శ్రీ వేంకటేశ్వరాయ నమః

ప్రసన్న రామాయణం

ప్రథమ సంపుటం

డా॥ రాయసం లక్ష్మి

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2017

PRASANNA RAMAYANAM
Volume - I

By

Dr. Rayasam Lakshmi

© All Rights Reserved

T.T.D. Religious Publications Series No. 1260

First Print : 2017

Copies : 500

Published by
Sri ANIL KUMAR SINGHAL, I.A.S.,
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati.

D.T.P.
Publications Division
T.T.D., Tirupati.

Printed at
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507

ముందుమాట

భారతీయులకు పవిత్రమైన పర్వతాలున్నాయి. నదులున్నాయి. ఆలయాలున్నాయి. ఆ వరుసలో జీవితాన్ని తరింపజేసే గ్రంథాలున్నాయి. అలాంటి వాటిలో శ్రీమద్రామాయణ మహాకావ్యం ఒకటి. వాల్మీకి మహాముని ముఖతః సంస్కృత భాషలో ఈ కావ్యం వెలువడింది. సూర్యవంశీయుల్లో అగ్రగణ్యుడైన శ్రీరామచంద్రుడు, భూజాతగా జనకచక్రవర్తి చేతుల్లో పెరిగిన సీతామహాదేవి జీవితచరిత్రమే రామాయణం. లోక కంటకుడైన రావణాసుర సంహారం ఇందలి ప్రధానేతివృత్తం. శ్రీమహావిష్ణువు అనపాయిని అయిన లక్ష్మీదేవితో అవతరించి దుష్టసంహారం కావించి భూమిమీద శాంతి నెలకొల్పిన అవతారవిశేషేతివృత్తం రామాయణగాథ. ఈ నేలమీద గిరులు, ఝరులు ప్రవహించేదాకా రామాయణం నిలిచి ఉంటుందన్న పెద్దలమాట పొల్లుపోనిది. రామాయణం వెలువడిన నాటి నుంచి ప్రపంచ భాషలెన్నింటిలోనో అనూదితమైన గ్రంథమిది. ఇక భారతీయ భాషలన్నింటా వెలువడ్డ కావ్యం రామాయణం. అంతేకాదు ఒక్కోభాషలో పెక్కు రచయితల మూలాన మరీ మరీ వెలువడుతున్న గ్రంథం రామాయణం. అంతటి మహత్తరస్థాయి అందుకొన్నది సీతారామకథాపూర్ణమైన రామాయణం.

ఇదిగో ఇప్పుడు మళ్లీ రామాయణం మన చేతుల్లోకి వస్తూ ఉంది. మళ్లీమళ్లీనా అంటే మనకు తప్పకుండా రామాయణకల్పవృక్షాన్ని తెలుగుభాషలో నాటిన విశ్వనాథ సత్యనారాయణగారి "మఱల నిదేల రామాయణ మన్నచో" అన్న పద్యంలోని మాట గుర్తుకు వస్తుంది. బహురచనలతో చేయి తిరిగిన రచయిత **రాయసం లక్ష్మి**గారు. ఇప్పటి పాఠకులను ఆకట్టుకొనే విధంగా చక్కని చిక్కని తెలుగు వచనంలో రాశారు. వస్తుభావాలకు ఎక్కడా ఆటంకం కలుగకుండా పఠనం ముందుకు సాగుతుంది.

రాయసం లక్ష్మిగారి ఈ **ప్రసన్న రామాయణాన్ని** తిరుమల తిరుపతి దేవస్థానముల పక్షాన ముద్రించేందుకు స్వీకరించి ఈ గ్రంథాన్ని తెలుగు చదువరులకు అందిస్తున్నాము. ఇంతకు ముందు ప్రచురితమైన గ్రంథాలను ఆదరించినట్లే పాఠకులు ఈ గ్రంథాన్ని కూడ ఆదరించగలరని ఆకాంక్షిస్తున్నాము.

సదా శ్రీవారిసేవలో...

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి



రాముడి దయ... శ్రీవారి కృప

శ్రీమద్రామాయణానికి వచనానువాదాలు తెలుగులో బాగానే వచ్చాయి. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీ దాశరథి రంగాచార్య, శ్రీ పురిపండా అప్పలస్వామి, ఉషశ్రీ వంటి సుప్రసిద్ధు లెందరో సులభశైలిలో ఈ ఆదికావ్యాన్ని రమ్యంగా అనుసృజన చేశారు. రాముడి కథ ఎన్నిసార్లు విన్నా, ఎందరినోట విన్నా ఇంకా వినాలనే అనిపిస్తుంది. కాబట్టి కొత్తగా ఎందరైనా చేతనైన మేరకు ప్రయత్నం చేయవచ్చు, చేసిన మేరకు తరించవచ్చు.

ఆంధ్రభూమి దినపత్రికలో వ్యాసభారతాన్ని, కొన్ని పురాణాలను యథామూలంగా సరళవచనంలో ఏలూరిపాటి వారి వంటి దిగ్దంతుల చేత తెలుగుసేత చేయించే పని అయ్యాక వాల్మీకి రామాయణాన్ని మా పాఠకులకు సులభశైలిలో అందించాలని అనుకున్నాం. ఈసారి ఎవరైనా కొత్తవారికి ఈ బాధ్యత అప్పగించదలిచాము. ఇందుకు ఎవరు సమర్థులా అని అన్వేషిస్తూండగానే రాయసం లక్ష్మి దైవికంగా ముందుకొచ్చింది. విద్యార్హతలు, రచనానుభవం ఉన్నప్పటికీ ఈ గురుతర భారాన్ని ఆమె ఎంతవరకు మోయగలదని మొదట్లో సంశయించాను. మచ్చుకు కొన్ని పేజీలు రాసి, మూలంతోబాటు తీసుకురమ్మంటే ఇచ్చిన వ్యవధికంటే ముందే ఆమె ఆపని పూర్తిచేసి తీసుకొచ్చింది.

ఇద్దరు ప్రసిద్ధ విద్వాంసుల అభిప్రాయాన్ని అడిగితే నిశితంగా పరిశీలించి, బాగున్నదన్నారు. వ్రాతప్రతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, రచన నిర్దుష్టతకు పూచీ పడటానికి ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డిగారు సంసిద్ధత తెలిపారు.

ఇలా తగు జాగ్రత్తలు తీసుకొన్న మీదట రచనను కొనసాగించటానికి లక్ష్మికి అంగీకారం తెలిపాం. తన మీద ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని ఆమె బృహత్ బాధ్యతను ప్రతిభావంతంగా నిర్వర్తించింది. సంస్కృతాంధ్రాల్లో విశేష పాండిత్యం, సుదీర్ఘ రచనానుభవం కలిగిన తలపండిన పెద్దలు మాత్రమే చేయగలరనుకునే పనిని, పూర్వానుభవం పెద్దగాలేకపోయినా రాముడి దయవల్ల సజావుగా పూర్తి చేయగలిగింది.

ఆంధ్రభూమి దినపత్రికలో ఇంచుమించు రెండు సంవత్సరాలు ధారావాహికంగా ప్రచురితమై పాఠకుల మెప్పు బాగా పొందిన ఈ గ్రంథాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఇప్పుడు అచ్చు వేస్తున్నందుకు సంతోషం. ఇది ఆంధ్రభూమికీ గొప్ప గౌరవం. తొలి గ్రంథమే శ్రీవేంకటేశ్వరుల అనుగ్రహానికి పాత్రమవటం లక్ష్మి అదృష్టం. అందుకు ఆమెను అభినందిస్తున్నాను. ఇటువంటి గ్రంథాలు మరిన్ని రాసి, మరింత పేరు తెచ్చుకోవాలని ఆశీర్వదిస్తున్నాను.

ఎం.వి.ఆర్.శాస్త్రి
సంపాదకులు
ఆంధ్రభూమి దినపత్రిక

తెలుగులో లక్ష్మీ ప్రసన్న రామాయణం

ఆ కాలంలో గంటం పట్టినా, ఈనాడు కలం పట్టినా రచనా వ్యాసంగానికి పూర్ణత్వం సిద్ధించిందనటానికి నిరద్యనం రామాయణ రచనమే. తొలి కావ్యమైన రామాయణంలోని మాధుర్యం అటువంటిది. వాల్మీకి మహర్షి రచనలోని ఘనతతో పాటు రాముని వ్యక్తిత్వంలోని ఆకర్షణ కూడ దీనికి కారణం.

స్వసూక్తీనాం పాత్రం రఘుతిలక మేకం కలయతాం
కవీనాంకో దోషస్సతు గుణగణా నామవగుణః ।
యదేతైర్నిశ్శేషైరపర గుణలుబ్ధైరివ జగ
త్స్వాసా దేకశ్చక్రే సతత సుఖ సంవాస వసతిః ॥

అని జయదేవ మహాకవి కవులందరూ రామకథను ఇతివృత్తంగా గ్రహించటానికి కారణం రాముడే అని ఆరోపిస్తాడు. సర్వ సుగుణ నిధానం అవటం వల్ల కవులు రామకథ చెప్పక తప్పటంలేదట! రాముడు సకల గుణాభిరాముడని ఎంత సున్నితంగా కీర్తించాడో! జయదేవుని సంస్తుతి వాక్స్తవం మాత్రమే కాదు వాస్తవం కూడ.

భారతీయులకు పరమ ప్రమాణమైన వేదహృదయం సామాన్యులకు అర్థమయే రీతిలో సోదాహరణంగా వివరించిన గ్రంథం శ్రీమద్రామాయణం. అన్ని గ్రంథాలు నశించినా రామాయణం ఒక్కటి ఉంటే భారతీయ సంస్కృతి, (మానవతా విలువలు) నిలిచి ఉన్నట్టే అని స్వామి వివేకానంద విశ్వాసం.

అటువంటి రామాయణం చిరంజీవి రాయసం లక్ష్మిని కూడ ఆకర్షించింది. "రాయసం" వారు ఒకప్పుడు వ్రాయసకాండ్రుగా ఉన్నవారు. ఒకప్పుడు ఎక్కువగా ప్రతులు తీయించుకున్న గ్రంథాలు రామాయణ, భారత భాగవతాలు అయి ఉండేవి. తరతరాలుగా అటువంటి సత్కార్యం చేసిన వారి వంశం కదా! ఆజన్యువులు ఉత్తేజితమై ఉంటాయి. రామాయణం ఈనాటివారికి అర్థమయ్యే పత్రికల భాషలో పత్రికాముఖంగా వెలువరించాలనే సంకల్పం కలిగింది. చేసేది మంచి పని గనుక అన్నీ అనుకూలించాయి.

మల్లెమాల రామాయణం పై పరిశోధన ప్రారంభించి రామకథలో తలమునకలు అవుతున్న పరిస్థితి. మరి మూలరామాయణం క్షుణ్ణంగా తెలిస్తే కదా అనువాద రామాయణాలను విశ్లేషించటం. అందుకని వాల్మీకి హృదయం తెలుసుకోటానికి చేసిన ప్రయత్నం ఏనాటికానాడు ఆంధ్రభూమి పత్రికాముఖంగా అశేషజనానికి అందింది. ఈ ప్రయత్నం స్థిరంగా నిలిచి ఉండదగినది అని శ్రీవేంకటేశ్వరుడు ఆమోదముద్రవేసి అంగీకరించాడు. తిరుమల తిరుపతి దేవస్థానం వారి ప్రచురణగా వెలువడటమే ఈ రచనకి యోగ్యతాపత్రం.

ఇది "ప్రసన్న రామాయణం". రామకథ గ్రంథకర్తికి ప్రసన్నమైనదా? చదువరులకు ప్రసన్నమయేట్టు రచించబడిందా? ప్రసాద గుణం ఉన్న రామకథా?

ప్రసన్న రామాయణం చదివితే దీనిలో ఈ మూడుగుణాలు ఉన్నట్టు తెలుస్తుంది. కథ తనకు ప్రసన్నమైనపుడే ఎటువంటి క్లేశమూ లేకుండా చెప్పటానికి వీలవవుతుంది. తనను చదువరుల స్థానంలో ఊహించుకుని తనకు

తానే చెప్పుకున్నపుడు చదువుతున్న వారికి వెంటనే చక్కగా అర్థమవుతుంది. మనసుకెక్కుతుంది కనుక రామానుగ్రహం లభ్యమౌతుంది.

ప్రసన్నరామాయణం అనే పేరుకి తగినట్టు రచన ప్రసాద గుణ శోభితంగా ఉంది. అలతి, అలతి పదాలతో, చిన్నచిన్న వాక్యాలతో అన్వయ కాఠిన్యం లేకుండా సరళంగా సాగిపోతుంది. చదవటం ప్రారంభించినప్పటి నుండి ఆపాలనిపించకుండా ముందుకు పోతూ ఉంటుంది. చదివించే లక్షణం ఉంది. ఒక మంచి పుస్తకానికి ఉండవలసిన ప్రధాన లక్షణం ఇది. ముఖ్యంగా ఆధ్యాత్మిక గ్రంథం. సంస్కృత గ్రంథాలని ప్రాంతీయ భాషలలోకి అనువదించటానికి కారణం అర్థమవాలనే కదా!

పూర్తిగా వాల్మీకి రామాయణాన్ని అనుసరించే రచన జరిగింది. కొన్ని కొన్నిచోట్ల మూలభావానికి అభిన్నమైన చిరుమార్పులు – అంటే సంక్షిప్తీకరణ, ఒక స్కంధంగాని, సర్గకాని ప్రారంభించేటపుడు ముందు దానితో అనుసంధానం చేసే ఒకటి రెండు వాక్యాలు చేర్చటం వంటివి.

మృదుస్వభావి, సాధుశీలి అయిన చిరంజీవి లక్ష్మి రచనాశైలి ఆమె వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తుంది.

మరెన్నో రచనలు చేయాలని, ఆమెపై రామానుగ్రహం ప్రసరించాలని కోరుకుంటూ

అభినందనలతో

డా॥ ఎన్.అనంతలక్ష్మి
అసోసియేట్ ప్రొఫెసర్
రైల్వే డిగ్రీకళాశాల
సికిందరాబాదు

కృతజ్ఞతాంజలి

పిపీలికాది బ్రహ్మాండమంతా వ్యాపించిన ఈ అనంత విశ్వచైతన్యంలో నాకొక దేహం ప్రసాదించడానికి నా పూర్వజన్మ సుకృతంగా లభించిన **నా తల్లిదండ్రులకు,** నాచేత కలం పట్టించి రచనా వ్యాసంగానికి దారిచూపిన నా ప్రత్యక్ష గురుదేవులైన **ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డిగారికి,** ఆ కలాన్ని ఆధ్యాత్మికత వైపుకు మరల్చి శ్రీవేంకటేశ్వరుని ఆశీర్వాదం పొందేటట్లు చేసిన **నా ఆధ్యాత్మిక గురుదేవులు,** ఇహలోకంలో ఆర్థిక స్థిరత్వం, ఆర్థిక స్వావలంబన కలిగేటట్లు చేసిన నాకు మార్గదర్శి అయిన **శ్రీ ఎం.వి.ఆర్.శాస్త్రిగారికి,** ఆ కలాన్ని పరిశోధనారంగం వైపు పరుగులెత్తించిన నా పరిశోధనా పర్యవేక్షకురాలైన **శ్రీమతి ఎన్.అనంతలక్ష్మిగారికి,** నా చేత రామయ్యే రాయించిన **రామాయణానికి** పుస్తక రూపం ఇచ్చిన తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీకార్యనిర్వహణాధికారి గారికి, ప్రచురణకు స్వీకరించిన ప్రచురణ విభాగం అధికారులందరికీ, ఈ రామాయణాన్ని చదివే పాఠకదేవుళ్ళకు కృతజ్ఞతాపూర్వక నమోవాకాలు.

– డా॥ రాయసం లక్ష్మి

మరల నిదేల రామాయణం బన్నచో...

శ్రీమద్రామాయణం భారతజాతికి శిరోధార్యమైన కావ్యం. కావ్యంగా, ఇతిహాసంగా, రెండు విధాల పూజార్హమైన గ్రంథం ఒక్క రామాయణమే. 'కవిః మనీషీ పరిభూః స్వయంభూః' అన్న దానికి సర్వకారణ ఉదాహరణప్రాయుడు మహర్షి వాల్మీకి. చిత్రం! వల్మీకం అంటే అనుపమాన కవిత్వ భావుకత్వాల పుట్ట. పుట్టబుట్టిన సహజకవి సంస్కృత కవి వాల్మీకి. కవి అనే పదానికి కవిత్వం వ్రాసేవాడు అనేకాక 'వాల్మీకి' అని కూడా అర్థాన్నిచ్చుకున్న సంస్కార పరీమళదేశం భారతదేశం.

యావత్ స్థాస్యంతి... అనే శ్లోకం సర్వ జనవిదితమే. సామాన్యార్థం ఏమిటంటే ఈ భూతలంపై కొండలు, నదులు, పర్వతాల వంటి ప్రాకృతిక స్థావరాలు ఉన్నంతవరకు రామాయణం భద్రస్థితిలో ఉంటుందని. కాని, విజ్ఞవిమర్శకుల ఆలోచనాకోణంలో చూస్తే, అంతరంగికంగా ఆలోచిస్తే రామాయణంలో ఈ ప్రాకృతిక ప్రదేశాలన్నీ పాత్రలు కూడా ఒక అవినాభావ సంబంధం వల్ల ప్రకృతితో మమేకమై ప్రాకృతికంగా భాసిస్తూ ఉన్న కావ్యం రామాయణం.

ఇటువంటివెన్నో ఉన్న మహోదాత్తకావ్యం రామాయణం. మానవులకు ఔపయోగిక కారణాలు ఇందులో ఏమి ఉన్నాయనేది వర్తమానతరాలవారి ప్రశ్న. ఈ ప్రశ్నకు ఉత్తరాలు ఉత్తమంగానే ఉన్నాయి. ఈనాడు కరిగిపోతున్నవి మానవసంబంధాలు, ఆత్మీయతలు, కౌటుంబిక ప్రేమలు. ఇటువంటి సందర్భంలో రామాయణ పాత్రల ఆదర్శ అవసరాలు వర్ధమాన తరానికి, భవిష్యత్తరాలకు రామాయణాన్ని అందించడం ద్వారా పునరుద్ధరణ అన్న విన్యాసం ఉంది.

నిజానికి సీతారాములు ముఖ్యంగా శ్రీరాముడు మన జీవనంలో కలసిపోయాడు. జానపద సాహిత్యంలో కాని, ఆర్షసాహిత్యంలోకాని, ధార్మిక సంబంధంగా ఏవిధంగా తీసుకొన్నా ఆయా పాత్రల ఉపదేశాలు అవసరమై ఉన్నాయి. అందుకు వాల్మీకి సంస్కృత రామాయణం ప్రామాణికంగా నిలిచింది. ఈ గ్రంథానికి అనువాదాలు, అనుసరణలూ ఎన్నో వచ్చాయి. చేదుకొన్నవారికి చేదుకొన్నంత, తోడుకొన్నవారికి తోడుకొన్నంత ఇవ్వదలచుకొన్న వారు ఇవ్వగలిగినంత, స్వీకరించదలచిన వారు స్వీకరించేంత. అనేక రామాయణాలు ఏక రామాయణ కథాజలపాతం నుంచి ఉద్భవించాయి. కావ్యాలుగా నదులయ్యాయి. వివిధభాషానువాదాలు లెక్కకు మిక్కిలిగా కనిపిస్తాయి. కాలువలుగా, ఘట్టాలుగా, ఘట్టాలను తాకుతూ ప్రవహించాయి. ఎన్నెన్ని ప్రక్రియలు, ఎన్నెన్ని రూపాలు, ఎన్నెన్ని సంతరింపులు! కల్పవృక్షాలు కావచ్చు. సకారప్రాసరామాయణాలు కావచ్చు. అద్భుతాలుగా, ఆశ్చర్యాలుగా, ఆనందాలుగా, చిత్రవిచిత్రాలుగా, ఆధ్యాత్మిక గుణప్రవర్ధితాలుగా ఎన్నో రామాయణాలు. కాని, పాత్రలు అవే. ఇతిహాసం అదే. వాల్మీకి భావుకత వర్షధారలనుండి ఏరుకున్న, కోరుకున్న, ఇచ్చిన బిందువులే. అయితే,

వచనంలోని ప్రసన్నమైన వ్యావహారికశైలిలో దాదాపు రెండేళ్లు ఆంధ్రభూమిలో సీరియల్‌గా ఈ రామాయణం ప్రచురితమైంది. పాఠకుల్లో ఎందరో ఈ రామాయణం పుస్తకంగా వస్తే బాగుందన్నారు. పైగా అవాల్మీకాలు లేని ఈ రామాయణం నేటి బాలబాలికలు చదవాలని నా ఆకాంక్ష.

ఎందుకంటే...

రామాయణం ఒక కావ్యం కాదు ఒక శక్తి. ఈ శక్తి మానవుల్లో పనితనాన్ని పెంచుతుంది. కుంభకర్ణులను సైతం తట్టిలేపుతుంది. ఆంజనేయుని సేవాభావాన్ని రుచి చూపిస్తుంది. వానరుల్లా సంఘటిత శక్తి చూపమంటుంది. లక్ష్మణునివలె సేవామార్గంవైపు నడిపిస్తుంది. రామానుజుల్లా కలసి ఉండమంటుంది. సజ్జనులను కాపాడమంటుంది. దుర్జనులను శిక్షించమంటుంది. తల్లితండ్రుల మాటను పాటించమంటుంది. కన్నతల్లిని, నేలతల్లిని ప్రేమించమంటుంది. గురుదేవుల మాటను శిరోధార్యంగా భావించమంటుంది. మనిషి మానవత్వంతో మనిషిగా జీవించడానికి దోహదం చేస్తుంది.

అసలు రామాయణం వ్యక్తి సుఖం కంటే దేశప్రజలే ముఖ్యమంటుంది. నీతిమంతులుగా, బుద్ధిమంతులుగా, శక్తిమంతులుగా, శ్రీమంతులుగా, ధర్మమూర్తులుగా, ప్రతిభావంతులుగా, దేశసంరక్షకులుగా, దేశభక్తులుగా ఒక్క మాటలో చెప్పాలంటే సర్వగుణ సంపన్నులుగా తీర్చిదిద్దుతుంది. అందుకే ఒక్క వాల్మీకి రామాయణం అనేక వందల వేల భాషల్లో అనువాదాలు, అనుసరణలు, అనుసృజనలు ఊపిరి పోసుకున్నాయి.

ఎన్ని వచ్చినా, వాటి ఫలితాలు, పరమార్థాలు ప్రచారాల వల్ల వచ్చే ఔపయోగిక అంశాలు అన్నీ ఆర్షబద్ధమైనవే, సంస్కృతికి నిబద్ధమైనవే. తెలుగు నాట ఏ నాట చూసినా ఎన్నెన్నో రామమందిరాలు ఏ గొడవలూ లేకుండా శాంతియుతంగా కట్టుకొన్నవి కనిపిస్తాయి. మానవజీవితంలో పెనవేసుకున్న రామాయణం కనులముందు సర్వవేళలా సర్వావస్థలయందు దృగ్గోచరమవుతూనే ఉంటుంది. రాముడు, 'ఇందుగల డందులేడని సందేహము వలదు' అనిపించే మానవదైవం. ఒక రకంగా మానవులందరి దేవుడు.

ఫలముల పేర వాని తను పక్షుల పేర మృగాళి పేర ని
ష్కలుషములై యెసంగు క్రిమి సంతతి పేర మహేశ్వరంకిత
స్థలముల పేర స్త్రీ పురుష సంగము పేరను నిండియుండె భూ
తలమున రామనామము ముదంబును సభ్రము సంగతించుచున్

అన్నారు (పెద్దపల్లి సుందరరామయ్య కవి)

ఈ సర్వసృష్టిలో శ్రీరామ నామము మిళితమై ఉండడానికి కారణం ఏమిటి?

ఆ రామాయణ కథ!

ఆ సీతారాముల అన్యోన్య అనుబంధాలు. రామలక్ష్మణాదులభ్రాతృప్రేమ సంబంధాలు, ఒకటేమిటి? మాతృ, పితృ, భ్రాతృ, మిత్ర, కళత్ర ఈ సర్వ సంబంధాలకు ఒక ఔపదేశిక మహాకావ్యం రామాయణం. ఎన్నో మలుపులతో కూడిన అనేక కథాఘట్టాలు. ఋషి సంబంధాలు, మానవ జంతు సంబంధాలు, దుష్టశిక్షణ శిష్టరక్షణ అనే ఒక జనపాలన సూత్ర అనుసంధానాలు.

ఇన్ని ఉన్న ఉన్నతోన్నత రామాయణాన్ని వచన రూపంలో నేను వ్రాస్తూన్నప్పుడు ఏది వ్రాసినా పొందలేని ఒక మహానుభూతి పొంది మరీ వ్రాశానని సవినయంగా, ఆనందంగా చెప్పదలుచుకున్నాను.

శ్రీమహావిష్ణువు దశావతారాల్లో అనేక రూపావతారాలున్నాయి. దర్శనీయ అవతారాల్లో ఆకర్షించే అవతారం శ్రీకృష్ణావతారమే అనిపిస్తుంది. అయితే ఒక శాంతిని చిందించే రూపంతో ఏ అల్లకల్లోలాలు లేని నిలుకడగల పాలకడలిలా గంభీర ముఖవర్చస్సుతో ఒక ప్రసన్న మేఘసందర్శనం చేశామనిపించే రూపం శ్రీరామచంద్రుల వారిది. మరే అవతార మూర్తి పేరులోనూ చల్లని చంద్రుని పేరు కలువలేదు. చంద్రుడు అమృతానికి అధిదేవత కనుక ఒక ప్రసన్నమైన అమృతభాండాన్ని హృదయభాండంలో దాచుకున్న చంద్రుడు వంటి వాడు శ్రీరామచంద్రుడు కావడం వల్ల ఆయన దర్శనం ఎప్పుడూ సుప్రసన్నంగానే ఉంటుంది. అసలు రామాయణంలో శ్రీరాముణ్ణి సుప్రసన్నం చేసుకోవడానికి ఎంతోమంది ఉవ్విళ్ళూరారు. సుగ్రీవుని కారణంగా వచ్చిన హనుమంతుడు ఆ శ్రీరామచంద్రుణ్ణి ప్రసన్నం చేసుకోవడమే నిత్యకార్యమైంది. రామాయణంలో ఆరుకాండలూ పఠించడం వల్ల వచ్చే కథల ఆనందం, జ్ఞానరహస్యాలు, శాస్త్రవిషయాలు వంటివి అలా ఉంచితే, శ్రీరామాయణం అంతా పఠించాక మనకు కలుగవలసింది శ్రీరామచంద్రుని సుప్రసన్నదర్శనమే.

ఆ ప్రసన్నదర్శనం పాఠకులకు కలిగించడానికి ముఖ్యంగా నేను పొందిన రామాయణ దర్శనానుభూతిని పాఠకులకు అందించడానికి సర్వపాఠకులను పారమార్థిక మార్గంలో ప్రసన్నులను చేసుకోవడానికి ఇదిగో మీముందుకు ఇలా వచ్చింది ఈ ప్రసన్న రామాయణం.

సర్వేజనా స్సుఖినోభవన్తు

– డా॥ రాయసం లక్ష్మి

శ్రీ రామాయణ మాహాత్మ్యమ్

ఉమాసంహితాయాం-

శ్రీరామ ప్రాతిపదిక మవశేనాపి సంగృణన్
ముక్తిం ప్రాప్నోతి మనుజః కిం పునర్బుద్ధిపూర్వకమ్ 1

రాశబ్దోచ్చారణాదేవ పాతకా దేహపంజరాత్
నిర్యాం త్యాయాంతి పాపాని మవర్ణాదర్శనాత్ పునః 2

రాశబ్దోచ్చారణే జాతే వక్త్రాత్ పాపం విగచ్ఛతి
మకారశ్రవణే జాతే భస్మీ భావం గమిష్యతి 3

రామేతి రామచంద్రేతి రామభద్రేతి వా మనుమ్
యావజ్జీవం జపన్ మర్త్యో జీవన్ముక్తో న సంశయః 4

రామాయణస్య మాహాత్మ్యం వక్తుం వర్షశతైరపి
ఆశక్యం విస్తరా ద్వక్తుం సంక్షేపా ద్వచ్మి సాంప్రతమ్ 5

రామాయణస్య వాక్యం వాపాదం వా పదమేవ వా
భక్త్యాం తే తు ప్రయుంజానో బ్రహ్మాభూమాయ కల్పతే 6

రామాయణకథా మేవ యే శృణ్వంతి నరోత్తమాః
విధూత పాపాస్తే యాంతి బ్రహ్మలోక మనామయమ్ 7

తత్త్వ సంగ్రహరామాయణే

సంసార తాపయుక్తానాం జంతూనాం హతచేతసామ్
శ్రీమద్రామాయణాఖ్యాన పీయూషం భేషజం స్మృతమ్ 8

శ్రీవైష్ణవైః శ్రీమద్రామాయణ పారాయణారంభే
పఠనీయాః శ్లోకాః

ప్రథమతః స్వస్వసం ప్రదాయ నిర్వాహకాచార్యానుసంధానమ్

లక్ష్మీనాథ సమారాంభాం నాథాయాయున మధ్యమామ్
అస్మదాచార్య పర్యంతాం వందే గురుపరంపరామ్ 1

యో నిత్య మచ్యుతపదాంబుజయుగ్మరుక్మ
వ్యామోహిత స్తదితరాణి తృణాయ మేనే

అస్మద్గురో ర్భగవతోస్య దయైక సింధో
రామానుజస్య చరణౌ శరణం ప్రపద్యే 2

మాతాపితా యువతయ స్తనయా విభూతి
స్సర్వం యదేవ నియమేన మదన్వయానామ్
ఆద్యస్య నః కులపతే ర్వకుళాభిరామం
శ్రీమత్తదంఘ్రియుగళం ప్రణమామి మూర్ధ్నా 3

భూతం సరశ్చ మహదాహ్వయ భట్టనాథ
శ్రీ భక్తిసార కులశేఖర యోగివాహాన్
భక్తాంఘ్రిరేణు పరకాల యతీంద్రమిశ్రాన్
శ్రీమత్పరాంకుశమునిం ప్రణత్యోస్మి నిత్యమ్ 4

అథ శ్రీశైల పూర్ణవిషయమ్

పితామహాస్యాసి పితామహాయ
ప్రాచేతసాదేశఫలప్రదాయ
శ్రీభాష్యకారోత్తమదేశికాయ
శ్రీ శైలపూర్ణాయ నమో నమస్తాత్

ఇతి శ్లోక మారభ్య శ్రీభాష్యకార ప్రభృతి స్వాచార్య పర్యంత విషయా స్సాంప్రదాయికాః శ్లోకా అనుసంధేయాః యద్వా స్వాచార్య ప్రభృతి శ్రీధరపర్యంత ప్రతివ్యక్తివిషయాః శ్లోకా అనుసంధేయాః

విష్వక్సేనధ్యానమ్

శుక్లాంబరంధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోప శాంతయే
యస్య ద్విరదవక్త్రాద్యాః పారిషద్యాః పరశ్శతమ్
విఘ్నం నిఘ్నంతి సతతం విష్వక్సేనం తమాశ్రయే

శ్రీ హయగ్రీవ ధ్యానమ్

జ్ఞానానందమయం దేవం నిర్మలస్ఫటికాకృతిమ్
ఆధారం సర్వవిద్యానాం హయగ్రీవ ముపాస్మహే
అభంగుర కలాదాన స్థూలలక్షత్వ మీయుషే
తుంగాయ మహసే తస్మై తురంగాయ ముఖే నమః

శ్రీ వాల్మీకి ధ్యానమ్

కూజంతం రామరామేతి మధురం మధురాక్షరమ్
ఆరుహ్య కవితాశాఖం వందే వాల్మీకి కోకిలమ్
వాల్మీకే ర్మునిసింహస్య కవితావనచారిణః
శృణ్వన్ రామకథానాదం కో న యాతి పరాం గతిమ్
యః పిబన్ సతతం రామచరితామృత సాగరమ్
ఆతృప్త స్తం మునిం వందే ప్రాచేతస మకల్మషమ్

శ్రీఆంజనేయ ప్రార్థనా

గోష్పద్కృతవారాశిం మశకీకృతరాక్షసమ్
రామాయణమహామాలారత్నం వందే నిలాత్మజమ్

అంజనానందనం వీరం జానకీశోకనాశనమ్
కపీశ మక్షహంతారం వందే లంకాభయంకరమ్

అమిషీకృతమార్తాండం గోష్పదీకృత సాగరమ్
తృణీకృత దశగ్రీవ మాంజనేయ నమామ్యహమ్

మనోజవం మారుతతుల్యవేగం
జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్
వాతాత్మజం వానరయూథ ముఖ్యం
శ్రీరామదూతం శిరసా నమామి
ఉల్లంఘ్య సింధో స్సలిలం సలీలం
యశ్శోక వహ్నిం జనకాత్మజాయాః

ఆదాయ తేనైవ దదాహ లంకాం
నమామి తం ప్రాంజలి రాంజనేయమ్
ఆంజనేయ మతిపాటలాననం
కాంచనాద్రి కమనీయ విగ్రహమ్
పారిజాత తరుమూల వాసినం
భావయామి పవమానందనమ్
యత్రయత్ర రఘునాథ కీర్తనం
తత్ర తత్ర కృతమస్తకాంజలిమ్
బాష్పవారి పరిపూర్ణలోచనం
మారుతిం నమత రాక్షసాంతకమ్

శ్రీరామాయణ ప్రార్థనా

వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే
వేదఃప్రాచేతసా దాసీ త్సాక్షాద్రామాయణాత్మనా
చరితం రఘునాథస్య శతకోటి ప్రవిస్తరమ్
ఏకైక మక్షరం ప్రోక్తం మహాపాతకనాశనమ్

శృణ్వన్ రామాయణం భక్త్యా యః పాదం పదమేవ వా
స యాతి బ్రహ్మణః స్థానం బ్రహ్మణా పూజ్యతే సదా

వాల్మీకిగిరిసంభూతా రామసాగర గామినీ
పునాతి భువనం పుణ్యా రామాయణ మహానదీ

శ్లోకసారసమాకీర్ణం సర్గకల్లోలసంకులమ్
కాండగ్రాహమహామీనం వందే రామాయణార్ణవమ్

యః కర్ణాంజలిసంపుటై రహరహ స్సమ్యక్ పిబత్యాదరా
ద్వాల్మీకే ర్వదనారవిందగళితం రామాయణాఖ్యం మధు
జన్మవ్యాధిజరావిపత్తిమరణై రత్యంతసోపద్రవం
సంసారం స విహాయ గచ్ఛతి పుమాన్ విష్ణోః పదం శాశ్వతమ్

తదుపగతసమాససంధియోగం
సమమధురోపనతార్థవాక్యబద్ధమ్
రఘువరచరితం మునిప్రణీతం
దశశిరసశ్చ వధం నిశామయధ్వమ్

శ్రీరామ ప్రార్థనా

శ్రీరాఘవం దశరథాత్మజ మప్రమేయం
సీతాపతిం రఘుకులాన్వయరత్నదీపమ్
ఆజానుబాహు మరవిందళాయతాక్షం
రామం నిశాచరవినాశకరం నమామి
వైదేహీసహితం సురద్రుమతలే హైమే మహామండపే
మధ్యే పుష్పక మాసనే మణిమయే వీరాసనే సుస్థితమ్

అగ్రే వాచయతి ప్రభంజనసుతే తత్త్వం మునిభ్యః పరం
వ్యాఖ్యాంతం భరతాదిభిః పరివృతం రామం భజే శ్యామలమ్

తతోయథాశక్తి శ్రీకోశోపరి భగవదారాధనం కార్యమ్

అథ– ధర్మాత్మా సత్యసంధశ్చ రామో దాశరథి ర్యది
పౌరుషే చా ప్రతిద్వంద్వః శరైనం జహి రావణిమ్
తప స్స్వా ధ్యాయనిరతం తపస్వీ వాగ్విదాం వరమ్
నారదం పరిపప్రచ్ఛ వాల్మీకి ర్మునిపుంగవమ్

ఇతి శ్లోకద్వయం పఠిత్వా' శ్రీరఘునందన పరబ్రహ్మణే నమః' ఇత్యుక్త్వా పారాయణ మారభేత

పారాయణసమాపనే అనుసంధేయశ్లోకక్రమః

ఏవమేతత్ పురావృత్త మాఖ్యానం భద్రమస్తు వః
ప్రవ్యాహరత విస్రబ్ధం బలం విష్ణోః ప్రవర్ధతామ్

లాభ స్తేషాం జయ స్తేషాం కుత స్తేషాం పరాభవః
యేషా మిందీవరశ్యామో హృదయే సుప్రతిష్ఠితః

కాలే వర్షతు పర్జన్యః పృథివీ సస్యశాలినీ
దేశోఽయం క్షోభరహితో బ్రాహ్మణా స్సంతు నిర్భయాః

కావేరీ వర్ధతాం కాలే కాలే వర్షతు వాసవః
శ్రీరంగనాథో జయతు శ్రీరంగ శ్రీశ్చవర్ధతామ్

స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం
న్యాయ్యేన మార్గేణ మహీం మహీశాః
గోబ్రాహ్మణేభ్యః శుభ మస్తు నిత్యం
లోకా స్సమస్తా స్సుఖినో భవంతు

మంగళం కోసలేంద్రాయ మహనీయగుణాబ్ధయే
చక్రవర్తితనూజాయ సార్వభౌమాయ మంగళమ్
వేదవేదాంతవేద్యాయ మేఘశ్యామలమూర్తయే
పుంసాం మోహనరూపాయ పుణ్యశ్లోకాయ మంగళమ్

విశ్వామిత్రాంతరంగాయ మిథిలానగరీపతేః
భాగ్యానాం పరిపాకాయ భవ్యరూపాయ మంగళమ్

పితృభక్తాయ సతతం భ్రాతృభిః సహ సీతయా
నందితాఖిలలోకాయ రామభద్రాయ మంగళమ్

త్యక్త సాకేతవాసాయ చిత్రకూటవిహారిణే
సేవ్యాయ సర్వయమినాం ధీరోదారాయ మంగళమ్

సౌమిత్రాణా చ జానక్యా చాపబాణాసిధారిణే
సంసేవ్యాయ సదా భక్త్యా స్వామినే మమ మంగళమ్

దండకారణ్యవాసాయ ఖండితామరశత్రవే
గృధ్రరాజాయ భక్తాయ ముక్తిదాయాస్తు మంగళమ్

సాదరం శబరీదత్తఫలమూలాభిషిణే
సౌలభ్య పరిపూర్ణయా సత్త్వోద్రిక్తాయ మంగళమ్

హనుమత్సమవేతాయ హరీశాభీష్టదాయినే
వాలి ప్రమథనా యాస్తు మహాధీరాయ మంగళమ్

శ్రీమతే రఘువీరాయ సేతూల్లంఘితసింధవే
జితరాక్షసరాజాయ రణధీరాయ మంగళమ్

అసాధ్య నగరీం దివ్యా మభిషిక్తాయ సీతయా
రాజాధిరాజరాజాయ రామభద్రాయ మంగళమ్

మంగళాశాసన పరై ర్మదాచార్య పురోగమైః
సర్వైశ్చ పూర్వై రాచార్యై స్సత్కృతాయాస్తు మంగళమ్

కాయేన వాచా మనసేంద్రియై ర్వా
బుద్ధ్యాత్మనా వా ప్రకృతేః స్వభావాత్
కరోమి యద్యత్ సకలం పరస్మై
నారాయణా యేతి సమర్పయామి

తతః పితామహస్యే త్యారభ్య స్వాచార్యపర్యంతశ్లోకా అనుసంధేయాః యద్వా స్వాచార్య మారభ్య శ్రీధర పర్యంతా గురుపరం పరానుసంధేయా సీతావివాహపట్టాభిషేక సర్గయోస్తు 'ఇయం సీతా మమసుతా' 'అభ్యషించ న్నరవ్యాఘ్రం' ఇతి శ్లోపఠనాత్ పూర్వం మధ్యే విశేషతో భగవదారాధనం చ కర్తవ్యమ్.

స్మార్తాదీనాం శ్రీమద్రామాయణోపక్రమే
అనుసంధేయాః శ్లోకాః

అదౌ శ్రీమహాగణపతిధ్యానమ్

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే
అగజాననపద్మార్కం గజనాన మహర్నిశమ్
అనేకదం తం భక్తానా మేకదంత ముపాస్మహే
వాగీశాద్యాస్సుమనస స్సర్వార్థానా ముపక్రమే
యం నత్వా కృతకృత్యాః స్యుస్తం నమామి గజాననమ్

సరస్వతీ ప్రార్థనా

శారదా శారదాంభోజవదనా వదనాంబుజే
సర్వదా సర్వదాస్మాకం సన్నిధి స్సన్నిధిం క్రియాత్

యా కుందేదుతుషారహారధవళా యా శుభ్రవస్త్రావృతా
యా వీణావరదండమండితకరా యా శ్వేతపద్మాసనా
యా బ్రహ్మాచ్యుతశంకరప్రభృతిభిర్దేవైః సదా పూజితా
సా మాం పాతు సరస్వతీ భగవతీ నిశ్శేష జాడ్యాపహా

దోర్భి ర్యుక్తా చతుర్భి స్స్ఫటిక మణిమయీ మక్షమాలాం దధానా
హస్తే నైకేన పద్మం సిత మపి చ శుకం పుస్తకం చాపరేణ
భాసా కుందేందుశంఖస్ఫటికమణినిభాభాసమానసమానా
సా మే వాగ్దేవతేయం నివసతు వదనే సర్వదా సుప్రసన్నా

వాల్మీకి నమస్క్రియా

కూజంతం రామరామేతి మధురం మధురాక్షరమ్
ఆరుహ్య కవితా శాఖాం వందే వాల్మీకి కోకిలమ్
వాల్మీకే ర్మునిసింహస్య కవితావనచారిణః
శృణ్వన్ రామకథా నాదం కో న యాతి పరాం గతిమ్
యః పిబన్ సతతం రామచరితా మృతసాగరమ్
ఆతృప్త స్తం మునిం వందే ప్రాచేతస మకల్మషమ్

ఆంజనేయ నమస్క్రియా

గోష్పదీకృత వారాశిం మశకీకృత రాక్షసమ్
రామాయణ మహామాలారత్నం వందే నిలాత్మజమ్
అంజనానందనం వీరం జానకీ శోకనాశనమ్
కపీశ మక్షహంతారం వందే లంకాభయంకరమ్
అమిషీకృత మార్తాండం గోష్పదీకృతసాగరమ్
తృణీకృత దశ గ్రీవ మాంజనేయం నమా మ్యహమ్

ఉల్లంఘ్య సింధో స్సలిలం సలీలం
యశ్శోకవహ్నిం జనకాత్మజాయాః

ఆదాయ తేనైవ దదాహ లంకాం
నమామి తం ప్రాంజలి రాంజనేయమ్

ఆంజనేయ మతిపాటలాననం
కాంచనాద్రికమనీయవిగ్రహమ్

పారిజాతతరుమూలవాసినం
భావయామి పవమాననందనమ్

యత్రయత్ర రఘునాథకీర్తనం
తత్ర తత్ర కృతమస్తకాంజలిమ్
బాష్పవారిపరిపూర్ణలోచనం
మారుతిం నమత రాక్షసాంతకమ్
మనోజవం మారుతతుల్య వేగం
జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్
వాతాత్మజం వానరయూథ ముఖ్యం
శ్రీరామదూతం శిరసా నమామి

శ్రీ రామాయణ ప్రార్థనా

వాల్మీకి స్మృతిమందరేణ మథిత స్సీతారమాసంభవ
స్సుగ్రీవామరభూరుహోఽంగదగజ స్సౌమిత్రి చంద్రోదయః
వాతోత్పన్నమణి ర్విభీషణసుధః పౌలస్త్యహాలాహలః
శ్రీరామాయణదుగ్ధసింధు రమలో భూయాత్సనశ్శ్రేయసే

యః కర్ణాంజలిసంపుటై రహరహ స్సమ్యక్పిబ త్యాదరా
ద్వాల్మీకే ర్వదనారవిందగళితం రామాయణాఖ్యం మధు
జన్మవ్యాధిజరావిపత్తిమరణై రత్యంతసోపద్రవం
సంసారం స విహాయ గచ్ఛతి పుమాన్ విష్ణోః పదం శాశ్వతమ్
తదుపగత సమాస సంధియోగం
సమమధురోపనతార్థ వాక్యబద్ధమ్
రఘువర చరితం మునిప్రణీతం
దశశిరసశ్చ వధం నిశామయధ్వమ్

వాల్మీకి గిరిసంభూతా రామసాగర గామినీ
పునాతి భువనం పుణ్యా రామాయణ మహానదీ
శ్లోకసార సమాకీర్ణం సర్గకల్లోల సంకులమ్
కాండ గ్రాహ మహామీనం వందే రామాయణార్ణవమ్
వేదవేద్యేపరే పుంసి జాతే దశరథాత్మజే
వేదః ప్రాచేతసా దాసీత్ సాక్షా ద్రామాయణాత్మనా

శ్రీ రామధ్యానమ్

వైదేహీ సహితం సురద్రుమతలే హైమే మహామండపే
మధ్యే పుష్పక మాసనే మణిమయే వీరాసనే సుస్థితమ్
అగ్రే వాచయతి ప్రభంజనసుతే తత్త్వం మునిభ్యః పరం
వ్యాఖ్యాం తం భరతాదిభిః పరివృతం రామం భజే శ్యామలమ్
వామే భూమిసుతా పురశ్చ హనుమాన్ పశ్చాత్ సుమిత్రా సుత
శ్శత్రుఘ్నో భరతశ్చ పార్శ్వదలయో ర్వాయ్వాదికోణేషు చ
సుగ్రీవశ్చ విభీషణశ్చ యువరాట్ తారాసుతో జాంబవాన్
మధ్యే నీలసరోజ కోమలరుచిం రామం భజే శ్యామలమ్

మాతా రామో మత్పితా రామభద్రో
భ్రాతా రామో మత్సఖా రాఘవేశః
సర్వస్వం మే రామచంద్రో దయాళు
ర్నాన్యం దైవం నైవ జానే న జానే

సాకేతే శరదిందుకుంద ధవళే సౌధే మహామండపే
పర్యస్తాగరు ధూపదీపలలితే కర్పూర దీపోజ్జ్వలే

సుగ్రీవాంగద జాంబవత్పరివృతం సౌమిత్రిణా సేవితం
లీలామానుష విగ్రహం రఘువరం రామం భజే శ్యామలమ్

నమోస్తు రామాయ సలక్ష్మణాయ
దేవ్యై చ తస్మై జనకాత్మ జాయై
నమోస్తు రుద్రేంద్రయామానిలేభ్యో
నమోస్తు చంద్రార్క మరుద్గణేభ్యః

తతః శ్రీకోశోపరి శ్రీరామ వాహనాది నైవేద్యాంత పూజా విధేయా
పారాయణావసానే చ పునః పూజా కర్తవ్యా

పారాయణ సమాపనసమయే అనుసంధేయ శ్లోకక్రమః

స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం
న్యాయ్యేన మార్గేణ మహీం మహీశాః
గోబ్రాహ్మణేభ్య శ్శుభ మస్తు నిత్యం
లోకా స్సమస్తా స్సుఖినో భవంతు
కాలే వర్షతు పర్జన్యః పృథివీ సస్యశాలినీ
దేశోఽయం క్షోభరహితో బ్రాహ్మణా స్సంతు నిర్భయాః

అపుత్రాః పుత్రిణ స్సంతు పుత్రిణ స్సంతు పౌత్రిణః
అధనా స్సధనా స్సంతు జీవంతు శరదాం శతమ్

చరితం రఘునాథస్య శతకోటి ప్రవిస్తరమ్
ఏకైక మక్షరం ప్రోక్తం మహాపాతకనాశమ్

శృణ్వన్ రామాయణం భక్త్యా యః పాదం పద మేవ వా
సయాతి బ్రహ్మణః స్థానం బ్రహ్మణా పూజ్యతే సదా

రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే
రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః

మంగళం కోసలేంద్రాయ మహనీయగుణాబ్ధయే
చక్రవర్తితనూజాయ సార్వభౌమాయ మంగళమ్

యన్మంగంళం సహస్రాక్షే సర్వదేవ నమస్కృతే
వృత్రనాశే సమభవ త్తత్తే భవతు మంగళమ్

యన్మంగళం సుపర్ణస్య వినతా కల్పయత్ పురా
అమృతం ప్రార్థయానస్య తత్తే భవతు మంగళమ్

అమృతోత్పాదనే దైత్యాన్ ఘ్నతో వజ్రధరస్య యత్
అదితి ర్మంగళం ప్రాదా త్తత్తే భవతు మంగళమ్

త్రీన్ విక్రమాన్ ప్రక్రమతో విష్ణో రమితతేజసః
యదాసీ న్మంగళం రామ తత్తే భవతు మంగళమ్

ఋతవ స్సాగరా ద్వీపా వేదా లోకా దిశశ్చతే
మంగళాని మహాబాహో దిశంతు తవ సర్వదా

కాయేన వాచా మనసేంద్రియై ర్వా
బుద్ధ్యాత్మనా వా ప్రకృతే స్స్వభాత్
కరోమి యద్యత్ సకలం పరస్మై
శ్రీరాఘవాయేతి సమర్పయామి

యదక్షరపదభ్రష్టం మాత్రాహీనం చ యద్భవేత్
తత్సర్వం క్షమ్యతాం దేవ శ్రీరాఘవ నమోస్తుతే

ఆత్మా త్వం క్షితిజా మతిః పరిజనాః ప్రాణా శ్శరీరం గృహం
పూజా తే విషయోపభోగరచాన నిద్రా సమాధిస్థితిః
సంచారః పదయోః ప్రదక్షిణవిధిః స్తోత్రాణి సర్వా గిరో
యద్యత్కర్మ కరోమి తత్త దఖిలం రామాస్తు తే పూజనమ్

సీతా వివాహ పట్టాభిషేక సర్గయోస్తు **'ఇయం సీతా మమసుతా' అభ్యషించ న్నరవ్యాఘ్రమ్'** ఇతి శ్లోక పఠనాత్ పూర్వం విశేషతో ధ్యానావాహన నైవేద్యాది నీరాజనాంతసపర్యా సంవిధేయా

అనేన శ్రీమద్రామాయణ పారాయణేన భగవాన్ సర్వదేవతాత్మకః సీతాలక్ష్మణభరతశత్రుఘ్న హనుమత్సమేత శ్రీరామచంద్రః సుప్రీతః సుప్రసన్నో వరదో భవతు.

శ్రీమద్వాల్మీకి రామాయణస్య అంగన్యాసాది మంత్రాః

అస్య శ్రీమద్వాల్మీకి రామాయణ మహామంత్రస్య నారదో భగవానృషిః అనుష్టుప్ ఛందః శ్రీ సీతాలక్ష్మణ భరత శత్రుఘ్న హనుమ త్సమేత శ్రీరామచంద్రో దేవతా, ఓం బీజమ్, ధర్మాత్మా సత్యసంధశ్చ రామో దాశరథి ర్యది ఇతి శక్తిః పౌరుషే చా ప్రతిద్వంద్వః శరైనం జహి రావణిమ్ ఇతి కీలకమ్, శ్రీ సీతారామచంద్ర ప్రసాద సిద్ధ్యర్థే జపే వినియోగః

ధర్మాత్మా– అంగుష్ఠాభ్యాం నమః
సత్యసంధశ్చ – తర్జనీభ్యాం నమః
రామః– మధ్యమాభ్యాం నమః
దాశరథి ర్యది– అనామికాభ్యాం నమః
పౌరుషే చాప్రతి ద్వంద్వః – కనిష్ఠికాభ్యాం నమః
శరైనం జహి రావణిమ్ –కరతల కరపృష్ఠాభ్యాం నమః
ధర్మాత్మా – హృదయాయనమః
సత్యసంధశ్చ – శిరసే స్వాహా
రామః– శిఖాయై వషట్
దాశరథి ర్యది –కవచాయ హుం
పౌరుషే చాప్రతిద్వంద్వః – నేత్రాయ వౌషట్
శరైనం జహి రావణిమ్ – అస్త్రాయ ఫట్
భూర్భువ స్సువరో మితి– దిగ్బంధః

ధ్యానమ్:-

సహస్రాదిత్యసంకాశం సర్వశత్రునిబర్హణమ్
రామశక్తిమయం ధ్యాయే దమోఘం రామసాయకమ్

అథపంచోపచారాః

లం పృథివ్యాత్మనే గంధాన్ కల్పయామి
హం ఆకాశాత్మనే పుష్పాణి సమర్పయామి
యం వాయ్వాత్మనే ధూప మాఘ్రాపయామి
రం వహ్న్యాత్మనే దీపం దర్శయామి
వం అమృతాత్మనే అమృతోపహారం నివేదయామి
సం సర్వాత్మనే సర్వోపచారాన్ సమర్పయామి

అథ మూల మంత్రః

ధర్మాత్మా సత్యసంధశ్చ రామో దాశరథి ర్యది
పౌరుషే చాప్రతి ద్వంద్వః శరైనం జహి రావణిమ్

ఇతి యథా శక్తి జపః తతః

సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే
అభయం సర్వభూతేభ్యో దదా మ్యేత ద్వ్రతం మమ
ఇత్యేతం మంత్రం యథాశక్తి జపేత్ ఏవ ముత్తరన్యాసః

శ్రీ మద్రామాయణపూజా క్రమః

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాంతయే

ఓం భూః ఇత్యాది సువరోమ్. మమోపాత్త దురితక్షయ ద్వారా శ్రీ భగవత్ప్రీత్యర్థం సీతాలక్ష్మణ భరత శత్రుఘ్న హనుమత్సమేత శ్రీ రామచంద్ర ప్రసాద సిద్ధ్యర్థం, శ్రీరామ చంద్ర ప్రసాదేన ధర్మార్థకామమోక్ష చతుర్విధ పురుషార్థఫలసిద్ధ్యర్థం సర్వాభీష్ట సిద్ధ్యర్థం సర్వపాపక్షయార్థం శ్రీ వాల్మీకి రామాయణ పారాయణం కరిష్యే.

తదర్థం శ్రీరామచంద్రపూజాం కరిష్యే శ్రీ... కాండ పారాయణం చ కరిష్యే. తదంగత్వేన విష్వక్సేన , బ్రహ్మేంద్రాది పంచపాలక, దీపరాజ, కలశ, శంఖాత్మ పీఠపూజాం చ కరిష్యే. అస్మిన్ పుస్తకే సీతా లక్ష్మణ భరత శత్రుఘ్న హనుమత్సమేత శ్రీరామచంద్రం ధ్యాయామి, ఆవాహయామి, రత్నసింహాసనం సమర్పయామి, పాద్యం సమర్పయామి, ఆచమనీయం సమర్పయామి, అర్ఘ్యం సమర్పయామి, ఆచమనీయం సమర్పయామి, స్నానం సమర్పయామి, స్నానానంతరం ఆచమనీయం సమర్పయామి, వస్త్రం సమర్పయామి యజ్ఞోపవీతో త్తరీ యాభరణార్థం పుష్పాణి సమర్పయామి గంధాన్ ధారయామి అక్షతాన్ సమర్పయామి పుష్పాణి సమర్పయామి.

ఓం కేశవాయ నమః, ఓం నారాయణాయ నమః, ఓం మాధవాయనమః, ఓం గోవిందాయ నమః, ఓం విష్ణవే నమః, ఓం మధుసూదనాయ నమః, ఓం త్రివిక్రమాయ నమః, ఓం వామనాయ నమః, ఓం శ్రీధరాయ నమః, ఓం హృషీకేశాయ నమః, ఓం పద్మనాభాయనమః, ఓం దామోదరాయ నమః, ఓం శ్రీరామాయనమః, ఓం రామభద్రాయ నమః, ఓం ఓం శ్రీరామచంద్రాయ నమః, ఓం శ్రీ వేధసే నమః, ఓం శ్రీ దాశరథయే నమః, ఓం శ్రీ రఘునాథాయ నమః, ఓం శ్రీనాథాయ నమః, శ్రీం సీతాయాపతయే నమః శ్రీరామచంద్రాయ నమః. సమస్తోపచారాన్ సమర్పయామి, ధూప మాఘ్రాపయామి. దీపం దర్శయామి. కదళీఫలం నివేదయామి. తాంబూలం సమర్పయామి, కర్పూర నీరాజనం దర్శయామి. ఛత్రచామరాది సమస్తోపాచారాన్ సమర్పయామి. ప్రదక్షిణ నమస్కారాన్ సమర్పయామి.

హరిః ఓమ్
శ్రీ హయగ్రీవాయనమః
శ్రీ వేంకటేశాయనమః
శ్రీమద్రామాయణ పఠన ప్రారంభం

రామాయణ పారాయణ అనంతరం

యదక్షర పదభ్రష్టం మాత్రాహీనం చ యద్భవేత్
తత్సర్వం క్షమ్యతాం దేవ నారాయణ నమోస్తుతే

ఓ దేవా! శ్రీమన్నారాయణా! ఇందు అక్షరములలో, పదములలో నేదేని స్థాలిత్యమున్నచో దానినెల్ల క్షమింపుము. నీకిదే నా ప్రణామము. శ్రీ రామార్పణమస్తు

ఓం శుభమ్

విషయ సూచిక

బాలకాండ

సర్గ-1.	సంక్షిప్త రామాయణం	1
సర్గ-2.	శోకం శ్లోకంగా పరిణమించటం	2
సర్గ-3.	రామాయణ కావ్య కథాసంగ్రహం	4
సర్గ-4.	రామకథాగానం	7
సర్గ-5.	అయోధ్యా నగర వర్ణనం	9
సర్గ-6.	అయోధ్యానగర వైభవం - దశరథుని పాలన	11
సర్గ-7.	మంత్రులు - గుణగణములు	13
సర్గ-8.	అశ్వమేధయాగారంభం	14
సర్గ-9.	ఋష్యశృంగుని వృత్తాంతం	16
సర్గ-10.	శాంతాకల్యాణం	17
సర్గ-11.	అయోధ్యకు ఋష్యశృంగుని రాక	19
సర్గ-12.	యాగ నిర్వహణలో ఏర్పాట్లు	21
సర్గ-13.	యాగదీక్షారంభం	23
సర్గ-14.	అశ్వమేధ యాగారంభం	24
సర్గ-15.	పుత్రేష్టి ప్రారంభం	27
సర్గ-16.	యజ్ఞపురుషునిచే ప్రసాద ప్రదానం	28
సర్గ-17.	వానరులు జన్మించుట	30
సర్గ-18.	శ్రీరామ ఆవిర్భావం	31
సర్గ-19.	విశ్వామిత్రుని కాంక్ష	34
సర్గ-20.	విశ్వామిత్రుని క్రోధం	35
సర్గ-21.	వసిష్ఠుని హితం	36
సర్గ-22.	విశ్వామిత్రునితో రామలక్ష్మణుల పయనం	37
సర్గ-23.	పవిత్రాశ్రమంలో విశ్రమం	38
సర్గ-24.	మలదకరూశ ప్రదేశాల ఆవిర్భావం	39
సర్గ-25.	రాక్షస వధకోసమై విశ్వామిత్రుని ఉద్బోధ	41
సర్గ-26.	తాటక వధ	42
సర్గ-27.	దివ్యాస్త్ర ప్రదానం	44
సర్గ-28.	ఉపసంహార విద్యాప్రదానం	45
సర్గ-29.	సిద్ధాశ్రమ వృత్తాంతం	46
సర్గ-30.	యాగరక్షణ	47
సర్గ-31.	విశ్వామిత్రాదుల మిథిల ప్రయాణం	48

సర్గ-32.	వాయుదేవుని అకృత్యం	50
సర్గ-33.	కుశనాభ కుమార్తెల వివాహం	51
సర్గ-34.	విశ్వామిత్రుని వంశ వర్ణనం	52
సర్గ-35.	గంగాపార్వతుల వృత్తాంతం	53
సర్గ-36.	పార్వతి ఆగ్రహం	54
సర్గ-37.	కుమార సంభవం	55
సర్గ-38.	సగరుని పుత్రప్రాప్తి	56
సర్గ-39.	సగరుని యజ్ఞాశ్వ అపహరణం	57
సర్గ-40.	కపిలుని క్రోధాగ్ని	58
సర్గ-41.	సగర యజ్ఞ పరిసమాప్తి	59
సర్గ-42.	భగీరథయత్నం	61
సర్గ-43.	గంగావతరణం	62
సర్గ-44.	సగర పుత్రాదుల పుణ్యలోకప్రాప్తి	64
సర్గ-45.	క్షీరసాగర మథనం	65
సర్గ-46.	దితి తపస్సు	66
సర్గ-47.	సప్త మరుత్తుల కథ	67
సర్గ-48.	అహల్యా శాపం	69
సర్గ-49.	అహల్యాశాపవిముక్తి	70
సర్గ-50.	మిథిలానగర ప్రవేశం	71
సర్గ-51.	శతానందుని ఆనందం	72
సర్గ-52.	వసిష్ఠుని ఆతిథ్యం	72
సర్గ-53.	విశ్వామిత్రుని కోర్కె తిరస్కరించటం	73
సర్గ-54.	కామధేనువుకై సేనాప్రయోగం	74
సర్గ-55.	వసిష్ఠాశ్రమ ధ్వంసం	75
సర్గ-56.	వసిష్ఠుని తేజం	77
సర్గ-57.	త్రిశంకుని కాంక్ష	78
సర్గ-58.	త్రిశంకుడు విశ్వామిత్రుని ఆశ్రయించటం	79
సర్గ-59.	త్రిశంకునికి విశ్వామిత్రుని రక్షణం	80
సర్గ-60.	త్రిశంకు స్వర్గారోహణం	81
సర్గ-61.	శునశ్శేపుడు యజ్ఞపశువుగా మారటం	82
సర్గ-62.	శునశ్శేపుని రక్షణం	83
సర్గ-63.	విశ్వామిత్రుడు - మహర్షి	84
సర్గ-64.	విశ్వామిత్రుని తపస్సు - భగ్న ప్రయత్నం	85
సర్గ-65.	విశ్వామిత్రునిలో బ్రహ్మత్వం	86
సర్గ-66.	శివధనుస్సు వృత్తాంతం	87

సర్గ-67.	దశరథునికి జనకుని ఆహ్వానం	88
సర్గ-68.	దశరథుడు - మిథిలా నగర ప్రయాణసన్నాహాలు	89
సర్గ-69.	మిథిలానగర ప్రవేశం- జనకుని సత్కారం	90
సర్గ-70.	కుశధ్వజునికి ఆహ్వానం	90
సర్గ-71.	జనకుని వంశ చరిత్ర	93
సర్గ-72.	భరత శత్రుఘ్నుల వివాహ యత్నం	94
సర్గ-73.	రామాదుల వివాహ మహోత్సవం	94
సర్గ-74.	పరశురామాగమనం	96
సర్గ-75.	పరశురాముడు శ్రీరాముని ప్రేరేపించటం	97
సర్గ-76.	పరశురాముని తిరుగుప్రయాణం	98
సర్గ-77.	అయోధ్యా ప్రవేశం	99

అయోధ్యకాండ

సర్గ-1.	శ్రీరామపట్టాభిషేకసంకల్పం	101
సర్గ-2.	శ్రీరాముని రాజుగా సమ్మతించటం	102
సర్గ-3.	పట్టాభిషేకసన్నాహములు	104
సర్గ-4.	కౌసల్య ఆశీర్వచనములు	106
సర్గ-5.	ఉపవాసదీక్షాస్వీకరణం	107
సర్గ-6.	పట్టాభిషేకకోలాహలం	108
సర్గ-7.	కైకేయికి మంథరబోధ	109
సర్గ-8.	మంథర దుర్బోధ	110
సర్గ-9.	కైక కోపం	112
సర్గ-10.	కైకను దశరథుడు ఓదార్చటం	114
సర్గ-11.	కైక వరములు కోరటం	115
సర్గ-12.	దశరథుని ఆవేదన	116
సర్గ-13.	దశరథుని విలాపం	120
సర్గ-14.	కైకేయి సుమంత్రుని ఆదేశించటం	121
సర్గ-15.	రామాంతఃపురానికి సుమంత్రుడు వెళ్లటం	123
సర్గ-16.	రాముడు దశరథుని దగ్గరకు వెళ్లటం	125
సర్గ-17.	రాముడు మహారాజప్రసాదంలోకి వెళ్లటం	126
సర్గ-18.	రామునికి కైక వరాలను వివరించటం	127
సర్గ-19.	కైక తృప్తి	128
సర్గ-20.	కౌసల్య విలాపం	130
సర్గ-21.	పితృవాక్య పరిపాలనే పరమధర్మం	132
సర్గ-22.	లక్ష్మణునికి రాముని బోధ	134
సర్గ-23.	లక్ష్మణుని ప్రతాపం	135

సర్గ-24.	కౌసల్య అనునయం	137
సర్గ-25.	కౌసల్య శుభాశీస్సులు	138
సర్గ-26.	సీతారాముల సంభాషణ	140
సర్గ-27.	సీతాదేవి కోరిక	142
సర్గ-28.	రాముని వనక్లేశాల వివరణ	143
సర్గ-29.	సీతాదేవి మనస్సులోని మాట	144
సర్గ-30.	సీత కోరిక మన్నింపు	145
సర్గ-31.	రామలక్ష్మణ సంవాదం	146
సర్గ-32.	బ్రాహ్మణోత్తములకు భూరిదానాలు	148
సర్గ-33.	సీతారాములు దశరథుని చెంతకు వెళ్లటం	150
సర్గ-34.	దశరథుని అనుమతి	151
సర్గ-35.	సుమంత్రుని హితబోధ	154
సర్గ-36.	మంత్రి సిద్ధార్థుని హితోక్తి	156
సర్గ-37.	వసిష్ఠుని మందలింపు	157
సర్గ-38.	దశరథుని మందలింపు	159
సర్గ-39.	దశరథుని పరితాపం	160
సర్గ-40.	సీతారామలక్ష్మణులు వనవాసప్రయాణం	162
సర్గ-41.	శోకతప్తమైన అయోధ్య	165
సర్గ-42.	దశరథుని పుత్రవియోగ విలాపం	166
సర్గ-43.	కౌసల్యావిలాపం	168
సర్గ-44.	సుమిత్ర ఓదార్పు	169
సర్గ-45.	రామాదులు తమసానదీ తీరానికి చేరటం	170
సర్గ-46.	తమసానదిని దాటటం	172
సర్గ-47.	పురజనులు అయోధ్యకు మరలటం	173
సర్గ-48.	స్త్రీల విలాపం	174
సర్గ-49.	గోమతినదిని దాటటం	176
సర్గ-50.	సీతారామలక్ష్మణులు శృంగిబేరపురం చేరటం	177
సర్గ-51.	లక్ష్మణుడు గుహునితో మాట్లాడటం	179
సర్గ-52.	సీతారామలక్ష్మణులు వత్సదేశం చేరటం	181
సర్గ-53.	లక్ష్మణుని అయోధ్యకు పంపే ప్రయత్నం	184
సర్గ-54.	భరద్వాజాశ్రమ దర్శనం	186
సర్గ-55.	రామాదులు యమునను దాటటం	187
సర్గ-56.	రామాదుల కుటీరప్రవేశం	189
సర్గ-57.	సుమంత్రుడు అయోధ్యకు చేరటం	191
సర్గ-58.	రామాదుల వివరాలు అడిగి తెలుసుకోవటం	193

సర్గ-59.	అయోధ్యాపురి ఆవేదన	195
సర్గ-60.	కౌసల్య ఆవేదన	197
సర్గ-61.	కౌసల్య పరుషోక్తులు	198
సర్గ-62.	కౌసల్య పశ్చాత్తాపం	200
సర్గ-63.	శ్రవణకుమారుని వృత్తాంతం	202
సర్గ-64.	దశరథుని మరణం	204
సర్గ-65.	అంతఃపుర స్త్రీల రోదనం	208
సర్గ-66.	దశరథుని శరీరాన్ని భద్రపరచటం	209
సర్గ-67.	రాజులేని రాజ్యస్థితి	210
సర్గ-68.	దూతలు కేకయరాజ్య ప్రవేశం	213
సర్గ-69.	భరతుని స్వప్నభయం	214
సర్గ-70.	భరతాదుల అయోధ్యాప్రయాణం	216
సర్గ-71.	భరతుని అయోధ్యాప్రవేశం	217
సర్గ-72.	భరతుని పరితాపం	219
సర్గ-73.	భరతుని ఆగ్రహం	222
సర్గ-74.	భరతుడు కైకను దూషించటం	223
సర్గ-75.	భరతుని నిజాయితీ	225
సర్గ-76.	దశరథుని అంతిమయాత్ర	229
సర్గ-77.	భరతాదుల ఆవేదన	230
సర్గ-78.	మంథరపై శత్రుఘ్నుని రోషం	231
సర్గ-79.	భరతుని నిశ్చయం	232
సర్గ-80.	రహదారి నిర్మాణం	234
సర్గ-81.	వసిష్ఠుని ఆహ్వానం	235
సర్గ-82.	వసిష్ఠభరతుల సంభాషణం	236
సర్గ-83.	భరతుని వనగమనం	238
సర్గ-84.	గుహుని అనుమానం	239
సర్గ-85.	భరతగుహుల సంవాదం	240
సర్గ-86.	గుహుని అంతరంగం - లక్ష్మణుడు	241
సర్గ-87.	భరతుడు - శ్రీరాముని ఆచూకి	243
సర్గ-88.	భరతుని ఆర్తి	244
సర్గ-89.	భరతాదులు - భరద్వాజాశ్రమం	246
సర్గ-90.	భరద్వాజుని దర్శనం	247
సర్గ-91.	భరద్వాజుని ఆతిథ్యం	248
సర్గ-92.	భరతాదుల చిత్రకూటప్రయాణం	251
సర్గ-93.	నరసంచారం	252

సర్గ-94.	చిత్రకూటవర్ణన	254
సర్గ-95.	మనోహరమందాకిని	256
సర్గ-96.	ప్రశాంతవాతావరణంలో అలజడి	257
సర్గ-97.	శ్రీరాముని శాంతవచనం	258
సర్గ-98.	భరతుని ఆనందం	260
సర్గ-99.	శ్రీరామభరతుల సమాగమం	261
సర్గ-100.	శ్రీరాముడు - రాజనీతి	263
సర్గ-101.	భరతుని అభ్యర్థన	269
సర్గ-102.	మహారాజు నిష్క్రమణ వివరణ	271
సర్గ-103.	రామాదుల విలాపం	271
సర్గ-104.	కౌసల్యాదులు - శ్రీరాముడు	273
సర్గ-105.	శ్రీరాముని హితవు	275
సర్గ-106.	భరతుని వేడికోలు	277
సర్గ-107.	శ్రీరాముని ఆదేశం	279
సర్గ-108.	జాబాలి నాస్తికవాదం	280
సర్గ-109.	రాముడు - నాస్తికత్వ ఖండన	282
సర్గ-110.	వసిష్ఠుని హితబోధ	284
సర్గ-111.	రామాజ్ఞ	286
సర్గ-112.	పాదుకాప్రదానం	288
సర్గ-113.	భరతుని తిరుగు ప్రయాణం	290
సర్గ-114.	అయోధ్య దురవస్థ	290
సర్గ-115.	పాదుకాపట్టాభిషేకం	292
సర్గ-116.	ఋషులు చిత్రకూటాన్ని వీడటం	294
సర్గ-117.	అత్రిముని ఆశ్రమదర్శనం	295
సర్గ-118.	అనసూయ సీతకు బహుమతులు ఇవ్వటం	297
సర్గ-119.	రామాదుల పయనం	299

అరణ్యకాండ

సర్గ-1.	సీతారామలక్ష్మణుల దండకారణ్య ప్రవేశం	300
సర్గ-2.	విరాధుడు తారసిల్లటం	301
సర్గ-3.	శ్రీరామ విరాధుల వాగ్వివాదం	303
సర్గ-4.	విరాధుని శాపవిముక్తి	304
సర్గ-5.	శరభంగాశ్రమం	306
సర్గ-6.	మునుల ప్రార్థన - శ్రీరాముని అభయం	308
సర్గ-7.	సుతీక్ష్ణుని దర్శనం	309
సర్గ-8.	దండకారణ్యంలోని మునుల ఆశ్రమాలు	311

సర్గ-9.	సీత యుక్తాయుక్తముల విచక్షణ	312
సర్గ-10.	ప్రతిజ్ఞాపాలనత్వం	314
సర్గ-11.	మాండకర్ణి వృత్తాంతం	315
సర్గ-12.	అగస్త్యుని ఆతిథ్యం	320
సర్గ-13.	పంచవటీ ప్రయాణం	321
సర్గ-14.	జటాయువు పరిచయం	322
సర్గ-15.	పంచవటి పర్ణశాల	324
సర్గ-16.	భరతుని ప్రశంస	325
సర్గ-17.	శూర్పణఖ ప్రవేశం	328
సర్గ-18.	శూర్పణఖను విరూపినిగా చేయటం	329
సర్గ-19.	పదునాల్గు వేల రాక్షసుల రణభేరి	330
సర్గ-20.	రాక్షస యోధుల అంతం	331
సర్గ-21.	శూర్పణఖ ఖరుని రెచ్చగొట్టటం	332
సర్గ-22.	ఖరుని యుద్ధాభిలాష	333
సర్గ-23.	ఖరుని ప్రగల్భాలు	334
సర్గ-24.	శ్రీరాముడు యుద్ధ సన్నద్ధుడు కావటం	336
సర్గ-25.	శ్రీరాముని చేతిలో రాక్షసులు అంతం	337
సర్గ-26.	అంతమైన దూషణుని సేన	338
సర్గ-27.	త్రిశిరుని సంహారం	339
సర్గ-28.	ఖరునితో శ్రీరాముని పోరు	340
సర్గ-29.	ఖరుని శ్రీరాముని వాగ్వివాదం	341
సర్గ-30.	ఖరుని యమపురి ప్రయాణం	342
సర్గ-31.	అకంపనుని బోధ - మారీచుని ఉపదేశం	343
సర్గ-32.	శూర్పణఖ లంకా ప్రయాణం	346
సర్గ-33.	శూర్పణఖ నిందాలాపాలు	347
సర్గ-34.	రామాదుల వివరణ - శూర్పణఖ	349
సర్గ-35.	రావణుడు మారీచుని దగ్గరకు వెళ్ళటం	350
సర్గ-36.	రావణుడు మారీచుని సహాయం అర్థించటం	352
సర్గ-37.	మారీచుని ఉపదేశం	353
సర్గ-38.	మారీచుని రామానుభవం	355
సర్గ-39.	మారీచుని హెచ్చరిక	357
సర్గ-40.	రావణుని ఆజ్ఞ	358
సర్గ-41.	మారీచుడు చెప్పిన యథార్థం	360
సర్గ-42.	బంగారు లేడి - సీత	361
సర్గ-43.	మాయామృగం వేటకై ఉత్సాహం	362

సర్గ-44.	మారీచ వధ	364
సర్గ-45.	సీతాదేవి పరుషోక్తులు	365
సర్గ-46.	రావణుని యతి వేషం	367
సర్గ-47.	రావణుని ప్రలోభం	369
సర్గ-48.	రావణుని స్వఘోష	371
సర్గ-49.	సీతాపహరణం	372
సర్గ-50.	జటాయువు హితోక్తులు	374
సర్గ-51.	జటాయువు - రావణుల సమరం	375
సర్గ-52.	రావణుడు బలవంతంగా సీతాదేవిని లాక్కొని వెళ్ళటం	377
సర్గ-53.	సీత రావణుని నిందించటం	378
సర్గ-54.	ఆభరణాలు నేలపాలు - సీత లంకకు చేరిక	379
సర్గ-55.	రావణుడు తన వైభవాన్ని సీతకు చూపించటం	381
సర్గ-56.	సీత అశోకవనాన్ని చేరటం	383
సర్గ-57.	రామునకు అపశకునాలు ఎదురవటం	384
సర్గ-58.	సీత కనపడకపోవటం	385
సర్గ-59.	రాముడు లక్ష్మణుని ప్రశ్నించటం	386
సర్గ-60.	సీతాన్వేషణం	387
సర్గ-61.	శ్రీరాముని విరహం	389
సర్గ-62.	శ్రీరాముని విలాపం	390
సర్గ-63.	రాముడి ఆవేదన	391
సర్గ-64.	సీత జాడలను గుర్తించటం	393
సర్గ-65.	లక్ష్మణుడు రాముణ్ణి శాంతింపజేయటం	395
సర్గ-66.	లక్ష్మణుని బోధ	396
సర్గ-67.	జటాయువును చూడటం	397
సర్గ-68.	జటాయువు దహన సంస్కారాలు	399
సర్గ-69.	కబంధుడు తారసిల్లటం	401
సర్గ-70.	కబంధుని కనువిప్పు	403
సర్గ-71.	కబంధుని వృత్తాంతం	404
సర్గ-72.	కబంధుని సూచన	405
సర్గ-73.	వివిధ విషయాల వివరణ	406
సర్గ-74.	శబరి వృత్తాతం	409
సర్గ-75.	రామలక్ష్మణులు - ఋశ్యమూక ప్రయాణం	410

* * *

బాలకాండ

సంక్షిప్త రామాయణం

సర్గ - 1

నారదుడు త్రిలోక సంచారి.

వాల్మీకి మహాతపస్వి; వేదాధ్యయనశీలి. వేదమంటే ఎనలేని ఆసక్తి; వాక్కును వశీకరించుకొన్న వారిలో ఉత్తముడు; మునులలో శ్రేష్ఠుడు. తన ఆశ్రమానికి విచ్చేసిన నారద మహర్షికి మర్యాదలు చేశాడు. ఇలా అడిగాడు.

"ఈ సమయంలో భూలోకంలో మంచి గుణాలున్న వారెవరు? పరాక్రమం దండిగా ఉన్నవారెవరు? ధర్మం తెలిసిన వారెవరు? కృతజ్ఞతా భావంతో వ్యవహరించువారెవరు? సత్యం పలికేవారెవరు? దృఢ సంకల్పం ఉన్నవారెవరు? ఇన్ని గుణాలున్న ఆ మహానుభావుడెవవరయినా ఉన్నాడా? ఉంటే నాకు చెప్పండి."

వాల్మీకి మాటలు విని నారదుడు సంతోషించాడు. నీవు అడిగిన గుణాలన్నీ ఉన్న శ్రీరాముని గూర్చి, బ్రహ్మదేవుని వద్ద విన్నాను. దానినే నీవు అడిగావు. సద్గుణాలన్నీ కలిగిన ఇక్ష్వాకు వంశోద్ధారకుడైన శ్రీరామచంద్రుని గూర్చి చెప్తాను విను; అని నారదుడు ఇలా చెప్పసాగాడు.

ఇక్ష్వాకు వంశంలో దశరథుని తనయుడు శ్రీరాముడు. ఇతడు గొప్ప తేజశ్శాలి. పరాక్రమవంతుడు సత్యవాక్య పరిపాలకుడు. అందగాడు. లోకులకు ప్రియం కలిగించువాడు. ఇన్ని ఎందుకు? సద్గుణ సంపన్నుడు శ్రీరాముడు.

శ్రీరాముడికి ముగ్గురు సోదరులున్నారు. తల్లిదండ్రులకు చాల ప్రియమైనవాడు. సాగరంలో కలియడానికి నదులు ప్రవహించినట్లు శ్రీరాముని దర్శనార్థమై సత్పురుషులు ఎల్లప్పుడూ వచ్చేవారు.

దశరథుడు జనహితుడైన రాముడికి రాజ్యం అప్పగించాలనుకొన్నాడు. దానికి తగిన ఏర్పాట్లు చేయసాగాడు. ఈ విషయం దశరథుని ప్రియసతి కైక మంథరద్వారా తెలుసుకొన్నది. ఈర్ష్య పడింది. దశరథుడు ఇచ్చిన వరాలు అడ్డుపెట్టుకొని భరతుని రాజ్యాభిషిక్తుణ్ణి చేయుమని రాముణ్ణి వనవాసం పంపుమని ఆదేశిస్తుంది.

తండ్రి ఆనతి ప్రకారం రాముడు అడవులకు వెళ్తాడు. సీతాలక్ష్మణులు అతనిని అనుసరిస్తారు. పుత్ర వియోగం దశరథుడు భరించలేకపోతాడు. రాజు స్వర్గస్థుడౌతాడు. మంత్రులందరూ భరతుణ్ణి రాజ్యం (రాజసింహాసనం) చేపట్టుమని కోరుతారు. ధర్మపరాయణుడైన భరతుడు దానికి అంగీకరించడు. రాజ్యం అప్పగించాలని భరతుడు కానలకు వెళ్తాడు. రాముణ్ణి ఒప్పించలేక రామపాదుకలను తీసుకొని వస్తాడు. పాదుకాపట్టాభిషేకం చేసి భరతుడు రాజప్రతినిధిగా 14 ఏండ్లు వ్యవహరిస్తాడు.

రాముడు దండకారణ్యంలో విరాధుణ్ణి సంహరిస్తాడు. అగస్త్య శరభంగ సుతీక్షణాది ముని జనుల ఆశీర్వాదాలను పొందుతాడు. శూర్పణఖను విరూపిగా చేస్తాడు. దండకారణ్యంలో రామ లక్ష్మణులు 14 వేల మంది రాక్షసులను హతమార్చుతారు.

రాక్షసవీరుడు లంకాధిపతి రావణుడు. రాముని గురించి తెలుసుకొంటాడు. సీత సౌందర్యాన్ని చూచి మోహిస్తాడు. మాయోపాయాలతో సీతను ఎత్తుకొని వెళ్లి అశోకవనంలో దాచాడు. ఈ విషయం జటాయువు ద్వారా రాముడు తెలుసుకొంటాడు.

సీతాన్వేషణలో కిష్కింధకు రామలక్ష్మణులు చేరుతారు. అక్కడ హనుమ సుగ్రీవాదులు పరిచయం అవుతారు. వారి సహాయంతో లంక చేరి రావణుని హతమార్చి సీతను స్వీకరిస్తాడు రాముడు.

వానర వీరులతో దానవ వీరులతో కలిసి రాముడు అయోధ్యలో ప్రవేశిస్తాడు. భరతుడు సంతోషంగా అయోధ్యా పట్టణాన్ని రామునికి అప్పగిస్తాడు. సీతారాములు పట్టాభిషిక్తులౌతారు. రాముడు రాజ్యాన్ని సుభిక్షంగా పదకొండు వేల సంవత్సరాలు పాలిస్తాడు. ధర్మయుక్త పాలనవల్ల రామరాజ్యంలో అకాల మరణాలు, అకృత్యాలు, అమానుషాలు ఎక్కడా కనిపించేవి కావు. రాజ్యంలోని పౌరులందరూ అక్షరాస్యులై ధర్మాచరణ చేసేవారు. భగవంతునిపై భక్తి, ప్రభువునందు అనురాగం కలిగి ప్రజలు నడుచుకొనేవారు. సకల వర్ణాలవారికి రాముడు ఆనందం చేకూర్చాడు.

శ్రీరామచరిత్ర విన్నవారందరి మనస్సులను పునీతం చేస్తుంది. ధర్మంపై ఆసక్తిని పెంచుతుంది. దీనిని చదివినవారికి విన్నవారికి సర్వపాపాలు నశిస్తాయి. పుణ్యంవైపుగా పయనిస్తారు. సర్వజనావళి మనస్సులలోని మంచి కోరికలు తీరుతాయి. రామాయణ పఠనంవల్ల పుత్ర పౌత్రాభివృద్ధి, సర్వసౌఖ్యాలు లభిస్తాయి. పరమసుఖాలు ప్రాప్తిస్తాయి. ఇలా మనోజ్ఞంగా మధురంగా నారదుడు వాల్మీకికి రామాయణ ఇతివృత్తాన్ని ప్రసాదించాడు.

* * *

శోకం శ్లోకంగా పరిణమించటం

సర్గ - 2

రామాయణ ఆవిర్భావం

నారదుని ద్వారా రామాయణ కథనంతా వాల్మీకి విన్నాడు. రామాయణ కథలోని విశేషాలను తెలుసుకొన్నాడు. అటువంటి అద్భుత కథను వినిపించిన నారదుని అతిథి దేవునిగా భావించి అర్ఘ్యపాద్యాదులతో సత్కరించాడు. వారిరువురు ఒకరినొకరు సంభావించుకొన్నారు. వచ్చిన పని అయిపోయిందనుకొన్న నారదుడు నారాయణ మంత్రం జపిస్తూ దేవలోకానికి తన సంచార యాత్రను కొనసాగించాడు.

అలా దేవలోకాలకు నారదుడు వెళ్ళిపోయాడు. ఆ నారదుడు చెప్పిన రామ కథను వాల్మీకి పదే పదే మననం చేయసాగాడు. మానవునిగా పుట్టిన ప్రతి వ్యక్తి కర్తవ్యం నిర్వర్తించాలి. అందుకే తన శిష్య బృందంతోకూడి వాల్మీకి తమసా నదికి వెళ్ళాడు. స్నాన సంధ్యాదుల అనంతరం కర్మానుష్ఠానం చేయాల్సి ఉంది. అలా తమసా తీర

ప్రాంతానికి చేరి ప్రకృతిని చూచి వాల్మీకి పరవశం చెందాడు. అక్కడి రేవున ఉన్న ఇసుక రేణువులను చూచి పరమానందపడ్డాడు. ఈ ఇసుక సత్పురుషుని బుద్ధివలె ఎంత నిర్మలంగా ఉందో అని తన ప్రియాతి ప్రియశిష్యుడు భరద్వాజునితో అన్నాడు. బురద అంటని ఇసుక సాధువుల అంతరంగంలా భాసిస్తోంది. ఇచ్చటి ప్రకృతి ఎంత రమణీయంగా ఉందో! నేను వనవాసిని; మరి నాలాంటివాని మనస్సే ప్రకృతికి దాసోహం అంటోంది. భగవంతుని సృష్టికి సాటిలేదు కదా! ఆహా! అంటూ తమసా తీర ప్రాంతాన్నంతా వాల్మీకి పరికించి చూస్తున్నాడు. ఈ నదీ తటంలోనే స్నానం ముగించుకొందాం. భరద్వాజా! నీవు కూడా స్నానానికి ఉపక్రమించు అంటూ గురుశిష్యులు స్నానాదులు పూర్తిచేశారు.

వాల్మీకి దివ్యమైన ప్రకృతి సోయగానికి పరవశిస్తూ అక్కడి వృక్ష సంపదను పరిశీలించాడు. ఆ సమయంలో ఒక క్రౌంచ పక్షి జంట సుఖాభిలాషతో అన్యోన్యానురాగంతో సంభాషించుకొనడాన్ని చూశాడు. విధాత సృష్టిలోని అద్భుత రసాన్ని ఆస్వాదిస్తున్నాడు.

అంతలో ఒక దుర్మతి ఐన బోయవాడు ఆ క్రౌంచ పక్షులలోని ఒక మగ పక్షిని బాణంతో కొట్టాడు. ఆ బాణం ధాటికి తాళలేక గిలగిలా కొట్టుకుంటూ ఆ పక్షి నేలపై పడింది. అసువులు బాసింది. దీనినంతా చూచిన కామి ఐన ఆడపక్షి తన రతి పారవశ్యానికి భంగం కలిగించిన వేటగానిని అమిత క్రోధంతో చూచింది. జంట బాసినందుకు ఎంతగానో రోదించింది. క్షణభంగురమైన జీవితంలో తోడు కోల్పోయానని దుఃఖించింది. ఆ క్రౌంచపక్షుల జంట దీనావస్థను వాల్మీకి చూశాడు. ఆయన హృదయం వేదనతో ద్రవించింది. క్రోధం ఉప్పొంగింది. ఆడపక్షి చేసే ఆక్రందనలు విన్నాడు. సున్నిత హృదయం కలిగిన వాల్మీకి వికృత చర్యకు పూనుకొన్న వేటగానిపై ఆగ్రహించాడు. వెంటనే కామపరవశమైన పక్షి జంటను ఎడబాపావు, కాబట్టి నీవు శాశ్వత అపకీర్తిని పొందుదువుగాక! అంటూ శాపం ఇచ్చాడు.

మరునిమిషం సంయమనం కోల్పోయి ప్రవర్తించిన తన తొందరపాటుకు చింతించాడు. అనాలోచితంగా తన నోటి నుండి ఛందోబద్ధంగా వెలువడిన శోకం, శ్లోకరూపాన్ని పొందడం చూశాడు. అబ్బురపడ్డాడు, దానినే పదే పదే ఉచ్చరించాడు. "మా నిషాద" అంటూ వాల్మీకి నోటినుండి వెలువడిన శ్లోకాన్ని భరద్వాజాది శిష్యులు విన్నారు. పదే పదే దానిని పలికారు. శోకం కాస్త శ్లోక విశిష్టతను సంతరించుకొంది. దీనినే మననం చేసుకొంటూ తిరిగి వాల్మీకి శిష్యులతోటి తన ఆశ్రమానికి చేరుకొన్నాడు. అక్కడా ఇదే వరస; పనులన్నింటిని మరిచాడు. బాహ్య ప్రపంచంతో సంబంధం లేనట్లుగా ప్రవర్తించాడు. క్రౌంచ జంటను మరువలేకపోయాడు. తాను ఇచ్చిన శాపాన్ని తిరిగి తిరిగి వల్లెవేసుకొంటున్నాడు. ఆశ్రమంలోని శిష్యులందరూ ఆ శ్లోకాన్నే లయబద్ధంగా పఠించసాగారు. ఆ శ్లోక పఠనం వారిలో తెలియని ఆనందాన్ని కలిగించింది. తెలియకుండానే తెరలు తెరలుగా వచ్చే సంతోషానికి కారణం తెలుసుకోలేకపోయారు. అయినా శ్లోక పఠనం వాల్మీకితో సహా అందరూ చేశారు.

అప్పుడు అక్కడికి బ్రహ్మదేవుడు వచ్చాడు. వ్యాకులపడుతున్న వాల్మీకిని చూచి చిరునవ్వు చిందించాడు. బ్రహ్మను చూచిన వాల్మీకి ఆనందంతో ఉబ్బితబ్బిబ్బు అయ్యాడు. విధి విధానంతో బ్రహ్మను కొలిచాడు. సుఖోపవిష్టుని

కావించాడు. కాని వాల్మీకి మనస్సు పదే పదే శ్లోకాన్నే అంటోంది. సృష్టికర్త సమక్షంలో కూడా శ్లోకమే మనస్సులో ప్రతిభాసించింది.

"వాల్మీకీ! నా బుద్ధి పూర్వకంగానే నీ నోటి నుండి శ్లోకం బయలుపడింది. దానికెంతో మహత్వముంది. నీవు నారదునిచే విన్న రామాయణ గాథకు అది ఆదిశ్లోకం. ఆ ఛందోబద్ధమైన శ్లోకమే నీవు రచించబోయే రామాయణానికి నాందిగా దృశ్యమానమైంది. అందుకే ఇక నీవు చింతించవలసిన అవసరం లేదు.

ధర్మాత్ముడు, ఆదర్శప్రాయుడు, సమదర్శనుడు, నిత్య సంతోషి ఐన రాముని కథను నారదుడు తెలిపినట్లుగా గ్రంథస్థం చేయి. నీకు రామాయణంలోని సీతారాముల వృత్తాంతం, భరతాది సోదరుల గాథ, ముప్పురు రాణులతో కూడిన దశరథుని జీవితం, రాక్షసుల కథలు ఇలా అన్నీ నీకు స్పష్టంగా తెలుస్తాయి. నారదుడు చెప్పని, జరిగిన విశేషాలన్నీ నీకు విస్పష్టంగా కనిపిస్తాయి. నీకు దివ్యదృష్టి కలుగుగాక! ఈ దృష్టి విశేషంతో రామకథనంతా అవలోకించి చూచి రామ కథను గూర్చవలసినది అని బ్రహ్మదేవుడు వాల్మీకికి చెప్పాడు.

లోకప్రసిద్ధం ఐన రామగాథనంతా కావ్యంగా మలుచు. నీవు రచించబోయే రామకథలో తప్పులుండవు. అర్థంలోకాని శబ్దంలోకాని ఎలాంటి దోషాలుండవు. ఈ రామకథ పాపాలను పోగొట్టేదిగా జనుల మనస్సంద్రంలో సంతోషాతిశయాన్ని కలిగించేదిగా ఉంటుంది. ఈ రామకథను నీవు విశేషించి రచించినందువల్ల నీ చరిత్రం లోక ప్రసిద్ధం అవుతుంది. నేను సృష్టించిన సత్యలోకం నదులూ పర్వతాలూ నిలిచి ఉండేదాకా ఈ రామకథ క్రొత్త పుంతలు త్రొక్కుతూనే ఉంటుంది.

"వాల్మీకి అలా శ్లోకాన్ని మననం చేస్తూ దృఢ చిత్తుడయ్యాడు. ఇదేవిధమైన ఛందోబద్ధ శ్లోకాలతో రామకథనంతా రచిస్తానని సంకల్పించాడు. ఆయన సంకల్పానికి బ్రహ్మ తథాస్తు అన్నాడు.

ఆ తర్వాత ముల్లోకాధీశుడు సత్యవంతుడైన రాముని కథను సమాక్షరాలు కలిగి ఛందోబద్ధంగా రచించడానికి వాల్మీకి నాంది వాచకం పలికారు.

* * *

రామాయణ కావ్య కథాసంగ్రహం

సర్గ - 3

బ్రహ్మ పలుకులు మననం చేసుకొన్న వాల్మీకికి బ్రహ్మానందం కలిగింది. నారదుడు చెప్పిన కథను మరల మరలా స్మరించాడు. ఇంకా ఏదో తెలుసుకోవాలని వాల్మీకి మనస్సుకు తోచింది. వెంటనే బ్రహ్మ ఇచ్చిన దివ్యదృష్టి జ్ఞప్తికి వచ్చింది. సర్వశాస్త్ర పారంగతుడైన వాల్మీకి దర్భాసనం తూర్పుముఖంగా ఏర్పరిచాడు. పద్మాసనునికి నమస్కరించాడు. రామకథనంతా దృష్టిపథంలోకి తెచ్చుకున్నాడు.

తపఃసంపన్నుడైన వాల్మీకికి సీతారామ లక్ష్మణులతోపాటు, కైకేయి సుమిత్రా కౌసల్యలతో కూడిన దశరథుడు భరత శత్రుఘ్న లక్ష్మణులు వారి ధర్మపత్నులు అందరూ కనబడసాగారు. భార్యాదులతో ఉన్నప్పుడు, లేనప్పుడు రాజ్య నిర్వహణలోను, సున్నిత, కఠోర విషయాలలో వారి చేతలు వారి మనోఫలకంపై రూపుదిద్దుకొనే ఆలోచనల పరంపరలు అన్నీ అద్దంలో కనిపించినట్లుగా కనిపించసాగాయి. ఇహలోకాన్ని వాల్మీకి పూర్తిగా మర్చిపోయాడు. అయోధ్య పట్టణం అందులోని ప్రజానీకం ఇక్ష్వాకువంశం– అందులోని ప్రతి అంశం ఆయన కన్నుల ముందు కదలాడింది.

రామకథనంతా ఆమూలాగ్రంగా తెలుసుకొన్నాడు. రామాయణం రత్నాకరం అనిపించింది. సముద్రంలో నత్తగుల్లలతోపాటు రత్నరాసులు ఉండినట్లుగా రామాయణ కథలో పైకి స్త్రీ వ్యామోహం కనిపిస్తున్నప్పటికి, అందులో మానవునికి అత్యవసరమైన ధర్మార్థ కామమోక్షాల సంపదంతా నిబిడీకృతమైనదని గ్రహించాడు. దీనినంతా గ్రహించిన వాల్మీకి సాధారణ మానవుడు సైతం మాన్యుడుగా అవడానికి తప్పనిసరిగా రామాయణం తెలుసుకోవాలని అనుకున్నాడు. తన కర్తవ్యాన్ని విధిని నిర్వర్తించిన ప్రజలకు ఆ దేవదేవుడే ఫలాన్ని అందజేస్తాడని తలిచాడు.

లోకకల్యాణమే పరమావధిగా భావించే సంయమి అయిన తాపసి రామకథను కావ్యంగా నిర్మించటానికి పూనుకొన్నాడు. మనస్సుకు ఆహ్లాదాన్ని ఆనందాన్ని కలిగించేది, వీనులకు విందొనర్చేది కన్నులను మోహింపజేసేది ఐన రామకథా నిర్మాణానికి ఉపక్రమించాడు.

దశరథుని తపఃఫలంగా శ్రీ మహావిష్ణువే శ్రీరామునిగా అవతరించటం దుష్టశిక్షణ శిష్టరక్షణ కార్యాన్ని అతి లాఘవంగా నెరవేర్చటం అందరి మనస్సులను చూరగొనటం, తప్పులను దిద్దటం, అపరాధులలో పశ్చాత్తాపం కలిగేటట్లుగా ప్రవర్తించటం, సత్యవాక్య ప్రభావం చాటిచెప్పటం అను విషయాలన్నీ ఈ కావ్యంలో మౌని పాత్రోచితంగా వర్ణించాడు.

రామునితో పెనవేసుకొన్న వాటిని రామకథతో ముడిపడి ఉన్న ఇతర కథా విశేషాలను, వారి పుట్టుకకు సంబంధించిన పూర్వకథలను విశ్వామిత్ర యాగసంరక్షణార్థం రామలక్ష్మణులు వెళ్ళటం, అది శివధనుర్భంగానికి జానకీ పరిణయానికి దారితీయటం, కొడుకు కోడళ్ళతో స్వగృహానికి వస్తున్న దశరథునికి పరశురామునిదర్శనం, పరశురామునితో శ్రీరామునికి ఏర్పడిన వివాదం, పరశురామగర్వభంగం విశ్వామిత్రునితో యాగాన్ని రక్షించటానికిగాను, విశ్వామిత్రుడు అందించిన దివ్యాస్త్రాలు, తాటకాదులను సమూలంగా నాశ మొందించటంలో కలిగిన సంశయాలను గురువుగా దూరం చేయటం, రాముని గుణవిశేషాలకు ప్రీతి చెంది యౌవరాజ్య పట్టాభిషిక్తుని చేయాలనే దశరథుని తలంపు, దానికి అడ్డుపడిన మంథర కైకేయిల మనోగతం, దుష్టచింతనం దానిద్వారా వనవాసదీక్షాబద్ధులైన సీతారామలక్ష్మణుల విషయం, పుత్రశోక విహ్వలుడైన దశరథుని స్వర్గలోక ప్రయాణం, పితృవాక్య పరిపాలనా దక్షతకోసం స్వపరివారాన్ని పురజనులను ఆందోళనకు గురిచేసి సుమంత్రుని సాయంతో రాముడు గుహుని, కలుసుకొనడం ఆ తర్వాత సుమంత్రుని కూడా వదిలించుకుని భరద్వాజుని ఆజ్ఞ ప్రకారం వనాలలో సంచరించటం, అక్కడి ఋషీశ్వరులను రాక్షసుల బాధనుండి కాపాడుతానని రాముడు మాట ఇవ్వటం జరిగింది. చిత్రకూట ప్రవేశానంతర కథ సాగింది.

అక్కడికి పితృవియోగ బాధాతత్పరుడైన భరతుని ఆగమనం, వశిష్ఠాది కుల గురువులతో తల్లులతో కూడి భరతుడు రాముని దీక్షను విరమింపజేయబూనటం, తాపసుల వేషాలతో ఉన్న రామలక్ష్మణులు దానికి అంగీకరించక భరతునే రాజ్యభారాన్ని మోయవలసిందిగా నిర్బంధించటం, దానికి పాదుకలను అనుగ్రహించవలసిందిగా భరతుడు కోరగానే సమ్మతించటం నందిగ్రామంలోనే రామలక్ష్మణుల మాదిరిగానే వల్కలాజినాలతో మౌని వేషధారణతో రామ ప్రతినిధిగా రాజ్యభారాన్ని మోయడానికి భరతుడు పూనుకొనడం, ఆ తర్వాత తండ్రికి శ్రాద్ధకర్మలు చేయడాన్ని వాల్మీకి వర్ణించాడు.

ఆ తరువాత తాను వచ్చిన పనిని నిరాఘాటంగా సాగించడానికి దండకారణ్యంలో ప్రవేశించడం, అక్కడ విరాధాది రాక్షసులను తుదముట్టించడం, శూర్పణఖను విరూపిగా చేయడం మొదలగు ఘట్టాలను వర్ణించాడు.

అత్రి అనసూయల దగ్గరకు సీతారాములు వెళ్ళటం, అనసూయ పాతివ్రత్య మహిమ తెలిపి, సీతకు వాడని కుసుమాలు, మాయని వస్త్రాలు, అంగరాగాలు ఇవ్వటం, సుతీక్షణులను అగస్త్యులను రాముడు పరామర్శించటం, వారి ద్వారా దివ్యాస్త్రాలను గైకొనటం, శూర్పణఖచే ప్రేరితులై సమరాభిలాషతో వచ్చిన ఖర దూషణాదులను యమపురికి పంపటం లాంటి విశేషాంశాలెన్నో కథనం చేశారు.

రావణ సహాయార్థియై వచ్చిన మారీచుని సంహరించుట, జటాయువుచే కోల్పోయిన సీత జాడను తెలుసుకొనటం, ఆ పక్షిరాజు స్వర్గప్రాప్తి కలిగించటం, కబంధుని, శబరిని దర్శించటం అనే అనేక అంశాల ప్రస్తావన రామాయణంలో జరిగింది.

ఆ తర్వాత సీత జాడకై వెదకుతూ రామలక్ష్మణులు పంపా సరస్సు ప్రాంతానికి వెళ్ళడం, అక్కడ హనుమ సుగ్రీవులను చూడటం, వారితో సంభాషించటం, అగ్నిసాక్షిగా మిత్రులవ్వటం, ఒకరికొకరు పరస్పర సహాయసహకారాలు అందించుకోవాలని ప్రతిజ్ఞలు పూనడం వర్ణించాడు.

సుగ్రీవునికి విశ్వాసం కలిగించటానికై సప్తతాళఛేదనం, వాలివధ, సుగ్రీవపట్టాభిషేకం, తదితర విశేషాలను కూలంకషంగా నిర్మించారు.

వర్షఋతువాగమనం, వానరవీరులు మోహప్రపంచంలో మునగటం, లక్ష్మణాగ్రహం, రామునికినుక, తార సుగ్రీవులు అనునయించటం సేనలసమీకరణం, భౌగోళికాంశాలను వర్ణించటం, వానరయోధులను నలుదిశలకు పంపటం, జాంబవంతుని అభిప్రాయం ప్రకారం ఆంజనేయుడు లంకకు వెళ్ళడానికి పూనుకొనడం, రామనామ ప్రభావాన్ని ఆంజనేయుడు తెలుసుకొనటం, దానికి రాముడు సంతసించటం, సీతకు భయం పోగొట్టడానికై అంగుళీయకం ఇచ్చి రమ్మనటం, నూరు యోజనాల విస్తీర్ణం కలిగిన లవణసంద్రాన్ని నేర్పుతో పవన సుతుడు దాడటం అన్న అంశాలను వివరించే కథ సాగింది.

మహేంద్ర పర్వతం ఎక్కటం, మైనాకుని దర్శనం, సింహిక వధ, అంధకారంలో మునిగిన లంకావాసులను ఉద్ధరించటానికై ఆంజనేయుని లంకాప్రవేశం, వానిని చూచి దానవులు పరుగు లంకించుకోవటం, ఇంద్రజిత్తుకు పట్టుబడినట్లుగా ఆంజనేయుని ప్రవర్తన, శత్రువులను అంచనా వేయటం, శత్రువులను భయాంధకారంలో

పడవేయటం, లంకాదహనం చేయటం, సీతకు ఆనందాన్ని కలిగించటం వర్ణించాడు. త్రిజటా స్వప్నం గురించి వివరించాడు.

సీతను కనుగొంటినంటూ రామునికి తెలపటం, సీత పంపిన చూడామణిని రామునికిచ్చి సంతసం కూర్చటం, నీలుని సేతుబంధనం, ఆ సేతువుపై వానరసేన లంకాప్రవేశం చేయటం జరిగింది.

లంకా సమీపంలో విభీషణునితో స్నేహం, రావణ వధోపాయం గ్రహించటం, కుంభకర్ణ మేఘనాథులను సంహరించటం, రావణుని హతమార్చటం, విభీషణుని పట్టాభిషిక్తుని చేయటం, సీతను అనుగ్రహించటం, సీతా లక్ష్మణ సమేతుడై రాముడు వానరులను విభీషణాదులను తీసుకొని పుష్పక విమానంలో నందిగ్రామానికి చేరడం వర్ణించాడు.

అక్కడినుండి అందరూ కలిసి అయోధ్య పట్టణానికి వెళ్ళటం, సీతారాముల పట్టాభిషేకం, అతిథులుగా వచ్చిన వానరయోధ శిఖామణులను, విభీషణాదులను వారి వారి నివాసాలకు పంపివేయటం ప్రజానురంజకంగా పదకొండు వేల సంవత్సరాలు రామపాలన ఇలా ప్రతి అంశాన్ని రామాయణ కావ్య విశేషాలన్నీ విస్తృత వర్ణనలతో వాల్మీకి రచించాడు.

సీతాపరిత్యాగం కుశలవుల పట్టాభిషేకం ఇలా ముందు జరిగే కథనంతా వాల్మీకి ఉత్తరకాండలో నిక్షిప్తం చేశాడు.

* * *

రామకథాగానం

సర్గ - 4

బ్రహ్మవర ప్రభావితుడు, దివ్యజ్ఞాన తేజో సంపన్నుడు, పరమేష్ఠి ప్రీతిపాత్రుడు ఐన వాల్మీకి, రామాయణ కథా చరిత్రను నిర్మించి సంతోష తరంగితుడయ్యాడు. 24 వేల శ్లోకాలు 600 సర్గలు ఆరు కాండలతో విలసిల్లేట్లుగా రామాయణానికి కావ్యాలంకార రూపాన్ని సంతరించాడు.

అంతేకాదు. రామ పట్టాభిషేకానంతరగాథను, సీతా పరిత్యాగాన్ని అశ్వమేధయాగ నిర్వహణను ఉత్తరకాండను నిర్మించాడు. అప్పుడు శబ్దార్థాలంకారాలతో శోభిల్లే ఈ రామాయణాన్ని గానయుక్తం చేస్తే బాగుంటుందన్న ఆలోచన వాల్మీకి మహర్షికి కలిగింది. ఈ రామాయణాన్ని గానం చేసే యోగ్యత కలవారు. నాకు తటస్థించాలని వాల్మీకి పరమాత్మను వేడుకొన్నాడు.

ఆ సమయంలో చిరుప్రాయులు, గురుభక్తి కలవారు, వర్చస్సు కలవారు మునివేషధారులు, గాయకులగు కుశలవులు వాల్మీకికి పాదాభివందనం చేశారు. వెదకబోయిన తీగ కాళ్ళకు చుట్టుకున్నట్లుగా వాల్మీకికి అనిపించింది.

మనోగతాన్ని అర్థం చేసుకొన్న, దేవదేవుడు రామాయణ గానానికి నా శిష్యులనే ఎంచుకొన్నాడన్న విషయం తెలుసుకొన్నాడు. ఆనందంతో ఎద పొంగింది. ఆశీర్వదించి తన ప్రియశిష్యులను దరిచేర్చుకొని, వాల్మీకి మూర్కొన్నాడు.

సకల శాస్త్ర కోవిదులు, నిష్ఠాగరిష్ఠులు, చక్కని గాత్రం గల, సమర్థులు అయిన ఆ సోదర ద్వయానికి పని అప్పగించాలని ఆలోచించాడు. సకల వేదస్వరూపం అయిన రామాయణాన్ని కుశలవులకు వినిపించాడు. వీనులకు విందు చేయగల ఆ కావ్యం – గానం చేయడానికి సోదరులు తమ ప్రసన్నతను తెలిపారు. తాను రచించిన వేదార్థ సంహితమైన రామాయణాన్ని పౌలస్త్యవధగాను, సీతాచరితంగాను పిలవవచ్చునని వారికి వాల్మీకి తెలిపారు.

వీణాతంత్రులతో మృదంగ వాద్యాలతో కూడి గానం చేయడానికి అనువైనది శబ్దార్థాలతో వెలుగొందే వీలున్నది నవరసాలను పలికించునదిగా ఉన్న రామాయణాన్ని కుశలవులు కంఠస్థం చేశారు. వారి గానం విని వాల్మీకి మహదానంద భరితుడయ్యాడు.

ఆ గానాన్ని విన్న వారందరూ అందులోని సంగీత సాహిత్యాలకు అచ్చెరువొందారు. అందులోని విచిత్ర శబ్దార్థ వాక్య విన్యాసానికి ఆనందపడ్డారు. వినగానే ఆశ్చర్యం కలిగించే రామాయణ కథకు అందరూ ఆకర్షితులయ్యేవారు. ఒకసారి వాల్మీక్యాశ్రమానికి ఎక్కడెక్కడినుంచో మునిపుంగవులు అరుదెంచారు. వారినందరిని వాల్మీకి యథావిధిగా ఆనందింపజేశాడు.

వారందరూ సుఖోపవిష్టులయ్యారు. త్రిలోక విశేషాలను చెప్పుకొంటున్నారు. పరమేశ్వరుని లీలావతార గుణాలను స్తుతిస్తున్నారు. ఆ సత్సాంగత్యానికి కుశలవులు వచ్చారు. అంతవరకు వారు నేర్చుకున్న విద్యా పాటవాలను, చూపుడని ఆ మౌనివర్యులు అడిగారు. లవకుశులు తమ గురుదేవులకు ప్రణమిల్లారు. ఆయన అభిప్రాయాన్ని అర్థం చేసుకొన్నారు.

వెంటనే రామకథను గానం చేయసాగారు. ఆ గానాన్నంతా వింటున్న ఆ మునివరేణ్యులు ఆనంద చిత్తులయ్యారు. ఇంతకుముందు తెలిసిన కథే అయినా వారిలో ఉత్సుకతను రేపింది. వారి మనోవాక్కాయాలకు ఆనందాన్ని చేకూర్చింది. వారు చిత్తవిభ్రమకు లోను అయ్యారు. అద్భుత కథను వీక్షిస్తున్నట్లుగా సంతోషించారు.

అలౌకికానందాన్ని ఒనగూర్చిన ఆ చిన్నారులకు ప్రశంసావర్షాన్ని కురిపించారు. వారి ఆనందానికి చిహ్నంగా వారిని ఆశీర్వాదాలతో ముంచెత్తారు. ఆచంద్రార్కం రామాయణ ప్రశస్తి నిలిచి ఉంటుందని స్తుతించారు. రామాయణ గానలోలత్వాన్ని కలిగించిన కుశలవులకు ఒక్కొక్కరు ఒక్కొక్క బహుమానాన్ని అందజేశారు.

కలశపాత్ర, కౌపీనం, వల్కలం, జింకచర్మం, మెత్తనిఆసనం, మౌంజి, దర్భలు, సమిధలు ఇలా ఎన్నింటినో లవకుశులకు అందించారు. ఏ మాత్రం తొట్రుపాటుపడకుండా చక్కని కంఠంతో రామాయణ గానాన్ని ఆలాపించిన కుశలవులు, బాగు బాగు అంటూ ఆనందాశ్రువులను కురిపిస్తున్న ఆ జంట కంఠాల జోరుకు తలలు పంకించారు.

ఇంత చక్కగా కూర్చిన రామాయణ కర్తను చూచి పరమానందభరితులయ్యారు. విన్న వృత్తాంతాన్నే మరల మరలా వినే ఆసక్తి కలిగేటట్లుగా ఏర్చి కూర్చి ముత్యాలసరంవలెనున్న రామాయణ కథను ఆసాంతం ఆనందంగా

ఆస్వాదించారు. అప్పటినుంచి ఎల్లవేళలా రామాయణ గానాన్ని విడవకుండా కుశలవులు గానం చేసేవారు. వీధులలోను గ్రామాలలోను, పట్టణాలలో వీరు గానం చేస్తూ తిరిగేవారు. వీరి గానానికి అక్కడి జనులు దాసులయ్యేవారు. వారు అప్రయత్నంగానే ఆ గానాన్ని ఆలాపించేవారు. చేస్తున్న పనిని ఆపేసి ఆ గానామృతంలో తడిసి ముద్దయ్యేవారు.

కుశలవులు మంత్రముగ్ధులవుతున్న ప్రజను చూచి పులకిత గాత్రులయ్యారు. ఆనందతాండవం చేస్తూ గాన పంక్తిని పదే పదే ఆలాపించేవారు. అలా అలా వారు పాడుతూ వెళ్ళుతుండడం ఒకసారి శ్రీరాముడు చూశాడు. వారి కంఠమాధుర్యానికి రాముడు పరవశుడయ్యాడు. వారిని తదేకంగా చూడసాగాడు. రాముని ప్రతిరూప విశేషాలను సంతరించుకొన్న వారు మునివేషధారణలతో చూపరులను కట్టిపడేసేవారు. వారి రూప లావణ్యానికి అబ్బురం చెంది నిల్చున్న వారిని తమ గానంతో వీనుల విందొనరించేవారు. అలా అక్కడి జీవులందరూ పరమాత్మలో లీనమయినట్లుగా స్థాణువులయ్యేవారు.

ఆ దృశ్యాన్నంతా కనులముందు సాక్షాత్కరించడం చూసిన రాముడు వారి గానాన్ని పూర్తిగా వినాలని అనుకొన్నాడు. వెంటనే వారిని రాజాంతఃపురానికి ఆహ్వానించాడు. వారికి ఉచితాసనం ఏర్పాటుచేశాడు. ఆ సౌధంలో ఉన్నవారందరూ ఈ ముని బాలకులను చూచి విస్మయం చెందారు. చెప్పలేని ఆనందానికి గురయ్యారు. మాటలుడిగి మౌనులై వారిని చూస్తూ నిలబడ్డారు.

వారందరిని ఉద్దేశించి రాముడు వీరిరువురు కలిసి గానఫణతిని వినిపిస్తారు. వీరి గాన నైపుణ్యం, వర్ణించ వీలులేనిది ఎవరికి వారు అనుభవించి తెలుసుకోవలసినదే. అందుకే వీరిని పిలిపించాను. ఏ గురు మాహాత్మ్యంతో గానాన్ని నేర్చారో వీరి అమూల్య గానసంపదను వినరారండి అంటూ చెప్పాడు.

విచిత్రార్థాలపలుకులతో మురిపిస్తూ రామాయణాన్ని ఆ బాలకులు గానం చేశారు. రామునిచే ప్రేరితులైన అంతఃపురవాసులందరూ గానాన్ని విని పరమాశ్చర్యభరితులయ్యారు. లవకుశులు రామాయణాన్నంతా రాజాంతః పురంలో గానం చేశారు.

* * *

అయోధ్యా నగర వర్ణనం

సర్గ - 5

విష్ణువుచే సృజించబడిన ఈ భూమండలాన్ని మనువు మొదలుకుని ఎందరో వీరాధివీరులు పాలించారు. సప్తద్వీపాలు గల ఈ భూమండలంలో సరయూనదీ తీర ప్రాంతంలో కోసల దేశం ఉండేది. ఆ దేశంలో అయోధ్యా పట్టణం మిక్కిలి ప్రసిద్ధి చెందింది. పూర్వం కోసలను ఇక్ష్వాకు వంశపు రాజు సగరుడు పాలించాడు. అతనికి 60

వేలమంది పుత్రులు. ఒకనాడు సగరుడు అశ్వమేధయాగం చేయ సంకల్పించాడు. అందు నిమిత్తం అశ్వాన్ని వదిలిపెట్టాడు. దాని వెంట సగరుని పుత్రులు వెళ్ళారు. కొంతకాలానికి ఆ అశ్వం సగరుని తనయులకు కనిపించలేదు. దానిని వెదికే ప్రయత్నంలో వారు భూమి త్రవ్వారు. అలా తవ్వుతున్నప్పుడు అక్కడ జలాశయం ఏర్పడింది. అందువల్ల అది సాగరంగా ప్రఖ్యాతి గడించింది.

అటువంటి వంశంలో కావ్య కథానాయకుడు మూర్తీభవించిన ధర్మవేత్త ప్రజా రంజకుడు అయిన శ్రీరాముడు దశరథునికి తపఃఫలంగా లభించాడు. దశరథుడు తపస్సు చేశాడు. యజ్ఞయాగాది కర్మలు నిర్వర్తించాడు. ప్రజాభీష్టంగా పరిపాలన సాగించాడు. దశరథుని పాలనలో అయోధ్య లోకప్రసిద్ధి పొందింది.

12 యోజనాల పొడవు 3 యోజనాల వెడల్పు గలిగింది అయోధ్య. దానిలో విశాలమైన రహదారులు ఉండేవి. ఆ దారులకిరువైపుల పొడవైన వృక్షాలు ఫలపుష్ప సంపదతో అలరారుతుండేవి. పట్టణవాసుల గృహాలు ఆరామాలు రమణీయంగా ఉండేవి. ప్రణాళిక ప్రకారం నిర్మించిన ఆ పట్టణం శోభాయుతంగా ఉండేది. నగరవాసుల యిండ్లు సమతల ప్రదేశంలో కట్టి ఉండేవి. స్వచ్ఛమైన వాయు ప్రసరణకు వీలుగా తలుపులు కిటికీలు అమర్చబడి ఉండేవి. వారి మనోభీష్టానికి అనుకూలంగా తటాకాలు, నదులు, బావులు దశరథుడు ఏర్పాటు చేసేవాడు.

కృషీవలురు ముక్కారు పంటలతో ఆనందించేవారు. దేశ విదేశాల నుండి వచ్చే యాత్రికులు క్రయ విక్రయాలతో సందడి చేసేవారు. రత్నాలు పొదిగిన ఇళ్ళు, ఆకాశాన్నంటే గోపురాలు, మామిడి, అరటి లాంటి తోపులు, ఋతువులననుసరించి ఫలాలనందించే తోటలు ఉన్న అయోధ్య పాదచారుల అలసటను పొగొట్టేది.

శత్రువులు రావడానికి వీలు లేని అగడ్తలు, ఎత్తైన కోట బురుజులు, ప్రాకారాలు అష్టాదశ పద్మాకారంలో ఉన్న రాజప్రాసాదాలు చూపులను ఆకట్టుకొనేవి. శత్రువులకు భీతి కలిగించేవి. చూచిన వారు మహేంద్రుని అమరావతిని పోలి అయోధ్య వెలుగుతోందని అబ్బురపడేవారు.

నగరాన్ని చూడడానికి వచ్చిన వారితోను, కప్పములు చెల్లించుటకు వచ్చిన సామంతులతోను, వ్యాపార నిమిత్తం ఏతెంచిన వ్యాపారస్థులతోను, స్వదేశీయుల బంధుసమాగణంతోను అయోధ్య క్రిక్కిరిసి ఉండేది.

ఇటువంటి అయోధ్యలో సర్వశాస్త్ర పారంగతులు ఉండేవారు. వారి వారి వృత్తులలో ఆరితేరినవారే ఉండేవారు; కాని నిరక్షరాస్యులనేవారు ఎవరూ ఆ నగరంలో ఉండేవారు కాదు. యోధానుయోధులైన శత్రు భయంకరులైన సైనికులు శిక్షణను పొందుతుండేవారు.

శిల్ప సంగీత నాట్యకళల్లాంటి లలిత కళలకు కాణాచి అయోధ్య. మృదంగ ధ్వనులు వీణానాదం దుందుభుల మ్రోతతో ఆ నగరం ప్రతిధ్వనిస్తూ వీనుల విందునొనరించింది. శిల్పుల నేర్పుకు తార్కాణంగా ఆ నగరం జ్వాలాయమానంగా ఉండేవి. శస్త్రాస్త్ర విద్యలలో ఆరితేరినవారే. శబ్దభేదిలాంటి విద్యలు చిరుప్రాయంలోనే ఉగ్గుతో రంగరించి పెట్టిన విద్యేమో అనిపించేది.

ఏమరుపాటు లేక విధి నిర్వహణను రాజు, ప్రజలు చేసేవారు. అందుకే చోరులు కాని జారులకు కాని నిలవనీడ లేకపోయేదక్కడ. సోమరులు నగర వాకిట అడుగుపెట్టేవారు కాదు. ఆ నగరవాసులు ఎంతటి వీరులో

అంతటి దయా సముద్రులు. శత్రువులు ఎవరైనా పారిపోవ చూస్తే పట్టుకొనేవారు కాదు. శరణు అన్న వారిని రక్షించి కాపాడేవారు. వేట వారి మనోల్లాసానికి ఏర్పడినదైనా అల్పప్రాణుల జోలికి వెళ్ళేవారు కాదు.

అందుకే చెవుల పిల్లలు గ్రామ సింహాలతో ఆడేవి. జాగిలాలను చూచి అడవి మృగాలే జంకేవి. క్రూరమృగాలు సైతం జాతి వైరాన్ని మరచి హాయిగా సంచరించేవి. వేటగాళ్ళు తమ బాణాలకు పదును పెట్టి, అడవిదున్నలను పెద్ద పెద్ద పులులను, అడవి పందులను మత్తిల్లి గర్జించే వనచరాలను వేటాడేవారు.

దీర్ఘమైన బాహువులు విశాల వక్షఃస్థలాలు కలిగిన యోధులతోను, సుకుమారులైన లావణ్యానికి మారుపేరులా ఉండే లలనలు, క్షమ ఓర్పులు మూర్తీభవించిన స్త్రీమూర్తులతో అయోధ్య నిండి ఉండేది.

వారందరూ నిత్యాగ్నిహోత్రులు మహర్షులను తలపించేవారు. తర తమ భేదాలు కాని కుళ్ళు కుతంత్రాలకు తావు ఇచ్చేవారు కాదు. వారి వారి వర్ణాశ్రమాల విధులను నిర్వర్తించే ప్రజ్ఞామూర్తులే కనిపించేవారు. ధన కనకవస్తువులతో తులతూగుతూ నిత్య సంతుష్టులై వ్యవహరించేవారందరు. సత్యవాక్య పరిపాలనయందాసక్తులైన అక్కడి జనులు ధర్మదేవతను తమ ఇలవేల్పును చేసుకొనేవారు.

అక్కడి బ్రాహ్మణోత్తములు నిష్ఠాగరిష్ఠులు. లోకకళ్యాణంకోసం అసువులను తృణప్రాయంగా చూచేవారు. రాజ్యహితంకోసం అహర్నిశలు పాటుపడేవారు. అయోధ్యవాసులందరూ మహాబుద్ధిశాలురై ఉండేవారు.

అటువంటి ప్రజలను సర్వవేళల సర్వావస్థల యందు కంటికిరెప్పలవలె కాపాడు రాజేంద్రుడు దశరథుడు.

* * *

అయోధ్యానగర వైభవం - దశరథుని పాలన

సర్గ - 6

దశరథుడు మహాయోగి. రాజై ఉండి కూడా ఋషి వలె ప్రవర్తించేవాడు. వేద వేదాంగాలను సర్వశాస్త్రాలను చదివినవాడు, దయార్ద్ర హృదయుడు. తన ఆశ్రితుల పాలిట కల్పవృక్షం వంటివాడు. ధర్మాచరణలో సాటిలేనివాడు, సర్వజన ఇష్టుడు, నాల్గు వర్ణాశ్రమ వాసులను సంతోషపరిచెడివాడు, క్రతువులపై ఆపేక్ష కలవాడు. దీర్ఘదృష్టి కలవాడు. అందువల్ల ఆయన ప్రజలకు హితుడు. దీర్ఘాలోచనతో పనులను చేసేవాడు. శత్రువులను మిత్రులను ఆదరించేవాడు. ధనధాన్యాదులలో కుబేరునితో పోటీపడేవాడు. తన వంశప్రతిష్ఠను ఇనుమడింపజేయడానికి అహర్నిశం పాటుపడేవాడు. ధర్మార్థ కామమనెడు పురుషార్థాలకు సమ ప్రాధాన్యత ఇచ్చేవాడు. సత్యనిరతి కలిగినవాడు.

తన నగరంలో విద్యాగంధం లేనివాడు కనిపించేవాడు కాదు. ప్రజలందరిని కన్నబిడ్డలవలె చూస్తూ ధర్మాచరణలో వారికి ఆసక్తిని కలిగించేవాడు. వేదాలు పురాణాలు లలితకళలు వారికి పరిచయం చేసి భగవంతుని

యందు ఇష్టాన్ని కలుగజేసేవాడు. తాను ఆచరించి చూపిన ఏ పనినైనా ప్రజలు ఇష్టంగా చేస్తారని నమ్మేవాడు, ఆ విధంగానే చేసేవాడు.

వైవస్వత మనువును బోలి పాలన సాగించేవాడు. తనవలె తన ప్రజలను కూడా బహుకుటుంబీకులై ఉండాలని కోరుకొనేవాడు. నరులు స్త్రీలు స్వభావరీత్యా సాధువులై ఉండేవారు. పిల్ల, పెద్ద అందరూ ఆదర్శప్రాయులై జీవించేవారు. దశరథునిపాలన చూచి దేవతలు సైతం ఆశ్చర్యానందభూతులయ్యేవారు.

క్షత్రియులు వారి భుజ బలానికి దీటుగా ప్రవర్తించేవారు. బ్రాహ్మణోత్తములు బృహస్పతిని తలపించేవారు. సేవాతత్పరతలో శూద్రులను మించినవారు లేరు. వారి వారి కర్తవ్యాన్ని నిద్రలో సైతం ఏమారేవారు కాదు.

స్త్రీల శరీరలావణ్యానికి సుగంధద్రవ్యాలచే అంగరాగాలచే మెరుగులు దిద్దేవారు. స్త్రీ పురుషులందరూ ఆభరణాలచే దేవతలను మరిపించేవారు. వారి అభ్యంగ స్నానాదులతో జలచరాలు ఆశ్చర్యాన్ని పొందేవి. అతిథి అభ్యాగతులను దేవతలవలె పూజించెడివారు. ఇతరులకు సహాయం చేసే పరిస్థితిని దేవుడు కల్పించాడన్న తలంపుతో ఉండేవారు.

అందుకే అయోధ్య నిత్యసంతుష్టితో మూడు పువ్వులు ఆరు కాయలుగా శోభిల్లేది. వరుణాది దేవతలు వారికి సహాయకులుగా ఉండేవారు. అకృత్యాలు ఎవరూ చేయరు. చోరులుండరు. అన్నార్తులనేవారే లేరు.

విద్యావిహీనులు లేరు. వారు వీరను లేక యాగం చేసేవారందరు సంస్కారవంతులై నిత్య కర్మానుష్ఠానులై ఉండేవారు. వర్ణసంకరులు మచ్చుకైనా ఉండేవారు కాదు. అసమర్థులు, జ్ఞానశూన్యులు కనబడేవారు కాదు. దేవతల వరప్రభావంతో దశరథుడు అయోధ్యను పాలించేవాడు. అయోధ్య పరిసరప్రాంతం రెండు యోజనాల దాకా కూడా శత్రువులు ఛేదించడానికి వీలులేకుండా ఉండేది. శత్రుశేషం లేకుండా యుద్ధం చేసేవాడు, కాని శాంతి హోమాలయందే నిమగ్నమై ఉండేవాడు. శత్రువులు తల ఎత్తి అయోధ్య వైపు చూడడానికి కూడా వెనుకాడేవారు.

కంఠాభరణాలు బహుభూషణాదుల సౌందర్యాతిశయంతో స్త్రీలు దేవతలను తలపించేవారు. భూదేవి సోదరీమణులుగా క్షమను కలిగి ఉండేవారు. నాస్తికులు, పరవస్తు మోహితులు, అవిక్షకులు కాగడా పెట్టి వెతికినా కనబడేవారు కాదు.

మానవేంద్రుడైన మనువును బోలిన దశరథుడని పేరుగాంచాడు మహారథుడు. మానవకోటినే గాక సకల ప్రాణులయందు దయ కలిగినవాడు తన ప్రజలను శిక్షావ్యాకరణచ్ఛందో నిరుక్త జ్యోతిషాదులలో ఆరితేరేటట్లు శ్రద్ధ వహించేవాడు. ప్రజలందరూ సచ్ఛీలురుగా ఉండడానికి దశరథుడు సర్వయత్నాలు చేసేవాడు.

కాంభోజ బాహ్లిక వనట సింధూ దేశ సంతతికి చెందిన ఉత్తమాశ్వాలను, హిమవత్పర్వత, మహాపద్మ, అంజన, వామన కుల సంతతికి చెందిన గజరాజులను పోషించెడివాడు.

ఏనుగులు, గుర్రాలు మిక్కిలి బలంగా ఉండేవి. అవి ఇంద్రుని ఐరావతంతోను, సూర్యాశ్వాలతోను పోటీపడేవి. అచ్చటి ప్రజలు కుటిల స్వభావానికి దూరులు. అలా రాజులలో శిరోమణియై వెలిగాడు దశరథుడు. ఆ దశరథుని

అయోధ్యలో చిత్ర విచిత్ర కూటాలు కలిగి రాజభవనాలు అమరావతిని తలపించేవి. తారా చంద్రులను తలపించుచు అయోధ్యారాజు, ప్రజలు ఉండేవారు. శుభప్రదమై సస్యశ్యామలంగా ఆహ్లాదజనకంగా అయోధ్య దశరథుని పాలనలో ఒప్పారుచుండెడిది.

* * *

మంత్రులు - గుణగణములు

సర్గ - 7

అప్రమేయ ప్రతిభాశాలి దశరథుడు. ఆ రాజుకు జాబాలి, వసిష్ఠుడు, వామదేవుడు పురోహితులుగా ఉండేవారు. దృష్టి, జయంతుడు, సుమంత్రుడు, విజయుడు, సిద్ధార్థుడు, అర్థసాధకుడు, అశోకుడు, మంత్రపాలకుడు అను ఎనిమిది మంది మంత్రులూ ప్రధాన పాత్ర వహించేవారు. గూఢచారులు, వేగులు ఎప్పటికప్పుడు దేశవిదేశ వార్తలను అందజేయడంలో సిద్ధహస్తులు.

మంత్రగణమంతా రాజ పరీక్షలో ప్రథములుగా నెగ్గినవారు. నిరంతరం ప్రజాహితాభిలాషులు. కార్యనిర్వహణాసక్తులు తన పరభేదం లేక న్యాయరక్షణ కావించేవారు. అందుకే శత్రువులు సైతం పశ్చాత్తాపమగ్నులయ్యేవారు. తప్పుచేసినవారిని కరుణార్ద్ర హృదయంతో శిక్షించేవారు. ఆ శిక్షలవల్ల అపరాధులలో పరివర్తన కలిగేది. మానవులలో శ్రేష్ఠులుగా మారడానికి దోషులకు అవకాశం ఇచ్చేవారు.

మంత్రాంగంలో ఆరితేరినవారు. రాజనీతికి భంగం రాకుండా శత్రువులను సమూలంగా నాశనం చేసేవారు. రాజ్యాన్ని, సత్పురుషులను అప్రమత్తంగా ఎల్లవేళలా కాపాడేవారు. నిష్పక్షపాతంగా సర్వవ్యవహారాలను నడిపేవారు. సర్వసంపన్నులుగా, సద్గుణ విశేషులుగా ఉండేవారు.

పరకాంతా విముఖులుగాను, పర ధనంపై ఆసక్తి లేనివారుగాను ఉండేవారు. తృప్తితో నిండిన యెద కలవారుగా ప్రసిద్ధికెక్కినవారు. పన్నులను, కప్పములను నేర్పుగా సేకరించి ధనాగారాన్ని సమృద్ధిగా నింపేవారు.

సామంతులపై స్నేహభావాన్ని వృద్ధి చేసేవారు. వారికై వారు శిస్తులు చెల్లించునట్లు తోడ్పడేవారు. పెద్దలను పిల్లలను స్త్రీలను ఆదరాభిమానంతో చూసేవారు.

తప్పుచేసినవారు తనవారైనా ధర్మపీఠమెక్కి న్యాయం చెప్పేవారు. తమ బుద్ధిబలంతో రాబోయే ఆపదలను గ్రహించి తదనుకూలంగా ప్రవర్తించేవారు. శాంతికాముకులుగా ఉండి ఇతర రాజులతో శాంతిచర్చలు జరిపేవారు. సమస్త ప్రపంచ జనులు సద్భావనతో శాంతియుతంగా వర్ధిల్లాలని కోరుకొనేవారు దానికి తగ్గట్టుగా నడిచేవారు.

ప్రభుభక్తి పరాయణతలో వారికివారే సాటివచ్చేవారు. అధర్మానికి తావు ఇచ్చేవారు కాదు. ధర్మదేవత నాల్గు పాదాల నడవడానికి శాయశక్తులా కృషిచేసేవారు. మనస్సును వాక్కును కర్మలను పవిత్రంగా ఉంచేవారు. సత్యం

పలుకుటలోనే ఆనందించేవారు. రాజహితంకై ప్రాణాలను పణంగా పెట్టేవారు. కామక్రోధ మద మాత్సర్యాలకు లొంగనివారు, తల్లిదండ్రులను గురువులను అతిథి అభ్యాగతులను దేవతలవలె పూజించేవారు.

వీరోచిత పోరాటపటిమ కలిగినవారు. ఐకమత్యంలో బలముందని తెలిసినవారు, పరిశుభ్రమైన శ్వేతవస్త్రధారణ చేయువారు. ఔదార్యగుణంలో మహేశుని వంటివారు. బుద్ధి కుశలురు, కార్యదక్షులు, ప్రియంతో మృదువాక్కులు పలికేవారు. ఇతరులను చిరునవ్వుతో పలుకరిస్తూ వారి మనస్సులను దోచేవారు. కృపా సముద్రులు. తామే కాక ప్రజలందరూ రాజుపై గౌరవభావం కలిగి ఉండేవిధంగా ప్రవర్తించేవారు.

ఇటువంటి మంత్రిగణం కలిగిన దశరథుడు తండ్రివలె ప్రజలను పాలించేవాడు. దశరథుని పాలనలో అసత్యానికి అక్రమానికి తావు లేకుండా ఉండేది. ప్రజలందరూ సర్వసమర్థులుగా ఉండేవారు.

సప్తాశ్వరథారూఢుడైన బాలభానునితో పోటీపడుతూ దశరథుడు స్వయంప్రకాశుడై రెండవ సూర్యుడా అని చిత్తవిభ్రమకు ప్రజలను లోనుచేసేవాడు.

* * *

అశ్వమేధయాగారంభం

సర్గ - 8

నిష్ణాతులైన మంత్రివర్యులు సేనాపతులు కలిగిన దశరథుడు సంతు లేదని చింతాక్రాంతుడయ్యేవాడు. ఎన్ని యాగాలు క్రతువులు చేసినా దేవుని దయ తనపై పూర్తిగా వర్షించడం లేదని వ్యాకులపడేవాడు. ఒకసారి దీర్ఘాలోచనా తత్పరుడయ్యేవాడు. దశరథునికి అశ్వమేధయాగం చేస్తే బాగుంటుందనే ఆలోచన కలిగింది.

మంచి ఆలోచనాచరణలో కాలహరణం ఉండకూడదనుకొన్నాడు. తన హితం కోరే సుమంత్రునితో ఆలోచన చెప్పాడు. రాజాభీష్టానికి అనుకూలుడే కాబట్టి ఆలోచన ధర్మసమ్మతమైనదని సుమంత్రుడు చెప్పాడు. వెంటనే వశిష్ట వామదేవాదులను, జాబాలి, సమయజ్ఞుని, కాశ్యపాదులను తోడ్కొని రమ్మని సుమంత్రుని దశరథమహారాజు పురమాయించాడు.

కాలయాపన లేకుండా సుమంత్రుడు వారి దగ్గరకు వెళ్ళాడు. రాజు ఆలోచనను విశదీకరించాడు. రాజు చెప్పిన వారినందరిని త్వరగా బయలుదేరుడని ప్రోత్సహించాడు. దేశంలో సకల బ్రాహ్మణోత్తములను కూడా రమ్మని కబురు పంపాడు. అయోధ్యాంతఃపురానికి వచ్చిన మంత్రులు, పురోహితులకు దశరథుడు తన ఆలోచనను వినిపించాడు. పున్నామ నరకంనుండి తప్పించే పుత్రులు లేక నాకు మనశ్శాంతి కరువైంది. నా భార్యలు సైతం నిర్వంశం అవుతుందేమోనని బాధపడుతున్నారు.

అందుకని మీరందరూ యోచించి చక్కని సలహానిచ్చి నన్ను నా వంశాన్ని ఉద్ధరించండి; అంటూ దశరథుడు మహర్షులను వేడుకొన్నాడు. కొడుకులకై తపిస్తూ మంచి ఆలోచనను కలిగించిన మహారాజును చూచి మహానుభావుని పలుకులు విని బాగు బాగు అని చెప్పారు. నీ దృష్టికోణం సరియైనది నీ ఆలోచన మహత్తరమైనది. నీ ఆలోచనకు మేమందరం ప్రీతి చెందాము. అశ్వమేధ యాగ నిర్వహణకు వలసిన యూప పాత్రాది ఉపకరణాలన్నీ సమకూర్చుకోండి. రాజా! ఆపై యాగాశ్వాన్ని వదిలిపెట్టండి! అని చెప్పారు. సరయూ నది ఉత్తర ప్రాంతం యజ్ఞ నిర్వహణకు ఉత్తమంగా ఉంటుందని చెప్పారు. వారి మాటలను విన్న దశరథ మహారాజు ఉప్పొంగిపోయాడు.

మంత్రివర్యులకు ఆదేశాలిచ్చారు. యజ్ఞాశ్వాన్ని పురోహితులు చెప్పినట్లుగా అలంకరించమన్నాడు. ఆ హయమును వెంబడించి కొంతసేనావాహిని, గురువులను వెంట వెళ్ళమని ఆదేశించాడు. యజ్ఞప్రదేశంగా నిర్ణయింపబడిన సరయూతీరాన్ని పరిశుభ్రం గావించుమన్నాడు. యజ్ఞానికి కావలసిన సంభారాలన్నిటిని కూర్చుమని చెప్పాడు.

యాగాలలో ఏదైనా దోషం తల ఎత్తితే యజమాని నిగర్హితుడౌతాడు. యజ్ఞం జరిపించడంలో కలిగే దోషాలచే బ్రాహ్మణులు బ్రహ్మరాక్షసులు అవుతారు. ఎక్కడా యాగంలో అపశ్రుతి కలుగకూడదు. యజ్ఞం పరిసమాప్తి వరకు విఘ్నాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నియమబద్ధంగా శాస్త్రోక్తంగా విధి విధానంతో యాగాన్ని నిర్వర్తించాలి. అలా నిర్వర్తించటం యాగ ఫలాన్ని మించిన అకృత్యాలు చోటుచేసుకొంటాయి. కాని, యజ్ఞానికి కావలసిన వనరుల సమీకరణలో తగు జాగ్రత్తలు తీసుకొమ్మని సలహానిచ్చిన బ్రాహ్మణోత్తముల మాటలను దశరథుడు తలదాల్చాడు. ఎక్కడా ఏ పొరపాటుకు వీలు లేకుండా జాగ్రత్త వహించాడు.

ఈ మధుర వార్తను తన ప్రియపత్నులకు, చేరవేయాలని సంకల్పించాడు. పురోహితులకు తగిన సదుపాయాలను కల్పించండని సేవకులకు ఆదేశాలిచ్చాడు. వెంటనే అంతఃపురానికి వెళ్ళి సంతోష వార్తను సతులకు తెలిపాడు. మబ్బులు వీడిన ఆకాశంలాగా వారందరూ సంతోషించారు. ఉదయసూర్యుని కిరణాల తాకిడిచే విచ్చుకున్న కమలాలవలె వారి ముఖపద్మాలు వికసించాయి.

అమిత సంతోషమగ్నులయ్యారు. పుత్రవంతులు అవబోతున్నామన్న వార్త వారిలో ఆనందాన్ని ద్విగుణీకృతం చేసింది. వారందరూ ముక్తకంఠంతో దానికై మేము చేయవలసిన పనులేమిటో చెప్పుమని వేడుకున్నారు. దానిని సంతసించిన దశరథుడు మీ ముగ్గురు యాగదీక్షాబద్ధులు కండి. పురోహితుల సలహాననుసరించి కార్యాలను నిర్వర్తించండి. త్వరలో మన సదనం ఆనందంతో అలరారుతుంది అని చెప్పాడు.

అతి మనోహరమైన మాటలచే ప్రభువు, రాణులు సంతసించారు. తరువాతి కార్యక్రమనిర్వహణా దీక్షులయ్యారు.

* * *

ఋష్యశృంగుని వృత్తాంతం

సర్గ - 9

అమితోత్సాహంతోనున్న మహారాజును సుమంత్రుడు చూచాడు, సంతోషించాడు. తనకు తెలిసిన విషయాన్ని మహారాజుకు విన్నవించాలని తలచాడు. ఏకాంతంలో మహారాజుకు ఇలా తెలిపాడు. "మహారాజా! నేను మీరు పొందబోయే సంతానానికి చెందిన ఒక విషయాన్ని విని ఉన్నాను. దానిని తెలుపుతాను వినండి" అన్నాడు. భవిష్యత్తును దర్శించగల సనత్కుమారుడు ఒకసారి తన సహచరులైన మునిసత్తములతో ఇలా చెప్పాడు. భవిష్యత్తులో దశరథుడు పుత్రులకై యాగం చేస్తాడు. కాశ్యపమహర్షి కొడుకు విభాండకుడు. ఆ విభాండకునికి ఋష్యశృంగుడు జన్మిస్తాడు. అతడు తండ్రితో వనాలలో తిరుగుతూ బ్రహ్మచర్యాన్ని పాటిస్తాడు. తండ్రి, వనచరాలు తప్ప అన్యమెరుగని తాపసి అవుతాడు. అంగరాజ్యానికి అమిత పరాక్రమశాలి అయిన రోమపాదుడు ప్రభువు అవుతాడు. ఆయన అధర్మాచరణకు పూనుకొంటాడు. దానివల్ల అతని దేశంలో క్షామం ఏర్పడుతుంది. అకాల మృత్యువు తాండవిస్తుంది. రోమపాదుడు తన తప్పును తెలుసుకొంటాడు. ప్రాయశ్చిత్తం చేసుకోవాలని తలుస్తాడు. పశ్చాత్తాపహృదయంతో తన పాపాలను పోగొట్టుమని, తన పురోహితులను, బ్రాహ్మణోత్తములను అర్థిస్తాడు. వారందరు రోమపాదుని కరుణిస్తారు. తగిన ఉపాయాన్ని చెప్తారు.

అస్ఖలిత బ్రహ్మచారైన ఋష్యశృంగుడు రాజ్యంలో అడుగిడిన కరవు కాటకాలు సమసిపోతాయని చెప్తారు. ఆ ఋష్యశృంగుని రాజ్యానికి రప్పించే భారం మాత్రం మేము నిర్వహించలేమని చెప్తారు. విభాండకుడు మహాతపశ్శాలి. శాపానుగ్రహ సంపన్నుడు. ఇతరములెరుగని తన కుమారునికి ఆపద కలుగజేస్తారేమోనని విభాండకుడు అనుమానపడ్తాడు. అప్పుడు చేయవలసిన కార్యం చెడుతుంది. కాబట్టి ఋష్యశృంగునికి విషయం చెప్పలేము అంటారు. విషయాన్నంతా విన్న రోమపాదుడు సంతోష తరంగుడౌతాడు. కాని తన వ్యాకులచిత్తం ఆధీనంలోకి రాక చింతిస్తాడు. మీరు ఋష్యశృంగుని తోడుకొని రాకపోయినా ఫర్వాలేదు. ఆ ఋషీశ్వరుడు మన రాజ్యానికి అరుదెంచే ఉపాయం చెప్పుమని వారిని పదే పదే ప్రాధేయపడ్తాడు. అప్పుడు వారందరూ బాగుగా యోచిస్తారు. రోమపాదునకు సలహానిస్తారు. రోమపాదుడు సంతోషపడ్తాడు. గణికలను పంపించి ఋష్యశృంగుని తన రాజ్యంలో అడుగుపెట్టే విధంగా ప్రవర్తించండని చెప్తాడు. ఆ గణికల ద్వారా రావించబడ్డ ఋష్యశృంగుని చూచి పరమానంద భరితుడౌతాడు. ఆయన రాక వరణునికి మోదం కలిగిస్తుంది. వానలు ముంచెత్తుతాయి. పైరంతా కళకళలాడుతుంది. పురజనుల కన్నులు మిణుగురులౌతాయి. పూర్వవైభవాన్ని అంగరాజ్యం తిరిగి పొందుతుంది. దానికి రోమపాదుడు సంతసించి తన కుమార్తె అయిన శాంతనిచ్చి ఋష్యశృంగునికి వివాహం జరిపిస్తాడు. నీకును జామాత అయిన ఋష్యశృంగుడు నీవు పుత్రవంతుడవు కావడానికి వలసిన కార్యాన్ని జరిపిస్తాడు అని సనత్కుమారులు చెప్పటాన్ని నేను విని ఉన్నాను, అని సుమంత్రుడు దశరథునితో చెప్పాడు. దానికి సంతోషపడి "సుమంత్రా! ఋష్యశృంగుని అంగరాజ్యం ఆగమన విధానం చెప్పుము" అని దశరథుడు అడుగుతాడు.

* * *

శాంతాకల్యాణం

సర్గ - 10

భవిష్యత్తు తెలుసుకొనిన సుమంత్రునిపై దశరథునికి అనుగ్రహం కలిగింది. ఆనందంతో "సుమంత్రా! ఋష్యశృంగుని రోమపాదుడు నగరానికి ఎలా రావించాడో, ఆ వృత్తాంతమంతా చెప్పి నన్ను సంతోషపరుచు" అని అన్నాడు.

ప్రభుభక్తి పరాయణుడైన సుమంత్రుడు ఇలా చెప్పసాగాడు. మంత్రి పురోహితుల హితవచనాలు రోమపాదుడు విన్నాడు. ఋశ్యశృంగుని ఆహ్వానించడంలో అమిత కుతూహలపడ్డాడు. కాని అంతలోనే భీతి చెందాడు. విభాండకుని ఆగ్రహాగ్నిలో పడతామేమోనని చింతించాడు. ఎవరికి ఎట్టి అపాయం కలుగకుండా ఉండే ఉపాయాన్ని చెప్పమని రోమపాదుడు పురోహితులను కోరాడు.

ఋష్యశృంగుడు పుట్టినది మొదలుకుని వనప్రాణులను, తన తండ్రిని తప్ప ఇతరం ఎరుగడు. అట్టివానిని నాగరికుల సౌందర్యాతిశయంతో మెప్పించవచ్చు. ఇంద్రియ నిగ్రహుడైన వానికి ఇహలోక సుఖాన్ని రుచిచూపించి, ఇక్కడికి రప్పించవచ్చు. ఋష్యశృంగుని మనస్సు హరించి ఇంద్రియాలపై వ్యామోహపడేటట్లు చేసి నగరానికి తీసుకునిరావచ్చునని సలహాను రాజుకు వారు తెలిపారు.

దీనినంతా విన్న రోమపాదుడు కార్యకారణభూతుడైన సర్వేశ్వరుడు అన్నింటికి గతి అని, ఆ పరంధాముడిని తన ప్రజలను తనను రక్షించవలసిందిగా వేడుకొన్నాడు. మంత్రులందరూ కలిసి ఉత్తములైన వేశ్య వనితలను పంపిన యెడల ఋష్యశృంగుని రాక సులభం అవుతుందనే ఆలోచనను చెప్పారు.

రోమపాదుడు వారాంగనలను పిలిపించాడు. అవసరాన్ని తెలిపాడు. రాజ్యక్షేమంకోసం అభ్యర్థించాడు. ఋశ్యశృంగుని చెంతకు వెళ్ళి వారు చేయవలసిన పనిని విపులంగా చెప్పాడు. వారందరూ ఆ పనికి సంతోషంగా ఒప్పుకున్నారు.

దేవదాసీలందరు బహుచక్కగా అలంకరించుకొన్నారు. ఋష్యశృంగుని ఆశ్రమం చేరువలో కుటీరాలు నిర్మించుకొన్నారు. మధురగానం చేస్తూ ఋష్యశృంగుని రాకకై ఎదురుచూపులు చూచారు. దైవవశాత్తూ ఎన్నడూ ఆశ్రమాన్ని విడిచివెళ్ళని, ఋష్యశృంగుడు వేశ్యావాటికల ప్రదేశానికి వచ్చాడు. అతనిని చూసిన అంగనలు మహదానందపడ్డారు. తమ పనిని జ్ఞప్తికి తెచ్చుకొన్నారు. తమ కంఠాలకు పని కల్పించారు. మంద్రంగా పాడారు. వీనులవిందు చేసే ఆ గాన మాధుర్యానికి ఋష్యశృంగుడు అబ్బుర పడ్డాడు. వారి చెంతకు వెళ్ళాడు.

తండ్రి తప్ప అన్య ప్రాణిని చూడని ఋష్యశృంగునికి విచిత్ర వేషాదులతో ఉన్న ఆడవారు చిత్రంగా కనిపించారు. వారు పాడే పాట, వేసే నృత్యం తన్మయం కలిగించి అదేపనిగా చూడసాగాడు. వారి సౌందర్యాతిశయం ఋష్యశృంగుని కట్టిపడేసింది. అలా చూస్తున్న ఋష్యశృంగునితో అప్సరసలను బోలు వనితామణులు మాటలు కలిపారు.

"అయ్యా ఋషీశ్వరా! మీరు ఎవరు? ఎక్కడనుండి వచ్చారు? మీ నిజవాసం ఏది? ఈ నిర్జనారణ్యంలో మీరు చేస్తున్నదేమిట"ని అడిగారు. చిత్రానికి చిత్తరువులా నిలబడ్డ ఋష్యశృంగుడు ఒక్క క్షణం విస్మయానికి గురయ్యాడు. తనవలె భాషిస్తున్న వారిని విస్మయానందంతో చూచి తన గురించి ఇలా చెప్పాడు.

"నేను విభాండకుని ఔరసపుత్రుడిని. మా ఆశ్రమం ఇక్కడకు దగ్గరలోనే ఉన్నది. మీరందరూ అక్కడికి వచ్చినచో మిమ్ములను పూజించుకుంటాను; రండి ఆశ్రమానికి అంటూ వారందరిని ఆహ్వానించాడు.

వారందరూ ఋష్యశృంగునితో కాలం గడపడానికి నిశ్చయించుకున్నారు. మిత్రత్వం చేయటానికి ముందుకు వచ్చారు. అందరిని తీసుకుని ఋష్యశృంగుడు తన ఆశ్రమానికి వెళ్ళాడు. అక్కడ వారందరికి అర్ఘ్య పాద్యాదులను ఇచ్చాడు. కందమూలాలు పెట్టి ఆదరించాడు.

వారాంగనలు సైతం మృదుభాషణలు సల్పారు. వారు తెచ్చిన మధుర పదార్థాలన్నీ ఋష్యశృంగునికి ఇచ్చి త్వరగా సేవించమని చెప్పారు. అవన్నీ ఫలాలని తలచిన ఋష్యశృంగుడు వాటినన్నింటికి ఇష్టంగా ఆరగించాడు. వారాంగనలు ఋష్యశృంగునికి స్పర్శాసుఖాన్ని కలిగించారు. కరచాలనంతో ఆనందాన్ని తెలిపారు. కొత్త వింతలను చూస్తున్న ఋష్యశృంగునిలో ఇంద్రియాలు మేల్కొన్నాయి.

ఇంతలో విభాండక మహర్షి వస్తాడేమోనన్న శంక వారాంగనలకు కలిగింది. వెంటనే వారు ఋష్యశృంగునికి అభివాదం చేసి కర్మానుష్ఠానికి ఆలస్యం అవుతుందన్న వంక చెప్పి, అక్కడినుంచి వారి కుటీ రాలకు వచ్చేశారు.

కొత్త స్పర్శసుఖానికి అలవడ్డ శరీరం ఋష్యశృంగుని వశం తప్పింది. ఇంద్రియ నిగ్రహం పట్టుసడలింది. అస్వస్థ చిత్తుడయ్యాడు. రాత్రి గడవడం దుర్భరంగా అనిపించింది. తెల్లవారగనే ఆశ్రమం విడిచి వారాంగనల ప్రదేశానికి వచ్చాడు.

అలా వచ్చిన ఋష్యశృంగుని అమితాశ్చర్యంతో వారాంగనలు చూశారు. తమ పని ఫలవంతం కాబోతున్నదని సంతోషపడ్డారు. ఋష్యశృంగుని చూచిన తోడనే ఎదురేగి ఆలింగనం చేసుకొన్నారు. తమ విడిదిలోకి తీసుకొచ్చారు. మధుర పదార్థాలను తినడానికి ఇచ్చారు. మా ఆశ్రమానికి వస్తే ఘనమైన సత్కారం చేయగలమని చెప్పారు.

నగరంలోని వింతలను, విడ్డూరాలను చెప్పారు. అన్నీ విన్న ఋష్యశృంగుని మనస్సులో కొత్త సంగతులు తెలుసుకోవాలన్న అభిలాష జనించింది. వెంటనే వారి ఆశ్రమానికి వస్తానని ఆమోదం తెలిపాడు.

పరోపకారార్థం ఇదం శరీరం అన్నట్లు వ్యవహరించే దేవదాసీలు మిగుల సంతసించారు. దేశక్షామాన్ని పోగొట్టటంలో మేమూ పాల్గొన్నామన్న సంతృప్తి వారి మనస్సును నింపివేసింది.

వెంటనే అత్యుత్సాహంతో ఋష్యశృంగుని వెంటబెట్టుకుని అంగరాజ్యానికి బయలుదేరారు. వేగులద్వారా ఈ విషయాన్ని తెలుసుకొన్న రోమపాదుడు అమిత సంతోషంతో నగర పొలిమేరలో ఋష్యశృంగుని రాకకై ఎదురు సన్నాహాలు చేశాడు.

అలా ఋష్యశృంగుని వాహనం అంగరాజ్యంలో ఆగింది. అక్కడున్న వారినందరినీ అమితాశ్చర్యంతో చూస్తూ అంగరాజ్యంలో ఋష్యశృంగుడు కాలుమోపాడు. వరుణుడు పులకించిపోయాడు. కుండపోతగా ఆనందపు జల్లును వర్షించాడు. వర్షహేతువైన ఋష్యశృంగుని చూచిన రోమపాదుడు ఆనందాశ్రువులతో సాష్టాంగపడ్డాడు.

"నాయనా ఋష్యశృంగా! మమ్ము కరుణించు. నిన్ను వారాంగనల సాయంతో ఇక్కడకు రప్పించినందుకు మమ్ము క్షమించు. నీ తండ్రి అయిన విభాండకుని కోపాగ్నిని నీవే చల్లబరుచు" అంటూ పరిపరివిధాలా వేడుకొన్నారు.

మిక్కిలి భక్తిశ్రద్ధలతో అర్ఘ్యపాద్యాదులను ఇచ్చాడు. ఆనందచిత్తంతో అతిథి సంస్కారాన్ని జరిపాడు. తన అంతఃపురానికి తీసుకొని వెళ్ళాడు. అక్కడి ఏ లోటు రాకుండా ఆయనను సన్మానించాడు. అన్నింటికి సంతోషపడిన ఋష్యశృంగుని చూచి ఆనందపడి రోమపాదుడు తన కూతురైన శాంతను గ్రహించి తన్ను పునీతుణ్ణి చేయుమని ప్రార్థించాడు.

విషయ వాసనలను తెలుసుకొన్న ఋష్యశృంగుడు ఆమోదాన్ని తెలిపాడు. విభాండకుని రప్పించాడు. రోమపాదుడు తన బంధు సమాగణంతో కలసి మహర్షుల పురోహితుల సలహాననుసరించి శాంతఋశ్యశృంగుల వివాహ మహోత్సవం జరిపించాడు. అప్పటినుంచి ఋష్యశృంగుడు తన భార్య అయిన శాంతతో కూడి రాజాంతః పురంలో స్వర్గసుఖాలను పొందుతూ నివసిస్తున్నాడు.

* * *

అయోధ్యకు ఋష్యశృంగుని రాక

సర్గ – 11

"మహారాజా! ఆ సనత్కుమారుడు తన ప్రసంగంలో ఇంకా ఇలా చెప్పాడు..." – అంటూ సుమంత్రుడు చెప్తున్నాడు. ఇక్ష్వాకువంశంలో దశరథుడను ఒక మహారాజు జన్మిస్తాడు, కాని చాలాకాలం వరకు పుత్ర సంతానం కోసం పరితపిస్తాడు. ప్రజానురంజక పాలన చేస్తాడు. సత్యసంధుడిగా ప్రసిద్ధి చెందుతాడు. అతని అంగరాజైన రోమపాదునితో స్నేహం కలుగుతుంది. ధర్మరథుని సుతుడు చిత్రరథుడే రోమపాదునిగా పేరుగాంచుతాడు.

రోమపాదుని దగ్గర ఉన్న ఋష్యశృంగుని గూర్చి దశరథుడు తెలుసుకొంటాడు. తన సంతాన లేమిని పోగొట్టగలిగిన మహర్షి ఋష్యశృంగుడని దశరథుడు అనుకొంటాడు. తన బాధను ఉపశమింపచేసుకోవడానికి దశరథుడు రోమపాదుని అతిథిగా వెళ్తాడు. అప్పుడు ప్రసంగవశాన మనశ్శాంతి కరువైన తన విషయం చెప్తాడు. రోమపాదునికి చెప్పి, ఋష్యశృంగుణ్ణి అయోధ్యకు తీసుకొని వెళ్తాడు. ఋష్యశృంగుడు అశ్వమేధ యాగాన్ని దశరథునికై జరిపిస్తాడు. ఆ యాగఫలంగా ఘనులైన నలుగురు పుత్రులను దశరథుడు పొందుతాడు. ఆ పుత్రుల వలన దశరథుని ఇక్ష్వాకువంశం మధ్యాహ్న మార్తాండునిలా వెలుగుతుంది అని కృతయుగంలో మునులకు సనత్కుమారుల వారు చెప్పారు – దానినంతా నేను విని ఉన్నాను.

కాబట్టి మీ ఆశ తప్పక నెరవేరుతుంది. మీరు రోమపాదుని దగ్గరకు బయలుదేరమని సుమంత్రుడు చక్కని సలహానిస్తాడు. మిత్రుడైన సుమంత్రుడు చెప్పినదంతా విని దశరథుడు మనశ్శాంతిని పొందుతాడు. వశిష్ఠుని ఆమోదాన్ని పొంది రాజ పురోహితులను, మంత్రులను, సేనానాయకులను, రాణులను వెంటబెట్టుకొని అంగరాజ్యానికి దశరథుడు పయనిస్తాడు.

దారిలో నదీనదాలను, తటాక, సరోవర శోభలను, ప్రకృతిని చూస్తూ పరవశిస్తాడు. పరమేష్ఠి అద్భుత సృష్టిని అవలోకిస్తూ ప్రయాణం సాగిస్తూ అంగరాజ్యాన్ని చేరుకుంటాడు. రోమపాదుడు దశరథునితో తనకు ఉన్న మైత్రిని జ్ఞప్తికి తెచ్చుకొంటాడు. ఎదురేగి ఉచిత మర్యాదలు జరుపుతాడు. కుశల ప్రశ్నలు వేస్తాడు. దశరథ పరివారాన్నంతా ఆదరాభిమానాలతో పలుకరిస్తాడు. వారందరికి కావలసిన సదుపాయాలను సమకూర్చుతాడు.

ఇలా వారం గడుస్తుంది. దశరథుడు ఒక రోజు తన కోర్కెను వెలిబుచ్చుతాడు. "మిత్రమా! నీ కుమార్తెను జామాతను నాతో పంపిన నా కోర్కె తీరుతుంది. కొద్దిగా నా పక్షాన ఆలోచించు, నా వంశాన్ని కాపాడడంలో సహాయం చేయి" అని అడుగుతాడు. దశరథుని మాటలను విన్న వెంటనే రోమపాదుడు ఆనందచిత్తంతో "అంతకంటే కావలసినది ఏముంది? నీ కోర్కె త్వరలో ఈడేరుగాక! దానికి నాచేతనైనంత నేను నిర్విఘ్నంగా చేస్తాను" అని చెప్తాడు. తన అల్లుడైన ఋష్యశృంగునితో మాట్లాడుతానని చెప్పాడు. ఒక రోజు రోమపాదుడు కొలువుతీరాడు. ఆ సభకు దశరథుని ఆహ్వానించాడు. దశరథుడు అక్కడ ఉన్న ద్విజశ్రేష్ఠుడు మహాతేజశ్శాలైన ఋష్యశృంగుని చూస్తాడు. రోమపాదుని ద్వారా విషయాన్ని గ్రహించిన ఋష్యశృంగుడు యజ్ఞకర్తగా తాను ఉండడానికి ఆమోదం తెల్పుతాడు.

వెంటనే దశరథ పరివారం రోమపాదునికి ధన్యవాదాలు తెలుపుతారు. పరస్పర వందనం ఆచరిస్తారు. తర్వాత అయోధ్యా పట్టణానికి వెళ్ళటానికి రోమపాదుని ద్వారా అనుమతి గైకొంటారు. శాంత ఋష్యశృంగులతో అయోధ్యకు మరలివస్తున్న వార్తను వేగుల ద్వారా దశరథుడు తన అయోధ్యావాసులకు అందజేస్తాడు. పురాన్నంతా పరిమళాలతో వున్న పుష్పాలతో అలంకరించమని సుగంధ ద్రవ్యాలతో ఎదురేగమని, రహదారుల నిండా సుమాలను పరచమని, మంగళవాద్యాలను తీసుకొని విప్రోత్తముడైన మునికి ఆహ్వానం పలకాలని పురమాయించాడు.

బృహస్పతితో వెళుతున్న దేవతారాజును పోలి దశరథుడు ఋష్యశృంగుని తోడ్కొని అయోధ్యకు వస్తాడు. వారిని చూచి నగరవాసులందరూ మిక్కిలి సంతోషపడ్తారు.

ఋష్యశృంగుని తన అంతఃపురానికి తీసుకువెళ్ళి శాస్త్రోక్తంగా పూజిస్తాడు. తన కలలపంటనిచ్చే దేవుడు ఋష్యశృంగ మహర్షిని తలుస్తాడు. ఆయన రాకతో తన పని నెరవేరినట్లుగా ఆనందిస్తాడు.

అంతఃపుర స్త్రీలందరూ శాంతను చక్కగా ఆదరిస్తారు. ఆ దంపతులను లక్ష్మీవిష్ణువులవలె తలచి అందరూ అభిమానంగా చూస్తారు. ఇలా కొంతకాలం గడుస్తుంది.

* * *

యాగ నిర్వహణలో ఏర్పాట్లు

సర్గ - 12

మనోల్లాసం కలిగించే పున్నమి చంద్రునివలె వసంత ఋతువు ప్రవేశించింది. చైత్రమాసం ఆరంభమైంది. దశరథునిలో కోర్కెలు గుర్రాల్లా పరుగెత్తాయి. తన కోర్కెలు తీరు సమయం ఆసన్నమైందని అనుకున్నాడు. దైవం తన కోసం వేచి ఉన్నాడని తలచాడు. వెంటనే ఋష్యశృంగుని చెంతకు వెళ్ళాడు. శిరసా ప్రణమిల్లాడు. తాను చేయబోయే యజ్ఞానికి ఋత్విక్కు అవసరమని వేడుకొన్నాడు. యజ్ఞ నిర్వహణాధికారిగా ఉండి, ఆయన ఆధ్వర్యంలో ఏలాంటి ఆటంకాలు లేకుండా యాగాన్ని నిర్వర్తించి తనను పుత్రవంతుణ్ణి చేయమని ప్రార్థించాడు. సత్యవంతుడైన దశరథుని మాటలు ఋష్యశృంగుడు ఆలకించాడు. దశరథుని కోర్కెను తీరుస్తానని ఋష్యశృంగుడు మాటిచ్చాడు. వెంటనే కుల గురువులను, పురోహితులను, బ్రాహ్మణోత్తములను రమ్మని కబురు పంపమన్నాడు. దశరథుడు రాజప్రతినిధిగా ఉన్న సుమంత్రునితో వేగంగా వెళ్ళి సుయజ్ఞ వశిష్ఠవామాదులను వివిధ దేశాలలలోని ద్విజశ్రేష్ఠులను వెంటబెట్టుకొని రమ్మని ఆదేశించాడు.

తత్క్షణమే సుమంత్రుడు వెళ్ళి రాజు చెప్పిన వారందరిని తోడ్కొని వచ్చారు. అలా వచ్చిన వారందరితో కలసి దశరథుడు సభదీరాడు. తన కోర్కెను వెలిబుచ్చాడు. ఋత్విక్కునిగా ఉండడానికి ఆమోదం తెల్పిన ఋష్యశృంగుని మాటను చెప్పాడు. వారందరూ నీ ధర్మ సమ్మతమైన కోర్కె నెరవేరగలదు. యజ్ఞం చేసినందువల్ల నీవు సత్ఫలాన్ని పొందుతావు. నలుగురు వీరాధివీరులైన పుత్రులను పొందుతావు. వారివల్ల నీవేగాక, నీ వంశం, తద్వారా సర్వ ప్రజానీకం ఆనందం పొందుతుంది. ఇది ఈశ్వరేచ్ఛ నీకు సద్బుద్ధి కలుగుగాక! యజ్ఞం నిర్విఘ్నంగా జరగగలదు అని వారందరూ ఆశీర్వదించారు.

వారి సలహాననుసరించి ఉత్తమాశ్వాన్ని యాగాశ్వంగా ఎంచుకొన్నాడు. దానిని చక్కగా అలంకరింప జేశారు. రాజ్యాన్నంతా మంగళ తోరణాలతో కస్తూరి మొదలగు సుగంధాలతో పువ్వులతో అలంకరించారు. నలుగురు ఋత్విజులు సమర్థులైన 400మంది యోధులు యాగాశ్వాన్ని వెంబడిస్తూ వెళ్ళారు.

గురువుల ఆదేశానుసారం సరయూనది ఉత్తర భాగాన్ని యజ్ఞ భూమిగా సిద్ధం చేయమన్నాడు. యజ్ఞానికి కావలసిన ఉపకరణాలు సంభారాలను ఎక్కడా ఎట్టి లోపం లేకుండా ఏర్పచమని చెప్పాడు. యజ్ఞ క్రతువు చేసే దోషాలకు విపరీత పరిణామ ఫలితాలుంటాయని గుర్తుచేశాడు. యజ్ఞయాగాది నిర్వహణా దురంధరులైన మహర్షుల పర్యవేక్షణలో యజ్ఞ సమారంభానికి కావలసినన్ని సమకూర్చుమని ఋత్విజులు ఆదేశాలను ఏమరుపాటు లేక ఆచరించుమని తన మంత్రులకు ఆదేశాలిచ్చాడు.

ఆయన ఆజ్ఞలను విన్న అక్కడివారందరూ దశరథుని మిక్కిలి ప్రశంసిస్తూ "ఇష్టకార్యసిద్ధిరస్తు" అని దీవించారు. ఇలా అన్ని నెరవేర్చి ఎవరి తావునకు వారు వెళ్ళారు. దశరథుడు తన నివాసానికి వెళ్ళాడు. ఆ యజ్ఞభూమిలో సావిత్రాది కర్మలను ఋత్విజులు చెప్పిన శాంతి హోమాలు జరిపించడానికి ఏర్పాట్లు చేయుమన్నాడు.

* * *

యాగదీక్షారంభం

సర్గ - 13

యాగాశ్వాన్ని వదిలిపెట్టిన తర్వాత దశరథుడు యజ్ఞ నిర్వహణలో నిమగ్నుడయ్యాడు. సావిత్రాది కర్మలను ఆచరించాడు. పురోహితుని ఆదేశానుసారం శాంతిక్రియ లొనర్చాడు. ఇలా సంవత్సరకాలం జరిగింది. వసంతుడు పునరాగమించాడు. ప్రకృతి పరిపూర్ణంగా తన రూపాన్ని సంతరించుకొన్నది. ఇక చేయవలసిన కార్యానికి సమయం ఆసన్నమైందని దశరథుడు గ్రహించాడు. వెంటనే దశరథుడు తన పురోహితుడైన వశిష్ఠుని చెంతకు వెళ్ళి దండప్రణామం చేశాడు. యాగం నిర్విఘ్నంగా సాగడానికి చేయాల్సిన విధులను గూర్చి తెలుపుమని అడిగాడు. యజ్ఞ నిర్వహణభారం అంతా వశిష్ఠుని మీదనే మోపి స్థిమితపడ్డాడు.

నీవు కోరినట్లుగానే యాగనిర్వహణ బాధ్యతను నెరవేర్చుతానని చెప్పి నాకు వలసిన వాటిని సమకూర్చడానికి సుమంత్రుణ్ణి నియోగించుమని దశరథుని వశిష్ఠుడు ఆదేశించాడు. తన మిత్రుడు సారథి అయిన సుమంత్రుణ్ణి బాధ్యతాయుతుని చేసి దశరథుడు వశిష్ఠుని కడ నియోగించాడు. వశిష్ఠుడు ధార్మికులైన ప్రజలను, వాస్తు శాస్త్రజ్ఞులను శిల్పులను మొదటగా పిలవమన్నారు. వారు వచ్చిన తర్వాత యాగం చూడటానికి అందులో పాల్గొనాలని వచ్చే జనానికి సందర్శకులకు రాజులకు పండితోత్తములకు జనపదులకు అందరికీ అవసరమైన భవంతులను అన్నీ సదుపాయాలతోటి తాత్కాలికంగా ఏర్పాటు చేయుమన్నాడు. యజ్ఞవాటికను నిర్మింపచేయడంలో శిల్పులను వాస్తు అనుభవజ్ఞులను పరస్పరం సంప్రదించుకోమని చెప్పారు. వడ్రంగులను, కుమ్మరులను, స్రుక్‌స్రువాదివస్తువులను తయారు చేయడంలో నిపుణులైన వారిని చిత్రకారులను, రసభావాలను పలికించగల నటులను, నాట్య శిరోమణులను, గానంతో అలౌకికానందాన్ని కూర్చే గాయకులను, సచ్చరితులను, అనుభవజ్ఞులు, సోమయాజులను అందరిని పిలిపింపుమని ఆదేశించాడు. సుమంత్రుడు వశిష్ఠాదేశం ప్రకారం ఆ యా పనులలో నిష్ణాతులైనవారిని ఆనందంగా పిలుచుకొని వచ్చి వారినందరిని యాగం చేయడంలో భాగస్థులను చేశాడు. వచ్చిన వారందరికి మృష్టాన్న భోజనాది వసతులను ఆనందంగా కల్పించుమని చెప్పాడు. యాగం చేయడానికి వచ్చినవారు, చూడటానికి వచ్చినవారు యాగ నిర్వహణలో తమ విధులను నిర్వర్తించినవారు, ఇలా అందరికి ప్రియంగా వారి మనస్సంతోషంగా చెప్పాడు. ఎవరికైనను అప్రియంతో వసతిని కల్పించిన యెడల యజ్ఞ యజమానికి యజ్ఞఫలం అందదని చెప్పారు. యజ్ఞాంగాలలో దోషాలు యజమానికే చెందుతాయని అందుకే విధి నిర్వహణలో ఎలాంటి ఏమరుపాటు లేక సకలజనావళికి మోదం కూర్చడం కోసం సర్వశక్తులు నియోగించాలని వశిష్ఠుడు ఉపదేశించాడు. కామక్రోధాదులను తన వశంలో ఉంచుకోవాలని, ఎవరిని తూలనాడరాదని, యాగ నిర్వహణకాలంతో ఎక్కడా అమంగళకరమైనవి జరుగకూడదని గుర్తు చేశాడు. ఈ నియమాలన్నింటిని ప్రతివారు తప్పనిసరిగా మనస్ఫూర్తిగా పాటిస్తే ఎవరికి దక్కవలసిన ఫలం వారికి భగవంతుడు అందిస్తాడని ఎవరి పనులను వారు క్రమబద్ధంగా చేయపూనుకొనాలని మరీ మరీ వశిష్ఠుడు పలికాడు.

ఇవన్నీ విన్న అక్కడివారందరూ సంతోషంతో తమకు నిర్దేశించిన పనులయందు మనస్సులను లగ్నం చేశారు. దానినంతా చూసిన దశరథుడు సంతుష్టచిత్తుడయ్యాడు. ఇక సుమంత్రుని పిలిచి యాగంలో పాలు పంచుకోవటానికి దశరథుని మిత్రులను సాటివారిని సామంతులను మిత్ర బంధు పరివారాన్ని ఆహ్వానించవలసిన పనిని తెలిపాడు. మొదటగా యజ్ఞానికి ఋత్విజుని పంపి సహాయం చేసిన రోమపాదుని సత్కరించి తోడ్కొని రమ్మన్నాడు. అతని మిత్రుడైన కాశీరాజును బంధు సపరివారంతో ఆహ్వానించుమన్నాడు. దశరథునితో పూర్వమే సంబంధం ఉన్న రాజర్షి అయిన జనకుని అతని పరివారాన్ని తగు రీతిలో ఆహ్వానించుమన్నాడు.

రాజు హితం కోరే కేకయ రాజాధీశుడైన కేకయ రాజునకు అతని బంధువులకు ఆహ్వానం పంపమన్నాడు. వివిధ దేశాలలో ఉన్న జ్ఞానవృద్ధులను, కర్మాచారులను వెంటనే రమ్మని కబురు పంపుమన్నాడు. మన రాజ్యంలోనే కాక సమస్తప్రపంచంలో ఉన్న బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య శూద్రులను ఎల్లరను ముదావహంతో ఆహ్వానించుమని ఆదేశించాడు. సర్వశాస్త్ర పారంగతుడైన మిథిలాధిపతి మిత్రులనందరిని ఆహ్వానించుమని చెప్పాడు. సౌరాష్ట్రధీశులను సింధు రాష్ట్రీయులను, సౌవీరులను, దక్షిణాదేశ ప్రభువులను ఆహ్వానించడానికి తగినవారిని పంపుమని చెప్పాడు. మంత్రి సామంతులను మిత్రులను దశరథుని పాలనలో కాక ఇతర రాజ్యాల రాజులను ఉచిత రీతిలో ఆహ్వానించుమని సుమంత్రునికి చెప్పాడు.

ఇలా వచ్చిన ప్రతి ఒక్కరికి కావలసిన అన్ని సదుపాయాలను ఒనగూర్చుటకు కర్మచారులను నియోగించుమని చెప్పాడు. సుమంత్రుడు వసిష్ఠుని ఆజ్ఞననుసరించి తాను తను నియమించిన కొందరితో పలువురు మహీపాలకులను ఆహ్వానించే కార్యాన్ని చేపట్టాడు. అలా దశరథుని ఆహ్వానం అందుకున్న రాజేంద్రులు, చక్రవర్తులు, సామాన్యులు, విశిష్టులు, పండితోత్తములు, మహర్షులు, ఋషీశ్వరులు అందరూ తగిన సంభావనలు చేబూని దశరథ రాజేంద్రుని దగ్గరకు వచ్చారు.

రాజులందరును వారి వారి అర్హతానుసారంగా శ్రేష్ఠములైన రత్నరాశులను, వజ్ర వైడూర్యాది ఆభరణాలను విలువగల వస్తుసామగ్రిని యజ్ఞానికి పనికివచ్చే సంభారాలను, అమూల్యాలైన వస్త్రాభరణాదులను, ముత్యాలను పగడాలను నానావిధ పరిమళద్రవ్యాలను గైకొని వచ్చి దశరథునికి ప్రియంతో ఇచ్చారు. అలా వచ్చిన వారినందరితో ప్రియవచనములాడి వారిని అతిథి సత్కారాలతో ఆనందించేశారు. ప్రజ్ఞాశీలురైన తపస్వులు ఆనందించారు. అప్పుడు సంతుష్ట మనస్సుతో వశిష్ఠుడు దశరథుని ఉద్దేశించి "ఓ మానవేంద్రా! యజ్ఞ సంభారాలన్నియు ఒనగూడాయి. సాధన సంపత్తి చేకూరింది. బంధు మిత్ర పరివారం ఏతెంచింది. ఇక నీవు యాగశాలకు విచ్చేయి. యజ్ఞదీక్ష నీ భార్యలతో కూడి గైకొనుము" అని ఆదేశించాడు. అపరిమితానందంతో దశరథుడు వశిష్ఠుని ఆదేశాన్ని శిరసావహించాడు. వేదపండితులు స్వస్తి వచనాలు పలుకుతుండగా శంఖ దుందుభులు మ్రోగుచుండగా పత్నులతో గూడి అయోధ్యాపతి యాగశాలకు బయలుదేరారు. శుభసమయంలో యజ్ఞవాటికలో అడుగుపెట్టాడు. అలా యాగశాలకు విచ్చేసిన దశరథుని ఆహ్వానితులందరూ మనోఫలసిద్ధిరస్తు అంటూ ఆశీర్వదించారు. వారందరికి తలవంచి నమస్కరించాడు దశరథుడు. ఆ తరువాత ఋష్యశృంగుడు ప్రధాన సూత్రధారి వశిష్ఠుడు హోమాధికారిగా

ఉండి సకలైశ్వర్య సంపన్నుడైన దశరథునికి యజ్ఞదీక్షను ఒసంగాడు. దీక్షాబద్ధుడైన దశరథుడు సపత్నులతో కూడిన యజ్ఞ నిర్వహణలో మనస్సు లగ్నం చేశాడు.

* * *

అశ్వమేధ యాగారంభం

సర్గ - 14

యాగాశ్వం విడిచిపెట్టిన సంవత్సరానికి అది తిరిగి యాగభూమికి చేరింది. అప్పుడు దశరథుడు యాగారంభం చేశాడు. అశ్వమేధయాగంలో ఋష్యశృంగుడు సుయజ్ఞుడు వశిష్ఠుడు మొదలైన ద్విజులు ఋత్విజులుగా ముందు నిలిచారు. ఈ యాగం మూడు దినాలు సాగుతుంది. అందు మొదటిదినం చేసే కార్యం చతుష్టోమం అంటారు. రెండవ దినం ఉక్థ్యం అని, మూడవనాడు చేసే హోమకార్యం అతిరాత్రం అని అంటారు. దీక్ష గైకొన్న దశరథుడు ముగ్గురు రాణులు సంతోషమైన మనస్సుతో ఋత్విజులు చెప్పినట్లుగా చేయసాగారు.

సంవత్సరకాలం నుండి జరుపుతున్న శాంతిక్రియలు నిర్విఘ్నంగా జరుగుతున్నాయి. వాటిని చూడడానికి అతిథులు బంధువులు ప్రపంచం నలుదెసల నుండి ప్రవాహంలా జనులు తండోపతండాలుగా వస్తూనే ఉన్నారు. వారందరికి దశరథుడు తగిన వసతులను కల్పించాడు. భోజన నివాసవసతులు వారు ఉపయోగించుకుంటూ దశరథుని వేనోళ్ళ పొగడుతున్నారు. వారందరికి నూతన వస్త్రాలంకారాదులను సైతం ఇవ్వమని తన సేవకాగణానికి దశరథుడు ఆజ్ఞాపించాడు. ఇలా హోమకార్యం జరుగుతోంది. దానికి ఉపబలకంగా జరగాల్సిన క్రతువును కూడా వశిష్ఠుడు దశరథునిచే చేయిస్తున్నాడు. ఇందులో భాగంగా జ్యోతిష్టోమం, ఆయుర్యాగం, అతిరాత్రములు రెండు, అభిజిత్తు, విశ్వజిత్తు, అప్తోర్యామం అను ఆరు విధాలైన క్రతువులను చేయించారు.

ఈ యజ్ఞం జరిగినన్నాళ్ళు అన్నార్తులు, బాధాతప్త హృదయులు లేకుండా చూచారు. విద్యావిహీనులు రసగంధం లేనివారు అక్కడ కనబడలేదు. అక్కడికి వచ్చిన ప్రతి విప్రునకు, తక్కువ గాకుండా వందమంది శిష్యులున్నారు. హోమకార్యాలలో జరుగు కాలయాపనను సద్వినియోగపరచడానికి అక్కడ చేరిన బ్రాహ్మణోత్తములు శాస్త్ర చర్చ జరిపారు. ఎక్కడైనా పురాణ పామరత్వం కలిగిన జనులు ఉంటే వారిని సైతం ప్రభావం చేయ ఉపకరించే చర్చలు సాగాయి. పురాణాలు, ఇతిహాసాలు, వేదాలను ఔపోసన పట్టి గురువులు వారిని మించాలనే శిష్యులు లెక్కకు అందనంతమంది యాగశాలలో పరివేష్ఠితులయ్యారు. వారందరు వాదోపవాద ఉద్దండపిండాలే. వారినందరిని సగౌరవంగా అయోధ్యవాసులు ఆదరిస్తున్నారు. అయోధ్యావాసులందరు తమ ప్రభువుకు మంచి జరగాలని మనసా వాచా కార్యాలలో పాల్గొంటున్నారు.

అక్కడ కులభేదాలు కాని శైవ వైష్ణవాధిక్యంగాని మచ్చుకైనా కానీ రాలేదు. అక్కడికి వృద్ధులు, బాలలు, స్త్రీలు వచ్చి యథేచ్ఛగా సంచరిస్తూ తమ మనోభీష్టాలను తీర్చుకొంటూ పరలోక సంపదలను మూటకట్టుకొనుచుండిరి.

వేదాంగాలలో ఆరితేరిన ఋత్విక్కులు ఎక్కడా పొరబాట్లు జరగకుండా, చేయవలసిన కర్మలన్నీ క్రమపద్ధతిలో జరుపుతున్నారు. బ్రాహ్మణులు అశ్వమేధాంగాలైన ప్రవర్గ్యం, ఉపసదంలాంటి క్రతువులను జరిపారు. శాస్త్రరీత్యా ఋత్విక్కులు యాగాహ్వాన దేవతలను పూజించారు. ప్రాతఃసవనాది కర్మలు చేశారు. ఇంద్రునకు హవిర్భాగాలు సమర్పించారు. సోమలతను సంప్రదాయబద్ధంగా నలగగొట్టి రసం తీశారు. మాధ్యాందిన సవనం తృతీయసవనం దశరథునిచే చేయించారు.

సమంత్ర యుక్తంగా అంతా క్షేమకరంగా ఉండేలాగా చర్యలు తీసుకున్నారు. అక్కడున్న భోజ్య పదార్థాలు, వస్త్రాదులు తదితర వస్తుసామగ్రి పెట్టని కోటల్లాగా, పర్వతాల్లాగా భాసిల్లాయి. వాటినన్నిటిని చూచినవారు సదుపాయాలను ఉపయోగించుకున్నవారు ఆనంద మనస్కులయ్యారు. దశరథునికి మంగళమగుగాక! అనే దీవెనలు మిన్నుముట్టుతున్నాయి. అదంతా స్వర్గాన్ని తలపిస్తున్నది.

ఆ యాగంలో యూపస్తంభములు నిలబెట్టాల్సిన తరుణం ఆసన్నం అయింది. ఆరు మారేడు కర్రలు, ఆరు చంద్ర కర్రలు, ఆరు మోదుగ కర్రలు, శ్లేష్మాతక వృక్ష కర్ర ఒకటి, దేవదారు కర్రలు రెండు, ఇలా వీటితో యూపస్తంభాలు చేయించి వాటి మధ్య బారెడు దూరముండునట్లు నిలబెట్టారు.

వాటిని కాంచనంతో అలంకరించారు. నూతన వస్త్రాదులను చుట్టబెట్టారు. 21 మూరల (అరత్ని) ఎత్తు ఉండునట్లు ఆ యూపస్తంభాల నిర్మాణం చేశారు. అవి నున్నగాను పొడవుగానూ ఎనిమిది అంచులు కలవిగా ఉన్నాయి. ఇలా నిలబెట్టిన స్తంభాలను సుగంధాది ద్రవ్యాలు అనేక రకాల పూలతోను అర్చించారు. అవి అన్నీ సప్తర్షి మండలంగా ఆహూతులకు కనువిందు కలుగజేశాయి.

దక్షులైన బ్రాహ్మణులచే భూమి పరిశుద్ధం చేయబడింది. శాస్త్రోక్తంగా ఇటుకలతో హోమ వేదికను నిర్మించారు. ఒంటి పేట త్రాడుచే చేసి శుల్బ కర్మలందు నిష్ణాతులైన బ్రాహ్మణులు హోమ వేదికల నిర్మాణంలో పాల్గొన్నారు.

దశరథుడు చేసే వేదిక గరుడాకారంగా నిర్మించారు. ఇది అన్నిటికంటే మూడు రెట్లు పెద్దది. గరుత్ముని ముఖం తూర్పు దిశగా ఉన్నట్లు, రెక్కలను పుచ్ఛం విస్తృతం చేసి తలవంచి చూస్తున్నట్లుగా, ఇటికలను పేర్చి వేదికలను ఏర్పాటుచేశారు. ఈ ఇటుకలను పేర్చడమే చయనం. అశ్వమేధయాగంలో ఈ చయనాలు 15 వరస (ప్రస్తారాలు)లతో ఏర్పాటు చేస్తారు. దీనినంతా కృష్ణయజుశ్శాఖాశాస్త్రంగా చిదగ్ని నెలకొల్పబడింది.

శాస్త్రాన్ననుసరించి జలచర వాయు చరాలతో పాటుగా కొన్ని పశువులను యూపస్తంభాలకు కట్టివేశారు. వాటిలో కొన్ని అరణ్య మృగాదులను అగ్ని ప్రదక్షిణ కావించి వదలి వేస్తారు. దశరథునికై 300 పశువులు ఉత్తమాశ్వం యూపస్తంభాలకు కట్టివేశారు.

యజ్ఞాశ్వాన్ని రాణులు ముప్వురు యథావిధిగా పూజించారు. ప్రదక్షిణ నమస్కారాలు చేశారు. బంగారుతో చేసిన సూదులతో యజ్ఞాశ్వానికి మూడు గుర్తులు కౌసల్య వేసింది. ఆ తర్వాత శాస్త్రవిధిననుసరించి ఒక రాత్రి అశ్వసమీపంలో నిద్రించింది.

దశరథుడు ఋత్విక్కులు చెప్పినట్లుగా తన పట్టమహిషిని యోగబ్రహ్మ అను ఋత్విక్కునకు, దేవదాసి అనగా వాహతను హోతకునకు, పరివృత్తిని ఉద్గాతకును, పాలికలని అనగా పాత్ర అందించు స్త్రీని అధ్వర్యునకును ఇచ్చివేశాడు. ఆ ఋత్విక్కులందరూ వాటిని గ్రహించినట్లుగా చేతులతో స్పృశించారు. మరల దశరథుడు వారికి బదులుగా ద్రవ్యం ఇచ్చి వారినందరిని దశరథుడు పరిగ్రహించాడు.

జితేంద్రియుడు పరమ నిష్ఠాగరిష్ఠుడైన ఋత్విక్కు పన్నేరుగడ్డను అను అశ్వకందమును తీసుకొని పచనం చేశాడు. దశరథుడు తన పాప ప్రక్షాళనకై ఆ వపాగంధంను వాసన చూశాడు.

ఆ తర్వాత 16 మంది ఋత్విక్కులు కలిసి కూర్చబడిన హోమ ద్రవ్యాలను హోమంలో మంత్రోక్తంగా ఆహుతి చేశారు. తర్వాత వచ్చిన హవిస్సు ప్రబ్బలి తీగపై ఉంచి సంస్కరించారు. ఇతర హోమ హవిస్సులను జువ్విచెట్లపై సంస్కరించినప్పటికీ ఈ అశ్వమేధ హవిస్సును మాత్రం ప్రబ్బలి చెట్ల తీగలపై సంస్కరించారు.

విధి విహితంగా చేయవలసిన అనేక క్రతువులను దశరథుడు చేశాడు. మహారాజు తన వంశాభివృద్ధిని చేకొనదలిచాడు. అందులకై తూర్పు దిశలోని భూమిని హోత అను ఋత్విజునకు, పశ్చిమాద్రినున్న ధాత్రిని అధ్వర్యునకు, దక్షిణ దిక్కున ఉన్న మేదినిని బ్రహ్మ అను ఋత్విక్కునకు, ఉత్తరంలోని అవనిని ఉద్గాత అను ఋత్విజునకు, స్వయంభువు అయిన బ్రహ్మ తెలిపినట్లుగా దానం చేశాడు. దశరథుడు అశ్వమేధయాగం సమాప్తి చేశాడు. ఆ ఫలం పూర్తిగా లభించాలని ఆశించాడు. తాను గెలిచిన భూమినంతయు బ్రహ్మ తేజోవిరాజమానులై బ్రాహ్మణోత్తములకు భూరిదానాలు ఇచ్చాడు.

దానినంతా విప్రోత్తాలు ఆనందంగా స్వీకరించారు. దశరథుని ఇష్టకార్యం సఫలం అవ్వాలని దీవించారు. తర్వాత దశరథుని చూచి ఉత్తమోత్తమమైన బుద్ధిగల మహారాజా! మేము ఈ భూమినంతా గ్రహించి ఏమి చేయజాలము. కాబట్టి ఈ భూమిని నీవు తీసుకొనుము. దానినంతా ప్రజలందరికి ఉపయోగపడునట్లుగా సారవంతం చేయము. దానికి బదులుగా మాకు ప్రయోజనం కూర్చే వస్తువులను ఏవైనను ఇప్పించుము. మేము సంతోషంగా స్వీకరిస్తాం అని చెప్పారు. దానినంతా సంతోషంగా దశరథుడు ఆలకించాడు. యజ్ఞ పరిసమప్తిచే ఆనంద చిత్తం కలిగాడు. వెంటనే ఆ ద్విజోత్తములకు వలసిన పది లక్షల గోవులను, వంద కోట్ల బంగారు నాణేలను నాలుగు వందల కోట్ల వెండి నాణేలను సంతోషంగా సమర్పించాడు. దానినంతా విప్రోత్తములు తీసుకొని ధీమంతులైన ఋశ్యశృంగునకు వశిష్ఠునకు వారు సమర్పించారు.

అందులోనుండి వారికి రావలసిన ధనమును తీసుకొని భూసురోత్తములు నీకు శుభం కలుగుగాక అంటూ దశరథుని ఆశీర్వదించి సెలవు తీసుకున్నారు.

మిక్కిలి సంతృప్తుడయిన దశరథుని అక్కడికి ఏతెంచిన బ్రాహ్మణోత్తములందరిని పిలిచాడు. వారికి కోటి బంగారు నాణేలను బహూకరించాడు. ఆ తర్వాత వచ్చిన పేద బ్రాహ్మణునకు తన చేతిననున్న ఆభరణాలు సైతం దానంగా ఇచ్చివేశాడు. వారందరికి మహదాత అయిన దశరథుడు సాష్టాంగ దండ ప్రణామాలు ఆచరించాడు. అద్భుత తేజశ్శాలి ఐన రాజేంద్రుని చూచి వారందరూ సంతృప్తులయ్యారు. మహా మహారాజులు కూడా చేయనట్టి

అశ్వమేధ క్రతువును చేశానని దశరథుడు సంతోషపడ్డాడు. త్వరగా పుత్రవంతుడౌతానన్న ఆశ ఆయనలో మొగ్గ తొడిగింది. దానితో పరమేష్ఠిని పొందినంత ఆనందపడ్డాడు. ఋశ్యశృంగుడు ఓ దశరథా! స్వాంతన పొందు. సంతృప్త మనస్సుతో ఆచరించిన ఈ యాగఫలం నీకు అందుతుంది. శ్రేష్ఠులైన నలుగురు కుమారులను పొందుతావు. వారివల్ల నీ వంశకీర్తి నలుదిశలకు వ్యాపిస్తుంది. నీ జీవిత గాథ ప్రపంచ ప్రఖ్యాతి పొందుతుంది. నీ కుమారుల యశస్సు ఆచంద్రార్కం నిలిచి ఉంటుంది అని దీవించాడు. ఆ మాటలు విని దశరథుడు మిగుల సంతసించాడు.

* * *

పుత్రేష్టి ప్రారంభం

సర్గ - 15

అశ్వమేధయాగం తర్వాత ఋశ్యశృంగుడు దశరథుడు చేయవలసిన కార్యాలన్నింటిని పునఃసమీక్షించుకొన్నాడు. ఆయన తలంపులో పుత్రేష్టియాగం వచ్చింది. వెనువెంటనే దశరథుని పిలిచి దశరథ మహారాజు నీవు చేయవలసిన కార్యాలలో పుత్రేష్టి అను యజ్ఞం ఒకటి ఉంది. దానిని నీవు శాస్త్రానుసారంగా నిర్వర్తించాలి. దానికై సమాయత్తుడవు కమ్ము అని చెప్పాడు.

దశరథుడు ఋష్యశృంగునికి ఆ విధంగానే చేస్తానని దీక్షను స్వీకరించాడు. ఆ తేజశ్శాలి వేద మంత్ర పఠనంతో దేవతలను ఆహ్వానించాడు. దశరథునిచే పుత్రేష్టి అను క్రతువును చేయించాడు. ఆ యాగ హవిర్భాగాల కొరకై దేవతలందరు గుమికూడారు. అలా వచ్చిన వారందరూ చతుర్ముఖుని చూశారు. ఆ విధాత చెంతకు వెళ్ళారు. "ఓ కమలాసన! రావణుడను దానవ వీరుడు నీ వరగర్వంచే బ్రాహ్మణులను, సాధువులను, ఋషులను బాధిస్తున్నాడు. దేవతలైన మమ్ము అనాదరిస్తున్నాడు. మేము నీపై ఉన్న గౌరవభావంతో అతనిని ఉపేక్షిస్తున్నాము."

"దానిని చూచి రాక్షసరాజు శ్రుతిమించుతున్నాడు. ఆయన ధాటికి సూర్యుడు తన కిరణ సమూహాన్ని ఉపశమింపచేసుకొంటున్నాడు. తన తరంగాలతో ఉవ్వెత్తున ఎగిసిపడే సముద్రుడు తన్ను తాను కుంచించు కొంటున్నాడు. ఆ భయంకరాకారుడైన దశకంఠుని చూచి సామాన్యులు గడగడలాడుతున్నారు. వానిని నిర్మూలించకపోతే సర్వనాశనం అవుతుంది. ఆ దుష్ట వీరుని హతమార్చు ఉపాయాన్ని నీవే మాకు ఎరిగించుము" అని అందరూ వేడుకున్నారు.

దేవతలు చెప్పినదంతా పద్మసంభవుడు విన్నాడు. ఆపై యోచించాడు వారితో ఇలా చెప్పాడు. "మునుపు ఆ రాక్షసేంద్రుడు నా కొరకై తపమాచరించాడు. యక్షకిన్నర గంధర్వులచే మృత్యువు రాకుండునట్లు వరమడిగాడు. నేను ఇచ్చాను. ఎవరైనా సరే లోక కల్యాణం కోసం కాక శుభప్రదమైన క్రతువును ఆచరించినా తపస్సాచరించినా వారికి ఆపద కలగకమానదు. అదేరీతిగా తపఃసంపన్నుడై ఉండి కూడా ఇతరులను బాధలకు గురిచేసే రావణుని

అంతం అతడే కల్పించుకొన్నాడు. హింసావృత్తిని చేపట్టినవారందరు మృత్యుఒడిలోకి పోక తప్పదు. వారేమియు చింతించవలసిన పనిలేదు."

"రావణుడు అహంభావంతో మనుష్యులచే ఆపదలను రాకుండునట్లుగా ఉండుటకు వరం అడుగలేదు. కావున మానవులే హంతకులగుదురు. ఆ రావణ పీడను తొలగిస్తారు. ఎక్కడైతే ధర్మగ్లాని జరుగుతుందో, అక్కడ పరమాత్మ ఆవిర్భవిస్తాడు. తనచే సృష్టించబడ్డ దుశ్చర్యలు చేయువానిని అంతమొందిస్తారు. శిష్టులను తన ఆశ్రితులను కాపాడుతాడు. మీరందరూ భగవంతునికై తపం చేయండి" అంటూ సలహానిస్తాడు.

అంతలో అక్కడ పీతాంబరధారి శంఖ చక్రగదాయుక్తుడైన విష్ణువు వచ్చాడు. వారందరూ "దేవ దేవా! మమ్ము కాపాడనెంచి ఇటు వచ్చితివా" అంటూ ఆ నిస్సంగుడిని ప్రార్థించారు. బ్రహ్మ మహావిష్ణువుతో ఇలా చెప్పసాగాడు. "ఓ లోకప్రియా! నీకు తెలియనిది ఈ లోకాన ఏదీ లేదు. కాని మా సంతోషం కొరకై మీకు నేను విన్నవించుతాను, ఆలకించు" అన్నాడు. విష్ణు దయాదృక్కులు బ్రహ్మపై ప్రసరించాయి. "ఈ దశరథుడు మానవేంద్రుడు, సాధువు, సర్వలోక యిష్టుడు. ఇతనికి హ్రీ, శ్రీ, కీర్తి అను వారితో సమానమైన భార్యలు ఉన్నారు. వారితో కలిసి పుత్రుల కొరకై పుత్రకామేష్టి అశ్వమేధాది క్రతువునెన్నింటినో చేశాడు. మానవులలో దయార్ద్ర హృదయం కలవాడు. నీవు ఇతనిపై దయచూపు. నీవే ఇతనికి కుమారునిగా అవతరించు. నీవల్ల సాధుజనులు రక్షించబడునట్లుగా చేయి. ఇదే మా వినతి. ఈ భూమికి నీ అవసరం ఎంతో ఉంది. భూదేవి రాక్షసకాండలతో సొమ్మసిల్లి ఉంది. భూదేవి అధికభారాన్ని మోయలేక నీకు మొరపెట్టుకొంటోంది. అందులకైనా నీవు నిన్ను మానవునిగా సృజించుకొమ్ము" అంటూ వేడుకొన్నాడు. ఆ చతురాననుని మాటలు మహావిష్ణువు మందహాసంతో విన్నాడు. దేవతలను సాధువులను ఉద్దేశించి భక్తవత్సలుడైన వైకుంఠుడు అభయం ఇచ్చాడు. "నేను శ్రీరాముడిగా దశరథనందనుడనై జన్మిస్తాను. అప్పుడు అకృత్యాలకు పాల్పడు రావణుని వంశాన్ని నిర్వీర్యం చేస్తాను. అతని పుత్ర పౌత్ర అమాత్యాది జనులు నాశనం చెందుతారు. అంతేగాక 11 వేల సంవత్సరాలు నేను ఈ భూమిని పాలించి, భూదేవికి ఆనందాన్ని కలిగిస్తాను" అని వరమిచ్చాడు. దానినంతా విన్న వారందరూ సంతోషపడ్డారు. "దేవదేవా! నీవే శరణు పాహిమాం పాహిమాం" అంటూ ప్రార్థించారు.

* * *

యజ్ఞపురుషునిచే ప్రసాద ప్రదానం

సర్గ - 16

రావణుని గూర్చి తెలిపే బ్రహ్మాదిదేవతల పలుకులు మహావిష్ణువు ఆలకించాడు.అంతా విన్న శ్రీమన్నారాయణుడు చిరునవ్వు నవ్వాడు. సర్వాధికారణుడైన సర్వేశ్వరుడు అన్నీ తెలిసి కూడా ఏమీ తెలియనట్లు చిన్న మందహాసంతో "ఆ లోకకంఠుని హతమార్చుటకు నేను ఏమి చేయాలో మీరే చెప్పండి" అన్నాడు. కరుణాకరుడైన

దేవాదిదేవుడు ఇలా అడుగగానే దేవతలందరూ ఏకకంఠంతో "సర్వేశ్వరా! నీకు తెలియనిది ఏదీ లేదు. నీ ఆజ్ఞలేక మేము చేయగలిగినది ఏమీలేదు. కాని నీవు మమ్ము అడిగావు కనుక మా కోరిక చెప్తాం. ఆలకించు ప్రభూ" అన్నారు.

"ఈ దశరథుడు పూర్వంనుంచి నీ భక్తుడు. నేడు సంతానం కొరకై పరితపిస్తూ వేదన చెందుతున్నాడు. ఋషీశ్వరుల ఆజ్ఞ మేరకు అశ్వమేధాది క్రతువులను చేశాడు. నేడు పుత్రకామేష్టిని జరుపుతున్నాడు. సకల ప్రాణులచే ఆశీర్వాదం పొంది ఉన్నాడు. కనుక నీవు ఈ దశరథుని మనోరథం తీర్చినట్లయితే మా కోరికా నెరవేరుతుంది."

"ఆ దశకంఠుని ఇచ్ఛ మేరకే నరులచే మృత్యువు అతనిని చేరుతుంది. అందరి మనోభీష్టాలు తీరుతాయి. పరమేశ్వరా! దయాళువై నిన్ను నీవు దశరథ నందనునిగా సృజించుకొనుము. మమ్ము రక్షించు. ఆర్తులను దీనులను కాపాడే బాధ్యత నీదే సుమా" అన్నారు.

సమస్త ప్రాణాధారియైన పరమాత్మ "తథాస్తు! మీ కోరిక ప్రకారమే నన్ను నేను దశరథుని నందనులుగా, నలుగురిగా సృజించుకుంటున్నాను. మీరందరూ కూడా ఆ భూలోకంలో వానరులై జన్మించండి పూర్వోత్తరంలో నాకును, మీకును సందర్భానుసారంగా మిత్రత్వం ఏర్పడుతుంది. జగన్మాతైన లక్ష్మీదేవి కూడా జనకనందిని అవుతుంది. ఆమెను నేను గ్రహిస్తాను. ఆమెను పరిత్యజించాననే నెపంతో లోకకంటకుని నిర్మూలనం చేస్తాను. సాధువుల రక్షణ చేస్తాను. మీరందరూ భయం వీడి స్వస్థులు కండి" అని చెప్పి అంతర్ధానం చెందాడు.

దశరథుడు చేయుచున్న యజ్ఞకుండం నుండి యజ్ఞపురుషుడు ప్రాదుర్భవించాడు. ఆ పురుషుడు దివ్య తేజోమయుడు కృష్ణవర్ణంతో ఎర్రని కన్నులతో దుందుభి స్వరంతో కనపడ్డాడు. ఎర్రని వస్త్రాలు ధరించాడు. అతని శరీరంపైగల కురులు సింహపు జూలువలె కనబడ్డాయి. సకల శుభలక్షణాలతో సర్వాంగశోభతో ఆభరణాలతో రూపుగాంచాడు. అతని చేతులలో ఆశ్చర్యం కొలుపుతూ బంగారుపాత్ర అందు దివ్యపాయసం తొణికిసలాడుతూ కనిపించింది.

ఆ దివ్యుని చూచినంతనే దశరథునితో సహా అక్కడున్న వారందరూ ఆశ్చర్యానుభూతులకు లోను అయ్యారు. చేయాల్సిన కార్యాలు మరచారు. దశరథుడు తొట్రుపాటును వీడి అంజలిబద్ధుడయ్యాడు. ఆనందాశ్రువుల నయనాలతో వీక్షించుచున్న దశరథుని యజ్ఞపురుషుడు సంతుష్ట మనస్సుతో చూశాడు. "ఓ రాజా! చతుర్ముఖుడు పంపగా నేను వచ్చితిని పరమేశ్వరుని కోరిక ప్రకారం ఈ దివ్య పాయసం నీకు ఒసంగుతున్నాను. దీనిని నీవు, నీ ప్రియపత్నులు సేవించండి. మీ మనోభీష్టం నెరవేరుతుంది. నీకు వలసిన పుత్రులను పొందుతావు. నీ వంశం ఉద్ధరింపబడుతుంది. నీ కీర్తి లోకాలకు వ్యాపిస్తుంది" అని పలికాడు. ఆ పలుకులు విన్న రాజేంద్రుడు ఎంతగానో సంతోషించాడు. ఆ దివ్య పాయసాన్ని తన కరములతో అందుకున్నాడు. పరమ ప్రీతుడయ్యాడు. ఆ దేవదత్తమైన పాయసానికి నమస్కరించాడు. ఇష్టకార్యసిద్ధిని కలుగజేసే ఆ పాయసాన్ని దశరథ పత్నులు ప్రియంగా చూశారు. వారందరూ ప్రదక్షిణగా నమస్కారాలు చేయగా ఆ దివ్యపురుషుడు అదృశ్యమయ్యాడు.

ఋష్యశృంగుడు "ఓ దశరథా నీ క్రతువు సత్ఫలితాన్నిచ్చింది. దీనితో నీవు అనుకున్నది సాధించావు. నీవు లోకకల్యాణార్థం నీ జీవితాన్ని కొనసాగించు. పరమేశ్వర ప్రీతికై కార్యారంభం చేయి. సకలం శుభం అగుగాక!" అని దీవించాడు. వారందరు ఆ మహర్షికి వందన సమర్పణ చేశారు.

దశరథుడు సంతానదాయకమైన ఆ దివ్య పాయసాన్ని అంతఃపురానికి తీసుకుని వెళ్ళాడు. ఆ అమృత తుల్యమగు పాయసం ఎప్పుడు తమకు అందుతుందా? అని దశరథుని భార్యలు ఎదురుచూశారు.

అంత మహారాజు ఆ పాయసంలో సగభాగాన్ని తన పట్టమహిషైన కౌసల్యాదేవికి ఇచ్చాడు. మిగిలిన దానిలో అర్ధభాగాన్ని సుమిత్రకు, తన ప్రియభార్య ఐన కైకేయికి సగభాగాన్ని ఇచ్చాడు. కైకేయి తనకు ఇచ్చిన భాగంలోని సగాన్ని మళ్లీ సుమిత్రకు ఇచ్చింది. వారందరూ దాన్ని సేవించి పరమానందం పొందారు.

అది సేవించిన కౌసల్యా సుమిత్రా కైకేయిలు సూర్య సమ ప్రభలతో ప్రకాశించారు. వారి హృదయం చంద్రుని వెన్నెలను మించిన చల్లదనంతో ప్రశాంతతను పొందింది. వారి చూపులు రాజీవలోచనుని తలపించాయి. గర్భవతులయిన వారిని చూచి దశరథ నరేంద్రుడు అమిత సంతోషపడ్డాడు. ఆనందచిత్తుడయ్యాడు.

* * *

వానరులు జన్మించుట

సర్గ - 17

పద్మసంభవుడు దేవతలందరిని ఒకచోట చేర్చాడు. "ఓ దేవతలారా! దశకంఠుని సంహారంలో పాలుపంచుకోవాల్సిన తరుణం ఆసన్నమౌతోంది. శ్రీ మహావిష్ణువు దశరథుని ఇంట్లో ఆవిర్భవిస్తాడు. కనుక మీరందరూ మీ మీ అంశలతో వానరులను పుట్టించండి. వారు అమితబల పరాక్రమసంపన్నులుగా, కామరూపులుగా వాయువేగాన్ని మించిన వేగం కలవారుగా వారికి జన్మనీయండి. గంధర్వ, నాగ, ఋక్ష, విద్యాధర, ఉరగ, యక్ష, కిన్నర స్త్రీలయందు వానరులను సృజించండి" అన్నాడు.

విధాత ఆజ్ఞ ప్రకారం దేవతలందరు కార్యోన్ముఖులయ్యారు. పరిమేష్ఠిని ధ్యానించారు. వారు చేయవలసిన కార్యాలను వారి చేత చేయించవలసిందిగా వేడుకొన్నారు. "ఓ అనిమిషులారా! పూర్వం ఒకసారి నేను ఆవులించగా జాంబవంతుడను ఒక శ్రేష్ఠుడు నా ముఖంనుండి జనించాడు. ఇతడు వానరుల శ్రేష్ఠుడు అవుతాడు అని బ్రహ్మ, దేవతలకు తెలిపాడు.

సృష్టికర్త తెలిపినట్లుగా ఋషులు, యక్షులు, కిన్నెరలు, విద్యాధరులు ఉరగులు, గంధర్వులు, నాగులు, చారిణులు మొదలైన జాతులలోని స్త్రీలందరు మహాత్ములైన విష్ణుసమానులైన వానరవీరులను పుత్రులుగా పొందారు.

దేవతల రాజైన ఇంద్రుడు మహాబల సంపన్నుడై మహేంద్ర పర్వతంవంటి వాలికి జన్మనిచ్చాడు. అర్కుడు తేజశ్శాలైన సుగ్రీవుని పుట్టించాడు. బృహస్పతి తన బుద్ధి చాతుర్యానికి దీటుగా ప్రజ్ఞాశాలైన తౌరుడను వానికి జన్మనిచ్చాడు. కుబేరునివలన గంధమాదనుడు, విశ్వకర్మ వలన నలుడు, అగ్నిదేవుని వలన నీలుడు జన్మనెత్తారు. వీరందరు వీరి జన్మకారకులైన వారి అంశలను వారి బుద్ధి కుశలతను తేజాన్ని పుణికిపుచ్చుకున్నారు. వానర శ్రేష్ఠులలో వీరినిమించిన వారు లేరనిపించుకొన్నారు. అభేద్యమైన శరీరం, గరుత్మంతుని వేగం కల సకల శుభలక్షణ సంపన్నునిగా వాయునందనుడు రూపునెత్తాడు. వానరులలో ప్రఖ్యాతుడు హనుమంతుడిగా పేరు గాంచాడు. ఇదేవిధంగా వేలకొలది వానరులు, భల్లూకములు, గోపుచ్ఛములు (కొండముచ్చు జాతివారు) వివిధ దేవతల సంతానమై తేజరిల్లారు. వీరందరూ సాటిలేని మహావీరులు, అమిత ప్రజ్ఞావంతులు. దశకంఠుని వధలో పాలు పంచుకోవడానికి వీలుగా వివిధ వేషాలు మహాకాయులు, కామరూపులు వన్యఫలాలను, కందమూలాలు తినేవారుగా ఉన్నారు.

వీరు అస్త్ర, శస్త్ర విద్యాదులలో ఆరితేరినవారు. వీరి గోళ్ళు కోరలు ఆయుధాలుగా కలిగినవారు. వీరి పాద ఘట్టన చర్యలు ఆకాశ నిర్మల పదవిహారం చేయు ఖగములను సైతం నేలకొరిగేటట్లు భీతిని కలిగించేవి. వీరు చేసే ధ్వనివల్ల భూమి కంపించేది. వీరు గోళ్ళచే పాతాళసందర్శనం చేయగల ధీమంతులు. వీరి శరీర లాఘవంతో సాగరాన్ని అల్లకల్లోలపరచగల వీరులు. పర్వతాలను అవలీలగా మోయగల సమర్థులు. వీరు వాయువుకంటే వేగంగా సంచరించగలరు. వీరు ఆకాశంలోకి ఎగిరి మేఘాలను స్పృశించగలరు. దైవాంశ సంభూతులైన వీరు ఏళ్ళ తరబడి పాతుకుపోయిన వృక్షరాజాలను సైతం పెకలించగలరు.

ఇటువంటి వానర ప్రముఖులు కోటాను కోట్లమంది జన్మించారు. వీరందరూ వాలి సుగ్రీవ హనుమదాదులను చేరి నాయకశ్రేష్ఠులుగా ఎంచుకొన్నారు. వీరు వృక్షాలపై, పర్వత గుహలలో నివసించ సాగారు.

దృఢమైన బాహువులు బలిష్ఠమైన శరీర దారుఢ్యం కలిగి భల్లూకాది వనచరాలను పాలిస్తుండేవారు. తమ బుద్ధి విశాలంతో పర్వతాలు, వృక్షాలు, నదులు, అడవులు, సముద్రాలతో కూడిన భూమండలం అంతా వ్యాపించి తమ కార్యార్థం వేచి ఉన్నారు.

* * *

శ్రీరామ ఆవిర్భావం

సర్గ - 18

దశరథుడు ప్రారంభించిన యజ్ఞాలు పూర్తయ్యాయి. హవిస్సులకు కొరకై వచ్చిన దేవతలు సంతోషంగా వెనుదిరిగారు. యాగాహ్వానితులైన రాజులు, ద్విజులు దశరథునిచే సత్కరించబడ్డారు. వారందరూ బంధుమిత్ర సమాగంతో వారివారి నిజపురాలకు బయలుదేరారు.

దశరథుడు మిగుల సంతుష్టమనస్సుతో ఋష్యశృంగుని, వశిష్టాది మహర్షులతో గూడి అయోధ్యా నగరానికి వెళ్లారు. అంతఃపురం చేరిన పిమ్మట ఋష్యశృంగుని ఆదరించాడు. అనేకానేకములైన వందన సమర్పణలు చేశాడు. తగిన విధంగా పూజాదికాలు సల్పాడు. వాటన్నింటిని గ్రహించిన ఋశ్యశృంగుని మనస్సు ఆనందపడింది. నీ మనోరథం త్వరలో ఈడేరుతుందని ఆశీర్వదించాడు. తర్వాత శాంతాసమేతుడయి నిజ నివాసానికి బయలుదేరాడు. రోమపాదుడు బంధుమిత్రులతో కలిసి ఋష్యశృంగుని అనుసరించాడు.

వశిష్ఠాది మునులు దశరథునికి ఆశీర్వాదాలు ఇచ్చి వారి ఆశ్రమాలకు వెళ్లారు. దశరథుడు పత్నీ సమేతుడై పుత్రోదయంకోసం వేచిచూశాడు. 10 మాసాలు గడిచాయి. చైత్రమాసం ఆరంభమైంది దశరథుని మోములో చిరుకాంతులు బయలుదేరాయి. పునర్వసు నక్షత్రయుక్త నవమి తిథిన రాసులన్నీ ఆనందంతో నిండాయి. ఐదుగ్రహాలు సూర్య, కుజ, గురు, శుక్ర, శని తమ ఉచ్చస్థానాల్లో మేష, మకర, కర్కాటక, మీన, తులరాసులతో కూడాయి. గురుడు చంద్రునితో సఖ్యం చేశాడు. కర్కాటలగ్నం ప్రవేశించింది. కౌసల్యలో అపరిమితానందం నిండింది. చెక్కిళ్లు ఆనందంతో పొంగాయి. మనస్సు ఎగిసిపడే సంద్రాన్ని తెలిపింది. ఆ సమయంలో సర్వశుభుడు సర్వలోక నమస్కృతుడు, వందనీయుడు, మహాభాగ్యవంతుడు, సర్వేశ్వరుడు ఇక్ష్వాకువంశ వర్ధనుడు కౌసల్యకు సుతునిగా ఆవిర్భవించాడు.

ఆకాశం పుష్పవృష్టి కురిపించింది. దేవతలు దుందుభులు మ్రోగించారు. మంగళ వాద్యతూర్యములు మిన్నుముట్టాయి. సకల సాధులోకగణం ఆనందపారవశ్యం చెందింది. దశరథునికి వర్ణించలేని ఆనందం కలిగింది. నయనాలు కుండపోతగా వర్షించాయి. శరీరం పులకించింది. రోమాలు నిక్కపొడుచుకున్నాయి. శరీరం స్థాణువయింది. దివ్య తేజోరూపునిగన్న కౌసల్య ఆనందం అనుభవైకవేద్యమే. అపరిమితానంద మనస్కులైన దశరథునికి పుష్యమీ నక్షత్ర మీనలగ్నమందు భరతుడు కైకేయికి జన్మించాడు.

ఆశ్లేషా నక్షత్రమందు కర్కాటక లగ్నంలో సుమిత్రాదేవి లక్ష్మణ, శత్రుఘ్నులకు జన్మనిచ్చింది. ఇలా దశరథుడు గుణవంతులను నక్షత్రభాసమానులను బుద్ధిమంతులను అగు నలుగురు కుమారులను పొందాడు. దేవతలచే స్తుతించబడు విష్ణువువలె బ్రహ్మానందపడ్డాడు. ఆ పుత్రోదయాన అయోధ్య స్వర్గాన్ని తలపించింది. గంధర్వులలాగా అయోధ్యవాసులు గానం చేశారు. యక్షకిన్నరులవలె నర్తించారు. సర్వలోకం ఆనంద తాండవం చేసినట్లు వంది మాగధులు దశరథుని స్తుతించారు.

పుత్రలబ్ధితో ఆనందించిన దశరథనరేంద్రుడు సకల వర్ణప్రజలను సంతోషపరిచాడు. భూరిదానాలు చేశాడు. విప్రులను, సన్యాసులను, ఋషులను యథారీతిగా సత్కరించాడు. అయోధ్యా పట్టణంలోని వారందరూ ఎంతో సంతోషించారు. "మము పాలింప నడిచి వచ్చితివా! స్వామీ..." అంటూ కౌసల్యానందుని ఆదరాభిమానాలతో అభినందించారు.

క్షత్రియ సంప్రదాయాన్ననుసరించి వశిష్ఠుడు ఆ శిశువులకు జాతక కర్మలు చేయించాడు. నామకరణ మహోత్సవం జరిపించాడు. కౌసల్యానందనుని రాముడని, కైకేయి పుత్రునకు భరతుడని, సుమిత్రా సుతులకు లక్ష్మణ, శత్రుఘ్నులని పేర్లు పెట్టారు. నామాలకు తగినట్లు వారు దినదినాభివృద్ధి చెందారు.

శుక్ల పక్ష చంద్రునివలె ఎదిగే కొడుకులను చూచి దశరథుడు ఉప్పొంగిపోయాడు. వారి బాల్య చేష్టలకు సతీసమేతుడైన దశరథుడు ఇహలోకాన్ని మరిచాడు. అందరిలోకి పెద్దవాడైన రాముడు తండ్రికి ప్రియుడయ్యాడు, ఆటలలోను వారు సత్య పరాక్రములయ్యారు. అన్నప్రాశన ఉపనయనాది సంస్కారములన్నియు ఆ యా కాలాలలో జరిపించారు. రాముడు అంతఃపురవాసులను తన అందంతో సమ్మోహపరిచేవాడు. లక్ష్మణ, భరత శత్రుఘ్నులు తమ చేష్టలతో, మనోహర రూపాలతో అందరినీ అలరించేవారు.

పుత్రులు జ్ఞానులవ్వాలని అభిలాషతో విద్యార్జన చేయించారు. గురువులు నిర్మలచిత్తులై విద్యను బోధించారు. వారు సకల శాస్త్ర ప్రవీణులయ్యారు. సరస్వతీ ప్రియులయ్యారు. యుద్ధవిద్యలలోను ఆరితేరారు. ధనుర్వేదమందు శ్రద్ధకలవారయ్యారు. వేదాధ్యయనంలో అకుంఠిత దీక్ష కనబరిచారు.

తల్లిదండ్రులను సేవించుటలోను, గురువులయందు భక్తి భావం చూపుటలోను, సకలజనులకు వినయంగా ఉండుటలోను, ఆ నల్వురు పుత్రులు ఆసక్తి కనబరిచేవారు. ప్రవర్ధమానం చెందుతున్న వారిని చూచి కౌసల్య, సుమిత్ర, కైకేయిలు అమిత ప్రేమవాత్సల్యాలను పెంచుకున్నారు. దశరథుడు వారిని వీడి ఒక క్షణమైనా నిలువలేక ఉన్నాడు.

తన పుత్రుల అభివృద్ధిని గాంచి సంతసించాడు. తర్వాతి కార్యక్రమ నిర్వహణకు దశరథుడు తన మంత్రులతో మంత్రాలోచనకు పూనుకున్నాడు. తన పుత్రుల వివాహ విషయాలను వారితో ముచ్చటిస్తున్నారు.

ఆ సమయంలో రాజద్వారం చెంత గాధి కుమారుడును, కుశిక వంశజుడును అయిన బ్రహ్మర్షి విశ్వామిత్రుడు వచ్చాడు. ఆయనను చూచిన ద్వారపాలకులు సాష్టాంగ ప్రణామాలు ఆచరించారు. ఆయన ఏతెంచిన విషయం రాజునకు చెప్పటానికి రాజప్రసాదంలోకి పరుగెత్తారు.

ద్వారపాలకులు అందించిన వార్తను విన్న దశరథుడు సంతోషించాడు. తన పురోహితులను వెంట బెట్టుకుని విశ్వామిత్రునికి ఎదురేగాడు. అతిథిసత్కారాలచే విశ్వామిత్రుని మనం చూరగొన్నాడు. అర్ఘ్య పాద్యాదులను ఇచ్చి సగౌరవంగా పూజించాడు. మర్యాద చేసి ఉచితాసనం ఇచ్చి ఉపవిష్టుని గావించాడు.

గాధిసుతుడు పరమానందపడ్డాడు. కుశలప్రశ్నలు వేశాడు. "దశరథా! నీ రాజ్యంలోని వారందరూ క్షేమమే కదా! జానపదులు, గ్రామ, పట్టణ వాసులు అందరూ సుఖులే గదా! వరుణాది దేవతలచే నీవు ప్రీతి ప్రాతుడవు అగుచున్నావు గదా! ధర్మం తప్పక పాలన సాగిస్తున్నావు గదా! నీ మిత్రసముదాయం నీతో సహ చర్యాన్ని అభిలషిస్తోంది కదా! నీ బంధుగణం నీ అభివృద్ధిని గాంచుచున్నది గదా! నీ ప్రియసఖులు ఆనందంగా ఉన్నారు గదా! పరమేశ్వర ప్రీతుడివైన నీవు నీ కుమారులచే సుఖాన్ని పొందతున్నావు గదా! నీ సామంతులు నీ అదుపాజ్ఞలలో ఉన్నారు గదా! నీ కోశాగారం బాగున్నది గదా! యజ్ఞ దైవాదికార్యాలకు ఆటంకాలు కలుగుట లేదు కదా" అంటూ అడిగాడు.

విశ్వామిత్రునితో వచ్చిన వామదేవాది మహాత్ములు దశరథునితో ఇష్టాగోష్ఠి జరిపారు. అవి అన్నీ విన్న నరేంద్రుడు పులకితగాత్రుడయ్యాడు. "బ్రహ్మర్షీ! నీ రాకచే నేను ధన్యుడయ్యాను. నీ పాదము మోపిన స్థలంలో

జీవించుటచేత నేను పాపవిముక్తుడినయ్యాను. రాజర్షి బ్రహ్మర్షివైన మీ ఆశీర్వాదంవల్ల నా వంశజులు ఉత్తమగతులు పొందారు.

మీ శుభ సందర్శనంచేత నేను కృతార్థుడినయ్యాను. నాకు మీరు దైవ సమానులు, మీ ఆగమనంవల్ల నా రాజ్యం సుభిక్షితం అయ్యింది.

ధర్మాత్ముడవైన నీవు ధర్మాచరణయందు పాల్గొను శక్తిని నాకు ప్రసాదింపుము, నేను నీ కొరకై చేయవలసిన కార్యాలను తెలుపుము. వాటిని దృఢచిత్తంతో అంగీకరించి నా శాయశక్తులా వాటిని నిర్వర్తిస్తాను" అన్నాడు.

ఆ మాటలను శమదమాది విశిష్ట గుణసంపన్నుడైన విశ్వామిత్ర మహర్షి విన్నాడు. అమితానంద పడ్డాడు. స్థిమిత బుద్ధిని కలిగాడు. సంతోషంగా విశ్రమించాడు. దానిని చూచి దశరథుడు సంతసించాడు.

* * *

విశ్వామిత్రుని కాంక్ష

సర్గ - 19

దశరథ మహారాజు మాటలతో విశ్వామిత్రుడు ఆనందపడ్డాడు. "దశరథా! నీవు నీ వంశం వలన సద్బుద్ధి కలిగి ఉన్నావు. నీ గురువుల శిక్షణతో నీ బుద్ధికుశలతను పెంచుకున్నావు. ధర్మాలన్నీ ఎరిగావు, కనుకనే నీ నోటినుండి మంచిమాటలే వస్తున్నాయి. నీ పలుకుల వలన నేను ప్రీతి చెందాను. నేను వచ్చిన పనిని తెలుపుతాను" అన్నాడు.

ఓ దశరథ నరేంద్రా! నేను తపఃసిద్ధి పొందుటకై యజ్ఞం చేస్తున్నాను. ఆ యాగ పరిసమాప్తి చేయడంలో మారీచ, సుబాహువులను రాక్షసులు వచ్చి విఘ్నాన్ని కలుగచేస్తున్నారు. వారిని శపించే సమర్థత నాకున్నది. కాని యాగం చేయటంవలన నా బుద్ధి వారిని శపించడానికి పూనుకొనడం లేదు. ఆ విఘ్నాలకు నా మనస్సు కలత చెందుతోంది.

కావున ఓ నరేంద్రా! నీవు నీ సుకుమారుడైన జేష్ఠపుత్రుని నాతో పంపించినట్లయితే ఆ రాక్షసులను నాశనం చేయడానికి వీలౌతుంది.

నా వెంట నీ కుమారులను పంపినచో నేను వారికి శ్రేయం కూరేటట్లుగా చూస్తాను. నీవు సంకోచం లేకుండా యజ్ఞరక్షణార్థమై నీ పుత్రులను నాతోకూడా పంపించు. దానివలన నీవు, నీ వంశం కీర్తిని పొందుతారు. రాక్షసులు మదగర్వంతో అనేక అకృత్యాలకు పాల్పడి ఉన్నారు. దానివలన వారికి మృత్యువు దాపుననే పొంచి ఉంది. కావున నీ శ్రీరాముని చేతిలో మారీచాది రాక్షసులు సంహరింపబడడం తప్పనిసరి, అందుకై నీవు సంకోచించకుండా నీ కుమారుని నా వెంట పంపించు.

నా సామర్థ్యం గురించి నీకు ముందుగానే తెలును. నీ పురోహితులతోను, వశిష్ఠాది గురువులతోను, సంప్రదించిన తర్వాత నీ కుమారులను నా వెంట పంపడానికి ఆలోచించుము.

రాజీవలోచనుడైన శ్రీరాముని పది రోజులపాటు నాతో ఉండునట్లు నీవు అంగీకరించు. దానివలన, నా యాగం సకాలంలో పూర్తి అవుతుంది. నీకు మేలు జరుగుతుంది" అని విశ్వామిత్రుడు దశరథునితో చెప్పాడు.

ఆ పలుకులువిన్న దశరథ మహారాజు కల్లోలిత మనస్కుడు అయ్యాడు. చిరుతప్రాయంలో ఉన్న తన చిన్నారులను యాగదీక్షాపరులను చేయవలసి వస్తోందని వ్యాకులపడ్డాడు. చంచల మనస్సుతో ఏమీ చేయటానికి పాలుపోక ఆసనంలో కూర్చోలేక చింతాక్రాంతుడయ్యాడు.

* * *

విశ్వామిత్రుని క్రోధం

సర్గ - 20

విశ్వామిత్రుని మాటలు దశరథుని నిశ్చేష్టుని చేశాయి. తనను తాను నిగ్రహించుకొని దశరథుడు స్థిమితం చెందాడు. విశ్వామిత్రునితో మాటలాడాలనుకొన్నాడు. "ఓ గురువర్యా నా రాముడు పదునారేండ్ల వయస్సుకూడా లేనివాడు. యుద్ధ విద్యలను ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్నవాడు. అస్త్రశస్త్ర ప్రయోగ విశారదుడు కాడు. అట్టివారిని రాక్షసవధకు కొనిపోవ నీవు ఆలోచిస్తున్నావు. అది నీకు ధర్మం కాదు. నాపై అనుగ్రహం చూపు. రాక్షసులు సమరంలో ఆరితేరిన నిపుణులై ఉంటారు. ఎన్నో కపటోపాయములతో సంగ్రామయోధులను భయభీతులను చేస్తారు. అట్టివారితో యుద్ధం చేయడం మిగులకష్టం అందులోను పసివారైన నా కుమారులు అందుకు ఏ మాత్రం పనికిరారు అని నాకు అనిపిస్తోంది.

మునీశ్వరా! నీకు తెలియంది ఏమీ లేదు. అరవైవేల సంవత్సరాలకు నేను పుత్రుని పొందాను. దీనికై నేను ఎన్నో క్లేశముల బారిన పడ్డాను. నాకు నా నలుగురు పుత్రులు సమానులైనప్పటికీ, నా పెద్ద కొడుకు ధర్మాచరణలో నాకు ఇష్టుడు. నా తదనంతరం రాజ్యభారాన్ని వహించవలసినవాడు. సర్వులకు ప్రియం ఒనరించువాడు, అటువంటి వానిని నేను యుద్ధంకోసం నీతో పంపించజాలను. ఇంతకీ నీ యాగానికి అడ్డువచ్చే ఆ రాక్షసులు ఎవరు? ఎవరి అండతో నీకు వారు ఆటంకాలను కలిగిస్తున్నారు. బ్రహర్షీ! ఆ రాక్షసులు స్వతసిద్ధంగానే కపటోపాయ ధురీణులు అయి ఉంటారు గదా. వారి వంశం ఎట్టిది? వారి తండ్రి ఎవరు? వారితో నా కుమారుడుగాని, నేనుగాని యుద్ధం చేయడానికి వారు ఎట్టివారో తెలుసుకొనవలెనుగదా. వారిని గురించి తెలుపు మునిపుంగవా!"- అంటూ దశరథుడు కుశిక వంశజుడిని అడిగాడు. "పౌలస్త్య వంశజుడు. విశ్రవసుడను మునికుమారుడు రావణుడు. ఇతడు కుబేరుని సోదరుడు. అతడు బ్రహ్మచే వరం పొందినాడు. తన అనుయాయులతో కలిసి ముల్లోకాలను బాధిస్తున్నాడు. యజ్ఞవిఘ్నాలను చిన్నవనే తలంపుతో తన అనుచరులైన మారీచ సుబాహులనే మహాబలశాలురతో

చేయిస్తున్నాడు" అని రావణుని గూర్చి మునిశ్రేష్ఠుడు చెప్పాడు. ఇదంతా విన్న దశరథుడు అమితంగా దుః ఖపడ్డాడు. "ఓ మహర్షీ! నేను నీ ఆజ్ఞలను పాలించలేని దురదృష్టవంతుడిని. నీవు చెప్పే రాక్షసరాజైన రావణుని ఎదుర్కొనలేని భీరువును. ఇక నా కుమారుల గురించి చెప్పేది ఏమంటుంది? కనుక మాపై దయ ఉంచి మమ్ము నిర్బంధించకుము. మేము సంగ్రామాభిలాషులం కాదల్చుకోవడం లేదు. నా పసి కుమారునిపై అనుగ్రహించుము" అని వేడుకున్నాడు. "ఓ మునీశ్వరా! అలాకాక నా కుమారునితోనే యుద్ధం చేయించాలనే కోరిక నీకున్నట్లయితే నా కుమారునితో పాటుగా నేను నా అక్షౌహిణుల సేనావాహిని రావడానికి అనుమతిని ఇమ్ము. అలాకాకపోతే నా తనయుని ఒక్కనినే నీ వెంట పంపజాలను. నాపై దయతో నీ కోరికను వదులుము. సుందోపసుందులైన ఆ రాక్షసవీరులు యమునితో సమానులు, అట్టివారితో యుద్ధ నైపుణ్యం లేని నా తనూజులు సమరం చేయలేరు. వారే కాక నేనును నా యావత్తు సైన్యంకూడా వెనుకంజ వేసేవారమే కాని యుద్ధం చేయ నేర్పరులం కాము" అని దృఢంగా దశరథుడు విశ్వామిత్రునితో పలికాడు. ఆ మాటలకు విశ్వామిత్రుని హృదయం అగ్నిహోత్రం వలె జ్వలించింది. ఆగ్రహోద్రగుడయ్యాడు. కన్నులు ఎర్రబారాయి.

* * *

వసిష్ఠుని హితం

సర్గ - 21

పుత్రవాత్సల్యంతో మాటలాడు దశరథుని విశ్వామిత్రుడు చూచి కుపితుడయ్యాడు. ఓ నరశ్రేష్ఠా! ఇక్ష్వాకుకులంలోనివాడవు రఘువంశమందు పుట్టిన నీవు ఆడినమాట తప్పడానికి సిద్ధపడుతున్నావు. అదే నీకు సరియైనదని తోచినచో అటులనే కానిమ్ము. నేను రిక్తహస్తంతో వెళ్తాను. ఫర్వాలేదు. నీవు నీ వంశజులందరూ సుఖంగా జీవించండి అని విశ్వామిత్రుడు పలికాడు.

ఆ మాటలు దేవతలు విని ప్రతిసృష్టి చేయగల విశ్వామిత్రుని చూచి భయపడ్డారు. భూదేవి భయకంపిత అయ్యింది. దీనినంతా వసిష్ఠుడు గ్రహించాడు. ఓ నరోత్తమా! ఈ విశ్వామిత్ర మహర్షి ఆకృతి దాల్చిన ధర్మమే. ఇతనితో కూడా నీ కుమారులను పంపించిన నీకు మేలే జరుగును. సత్యవంతుడివైన నీవు ఇప్పుడు ఇచ్చిన మాట నెరవేర్చక పోయినట్లయితే పాపం ఒడిగట్టుకున్నవాడి వవుతావు. ధర్మజ్ఞులైన నీ వంశజులకు అపకీర్తి కలిగించే పనులను చేయవద్దు.

రాక్షసులను నిగ్రహింప సమర్థుడై ఉండికూడా నిన్ను నీ కుమారులను ఉద్ధరించుటకై విశ్వామిత్రుడు ఇక్కడకు వచ్చాడు. విశ్వామిత్రుడు పాలన చేయుకాలంలో భృశాశ్వదను ప్రజాపతి తన కుమారులను అస్త్రరూపంలో ఉపయోగించుకొనమని ఇతనికి ఇచ్చాడు. వారు దక్షప్రజాపతి తన కుమారులను అస్త్రరూపంలో ఉపయోగించుకొనమని ఇతనికి ఇచ్చాడు. వారు దక్షప్రజాపతి మనుమలు. వారందరూ తేజఃస్వరూపులు, మహా

బలపరాక్రమవంతులు, విశ్వామిత్రుని రక్షణలో ఉండే రాముడు భద్రంగా ఉంటాడు. అగ్నితో రక్షించబడే అమృతంవలె భాసిల్లుతాడు. అంతేగాని రాముడు అస్త్రశస్త్ర నిపుణుడు కావాల్సిన అవసరం ఏ మాత్రం లేదు. నీవు భయం వీడి విశ్వామిత్రునితో నీ పుత్రులను పంపించు అని వశిష్ఠుడు చెప్పాడు. స్వస్థత చేకూరని దశరథుడు అన్యమనస్కుడై ఆలోచించసాగాడు. అతనిని చూచి వశిష్ఠుడు ఓ నరేంద్ర! విశ్వామిత్రుని మించిన అస్త్రశస్త్ర ప్రయోగశీలి ఎవరూ లేరు. అతడు అస్త్రశస్త్రాలను సృజించగల శక్తిమంతుడు. ఇతనికి తెలిసినన్ని విద్యలు దేవతలకుగాని యక్షకిన్నర కింపురుషులకు గాని తెలియవు. ఋషులలో శ్రేష్ఠుడైన ఈ మహర్షి నీ బిడ్డలను కాపాడడంలో ఏమాత్రం సంశయించ పనిలేదు.

జయ అను దక్షప్రజాపతి కుమార్తె ఒకసారి నూరు అస్త్రాలను సృష్టించింది. సుప్రభ అను కూతురు సంహారులను శస్త్రాలు యాభై సృజియించింది. వీటినన్నింటిని విశ్వామిత్రునికే వారు ఇచ్చి వేశారు. కుశుక కుమారుడైన ఈ గాధి సుతుడు అస్త్రశస్త్రాదాది విద్యలలో నేర్పరి. ఇటువంటి గొప్ప తపశ్శాలైన ఈ విశ్వామిత్రునితో రాముని పంపడమే ఉత్తమమైనపని. నీవు వ్యాకులతను వీడి, కర్తవ్యాన్ని పాలించు అని హితబోధ చేశాడు. ఆ మాటలు విన్న దశరథుడు అమితానందం చెందాడు. తన కుమారుని అదృష్టానికి పొంగిపోయాడు. మనస్ఫూర్తిగా విశ్వామిత్రుని వెంట రాముని పంపడానికి తన సంసిద్ధతను తెలిపాడు.

* * *

విశ్వామిత్రునితో రామలక్ష్మణుల పయనం

సర్గ - 22

వశిష్ఠుని మాటలు దశరథునికి ధైర్యాన్ని కలిగించాయి. కర్తవ్యపాలనకు దారిచూపాయి. సత్యనిరతునిగా ఉండటానికి దశరథుడు నిశ్చయించుకున్నాడు. వెంటనే రామలక్ష్మణులను పిలిపించాడు. కౌసల్యాదులతో కూడి దశరథుడు పుత్రులను దీవించాడు. శిరస్సును ముద్దాడాడు. చిత్తశుద్ధితో తన పుత్రులను విశ్వామిత్రునకు సంతోషంగా అప్పగించారు.

విశ్వామిత్రుడు సంతుష్టుడయ్యాడు. ఆ ఇరువురిని తీసుకుని తన ఆశ్రమానికి బయలుదేరాడు. అప్పుడు నిర్మలమైనగాలి వీచింది. ఆకాశంనుండి పుష్పవర్షం కురిసింది. దశరథుని ఇంట మంగళతూర్యరవాలు వినిపించాయి. శంఖాలను మధురంగా ఊదారు. జులపాల జుట్టుతో, దివ్యశోభతో రాముడు విశ్వామిత్రుని అనుసరించాడు. ధనుస్సు చేబట్టి రాముని వెంట లక్ష్మణుడు అనుగమించాడు.

అలా పోతున్న ఆ ముగ్గురు బ్రహ్మదేవుని వెంట వెళ్లు అశ్వనీ దేవతలవలె ప్రకాశించారు. వారి రెండు భుజములపై అమ్ముల పొదులతో కలిసి వారు మూడుముఖాలు ఉన్న పన్నగాలవలె కనిపించారు. వారు ఉడుం చర్మంతో చేసిన తొడుగులు ధరించి ఖడ్గహస్తులై ధనుర్ధారులై విశ్వమిత్రుని వెంట వెళ్లారు.

అలా సరయూనదికి దక్షిణాన ఒకటిన్నర యోజనముల దూరం వారి ప్రయాణం సాగింది. విశ్వామిత్రుడు అప్పుడు "ఓ రామా!" అని ప్రియంగా పలికాడు. "మీరిద్దరూ ఇక్కడ ఆగండి, ఆచమనం చేయండి. నేను మీకు 'బల', 'అతిబల' అను విద్యలను ఉపదేశిస్తాను. వీటివలన మీకు ఆకలి దప్పులుగాని నీరస నిస్పృహలు కాని దరిచేరవు. వీటిని శుద్ధాంత తరంగులై పఠించినచో మిమ్ములను మించువారు ఈ మూడు లోకాలలో ఎవరూ ఉండరు. మీరు నిద్రిస్తున్నప్పుడు ఏమరపాటులో ఉన్నప్పుడు కూడా శత్రువులు మిమ్ములను ఎదురించలేరు. వీటి సాయంతో మీరు పరాక్రమవంతులై రాక్షసపీడను వదిలించండి. మీకు సాటిలేని యశస్సు కలుగుతుంది అని విశ్వామిత్రుడు రామలక్ష్మణులతో చెప్పాడు. లోకకల్యాణార్థం వీటిని ఉపయోగించినచో ఇవి వివిధ రూపాలు పొంది ఉపయోగపడతాయి. కాబట్టి మీరు పరిశుద్ధులై రండి, వీటిని మీకు ఉపదేశిస్తాను" అని విశ్వామిత్రుడు చెప్పాడు.

గురుదేవుని మాటలు అన్నదమ్ములు విన్నారు. స్నానం ఆచరించి పరిశుద్ధ మనస్సుతో భగవద్ధ్యాన పరాయణులయ్యారు. వారిని చూచి విశ్వామిత్రుడు ఆనందించాడు. వెంటనే వారికి 'బల', 'అతిబల' అను విద్యలను ధారపోశాడు. వాటిని గ్రహించిన రామలక్ష్మణులు శరత్కాల సూర్యుని వలె భాసించారు.

ఆ తరువాత తృణశయ్యపై విశ్వామిత్రుని ప్రియవచనాలు ఆలకిస్తూ సుఖంగా నిద్రపోయారు.

* * *

పవిత్రాశ్రమంలో విశ్రమం

సర్గ - 23

ప్రభాతవేళ అయ్యింది. తూర్పువాకిలి వెలుగురేఖల్ని పరుచుకొంటోంది. రామలక్ష్మణులను విశ్వామిత్రుడు మేల్కొలిపాడు. "పురుషశ్రేష్ఠా! లెమ్ము స్నానసంధ్యాదికాలు నిర్వర్తించు" అంటూ రాముని లేపగానే లక్ష్మణుడూ మేల్కొన్నాడు.

ఆ సోదరద్వయం విశ్వామిత్రుని మాటప్రకారం సంధ్యావందనం చేశారు. కాలకృత్యాలు తీర్చుకొన్నారు. మంత్రరాజమైన గాయత్రిని ఉపాసించారు. సూర్యునికి అర్ఘ్యపాద్యాలిచ్చారు. దేవతలకు, ఋషులకు తర్పణం విడిచారు. తర్వాత తపోధనుడైన విశ్వామిత్రుని చెంతకు వచ్చి, నమస్కరించారు.

అలా వచ్చిన ఆ సోదరులను తీసుకుని విశ్వామిత్రుడు ముందుకు ప్రయాణం సాగించాడు. అలా అలా వారు సరయూనది గంగలో సంగమించు ప్రదేశానికి చేరారు. అక్కడ అలరారు ప్రకృతి సోయగాన్ని చూసి పులకించారు. అక్కడే పరిశుభ్రంగా పవిత్రంగా కనబడే ఆశ్రమాన్ని వారు తిలకించారు. "గురువర్యా! ఈ ఆశ్రమం ఎవరిది? ఇక్కడ ఉండే తపోనిష్ఠులు ఎవరో మాకు చెప్పండి" అని వారు అడిగారు. విశ్వామిత్రుడు వారి మాటలు

విని మందహాసం చేశాడు. "రామలక్ష్మణులారా! ఇది పవిత్రాశ్రమం. ఇందులో ఎందరెందరో ఋషీశ్వరులు తపస్సు చేసి పునీతులయ్యారు. పూర్వం కందర్పుడు అనువాడు ఒకడు ఇక్కడ ఉండేవాడు. అతనిని కాముడని అందరూ పిలిచేవారు. అతనికి సుందరమైన శరీరం ఉండేది. ఒకసారి ఇక్కడ శివుడు ఘోరతపస్సు చేశాడు. ఆ సమయంలో శివునికి ఈ కాముడు తపోభంగం ఒనరించాడు. ఆ సమయాన శివుడు క్రుద్ధుడై మూడోకన్ను తెరిచాడు. దానితో ఆ కాముని శరీరం భస్మం అయ్యింది. అశరీరుడై మన్మథనామంతో వాడు ఇక్కడ సంచరించే వాడు. శరీర భాగాలు లేనందున వానిని అనంగుడు అనికూడా పిలిచేవారు. అనంగుడు నివసించిన ఈ ప్రదేశాన్నీ అంగదేశంగా వాసికెక్కింది. శివుని తపోకారణంచే ఇది పవిత్రం అయ్యింది.

ఇప్పటికి ఇక్కడ శివభక్తితత్పరులు, ధర్మపరాయణులు తపస్సు చేస్తుంటారు. మనం కూడా ఈ పవిత్రా శ్రమంలో ఈ రాత్రి విశ్రమిద్దాం. రేపు ఈ గంగను దాటి ఆవలికి వెళ్దాం అన్నాడు.

విశ్వామిత్రుని మాటలు విన్న రామలక్ష్మణులకు శరీరం గగుర్పాటు గురిఅయ్యింది. పవిత్రమైన సంగతిని విని శివునికి వారు నమోవాకములు అర్పించారు. ఆ మహర్షి మాటప్రకారం సాయం సంధ్యాదికాలు ముగించు కున్నారు. ఆ సమయంలో అక్కడ తపస్సు చేసుకుంటున్న వారు, వారి దివ్యదృష్టితో వీరి రాకను గమనించారు. వెంటనే వారందరూ వచ్చి విశ్వామిత్రుని ఆయనతోవున్న రామలక్ష్మణులను సాదరంగా ఆశ్రమంలోకి ఆహ్వానించారు. అర్ఘ్యపాద్యాదులిచ్చి అతిథి సత్కారం చేశారు. వారు విశ్రమించటానికి వసతిని ఏర్పాటుచేశారు. కుశల ప్రశ్నలు వేశారు. సలహా సంప్రదింపులతో కథా కాలక్షేపం చేస్తూ వారందరూ నిద్రకు ఉపక్రమించారు.

* * *

మలదకరూశ ప్రదేశాల ఆవిర్భావం

సర్గ - 24

స్వచ్ఛంగా నిర్మలంగా ఉన్న ప్రాతఃకాలంలోనే రామలక్ష్మణులు నిద్రలేచారు. యథారీతిగా విధులను నిర్వర్తించారు. విశ్వామిత్రునకు నమస్కరించి, ఆయనతోపాటుగా గంగానదీ తీరానికివచ్చారు. అక్కడ ఉన్న మునులందరు వారికి ఒక నావను ఏర్పాటు చేశారు. దాని సహాయంతో ఆవలిఒడ్డుకు క్షేమంగా చేరమని సలహానిచ్చారు. వారు చెప్పిన రీతిగానే విశ్వామిత్రుడు రామలక్ష్మణులు నావలో బయలుదేరారు. నదీ మధ్యమునకు వెళ్లుసరికి పెద్ద శబ్దం వారు విన్నారు. ఆశ్చర్యపడ్డారు.

"గురూత్తమా! ఈ శబ్దం ఎక్కడనుండి వస్తోంది. ఈ ధ్వని విశేషమేమిటో మాకు చెప్పమని" రాముడు అడిగాడు. కుతూహలపడుతున్న ఆ సోదరులతో శబ్దం గురించి ఇలా చెప్పాడు. "రామా! ఒకసారి బ్రహ్మ తన మనఃసంకల్పంతో ఒక సరోవరాన్ని సృష్టించాడు. దానినే మానససరోవరం అని అంటారు. దానినుండి అయోధ్యను

చుట్టూ వున్న సరయూనది జనించింది. ఈ రెండునదులు గంగలో విలీనం అవుతున్నాయి. అప్పుడు ఏర్పడే అలల తాకిడితో ఈ శబ్దం ఉత్పన్నం అవుతోంది. మీరు శ్రద్ధతో ఈ నదుల ద్వయం గంగలో కలియు ఈ ప్రదేశానికి నమస్కరించండి" అని విశ్వామిత్రుడు చెప్పాడు.

వారు నావలో గంగ దక్షిణతీరానికి చేరారు. అక్కడ నిర్మానుష్యంగా ఉన్న ఒక అద్భుత అడవిని చూశారు. కాకులు దూరని కారడవిలాగా నిశ్శబ్దంగా ఉన్న ఈ కాన ఏమిటో అనుకున్నారు. భాంస పక్షుల రొద కఠోరంగా వినిపిస్తోంది. ఏనుగులు, సింహాలు, పులుల్లాంటి అడవి జంతువుల గాండ్రింపులు అడవి అంతా ప్రతి ధ్వనిస్తున్నట్లున్నాయి.

నల్లమద్ది, ఏరుమద్ది, చండ్ర, మారేడు, తుమ్మి, కలిగొట్టు వృక్షాలు ఏపుగా పెరిగి ఉన్నాయి. కాలు పెట్ట లేనంతగా చెట్లు కొమ్మలు, లతలు పెనవేసుకొని ఉన్నాయి. ఇటువంటి అడవిని చూచి రామలక్ష్మణులు ఆశ్చర్యం చెందారు.

రాముడు "ఓ విశ్వామిత్ర మహర్షీ! ఈ సంకీర్ణమైన ఈ కాననం ఎవరిది? ఎందుకిలా నిర్మానుష్యంగా ఉంది. దీని గురించి మాకు చెప్పండి" అంటూ రాముడు అడిగాడు. దానికి విశ్వామిత్రుడు సంతసించాడు. ఇలా చెప్తున్నాడు. పూర్వం ఇక్కడ మలదం, కరూశం అను దేశాలు దేవ నిర్మితాలై ఉండేవి. ఇక్కడ జనులు ధర్మపరాయణులై సకల సంపదలతో నివసిస్తుండేవారు.

ఒకసారి ఇంద్రుడు వృత్రాసుర సంహారంలో బ్రహ్మ హత్యాపాతకాన్ని ఒడిగట్టుకొన్నాడు. దానివలన ఆయనకు విపరీతమైన ఆకలి దప్పులు పుట్టాయి. వాటితో బాధపడుతుండేవాడు. ఇంద్రుడు ఒకసారి ఈ ప్రదేశానికి వచ్చాడు. అప్పుడు ఇంద్రుని బాధను చూడలేక దేవతలు, ఋషులు అతనికి ప్రాయశ్చితం చేశారు. అశుచిత్వాన్ని పోగొట్టారు. దానితో ఇంద్రుని ఆరోగ్యం మెరుగుపడింది. దానికి ఇంద్రుడు సంతోషపడ్డాడు. ఈ మలద కరూశదేశములుగా ఈ ప్రదేశం ఖ్యాతి పొందుతుంది. ఇక్కడి జనులు ధనధాన్యాదులతో నిత్యం తులతూగుతారు అని వరాలు ఇచ్చాడు. అందువలన ఈ ప్రదేశాలు చాలాకాలం ప్రఖ్యాతినొందాయి.

కొంతకాలం తర్వాత వేయి ఏనుగుల బలంవున్న ఒక యక్షిణి తాటకగా ఇక్కడ జన్మించింది. సుందుడను వానికి భార్యైంది. ఆమెకు ఇంద్రునితో సమానమగు పరాక్రమవంతుడగు మారీచుడను ఒక పుత్రుడు కలిగాడు. దానితో ఆమెకు గర్వం అతిశయించింది. ఆ గర్వంతో అక్కడ ఉండే సాధువులను బలిష్ఠములైన బాహువులతో మారీచుడు బాధించేవాడు. కొడుకుకు ధీటుగా తాటక కూడా సాధుపుంగవులను నిర్మూలించడంతో తనవంతు కృషి చేసేది. అట్టి దుర్మార్గులను ఎదిరించడానికి అందరూ భయపడేవారు. ఆ ఘోర రాక్షసకృత్యాల వలన ఇక్కడి వారందరూ పారిపోయారు. కొందరు చనిపోయారు. ఈ తాటకని గూర్చి విన్నవారెవరు ఈ ఛాయలకు కూడా రాకుండా జాగ్రత్తలు తీసుకొంటారు. అందుకే ఈ చక్కని ప్రదేశం నిర్మానుష్యంగా అయ్యింది. ఎందుకూ కొరగాని అడవిగా తయారు అయ్యింది.

ఈనాటికి కూడా ఈ తాటక ఇక్కడే ఉంటూ నరసంచారం జరగకుండా చూస్తోంది. ఈ మారీచుడే నా యజ్ఞానికి విఘ్నాలు కలుగచేసే కంటకుడు అంటూ విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు ఆ ప్రదేశ విశేషాలను చెప్పాడు.

* * *

రాక్షస వధకోసమై విశ్వామిత్రుని ఉద్బోధ

సర్గ - 25

తాటక అను యక్షిణి గురించి విన్న రాముడు విస్మయం చెందాడు. "గురువర్యా! యక్షులు పరాక్రమశాలురు కాదు గదా! అందులోను అబల ఐన తాటక వేయి ఏనుగుల బలమును ఎట్లు సంపాదించినది. ఆమెకు అంత బలం ఎందువలన ప్రాప్తించినదో మాకు చెప్పుము" అని విశ్వామిత్రుని అడిగాడు.

విస్మయానందకరములైన రాముని పలుకులు విశ్వామిత్రుడు విన్నాడు. "నాయనా రామచంద్రా! తాటక ఒక యక్షిణే కాని, ఆమె ఇప్పటి రూపానికి చేష్టలకు వెనుక ఒక వృత్తాంతం ఉంది. ఆలకించు చెప్తాను" అన్నాడు విశ్వామిత్రుడు.

పూర్వం సుకేతుడను యక్షుడు ఉండేవాడు. అతడు పుత్ర సంతానలేమితో బ్రహ్మను గూర్చి ఘోరతపస్సు చేశాడు. అతని తపస్సుకు బ్రహ్మ ప్రీతి చెందాడు. సుకేతుని కోరికను తెలుసుకొన్నాడు. అతనికి ఒక పుత్రికారత్నం జనించేటట్లు అనుగ్రహించాడు; అంతేగాక ఆమెను నాగసహస్ర బలసంపన్నురాలిగా చేశాడు.

ఆమె తాటక. దినదినాభివృద్ధి చెందుతూ రూపయౌవనభరిత అయ్యింది. ఆ తాటకను జంబరాసురుని తనూజుడైన సుందునకు ఇచ్చి సుకేతుడు వివాహం చేశాడు. ఆమెకు మారీచుడను పుత్రుడు కలిగాడు. అతడు అమిత పరాక్రమశాలిగా పేరు పొందాడు. మారీచునకు ఇంద్రుడి సమకాయుడనే గర్వం ఉండేది. ఒకసారి సుందుడు అగస్త్య మహర్షి కోపానికి గురి అయ్యాడు. అగస్త్యుడు సుందుని శపించాడు. దాని కారణంగా అతడు మృత్యుపాలయ్యాడు. దానిని చూచిన మారీచుడు పై బడ్డానికి పరుగెత్తాడు. దాన్ని గమనించిన అగస్త్యమహర్షి రాక్షసుడవు అగుదువుగాక అని మారీచునకు శాపం ఇచ్చాడు.

ఇదంతా తెలుసుకొన్న తాటక ఆగ్రహంతో విచక్షణను కోల్పోయింది. అగస్త్యుని తినివేయాలని అనుకొన్నది. వెంటనే తన వేయి ఏనుగుల బలం కూడదీసుకుని ఆయనపైకి ఉరికింది. వెంటనే అగస్త్యుడు "వికృతరూపిణివై బ్రహ్మరాక్షసివి, నరభక్షకురాలివి అగుదువు గాక!" అంటూ శపించాడు.

తాటక ఆ రోజు నుండి అగస్త్యునిపై కోపం పెంచుకొన్నది. ఆయన పాదంచే పునీతం అయిన ఆ ప్రదేశాన్ని సర్వనాశనం చేయ సంకల్పించుకొంది. ఈ పవిత్రవనాన్ని ఘోరారణ్యం చేసింది. మానవులెవ్వరూ అడుగు పెట్టకుండా వారిని భక్షిస్తూ భయపెడ్తుంది. సాధువులను, మునులను, గోవులను బాధిస్తూ కాలయాపన చేస్తుంది.

కావున నీవు తాటకను సంహరించి గోవులను, సాధువులను కాపాడుము అని విశ్వామిత్రుడు రామునకు చెప్పాడు. అబల అని స్త్రీ అని సంహరించడానికి సందేహించనవసరం లేదు. ఎందుకంటే పూర్వం విరోచనునిసుత మంధర, భూమిని పెకలించాలని ప్రయత్నం చేసింది. దానివలన సాధుజనులు కల్లోలం చెందారు. అప్పుడు ఆ మంధరను ఇంద్రుడు సంహరించాడు.

అదేగాక "రామా! నీవు రాజువు కాబోతున్నావు. రాజధర్మాలలో అన్ని వర్ణాలకు చెందిన వారిని కాపాడడం ముఖ్యమైనది. కావున తాటకవధ ఒనరించుటకు విచారించపనిలేదు" అని చెప్పాడు. అంతేగాదు భృగుపత్ని శుక్రాచార్యుని తల్లి ఉశన. ఈమె ఒకసారి ఇంద్రుని తుదముట్టించాలని అనుకొన్నది. దేవతల వలన రాక్షసుల మనుగడ కష్టసాధ్యమవుతుందని అనుకున్నది. ఇంద్రుని సంహరిస్తే దానవులకు అడ్డు లేకుండా ఉంటుందని ఆలోచించింది. ఆ కోర్కెతో ఆమె తీవ్ర తపమాచరించింది. దీనిని దేవతలు చూశారు. మునులు, దేవతలు ఈ అనాలోచనకు బాధపడ్డారు. ఆమెను నిరోధించకపోతే ప్రకృతి సమతౌల్యం దెబ్బతింటుందని అనుకొన్నారు. వెంటనే వారందరూ విష్ణుభగవానుని ప్రార్థించారు. మహావిష్ణువు లోకకంటకురాలిగా మారబోతున్న ఉశన తల నరికివేశాడు. దీనితో సృష్టి యథాతథంగా నడిచిపోయింది.

రాజు ధర్మవర్తనుడైనప్పటికీ ఒక్కొక్కసారి ప్రజలకోసం క్రూరకార్యాలను నిర్వర్తించాల్సి వస్తుంది. ప్రజాహితాన్ని దృష్టిలో ఉంచుకొన్న తాను చేయకూడని కార్యాలను సైతం చేయాలి. అలాంటప్పుడు రాజధర్మాన్ని నిర్వర్తించిన పుణ్యమే వస్తుంది కాని పాపం ఒనగూడదు. ఇవన్నీ ధర్మసూక్ష్మాలు కావున "ఓ శ్రీరామా! తాటకను నిశ్శంకంగా నిర్మూలించు. దానివలన మునులు, సాధువులు, గోవులు సమస్త ప్రాణికోటి ఆనందిస్తుంది" అని విశ్వామిత్రుడు చెప్పాడు.

* * *

తాటక వధ

సర్గ - 26

విశ్వామిత్రుని మాటలు రాముడు ఆలకించాడు. "గురువర్యా! నా తండ్రి మీ మాటను శిరసావహింపుము అని చెప్పాడు. గురువైన మీ మాట నాకు శిరోధార్యం, కనుక నేను మీ మాట ప్రకారం తాటకను నిస్సందేహంగా నిర్మూలిస్తాను" అని చెప్పాడు.

వింటిని చేత ధరించి, గురువునకు ప్రణామం చేసి, ధనుష్టాంకారం చేశాడు. ఆ ధ్వని తాటకావనమందున్న జంతుజాలములకు భయం గొల్పింది. తాటక కూడా తొట్రుపడింది దిగ్భ్రాంతికి గురైంది. వెంటనే క్రోధం తెచ్చుకుంది. ఎవరీ శబ్దం చేసిందా అని నలువైపుల కలయజూసింది. తన వనంలో అడుగిడిన నరులను చూసి అమిత కుపిత అయ్యింది. తన బలిష్ఠ బాహువులు ఎత్తి రామలక్ష్మణులపైకి వేగంగా పరుగెత్తింది.

దాన్ని చూచిన విశ్వామిత్రుడు హుంకారం చేశాడు. "రామలక్ష్మణులను శుభం కలుగుగాక! ఓ రామా! భయంకరాకారంతో పరిగెత్తి వస్తున్నదే తాటక దానిని నీవు నిర్మూలించు", అని విశ్వామిత్రుడు చెప్పాడు. నీతిమంతుడు, నేర్పరైన రాముడు వికృతరూపిణియైన తాటకను చూశాడు. లక్ష్మణునితో "ఈమె స్త్రీయే కాబట్టి ఈమె భుజశక్తిని, గమనశక్తి నిరోధిస్తాను. ముక్కు చెవులు కోసి ఈమె వెనుతిరిగేటట్లు చేస్తాను" అని చెప్పాడు. తనపై రాళ్ళ వర్షం కురిపించే తాటకను రాముడు బాణం వేసి చేతులను ఖండించివేశాడు. దానితో తాటక క్రోధురాలైంది. తన మాయోపాయంతో నలువైపుల నుండి దుమ్మును లేపి వారిపై ఎగజల్లింది. అలా పైకి వస్తున్న తాటకను లక్ష్మణుడు కోపం చూచి ఆమె ముక్కు చెవులను తన శరంతో కోసివేశాడు.

కామరూపిణియైన తాటక బహురూపములను పొందింది రామలక్ష్మణులకు కనబడకుండా పోయింది. కాని వారిపై ఎగతెగకుండా రాళ్ళ వర్షాన్ని కురిపించసాగింది. విశ్వామిత్రుడు పరిస్థితిని అవలోకించాడు. రాముని కనికరాన్ని గ్రహించాడు. "ఓ రామా! నీవు స్త్రీ అని దయ చూపుతున్నావు. కాని, సంధ్యాసమయం వస్తోంది. అప్పుడు రాక్షసి ఐన తాటక బలాన్ని పుంజుకొంటుంది. యజ్ఞవిఘ్నం చేస్తున్న ఈ తాటకను నిర్దయతో చంపివేయి" అని ప్రోత్సహించాడు.

వెంటనే రాముడు శబ్దభేదిని ఉపయోగించి తాటకపై బాణం వేసి, ఆమె రాళ్ళ వర్షంను నిరోధించాడు. దానికి తాటక కోపం తెచ్చుకొన్నది. వెంటనే రామలక్ష్మణులను మ్రింగివేద్దామని పైకి పరుగెత్తింది. వెంటనే దానిని గమనించిన రాముడు వింటిని సంధించి తన శరంతో తాటక వక్షస్థలంను కొట్టాడు. భయంకరమైన తాటక నేలకొరిగి ప్రాణం విడిచింది.

దానిని చూచిన దేవతలందరూ రాముని ప్రశంసించారు. విశ్వామిత్రుని కొనియాడారు. విశ్వామిత్రుని వారందరూ పూజించారు. "సాధుశ్రేష్ఠా! దైవకార్యనిమిత్తం జన్మించిన ఈ రామునకు భృశ్వాశుని అస్త్రాలన్నింటిని రామునకు ఉపదేశింపుము. త్వరలో దేవకార్యాన్ని తలపెట్టే రాముని ఆశీర్వదించుము" అని చెప్పారు.

రామలక్ష్మణులను చూచి దేవతలందరు సంతోషంగా "కీర్తిప్రతిష్ఠలు కలుగుగాక! ఇనవంశతిలకులై జీవించుదురు గాక!" అంటూ వారిని దీవించారు.

సంతోషాంతరంగుడైన విశ్వామిత్రుడు తన శిష్యులను ప్రేమగా దగ్గరకు తీసుకొన్నాడు. వారిని ఆలింగనం చేసుకొన్నాడు. ఆశీర్వదించాడు. "నాయనలారా! సాయం సమయం కాజొచ్చింది. మనం ఈ రాత్రికి ఇచ్చటనే ఉండి తెల్లవారిన తర్వాత మన ఆశ్రమానికి వెళ్దాం" అని చెప్పాడు.

గురువు ఆజ్ఞను పాటించిన రామలక్ష్మణులు విశ్వామిత్రునకు మోకరిల్లారు. "మీరు చెప్పినట్లుగానే ఆచరిస్తాం" అని అన్నారు. సంధ్యావందనాలకు పూనుకొన్నారు.

ఆ అడవి అంతా మబ్బు వీడిన ఆకసం వలె ప్రకాశించింది. అందులో మృగాలన్నీ నిర్భయంగా సంచరించాయి. అలా వారు రాత్రిని హాయిగా గడిపారు.

* * *

దివ్యాస్త్ర ప్రదానం

సర్గ - 27

విశ్వామిత్రుడు పూర్ణచిత్తుడై మేల్గాంచాడు. రామలక్ష్మణులు తమ విధులను నిర్వర్తించారు. వినయవంతులై నిలబడిన సోదరులను విశ్వామిత్రుడు సాదరంగా చూశాడు. దివ్యాస్త్రాలను ఇవ్వడానికి సమాయత్తం అయ్యాడు.

"ఓ రఘునందనా! నేను నీకు ప్రదానం చేసే ఈ అస్త్ర సంపద నిన్ను దివ్య పురుషునిగా చేస్తుంది. దేవతలకు సైతం నిన్ను ఎదిరింప శక్యం కాదు" అని విశ్వామిత్రుడు చెప్పి "రామలక్ష్మణులారా! తూర్పు ముఖంగా ఆసీనులయ్యి భగవంతుని ధ్యానించండి" అని చెప్పాడు.

రామలక్ష్మణులు పూర్వాభిముఖులయ్యారు. అంజలి ఘటించారు. అప్పుడు విశ్వామిత్రుడు దండ చక్రంను ధర్మ, కాల, విష్ణు చక్రాలను, ఇంద్రాస్త్రమును తీసుకొనుము. ఇవి చాలా తీక్షణ ప్రభావం కలవి అని చెప్పాడు.

"ఓ రాజకుమారులారా! మీకిద్దరికి 'మోదక' 'శిఖరి' అను గదలను ప్రదానం చేస్తున్నాను, స్వీకరించండి" అన్నాడు.

"ఓ కాకుత్స్థ వీరులారా! వాయువ్యాస్త్రం హయశిరస్సను క్రౌంచాస్త్రంను, విష్ణుశక్తి, శివశక్తి అను అస్త్రములు తీసుకోండి. వీటి వలన నీవు అప్రమేయ ప్రతిభాశాలురు అవుతావు. నేను ఇచ్చే ఈ అస్త్రాలన్నింటిని లోకకల్యాణార్థం ఉపయోగించి జనులను ఎల్లవేళలా కాపాడుము" అని చెప్పాడు.

"రామా! రాక్షసుల దగ్గర ఉండే కంకాళం, ముసలం, కాపాలం, కంకణములను కూడా నీకు ప్రదానం చేస్తాను. విద్యాధరులు, గంధర్వులు, ఉరగులు ఉపయోగించే నందనం మహాస్త్రం నీకు ఇస్తున్నాను స్వీకరించు" అన్నాడు.

నిద్రను సైతం అదుపులో ఉంచుకోదగిన అస్త్రరాజములైన మానవాస్త్రం సౌరాస్త్రములను కూడా నీకు అనుగ్రహిస్తున్నాను. వర్ణం, శోషణం, సంతాపం, విలాపం అనే అస్త్రాలు దివ్యతేజోమయమైనవి. వీటినన్నింటిని నీవు గ్రహించు ఎల్లవేళలా ప్రజలను కాపాడు బాధ్యతను సరిగ్గా పాటించు" అని విశ్వామిత్రుడు చెప్పాడు.

మన్మథుని మదనం పిశాచాలకు ఇష్టమైన 'మోహన'మగు అస్త్రాలను కూడా శ్రీరాముని పరం చేశాడు.

శత్రువులను మట్టి కరిపించే తేజఃప్రభు అస్త్రం, సంవర్తనం, మౌసలం, సత్యాస్త్రం, మాయాధరం అను అస్త్రాలన్నింటిని శ్రీరాముని దత్తం చేశాడు.

సోమదేవత ఆధీనంలో ఉండే శిశిరం, విశ్వకర్మ నిర్మితం ఐన సుదారణం, భగదేవతదైన దారుణం, మనువుకు సంబంధించిన శీతేషువు అను అస్త్ర సంచయాన్ని రామునకు ఇచ్చివేశాడు. ఇలా అన్ని అస్త్రశస్త్రాలను, ఖడ్గాలను శ్రీరామునకు ప్రదానం చేశాడు.

తర్వాత అస్త్ర దేవతలను శ్రీరాముని ఆజ్ఞలో ఉండునట్లు చేయడానికి విశ్వామిత్రుడు వాటిని స్మరించాడు. ఆ అస్త్ర మంత్రాధిష్ఠాన దేవతలందరు శ్రీరామునకు దగ్గరకు వచ్చి అంజలి బద్ధులయ్యారు. వారందరూ త్రికరణ శుద్ధిగా "రామచంద్రా! మేమందరం మీ కింకరులమవుతాం. మేము ఆజ్ఞలను శిరసావహించి మీ కార్యాన్ని సఫలం చేస్తాం" అని చెప్పాయి. ఆ అస్త్రాలన్నింటిని గ్రహించి శ్రీరాముడు నేను స్మరించినంత మాత్రాన్నే మీరు నన్ను చేరండి అని ఆజ్ఞాపించాడు.

దివ్యాస్త్ర సంపదతో రామలక్ష్మణులు ప్రసన్న వదనంతో విశ్వామిత్రునకు పాదాభివందనం చేశారు. "గురువర్యా! మేము సర్వదా మీ సేవకులం మీ ఆజ్ఞలను పాటించు శక్తిని మాకు ఒసంగుము" అని వినయంగా ప్రార్థించారు.

గుణసంపన్నుడైన శ్రీరాముని మాటలు విశ్వామిత్రుడు ఆలకించాడు. సంతుష్టాంతరంగులై ఆ ముప్వురూ ప్రయాణం సాగించారు.

* * *

ఉపసంహార విద్యా ప్రదానం

సర్గ - 28

దివ్యాస్త్రాలన్నింటిని ప్రసాదించి, పయనం సాగిస్తున్న విశ్వామిత్రుని రామలక్ష్మణులు అనుసరిస్తున్నారు. మార్గమధ్యంలో శ్రీరాముడు "ఓ గురువర్యా! నీవు ప్రసాదించిన అస్త్రాలతో నేను అమిత తేజోబలుడిని అయ్యాను. కాని వీటి ఉపసంహారం తెలియక నా మనస్సు ఆందోళనగా ఉంది. కావున ఈ అస్త్ర శస్త్ర ఉపసంహారాలను నాకు ఉపదేశించు స్వామీ" అని శ్రీరాముడు వినమ్రతతో అడిగాడు.

ఆ పలుకులు విన్న మునిశ్రేష్ఠుడు "ఓ ఇనవంశోద్ధారకా రామా! నీ అంతరంగం నాకు అవగతం అయ్యింది. ఇప్పుడే అస్త్ర ఉపసంహార విద్యలను బోధిస్తాను విను" అని చెప్పాడు.

విశ్వామిత్రుని ఆదేశంతో ఉపసంహార మంత్రానుష్ఠాన దేవతలందరూ శ్రీరాముని ముందు ప్రత్యక్షం అయ్యారు. "అయ్యా రామచంద్రా! మేము చేయవలసిన పనిని మాకు ఆదేశించు" అని అన్నారు.

శ్రీరాముడు జ్యోతిషం, విధూతం, సర్వనాభం వరణం లాంటి ఉపసంహార అస్త్ర దేవతలను చూచి "మీరందరూ నా స్మృతిపథంలో ఉండి అవసరార్థం నాకు ఉపయోగపడండి. ఇప్పుడు మీ ఇచ్చ వచ్చినచోటుకు వెళ్ళండి" అని చెప్పాడు. రాముని ఆజ్ఞను విని ఆ అస్త్ర దేవతలు వెనుదిరిగారు. విశ్వామిత్రుడు ముందుకు సాగాడు. శ్రీరాముడు ప్రయాణంలో తాను నేర్చుకొన్న అస్త్రశస్త్రాలను అన్నింటిని తన ప్రియసోదరుడైన లక్ష్మణునకు ఉపదేశించాడు. లక్ష్మణుడు కూడా వాటినన్నింటిని వినయపూర్వకంగా స్వీకరించాడు.

వారి ప్రయాణం ప్రశాంత వనాలలోకి ప్రవేశించింది. వినిర్మల శోభతో ఉండే ప్రకృతిని చూసి ఆనందపడుతూ శ్రీరాముడు "గురువర్యా! మనం తాటకావనం దాటామని నేను అనుకొంటున్నాను. ప్రశాంతంగా నిర్మలంగా ఉన్న

ఈ వనం ఎవరిది? ఇక్కడ ఏ ఆశ్రమవాసులు జీవిస్తున్నారో నాకు తెలపండి. నానావిధ పక్షుల కిలకిలరావాలు మృగ సంచారం, వృక్ష సముదాయం నా మనస్సుకు ఆనందం కలిగిస్తోంది. దీనిని గురించిన వివరం మాకు చెప్పండి" అని విశ్వామిత్రుని శ్రీరాముడు అడిగాడు. "ఓ గురువర్యా! మీ ఆశ్రమం ఏది? మీ యజ్ఞాలకు విఘ్నాలు కలిగించు దానవులను ఎప్పుడు నిర్మూలించాలి? వారు ఉండు ప్రదేశం ఏదో మాకు తెలపండి" అని ఉత్సాహంతో రాముడు విశ్వామిత్రుని అడిగాడు.

* * *

సిద్ధాశ్రమ వృత్తాంతం

సర్గ - 29

వనాలను గూర్చి అడుగుతున్న రామలక్ష్మణుల ఉత్సాహం తీర్చుటకై విశ్వామిత్రుడు ఇలా చెప్పాడు. "రామచంద్రా! దేవాదిదేవుడు శ్రీమన్ మహావిష్ణువు వేలయుగాలు ఇక్కడనే తపస్సు చేశాడు. వామనావతారం ముందు కాశ్యప మహర్షి ఇక్కడే విష్ణు ప్రీత్యర్థం తపమాచరించాడు." "శ్రీరామా! ఆ కాలంలో ప్రహ్లాదుని మనుమడు విరోచనుని కొడుకు బలిచక్రవర్తి మరుద్గణాలనే దేవతలను జయించి ముల్లోకములను ఏకచత్రాధిపత్యంగా పాలిస్తుండేవాడు. ఆ కాలంలో బలిచక్రవర్తితో బాధలు పొందిన తాపసులు దేవతలు విష్ణువును మమ్ము కాపాడమని ప్రార్థించారు. బలిచక్రవర్తి తన కీర్తిని పెంచుకొనవలెననే దృష్టితో దాన కార్యాన్ని చేసేవాడు. ఆ విషయాన్ని విష్ణువుకు దేవతలు చెప్పారు. అప్పుడు కశ్యపుడు విష్ణువు దగ్గరికి వచ్చి "ఓ భగవంతుడా! ముల్లోకాలను పాలించే దేవా! మమ్మల్నందరిని కాపాడు. నీవు నా కుమారుడిగా అవతరించు. బలిచక్రవర్తి చేత దానం స్వీకరించి అతనిని నిరోధించు" అని కశ్యపుడు విష్ణువును ప్రార్థించాడు. అతిథి కశ్యపులు విష్ణువును వామనుడిగా అవతరించి మమ్ము కాపాడమని అభ్యర్థించారు. దేవతలు సైతం వామనుడివై మా బాధలను నివారించు దేవా అని పదే పదే అడిగారు. విష్ణువు వారి ప్రార్థనలను మన్నించాడు. అలా ఈ ఆశ్రమంలో విష్ణువుకోసం తపస్సు చేసి సిద్ధి పొందాడు కశ్యపుడు. అందుకే ఈ ఆశ్రమం సిద్ధాశ్రమంగా ఆనాటినుంచి ప్రసిద్ధికెక్కింది. ఆ తరువాత వామనుడై మహావిష్ణువు అదితి కశ్యపులకు మోదం కలిగించాడు. వారి కొడుకై వారి కోరికను తీర్చాడు. ఉపనయనాది సంస్కారాలను చేసుకొని వటువై బలి దగ్గరకు వెళ్ళాడు. అప్రమేయ దానశీలియై బలిని మూడడుగులు దానం ఇవ్వమని అడిగాడు. మూడడుగులతో ముల్లోకాలను ఆక్రమించి, అందరికి విస్మయం కూర్చాడు. బలిని పాతాళానికి పంపించి అతని పరాక్రమానికి అడ్డు నిలిచాడు. వామనుని పాద స్పర్శతో ఈ భూమి పవిత్రమైంది. నేనూ ఆ మహావిష్ణువు శక్తికి తలవంచాను. స్థాణ్వాశ్రమాన్ని వీడి ఈ సిద్ధాశ్రమాన్ని నా నిలయం చేసుకొన్నాను. ఇక్కడే నా తపస్సును యజ్ఞాన్ని సాగిస్తున్నాను. ఈ ప్రదేశంలోనే రాక్షసులు నా యాగానికి అడ్డంకులు ఏర్పరుస్తున్నారు. "రామా! నీవు వారినందరిని నిర్మూలించు. నీకు శుభం కలుగుతుంది. నా కోర్కె ఈడేరుతుంది. నా యజ్ఞ పరిసమాప్తి చెంది లోక కల్యాణం జరుగుతుంది" అని విశ్వామిత్రుడు శ్రీరామునితో చెప్పాడు. అదంతా శ్రద్ధతో

రామలక్ష్మణులు విన్నారు – "గురువర్యా! నీవు త్వరగా యాగదీక్షను స్వీకరించు. నీవు నిర్విఘ్నంగా యజ్ఞప్రక్రియను కొనసాగించు. మేమిద్దరం నీ యజ్ఞానికి ఆటంకం కలుగకుండా అహర్నిశం రక్షిస్తాం" అని చెప్పారు. అప్పుడు మంచు తొలగిన ఉదయాద్రివలె విశ్వామిత్రుడు అగుపించాడు. వీరి రాకను తెలుసుకొన్న అక్కడి మునులు వచ్చి వీరికి స్వాగత సత్కారాలు చేశారు. మరుసటి ప్రొద్దున్న కాలకృత్యాలు తీర్చుకొన్నారు. ఉదయ సంధ్యావందనాలు అనుష్ఠించారు. గాయత్రీ మంత్రం పఠించారు. రామలక్ష్మణులు విశ్వామిత్రుని కడకు వచ్చి అంజలి బద్ధులై నిలబడ్డారు. అంతలో విశ్వామిత్రుడు ఆపోశనాది క్రియలు ఒనర్చాడు. యోగదీక్షను స్వీకరించాడు. అగ్నికార్యాలు చేశాడు. యజ్ఞానికి ఉపక్రమించుతున్న విశ్వామిత్రుడు సోదరులను చూచి ఆశీర్వదించాడు. యాగరక్షణలో సఫలీకృతులు అవ్వండి అని పలికాడు.

* * *

యాగరక్షణ

సర్గ – 30

లౌకిక జ్ఞానం కలిగిన రామలక్ష్మణులు విశ్వామిత్రుని ఆజ్ఞకై నిలబడ్డారు. అక్కడున్న మునులు రాజకుమారులను చూచి ముచ్చటపడ్డారు. విశ్వామిత్రుడు నేటినుంచి ఆరు దినాలవరకు మౌనాన్ని యాగదీక్షగా తీసుకొన్నారు. మీరు ఈ ఆరు దినములు చాలా జాగ్రత్తగా యాగపరిరక్షణ కావించాలి అని చెప్పాడు.

వారి మాటలు విన్న రామలక్ష్మణులు మేము రాత్రీ పగలూ యజ్ఞాన్ని కాపాడుతూ ఉంటాము. మీరు మీ పనులను ఆరంభం చేసుకోండి అని చెప్పారు.

ఐదు దినాలు యాగం నిర్విఘ్నంగా సాగింది. ఆరవనాడు రాముడు లక్ష్మణునితో "నీవు చాలా జాగ్రత్తగా ఈ పరిసరాలను గమనించు; ఈ దినం రాక్షసులు వచ్చే అవకాశం ఉంటుంది" అని చెప్పాడు. అలా వాళ్ళు మాట్లాడుకొంటున్న సమయంలోనే విశ్వామిత్రుడు యాగం చేస్తున్న వేదిక ఒక్కసారిగా ప్రజ్వరిల్లింది. ఆ యాగకుండంలోని అగ్నికీలలు ఎత్తుగా లేచాయి. అక్కడేవున్న మునులు దాన్ని గమనించారు. అది చూచినవారు ఇది జరగబోయే ఉత్పాతానికి సంకేతమని చెప్పారు.

మరింత జాగ్రత్తగా రామలక్ష్మణులు పరిసరాలను పరిరక్షిస్తూ ఉన్నారు. అంతలో భీకరమైన శబ్దాలతో ఆకాశం ఒక్కసారిగా దద్దరిల్లింది. ఊకుమ్మడిగా రాక్షసులు మాయోపాయాలతో ఆకాశాన్ని ఆవరించారు. కుండలతో రక్తాన్ని వర్షించసాగారు. దీన్నిచూచిన రాముడు క్రుద్ధుడై మానవాస్త్రం సంధించి మారీచుని వక్షస్థలాన్ని కొట్టాడు. అది శీతేషు నామం కలది. అది మారీచునికి నిస్పృహను కలిగింపజేసి నూరు యోజనాల దూరం తీసుకొనిపోయి సముద్రం మధ్యలో పడవేసింది. దాన్ని చూస్తున్న లక్ష్మణునితో రాముడు "లక్ష్మణా! ఈ శీతేషు అనే మానవాస్త్రం

శత్రువును చంపివేయదు కాని చైతన్యం కోల్పోయేలాగా చేసి భీతిని కలుగజేస్తుంది. దూరంగా తీసుకొని పోయి విడిచి పెడుతుంది. ఇది ధర్మసంయుక్తమైన అస్త్రంగా కనిపిస్తుంది. ధర్మం కూడా మనిషి పరివర్తనను కోరుకొంటుంది.

రామలక్ష్మణులు చెల్లాచెదరైన రాక్షసులను చూశారు. మారీచుని దెబ్బ చూచి వీరు భయపడినట్లు ఉన్నారు. వీరిని కూడా మనం హతమార్చవలెను అని అంటుండగానే ఆ దానవులు మళ్ళీ గుమికూడారు.

యజ్ఞానికి విఘ్నం కలిగించటానికి మాయలను పన్నుతున్నారు. దానిని సోదరులు చూశారు. వెంటనే చేతిన ఉన్న ధనుస్సును ఎక్కుపెట్టారు. ఆగ్నేయాస్త్రం వాయువ్యాస్త్రాలను సంధించి రాక్షసులందరిని పడవేశారు. ఆగ్నేయాస్త్రం దెబ్బకు సుబాహువు నేలకొరిగాడు. ఇలా రాక్షసుల పీడ అంతం అయింది.

దానిని చూసిన మునులు సంతోషంతో రామలక్ష్మణులను కొనియాడారు. దేవతలందరూ ఇంద్రుని పూజించినట్లు, రాముడిని మునులు దేవతలు ప్రశంసించారు. యాగం పరిసమాప్తం అయింది. దిక్కులన్నీ తమ బాధలను తీర్చుకొన్నట్లుగా వెలుగొందాయి. తన కోరిక తీరినందుకు విశ్వామిత్రుడు సంతోషించాడు.

యాగరక్షణకు చేసిన తన శిష్య పరిమాణువులకు తన దివ్యాశీస్సులను విశ్వామిత్రుడు అందజేశాడు. "ఓ శ్రీరామా! నీ తండ్రి ఇచ్చిన మాటప్రకారంగా నడుచుకొన్నావు. నిర్విఘ్నంగా యాగం సమాప్తి అయింది. నీ చర్యతో ఈ ఆశ్రమానికి సిద్ధాశ్రమం అన్న పేరు సార్థకం అయ్యింది. నీ ఖ్యాతి ఇనుమడించింది" అని విశ్వామిత్రుడు రాముని కొనియాడాడు.

* * *

విశ్వామిత్రాదుల మిథిల ప్రయాణం

సర్గ - 31

యాగసమాప్తితో విశ్వామిత్రాదులు సంతోషపడ్డారు. రామలక్ష్మణులు గురు కార్యమును నిర్వర్తించామని ఆనంద చిత్తులయ్యారు. అందుకే వారందరూ మనశ్శాంతితో హాయిగా ఆ రాత్రి యజ్ఞశాల పరిసరాలలో నిద్రించారు.

తెల్లారింది. వేకువనే మునిగణం లేచింది. తమ అనుష్ఠానాదులను పూర్తిచేసుకొన్నారు. రామలక్ష్మణులు గురువుల మాదిరిగానే తమ నిత్య విధులను నిర్వర్తించారు. అందరూ గాయత్రిని ఉపాసించారు. అందరూ విశ్వామిత్రుని చెంతకు వచ్చారు. రామలక్ష్మణులు మునిగణానికి చేతులెత్తి మ్రొక్కారు. "గురువర్యా! మేము చేయవలసిన కార్యం తెలిపినట్లయితే సంతోషంగా నిర్వర్తిస్తాం ఆజ్ఞ ఇవ్వండి" అన్నారు.

వారి మాటలు విశ్వామిత్రుని మనస్సును ఆహ్లాదపరిచాయి. వారిని ఆ సాధువు ఆశీర్వదించాడు. "నాయనా! నేను సంకల్పించిన కార్యం నెరవేరింది కదా! ఇక మేము హిమవత్ పర్వత సానువులకు వెళ్తాం" అని చెప్పాడు. అప్పుడు అక్కడున్న మునులు విశ్వామిత్రా! మిథిలలో జనకుడు చేయుచున్న యాగం చూడాలనే కోర్కె మాలో కలుగుతోంది అని చెప్పారు.

దాంతో విశ్వామిత్రుడు " రామలక్ష్మణులారా! మేము వెళ్ళు ఉత్తర దిశలోనే మిథిలానగరం ఉంది. రాజర్షియైన జనకుడు యాగం చేస్తున్నాడు. మీరుకూడా మాతో రండి యాగం చూడవచ్చు. అంతేగాక దేవదత్తం అయిన శివధనుస్సు ఆయన ఇంటనే ఉంది. అది గొప్ప ధనువు దానిని మీరు చూడవచ్చు. ఎందరో యోధానుయోధులు దానిని ఎత్తలేక పోయారు. ఆ ధనుస్సు చాలా పవిత్రమైంది. ధనుర్యాగంలో జనకుడు దానిని పూజించాడు" అని విశ్వామిత్రుడు చెప్పాడు.

ఇదంతా విన్న రామలక్ష్మణులు ఉత్సాహపడ్డారు. "గురువర్యా! ఆ శివధనుస్సు జనకునికి ఎలా లభించిందో తెలపండి స్వామీ" అని విశ్వామిత్రుని అడిగారు. శివచాప వృత్తాంతాన్ని తెలుసుకోవాలని ఉబలాటపడుతున్న రామలక్ష్మణులను చూసి విశ్వామిత్రుడు ఇలా చెప్పాడు.

"రామా! పూర్వం మిథిలాధిపతియైన దేవరాతుడు యజ్ఞం చేశాడు. ఆ యజ్ఞ ఫలంగా దేవతలు అతనికి ఈ శివచాపాన్ని బహూకరించారు. దీనిని గంధర్వులే ఎత్తజాలరు. దీనిని మీరును చూడవచ్చు. మీరు కూడా బయలుదేరండి" అని చెప్పాడు.

ఆ ఉత్సాహంతో రామలక్ష్మణులు విశ్వామిత్రుని వెంబడించారు. బ్రహ్మవాదులందరూ తమ తమ యజ్ఞ సంబారాలను వంద బండ్ల నిండా నింపారు. ప్రయాణానికి సన్నద్ధం అయ్యారు. విశ్వామిత్రుడు "వనదేవతలారా! మీరు క్షేమంగా ఉండండి. ఈ సిద్ధాశ్రమం నా సంకల్పాన్ని నెరవేర్చింది. నేను ఇప్పుడు గంగానది ఉత్తర తీరమందున్న హిమాలయాలకు వెళ్తున్నాను" అని వనదేవతలను, వృక్షరాజాలను జంతుజాలాన్ని ఆశీర్వదించాడు. ఆ మహామహుని వెంట కొన్ని వనచరాలు అనుగమించాయి. వాటిని చూసి విశ్వామిత్రుడు వాత్సల్యంతో నిమిరి మీరు మీ మీ స్థానంలోనే ఉండండి. నాతో రావడంకన్నా మీరు ఇక్కడ ఉండడమే క్షేమకరం అని చెప్పాడు. అవన్నీ తలలు వూపాయి. విశ్వామిత్రుని ఆజ్ఞను పాలించాయి.

ఆ తర్వాత మునిజనమంతా మిథిలకు బయలుదేరారు. సాయంకాలానికి శోణానదీతీరానికి చేరారు. అక్కడి ప్రకృతి రమణీయంగా కనిపించింది. ఆ తరువులు చల్లని స్పర్శతో వారిని పలకరించాయి. వాయువు సుతిమెత్తగా స్పృశించి వారికి స్వాగతం పలికింది.

ఆ శోణానదీ తీరం నిర్మలంగా కనిపించింది. ఆ నీరు సత్పురుషుని హృదయంవలె రూపుగాంచింది. ఆ ప్రకృతికి తన్మయులైన వారు తమ సంధ్యావందనాది క్రియలను జరిపారు.

రాత్రి సమీపిస్తుండటం చూశారు. ఆకాశంనుండి ఇరులు భూదేవిని చుట్టుముట్టడం గమనించారు. విశ్వామిత్రుడు ఈ రాత్రికి మనమందరం ఇక్కడే విశ్రమించుదాం. ఈ రమణీయకతను ఆస్వాదించుదాం అని చెప్పాడు.

రామలక్ష్మణులు ఈ ప్రదేశం యొక్క విశిష్టతను మాకును వివరించండని ఎప్పటిలాగా తమ గురువును అని అడిగారు. మహాతపశ్శాలి గాధిసుతుడు ఆ ప్రదేశం యొక్క కథను వారికి వినిపించడానికి ఉద్యుక్తుడయ్యాడు.

* * *

వాయుదేవుని అకృత్యం

సర్గ - 32

బ్రహ్మమానసపుత్రుడు కుశుడను ఒక తపశ్శాలి ఉండేవాడు. ఇతడు మూర్తీభవించిన ధర్మమూర్తి. నియమ నిష్ఠలతో వ్రతాచరణంతో తన జీవనాన్ని సాగించేవాడు. ఈ అయోనిజునికి విదర్భ రాజసుత వైదర్భి భార్య. ఈమె భర్తకు తగిన ఇల్లాలుగా ఉండేది. వీరిద్దరికి కుశాంబుడు, కుశినాభుడు, అధూర్తరజసుడు, వసువు అను పుత్రులు కలిగారు. వీళ్లు ధర్మవర్తనంలో తల్లిదండ్రులను మించినవారు. మహాతేజశ్శాలురైన వీరు అందరికి ప్రియం ఒనర్చే పనులను చేసేవారు.

ఒకనాడు కుశుడు తన పుత్రులను పిలిచి ధర్మం తప్పకుండా మీరు రాజ్యపాలన చేయండి. మీ మీ రాజ్యంలోని పౌరులందరూ ధర్మాచరణులుగా ఉండేలాగా మీరు ప్రవర్తించండి అని చెప్పాడు. వారు తండ్రి మాటప్రకారం కౌశాంబీ, మహోదయం, ధర్మారణ్యం, గిరివ్రజపురాలను నిర్మించారు. ఆ యా రాజ్యాలలో వారు సుఖంగా కాలం గడిపేవారు.

మగధదేశంలో ఈ శోణనది పుట్టి సుమాగధీ అనే నామాంతరంతో ఐదు పర్వతాల మధ్య ప్రవహిస్తూ ఒక పుష్పమాలవలె ప్రకాశిస్తోంది. దీనివలన ఇక్కడ భూమి సస్యశ్యామలమై అలరారుతోంది. ఇక్కడి ప్రజల ఈ నదీమతల్లిచే పునీతులవుతున్నారు.

కుశనాభునికి ఘృతాచి అను కన్యారత్నంతో వివాహం అయ్యింది. ఆమె నూర్గురు పుత్రికలకు జన్మనిచ్చింది. వారందరూ రూప సౌందర్యాలలో పేరుగాంచారు. వీణావాదనాది గానాలు ఆలపించడంలో ప్రఖ్యాతి పొందారు. నృత్యాలు చేయడంలో యక్షులను మురిపించేవారు.

ఆ కుశనాభుని కుమార్తెలు యౌవనవతులయ్యారు. తమ రూపలావణ్యాలకు సుగంధభరితమైన పుష్పమాలికలతో ఆభరణాదులతో మెరుగులు దిద్దారు. ఒకప్పుడు వారందరూ ఒకసారి నందనోద్యానంలో ఆడుతూ పాడుతూ కాలం గడిపారు. వారందరూ తమ శోభలతో మింటిలోని చుక్కలవలె కనిపించసాగారు.

వారినందరిని వాయుదేవుడు చూశాడు. మోహపాశానికి బద్ధుడయ్యాడు. కామవికారాన్ని పొందాడు. వారి దగ్గరకు వచ్చి వారి రూపలావణ్యాతిశయాన్ని పొగిడాడు. "ఓ పడుచులారా! మీ అందంతో నా మనస్సు దోచారు. మీ యౌవనం అట్టేకాలం నిలవదు. అప్పుడు ఈ రూపాన్ని పొగొట్టుకొని దుఃఖం పొందుతారు.

మీరు నన్ను చేబట్టితే మీరు కీర్తిమంతులు అవుతారు. మీ యౌవనం అక్షయం అవుతుంది. నాకోర్కెను తీర్చి దేవతలు కండి" అని అడిగాడు. దానికి ఆ రాజకుమార్తెలు నవ్వారు.

"ఓ వాయుదేవా! నీ శక్తి సామర్థ్యాలు మాకు తెలుసు. నిన్ను నిరోధించే శక్తి మాకున్నది. కాని మేము నీలాంటి దురాత్మునికి దండన విధించి మా తపఃశక్తిని పోగొట్టుకోలేం. మేమందరం మా తండ్రి అధీనంలో

పెరుగుతున్న కన్యలం. కనుక నీవు మా తండ్రి దగ్గరకు వెళ్ళి నీ కోర్కెను తెలుపు. మేము మా తండ్రి కోరిన విధంగా పతులను స్వీకరిస్తాం కాని, మాకు ఇష్టం వచ్చిన రీతిగా మేము ప్రవర్తించం. నీ కోర్కె సబబైనచో మా తండ్రి దగ్గరకు వెళ్ళు. మా చెంతకు వచ్చి మమ్ములను ఇబ్బంది పెట్టకు" అని సున్నితంగా చెప్పారు.

మోహంలో కూరుకుపోయిన పవనుడు విచక్షణను కోల్పోయాడు. ఆ కుశనాభ కుమార్తెలలో ప్రవేశించాడు. వారినందరిని బాధించాడు. వారికి అవయవ లోపం కలిగించాడు. వారందరూ గూనివారయ్యారు. తమ స్థితికి వేదన చెందారు. వారి అంతఃపురానికి వెళ్ళారు. నేలపై బడి దొర్లి కన్నీరు మున్నీరుగా విలపించారు.

బాధతో తల్లడిల్లుతున్న కుమార్తెలను కుశనాభుడు చూశాడు. "అయ్యో! మీకు ఈ గతిని కలిగించిన పాపాత్ముడు ఎవరు? ధర్మపరాయణులైన మీపై కక్ష పెంచుకొన్నది ఎవరో నాకు చెప్పండి. నేను వారిని తుదముట్టిస్తాను" అని దుఃఖంతో కుశనాభుడు అడిగాడు.

* * *

కుశనాభ కుమార్తెల వివాహం

సర్గ - 33

కుశనాభుని మాటలతో వారు ధైర్యం తెచ్చుకొన్నారు. స్వస్థత పడ్డారు. "తండ్రీ! సర్వవ్యాపి ఐన వాయుదేవుడు అపమార్గం అవలంబించాడు. మమ్ములను కోరాడు. మేము మా తండ్రిని అడుగు. మా తండ్రి ఇష్టపడి కన్యాదానం చేసినచో నిన్ను అంగీకరిస్తాం అని చెప్పాం. మా మాటలను వాయువు వినలేదు. అతనిని నిరాకరించినందువల్ల మమ్ము కుబ్జలుగా చేసి పీడిస్తున్నాడు" అని చెప్పారు. తన తనయుల క్షమాగుణం చూసి కుశనాభుడు ఆనందం పొందాడు."తల్లులారా! మీ బాధలు త్వరలోనే ఉపశమిస్తాయి. ధర్మంతో ప్రవర్తించి మన వంశ గౌరవాన్ని నిలబెట్టారు. ఐకమత్యంతో మీరందరూ ఏకత్రాటిపై నిలబడ్డారు. ఆ ధర్మమే మిమ్ము రక్షిస్తుంది.

క్షమాగుణం అన్ని ఐశ్వర్యాలలో కెల్లా గొప్పది. క్షమవలనే ఈ భూమి సస్యశ్యామలమైంది. క్షమాగుణంవల్లే మీ కీర్తి దశదిశలా వ్యాపిస్తుంది. చింతను వీడి భగవధ్యానం చేయండి. దీనికి ఏమి చేయాలో ఆలోచించి చేస్తాను" అని చెప్పి వారిని ఉపశమింపజేశాడు.

తర్వాత తన మంత్రులతో కన్యకల వివాహ విషయమై ఆలోచించాడు.

ఆ సమయంలో ఊర్ధ్వరేతస్కుడైన చూళిని జ్ఞప్తికి తెచ్చుకున్నాడు. చూళి గొప్ప తపఃశ్శాలి. వేదోక్త రీతిలో యాగాలు చేస్తూ జీవించేవాడు. ఊర్మిళ అను అప్సరస సోమద అను తన కూతురిని చూళికి సేవకురాలిగా నియమించింది. ఘోర తపస్సాచరించే చూళికి సోమద వినయంగా సేవలను ఒనర్చేది. ఆమె సాధుత్వాన్ని వినయ విధేయతలను చూళి గమనించాడు.

కఠోర నియమంతో తపస్సు ఆచరిస్తున్న తనకు నియమానుసారంగా ఉపచారాలందించే సోమదపై చూళికి దయ కలిగింది. వెంటనే "ఓ సోమద నీ చర్యలకు నేను సంతోషపడ్డాను. నీ పరిచర్యలవలన నేను నా కోర్కెను తీర్చుకొన్నాను. కాన నీవు ఏదైనా ఒక కోరికను తెలుపు తీర్చుతాను" అని చెప్పాడు.

చాతుర్యం కలిగిన సోమద "బ్రహ్మవర్చస్సును పొందిన బ్రహ్మవేత్తలు మీరు. మీ తపస్సులతో బ్రహ్మ సమానులయ్యారు. నాకు ఒక ఉత్తమ పుత్రుని ప్రసాదించి నన్ను కరుణించండి. నేను ఈ లోకంలో ఎక్కడా కూడా ఎవరినీ నా భర్తగా ఎరుగను. కాని నాకు మీరే పరదైవం. మీ కృపచే నాకు ఒక కుమారుని ప్రసాదించండి" అని అడిగింది. నిర్మల చిత్తంతో చూళి ఆమెకు బ్రహ్మదత్తుడను పుత్రుని ఇచ్చాడు. అతడు నిష్ఠాగరిష్ఠుడు అతి పరాక్రమశాలి కాంపిల్య నగరానికి రాజుగా ఉండి ధర్మపాలన చేస్తున్నాడు.

బ్రహ్మదత్తుని విషయం అంతా కుశనాభునకు దృష్టిపథంలో మెదిలింది. తన కుమార్తెలకు తగిన వరుడు బ్రహ్మదత్తుడనే నిశ్చయించుకొన్నాడు.

వెంటనే బ్రహ్మదత్తుని రావించాడు. అతిథి సత్కారాలతో సంతోషపెట్టాడు. తన కుమార్తెల చేయి అందుకొనుమని అభ్యర్థించాడు. బ్రహ్మదత్తుడు విషయాన్నంతా గ్రహించాడు. ప్రాణిగ్రహణానికి తన ఆమోదం తెలిపాడు. కుశనాభుడు అమితానందపడ్డాడు. వెంటనే వివాహ మహోత్సవ ఏర్పాట్లు చేశారు. దేవ దందుభులు మంగళతూర్యాల శబ్దాలమధ్య బ్రహ్మదత్తుడు కుశనాభుని నూరుమంది కన్యకలను గ్రహించాడు.

బ్రహ్మదత్తుని కరస్పర్శచే కుశనాభుని కుమార్తెలు పూర్వ రూపలావణ్యాలను పొందారు. తమ అవయవాలకు కలిగిన వంకరలు మాయం అయినందుకు అమితంగా ఆనందించారు.

తమను చేపట్టిన బ్రహ్మదత్తునకు పాదాభివందనం చేశారు. వారినందరిని కాంపిల్య నగరానికి సాంగోపాంగంగా కుశనాభుడు పంపాడు. సోమద తన కుమారుడైన బ్రహ్మదత్తుని విషయం విని ఆనందచిత్త అయ్యింది. అవకరాలను పోగొట్టుకొన్న తన కోడళ్ళను ప్రేమగా ఆదరించింది. అత్తాకోడళ్ళు ఆనందంతో కాలం గడిపారు. "రామా! ఈ కథనంతా విన్నావు కదా!" అని విశ్వామిత్రుడు రాముని అడిగాడు.

* * *

విశ్వామిత్రుని వంశ వర్ణనం

సర్గ - 34

"ఓ రామా! నీకు ఈ రోజు నా గురించి కూడా చెప్తాను" అని అన్నాడు. "గురువర్యా! మహాప్రసాదం. నేను మీ జన్మవృత్తాంతం గురించి తెలుసుకోవాలని అనుకొన్నాను. మీరే నాకు చెప్తానన్నారు. త్రికాలవేది ఐన మీరు నా మనస్సులోని మాట తెలుసుకోవడం కష్టసాధ్యం కాదు గదా!" అని అన్నాడు.

విశ్వామిత్రుడు రామలక్ష్మణులను వాత్సల్యంతో చూశాడు. "నాయనలారా! కుశనాభుడు కూతుళ్ల పెండ్లి చేసి మనస్థిమితం చెందాడు. కాని పుత్రులు లేని నన్ను పున్నామనరకం నుండి రక్షించేవారు లేరు కదా! అని బాధపడుతూ ఉండేవాడు. అతని హితులందరూ ఆయనను పుత్రకామేష్టిని చేసి పుత్రులను పొందవచ్చు గదా!" అని చెప్పారు. "రామా! వారి మాట ప్రకారం కుశనాభుడు పుత్ర కామేష్టిని చేశాడు. అప్పుడు అతని తండ్రి కుశుడు కనిపించి నీకు ధీరోదాత్తుడు నీ వంశప్రతిష్ఠ పెంచువాడైన సుతుడు గాధి అను నీ కుమారుడు నీ పేరును కూడా శాశ్వతంగా నిలబెట్టగలడు అని చెప్పి ఆకాశమార్గంలో స్వర్గలోకానికి వెళ్ళాడు."

"దాన్ని విన్న కుశనాభుడు ఎంతో సంతోషించాడు. కొంతకాలానికి కుశనాభునకు గాధి పుట్టాడు. ఆ గాధి సుతుడనే నేను. సత్యవతి అను పడతి నా సోదరి. మేమిద్దరం కుశవంశమందు పుట్టాం కాబట్టి నన్ను కౌశికుడని నా అక్కను కౌశికి అని పిలుస్తారు. సత్యవతి పతివ్రత. ఆమెను ఋచీకునికిచ్చి నా తండ్రి వివాహం చేశాడు. వారిద్దరూ హాయిగా ఇహలోక సుఖాలను అనుభవించి పరలోక సంపదలకై సశరీరులుగా స్వర్గలోకానికి వెళ్ళారు. నా సోదరి అందరికి మోదం కూర్చాలనే తలంపుతో కౌశికీ మహానదిగా ఆవిర్భవించింది. హిమాలయ పర్వత ప్రాంతాలలో ప్రవహిస్తోంది. అక్కడి జనులకు ఐహికాముష్మిక సంపదలను ఇస్తుంది. అందుకే నేనును ఆ సానువులలోనే ప్రశాంత జీవనం గడపాలని హిమాలయాలకు వెళ్ళడానికి ఇష్టపడతాను; అంటూ విశ్వామిత్రుడు తన వృత్తాంతాన్ని రామసోదరులకు చెప్పాడు. నీ కార్యశూరతతో నేను సిద్ధాశ్రమానికి వచ్చిన పని అయిపోయింది. మరల నేను నా యథాస్థానానికే వెళ్తాను" అని చెప్పాడు. విశ్వామిత్రునితో మహాత్ములైన మీ జననం గురించిన విశేషాలు మాలో ధర్మాచరణలో ఆసక్తిని పెంచాయి. మేమెప్పుడు మీ సేవకులుగానే ఉంటాము. మమ్ము ఆశీర్వదించండి అని రామలక్ష్మణులు వినయపూర్వకంగా వేడుకొన్నారు. "శ్రీరామచంద్రా! నిన్ను నేను నీడవలె ఉండి నా ఆశీర్వాదబలాన్ని నిరంతరం అందజేస్తాను. అందుకే నీవు ఏమి సందేహించక్కరలేద"ని చెప్పాడు.

ఇంతలో ఆకాశాన్ని చంద్రుడు తన అధీనంలోకి తెచ్చుకోవడానికి ఉబలాటపడ్డాడు. తారలు తమ ప్రకాశాన్ని సర్వులకు చూపడానికి ముందుకు వచ్చాయి. సూర్యుడు ఎప్పటిమాదిరిగానే పశ్చిమాద్రి ఒడిలో సేద తీరడానికి వెళ్ళాడు. రాత్రించరుడు తన తిమిరాంధకారాన్ని భూమి అంతా వెదజల్లాడు. దానికి పరవశులైన ప్రాణులు ఆ మోహావేశానికి దాసులయ్యారు. కౌశికుణ్ణి అక్కడ ఉన్న మునిగణమంతా కొనియాడారు. బ్రహ్మ సమానులైన మీరు మీ సోదరి కడు ప్రజ్ఞావంతులని మునులు అన్నారు. మెల్లమెల్లగా అందరూ నిద్రాదేవి ఒడిలో జోగారు.

* * *

గంగాపార్వతుల వృత్తాంతం

సర్గ - 35

శోణనదీమతల్లి దగ్గర పవళించిన వారందరు తూర్పు వెలుగు రేకలన్నీ పరుచుకోకముందే లేచి తమ విధులను నిర్వర్తించుకొన్నారు. మునిగణమంతా విశ్వామిత్రుని పరివేష్టించింది. అప్పుడు రామలక్ష్మణులతో

కూడి విశ్వామిత్రాదులు తమ ప్రయాణాన్ని సాగించారు. అలా గంగాదేవీ తీరం చేరారు. తాము ఉండడానికి ఏర్పాట్లు చేసుకొన్నారు. పవిత్రమైన గంగానదికి నమస్కరించారు. అగ్ని విధులను ఆచరించారు. యజ్ఞఫలాలను వారు అమృతంలాగా సేవించారు. తరువాత అందరూ సుఖోపవిష్టులయ్యారు. గంగ పరిసరప్రాంతాలను పరిశీలనగా చూడసాగారు.

ముల్లోకాలలో ప్రవహించే ఈ గంగమ్మను గూర్చి తెలుసుకోవాలనిపిస్తోందని రామలక్ష్మణులు విశ్వామిత్రునితో చెప్పారు. ఎన్ని తెలిసినా ఇంకా తెలుసుకోవాలనే జిజ్ఞాస కలిగిన శిష్యులను చూసి విశ్వామిత్రునకు అనురాగం పెల్లుబికింది. "రామలక్ష్మణులారా! నాకు తెలిసిన గంగాదేవిని గురించి మీకు తప్పక చెప్తాను వినండి" అన్నాడు. అప్పుడు విశ్వామిత్రుడు గంగావతరణం గురించి ఇలా చెప్పసాగాడు.

హిమవంతుడు మేనక దంపతులకు గంగ ఉమ అను ఇద్దరు కుమార్తెలున్నారు. దేవతలందరు నిర్విఘ్నంగా సాగే గుణం కల గంగను గూర్చి తెలుసుకొన్నారు. తమ ప్రయోజనార్హమైన గంగను హిమవంతుణ్ణి అడగాలని అనుకొన్నారు. దేవతలందరు హిమవంతుని దగ్గరకు వచ్చారు. సర్వప్రయోజనార్థంకోసం లోకకల్యాణకోసం తమ జేష్ఠపుత్రికను తమకివ్వమని ప్రార్థించారు. దేవతల కోరికను హిమవంతుడు మన్నించాడు.

తన ప్రియపుత్రికను ముల్లోకాలకు హితంకోసం దేవతలకు అర్పించాడు. వారందరూ కృతార్థులయ్యామని చెప్పి వెళ్ళిపోయారు.

మేనకాహిమవంతుల చివరి కూతురు ఉమ. ఈమె శివుని పతిగా కావాలని కోరుకొనేది. అందుకే పరమశివునికోసం ఉగ్రమైన తపస్సు చేసింది. పరమేశ్వరుడు ఉమాదేవి తపస్సును మెచ్చుకొన్నాడు. తన కోరికను మన్నించాడు. మేనకాహిమవంతులు సంతోషంగా ఉమా మహేశ్వరుల కల్యాణం చేశారు.

ఇలా హిమవంతుని ఇద్దరు కుమార్తెలు లోకపూజ్యులయ్యారు. దేవతల ప్రయోజనంకోసం గంగ ఆకాశం చేరి అక్కడ ఆకాశగంగగా శోభిల్లింది.

* * *

పార్వతి ఆగ్రహం

సర్గ - 36

ఆకాశానికి చేరిన గంగాదేవిని గూర్చి తెలుసుకొన్నారు. ఆ గంగ త్రిపథగా ఎట్లు ఆవిర్భవించిందో చెప్పమని రామలక్ష్మణులు అడిగారు.

ఉమామహేశ్వరుల వివాహం జరిగిపోయింది. ఉమ పుత్రకాంక్షతో మహేశ్వరుని చేరింది. వారిద్దరూ ఆనందంతో క్రీడించారు. అలా నూరు వత్సరాలు గడచిపోయాయి. కాని వారు పుత్రవంతులు కాలేదు. దేవతలందరూ ఆదుర్దాపడ్డారు. శివ తేజఃప్రభావాన్నుంచి జన్మించే పుత్రుని గూర్చి మథనపడ్డారు. అందరూ ఆలోచించారు.

దేవతలందరూ కలిసి మహేశ్వరుని దగ్గరకు వెళ్ళారు. ప్రణమిల్లారు. "లోకప్రియా! పరమేశ్వరా! నీ తేజస్సును భరించడం పార్వతికి దుర్లభం అవుతుందేమోననే" అనుమానాన్ని వెలిబుచ్చారు. పరమేశ్వరుడు ఆలోచించి" దేవతలారా! మీ ఇష్టప్రకారమే నా రేతస్సును భూమిపై విడుస్తాను" అని చెప్పాడు. దేవతలందరు వాయువును పిలిచి నీవు అగ్నితో కూడి శివరేతస్సును భరించుమని చెప్పారు – శివునినుండి జనించిన రేతస్సు భూమి అంతా ప్రసరించింది. అగ్ని వాయువు శివతేజాన్ని తమలో నింపుకొన్నారు. ఆ ప్రభావంచేత శ్వేతపర్వతం ఏర్పడింది. దానినుంచి శరవణం ప్రభవించింది. ఆ రెల్లుగడ్డివనంలో అగ్ని ఆదిత్యులు శివతేజస్సును దింపారు. అందులో నుండి కుమారస్వామి జన్మించాడు. కృత్తికలు పాలిచ్చి పెంచారు. అందుకే కార్తికేయుడన్న నామధారి అయ్యాడు. శివతేజస్సును ధరించిన అగ్నివల్ల పుట్టాడు కాబట్టి అగ్ని సంభవుడు అయ్యాడు. ఇలా కుమారస్వామి జననం గురించి పార్వతీదేవి తెలుసుకొంది. తనకు పుత్రుడు కలగకుండా చేసిన దేవతలపై మండిపడింది. తన ఇచ్ఛకు అడ్డువచ్చిన దేవతలను అపుత్రులు కమ్మని శపించింది. ఖిన్నులైన దేవతలు పరమేశ్వరుని ప్రణమిల్లారు. శివతేజస్సును ధరిత్రి మోయుటకు పూనుకొన్నదని తెలుసుకొన్న ఉమ కుపితయై పుత్రభావం లేకుండునట్లు చవిటినేలగా ఉండమని భూదేవిని సైతం శాపానికి గురిచేసింది. తన భర్త అనురాగ ఫలాన్ని తనకు అందకుండా చేసినందుకు నీవు పెక్కు భర్తలను పొందెదవుగాక శపించింది.

ఉమాసహితుడై పరమేశ్వరుడు హిమాలయ ఉత్తర ప్రాంతానికి ప్రయాణం కట్టాడు. అక్కడ వారిద్దరూ తపోదీక్షకు పూనుకొన్నారు. ఇక త్రిపథగా వ్యవహరించే గంగను గూర్చి చెప్తాను వినండి అని విశ్వామిత్రుడు అన్నాడు.

* * *

కుమార సంభవం

సర్గ – 37

"రామా! గంగాదేవి విశిష్టతను చెప్తాను విను" – అంటూ ఇలా విశ్వామిత్రుడు చెప్తున్నాడు. హిమాలయాలకు వెళ్ళిపోయిన మహేశ్వరుని తలచుకొని దేవతలు దిగులు చెందారు– వారందరూ సేనా నాయకుడు తమను విడిచి దూరంగా వెళ్ళాడని చింతించారు. బ్రహ్మదేవుని చెంతకు వెళ్ళారు. వారి వ్యధలను తెలిపారు.

చతుర్ముఖుడు వారికి ప్రసన్నత చేకూర్చాడు. "దేవతలారా! ఉమాదేవి శాపం తిరుగులేనిది. ఆమె చెప్పినట్లుగానే మీ నిజపత్నుల ద్వారా పుత్రులను పొందలేరు. కాని మహేశ్వరుని వీర్యాన్ని ధరిస్తున్న అగ్ని దేవతలకిష్టమైన గంగ ద్వారా పుత్రుని పొందగలడు. ఆ పుత్రునిపై ఉమ వాత్సల్యాన్ని పెంచుకొంటుంది. భయపడవలదు. మీరు అగ్నిని పుత్రప్రాప్తికై ఆజ్ఞాపించండి" అని కమలాసనుడు చెప్పాడు.

దేవతలందరూ అగ్నిని శివతేజాన్ని గంగలో నిక్షిప్తం చేయమన్నారు. అగ్ని గంగకు దేవతాభీష్టాన్ని తెలిపాడు. దేవతలకిష్టమైన పనిని చేయడానికి గంగ ఆమోదం తెల్పింది. అద్భుత సౌందర్యరాశియైన స్త్రీగా గంగ అవతరించి, శివవీర్యాన్ని అగ్ని ద్వారా పొందింది. కొన్నాళ్ళకు ఆ గర్భాన్ని భరించలేక హిమాలయ ప్రాంతాలలో విడిచిపెట్టింది. ఆ వీర్య ప్రభావం శ్వేతపర్వతం అయ్యింది. ఆ రేతఃప్రభావం చేత అక్కడ సువర్ణం ఏర్పడింది. ఆ కాంతి ప్రభావంతో వెండి తయారైంది. వృక్షాలు లతలు పొదలు అన్ని సువర్ణాలయ్యాయి. అప్పటినుంచి బంగారం జాత రూపం పొందింది. ఆ రేత తీక్షణత్వంవల్ల రాగి ఇనుము లాంటి ధాతువులు ఏర్పడ్డాయి. ఆ హిమాలయ ప్రాంతం శివ తేజః ప్రభావంతో సర్వధాతుమయం అయ్యింది.

ఆ తర్వాత సువర్ణమయంగా కనిపించే ఆ రెల్లు గడ్డిలోనుంచి శివవీర్యం కుమారునిగా అవతరించింది. దేవతలందరూ సంతోషించారు. కృత్తికలను ఆ బాలుని ఆలనా పాలనా చూడమన్నారు. ఆరుగురు కృత్తికలు తమ చనుబాలను ఒకేసారి ఇచ్చారు. ఆరు ముఖాలు గలవాడై ఆ పాలను కుమారుడు గ్రోలాడు. అందుకే కార్తికేయ నామధారియైనాడు. దేవసేనాపతిగా నియమించబడ్డాడు.

గంగ గర్భం నుండి స్ఖలించగా ఉద్భవించాడు గాబట్టి స్కందుడని వ్యవహరించబడ్డాడు. ఇలా కుమార సంభవం జరిగింది. ఉమ కూడా స్కందునిపై ప్రేమ పెంచుకొంది. అచిరకాలంలోనే దేవ సేనాపతిగా ఉజ్వలంగా వెలుగొందాడు.

* * *

సగరుని పుత్రప్రాప్తి

సర్గ - 38

"రఘుకులనందనా! సగరుడు అనువాడు అయోధ్యానగరాన్ని పాలించేవాడు. అతనికి విదర్భ దేశాధీశుని కుమార్తె కేశిని, అరిష్టనేమి కూతురు సుమతి–అను వారు భార్యలు. పుత్ర సంతానం లేక సగరుడు చింతిస్తుండేవాడు.

తన భార్యలతో కూడి సగరుడు భృగుప్రసరణగిరికి వెళ్ళాడు. అక్కడ భృగుమహర్షిని గూర్చి వారు తపస్సు చేశారు. భృగుమహర్షి సంతసించి మీకు సంతాన ప్రాప్తి కలుగుతుంది. మీలో ఒక్కరికి వంశాభివృద్ధి చేయు ఒక సుతుడు కలుగుతాడు. రెండవ వారికి 60 వేలమంది పుత్రులు మహాబలశాలురైన వారు జన్మిస్తారు అని చెప్పాడు.

దానికి వారు ఎంతో సంతోషించారు. ఓ మహర్షిపుంగవా! మాకు ఎవరికి ఎవరు జనియిస్తారో సెలవీయండి అని అడిగాడు. మీ మీ అభీష్టాల ప్రకారమే జరుగుతుందని చెప్పగా కేశిని వంశోద్ధారకుని కోరుకుంది. ఆమెకు అసమంజుడు అను పుత్రుడు పుట్టాడు. సుమతి కొన్నాళ్ళ తర్వాత సొరకాయవంటి గర్భపిండాన్ని ప్రసవించింది. అందులోనుండి 60 వేలమంది పుత్రులు బయటకు వచ్చారు. వారినందరిని దాదులు నేతి కుండలలో దాస్తూ

పెంచారు. కొన్నాళ్ళకు వారు యౌవనభరితులు అయ్యారు. అన్ని విద్యలలో ఆరితేరారు. తండ్రికి తగ్గ తనయులుగా కీర్తికెక్కారు. అసమంజుడు చిన్నవాడు. నగరంలోని బాలలు తీసుకొని వెళ్ళి సాగరంలో పడవేసేవాడు. వారందరూ ఉక్కిరిబిక్కిరై మునకలు వేస్తుంటే అసమంజుడు సంతోషపడేవాడు. అసమంజుడు పెద్దవాడై అంశుమంతుడు అనువానికి జన్మనిచ్చాడు. అసమంజుని చేష్టలను భరించజాలని జనులు సగరునికి మొరపెట్టుకొన్నారు. ధర్మరక్షకుడైన సగరుడు తన తనయుడై ఉండి కూడా అధర్మాలకు పాల్పడుతున్న అసమంజునికి నగర బహిష్కరణను విధించాడు. చాలాకాలం తర్వాత సగరునికి యజ్ఞం చేయాలన్న సంకల్పం కలిగింది. సర్వ వేదపారగుడైన సగరుడు యజ్ఞకార్యాన్ని ఎలా ఆరంభించాలో యోచించాడు.

* * *

సగరుని యజ్ఞాశ్వ అపహరణం

సర్గ - 39

సాగరుని యజ్ఞం ఎలా సాగిందో వివరంగా మాకు చెప్పండి అని విశ్వామిత్ర మహర్షిని రాముడు అడిగాడు. సగరుడు యజ్ఞారంభం చేశాడు. ఋత్విక్కులు సైనికుల వెంట యాగాశ్వాన్ని పంపించారు. ఆ యాగాశ్వం భూమి అంతా చుట్టిరావడానికి బయలుదేరింది. కొంతకాలం ప్రయాణం సాగిన తర్వాత ఒక పర్వదినంనాడు ఇంద్రుడు ఆ గుర్రాన్ని అపహరించి తీసుకొని వెళ్ళాడు.

ఆ విషయం ఋత్విజులు సైన్యం తెలుసుకొన్నారు. యజ్ఞానికి విఘ్నం కలుగుతుందని అనుకొన్నారు. యాగాశ్వం కోసం అంతటా వెదికారు. వారికి అశ్వంజాడ తెలీలేదు. వారందరూ పరుగు పరుగున వెళ్ళి సగరునికి ఈ విషయం తెలిపారు. సగరుడు తన 60 వేలమంది పుత్రులను పిలిచారు. "నాయనలారా! నేను నా పౌత్రుడైన అంశుమంతుడు యాగదీక్షాకాలంలో యజ్ఞవేదికను వదిలి వెళ్ళకూడదు. కాని, ఇప్పుడు యాగాశ్వాన్ని ఎవరో దొంగిలించారు. మీరందరూ వెళ్ళి భూలోకం అంతా యజ్ఞాశ్వం తీసుకునిరండి. ఒకవేళ మీకు భూలోకంలో యాగాశ్వం కనిపించకపోతే పాతాళం వరకు వెళ్ళి అక్కడ కూడా వెతకండి. యాగాశ్వం లేకుండా మాత్రం రావద్దు. ఇది నా ఆజ్ఞగా పాటించండి" అని చెప్పాడు.

తండ్రి చెప్పిన మాట ఆచరించడానికి సగరపుత్రులు బయలుదేరారు. వారందరూ భూమినంతా పంచుకొని పరిశీలించారు. వారికి ఎక్కడా యాగాశ్వం కనిపించలేదు. వారందరూ చింతక్రాంతులయ్యారు. తండ్రి కోరిక సఫలం కాదేమోనని దుఃఖించారు. అందరూ కలిసి పాతాళానికి వెళ్ళి అక్కడ వెతకాలని అనుకొన్నారు. వజ్ర సమములైన వాడి గోళ్ళతో భూమిని పెకలించసాగారు. అలా వారు భూమిని పెళ్ళగించేటప్పుడు సరీసృపాలు ఎన్నో మృత్యువాతపడ్డాయి. ఎందరో తాపసులు చెల్లాచెదరయ్యారు. పాతాళ జీవులన్నీ అల్లోకల్లోలం అయ్యాయి. ఎన్నో జీవులు వాటి జీవితానికి అంతిమగీతం పాడాయి. ఇలా బీభత్సాన్ని సృష్టిస్తున్న సగర పుత్రులను దేవతలు చూశారు.

వారివల్ల బాధలు పడే జీవులన్నీ కలసి బ్రహ్మదేవుని దగ్గరకు వెళ్ళాయి. దేవతలు మునులు అక్కడికి చేరారు. వారందరూ కలిసి సగరపుత్రుల దౌష్ట్యాన్ని తెలిపారు.

"ఇదుగో వీడే! యాగాశ్వాన్ని అపహరించింది. మన తండ్రి తీరని దుఃఖానికి కారణం ఇతడే!" అంటూ కనిపించిన వారినందరిని సగరపుత్రులు బాధిస్తూ చంపివేస్తున్నారని తమ గోడును వెళ్ళబోసుకొన్నారు.

* * *

కపిలుని క్రోధాగ్ని

సర్గ - 40

"ఓ రామచంద్రా! భయవిహల్వతతో వణుకుచున్నవారిని బ్రహ్మదేవుడు చూశాడు. సృష్టికర్త ప్రసన్న వదనంతో స్వస్థులు కండి భయపడవద్దు. సగరపుత్రులు అల్పాయుష్కులు వారందరూ అచిరకాలంలోనే చనిపోతారు. ఇది ఎప్పుడో నిర్ణయం అయిపోయిన విషయం. మీరు వారి గురించి ఇంతగా కలత చెందాల్సిన అవసరం లేదు. వారు బహుకొద్ది కాలంలోనే నశిస్తారు. మీ మీ స్థానాలకు వెళ్ళి సుఖంగా ఉండండి" అని చెప్పారు.

విధాత మాటలు విని వారు కలత తీరినట్లుగా భావించారు. బ్రహ్మకు నమస్కరించి వారు స్వస్థానాలకు వెళ్ళారు. సగరుని కొడుకులు భూమినంతా త్రవ్వివేశారు. కాని, యాగాశ్వాన్ని పొందలేకపోయారు. రిక్తహస్తాలతోనే తండ్రి చెంతకు వెళ్ళారు. తాము చేసిన పని అంతా చెప్పారు.

అంతా విన్న సగరుడు తన పుత్రులపై మండిపడ్డాడు. పుత్రులారా! ఉత్తి చేతులతో నా దగ్గరకు రాకండి. పాతాళాన్ని కూడా ఛేదించి యాగాశ్వాన్ని తోడ్కొని రండి. ఒక్కొక్కరు యోజనం పొడవుగా భూమిని పంచుకొని నలుదిశలూ త్రవ్వించండి. ఎటులైనా యాగాశ్వాన్ని కొనిరండి వెళ్ళండి అంటూ ఆగ్రహించాడు.

తండ్రి ఆగ్రహానికి పుత్రులు దుఃఖించారు. అందరూ కలిసి ఆలోచించారు. ఒక్కొక్క దిక్కుకు అణువణువు పరిశీలించాలని అనుకొన్నారు. వెంటనే ఆయుధాలను తీసుకొన్నారు. భూమిని త్రవ్వడం మొదలుపెట్టారు. మొట్టమొదటగా వారందరూ పాతాళానికి వెళ్ళారు. అక్కడ వారికి విరూపాక్షం అనే పర్వత ప్రమాణంలో ఉండే గజం కనబడింది. అది తన తలపై సమస్త భూతలాన్ని మోస్తున్నది. దీనిని చూచి సగర పుత్రులు నమస్కరించారు. ఓ రామలక్ష్మణులారా! ఈ విరూపాక్షం పర్వదినాల్లో అప్పుడప్పుడు అలసట తీర్చుకోడానికి తన తలను కదిలిస్తుంది. అప్పుడే భూమి కంపించడం జరుగుతోంది అని విశ్వామిత్రుడు చెప్పాడు.

"స్వామీ! ఇంతకి సగరపుత్రులకు యాగాశ్వం ఎక్కడ కనబడింది?" అని లక్ష్మణుడు ఆతురతతో అడిగాడు. "లక్ష్మణా! అదే చెప్తున్నాను. సగర పుత్రుల పితృవాక్య పాలన దానివల్ల వారు పొందిన ఫలం చెప్తాను వినండి" అంటూ ఇలా చెప్పాడు.

వారందరూ భూమిని ఛేదిస్తూ రసాతలానికి వెళ్ళారు. పూర్వదిశ తర్వాత దక్షిణ దిశను ఛేదించారు. అక్కడ వారికి మహాపద్మం అను దిగ్గజం దక్షిణ భూభారాన్ని మోస్తూ కనిపించింది. దానిని చూచి సగర పుత్రులు ఆశ్చర్యానికి లోనయ్యారు. దానికి ప్రదక్షిణ నమస్కారాలు చేశారు. వారి దిశను మార్చుకొని అక్కడనుంచి వెళ్ళారు.

అలా వారు పశ్చిమ దిశకు వెళ్ళారు. అక్కడ సౌమనస మహాగజం పశ్చిమాద్రిని తలనిడుకొని కనిపించింది. భగవంతుడు కల్పించే అద్భుతాన్ని చూసి విస్మయానందంతో దానికి మొక్కారు.

ఉత్తరదిశలోనైనా కృతార్థులం అవుదామని భేదించారు. అక్కడ వారికి భద్రగజం ఎదురుపడింది. ఉత్తరాన్ని మోస్తున్న భద్రానికి సాగిలపడి మ్రొక్కారు.

ఆ ప్రదేశాన్ని విడిచిపెట్టారు. ఈశాన్యాన్ని తమ కార్యానికి అనుకూలం చేసుకోవడానికి త్రవ్వసాగారు. మహాకాయులు ఐన మీరు త్వరలోనే కపిలమహర్షిని చూశారు. ఆయన చెంత సేదతీరుతున్న యాగాశ్వాన్ని చూశారు.

అమితానందం చెందారు. యాగాశ్వాన్ని తీసుకొని వెళ్ళచ్చునని అనుకొన్నారు. ఈ కపిలుడే యాగాశ్వానికి అపహరించిన చోరుడని తలచారు. వారి కన్నులలో రోషం ఎగజిమ్మింది. క్రోధావేశం పెల్లుబికింది. "ఓ కపిలా! ఆగుము దుర్మార్గుడా! మా తండ్రి యాగాశ్వాన్ని అపహరించి ఇక్కడ దాక్కొన్నావా? నీ గురించి తెలుసుకోలేక పోతామని భావించావా? దుష్టుడా!" అంటూ శిలలు వృక్షములతో ఆయన పైకి వెళ్ళబోయారు.

తపస్సు చేసుకొంటున్న కపిలుడు వారినందరిని చూశాడు. యాగాశ్వం కోసం దురుసుగా మాట్లాడే వారి అజ్ఞానాన్ని గమనించాడు. త్రికాలజ్ఞాని అయిన కపిలుడు జరగబోయే దానినంతా అవలోకించాడు. బ్రహ్మ రాసిన రాతను చూచి విధి అలా ఉందని అనుకొన్నాడు. అంతలో సగరుని పుత్రులు కపిలుని తమ అజ్ఞానంతో గాయపర్చాలని అనుకొన్నారు. వెంటనే వారు వికృతచేష్టలు మొదలుపెట్టారు. దాన్ని చూచిన కపిలుడు మహారోషావేశంతో వారిని అదుపు చేయాలని ఒక్కసారి హుంకరించాడు. ఆ కపిలుని హుంకారంతోనే సగరపుత్రులు భస్మం అయ్యారు.

* * *

సగర యజ్ఞ పరిసమాప్తి

సర్గ - 41

"ఓ శ్రీరామా! సగరుని పుత్రులు వెనుదిరిగిరాక చాలాకాలం అయింది. ఎదురుచూస్తున్న సగరుడు వారి జాడ తెలియక అయోమయానికి గురి అయ్యాడు. ఒకరోజు తన పౌత్రుడైన అంశుమంతుని పిలిచాడు

"అంశుమంతా! నీవు నీ పినతండ్రులవలె యశోమంతునివి, పరాక్రమశాలివి. యాగాశ్వాన్ని తీసుకొని వస్తామని వెళ్ళిన నీ చిన్నాన్నలు ఇంకా రాలేదు. నా యజ్ఞం మధ్యలో ఆగిపోతోంది. యజ్ఞానికి విఘ్నం కలగడంవలన

మన వంశానికి మంచిది కాదు. అందుకని నీవు అవసరమైన ఆయుధాలను ధరించి యాగాశ్వాన్ని వెదుకు. అలానే పినతండ్రులు ఏమయ్యారో తెలుసుకో. నీవు యజ్ఞాశ్వాన్ని తీసుకొని రమ్ము నీకు శుభం కలుగుతుంది" అని చెప్పాడు.

తాతగారి మాటలను అంశుమంతుడు తలదాల్చాడు. వెంటనే ఆయుధపాణై బయలుదేరాడు. అప్పుడు "తండ్రీ అంశుమంతా! పాతాళంలోని జీవులు మహాబలిష్ఠులు వారిని ఎదిరించడంలో ఖడ్గం, ధనుస్సులాంటి ఆయుధాలను ఉపయోగించు. శ్రేష్ఠులైన వారు కనిపించినప్పుడు సాదరంగా వారిని ఆదరించు. ప్రముఖుల ఆశీర్వాదాలను పొందు. నీ పనికి అడ్డువచ్చేవారి విషయంలో కఠినంగా ప్రవర్తించు" అంటూ జాగ్రత్తలు చెప్పాడు. అంశుమంతుడు అన్నింటిని ఆలకించాడు. తన పినతండ్రుల మార్గాన్నే పాతాళం చేరాడు. అక్కడ విరూపాక్షున్ని చూసి నమస్కరించాడు. యాగాశ్వం సంగతిని అడిగాడు. తన పినతండ్రుల విషయం తెలుసునా అని అడిగాడు. ఆ విరూపాక్షం "ఓ అంశుమంతా! అల్పాయుష్కులైన నీ పినతండ్రులు లోకశాంతికై కపిలుని క్రోధాగ్నిలో భస్మం అయ్యారు. నీ యాగాశ్వం నీకు కనబడుతుంది. దాన్ని తీసుకొని త్వరలోనే నీవు నీ తాతగారి దగ్గరకు వెళ్తావు" అని చెప్పింది.

పినతండ్రుల మరణవార్త విని అంశుమంతుడు పరితపించాడు. వారికోసం దుఃఖించాడు. కాలవశమైన కార్యం కోసం సమయం వృధా చేసుకోకూడదనుకొన్నాడు. తాను చేయవలసిన పనిని మొదలుపెట్టాడు. నాలుగు దిక్కులలో నున్న మత్తగజాలను చూశాడు. వాటికి నమస్కరించాడు.

కొంతకాలానికి పినతండ్రుల భస్మరాశులను కనుగొన్నాడు. వారికి తర్పణం విడవాలని అనుకొన్నాడు. అక్కడ నీటికై వెదికాడు. కాని ఆ దాపులలో ఎక్కడా జలాశయం కనిపించలేదు. అలా జల అన్వేషణలోనున్న అంశుమంతుడికి తన పినతండ్రుల మేనమామ ఐన ఖగరాజు కనిపించాడు.

ఆ వైనతేయునకు నమస్కరించి అంశుమంతుడు జలాశయం ఎక్కడ ఉందోనని అడిగాడు. వైనతేయుడు "కుమారా! నీ పినతండ్రులకు తర్పణం విడుచుట పనికిరాదు. బ్రాహ్మణాగ్రహంలో వారు అశువులు కోల్పోయారు. అందుకే వారికి తర్పణ విధులు దరిచేరవు. ఆకాశగంగను తీసుకొని వచ్చి వారికి స్వర్గ ప్రాప్తిని కలుగజేయాలి. నీవు ఇప్పుడే నీ యాగాశ్వాన్ని తీసుకొని వెళ్ళి నీ తాతగారి అభీష్టాన్ని నెరవేర్చు" అని చెప్పాడు. వైనతేయుడి మాటలు ఆలకించి అంశుమంతుడు అంజలి ఘటించాడు. యాగాశ్వం అంశుమంతునికి కనబడింది.

దానికి ప్రదక్షిణ నమస్కారాలు చేశాడు. దానిని తీసుకొని సగరుని దగ్గరకు వెళ్ళాడు. సగరుడు పుత్ర మరణవార్త విని అమితంగా దుఃఖించాడు. యాగాశ్వం వచ్చినందువల్ల తన యజ్ఞాన్ని కొనసాగించాడు. యజ్ఞం పరిసమాప్తి చెందింది.

అంశుమంతుడు ఆకాశగంగను ఎలా భూమికి తేవాలో అని ఆలోచించసాగాడు. సగరునికి ఎంతకీ ఆలోచన కుదరలేదు. రాజ్యపాలనలో మునిగిపోయాడు. అవసర కార్యాన్ని పక్కన పెట్టాడు. అలా సగర మహారాజు

30వేల సంవత్సరాలు రాజ్యపాలన చేశాడు. చివరకు స్వర్గస్థుడయ్యాడు. తాను ఆశించిన కార్యాన్ని ఆచరణలో పెట్టలేక మానసిక చింతతో అసువులు కోల్పోయాడు.

* * *

భగీరథయత్నం

సర్గ - 42

సగరుడు స్వర్గస్థుడయిన పిమ్మట మంత్రులు ప్రజలు అంశుమంతుని రాజుగా కోరుకొన్నారు. వారి కోరిక ప్రకారం అంశుమంతుడు రాజ్యభారాన్ని చేపట్టాడు. కాని, తన పినతండ్రుల పరిస్థితి ఏ విధంగా బాగుచేయాలన్న ఆలోచనామగ్నుడయ్యేవాడు.

అంశుమంతునికి దిలీపుడను పుత్రుడు ఉన్నాడు. ఆ దిలీపుడు ప్రజలందరికీ ఇష్టుడే. వానిని రాజుగా చేశాడు. గంగను భూలోకానికి తీసుకురావాలనే తన ఆశను తీర్చుకోవాలని అనుకొన్నాడు. దానికి తపస్సే మార్గమనుకొన్నాడు. వెంటనే రాజ్యభారాన్ని దిలీపునికి అప్పగించాడు. తపోభూమికి మళ్లాడు. ఇలా ముప్పై రెండు వేల సంవత్సరాలు తపస్సు చేశాడు. కాని ఫలసిద్ధిని పొందలేకపోయాడు. చివరకు స్వర్గస్థుడయ్యాడు.

విషయం తెలుసుకొన్న దిలీపుడు దుఃఖించాడు. తన తండ్రి కోరికను ఎలా తీర్చాలో తెలియక తికమకపడ్డాడు. ఋషులు వేదవేత్తలతో మంత్రాంగం చేశాడు. వారి ఆలోచన ప్రకారం వేదోక్త రీతిలో యజ్ఞయాగాలు చేశాడు. తన కుమారుడైన భగీరథునితో తాతలస్థితి తెలిపాడు. దానికి మార్గాలోచన చేయమన్నాడు.

ఇలానే ముప్పై వేల సంవత్సరాలు గడిచిపోయాయి. దిలీపుడు భగీరథునికి రాజ్యాభిషేకం చేసి తన తనువు చాలించాడు.

నిరాశతోనే స్వర్గస్థుడైన తన తండ్రికి ఆత్మశాంతి కలిగించాలని భగీరథుడు ఆశపడ్డాడు. దానికి తపస్సే తగినది అనుకొన్నాడు. వెంటనే రాజ్యాధికారాన్ని ఎవరికి అప్పగించాలని యోచించాడు. తనకు పుత్రప్రాప్తి లేనందుకు దుఃఖించాడు. రాజ్యభారాన్ని మంత్రులకు అప్పగించాడు.

హిమవత్పర్వత ప్రాంతంలోని గోకర్ణ క్షేత్రానికి బయలుదేరి వెళ్ళాడు. అక్కడ తీవ్రంగా తపస్సు చేశాడు. మాసానికి ఒక్కసారే భుజించేవాడు. పంచాగ్నుల మధ్య నిలబడి తపస్సు చేశాడు. అతడి తపస్సుకు కఠోరదీక్షకు దేవతలు అబ్బుర పడ్డారు. చతుర్ముఖుడు సదాచారానికి సంతోషించాడు. భగీరథుని ధర్మయుక్తమైన కోరికను తీర్చాలని అనుకొన్నాడు.

దేవతలను మరుద్గణాలను వెంటబెట్టుకొని భగీరథుని చెంతకు వెళ్ళాడు. "నాయనా భగీరథా! నీ యత్నం మమ్ములను ఆనందపరిచింది. నీ తపస్సు మెచ్చదగింది" అని అన్నారు. వారిని చూసి భగీరథుడు ఆనందాశ్రువులను రాల్చాడు. వారి మాటలను విని ఆనందించాడు.

"ఓ కమలాసనా! నా తపస్సు మిమ్ములను ఆనందపరిచిందా? నన్ను కృతార్థుని చేయాలనే సంకల్పాన్ని కలిగించిందా" అని ఆనందంగా అడిగాడు. విధాత "భగీరథా! నీ కోర్కె లోక సమ్మతమైనది. నీ తాతలకోసం నీవు చేసిన ఈ యజ్ఞఫలం నీకు తప్పక దొరుకుతుంది. నీ కోరికలేమిటో మాకు చెప్పు" అని అడిగాడు.

భగీరథుడు ఆనందంతో మాట్లాడాడు. "సృష్టికర్తా! ఓ కమలాసనా! నాకు ఫలం ప్రసాదించు. గంగను భువికి పంపించు. నా తాతలను తరింపజేయుము. వారికి స్వర్గప్రాప్తిని కలిగించు లేదా. అంతేగాక నా వంశం నాతోనే ఆగిపోకుండా నిర్విఘ్నంగా సాగేటట్లుగా అనుగ్రహించు తండ్రీ! నా వంశోద్ధారణ కలిగించు మహానుభావా! ఇంతకన్నా నాకు కావాల్సింది ఏమీ లేదు. నా కోర్కెలు సమంజసమైనవని నేను అనుకొంటున్నాను. వాటిని నెరవేర్చు పితామహా" అని భగీరథుడు వేడుకొన్నాడు.

పద్మసంభవుడు "భగీరథా! నీ కోర్కె సఫలం అవుతుంది. ఆకాశంనుంచి దుమికే గంగను నిలవరించే శక్తి ఒక్క మహేశ్వరునికే ఉంటుంది. దానికి ఆయనే సమర్థుడు. హిమవంతుని పెద్ద కుమార్తె ఐన గంగ మహేశునికే వశం అవుతుంది. దానికై శివుని అభ్యర్థించాలి" అన్నాడు.

"ఓ పతిత పావనీ! పుత్రికారత్నమా నీవు ఈ భూలోకంలోకి వెళ్ళి భగీరథుని కోర్కెను తీర్చు తల్లీ!" అని గంగను బ్రహ్మదేవుడు ఆదేశించాడు.

"భగీరథా! నీ కోర్కె త్వరగా సఫలం అగుగాక! "అని ఆశీర్వదించాడు. మరుద్గణాలతో దేవతలతో కూడి బ్రహ్మ అదృశ్యం అయ్యాడు.

* * *

గంగావతరణం

సర్గ - 43

"ఓ రామా! ఇక జరిగింది చెప్తాను విను" అని విశ్వామిత్రుడు రామాదులకు ఇలా చెబుతున్నాడు. బ్రహ్మదేవుడు సత్యలోకానికి వెళ్ళిపోయాడు. భగీరథుడు తాను చేయవలసిన దానిని గురించి ఆలోచించాడు. వెంటనే శివుని గూర్చి బొటనవ్రేలిపై నిలబడి తపస్సు ఆచరించాడు. శివుడు భగీరథుని తపస్సును మెచ్చుకొన్నాడు.

శివుడు ప్రత్యక్షం అయ్యాడు. భగీరథుడు అశ్రునయనాలతో శివునికి నమస్కరించాడు. ముల్లోకాధీశుడైన పరమశివుడు"లోకప్రియా భగీరథా! నీ ఆశయం ఉత్తమమైనది. నీ కోర్కె సఫలీకృతం అవుతుంది. నేను ఆకాశం నుంచి వచ్చే శైల పుత్రిని నా తలపై ధరిస్తాను. నీవు నిశ్చింతుడవు అగుము" అని చెప్పాడు.

ఆనందంతో భగీరథుడు గంగావతరణానికి అర్రులు చాచాడు. దేవతలకు కూడా ప్రియమైన పరమపావని గంగ, మహాశక్తితో ఆకాశం నుండి బయలుదేరింది. దుస్సహమైన వేగంతో శివుని జటలపై గంగ దూకింది. అలా

దుముకుతూ గంగ తన ప్రవాహఝురిలో శివుని కూడా పాతాళానికి చేరుస్తాను అని అతిశయించింది. ఆ గంగాగర్వాన్ని మహేశ్వరుడు తెలుసుకొన్నాడు. గర్వపడుతున్న గంగకు బుద్ధి చెప్దాం అనుకొన్నాడు. వెంటనే జటామండలంలో గంగను శివుడు బంధించివేశాడు. అనేక సంవత్సరాలు గడిచినా గంగ బయటకు వెళ్ళలేక పోయింది.ఏమి జరిగిందో గంగకు అర్థం కాలేదు. బాగా ఆలోచించింది. తన గర్వమే ఇంత పని చేసిందని అనుకొన్నది. సర్వాధికారి ఐన పరమేశ్వరుని ఆజ్ఞ లేనిదే గడ్డిపోచ సైతం కదలడానికి అశక్తతను కలిగి ఉందని తెలుసుకొంది. అసలు నిజాన్ని తెలుసుకొన్న గంగ తాను మాయాప్రభావానికి చిక్కానని గ్రహించింది. పశ్చాత్తాప పడింది. తాను చేసిన పొరపాటుకు క్షమించమని శంకరుని ప్రార్థించింది.

ఇంతలో గంగ జాడ తెలియక భగీరథుడు ఖిన్నుడయ్యాడు. ఏమి చేయాలో తెలుసుకోలేకపోయాడు. తాను మొదలుపెట్టిన కార్యం ఎందుకు ఆగిపోయిందో కనుక్కోలేక భగీరథుడు సతమతమయ్యాడు. తనను రక్షించేవారు ఎవరూ లేరని వాపోయాడు. సర్వనియంత ఐన పరమేశ్వరుడు తప్ప దిక్కు ఎవరూ లేరని నిశ్చయించుకొన్నాడు. అంతే పరమేశ్వరుని గూర్చి తపస్సు ఆచరించాడు. భగీరథుని సదుద్దేశాన్ని పరమేశ్వరుడు తిలకించాడు.

భగీరథుని కోర్కె ప్రకారం పరమేశ్వరుడు గంగను బయటకు వదిలాడు. జటాజూటం నుంచి పరుగులెత్తే గంగ వింత శోభలను గూర్చింది. భగీరథుడు తన రథంపై ముందుకు సాగాడు. గంగాదేవి భగీరథుని అనుసరించింది.

ఒక్కోచోట వేగవంతంగా మరోచోట నిదానంగా వంకర్లుపోతూ పడుచుదాని పరువంవలె పరిగెత్తింది. గంగ కొండల్లో కోనల్లో దూరి మైదానాలను నింపివేస్తూ జాలువారింది. ఆ గంగలోనుంచే తాబేళ్లు మొసళ్ళు మీనాలు దుమికాయి. జలచరాలకు భూలోకానికి వన్నె తెచ్చాయి.

గగనం నుండి శివుని జటతో ప్రవహించిన గంగ అక్కడినుండి స్థిరత్వం లేనిదానిలాగా ప్రవహించింది. ఆ గంగను చూడడానికి దేవతలందరూ విమానాలలో వచ్చారు. గంధర్వ యక్ష కిన్నర కింపురుషులు నిర్మలాకాశాన నిలిచారు. వారి కిరీటాల శోభతో ఆకాశం ప్రకాశవంతం అయింది. ఆశ్చర్యానందాలతో భూలోకవాసులు తన్మయులై శివుని తలనుండి జాలువారిన ఈ గంగ పరమ పావని అంటూ ప్రస్తుతించారు. ఆ నీళ్ళను తలలపై చల్లుకొన్నారు. తాము పవిత్రులైనట్లు భావించారు. అలా సాగుతున్న గంగలో తిరుగాడు హంసలు శరత్కాల మేఘమాలికల్లా శోభించాయి.

గాలి తాకిడిచే ప్రవాహం అప్పుడప్పుడు వెనుకకు మరిలేది. అలల తాకిడిచే శబ్దాన్ని కలగజేస్తూ గంగ ప్రవహిస్తోంది. గంగలో మునిగిన వారందరూ పాపరహితులై దివికి చేరసాగారు. అలా పతిత పావనియైన గంగ మహారాజును వెంబడించింది.

ఒకచోట జహ్ను మహర్షి క్రతువును ఆచరించడం గంగ చూచింది. గంగకు ఆనందం వేసింది. ఆ ఆశ్రమాన్నంతా చూడాలనుకొంది. ఆ ఆశ్రమాన్నంతా తన జలాలతో ముంచివేసింది. ఇది చూసిన జహ్ను మహర్షి గంగ దుశ్చర్యను చూచి గంగ అహంకారంతో చేసిందనుకొన్నాడు. ఆ మహర్షి పుంగవుడు కుపితుడయ్యాడు. తన అద్భుత మేధాశక్తిచే గంగాజలాన్నంతా త్రాగివేశాడు. అంతే గంగ ఎక్కడా లేకుండా పోయింది.గంగ కనిపించకపోయేసరికి ఏమై ఉంటుందా అని అందరూ అనుకొన్నారు.

భగీరథునితో సహా అందరూ జహ్ను ఆచరించిన దానిని తెలుసుకొన్నారు. భగీరథుడు, దేవతలు మానవులు జహ్నుమహర్షిని శాంతింప చేశారు. జహ్ను మహర్షి విషయం తెలుసుకొన్నాడు. శాంత చిత్తుడయ్యాడు. గంగ తప్పును మౌని మన్నించాడు. అంతే కాదు గంగను తన సుతను చేసుకొన్నాడు. సావధాన చిత్తంతో జహ్ను లోక కల్యాణార్థం గంగను తన చెవినుండి వెలుపలికి ప్రవహింపచేశాడు. అందుకే గంగకు 'జాహ్నవి' అనే పేరుకూడ కలిగింది. దేవతలు, మానవులు భగీరథుడు గంగను తిరిగి చూచి మహానందపడ్డారు. అలా భగీరథుడు గంగను పాతాళానికి తీసుకొని వెళ్ళాడు. అక్కడ ఉన్న తన తాతల భస్మరాశులను గంగకు చూపి కన్నీరు కార్చాడు. పావని ఐన గంగ ఆ భస్మరాశిని తనలో కలిపేసుకొంది. వెంటనే సగర పుత్రులు పాపరహితులయ్యారు. అందరూ భగీరథుని ప్రశంసించారు. తమకు పుణ్యగతులు కల్పించిన తమ పౌత్రుడిని బహుధా ఆశీర్వదించాడు. అప్పుడు భగీరథుడు ఈడేరిన కోర్కెతో నిర్మల చిత్తుడయ్యాడు.

తనవారికి స్వర్గప్రాప్తి లభించిందని సంతోషపడ్డాడు. తన కోరిక ఇన్నాళ్ళకు తీరిందని ఎంతో ఆనందించాడు. తమ వంశజులు స్వర్గానికి వెళ్లారని తన తండ్రి చింత తీరిపోయిందన్న ఆనందంతో భగవంతుని పలువిధాలుగా భగీరథుడు కీర్తించాడు.

* * *

సగర పుత్రాదుల పుణ్యలోకప్రాప్తి

సర్గ - 44

ఆనందపడుతున్న భగీరథుని బ్రహ్మ చూశాడు. "భగీరథా! నీ ఆశయం నెరవేరింది. నీ పితృదేవులు చేసిన ప్రతిజ్ఞ నీవలన ఈడేరింది. ఈ గంగాజలంలో సాన్నం చేసి నీవు కూడా పునీతుడవు కమ్ము. ఈ జలాన్ని తీసుకొని ఈ పితృగణానికి అంతా తర్పణాలు విడిచిపెట్టు" అని చెప్పాడు.

చతుర్ముఖుని ఆదేశం ప్రకారం భగీరథుడు పితృతర్పణాది కృత్యాలు చేశాడు. వారికి ఉత్తమ గతులు కల్పించాడు. దానిని చూసి బ్రహ్మదేవుడు "ఓ భగీరథా! ఈ గంగ భూలోకంలో ఉన్నంతకాలం నీవారు స్వర్గలోకంలో ఉంటారు" అని ఆశీర్వదించాడు.

ఈ గంగ నీకు పెద్ద కుమార్తె అయి భగీరథి అనే పేరు సార్థకం చేసుకొంటుంది. స్వర్గ - భూలోక - పాతాళాలలో ప్రవహించి త్రిపథగా ఖ్యాతి పొందుతుంది. పతితుల పాపాన్నంతా క్షాళన చేస్తుంది. నీ పూర్వుడైన సగరుని కోర్కె నీవీనాడు తీర్చావు. దానివల్ల ఆ చంద్రార్కంగా నీ కీర్తి వ్యాపిస్తుంది. నీ యశస్సుచే నీ వంశం శోభిస్తుంది. గంగను దివినుండి భువికి తీసుకొని వచ్చి ధర్మపరుడివి అయ్యావు" అంటూ బ్రహ్మ భగీరథుని మెచ్చుకొన్నాడు. వచ్చిన పని అయిపోయిందని చతుర్ముఖుడు తన దివ్యలోకానికి చేరాడు.

ఈదేరిన కోర్కెతో భగీరథుడు రాజ్యాన్ని సుభిక్షంగా పాలించాడు "ఓ రామచంద్రా! భగీరథుని పాలనలో ప్రజల ధర్మ ప్రవర్తనులయ్యారు. కోకొల్లలైన ధనధాన్యాదులతో తులతూగారు. సమస్త సుఖాలను అంది పుచ్చుకొన్నారు.

సంధ్యాసమయం కాజొస్తోంది రామా! నీ నిత్యవర్తనను చేయుము. గంగావతరణను విన్న వీరందరూ పరమ పావనులు అవుతారు. మీ సమస్త కార్యాలు నిర్విఘ్నంగా కొనసాగుతాయి. పాపాలన్నీ నశించుతాయి. ఆయుర్దాయం వృద్ధి అవుతుంది. కీర్తి ఇనుమడిస్తుంది.

ఓ రామలక్ష్మణులారా! హాయిగా మీ కార్యాలను చేయండి" అని విశ్వామిత్రుడు చెప్పాడు. తమ వంశజుల గొప్పతనాన్ని విన్న ఆ సోదరుల హృదయం ఉప్పొంగిపోయింది. తాము తమ వంశజుల అడుగుజాడలలో నడవాలన్న ఆలోచన వారి మదిలో చిగురించింది.

* * *

క్షీరసాగర మథనం

సర్గ - 45

విశ్వామిత్రుడు చెప్పినదంతా మరల మరల రామలక్ష్మణులు మననం చేసుకొన్నారు. అద్భుత గంగావతరణాన్ని చర్చిస్తూ రాత్రి గడిపేశారు. తెల్లవారింది. యథావిధిగా పనులను పూర్తి చేశారందరు. విశ్వామిత్రుని దగ్గరకు వచ్చారు. రాత్రి మీరు చెప్పిన కథాచర్చతో ఇట్టే గడిచిపోయిందని ఆనందంతో చెప్పారు.

అంతలో అక్కడి ఋషీశ్వరులు చక్కని నావను తెచ్చారు. అందరూ అందులో కూర్చుండి గంగఉత్తర భాగానికి చేరారు. అక్కడనుంచి వారు విశాలనగరానికి వెళ్ళారు. ఈ విశాలనగరం ఏ రాజుచే పాలింపబడుతోంది. ఈ నగర విశిష్టతనంతా మాకు ఎరిగింపుము మహానుభావా అని రాముడు వినయంగా అడిగాడు.

విశ్వామిత్రుడు కథలయందు ఆసక్తి ఉన్న రాముని చూచి చిరునవ్వు నవ్వాడు. "ఓ రామచంద్రా! దేవేంద్రుని కథను నీకు చెప్తాను. అప్పుడే ఈ ప్రదేశంలో జరిగిన ఒక సంఘటనను చెప్తాను విను" అంటూ ఇలా చెప్పసాగాడు.

కృతయుగంలో దితి, అదితుల పుత్రులు మహాబలశాలురుగాను ధర్మబుద్ధిశాలురుగాను ఉండేవారు. వారికి ఒకసారి వార్ధక్యం రోగాలు రాకుండా ఉండేందుకు ఏదైనా చేయాలని అనిపించింది.

వారు బాగా ఆలోచించి చివరకు మంధర పర్వతాన్ని కవ్వంగా చేసుకొని వాసుకిని త్రాడుగా చేసుకొని క్షీరసాగరాన్ని మథించి అందునుండి అమృతం పొందాలని అనుకొన్నారు.

అనుకొన్నట్లుగానే దేవదానవులు క్షీరసాగరాన్ని మథించారు. ఈ మథనం వేయి సంవత్సరాలు సాగింది. క్షీరసాగరంనుండి భయంకరమైన విషపుజ్వాలలు బయలుదేరాయి. ఆ అగ్నికీలలు సమస్త జగత్తును దహించి వేయసాగాయి. దేవతలు దానవులు నరులు అందరూ దేవదేవుడైన మహేశ్వరుని ఆశ్రయించారు. మమ్మల్ని కాపాడమని అభ్యర్థించారు. అక్కడ శంఖచక్రగదాధరుడైన మహావిష్ణువు ఆవిర్భవించాడు.

మహావిష్ణువు శంకరుని చూచి నమస్కరించాడు. "ఓ సురశ్రేష్ఠా! నీవు మాకందరికంటే ముందు ఉద్భవించిన వాడివి కనుక అగ్రపూజగా ఈ విషాన్ని నీవు స్వీకరించు. సర్వమానవాళికి మంగళం చేయి" అని పలికాడు.

మహావిష్ణువు మాట ప్రకారం శంకరుడు హాలాహలాన్ని అమృతంలాగా స్వీకరించాడు. ఆ విషాన్నంతా గరళంలో పట్టి ఉంచాడు. అందుకే ఆయన గరళకంఠుడయ్యాడు. దాని తర్వాత దేవతలకు వీడ్కొలిచ్చి శివుడు కైలాసం చేరాడు.

క్షీరసాగరమథనంలో మంథరపర్వతం జారిపోతుండేది. దేవదానవులకు పట్టుచిక్కక చింతించేవారు వారందరూ. భగవంతుడైన విష్ణువును తమ ఇక్కట్లను తొలగించవలసిందిగా ప్రార్థించారు. భక్తవత్సలుడైన విష్ణువు మంథర పర్వతం క్రింద కుదురుగా ఉండాలని తలచాడు. ఆ చిలికే కశ్యప పుత్రులలో (విష్ణువు) తాను ఒక్కడిగా నిలచి వాసుకితో సాగరాన్ని మథించాడు.

అన్నింటాతానై నిలిచి క్షీరసాగర మథనం జరిపించాడు. అందులోనుండి ధన్వంతరి, అప్సరసలు, వారుణి, ఉచ్చైశ్శ్రవం, కౌస్తుభం, లక్ష్మి ఇలా ఎన్నో ఆవిర్భవించాయి. దేవతలు, దానవులు వారి వారి ఇచ్ఛానుసారం వాటినంతా తీసుకొన్నారు. చివరకు లభించిన అమృతంకోసం అప్పటిదాకా కలసి ఉన్న అన్నదమ్ములు పోట్లాడుకొన్నారు. యుద్ధం చేసికొన్నారు.

ఆ ఉభయపక్ష వీరులకు ముల్లోకాలకు ఆశ్చర్యం గొలుపుతూ విష్ణువు మోహిని అవతారం దాల్చాడు. దేవదానవులు మోహినీని చూచి అచ్చెరువొందారు. ఆ మోహపాశానికి దాసులయ్యారు. అమృతకలశాన్ని మోహినీ హస్తగతం చేసుకొంది. దేవతలకు అమృతాన్ని ఒసిగింది.

కొందరు దైత్యవేత్తలు ఆ మహాదేవుని ఎదిరించారు. వారిని విష్ణువు నుగ్గు నుగ్గు చేశాడు. ఇంద్రుడు యుద్ధం చేశాడు. విష్ణువు అభయం ఉన్నందున ఇంద్రుని జయలక్ష్మి వరించింది. రాజ్యలక్ష్మిని కూడా ఇంద్రుడు చేపట్టాడు. సమస్త లోకాలు ఆనందపడ్డాయి.

* * *

దితి తపస్సు

సర్గ - 46

"ఓ రామా! ఇంకా ఇలా జరిగింది. చెప్తాను విను." దైత్యుల మరణవార్త విని దితి అమితంగా శోకించింది. దుఃఖంలో ఉన్న ఆమె కశ్యపుని దగ్గరకు వెళ్ళింది. దేవాసుర సంగ్రామంలో దేవేంద్రుడు చేసిన పనిని తెలిపింది. "ఓ మహానుభావా! నేను గర్భశోకాన్ని భరింపలేకున్నాను. నీవు నాపై దయ తలచుము. నాకు ఇంద్రుని జయించే

కుమారుని అనుగ్రహించు. సతికి పతియే పరదైవం కదా! నీవు నా కోర్కెను తీర్చుము" అని పదే పదే దితి కశ్యపుని వేడుకొంది.

పుత్రశోకంలోనున్న దితిని శాంతపరచడానికి కశ్యపుడు "ఓ దితి! వేయి సంవత్సరాల తర్వాత నా వలన నీకు ముల్లోకాలను జయించగల కుమారుడు పుడతాడు. దుఃఖించకు. నీవు పవిత్రురాలివై భగవద్యాస పరాయణవై ఈ వేయి వత్సరాలు గడిపినచో నేను నీకు పుత్రుని అనుగ్రహించగలను" అని చెప్పాడు.

కశ్యపుని మాటలకు దితి ఎంతో సంతోషించింది. తన కోరిక నెరవేరుతుందన్న ఆశతో ఆమె కుశ ప్లవనమునకు చేరి తపస్సు చేయడం మొదలుపెట్టింది. అయితే అక్కడ దేవేంద్రుడు వచ్చి ఆమె శుశ్రూష చేశాడు. కుమారుడైన దేవేంద్రుడు సమయానుకూలంగా దితికి కుశలు సమిధలాంటివి తెచ్చి ఇచ్చేవాడు. ఆమెకు పాదాలు ఒత్తి సేద తీర్చేవాడు. ఇలా శుశ్రూష చేస్తున్న సహస్రాక్షుడిపై ఆమెకు పుత్రవాత్సల్యం కలిగింది.

"నాయనా దేవేంద్రా! నా కోరిక ప్రకారం నీ తండ్రి కశ్యపుడు నాకు వేయి సంవత్సరాల తర్వాత పుత్రుని ప్రసాదిస్తాడు. ఆ సోదరునితో నీవు సఖ్యంగా ఉండి ముల్లోకాలను జయించి సుఖంగా ఉండండి. నేను నిన్ను చంపగల వీరుడిని పుత్రునిగా అడిగాను కాని నీపై నీ సోదరుడు ఆగ్రహించినపుడు నేను వానిని శాంతపరుస్తాను. మీరిద్దరూ భ్రాతృభావంతో మెలగండి" అని చెప్పింది.

అలా చెప్పేటప్పుడు ఆమె నిద్రపరవశురాలైంది. మధ్యాహ్న సమయంలో ఆమె నిద్రలోకి జారి అశుచిత్వాన్ని పొందింది. దీన్ని చూచిన దేవేంద్రుడు ఆమె గర్భంలోకి ప్రవేశించాడు. ఆ గర్భంలోని పిండాన్ని తన వజ్రాయుధంతో ముక్కలుగా చేస్తున్నాడు. ఆ పిండం బిగ్గరగా ఏడ్చింది. ఆ ఏడుపు విని దితి మేల్కొనింది. జరుగుతున్న అకృత్యాన్ని చూచింది. "దేవేంద్రా! పిండస్థశిశువును చంపకు" అని చెప్పింది. అంతలో "ఏడవకు, ఏడవకు" అంటూ ఆ పిండాన్ని ఏడు ముక్కలుగా ఇంద్రుడు నరికేశాడు.

తల్లి కోరిన విధంగా పిండాన్ని వదిలిపెట్టి గర్భంనుంచి బయటకు వచ్చాడు. "అమ్మా! నన్ను జయింపగల కొడుకును నీవు కనబోతున్నావు అని నేను తెలుసుకొన్నాను. నీవు అపవిత్రంగా నిద్రాదేవికి వశం అయ్యావు. అందుకే నేను నీ పిండాన్ని ఏడు ముక్కలు చేశాను. నన్ను క్షమించు తల్లీ" అని ఇంద్రుడు దితిని వేడుకొన్నాడు.

* * *

సప్త మరుత్తుల కథ

సర్గ - 47

దితి తన గర్భస్థ పిండం ఏడు ముక్కలైనందుకు తానే కారణం అని అమితంగా దుఃఖించింది. ఇంద్రునితో "నాయనా పురందరా! ఇందులో నీ తప్పు ఏమీ లేదు. కాని బలాసురుని నీవు ఏడు ముక్కలు చేస్తూ ఏడవకు

ఏడవకు అన్నావు గదా! అందుకే వారు మరుత్తులనే పేరుతో ఏడు లోకాలకు పాలకులుగా ఉంటారు. వారందరు సప్తవిధ వాయువులకు అభిమానులై ఉంటారు. అందులో ముగ్గురు బ్రహ్మ ఇంద్ర అంతరిక్షంలో పాలకులౌతారు. మరో నలుగురు నీ అధీనంలో నాలుగు దిక్కులకు అధిష్ఠాన దేవతలౌతారు" అని చెప్పింది.

తల్లి యొక్క ఆర్ద్ర వచనాలు పురందరుడు విన్నాడు. "అమ్మా! నీ కోరిక తప్పక తీరుతుంది. నీ కొడుకులు దివ్య స్వరూపులై సంచరిస్తారు. నన్ను క్షమించు" దేవేంద్రుడు అన్నాడు. అలా వారు మాట్లాడుకొని వెళ్ళిపోయారు.

"ఓ రామా! అలా దేవేంద్రుడు తన తల్లి తపోదీక్షలో పరిచర్యలొనర్చిన భూమి ఇదే" అని విశ్వామిత్రుడు చెప్పాడు.

"గురువర్యా! మరి ఈ విశాల నగరం ఇంతకుముందు ఎవరి పాలనలో ఉండేది. ఇప్పుడు ఎవరు దీనిని పాలిస్తున్నారు. ఆ విషయం మాకు చెప్పండి" అని రామలక్ష్మణులు విశ్వామిత్రుని అడిగారు.

విషయాసక్తిగల వారిరువురుతో విశ్వామిత్రుడు ఇలా చెప్పాడు. "ఈ విశాల నగరాన్ని ఇప్పుడు ఇక్ష్వాకుల వంశజుడైన కాకుత్స్థుని కుమారుడగు సుమతి అను రాజు పాలిస్తున్నాడు. ఈ నగరాన్ని పాలించిన రాజులందరూ మీ ఇక్ష్వాకువంశ సంభవులే రామచంద్రా!" అని విశ్వామిత్రుడు చెప్పాడు.

విశాల నగరాధీశులు తన వంశజులేనన్నది విని రామలక్ష్మణులకు ఆనందం వేసింది. లక్ష్మణుడు "ఓ మునిశ్రేష్ఠా! ఇంతకుముందు ఈ నగరాన్ని ఏలినవారి గురించి మాకు చెప్పండి. అది తెలుసుకోవాలన్న ఆతురత నాలో ఎక్కువ అవుతుంది" అని అన్నాడు.

"నరశ్రేష్ఠా! లక్ష్మణా! మీరు తెలుసుకోవాల్సింది చెప్తాను విను." ఇక్ష్వాకు మహారాజుకు అలంబుస వలన విశాలుడను ఒక కుమారుడు కలిగాడు. ఈ విశాలుడు పరమ ధార్మికుడు. ధర్మసంయుతంగా నీతిమంతంగా ప్రజలను పాలించాడు. అందుకే ఈ నగరం విశాలనగరం అనే పేరు స్థిరీకరించుకొంది. ఆ విశాలునకు హేమచంద్రుడు అను కొడుకు పుట్టాడు. హేమచంద్రునకు సుచంద్రుడను వాడు పుత్రుడు. ఇతనికి ధూమ్రాశ్వుడు అను పుత్రుడు కలిగాడు. వీరందరూ ఈ నగరాన్ని ఏలిన ఏలికలే. వీరందరూ ధార్మికులై ఈ భూమిని సుభిక్షం చేశారు. ప్రజల మన్ననలను పొందారు.

పరాక్రమశాలిగా సృంజయుడు పేరు తెచ్చుకొన్నాడు. ధూమ్రాశ్వునికి ఈ సృంజయుడు కొడుకు ఇతడికి సహదేవుడను బుద్ధిశాలి జన్మించాడు. సహదేవునకు కుశాశ్వుడు అను పుత్రుడు పేరుబడినవాడు. పరాక్రమశాలే కాక పరమ దయాళువుగా కూడా ఖ్యాతికెక్కాడు. ఇతనికి సోమదత్తుడనేవాడు కొడుకు. ఇతడు తేజశ్శాలిగా పేరుపొందాడు. సోమదత్తుని పౌత్రుడే సుమతి అని వంశ చరిత్రను వివరంగా విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు చెప్పాడు.

ఇంతలో విశాల నగరాధీశుడైన సుమతి వీరి ఆగమనాన్ని వేగులద్వారా తెలుసుకొన్నాడు. వెంటనే మంత్రి పురోహిత సుమేతుడై వీరిని ఆహ్వానించడానికి వచ్చాడు. "ఓ మహామునీ! మీ రాక నన్ను, నా రాజ్య ప్రజలను

ధన్యులను చేసిందంటూ సుమతి వారందరికి స్వాగత సత్కారాలను చేశాడు. మునిగణం, రామలక్ష్మణులు ఆ సత్కారాన్నంతా సంతోషంగా స్వీకరించారు. విశ్వామిత్రాదులు మహారాజు అయిన సుమతి నెరవేర్చిన పనులకు ఆనందించారు. ఆ రాత్రి ఆ ప్రదేశంలో గడిపారు.

"నన్ను ధన్యుడిని చేసి, నన్ను నా రాజ్య ప్రజలను కరుణించండి" అని విశ్వామిత్రుని సుమతి వేడుకొన్నాడు.

* * *

అహల్యా శాపం

సర్గ - 48

సుమతి విశ్వామిత్రులు ఒకరినొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకొన్నారు. సుమతి విశ్వామిత్రుని దగ్గర ఉన్న తేజోవిరాజమానులైన రామలక్ష్మణులను అబ్బురంగా చూశారు. రూపయౌవన సంపదతో చూపరులను ఆకట్టుకొనే వర్చస్సుతో వెలుగొందే ఈ రాజ కుమారులు ఎవరు మునివరా? వీరు మృదుపాదాలతో దుర్గమారణ్యంలో మీతో సంచరిస్తున్నారు ఎందుకు? అంటు సుమతీ మహారాజు ఆశ్చర్యాన్ని వ్యక్తంచేశాడు. విశాల నగరాధీశుడితో విశ్వామిత్రుడు రామలక్ష్మణుల గురించి చెప్పాడు. వారిద్దరివలన యాగపరిసమాప్తి పొందిన విధం విన్నాడు. తన వంశజులైన మహానుభావులు తమ నగరానికి విచ్చేశారని సుమతి ఆనందించాడు. అలా వారు మాట్లాడుకొంటూ నిద్రాదేవి ఒడిలో జోగుతూ వారు రాత్రి విశ్రమించారు.

మరుసటిరోజు మిథిలకు ప్రయాణమయ్యారు. మిథిలా నగరానికి దగ్గరగా వున్న ఒక ప్రదేశానికి చేరారు. శ్రీరాముడు ఆ ప్రదేశాన్ని పరికించాడు. "ఓ మునిశ్రేష్ఠా! పవిత్రంగా ఉన్న ఈ ప్రదేశం ఆశ్రమమేమో అనిపిస్తోంది. కాని ఇక్కడ మునులు ఎవరు కనిపించడంలేదు. నిర్జనంగా వున్న ఈ ఆశ్రమగాథ తెలుపుము" అని రాముడు విశ్వామిత్రుని అడిగాడు. "రామచంద్రా! ఈ ప్రదేశం గౌతమముని ఆశ్రమ వాటికగా వుండేది. ఆయన కోప కారణంగానే ఇవి నిర్జనంగా వుంది. ఒకసారి దేవేంద్రుడు గౌతమ మహాముని భార్య ఐన అహల్య అందానికి దాసుడయ్యాడు. పరమ నిష్ఠాగరిష్ఠుడైన గౌతముడు ఆశ్రమంలో లేని సమయంలో గౌతమముని రూపం దాల్చి దేవేంద్రుడు అహల్య దగ్గరకు వచ్చాడు. తన ఇచ్ఛానుసారం వర్తించమని ప్రార్థించాడు. అహల్య తన తపశ్శక్తితో గౌతముని వేషం దాల్చిన దేవేంద్రుని గుర్తించింది. కాని అతని కోరికకు తన సమ్మతిని తెలిపింది. ఆ తర్వాత అహల్య ఇంద్రునితో "అయ్యా కృతార్థురాలైతిని" అంది. కాని, తర్వాత దేవరాజైన ఈ సహస్రాక్షుడు ఎందుకీవిధంగా ప్రవర్తిస్తున్నాడనుకొంది. పరిపరివిధాల ఆలోచించింది. "ఓ అనిమిషపతీ! నీవు ఇటనుంచి శీఘ్రముగా మరలిపో! అదియే నీకును నాకును మంచిది" అని చెప్పింది. చూచినంతనే తాను ఎవరో తెలుసుకొన్న అహల్య చూసి దేవేంద్రుడు భయపడ్డాడు. తన తప్పును క్షమించమని చెప్పి మరలాడు. ఆశ్రమ వాకిట గౌతమ ముని రావడం చూచి దేవేంద్రుడు తత్తరపడ్డాడు. కనబడకుండా వెళ్లేందుకు ప్రయత్నించాడు. గౌతముడు వానిని చూడగానే తన

దివ్యదృష్టి పథంలో దేవేంద్రుని ఆగడాన్ని చూచి క్రుద్ధుడై విగత వృషణుడివి కమ్మని శపించాడు. తర్వాత దుష్టచింతనునితో మాట్లాడిన అహల్యను చూచి "వాయుభక్షణతో ఎవరికీ కనపడకుందువుగాక" అని గౌతముడు తన భార్య అయిన అహల్యను శపించాడు. అహల్య తాను చేసిన పొరపాటును క్షమించవలసిందిగా ప్రార్థించింది. ఆమె పశ్చాత్తాపాన్ని గుర్తించిన గౌతముడు "దశరథ మహారాజు కుమారుడైన రాముడు ఈ ప్రదేశానికి వచ్చినప్పుడు అతనికి అతిథి సత్కారాలు చేసి లోభ మోహ మదమాత్సర్యాలను పొగొట్టుకుంటావు" అని శాపాన్ని ఉపశమింపచేశాడు. అందువల్లనే ఈ ప్రదేశం నిర్జనమై వుంది. అగ్నివలె తేజస్సు కలిగిన ఆ మహాముని తాను దుర్వర్తనులను శపించినందువల్ల కలిగిన పాపాన్ని నిర్మూలనం చేసుకోవడానికి హిమవత్పర్వత శిఖరాలకు వెళ్లాడు అక్కడే ఆయన తపస్సు చేసుకొంటున్నాడు అని అహల్య గౌతముల గురించి విశ్వామిత్రుడు రామాదులకు చెప్పాడు. ఇది ఋషిప్రోక్తం ఆదికావ్యం రామాయణం.

* * *

అహల్యాశాపవిముక్తి

సర్గ - 49

గౌతమునిచే శపించబడిన మహేంద్రుడు దుఃఖితుడయ్యాడు. ఆయన తన సహచరులతో కలిసి నేను గౌతముని తపస్సు హరించడానికై అహల్య దగ్గరకు వెళ్ళాను. కాని ఆ మహాత్ముడు నన్ను శపించడమే కాక మహాతల్లి అయిన అహల్యను పరిత్యజించాడు. గౌతముడు తన తపశ్శక్తిని కోల్పోయాడు. నేను దైవకార్యం జరిగిందనుకొన్నాను. కాని నేను మాత్రం వృషణ హీనుడయ్యాను. నాకు మీరు వృషణాలు ఎలా లభిస్తాయో చెప్పండి అన్నాడు.

మరుద్గణములు వాయువు తదితరులతో కలిసి ఇంద్రుడు బ్రహ్మదేవుని చెంతకు వెళ్లారు. ఆయనతో జరిగిన విషయం చెప్పి చింతించారు. జరగవలసిన కార్యాలు తప్పక జరిగి తీరుతాయి. దానిని నివారింప చేయడానికి ఎవరికీ సాధ్యం కాదు. నీవు శాపోహహతుడవు కావాలని ఎప్పుడో నిర్ణయం అయింది. కావుననే నీవీనాడు శాపానికి గురయ్యావు. దానికై నీవు బాధపడకు అని బ్రహ్మ దేవేంద్రునికి నచ్చచెప్పాడు.

మరి నా గతి ఏమిటి అంటూ దేవేంద్రుడు చూశాడు. "ఓ సురాధిపతీ! నీకు మేష వృషణాలద్వారా సంతృప్తి కలుగుతుంది" అని చెప్పాడు. అగ్నిదేవుడు మేష వృషణాలను దేవేంద్రునకు ఇచ్చాడు. అప్పటినుంచి పితృదేవతలు వృషణ రహిత మేషములు అందుకుంటూ అవి ఇచ్చినవారికి కావాల్సిన ఫలాలను అందజేస్తున్నాడు.

"ఓ రామచంద్రా! దివ్యసుందరి మహాత్మురాలైన అహల్య దుర్నిరీక్ష్యమై నీకోసం నిరీక్షిస్తూ వుంది. ఆ మహాసాధ్విని అనుగ్రహింపుము" అంటూ విశ్వామిత్రుడు రామలక్ష్మణులతో కలిసి గౌతమ ఆశ్రమంలోకి ప్రవేశించారు. రామదర్శనంతో అప్పటివరకు అదృశ్య ఐన అహల్య సశరీరంతో అందరినీ వీక్షించింది. "రామచంద్రా!

నన్ను రక్షింపుము" అని ప్రార్థించింది. పతివ్రతామతల్లి ఐన అహల్య కనబడగానే రాముడు ఆమెకు పాదాభివందనం చేశాడు. ఇదంతా గౌతముడు తన దృష్టిపథంలో చూశాడు. వెనువెంటనే తన ఆశ్రమానికి చేరాడు. అహల్యతో కూడి విశ్వామిత్రునకు అంజలి ఘటించాడు. రామలక్ష్మణులను సాదరంగా ఆహ్వానించాడు. అతిథి సత్కార విశేషాలతో వారిని పూజించాడు. ముల్లోకాలవారు దర్శించగోరే రామభద్రుడిని శక్త్యనుసారంగా పూజించారు. దీనిని చూచిన దేవతలు దుందుభులు మ్రోగించారు. పుష్పవృష్టిని కురిపించారు. ఇరువురు పరమానంద భరితులయ్యారు. సంతోషంతో విశ్వామిత్రుడు మిథిలానగరానికి రామలక్ష్మణులతో బయలుదేరాడు.

* * *

మిథిలానగర ప్రవేశం

సర్గ - 50

విశ్వామిత్రుడు, రామలక్ష్మణులు మిథిలానగర ప్రవేశం చేశారు. జనకుని యజ్ఞభూమిని దర్శించారు. అక్కడ ప్రశాంతంగా వున్న ప్రదేశాన్ని తమకు నివాసయోగ్యంగా చేసుకున్నారు. దానిని జనకమహారాజు తెలుసుకొన్నాడు. పురోహితుడైన శతానందునితో కలిసి జనకుడు విశ్వామిత్రుని దగ్గరకు వచ్చాడు. అర్ఘ్యపాద్యాదులనిచ్చి సత్కరించాడు. ఆ మహామునితో వున్న రామలక్ష్మణులను చూశాడు. "విశ్వామిత్ర మహర్షీ! మీతోవున్న వీరు ఎవరు? తామరరేకుల వంటి కన్నులతోను, జులపాల జుట్టుతోను, దివ్యతేజస్సును కలిగివున్న ఈ ధనుర్బాణధారులు ఎవరి తనయులో చెప్పండి" అంటూ జనకుడు అడిగాడు.

రాజర్షి మాటలు విన్న విశ్వామిత్రుడు సంతోషించాడు. "జనక మహారాజా! వీరు దశరథనందనులు అయోధ్యాపురవాసులు. నా యజ్ఞకార్యార్థం నాతో వచ్చారు. దానవపీడను వదిలించారు. యజ్ఞఫలాన్ని అందించారు. అహల్యా శాపవిమోచన గావించిన పురుషోత్తముడు ఈ శ్రీరాముడు. ఆయన తమ్ముడు లక్ష్మణుడు" అంటూ వారిద్దరిని పరిచయం చేశాడు. మీ ఇంట వుండే శివధనుస్సును గురించి విని దానిని చూడాలనే కోరికతో వచ్చారు. దివ్యశక్తిగల వీరిరువురు నా దగ్గరకు రావడం ఎంతో సంతోషదాయకం. తప్పక మీకు ఆ ధనుస్సును గురించి చెప్తాను. విశ్వామిత్రా! మీరందరూ వచ్చినందువల్ల నా జన్మ ధన్యమైంది. నా యజ్ఞఫలం నాకు తప్పక అందుతుందన్న నమ్మకం నాకు కలుగుతోంది - అన్నాడు జనకుడు.

విశ్వామిత్ర మహర్షి "జనకమహారాజా! నీ యజ్ఞం సాంగోపాంగంగా జరుగుతోంది. ఇంక ఎన్నిరోజులు నీ యాగం సాగుతుందో నీ యజ్ఞ విశేషాలను వినాలనే నా కోరికను తీర్చు" అని అడిగాడు. "గురువర్యా నా యజ్ఞం మరో 12 రోజులకు పూర్తవుతుంది. హవిస్సులను కొనిపోవచ్చే దేవతలను కూడా మీరందరూ చూడవచ్చు. మీకందరికి తగిన వసతులను కల్పించుతాను. మీరు విశ్రాంతి తీసుకోండి" అని జనకుడు చెప్పాడు. విశ్వామిత్రాదులందరూ విశ్రమించారు. రేరాజు తన పని తాను నెరవేర్చడానికి ఆకాశ పథవిహారానికి వచ్చాడు. తారలన్నీ చంద్రుని అనుసరిస్తూ గగనవాహ్యాళికి వచ్చాయి.

* * *

శతానందుని ఆనందం

సర్గ - 51

గొప్ప తేజశ్శాలియైన గౌతమ మహాముని కుమారుడు శతానందుడు. విశ్వామిత్రుని పూజించిన తర్వాత "ఓ మునిపుంగవా! మా అమ్మ మీకు కనిపించిందా? మా తండ్రిగారి చెంతకు ఆనందంగా చేరిందా? గౌతమ మహామునిపుంగవుని శాపం నుంచి ఈ శ్రీరాముని దయతో విముక్తి లభించిందా? వారి గురించి సవివరంగా నాకు చెప్పండి" అని శతానందుడు అడిగాడు. శతానందుని సంశయాలన్నీ విశ్వామిత్రుడు తీర్చాడు. దానితో శతానందునికి రామునిపై పూజ్యభావం పెరిగింది. "తండ్రీ రామచంద్రా! నీవు నరులలో శ్రేష్ఠుడవు నీ దర్శనభాగ్యం నాకు ఎనలేని సంపదను ఇస్తుంది. నీవలన నా తల్లిదండ్రులు ధన్యులయ్యారు" అని శ్రీరాముని పొగిడాడు.

"ఈ విశ్వామిత్రుడు నీకు గురువుగా దొరకడం నీ తపఃఫలమే. ఈ మునిశ్రేష్ఠుడు ఒకప్పుడు అక్షౌహిణీ సైన్యంతో కలిసి భూమండలాన్నంతా చుట్టివచ్చాడు. రాజుగా భూమిని ఏలి నరులను దేవతలను సంతృప్తి పరిచాడు. ఇప్పుడు తపఃసంపన్నుడై ఎదురులేనట్టి శక్తిని సంపాదించాడు. నీ గురువువల్ల నీ ఖ్యాతి ఇనుమడిస్తుంది" అంటూ గాధిసుతుని యందు తనకుగల అపారమైన గౌరవాన్ని తెలిపాడు.

రాజుగానున్న విశ్వామిత్రుడు ఒకసారి వసిష్ఠాశ్రమానికి వెళ్లాడు. అక్కడున్న ప్రశాంత వాతావరణానికి ముగ్ధుడయ్యాడు. తపస్సిద్ధి పొందిన అక్కడి మునులు అగ్నిదేవతలవలె కనిపించారు. వారిలో కొందరు కేవలం జలపానం చేసేవారు. మరికొందరు రాలిపడిన పండ్లనే భుజించేవారు. ఇంకొందరు వాయువునే తమ ఆహారంగా చేసుకొని వుండేవారు. కొందరు ఆకులనే స్వీకరించేవారు. వారి దగ్గరే బ్రహ్మకుమారులు వాలఖిల్యులు వైఖానసులు, జపహోమాలు చేస్తుండేవారు. దానినంతా చూచి విశ్వామిత్ర మహారాజు ఇది బ్రహ్మలోకంవలె భాసిస్తోందని అనుకొన్నాడు.

* * *

వసిష్ఠుని ఆతిథ్యం

సర్గ - 52

గొప్ప బలసంపన్నుడైన విశ్వామిత్రుడు మహాత్ముడైన వసిష్ఠుడు చాలాసేపు కుశల ప్రశ్నలు వేసుకొన్నారు. ఒకరిని గురించి మరొకరు అన్ని విషయాలను మాట్లాడుకొన్నారు. ఆ ధర్మాత్ములిరువురు కథాప్రసంగాలతో తృప్తిపొందారు.

దానితో వసిష్ఠునకు రాజశ్రేష్ఠుడైన విశ్వామిత్రునిపై ఆదరం పెరిగింది. "ఓ మహారాజా! నీవు, నీ పరివారం నా ఆతిథ్యాన్ని స్వీకరించండి. మీరు ఇక్కడకు రావటం నాకు ఎంతో సంతోషాన్ని కలుగచేస్తోంది" అని వసిష్ఠుడు విశ్వామిత్రునితో అన్నాడు.

"ఓ వందనీయా! మీరు మాకు ఇచ్చిన కందమూలాలు, పండ్లు, పానీయాలు మా ఆకలి దప్పులను తీర్చాయి. మీ హితవచనాలు మా హృదయాన్ని సంతోషంతో నింపివేశాయి. దానివల్ల మేము ఎంతో ధన్యులం అయ్యాం. ఈ సత్కారం మాకు చాలు" అని విశ్వామిత్రుడు వసిష్ఠునకు ప్రత్యుత్తరం ఇచ్చాడు.

"విశ్వామిత్రా! అదంతా బాగుగా ఉంది. కానీ, నా తృప్తికై నేను ఇచ్చే ఆతిథ్యాన్ని తీసుకోండి" అని అడిగాడు. పలుమార్లు అడుగుతున్నందున విశ్వామిత్రుడు "మీ అభీష్టం ప్రకారమే మాకు ఆతిథ్యాన్ని ఇవ్వండి. మేము ఆనందంగా స్వీకరిస్తాం" అన్నాడు. దానితో వసిష్ఠుడు ఆనందించాడు.

'శబలా!' అంటూ కామధేనువును పిలిచాడు. "ఓ కామధేనువా ఈరోజు మన ఆశ్రమానికి విశ్వామిత్ర మహారాజు అతని పరివారం ఏతెంచారు. వారినందరిని నేను సంతుష్టపరచాలని అనుకొంటున్నాను. అందుకై నీవు ఎవరికి కావాల్సిన వాటిని వారికి అందజేస్తూ మృష్టాన్న భోజనాన్ని పెట్టి వీరందరిని సంతోషపరచు" అంటూ చెప్పాడు. రుచికరములైన ఆహార పదార్థాలన్నింటిని వారందరికి కావల్సిన వాటినన్నింటిని సమకూర్చుమని చెప్పాడు.

* * *

విశ్వామిత్రుని కోర్కె తిరస్కరించటం

సర్గ - 53

వసిష్ఠుని ఆదేశం ప్రకారం కామధేనువు మృష్టాన్న భోజనంలో, వివిధరకాల ఆహార పదార్థాలను రసాలను, లేహ్యాలను, నానావిధ పరిమళ మధుర పదార్థాలను సృష్టించింది. వాటన్నింటిని విశ్వామిత్రాదులు ఆరగించి సంతుష్టులయ్యారు.

వశిష్ఠుని ఆదరాభిమానాలకు, క్షణంలో ఏర్పాటు చేసిన సమస్త సౌకర్యాలను చూచి విశ్వామిత్రుడు విస్మయం చెందాడు. భోజనాదులతో తృప్తిచెందిన ఆ రాజేంద్రుడు వసిష్ఠుని దగ్గరకు వచ్చాడు. "ఓ బ్రహ్మర్షీ! నీవు పూజనీయుడవు. నేను నీకు లక్ష గోవులను ఇస్తాను. గోరత్నం అయిన ఈ కామధేనువు నాకు దానంగా ఇవ్వు. నేను రాజును కాబట్టి భూమండలంలోని రత్న రాసులన్నిటికి నేను అధిపతిని కావున ఈ ధేనువు న్యాయానుసారంగా నాకే చెందవలసి వుంది" అన్నాడు విశ్వామిత్రుడు.

ధర్మాత్ముడైన వసిష్ఠుడు విశ్వామిత్రునితో శాంతంగా "అయ్యా రాజేంద్రా! నీవు లక్షకాదు గదా! శతకోటి గోవులను, రత్నరాసులను ఇచ్చినప్పటికీ నేను ఈ ధేనువు నీకు ఇవ్వలేను. దీనికి నాకు విడదీయరాని బంధం పెనవేసుకున్నది. దీనిని నేను నీకు ఏవిధంగాను ఇవ్వలేను. నీవు ఏది కోరినా నేను ఇవ్వడానికి సంసిద్ధుడనే. ఒక్క ఈ కామధేనువు విషయంలో నేను నిన్ను తృప్తిపరచలేను" అన్నాడు. వసిష్ఠుని మాటలు విశ్వామిత్రునికి ఆగ్రహాన్ని తెప్పించాయి. కోపవశుడైనాడు. "ఓ వసిష్ఠా! నీకు గోవులేకాక చిరుగంటల పట్టెడలతోవున్న శ్వేతాశ్వాలను, బంగారు రథాలను, గంధర్వ జాతికి చెందిన బలిష్ఠమైన ఏనుగులను నీకు సమర్పిస్తాను.

ఆశ్రమవాసివైన నీ దగ్గరకన్నా నా దగ్గర ఈ కామధేనువు చక్కగా పోషించబడుతుంది. నీవు కాదనక గోవును ఇచ్చివేయి" అని కఠినంగా విశ్వామిత్రుడు పలికాడు.

"ఓ నరశ్రేష్ఠా! నా అభ్యర్థనను ఆలకించు. ఈ గోవు వల్ల నా అనుష్ఠాన కార్యాలు యజ్ఞాలు జరుగుతున్నాయి. ఆశ్రమవాసినైన నాకు ఈ ధేనువే సర్వం. ఈ నా ఆశ్రమంలో నాకు సమస్త కార్యనిర్వహణ ఈ ధేనువుచే సమకూరుతున్నది. ఇదియే నాకు రత్నాల గని. ఇదే నా జీవనాధారము. రాజువై వుండి ఈ ధేనువును కోరుట నీకు అనుచితం. ఇక పెక్కు మాటలు అనవసరం. నేను నీవు ఏమి ఇచ్చినా ఈ కామధేనువును ఇవ్వను" అని వసిష్ఠుడు విశ్వామిత్రునితో ఖచ్చితంగా చెప్పాడు.

* * *

కామధేనువుకై సేనాప్రయోగం

సర్గ - 54

వసిష్ఠుని నిరాకరణ విశ్వామిత్రునిలో క్రోధం పెంచింది. క్రోధావేశంలో వసిష్ఠుడు వివేకహీనుడయ్యాడు. తన సేనలకు బలవంతంగా గోవును లాక్కురమ్మని ఆదేశించాడు. విశ్వామిత్రుని సేన వసిష్ఠుని ఆశ్రమంలోకి జొరబడి అక్కడవున్న గోవును ఈడ్చుకొనిపోయారు.

ఆ గోవు ఇది ఏమిటి? నేను చేసిన అపరాధం ఏముంది? నన్ను మహితాత్ముడైన వసిష్ఠుడు పరిత్యజించాడు. గర్వితులైన వీరు నన్ను ఇలా ఈడ్చుకెళ్తున్నారు. ఈ ఆశ్రమంలో నేను నిశ్చింతగా జీవిస్తూ వుంటిని. ఈనాడు నాకు ఈ దురవస్థ కలిగింది. నన్ను నిజంగానే వసిష్ఠుడు వదిలేశాడా? నన్ను రక్షింప పూనుకొనటం లేదేమి అని అనుకొన్నది.

వసిష్ఠుడు జరుగుతున్నదానిని అలా చూస్తూ నిలబడ్డాడు. అంతలో బలాన్వితులైన విశ్వామిత్రుని సేనను ఒక్కసారిగా విదిలించి పరుగెత్తింది ధేనువు. అలా పరుగెత్తుతూ వచ్చి వసిష్ఠుని పాదాలచెంత మోకరిల్లింది."ఓ మునిపుంగవా! పరిస్థితిని చూచి ఊరుకున్నావు. నన్ను పరిత్యజించుటకు నేను చేసిన అపరాధం ఏమిటి?" అని అడిగింది.

"ఓ శబలా! నిన్ను రాజ్యాధిపతి అమిత బలశాలైన విశ్వామిత్రుడు కోరాడు. నేను ఇవ్వ నిరాకరించినా బలవంతంగానైనా నిన్ను పొందాలనే నిశ్చయానికి వచ్చాడు. అట్టి రాజుతో బ్రాహ్మణుడనై నేను పోరాడలేను. అక్షౌహిణీ సైన్యాన్ని కాని విశ్వామిత్రునికాని ఎదిరించలేను. క్షత్రియ బలాన్ని ఎదిరించి నిన్ను కాపాడలేను" అని చెప్పాడు. "శబలా నేను అట్టి రాజుతో పోరాడలేను" అని అంటున్న వసిష్ఠుడ్ని చూచి ధేనువు ఆశ్చర్యపడింది. "అయ్యా! వసిష్ఠా నీవు పొరబడుతున్నావు. విశ్వామిత్రుడు బలశాలియైన రాజే కాని, బ్రాహ్మణుని బలం క్షత్రియ

బలాన్ని మించింది. తపోధనుడివైన నీవు నన్ను కాదు ఈ భూలోకాన్ని, దేవతలను సైతం నిలవరించగలవు. నీవు నీ సత్ప్రవర్తనతో తపశ్శక్తితో దేనికైనా తృటిలో పొందగలవు నన్ను ఆజ్ఞాపించు నేను నీ ఆజ్ఞలను శిరసావహిస్తాను. ఈ గర్వాతిశయుడైన విశ్వామిత్రునకు సద్బుద్ధి కలిగిస్తాను" అని చెప్పింది.

సాధుశీలైన కామధేనువు మాటలు వసిష్ఠుడు ఆలకించాడు. "శత్రువులకు బుద్ధిచెప్పుము నీవు సేనలను సృష్టించి విశ్వామిత్రుని ఎదిరించుము" అని వసిష్ఠుడు శబలను ఆదేశించాడు. వెంటనే శబల పహ్లవులను సృష్టించింది. వారందరూ వెళ్లి విశ్వామిత్రుని సేనావాహినిని భయభీతులను చేశారు.

దీన్ని చూచిన విశ్వామిత్రుడు క్రోధంతో రగిలిపోయాడు. కన్నులెర్రజేస్తూ అనేక శస్త్ర అస్త్ర ప్రయోగాలు చేస్తూ పహ్లవులను హతమార్చాడు. దానినిచూచి కామధేనువు శకులు, యవనులను సృష్టించింది. వారు విశ్వామిత్రాదులపై దుమికారు. పెద్దపెద్ద కృపాణములను ఖడ్గములను ధరించి విశ్వామిత్రుని బలాలన్నింటిని అగ్నిజ్వాలలవలె దహించివేశారు. విశ్వామిత్రుడు వారిపై అస్త్రప్రయోగం చేశాడు. యవనులు కాంభోజులు పహ్లవులు అందరూ చెల్లాచెదరయ్యారు.

* * *

వసిష్ఠాశ్రమ ధ్వంసం

సర్గ - 55

విశ్వామిత్రుని ధాటికి సైనికులు చెల్లాచెదరయ్యారు. వ్యాకులచిత్తులయ్యారు. వసిష్ఠుడు కామధేనువును పిలిచి ఏమాత్రం భయం లేదు. నీవు నీ శరీరావయవాలనుండి వివిధ సేనా జాతులను సృజించు. వారందరూ విశ్వామిత్రుని నిలువరించగలరు అని చెప్పారు.

కామధేనువు కాంభోజులు, యవనులు, ప్లవులు, శకులు, మ్లేచ్ఛులు అందరిని సృష్టించింది. వారందరూ ఒక్కటయ్యారు. విశ్వామిత్రుని నిలవరించడానికి శాయశక్తులా పోరాడసాగారు. క్షణకాలంలోనే విశ్వామిత్ర సేనావాహిని అంతం అయ్యింది. దాన్ని విశ్వామిత్రుని సుతులు చూచి కోపం తెచ్చుకొన్నారు. వందమంది సుతులు ఒక్కసారిగా వసిష్ఠునిపై దాడికి పూనుకొన్నారు. వసిష్ఠుడు వారిని హుంకరించాడు. ఆ హుంకార ధ్వనిచే వారందరూ హతులయ్యారు. చతురంగబలాలు, సేనలు అన్నీ కోల్పోయిన విశ్వామిత్రుడు ఖిన్నుడయ్యాడు. అతని వేగం ఉపశమించింది. నిర్వేదం ఆవరించింది.

విచారగ్రస్తుడైన విశ్వామిత్రుడు రాజ్యభారాన్ని తన కుమారునకు అప్పగించాడు. క్షత్రియానుసారంగా రాజ్యాన్ని పాలింపుము అని చెప్పాడు. ఓ రామచంద్రా! ఇలా ఆ విశ్వామిత్రుడు విచారుడై రాజ్యభారాన్నుంచి తప్పించుకొన్నాడు.

కాని అవమానభారంతో అతని హృదయం మండుతూనే ఉంది. వసిష్ఠుని గొప్పతనాన్ని విశ్వామిత్రుడు జీర్ణం చేసుకోలేకపోయాడు. తనను మించిన వారు ఉన్నారనే విషయం అతనిని నిలవనీయలేదు. బాగా ఆలోచించి తాను అనుకొన్నది సాధించడానికి తపస్సు మంచిదనుకొన్నాడు. భగవంతుని కోరితే అతడు ఇవ్వలేనిది ఏది ఉండదు గదా! నేను వసిష్ఠునంతటి గొప్పతనం సాధించాలంటే తప్పనిసరిగా భగవంతుని ఆరాధించాలి. పరమ శివుని మెప్పించి నేను అనుకొన్నది సాధించాలి అనుకొన్నాడు. వెంటనే హిమవత్పర్వత ప్రాంతానికి చేరాడు. అక్కడ పరమ శివుని గూర్చి తపస్సు చేశాడు.

అతని పట్టుదలకు శివుడు ఆశ్చర్యంతో ఆనందించాడు. విశ్వామిత్రునకు దర్శనం ఇచ్చాడు. "కుమారా! నీవు మహారాజువు గదా! ఎందుకోసం ఈ తపం చేస్తున్నావు. నేను నీ తపస్సుతో ప్రీతిచెందాను. నీ కోరికను తెలుపు. దానిని నేను అంగీకరిస్తాను" అని అన్నాడు.

వెంటనే విశ్వామిత్రుడు "పరమేశ్వరా! అస్త్రశస్త్ర విద్యలన్నింటిని నాకు ప్రసాదించు. యక్ష కిన్నర కింపురుషుల దగ్గర ఉండే విద్యలను, రాక్షసులకు తెలిసిన విద్యలను నీకు ఉపదేశించు. ధనుర్విద్యను ఉపనిషద్రహస్యాలను నాకు ప్రసాదించు స్వామీ అని వేడుకొన్నాడు. మహాదేవుడు నీ కోర్కె తీరుగాక!" అంటూ అంతర్ధానం చెందాడు.

అస్త్రశస్త్ర విద్యలు నాకు దొరికాయి అని విశ్వామిత్రునికి సంతోషం వేసింది. తాను వసిష్ఠునికన్నా అస్త్రశస్త్ర విద్యలలో గొప్ప నన్న అహం విశ్వామిత్రునిలో పొడ చూపింది. అణగారిన గర్వం అతిశయించింది. మూర్ఖం తలఎత్తింది. వెంటనే వసిష్ఠుని పని పట్టాలని భావించాడు. ఆ తరుణంలోనే వసిష్ఠునిపైకి ఉరికాడు. ప్రశాంతంగా ఉన్న ఆశ్రమాన్నంతా అస్త్ర శస్త్ర ప్రయోగంతో ఛిన్నాభిన్నం చేశాడు. క్రూరమృగాలు సైతం స్వభావ సిద్ధమైన క్రౌర్యాన్ని వదిలి సాధుత్వాన్ని అవలంబించి వసిష్ఠాశ్రమంలో సంచరించేవి. అటువంటి మృగాలను పక్షులను భీతావహులను చేశాడు. తపశ్చర్యలో మునిగిపోయి ఉన్న మునులను భయభ్రాంతులను చేశాడు. సస్యశ్యామలమైన ఆ ప్రదేశాన్ని తృటికాలంలో ఊసరక్షేత్రం చేశాడు.

దీన్నంతా చూసి వసిష్ఠుడు మిగుల విచారించాడు. ఆశ్రమవాసులందరిని భయపడకండని ధైర్యవచనాలు చెప్పాడు. వసిష్ఠుని మాటలు వినకుండానే అక్కడి జనం పరుగులు తీశారు. జపహోమ తత్పరుడైన వసిష్ఠుడు విశ్వామిత్రుని చూచి క్రుద్ధుడయ్యాడు.

"ఓరి గర్విష్ఠి! నిర్దయుడివై తాపసులను, మూగజీవులను కల్లోల పరుస్తావా? ఇక నిన్ను ఉపేక్షించడం మంచిది కాదు" అన్నాడు.

"నీ గర్వాతిశయం సాధువుల హింసకు కారణం అవుతోంది. ఇది నీకు నాశన హేతువు అవుతుందన్న విషయం నీకు తెలియడంలేదు" అంటూ క్రోధావేశంతో ప్రళయాగ్ని వలె ఉన్న యమదండంలాంటి బ్రహ్మదండం చేబూనాడు. బ్రాహ్మణుని కోపం ఎంతటి వినాశకారో తెలియచెప్పుతాను. మూగజీవులను బాధించడం అంటే సర్వేశ్వరుని బాధించడమే నని నీకు నా చర్యతో తెలిసివస్తుంది అంటూ వసిష్ఠుడు విశ్వామిత్రుని ఎదుట నిలబడ్డాడు.

* * *

వసిష్ఠుని తేజం

సర్గ - 56

వసిష్ఠుని విశ్వామిత్రుడు చూశాడు. ఆగ్నేయాస్త్రంతో వసిష్ఠుని అంతం చేయాలని తలచాడు. కాని ఆ ఆగ్నేయాస్త్రాన్ని వసిష్ఠుని బ్రహ్మదండం నీరుకార్చింది. "ఓ దుష్టచరితా! నేను ఇక్కడనే ఉంటాను. నీ బలం ఎంతో చూపు. గాధి సుతా! దుర్బుద్ధితో సదాచారులను హింసించావు. నీకు విజయం చేకూరదు" అని వశిష్ఠుడు అన్నాడు.

ఆ మాటలకు మండిపడ్డ విశ్వామిత్రుడు తన అస్త్ర శస్త్ర నిపుణతను చూపి ఆ మహానుభావునికన్నా గొప్పవాడినని రుజువుచేసుకొందామని అనుకొన్నాడు. వెంటనే పరమశివుడు ప్రసాదించిన అస్త్రాలను శస్త్రాలను వసిష్ఠునిపై వర్షంలాగా కురిపించాడు. వాటినన్నింటిని తన తేజోమయమైన బ్రహ్మదండంతో వశిష్ఠుడు ఎదుర్కొన్నాడు.

నిర్వీర్యమౌతున్న తన బలాన్ని చూస్తూ తాను అభ్యసించిన యక్షరాక్షస విద్యలను ప్రయోగించాడు విశ్వామిత్రుడు. వాటిని కూడా నిర్వీర్యం చేశాడా వసిష్ఠుడు. విశ్వామిత్రుని అస్త్రాలన్ని వమ్మైపోయాయి. దానితో బ్రహ్మాస్త్రాన్ని వసిష్ఠునిపై ప్రయోగించాడు.

ఆ బ్రహ్మర్షి విజృంభణకు అందరూ భయపడ్డారు. తాపసులు సాధువులు గంధర్వులు నాగులు చారణులు సమస్త ప్రజానీకం భీతావహం చెందింది. దిక్కులన్నీ దద్దరిల్లాయి. అటువంటి భయంకరమైన బ్రహ్మాస్త్రం వసిష్ఠుని చెంతకు వచ్చి బ్రహ్మదండం ముందు తేజోవిహీనం అయ్యింది.

దాన్ని చూచిన వారందరూ వసిష్ఠుని ప్రస్తుతించారు. "వసిష్ఠ మహామునీ! శాంతించు. గర్వాతిశయుడైన విశ్వామిత్రుని ఆగడాలను అరికట్టిన తేజోమయుడవు నీవు. ముల్లోకాలకు శాంతిని చేకూర్చే నీకు ఆగ్రహంవలదు స్వామీ! మాయందు దయచూపు" అని వేడుకొన్నారు.

దేవతలు వసిష్ఠుని కీర్తిప్రతిష్ఠల పెరగాలని దీవించారు. జనశ్రేష్ఠి సాధువర్తనులపై దయచూపి ప్రశాంత చిత్తుడవు కమ్ము అంటూ వేడుకొన్నారు. వారందరి మాటలు విని వసిష్ఠుడు ఉపశమించాడు. ప్రశాంత వదనుడయ్యాడు. ఓటమిపాలైన విశ్వామిత్రుడు సిగ్గుతో కుంచించుకుపోయాడు. క్షత్రియబలం ఎందుకూ కొరగానిదని తెలుసుకొన్నాడు. గర్వం మంచిది కాదని తలపోశాడు. తన కోపమే తన్ను నాశనం చేసిందని పశ్చాత్తాపపడ్డాడు. ఒక్క బ్రహ్మదండమే అన్నింటిని నిర్వీర్యం చేసింది. ఆ బ్రాహ్మణత్వమే అన్నింటికన్నా గొప్పది. సాధుబుద్ధి, సత్ప్రవర్తనే బ్రాహ్మణత్వానికి మూలం అని గ్రహించాడు. తాను సైతం బ్రహ్మర్షి అవ్వాలని ఆలోచించాడు. ఈ కోపతాపాలను ఆశనిరాశలను త్యజించాడు. కోరిక లేక నిస్సంగుడినైతే బ్రహ్మత్వం వస్తుందని తలచాడు. వెంటనే తపోవనాలకు బయలుదేరాడు. ప్రశాంత చిత్తుడయ్యాడు. ఇంద్రియాలను నిగ్రహించాడు. తపస్సులో మునిగిపోయాడు.

* * *

త్రిశంకుని కాంక్ష

సర్గ - 57

"ఓ రఘునందనా!విశ్వామిత్రుని గురించి చెప్తాను విను." వసిష్ఠునితో వైరం పెంచుకొని దుర్దశను విశ్వామిత్రుడు కొనితెచ్చుకొన్నాడు. దానితో ఎల్లప్పుడు వైరాగ్య భావనలో ఉండేవాడు నైరాశ్యపు మాటలు మాట్లాడేవాడు. ఒకసారి ఆయన పెద్ద భార్యతో కలిసి దక్షిణ దిశకు వెళ్ళాడు.

ఇంద్రియ నిగ్రహం చేసుకొన్నాడు. వేయి వత్సరాలు బ్రహ్మకోసం తపస్సు ఆచరించాడు. అక్కడ ఆయనకు నలుగురు పుత్రులు కలిగారు. తపస్సులో ఉన్న విశ్వామిత్రునకు బ్రహ్మ ప్రత్యక్షం అయ్యాడు. చతుర్ముఖుడు "ఓ రాజర్షీ"అని సంబోధన చేశాడు. కోరిక తీరని వాడైన విశ్వామిత్రుడు "పద్మసంభవా!" అంటూ చేతులు జోడించాడు. "నీ తపశ్చర్యతో నేను ప్రీతి చెందాను. నీవు రాజర్షివయ్యావు. నీ కోరికలేమిటో తెలుపు" అన్నాడు.

"పద్మసంభవా! అందరూ నన్ను రాజర్షిగా అంటున్నారు. నేను కోరుకొనే బ్రహ్మత్వానికి నేను అర్హుడగుటకు నేను మరల తపస్సు ఆచరిస్తాను" అని చెప్పాడు. తపోసమాధియందు ఉండిపోయాడు.

"ఓ రామా! ఇంకో విషయం చెప్తాను విను." ఆ కాలంలో ఇక్ష్వాకు వంశీయుడైన త్రిశంకుడు అను రాజు ఉండేవాడు. అతనికి సశరీరంగా స్వర్గానికి వెళ్ళాలని తలంపు కలిగింది. వెంటనే కుల గురువైన వసిష్ఠుని దగ్గరకు వచ్చాడు ఏ యాగం ఆచరిస్తే నాకు స్వర్గప్రాప్తి కలుగుతుందని అడిగాడు.

రాజేంద్రా! త్రిశంకూ! నీ కోరిక దుర్లభమైంది. సశరీరులై స్వర్గాన్ని చేజిక్కించుకొన్నవారు ఎవరూ లేరు అని చెప్పారు. నేను అట్టిదానికోసం యజ్ఞాలను నిర్వర్తించలేను అని ఖండితంగా చెప్పాడు.

అక్కడే తపస్సు చేసుకొంటున్న వసిష్ఠుని పుత్రులను చూశాడు. వారిదగ్గరకు వెళ్ళాడు. ప్రణామాలు ఆచరించాడు. నేను వసిష్ఠునిచే నిరాకరింపబడ్డాను. మీరు తపోధనులు. మీరందరూ నా కోర్కెను మన్నించండి. నాకోసం యాగం నిర్వర్తించి నన్ను సశరీరునిగా స్వర్గానికి చేర్చండి. నాకు మీరు తప్ప అన్యులు తెలియరు అని వేడుకొన్నారు. పూజ్యులైన మీరు నాకు రక్షకులు యాగ సంబారాలన్ని సమకూర్చుతాను యాగం చేసి నా కోరికను తీర్చండి అని వేడుకొన్నారు. వారి మనోభీష్టం ఏమిటో తెలుసుకోకుండా వారిని తన అభీష్టాన్ని తీర్చమని పలుఖిదాలుగా నిర్బంధించడం మొదలుపెట్టాడు.

వారు ఎంత చెప్పినా వినే పరిస్థితి లేదు. త్రిశంకుడు పట్టిన పట్టు విడవకుండా తనను సశరీరంతో స్వర్గానికి పంపివ్వమని ఎంతగానో వేడుకొన్నాడు.

* * *

త్రిశంకుడు విశ్వామిత్రుని ఆశ్రయించటం

సర్గ - 58

త్రిశంకుని ప్రార్థన వినిన వసిష్ఠ పుత్రులు ఆగ్రహించారు. "ఓ త్రిశంకు మహారాజా! ఇక్ష్వాకు వంశీయులందరికి మా తండ్రి ఐన వసిష్ఠుడు కులగురువు. కులగురువును మించిన భగవంతుడు ఎవరూ ఉండరు కదా. గురువు చేయలేని పనిని మరొకరు ఎలా చేయగలరు? నీకా విషయం తెలీదని మాకు అనిపించడం లేదు. ఆ గురువే నీ కోరిక అసాధ్యమని చెప్పారు కదా! మరలా మమ్ములను ఆశ్రయించడంలో నీ అభిప్రాయం ఏమిటి? మా తండ్రి ఈ లోకంలో ఎవరి చేతనైనను యజ్ఞం చేయించగల సమర్థుడు. అటువంటి మహర్షి చేయలేనని చెప్పిన పనిని మేము చేయగలమని నీవు ఎలా అనుకొంటున్నావు? ఆ తపోధనుడే నిరాకరించిన తర్వాత నీవు కోరితే మేము ఎలా ఒప్పుకొంటాం. ఇక నీ కోరికను వదిలివేయి. చక్కగా పురజనులను పాలిస్తూ కీర్తిపొందు" అని చెప్పారు.

త్రిశంకుడు వారి మాటలు పెడచెవిని పెట్టాడు. "మీరును మీ తండ్రీ నన్ను, నా కోరికను తిరస్కరిం చారు. కాని నా సంకల్పం గట్టిగా ఉంది. నేను ఇంక ఎవరినైనా ఆశ్రయించి నా కోరిక సఫలం చేసుకొంటాను" అని అన్నాడు. దానికి వసిష్ఠుని పుత్రులు కృద్ధులయ్యారు.

"మూర్ఖంగా మాట్లాడే ఓ రాజా! నీకు చండాలత్వం సిద్ధించుగాక" అని శపించారు. త్రిశంకు జరిగిన దానికి బాధపడ్డాడు. కాని కోరిక తీరలేదు. దానినే మననం చేసుకొంటూ అంతఃపురం చేరాడు. మరుసటి ప్రొద్దున లేచేసరికి శరీరం భయంకరరూపును ఆపాదించుకొన్నది. వస్త్రాలన్నీ నల్లనిరూపును సంతరించు కొన్నాయి. ఆభరణాలన్నీ ఇనుముతో తయారుచేసినవయ్యాయి. మెడలో స్మశాన మాలలు చేరిఉన్నాయి. ఇవి అన్నియు చూసుకొని తనకు దైవం అనుకూలంగా లేదనుకొన్నాడు.

భయంకర చండాలత్వాన్ని పొందిన రాజును చూసి మంత్రులు జనులు పారిపోయారు. ఐనా త్రిశంకు భయం వీడలేదు. బాగుగా ఆలోచించాడు. వసిష్ఠునితో వైరం పెట్టుకొన్న విశ్వామిత్రుడు దృష్టికి గోచరించాడు. వెంటనే విశ్వామిత్రుని దగ్గరకు వెళ్ళాడు. సాష్టాంగప్రణామం ఆచరించాడు. తన దైన్యస్థితి పోగొట్టమని వేడాడు. మీరు తప్ప మరొకరు నన్ను రక్షించువారు లేరన్నాడు. పరిపరివిధాల విశ్వామిత్రుని దయను చూరగొనటానికి ప్రయత్నించాడు.

ఇలా అభ్యర్థిస్తున్న త్రిశంకుని చూశాడు విశ్వామిత్రుడు. అతనికి జాలివేసింది. "నీ ఈ చండాల రూపానికి కారకు లెవ్వరు. నీవు చేసిన నేరమేమిటి" అంటూ త్రిశంకును, మహర్షి అడిగాడు.

"మహాత్మా! నేను సశరీరంగా స్వర్గాన్ని ఆశించాను. దానికై నేను మా కులగురువును ఆశ్రయించాను. ఆ పని తన చేతకాదన్నారు. వారి పుత్రులను యాగం చేయమని కోరాను. వారు దానికి అంగీకరించలేదు. పైగా మూర్ఖపు పట్టుదల నీదంటూ అపనింద వేశారు. నాకు ఈ ఛండాలత్వం సిద్ధించేలా శాపం ఇచ్చారు. మంచి చేయకపోయినా చెడు మాత్రం చేశారు."

"ఈ లోకంలో దైవానికి వ్యతిరేకంగా ఏది చేయలేమని నిరూపితం అవుతోంది. నేను క్షత్రియ వంశంలో పుట్టాను. ఇప్పటికి వరకు నూరు యజ్ఞాలు చేశాను. కాని ఫలితం రాలేదు. మరి నేను చేసిన దోషం ఏమిటి? నాకీ గతి కల్గుట దైవేచ్ఛ గదా!"

"నేను ధర్మమార్గంలో యజ్ఞం చేయమని కోరాను. దానికి ఋత్విజుల అనుమతిని పొందలేకపోయాను. కనుక ఈశ్వరేచ్ఛ తిరుగులేనిదని స్పష్టమైనది. పురుష ప్రయత్నంకూడా దైవాధీనమే."

"మీరు తప్ప నన్ను ఆదుకొనే మహాత్ములు ఎవరూ లేరు. మీరు ఎన్నో యజ్ఞాలు చేశారని విన్నాను. అంతేకాక ఇంద్రియాలు నిగ్రహించి తపస్సు ఆచరించి బ్రహ్మను మెప్పించారని నాకు తెలిసింది. మహాత్ములైన-మీరైనా నన్ను అనుగ్రహించండి. నాకు దైవాన్ని అనుకూలంగా చేయండి దైవేచ్ఛకు లొంగని సంకల్పబలం ఏదీలేదని నాకు తెలిసింది. అలా కాదని మహానుభావులైన మీరైనా నన్ను అనుగ్రహించి నా కోరిక సమంజసమైనదనే నా అభిప్రాయాన్ని దృఢతరం చేయండి" అని అంటూ త్రిశంకుడు విశ్వామిత్రుని వేడుకొన్నాడు.

* * *

త్రిశంకునికి విశ్వామిత్రుని రక్షణం

సర్గ - 59

ఇలా పలువిధాలుగా బతిమాలుకొంటున్న త్రిశంకుని చూచి విశ్వామిత్రుడు జాలి బడ్డాడు. త్రిశంకుని కోరిక విశ్వామిత్రునికి అవాంఛనీయమైనదిగా కనిపించలేదు.

చండాల రూపాన్ని ధరించిన రాజేంద్రునిపై విశ్వామిత్రునికి దయ కలిగింది. "ఓ రాజశ్రేష్ఠా! నీవు పరమ ధార్మికుడవని, సత్యవాదివనియు నాకు తెలుసు. నీ దుర్భర శరీర చండాలత్వాన్ని పోగొట్టి, నేను నీకు రక్షణ కల్పిస్తాను. నీ యజ్ఞం చేయడానికి అన్ని సమకూర్చలేను. యజ్ఞంలో సహాయం చేయుటకు మహర్షులను పిలిపిస్తాను నీవు వ్యాకులం వీడు" అంటూ అనునయ వాక్యాలు చెప్పాడు.

విశ్వామిత్రుని ఆదరంతో త్రిశంకుడు మనశ్శాంతిని పొందాడు. కౌశికుడు తన పుత్రులను పిలిచాడు సంగతి వివరించాడు. యజ్ఞానికి కావల్సిన సామగ్రిని సమకూర్చమని ఆదేశించాడు. మునులను ఋత్విజులు వేదశాస్త్ర పండితులను నా ఆజ్ఞగా చెప్పి వారిని యజ్ఞానికి ఆహ్వానించండి.

ఒకవేళ ఎవరైనా అధిక్షేపించినచో లేక నిందాపూర్వక మాటలు మాట్లాడినచో అవి నాకు తెలపండి మీరు స్వయంగా వెళ్లి అందరిని పిలుచుకురండి అని చెప్పాడు. వారు అలానే చేస్తామని వెళ్లారు. వీరు పిలిచిన పండితులు వేదవేదాంగాలు చదివినవారు, బ్రహ్మచారులు, మునులు అందరూ విచ్చేసారు.

కాని మహోదయుడు అను ముని, వసిష్ఠుడు వారి పుత్రులు యజ్ఞానికి రావడంలేదని విశ్వామిత్రుని పుత్రులు విశ్వామిత్రునకు చెప్పారు. వారిలో ఎవరైనను ఏదైనను మాట్లాడి వుండినచో వారి మాటలు నాకు తెలపండి అని అడిగాడు.

తండ్రి వారందరూ ఇలా అన్నారు. యజ్ఞం చేయువాడు చండాలుడు. చేయించుచున్నవాడు క్షత్రియుడు. వీరి యజ్ఞ హవిస్సులను తీసుకోడానికి దేవతలు ఎట్లా వస్తారు? బ్రాహ్మణులమై వుండి నిష్ఠాగరిష్ఠులమై తపమాచరించే మేము ఆ చండాల భోజనాన్ని ఎలా ఆరగించగలం? అట్లు చేసి మహాత్ములై స్వర్గానికి వారు ఎలా వెళ్తారు? మేము అక్కడికి రామని చెప్పారు అని అంటూ విశ్వామిత్రునికి అతని సుతులు చెప్పారు.

వెంటనే విశ్వామిత్రుడు కోపిస్తూ, సదాచారుడై ముక్కు మూసుకొని తపస్సు చేసుకొంటున్న తనను తూలనాడి, వారు నిందార్హులు అయ్యారు అని వారినందరిని భస్మమగునట్లుగా శపించాడు. అంతేగాదు వారు ముష్టికులై హీనాత్ములై కుక్కమాంసం, శవాలు పీక్కుతింటూ ఏడువందల వికృతజన్మలు ఎత్తెదరుగాక అంటూ విశ్వామిత్రుడు మహోదయుని, వసిష్ఠుని పుత్రులను శపించాడు.

* * *

త్రిశంకు స్వర్గారోహణం

సర్గ - 60

అచ్చటికి విచ్చేసిన మునులందరి సమక్షంలో విశ్వామిత్రుడు ఇలా చెప్పారు. త్రిశంకు అను పేరుగల ఈ నరశ్రేష్ఠుడు ఇక్ష్వాకువంశీయుడు పరమధార్మికుడు. సత్యవచనమునందు ఆసక్తి కలవాడు. ఇతనికి శాపకారణంగా ఈ చండాలరూపం ఆవరించింది.

ఈ చండాలరూపంతోనే నేను త్రిశంకుని సశరీరునిగా స్వర్గానికి పంపుతాను. నేను యజ్ఞకర్తగా వుండి యాజకత్వాన్ని నెరుపుతాను. మీరందరూ నాకు యజ్ఞం చేయడంలో సహాయం చేయండి అని అందరికీ చెప్పాడు.

అక్కడున్నవారు ఈ విశ్వామిత్రుడు ముక్కోపి ఆయన చెప్పినట్లుగానే మనమందరం పనిచేద్దాం. లేనిచో విశ్వామిత్రుని శాపానికి గురవుతాం. లేనిపోని కడగండ్లను తలకెత్తుకొన్న వారమౌతాం. యజ్ఞం చేయించుకొనేవాడు వాడు అడిగాడు. చేయిస్తానని చెప్పి చేయించేవాడు ఉన్నాడు. అటువంటప్పుడు మనం ఏదో ఒకటి అని, తపోధనునికి ఆగ్రహం కలిగించడం ఎందుకు? మనకు చెప్పిన పని చేస్తే పోతుంది గదా అనుకొని వారందరూ విశ్వామిత్రుని ఆజ్ఞను పాటించుదాం అని అనుకొన్నారు.

వారందరూ కలిసి "విశ్వామిత్రా! నీవు చెప్పినట్లుగానే మేము యజ్ఞం చేయిస్తాం. నీ కోరిక సఫలం అగుగాక!" అని దీవించారు. వేదోక్త రీతిలో మంత్రాలను పఠిస్తూ యాగారంభం చేశారు. కల్పోక్త ప్రకారంగా విధులన్నింటిని చేశారు.

కాని యజ్ఞ హవిర్భాగాలను తీసుకొనడానికి దేవతలు ఎవరూ రాలేదు. దానితో విశ్వామిత్రునకు కోపం వచ్చింది. విశ్వామిత్రుడు చేతిలో వున్న స్రువమును పైకెత్తాడు. ధరవరా! తపఃఫలాన్ని ధారపోసి నిన్ను ఇప్పుడే సశరీరంగా స్వర్గానికి పంపిస్తున్నాను. నీ కోరిక తీరుతుంది సంతోషించు అన్నాడు.

అలా అంటుండగానే త్రిశంకుడు స్వర్గానికి సశరీరంగా వెళ్లిపోయాడు. అక్కడ వున్న దేవేంద్రాదులు త్రిశంకును చూచి "ఓరి దురాత్మ! గురువు శాపాన్ని పొందిన నీవు స్వర్గ ప్రవేశ అనర్హుడవు. నీవు లోపలకు రాకు" అంటూ తలక్రిందులుగా త్రోసివేశాడు. దానితో "రక్షించు! రక్షించు!" అని కేకలు వేస్తూ త్రిశంకుడు నేలపై పడబోయాడు.

విశ్వామిత్రుడు వెంటనే "అక్కడే నిలువు! దేవేంద్రునిగా నిన్నే చేస్తాను. దక్షిణ దిశలో మరొక స్వర్గాన్ని ఏర్పాటుచేస్తాను. భయపడవద్దు" అని చెప్పి సప్తర్షి మండలాన్ని నక్షత్రాలను కల్పించాడు. ఇదంతా చూస్తున్న దేవతలు విశ్వామిత్రుని చెంతకు వచ్చారు.

"ఓ రాజర్షీ! శాంతించు. నీవు ప్రతి సృష్టి చేయగల సమర్థుడవు. కాని గురువు శాపానికి గురైనవాడికి. స్వర్గప్రాప్తి లేదు కదా! శాంతించు. నీ కోరిక ప్రకారం త్రిశంకుడు అక్కడే నిలిచివుంటాడు. నీవు సృష్టించిన నక్షత్రాలు జ్యోతిశ్చక్రానికి వెలుపల వుంటాయి. త్రిశంకు దేవతలతో సమానుడై వెలుగొందుతాడు. స్వర్గ సౌఖ్యాలను పొందుతాడు. కాని గురువును అవమానించినందుకు అధోముఖుడై వుంటాడు. నీవు శాంతించుము" అని చెప్పారు.

వారి మాటలు విశ్వామిత్రుడు విని శాంతపడ్డాడు. యజ్ఞం పరిసమాప్తం చెందింది. "ఓ రామచంద్రా! నీ గురువు సశరీరంగా త్రిశంకు స్వర్గానికి పంపిన ఘనత వహించినవాడు" అని శతానందుడు చెప్పాడు.

* * *

శునశ్శేపుడు యజ్ఞపశువుగా మారటం

సర్గ - 61

"ఓ రామచంద్రా! ఇలా విశ్వామిత్రునకు దక్షిణదిశలో యజ్ఞభాగం జరిగింది. దానితో ఆయన పశ్చిమ దిశకు వెళ్ళాడు. తపస్సు ప్రారంభించాడు. దుంప ఫలాలను మాత్రమే తీసుకొంటూ తీవ్రంగా తపస్సు చేయసాగాడు.

ఆ సమయంలో అంబరీషుడు అయోధ్యాధిపతి అయ్యాడు. యజ్ఞం చేయాలని అంబరీషుడు సంకల్పించాడు. తన పురోహితుని సలహా ప్రకారం యాగం ప్రారంభించాడు. ఇంద్రుడు ఆ యాగపశువును అపహరించుకొని వెళ్ళాడు. అంబరీషుడు చింతితుడయ్యాడు. పురోహితులందరూ బాగా యోచన చేసి మహారాజుకు సలహా ఇచ్చారు. గోవులను ఇచ్చి ఐనా యజ్ఞపశువుగా ఒక నరుని తీసుకొని వచ్చి యాగ సమాప్తిని చేయమని చెప్పారు. అంబరీషుడు పురోహితుని సలహాను పాటించాలనుకొన్నాడు. దేశ దేశాలు తిరిగాడు. ఎక్కడ యాగ పశువుగా ఉండడానికి ఎవరు దొరుకుతారో అని చూస్తున్నాడు. అలా అలా తిరిగి తిరిగి ఋచీకుని దగ్గరకు అంబరీషుడు

వచ్చాడు. తపస్తేజస్సుతో ప్రకాశించే ఋచీకునికి నమస్కరించాడు. తన దుస్థితిని వివరించాడు. తన స్థితిని బాగుపరచమని, లక్ష గోవులను తీసుకొని ఒక కొడుకును యజ్ఞపశువుగా పంపమని అభ్యర్థించాడు.

ఋచీకుడు బాగా ఆలోచించాడు. పున్నామ నరకం నుండి తప్పించేందుకు, కర్మలు చేసేవాడు పెద్దవాడే; కాబట్టి జేష్ఠకుమారుని ఇవ్వలేనని చెప్పాడు. నేను తల్లిని కాబట్టి నా చిన్ని గారాల కుమారుని పంపలేనని ఋచీకుని భార్య చెప్పింది. ఇదంతా ఋచీకుని మధ్యమ పుత్రుడు చూశాడు. పెద్దవాడు తండ్రికి, చిన్నవాడు తల్లికి కావాలి. అంటే ఇక మిగిలింది నేనే కదా అనుకొన్నాడు. దానితో శునశ్శేపునకు జీవితంపై విరక్తి కలిగింది. "మహారాజా నా తల్లిదండ్రులు చెప్పకనే నన్ను తీసుకువెళ్ళమని చెప్పారు. ఇక ఆలసింపక నన్ను వెంటబెట్టుకొని వెళ్ళి, యాగాన్ని ప్రారంభించ"మ ని శునశ్శేపుడు చెప్పాడు.

అంబరీషుడు ఆనందంగా శునశ్శేపునితో కలిసి బయలుదేరాడు. "ఓ రఘునాథా! అంబరీషుడు ఋచీకునికి మాట ప్రకారం లక్ష గోవులను ఇచ్చాడు. శునశ్శేపుని యాగపశువుగా నిశ్చయించుకొని అంబరీషుడు గృహోన్ముఖుడయ్యాడు" అంటూ విశ్వామిత్రుడు కథనంతా వివరించాడు.

* * *

శునశ్శేపుని రక్షణం

సర్గ - 62

"ఓ రఘురామా! అంబరీషాదులు పుష్కర క్షేత్రం చేరారు. శునశ్శేపుడు దప్పికతో బాధతో దస్సిపోయాడు. అక్కడ తపస్సు చేసుకొంటున్న విశ్వామిత్రుని చూశాడు. తల్లిదండ్రులచే త్యజింపబడి, యాగపశువుగా ఉన్న శునశ్శేపునికి దుఃఖం పెల్లుబికింది. వేగంగా వెళ్ళి మేనమామ ఐన విశ్వామిత్రుని ఒడిలో తలపెట్టి రోదించాడు.

దుఃఖాశ్రువులతో తల్లడిల్లుతున్న బాలుని, ఆ తల నిమురుతూ, వచ్చిన కష్టం ఏమిటని విశ్వామిత్రుడు అడిగాడు. తాను యాగపశువు ఐన వివరాన్నంతా వివరించాడు. తనను ధర్మయుక్తంగా కాపాడమని శున శ్శేపుడు విశ్వామిత్రుని వేడుకొన్నాడు.

విశ్వామిత్రుని హృదయం ద్రవించింది. తన పుత్రులను పిలిచి సంగతి వివరించాడు. వారిలో ఎవరినైనా యాగపశువుగా ఉండి, శునశ్శేపుని రక్షించమని ఆజ్ఞాపించాడు. వారు దానికి తన్ను మాలిన ధర్మం మొదలు చెడ్డబేరం అని నిరాకరించారు. తనూజులను త్యాగం చేసి అన్యులను కాపాడడం అకృత్యమని చెప్పారు.

వారి మాటలకు విశ్వామిత్రుడు కుపితుడయ్యాడు. తన ఆజ్ఞను ధిక్కరించినందున వారిని ముష్టిక జాతుల్లో జన్మిస్తూ వశిష్ఠ పుత్రులవలె వేయి వత్సరాలు భూమిపై పడి ఉండమని శపించాడు.

ఆర్తుడైన శునశ్శేపుని మంత్ర పూతమైన భస్మంతో రక్షించాడు. అభయం ఇచ్చాడు. యూపస్తంభానికి కట్టివేసినపుడు అగ్నిని ప్రార్థిస్తూ రెండు మంత్ర రాజాలను పఠించమని చెప్పాడు. ఇంద్రుణ్ణి స్తుతిస్తే నీకు శుభం

కలుగుతుందని చెప్పాడు. దీనితో అంబరీషుని మనోరథం కూడా ఈడేరుతుందని భయం లేదని ధైర్యవచనాలు చెప్పాడు.

అంబరీషుడు విశ్వామిత్రాదుల దగ్గర సెలవు తీసుకొని, యాగప్రదేశానికి వెళ్ళాడు. యాగం ప్రారంభం అయ్యింది. ఎర్రని పూలమాలలతో చందనాదులతో శునశ్శేపుని అలంకరించారు. యూప స్తంభానికి కట్టివేశారు. విశ్వామిత్రుడు బోధించిన మంత్రాలతో ఇంద్రుని ఉపేంద్రుని శునశ్శేపుడు స్తుతించాడు. ఆ స్తుతులతో ఇంద్రుడు సంప్రీతుడయ్యాడు. శునశ్శేపునికి దీర్ఘాయువును ప్రసాదించాడు. ఆ సహస్రాక్షుడు అంబరీషునికి యజ్ఞఫలాలను అందించాడు.

శునశ్శేపుని రక్షించాననే ఆనందంతో, కౌశికుడు ఆ పుష్కర క్షేత్రంలో మళ్ళీ తపస్సు ప్రారంభించాడు.

* * *

విశ్వామిత్రుడు - మహర్షి

సర్గ - 63

విశ్వామిత్రుని మోహం : విశ్వామిత్రుడు పుష్కర క్షేత్రంలో వేయి సంవత్సరాలు దీక్షగా తపస్సు చేశాడు. దీక్షానంతరం దేవతలందరు విశ్వామిత్రుని దగ్గరకు వచ్చారు. నీ తపః ఫలంగా నీవు ఋషి అయ్యావని చెప్పారు. జితేంద్రుడను కాలేదనే నిరాశ విశ్వామిత్రునిలో కలిగింది. దానితో మళ్ళీ తపస్సుకు శ్రీకారం చుట్టాడు. దీనిని దేవేంద్రుడు చూశాడు. ఈ మహర్షి పట్టిన పట్టు విడవకుండా తపస్సు మొదలు పెట్టాడు. ఎలా అయినా సరే ఇంద్రుడు విశ్వామిత్రుని తపోభంగం చేయాలనుకొన్నాడు. అప్సరసలలో సౌందర్యవతియైన మేనకను విశ్వామిత్రుని దగ్గరకు పంపాడు. పుష్కర తీర్థంలో జలకాలాడే మేనకను విశ్వామిత్రుడు చూశాడు. ఆమెపై మోహం పెంచుకొన్నాడు. "ఓ సౌందర్యవతీ! నా కుటీరానికి వచ్చి నాలోని తృష్ణను తీర్చమని మేనకను అభ్యర్థించాడు. తన పని సఫలమౌతోందని మేనక విశ్వామిత్రుని కోరికను మన్నించింది. కొన్నాళ్లు మేనకా విశ్వామిత్రులు ఒకరికోసం మరొకరు జీవించారు. ఇలా పది సంవత్సరాలు గడిచాయి. విశ్వామిత్రునిలో అంతర్మథనం మొదలయింది. తన తపస్సు ఇంద్రియ నిగ్రహం లేక చెడిపోయిందని తెలుసుకొన్నాడు. భయంతో వణుకుతున్న మేనకను భయపడనవసరంలేదని అనునయించాడు. మేనకను నిజావాసానికి పంపివేశాడు. విశ్వామిత్రుడు పశ్చాత్తాపంతో రగిలిపోయాడు.

విశ్వామిత్రుడు తపోభూమికి పునఃప్రయాణం

అక్కడినుండి హిమవత్పర్వత ప్రాంతాలకు పయనం సాగించాడు. కఠోరమైన తపస్సు చేయసాగాడు. అతని తపస్సుకు దేవతలు భయపడ్డారు. దేవతలందరూ బ్రహ్మదేవుని సంప్రదించారు. విశ్వామిత్రుడిని మహర్షిగా నిర్ణయించమని చెప్పారు. దేవతలందరితో కలిసి చతుర్ముఖుడు విశ్వామిత్రుని దగ్గరకు వచ్చాడు. "ఓ కౌశిక మహర్షీ! అని సంబోధించాడు. నీవు ఈ రోజుకు తపస్సు ఆచరించి మహర్షిత్వాన్ని పొందావు. నీ తపస్సుచే

మమ్మల్నందరిని ఆనందింపజేశావు. ఈనాటి నుండి నిన్ను మహర్షి అని మేము సంబోధిస్తాం అని చెప్పాడు. విశ్వామిత్రునిలో సంతోష దుఃఖాలు కలుగలేదు. "ఓ కమలాసనా! నీవు నన్ను మహర్షివన్నావు కాబట్టి, నేను జితేంద్రియుడినయ్యానని తలుస్తాను అన్నాడు. దానికి చతుర్ముఖుడు "నాయనా! కౌశికా! నీవు ఋషిత్వాన్ని పొందావు; కాని జితేంద్రియుడవు కాలేద" ని చెప్పాడు.

విశ్వామిత్రునిలో అసంతృప్తి మిగిలింది. ఈ సారి విశ్వామిత్రుడు మరింత కఠినంగా తపస్సుకు పూనుకొన్నాడు. కౌశికుడు ఊర్ధ్వబాహువయ్యాడు. మౌనవ్రతుడయ్యాడు. వాయువునే ఆహారంగా స్వీకరిస్తూ పంచాగ్నుల మధ్య కఠోర దీక్షకు పూనుకొన్నాడు. ఉగ్ర తపోసమాధిలో మునిగిపోయాడు. అలా వేయి సంవత్సరాలు గడిచిపోయాయి. విశ్వామిత్రుని తపస్సు భగ్నం చేయాలని ఇంద్రుడు రంభను నియోగించాలని అనుకొన్నాడు.

* * *

విశ్వామిత్రుని తపస్సు - భగ్న ప్రయత్నం

సర్గ - 64

దేవతాహితానికై రంభను విశ్వామిత్రుని తపస్సును భంగం చేయమని ఇంద్రుడు పంపాడు. రంభ ముక్కోపి అయిన విశ్వామిత్రుని తపస్సును భగ్నపరచటానికి భయపడింది. అంజలి ఘటించి ఇంద్రునితో నేను అశక్తురాలినని చెప్పింది. ఓ రామచంద్రా! భయపడుతున్న రంభకు అభయం ఇస్తూ, "నీకు అంతా శుభమే జరుగుతుంది. ఇది నా ఆజ్ఞగా తలచి విశ్వామిత్రుని తపో భంగం చేయు"మని సహస్రాక్షుడు రంభను ఆదేశించాడు.

రంభ మన్మథునితో కలిసి విశ్వామిత్రుడున్న ప్రదేశానికి వెళ్లింది. వసంతాగమనంతో కోయిల తీయగా తన గొంతును సవరించుకొంది. ప్రకృతి సోయగానికి వగలుపోతూ రంభ విశ్వామిత్రుని చిత్తం మరలించ ప్రయత్నించింది. తన గానమాధుర్యంతో కోయిలతో పోటీపడింది. ఆ మధురధ్వనులకు విశ్వామిత్రుడు కన్నులు తెరిచాడు. ఎదురుగా నవ యౌవనాంగి ఐన రంభ కనబడింది. అకాలంలో వసంతుని వయ్యారాన్ని గమనించాడు. ఇంద్రుని మాయోపాయాన్ని గ్రహించాడు.

క్రోధావేశంలో ఎదురుగా వున్న రంభను బండరాయివి కమ్మని శపించాడు. క్రోధంలో రాజశాసనాన్ని పాటించిన రంభను శపించానని తృటిలో తెలుసుకొని పశ్చాత్తాపపడ్డాడు. రంభపై అనుగ్రహం కలిగింది. తపోబల సంపన్నుడైన వసిష్ఠుడు నా శాపవిముక్తిని కలిగించగలడని చెప్పి రంభను ఓదార్చాడు. కోపాన్ని జయించలేక పోయానని విశ్వామిత్రుడు పరితపించాడు. కోపంవలనే నా తపోబలం క్షీణిస్తోందని తెలుసుకొన్నాడు.

బ్రహ్మత్వం సిద్ధించువరకు కుంభకంలో ఉండి కోపాన్ని జయిస్తాను. ఆహార పానీయాదులను విసర్జించి శరీరాన్ని శుష్కింప చేసుకుంటాను. లోకంలో ఎవరు చేయలేనివిధంగా నేను తపస్సు ఆచరిస్తాను అని విశ్వామిత్రుడు గట్టిగా నిర్ణయించుకున్నాడు.

* * *

విశ్వామిత్రునిలో బ్రహ్మత్వం

సర్గ - 65

తూర్పుదిశలో విశ్వామిత్రుడు తపస్సుకు ఉపక్రమించాడు. కఠోరంగా తపస్సు చేస్తున్నాడు. శరీరం దినదినం కృశించింది. ఎన్నో ఆటంకాలు తలెత్తాయి. అయినా విశ్వామిత్రునిలో కోపం పొడచూలేదు. ఇంద్రియాలను తన వశంలో వుంచుకొన్నాడు. పరిస్థితులకు మనస్సు లొంగకుండా చేసుకున్నాడు. వేయి సంవత్సరాలు తపస్సు సాగింది. తన దీక్షాకాలం ముగిసిందని దీక్షాస్నాన మాచరించాడు. దీక్షను విరమించి సిద్ధాన్నాన్ని తినబోయాడు. అంతలో ఇంద్రుడు బ్రాహ్మణ వేషధారియై వచ్చాడు. తినబోయేదానిని దానం చేయమని కోరాడు.

సంతోషంగా విశ్వామిత్రుడు తన ఆహారాన్ని ఇంద్రునికి దానం చేశాడు. మరల తపస్సు చేయాలని సంకల్పించాడు. ఊపిరి బిగబట్టి తపస్సు ఆరంభించాడు – శ్వాసను నిరోధించి తపస్సు చేస్తున్న విశ్వామిత్రుని శిరస్సునుంచి అగ్ని ప్రజ్వరిల్లింది. ఆ ప్రభావానికి ముల్లోకాలు తల్లడిల్లుతాయన్న భ్రమ కలిగింది. గంధర్వ యక్ష నాగ కిన్నరులు తహతహలాడారు. బ్రహ్మదేవుని చెంతకు చేరారు.

"ఓ విధాతా! పట్టువదలకుండా విశ్వామిత్రుడు తపస్సు కొనసాగిస్తున్నాడు. ఆటంకాలను వెరవడంలేదు. పట్టుదల సడలలేదు. దినదినాభివృద్ధి చెందుతూ విశ్వామిత్రుడు తపస్సు ఆచరిస్తున్నాడు. అతని మనోరథం తీర్చే సమయం ఆసన్నమైందని అనిపిస్తోంది. ఆ ముని పుంగవుని తపః ప్రభావంతో సముద్రాలు కల్లోలం అవుతున్నాయి. పర్వతాలు కదలబారాయి. జగత్తు అంధకారబంధురం అవుతోంది త్వరగా విశ్వామిత్రుని తపస్సు విరమింపచేయి" అని సృష్టికర్తను అందరూ వేడుకొన్నారు.

దేవతలందరూ ముక్తకంఠంతో విశ్వామిత్రుని కఠోరదీక్షను మెచ్చుకున్నారు. అగ్నితుల్యుడైన విశ్వామిత్రుని అనుగ్రహింపవలసిందని సృష్టికర్తకు చెప్పారు. ఆ మహర్షి కోరినచో దేవరాజ్యాన్నే ఇవ్వవచ్చునని తెలిపారు. బ్రహ్మ విశ్వామిత్రుని చూచాడు. ఆనంద పరవశుడయ్యాడు. అందరూ కలిసి విశ్వామిత్రుని దగ్గర చేరారు. బ్రహ్మ "ఓ కౌశికా! నీ తపస్సు ఫలం నీకు అందింది. నీ కఠోర నియమాలచే బ్రహ్మత్వాన్ని పొందావు. ఓ బ్రహ్మర్షీ! కనులు తెరువు" అన్నాడు. పరమానందభరితమైన వాక్కులు విని విశ్వామిత్రుడు కనులు తెరిచాడు. "ఓ సౌమ్యుడా! నీకు దీర్ఘాయువు కలుగుగాక! అని బ్రహ్మ ఆశీర్వదించాడు. బ్రహ్మ ఆశీస్సులు విశ్వామిత్రుడు అందుకున్నాడు. వశిష్ఠుడు నన్ను బ్రహ్మర్షిగా అంగీకరించునట్లు దీవించ"మని విశ్వామిత్రుడు కోరాడు. "అట్లే అగుగాక!" అని దీవించి బ్రహ్మాదులు అదృశ్యమయ్యారు.

వసిష్ఠుడు బ్రహ్మర్షి వైతివని విశ్వామిత్రునితో చెప్పాడు. విశ్వామిత్రుడు పరమానందపడ్డాడు. మంత్ర జపతత్పరులలో శ్రేష్ఠుడైన వశిష్ఠుని విశ్వామిత్రుడు పూజించాడు. "ఓ రామా! పరాక్రమశాలి మహాతపస్వి అయిన విశ్వామిత్రుడు ఇలా సత్ఫల మనోరథుడయ్యాడు. ఇంత గొప్పతనాన్ని పొందినవాడు నీ గురువు" అంటూ శతానందుడు విశ్వామిత్రుని జీవిత చరిత్రనంతా రామలక్ష్మణులకు వినిపించాడు.

జనకుడు విశ్వామిత్రునికి నమస్కరించాడు. "కౌశిక మహర్షీ! నాపై అనుగ్రహంతో ఇక్కడకు వచ్చావు. నన్ను ధన్యుణ్ణి చేశావు. శతానందునివల్ల మీ ఉదాత్త గుణసంపదను తెలుసుకొన్నాను. అప్రమేయ తేజోమయ రాశివైన నీవు నాకు లభ్యమవటంతో నా జన్మ సుకృతం అయింది."

"స్వామీ! నాకు సెలవునిమ్ము. రేపు ప్రాతఃకాలంలో దర్శనం చేసుకొంటాను" అని జనకుడు అనుమతి పొంది తన పురోహితాదులతో నివాసం చేరాడు. రామలక్ష్మణులతో కలిసి విశ్వామిత్రుడు తన నివాసంలో సేదతీరాడు.

* * *

శివధనుస్సు వృత్తాంతం

సర్గ - 66

ప్రాతఃకాల విధులను తీర్చుకొని జనకుడు విశ్వామిత్రుని స్వాగతించాడు. "ఓ మహర్షి పుంగవా! నేను ఏమిచేయాలో ఆజ్ఞాపిస్తే దానిని నిర్వర్తిస్తాను" అని చెప్పాడు. చాతుర్యంగల మహాముని "ఓ జనకమహారాజా! వీరు దశరథుని పుత్రులు మిక్కిలి పరాక్రమశాలురు. మీ ఇంట వుండే శివచాపాన్ని వీరికి చూపిస్తే వీరి ముచ్చట తీర్చినవారు అవుతారు. వీరు నీ విల్లును చూచి వారి దారిన వారు వెళ్లిపోతారు" అని చెప్పాడు.

"ఓ ఋషీశ్వరా! ఈ శివచాపం నాకు మా పూర్వులనుండి సంక్రమించిన సంపద. ఈ శివుని విల్లును గురించి నాకు తెలసిందంతా మీకు చెప్తాను." ఈ శివధనుస్సును మా పూర్వజుడైన దేవరాతునకు మహేశ్వరుడు ప్రసాదించాడు. దక్షయజ్ఞ ధ్వంసంలో శివుడు ఈ ధనుస్సును ఎక్కుపెట్టాడని నేను వినివున్నాను. ఒకసారి నేను యజ్ఞం చేయ సంకల్పించాను. దానికై భూమిని త్రవ్వుతున్నపుడు నాగేటి చాలులో ముద్దులొలికే చిన్నారి నాకు దొరికింది. ఆ బాలికను నేను నా కుమార్తెగా ప్రేమానురాగంతో పెంచుకుంటున్నాను. ఆమె సీత అను పేరుగలది. అయోనిజ అయిన సీతకు అతి పరాక్రమవంతుడగు వానితో వివాహం జరిపించాలని నా కోరిక.

"మునీశ్వరా! ఇంతకుపూర్వం ఎందరో రాజులు జానకిని పరిణయమాడాలని వచ్చారు. కాని వారు పరాక్రమంలో ఓడిపోయిన వారగుటచే నేను నా సుతను వారికి ఇవ్వలేదు. సీతను చేపట్టడానికి వచ్చిన రాజులకు నేను ఈ శివచాపం ఎక్కుపెట్టాలని నిబంధన పెట్టాను. ఎందరో వీరులు ఈ చాపాన్ని కదల్చలేకపోయారు. దానితో వారందరూ నేను వారిని అవమానించానని తలిచారు. నా ప్రజలను నన్ను ఇబ్బందులకు గురిచేసారు. నేను దైవానుగ్రహం చేత వారినందరిని నిరోధించగలిగాను. నా చతురంగ బలాలను తిరిగి సమకూర్చుకోగలిగాను."

"ఓ తపస్సంపన్నా! తేజో విరాజమానమైన ఈ శివధనుస్సును రామలక్ష్మణులకు చూపిస్తాను. వీరిలో ఎవరైనా ఈ విల్లును ఎక్కుపెట్టినచో వారికి నా కూతురునిచ్చి వివాహం చేస్తాను, ఇది నా ప్రతిజ్ఞ" అని జనకుడు మహర్షితో విన్నవించుకొన్నాడు.

* * *

దశరథునికి జనకుని ఆహ్వానం

సర్గ - 67

జనకుడు విశ్వామిత్రుని మాట పాటించాలనుకొన్నాడు. తన మంత్రులను పిలిచి బలవంతులైన వారిని పంపిన ధనుస్సు ఉన్న పేటికను తీసుకొని రమ్మని పురమాయించాడు. రాజాజ్ఞానుసారం బలిష్ఠులు, మహాకాయులైన వీరులు ఐదువేలమంది ఎనిమిది చక్రాలున్న బండిని లాగుతూ తీసుకొని వచ్చారు.

"ఓ మహారాజా! ఈ శ్రీరామునకు చూపించవలసిన ధనుస్సు ఇదే సుమా!" అని అన్నారు. జనకుడు విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు ఆ ధనుస్సు చూడమని చెప్పాడు. విశ్వామిత్రుని ఆజ్ఞపొంది శ్రీరాముడు ఆ పెట్టెను తెరిచాడు. ఆ ధనుస్సును చూచి "ఓ గురువర్యా! ఈ విల్లును నేను ఎక్కుపెట్టగలను, నాకు అనుమతి నివ్వండి" అని అడిగాడు.

జనకుడు విశ్వామిత్రుడు ఆనందంగా తలలు ఊపి ఆమోదం తెలిపారు. అంజలి ఘటించి గురు అనుగ్రహాన్ని శ్రీరాముడు పొందాడు. శివచాపానికి ప్రణమిల్లాడు. తన చేతిని చాచి ఆ ధనుస్సు మధ్యలో పట్టుకొన్నాడు. కరస్పర్శచే వంగినట్లుగా ఆ శివచాపం వంగింది. శ్రీరాముడు దానిని ఎత్తి అల్లెత్రాడును బిగించాడు. కర్ణములవరకు లాగి వింటినారిని సంధించాడు.

మహాభీకరమైన ధ్వని ఆ ప్రదేశమంతా దద్దరిల్లింది. అక్కడ ఉన్న సదస్యులందరూ ఆ ధ్వని ప్రభావంతో మూర్ఛిల్లారు. శ్రీరాముడు, లక్ష్మణుడు, విశ్వామిత్రుడు, జనకుడు అద్భుతాన్ని చూచిన ఆనందాన్ని పొందారు. కొద్దిసేపట్లో వారందరూ యథాస్థితిని తిరిగి పొందారు.

తమ మనోరథం సఫలం అవుతుందో లేదోనన్న శంకతోనున్న జనకుని హృదయం ఆనందంతో తబ్బిబ్బైంది. "మహాత్మా! నీ శిష్యుని దివ్య ప్రభావాన్ని కనులారా చూశాను. ఇది అత్యద్భుతమైన సంగతి. నేను అయోనిజయైన నా కుమార్తెను దాశరథికి ఇచ్చి వివాహం చేస్తాను.

ఓ బ్రహ్మర్షీ! దశరథ మహారాజుకు విషయం వివరించడానికి నాకు అనుమతినివ్వు. శీఘ్రంగా నా మంత్రులు అయోధ్యకు వెళ్ళి, విషయాన్ని వివరించి, మిథిలానగరానికి కల్యాణశోభను చేకూర్చే దశరథాదులను తోడ్కొని వస్తారు. మీ పరిరక్షణలోనున్న రామలక్ష్మణుల కుశలవార్తను కూడా దశరథునకు తెలుపుతారు" అని జనకుడు అనుమతిని కోరాడు.

కౌశికుడు తన ఆమోదాన్ని తెలిపాడు. జనకుడు శుభ ఆహ్వాన పత్రికలను అందజేసి దశరథుని అతని భార్యలను బంధుగణాన్ని వెంటబెట్టుకొని రమ్మని తన మంత్రులను పంపించాడు.

* * *

దశరథుడు - మిథిలా నగర ప్రయాణసన్నాహాలు

సర్గ - 68

జనకుని దూతలు అతిశయించిన ఆనందంతో జనక మహారాజు చెప్పినట్లు చేయటానికి బయలుదేరారు. చెట్లు పుట్టలు, నగరాలు, కొండలు దాటుకుంటూ వేగంగా అయోధ్యకు మూడురోజులకు చేరారు. వారు ఉత్సాహంగా రాజదర్శనం చేసుకుని వారు వచ్చిన పనిని తెలియపర్చారు.

జనకుని నుంచి శుభవార్తను తీసుకొచ్చామంటున్న వారిని చూచి దశరథుడు అమితానందపడ్డారు. విషయం తెలుసుకోవాలని అనుకున్నాడు. ముందుగా జనకుని దూతలు దశరథుని క్షేమసమాచారాలు అడిగారు. జనకుని మాటలను వారు దశరథునికి ఇలా వినిపించారు.

"ఓ దశరథమహారాజా! నేను నా కుమార్తెకు వివాహప్రయత్న భాగంగా చేసిన ప్రతిజ్ఞ మీకు తెలుసుగదా. విశ్వామిత్ర మహర్షి మీ పుత్రులైన రామలక్ష్మణులను మిథిలానగరానికి తీసుకుని వచ్చారు. అలా వచ్చిన రాముడు శివధనుస్సు వృత్తాంతాన్ని విని కూతూహలంతో దాన్ని చూడనెంచి నా ప్రతిజ్ఞను విని, విశ్వామిత్రుని అనుజ్ఞతో శివధనుర్భంగం చేశాడు. నేను కూడా విశ్వామిత్రుని, శతానందుని అనుజ్ఞపొంది నేను మీకీ విషయం చెబుతున్నాను. దీన్ని విన్న మీరు కూడా ఆనందిస్తారు.

ఇప్పుడు మీరు నాకు నా కుమార్తెను మీ కోడలుగా పంపడానికి నాకు అనుమతిని ఇవ్వండి. నేను నా ప్రాణంగా పెంచుకున్న ఈ సీతమ్మ తల్లిని మీ ఇంటి కోడల్ని చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను. మీరు నా కా అనుజ్ఞను ప్రసాదించి మీరు పుత్రమిత్రకళత్రాదులతో మీ మంత్రి సామంత పురోహితాదులతో కలిసి మీరు మిథిలానగరానికి దయచేయండి. నన్ను అనుగ్రహించండి" అని జనకుని మాటలను యథాతథంగా చెప్పారు. ఆ దూతల మాటలను విని దశరథుడు ఆనందించాడు. వెనువెంటనే వశిష్ఠునితో విషయం చెప్పాడు. అక్కడున్న వామదేవాదులతో, నా రాముడు విశ్వామిత్రునిచేత పరిరక్షితుడై మిథిలానగరంలో శివధనుర్భంగం చేశాడట. జనకమహారాజు తన కుమార్తెను ఇక్ష్వాకువంశపు కోడలుగా పంపించడానికి మనందరి అనుజ్ఞను కోరుతున్నాడని చెప్పాడు. వారందరు తమ సంతోషాన్ని తెలిపారు.

వసిష్ఠవామదేవాదులు శ్రీరాముని వివాహాన్ని చేయుమని చెప్పారు. దశరథుడు వారి మాటలను విని మీ అనుజ్ఞ నాకు లభించింది కదా చాలా సంతోషం. ఇక మనమందరం మిథిలకు నేడు ప్రయాణం అవుదామని అన్నారు. సుమంత్రాది మంత్రులకు దశరథుడు మిథిలానగర ప్రయాణ సన్నాహాలు చేయుమని ఆజ్ఞ నిచ్చారు. ఆనందచిత్తుడైన సుమంత్రుడు మిథిలానగర ప్రయాణ సన్నాహాలను ఆరంభించాడు.

* * *

మిథిలానగర ప్రవేశం - జనకుని సత్కారం

సర్గ - 69

పక్షుల కిలకిలరావాల స్వాగతంతో భానుడు ఉదయించాడు. దశరథుడు తన పుత్రుని పెండ్లి వేడుకకు కావాల్సిన ఏర్పాట్లు చేయసాగాడు. సుమంత్రుని పిలిచాడు. "సుమంత్రా! కోశాగారం నుండి కావలసినంత ధనం రత్నాలు వజ్రవైడూర్యాలు తీసుకొని పల్లకీలలో ముందుగా కొందరిని పంపించు. వారికన్నా ముందుగా వసిష్ఠ వామాదేవాది పురోహితులు, మార్కండేయ కాత్యాయనుడు లాంటి మహర్షి గణం ముందు నడుచునట్లుగా చూడు. చతురంగ బలాలను, సేనావాహినిని పంపించు. నా రథాన్ని సిద్ధం చేయి.

నా వెంట రాణులు, బంధువులు వచ్చునట్లుగా ఏర్పాటు చేయి, ఎక్కడా పొరబాట్లు జరగకుండా చూసుకోండి" అని దశరథుడు ఆజ్ఞాపించాడు. రాజు చెప్పినట్లుగానే రాజపరివారం పెండ్లికి బయలుదేరి నాల్గవనాటికి మిథిలకు చేరింది.

దశరథుని ఆగమన వార్త తెలుసుకొని జనకుడు ఎదురేగి వారిని అతిథి సత్కారాలతో సంతోషపరిచాడు. శ్రీరాముని పరాక్రమాన్ని, జనకుని ప్రతిజ్ఞను దశరథునికి తెలిపాడు. అందుకు విశ్వామిత్రాది మహర్షుల ఆమోదం పొందినట్లుగా కూడా తెలిపాడు. మీరందరూ ఇక్కడకు రావడం మా భాగ్యం అంటూ మురిసిపోయాడు.

వసిష్ఠాది మహర్షిగణం మిథిలలో ప్రవేశించడంతో జన్మ ధన్యం అయిందని జనకుడు అన్నాడు. రఘువంశంతో బాంధవ్యం ఏర్పడడం తన పూర్వజన్మ సుకృతం అని ఆనందాశ్రువులు కార్చాడు.

"ఓ దశరథ నరేంద్రా! రేపటికి నేను తలపెట్టిన యాగం పరిసమాప్తం అవుతుంది. ఆ పిమ్మట వివాహం చేయడానికి నాకు అనుజ్ఞ ఇవ్వండి" అంటూ జనకుడు ప్రార్థించాడు. దశరథుడు సంతోషంగా మీరు అనుకొన్న విధంగానే చేయండి అని జనకుని చెప్పాడు. జనకుడు తన రెండవ కుమార్తె అగు ఊర్మిళను లక్ష్మణునకు కన్యాదానం చేయాలనే కోర్కెను దశరథునికి తెలిపాడు. దశరథుడు ఆ కోర్కెను సమ్మతించాడు. రామలక్ష్మణులు వచ్చి తమ తల్లిదండ్రులకు పాదాభివందనం చేశారు. అయోధ్యావాసులు ఆనంద తరంగితులయ్యారు. ఆ రాత్రి అందరూ హాయిగా గడిపారు.

* * *

కుశధ్వజునికి ఆహ్వానం

సర్గ - 70

జనకుడు ఆనందంగా ప్రాతఃసంధ్యావిధులను నిర్వర్తించాడు. పురోహితుడైన శతానందునితో తన తమ్ముని గూర్చి ఇలా చెప్పాడు. కుశధ్వజుడు నా సోదరుడు. అతడు సాంకాశ్య నగరాన్ని పాలిస్తున్నాడు. అది అమరావతి

వలె శోభిస్తుంది. ఆ నగరం శత్రు దుర్భేద్యంగా ఉండటానికి మంత్రపూరితంగా దృఢతరం చేశాడు. ఆ నగరం ఇక్షుమతీ నదీ తీర ప్రాంతంలో ఉంది. కుశధ్వజుడు నా యజ్ఞ సంభారాలన్ని అక్కడనుంచే పంపించాడు.

నేడు కుశధ్వజుడు నాతో ఉండి వివాహ మహోత్సవంలో పాలుపంచుకోవాలని నాకు అనిపిస్తోంది. అందుకే కొందరిని పంపి కుశధ్వజుని అతని భార్యా సుత సమేతంగా ఆహ్వానించండి అని జనకుడు చెప్పాడు. జనకుని ఆదేశం ప్రకారం వేగులు కుశధ్వజుని దగ్గరకు వెళ్ళారు. సందేశం వినిపించారు. వెంటనే కుశధ్వజులు తన స్వజనులను బంధువులను పురోహితులను వెంటబెట్టుకొని మిథిలను చేరారు.

అన్నదమ్ములిద్దరూ కలిశారు. సంతోషించారు. కుశల సమాచారం తెలుసుకొన్నారు. దశరథుని విశేషాలను రామలక్ష్మణుల పరాక్రమాన్ని జనకుడు కుశధ్వజునికి తెలిపాడు. వారిద్దరూ కలిసి పురోహితులను పంపి దశరథుని ఆహ్వానించారు. దశరథ పరివారం జనకుని రాజప్రాసాదానికి వెళ్ళింది. దశరథునికి ఉచితాసనం ఏర్పాటుచేశాడు. వసిష్ఠాదిమహర్షి గణాన్ని ఉచితాసనాలంకృతులను చేశాడు. "విదేహ ప్రభూ! మా వంశ చరిత్రనంతా తెలిసిన వసిష్ఠుడు మీకు మా గురించి చెప్తాడు. మా వంశాన్ని గురించి మీరు తెలుసుకోవాల్సిన తరుణమిది" అని దశరథుడు జనకునితో చెప్పాడు.

దశరథుని కోరిక ప్రకారం వసిష్ఠుడు జనకునితో ఇలా చెప్పసాగాడు. "ఓ జనక రాజేంద్రా! బ్రహ్మ మానసపుత్రుడు మరీచి. ఇతడు కాశ్యపునకు జన్మనిచ్చాడు. కాశ్యపుని వలన వివస్వంతుడు పుట్టాడు. మొదటి ప్రజాపతి ఐన వైవస్వతమనువు తండ్రి వివస్వంతుడు. ఈ మనువు పుత్రుడు ఇక్ష్వాకుడు. ఇతడే మొదటి అయోధ్యాధిపతి. ఇతడు ప్రజానురంజకంగా పాలన చేశాడు. ఇతనికి కుక్షి అను పుత్రుడు వికుక్షి అను పౌత్రుడు కలిగారు. కుక్షి సర్వశుభలక్షణునిగా పేరుగాంచాడు.

వికుక్షి సూనుడు బాణుడు, ఇతడు అమేయ ప్రతిభాశాలి తేజస్వీగా పేరు పొందాడు. ఇతనికి అనరణ్యుడు తనూజుడయ్యాడు. ఇతనికి పృథుమహారాజు కొడుకు ఇతడు ప్రఖ్యాతి వహించినవాడు. పృథువు కొడుకు త్రిశంకువు. ఇతడు సశరీరంగా ఈ విశ్వామిత్రుని వల్లే స్వర్గారోహణ చేశాడు. ఇతడు పరమ ధార్మికుడు. త్రిశంకువు. త్రిశంకు కుమారుడు దుంధుమారుడు.

దుంధుమారునకు యవనాశ్వుడు అను పేరుకూడా ఉండేది. ఇతని పుత్రుడు మాంధాత. మాంధాతకు సుసంధి పుత్రుడు. ఇతనికి ధ్రువసంధి ప్రసేనజిత్తు అను కుమారులు పుట్టారు. ధ్రువసంధికి భరతుడు, భరతునకు అసితుడను వారు జన్మించారు.

ఈ అసితునకు, హైహయ, తాల, జంఘ శశిబిందు వంశాలకు చెందిన రాజులతో శత్రుత్వం ఏర్పడింది. దానితో అసితుడు రాజ్యభ్రష్టుడయ్యాడు. కొద్దిమంది మంత్రులతోను శ్రేయోభిలాషులతోను అసితుడు భృగు ప్రస్రవణమనే ప్రదేశంలో తలదాచుకొన్నాడు.

అసితుని భార్యలిద్దరు గర్భవతులయ్యారు. వారిలో ఒక భార్య మరొక భార్య పుత్రుని కనగూడదనే సంకల్పంతో ఆమెకు విషం ఇచ్చింది. ఆ సమయంలో హిమవత్పర్వత ప్రాంతాలకు భృగు వంశజుడైన చ్యవనుడు వచ్చాడు. అసితుని భార్య ఐన కాళింది సుపుత్రాభిలాషతో చ్యవనునికి నమస్కారం చేసింది. ఆమె అతనికి సేవలు అందించింది. చ్యవనుడికి ఆమెపై దయ కలిగింది.

"ఓ కాళిందీ! నీకు విషాహారం పెట్టినా నీ గర్భస్థ శిశువుకు ఏ హానీ కలుగదు. నీకు త్వరలో మహా తేజశ్శాలి మహాపరాక్రమవంతుడైన కుమారుని నీవు పొందుతావు" అని అభయం ఇచ్చాడు. కాళింది చాలా సంతోషపడింది.

అసితుడు స్వర్గస్థుడయ్యాడు. విషాహారం తిన్న తర్వాత కూడా జన్మించినవాడు కాబట్టి గరళంతో పుట్టినవాడగుటచే సగరుడని నామం పెట్టారు.

సగరునికి అసమంజసుడు పుత్రుడు కలిగాడు. అసమంజసునికి అంశుమంతుడనే సుతుడు పుట్టాడు. అంశుమంతుడు దిలీపునకు జన్మనిచ్చాడు. ఇతని తనూజుడు భగీరథుడు. ఎంతో శ్రమకోర్చి భగీరథుడు ఆకాశగంగను భువికి తెచ్చాడు. దానివల్ల సగరుని పుత్రులకు స్వర్గప్రాప్తి కలిగింది. కకుత్స్థుడు భగీరథుని సుతుడు. కకుత్స్థుని పుత్రుడు రఘుమహారాజు.

ఒకసారి రఘుమహారాజు కుమారుడు ప్రవృద్ధుడు వశిష్ఠుని శాపానికి గురి అయ్యాడు. వశిష్ఠుని శపించగల శక్తిని పొందాలని తపస్సు చేశాడు. బలసంపన్నుడయ్యాడు. కాని, అతని భార్య ఉపదేశంవల్ల శాపం ఇవ్వడానికి పట్టుకొన్న జలాన్ని తన కాళ్ళమీద పోసుకొన్నాడు. దానితో కల్మాషపాదుడని అతనిని పిలిచేవారు. ఇతనికి శంఖణుడు అనే పుత్రుడు కలిగాడు. అతనికి సుదర్శనుడు పుట్టాడు అగ్నివర్ణుడు పౌత్రుడయ్యాడు.

ఓ జనక రాజేంద్రా! దశరథుడు అజమహారాజుకు కలిగినవాడు. ఇతని తాత నాభాగుడు. ఇక్ష్వాకు వంశంలోని వారందరూ గొప్ప పరాక్రమశాలురు, ధర్మమూర్తులు అని చెప్పదగినవారే. అగ్నివర్ణుడికి శీఘ్రుగుడు, ఇతనికి మరువు కలిగారు. మరువు యొక్క ఆత్మజుడు ప్రశుశ్రుకుడు. ఆయన పుత్రుడే అంబరీషుడు.

అంబరీషుడు గొప్ప విష్ణుభక్తుడు. తానేగాక తన ప్రజలను విష్ణుభక్తి తత్పరులుగా చేసినవారు అంబరీషుడు. అంబరీషునకు నహుషుడు కొడుకయ్యాడు. ఇతనికి యయాతి జన్మించాడు. అతని కుమారుడే నాభాగుడు. ఇతనే దశరథునికి తాత.

ఈ దశరథ మహారాజుకు నలుగురు కుమారులు. వారు నీకు తెలిసినవారే మహిమోపేతులు. విశ్వామిత్రుని కరుణతో అప్రమేయ బలసంపన్నులయ్యారు. నీవు రామలక్ష్మణులకై సీత, ఊర్మిళలను కన్యాదానం చేయాలని అనుకొన్నావు. దానివల్ల నీ వంశం ఉద్ధరింపబడుతుంది. నీ కీర్తి దశదిశలా వ్యాపింపబడుతుంది. అంతా శుభం జరుగుతుంది అని వశిష్ఠుడు దశరథుని వంశ చరిత్రనంతా విపులంగా విశదీకరించి చెప్పాడు.

* * *

జనకుని వంశ చరిత్ర

సర్గ - 71

"ఓ వసిష్ఠ మహామునీ! కీర్తిగాంచిన దశరథుని వంశజుల గురించి నీ నోటి ద్వారా విన్నాను. మా వంశకర్తలైన వారి గురించి నేను నాకు తెలిసినంత చెప్తాను వినండి. దశరథునికి కూడా మా వంశజులను పరిచయం చేస్తాను అని జనకుడు అన్నాడు. అంతేగాక కన్యాదాన సమయంలో ఇరు వంశాల వారి ప్రవర్తన చెప్పడం సంప్రదాయం. అందుకే ఇప్పుడు మా వంశం గురించి చెప్తాను ఆలకించండి" అని జనకుడు చెప్పడం ఆరంభించాడు. మా వంశ మూలకర్త నిమిచక్రవర్తి. ఇతనికి మిథి అనే పుత్రుడు. ఈ మిథి నామం మీదనే మిథిలానగరం ఏర్పాటు చేశారు. ఇతడు గొప్ప పరాక్రమవంతుడు. ఇతనికి ఉదావసుడు కొడుకు అయ్యాడు. అతనికి నందివర్ధనుడు అనే సుతుడు జన్మించాడు. నందివర్ధనునికి సుకేతుడు పుత్రుడు దేవరాతుడు పౌత్రుడు. ఈ దేవరాతుడు దేవతలకు సంతోషం కలుగజేశాడు. శివచాపాన్ని మహేశ్వరునిచే న్యాసంగా గ్రహించాడు. ఆయన పుత్రుడు బృహద్రథుడు ఇతనికి మహావీరుడు అనే కుమారుడు కలిగాడు. ఇతడు శూరశిరోమణిగా ఖ్యాతి గడించాడు. సుధృతి మహావీరుని తనయుడు. సత్యపరాక్రముడు ఇతని తనూజుడు దృష్టకేతువు. ఇతడు రాజర్షిగా గౌరవించదగినవాడు. ఎన్నో యజ్ఞయాగాదులను నిర్వర్తించినవాడు. ఇతనికి హర్యశ్వుడు పుత్రుడిగా లభించాడు. మరువు హర్యశ్వునికి పుత్రుడిగా ఉదయించాడు. ఇతనికి ప్రతింధకుడు పుత్రుడు, కీర్తిరథమహారాజు పౌత్రుడు అయ్యారు. దేవమీఢుడు కీర్తిరథమహారాజు తనయుడు. ఇతనికి విబుధుడు. ఇతనికి మహీధ్రకుడు కుమారుడిగా పుట్టారు.

హ్రస్వరోముడు ధర్మమూర్తిగా పేర్గాంచాడు. ఇతని తండ్రి స్వర్ణరోముడు రాజర్షి. కీర్తిరాతుడు మహీధ్రకుని కుమారుడు. ఇతని తనూజుడు మహారోముడు. మహారోముడికే స్వర్ణరోముడు జనించాడు. హ్రస్వరోముడికి ఇద్దరు కుమారులు. వారిలో పెద్దవాడిని నేను. నా తమ్ముడు కుశధ్వజుడు. మా తండ్రి నన్ను రాజ్యాభిషిక్తుని చేసి తనువు చాలించాడు. ఒకసారి నా కుమార్తె సీతను, శివచాపాన్ని ఇవ్వమని సుధన్వుడు కబురుపంపాడు. నేను దానికి నిరాకరించాను. దానితో మిథిలపై సుధన్వుడు దండెత్తాడు. అప్పుడు కుశధ్వజుడు అతని మదం అణిచాడు. అందుకే నేను సాంకాశ్యపురానికి కుశధ్వజుని రాజును చేశాను. ఇతడు సహృదయుడు, నిర్మలచిత్తుడు. ఇది నా వంశ చరిత్ర. నాకు ఇద్దరు కుమార్తెలు. వారిలో సీతను రామునికి, ఊర్మిళను లక్ష్మణునికిచ్చి వివాహం చేయాలని నా కోరిక. దానిని మీరు మన్నించండి. "దశరథ నరేంద్రా! స్నాతక కార్యక్రమానికై పూనుకోండి. వివాహానికి సంబంధించి నాంది మొదలగు విధులను నిర్వర్తించుదాం. ఉత్తర ఫల్గుణీ నక్షత్రంనాడు వివాహం సుముహూర్తం అని నిశ్చయించినారు గదా! ఆ రోజు వివాహాన్ని జరిపిద్దాం. దానికై నేను దానాలు ఇవ్వడం ఆరంభించాను." అని జనకుడు చెప్పాడు. దశరథుడు మిక్కిలి సంతోషించాడు. తానుకూడా వీరుని తండ్రిగా చేయవలసిన విధులను చేపట్టాడు. భూదానాలు, గోదానాలు, తిల, హిరణ్యాది దానాలను ఇవ్వడం ప్రారంభించాడు.

* * *

భరత శత్రుఘ్నుల వివాహ యత్నం

సర్గ - 72

విశ్వామిత్రుడు ఇరువురి వంశ చరిత్రలచే సంతోషించాడు. మీరిద్దరును సరితూగువారు మీకు మీరు సాటిలేని ప్రఖ్యాతిని పొందినవారు. సీతా ఊర్మిళలు రామలక్ష్మణులకు తగినవారుగా నాకు తెలుస్తోంది.

ఇదంతా చూచిన తర్వాత నా మనస్సులో ఒక ఆలోచన వచ్చింది. కుశధ్వజుని కుమార్తెలైన మాండవీ, శ్రుతకీర్తులు నిరుపమాన సౌందర్యవంతులు. వీరిని భరత శత్రుఘ్నులు చేపట్టితే బాగుండుననే అభిలాష నాకు కలుగుతోంది అని అన్నాడు. వసిష్ఠుడు కూడా దీనికే సమ్మతాన్ని తెలిపాడు.

ఆ ఇరువురు మహానుభావుల ఆలోచనను జనకుడు విన్నాడు. మీరు ఉభయులు నిర్ణయించిన తర్వాత దీనిని మేము జవదాటం. మీ ఆజ్ఞానువర్తులం అవుతామని జనకుడు కుశధ్వజుడు తమ సుముఖతను వెల్లడించారు. దశరథుడికి పరమానందం వేసింది.

తన సమ్మతాన్ని, అంగీకారాన్ని తెలిపాడు. ఆ మహర్షులు సంతానప్రదుడైన భగప్రజాపతి ఉత్తర నక్షత్రమందున్నప్పుడు వివాహం జరపడం ప్రశస్తం. కావున మీరిద్దరూ దాత ప్రతిగ్రహీతలుగా ఆనాడు మారండి అని అన్నారు. జనకుడు సంతోషంతో "అయ్యా దశరథ మహారాజా! ఈ మిథిలానగరం మీ అయోధ్యగా భావించండి. నాకు కన్యాదాన ఫలం లభింపచేసే మీరు నాకు దైవసమానులు. మీకు కావాల్సిన దానిని నాకు ఆజ్ఞాపించండి. నేను ఆజ్ఞాబద్ధుడనై మీ కోరికను తీరుస్తాను" అని జనకుడు వినయంగా దశరథాదులతో చెప్పాడు.

వారి వారి పనులలో నిమగ్నులయ్యారు. దశరథుడు ఒక్కొక్క కుమారుని పేర లక్ష గోవులను దానం ఇచ్చాడు. ఆవులకు బంగారు కొమ్ముల తొడుగులు కలవిగా చూశాడు. దూడలను సైతం బ్రాహ్మణులకు గోవులతో పాటుగా ఇచ్చాడు. పాలను పితకడానికి కంచు పాత్రలను సైతం దానం చేశాడు. స్నాతకాది కార్యక్రమాలను నిర్వర్తించాడు.

* * *

రామాదుల వివాహ మహోత్సవం

సర్గ - 73

దశరథుడు గోదానాలు చేస్తున్నప్పుడు భరతుని మేనమామ యుధాజిత్తు వచ్చాడు. మహారాజుకు నమస్కరించాడు. దశరథుని కుశల ప్రశ్నలను అడిగాడు. దశరథుడు యుధాజిత్తును సగౌరవంగా ఆహ్వానించి అతిథి సత్కారాలు చేశాడు. ఉచితాసనాన్ని ఇచ్చాడు. కేకయరాజు కుశలం అడిగాడు. కేకయరాజ్య ప్రజల బాగోగులను విచారించాడు దశరథుడు.

మేనళ్లుళ్లను చూడాలన్న కాంక్షతో నేను అయోధ్యకు వచ్చాను. అక్కడ మీరందరూ మిథిలానగరంలో ఉన్నారన్న సంగతి తెలిసింది. దానితో నేనును ఇక్కడకు వచ్చానని యుధాజిత్తు చెప్పాడు. అందరూ ఆనందంగా గడిపారు. మరుసటి రోజు ప్రొద్దున్నే కాలకృత్యాలు తీర్చుకొన్నారు. నిత్యవిధులను ముగించుకొన్నారు. జనకుని ఆహ్వానం మేరకు దశరథాదులు యజ్ఞవాటికను చేరారు.

రామచతుష్టయాన్ని పెండ్లికొడుకులుగా తీర్చారు. మంగళస్నానాలు చేయించి రాజోచితమైన ఆభరణాలన్నింటిని అలంకరించారు. మహర్షుల ఆదేశానుసారం రాముడు సోదరులతో కలిసి తండ్రి వద్దకు వచ్చాడు. వసిష్ఠుడు జనకుని పిలిచాడు. దశరథుడు స్నాతకార్యాలు ముగించుకొన్నాడు. తనయులకు తోరాలను కట్టాడు. నీ కన్యాదానానికై ఎదురుచూస్తున్నాడు. నీవు స్వధర్మాన్ని ఆచరించు అని వసిష్ఠుడు జనకునికి హితోపదేశం చేశాడు. ఇచ్చేవారు తీసుకొనేవారు ఎదురైనప్పుడే అనుకొన్న దానం నెరవేరుతుంది. నీవు చేసే కన్యాదానాన్ని స్వీకరించుటకు దశరథుడు వేచియున్నాడు అని వశిష్ఠుడు జనకునికి తెలిపాడు. స్వగృహంలో ఎవరి ఆజ్ఞకోసం వేచి ఉండనవసరం లేదు. అయోధ్యలో ఏ విధంగా పనులు చేస్తారో అలానే మిథిలలో కూడా చేయవచ్చు గదా.

నా కుమార్తెలు నలుగురు అలంకృతులై జ్వలిస్తున్న అగ్నిశిఖలలాగా వేదికపైనే సిద్ధంగా ఉన్నారు. జాగుచేయక దశరథుడు తన కుమారులకు చేయవలసిన కార్యాలను నిర్విఘ్నంగా జరిపించమనండి అని జనకుడు వసిష్ఠునితో చెప్పాడు.

"ఓ మహర్షీ! నా మీద దయతో జానకీ పరిణయ కార్యాన్ని చేయింపుము" అని జనకుడు వసిష్ఠుని వేడుకొన్నాడు. దాత ప్రతిగ్రహీతల కోరిక మేర వసిష్ఠుడు విధి విధానాన్ని అనుసరించి వివాహ వేదికను ఏర్పాటు చేశాడు. సుగంధ ద్రవ్యాలతో ఆ ప్రదేశాన్ని పరిశుద్ధం కావించాడు. బంగారు పాలికలు మొలకలతో కూడిన నవధాన్యపు మూకుళ్ళను ధూప పాత్రలను సిద్ధం చేశాడు. వివాహ కార్యానికి వలసిన పేలాలు మొదలైన వస్తువులను దగ్గరగా ఉంచుకొన్నాడు. విధ్యుక్తంగా మంత్రపఠనం సాగించారు. అగ్నిసాక్షిగా చేశారు.

సీతారాముల కల్యాణం

జనకుడు సర్వాలంకార భూషితురాలైన సీతాదేవిని తెచ్చి అగ్ని సమక్షంలో రామునకు అభిముఖంగా నిలబెట్టాడు. "అయ్యా! రామచంద్రా! ఈ సౌందర్యరాశి సుకుమారవతి నా కుమార్తె. ఈమె చేతిని నీవు గ్రహించి నీ సహధర్మచారణిగా చేపట్టు. ఈమె సర్వదా నిన్ను నీడవలె అనుసరిస్తుంది" అంటూ సీతాదేవి చేతిని రాముని చేతిలో ఉంచి మంత్రపూరిత జలాన్ని విడిచాడు.

ఆ సమయంకోసమై ఎదురుచూస్తున్న దేవతలు పుష్పవృష్టి కురిపించారు. దేవదుందుభులు మ్రోగాయి. మిథిలానగరం అంతా మంగళతూర్యనాదాలు మిన్నుముట్టాయి. అలా సీతారాముల కల్యాణం దివ్యంగా జరిగింది.

లక్ష్మణ భరత శత్రుఘ్నుల కల్యాణం

జనకుడు "లక్ష్మణ కుమారా! ఆలస్యం చేయకుండా నా సుత ఐన ఊర్మిళను చేపట్టు" అని ఊర్మిళా కల్యాణంను జరిపించాడు. "ఇక్ష్వాకుకుల వర్ధనా భరతా! నీవు మాండవిని చేకొని, మా వంశాన్ని ఉద్ధరించు" అని

భరతుని పెండ్లిచేశారు. కుశధ్వజుడు "రఘువంశతిలకా శత్రుఘ్నా! నీవు శ్రుతకీర్తిని పాణిగ్రహణం చేయి" అని శత్రుఘ్ను శ్రుతకీర్తులను ఒకటిగా చేశాడు. వసిష్ఠుడు విశ్వామిత్రుడు కలసి రామసోదరులకు జానకీ సోదరీమణులకు వివాహ మహోత్సవాన్ని ఘనంగా జరిపించారు. ఇలా జనక కుశధ్వజులు తమ కూతుళ్లకు వివాహాన్ని చేశారు. రామలక్ష్మణభరతశత్రుఘ్నులు తమ భార్యలతో కూడి మూడుసార్లు అగ్నిప్రదక్షిణ చేశారు. వేదిక దిగి అక్కడున్న పెద్దలందరికి వధూవరులు నమస్కరించారు. దశరథుడు బంధుమిత్ర సమేతుడై, పురోహితాది మహర్షులతో కలిసి వధూవరులను తీసుకొని విడిది గృహాలకు తరలి వెళ్ళారు.

* * *

పరశురామాగమనం

సర్గ - 74

విశ్వామిత్రుడు మరునాడు వధూవరులకు ఆశీర్వాదాలను అందించాడు. జనకుని దగ్గర, దశరథుని చెంత సెలవు తీసుకొని హిమవత్పర్వత ప్రాంతాలకు వెళ్ళిపోయాడు. దశరథుడు తన కొడుకు కోడళ్ళను తీసుకొని పరమానందంగా అయోధ్యకు మరలాడు.

జనకుడు తన కుమార్తెలకు వెలకట్టగరాని ఆభరణాలనెన్నిటినో ఆరణంగా పంపాడు. ఆవులను, గుర్రాలను పట్టు వస్త్రాలను రథాలను దాసదాసీ జనాలను సారెగా ఇచ్చి అయోధ్యకు పంపించాడు. దశరథునికి వీడ్కోలు ఇచ్చి, తన నిజపురి అయిన మిథిలానగరానికి జనకుడు వెళ్ళాడు.

అయోధ్యకు దశరథాదులు బయలుదేరారు. మార్గమధ్యంలో వారికి పక్షుల భయంకర ధ్వని వినిపించింది. భూమిపై సంచరించే కొన్ని జంతువులు వీరికి ప్రదక్షిణం చేస్తున్నట్లుగా తిరిగి వెళ్ళిపోయాయి.

ఈ పరిస్థితిని చూచిన దశరథునికి అనుమానం కలిగింది. వెంటనే కులగురువును "నా హృదయం ఏదో కీడును శంకిస్తోంది. దీని పర్యవసానమేమి?" అని దశరథుడు అడిగాడు. భయపడనవసరంలేదని వశిష్ఠుడు దశరథునికి ధైర్యం చెప్పాడు.

"ఓ రాజేంద్ర!పక్షుల ధ్వని దైవకృతాన్ని తెలుపుతోంది. ఆ భయం మబ్బు వీడినట్లుగా తొలగిపోతుందని మృగ సంచారం వలన తెలుస్తోంది. కాబట్టి మనస్తాపాన్ని పోగొట్టుకో" అని వశిష్ఠుడు చెపుతున్నప్పుడు ప్రచండమైన గాలి వేగంగా వీచింది. భూమి సన్నగా కంపించింది. దిక్కులన్నీ మూగపోయాయి. ప్రకృతి అంతా చీకటిమయం అయింది. దశరథుని సైన్యం అంతా మూర్ఛిల్లింది. వశిష్ఠాది ఋషులు దశరథుడు, రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు, రాణులు తప్ప మిగతా జీవులన్నీ చైతన్యం వదిలి నిద్రలో కూరుకుపోయాయి.

ప్రళయ కాలాగ్నివలె ఉన్న భయంకరాకారుడగు పరశురాముడు వారికి కనిపించాడు. గండ్రగొడ్డలిని భుజంపై ధరించాడు. తేజస్సుతో నిండిన ధనుస్సును చేపట్టాడు. బాణాన్ని చేత్తో పట్టుకొని మహాశివునివలె పరశురాముడు వారికి దర్శనం ఇచ్చాడు.

క్షత్రియవంశాన్ని నిర్మూలనం చేశాడు. మదగర్వితులైన రాజులను మట్టి కరిపించిన కార్తవీర్యార్జునుడు మరల యుద్ధం చేయాలని సంకల్పించాడేమోనని అక్కడివారు గుసగుసలాడుకొన్నారు. అంతలో ఋషిగణం ఆయనకు అర్ఘ్యపాద్యాదులను నిచ్చి అతిథి సత్కారాలు చేసింది. దశరథుడు చింతితుడై గద్గదస్వరంతో పరశురామునకు నమస్కరించాడు. ఋషుల పూజలను పరశురాముడు అందుకొన్నాడు. దాశరథితో మాట్లాడాలని పరశురాముడు అనుకొన్నాడు.

* * *

పరశురాముడు శ్రీరాముని ప్రేరేపించటం

సర్గ - 75

వెనువెంటనే పరశురాముడు రాముని వైపు తిరిగి "ఓ దశరథ రామా! నీ పరాక్రమం గురించి నేను విన్నాను. నీవు జనకుని ఇంట శివధనుర్భంగం చేసిన సంగతి విని ఎంతో సంతోషించాను. నిన్ను చూడాలనే ఉబలాటంతో ఇక్కడకు వచ్చాను. నీ అమోఘమైన దివ్యరూపాన్ని చూసి ఆనందించాను. నీతో నాకు ద్వంద్వ యుద్ధం చేయాలని కోరికగా ఉంది. నా దగ్గర నా తండ్రి ఇచ్చిన వైష్ణవ ధనుస్సు ఉంది. నీవు ఈ విష్ణుచాపాన్ని ఎక్కుపెట్టి నీ శౌర్యాన్ని నిరూపించు. నీవు ఈ వింటిని ధరించి శరం సంధించినచో నాతో ద్వంద్వ యుద్ధానికి నీకు అనుమతినిస్తాను" అని పరశురాముడు శ్రీరామునితో పలికాడు.

ఇదంతా విన్న దశరథుడు వ్యాకులపడ్డాడు. పరశురామునితో ద్వంద్వయుద్ధమా అదీ నా చిన్న కుమారునితో అయ్యో, నా రాముడు ఇప్పుడే వివాహం చేసుకొన్నాడు గదా! ఎలా పరశురాముణ్ణి శాంతపరచడం అని దశరథుని మది చింతాక్రాంతం అయింది. బాగా ఆలోచించాడు. తర్వాత పరశురామునికి అంజలి ఘటించాడు. "ఓ బ్రాహ్మణోత్తమా! నీవు శాంతిని కోరి మహేంద్రాది పర్వతాలకు వెళ్ళావు గదా! నీకు క్షత్రియులపై ఉన్న కోపం చల్లారిపోయింది గదా! పసిబాలుడైన నా కుమారునిపై దయ చూపు. నిన్ననే కుమారుని పెండ్లి జరిగింది. ఇంకను పాదాల పారాణి ఆరలేదు.

నీవు భృగువంశ సంజాతుడవు కదా. నిరంతరం వేదాధ్యయనంతో నీ మనస్సు పరిశుద్ధమై ఉంటుంది. నీవు మహేంద్రుని ఎదుట అస్త్ర సన్యాసం చేశావు. ఈ భూమిపై నేనుండనని వాగ్దానం చేశావు. నీవు గెలుచుకొన్న భూమినంతా కాశ్యపునికి దానం చేశావు గదా! మరి ఈ ద్వంద్వ యుద్ధాభిలాష నీకు ఎందుకు కలుగుతోంది? నా కుమారుడు లేనిచో నేను క్షణమైన బ్రతుకలేను. నేను లేనట్లయితే నా కులనాశనం తప్పదు. అంటూ ఇంకా ఏదో దశరథుడు చెప్పుతూనే ఉన్నాడు.

పరశురాముడు దశరథుని మాటలు పట్టించుకోలేదు. రామునితో "ఓ రామా! విష్ణు, శివచాపాలు లోకోత్తరమైనవి. దేవలోకానికి సంబంధించినవి. విశ్వకర్మ వీటి నిర్మాణం చేశాడు. నరశ్రేష్ఠుడివైన నీవు త్రిపుర సంహారం చేసిన శివుని విల్లును విరిచితివి. దేవతలందరు నా దగ్గర ఉన్న విష్ణుచాపం శివచాపానికి దీటైనది అంటారు.

ఒకసారి బ్రహ్మదేవుడిని దేవతలందరు శివకేశవులలో ఎవరు గొప్పవారో చెప్పమని అడిగారు. వారి సందేహం తీర్చాలని బ్రహ్మ భావించాడు. శివ విష్ణువులకు విరోధాన్ని పుట్టించాడు. వారిద్దరి మధ్య ఘోరమైన యుద్ధం మొదలైంది. అప్పుడు విష్ణువు హుంకారం చేశాడు. దానికి త్రిలోచనుడు శివధనుస్సు కదలలేక జడమైపోయాడు. దేవతలందరు వీరిద్దరిని ప్రార్థించారు. యుద్ధం నుంచి శాంతి కాముకులు కమ్మని వేడారు. శివచాపం శివుడు శిలలు అవడం చూసిన దేవతలు విష్ణువే అధికుడని భావించారు. దానికి శివుడు కోపించాడు. శరసహితంగా శివ ధనుస్సును దేవరాతునకు శివుడు ఇచ్చివేశాడు. విష్ణువు భృగువంశుజుడైన ఋచీకుని పిలిచాడు. తన ధనుస్సును అమ్ముల పొదిని ఋచీకునికి విష్ణువు దానం చేశాడు. ఆ మహాత్ముడైన ఋచీకుడు నా తండ్రి జమదగ్నికి కానుకగా ఇచ్చాడు. తపోబల సంపన్నుడైన నా తండ్రిని కార్తవీర్యార్జునుడు చంపాడు. దానితో నేను కుపితుడినయ్యాను. నేను రోషావేశపరుడినయ్యాను. ఎన్నోసార్లు భూప్రదక్షిణ చేసి క్షత్రియులను మట్టి కరిపించాను. ఈ భూమినంతా జయించాను. రాజ్యకాంక్ష లేని నేను నా కోపాన్ని చల్లార్చుకొన్నాను. కాశ్యపునకు ఈ భూమినంతా దానం చేశాను. నా స్వభావరీత్యా తపస్సులకై మహేంద్రగిరి చేరాను.

ఈనాడు నేను నీ తేజోబల పరాక్రమాలను గురించి విన్నాను. నిన్ను చూడాలని తలచాను. అందుకే వేగంగా నీ దరి చేరాను. నీ పరాక్రమం చూడాలన్న నా కోరికను తీర్చు. నీవు ఈ ధనుస్సును సంధించినట్లయితే నాతో ద్వంద్వ యుద్ధం చేయవచ్చు అని పరశురాముడు శ్రీరామునితో అన్నాడు.

* * *

పరశురాముని తిరుగుప్రయాణం

సర్గ - 76

శ్రీరాముడు పరశురాముని మాటలన్నీ ఆలకించాడు. తన తండ్రి ఎదురుగా ఎక్కువగా మాట్లాడకూడదని తలచాడు. "ఓ పరశురామా! నీవు పితృణం తీర్చుకొనడానికి 21 మార్లు క్షత్రియ నాశనం చేశావని నేను తెలుసుకొన్నాను. స్వధర్మాన్ని ఆచరించిన నీపై నాకు గౌరవం ఉంది.

"ఓ భార్గవా! నన్ను పరాక్రమం లేనివానిగా తలుస్తున్నావు. యుద్ధం చేయడంలో, వింటిని ఎక్కుపెట్టడంలో నన్ను అశక్తుడిగా భావించినట్లున్నావు. అందుకే నన్ను పదే పదే ద్వంద్వ యుద్ధానికి రమ్మని కోరుతున్నావు. నీవు బ్రాహ్మణుడవు, పూజనీయుడవు. కాన నీపై ప్రాణం హరించే శరాన్ని నేను సంధించలేను. అదేగాక నీ తండ్రి నా

గురువు విశ్వామిత్రుని సోదరీసుతుడు (జమదగ్ని సత్యవతి తనయుడు). నేను నా గురువుగారి మనస్సును క్షోభింపచేయను.

ఓ పరశురామా! నేను ఎక్కుపెట్టిన శరం వృధా గాదు! అందుకే నీ పాదగమన శక్తిని గాని లేక నీవు తపస్సు చేత సంపాదించుకున్న పుణ్యరాశినిగాని నాశనం చేస్తాను. ఇందులో నీకు ఏది ఇష్టమో తెలిపినట్లయితే, దానిపైనే నేను బాణాన్ని సంధిస్తాను. నీ కోరిక శీఘ్రంగా తెలుపు" అని శ్రీరాముడు పరశురాముని కోరాడు. శ్రేష్ఠమైన విష్ణు ధనుస్సును ధరించిన కోసలేంద్రుడిని చూడాలని దేవతలందరూ ఆకాశాన నిలిచారు. గంధర్వ యక్ష కిన్నర కింపురుషులు సీతారాముడిని కనులారా కాంచాలని గుమికూడారు.

శ్రీరాముడు విష్ణుచాపాన్ని చేతితో పట్టుకొన్నాడు. అల్లెత్రాడును బిగించి శరాన్ని ఎక్కుపెట్టాడు. దాన్ని పరశురాముడు చూశాడు. "ఓ రామా! నేను ఇంతకుముందు ఈ భూమిని కాశ్యపదత్తం చేశాను. కావున నేను ఈ భూమిపై ఉండజాలను. అందుకే రాత్రియందు నేను భూమిపై కశ్యపుని మాట ప్రకారం నివసించను. నా మనోవేగంతో క్షణకాలంలో మహేంద్రగిరిని చేరుతాను. కాబట్టి నీవు నా గమనశక్తి నిరోధించవద్దు. కాల విలంబనం చేయకుండా నేను సాధించుకొన్న ఉత్తమ లోకాలపై నీ శరాన్ని విడుచు. నీవు ఈ శరాన్ని సంధించుటచే నీవే పరమ దయాళువైన విష్ణు అంశసంభూతుడవని తెలుసుకొన్నాను. శత్రునాశకా రామా! నీకు శుభం కలుగుగాక! నిన్ను యుద్ధంలో ఎదిరించువారు ఎవరూ లేరు. ముల్లోకాలను జయించగల నీ చేతిలో నేను ఓడిపోవడం పెద్ద విషయం కాదు.

నీ బాణ ప్రయోగాన్ని కన్నులారా చూచి నేను మహేంద్రగిరికి పయనం అవుతాను. శ్రీరామచంద్రా! నీకు మంగళం అగుగాక!" అని పరశురాముడు దీవించాడు. ఆపై శ్రీరాముడు బాణ ప్రయోగం చేశాడు. ఆ శరాహతితో భార్గవరాముని ఉత్తమలోకాలు నాశనం అయ్యాయి. దాన్ని పరశురాముడు చూశాడు. మహేంద్రగిరిని మనోవేగంతో చేరాడు. అప్పుడు దిక్కులన్నీ తేజరిల్లాయి. జీవులన్నీ చైతన్యం తెచ్చుకొన్నాయి. సూర్యుడు ప్రకాశవంతుడయ్యాడు. దేవతలు ఋషులు శ్రీరాముని స్తుతించారు. బాధలు తొలగిపోయాయని దశరథుడు సంతోషించాడు.

* * *

అయోధ్యా ప్రవేశం

సర్గ - 77

భార్గవ రాముడు నిష్క్రమించాడు. శ్రీరాముడు వరుణదేవుని పిలిచాడు. భార్గవుడు ఇచ్చిన ధనుస్సును విల్లంబులను ఇచ్చివేశాడు. చతురంగ బలాలు అయోధ్యకు కదిలాయి.

పరశురాముని దగ్గర విజయ శ్రీవిరాజితుడైన శ్రీరాముని దశరథుడు ఆలింగనం చేసుకొన్నాడు. శిరస్సు ముద్దాడాడు. శ్రీరామునికి పునర్జన్మ లభించినట్లుగా దశరథుడు ఆనందించాడు. అందరూ కలిసి అయోధ్యాపురి

చేరారు. అక్కడ రమ్యమైన తూర్యనాదాలు మిన్నుముట్టాయి. రాజవీధులన్నీ పుష్పాలతో అలంకరించారు. వాకిట్ల నిండా ముత్యాల ముగ్గులను తీర్చారు. అయోధ్యావాసులు రామసోదరులను కొత్త పెళ్ళికూతుళ్లను ఆహ్వానించారు. దశరథ మహారాజుకు జయం కలగాలని మంగళాశాసనాలు చేశారు.

కౌసల్యా, సుమిత్ర, కైకేయి తమ కోడళ్ళచే నూతన గృహప్రవేశం చేయించారు. కోడళ్ళను చిరకాలం పుత్రపౌత్రాభివృద్ధిరస్తు అంటూ దీవించారు. అందరూ కలిసి ఇలవేల్పును పూజించారు.

బ్రాహ్మణోత్తములను సంతృప్తిపరిచారు. భూలోకంలో సాటిలేని వీరులుగా దశరథసుతులు పేరు తెచ్చుకొన్నారు. తండ్రికి శుశ్రూషలు చేస్తూ ఆనందించారు.

దశరథుడు భరతుని పిలిచి మేనమామ నిన్ను కేకయ రాజ్యానికి తీసుకొని వెళ్లాలని అభిలషిస్తున్నాడు. నీవు కొద్ది దినాలు ఆయన కోరికను తీర్చి యుధాజిత్తును ఆనందింపజేయి అని చెప్పాడు.

తండ్రి మాటప్రకారం భరతుడు శత్రుఘ్నుడు మేనమామ ఇంటికి వెళ్ళారు. రామలక్ష్మణులు దశరథుని ఆజ్ఞానువర్తనులై రాజ్యకార్యాలను చేసేవారు. రాముని ప్రవర్తనతో దశరథుడు తృప్తి చెందాడు. రాముడు రాజ్యంలోని వారినందరిని సమానంగా చూసేవాడు, ఆదరించేవాడు.

సీత రాముడినే పరదేవతగా ఆరాధించేది. రాముడు సీతనే మనస్సునందు నిలిపి ఉంచుకొనేవాడు. సీతారాములు ఆదర్శవంతంగా జీవనం చేస్తున్నారు. అన్యోన్యంగా ఒకరికోసం మరొకరు బతుకుతున్నట్లుగా ఉండేవారు. లక్ష్మీనారాయణులవలె సీతారాములు ఆదర్శ దంపతులుగా జీవనం చేయసాగారు.

* * *

బాలకాండ సమాప్తం

అయోధ్యాకాండ

శ్రీరామపట్టాభిషేకసంకల్పం

సర్గ - 1

భరతశత్రుఘ్నులు మేనమామ ఇంటికి వెళ్ళారు. అక్కడి బంధువర్గం వీరిని ఆదరాభిమానాలతో చూస్తున్నారు. అయినా భరతశత్రుఘ్నులు తండ్రికి దగ్గరగా లేమని బాధపడుతున్నారు. దశరథుడు తన పుత్రులను చూస్తూ ఆనందంగా రాజ్యాన్ని పాలిస్తున్నాడు. తనకు వారే సంపద; అటువంటి పుత్రులు దూరంగా ఉన్నారని ఆయన ఎప్పుడూ కలవరిస్తున్నాడు.

మహావిష్ణువుకు బ్రహ్మ ప్రీతిపాత్రుడైనట్లు దశరథునికి జ్యేష్ఠుడైన రామునిపై ఎంతో ప్రేమ ఉంది. దేవతల ప్రార్థనను మన్నించి మహావిష్ణువు రావణ సంహరణార్థం భూమిపై శ్రీరామునిగా అవతరించాడు. దేవతల తల్లి ఐన అదితి వలె శ్రీరాముని పొందిన కౌసల్య నిత్యానందంతో ఉంది. లోకోత్తర సుందరుడు సద్గుణరాశి ఐన శ్రీరాముని పుత్రునిగా పొందడం కౌసల్యాదేవి తన అదృష్టంగా భావించింది.

రఘురాముడు సాటిలేని వీరుడు. మితభాషి. మృదుస్వభావి. ఇతరుల అంతరంగం తెలుసుకొని నడుచుకొంటాడు. అందుచే అందరికీ ఇష్టుడయ్యాడు. రాజ్యంలోని ప్రజలను కన్నబిడ్డలవలె అహర్నిశలు కాపాడు తున్నాడు.

ఎవరైనా తనకు అపకారం చేస్తే పట్టించుకోడు. క్షమాగుణం కలవాడు. తాను మాత్రం అందరికీ సహాయకారిగా ఉంటాడు. రాముడు జ్ఞానవృద్ధులతోను, సజ్జనులతోను శాస్త్ర విషయాలు చర్చిస్తుంటాడు. శరణాగతులను కాపాడడం, దుష్టుల పీచమణచడం ఆయన ధర్మాలు. ఇలా ఆవగింజంతైనా గర్వం లేని వాడుగా రాముడు ఎదుగుతున్నాడు. కలలో సైతం పరుల సొమ్ము ఆశించేవాడు కాదు. ఆత్మారాముని బోధతో నిత్యం వివేకంతో ఆలోచిస్తాడు. ఆ రాముడు క్రోధాన్ని జయించాడు. రాజోచితవిద్యలను, క్షత్రియవిద్యలను ఆపోశనం పట్టాడు.

యుక్తిగా మాట్లాడడంలో బృహస్పతిని తలపిస్తాడు. ధర్మవిరుద్ధకార్యాలు ఎన్నడూ చేసేవాడు కాదు. సాధువర్తనుడు, ఏకసంథాగ్రాహి. దుందుభి వంటి మంచి కంఠధ్వని ఆయనది. ప్రజ లందరూ శ్రీరాముణ్ణి ఇష్టపడేవారు. ఇన్ని సద్గుణాలున్న శ్రీరాముని దశరథుడు తన వారసునిగా భావించి రాజధర్మాలన్నీ నేర్పించాడు. న్యాయసమ్మతమైన ఆర్జనతో జీవితాన్ని గడపాలని భావిస్తాడు. శాస్త్రమర్యాదలు పాటిస్తాడు. సకలశాస్త్రకోవిదునిగా అందరి మెప్పును సంపాదించాడు. వాక్చాతుర్యంతో కార్యాన్ని అనుకూలంగా మలుచుకొంటాడు. సహజసుందరుడైన రాముని సద్గుణాలన్నీ కలిసి అందానికి మారుపేరు రాము డనిపించేవి. కుసుమకోమలంగా ఉదాత్తంగా కనిపిస్తున్న రాముణ్ణి యువరాజుగా పట్టాభిషిక్తుణ్ణి చేయాలని దశరథుడు ఆలోచించాడు. మంత్రాంగం నెరపాడు. సకలప్రాణులపై దయ ఉన్న రాముణ్ణి గూర్చి ప్రజలు ఏమనుకొంటున్నారో తెలుసుకోవాలని దశరథుడు గూఢచారులను తన పురంలో నియమించాడు. ప్రజాభీష్టాన్ని తెలుసుకొన్నాడు. రాముడే రాజ్యాధికారాన్ని చేపట్టాలని నిర్ణయించాడు.

సామంతుల ఆలోచనలను కూడా తెలుసుకోవాలని అనుకొన్నాడు. వేగులను పంపించి సామంతులను, జానపదులను, వివిధనగరప్రజలను రాజధానికి పిలిపించాడు. వారందరితో విడివిడిగా మంతనాలు జరిపాడు. వారందరూ రాముణ్ణే భావిరాజ్యాధిపతిని చేయవలసిందని దశరథుణ్ణి ప్రోత్సహించారు.

దశరథుడు ఒకనాడు కొలువు తీరాడు. ఆ దర్బారుకు వివిధదేశాధీశులను, సామంతులను పిలిపించాడు. జానపదులను, నగరవాసులను, అయోధ్యావాసులను ఆహ్వానించాడు. వివిధదేశమంత్రులను, ఋషులను, పురోహితులను ఉచితాసనాలపై కూర్చోబెట్టాడు. వారందరితో కలిసి దశరథుడు సకలైశ్వర్య సంపన్నుడైన దేవరాజు వలె శోభిల్లాడు.

* * *

శ్రీరాముని రాజుగా సమ్మతించటం

సర్గ - 2

దశరథుడు నిండు సభలో తన మనసులోని మాట చెప్పాడు. ప్రజలందరూ శ్రద్ధగా వింటున్నారు. "ఓ సజ్జనులారా! మా వంశీయులందరూ రాజ్యంలోని అందరినీ కన్నబిడ్డల్లా చూసుకొనేవారు. నేను కూడా నా రాజ్యంలోని జనులందరికీ ఆనందాన్ని చేకూర్చాననే భావిస్తున్నాను. నా అనంతరం రాజ్యబాధ్యతలను చేపట్టే వారసులు ఎవరని నేను ఆలోచించాను. నా ఆలోచనలకు తగ్గట్టుగానే మీరందరూ మీమీ అభీష్టాలను మనోవాంఛలను నాకు తెలిపారు. నాకు ఎంతో సంతోషంగా ఉంది. నాకంటే కూడా మీరందరినీ కంటికి రెప్పవలె కాపాడే రాజును నిర్ణయించడంలో భగవంతుడు నాకు తోడ్పడాలని కోరుకొంటున్నాను.

నేనిప్పుడు వయోవృద్ధుణ్ణి. రాజ్యాన్ని కాపాడడంలో అశక్తత నన్నావేశించింది. రాజ్యపాలనాభారంతో నేను చాలా అలసిపోయాను. ప్రజల శ్రేయస్సును కోరే నేను మీకు హితం కలిగించే రాజును నా ప్రతినిధిగా చేయాలని అనుకొంటున్నాను."

"దైవప్రసాదంగా నేను పొందిన నా పుత్రులలో శ్రీరాముడు నా జ్యేష్ఠకుమారుడు. ఇతణ్ణి గురించి మీకు తెలియనిది లేదు. విశ్వామిత్రాది గురువులను పొందినవాడు. అప్రమేయ తేజశ్శాలి. పరాక్రమశాలిగా మిమ్ములను ఎల్లవేళలా నీడలా అనుసరించి కాపాడగలడని నేను విశ్వసిస్తున్నాను" అంటూ అందరినీ కలయచూచి దశరథుడు మళ్ళీ ఇలా అన్నాడు. "మీ అందరి అనుమతిని తీసుకోవాలని నేను తలచాను. ఈ విధంగా కొలువులో మనమందరం కలిశాం." అలా దశరథుడు అనగానే కొలువులోని వారందరూ 'బాగు' 'బాగు' అని ప్రశంసించారు. "మేమందరం మీకు మా సమ్మతిని తెలియజేస్తున్నాం. రాముణ్ణి పట్టాభిషిక్తుణ్ణి చేయండి! మేమందరం మీ వెంట ఉంటాం" అని

తమ అంగీకారాన్ని తెలిపారు. దశరథుడు ఆనందంతో ఉప్పొంగిపోయాడు. పుష్యమీనక్షత్రయుక్త కాలం పట్టాభిషేకానికి అనువైనదని మహర్షులు తెలిపారు.

"వృద్ధుడైన మహారాజు ఇలా చెప్పాడు. మీ అందరి అనుమతితో రాజ్యభారాన్ని రామునికి అప్పగించి నేను విశ్రాంతి తీసుకొంటాను. ఈ ముసలితనంలోనైనా నేను ఏ ప్రయాసలు లేకుండా సంతోషంగా కాలం గడపాలని అనుకొంటున్నాను. దానికి దైవం అనుకూలించినందుకు నాకు పరమానందంగా ఉంది" అని చెప్పాడు. కొలువులోని వారందరు రాబోయే మంచి కాలాన్ని గూర్చి ఆనందంగా ఆలోచిస్తున్నారు.

అంతలో "ఓ మహారాజా! మాకు ఇష్టమైన శ్రీరాముడు పట్టాభిషికుడై 'శత్రుంజయ' గజం ఎక్కి శ్వేతచ్ఛత్రాదుల ఛాయలో పురవీధులలో ఊరేగాలని, దానిని మేమందరం ఆనందచిత్తంతో చూడాలని ఉవ్విళ్ళూరుతున్నాం" అన్నారందరూ ఏకగ్రీవంగా.

తనకు అనుకూలంగా మాట్లాడే ప్రజలను చూచి దశరథునికి ఆనందం కలిగింది. "ఓ సాధు పుంగవులారా! మహారాజును కాబట్టి నా మాటను త్రోసివేయక రాముణ్ణి రాజుగా కోరుకొనడం లేదు గదా! సత్యంపై నమ్మకం ఉన్న మీరు యథార్థాన్నే మాట్లాడండి! నేను అధర్మపాలన చేయడం లేదు గదా! నా పాలనకు రోసి మీరు మరొక రాజును కోరుకొనడం లేదు గదా? మీ రక్షణ భారాన్ని నేను సరిగ్గానే మోశాననే నా నమ్మకం నిజమే కదా? నా పాలన మీకు ఆనందాన్నిచ్చిందా?" అని దశరథుడు పరిపరి విధాల వారిని పరీక్షించి, పరిశీలించి వారి మనోరథాన్ని తెలుసుకొన్నాడు, ఆనందించాడు. మహర్షులకు పురోహితులకు పట్టాభిషేకకార్యక్రమాన్ని ఆరంభించండని ఆదేశించాడు.

జనులందరూ తమకు రాబోయే రాజు గురించి తమలో తాము మాట్లాడుకుంటున్నారు. "రామచంద్రుడు తీరైన కనుబొమలతో, తామరరేకులవంటి నేత్రాలతో, చూపరులకు ఆనందం కలిగిస్తాడు. ఇప్పుడు రాజ్యభారంతో ఆయన ముఖం మరింత తేజోమయంగా కనిపిస్తుందేమో" అని.

మహర్షులందరూ దశరథుని ఉద్దేశించి "ఓ రాజా! నీ అదృష్టం వల్ల రాముడు నీ కొడుకై పుట్టాడు. రాముని వల్ల నీ వంశం కీర్తింపబడుతుంది. అట్టి రామునికి ఆయురారోగ్యాలు, సకల ఐశ్వర్యాలు కలిగించమని ఆ దేవదేవుని వేడుకొంటున్నాం" అన్నారు.

"ప్రజలందరి కోరిక ప్రకారం శ్రీరాముణ్ణి పట్టాభిషిక్తుణ్ణి చేసి మీరు విశ్రాంతి తీసుకోండి. మీకు జయం కలుగుతుంది." కొలువుకూటమిలోని వారందరూ ముక్తకంఠంతో తమ అభిప్రాయం చెప్పారు. ఆనాటికి కొలువు ముగించుకుని దశరథుడు తన అంతఃపురానికి వెళ్ళాడు. సదస్యులందరూ వారివారి నివాసాలకు వెళ్ళారు.

* * *

పట్టాభిషేకసన్నాహాలు

సర్గ - 3

మరునాడు దశరథనరేంద్రుడు కొలువు తీరాడు. సభలోని వారందరి అభిప్రాయాలను దశరథుడు ఆలకించాడు. వారి ఇష్టానుసారంగా గంభీరంగా ఇలా చెప్పాడు. నన్ను మించిన భాగ్యవంతుడు ఇలలో లేడని నాకనిపిస్తోంది. "ఓ వసిష్ఠవామదేవాది మహర్షులారా! మీ అనుగ్రహంతో నా కుమారుడు పట్టాభిషిక్తుడు కాబోతున్నాడు. దానికి మీరు వలసిన ఏర్పాట్లను ప్రారంభించండి" అని చెప్పాడు. "శోభాయమానమైన ఈ చైత్రమాసం సరియైనదనే నా అభిప్రాయం. మీరు మంచి ముహూర్తం నిర్ణయించి తగిన విధంగా చేయడానికి ఆదేశాలను ఇవ్వండి" అని దశరథుడు ప్రార్థించాడు.

ఈ మాటలు విన్న సదస్యులు హర్షధ్వానాలు చేశారు. వారి ఆనందాతిరేకాలతో జయఘోషతో ఆ కొలువు కూటం దద్దరిల్లింది. కొద్దిసేపటికి వసిష్ఠులవారు ఇలా చెప్పారు. "దశరథవసుధేంద్రా నీవు తగిన నిర్ణయమే తీసుకొన్నావు. దానికి నీకు దైవం అనుకూలించుగాక! ఇప్పుడే పట్టాభిషేక ఏర్పాట్లను చేయిస్తాను" - అని "సుమంత్రా! పట్టాభిషేకానికి అవసరమయ్యే ఉపకరణలు పనులు చేసే మనుషుల్ని సిద్ధపరచు" అని చెప్పారు.

"పూజాద్రవ్యాలు, చందనాది సుగంధ ద్రవ్యాలు, తెల్లని పుష్పాలు, తేనె, నేయి, నూతనవస్త్రాలు, చామరం, ఛత్రం, బంగారు కుంభాలు, బంగారు కొమ్ములు గలిగిన వృషభం, వ్యాఘ్రచర్మం మొదలైనవన్నీ రాజుగారి అగ్నిహోత్రగృహంలో చేర్చు. అంతఃపుర ద్వారాలన్నీ, నగర ద్వారాలన్నీ పరిశుభ్రం చేసి చందనాది ద్రవ్యాలతో వాటిని అర్చించండి. పెరుగు, పాలు, అన్నం లాంటివి నైవేద్యం కోసం సిద్ధం చేయండి. అన్నాన్ని ప్రాతఃకాలంలో ద్విజులకు సత్కార పూర్వకంగా ఇవ్వాలి. దానితో పాటుగా నేయి, పేలాలు, దక్షిణలు, పుష్కలంగా సమర్పించి వారి ఆశీర్వాదాలు తీసుకోవాలి. వాటినన్నింటిని నీవు సిద్ధం చేయించు" అని వసిష్ఠుడు సుమంత్రునితో చెప్పారు.

బ్రాహ్మణులందరిని పిలిచి రేపు పొద్దున్నే స్వస్తివచనాలు పలకాలని చెప్పండి. నగరమంతా కల్లాపి చల్లి రత్నాల ముగ్గులను వేయించాలి. రాజగృహాల మీద ప్రముఖుల ఇండ్ల మీద ఇక్ష్వాకువంశ పతాకం ఎగురవేయాలి. చక్కగా అలంకరించుకొన్న దేవదాసీలు రాజప్రసాదంలోని రెండవ కక్షలో వేచి ఉండాలి. పూజాద్రవ్యాలను రకరకాల పూజలకై సిద్ధం చేయాలి. యోధులందరు పరిశుభ్రమైన వస్త్రాలు ధరించి, ఖడ్గం చేబూని, రాజప్రసాదపు వాకిట్లో నిలబడాలి. ఇవన్నీ సక్రమంగా జరిగేలా చూడడానికి యుక్తమైన వారిని నియమించు అని వామదేవుడు సుమంత్రునితో చెప్పాడు. "మీ ఆజ్ఞలన్నింటిని శిరసా వహిస్తాను" అని సుమంత్రుడు వారికి చెప్పాడు. దానికి తగిన ఏర్పాట్లలో నిమగ్నం అయ్యాడు. ఇవన్నీ చూడడంవల్ల దశరథుడికి చాలా సంతోషం కలిగింది. "ఓ సుమంత్రా! నీవు వెళ్ళి నా రాముని తోడ్కొని రమ్ము. నా మాటగా చెప్పి తీసుకొనిరా" అని దశరథుడు చెప్పాడు.

నాలుగు దిక్కులకు చెందిన రాజులను, జానపదులను నగరప్రముఖులను అందరిని ఆహ్వానించిన దశరథుడు కేకయరాజ్యంలోని వారిని మిథిలానగర వాసులను పిలవలేదు. ప్రముఖులందరూ ఆసీనులైన దర్బారుకు రమ్మని చెప్పి, రాముని వెంటబెట్టుకొని రథంపై రావటం దశరథునకు కనబడింది. ఆజానుబాహువు ముగ్ధమనోహరుడైన

రాముని రెప్పవాల్చక చూస్తునే ఉన్నాడు దశరథుడు. రాముడు రథం దిగి తండ్రి దగ్గరకు వచ్చి 'రాముణ్ణి నేను వచ్చాను' అంటూ పాదాభివందనం చేశాడు. వెంటనే రాజు రాముణ్ణి దగ్గరకు తీసుకొని తన హృదయానికి హత్తుకొన్నాడు. రత్నాలు పొదిగిన ఉన్నతాసనం మీద రాముని కూర్చోమని చెప్పాడు. రాముడు ఆసీనుడు కాగానే అక్కడున్న వారందరి మనస్సులు తమ కోరిక నెరవేరబోతున్నదని ఆనందించాయి. రాముని ఆగమనం చంద్రుని వెన్నెల తెచ్చి చీల్చినట్లుగా అనిపించింది. రాముని ముఖం దివ్యతేజస్సుతో బాలభానుడిలాగా వారికి కనిపించింది. తనవలె నున్న రాముణ్ణి చూచి తన్ను మించిన తనయుడు తనకు లభ్యం అయ్యాడని దశరథుడు ఎద ఉప్పొంగి మేరు పర్వతంతో పోటీపడింది. దశరథుడు చిరునవ్వుతో"ఓ రామా! నీ తల్లి నా పట్టమహిషి. ఆమె వినయ సంపన్నురాలని నీతో కొత్తగా చెప్పవలసిన పనిలేదు. తల్లిదండ్రులను బట్టి పుత్రుల నడవడిని అంచనా వేయవచ్చునంటారు. కాని, తల్లియే పుట్టిన బిడ్డలందరికి గురువు, దైవం అని నాకు అన్పిస్తుంది. ఆమె తన సద్గుణాలన్నీ తన వారసులకు పంచిపెడ్తుంది. వారి పురోభివృద్ధిని చూస్తూ తన కాయాన్ని పట్టించుకొనడం మానేస్తుంది. అలానే కౌసల్య సుగుణాలన్నీ నీవు అందిపుచ్చుకొన్నావు. ప్రజలందరికీ ఇష్టుడవయ్యావు. అందుకే మేమందరం కలిసి నిన్ను పట్టాభిషిక్తుని చేయాలని అనుకొంటున్నాము. నేడు రాబోయే పుష్యమీ నక్షత్రమందు నిన్ను కిరీటాలంకృతుని చేస్తాం. దానికి నేను కొన్ని విషయాలు చెప్తాను. నీవు జాగ్రత్తగా విని వాటిని ఆచరించి మంచి నాయకునిగా పేరు తెచ్చుకో" అని చెప్పారు. రాముడు చిరునవ్వుతో "తండ్రీ! మీ మాట నాకు వేదతుల్యం. కాన మీకు ఏది ఉచితం అనిపించిన దానినే నన్ను చేయమని ఆజ్ఞాపించండి. దానిని నేను తప్పక నెరవేరుస్తాను" అని అన్నాడు.

"రామచంద్రా! నీ వినయగుణాన్ని ద్విగుణీకృతం చేసుకో. రాత్రి పగలు అనే భేదం లేకుండా ప్రజల రక్షణలో జాగరూకుడవై ఉండాలి. కోశాగారాలను నింపడంలో జనులకు కష్టం కలిగించకూడదు. సామంతులు ఇష్టంతో కప్పం కట్టేలాగా చూడాలి. మనోనిగ్రహుడవై పాలన సాగించాలి. లోభ, మద, మాత్సర్యాలు కోపం లాంటివి రాజుకు ఆమడదూరంలో ఉండాలి. ఎంత ఇష్టమైన వ్యక్తితోను, మంత్రాంగంలోని రహస్యాలను చెప్పకూడదు. నీ దగ్గర పనిచేసేవారికి అసంతృప్తిని కలిగించకూడదు. వారి స్వవిషయాలలో వారు చింత లేకుండునట్లు చేయవలసిన బాధ్యత రాజుదే అయి ఉంటుంది. వీటి నన్నింటిని నీవు దృష్టిలో పెట్టుకొంటావని నేను ఆశిస్తున్నాను. రేపటి కార్యక్రమాలకు కావాల్సిన వాటిని పురోహితుల నడిగి తెలుసుకో" అని దశరథుడు రామునితో చెప్పాడు.

తండ్రి దగ్గర సెలవు తీసుకొని రాముడు తిరిగి గౌరవమర్యాదలు పొందుతూ తన ప్రాసాదానికి వెళ్లిపోయాడు. ఈ విషయం విన్న పరిచారికలు కౌసల్యకు ఆనందం కూర్చాలనుకొన్నారు. వెంటనే కౌసల్య దగ్గరకు వెళ్ళారు. వాళ్ళు విన్నది, చూచినది చూసినట్టుగా పూస గుచ్చినట్టు చెప్పారు. కౌసల్యకు అపరిమితానందం వేసింది. శుభవార్తను తెచ్చినవారికి బంగారు నాణేలు, ఆభరణాలు, గోవులను దానం చేసింది. పౌరులందరూ ఆనందించారు. కొలువులోని వారు రాజు దగ్గర సెలవు తీసుకొని వెళ్ళారు. మహారాజు సభ చాలించారు.

* * *

కౌసల్య ఆశీర్వచనాలు

సర్గ-4

దశరథుడు తన ప్రాసాదానికి వెళ్లాడు. రేపే పుష్యమీ నక్షత్రం; సుమూహూర్తం నేడే కదా, నా చిట్టి తండ్రికి ఎన్నో విషయాలు చెప్పాలి అనుకున్నాడు. వెంటనే సుమంత్రుణ్ణి పిలిచాడు. 'నా రాముణ్ణి తీసుకొనిరమ్ము' అన్నాడు. సుమంతుడు రాముని దగ్గరకు వెళ్లాడు. మంత్రివర్యుని చూడగానే రాముడు ఏదో శంకించాడు. 'నమస్కారం మంత్రి పుంగవా! విషయం ఏమిటో త్వరగా చెప్పండి' అని అడిగాడు. మంత్రి విషయం చెప్పి, 'నీ కోరిక ప్రకారం నీవు రావచ్చును' అని తెలిపాడు. 'ఎట్టి సందేహం లేదు నీ వెంట నేను వస్తున్నాను పద' అంటూ రాముడు సుమంతుడితో బయలుదేరి దశరథుని దగ్గరకు వచ్చాడు. అంజలి ఘటించాడు. 'భావి రాజ్యాధినేతా! నా దగ్గరగా రా తండ్రీ!' అని దశరథుడు రాముని పిలిచాడు.

తన దగ్గరగా ఉన్న ఉచితాసనం మీద కూర్చోమన్నాడు. "నాయనా రామచంద్రా! నేను నా వయో భారంతో వృద్ధుడిని అయ్యాను. నేను సంపూర్ణంగా సుఖాలను అనుభవించాను. ఎన్నో యజ్ఞాలు, యాగాలు ఆచరించాను. మృష్టాన్నభోజనాలతో తృప్తి పడ్డాను. సుతులను కని, పరలోక సంపద పెంచుకున్నాను. మనిషిగా పుట్టిన ప్రతి జీవి పంచఋణాలను తీర్చుకోవాలి. అవి యజ్ఞయాగాదుల ఆచరణంతో దేవఋణం, వేదాధ్యయనంతో ఋషిఋణం, సంతాన లబ్ధితో పితృఋణం, దానంతో విప్రఋణం, ధర్మాచరణతో మాతృఋణం, వీటినన్నింటినీ నేను క్రమంగా తీర్చుకున్నాను.

ఇక రాజుగా నా కర్తవ్యాన్ని నిర్వర్తించాలి. నా తదనంతరం ధర్మ ప్రభువుగా ఉండేవాణ్ణి నా వారసునిగా చేయాలనుకున్నాను. నీ గుణ సంపదతో నన్ను నీవు సంతృప్తి చేశావు. అందుకని నేను నిన్ను పట్టాభిషిక్తుణ్ణి చేయదలిచాను" అని దశరథుడు చెప్పాడు.

అంతేగాదు "రామచంద్రా! ఈ మధ్య నాకు దుస్స్వప్నములు వస్తున్నాయి. పిడుగులు పడినట్లు, ఉల్కలు రాలినట్లు, మహాధ్వని ఇలాంటి స్వప్నాలవల్ల రాజమరణమో, లేక తీరని కడగండ్లో కలుగుతాయని నాకు అనిపిస్తోంది. స్వప్నశాస్త్రపండితులతో ఈ విషయం ఆలోచించాను. వారు జ్యోతిష్యశాస్త్రం ప్రకారం నా జన్మ నక్షత్రంలో సూర్యుడు, రాహువు, కుజుడు క్రూరులై ఉన్నారని చెప్పారు. దానివల్ల ఆపదలు వచ్చే సూచనలు కనబడుతున్నాయని చెప్పారు. అందుకని కూడా నేను దూరదృష్టితో నిన్ను రాజును చేయాలనుకొన్నాను. మనమందరం దైవానికి వారసులం కదా! అందుకే నా మనస్సు నన్ను తొందరపెట్టుతోంది. ఈ రోజే నీవు నా కోడలు సీత ఉపవాసదీక్ష తీసుకోండి. దర్భాసనంపై పడుకోండి. ఇట్టి శుభకార్యాలకు ఎన్నో విఘ్నాలు తలెత్తుతాయి. నీవు అప్రమత్తుడవై ఉండు. భరతుడు రాక పూర్వమే నీ పట్టాభిషేకం చేయాలనేది నా సంకల్పం. నీ సోదరుడు ధర్మపరుడే కాని మనస్సు చంచలం కదా! చిత్త చాంచల్యం ఎవరినైనా పీడించవచ్చు. అందువల్ల నీవు త్వరగా దీక్ష తీసుకొని సిద్ధంగా ఉండు" అని చెప్పాడు. నీవు ఇక విశ్రాంతి తీసుకో అని దశరథుడు రాముడికి చెప్పి రాముణ్ణి పంపించాడు.

తండ్రి చెప్పినదంతా రాముడు విన్నాడు. తన తల్లి అయిన కౌసల్యాదేవి మందిరానికి బయలుదేరాడు. కౌసల్య ధ్యానంచేస్తూ ఉంది. ఆమె దగ్గరగా లక్ష్మణుడు, సుమిత్ర కూర్చుని ఉన్నారు. కౌసల్య తన పుత్రుని క్షేమంకోరి విష్ణువును ప్రార్థిస్తోంది. రాముడు వారి చెంతకు వెళ్లాడు. కౌసల్య సుమిత్రలకు నమస్కరించాడు. "అమ్మా తండ్రి నన్ను పట్టాభిషిక్తుణ్ణి చేస్తానని చెప్పారంటూ కౌసల్యకు చెప్పాడు. అమ్మా! రేపు రాజ్యాభిషేకం. నన్ను సీతను రాత్రికి ఉపవాస దీక్ష చేపట్టమని తండ్రి, వసిష్ఠులవారు చెప్పారమ్మా" అని అన్నాడు.

"రామచంద్రా! నీవు బంగారు కొండవు, నీ పుట్టిన నక్షత్రం చాలా మంచిది. అందుకే మహారాజుగారి మన్ననలను అందుకున్నావు. నీవు చిరంజీవివై వర్ధిల్లు. నీవు శత్రుభయంకరుడవై రాజ్యపాలనచేయి"– అంటూ కౌసల్య రాముణ్ణి ఆశీర్వదించింది. "నీ కోసం నేను విష్ణువును ప్రార్థించాను. ఎన్నో ఉపవాసాలు, వ్రతాలు చేశాను. అవన్నీ నేడు ఫలాన్ని అందిస్తున్నాయి. నీవు రాజువై మమ్మల్నందరినీ ఆనందింపచేయి."

రాముడు తల్లి మాటలన్నీ విన్నాడు. అక్కడే ఉన్న లక్ష్మణునితో "సోదరా! నీవు నా రెండవ ప్రాణం. నీవును నాతోపాటు రాజ్యపాలనలో భాగం పంచుకోవాలి. నీ కోసమే నేను రాజుగా ఉండదలచాను. నీకు కావలసిన భోగాలన్నీ అనుభవించవచ్చు."

ఇలా రాముడు చెప్పి సతీసమేతుడై తన ప్రాసాదానికి వెళ్లాడు.

* * *

ఉపవాస దీక్షా స్వీకరణం

సర్గ – 5

వసిష్ఠుడు రాజాజ్ఞను పాటించాలనుకొన్నాడు. గుర్రాలను కట్టిన రథం ఎక్కి రాముని రాజగృహానికి వెళ్ళాడు. గురువుని చూచి, సంభ్రమాశ్చర్యాలతో రాముడు ఎదురుగా వచ్చాడు. కైదండలిచ్చాడు. ఉచితాసనుని చేశాడు."తపోధనా ! నేను నెరవేర్చవలసిన కార్యం తెలపండి" అని అడిగాడు. వసిష్ఠుడు రాముని ఆశీర్వదించి, 'రామా ! నీవు భార్యా సమేతుడవై ఉపవాస దీక్ష తీసుకోవాలి. యశఃకీర్తిప్రతిష్ఠలు కలగడానికి దేవతారాధన చేయాలి' అని చెప్పాడు. వెంటనే సీతారాములు అంజలిబద్ధులై దీక్షకు పూనుకొన్నారు.

మంత్రపూరితంగా దీక్షను వారికి వసిష్ఠుడు ఇచ్చాడు. రాముడు వసిష్ఠునికి పూజాదికాలు సల్పాడు. వసిష్ఠుడు రాముని దగ్గరనుండి దశరథుని దగ్గరకు వెళ్ళాలని మళ్ళీ రథాన్ని అధిరోహించాడు. రాజమార్గం సముద్రంవలె ఆయనకు కనిపించింది. హర్షాతిరేకంతో జనులందరూ మాట్లాడుతూ గుంపులు గుంపులుగా చేరి సముద్రఘోషను తలపిస్తున్నారు.

రాముడు తన వద్దనున్న మిత్రబృందంతో ఇచ్చకాలు చేశాడు. వీరి నందరిని సంతోషింపజేశాడు. తిరిగి తన అంతఃపురంలోకి వెళ్ళిపోయాడు.

జనులందరు వారి వారి వాకిండ్లను శుభ్రపరిచారు. ఆవుపేడతో కల్లాపు చల్లారు. రత్నాల ముగ్గులు తీర్చారు. పువ్వులతో, లతలతో ద్వారబంధనాలను అలంకరించారు. ఇండ్లపై ధ్వజాలను ఎగురవేశారు. రహదారులన్నీ శుభ్రపడ్డాయి. రాజాగృహాలపై జయకేతనాలు రెపరెపలాడాయి. రాజప్రసాదాలతో, పురప్రముఖుల ఇండ్లల్లో నగరవాసుల ఇళ్ళల్లో సంతోషతరంగాలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. అయోధ్య అంతా మిరుమిట్లు గొల్పుతూ అమరావతిని తలపిస్తోంది.

వసిష్ఠుడు దేవేంద్రభవనాన్ని పోలే మహారాజభవనంలోకి అడుగుపెట్టాడు. దశరథుడు ఎదురువచ్చి నమస్కరించాడు. అంతా మనం ఆశించినట్లుగా జరుగుతోంది గదా అని వసిష్ఠుని అడిగి తెలుసుకొన్నాడు. తన అభీష్టం నెరవేరుతుందని సంతోషించాడు. వసిష్ఠుడు తన నెలవుకు వెళ్ళాడు.

దశరథుడు సింహం గుహలోకి వెళ్ళినట్లుగా అంతఃపురం చేరాడు. ఆభరణాదులతో శోభాయమానమైన వస్త్రాదులతో అలంకరింపబడిన స్త్రీలు అక్కడ ఉన్నారు. వారందరితో దశరథుడు తారలతో కూడిన చంద్రుడిలాగా కనిపించాడు.

* * *

పట్టాభిషేక కోలాహలం

సర్గ - 6

శ్రీరాముడు సీతతో కలిసి శ్రీమన్నారాయణుణ్ణి ప్రార్థించాడు. ఏకాగ్రచిత్తంతో దేవదేవుని స్తుతించాడు. సీతతో కూడి అగ్ని ప్రదక్షిణం చేసి హవిస్సును సమర్పించింది. మిగిలిన హవిస్సును ప్రసాదంగా తీసుకొన్నారు. రాత్రికి దర్భాస్తరణంపై వారిద్దరూ శయనించారు.

తెల్లవారుజామునే సీతారాములు మేల్కొన్నారు. గృహాన్ని పూవులతో మంగళతోరణాలతో అలంకరించారు. నాల్గవజాము మొదలగానే మంగళవాద్యాలు మోగాయి. వందిమాగధులు జయజయధ్వనులు చేశారు. బ్రాహ్మణులు వేదమంత్రాలు పఠించారు. రాముడు స్నానకృత్యాలు తీర్చుకొన్నాడు. మంత్రరాజమైన గాయత్రిని ఉపాసించాడు. సూర్యభగవానుని అర్ఘ్యపాద్యాదులతో పూజచేశాడు. ఇలువేల్పును స్తుతించాడు. సీతారాములిద్దరూ పట్టువస్త్రాలు ధరించారు. స్వస్తివచనాలు చెప్పుతూ ఆశీర్వచనాలు అందుకొన్నారు.

అయోధ్యావాసులందరు తమ తమ గృహాలను అలంకరించారు. రాజవీధులన్నీ తోరణాలతో తీర్చిదిద్దారు. రాజ గృహాలపై, కోటబురుజులపై విక్రయశాలలపై వృక్షాలపై పతాకాలను ఎగురవేశారు. పట్టాభిషేకానంతరం

రాముని ఊరేగింపు జరుగుతుందని అనుకొన్నారు. దానికి దీపతోరణాలను ఏర్పరచారు. దీపాలతో అయోధ్య జాజ్వల్యమానంగా కనిపించేదిగా ఏర్పాటుచేశారు.

నర్తకీమణులు తమ నర్తనాదులచే ప్రజలను అలరిస్తున్నారు. వివిధ గాయకులు తమ గానంచే జనులకు అలౌకికానందం కలిగిస్తున్నారు. రామాభిషేకగాథలను పిల్లలు పెద్దలు ముచ్చటించుకొంటున్నారు. వివిధ దేశాలనుండి వచ్చిన జనులు, జానపదులు వీరందరితో కలిసి అయోధ్య నిండిపోయింది. జనవాహినిలో జనులు చేసే రొద సముద్రపుహోరు వలె వినిపించింది.

వారందరూ దశరథుని ధర్మాచరణం రాముని గుణగణాలు, ఇక్ష్వాకువంశంలోని ఉదాత్తుల గురించి మాట్లాడుకుంటున్నారు. పురం కాంతులు చిమ్ముతూ స్వర్గాన్ని తలపించింది.

* * *

కైకేయికి మంథర బోధ

సర్గ - 7

కైకేయి అరణపు దాసి మంథర. ఈమె రామపట్టాభిషేకపు ముందు రోజు రాత్రి కైలాసపర్వతం వలెనున్న రాజప్రాసాదంపైకి వెళ్ళింది. అక్కడనుంచి అలంకరింపబడిన రాజవీధులను చూచింది. జ్వాలాయమానమై ప్రకాశవంతమైన అయోధ్యను చూసింది. హర్షాతిరేకులైన జనులు త్వరత్వరగా చేసే పనులను గమనించింది. వేగంగా అలంకరిస్తున్న దేవాలయప్రాకారాలను చూసింది. పండుగ సంబరాన్ని తెలుపుతున్న పురాన్ని చూచి మంథర విస్మయం చెందింది.

అంతలో కౌసల్యామందిరానికి చిరునవ్వులు చిందిస్తూ వెళ్తున్న వారిని చూసింది. వారి చేతుల్లో ఉన్న అలంకారసామగ్రిని, దానం తీసుకొని వెళ్తున్న జనాన్ని చూసి శంకించింది. కౌసల్య దాసిని పిలిచింది. 'ఓహో! మీ రాముని తల్లి ఏదైనా వ్రతం ఆచరిస్తున్నదా ఏమి? ఏమి సంబరాలు ఇవి' అని అడిగింది. ఏమి ఆశించి దాన కార్యాలు ఈ కాలంలో చేపట్టింది.' అంటూ కూపీ లాగింది. ఆ దాసి రాముడు రేపు రాజ్యాన్ని చేబడుతున్నాడని చెప్పింది. అందుకని పురమంతా స్వర్ణమయం అయింది. రాముని తల్లి రాజమాత అవుతుందని చెప్పింది.

నాగుబాము బుసగొట్టినట్లుగా మంథరలో కోపం కట్టలు త్రెంచుకొంది. వేగంగా క్రిందకు దిగింది. కైకేయి శయనమందిరం చేరింది. సుఖనిద్రలోనున్న కైకేయిని తట్టిలేపింది."ఓ సౌందర్యవంతురాలా! నీవు తెలివిలేని దానిలాగా నిద్రిస్తున్నావు. లే లేచి జరుగుతున్న అకృత్యాలు గమనించు. నీవు ఆపదల పాలు అవడమే కాక, నీ పుత్రుడిని సైతం కడగండ్లపాలు చేస్తున్నావు. నీవు అమాయకురాలివి; అందుకే నీ భర్త నీతో ప్రియంగా మాట్లాడి వంచన చేస్తున్నాడు. నిన్ను నా ప్రియసతిని అని చెప్తూనే అదృష్టాన్ని కౌసల్యకు అందజేస్తున్నాడు. వంచనబుద్ధితో భరతుని మేనమామ ఇంటికి పంపివేశాడు. ఇక్కడ ఏ అడ్డూ లేకుండా కార్యాలను చక్కబెట్టుతున్నాడు" అంటూ మంథర కారణం చూపకుండానే హితోక్తులా అనిపించే మాటలను మాట్లాడుతోంది.

కైకేయి మంథర మాటలకు అడ్డువచ్చి "ఓ మంథరా! ఇప్పుడు మనకు వచ్చిన కష్టం ఏముంది? మనలను ఎవరు అవమానిస్తున్నారు? ఎందుకు నీవు దుఃఖితురాలివి అవుతున్నావు? నిన్ను ఎవరైనా బాధపెట్టారా? నాకు చెప్పు వారిని హెచ్చరిస్తాను" అని సహృదయంగల కైకేయి చెప్పింది.

తన ఎత్తు పారలేదని మంథర తెలుసుకొన్నది. 'ఓ బేలా! నీవు ఇంత అమాయకురాలివి. పరుల సంతోషం చూసి ఉప్పొంగిపోయే నిన్ను నీ పతిదేవుడు అగాథంలో తోసి వేస్తున్నాడు. నీ సవతుల వద్ద నిన్ను తక్కువ చేస్తున్నాడు. అది తెలుసుకోలేక నీవు నాకు ఏదో జరిగిందని భ్రమిస్తున్నావు. అయినది నాకు కాదు. నేను బాధపడేది నాకోసం కాదు. నేను చిన్నప్పట్నించి నిన్ను పెంచినదానిని, నిన్ను అభిమానించేదానిని నీ అభివృద్ధిని చూసి గర్వపడేదాన్ని. అందుకే నీకు రాబోయే ఆపదలను ఆలోచించి నేను నా దుఃఖాన్ని దిగమింగుకోలేక ఇలా మొత్తుకొంటున్నాను' అంది మంథర.

"అయ్యో ఎందుకీ అశుభపు మాటలు. జరిగింది ఏమిటో? జరగబోయేదేమిటో నాకు తెలియజేయి. నీ దుఃఖకారణం నాకు తెలుస్తుంది" అంది కైకేయి.'ఓ కైకమ్మా! నీకు ఏమి చెప్పకుండానే కౌసల్య తనయుడైన రాముడికి నీ విభుడు రాజ్యం రేపు అప్పగించబోతున్నాడు' అని మంథర చెప్పింది. ఆ మాట చెవుల సోకగానే కైకేయి ఒక్క ఉదుటన లేచింది. సంతోషంతో తన మెడలో హారాన్ని మంథరకిస్తూ "ఇంత మంచి శుభవార్త తెచ్చి శోకిస్తావెందుకు? నాకు భరతునకు, రామునకు భేదం లేదు. వారిద్దరూ నాకు సమానులే. వారిలో ఎవరు రాజ్యభారాన్ని మోసినా నేను రాజమాతనే. అందులో సందేహం లేశమాత్రం లేదు. నీవు అనవసరంగా భ్రమలలో కూరుకుపోయి అతిగా ఆలోచిస్తున్నావు. రామపట్టాభిషేకవార్త నాలో సంతోషతరంగాలను రేపుతోంది.

దశరథుని ఈ ప్రయత్నం నాకు సంతోషమే. రాముడు నాకన్నబిడ్డకన్నా నన్ను ఎక్కువగా ఆరాధిస్తాడు.' అని అంది వనితారత్నం అయిన కైక. 'ఇంత చల్లని వార్త తెలిపే నీకు నేను ఏమి ఇచ్చి సంతోషపెట్టగలను. నీవు నీ ఇచ్ఛ వచ్చిన కోరికను కోరుకో! నేను దానిని తీర్చుతాను' అని సంతోషంగా చెప్పింది కైక.

* * *

మంథర దుర్బోధ

సర్గ - 8

కైక సంతోషించడం మంథర సహించలేకపోయింది. ఆమెలో దుఃఖం పెల్లుబికింది. "ఓ మూర్ఖురాలా! నీపై అభిమానంతో చెప్పే మాటలు నీవు చెవిని పెట్టడంలేదు. నీ అభివృద్ధిని వాంఛించే నేను, నీకు పట్టబోయే దుర్గతిని నేను చూడలేకున్నాను.

నీకు రాబోయే కాలమంతా గడ్డుకాలమే. నీ సవతి రాజమాత అవుతుంది. ఆమె నీపై అనాదరం పెంచుకొంటుంది. దశరథుడు వృద్ధాప్యంతో ఏమీ చేయలేని దుస్థితిలో ఉంటాడు. శోకించవలసిన తరుణంలో సంతోషిస్తున్న నీ అవిజ్ఞతను చూసి ఏమనుకోను?"

"రాజ్యాధికారాన్ని పొందడంలో రామభరతులు ఇద్దరూ సమానులే. కానీ నీ విభుడు దురాలోచనతో భరతుణ్ణి దూరంగా పంపించి, రామునికి రాజ్యాన్ని కట్టబెట్టాలని ఆలోచిస్తున్నాడు. ఏ దుస్సంకల్పం లేకపోతే భరతుని ఈ సంబరాలలో ఎందుకు పాలుపంచుకోనీయడంలేదు? నేను చెప్పానని గాక నీకై నీవు రామునిపై ప్రేమను ప్రక్కన బెట్టి, ఆలోచించు. అప్పుడే నీకు బోధపడును. రేపు పుష్యమీ నక్షత్రంలో కౌసల్యా తనయునికి యువరాజాభిషేకం బ్రాహ్మణులు చేయబోతున్నారు. భరతుని చూస్తే రామునికి భయం. అందువల్లనే భరతుడు లేని సమయంలో తండ్రీ కొడుకులు ఈ పనికి పూనుకొన్నారు."

కైక ఇచ్చిన ఆభరణాన్ని నేలపై విసరికొట్టింది మంథర. మితిమీరిన కోపంతో "వినాశకాలే విపరీతబుద్ధిః" అన్నట్లు మంచి చెప్పినచో నీకు తలకెక్కడంలేదు," అని విసవిసలాడింది. మంథర దురుసు ప్రవర్తన కైకకు బాధ కలిగించింది. "ఓ కుబ్జా! నీవు అపమార్గంలో ఆలోచిస్తున్నావు. రాముడు కీర్తిమంతుడు. ప్రసిద్ధులైన గురువుల దగ్గర శిక్షణ పొందినవాడు. ఇతరులు తనకు చేసిన చిన్న సాయాన్ని పెద్దదిగా ఎంచేవాడు. ఎల్లప్పుడు పరోపకారమే చేసేవాడు. భేదభావం లేనివాడు. సోదరులపై అమితప్రేమ గలవాడు. ఇట్టివానిని నీవు పరుషంగా మాట్లాడుతున్నావు. రాజ్యం రాముడు ఏలినను భరతునిది కాకపోవునా? వారిలో వారికి తగవుపెట్టి దాని ఫలితాన్ని నన్ను అనుభవించమందువు. కులనాశనం చేసి వచ్చే ఏ ఫలమైనా మనశ్శాంతిని కలుగజేస్తుందా? నీవే ఆలోచించు" అంటూ కైక మంథరతో మాట్లాడింది. "కొంతకాలం తర్వాత భరతుడు కూడా ఈ రాజ్యం ఏలగలడు. రాబోయే సంతోషాన్ని గుర్తించక అనుమానపడడం నీ అవివేకం" అంటూ మంథర మనస్సు మార్చబోయింది కైక.

'అంతేగాక రాముడు తన తల్లి కన్నా నన్నే ఎక్కువగా అభిమానిస్తాడు. భరతుడంటే రామునికి సదభిప్రాయమే ఉన్నది. భరతుడు రాజ్యం అడిగితే, రాముడు లేదని అనలేడు. ఇది నాకు బాగుగా తెలిసిన విషయం మంథరా!' అంటూ అని నచ్చచెప్పింది కైక.

"ఓ వెర్రిదానా!. నీవు అంతా శుభమే కలుగుతుందని భ్రమపడుతున్నావు. ఇప్పటివరకు జరిగినది వేరు. ఇప్పుడిక జరగబోయేది వేరు. అవకాశం వచ్చువరకు అందరును బుద్ధిమంతులే. అవకాశం చేజిక్కిన తరువాత వారి బుద్ధికుశలత అందరికీ తెలియదు. రాముడు రాజ్యభారాన్ని చేజిక్కించుకొన్న తర్వాత అసలు స్వరూపం తెలుస్తుంది. ఆనాడు నీవును నావలె దాసివై కౌసల్యకు ఉపచారాలు చేస్తావు. నీకు పుట్టిన దురదృష్టానికి భరతుడు వగచి, రామునికి సేవకుడౌతాడు. ఆనాడు నిన్ను భరతుడే అవమానిస్తాడు. నీ అజ్ఞానంవల్ల ఇంత దుస్థితి కలుగుతున్నదని నేను నెత్తినోరు కొట్టుకొంటుంటే, నీవు నిమ్మకు నీరెత్తినట్లుగా కూర్చున్నావు. పైగా శ్రీరంగనీతులు వల్లె వేస్తున్నావు. ఎవరి కర్మకు ఎవరు బాధ్యులు, కాకున్నది కాకమానదు. తెలిసి చెప్పకపోయినచో పాపం చుట్టుకొంటుంది. అందుకే నేను చెప్పాను. పైగా నా చేతులలో పెరిగిన నీవు ఆనందంగా ఉండాలని తలచాను. అందుకే ఇంతగా చెప్తున్నాను.

పోనీలే, రాముడు రాజైనాక భరతుని దేశమునుండి వెడలగొడతాడు. కనీసం శత్రుఘ్నుడు ఇక్కడ ఉన్నా భరతునికి అభివృద్ధి కోసం ప్రయత్నించేవాడు. నీవు నీ తెలివితక్కువతో పిల్లలను మేనమామ ఇంటికి పంపించివేశావు.

ఒకవేళ వారే ఇక్కడ ఉన్నట్లయితే వారిపై దశరథునకు ప్రేమ కలిగి ఉండేది. ఇపుడు భరతుడు కేకయ రాజ్యం నుండియే అడవులకు వెళ్ళినా క్షేమమని నాకు అనిపిస్తోంది.

ఒకవేళ నేను ఆలోచించినట్లు జరిగితే భరతుడు రాజ్యాధికారం చేపడతాడు. నీవు రాజమాత హోదాను అనుభవిస్తావు. నీ వంశం వారికందరికి శ్రేయస్కరంగా ఉండేది. ఇంతకుముందు నీవు దశరథుని ప్రియపత్నివని కౌసల్యను అనాదరం చేసి ఉన్నావు. ఆ పగ ఆమె నీపై తీర్చుకొనే అవకాశం వచ్చినప్పుడు తీర్చుకోదా? ఈ విశాలమైన అయోధ్యానగరానికి రాముడు రాజైతే నీకూ నీ కుమారునికి స్థానం ఎక్కడ ఉంటుంది? రాజుగా రాముడు సింహాసనంపై కూర్చున్న తర్వాత భరతునికి అధోగతే. అది ముమ్మాటికి నిజం."

అందుకే ఓ భామినీ! నీవు కనులు తెరిచి, రాబోయే ఆపదను నివారించు. అంతేగాక ఆపదలను దూరంగా నెట్టివేయి. దీపం ఉండగనే ఇల్లు చక్కబెట్టుకోమని పెద్దలంటారు గదా దశరథునికి నీపై అనురాగం ఉన్నప్పుడే నీవు భరతుని పట్టాభిషేకం ఆలోచించు. అంతేగాక ఆ రాముడిని అడవులకు పంపు" అంటూ మంథర చెడునంతా కుప్పపోసి కైకకు నూరిపోసింది.

* * *

కైక కోపం

సర్గ - 9

మంథర దుర్బోధ తలకెక్కించుకొన్న కైక వేడి నిట్టూర్పులు విడిచింది. చెడు మాటలతో నిండిన ఆమె హృదయం బరువెక్కింది. శయ్యపైనుండి సగం లేచి "ఓ కుబ్జా! నేను రాముని వనాలకు పంపిస్తాను. భరతునికి రాజ్యం ధారపోయిస్తాను. ఇది చేయడానికి నాకు ఏదైనా ఒక ఉపాయం చెప్పు" అని కైక అడిగింది.

నా మాటలు బాగా పనిచేస్తున్నాయని మంథర సంతోషపడింది. "ఓ సుకుమారీ! ఇప్పుడే నీకు మంచి ఉపాయం చెప్తాను. అయినా నీకు తెలియంది ఏముంది? ఆనాడు దశరథునిచే పొందిన వరములను మరచిపోయావా? లేక మరచినట్లు నన్ను చెప్పమని అడుగుతున్నావా? ఏదిఏమైనా నేను హితాభిలాషిని. కనుక నీకు నేను మంచినే చెప్తాను విను" అంది.

"దశరథుడు పూర్వం దేవాసుర సంగ్రామంలో దేవేంద్రునికి సహాయం చేయడానికి యుద్ధం చేశాడు గదా! ఆ పోరులో నీవు భాగం పంచుకొని నీ పతిని రెండుసార్లు ప్రమాదం నుండి రక్షించావు గదా! అప్పుడు నీ నాథుడు నిన్ను వరం కోరుకొమ్మని చెప్పాడు గదా! అవసరం వచ్చినప్పుడే అడుగుతానంటూ నీవు నీ బహుమానాన్ని దాచి ఉంచిన సంగతి నీకు జ్ఞాపకం లేదా?

ఆ వరాలు అడిగే సమయం నేడు వచ్చింది. సరైన సమయం ఇదే. వాటిని నరేంద్రునికి గుర్తుచెయ్యి. ఆనాడు నీ శీతలోపచారాలతో సంతసించిన నీ భర్త నీ మాట నేడు జవదాటడు. ప్రాణభిక్ష పెట్టిన నీవు నేడు

కఠోరంగా మాట్లాడి ఐనను నీ కోర్కెలను తీర్చుకో. ఇదంతా నీవు మరచిపోయినా నేను మరువలేదు. ఆ వరాలలో ఒకటి రాముని పద్నాలుగేండ్లు వనవాసానికి పంపమని అడుగు. రెండవ వరంగా భరతునికి రాజ్యం ఇవ్వమని చెప్పు. రాముడు లేని సమయంలో నీ కొడుకు ప్రజలకు ఇష్టమైన కార్యాలు చేసి రాముని మరిపించివేస్తాడు. ప్రజలు మరచిన రాముడు తిరిగి రాజ్యం పొందడం అనేది దుర్లభం అవుతుంది.

నీవు వెంటనే లేచి ఆభరణాలు తీసివేయి. మలిన వస్త్రాలు కట్టి నీ కోపాన్ని రాజు గుర్తించేటట్లు చేయి. నేలపై బడి దొర్లి ఏడుస్తూ నీ పంతాన్ని నీవు నెగ్గించుకో. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నా లాభం లేదు. వెంటనే లేచి పని ప్రారంభించు" అని కైకను మంథర త్వరపడమని ఉసిగొల్పింది.

"ఓ కైకా! నీవు కనులెర్రచేసిన నీ భర్త తట్టుకొనజాలడు. నిన్ను సంతోషపెట్టడానికి బహుమానాలు ఇవ్వజూస్తాడు. బంగారాలు, మణులు, మాణిక్యాలు ఏమి ఇచ్చినా నీవు తీసుకోకు. నీ మనస్సును దృఢంగా చేసుకో. నీ మనస్సు మళ్ళించడానికి రాజు చేసే పని నీవు పట్టించుకోకు. నేను చెప్పిన రెండు వరాలు నీకు లభించేవరకు మొండిగానే ప్రవర్తించు. నీ కోరికల సాధనపైనే నీ పుత్రుడి భవిష్యత్తు ఆధారపడి ఉంది. నీకు అప్పుడే జీవితం ఉంటుంది. నీవు ఏ మాత్రం సడలినా నీ భావి జగత్తును అంధకారం చేసుకొన్నదానివి అవుతావు" అంటూ మంథర నూరిపోసింది.

తీయగా నూరిపోసే ఈ మాటలకు కైక తలవంచింది. ప్రజ్ఞావంతురాలైన కైక బాలికలాగా ఆలోచించింది. ఎర్రనిమంట చూసి ఎర్రని రంగు అని భ్రమపడే చిన్నారులవలె కైక మంథర మాటలమాయలో పడిపోయింది. మంథర తెలివికి అబ్బురపడింది. "మంథరా! ఈ లోకంలోని దాసీలందరికంటే నీవే తెలివిగలదానివి. నీవు చెప్పినట్లు భరతుడు రాజైతే నీకు నేను ఆ బంగారు తొడుగు చేయిస్తాను. నీకు దాసీలను కూడా ఏర్పాటు చేయిస్తాను. నీవు కుబ్జవైనప్పటికీ నీ అందంతో పోటీపడడం కష్టమే. నీవు పట్టుచీర కట్టి, వడ్డాణం పెట్టుకొని, అటునిటు నడుస్తుంటే ఆ చిరుమువ్వల సడి హృదయానందాన్ని కలుగజేస్తుంది. నీ మనస్సువలె నీ శరీరాకృతి అందమైనది. నీకున్న దూరదృష్టి– దానికి నీవు ఆలోచించే విధానానికి తగ్గట్టు నీ మూపురం పెరిగింది."

"శంబరాసురినిలోనున్న మాయోపాయాలకన్నా నీకు తెలిసినవే కోకొల్లలు. నా కార్యసిద్ధి జరిగిన తర్వాత నీకు విచిత్రాలతో కూడిన బంగారుతో చేసిన తిలకాన్ని నీ నుదుట అలంకరింపచేస్తాను." ఇలా మంథరను పొగడడంలో మునిగిన కైకను మంథర కార్యోన్ముఖురాలిని చేయడానికి సరేలే, ఇక నీవు త్వరగా లేచి కోపాన్ని నటించి, నీ అభీష్టాన్ని సిద్ధింపచేసుకో. లేకుంటే సమయం మించిపోతుంది. ఏ పనినైనా సకాలంలో పూర్తిచేయాలి. ఆలస్యం విషంతో సమానం" అంటూ త్వరపెట్టింది కైకను మంథర.

కైక బుసకొట్టే నాగువలె లేచింది. అభరణాలన్నీ నేలపై విసిరికొట్టింది. మేలిమి చీరలను తీసివేసి పాతచీరను చుట్టుకొంది. మెత్తని దూదితో చేసిన పరుపుని వదిలి కటిక నేలపై పడుకొంది. అటు ఇటు దొర్లింది. "ఓ మంథరా! దశరథునితో నామాటగా చెప్పు, రాముడు అడవికి వెళ్ళడం, భరతుడు రాజ్యమేలడం జరిగిన తర్వాతనే నేను లేచేది. అది జరగని నాడు నేను ప్రాణాలతో ఉండనని చెప్పు" అంది కైక. తన పాచిక పారినందుకు మంథర సంతోషించింది. కైక కోపం మితిమీరడానికి మరల ఆజ్యం పోసింది. "ఓ ప్రియమైన కైకా! భరతుడు రాజ్యమేలడమే

నీ క్కావాల్సిందని గట్టిగా కోరుకో. లేనిచో నీకు నీ భరతునికి తిప్పలు తప్పవు" అని మంథర చెప్పింది.

గూనిదాని మాటలు కైక మనస్సును ఆవరించివేశాయి. "అవునౌను నా విభుడు నన్ను వంచించాడు. నీవే లేకపోతే నాకు ఏమీ తెలిసేది కాదు. నీవు నాకు మహోపకారం చేశావు. నిన్ను నేను ఎన్నటికీ మరువను" అని పదే పదే కైక మంథరను మెచ్చుకొన్నది.

అలా కైక కోపంతో తన సహృదయాన్ని అణచివేసింది. భూమిని అంతా ఇరులు ఆక్రమించి అంధకారంలో ముంచెత్తినట్లుగా ఆమె ముఖం తేజోవిహీనం అయింది. కోపావేశంతో ముఖం మాడింది. చెడుబుద్ధి మనసును ఆక్రమించడంవల్ల చేతలు, చేష్టలుడిగి కార్యవిముఖతతో అణగారిపోయాయి.

* * *

కైకను దశరథుడు ఓదార్చడం

సర్గ - 10

పాపాత్మురాలైన మంథర మాటలకు కైక తలఒగ్గింది. ఆభరణాలన్నీ తీసివేసి తన కోరిక తీరుతుందో లేదోనని ఆలోచిస్తూ పడుకొంది. బాధతో ఉన్న కైక ఒక కిన్నెర స్త్రీవలె కనిపించింది. మంథర మాత్రం కైక మాటలచే తాను అనుకొన్నది సాధించేసినట్లు ఆనందం పొందింది. దశరథుడు సుమంత్రునికి ఆదేశాలు ఇచ్చివేశాడు. తన అంతఃపుర కాంతలకు సంతోషం కలిగించే వార్తలను చెప్పాలనుకొన్నాడు. మొదట తన ముద్దులభార్య అయిన కైకకు విషయం చెప్పుదామనుకొని అటుగా అడుగులు వేశాడు. ఆ ప్రదేశం చిలుకలు, క్రౌంచ పక్షులు, నెమళ్ళు లాంటి వాటి ధ్వనులతో నిండి ఉండింది. వీణామృదంగాది ధ్వనులు వీనులకు విందు కూర్చుతున్నాయి. కైక దాసీజనం తిరుగాడుతున్నారు. మంచి మంచి వంటకాలరుచి ముక్కుపుటాలకు సోకుతుంది. అక్కడ వృక్షాలు, లతలు, పొదలు చక్కని పూలు ఫలసంపదతో అలరారుతున్నాయి. పాదచారులు అక్కడికి వచ్చినవారు కూర్చోడానికి వీలుగా చక్కని ఆసనాలు వేసి ఉన్నాయి. కైక భవనం దివ్యశోభతో ఒప్పారుతోంది. దశరథుడు కైక శయన మందిరంలోకి అడుగుపెట్టాడు. తల్పంపైన కైక కనబడలేదు.

ఎప్పుడూ ఎదురువచ్చే కైక నేడు కనిపించకపోవటంతో దశరథుడు ద్వారపాలకుణ్ణి కైక సంగతి అడిగాడు. అతడు భయపడుతూ కైక కృద్ధురాలైన సంగతి, కోపగృహంలో ప్రవేశించిన విషయం చెప్పాడు. కైక గూర్చి వినగానే దశరథుడు వ్యాకులం చెందాడు. నేలపై పడి ఉన్న కైకను చూచి దశరథుడు దుఃఖించాడు. వేటగాని శరాహతితో దెబ్బతిన్న లేడివలె ఉన్న కైకను చూచి దశరథుడు చింతించాడు.

కైక దుస్థితికి ఇదమిత్థమగు కారణం తెలియక దశరథుడు తన చేతితో నిమరుతూ కైకను ఓదార్చాడు. "ఓ కల్యాణీ! నిన్ను ఎవరైనా అవమానించారా? నిన్ను ఏదైనా అనరాని మాట అన్నారా? నీ అభీష్టాలన్నింటిని

తృటిలో తీర్చే నేను ఉండగా నీవు నన్ను బాధపెట్టడం ఉచితమేనా? నిన్ను ఈ స్థితిలో చూడలేకున్నాను. నీ ఆరోగ్యానికి ఏమైనా ఉపద్రవం వాటిల్లిందా?

నీ కోపానికి కారణమేమిటో చెప్పు. ఎవరినైనా దండింపవలెనా? సంపన్నునిగా చేయవలెనా? లేక నిర్ధనునిగా చేయవలెనా? నీకు అప్రియాన్ని ఒనర్చింది ఎవరో నాకు తెలుపు. నేను, నా వారందరూ నీ అధీనంలోని వారేగదా! నీ కోరిక ఎట్టిదైనను నాకు చెప్పు. దానిని నేను నిరాకరించను. నా ప్రాణం ఇచ్చైనా నీ కోరికను తీర్చుతాను. నీవు సందేహించక నీ కోరికను నాతో చెప్పు" అని పరిపరివిధాల కైకను దశరథుడు ఊరడించాడు. "ఓ చిన్నదానా! సూర్యుడు మంచును మాయం చేసినట్లుగా నీ భయాన్ని నేను పారదోలుతాను. సూర్యరశ్మి సోకునంత వరకు గల ఈ భూమండలం అంతయు నా అధీనంలో ఉంది. నీ కోరిక ఏదైనను నేను తీర్చుతాను. నా అధీనంలో గల అంగ వంగ మగధ మత్స్యదేశాలను తూర్పుదేశాలలోని సర్వసంపదలో నీవు ఏది కోరినను నేను ఇస్తాను. లెమ్ము" అంటూ దశరథుడు కైకను బతిమాలుతుండగా, కైక ఏదో విధంగా దశరథుని ఆజ్ఞాబద్ధునిగా చేయాలని తలుస్తుంది.

* * *

కైక వరాలు కోరటం

సర్గ – 11

కామమోహితుడైన దశరథుడు కైకను ఊరడించాడు. అది అంతా విన్న కైక "ఓ మహారాజా! నన్ను ఎవరూ బాధింపలేదు. అవమానింపలేదు. నాకు కోరికలు ఉత్పన్నమయ్యాయి. వాటిని మీరే తీర్చాలి. అలా తీర్చుతానని ప్రతిజ్ఞ చేయి" అంటూ దశరథుని నిర్బంధంలో పెట్టింది. దశరథుడు కైక మాటలకు చిరునవ్వు నవ్వాడు. "ఓ కైకా" అంటూ ఆమె కేశాలను దువ్వుతూ నేను ఎప్పుడూ 'నీకు దాసుడనే గదా; నీ మాటను నేను ఎప్పుడూ త్రోసివేయలేదుగదా. మరి నీకు సందేహం ఎందుకు కలిగింది? తరుణులలో అత్యంత ప్రియమైన దానిని నీవే. పురుషులలో ఒక్క రాముడే నాకు ప్రియము. నా ప్రాణాధికమైన రాముని మీద ఒట్టువేసి చెప్పుతున్నాను. నేను రాముని చూడక ఒక్క క్షణమైనా నిలువజాలను. అటువంటి రామునిపై ప్రతిజ్ఞ చేస్తున్నాను. నీ కోరిక లేమిటో తెలిపితే వాటిని నేను తీర్చుతాను" అన్నాడు. నా రాముడి కోసం బంధుజను లందరిని నేను త్యజించగలను. నీపై నాకున్న గాఢానురాగాన్ని దృష్టిలో పెట్టుకొని నాపై శంకను వీడు. నేను సంపాదించుకొన్న పుణ్యపురాశిపై ఆన. నీ కోరిక ఏది ఐనను నేను తీర్చుతాను. ఇక నీ కోరికలేమిటో జాగుచేయక చెప్పు" అని దశరథుడు కైకను అడిగాడు.

"ఓ మనుజేంద్రా! మీ మాటలు పంచభూతాలు విన్నాయి. ముప్పది మూడుకోట్లమంది దేవతలు సాక్షులుగా ఉన్నారు. మీ మాటలకు అగ్ని కూడా సాక్షిరూపుడే. ఆడిన మాట మీ రఘువంశీకులు తప్పరు. బాగుగా ఆలోచించి

నాకు మాట ఇస్తున్నారు గదా" అని కైక అంది. ఇంద్రియలౌల్యుడైన దశరథుడు "ఓ ప్రియసతీ! నీ కోరికలేమిటో చెప్పు" అని అనగానే "రాజా! ఒకనాడు మీరు ప్రాణాపాయస్థితిలో ఉన్నప్పుడు మిమ్ము రక్షించాను. నా ఉపచారాలకు మీరానాడు నాకు రెండు వరాలిచ్చారు. అవి మీకు గుర్తున్నాయా?" అని నాటి మాటను దశరథునికి కైక గుర్తుచేసింది. "వాటిని నేనేనాడు కోరలేదు. వాటిని కోరే సమయం ఇప్పుడు వచ్చింది." తానిచ్చిన వరాలు గుర్తుతెచ్చుకొన్న దశరథుడు కైకవశుడు అయ్యాడు. పూర్తిగా వశవర్తి అయిన దశరథునితో కైక తన కోరికలను వెల్లడించింది. "ఓ దశరథా! మీరీనాడు జరుపతలపెట్టిన పట్టాభిషేకానికి భరతుని నియోగించు. భరత పట్టాభిషేకమే నేను కోరే మొదటివరం. రాముడు జటావల్కలాలు ధరించి మునివృత్తితో వనవాసం పదునాలుగేండ్లు చేయాలి. ఇది నా రెండో కోరిక" అని కర్కశంగా కైక తన కోరికలను చెప్పింది. "నేడే నేను అనుకొన్నది జరిగితీరాలి. నేడు నా కన్నులతో తాపస వేషధారియై రాముడు అడవులకు వెళ్ళడం చూచి తీరాలి. ఆ తర్వాత శత్రువులకు అభేద్యమైన అయోధ్యను నా భరతుడు చేపట్టాలి. ఈ నా కోరికలను తీర్చి మీ వంశప్రతిష్ఠను నిలబెట్టుకొండి. సత్యవాక్ పరిపాలనతో మీ జన్మ సార్థకం చేసుకొండి. మీవంశం, మీ కులాన్ని ఉద్ధరించుట ఇక మీ చేతులలోనే ఉంది." అని కైక దశరథునితో కటువుగా మాట్లాడింది.

* * *

దశరథుని ఆవేదన

సర్గ - 12

కైక మాటలకు దశరథుడు స్థాణువయ్యాడు. "రామునిపై ప్రేమ కలిగిన కైక విఘ్నం కలిగించుట అసంభవం. మరి ఇది ఏమైనా నేను కలగంటినా? నేను మేల్కొనియే కలగనడం దుర్లభం కదా. ఇది నా జన్మాంతర పాపమా? ఈ విపరీతం ఏమిటీ" అంటూ దశరథుడు పరితపించాడు.

రాముణ్ణి అడవులకు పంపాలన్న మాట గుర్తుకువచ్చి దశరథుడు స్పృహ తప్పాడు. చాలాసేపటి తర్వాత తెలివి పొందాడు. నేలపై చతికిలబడ్డాడు. అతని నాసిక నుండి వేడిగాలులు తీవ్రంగా రాసాగాయి. ముక్కుపుటాలు అదురుతున్నాయి. మరల కూర్చోలేక వివశుడై నేలపై పడిపోయాడు. కొంతసేపటికి తెప్పరిల్లాడు. ఎర్రనైన నేత్రాలతో కైకను చూశాడు. "ఓ దురాత్మురాలా! నేను నీకు చేసిన అపకారం ఏమి? నా రాముడు సర్వజనప్రియుడే. అందరకు ఆనందాన్ని కలుగచేసేవాడే నా చిన్న బాలుడు. వాడిపై నీ అకారణ ద్వేషం ఏమి? ఏ నోటితో వానిని అడవులకు పంప నిశ్చయించావు? వంశఘాతకురాలా! నీవు సుందరాంగివని, రాజకుమార్తెవని మోసపోయి ఇంటికి తెచ్చుకొన్నాను. నాచేతులారా నేను విషనాగును తెచ్చుకొన్నట్లయింది. శత్రువుల గుండెల్లో నిదరపోయే నేను ప్రక్కలో బల్లెంలాగా ఉన్న నేను నిన్ను ఎరుగకపోయితిని. ఏ నేరం చేశాడని నా రాముణ్ణి త్యజించాలి?" అని పరి పరివిధాల కైకను నిలదీయసాగాడు దశరథుడు.

నేను దేనినైనా త్యజించగలను. కాని రాముణ్ణి విడిచి క్షణకాలం జీవించలేను. నా పెద్దకొడుకైన రాముని సమక్షంలో నేను పొందే తృప్తికి మేరలేదు. సూర్యుడు లేకుండానే లోకం జీవనం సాగించగలదేమో! నీరు లేకుండానే సస్యరమ పండి పులకిస్తుందేమో! కాని నేను మాత్రం రాముడు లేకుండా జీవితం గడపలేను. నా ప్రాణాలు పోవడం తథ్యం."

"ఓ పాపాత్మురాలా! ఇప్పటికైనా నీవు రాముణ్ణి అడవులకు పంపడం అన్న ఆలోచనను మానివేయి. కావాలంటే భరతునికి రాజ్యం కట్టబెడతాను. రాముని కానలకు పంపడం నీకు భావ్యమేనా? లేక నాకు భరతునిపై ప్రేమ ఉందో లేదోననే సంశయం కలిగిందా? నీవును ఇంతకుముందు 'రాముడు, భరతుడు ఇద్దరూ సమానులే' అని చెప్పావు గదా. ధర్మప్రవర్తనలో రాముని మించినవారు లేరని నీవు చెప్పేదానివిగదా. మరి ఆ మంచి స్వభావం ఏమైంది. నీవెందులకు అభద్రతాభావాన్ని కలిగించుకొన్నావు? నీకు ఎవరైనా చాడీలు చెప్పారా? పరుల మాట విని కులనాశం చేయడానికి పూనుకొన్నావు. మరల ఆలోచించి నాతో మాట్లాడు. నన్ను కనికరించు. నేను పాదాలు పట్టుకొని బతిమాలుతున్నాను" అంటూ దశరథుడు కైక పాదాలు పట్టుకోబోయాడు. కైక దూరంగా జరిగిపోయింది.

"ఓ ఇక్ష్వాకుల కులంలో పుట్టిన మహారాజా! మీరు ఆడిన మాట తప్పుతున్నారు. మీరు ప్రతిన చేశారు. కాని పుత్రవాత్సల్యం మిమ్మల్ని అసత్యవాదిని చేస్తున్నది. ఏదిఏమైనా నాకు కావాల్సిన కోరికలు తీర్చే బాధ్యత మీపై ఉంది. అసత్యం పలికి నన్ను మోసగిస్తారో, భరతునికిరాజ్యం, రామునకు వనవాసం చేకూర్చేలాగా చేస్తారో మీ ఇష్టం. కౌసల్య రాజమాతగా అయితే నేను ఆమెకు నమస్కరించవలసి వస్తే దానికన్నా ప్రాణత్యాగం చేయడమే మేలని తలుస్తాను" అని గంభీరంగా కైక చెప్పింది.

"ఓ కుటిలాత్మురాలా! పేరుప్రతిష్ఠలున్న వంశంలో మెట్టినదానివి. నీకు ఇలాంటి విపరీత బుద్ధి ఎలా కలిగింది? నీవు ఇంతకుముందెన్నడూ ఇలా అప్రియమైన పనులు చేయలేదు కదా. కల్మషం లేని హృదిలో కలుషితం ఎలా చేరింది? నీవనుకొన్నట్లు భరతుడు రాముని అడవులకు పంపి రాజ్యమేలడానికి ఒప్పుకోడు. భరతుడు కూడా రఘువంశంలో పుట్టిన ధర్మాత్ముడే కదా.

రాముడు నీకు సపర్యలు చేయడమే నేను చూశాను. భరతుడు నీపై అధికప్రేమ కనబర్చటం అనేది నేను చూడలేదు. దేవీ! నిన్ను ప్రీతితో సేవించే వానిపై నీకు కక్ష తగునా? ఆలోచించు. రాముడు ఎప్పుడు ఎవరిని కష్టపెట్టడు. రాముని నీడలో అందరూ సుఖమే పొందుతారు. నిర్ధనులను సంతోషపెట్టడంలోను, శరణాగతులను రక్షించడంలోను రాముడు ముందుంటాడు. అంతా తెలిసే నీవు ఇట్టి కోరికను ఎలా కోరుతున్నావు?

సద్గుణసంపన్నుడు శమదమాది గుణాలతో శోభించే నా రాముని విడిచి నేనుండజాలను. ప్రియసుతునితో అడవులకు పొమ్మని నేను ఎలా చెప్పగలను? రాముణ్ణి అడవుల పాలు చేసి కౌసల్యకు నా ముఖం ఎలా చూపించగలను? సౌజన్యమూర్తి ఐన కౌసల్యను నీపై అభిమానంతో ఎన్నోసార్లు అనాదరించాను. నావల్ల ఆదరాభిమానాలు దొరకకపోయినా కౌసల్య ఒక్కనాడు నాకు అప్రియం మాటలు మాట్లాడలేదు. జీవిత చరమాంకంలో ఉన్న నన్ను ఇంతగా బాధపెట్టడం నీకు ఉచితం కాదు కదా కైకా!" అంటూ అనునయిస్తూ తనకు గల అభిమానాన్ని గుర్తుచేశాడు.

కఠోరనిర్ణయం తీసుకొన్న కైక దశరథుని మాటలకు వశం కాలేదు. చెడుబుద్ధిచే ప్రేరేపితమైన కైక మొండిగా ఆలోచిస్తూనే ఉంది. దుఃఖసముద్రంలో అల్లాడుతూ గట్టుకై ప్రయత్నం చేసే దశరథుని చూచి కైక క్రోధపరవశురాలైంది "ఓ దశరథ రాజేంద్రా! ఆనాడు నేను అడుగకనే వరాలిచ్చారు. అవి తీర్చమని నేడు అడగగానే పశ్చాత్తాపాగ్నిలో కొట్టుకుపోతున్నారు. అట్టి మిమ్ము లోకం ఏమని ప్రస్తుతిస్తుంది? మీ వంశప్రతిష్ఠ దిగజార్చడమే మీ దౌర్భాగ్యం అయితే నేను ఏమీ చేయజాలను.

ఏనాడైనా ధర్మప్రసంగవశాత్తు నేను మీ ప్రాణ రక్షణ చేశానని తెలిసి, నాకు ప్రత్యుపకారం ఏమి చేశారని ఎవరైనా అడిగితే ఏమని చెప్తారు?

శిబి చక్రవర్తి డేగను కాపాడుటకై తన శరీరంలోని మాంసం ఇచ్చాడు. అలర్కుడు అనే మహారాజు బ్రాహ్మణునకు నేత్రదానం చేశాడు. మీరీ కథలను విని ఉండలేదా? అని కైక అడిగింది దశరథుణ్ణి. దానికి జవాబు దశరథుడు చెప్పలేదు. కాని "ఓ మహారాజా చేసిన వాగ్దానం వమ్ముచేసి నా సుఖాన్ని పొందగోరుతున్నారా? ఏది ఏమైనా భరతునికి రాజ్యం ఇవ్వటం, రాముని అడవులకు పంపటం, అధర్మమైనా నాకు కావాల్సింది అదే. అందులో ఎట్టి సంశయం లేదు. నా మాటకు ప్రాధాన్యం ఇవ్వకుండా మీ కార్యం మీరు ఆచరించండి. అప్పుడు మీ ఎదురుగానే నేను విషం తీసుకొని ప్రాణం విడుస్తా" అని కైక చెప్పింది.

అయ్యో ఇన్నాళ్ళు ప్రేమించిన కైకేనా ఈ మాటలు మాట్లాడేది. ఈమెనేనా నేను మోహించింది? వజ్రంలాంటి పరుషవాక్యాలు ఎలా పలుకుతోంది? ఈ విపత్కరపరిస్థితికి నేనే కారణం అనుకుంటూ ఏమి చేయాలో పాలుపోక మొదలు నరికిన చెట్టులాగా దశరథుడు నేలకొరిగిపోయాడు. 'రామా' 'రామా' అంటూ బోరున విలపింపసాగాడు.

"కైకా! మంచిదానవు కదా. కానీ చిన్ననాడు నీవు ధర్మంగా మాట్లాడేదానివి కదా. ఈ వయస్సులో నీకు ఎవరు ఇలా చెప్పారు? నీవు ఎందుకు భయపడుతున్నావు? నీవు మంచి అనుకొనేదంతా మంచిది కాదు. అది నీకు వినాశనమే కలిగిస్తుంది. దూరదృష్టి లేక నీవు ఇలా ఆలోచిస్తున్నావు. ఒక్కసారి నీవు చెప్పినట్లు చేస్తే ఎలా ఉంటుందో నీవు ఆలోచించి చూడు" అంటూ కైకను బ్రతిమాలాడు.

"నేను రాజులందరితోను, సచివులతోను ఆలోచించి ప్రజలందరి ఇష్టానుగుణంగా రాముణ్ణి పట్టాభిషిక్తుని చేయుమని ఆదేశం ఇచ్చి వచ్చాను. ఇప్పుడు వారితో నేను ఏమని చెప్పగలను? రేపు ప్రొద్దునే రాముడేడి అని అడిగే వారికి నేనేమి బదులు చెప్పను?"

"ప్రేమమయి ఐన కౌసల్య నన్ను తల్లిలాగా చెల్లిలాగా లాలిస్తుంది. మంత్రిలాగా సలహాలిస్తుంది. నెచ్చెలిలాగా సముదాయిస్తుంది. అటువంటి కౌసల్యకు నేను కీడు చేయనా? నీకు నేను చేసిన ఉపకారం అంతా బూడిదలో పోసిన పన్నీరైంది. నేను చేసిన మహాపరాధం నిన్ను ప్రేమించడమే."

"రాముని అడవులకు పంపటం చూచి సుమిత్ర నాపై నమ్మకాన్ని పోగొట్టుకొంటుంది. నా కుమారుల గతి ఏమగునో అని చింతిస్తుంది. రాముడు అడవులకు పోవడం సీత చూచి తట్టుకోలేకపోతుంది. వారిద్దరిని ఎడబాపిన

నాకు జీవితంపైన ఆశ ఎందుకుంటుంది? రాముని అడవులకు పంపటమే జరిగితే నేను పరలోకయాత్ర చేయటం తప్పనిసరి. అప్పుడు నీవు, నీ పుత్రుడు ఈ భూమిని సుఖంగా ఏలుకోవచ్చు.

వలవేసి పక్షులను వేటగాడు పట్టుకొన్నట్లు నీవు నాపై ప్రేమామృతమనే విషాన్ని చల్లి నన్ను బంధించావు. ఇదంతా నేను చేసుకొన్న పురాకృత పాపం. అదే నన్ను ఇలా బాధిస్తోంది. దశరథుడు కామపిపాసి – సౌందర్య వ్యామోహంలో పడి పుత్రులకు అన్యాయం చేశాడని లోకం అనదా?"

"క్షణికానందం కోసం దశరథుడు పున్నామనరకం నుంచి తప్పించే పుత్రుడిని కష్టాలపాలు చేశాడని లోకం నన్ను దుమ్మెత్తిపోయదా? అయినా నేను నీ మాటల వింటున్నందువల్లే గదా నేడు నాకీ గతి పట్టింది? సజ్జన సాంగత్యం సత్యమార్గాన్ని చూపిస్తుంది. దుర్జనసహవాసం అధోగతి పాలు చేస్తుంది. దానికి తార్కాణం నేను కదా! అయ్యో నేను ఎంత తప్పు చేశాను!"

"నా రాఘవుడు నేను చెప్పిన మాటను ఎన్నడూ జవదాటడు. 'రామా! నీవు అడవులకు పొమ్ము' అని నేనగానే 'సరే తండ్రి!' అంటూ అడవులకు పయనం అవుతాడు. అటువంటి నా కుమారుని నేను ఎలా కడగండ్ల పాలు చేయను. నా మాట వినకపోయినా నా రాముడు కష్టాలను తప్పించుకొనేవాడు. నేటి దాకా గురువు శిక్షణలో, శాస్త్రాధ్యయనాదులలో రాముడు క్లేశాలు పొందాడు. ఇప్పుడే కదా, గృహస్థాశ్రమాన్ని పొందింది. ఇపుడే కదా, సుఖాలను చవిచూస్తున్న నా రాముని నేను ఇక్కట్ల పాలు ఎలా చేయగలను" అంటూ దశరథుడు అనేక విధాలుగా పరిస్థితులను కైకకు తెలుపుతున్నాడు.

"కైకా! రాముడు అరణ్యాలకు వెళ్ళటం తటస్థించినచో నేను మరణించడం తథ్యం. అప్పుడు నాకు ప్రియులైన కౌసల్య, సుమిత్రలను నీవు ఎన్ని కష్టాల పాలు చేసెదవో కదా! ఓ దుర్మతీ! నేను మరణించుట చూచి నా లక్ష్మణ, శత్రుఘ్నులు మృతి చెందుదురు. ఈ పరిస్థితులకు తాళలేక కౌసల్య, సుమిత్రలు మరణాన్ని ఆహ్వానిస్తారు. ఈ పరిస్థితిని భరతుడు తట్టుకోజాలడు. మరి ఇందరిని బాధ పెట్టి నీవు బాపుకొనేది ఏమిటి? ఓ కైకేయి! నీవల్ల నాకు అపకీర్తి పరాభవం కలుగుతున్నాయి. మనలో మనం బాధలు పడటమే కాదు నేను ఏలుతున్న ఈ రాజ్యపు ప్రజల మనస్సులను అల్లకల్లోలం చేస్తున్నావు. వారు ఏది మంచో, ఏది చెడో తెలుసుకోలేక వారును అధర్మాలకు పాల్పడుతారు. ఈ పాపం నిన్ను ఊరికినే వదలదు సుమా! నా చిన్నారి తనయుడు నారచీరలను ఎలా ధరించగలడు? ఎలా కాలినడకతో అరణ్యాలలో సంచరించగలడు? ఏనాడైనా కష్టాలు పడినాడా? వయస్సులో కూడా లేడే. అటువంటివాడిని నేను ఎలా అడవులకు పంపించను? స్త్రీలందరూ స్వార్థబుద్ధికలవారే అనడానికి కారణం నీవే. ఓర్పు ప్రతీకలైన సుమిత్రాదులను చూచి నీవు నేర్చుకున్నదేమీ లేదా? విషసర్పాన్ని బంగారం అని భ్రమించి ఒడిలో బెట్టుకొంటిని ఇన్నాళ్ళు. పాముకు పాలు పోసినంత మాత్రాన అది తన సహజగుణాన్ని మరచునా? అలానే నీవు నీ దుష్టబుద్ధి ఇంత మంచివాళ్ళ మధ్య వున్నా మరువలేకపోయావు.

భరతుడు మమ్మల్నందరిని వదులుకొని రాజ్యాన్ని ఏలగలడా? సద్గుణాభిరాముడు అడవులకు వెళ్ళడం చూసిన వారు బతికి ఉండగలరా? నేను నా కుమారుడు పట్టాభిషిక్తుడై మదపుటేనుగుపై ఊరేగే సంబరాన్ని

కనులలో నింపుకొని ఉన్నాను. అటువంటి నా కన్నులు కాలినడకతో నారవస్త్రాలు ధరించి జటాజూటధారియై వెళ్ళడం చూడగలవా?

ఓ కైకా! నీ వంశానికి అపకీర్తి రానీయకు. కాస్త కనికరించు. నాపై దయచూడు. నా చిన్నారిపై కక్ష సాధించకు. నీ మనస్సును మరలించు. దుష్ట సాంగత్యంవల్ల నీవు పాషాణమైన నిర్ణయం తీసుకొన్నావు. ఇప్పుడైనా మించినది లేదు. నీవు కరుణతో ఆలోచించు. నీ కాళ్ళు పట్టుకొంటాను" అంటూ కైక పాదాలపై దశరథుడు పడిపోయాడు. ఆ సమయానికి కైక దూరంగా జరిగింది.

దానితో దశరథుడు పాదాలు స్పృశించలేక నేలపై రోగివలె పడిపోయాడు. పెద్దగా రోదించసాగాడు.

* * *

దశరథుని విలాపం

సర్గ - 13

శోకార్తుడగు రాజు నేలపై పడి గట్టిగా ఏడ్వసాగాడు. పుణ్యాలన్నీ అయిపోయి భూమిపై పడ్డ యయాతివలె, దశరథుడు తన మహారాజత్వాన్ని వదిలి కైక అనుగ్రహం కోసం నేలపై కూర్చున్నాడు. కైకా కాస్త కనికరించు అంటున్న దశరథుని ఆమె ఏమాత్రం పట్టించుకోలేదు. పైగా "ఓ రాజకులశ్రేష్ఠా! నేను సత్యవాదిని, ఆడినమాట తప్పడం నా వంశంలో లేదు అని గొప్పలు చెబుతారే మరి నేడు నాకిచ్చిన వరాలు నెరవేర్చడానికి ఎందుకు వెనకాడుతున్నారు? ఇదేనా మీ సత్యవాదిత్వం? ఇదేనా మీ వంశం గొప్పతనం? ఏది ఏమైనా నా పట్టు విడవను. నేను కోరిన వరాలు సాధించేవరకు నేను నిద్రపోను" అని గట్టిగా చెప్పింది కైక.

'ఓ క్రూరాత్మురాలా! నేను మరణించడం నిజం. అప్పుడు నేను స్వర్గలోకానికి వెళ్తాను. అక్కడ దేవతలు రాముని కుశలవార్తను చెప్పమని నన్ను అడుగుతారు. వారికి నేను ఏమని చెప్పాలి? నేను ముద్దుల భార్యకోసం నా రాముని అడవులపాలు చేశాను అని చెప్పనా? అప్పుడు వారు నన్ను నరకకూపంలో నెట్టివేయరా? పతికి సద్గతులు కలగాలని పడతులు కోరుకొంటారని నేవిని ఉన్నాను. అదంతా అసత్యమేనా? నీవు నన్ను దుర్గతిపాలు చేయడానికే పూనుకొన్నావా? కలువరేకుల వంటి కన్నులుగల రాముణ్ణి సద్గుణుణ్ణి నేను ఎలా అడవులకు పంపగలను?" అంటూ దశరథుని మనస్సు వికలం అయింది. పరితాపంతో అతని కళ్లు ఎర్రబడ్డాయి. రోగపీడితునిలాగా అయిపోయాడు. దశరథుని బాధ చూడలేకపోయాడా! అన్నట్లు సూర్యుడు అస్తమించాడు. రేరాజు తన చెలులతో కలిసి విహారానికి వచ్చాడు. దశరథుడు ఆకాశంవైపు చూశాడు. 'ఓ రాత్రీ నీవైనా నాపై కరుణచూపు. తెల్లవారనీయకు నా రాముని అడవులకు పోకుండా కాపాడు' అన్నాడు. అంతలోనే 'ఓ కైకా నే చెప్పేదంతా నీవు వింటున్నావా? లేదా? నా మాటలన్నీ ఈ గాలిలో కలిసి ఆకాశానికి చేరుతున్నాయా? ఓ కైకా! నేను వృద్ధుణ్ణి నన్ను బాధించకు. చపల చిత్తంతో నిన్ను ఏదో అన్నాను. అవన్నీ నీ మనసులో ఉండనీకు. నీవు

చాలా మంచిదానవు. ప్రేమ స్వరూపిణివి, నాపై దయచూడు. నీ చేతులతో ఈ రాజ్యాన్ని రామునికి అప్పగించు. అప్పుడు నేనేకాదు సర్వలోకం హర్షిస్తుంది.నీ భరతుడు కూడా నిన్ను గౌరవిస్తాడు. రాముడు నిన్ను అమితంగా ప్రేమిస్తాడు.' అని అర్థించాడు. కైక దశరథుని మాటలు లెక్క చేయలేదు. దాంతో దశరథుడు 'ఓ కాలమా త్వరగా తెల్లవారనీయి. ఈ పాడు కైక ముఖం నే చూడలేను' అన్నాడు. అయినా కైక ప్రతికూలంగా వ్యవహరించింది. ధారాపాతంగా దశరథుని కండ్లు కన్నీటిని స్రవిస్తూనే వున్నాయి. అంతలో రాత్రి నాల్గవ జాములోకి ప్రవేశించింది. వందిమాగధులందరూ దశరథుడున్న కైక మందిరం చేరారు. జయహో, జయహో దశరథమహారాజుకు బహుపరాక్ అంటూ జయజయ ధ్వానాలు చేశారు. ఆ దుఃఖార్తిలో ఉన్న దశరథుడు జయధ్వానాలు వినలేకపోయాడు. వాటిని ఆపివేయించాడు.

* * *

కైకేయి సుమంత్రుని ఆదేశించటం

సర్గ - 14

'ఓ కైకా! నేను పుత్రహీనతతో వ్రతాలు, యజ్ఞాలు చేసి చేసి ఆజానుబాహుడైన రాముణ్ణి కన్నాను. అటువంటి సుకుమారుడైన నా రాముణ్ణి నన్ను వేరుచేయకు" అంటూ దశరథుడు గట్టిగా రోదించాడు. ఇలా పుత్రశోకంతో విలవిలలాడే రాజుని చూచి కైక కోపం తెచ్చుకుంది. 'ఓ రాజా! మీరే వరాల నిచ్చారు, వాటిని నెరవేర్చే సమయంలో పాపం చేస్తున్నట్లు బాధపడుతున్నారు. సత్యమే బ్రహ్మం అని మీకు తెలియదా? సత్యం పలికి ఎందరో కీర్తిని పొందారు గదా. ఆ ధర్మపాలన చేయడంకోసమే సముద్రుడు తన హద్దుని దాటడంలేదు. సూర్యచంద్రాదులు వారి గమనంలో తేడాలు రానీయడంలేదు. ఇన్ని తెలిసిన మీరు ఎందుకు ఇంతగా రోదిస్తున్నారు. ధర్మపాలనేకదా మీ వంశజులు చేసింది. మీరు మీ వంశజుల అడుగు జాడల్లో నడవలేరా? ఆ ధర్మాన్ని పాలించమనే నేను మిమ్మల్ని ప్రేరేపిస్తున్నాను.

ఇకనైనా మేల్కొని చేయవలసిన కార్యాన్ని ఆరంభించండి. రాముణ్ణి వనానికి పంపి శత్రురహితమైన రాజ్యాన్ని భరతునకు అప్పగించు. ఈ పని చేయటంవల్లే మీరు సత్యవచనులు అవుతారు. మీరు నా వరాలను సఫలం చేయకపోతే నేను మీ ఎదుటనే దేహత్యాగం చేస్తాను. నా ప్రాణాలను హరించి మీరు చేయదల్చింది చేయండి." అని కర్ణకఠోరమైన పలుకులు కైక వినిపించింది.

బలిచక్రవర్తి తన వాగ్దానపాశంతో బంధితుడైనట్లు దశరథుడు ఏమిచేయాలో తోచక నిశ్చేష్టుడయ్యాడు. కాడికి చక్రానికి మధ్య నలిగే ఎద్దు లాగా దశరథుడు విలవిలలాడాడు. వేదనకు గురైన దశరథుని ముఖకాంతి విహీనం అయింది. కోపం పట్టలేకపోయాడు. 'ఓ పాపచరితా! నిన్ను నేను అగ్నిసాక్షిగా వివాహం చేసుకున్నాను. నేడు నిన్ను త్యజిస్తున్నాను. నీకును, నీ కుమారునితోను నాకు ఏ బాంధవ్యం నేటి నుంచి ఉండదు.

ఓ కైకా! తెల్లవారబోతుంది. వసిష్ఠుడు శ్రీరాముని పట్టాభిషేకం కోసం నన్ను తొందరపెడ్తాడు. నేను నిండు సభలో రామునికి రాజ్యం ఇస్తానని చెప్పాను. ప్రజలందరూ నా కోరికను మన్నించారు. బ్రాహ్మణులు, మంత్రులు అందరూ పట్టాభిషేకం కోసం వనరులు సమకూర్చారు. ఇప్పుడు రాముణ్ణి అడవులకు పంపించడమే జరిగితే నేను మృత్యువాత పడడానికి ఎంతోసేపు పట్టదు. పట్టభిషేకానికి తెచ్చిన సామాను నా అంత్యక్రియలకు ఉపయోగిస్తారు. కాని నా ఉత్తరక్రియలు నా రాముడే చేయాలి. భరతుని దీనికి నేను సమ్మతింపను" అంటూ మాట్లాడే దశరథుని చూచి కైక రుసరుసలాడింది. పరుషంగా మాట్లాడింది.

'ఓ రాజా ఏది ఏమైనను కోరికలను నేను వదలను. నీవు వెంటనే ధర్మాత్ముడైన రాముణ్ణి పిలిపించు. వెంటనే అడవులకు ప్రయాణం కట్టించు. మరొకమాట మీరు మాట్లాడనట్లయితే నేను ప్రాణాలతో ఉండను" అంటూ గర్జించింది.

పట్టాభిషేకముహూర్తం దగ్గర పడసాగింది. దశరథుడు నా గారాల పట్టిని నా బంగారు తండ్రిని రాముణ్ణి నేచూడాలి అని అనుకోసాగాడు. ఇంతలో వసిష్ఠుడు తన శిష్యులతో కలిసి అయోధ్యాపురిలో కాలుపెట్టాడు. రాజవీధులన్నీ కల్లాపు చల్లి ముగ్గులతో అలంకరించారు. ప్రతివారి ఇంటి ముందు రంగురంగుల రంగవల్లులు తీర్చి ఉన్నాయి. ద్వారాలు మామిడాకులతో స్వాగతం పలుకుతున్నాయి. చందనాది సుగంధాలతో అయోధ్య అంతా పరిమళభరితంగా కనిపిస్తుంది. వసిష్ఠుడు ఆనందంగా అంతఃపురానికి చేరుకున్నాడు. ఆ సమయానికి సుమంత్రుడు అంతఃపురం నుంచి బయటకు వస్తున్నాడు. వసిష్ఠుడు సుమంత్రుని చూచి నమస్కరించాడు. 'మంత్రిపుంగవా! మేము వచ్చి ఉన్నామని రాజుతో చెప్పు' అని వసిష్ఠుడు చెప్పాడు. దశరథుడు కైక మందిరంలో ఉన్నాడని, నేను దశరథదర్శనార్థమై వెళుతున్నానని సుమంత్రుడు చెప్పాడు.

పట్టాభిషేకం కోసం ఎనిమిది కలశాలతో సముద్ర జలాన్ని, గంగానది నీళ్లను తీసుకొచ్చాను. మేడి చెక్కలతో చేసిన పీఠము, ధాన్యాలు, రత్నాలు, వజ్రాలు, తేనెలు, క్షీరాలు, పెరుగు మొదలైనవన్నీ దశరథుని ప్రసాదంలోకి తెచ్చిపెట్టారు. నాల్గు గుర్రాలు పూన్చిన రథము, ఎనిమిదిమంది కన్యలు, రాజఖడ్గము, ధనుస్సు, పల్లకి, గొడుగు, ఛత్రాలు, తెల్లని వృషభము, నాల్గు కోరలుగల సింహం, మహాశ్వం ఇలా వసిష్ఠుడు చెప్పినవన్నింటిని సుమంత్రుడు తెప్పించసాగాడు. సుమంత్రుడు ద్వారములన్నీ దాటుతూ కైక వున్న గృహం ప్రవేశించాడు. దశరథుడునేలపై పడి ఉండడాన్ని గమనించాడు. అతని మనస్సు కీడు శంకించింది. కాని యథారీతిగా దశరథుని సుమంత్రుడు స్తుతించాడు. ఆయన పరిస్థితిని తెలుసుకోకుండా అంజలి బద్ధుడై "పున్నమి చంద్రుని చూచి ఉప్పొంగే సముద్రునిలా మీరు పట్టాభిషేకం కోసం ఎదురుచూచే మహారాజా! వేగంగా లేవండి మీ కోసం జనులందరు వేచి ఉన్నారు. మీ కీర్తి దశదిశలా వ్యాపించింది. స్వయంభువు ఐన బ్రహ్మను మేల్కొలిపినట్లు నేను మిమ్ము జాగృతం చేస్తున్నాను. మీరు త్వరగా వచ్చి రాముణ్ణి ప్రజారామునిగా చేయండి. మీ ఆనతి ప్రకారం నేను సర్వం సిద్ధం చేయించాను. పూజ్యుడైన వసిష్ఠమహర్షి మీ దర్శనార్థం వేచి ఉన్నారు. రాజు లేని రాజ్యం కాపరి లేని గొర్రెల మందలా తలా ఓదిక్కై పోతుంది. చంద్రుడు లేని రాత్రిలాగా వెలవెలబోతుంది. మీరు త్వరగా లేచి ఆజ్ఞనివ్వండి. సర్వదా మీ

ఆజ్ఞానువర్తులమై మేము వున్నాము" అని చెప్పే సుమంత్రుని మాటలకు దశరథుని హృదయం ముక్కలైంది. శోకంతో గొంతు పూడుకుపోయింది.

దుఃఖంతో ఎర్రబారిన కన్నులతో, వాడిన మోమును ఎత్తి దశరథుడు సుమంత్రుని చూశాడు. 'ఓ మంత్రిపుంగవా! కైక మాటలతో కృశించిన నన్ను నీ మాటలు మరింత బాధకు లోనుచేస్తున్నాయి' అన్నాడు. దుః ఖాశ్రువులు ధారాపాతంగా కారుతూ వున్న దశరథుని సుమంత్రుడు చూచి ఒక అడుగు వెనక్కు వేశాడు. దుఃఖం ముంచుకు రాగా దశరథుడు ఏమీ మాట్లాడలేకపోయాడు. వెంటనే కైక ముందుకు వచ్చింది. 'ఓ సుమంత్రా రాజ్యాభిషేక సువార్తతో రాజు ఆనందం పట్టలేకపోతున్నాడు. దాన్ని గురించి ఆలోచిస్తూ రాత్రి అంతా నిదురపోలేదు. అలసిపోయి ఉన్నాడు. నీవు వెంటనే వెళ్లి రాముణ్ణి పిలుచుకొని రా. ఆలోచించాల్సిన అవసరం ఏమీ లేదు' అని చెప్పింది. కైక మాట ప్రకారం సుమంత్రుడు రాముని దగ్గరకు వెళ్లడానికి వెనక్కు తిరిగాడు. జనంతో కిక్కిరిసిన రహదారులను చూశాడు.

* * *

రామాంతఃపురానికి సుమంత్రుడు వెళ్లటం

సర్గ - 15

వేదపారంగతులైన విప్రులందరూ పట్టాభిషేక ప్రాంతానికి వచ్చారు. వసిష్ఠుడు శిష్యులతో కలిసి ఆ మండపానికి దగ్గరే ఉన్నాడు. అభిషేకమహోత్సవాన్ని తిలకించడానికి పురప్రముఖులు, నానాదేశాల రాజులు, సామంతులు, సేనానాయకులు గుమికూడి వున్నారు.

సూర్యుడు పూర్తిగా భూమండలాన్ని చూస్తున్నాడు. పుష్యమి నక్షత్రం వచ్చింది. కర్కాటక లగ్నంలో రామునికి పట్టాభిషేకం చేయాలని వేదవేత్తలు అనుకొన్నారు. దానికై సర్వ సంభారాలు ఆయత్తం చేశారు. బంగారు, వెండి కలశాలతో కృష్ణ, గోదావరి, కావేరి పవిత్ర నదీ జలాలను నైమిశారణ్యాది ప్రాంతాలలోని బ్రహ్మావర్త రుద్రావర్తాది సరస్సుల నీరును, గండకీ ప్రభృతి నదీ జలాలను ప్రసిద్ధమైన సముద్రపు నీటిని తీసుకువచ్చారు.

విప్రులు చెప్పిన యజ్ఞసంభారాలను సిద్ధం చేశారు. పేలాలు, పాలు, పెరుగు, తేనె, ఆవాలు, దర్భలు, నేయి, పూలు మొదలైనవన్నీ తెచ్చిపెట్టారు. దేవదాసీలు చక్కగా అలంకరించుకొని వచ్చారు. జయధ్వానాలు పలికే వందిమాగధులు వేచి ఉన్నారు. స్వస్తివచనాలు చెప్పే బ్రాహ్మణోత్తములు ఉన్నారు. సకలవాద్యాలు, జంత్రగాండ్లు అందరూ విచ్చేశారు. కాని ప్రభువు వారికి కనబడలేదు. సూర్యోదయం తర్వాత కూడా నిశ్శబ్దంగా ఉన్న రాజ ప్రాసాదాలను ఆశ్చర్యంగా వారందరూ చూస్తున్నారు. అంతలో సుమంత్రుడు వారి వద్దకు వచ్చాడు. మనం వేచి ఉన్నామన్న సంగతి రాజుకు ఎలా తెలియబర్చాలా అనుకొనేటపుడు వారికి సుమంత్రుడు కనిపించాడు. వారందరూ మహారాజును గురించి అడిగారు. వారిలో రామాభిషేకం గురించిన ఉత్సాహాన్ని సుమంత్రుడు చూశాడు.

వారందరికీ సుమంత్రుడు అభివాదం చేశాడు. మహారాజుగారి యశస్సు కోరే మీరందరూ వచ్చి ఉన్నారని మహారాజుకు చెప్తాను. ఆయన దర్శనం ఎందుకు జరగడంలేదో అడిగి తెలుసుకుంటాను అని వారికి చెప్పి తిరిగి రాజాంతఃపురంలోకి వెళ్లాడు.

దశరథుడు పడుకొనివున్న ప్రదేశానికి వెళ్లాడు. రఘువంశాన్ని కీర్తించాడు. దశరథుని గుణగణాలను ప్రస్తుతించాడు. దేవతలందరూ మీకు విజయం చేకూర్చుతారని ఆశీర్వదించాడు. శోభాయమానం ఐన రాత్రి గడిచిపోయి సూర్యుడు తూర్పుదిక్కున ఆక్రమించుకొన్నాడు. రామాభిషేక సమయం కోసం అందరూ వేయి కన్నులతో ఎదురుచూస్తున్నారు. అంటూ మంత్రాంగంలో దిట్ట ఐన సుమంత్రుడు దశరథునికి చెప్పాడు.

'ఓ సుమంత్రుడా! నేను నిద్రించడంలేదు. నీకు ఇందాకే నా మనోరథాన్ని చెప్పాను. నీవు వేగంగా వెళ్లి రాముణ్ణి పిలుచుకొని రా' అని దశరథుడు చెప్పాడు. రాజాజ్ఞ సుమంత్రుడు శిరసావహించి అక్కడనుంచి కదిలాడు. రామమందిరానికి వెళ్లాలనుకొన్నాడు. దారిలో జనులు ఆనందాతిరేకంతో మాట్లాడే మాటలను వింటూ రామరాజప్రాసాదానికి చేరాడు. సువర్ణమయశిఖరాలతో అలరారే భవనకాంతిని చూశాడు. మేలైన ముత్యాలు పగడాలతో తాపడం చేసిన ప్రాకారాలు మనోహరంగా ఉన్నాయి. ఎత్తైన గోపురాలు వాటిమీద వివిధరకాల పక్షులు అవి చేసే ధ్వనులు కంటికి ఇంపుగా ఉన్నాయి. మంగళవాద్యాలు పక్షుల కిలకిలా రావాలు కలిసి వీనుల విందొనరుస్తున్నాయి. సుగంధ పరిమళాలతో నిండిన పవనం ముక్కుపుటాలను సోకి ఆనందపారవశ్యం కలిగిస్తోంది. బెగ్గురు పక్షులు, నెమళ్లు, కుందేళ్లు అటు ఇటు పరుగెడుతూ మేము రామాభిషేక సంబరంలో తలమునకలై ఉన్నామని చెబుతున్నట్లుగా వున్నాయి. గోడలమీద, తలుపులమీద అందమైన నగిషీలు సృష్టికర్త చిత్రంలోని విచిత్రాలను కళ్లకు కడుతున్నాయి. రామమందిరం మహేంద్రుని అమరావతివలె, కుబేరుని సౌధంవలె కనిపిస్తుంది.

ఆ భవనానికి దగ్గరలో రాముని మిత్రబృందమంతా ఎదురు చూస్తున్నారు. జానపదులు, సామంతులు, పురవాసులు అందరూ ఆత్రుతగా రామాభిషేకసన్నాహంలో మునకలు వేయాలని ఎదురుచూస్తున్నారు. వారినందరిని సుమంత్రుడు చిరునవ్వుతూ పలకరించాడు. రామమందిరానికి వెళ్లే సుమంత్రుని రథం రాబోయే మంచి కాలాన్ని సూచిస్తోందని అక్కడివారి మనస్సులు అనుకొన్నాయి. సుమంత్రుడు రథం దిగాడు. కక్షలు దాటుకుంటూ రాముని అంతఃపురానికి చేరాడు. అక్కడ రాముడు అధిష్ఠించే శత్రుంజయం అనే భద్రగజం అలంకరించబడి ఉండడాన్ని చూశాడు. అది పెద్ద పర్వతంలాగా బలిష్ఠంగా వుంది. అక్కడ రథ గజ బలాలతో కూడిన అమాత్యులు ఉన్నారు. వారినందరిని చూస్తూ సుమంత్రుడు రామమందిరానికి వెళ్లాడు.

* * *

రాముడు దశరథుని దగ్గరకు వెళ్లటం

సర్గ - 16

కావలిగాస్తున్న యువకుల్ని సుమంత్రుడు చూశాడు. చేతిలో బెత్తాలు పట్టుకొని అంతఃపురద్వారం వద్ద వుండే వృద్ధుల్ని చూశాడు. దాసీ జనాలను చూశాడు. వారందరూ సుమంత్రుని చూసి గౌరవంగా లేచి అభివాదం చేశారు. ఏమరుపాటు లేకుండా కావలికాచేవారిని చూచి సుమంత్రుడు నేను వచ్చానని రాముని దర్శించాలని అనుకొంటున్నానని చెప్పి రమ్మన్నాడు.

వారు వెంటనే సీతాసమేతుడై వున్న రామునికి విషయం చెప్పారు. రాజుకు ఇష్టుడైన సుమంత్రుని వెంటనే రమ్మని రాముడు కబురు పంపాడు. సుమంత్రుడు లోపలికి వచ్చి ఆసీనుడై ప్రసన్నవదనంతో ఉన్న సీతారాముల్ని చూశాడు. నమస్కారం చేశాడు. 'కౌసల్యా తనయా! నిన్ను దశరథుడు కైక చూడాలని అనుకొన్నారు. నిన్ను వెంటబెట్టుకు రమ్మని నన్ను ఇక్కడకు పంపారు' అని చెప్పాడు.

'సీతా! సహృదయంగల కైక నా హితం కోరుతూ మహారాజును ప్రేరేపిస్తున్నట్లు నాకు అనిపిస్తోంది. మనకు పురుషార్థాలను ప్రసాదించే నా తల్లిదండ్రులు నన్ను చూడాలని అభిలషించడం నా అదృష్టం. వారి కోరిక నెరవేర్చడం నా విధి సీతా!' అని సీతతో తన మనస్సులోని మాటను చెప్పాడు రాముడు. నా తండ్రి నన్ను రాజ్యాభిషిక్తుణ్ణి చేయాలని ఈ దూతను నా దగ్గరకు పంపాడు. నేను ఇప్పుడే వెళ్లి వస్తాను. నీవు సంతోషంగా ఉండు అని చెప్పాడు. పతి అనురాగం పొందే సీత రాముని అభివృద్ధిని కోరుకుంటూ భర్తతో ద్వారం దాకా వచ్చింది.

'ఓ రామచంద్రా మిమ్మల్ని దేవతలు రక్షిస్తారు. లోకప్రసిద్ధమైన మీ వంశకీర్తిని మీరు ఇనుమడింపచేయండి. మున్ముందు మీకు జరిగే యౌవరాజ్య పట్టాభిషేకం నేను చూడాలనుకొంటున్నాను. సర్వవేళలా ధర్మాన్ని ఆచరించే మిమ్ము ధర్మమే కాపాడుతుంది" అని చెప్పింది సీత. రామునికి వీడ్కోలు పలికింది.

రాముడు సుమంత్రునితో కలిసి గుహలో నుంచి వెలుపలికి వచ్చే సింహంలాగా మందిరం బయటకు వచ్చాడు. అక్కడే ఎదురుచూస్తున్న లక్ష్మణుణ్ణి చూచి చిరునవ్వు నవ్వాడు. తండ్రి కోరికను తెలిపాడు. రాముణ్ణి లక్ష్మణుడు అనుసరించాడు. తమకోసమే ఎదురుచూస్తున్న మిత్రుల్ని రాముడు పలకరించాడు. వారితో కాసేపు ముచ్చటలాడాడు. మంత్రులు, సేనానాయకులు, సామంతరాజులు వారినందరినీ ఉద్దేశించి రాముడు మాట్లాడాడు. తన రాజ్యాభిషేకం కోసం ఎదురుచూసే జనాళిని చూచి ఆనందపరవశం చెందాడు.

రాజప్రాసాదం దగ్గర తనకోసం ఏర్పాటు చేయబడ్డ వెండి రథంపైకి ఎక్కాడు. లక్ష్మణుడు, సుమంత్రుడు ఆయన్ను అనుసరించారు. మేఘగర్జనను తలపించే సవ్వడితో ఆ రథం ముందుకు సాగింది. రాజకుమారులపైన రాజవీధుల్లోని స్త్రీలు పూలు చల్లారు. పెద్దలు ఆశీర్వచనాలు పలికారు. వందిమాగధులు జయజయధ్వానాలు చేశారు. వారందరూ రామునికి యశఃప్రతిష్ఠలు కలగాలని దీవించారు. కీర్తిమంతుడవైన 'ఓ రామా! నీ తల్లికి తండ్రికి ఆనందాన్ని చేకూర్చు' అని పలికారు. వారందరి మాటల్ని రాముడు వింటున్నాడు. రథం దశరథభవనానికి

దూసుకుపోయింది. అక్కడి జనులందరూ రాముడు రాజైన తర్వాత అయోధ్య ఎలా ఉంటుందో చెప్పుకోసాగారు. ప్రజలకిష్టమైన రాజు పాలనం చేస్తే రాజ్యంలోని వారందరూ ఆనందించవచ్చునను కొంటున్నారు.

రథం దశరథమహారాజు భవనం దగ్గర ఆగింది. చతుర్విధబలాలు గుమికూడి ఉండడం రాముడు చూశాడు. దేశదేశాలజనంతో కిక్కిరిసిన రాజవీధులను దాటుతూ రామలక్ష్మణులు ముందుకు సాగారు.

* * *

రాముడు మహారాజప్రాసాదంలోకి వెళ్ళటం

సర్గ - 17

సద్గుణాభిరాముడు సర్వాంగసుందరమైన నగరాన్ని చూచి ఆనందించాడు. జనులు మాట్లాడుకొనే మాటల్ని విన్నాడు. తన సంతోషాన్ని బయటపడనీయక గంభీరంగా ఉన్నాడు. ఆకాశాన్నంటే మేడలు ఎత్తుగా ఉన్న ప్రాకారాల్ని చూశాడు. రంగు రంగులతో అలంకరింపబడిన రాజవీధులు సుమనోహరంగా కనిపించాయి.

అక్కడ చేరిన జనులందరు ఇనవంశచరిత్రను పొగడుతున్నారు. "ఓ రామా! నీవు పట్టాభిషిక్తునివై మత్తగజారూఢుడవై తిరగాడేటప్పుడు చూడాలని మేము అభిలషిస్తున్నాం. మీ తాతముత్తాతల పాలనలో మేమందరం ఆనందించాం. మీ పాలనలో మేము మా పుత్రులు క్షేమంగా ఉంటారని మేం అనుకొంటున్నాం."అన్నారు. రాముని మిత్రులందరు "రాముడు రాజు కాగానే మేం భయరహితులం అవుతాం. స్వర్గంలో దేవేంద్రునిలాగా మీరు పాలన చేస్తుంటే మేము అయోధ్యలోనే స్వర్గసుఖాల్ని అనుభవిస్తాం" అని చెప్పుతున్నారు.

రామలక్ష్మణులు రథంలో ముందుకు సాగుతూనే ఉన్నారు. వారు కనిపించనంత దూరం వెళ్ళారు. కాని పురజనులు వారిమీద దృష్టిని మరల్చలేకపోతున్నారు. చూపులను త్రిప్పుకోలేక రామనామాన్నే మంత్రంలాగా జపించసాగారు. రాముని చూడలేకపోతే జన్మసాఫల్యం పొందదు అనుకొంటున్నారు. రాముడు కూడళ్లన్నింటిని దాటుకుంటూ మహారాజభవనం దగ్గరకు వచ్చాడు. రాజభవనం మిరుమిట్లు గొలిపే కాంతితో విరాజిల్లుతోంది. ఎత్తుగా ఉండే గోపురాలు, వాటిమీద కలశాలు బంగారు రంగులో ఉండి సూర్యకాంతితో పోటీపడుతున్నాయి.

రథం ప్రవేశించింది. ఆ ద్వారాలను సాయుధలైన భటులు కావలి కాస్తున్నారు. ధనుర్ధారులై అప్రమత్తంగా నాల్గు దిక్కులను చూస్తున్నారు. అటువంటి మూడు కక్షలను రథం దాటి ముందుకు వెళ్ళి ఆగింది.

రథం నుంచి రామలక్ష్మణులు దిగారు. వారితో వచ్చిన మిత్రులను, సేనానాయకులను రాముడు పంపివేశాడు. రామలక్ష్మణులు ఇద్దరూ నడుస్తూ రెండు ద్వారాలు దాటారు. ఆ తర్వాత దశరథుడు ఉన్న మందిరంలోకి అడుగుపెట్టాడు. బయట వేచిఉన్న జనం చంద్రోదయం కోసం ఎదురుచూసే చకోరపక్షుల్లాగా, సూర్యోదయం కోసం ఎదురుచూసే విజ్ఞులలాగా రాముడికోసం నిరీక్షించసాగారు.

* * *

రామునకు కైక వరాల వివరణ

సర్గ - 18

రాముడు మందిరంలో ప్రవేశించాడు. ఉచితాసనంపై దశరథుడు కైకతో కూడి ఉండడాన్ని చూశాడు. రాముడు తండ్రి దీనవదనాన్ని చూశాడు. తండ్రికి పాదాభివందనం చేశాడు. తల్లి పాదాలను స్పృశించి నమస్కరించాడు. ఆ రాముడిని చూసి దశరథుడు వేదన నిండిన స్వరంతో 'రామా!' అని పిలిచాడు. దశరథుని కండ్లు కన్నీటితో నిండిపోయాయి. గొంతు పిడచకట్టుకుపోయింది. వెక్కి వెక్కి ఏడ్వసాగాడు. ఇంతకు ముందెప్పుడు ఈ స్థితిని చూడని రాముడు చింతాక్రాంతుడయ్యాడు. తండ్రి రోదనకు కారణం తెలుసుకోలేక భయపడ్డాడు. తల్లిని చూశాడు. అభావంతో ఉన్న కైక రాముని చూడలేదు.

తిరిగి తండ్రి ముఖం రాముడు చూశాడు. రాహువు మింగిన సూర్యునిలాగా, మబ్బు కమ్మిన ఆకాశంలాగా విషాదం అలముకొన్న దశరథుని ముఖం కనిపించింది. తండ్రి వ్యాకులతకు కారణం ఏమో అనుకొన్నాడు. తల్లి ఐన కైక వైపు రాముడు చూసి, 'అమ్మా నా తండ్రి ఎందుకు ఇలా చింతిస్తున్నాడు. క్రోధావేశంతో మండిపడుతున్నాడా? లేక నేను తెలిసి కాని తెలియక కాని ఏ దోషాన్నైనా చేశానా? మానసికంగానైనా, వ్యాధి చేతనైనా పీడింపబడుతున్నాడా? ఏదైనా మా తండ్రి ఇంతకుముందు కోపంతో ఉన్నప్పుడు నన్ను చూసినప్పటికి, నన్ను చూడగానే సంతోషంతో పలకరించేవారుకదా. ఇప్పుడు నామీద కోపంతో నాతో మాట్లాడలేక ఉన్నారా? లేక నా ప్రియమైన తమ్ముళ్ళకు ఏదైనా ఆపద కలిగిందా? నాకు జన్మనిచ్చిన తండ్రికి హితం కానిపని చేస్తూ నేను బతికి ఉండడం వృధా అని నేను అనుకొంటాను.

లేక అమ్మా మీరేదైనా అభిమానంతోనో, కోపంతోనో మా తండ్రిని అవమానించారా? దానికై దుఃఖిస్తున్నారా? అమ్మా నా మీద దయ ఉంచి మా తండ్రి వ్యధకు కారణం తెలుపు తల్లీ" అని దీనంగా రాముడు వేడుకొన్నాడు.

అట్లా అడిగే రాముణ్ణి కైక చూసింది. కనికరం లేని కైక ఇలా చెప్పింది. 'ఓ రామా! మీ తండ్రికి కోపం లేదు తాపం లేదు. మనస్సులో ఒక కోరిక మాత్రం ఉంది. దాన్ని నీతో చెప్పలేక బాధపడుతున్నారు' అంది.

'అమ్మా మా తండ్రి కోరికను నేను ఏనాడూ కాదనలేదు. తండ్రి ఆజ్ఞ విషం మింగమని అయితే నేను సంతోషంగా ఆ విషాన్ని సేవిస్తాను. అగ్నిలో దూకమని మా తండ్రి కోరితే ఉత్సాహంతో దుముకుతాను. నా తండ్రి చెప్పిన పని నేను చేయలేని నాడు ఈ శరీరంలో ప్రాణాలు ఉండవు' అని చెప్పాడు.

'మా తండ్రి కోరికను మీరైనా నాకు తెలపండి. దానిని నేను పాలిస్తాను" అని అన్నాడు. 'రామా! ఆ పని నీ ఒక్కనివల్లే అవుతుంది. నీవు ధర్మాచరణంలో ముందుంటావు గదా. సత్యం, ధర్మం మీదనే ఈ భూమండలం నిలబడి ఉందని నీవు నమ్ముతున్నావు గదా. ధర్మం తప్పి సత్యం విడనాడి జీవించడం నీ వంశజులలో ఎవరినైనా చూశావా? అటువంటి వంశంలో ధర్మమూర్తిలాగా నీవు పుట్టావు. నీకు అప్రియమైన మాటలు చెప్పలేక రాజు మూగపోయారు.

ఇంతకుముందు మీ తండ్రిని నేను అపాయస్థితినుండి రక్షించాను. అప్పుడు నాకు రెండు వరాలనిచ్చారు. అవి నెరవేర్చడానికి ఈనాడు అంగీకరించడంలేదు. చెరువులో నీరు అంతా ఎండిన తర్వాత కట్టవేసినట్లుగా మీ తండ్రి వరదానం చేసి వాటిని పాలించడంలో వ్యర్థంగా ఆలోచిస్తున్నారు."అని కైక చెప్పింది.

'అమ్మా! నాకు అప్రియం కలిగించే పని అయినా నేను సంతోషంగానే చేస్తాను. నా మీద మీకు నమ్మకం లేదా? మీకు మా తండ్రి ఇచ్చిన వరాలను నిర్వర్తించడంలో నేను చేయాల్సినది ఉంటే తప్పక చేస్తాను. నామీద నమ్మకం ఉంచి ఆ విషయం గూర్చి నాతో చెప్పుము' అని రాముడు కైకను ప్రార్థించాడు.

దుష్టబుద్ధి గల కైక 'ఓ రామచంద్రా! నీవు చెప్పేదంతా నిజమేనని నేను నమ్ముతున్నాను. ఇంతకుపూర్వం మీ తండ్రి ఇచ్చిన వరాలలో ఒకటి నీవు పద్నాలుగేండ్లు వనవాసం చేయుమని, మరొకటి శత్రువులు లేని అయోధ్యాపురిని భరతునకు ఇచ్చునట్లు మీ తండ్రి వాగ్దానం చేశారు. కాని నేడు జటావల్కలధారివై నిన్ను వనాలకు వెళ్ళమని నీతో చెప్పలేక రోదిస్తున్నారు.

కనీసం నీవైనా ధర్మాచరణుడవు కమ్ము. సత్యపాలన చేయి. తండ్రి మాటను నిలబెట్టి, మీ వంశ గౌరవాన్ని పెంచు' అని కైక కర్కశంగా రామునితో చెప్పింది. దీనికి రాముడు క్రుంగిపోలేదు. ఇంతకుముందులాగానే ఉన్నాడు. చిరునవ్వు చెరిగిపోలేదు. కాని దశరథుడు పుత్రవాత్సల్యంతో కుమిలిపోయాడు.

* * *

కైక తృప్తి

సర్గ - 19

కౌసల్యాగృహానికి - రాముడు

అరిషడ్వర్గాలను వశీకరించుకొన్న రామునికి కైకమాటలు బాధ పెట్టలేదు. ముఖంలో ఎట్టి వికారం కనబడలేదు. "అమ్మా! ఈ మాత్రానికే నాన్నగారు ఇంతగా బాధపడుతున్నారా? నేను తను ఆశించిన కార్యాన్ని చేయడానికి సందేహిస్తానని అనుకొన్నారా? నీవు కూడా నన్ను తెలుసుకొన్నది ఇంతేనా? నేను ఎప్పుడూ ఆడిన మాటను తప్పను. మీ ఇష్టప్రకారం నేను చేస్తాను. అసలు మీ కోరికను నాకు చెప్పి ఉంటే సరిపోయేది. కాని మీరు దాన్ని తండ్రికి చెప్పి ఆయనను బాధపెట్టారు.

భరతుడు కోరుకున్నదానిని ఏదైనా సరే నేను సంతోషంగా ఇస్తాను. భరతుని కోరిక ఇది అని నాకు తెలిసిన వెంటనే ఎవరూ నన్ను అడుగకుండానే రాజ్యాన్ని, బంధువుల్ని సీతను కూడా నేను ఇవ్వటానికి ఏ మాత్రం సంశయించను. అట్టి నన్ను సందేహించడం మీరు చేసిన పొరపాటు. ఇప్పుడే వేగంగా వెళ్ళే అశ్వారూఢులను పిలిపించి భరత కుమారుని రప్పిస్తాను" అని రాముడు కైకకు చెప్పాడు.

తన కోరిక తీరబోతుందని కైక సంతోషపడింది.'ఓ రామా! నీవు చెప్పినదంతా నిజమగుగాక! రామా! నీ మీద నాకు ఏ మాత్రం సంశయం లేదు. కాని దండకారణ్యానికి జటాధారివై ఇప్పుడే వెళ్ళాలని నిర్ణయించుకొన్నావు గదా. మరి దానికి ఆలస్యం చేయకూడదనేది నా భావం. నీవు వెళ్ళిన తర్వాతనే భరతుడు రాజ్యాన్ని స్వీకరిస్తాడు' అని చెప్పింది.

'అమ్మా! మరి తండ్రిగారు నాతో మాట్లాడలేదే అని నాకు మనోవ్యథ కలుగుతోంది' అన్నాడు. 'రామా! నీవు ఈ రాజ్యాన్ని వదిలి అడవులకు వెళ్ళేంతవరకు మహారాజు అన్నపానీయాలు ముట్టరు. అందువల్లే నీతో సంభాషించలేకున్నారు' అని చెప్పింది. ఈ మాటలు విన్న దశరథుడు క్రుంగిపోయాడు. 'ఏమి ఈ దుస్థితి'– అని కళ్ళనీరు కార్చుతూ తన పర్యంకంపై సొమ్మసిల్లిపోయాడు.

అది చూచిన రాముడు చింతాక్రాంతుడయ్యాడు. తన తండ్రికి శీతలోపచారాలు చేశాడు. లేపి కూర్చోబెట్టాడు. పాదాలు పట్టుకొని 'మీ ఆజ్ఞను సంతోషంగా స్వీకరించి అమలుపరుస్తాను. ఇప్పుడే వనవాసదీక్షితుడనై' వెళ్తాను అని చెప్పి అంజలి ఘటించాడు. తల్లివైపు తిరిగి 'అమ్మా నన్ను ఆశీర్వదించు. మీ మాటను మన్నించి నేడు నేను దండకారణ్యానికి వెళ్తాను. కాని నాకు జన్మనిచ్చిన తల్లిని చూచి ఆమెకు ఈ వార్త తెలిపి ఆమె అనుమతి తీసుకొని మీ కోడలైన సీతను అనునయించి బయలుదేరడానికి నాకు సమయాన్ని అనుగ్రహించు' అని కోరాడు. వెంటవెంటనే కార్యాన్ని పూర్తిచేసుకొని అడవులకు నేడే పయనం అవ్వాలని కైక చెప్పింది. వెంటనే రాముడు ఆమెకు నమస్కరించాడు. తల్లిదండ్రులకు ప్రదక్షిణనమస్కారాలు చేశాడు. అంతఃపురం బయటకు వచ్చాడు. కోపాన్ని నిగ్రహించుకుంటూ లక్ష్మణుడు అన్నను అనుసరించాడు. అక్కడ సిద్ధం చేసి వున్న అభిషేకసామగ్రికి రాముడు నమస్కరించాడు. మరల వాటివైపు చూడకుండా ముందుకు సాగాడు.

కౌసల్య మందిరం వైపు అడుగులు వేశాడు. కామక్రోధాదులను త్యజించిన రామునిలో వికారాలకు తావు లేదు. అందుకే పూర్వపు శోభను ముఖంలో దోబూచులాడుతూనే వుంది. తనను అనుసరిస్తూ వస్తున్న వారిని ఇక్కడే ఉండండని రాముడు వారిని ఆపివేశాడు. తనకు వింజామరలు వీస్తూ శ్వేతచ్ఛత్రాన్ని పడ్తున్నవారిని వారించాడు. వనగమన వార్తను తెలుసుకొన్న ఆత్మీయులందరూ రాముడిని చూచి కంట తడిపెట్టారు. వలదు వలదంటున్న వారిని రాముడు ఊరడించాడు.

అప్రియ వార్తను చెప్పడానికి కౌసల్య అంతఃపురంలోకి రాముడు అడుగుపెట్టాడు. అక్కడ ద్వారపాలకులు, దాసీలు, బంధువులు అందరూ ఎంతో సంతోషంగా ఉన్నారు. రాముణ్ణి వారందరూ చూశారు. అభావాన్ని వెలిబుచ్చే రాముని మోము వారికి విషయాన్ని ఎఱుకపరచలేదు. ఆయన ముఖం ప్రసన్నంగా, సంతోషంగానే ఉంది. అందుకనే వారెవరూ విషయాన్ని పసిగట్టలేకపోయారు.

* * *

కౌసల్య విలాపం

సర్గ - 20

రాముడు కైకేయి అంతఃపురాన్ని దాటగానే విషయం అంతా పొక్కింది. దశరథుని రాణులందరికి కైక విపరీతపు కోర్కె తెలిసింది. వారందరూ దుఃఖించారు. దూడలను కోల్పోయిన గోవుల్లాగా విలపించారు. క్రోధమే లేని రాముడిని తలచుకొని చింతించారు. ఎవరైనా కోపం తనకు కలిగించినా వారి కోపాన్ని పొగొట్టే అమాయకుడైన రాముడికి కలిగిన ఆపదకు వారు రాజును నిందించారు. వారి ఆక్రందనలన్నీ కైక మందిరాన్ని కుదిపేశాయి. ఆ రోదన విన్న మహారాజు తన ఆసనంలోనే మూర్ఛిల్లాడు.

రాముడు ఇవేమీ పట్టించుకోకుండా కౌసల్య అంతఃపుర కక్షలను అధిగమిస్తూ, అక్కడి వారిని పలుకరిస్తున్నాడు. వారికి సంతోషం కలిగించే మాటలను చెప్పుతున్నాడు. కౌసల్యామందిరంలోకి అడుగు పెట్టబోతున్నాడనే వార్తను అక్కడి వారు పరుగున వెళ్ళి కౌసల్యకు చెప్పారు. పుత్రాభివృద్ధికై వ్రతాలను ఆచరించే కౌసల్య పరమానందపడింది. రాజ్యం చేపట్టబోయే తన తనయుడు ఆశీర్వాదం కోసం వస్తున్నాడనుకొంది. ఇలువేల్పుకు మొక్కులు తీర్చుకొంది. కౌసల్య మందిర ద్వారాల చెంత ఉన్న వృద్ధులు, స్త్రీలు రామునికి జయజయధ్వానాలు పలికారు. 'విజయోస్తు!' అని దీవించారు.

అగ్ని కార్యాలను విప్రులతో జరిపించే కౌసల్యను రాముడు చూశాడు. తెల్లని పట్టుచీర కట్టి మంగళకరంగా కనిపించే కౌసల్యను చూచి రాముడు ఆనందించాడు. అప్రియమైన వార్త చెబితే ఆమె దుఃఖితురాలు అవుతుందేమోనని సంశయించాడు. సర్వులకు ఆనందాన్ని కలిగించే రాముణ్ణి కౌసల్యాదేవి చూసింది. తన ప్రియపుత్రుడికి దగ్గరగా వచ్చింది. రాముడు తల్లికి ఎదురుగా వెళ్ళి పాదాభివందనం చేశాడు. రాముణ్ణి లేవనెత్తి శిరస్సును ముద్దాడింది.

'నాయనా! నీవు ధర్మమూర్తిలాగా వ్యవహరించు. నాకు, మీ తండ్రికి యశస్సును తెచ్చిపెట్టు. మన వంశగౌరవాన్ని ఇనుమడింపచేయి. మీ జనకుడు నేడు నిన్ను పట్టాభిషిక్తుణ్ణి చేయదలచారు. నీ తండ్రి మాటను ఏనాడూ జవదాటకు' అంటూ హితవు చెప్పింది.

వినయశీలుడైన రాముడు అన్నిటికి తలూపాడు. 'కౌసల్యా రామా! ఇప్పుడే పూజాదికాలు పూర్తి అయ్యాయి. భోజనం చేయి తండ్రీ!' అని చెప్పింది. 'అమ్మా' అంటూ తన వనగమన వార్తను చెప్పడానికి సంకోచపడ్డాడు. 'అమ్మా నేడు మీకు, వైదేహికి, నా ప్రియసోదరుడైన లక్ష్మణునికి, అప్రియమైన వార్త చెప్పబోతున్నాను' అన్నాడు. 'మీకు దుఃఖాన్ని కలిగించేదే ఐనా నేను పాటించవలసిన దానిని చెప్తాను' అంటూ దండకారణ్యానికి పయనం అయ్యే సంగతి కౌసల్యతో రాముడు చెప్పాడు.

'అమ్మా నేను రాజ్యభోగాలు త్యజించి మునివేషధారణ పూని అరణ్యాలలో సంచరిస్తాను. భరతుడు పద్నాలుగేండ్లు రాజ్యసింహాసనాన్ని అధిష్ఠించి రాజ్యాన్ని ఏలుతాడు అని చెప్పాడు. కాబట్టి నేను రాజభోజనాన్ని స్వీకరించలేను. నేటినుండి నేను కందమూలాలు భుజించి దర్భాసనంపైన శయనించాలి" అని చెప్పాడు.

ఆ మాటలకు కౌసల్య బాధాతప్తురాలైంది. మరునిమిషం అచేతనురాలై నేలపై ఒరిగిపోయింది. వ్రతా చరణాదులచే కృశించి ఉన్న ఆమె దేహం వడలిపోయింది. ఆమె హృదయం దుఃఖభారంతో సాగరం అయింది. నేలపై పడిన కౌసల్యను రాముడు లేవనెత్తి తన కరస్పర్శతో అనునయించసాగాడు. కొంత తడవుకు ఆమె తెప్పరిల్లింది.

రాముని చేతిలో ఉన్న కౌసల్య దుఃఖంతో 'రామా!నీవు నాకు జన్మించకపోయినా నాకీ దుఃఖం కలిగేది కాదు. సంతానమే లేదని శోకించేదాన్ని కాను. ఈ పుత్రవియోగాన్ని నేను భరించలేను. ఓ రామా! నేను పట్టమహిషినే కాని ఏనాడు నీ తండ్రివల్ల ఆనందాతిరేకాలకు అంతగా నోచుకోలేదు. పెద్దరాణినై ఉండి కూడా ఇతరుల సూటిపోటి మాటలతో చిత్రవధ అనుభవించాను. సవతులతో మాటలు పడుట కంటే మరణమే స్త్రీలకు మేలన్నది నా అభిప్రాయం.

పుత్రుని కన్న నాకు నిరాదరణయే ఒనగూడింది. నీవు ప్రయోజకుడివై నన్ను బాధలనుంచి బయటపడవేస్తావని ఇన్నాళ్ళు ఎదురుచూశాను. దైవం నాకు అనుకూలంగా లేదు. ఎప్పుడూ మీ తండ్రి ఆగ్రహావేశాలకు భయపడుతూ బతికితినిగాని ఆదరాభిమానాలను ఎదురుచూడలేదు. అట్టి నేను నీవీనాడు రాజువై నన్ను రాజమాతను చేస్తావని అనుకొంటిని. దైవాన్ని అమితంగా పూజించాను. నా పూజలలో లోపం ఉన్నట్లుంది. అందుకే అవి సత్ఫలితాలను ఇవ్వడంలేదు. నేడు నీవు నన్ను వదిలి కానలకు వెళ్లితే నాకు మరణం తప్ప మరో దిక్కు లేదు రామా!' అంటూ దీనురాలై కౌసల్య ఆక్రోశించింది.

'నీ పినతల్లి ఎప్పుడూ క్రోధావేశపరురాలే. ఎప్పుడూ పరుష వాక్కులే మాట్లాడుతుంది. భరతుడు రాజైన తర్వాత ఆమెకు భయపడి నన్ను పలుకరించువారు ఎవ్వరూ కానరారు. నిస్సహాయ స్థితిలో ఉన్న నేను ఆమె ముఖం ఎలా చూడగలను?'

'ఎన్నో నోములు నోచి నిన్ను కన్నాను. ఎన్నో సంవత్సరాలు నీ అభివృద్ధికొరకై ఎదురుచూశాను. కాని నేడు నావన్నీ నిరాశలే అయినవి. నీ అరణ్యగమనంతో నాకు తీరని దుఃఖం తప్ప మరేది మిగలలేదు. ఇంతటి సంతాపవార్త విన్ననూ నా హృదయం బద్దలగుటలేదు. బహుశా యమలోకంలో కూడా నాకు చోటు లేదేమో. ఆయన యమపాశానికి కూడా నేను ఇష్టం లేదేమో' అని రోదించసాగింది.

'రామా! నీవు వెళ్ళిన తర్వాత నేను చేయవలసినది, చేయదగినవి అంటూ ఏవీ లేదు. ఇక్కడ నేను చేసే గొప్ప కార్యం ఏమీ లేదు. నీ ఎడబాటుతో కృశిస్తూ నేను జీవించలేను. ముదుసలినైన నేను నిన్ను అనుసరించి నీతో అడవులకు వస్తాను. కనీసం నీతో కూడా ఉండైనా మనశ్శాంతిని పొందుతాను' అంటూ రాముని చూచి బోరున విలపించింది కౌసల్య.

* * *

పితృవాక్యపరిపాలనే పరమధర్మం

సర్గ - 21

కౌసల్య దీనాలాపం చూచి రామలక్ష్మణులు దుఃఖించారు. లక్ష్మణుడు 'అమ్మా! ఒక్క ఆడదాని మాటలతో రాముడు రాజ్యం త్యజించడం సమ్మతంగా నాకు అనిపించడంలేదు. మన మహారాజు వృద్ధుడు, కామాతురతో వరాలనిచ్చినవాడు, భోగలాలసుడు. ఆ లాలసత్వంతో రాముని అడవులకు పంపాలని నిశ్చయించడం అసమంజసం. రాముడు చేసిన దోషమేమీ లేదు. రాజ్యంలోని వారికెవరికి అపకారం చేయలేదు. ఏ నేరారోపణ రామునకు లేదు. అటువంటప్పుడు రాముడు ఎవరిమాట కోసమో రాజ్యలక్ష్మి చేపట్టకుండుట అంత మంచిది కాదు. మంచిమాట ఎవరు చెప్పినను వినాలి అన్నది పెద్దలమాట. అలానే వృద్ధులు, పెద్దలు చేయకూడని పనులు చేయమని ప్రోత్సహిస్తే వాటిని చేయవలసిన పనిలేదు.' అని చెప్పి రామునివైపుకు తిరిగి 'ఓ అన్నా! ఈ విషయం ఎవరికి తెలియకముందే రాజ్యాన్ని చేజిక్కించుకో. నేను నీ వెంటే ఉంటాను. భరతుని పక్షం వహించేవారిని నేను మట్టుపెడతాను. కైకేయి మాటలకు లోబడిన మన తండ్రి మనకు అడ్డుగా నిలిస్తే ఆయనను ఎదిరిస్తాను. ఆయనను చంపవలసి వస్తే తండ్రి అని తలచక వధిస్తాను' అని లక్ష్మణుడు ఆగ్రహంతో మాట్లాడాడు.

'అన్నా! అధర్మపాలన చేసేవాడు గురువైనా వానిని శిక్షించి తీరాలని మనం నేర్చుకొన్నాం గదా.' 'అమ్మా! కౌసల్యాదేవీ! మీరు చింతించకండి. నాకు రామునిపై అపారమైన ప్రేమ ఉంది. అతడు నాకు ప్రాణతుల్యుడు నా ధనుస్సుపైన, దాన ధర్మాలపైన ఒట్టువేసి చెప్తున్నాను. నేను బతికి ఉండగా నా రామునికి చెడు తలపెట్టేవారిని నేను ఊరికినే వదలను. అగ్నిలో కాని, మహారణ్యంలో కాని రాముడు వెళ్ళదలిస్తే వారికన్నా ముందు నేను ప్రవేశించి మార్గాన్ని సుగమం చేస్తాను. మీ దుఃఖాన్ని నా పరాక్రమంతో పారదోలుతాను' అంటూ లక్ష్మణుడు తనకు అన్నపైగల అవాజ్య ప్రేమానురాగాలను చూపించాడు. 'ఓ రామచంద్రా! నీ తమ్ముని మాటలను విన్నావు కదా! ధర్మమూర్తి వైన నీవు నీ ఇష్టానుసారంగా కార్యాన్ని ఆరంభించు. తల్లిదండ్రుల సేవ పరమోత్తమమైన ధర్మమని నీకు తెలుసు గదా. కశ్యపకుమారులలో ఒకడు తల్లితో పాటే ఉండి ఆమెకు శుశ్రూషలు చేసి చివరకు స్వర్గాన్ని చేజిక్కించుకొన్నాడని నీవు విని ఉన్నావు గదా. నేడు నేను ఈ ముదుసలివయస్సులో కష్టాల కోర్చలేను. మీ తండ్రికాలంలో నేను బాపుకొన్నదాని గురించి నీకు చెప్పవలసిదేమీ లేదు. కావున నీవు అడవులకు వెళ్ళటానికి నేను సమ్మతించను' అని గట్టిగా తన నిర్ణయాన్ని కౌసల్య రామునితో చెప్పింది.

'రామా! నీవు లేకుండా నేను ఈ రాజ్యభోగాలు అనుభవించలేను. నీతోపాటే కందమూలాలు దుంపలు తినటమే నాకు పరమానందం. తల్లిని అనాదరం చేసినందుకు సముద్రుడు నరకయాతన అనుభవించాడు. నీవు నన్ను నిరాదరించి అడవులకు వెళ్ళినట్లయితే నేను ప్రాయోపవేశం చేసి దేహత్యాగం చేస్తాను. అప్పుడు నీవు కూడా సముద్రునిలాగా బాధపడవలసి వస్తుంది.' అని పలువిధాలుగా రాముని నిర్ణయాన్ని మార్చడానికి కౌసల్య విఫలయత్నం చేసింది. అన్నీ విన్న రాముడు నిశ్శబ్దంగా ఉన్నాడు. కొంతసేపు తర్వాత 'అమ్మా నేను మిమ్ము వేడుకొంటున్నాను. నేను ఎన్నటికి పితృవాక్యాన్ని జవదాటలేను. నేను తండ్రి ఆనతి ప్రకారం వనాలకు వెళ్ళడానికి

నిశ్చయించుకొన్నాను. మీరు నాకు అనుజ్ఞ ఇవ్వండి. కండుడు అను గొప్ప విద్వాంసుని మీరు ఎరుగుదురు కదా. వ్రతదీక్షాపరుడైన ఆ కండుడు తన తండ్రి మాటకు విలువనిచ్చి గోహత్య చేశాడు. అంతేగాదు మన వంశజుడు ఐన సగరుని మాట ప్రకారం అతని పుత్రులు భూమిని త్రవ్వుతూ అకాల మరణం పొందారు. జమదగ్ని తనయుడైన పరశురాముడు తన పితృవాక్యాన్ని పాటించి రేణుకాదేవి తలను నరికాడు గదా. మరి వీరందరు తండ్రి ఆజ్ఞను పాటించినవారే కదా. నేనేమీ నీకు కొత్త విషయం చెప్పడం లేదు. తండ్రి ఆనతి పాటించిన మహితాత్ముల జాడలలో నేను నడుస్తున్నాను. అవే మనకు శిరోధార్యాలు. జనకుని మాటలను పాటించిన వారెవరూ దుర్గతి చెందరు.' అని అమ్మకు తన నిర్ణయాన్ని చెప్పి లక్ష్మణుని చూచి 'లక్ష్మణా! నీకు నాపై అపారప్రేమ ఉన్నదని నాకు తెలుసు. నీవు గొప్ప తేజశ్శాలివి, బుద్ధిమంతుడవు. మన మాతృమూర్తి పుత్రవాత్సల్యంతో అంతులేని దుఃఖాన్ని పొందుతోంది. ఈ సంగతి తెలిసి నీవు ఇలా మాట్లాడుతావేమి? నీవు కోపాన్ని విడిచి విషయాన్ని గ్రహించు. కైకేయి సత్యపాలన చేయుమనియే తండ్రిని అడుగుతున్నది. ధర్మంతో నీవు ఆలోచిస్తే నీకు తండ్రి మాట ఎంత పవిత్రం అయిందో తెలుస్తుంది. అధర్మమార్గాన ఎన్ని సంపదలు వచ్చినా మనకు మనశ్శాంతి కలుగదు.' అని లక్ష్మణుని శ్రీరాముడు ఊరడించి తిరిగి తన తల్లిని ఓదార్చడానికి మాట్లాడడానికి పూనుకొన్నాడు. 'అమ్మా అందుకే నేను తండ్రి మాటను పాటించదలచాను. నేను అడవులకు వెళ్ళడం నిజం. దానికి మీరు అనుమతి ఇవ్వండి. నేను నా పద్నాలుగేండ్ల వనవాసాన్ని పూర్తిచేసుకొని నగరానికి వస్తాను. యయాతిరాజు పుణ్యరాశిని పెంచుకొని రెండవసారి స్వర్గాన్ని చేజిక్కించుకొన్నట్లు నేను నా రాజ్యాన్ని పొంది మీ కోరికను నెరవేరుస్తాను' అని రాముడు తల్లితో దృఢంగా తన నిర్ణయాన్ని చెప్పాడు.

కౌసల్య అంతా విన్నది. అయినా కుమారుడిని అడవులకు పంపించడం ఆమెకు చేతకాలేదు. అందుకే 'ఓ రామా! నీవు ధర్మాధర్మములను తెలిసినవాడివి. కాని నీవు లేకుండా నాకు ఏ సంపదా అవసరం లేదు. ఇహపర సౌఖ్యాలకోసం నేను వెంపర్లాడడంలేదు. నిన్ను విడిచి క్షణమైన నిలువజాలను. ఇటువంటి నన్ను విడిచివెళ్ళడం నీకు మంచిది కాదని' చెప్పింది. రూపుకట్టిన ధర్మమే రాముడు కాబట్టి తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. 'ఓ లక్ష్మణా! నీవుకూడా మన తల్లికి మంచిచెప్పి, అమ్మా! మనం ఒక్క ధర్మాన్ని ఆచరించినట్లైతే నాలుగు పురుషార్థాలు మనకు చేరువ అవుతాయి. అనుకూలవతి అయిన భార్యవల్ల ఉత్తమ గతులు అందినట్లు ధర్మాచరణ వల్ల అర్థకామాలు మనకు లభ్యమవుతాయి. మహారాజు జ్ఞానవృద్ధుడు, వయోవృద్ధుడు పైగా మన జన్మదాత. అటువంటి తండ్రిని కష్టపెట్టి మనం పొందే లాభం ఏమీ ఉండదు. తండ్రి మాటను పాటిస్తే జనకునికి మనశ్శాంతి ఇచ్చినవారం అవుతాం. మన తండ్రి లోభంతోకాని, కామంతోకాని, ఇంద్రియలక్ష్యంతోగాని ఒక కోరిక కోరితే దానిని నిర్వర్తించడం కొడుకుల బాధ్యత. బాధ్యతారాహిత్యం మనిషిని అష్టకష్టాలపాలు చేస్తుంది. దశరథుడు నాకే గాదు మీకు, భరతాదులకు, కౌసల్యామాతకు, సుమిత్ర, కైకేయిలకు వందనీయుడు పూజనీయుడు. అమ్మా! తండ్రి ఆనతిని పాలించి త్వరలో నేను క్షేమంగా ఇంటికి చేరాలని నన్ను ఆశీర్వదించు. రాజ్యాధికారాన్ని ఆనాడు చేపట్టి మీకు ఆనందం చేకూర్చుతాను. జీవితం క్షణమైనను ధర్మం శాశ్వతమైనది. క్షణభంగురమైన ఆనందం కోసం నేను అధర్మాన్ని ఆశ్రయించను. మీరు అన్ని తెలిసినవారు. బాగుగా ఆలోచించి నాకు అనుమతిని ఇవ్వాలి' అంటూ తన దృఢనిశ్చయాన్ని తేటగా తెలియబర్చాడు.

* * *

లక్ష్మణునికి రామబోధ

సర్గ - 22

లక్ష్మణుడు అధర్మాన్ని సహించలేకపోయాడు. యౌవరాజ్యపట్టాభిషేకాన్ని తుంచి వేసే కైక మాటలను భరించలేకపోయాడు. రోషావేశంతో కుతకుతలాడాడు. కోపంతో సౌమిత్రి కన్నులు ఎర్రగా కనిపించాయి. నాసికా రంధ్రాలు ఉచ్ఛ్వాసనిశ్వాసాలతో అదురుతున్నాయి. అట్టి లక్ష్మణుని దగ్గరకు రాముడు చేరాడు. నిగ్రహవంతుడైన రాముడు లక్ష్మణునితో 'సోదరా! నీకు అప్రియాలైన మాటలతో ఏర్పడిన శోకాన్ని వీడు. జరిగినదానిని అవమానంగా తలంచకు. ఏ ఉత్సాహంతో రాజ్యాభిషేకానికి సమాయత్తం చేశావో అదే సంతోషంగా మన వనగమన ఆటంకాలను తొలగించు' అని చెప్పాడు.

దీనివల్ల మన తల్లి ఐన కైకకు మనస్సు శాంతిస్తుంది. ఒక్క నిమిషం కూడా ఆమెకు మనం వనాలకు బయలుదేరడంలో ఆలస్యం అవుతోందని తెలియపరచకు. ఆమె వ్యాకులం చెందుతుంది. మనం తండ్రి ఆనతిని పాటించడం వల్ల పరలోకబాధాపీడనం నుంచి తండ్రి బయటపడ్తాడు. ఇహలోకంలోను, పరలోకంలోను శాంతచిత్తుడౌతాడు. తండ్రి సంతోషాన్ని చూచి మన కౌసల్య, సుమిత్రాదేవులు ఆనందిస్తారు. మనం ఆయన అనుకొన్న పనిని నిర్వర్తించనినాడు తండ్రిని మనస్తాపానికి గురిచేసినవారమౌతాం. ఆనాడు మనం జీవించినా మరణించిన దానితో సమానం. నేను జటావల్కలధారినై అడవులను అనుగమించడం కైక చూస్తుంది. దానివల్ల ఆమె మనస్సు చల్లబడుతుంది. ఆమె యథేచ్ఛగా భరతుని రాజ్యాభిషేకాన్ని నెరవేర్చుతుంది. కుమారా! లక్ష్మణా! నాకు నా ముగ్గురి తల్లులలో భేదభావం లేదు. వారు ముగ్గురు నాకు పూజనీయులే. కైక కూడా ఇంతవరకు మనపై హెచ్చుతగ్గులు చూపలేదు. భరతునికి, నాకు ఆమెపై ఒకటే రకమైన ప్రేమే ఉండేది. ఈ విషయం నీకు కూడా తెలిసిందే.

అట్టి మన కైక మాత నేడు ఈ విధంగా ప్రవర్తించడానికి కారణం కేవలం దైవికమే. దైవ ప్రేరణ లేనిదే ఎవరూ ఏమీ చేయలేరు. కైకేయి సాధు హృదయం గలది. మెత్తని స్వభావం గలది. అటువంటి ఆమె నన్ను అడవులకు పంపాలని అనుకోవడానికి కారణం కేవలం దైవవశం తప్ప మరేమీ కాదు. విధిని ఎదిరించడం ఎవరివల్లా కాదు. ప్రారబ్ధకర్మను అందరూ అనుభవించి తీరవలసిందే. అందుకే ఎందరో మహానుభావులు వారి వారి కర్మఫలాలను అనుభవించడంలో క్లేశాలపాలౌతారు. సమస్త ప్రాణికోటి దైవాధీనం అయి ఉంటుంది. జనన మరణాలు, సుఖదుఃఖాలు, శీతోష్ణాలు అన్ని దైవప్రేరణలే. ఎందరో ఋషీశ్వరులు అమోఘమైన తపస్సులు చేస్తారు. కఠోరనియమాలు ఆచరిస్తారు. కాని వారి కర్మవశాత్తు ప్రలోభాలలో చిక్కుకొని కడగండ్లపాలవ్వడం మనం చూశాం కదా. మనం ఒకటి తలచిన దైవం మరొకటి తలుస్తుంది. ఎంతటి వివేకమైన దైవం ముందు తలవంచాల్సిందే. దైవనిర్ణీతమైన పనినే మన చేత భగవంతుడు చేయిస్తాడు. మరొకలాగా చేయడం మన చేత కాదు.

బాగా ఆలోచించి చూస్తే మనకు దైవం నిర్ణయించినదే లాభదాయకంగా ఉంటుంది. రాజ్యభారాన్ని మోయడంకన్నా మౌని వృత్తిని చేపట్టడం సులభం. అంతేకాదు ప్రకృతిమాత సోయగాలు వీక్షిస్తూ ప్రకృతి ఒడిలో సేదతీరటంకన్నా కావాల్సింది ఏముంటుంది? తృప్తిపడని వారు సప్తద్వీపాలు దాటినా కూడా సంతోషించలేరు. మనకు లభ్యం అయినదానితో తృప్తిపొందితే ఆ ఆనందాన్ని మించింది ఎక్కడా ఉండదు. నా వనవాసగమనానికి కైక మాతయే కారణం అని తలచకు. దైవనిర్ణయం లేనిదే ఆమె ఇలా మాట్లాడడానికి సాహసించేది కాదు' అని శ్రీరాముడు లక్ష్మణుని అనునయించాడు.

* * *

లక్ష్మణుని ప్రతాపం

సర్గ - 23

శ్రీరాముడు చెప్పే దైవశక్తి ప్రభావాన్ని ధర్మాచరణ ప్రాముఖ్యాన్ని విన్న లక్ష్మణుని మనస్సు సుఖదుఃఖాల మధ్య కొట్టుకులాడింది. ఒకవైపు సంతోషం, మరోవైపు దుఃఖం లక్ష్మణుని కుదిపేశాయి. ఓ కంట నీరు మరోకంట పన్నీరు స్రవించింది. కోపంతో సౌమిత్రి ముఖం బుసకొట్టే నాగుపాములాగా కనిపించింది. 'ఓ రామచంద్రా! మీరు క్షత్రియులలో శూరులు గదా! తండ్రి ఆజ్ఞను మీరితే ధర్మగ్లాని జరుగుతుందని అనుకుంటున్నారా? మీరు అధర్మంగా రాజ్యాన్ని పాలిస్తే ప్రజలందరూ అధర్మవర్తనులు అవుతారని ఆలోచిస్తున్నారా? ఇలాంటి దానిని దైవప్రేరణ అనడం కేవలం అసమర్థులు చేసేపని. చేతకానితనాన్ని దైవ నిర్ణయమని అందరూ అనుకొంటారేమోగాని శూరులైన మీరు అలా యోచించడం తగదు. పాపకృత్యాలకు పాల్పడిన కైకేయి దశరథులే అధర్మవర్తనులు. ఇదంతా వారిద్దరూ కలిసిచేసిన కుటిలయత్నం అని నాకు అనిపిస్తోంది.

అలాకాక పోయినచో ఎప్పుడో ఇచ్చిన వరాలను ఇప్పుడు అడగడం ఏమిటి? ఇదంతా అసమంజసం. ద్రోహచింతనతోనే మహారాజు ఈ పనికి ఒడిగడినట్లు నాకు అనిపిస్తుంది. కైకేయి చేతిలో కీలుబొమ్మవలె ఆడే మహారాజు మాటలను వినవలసిన అవసరం నాకు కనిపించడంలేదు. కైకేయి దశరథులు ఇద్దరూ స్వార్థపూరితులు అయ్యారు. దానివలనే విశ్వాసద్రోహాన్ని తలపెట్టారు. అటువంటి పనిని ఎదుర్కొవడం వీరోచితలక్షణం. ఇటువంటి పనిని నీవు దైవనిర్ణయం అని భావించడం అవివేకం. పిరికివారు పరాక్రమహీనులు దైవం మీదకు నెట్టివేసి బాధ్యతనుంచి తప్పుకొంటారు. సమర్థుడైన వాడు అనుకోని సంఘటనలు ఎదురైనా వానిని వీరోచితంగా ఎదుర్కొని అనుకున్న పనిని సాధించి తీరుతాడు. అదే బుద్ధిమంతుల లక్షణం.

నేడు దైవశక్తి – పురుషుని సామర్థ్యం అనువాటిని నేను తెలియపరుస్తాను. నేడు దశరథుని ధిక్కరించి కైకేయి ఆటలుకట్టించి వేస్తాను. దైవశక్తి పురుషప్రయత్నానికి తలవంచి తీరుతుంది అని నేను చేసి చూపిస్తాను. సమస్త దిక్పాలురు, ముల్లోకాలలో సాటిలేని వీరులు నాకు ఎదురు వచ్చి మీ పట్టాభిషేకాన్ని ఆపినా, వారినందరినీ ఎదిరించి నేను పట్టాభిషేకమహోత్సవాన్ని జరిపించి తీరుతాను.

అన్నా! కైకమ్మ ఆశను వమ్ముచేస్తాను. దశరథుని ఆట కట్టిస్తాను. మీరు ఏ మాత్రం చింతించకండి.నా ధాటికి దైవం నిలువలేదు. వారిద్దరూ దుఖంలో మునగక తప్పదు. ఓ రామచంద్రా! మీరు వేలకొలది సంవత్సరాలు భూమిని పరిపాలించండి. మీరు వానప్రస్థాశ్రమానికి వెళ్లిన తరువాత మీ కుమారులు ఈ రాజ్యాన్ని పాలిస్తారు.

ప్రజాక్షేమంకోసం పూర్వం రాజులందరూ చేసినపనే ఇది. వారు నిస్సంగులై ప్రజలను బాగుపరచడానికి అహర్నిశం కష్టపడేవారు. వారి జీవితాన్ని ధారపోసేవారు. శ్రీరామా! మన తండ్రి సంప్రదాయానుసారంగా వనాలకు ఏగి మీకు రాజ్యభారాన్ని అప్పగించాలి. అలా ఆయన చేయడం లేదు. కనుక మీరు భుజబలంతో రాజ్యాన్ని చేజిక్కించుకొనాలి. అప్పుడు ప్రజలలో భేదభావాలు తొంగిచూస్తాయేమోనని మీరు అనుమానపడుతున్నట్లున్నారు. మీరు ఏ మాత్రం ఆలోచించక్కరలేదు. నేను సదా మీ ఆజ్ఞానువర్తినై మమ్ము ఎల్లప్పుడు రక్షిస్తుంటాను. ఏనాడు మిమ్ము విస్మరించను. నేను చేసిన ప్రతిజ్ఞను మీరినట్లయితే వీరస్వర్గానికి నేను అనర్హత పొందిన వాడినవుతాను.

అన్నా! మీరు మంగళప్రదులై పట్టాభిషేకానికి ముందుకు నడవండి. ఇక్కడకు వచ్చిన భూపతులెవరైనా మిమ్ము ఎదురిస్తే వారిని నేను అరికడతాను. నా ధనుస్సు ఖడ్గం నాకు ఆభరణాలు కావు. నేను శత్రు నిర్మూలనం కొరకై సర్వదా అప్రమత్తుడనై ఉంటాను. వజ్రాయుధాన్ని ధరించి ఇంద్రుడే మిమ్ము ఎదిరించవస్తే వానిని నేను యమపురికి పంపుతాను. సమస్తరాజానీకం ఎదిరించినా నేను వారికి తగిన బుద్ధి చెప్తాను. సమరభూమిలో చతురంగబలాలను మట్టికరిపిస్తాను. దుర్గమమైన అరణ్యంలాగా ఈ భూమిని నేను చేయగలను. చేతులకు కవచాలు వేసుకొని ధనుస్సు చేబూని నేను నిలిచి ఉండగా మరొక మొనగాడు మీ ఎదురుగా నిలవలేడు.

ఓ ప్రభూ! అధర్మాన్ని అరికట్టించి మీరు ధర్మప్రభువుగా వర్ధిల్లండి. దానికై నేను నా అస్త్రప్రభావాన్ని ప్రకటిస్తాను. అప్పుడు మీకూ మన తండ్రికి కూడా నా సామర్థ్యం తెలుస్తుంది.

ఇంతవరకు నా చేతులు ఆభరణాదులను మోయుపనే చేశాయి. సంపదలను దానం ఇవ్వడంలోనే హస్తాలు పనికి వచ్చాయి. సజ్జనులను కాపాడడంలోనే నా భుజాలు ఉపయుక్తం అయ్యాయి. నేడు నా పూర్వజన్మ సుకృతం వల్ల మీ పట్టాభిషేక సంబరంలో పాల్గొంటాయి.

ఓ రామా! మీరు ఈ భూమండలాన్ని ఏలడంలో నేను ఏమేమి చేయాలో నాకు ఆజ్ఞనివ్వండి. మీ మిత్రులను ఆదరించడం, మీ శత్రువులను అనాదరించడంలో నాకు పని కల్పించు' అంటూ రోషావేశపరుడై పలుకు లక్ష్మణుని మాటలు రాముడు విన్నాడు. కన్నులలో నీరునిండి స్రవించే స్థితినిచూసి రాముడు లక్ష్మణుని చెంత చేరాడు. కనులనీరు తుడిచాడు. 'లక్ష్మణా! తల్లిదండ్రుల ఆనందాన్ని చేకూర్చేవానిగా నన్ను చూడు. తల్లిదండ్రుల మాట మన్నించడమే సత్పురుషుల లక్షణం. అదే నేను నీవు చేయవలసిన పని. ఉద్రేకపడకు' అంటూ లక్ష్మణుని శాంతపరిచే మాటలు రాముడు చెప్పాడు.

* * *

కౌసల్య అనునయం

సర్గ - 24

ధర్మపరాయణుడైన కొడుకును చూసుకొని కౌసల్య మురిసిపోయింది. దశరథుని ప్రేమవల్ల పుట్టిన ఈ ధర్మనందనుడు సుకుమారుడు గదా? ఎన్నడూ దుఃఖాన్ని చవి చూడలేదు గదా? నేడు పద్నాలుగేండ్లు మౌనిలాగ ఎలా సంచరించగలడు? నా చిట్టితండ్రి అని పదే పదే కౌసల్య మథనపడింది.

సర్వులకు ప్రాణప్రదుడైన నా చిన్నవాడు అడవులకు వెళ్తున్నాడని అంటే ఎవరు నమ్ముతారు. ఇక్కడ అందరూ మృష్టాన్న భోజనాన్ని ఆరగిస్తుంటే శ్రీరాముడు కందమూలాలు భక్షించాలి కదా! అని ఆవేదన చెందింది. 'ఓ రామచంద్రా! ఇనకులవంశాన్ని ఉద్ధరించే నీవు అడవుల పాలు కావడం నిజంగా విధే. విధిని ఎదిరించడానికి, నిలవరించడానికి ఎవరికీ శక్తిలేదు. ఆ పరమాత్మ ఆడినట్లు ఆడే తోలుబొమ్మలమే మనమందరం' అంటూ కౌసల్య తన అశక్తతను నిర్ధారించుకొంది.

'కుమారా! రామా! నీ నిర్ణయం నాకు సమంజసంగానే తోస్తోంది. కాని, నీవు నన్ను విడిచి వెళ్లడం అనేది నేను భరించలేకుండా ఉన్నాను. నీవు కనిపించకుండా ఉన్నట్లు అయితే నన్ను నా శోకాగ్నే దహించి వేస్తుంది. నిన్ను మరల ఎప్పుడు చూస్తానో అనే చింత, గ్రీష్మతాపానికి పొదలు కాలినట్లు నన్ను కాల్చివేస్తుంది.

నాయనా! తండ్రీ!దూడను వెంబడించి ఆవు వెళ్లినట్లు నేను నీతో వస్తాను. కోడి తన పిల్లలను అంటి పెట్టుకుని తిరిగినట్లు నేను నిన్ను కాపాడుకొంటాను. నేను నీతో వస్తాను' అంటూ కౌసల్య దుఃఖించింది.

'అమ్మా! మీరు చింతించవలసిన పనిలేదు. మీరు నాతో వచ్చినట్లు అయితే నాన్నగారిని ఎవరు చూస్తారు? అసలే కైక వల్ల ఆయన వంచితులై ఉన్నారు.

మీరు కూడా నాతో వస్తే మహారాజును చూసేవారు ఎవరైనా ఉంటారా? భర్తకు సేవచేయడం భార్య ధర్మం కదా. మరి నా తండ్రిని వదిలి మీరు నాతో వస్తానని అనడం సముచితమా?' అని శ్రీరాముడు తన తల్లికి జ్ఞానాన్ని ఉద్దీపనం చేశాడు.

'రామా! తండ్రి మాటను శిరసావహించినవాడు తన తనయుడని అంటే ఏ తల్లి హర్షించదు రామచంద్రా? నీ మాటలతో నా కడుపునిండింది'– అని అంది కౌసల్య. తల్లిసంతోషవచనాలు శ్రీరాముడు విన్నాడు. సంతోషంతో 'అమ్మా! నా తండ్రి సర్వసమర్థులు. మీకు, నాకు ప్రజలకు అందరికీ ప్రభువు, మహారాజు. ఆయనను నొప్పించకుండా ఉండడం మనధర్మం' అని శ్రీరాముడు చెప్పాడు.

'అమ్మా! మీ ఆజ్ఞతో పద్నాలుగు సంవత్సరాలు వనాలలో గడిపి తిరిగి మీ చెంతకు వస్తాను. అప్పుడు మీరుకోరినట్లుగా నేను చేస్తాను.' అని చెప్పే శ్రీరాముని చూసి కౌసల్య బొటబొట కన్నీరుగార్చింది. 'నాయనా! రామచంద్రా!ఈ సవతుల మధ్య నేను ముదిమి వయస్సులో ఉండి అగచాట్లు పడలేను. నీతోకూడా నేను వస్తాను'

అంది. కుమిలిపోతున్న కౌసల్యను చూచి రాముడు దుఃఖించాడు. 'అమ్మా! పతిని అనుసరించి సతి ఉండడమే సంప్రదాయం గదా. మీరు వృద్ధుడైన నా తండ్రిని వదిలి నాతో వస్తే ఏం జరుగుతుందో ఆలోచించటం లేదు. భరతుడు ధర్మాత్ముడు. అతని అండలో మీకు ఏ లోటూరాదు. భరతునికీ నాకూ ఏమీ తేడాలుండవు. నాకంటే ప్రేమ పూర్వకంగా మిమ్ము గౌరవిస్తాడు.

వయస్సు పైబడిన నా తండ్రి నన్ను విడిచి ఉండడానికై పరితపిస్తారు. నేను లేనని చింతించే నా తండ్రిని మీరు సర్వవేళలా నీడలాగా ఉండి సేవించండి. 'మీరు నమ్మే ఆ పరమాత్మను ఎంతగా ఆరాధించినా, ఉపవాసాలు చేసి, వ్రతాలుచేసి సంపాదించుకునే పుణ్యం కన్నా భర్తను అనురాగంతో చూసుకునే భార్యే ఎక్కువ పుణ్యాన్ని సంపాదించుకోగలదు' అని మీకు తెలియదా అమ్మా? దేవతలను ఆరాధించకుండా ఉన్నను, బ్రాహ్మణులను గౌరవించకున్నను, భర్తకు సేవలొనరించిన స్త్రీకి సద్గతులు కలుగుతాయి కదా.

భర్తను గౌరవించడం, వారి హితాన్ని కోరుకోవడం లాంటివి స్త్రీల ధర్మాలు అని శాస్త్రం, వేదం చెప్తున్నాయి. అమ్మా! నేను బాగుండాలని మీరు దేవుణ్ణి ఆరాధించండి, విప్రులను గౌరవించి వారి ఆశీర్వాదాలను పొందండి, నియమనిష్ఠలతో కాలం గడపండి. పతిసేవే పరమ ధర్మం అని సేవచేయండి. ఇలా మీరు కాలం గడుపుతూ ఉంటే నేను నా వనవాసదీక్షను ముగించుకొని త్వరలో మీ దగ్గరకు వస్తాను' అని శ్రీరాముడు తల్లిని ఓదార్చాడు. 'రామచంద్రా! మీ నిర్ణయాన్ని మార్చే శక్తి నాకులేదు. శుభంగా వెళ్లి వనాలలో ఆపదలు కలుగకుండా జాగ్రత్తలు తీసుకొని జాగ్రత్తగా వెళ్లిరమ్ము'

'ఓ రామా! నీవు పరాక్రమంతో వనవాసదీక్ష ముగించుకుని వచ్చినప్పుడు నా కన్నా ఆనందించేవారు ఎవరూ ఉండరు. నీ తండ్రిని నీవు ఋణవిముక్తి కలిగించినవాడవు అవుతావు. అప్పుడే నాకును శాంతి లభిస్తుంది. విధినిర్ణయం బలీయమైనది, అనూహ్యమైనది. దానిని తెలుసుకొనడానికి ఎవరితరం కాదు కదా! మనం ఒకటి తలచిన దైవం మరొకటి తలచినట్లువుంది.

వనవాసదీక్షాబద్ధుడై వెళ్లి తిరిగివచ్చే కాలం ఎప్పుడు వస్తోందో? అది ఇప్పుడే వచ్చిన ఎంత సంతోషం కలుగుతుందో కదా' అని కౌసల్య అంది.

వనాలకు వెళ్లాలనే కృతనిశ్చయంతో ఉన్న ఆ రామునికి శుభపరంపరలు కలగాలని కౌసల్య ఆశీర్వదించింది.

* * *

కౌసల్య శుభాశీస్సులు

సర్గ - 25

రాముని నిర్ణయం తెలుసుకొన్న కౌసల్య దుఃఖాన్ని వదిలింది, ఆచమించింది, రామునకు శుభాశీస్సులను పలికింది. 'ఓ రఘుకుల రామా!నీవు పద్నాలుగేళ్లు క్షేమంగా వెళ్లి లాభంగా తిరిగి వత్తువుగాక!' అని ఆశీర్వదించింది.

'నీవు సర్వదా ఆచరించే ధర్మమే నిన్ను తప్పక కాపాడుతుంది. నీ వనవాసకాలాన నాలుగు మార్గాలు కలిసే కూడలిలోని దేవతలను, దేవాలయాలను నీవు సందర్శించి వారికి నమస్కరించు. వారు సర్వదా నిన్ను కాపాడతారు.

మునిశ్రేష్ఠుడైన కౌశికుడు నీకు ఇచ్చిన అస్త్రశస్త్రాదులు నీకు రక్షణ కవచాలై ఉంటాయి. నీ సత్యవాక్ పరిపాలన నీ మాతాపితల సేవ నిన్ను రక్షిస్తాయి. వనాలలో వుండే వనచరాలు, జలచరాలు, చిత్రవిచిత్రాలైన దేవపూజా ప్రవేశాలు, యజ్ఞానికి ఉపకరించే సమిధలు, దర్భలు, అగ్నివేదికలు, ఇలా అన్నీ రక్షించేవిగా వుంటాయి.

దిక్పాలురు, మరుత్తులు, విశ్వదేవతలు, సాధ్యులు, పూషుడు, భగుడు లాంటి ఆదిత్యులు, లోకపాలురు, ఇంద్రాది దేవతలు నీకు శుభాలు కలుగచేస్తారు. సంవత్సరాలు, ఋతువులు, మాసాలు, కాలాలు, కళలు, కాష్ఠలు (కాష్ఠా= 18 రెప్పపాట్ల కాలం, కళ అనగా 30 కాష్ఠలకాలం) దివారాత్రాలు, ముహూర్తాలు, ఆయా అధిష్ఠాన దేవతలు నీకు చేదోడు వాదోడుగా వుంటూ నిన్ను సర్వదా రక్షిస్తారు.

కుమారా! సప్తసముద్రాలు అష్టదిక్కులు, కుబేరుడు, ఆకాశం, అంతరిక్షం, భూమి, సకలనదులు, నక్షత్రాలు, గ్రహాలు, గ్రహదేవతలు సంధ్యాదేవతలు వనవాసివై వున్న నిన్ను రక్షిస్తారు.

నీవు అరణ్యాలలో సంచరించేటపుడు, భయంకరాకారులు, రాక్షసులు, మాంసభక్షకులు, భూతాలు, పిశాచాలు, పక్షులు, క్రిమికీటకాలు, తేళ్లు, జెర్రులు, దోమలు, కోతులు నిన్ను బాధించకుండా ఉంటారు.

శ్రీరామా! సింహాలు, వ్యాఘ్రభల్లూకాలు, అడవిదున్నలు నీకు అపకారం చేయకుండా కాపాడతాయి. నరమాంసభక్షణ చేసే జంతువులు, రాక్షసులు నేను చేసే భూతబలితో సంతృప్తిచెంది నిన్ను రక్షిస్తారు. నీవు వెళ్లే మార్గాలన్నీ సుగమాలై నీకు అడ్డు లేకుండా చేస్తాయి. నీకు వనవాసకాలంలో శత్రుభయం లేకుండా ఉంటుంది.

నాచే పూజ లందుకొనే దేవతలు నిన్ను సర్వదా రక్షిస్తారు. సర్వలోకరక్షకులైన శివకేశవులు నిన్ను కాపాడతారు' అంటూ కౌసల్య ఆయా దేవతలకు తదితరులకు పువ్వులను సమర్పించి వేడుకొంది.

శ్రీరాముని మంగళార్థం కౌసల్య హోమాన్ని విప్రులతో చేయించింది. ఆ బ్రాహ్మణోత్తములను దానాలచే సంతోషపెట్టింది. వారందరూ రామునకు దిగ్విజయం కలగాలని ఆశీర్వచనాలు చేశారు. శాంతిహోమాన్ని చేయించింది. ఇంకా మనస్సును ఊరుకోబెట్టలేక రాముని ఇలా దీవించసాగింది కౌసల్య.

'ఓ రామచంద్రా! నీకు మంగళమగుగాక! గరుత్మంతుని ఆశీర్వదించిన వినత మంగళములు, వృత్రాసుర సంహారమునకు వెళ్లే ఇంద్రునకు లభించిన మంగళాశీస్సులు, అమృతాన్ని సృజించే సమయంలో దైత్యులపై అధికారాన్ని కోరే ఇంద్రునికి అదితి ఇచ్చిన ఆశీర్వచనాలు, మూడడుగులతో ముల్లోకాలను ఆక్రమించిన వటునకు అందిన ఆశీర్వాదాలు, అన్నీ నీకు లభిస్తాయి.'

ఇలా కౌసల్య ప్రతి వస్తువు నుంచి రామునకు శుభం జరగాలని మార్గం సుమార్గం కావాలని ఆశీర్వదించింది. అంతేకాక విశల్యకరణి అనే ఓషధిని రక్షగా కట్టింది. అక్షతలు చల్లి కుమారుని దీర్ఘాయుష్మంతుడు కావాలని దీవించింది.

దుఃఖమగ్నమైన మనస్సుతో రాముని పదేపదే కౌగిలించుకొని ముద్దాడింది. శిరస్సుపై ముద్దిడింది. 'కృతనిశ్చయంతో వెళ్లే రామా! కృతకృత్యుడవై పూర్ణాయుష్షుతో కీర్తిమంతుడవై వేగంగా తిరిగి వస్తావు. వనవాసానంతరం నీవు అయోధ్యను పాలిస్తావు. ఆ దినంకోసం నేను ఎదురుచూస్తాను. రాజ్యాధికారాన్ని చేపట్టినరోజు రాహుముఖం నుంచి బయటపడ్డ చంద్రునిలాగా నేను నిన్ను చూసి సంతోషిస్తాను.

పట్టాభిషిక్తుడవై సీతను సంతోషపెట్టు. నన్ను కృతార్థురాలిని చేయి. నేను నిత్యం పూజించే విష్ణువు, శివుడు సమస్త దేవతాగణం నిన్ను సర్వవేళలా సర్వావస్థలయందు కాపాడుతారు.' ఇలా అంటూ కౌసల్య రాముని చుట్టూ రక్షణ ప్రదక్షిణలు చేసింది. ఆశీర్వాదాలు పొంది సహజ సుందరుడైన రాముడు సీతానివాసానికి బయలుదేరాడు.

* * *

సీతారాముల సంభాషణ

సర్గ - 26

శ్రీరాముడు కౌసల్యనుంచి అనుమతి తీసుకొన్నాడు. అరణ్యవాసానికి బయలుదేరాలనుకొన్నాడు. తన సహచరి ఐన సీతతో ముచ్చటిద్దాం అనుకొన్నాడు. అలా అనుకొని సీతానివాసానికి వెళ్లాడు. పట్టాభిషేకాన్ని చూడడానికి వచ్చిన బంధువులతో సీత నివాసం క్రిక్కిరిసి ఉంది. వారినందరిని చిరునవ్వుతో పలకరిస్తూ సీత మందిరంలోకి రాముడు అడుగుపెట్టాడు. అల్లంత దూరంనుంచే రాజలాంఛనాలు లేని రాముడిని సీత చూసింది. అనుమానపడింది, దుఃఖార్తితో వెలవెలబోయే రాముని ముఖాన్ని చూసి ఆమె దుఃఖించింది. దీక్షాబద్ధురాలై ఉపవాసాది క్రియలలో ఉన్న సీత రాముణ్ణి చూసింది. చంచల మనస్సుతో రాముడిని సీత చూడగానే రాముడు దుఃఖం ఆపుకోలేకపోయాడు.

కన్నులు చెమ్మగిల్లాయి. కంఠం జీరపోయింది. వందిమాగధులచే ప్రశంసలు అందుకొనే మీరు ఎందుకని చింతిస్తున్నారు అంటూ ధర్మవర్తనురాలైన సీత అడిగింది. 'స్వామీ! పట్టాభిషేక శుభసమయంకోసం వీక్షించాల్సిన మీ మోము ఎందుకు వడలిపోయింది? ఈ దుఃఖాశ్రువులకు చోటు ఎందుకు కల్పిస్తున్నారు? మీ రాచమర్యాదను చూపే శ్వేతచ్ఛత్రం మీకు నీడను కల్పించడం లేదేమి?

రాజ్యలక్ష్మిని చేపట్టబోయే మిమ్ములను వింజామరలతో సేద తీర్చడం లేదేమి? విప్రోత్తములు తమ వేదవిధులను ఆచరించడం లేదేమి? తేనె, పెరుగు లాంటి వాటితో మిమ్ము అభిషేకించడం లేదేమి? నాలుగు గుర్రములను పూన్చి పూలతో అలంకరించిన మీ పుష్యరథాన్ని వీడి, మీరు పాదచారులై రావడానికి కారణం ఏమి? సర్వశుభలక్షణ ఐన మీ భద్రగజం మిమ్ము అనుసరించడం లేదేమి?

పట్టాభిషేకసన్నాహములు అన్నీ సంపూర్తి అయ్యాయికదా! మరి దివ్యశోభలతో విరాజిల్లాల్సిన మీ మోము కళావిహీనం చెందింది. దీనికి కారణం నాకు కనిపించడంలేదు' అంటూ భర్త విచారాన్ని తట్టుకోలేని సాధ్వీమణి సీత భర్తను పరిపరివిధాల అనునయిస్తూ అడిగింది.

తనలో భాగమైన సీతను చూచి రాముడు తన తండ్రి ఆజ్ఞను చెప్పాడు. రాజ్యలక్ష్మిని కాదు వనదేవత చెంత ఉండబోతున్నాననే కఠినమైన విషయాన్ని తేలికగా సీతకు రాముడు చెప్పాడు.

'ఓ సీతా! నీవు ధర్మ చింతన కలదానివి. ఉత్తమ చరిత్ర ఉన్న మీ తండ్రి ఇంట నీవు పెరిగావు. నా వనవాస కారణం చెప్తాను విను' అంటూ ఇలా చెప్పాడు.

'ఓ జానకి పూర్వం దేవాసురసంగ్రామసమయంలో నా తల్లి ఐన కైకకు నా తండ్రి రెండు వరాలు ఇచ్చాడు. ఇప్పుడు నా పట్టాభిషేకం ఏర్పాట్లను కైక చూసింది.

మహారాజైన మా తండ్రి దగ్గర కైక తన వరాలను గుర్తుచేసింది. వాటిని పాలన చేయమని చెప్పింది. ధర్మాన్ని, సత్యభాషణను చెప్పి వరాలను ఈడేర్చమని కోరింది. దానివలనే నేను దండకారణ్యానికి మౌని వేషధారణతో వెళ్లాల్సి వుంది. భరతుడు పట్టాభిషిక్తుడై రాజ్యాన్ని పాలిస్తాడు.

తండ్రి మాటలకు నేను కట్టుబడాలని అనుకొన్నాను. వనవాస దీక్ష తీసుకోబోయే ముందు విషయం నీకు చెప్పాలని వచ్చాను.నేను రాజాజ్ఞ తలదాల్చి అడవులకు వెళ్తాను. నేను లేని సమయంలో కూడా నీవు నా తల్లిదండ్రులను ఆదరించాలి. వారిని యథావిధిగా పూజించాలి. నా తమ్ముళ్లతోను, మరదళ్లతోను ప్రేమాదరాలు పంచిపెడుతూ నీవు జీవించాలి.

భరతుడు రాజ్యాన్ని చేపడతాడు. భరతుని ముందు నీవు ఎప్పుడూ నా గురించి ప్రశంసలు చేయకు. సంపదలు, అధికారం ఉండేవారు ఎదుటివారిని మెచ్చుకోవడం మెచ్చరు.

నీవు ఊర్మిళ శ్రుతకీర్తులకంటే మించిన గౌరవమర్యాదలను ఆశించకు. ఓ వైదేహీ! భరతునిపట్ల కూడా నీవు ఆదరంగానే వ్యవహరించు.

నీవు ఎప్పటి మాదిరిగానే ఉషోదయంలోనే మేల్కో. యథావిధిగా నీ విధులను నిర్వర్తించు, పూజాదికాలు ముగించుకొను, వృద్ధులైన నా తల్లిదండ్రులను ఎల్లవేళలా కనిపెట్టుకొని ఉండి వారిని సదా ఆదరిస్తూ ఉండు. నేను లేని లోటు రానీయక వారికి సంతోషాన్ని కలిగించు. అలాగే సుమిత్రా! కైకలను కూడా సమానగౌరవ మర్యాదలతో వారిని సంతోషింపచేయి.

బంధుజనులను, స్నేహితులను అందరిని గౌరవాభిమానాలతో ఆదరించు. భరతుడు నేటినుంచి ప్రభువు కావున భరతునకు అప్రియం కలిగించే పనులను ఏమీచేయకు. రాజుల మనోభావాలను గుర్తించి అందరూ మెలగాలి.

రాజులు ప్రజాహితం కోసం స్వజనులను సైతం శిక్షిస్తారు. అదేవిధంగా రాజ్యక్షేమాన్ని కోరేవారు సామాన్యులైనా వారిని చేరదీస్తారు. వారికి ఎక్కడ లేని ప్రేమాదరాలను పంచుతారు.

కల్యాణీ! నీవు నీ సతీధర్మాన్ని ఎన్నడు విడిచిపెట్టకు. నీ స్వధర్మాన్ని మరవకు. నేను లేనప్పుడు కూడా నీవు ప్రసన్నవదనంతో సుఖంగా ఉండు' అని శ్రీరాముడు సీతతోపలికారు.

* * *

సీతాదేవి కోరిక

సర్గ - 27

సీతాదేవి సహజంగానే మృదుభాషిణి. తన భర్త దగ్గర అప్రియ వాక్యాలు ఎప్పుడూ పలకదు. కాని నేడు రాముని వాక్యాలు విన్న ఆమె కోపం తెచ్చుకొంది. అయినా తన భర్తతో 'ప్రియా! వీరాధివీరునివై ధర్మాచరణ కలిగిన మీరు ఇలా మాట్లాడడం నాకు సముచితంగా అనిపించడం లేదు. ఈ మాటలు ఆర్యపుత్రులైన మీకు అప్రతిష్ఠను తెచ్చిపెడ్తాయి. "ఓ పురుషశ్రేష్ఠా! మీకు తెలియని ధర్మం ఏమున్నది? ఎవరు చేసికొన్న పుణ్యపాపఫలాలు వారు మాత్రమే అనుభవించితీరాలి. కాని సతీపతుల విషయంలో పతి అనురాగాన్ని సతి పంచుకొన్నట్లుగా అతని పాపపుణ్యాలలో భాగం భార్యకే చెందుతుంది. ఇప్పుడు మహారాజు మిమ్ము వనాలలో నివసించమని ఆదేశించిన, మీలో సగమైన, మీ అర్ధాంగినైన నన్ను వనాలలో నివసించాలనేది ఆయన ఉద్దేశం అయి ఉంటుంది.

ఓ నరశ్రేష్ఠా! స్త్రీకి పతి తప్ప అన్యులెవరూ తోడునీడగా ఉండరు. ఇహపరలోకాలలో స్త్రీకి ఉత్తమ గతులను కల్పించేది ఒక భర్త మాత్రమే. రామా! మీరు ఇప్పుడే దుర్గమారణ్యాలకు పయనం ప్రారంభిస్తే నేనును మీకన్నా ముందుగా నడిచి తీరుతాను. మీ అడుగులలో అడుగులు వేస్తూ కంటకాలను తొలగిస్తూ మీ మార్గాన్ని సుగమం చేస్తాను. మీరు మీలో కలిగే రోషాన్ని త్యజించి నన్ను మీ వెంట రావడానికి అనుమతిని ప్రసాదించండి.

నా తల్లిదండ్రులు నాకు అన్ని నీతులను ఉపదేశించి ఉన్నారు. భర్తను అనుసరించడమే పతివ్రత లక్షణం. ఈ విషయాన్ని మరల మరల నాకు ఎవ్వరూ చెప్పే పనిలేదు. స్త్రీకి మేడలు మిద్దెలో నివసించేకంటే, ఆకాశ పథ సంచారం కంటే, సమస్త సుఖభోగాలననుభవించుట కంటే భర్త అడుగుజాడలలో నడవడమే పరమ పావనం. నేను అడవులలో సైతం మీతో కూడా నివసించగలను. దుర్గమారణ్యాలలోను మీతో కలిసి సుఖాన్ని పొందగలను.

మీతో కలిసి కందమూలాలు భుజించినా మృష్టాన్నభోజనం చేసినట్లు తృప్తి పొందగలను. మీతో కలిసి ప్రకృతిమాత ఒడిలో సేద తీరతాను. నా నిర్ణయాన్ని మార్చగలవారు ఎవరూ లేరు. కావున నన్ను మీవెంట కొనిపొండు,' అంటూ ప్రియంగా సీత రాముని తో చెప్పింది.'ఓ రాజీవనేత్రా! నేను స్థిరవ్రతాన్ని ఆచరిస్తూ తటాకాలలో, సరస్సులలో స్నానమాచరిస్తూ మీతోకూడి హాయి ననుభవిస్తాను. మీ సాంగత్యాన్ని వదిలి నేను జీవించలేను. మీరు లేకుండా స్వర్గసౌఖ్యాలు నాకు లభించినా అవి నాకు నరకతుల్యంగానే ఉంటాయి. రామచంద్రా! నీతో కలిసి దుర్గమారణ్యాలలో సైతం రాజ్యభోగాలను అనుభవించగలను. తృప్తితో కూడిన జీవనం కంటే ఎవరు మాత్రం ఏమి కోరుకొంటారు. నన్ను క్షమించుము, నా కోరిక మన్నించు అంటూ అనేకవిధాలుగా తన దృఢనిశ్చయాన్ని తెలిపే సీతను అడవులలోని అష్టకష్టాలను రాముడు విడమర్చి చెప్పడం ప్రారంభించాడు.

* * *

రాముడు - వనక్లేశాల వివరణ

సర్గ - 28

ధర్మాత్ముడైన శ్రీరామునకు సీతపై అపారమైన ప్రేమ ఉంది. ఆమె వనవాస కోరిక విన్నాడు. వనాలలో ఉండే కష్టాలను సీత భరించలేదని అనుకొన్నాడు. ఆమె సంకల్పాన్ని మరల్చుదామని అనుకొన్నాడు. 'ఓ సీతా! నీవు ఉత్తమవంశసంభూతురాలివి. కనుకనే ధర్మాచరణలో ఆసక్తి నీకు కలిగింది. ఓ జానకీ! నేను చెప్పినట్లు నీవు నడచుకొన్నట్లయితే సుఖాలను అనుభవిస్తావు.

నీ కోరిక నేను నిరాకరించాను. దానికి కారణం చెప్తాను విను,' అంటూ ఇలా చెప్పసాగాడు– 'ఓ మైథిలీ! వనవాసం అత్యంతదుర్భరంగా ఉంటుంది. ఎన్నో మృగాలు, కీటకాలు, పక్షులు, పాములు లాంటి వాటినుంచి నిరంతరం అప్రమత్తులమై వుండాలి. వనచరాల భీకర ధ్వనిని సుకుమారివైన నీవు తట్టుకొనజాలవు. సుగమమైన మార్గం అంటూ అడవులలో ఎక్కడా ఉండదు. ఎక్కడనుంచి ఎప్పుడు ఆపద వాటిల్లుతుందో అని భయపడుతూ జీవించాలి.

సరియైన సమయానికి భోజన సదుపాయాలు అంటూ ఏవీ ఉండవు. సమయానుసారంగా నడిచే మన నిత్యకృత్యాలను సమయానుకూలంగా నిర్వర్తించాల్సి ఉంటుంది. మెత్తని పరుపులపై పడుకొనే నీవు కఠినమైన శిలలపై, ఎండిన ఆకులపై పడుకోవాల్సి ఉంటుంది. పట్టు పీతాంబరాలు ధరించే నీవు నార చీరలు కట్టి తాపసివలె జీవించాల్సి ఉంటుంది. సమిధలను ఏరికూర్చి నిత్యాగ్నిహోత్రిని జరిపించాల్సి ఉంటుంది. దాసదాసీజనంతో అలరారే నీవు ఒంటరిగా నీ పనులను నీవే చేయాల్సి ఉంటుంది. అరణ్యంలో అనుకోని విపత్తులు ఎన్నో ఎదురవుతాయి. వాటిని ఎదుర్కొనే శక్తి కావాల్సి ఉంటుంది. పెనుగాలులు, సెలయేళ్ల రొదలు, క్రిమికీటకాలవల్ల పుట్టే ధ్వని ఒళ్లు గగుర్పాటుకు గురవుతుంది. వీటన్నింటిని ఎదుర్కొంటూ అరణ్యవాసం చేయడం నీకు అసాధ్యం. అనేకరకాల జంతుజాలం అడ్డు అదుపులేక సంచరిస్తుంటాయి. సీతా! నీవు అసలు అబలవు, సౌకుమార్యం గలదానివి. అటువంటి నీవు ఈ క్లేశాలన్నీ తట్టుకొనజాలవు.

రాత్రి పగలు అనే తేడా లేకుండా ఎల్లప్పుడూ అరణ్యంలో జాగరూకులమై తిరగాలి. క్రోధలోభాదులను విడిచి మనస్సును అధీనంలో ఉంచుకోవాలి. ఇంద్రియ నిగ్రహులమై జీవనం సాగించాలి.

వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని నీకు చెప్తున్నాను. నీవు కష్టాలను కొనితెచ్చుకోక రాజాంతఃపురంలోనే కాలం గడుపు' అంటూ శ్రీరాముడు అరణ్యవాసంలో వుండే క్లేశాలను పూసగుచ్చినట్లు చెప్పాడు.

తన రాకను సమ్మతించకపోవడంతో సీత అమితంగా దుఃఖించింది. ఆమె ఇలా చెప్తోంది.

* * *

సీతాదేవి మనస్సులోని మాట

సర్గ - 29

రాముడు చెప్పిన మాటలన్నీ సీతలో దుఃఖాన్నే కలుగచేశాయి. దుఃఖాశ్రువులతో సీత 'రామచంద్రా! మీరు చెప్పినవన్నీ నిజములే. అరణ్యవాసం బహుకష్టంగానే ఉంటుంది కానీ మీరు ఒక విషయాన్ని గమనించడంలేదు. మీ సాహచర్యంలో నాకు అష్టకష్టాలుగాని, దుర్గమారణ్యాలు కాని, భూతల స్వర్గాన్ని తలపిస్తాయి. అదేవిధంగా మీ సాన్నిహిత్యం లేనినాడు స్వర్గం కూడా నరకప్రాయంగా నాకు అనిపిస్తుంది.

వనవాసకాలాన కనిపించే మృగాలు, పక్షులు అడవి జంతువులు అన్నీ నీ రూపాన్ని చూచి పారిపోతాయి. భయకారణాన్నే చూసి భయపడనివారు ఎవరైనా ఉంటారా? మీ నీడలో సంచరించే నన్ను చూచి దేవతల రాజైన ఇంద్రుడు కూడా భయపడతాడు. మీ సాహచర్యం నన్ను భయరహితగా చేస్తుంది.

మా తండ్రి నన్ను మీకు కన్యాదానం చేశాడు. అప్పుడు నా తల్లిదండ్రులు, హితులు చెప్తూ మిమ్మల్ని నేను సదా అనుసరించి ఉండమని చెప్పారు. సుఖదుఃఖాలలో సమవర్తివై మెలగమని నన్ను వారు ఆజ్ఞాపించారు. అటువంటప్పుడు నేను మిమ్మలను ఎలా వదలి రాజభోగాలను అనుభవించగలను.

మీరు లేకుండా నేను జీవించడం అసాధ్యం. మీకు తెలియని విషయం ఒకటి చెప్తాను. నేను కన్యగా ఉన్నప్పుడు నా జాతక విశేషాలను వివరిస్తూ బ్రాహ్మణోత్తములు నేను వనవాసం చెయ్యాల్సి వస్తుందని చెప్పారు. హస్తసాముద్రికవేత్తలు సైతం నేను వనవాసం అనుభవిస్తానని చెప్పారు. మరి ఆ దైవజ్ఞుల మాట పొల్లు పోదు గదా. జ్యోతిష్యసాముద్రికశాస్త్రాలన్నీ భవిష్యవాణి వినిపించే ఉన్నాయి. కష్టాల గురించి తెలియనివారికి అవి బాధలు కలుగజేస్తాయి. నాకు కష్టాల గురించి అన్ని వివరాలు తెలుసు. అవి నాకు బాధలను కలుగజేయవు.

నేను మీ దగ్గరకు వచ్చిన తర్వాత గంగాతీరప్రాంతంలో నివసించాలనే నా కోరికను మీకు చెప్పి ఉన్నాను గదా. శూరుడివైన నీ సమక్షంలో నేను కష్టాలను సుఖాలుగా చేసుకోగలను. పతిసేవా భాగ్యంలో నేను పాపాలను పోగొట్టుకొని పవిత్రురాలిని అవుతాను. నాథా! నా కోరికను మన్నించి నన్ను నీతో రావడానికి అనుమతిని ప్రసాదించండి. ఇంతగా ప్రాధేయపడినను నన్ను మీరు నిరాకరించినచో విషం త్రాగి లేక అగ్నిలో ప్రవేశించి ఐనా నేను నా దేహాన్ని త్యజిస్తాను.'అంటూ కన్నీరు కారుస్తూ సీతాదేవి భర్త అనుమతిని పొందలేక దుఃఖంతో కుమిలిపోయింది. సీతాదేవి వనగమనాభిలాషను తుంచివేయాలని ప్రాజ్ఞుడైన శ్రీరాముడు యత్నించాడు.

* * *

సీత కోరిక మన్నింపు

సర్గ - 30

శ్రీరాముని అంగీకారాన్ని పొందలేని సీత కుపిత అయింది. ఏ విధంగానైనా శ్రీరాముని అనుసరించాలని తీవ్రంగా అనుకొన్నది. దానికై ఇలా శ్రీరామునితో పలుకుతోంది. 'ఓ రామా! మీరు నన్ను ఇక్కడనే వదిలి వనవాసానికి వెళ్ళినట్లయితే నా తండ్రి మిమ్మల్ని అనుమానిస్తాడేమో. అంతేగాక మీరు పరాక్రమహీనులని లోకులు భావిస్తారేమో. వారందరు మీలో తేజస్సు లేదని అనుకొందురేమో. అది అనృతమైనను నాకు బాధ కలుగుతుంది కదా. మిమ్ము ఎవరైనా అవమానించినచో నేను తట్టుకొనలేను.

మీరు మనస్సులో ఏదో సంశయం పెట్టుకొని నన్ను తీసుకొని వెళ్ళడానికి సందేహిస్తున్నారు. ఓ మహావీరా! పతివ్రత ఐన సావిత్రి సత్యవంతుని అనుసరించినట్టు నేను మిమ్మల్ని అనుసరిస్తాను. నేను పరపురుషుని నీడను భరించలేను. సర్వావస్థల్లో మిమ్మే ధ్యానిస్తూ ఉంటాను. నేను మిమ్ము ఆశ్రయించి ఉన్నాను. మీ ఆజ్ఞ సదా పాలిస్తాను. నాపై మీరు కినుక వహించవద్దు. నన్ను పరులపాలు చేయడం తగదు. మీరు మీ తల్లిదండ్రులకు ఎల్లప్పుడు విధేయులై ఉంటూ వారికి సేవలు చేయవచ్చు. మీ చెంత నేను ఉండి వారికి సేవలు చేస్తాను. కాని మీరు లేకుండా నన్ను వారి సేవకు నియమించడం అనుచితకార్యం అనిపించుకొంటుంది. మిమ్ము అనుగమిస్తూ వెళుతున్నప్పుడు నాకు దారిలో ఎదురయ్యే ముండ్లు, రెల్లు గడ్డి దుబ్బలు అన్ని దూదిపింజల్లాగా అనిపిస్తాయి. మీ సాహచర్యంతో దుమ్ము, ధూళి చందనాదులలాగా సంతోషింపజేస్తాయి. మీతో గూడి కఠినశిలలపై నిద్రించినా అవి నాకు పట్టుపరుపులపై నిద్రించినప్పుడు వచ్చే ఆనందాన్ని ఇస్తాయి.

మీరు స్వయంగా నాకు ఇచ్చే కందమూలాలే అమృతతుల్యంగా అనిపిస్తాయి. మీ వనవాస కాలాన మీతో ఉండుటకు అంగీకరిస్తే మిమ్ములను ఏ విధంగాను కష్టపెట్టను. తల్లిదండ్రులను గాని, అత్తమామలనుగాని, గృహ సౌకర్యాల కోసం గాని మిమ్ము బాధించను. నా వలన మీకు సుఖమే కలుగుతుంది కాని దుఃఖానికి హేతువు కాదు. నన్ను పోషించడం మీకు భారం కాబోదు. మిమ్ము విడిచి నేను ఎక్కువ కాలం జీవించలేను. అందుకే మీరు నన్ను తీసుకొని వెళ్ళినట్లయితే నేను ఇప్పుడు నా జీవితానికి అంతిమగీతం పాడడమే మేలని భావిస్తాను.'

ఇలా చెప్తూ భర్తను విడిచి ఉండలేక భార్య అయిన వైదేహి రాముని ఆలింగనం చేసుకొని బిగ్గరగా రోదించింది. విషపూరితశరాల తాకిడి తగిలిన ఆడు ఏనుగువలె సీత ఎంత సేపటినుండో ఆపుకొన్న దుఃఖాన్ని వెళ్ళగక్కింది.

ఆమె నేత్రాంచలాలనుండి కారే స్వచ్ఛమైన కన్నీరు పద్మంనుండి జాలువారే ఉదకాన్ని తలపించింది. విశాలనేత్రి అయిన సీత ముఖం నీటినుండి దూరం చేసిన తామరపూవులాగా వాడిపోయింది.

దుఃఖించుచున్న సీతను శ్రీరాముడు తన బాహువుల్లో పొదువుకున్నాడు. 'ఓ ప్రియా! నీవు దుఃఖిస్తూండగా స్వర్గమే నాకు లభించినా అది నాకు అప్రియాన్నే కలుగజేస్తుంది. నీవు చింతించడం నేను చూడలేను. బ్రహ్మ

నాకోసమే నిన్ను సృష్టించినట్లుంది. అందుకే వనవాసకాలాన కూడా నిన్ను వదలి ఉండలేను. అభిమానధనుడు తన పౌరుషాన్ని ఏ విధంగా విడవలేడో ఆ విధంగానే నేనును నిన్ను విడిచి ఉండలేను.

ఓ ప్రియబాంధవీ! సువర్చల సూర్యుని అనుసరించినట్టుగా నేను ధర్మాన్ని ఆశ్రయించే ఉంటాను. నా తల్లిదండ్రులు గురువులే నాకు ప్రత్యక్ష దైవాలు. వారి మాటను కాదని నేను ఏమీ చేయలేను. తల్లిదండ్రుల సేవను మించిన పుణ్యప్రదమైన పని మరి ఏదీ ఈలోకంలో లేదు. తల్లిదండ్రుల సేవలొనర్చిన వారికి దేవ గంధర్వ గో బ్రహ్మలోకాలు పాదాక్రాంతం అవుతాయి. అందుకే నేను సత్యధర్మమార్గాన్నే ఆశ్రయిస్తాను. నా తండ్రి ఆజ్ఞాపించినట్లుగానే నేను ప్రవర్తిస్తాను. అదే సనాతనధర్మమని నీకు తెలుసు గదా. నిన్ను అరణ్యానికి నాతో తీసుకొని వెళ్ళి ఇక్కట్లపాలు చేయడం నాకిష్టంలేదు.

కానీ నీవు కృతనిశ్చయురాలివై ఉన్నావు. నాతోనే ఉంటాననే నీ నిర్ణయం నిన్నే కాదు నన్ను, మన ఉభయ వంశ ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తుంది. నాకు నీవు లేనట్లు ఐతే అమృతం కూడా విషతుల్యమౌతుంది.

నీవు నాతో రావడానికి నేను అనుమతిస్తున్నాను. వనవాసానికి ఆలస్యం జరగకుండా ప్రయాణానికి సిద్ధం కమ్ము. కోరి వచ్చిన బ్రాహ్మణులకు భూరిదానాలు చేయుము. భిక్షుకులకు మనస్సు తృప్తిపరచుము. మంచి విలువగల ఆభరణాలు, వస్త్రాలు, క్రీడా వస్తువులు నాకు సంబంధించిన వస్తువులు అన్నీ నీ పోషణలో ఉండేవారికి ఇచ్చివేయి' అంటూ శ్రీరాముడు సీతకు అనుమతిని ప్రసాదించాడు.

భర్త అంగీకారాన్ని పొందిన సీత మనస్సు ఆనందడోలిక అయింది. పారవశ్యం చెందిన మనస్సుతో దానకార్యాలు చేపట్టింది. నిండు మనస్సుతో రత్నాలు మణులు మణిమాణిక్యాలు తదితరాలన్నింటిని బ్రాహ్మణోత్తములకు దానం ఇచ్చింది.

* * *

రామలక్ష్మణ సంవాదం

సర్గ - 31

రాముని వెన్నంటి ఉండే లక్ష్మణుడు సీతారాములు మాడ్లాడినదంతా విన్నాడు. తాను సైతం వారిని అనుసరించడానికి రాముని ఎలా ఒప్పించాలో తెలియక వ్యాకులత పొందాడు. చింతాక్రాంతుడై నీరు నిండిన కన్నులతో రాముని పాదాలను ఆశ్రయించాడు. సీతాదేవిని ప్రార్థించాడు.

'అన్నా మీరు వనాలకు వెళ్ళే స్థిర నిశ్చయాన్ని తీసుకొన్నట్లు ఐతే నేను నిన్ను అనుసరించి అడవులకు వస్తాను. క్రూరమృగాలు, ఏనుగుల గుంపులు, నానావిధ పక్షుల సముదాయాలు, వృక్షాలతో నిండి ఉండే అడవులలో మీరిద్దరూ యథేచ్ఛగా తిరగండి. నేను అహర్నిశం ధనుర్ధారినై మీ వెంట ఉండి మిమ్ము కాపాడుకొంటాను. దీనికి మీరిద్దరూ నాకు అనుమతివ్వండి.

మీ వెంట ఉండే భాగ్యం నాకు దొరక్కపోతే, నాకు త్రిలోకాధిపత్యం, మహేంద్రపదవి లభించినా నేను సంతోషించను. అంతేగాదు పరమపదప్రాప్తి నేను పొందినప్పటికీ దానిని నా మనస్సు అంగీకరించదు.' అంటూ తనకు అనుమతిని ప్రసాదించమని పలువిధాలుగా సౌమిత్రి వేడుకొన్నాడు.

లక్ష్మణుని నిశ్చయాన్ని విన్న శ్రీరాముడు చింతితుడైనాడు. రాముడు లక్ష్మణుని అభిప్రాయాన్ని మార్చడానికి అనేకవిధాలుగా ప్రయత్నించాడు.

రాముని మాటలను అడ్డుకొంటూ లక్ష్మణుడు 'ఓ రామచంద్రా!ఇప్పుడే కదా! మీరు నన్ను మీతో ఉండేందుకు అంగీకరించారు. ఇప్పుడు నన్ను నిరాకరించడానికి కారణం ఏముంది? నావల్ల ఏమైనా అపచారం జరిగిందా? దానికి నేను క్షమాపణలు అడుగుతున్నాను. మీ వనగమనంలో మీకు ఏ సమస్యలు తలెత్తకుండా శ్రేయం కలిగించడంలో నా వంతు కృషి చేస్తాను.' ఇలా చెప్తున్న లక్ష్మణునితో రాముడు ఇలా అన్నాడు. 'లక్ష్మణ కుమారా! నీవు నాకు సోదరుడివే కాదు ప్రియ మిత్రుడవు కూడా. నన్ను నీవు నీడవలె వెన్నంటి ఉంటావని నాకు తెలుసు. కాని నేనును, నీవును వనాలకు వెళ్ళినట్లయితే మన తల్లిదండ్రులను చూసేవారు ఎవరుంటారు? ఓ సౌమిత్రీ! నీవు నన్ను అనుగమించినచో మన తల్లులు కౌసల్యను, సుమిత్రను ఎవరు ఆదరిస్తారు. మన తండ్రి మహారాజు సర్వసమర్థులైనప్పటికీ నేడు కామపరవశుడై కైక ఆజ్ఞాబద్ధుడై ఉన్నాడు.

తండ్రి మాట పాటించి భరతుడు రాజ్యాన్ని చేపడతాడు. కైకమ్మ భరతుని శాసిస్తుంది. ఆమె మాట ప్రకారం రాజ్యాన్నేలే భరతుడు కౌసల్యాదులను ఆదరణ చేయలేడు. వృద్ధుడైన తండ్రిని పట్టించుకోడు. అటువంటప్పుడు నీవు ఇక్కడే ఉన్నచో నీవు స్వయంగా గాని లేక భరతుని ఆజ్ఞానువర్తివై కాని మన తల్లుల ఆదరణలో లోపం జరగనీయవు. మహారాజును మంచి చేసుకొని ఆయన భారాన్ని నీవు మోయగలవు. వనాలలో ఉండే నేను నిశ్చింతగా ఉండగలను. ఒకవేళ నీకు ఇష్టం లేకపోయినా నా కోసం నా మాట విను. ఇక్కడే ఉండి నీ కర్తవ్యాన్ని పాటించు' – అంటూ రాముడు లక్ష్మణుని ఓదార్చాడు.

మాటల నేర్పును, అంతరంగాన్ని తెలుసుకొనే నేర్పరి అయిన లక్ష్మణుడు రామునితో ఇలా మారు పలికాడు. 'అగ్రజా! భరతుడు సైతం ఆదర్శపురుషుడే, ధర్మమూర్తే. భరతుడు కూడా నీవలె కౌసల్యా సుమిత్రలను గౌరవాదరాలతో తృప్తిపరచగలడు. ఏ మాత్రం సంశయంలేదు. అసలు కౌసల్యామాత అధీనంలో వేయి గ్రామాలు ఉన్నాయి. వాటివల్ల వచ్చే సంపదతో ఆమె నాలాంటివారిని వేయిమందిని పోషించగలదు. దానధర్మాలలో పేరెన్నికగల కౌసల్య పోషణకు ఎలాంటి విఘాతం కలుగదు.

నా తల్లి భారాన్ని కూడా కౌసల్యామాత చూడగలదు. నన్ను మీతో రావడానికి అనుమతించి నన్ను ధన్యుడను చెయ్యి రామా' అని లక్ష్మణుడు రాముని భయాందోళనలను నివారించాడు. నావల్ల మీ వనవాసం సులభంగా సాగిపోగలదు. నేను చిన్న గంపను, గునపాన్ని తీసుకొని ధనుర్ధారినై మీకన్నా ముందుగా నడుస్తాను. ఎక్కడనుంచైనా సరే కందమూలములు తెచ్చి మీకు అర్పించి నేను కృతార్థుడనౌతాను. మీరూ వదినా పర్వత చరియలలోను, జలపాత తీరాలలోను సంచరిస్తున్నప్పుడు, మీరు నిద్రిస్తున్నప్పుడు సైతం మీ వెంట ఉండి మిమ్ము సర్వవేళలా

కాపాడుకొంటాను. నన్ను మీరు అనుగ్రహించండి. సకలోపచారాలు చేసి మిమ్ము ఆనందింపచేసే భారాన్ని నాకు కల్పించండి.' అని రాముని లక్ష్మణుడు వేడుకొన్నాడు.

లక్ష్మణుని మాటలు రామునిలో ప్రసన్నతను కలుగజేశాయి. 'లక్ష్మణా! నీ మాటను నేను అంగీకరిస్తున్నాను. నీ వనవాసాన్ని సుమిత్రాదులకు తెల్పి వారి ఆమోదాన్ని పొంది త్వరగా రమ్ము' అని రాముడు చెప్పాడు.

'లక్ష్మణా! జనకమహారాజు చేసిన యజ్ఞసమయంలో వరుణుడు మనకు రెండు దివ్యధనుస్సులను, దుర్భేద్యాలైన రెండు కవచాలను, అక్షయాలైన బాణతూణీరాలను, బంగారు పిడి ఉన్న రెండు ఖడ్గాలను ఇచ్చాడు. వాటిని పూజార్థమై వసిష్ఠమహర్షి ఇంట ఉంచాము. నేడు వాటి అవసరం వచ్చింది. అందుకే నీవు నీ ఆత్మీయులకు వనవాస విషయం తెలిపిన తర్వాత, కులగురువు దగ్గరకు వెళ్ళి ఆ ఆయుధాలను తీసుకొని త్వరగా ఇక్కడికి వచ్చేయి' అని రాముడు లక్ష్మణునికి చెప్పాడు.

సంతోషం పొందిన మనస్సుతో లక్ష్మణుడు రాముడు చెప్పిన పనులను చేయడానికి ముందుకు ఉరికాడు. వసిష్ఠుని అనుమతితో దివ్యాయుధసంపదను తీసుకొని సౌమిత్రి అనుకొన్న సమయానికి రాముని చెంత చేరాడు.

అలా వచ్చిన లక్ష్మణుని చూచి రాముడు సంతోషించాడు. 'లక్ష్మణా! నా దగ్గర ఉన్న సంపదనంతా నీతో కలిసి విప్రులకు దానం ఇవ్వదలచాను. నన్ను ఆశ్రయించిన వారికి, బ్రాహ్మణోత్తములకు, వసిష్ఠుని కొడుకు ఐన సుయజ్ఞునకు దానం చేయాలని అనుకొన్నాను. నీవు వారినందరిని పిలుచుకొని రమ్ము' అని శ్రీరాముడు లక్ష్మణుని ఆదేశించాడు.

* * *

బ్రాహ్మణోత్తములకు భూరిదానాలు

సర్గ - 32

లక్ష్మణుడు అన్న ఆదేశాన్ని శిరసావహించి సుయజ్ఞుని కుటీరానికి వెళ్ళాడు. సుయజ్ఞునికి ప్రణమిల్లాడు. అన్న ఆదేశాన్ని వినిపించాడు. 'ఓ గురుపుత్రా! మా సోదరుడు ఎవరూ చేయలేనట్టి కార్యాన్ని చేపట్టారు. ఆయన మిమ్ములను తోడ్కొని రమ్మని నన్ను ఆదేశించాడు. మీరు నాతో రావలసిందిగా నా ప్రార్థన' అని లక్ష్మణుడు చెప్పాడు.

సుయజ్ఞుడు సంధ్యావందన క్రియలు ముగించుకొన్నాడు. లక్ష్మణునితో కలిసి శ్రీనివాసమైన రాముని గృహానికివెళ్ళాడు. తన గృహాన్ని పావనం చేసిన గురుపుత్రుని సీతారాములు ఎదురేగి తోడ్కొని వచ్చి ఉచితాసనాన్ని ఇచ్చి గౌరవించారు. అగ్నికి ప్రదక్షిణ చేసినట్లుగా వారు ఆయనకు ముమ్మారు ప్రదక్షిణ నమస్కారాలు చేశారు. సువర్ణంతో చేసిన దండకడియాలను రత్నాలు కూర్చిన హారాలను, భుజకీర్తులను, చక్కని కుండలాలను ఇచ్చి ఆయనను సంతోషపెట్టారు.

'ఓ మిత్రమా! సీత నాతో కలిసి వనవాసానికి వస్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని, నీ భార్యారత్నానికి సీత తన కంఠాభరణాలను, ఒడ్డాణం, దండకడియాలు, చక్కని శిల్పం గల కేయూరాలు, ఒక మంచి పాన్పు ఇవ్వాలని ముచ్చటపడుతోంది. వాటినన్నింటిని మీరు గ్రహించి మమ్ము సంతోషింపజేయండి. అంతేగాక మా మేనమామ శత్రుంజయం అను మహాగజాన్ని నాకు ఇచ్చి ఉన్నారు. దానిని, వేయి బంగారు నాణేలను మీకు సమర్పిస్తున్నాను మీరు గ్రహించండి' అని శ్రీరాముడు సుయజ్ఞునికి చెప్పాడు. అన్నింటిని సుయజ్ఞుడు స్వీకరించాడు. సీతారామలక్ష్మణులకు శుభాశీస్సులను ఇచ్చాడు.

రాముడు లక్ష్మణుని పిలిచాడు. "సౌమిత్రీ! నీవు వెళ్ళి మహామహులైన అగస్త్యుని, విశ్వామిత్రుని సాదరంగా ఆహ్వానించు. వారిని కూడా పాడి ఆవులను, వెండి బంగారు ఆభరణాలను, రత్నాలను ఇచ్చి సంతోషపెడ్తామ"ని చెప్పాడు. అన్న చెప్పినట్లుగానే లక్ష్మణుడు చేశాడు.

భూరిదానాలను స్వీకరించడానికి ఎంతోమంది అర్థులు రామాలయం చేరారు. వాక్‌శుద్ధిగలవారు, వేదాలను ఔపోసన పట్టినవారు, కౌసల్యామాతకు శుభాశీస్సులను అందచేసే విప్రోత్తములు అందరూ రాముడు ఇచ్చే దానాలను గ్రహించడానికి వచ్చారు. సౌమిత్రి వేద భాగాలను అధ్యయనం చేసే బ్రహ్మచారులకు ఎనుబది బండ్ల రత్నాలు, ధాన్యాదులను మోయునట్టి వృషభాలు, శకటాలు, పొలాలను దున్నే ఎద్దులను, పాలిచ్చే ఆవుల్ని వారికి బహూకరించాడు. వేదాధ్యయనమే పనిగా ఉండే వారికి కావాల్సిన కానుకలను ఇచ్చాడు.

కౌసల్యామాతను ఆశ్రయించిన వారికందరికి దానాలు చేశాడు. రాముని ఆశ్రయించి ఉన్నవారికందరికి పదునాలుగేండ్లకు సరిపడా ఆహార ధాన్యాలను, సంపదలను రామలక్ష్మణులు దానం చేశారు. రాముడు తిరిగి వచ్చేవరకు రాముని మందిరాన్ని శుభ్రంగా ఉంచడానికి తగిన మనుషులను నియోగించాడు.

తమను విడిచి వెళ్ళుతున్నందుకు విచారించే జనులను ఆనందింపజేయడానికి తన కోశాగారంలోని ధనమంతా దానం చేయాలని శ్రీరాముడు అనుకొన్నాడు. అయోధ్య సమీపంలోనే పింగళవర్ణకేశాలు ఉన్న బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు పరమ నిష్ఠాగరిష్ఠి. కడు బీదరికంతో జీవనం చేసేవాడు. బహు కుటుంబీకుడు. పలుగు, పార పుచ్చుకొని భూమిని తవ్వుతూ ఉండేవాడు. ఆయన భార్య సాధ్వీమణి. ఒకనాడు ఆ ఇల్లాలు ఆ బ్రాహ్మణుని చూసి నాథా! మీరు చేసే పనిని వదిలిపెట్టి రాముని దగ్గరకు వెళ్ళితే మన దరిద్రం వదిలిపోతుంది గదా. ఒక్కసారి రామానుగ్రహం కోసం వెళ్ళిరండి అని ప్రోత్సహించింది.

భార్యచే ప్రేరేపితుడై త్రిజటుడు జనసమర్థంగా ఉన్న రామమందిరం ఐదవకక్ష్యలోకి అడుగుపెట్టాడు. అంగీరసమహామునివలె తేజస్సు నిండిన ఆయన ముఖం చూసి రామ మందిరంలోకి వెళ్ళేంతవరకు ఎవరూ ఆయనను అడ్డగించలేదు. అతడు రాముని చెంత చేరాడు. 'ఓ శ్రీరామా! నేను కటికపేదరికంతో జీవిస్తున్నాను. నాపై కాస్త కనికరం చూపు' అని అడిగాడు. శ్రీరాముడు చిరునవ్వు నవ్వి 'ఓ భూసురోత్తమా! నేను దానాలను ఇవ్వడానికే ఇక్కడ ఉన్నాను. మీ చేతిలో ఉన్న దండం మీ శక్తిమేర విసరండి. అది పడిన చోటవరకు ఉండే ఆవుల మందను మీకు ఇస్తాను' అని శ్రీరాముడు చెప్పాడు. త్రిజటుడు మహానందపడ్డాడు. వెంటనే తన భుజంపై

వ్రేలాడే ఉత్తరీయాన్ని నడుముకు బిగించాడు. చేతి కర్రను గిరగిరా త్రిప్పుతూ విసిరివేశాడు. ఆ కర్ర వెళ్ళి సరయూనది ఆవల ఉన్న ఆవుల మందలోని వృషభం చెంత పడింది.

ధర్మాత్ముడైన రాముడు త్రిజటుణ్ణి ఆలింగనం చేసుకొన్నాడు. 'ఓ బ్రాహ్మణోత్తమా! నన్ను తప్పుగా భావించకు. మీ శక్తిసామర్థ్యాలను అందరికీ చూపించాలనే నెపంతో నేను ఈ విధంగా చేస్తూన్నాను. నన్ను మన్నించి ఈ ఆవుల మందనంతా మీరు గ్రహించండి. నన్ను కృతారుణ్ణి చేయండి' అంటూ శ్రీరాముడు కోరాడు. త్రిజటుడు ఆవుల మందను గ్రహించి సోదరద్వయాన్ని ఆశీర్వదించాడు.

రాముని చేత దానం పొందిన విప్రులు, సేవకులు, దరిద్రులు, యాచకులు, సుహృదులు అందరు సంతృప్తి చెందారు.

* * *

సీతారాములు దశరథుని చెంతకు వెళ్ళటం

సర్గ - 33

వనవాసాభిలాషులైన సీతారామలక్ష్మణులు దానాలు చేశారు. తండ్రి ఆశీర్వాదం తీసుకోవడానికి ఆ ముగ్గురు కైకేయి భవనానికి బయలుదేరారు. రామలక్ష్మణులు దివ్య ధనుస్సులను ఖడ్గములను ధరించారు. వాటినన్నింటిని సీత చందనాది పుష్పములచే అర్చించింది. ఈ ముగ్గురు రాజమార్గంలో వెళ్ళుతున్నారు. వీరిని చూడటానికి అయోధ్యావాసులు తమ తమ భవంతులపై ఎక్కి నిలుచున్నారు. వారు వీరిని చూచిన వెంటనే కన్నుల నీరు గ్రమ్మి దుఃఖితులయ్యారు. ఛత్రచామరాదులు, వందిమాగధులు, రథాలు అన్నింటిని త్యజించి ఆ ముగ్గురు రాజవీధిలో కాలినడకన వెళుతున్నారు. వారిని చూచిన ప్రతి ఒక్కరు కుమిలిపోయారు. విధి ఎంత బలీయమైనదో అని వాపోయారు. శ్రీమంతుడు, పరాక్రమశాలి అయిన శ్రీరాముడు తండ్రి ఆజ్ఞను పాలించాలని అనుకొన్నాడు. ఆయన కోరిక మేరకు వనవాసానికి బయలుదేరాడు.

సీత సుకుమారి. ఎండ కన్నెరగని వనితగా అంగరాగాదులు మైపూతలచే ఒప్పారే సీత శరీరలావణ్యం నేడు ప్రకృతివైపరీత్యాలను తట్టుకోవడానికి ఉపక్రమించింది. సీత ఎప్పుడూ ఎవరికీ కనిపించేది కాదు కదా. అటువంటి ఆ సాధ్వీమతల్లి నేడు కాలినడకతో భర్త వెంబడి నడిచి రావడాన్ని పురజనులు చూడలేకపోయారు. అయోధ్యా వాసులందరు దశరథునికి నిజంగానే ఏదో పిశాచం ఆవహించి ఉండుననుకొన్నారు. ఏ తండ్రి ఐనా కన్నకొడుకును కావాలని కష్టాలపాలు చేస్తాడా? దుర్మార్గుడైన కొడుకును కూడా సన్మార్గంలోకి తేవడానికి అష్టకష్టాలు పడతారు గదా! మరి సాధుజనేష్టుడు, సర్వులకు ప్రియం ఒనర్చేవాడు, మితభాషి ఇన్ని మాటలెందుకు పురుషోత్తముడైన శ్రీరాముని పోగొట్టుకోవాలని ఏ తండ్రి, ఏ మనిషి ఆలోచిస్తారు అని వారందరూ అనుకొన్నారు.

సద్గుణరాశి అయిన రాముణ్ణి వదలలేక, నీటిని వదిలి భూమి మీదకు వచ్చి గిలగిలా కొట్టుకొనే చేపవలె అక్కడివారు కొట్టుమిట్టాడారు. సర్వజన బాంధవుడైన రాముణ్ణి విడిచి ఉండలేక వారు దుఃఖభాజనులయ్యారు. జగత్పతియైన రామునికి వచ్చిన ఆపదను చూడలేకపోయారు.

రాముని అనుసరించి వెళుతున్న సీతాలక్ష్మణులను చూచి మిగుల పరితాపం చెందారు. వారిని చూస్తూ ఊరుకోలేక, స్వజనాన్ని ఆస్తిపాస్తులను వదులుకొని, వారందరూ ఆ ముగ్గురిని వెంబడిస్తూ వెళ్ళారు. మనమందరం రాముని వెంట వెళ్దాము. మన ఇండ్లు వాకిళ్ళు, ధనధాన్యాలు, పశువులు, సామగ్రి అన్నింటిని చోరులు అపహరించుకొని పోతారు. చేసేవారు లేక అయోధ్యాపట్టణమంతా దుమ్ముకొట్టుకొని పోతుంది. పశుసంపద, భూసంపద అంతా వ్యర్థమైపోతుంది. పట్టణం అంతా శూన్యం అయ్యి వల్లకాడును తలపిస్తుంది. అట్టి అయోధ్యను కైక ఒక్కతే ఏలుకొంటుందిలే అనుకొన్నారు.

మనమందరం రాముని వెంట ఉండి ఆ అడవినంతా అయోధ్యాపట్టణాన్ని మించిన నగరంలా చేద్దాం. అక్కడే అమరసుఖాలను అనుభవిద్దాం. ఈ పురం అంతా నిర్జనమై కైక భరతులకు బుద్ధి తెప్పిస్తుంది అని ఆ నగర వాసులు అనుకొంటూ రాముని వెంబడించారు.

ధైర్యశాలి అయిన శ్రీరాముడు జనాన్నంతా సంతోషవదనంతో చూస్తూ ముందుకు వెళ్ళాడు. భార్యాసోదర సమేతుడై కైక నివాసానికి చేరుకొన్నాడు. సుమంత్రుని చూశాడు. దుఃఖమగ్నమైన మోముతో సుమంత్రుడు రామునకు నమస్కరించాడు. తన రాకను మహారాజుకు తెలియజేయండని శ్రీరాముడు సుమంత్రుని కోరాడు.

* * *

దశరథుని అనుమతి

సర్గ - 34

మహారాజును దర్శించాలని రాముడు వేచి ఉన్నాడన్న విషయం తెలుపమని సుమంత్రునికి రాముడు చెప్పాడు. రామాజ్ఞను మంత్రి పుంగవుడు తలదాల్చి మహారాజు చెంతకు వెళ్లాడు. బూడిదచే కప్పబడిన అగ్నిలాగా, రాహువు నోటిలో చిక్కిన దినకరుని లాగా, నీరులేని చెరువులాగా కళను కోల్పోయిన దశరథుని ముఖం తేజోవిహీనం అయింది.

దుఃఖంలో మునిగిన మహారాజుకు జయవచనాలు ముందుగా సుమంత్రుడు చెప్పాడు. అంజలి ఘటించాడు. ఆయన పరిస్థితికి వ్యాకులపడుతూ చిన్నగా రాముడు అరుదెంచిన విషయాన్ని చెప్పాడు. మిమ్ము దర్శించాలని సీతారామలక్ష్మణులు ద్వారం దగ్గర వేచిఉన్నారు. 'ఓ మహారాజా! అప్రమేయ ప్రతిభాశాలి అయిన మీ జ్యేష్ఠ

కుమారుడు మీ ఆజ్ఞానువర్తియై వనాలకు తరలి వెళ్లడానికి మీ అనుమతి కోరుతున్నాడు'– అని సుమంత్రుడు దశరథునకు తెలిపారు. పరమ ధర్మమూర్తి, సత్యవచనుడైన దశరథుడు సుమంత్రునితో 'ఓ మంత్రిసత్తమా!నీవు నా రాణులందరినీ తీసుకుని ఇక్కడకు రమ్ము. వారినందరితో కలిసి నేను నా రామచంద్రుని చూడకోరుతున్నాను" అని చెప్పాడు. సుమంతుడు రాజు కోరిన విధంగా రాజపత్నులందరినీ సాదరంగా తీసుకొని వచ్చాడు. రాముని దూరం చేసుకోలేక ఆ రాణులు ముఖాలన్నీ ఏడ్చి ఏడ్చి ఉబ్బాయి. కన్నులు ఎర్రని కమలాలను పోలి ఉన్నాయి. మూడువందల యాభైమంది స్త్రీలు కౌసల్యతో కూడి దశరథుని చెంతకు వచ్చారు. వారినందరినీ దశరథుడు పరిశీలనగా చూశాడు. 'సుమంత్రా! నా జ్యేష్ఠతనయుణ్ణి నా రాముణ్ణి తీసుకొని రా' అని చెప్పాడు. రాముడు తన తండ్రి దగ్గరకు రాబోయాడు. రాముని చూచిన వెంటనే దశరథుడు పాలకై పరుగెత్తు దూడవలె తటాలున పర్యంకంనుండి లేచాడు. రాముని చెంతకు పరుగెత్తాడు. కానీ శోకభారంతో కుంగిన మహారాజు రాముణ్ణి చేరకముందే స్పృహ తప్పి పడిపోయాడు. అట్టి స్థితిలో ఉన్న మహారాజును లేవనెత్తాలని రామలక్ష్మణులు పరుగెత్తి వచ్చారు. అక్కడ చేరిన స్త్రీలందరూ 'ఓ రామా!', 'రామా!' అని గగ్గోలు పెట్టారు. అంతలో సోదరులిద్దరూ కలిసి దశరథుని లేపి మంచంపై పడుకోబెట్టారు. శీతలోపచారాలు చేశారు. కొద్దిసేపటికి దశరథునికి తెలివి వచ్చింది. కన్నులు తెరచి వారినందరినీ చూశాడు.

'ఓ మహారాజా! వనవాసానికి నేను బయలుదేరాను. మీ చల్లని దీవెనల కోసం వచ్చాను. నాతోపాటు వనవాసానికి రావాలని సీత, లక్ష్మణుడు కూడా వచ్చి ఉన్నారు. మా ముగ్గురిని మీరు ఆశీర్వదించి పంపండి' అని రాముడు తండ్రితో చెప్పాడు. 'బ్రహ్మ తన మానసపుత్రులైన సనకాదులకు తపోవనదీక్షకు అనుమతించినట్లుగా మీరు మా ముగ్గురికి అనుమతిని ప్రసాదించండి. మా కోసం మీరు ఏ మాత్రం విచారించ పనిలేదు' అని శ్రీరాముడు తన తండ్రితో స్థిర నిశ్చయాన్ని తెలిపాడు. అప్పుడు దశరథుడు 'ఓ రఘుకులరామా! నేను ఈ కైకవలన మోసపోయాను. నీవు నా ఆజ్ఞను పాలించనక్కరలేదు. నన్ను నా మాటలను తోసిపుచ్చి ఈ కోసలరాజ్యాన్ని చేపట్టు' అని చెప్పాడు. దానికి రాముడు ఏ విధమైన వికారానికి లోను కాలేదు. 'ఓ రాజేంద్రా! మీరు వేల సంవత్సరాలు ఈ అయోధ్యను పాలించారు. నేను నా వనవాసకాలాన్ని పూర్తిచేసుకున్న తర్వాత వచ్చి మీ సేవలో కృతార్థుని అవుతాను. దీనికోసం మీరు ఇంతగా వ్యాకుల పడనవసరం లేదు' అని రాముడు దశరథునికి చెప్పాడు.

అంతలో కైక తొందరచే దశరథుడు 'శ్రీ రామా! నీవు త్వరగా వనవాస దీక్షను ముగించుకొని రమ్ము. అయినా ఓ రామా! నిన్ను విడిచి ఉండడం నాకు అసాధ్యం. ఈ ఒక్కరోజు నీవు నా దగ్గర ఉండి రేపు వనాలకు వెళ్లిరావచ్చు. ఈ ఒక్కనాడైనా తృప్తిగా మీ అమ్మతో కలిసి నేను సుఖిస్తాను. నా మాట విను తండ్రీ!' అని దశరథుడు చెప్పాడు. 'ఓ రామా! నివురుగప్పిన నిప్పులాగా ఈ కైక దురుద్దేశ్యాన్ని మనస్సులో పెట్టుకొని నా చెంత చేరింది. ఈమె మోసపూరితమైన మాటలకు నేను లొంగిపోయాను. నా వలన నేడు నీవు కష్టాల కొలిమిలో చిక్కుకున్నావు. ఓ సద్బుద్ధిగల కుమారా! నేను వరాలను ఇచ్చాను. కాని వాటికి ఈ రూపును కైక ఇచ్చింది. నా

మనఃక్లేశాలకు కారణం అయింది. ఓ నరశ్రేష్ఠా! నీ గుణాల వల్ల కూడా నా పెద్ద కుమారుడవు నీవే. నా మాటను శిరోధార్యంగా భావించావు. వనవాసదీక్షను నీ భుజాలపై వేసుకున్నావు కానీ', అంటూ బతిమాలుతున్న దశరథునితో రాముడు ఇలా చెప్పాడు.

'ఓ పితామహా! ఒక్కరోజు మీ చెంత ఉండి సుఖభోగాలను అనుభవించినప్పటికీ రేపు మరల వనవాసానికి వెళ్లి తీరాలి గదా! మరి నేడే కోరికలను త్యజించి తండ్రి మాటను పాటించడమే నాకు ఉత్తమంగా కనిపిస్తోంది. క్షణికసుఖాలకోసం నా మనస్సు పరుగెత్తదు.మీరు కైకమ్మకు ఇచ్చిన మీ మాటలను దృఢంగా తీరుస్తానని చెప్పివేయండి. నేను మీ మాటను నిలబెడతాను. సంశయించవలసిన అవసరం లేదు తండ్రీ' అని శ్రీరాముడు దశరథుని మనస్సును అనునయించాడు. 'ఓ దశరథ రాజేంద్రా? నాకు ఇహపరసుఖాలపై మక్కువ లేదు. నేను సత్యవంతుడినై ఉండడమే నాకు ఇష్టం నాకు సీతపై కాని, ఈ నా దేహంపైకాని ఏ మాత్రం ఇష్టం లేదు. నేను ఒక్క క్షణమైన ఈ రాజ్యంలో ఉండలేను. కైకమ్మ నన్ను వనాలకు వెళ్లమని అర్థించింది. తల్లి అనుజ్ఞపొందిన నేను వనాలలో సుఖంగా జీవిస్తాను.

ఇందులో లవలేశంకూడా సంశయంలేదు. మీరు నాకోసం చింతపడవలసిన పని లేదు. పద్నాలుగేండ్లు దీక్షను ముగించుకొని వచ్చిన తర్వాత మీ మాటను శిరసావహిస్తాను' అని స్థిర నిశ్చయాన్ని తెలిపాడు. 'ఓ పురుషశ్రేష్ఠా! భరతునకు సస్యశ్యామలంగా వర్ధిలుతున్న ఈ అయోధ్యాపట్టణాన్ని అప్పగించి మీరు నిశ్చింతగా ఉండండి. భరతుని ఏలుబడిలో అయోధ్య శోభ మరింత పెరుగుతుంది. పుణ్యపురుషా! నేను సత్యవచనానికి కట్టుబడి ఉంటాను. విషయభోగాలవైపు నా మనస్సు మరలదు. దేవుని సృష్టిలో ప్రకృతి రమణీయత ఎంతగానో శోభిస్తుంది. అటువంటి ప్రకృతిలో సేద తీరుతూ హాయిగా పద్నాలుగేండ్లు గడిపి తిరిగి వస్తాను. మీరు మనః క్లేశాన్ని వీడి నన్ను నిండుమనస్సుతో ఆశీర్వదించండి. సీతాలక్ష్మణులు సైతం ఎన్ని చెప్పినాకూడా వారి నిర్ణయాన్ని మార్చుకోలేదు. వారు నాతోకూడా వనవాసం చేయడానికి పూనుకొన్నారు. మీరు సంతృప్తిగా మా ముగ్గురిని దీవించి వనాలకు పంపి, మీరు సత్యవ్రతులై ఉండండి' అని శ్రీరాముడు తన దృఢసంకల్పాన్ని దశరథునికి తెల్పాడు.

కఠినమైన మాటలను విన్న దశరథుడు కుంగిపోయాడు. రాముని తన గుండెలకు హత్తుకుని రామా! అంటూ విలపించాడు. పుత్రవియోగాన్ని భరించలేక మూర్ఛపోయాడు. వెంటనే అక్కడున్న రాణులందరూ బోరుమని ఏడ్చారు. వారి రోదన ధ్వని ఆ ప్రదేశంలో మారుమోగింది. దీనినంతా చూచిన సుమంత్రుడు ఆవేశాన్ని ఆపుకోలేక బోరుబోరుమని ఏడ్వసాగాడు. కాని కైక మాత్రం నిశ్చలంగా ఉంది. చోద్యం చూస్తున్న దానిలాగా వారినందరిని తేరిపార చూస్తోంది. పాషాణహృదయం గల కైక మనస్సు ఏమాత్రం తొణకలేదు.

* * *

సుమంత్రుని హితబోధ

సర్గ - 35

కొద్దిసేపటికి సుమంత్రుడు తెలివిపొందాడు. కోపంతో ప్రజ్వరిల్లాడు. కోపం పట్టలేక పళ్ళు పటపట లాడించాడు. చేతులను పిండివేశాడు. అయిననూ కోపాన్ని అదుపు చేయలేకపోయాడు. అతని కన్నులు ఎరుపు ఎక్కాయి. నాసిక ఉచ్ఛ్వాసనిశ్వాసాలతో అదిరింది. కైక కుటిలయత్నానికి మనస్సు కుతకుతలాడింది. కైకనుచూసి కోపం చల్లార్చుకోలేక ఆమెపై మాటల తూటాలను ఎక్కుపెట్టాడు. మాటలనే శస్త్రాలుగా చేసి కైక మనస్సును ఛిద్రం చేయాలనుకొన్నాడు.

'ఓ కైకేయీ మీకు మాత్రమే ఈ దశరథుడు నాథుడు కాదు. మిమ్ము మించిన మహామహులకు, ఈ పౌరులందరకు ప్రాణప్రదుడు దశరథుడు. అట్టి మహారాజు మాటలను తృణీకరించి నీవు సాధించేది ఏదీ ఉండదు. స్త్రీలకు పతియే పరమదైవం. కోటిమంది కొడుకులకన్నా ఒక్క నాథుడే వారికి మిన్న. కోరిన కోరికలన్నీ తీర్చేవాడు, నిన్ను పోషించే వాడు అయిన నీ భర్తను నీవు ఈ విధంగా బాధపెట్టడం సమంజసం కాదు. రాజు తదనంతరం అతని పెద్దకొడుకే రాజ్యభారాన్ని మోయటం ఎప్పటినుంచో వస్తున్న ధర్మం. అది నీవు కాలరాస్తున్నావు. ఆ పరంపరను దశరథుడు జీవించి ఉండగానే నశింప చేస్తున్నావు. ఇది ఎవరికీ మంచిని కలుగచేయదు.

ఓ కైకా! ఈ దశరథుడు మహారథుడు. అతనిని ఎదిరింప మహేంద్రునికైనా అశక్యమే. పర్వతంవలె కదల్ప శక్యం కాని రాజును నీ వరాలనే మాటలచే కృశింపజేశావు. దీనివలన నీవు నీ భర్తను నాశనం చేయటమే కాదు. నీ కులనాశనానికి కూడా నీవే హేతువగుచున్నావు. నీ మొండిపట్టును నీవు వదలకుండానే ఉండు. నీవు, నీ భరతుడు శ్మశానం అయ్యే ఈ అయోధ్యను పాలించండి. మేమందరం రాముని వెంట అడవులకు వెళ్తాం. అక్కడే అయోధ్యను సృజించుకొంటాం' అని సుమంత్రుడు కైకను హెచ్చరించాడు.

'కైకా! నీవు ఇప్పుడు చేసే దుష్కర్మవల్ల బ్రాహ్మణుడే కాదు. మనస్సున్న మనిషెవరూ ఈ నగరంలో ఉండడానికి ఇష్టపడరు. సత్పురుషులు లేని అయోధ్యను ఏమి పాలిస్తావు? నీ చెడ్డ పనులను చూస్తూ కూడా ఈ భూమి బద్దలవ్వడంలేదు. 'ఛీ' అనే వాగ్దండంకూడా నిన్ను హింసించుటకు వెనుకడుగు వేస్తోంది. దుర్మార్గురాలివై దుష్ట చరిత్రను నిర్మించుకోకు. నీ కోసమేకాక సర్వులను దృష్టిలో ఉంచుకొని నిర్ణయం తీసుకో. నీ భర్త నీకు ఇచ్చిన మాట కోసం పరితపిస్తున్నాడు. అతని సత్యవచనప్రియత్వాన్ని అడ్డుగా పెట్టుకొని నీవు దశరథుని వంచించడం బాగాలేదు. కైకా! మరొకసారి నీ కోరికను పునరాలోచించి మమ్మల్నందరినీ సంతోషపెట్టు' అని సుమంత్రుడు కైకకు హితాన్ని చెప్పాడు.

ఎన్ని విన్నప్పటికీ కైక మనస్సు ఏ మాత్రం సడలలేదు. ఆమె గంభీరంగా మౌనముద్రలోనే ఉంది. ఆమెను చూచిన సుమంత్రునికి కోపం ఎక్కువైంది. 'ఓ కైకా! లోకులు సాధారణంగా తల్లి లక్షణాలు కూతుళ్లకు తండ్రి లక్షణాలు కొడుకులకు వస్తాయని అంటారు. బహుశా నీకు కూడా నీ తల్లి బుద్ధులే అలవడినట్లున్నాయి. ఆమెకూడా నీ వలె పాషాణ హృదయురాలు.

నీ తల్లి విషయంలో జరిగిన సంగతి చెప్తాను విను అంటూ సుమంత్రుడు ఇలా చెప్పాడు. నీ తండ్రికి ఒక గంధర్వయోగి ఒక వరాన్ని ఇచ్చాడు. ఆ వరప్రభావంతో జంతువుల పక్షుల భాషను తెలుసుకొనే శక్తి మీ తండ్రికి కలిగింది. కాని ఆ యోగి నీ తండ్రితో ఇలా చెప్పాడు. ఓ "కేకయరాజా! నీవు అర్థం చేసుకున్న జంతువుల, పక్షుల భాషను మరొకరికి తెలిపినట్లు అయితే, నీవు మరణిస్తావు. కనుక జాగ్రత్తగా నా వరాన్ని కాపాడి నీ జీవితాన్ని సార్థకం చేసుకో" అని చెప్పాడు.

ఒకసారి నీ తండ్రి మీ తల్లిదగ్గర కాలం గడిపే సమయంలో తల్పానికి దగ్గరలో చీమల బారు వెళ్తుండడం నీ తండ్రి చూశాడు. ఆ బారులోని చీమల భాష నీ తండ్రికి తెలిసింది. దానికి ఆయన బిగ్గరగా నవ్వాడు. ఆ నవ్వును మీ అమ్మ చూసింది. తననుచూసే నవ్వుతున్నారని అనుకొన్నది. అందుకే నవ్వుకు కారణం చెప్పమని మీ తండ్రిని నిర్బంధించింది. అప్పుడు మీ తండ్రి నా నవ్వుకు కారణం నీకు తెలిపితే నేను జీవించను అన్నారు. మీ జనన మరణాలతో నాకు పనిలేదు. మీ నవ్వుకు కారణం చెప్పి తీరాలి. మీరు మరణించినా నేను లెక్క చేయనని మొండిగా అన్నది. అప్పుడు గంధర్వయోగి మీ తండ్రికి కనిపించి ఓ రాజేంద్రా! నీ భార్య మాటలను లెక్క చేయకు ఆమెను వదిలివేసి నీ కార్యాలలో నీవు నిమగ్నం కా. ఎట్టి పరిస్థితులలోను నీ మందహాసానికి కారణం వివరించకు. దానివల్ల నీకు యశఃప్రతిష్ఠలు కలుగుతాయి' అని చెప్పాడు.

అప్పుడు నీ తండ్రి మీ అమ్మ మాటలను త్రోసిపుచ్చి రాజ్యకార్యాలలో మునిగి పేరు తెచ్చుకున్నాడు.

అటువంటి తల్లి కడుపున పుట్టిన నీవు ఈనాడు నీ జీవితేశ్వరుని ప్రాణాన్ని పణంగాపెట్టి నీ కోరికలను సిద్ధింప చేసుకొనుచున్నావు. వేపచెట్టునుండి తేనె స్రవిస్తుందని మేము అనుకోవడం మా బుద్ధి తక్కువనే చెప్తోంది. నీ వంశం దుష్టచరిత్ర కలది. ఆ రేకులోని పిలక అయిన నీకు మంచితనం ఎక్కడనుంచి వస్తుంది?' అని సుమంత్రుడు కైకను దుర్భాషలాడాడు. అయినప్పటికీ కైక చిత్తం మరలలేదు.

తీక్ష్ణవాక్కుల్ని ప్రయోగిస్తూ సుమంత్రుడు కైకతో ఇలా చెప్పాడు. ఓ కైకా! నీవు రాముని చిన్నతనంనుంచి ఎరుగుదువుకదా. రాముడు సర్వలోకప్రియుడు. సదాచార నిరతుడు. ప్రజలను కన్నబిడ్డలవలె చూచేవాడు. అతని పట్టాభిషేకాన్ని నిలుపకుండా జరుగనిమ్ము. రాముని రాజుచేస్తే నీవు కూడా కీర్తిమంతురాలివి' అవుతావు అని అనేక విధాలుగా కైకకు హితాన్ని బోధించాడు.

ఎన్ని హితోక్తులు విన్నా చెవిటివాని ముందు శంఖం ఊదినట్లు అయింది. కైకలో ఇసుమంతైనా చలనం లేదు. పరితాపం లేదు. కఠిన హృదయం ఉన్న కైక ఏ విధమైన మార్పును పొందలేదు. తన మొండి పట్టుదలను మార్చుకోలేదు.

* * *

మంత్రి సిద్ధార్థుని హితోక్తి

సర్గ - 36

సుమంత్రుని మాటలకు కైకలో ఎట్టి మార్పు లేదు. దీనిని చూచి దశరథుడు వ్యథ చెందాడు. తాను చేసిన పని ఎంత చేటు తెచ్చిందో అని బాధపడుతున్నాడు. ఆ బాధలో సుమంత్రునితో ఇలా చెప్తున్నాడు. 'ఓ మంత్రి సత్తమా! అడవులకు వెళ్ళే రామునితో చతురంగబలాలను, రత్నాలు నింపిన బండ్లను, ఆహారధాన్యాలను, నర్తకీమణులను, గాయకులను, చతురసంభాషణను చేసేవారిని అందరిని పంపించు". వారందరూ రాముని వెంట ఉండి రామునికి బాధ కలుగకుండా చూస్తారు అని చెప్పాడు. ఓ సుమంత్రా! అడవి బాగుగా తెలిసిన అటవికులను మార్గాన్వేషకులుగా పంపించు. రాముడు అరణ్యాలలో ఋషులను అర్చిస్తూ యజ్ఞయాగాది కర్మలు చేస్తూ పద్నాలుగేండ్లు సుఖంగా గడుపుతాడు. ఆ విధంగానైనా నా రాముణ్ణి నేను సంతోషింపచేస్తాను' అని దశరథుడు చెప్తూనే ఉన్నాడు.

ఎప్పటికప్పుడు రామునికి కావాల్సినవన్నీ అందేటట్లుగా మనుష్యులను, ఒంటెలను, ఏనుగులను మొదలైన వాటిని పంపుతూ ఉండు. ఇక్కడ బాహుబల విక్రముడైన భరతుడు రాజ్యాన్ని ఏలుతూ వాటిని అన్నింటిని సమకూర్చగలడు.

ఇలా చెప్పే దశరథుని కైక చూసింది. కైక మనస్సు ఆందోళనకు గురి అయింది. తన పన్నాగం పారదేమో అని శంకించింది. విచారవదనంతో 'ఓ మహారాజా ఇక్కడి సమస్తాన్ని శ్రీరాముని వెంట పంపించండి. నిర్జనమైన అయోధ్యను పాలించమని భరతునికి ఇవ్వండి. శూన్యమైన ఈ అయోధ్యను భరతునికి మీరేమీ కట్టపెట్టనవసరంలేదు' అని కోపంగా గట్టిగా కైక అరిచింది. దానిని చూచి దశరథుడు 'ఓసి దుర్మార్గురాలా! నీ కుటిలయత్నంలో నన్ను పావును చేశావు. అయినా నేను నిన్ను ఏమీ అనలేదు. ఇప్పుడు నా రామునికి పంపించే వస్తువుల్లో కూడా నీ అభ్యంతరం ఉందా? ఆనాడు నీ వరాలను చెప్పటంలో నీవు ఇవేమీ చెప్పలేదు గదా! మరి ఈనాడు ఈ దుర్మార్గం ఎందుకు చేస్తున్నావు?' అని అడిగాడు.

దశరథుని మాటలకు కైక అమితక్రుద్ధురాలైంది. కోపావేశంలో 'ఓ దశరథ మహారాజా! నేను కొత్తగా చెపుతున్న కార్యం ఏదీ లేదు. ఇంతకుముందు మీ వంశజుడైన అంశుమంతుణ్ణి ఆయన తండ్రే నగర బహిష్కరణ చేశాడు. ఆ అంశుమంతుడు ఒక చిన్న గునపం, ఒక బుట్ట పట్టుకొని అరణ్యాలకు వెళ్ళాడు. మరి మీరీనాడు మీ కుమారుని వెంట రాజ్యాన్ని పంపడానికి ఉద్యుక్తుడవుతున్నారు' అని కైక చెప్పింది. వెంటనే దశరథుడు కైకను చూసి ఛీ, ఛీ అని చీదరించుకొన్నాడు. అక్కడ ఉన్న స్త్రీలందరూ తలలు దించుకొన్నారు. నలుగురి ముందు చీదరించుకొన్నప్పటికీ కైక పట్టు సడలలేదు.

మహారాజు బాధను చూచి అందరూ ఖిన్నులయ్యారు. అక్కడే ఒక వృద్ధ సచివుడు ఉన్నాడు. అతడే సిద్ధార్థుడు. సిద్ధార్థుడు కపటమెరుగనివాడు, రాజులచే మన్ననలను పొందినవాడు. ఆయన కైకను చూచి ఇలా చెప్పాడు.

'అమ్మా కైకా! నీవు పొరబాటు చేస్తున్నావు. సగరుని కొడుకు అంశుమంతుడు. ఇతడు వీధులలో ఆడుకొంటున్న చిన్నారి బాలలను పట్టుకొని వెళ్ళి నదులలో ముంచుతుండేవాడు. ఆ బాలలు నీటిలో మునిగి ఊపిరి అందక కొట్టుమిట్టాడుతుంటే చూచి అంశుమంతుడు రాక్షసానందాన్ని పొందేవాడు.

వాని దుర్మార్గానికి రాజ్యంలోని పౌరులందరూ విసిగిపోయారు. వారందరూ వెళ్ళి సగరునికి తమను రక్షించమని వేడుకొన్నాడు. రాష్ట్ర ప్రజలను రాజులు కన్నబిడ్డలవలె చూచుకొనేవారు. అందుకనే తన తనయుడైనప్పటికీ అంశుమంతునికి సగరుడు నగరబహిష్కారాన్ని విధించి అడవులకు పంపివేశాడు.

కాని నేడు శ్రీరామునిలో ఎక్కడ వెదికినను ఒక్క దోషం కానరాదు. కాగడా పెట్టి వెదికినా రాముని ఇష్టపడని వారు ఎవరూ ఉండరు. మరి ఏ పాపాన్ని, ఏ దోషాన్ని చూపి శ్రీరాముణ్ణి అడవులకు పంపిస్తున్నావు? అది నీకు ఏమైనా తెలుసా' అని సిద్ధార్థుడు కైకను నిలదీశాడు.

'నిరంతరం దైవధ్యానపరుడై ఉండే రామునిలో నీకు ఏ దుష్కృతం కనబడిందో దానిని తెలుపు. మేమందరం రాముని అడవులకు పంపుతాము. అధర్మ ప్రవర్తన ఎవరు చేసినా దాని ఫలితాన్ని పొంది తీరాలి. చేసిన పాపం కట్టి కుడుపుతుంది. నీవు శ్రీరాముని విషయంలో ఇప్పటివరకు చేసిన నిర్వాకం చాలు. పట్టాభిషేకాన్ని నిలిపివేయకు. కనీసం నీవు లోకాపవాదానికైనా తలవంచు'– అని సిద్ధార్థుడు కైకతో చెప్పాడు.

'ఓ కైకా! ఈ సిద్ధార్థుని మాటలు విసుగును కల్గిస్తున్నాయా? నీవు ఏది మంచో, ఏది చెడో తెలుసుకోలేకున్నావు. సత్పురుషుల మార్గాన్ని వదిలి పెడదోవన పోతున్నావు. నీ వినాశాన్ని నీవే కొని తెచ్చుకొంటున్నావు. సరే, నీతో నాకు పనిలేదు. నేడే నేను కూడా ఈ రాజ్యభోగాలు వదిలివేసి నా రామునితో అడవులకు వెళ్తాను. నీ ఇష్టం వచ్చిన రీతిలో ఈ రాజ్యాన్ని ఏలుకో.' అని దశరథుడు కైకతో అన్నాడు.

* * *

వసిష్ఠుని మందలింపు

సర్గ - 37

సిజ్జనుడైన శ్రీరాముడు సిద్ధార్థుని మాటలు, దశరథుని వ్యథాపూరితమైన మాటలు విన్నాడు. తన తండ్రిని ఓదార్చాలనుకొన్నాడు. "ఓ సజ్జనశిరోమణీ! నేను కోరికలన్నింటిని త్యజించాను. వస్తువాహనాదులను దానం చేశాను. మహాగజాన్ని కూడా దానం చేశాను. మనసా, వాచా కర్మణా వనాలలో నివసించాలని అనుకొన్నాను. అట్టి నాకు మీరు పంపే వందిమాగధులు, నర్తకీమణులు, వస్తు వాహనాలతో పని ఏమి ఉంటుంది. మౌని వేషధారణలో ఉండే నాకు అమూల్యవస్త్రాభరణాలు ఎందుకు? తాపసి వలె జీవించాల్సిన నాకు ధనధాన్యాదులతో పని ఏముంటుంది? మీరు భ్రమను వీడండి. అజ్ఞాబద్ధునివై మాకు వెళ్ళడానికి అనుమతిని ప్రసాదించండి." అని శ్రీరాముడు తన తండ్రిని వేడుకొన్నాడు.

"తండ్రీ! నాకు వనాలలో అవసరమయ్యే ఒక గునపం, బుట్టను ప్రసాదిస్తే అదే పదివేలు. మీరు నేను ధరించాల్సిన నారవస్త్రాలను బహూకరిస్తే నేను వాటిని ధరించి ఈ రాజోచిత వస్త్రాలను తీసివేస్తాను. మీరు మనస్సును దిటవు చేసుకోండి. కావాల్సిన కార్యాలను చూడండి" అని శ్రీరాముడు తన తండ్రితో చెప్పాడు.

కైక ఆ మాటలు విన్నది. తటాలున వెళ్ళింది. ముందే సిద్ధం చేసి ఉంచిన నారవస్త్రాలను తెచ్చి 'ఇవి కట్టుకోండి' అని శ్రీరామునకు ఇచ్చింది. రామలక్ష్మణులు వారి మేలిమి వస్త్రాలను విసర్జించారు. నారవస్త్రాలను ధరించారు.

సీతాదేవి తనకు ఇచ్చిన నారచీరలను చూచి కలవరపడింది. అవి ఎలా ధరించాలో తెలియక తికమకపడింది. వాటిని కట్టుకోలేక బిడియపడింది. తన భర్త కేసి చూచింది. 'వనాలలో ఉండే తాపస స్త్రీలు వీటిని ఎలా కట్టుకొంటారో గదా' అని భర్తను అడిగింది. బిడియపడుతున్న సీతను ఓదార్చుతూ రాముడు సీత కట్టుకొన్న పట్టుచీరపై నారచీర ధరించే విధానాన్ని చూపాడు. అది చూసిన వారందరూ దుఃఖించారు. అంతేకాక 'ఓ రామచంద్రా! మీ తండ్రి నీకు మాత్రమే వనవాసదీక్షను విధించాడు గదా. ఈ సుకుమారికి వనవాసం లేదు గదా. నీవు వచ్చేవరకు మేము నీ సీతాదేవిని కన్నులలో పెట్టుకొని కాపాడుతుంటాము. నీవు బాధపడకుండా సీతాదేవిని మా దగ్గర వదిలిపెట్టి వెళ్లండి' అని చెప్పారు.

రాముడు వారి మాటలను పట్టించుకోలేదు. సీతకు నారచీరలను ధరింపజేశాడు. నారవస్త్రాలలోని సీతను కులగురువైన వసిష్ఠుడు చూశాడు. అమితమైన కోపం తెచ్చుకొన్నాడు. 'ఓ దుష్టురాలా! ఇక నీ దుర్మార్గం పెచ్చుమీరింది. హద్దుమీరి ప్రవర్తిస్తున్నావు. మహారాజును మోసపుచ్చి రాజ్యాన్ని కైవసం చేసుకోవాలని పన్నాగం పన్నావు. నీ ఆటలు సాగవు.

ఇల్లాలు మగనికి ప్రతినిధి. రాముడు అరణ్యవాసానికి వెళ్లితే, సీత రాజ్యసింహాసనాన్ని అధిష్ఠించగలదు. రాజ్యాన్ని చక్కగా పరిపాలించగలదు. సీతాదేవి వనాలకు వెళ్ళితే మేమూ అరణ్యాలకే పయనం అవుతాం. సీతారాములు ఉన్న ప్రదేశమే మాకు అయోధ్య. మేమే కాదు భరత శత్రుఘ్నులు సైతం నారవస్త్రాలు ధరించి తాపసులై శ్రీరాముని చెంతనే జీవిస్తారు. అంతేకాదు ఇక్కడి జనులందరూ అయోధ్యను విడిచి వనాలలోనే కూడుతారు. అప్పుడు ఇక్కడ ఉండే భూమిని, చెట్టు చేమలను నీవు ఒక్కదానివే ఏలుకో.

భరతుడు కూడా ధర్మనిరతుడైన దశరథుని కుమారుడే! భరతుడు అధర్మాన్ని మెచ్చుకోడు. నీ కుటిల యత్నాన్ని సాగనీయడు. సదాచారుడైన భరతుడు నీ సుతునిగా ఉండడానికి ఇష్టపడడు. నీవు నేలను విడిచి సాము చేస్తున్నావు. ఇక్ష్వాకువంశజుడైన భరతుడు ఏనాటికీ రాజ్యభారాన్ని తన సోదరుని నుంచి తీసుకోడు. నీదంతా వృధాప్రయత్నమే అవుతుంది. నీవు చేసిన పని వల్ల నీకు అప్రతిష్ఠ తప్ప మరేమీ కలుగదు. నీవు నీ పుత్ర వాత్సల్యంతో నీ పుత్రునకే అప్రియమైన కార్యం చేస్తున్నావు. ఓ కైకేయీ! శ్రీరాముని వెంట నోరులేని జీవాలు సైతం తరలి వెళ్ళిపోవడాన్ని నీవు చూడగలవు. చలనరహితాలైన వృక్షాలు సైతం రాముని ఎడబాటును భరింపలేక ముకుళించుకుపోవడాన్ని నీవు చూడవచ్చు.

ఓ దేవీ! నీ కోడలిని నీవు కష్టపెట్టడం తగని పని. ఈ నార చీరలను తీసివేసి సీత అమూల్య వస్త్రాభరణాలను ధరించడానికి అనుమతిని ఇవ్వు' అంటూ వసిష్ఠుడు సీత నారచీరలను ధరించడాన్ని నివారించాడు. నీవు శ్రీరామునికి వనవాస దీక్ష అడిగే సమయంలో సీత ప్రస్తావన రాలేదు. అందుకే సీత చక్కని వస్త్రాలంకారాలతో శ్రీరాముని వెంట ఉంటుంది. ఈ మైథిలి మేలిమి వస్త్రాలను ధరించి పల్లకీలో శ్రీరాముని వెంట వెళ్తుంది" అని వసిష్ఠుడు చెప్పాడు.

కాని సీత వస్త్రాదులపై ఆశపడలేదు. తన జీవిత భాగస్వామి లాగే తాను కూడా నారచీరలనే ధరించింది. శ్రీరాముని వెంట నీడలాగా ఆయన్నే అనుసరించి ఉంది.

* * *

దశరథుని మందలింపు

సర్గ - 38

సీతాదేవి తన పతివలె నారచీరలు ధరించింది. ఆయన పక్కనే నిలబడింది. వారిద్దరిని చూచిన అక్కడి జనం దశరథుని చూచి ఛీకొట్టారు. ముసలి రాజు కామపరవశుడై అన్యాయానికి ఒడిగట్టాడని చీదరించారు. అవన్నీ విని దశరథుడు చాలా చింతించాడు.

దశరథునికి తను సంపాదించుకొన్న కీర్తిప్రతిష్ఠలపైన విరక్తి కలిగింది. వారి ఈసడింపులు భరించలేక పోయాడు. దశరథునికి జీవితంపై విరక్తి కలిగింది. ఓ కైకేయీ! సీత అతిసుకుమారవతి. ఈమె జనకుని ప్రియపుత్రి. పట్టు పీతాంబరాలు ధరిస్తూ గారాబంగా పెరిగిన లావణ్యవతి. అటువంటి సీత నారచీరలు ధరించడం బాగాలేదు. వసిష్ఠమహర్షి కూడా సత్యమే చెప్పాడు.

నేను నీ ప్రతిజ్ఞాచరణంలో సీత ప్రస్తావన చేయలేదు. ఆమె పతివ్రతా శిరోమణి. నారచీరలు కట్టాల్సిన అవసరం సీతకు లేదు. ముందు ఆమెకు అమూల్యాలైన వస్త్రాదులను ఇవ్వు. సీత తనకు కావాల్సిన వస్త్రాలు ఆభరణాలు అన్నీ యథేచ్ఛగా ధరించి రాముని వెంట వెళ్తుంది. కైకా! నేను ఇక జీవించడమే వ్యర్థం. నీ ప్రతిజ్ఞాబద్ధుడనై మహాపరాధం చేశాను. నీ మూర్ఖత్వంతో వాటిని ఆయుధాలుగా చేసుకొన్నావు. వాటిని నాపైనే ఎక్కుపెట్టావు. నా కుమారులకు నారచీరలు కట్టబెట్టావు. అది చాలక నా కోడలైన సీత చేత కూడా నీవు నారచీరలు ధరింపచేయడానికి పూనుకొన్నావు. పాలు పోసిన చేతినే పాము కాటువేసినట్లుగా నడిచావు. వెదురుగడకు పుట్టిన పుష్పమే దాన్ని ఛేదించినట్లు నేను చేసిన తప్పు నన్ను కాల్చివేస్తోంది. నీ కోరిక తీర్చుకోడానికి అడ్డుగా ఉన్నాడని శ్రీరాముని అడవులు పంపుతున్నావు. మరి ఈ సౌందర్యవతి సీత చేసిన అపకారం ఏమిటి? ఈమెను నీవు ఏల శిక్షించాలనుకొన్నావు?

సీతారాములు సాధుస్వభావులు. వారిద్దరూ కలలో కూడా ఎవరికీ అపకారం చేసేవారు కాదు. అట్టి సీతకు నారచీరలు కట్టబెట్టాలనే తలంపు ఎంత ఘోరకృత్యమో కదా! రాముని అడవులకు పంపడమే నీకు నరకప్రాప్తి కలుగునని చెప్తోంది. సీతను కూడా అవమానించి నీ పాపభారాన్ని ఎలా పెంచుకొంటున్నావు?' తన ప్రియాతి ప్రియమైన కొడుకు తనను వదిలి వెళ్తున్నాడనే బాధ దశరథునిలో ఎక్కువ అయింది. దాంతో అతడు నిస్పృహ చెందాడు. స్పృహ కోల్పోయి నేలపై పడిపోయాడు. మరల కొంత తడవుకు లేచి కూర్చున్నాడు. అటువంటి దశరథునితో శ్రీరాముడు 'తండ్రీ! నేను ఉండననే బాధతో నా తల్లి కౌసల్య ఎంతగానో బాధపడుతోంది. అసలే ఆమె వృద్ధురాలు. మిమ్మల్ని ఏనాడూ అవమానించలేదు. నేడు దుఃఖభారాన్ని మోయలేకుండా ఉంది. మీరు నేను లేని కొరతను ఆమెకు కనిపించకుండా చేయాలి. మీరు మీ అనురాగాన్ని ఆమెపై చూపించి ఆమెను కాపాడే బాధ్యతను తీసుకోండి. నా తల్లిని ఊరడించే భారం మీదే' అని అన్నాడు.

* * *

దశరథుని పరితాపం

సర్గ - 39

భార్యలతో కూడి దశరథుడు మౌనివేషధారణలో ఉన్న రాముని చూశాడు. అతని కన్నులు నీటితో నిండాయి. నోట మాట రాక నిశ్చేష్టుడయ్యాడు. దుఃఖభారంలో నున్న దశరథుడు రామునికి బదులు చెప్పలేకపోయాడు. 'రామా' అంటూ గద్గదకంఠుడయ్యాడు. ఆజానుబాహువు ఐన దశరథుడు రాముని గూర్చే ఆలోచిస్తూ మాటిమాటికి మూర్ఛితుడవుతూ స్పృహను పొందుతూ ఉన్నాడు.

పూర్వం నేను ఎందరినో హింసించి ఉంటాను. ఎందరి ప్రాణాలనో పొట్టను పెట్టుకొని ఉంటాను. నేను చేసిన పాపమే నన్ను కట్టి కుడుపుతోంది. నేను చేసిన దుర్మార్గపు పనులే నన్ను దహించి వేస్తున్నాయి. పూర్వజన్మలో నేను ఏ పిల్లలను వేరు చేశానో, ఈనాడు ఈ పుత్ర వియోగం నాకు కలుగుతోంది అని దశరథుడు అనుకొన్నాడు. కాలం సమీపించకుండా ఎవరినీ మృత్యువు దరి చేర్చుకోదు. అందుకే మౌనివేషంలో ఉన్న నా రాజకుమారులను చూచి కూడా నేను బతికే ఉన్నాను. కేవలం నా వల్లనే కైక పన్నిన కుట్రలో రాముడు చిక్కుకొన్నాడు. ఒక్క దుర్మతి ఐన కైక వలన జనులందరూ శోకతప్తులు అవుతున్నారు అని అనుకొంటూ ఉన్న దశరథుని కళ్ళు ధారాపాతంగా వర్షించసాగాయి. ఆ కన్నీరు నిండిన కన్నులతో రాముని చూడలేకపోయాడు. కంఠాన్ని కన్నీళ్ళు నింపివేశాయి. దాంతో దశరథుడు రామా! అంటూ మరేమీ మాట్లాడలేకపోయాడు.

దశరథుడు దుఃఖం మింగాడు. సుమంత్రునితో ఇలా చెప్పాడు. 'ఓ సుమంత్రా! మేలు జాతి గుర్రాలను పూన్చిన రథాన్ని సిద్ధం చేయి. దానిపై సీతారామ లక్ష్మణులను కూర్చోబెట్టుకొని అయోధ్యకు ఆవలనున్న వనాలలో విడిచి రమ్ము' అని చెప్పాడు. అయ్యో! బుద్ధిమంతుడైన కొడుకును అడవులకు పంపిస్తున్నానే అని దశరథుడు చింతించాడు. సద్గుణవంతులకు దక్కేది కష్టాలేమోనని పరితాపం చెందాడు.

రాజాజ్ఞను శిరసావహించి సుమంత్రుడు మేలుజాతి అశ్వాలను రథానికి కట్టుకొని తీసుకొని వచ్చాడు. మహారాజా! బంగారు రథం సిద్ధంగా ఉంది అని దశరథునితో చెప్పాడు. నిజాయితీ ఉన్న దశరథుడు వెంటనే తన కోశాధిపతిని పిలిచాడు. పద్నాలుగేండ్లు అరణ్యాలలో ఉండేటప్పుడు సీతకు కావాల్సిన మేలిమి వస్త్రాలు, ఆభరణాలు అన్నింటిని తీసుకొని రమ్మని పురమాయించాడు.

వాటినన్నింటిని సీతకు ఇప్పించాడు. 'అమ్మా సద్గుణవతీ! నీవు ఇవన్నీ ధరిస్తూ సంతోషించు' అని చెప్పాడు. సీత ఆభరణాదులను వస్త్రాలను అలంకరించుకొంది. సీత తన సహజ సౌందర్యానికి మెరుగులు దిద్దింది. అసమాన తేజస్సుతో ప్రకాశవంతంగా సీత కనిపించింది. ఉత్తమస్త్రీలు తమ భర్తల దీనావస్థలోను వారిని గౌరవిస్తారు. ఉత్తమస్త్రీ అయిన సీతలో ఎలాంటి దైన్యం కౌసల్యకు కనిపించలేదు. తన భర్త పక్కనే ఉన్న సీత మోములో సంతోషచ్ఛాయలే కనిపించాయి. అటువంటి సీతను కౌసల్య దగ్గరకు తీసుకొని ముద్దాడింది. ఆమెకు ఇలా చెప్పింది. 'అమ్మా సీతా! చెడ్డ ఆలోచనలు గలిగిన స్త్రీల మనస్సును ఆకట్టుకొనడం చాలా కష్టం. వారిలో సచ్ఛీలం ఉండదు. వారు ఒక్క క్షణంలో వారి భర్తపై అనురాగాన్ని తుంచివేయగలరు. అటువంటి స్త్రీలు స్త్రీ జాతికే తలవంపులు తెస్తారు. వాళ్ళ హృదయం కఠినపాషాణమై ఉంటుంది.

కాని ఉత్తమ ఇల్లాళ్ళు మెత్తని స్వభావం కలవారు. మంచి హృదయం ఉన్నవారు. శమదమాల్లో స్థిరచిత్తం ఉన్న స్త్రీలు ఒక్క భర్తనే పరదైవంగా ఆరాధిస్తారు. వారు వారి భర్త ధనహీనుడైనా ధనవంతుడైనా ఒక్కమాదిరిగానే చూస్తారు. స్త్రీలందరూ ఎప్పుడూ ఆనందాన్నే అభిలషిస్తారు. కొంచెం ఆపదలు రాగానే కొందరాడవాళ్ళు పతులను అవమానిస్తారు. ఇది దుష్టచరిత్ర గలవారికే సాధ్యమవుతుంది.

ఓ సీతా! ధర్మాధర్మాలు తెలిసినదానవు జ్ఞానవంతురాలివి. నా కొడుకు విషయంలో ఏమరుపాటులేక రాముని నొప్పించక నీవు నొచ్చుకోక కాలం గడపగలవని నేను ఆశిస్తున్నాను' అని చెప్పింది.

కౌసల్య మాటలకు సీత సంతోషించింది. 'అత్తయ్యా! మీరు చెప్పిన రీతిలోనే నేను నడుచుకొంటాను. మీరు నా గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు. నా తల్లిదండ్రులు సైతం నాకు ధర్మాలను తెలిపి ఉన్నారు. కాంతి చంద్రుని వీడనట్లు నేను ధర్మాన్ని వీడను. తీగలు లేని వీణ మ్రోగదు. చక్రాలు లేని శకటం ముందుకు పోలేదు. అలానే నేను నా భర్త లేకుండా ఒక్క క్షణమైనా నిలవలేను. నాకు ఆనందాన్ని చేకూర్చే భర్తను నేను ఎందుకు అవమానిస్తాను? అసలు స్త్రీలందరికి ఉత్తమగతులను, ఇహపరసుఖాలను ఇచ్చేది భర్తే గదా. మరి అటువంటి భర్తను పూజించకుండా ఏ స్త్రీ ఉండగలదు?' అని సీత కౌసల్యకు మారుపలికింది. సీత మాటలు విన్న కౌసల్య మనస్సు ఆర్ద్రం అయింది. ఒక్కసారి కౌసల్య కన్నులను ఆనందాశ్రువులు దుఃఖాశ్రువులు నింపివేశాయి.

ధర్మాత్ముడైన రాముడు 'అమ్మా! నీవు దుఃఖించకుండా నా తండ్రిని సరిగా చూచుకోమ్మా.' అంటూ కౌసల్యకు ప్రదక్షిణ నమస్కారాలు చేశాడు. అమ్మా పద్నాలుగేండ్లు ఒక చిటికెలో అయిపోయినట్లు అయిపోతాయి. నేను మిత్ర సమేతంగా తిరిగి అయోధ్యకు వస్తాను. మీకు ఆనందాన్ని కలుగజేస్తాను అని చెప్పాడు. మిగతా 350 మంది తల్లులవైపు తిరిగి వారిని చూశాడు.

"అమ్మల్లారా నేను మీ బిడ్డను. మీకు నేను తెలిసి కాని, తెలియక కాని అపచారం చేసి ఉంటే నన్ను మన్నించండి. మీరందరూ నేను అడవులకు వెళ్ళటానికి అనుమతిని ఇవ్వండి" అని అడిగాడు. రాముని మాటలు విన్న వారందరూ హతాశులయ్యారు. క్రౌంచపక్షులలాగా రోదించారు.

ఎప్పుడు మంగళతూర్యనాదాలతో జయఘోష వినిపించే దశరథుని భవనం నేడు చింతాక్రాంతులతో నిండిపోయింది. ఘోరంగా వినిపించే సముద్ర ఘోషలాగా ఏడుపులతో పెడబొబ్బలతో దశరథుని భవనం దద్దరిల్లింది.

* * *

సీతారామలక్ష్మణుల వనవాసప్రయాణం

సర్గ - 40

సీతారాములు, లక్ష్మణుడు దశరథునకు ప్రదక్షిణనమస్కారాలు చేశారు. వారిని ఎడబాసిపోతున్నామనే దిగులు వారిలో నిండింది. కౌసల్యకు వారు నమస్కరించారు. లక్ష్మణుడు కౌసల్యాదశరథులకు నమస్కరించాడు. తన తల్లి అయిన సుమిత్రాదేవికి ప్రణమిల్లాడు. పాదాభివందనం చేసే లక్ష్మణకుమారుని లేవనెత్తి సుమిత్ర తన హృదయానికి హత్తుకొంది. శిరము మూర్కొంది. 'నాయనాలక్ష్మణా! నీకు నీ మిత్రులపై అమిత ప్రేమ ఉంది. శ్రీరామునిపై నీకు అపారభక్తి భావం ఉంది. దానికి నాకు చాలా సంతోషం వేస్తోంది. పెద్దవారి పట్ల గౌరవాభిమానాలు చిన్నవారికి ఉండాలి. శ్రీరాముని సేవించడం కోసమే నీవు నా కడుపున పుట్టావు. అన్నా వదినల్లో నన్ను మీ తండ్రిని చూచుకొంటూ, వారిని ఎల్లవేళలా అప్రమత్తుడవై కాపాడుతూ ఉండు. ఇది నీ కర్తవ్యం.

కర్తవ్యపాలనలో కాస్తయినా ఏమరుపాటు ఉండకూడదు. ఓ సుపుత్రా! నీవు అన్న అడుగు జాడలలోనే నడువు. ఇదే ధర్మము. సత్పురుషులందరూ దీనినే గ్రహిస్తారు. నీవు కూడా సద్బుద్ధి కలిగి వనవాసదీక్షను ముగించుకొని తిరిగి సీతారాములతో కలిసి రమ్ము' అంటూ సుమిత్ర లక్ష్మణునితో చెప్పింది.

సుమిత్ర మరల లక్ష్మణునితో ఇలా చెప్పింది.

'ఓ ప్రియపుత్రా! మన వంశంలోని వారందరూ అత్యంతదీక్షాదక్షులు. వారందరూ త్యాగబుద్ధిలో, దానం చేయడంలో, యజ్ఞయాగాది కర్మలు చేయడంలో వారికి వారే సాటి అయినవారు. మన వంశపరంపరలను గుర్తుపెట్టుకొని నీవు నడుచుకో. మన వంశప్రతిష్ఠను ఇనుమడింపచేసేటట్లుగా నీ ప్రవర్తనతో సీతారాముల్ని ఆనందింపచేస్తూ దీక్ష ముగించుకొని రండి' అంది.

అంతలో మాతలి దేవేంద్రునితో చెప్పినట్లుగా సుమంత్రుడు అంజలిబద్ధుడై శ్రీరాముని ఎదురుగా నిల్చున్నాడు. 'ఓ దశరథ కుమారా! రథం సిద్ధం చేశాను. మీరు ఎక్కడికి తీసుకొని వెళ్ళమని చెప్తారో నేను అక్కడికి తీసుకొని వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నాను' అని చెప్పాడు.

తన తల్లి దగ్గర అనుమతి పొందిన లక్ష్మణుని, ఆభరణాలు అలంకరించుకున్న సీతను తీసుకొని ఆజానుబాహువైన శ్రీరాముడు రథం ఎక్కాడు.

ఆ రథంపై సీత కోసం దశరథుడు ఇచ్చిన అమూల్యాభరణాలు, రామలక్ష్మణుల కోసం దివ్యాస్త్రాలు, రక్షణ కవచాలు, విల్లంబులు, తూణీరాలు, పలుగు బుట్టలు సుమంత్రుడు పెట్టాడు.

సుమంత్రుడు సీతారామలక్ష్మణులు ఎక్కిన రథాన్ని ముందుకు తోలాడు. వీధుల్లో కిక్కిరిసిన జనాన్ని పక్కకు తొలగమంటూ అశ్వాలను అదిలిస్తూ రథాన్ని నెమ్మదిగా సాగించాడు. అక్కడ పట్టాభిషేకమహోత్సవాన్ని చూడడానికి వచ్చిన జనులు ఈ విపరీతాన్ని చూసి తట్టుకోలేక మూర్ఛిల్లారు. వారందరూ స్పృహ తెచ్చుకొని గట్టిగా ఏడ్వసాగారు. చతురంగబలాలు అదుపు తప్పాయి. రాముని వియోగాన్ని జంతువులు భరించలేకపోయాయి. మత్తెక్కిన గజాలు, అశ్వాలు కోపంతో రెచ్చిపోయాయి. బాధతో ఘూర్ణిల్లాయి. వాటి ధ్వనులతో అయోధ్య దద్దరిల్లింది. అయోధ్యాపురాన్ని శోకం ఆవహించింది.

గ్రీష్మతాపానికి తట్టుకోలేక దాహార్తితో అలమటించే జనంలాగా రాముని వియోగదుఃఖాన్ని ఆ నగర వాసులు భరించలేకపోయారు. వారందరూ వెక్కి వెక్కి ఏడ్వసాగారు. 'ఓ సుమంత్రా! మరలా పద్నాలుగేండ్లు తరువాత గాని రామలక్ష్మణుల్ని చూడలేము నిదానంగా రథాన్ని తోలు. కాసేపైనా వారిని చూసి ఆనందిస్తాము అని వారందరూ ముక్తకంఠంతో చెప్పసాగారు. కోలాహలధ్వని మాయమై అక్కడి వాతావరణం గంభీరంతో శోకధ్వనులతో నిండిపోయింది.

అక్కడి వారందరూ ఇలా తలపోశారు. 'ఈ కౌసల్యామాత గుండె రాయివలె కఠినమై ఉంటుంది. తన చిన్నారి తనయులను అడవులకు పంపుతూ ఉంటే ఆమె ఎద ముక్కలు కాదా? ఈ సీత కృతార్థురాలు. చంద్రుని అంటి ఉండే తారల్లాగా నిత్యం రాముని తోడునీడగా మెలిగే స్త్రీ ధన్యురాలు. ఆమె జీవితం సార్థకమైంది. ఈ లక్ష్మణుని పుణ్యమే పుణ్యం. ఇతడు ప్రాణతుల్యుడైన అన్నను సదా అనువర్తించి ఉంటాడు. భ్రాతృసేవాభాగ్యం ఎంత గొప్పదో కదా. అది ఉత్తముడైన లక్ష్మణ కుమారునే వరించింది' అంటూ నగరవాసులు పరిపరివిధాల అనుకొన్నారు.

అంతలో రాజాంతఃపుర స్త్రీలు రాముని ఒక్కసారిగా చూడాలన్న తలంపుతో అందరు ప్రాసాదం బయటకు వచ్చారు. మహారాజు తన వెన్నంటి ఉన్న స్త్రీల ఏడుపులు విని చేతనారహితుడయ్యాడు. మహాతేజస్వి భుజ బల సంపన్నుడైన దశరథుడు రాహువు మింగిన సూర్యుడిలాగా చిన్నబోయాడు. కన్నుల నీరు స్రవిస్తుండగా రాముడు వెళ్ళినవైపు తదేకంగా చూశాడు.

దానినంతా రాముడు రథంపైనుండి తిరిగి చూశాడు. తన తల్లిదండ్రుల దైన్యస్థితిని చూడలేక దిగులు చెందాడు. 'ఓ సద్బుద్ధిగల సుమంత్రా! రథాన్ని వేగంగా నడిపించు. నేను నా తల్లిదండ్రుల ఏడుపును చూడలేకున్నా' నని చెప్పాడు. ప్రజలందరూ రథాన్ని మెల్లగా తోలుమని సుమంత్రుని నిర్బంధిస్తున్నారు. రథం తోలే సూతుడు ఏం చేయాలో తోచక సందిగ్ధావస్థలో పడ్డాడు. వేగంగా నడుస్తున్న ప్రజలవల్ల, రథం సాగడంవల్ల రేగిన దుమ్ము అయోధ్యావాసులు కురిపిస్తున్న కన్నీటి ప్రవాహంలో తడిసి అణగారిపోయింది.

బాలలు, వృద్ధులు, స్త్రీలు అందరూ రామ వియోగాన్ని తాళలేకపోయారు. వారి కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. పురజనులందరూ వ్యాకులం చెందడాన్ని దశరథుడు చూశాడు. దీనికి కారణం నేనేనని అనుకొంటూ స్పృహ తప్పి నేలకొరిగాడు. అలా దుర్భరదుఃఖంతో కూలిపోయే మహారాజును ప్రజలు చూశారు. అందరూ ఒక్కమారుగా హాహాకారాలు చేశారు. 'అయ్యో! రామా' 'అయ్యో! కౌసల్యా' అనే మాటలు ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. అంతఃపుర జనులందరూ తీవ్రతాపానికి గురి అయ్యారు.

అలా భీకరధ్వనిని విని రాముడు ఒక్కసారి వెనుతిరిగి చూశాడు.

భ్రాంతచిత్తులై తన తల్లిదండ్రులు పరుగెత్తుతూ తమవైపు రావడాన్ని రాముడు చూశాడు. అలాంటి స్థితిలో నున్న తల్లిదండ్రుల అవస్థను రాముడు చూడలేకపోయాడు. ధర్మపాశంతో కట్టబడిన రాముడు తిరిగి రాలేకపోయాడు.

దూడను వదిలి ఉండలేని ధేనువులాగా కౌసల్య 'రామా' అంటూ విలపిస్తూ దగ్గరికి పరుగెత్తింది. ఎప్పుడూ వాహనారూఢులై తిరిగే తల్లిదండ్రులు కాలినడకన రహదారిలో పరుగెత్తి రావడాన్ని రామలక్ష్మణులు చూడలేకపోయారు.

తమ గారాలపట్టిని విడువలేక దశరథుడు 'సుమంత్రా ఆగు, ఆగు' అంటూ పరుగెత్తాడు. 'ఓ రామా,''లక్ష్మణా, సీతా' అంటూ కౌసల్యాదులు ముందుకు ఉరికారు. వారిని చూడలేక రాముడు సుమంత్రుని తొందరపెట్టాడు. రామ, దశరథుల మాటల్లో ఏది పాటించాలో తెలియక అడకత్తెరలో నలిగే పోకచెక్కలాగా సుమంత్రుడు నలిగిపోయాడు.

దాన్ని గమనించిన రాముడు 'సుమంత్రా! రథాన్ని వేగంగా తోలు. మహారాజు నిన్ను ఆపలేదేమని అడిగినపుడు నాకు మీ మాటలు వినబడలేదని చెప్పొచ్చు' అని చెప్పాడు. దుఃఖంలో మునిగినవారిని నేను ఎక్కువసేపు చూడలేను. వారిని ఈ స్థితిలో ఓదార్చితే వారి దుఃఖం ఎక్కువౌతుందేగాని తగ్గదు. అందుకే నేను రథాన్ని త్వరగా తోలమని చెప్తున్నాని తన ఆవేదనను రాముడు సుమంత్రునకు తెలిపాడు

సుమంత్రుడు రాముని స్థితిని అర్థం చేసుకొన్నాడు. ఆయనను బాధపెట్టడం ఇష్టం లేక రథాన్ని వేగంగా నడిపించాడు. అంతఃపుర జనులు బాధలను తట్టుకోలేకపోయారు. చేసేదేమీ లేక వెనుదిరిగారు. కాని వారి మనస్సును రాముని నుండి మరల్చుకోలేకపోయారు. వారి అధీనంలో లేక వారి నయనాలు సంతతధారగా కన్నీటిని స్రవించాయి.

శాస్త్రమర్యాద తెలిసిన పండితులు విప్రులు గురువులు దశరథునితో ఇలా చెప్పారు.'ఓ రాజా! ఎవరిని అయితే త్వరగా తిరిగి రావాలని ఆశిస్తామో వారు వెళ్ళేటప్పుడు ఎక్కువ దూరం వారిని అనుసరించి పోకూడదు.'

వారి మాటలు విని దశరథుడు అక్కడే వెనక్కు తిరిగాడు. అతని శరీరం దుఃఖంతో కృశించిపోయింది. బాధను తట్టుకోలేక దశరథుని శరీరం సన్నగా కంపించింది. ఆయనను చూసి అంతఃపుర స్త్రీలు నగరవాసులు దుఃఖితులయ్యారు.

* * *

శోకతప్తమైన అయోధ్య

సర్గ - 41

సీతారామలక్ష్మణ వియోగాన్ని భరించలేక అంతఃపురవాసులు బిగ్గరగా ఏడ్చారు. సర్వులకు ప్రియం కలిగించే శ్రీరాముడు దిక్కులేని వాడుగా అడవులకు వెళ్ళడాన్ని నగర వాసులు జీర్ణించుకోలేకపోయారు. దుఃఖార్తుల కన్నీటిని తుడిచే రాముడు ఎక్కడకు వెళుతున్నాడో? ఎలా పదునాలుగేండ్లు వనవాసం చేస్తాడో అని వారందరూ ఎంతగానో కుమిలిపోయారు.

కోపమే ఎరుగనివాడు, ఎవ్వరు తనను కోపించినా వారిపై కరుణనే కలిగి ఉండేవాడు, ఇతరుల దుఃఖాలలో పాలుపంచుకొనేవాడు అయిన రాముడు ఎక్కడికి వెళ్ళాడోనని నగరవాసులు అనుకొంటూ వ్యాకులం చెందారు.

కౌసల్యాదేవిని గౌరవించినట్లే స్త్రీలందరిని రాముడు గౌరవించేవాడు గదా! సోదరులను రాముడు ప్రేమించినట్లు మరి ఎవరూ ప్రేమించలేరు గదా! సేవకులపై రాముని ప్రేమ అపారం గదా! శరణన్నవారిని కాపాడడంలో ఇనకులవంశంలోనే పేరెన్నికగన్నవాడు గదా! సత్యసంధతలో రాముని మించిన వారు ఎవరూ లేరని జనులందరూ రాముని గూర్చి పదే పదే చింతించసాగారు.

ఈ దశరథుడు మతితప్పిన వాడయ్యాడు. లేకుంటే ఆర్తత్రాణపరాయణుడైన రాముని కానలకు పంపునా? అసమాన పరాక్రమశాలులైన రామలక్ష్మణులను దూరం చేసుకొనేవాడా? అని వారందరూ అనుకొన్నారు. అయోధ్య అంతా నిండిన రోదన ధ్వని దశరథుని చెవులు బ్రద్దలు చేసింది. దాంతో దశరథుడు దుఃఖభారంతో సముద్రంలో మునిగిన శిలవలె శోకంతో క్రుంగిపోయాడు.

పురమంతా శోకాగ్నితో జ్వాలాయమానమైంది. ఎవరూ నిత్యవిధులను స్మరించలేదు. నిత్యాగ్నిహోత్రాల జోలికి వెళ్ళలేదు. గృహస్థుల ఇండ్లు వాకిళ్ళు నిశ్శబ్దంతో తాండవించాయి. మహిళలు తాము చేయాల్సిన కార్యాలను మరచిపోయారు. పిల్లలు పాలు తాగడం మరిచారు.

దూడలు సైతం గోవుల దగ్గరకు వెళ్ళలేకపోయాయి. పశువులు మేత తినడం మానివేశాయి. సూర్యుడు తన ప్రచండాగ్నిని జ్వలించలేకపోయాడు. రాత్రించరుడు వెన్నెల వెలుగులను విరజిమ్మలేక మబ్బుల మాటున దాగాడు. తొలికాన్పులో మగబిడ్డను ప్రసవించిన తల్లులు తమ వంశాంకురాన్ని చూచి సంతోషించలేకపోయారు. ఉత్పాతాలకు గురిఅయిన సముద్రంలాగా అయోధ్య సంక్షోభించింది.

అన్ని దిక్కులలో చీకట్లు ఆవరించాయి. ప్రతివారి మనస్సు తమస్సుతో నిండింది. పౌరులందరిలో దైన్యం ఆవరించింది. దైవనిర్ణయానికి తిరుగులేదని వాపోయారు. తమ ప్రియతమనాయకుడు కనుమరుగు అయ్యాడని చింతించారు. మరల ఎప్పుడు రామదర్శనం జరుగుతుందోనని ఎదురుచూశారు. వారందరూ వయోవృద్ధుడైన దశరథుని చూసి వగచారు. నిన్నటిదాకా పుత్రులలేమితో బాధపడిన దశరథుడు నేడు పుత్రవియోగదుఃఖంతో

క్రుంగిపోతున్న స్థితికి జాలిపడ్డారు. సతీపతులు వారిమధ్య ఉండాల్సిన అన్యోన్యతను మరిచారు. కుమారులు తండ్రి ఎడ చూపాల్సిన గౌరవాదరాలను పక్కన పెట్టారు. తండ్రులు తమ పిల్లలపై పెంచుకునే వాత్సల్యంపై విరక్తి చెందారు. సోదరుల మధ్య ఉండే ఆత్మీయతాబంధంపై మమతను మరిచారు.

రాముని మిత్రులందరూ రామవియోగాన్ని భరించలేక తమ శరీరం నుండి ఒక భాగం వేరైనట్లుగా చింతించారు. శ్రీరాముడు లేని అయోధ్య ప్రకృతివైపరీత్యానికి భీతిచెందిన హరిణిలాగా అయిపోయింది. అయోధ్యలోని ప్రతిప్రాణి రాముని తలచి చలించిపోయింది. వారి దుఃఖాశ్రువులను ఆపే శక్తి ఎవరికీ లేకపోయింది. భూమి వారి రోదనలతో కంపించింది.

* * *

దశరథుని పుత్రవియోగ విలాపం

సర్గ - 42

శ్రీరాముని రథం వెళ్లిన వైపే దశరథుడు చూడసాగాడు. రథచక్రాల వేగానికి రేగిన దుమ్ము కనబడు తున్నంతసేపు దశరథుడు మునివ్రేళ్లపై నిలబడి నిక్కినిక్కి చూశాడు. ఆ దుమ్ము కూడా కొద్దిసేపటికి కనిపించకుండా పోయింది. ఆ పుత్రవియోగభారాన్ని తట్టుకోలేక దశరథుడు నేలపై ఒరిగిపోయాడు. తటాలున కౌసల్య వచ్చి కుడిభుజం పట్టుకొంది. దశరథుని లేపబోయింది. అప్పుడు కైక కూడా వచ్చి దశరథుని పట్టుకొని లేపడానికి ప్రయత్నించింది.

నీతిమంతుడైన దశరథుడు కైకను చూడగానే మండిపడ్డాడు. "ఓ కైకా! నీవు నన్ను ముట్టుకోకు. నీ ముఖం నాకు చూపించకు. నీవు నాకు ఏవిధంగానూ భార్యవు కాదు. నాకు నీతో ఎటువంటి సంబంధంలేదు. నిన్ను ఆశ్రయించిన జనులతో సైతం నాకు బాంధవ్యం ఈనాటితో తెగిపోయింది. ధనాశతో నా వంశాన్ని నాశనం చేయడానికి పూనుకొన్నావు. అధర్మపరురాలివైన నిన్ను నేడు పరిత్యజిస్తున్నాను. నేను నీ కుటిలయత్నాలు తెలియక అగ్నిసాక్షిగా నిన్ను పెండ్లాడాను. ఈరోజునుంచి నీతో నాకు ఎట్టి సంబంధం లేకుండా తుంచి వేస్తున్నాను. ఇహపరసుఖాలలో, దుఃఖాలలో నీదారి నీదే, నా దారి నాదే! ఈ అఖండ కోసలరాజ్యం నీదే. నా కొడుకైన భరతుడు ఈ అధర్మమైన పద్ధతిలో రాజ్యాన్ని స్వీకరించడానికి ఇష్టపడితే ఆ భరతుడు నేను మరణించిన తర్వాత నాకు చేయు శ్రాద్ధకర్మల ఫలాలు నాకు చెందవు" అన్నాడు కఠోరంగా కైకతో దశరథుడు. కౌసల్య దశరథుని లేవనెత్తింది. దశరథుడు కౌసల్యతో కూడి కౌసల్యా మందిరానికి వెళ్లడానికి వెనుదిరిగాడు. అక్కడ కూడా చేసిన తప్పును పదే పదే తలుస్తూ పరితాపం చెందాడు. అగ్ని అని తెలిసి చేతిలో పట్టుకొన్నట్లు, బ్రహ్మహత్య చుట్టుకొన్నవాడిలాగా దశరథుడు ఎంతగానో దుఃఖించాడు. రాముడు వెళ్లినవైపే పదేపదే దశరథుడు చూస్తూ తన మనస్సులోని బాధను పైకి చెప్పుకోలేక దిగులు చెందాడు.

అంతలో శ్రీరాముని రథం నగరం పొలిమేరలకు చేరిందన్న వార్త తెలిసింది. ఆ వార్త విన్న దశరథుడు ఇలా అన్నాడు– 'నా కుమారుని ఎక్కించుకొని వెళ్లిన రథాశ్వాల జాడలు కనబడుతూ ఉన్నాయి. కాని మహాత్ముడైన నా చిన్ని తనయుడు కానరావడంలేదు. నా ముద్దులపట్టి చందనాది సుగంధ ద్రవ్యాలు పూసుకొని హంసతూలికా తల్పంపై పడుకొనేవాడు. నేడు కఠిన శిలలపైన ఎండుగడ్డి పరుపుమీద ఎలా పడుకొంటాడో' అని చింతించాడు. 'ఇప్పుడు ఏ రాతినానుకొనో లేక చెట్ల నీడలను ఆశ్రయించి విశ్రాంతి పొందుతాడేమో' అని అనుకొన్నాడు.

'ఇక్కడ వందిమాగధులు జయధ్వానాలు చేస్తుంటే బాలభానుడిలాగా నా రాముడు మేల్కాంచేవాడు. కాని వనాలలో తిరిగే నా రాముడు కటిక నేలపై పడుకొని దుమ్ముతో శరీరం మలినమై ఉంటుంది. నా కుమారుడు దానిని భరించలేక నిట్టూర్చుతూ లేచి నిత్యకృత్యాలు తీర్చుకోవాలిగదా. ఇట్టివానిని ఆటవికులు చూస్తారుగదా! అని చింతించాడు.

ఎండ కన్నెరగని సుకుమారి జనకుని పుత్రి. ఆమెకు ఈ అడవులు, అరణ్యాలు కొత్తవి. కాలినడకను రామునితో నడిచేటప్పుడు సీత బాధపడుతుందేమో. ఉన్నట్టుండి క్రూరమృగాలు చేసే ధ్వని విని సీత భయకంపిత అవుతుందేమో అని అన్నాడు. కోపాన్ని అణచుకోలేక దశరథుడు 'ఓ కైకేయీ! నీ పాపచింతనతో నాకు మరణం తప్పదు. విధవవైన నీవు నేను సంపాదించి పెట్టిన రాజ్యాన్ని అనుభవించు' అన్నాడు.

నగరవాసులందరూ శ్రీరాముని వెంట వెళ్లారు. అయోధ్య అంతా జనం లేక బోసిపోయింది. నాలుగు రోడ్ల కూడళ్లు వెలవెలబోయాయి. వయస్సు పైబడినవారు, బాలలు ఏమి చేయాలో తోచక విలపించారు. దేవాలయాలను, అంగళ్లను మూసివేశారు. దీనినంతా చూచిన దశరథుడు వ్యథ చెందాడు. సూర్యుడు మబ్బుల చాటుకు వెళ్లినట్లు మహారాజు తన అంతఃపురంలోకి వెళ్లాడు. సీతారామలక్ష్మణులు లేని ఆ గృహం చంద్రుడు లేని ఆకాశంలాగా నిశ్శబ్దం ఆవరించింది.

మనశ్శాంతిని కోల్పోయిన దశరథుడు అక్కడున్న ద్వారపాలకులతో నన్ను కౌసల్య ఇంటికి చేర్చండి. ఇక ఎక్కడా నాకు మనశ్శాంతి లభించదు అని దశరథుడు చెప్పాడు. ద్వారపాలకులు ఆయన చెప్పినట్లుగానే చేశారు. అక్కడ శయనమందిరం చేరి పర్యంకంపై దశరథుడు కూర్చున్నాడు. సీతారామలక్ష్మణులు లేని భవనం శూన్యంగా కనిపించింది.

'అయ్యో రామా! తల్లిదండ్రులను విడిచి వెళ్లావా' అంటూ దశరథుడు బిగ్గరగా ఏడ్వసాగాడు. 'పద్నాలుగేళ్ల తర్వాత రామదర్శనం లభించినవారి పుణ్యమే పుణ్యంకదా! రాముని ఆలింగనసుఖాన్ని చవిచూసినవారి సుఖమే సుఖంగదా. మరి అటువంటి భాగ్యం నాకు ఉందోలేదో అని చింతించాడు.

రాత్రి అయింది. దశరథునికది కాళరాత్రి లాగే అనిపించింది. దశరథుని మనస్సు ఎంత ప్రయత్నించినా రాముని ధ్యాసనుంచి మరవలేదు. కళ్లు మూసుకొన్నా తెరచుకొన్నా రాముడే ఆయనకు కనిపించేవాడు. అందుకే 'కౌసల్యా!'అని పిలిచాడు. 'రాముని విడిచి నేను ఉండలేను. రామధ్యాసలో మునిగిన నాకు రాముడు తప్ప ఏవీ కనిపించడంలేదు. ఓ కౌసల్యా! నీవు ఇక్కడే ఉన్నా నేను నిన్ను గుర్తించలేకపోయాను.

ఓ కౌసల్యా! నీవు రాముని కన్నతల్లివిగదా! ఒక్కసారి నీ చేతితో నన్ను స్పృశించు. నాకు ఆనందం వస్తుందేమో' అని దశరథుడు రామవియోగాన్ని భరించలేక వ్యథచెందాడు.

మహారాజు దీనావస్థను కౌసల్య చూసింది. కన్నకొడుకు కారడవుల పాలయ్యాడని, తన భర్త చెంత కూర్చుని ఎంతగానో విలపించింది.

* * *

కౌసల్యా విలాపం

సర్గ - 43

పుత్రశోకాన్ని భరించలేని దశరథుడు పర్యంకంపై పడుకొన్నాడు. కౌసల్య పుత్రవియోగబాధతో కృశిస్తూ ఆయన పక్కనే కూర్చుంది. "ఓ మహారాజా! నేడు ఎంత దుర్దశ ప్రాప్తించిందో? కైక కుటిల స్వభావి. విషమున్న నాగిని లాంటిది. తన క్రూరస్వభావంతో నా కుమారుని నానుంచి దూరం చేసింది.

వక్రబుద్ధితో భరతునకు రాజ్యం లభించాలని ఆశించింది. మీరు దానికి సమ్మతించారు. భరతుడు రాజు అయినప్పటికీ రాముడు ఎందుకు అడవులకు వెళ్లడం? ఒకవేళ భరతుని ఇష్టప్రకారం అతని బంటులాగా ఉంటూ ఆయన చెప్పిన పనులు చేస్తూనే నాకంటి ఎదురుగా ఉండేవాడు కదా. భిక్షాటన చేస్తూ నా దగ్గర ఉండమని చెప్పినా బాగుండేది. నేడు ఈ శోకాగ్ని నన్ను కాల్చివేసేది కాదేమో!

దుష్టచరిత గల కైక రాముడిని అడవులకు పంపింది. ఇక పనిగట్టుకొని నన్ను హింసిస్తుంది. యజ్ఞం చేసి హవిర్భాగాలను దేవతల పరం కాకుండా రాక్షసులకు ఇచ్చినట్లుగా మీరు రాజ్యాన్ని కైక ఒత్తిడితో భరతునికి అర్పించారు.

గజరాజువలె గంభీరంగా నడిచేవాడు, ఆజానుబాహువు, సౌశీల్యుడు అయిన రాముడు సీతాలక్ష్మణులతో కలసి అరణ్యంలో ప్రవేశించాడేమో!" అని కౌసల్య అన్నది.

"సుఖాలను అనుభవించాల్సిన తరుణంలో వారిని వానప్రస్థానికి పంపినట్లు అడవులపాలు చేశారు. ఎప్పుడూ కష్టాలు ఎరుగని సీత నేడు ఎట్టి దురవస్థను ఎదుర్కొంటుందో? ఈ వనవాసదీక్ష ఎపుడు ముగుస్తుందోకదా? ఎప్పుడు నా బిడ్డలు వనవాసాన్ని ముగించుకొని తిరిగి వస్తారో?

రాముడిని నేను ఎప్పుడు చూస్తానో? ఆ శుభ సమయంలోనే నా పరితాపం తీరుతుంది. తిరిగి వచ్చిన వారి ముగ్గురిని చూసి అయోధ్యావాసులందరూ పట్టరాని సంతోషాన్ని పొందుతారు.

ధ్వజపతాకాలు రెపరెపలాడేటప్పుడు ఆవుతో కలిసి వృషభం నడిచినట్లుగా సీతతో కలిసి రాముడు రాజ్యలక్ష్మిని వరించి ఎప్పుడు తిరుగునోకదా? వారు అలా తిరిగేటప్పుడు ప్రజలు సంతోషంతో వారిపై పేలాలు ఎప్పుడు చల్లుతారోకదా! ఆ శుభ సమయం ఎప్పుడు వస్తుందో?

దీర్ఘబాహువులు కలిగిన రామలక్ష్మణులు దివ్య తేజస్సుతో ధనుర్ధారులై ఖడ్గహస్తులై ధీరోదాత్తంగా ఎప్పుడు అయోధ్యలో అడుగుపెడ్తారో? అప్పుడు వారిని చూసే భాగ్యం నాకు కలుగుతుందో లేదో" అంటూ కౌసల్య దశరథునితో అంది.

"రాముడు విశ్వామిత్ర మహర్షి వద్ద విద్య అభ్యసించాడు. ఎందరో రాక్షసులను మట్టుపెట్టాడు. జనకుని సుతను పాణిగ్రహణం చేశాడు. నేడు దండకారణ్యాలకు వెళ్లాడు. పదునాలుగేండ్లు గడచిన తర్వాత తిరిగి అయోధ్యను పాలిస్తాడు. కాని నాకు మాత్రం నా చిన్ని కుమారుడు ముద్దులు మూటగట్టు బాలుడే. అతడు నా ఒళ్లో పడుకొని నాతో ఆడుకొనే చిన్నారి తనయుడే. కొడుకులు ఎంతటి వీరాధివీరులైనా అమ్మకు మాత్రం తనయులేకదా.

ఓ రాజా! ఇందులో నా తప్పు కూడా నాకు కనిపిస్తోంది. పూర్వజన్మలో నేను పాలు తాగాలనే ఉబలాటపడే దూడలను బలవంతంగా ఆవులనుంచి వేరుచేశానేమో? ఓ నరోత్తమా! నేడు దూడను ఆవును వేరుచేసే సింహపు వలలో చిక్కాను. ఆ సింహం లాగా నేడు దుష్టకైక నన్ను నా కొడుకును వేరుచేసింది.

సకల సద్గుణ రాశి అయిన నా కుమారుని వదిలిపెట్టి నేను ఎక్కువ కాలం జీవించలేను. నా ముద్దులపట్టిని చూడకుండా జీవితాన్ని గడపలేను. సూర్యకిరణాల తాకిడితో పచ్చనిపొదలు తగలబడినట్లుగా నేను పుత్ర వియోగాగ్నిలో దహించిపోతున్నాను' అని కౌసల్య విలపిస్తోంది.

* * *

సుమిత్ర ఓదార్పు

సర్గ - 44

కౌసల్య విలపించడం సుమిత్ర చూడలేకపోయింది. ఆమెను ఊరడించడం తన బాధ్యత అనుకొంది. వెంటనే 'ఓ పూజనీయులారా!మీరు ఎందుకు ఇంతగా శోకిస్తున్నారు? ఇది మీకు అనుచితం. మీరు మహారాణి. దశరథుని పట్టమహిషి. రాజ్యంలో ఎవరైనా దుఃఖార్తులు అయితే వారిని ఊరడించి వారిలో ఉత్సాహాన్ని నింపవలసిన మీరు ఇంతగా రోదించడం మంచిదికాదు. అక్కా! మీ కుమారుడు సాధారణపౌరుడు కాదు. భుజబలంలో ఇంద్రుని వంటివాడు. అనేకానేకదివ్యాయుధసంపన్నుడు. అతనిని గూర్చి మీరు చింతించడం పనికిమాలినపని అనిపించుకొంటుంది. రాముడు నిత్యసత్యవచనుడు.

ఎట్టి పరిస్థితుల్లోనూ ధర్మాన్ని వదలనివాడు. శరణాగతవత్సలుడు. ఎదుటివారి మనస్సు ఎరిగి నడుచుకొనేవాడు. అటువంటి ధర్మనందనుణ్ణి గూర్చి నీవు ఆలోచించాల్సిన పని ఏముంది? లక్ష్మణుడు శత్రు భయంకరుడు. రామునికి తోడునీడై మసలేవాడు. ధనుస్సును చేతబట్టి లక్ష్మణుడు ముందు నడుస్తుండగా సీతారాములకు ఎదురువచ్చేవారు ఎవరుంటారు? సోదరప్రేమ గల రాముణ్ణి సేవించే భాగ్యం లక్ష్మణునికి దక్కింది.

పతిసేవాభాగ్యానికి మించింది స్త్రీకి ఏదీ ఉండదుకదా! దీన్ని తెలుసుకొన్న సీత రాముణ్ణి అనుసరించి వెళ్లింది. భర్తనీడలో మసలే భార్యకు కోరదగింది ఏమీ ఉండదుకదా? శ్రీరాముని చెంతనే ఉన్న సీతకు కొరత ఎందుకుంటుంది? శ్రేష్ఠుడైన సోదరుణ్ణి, తన శరీరంలో సగభాగమైన అర్ధాంగిని పక్కనే పెట్టుకొన్న శ్రీరామునికి కావలసింది ఏముంది?

శ్రీరాముడు మృదుస్వభావి. త్రికరణశుద్ధి కలవాడు. ఇతరులకు సంతోషం కలిగించడంలో తృప్తి పొందేవాడు. అటువంటి రాముని దగ్గరకు బాధ ఎందుకు చేరుతుంది? పరుల సేవే పరమాత్మసేవ అని భావించేవారికి సూర్యుడు, వరుణుడు లాంటి దిక్పాలురందరు వశమై ఉంటారు. సూర్యుడు తన కిరణాలలోని వేడిని చల్లదనంగా మార్చి రామునికి ఆనందాన్ని కలిగిస్తాడు. వరుణుడు వెచ్చదనాన్ని ఇస్తాడు. ఋతువులు, ప్రకృతి కూడా రామునికి మంచినే కలిగిస్తాయి. చంద్రుడు తన చల్లని కిరణాలతో రాముని అలసట పోగొట్టి తన అక్కున చేర్చుకొని సేద తీరుస్తాడు. శంబరాసురుడు దశరథుని శత్రువు. ఆ శంబరాసురుని కొడుకును శ్రీరాముడు హతమార్చాడు. దానికి సంతోషడిన బ్రహ్మ శ్రీరామునికి దివ్యాస్త్రాలు బహూకరించాడు.

శ్రీరాముడు తన వినయసంపదతో అరణ్యాన్ని కూడా అమరావతిని చేయగలడు. తన మనస్సును అధీనంలో ఉంచుకోగలిగినవారికి ఎక్కడున్నా ఆ ప్రదేశం స్వర్గసుఖాలను కలిగిస్తుంది. ఓ కౌసల్యాదేవీ! విశిష్టగుణ సంపన్నులైన మీ బిడ్డలు ముగ్గురు సులభంగా వనవాస దీక్షను పూర్తిచేయగలరు. మీరు వారికోసం మనోవ్యథ చెందనవసరంలేదు. సద్గుణరాశి అయిన శ్రీరాముడు సతీసోదరసమేతుడై త్వరలోనే వనవాసదీక్ష ముగించుకొని మీకు పాదాభివందనం చేయడానికి వస్తాడు. అప్పుడు మీరే ఆనందాశ్రువులతో వారిని ఆశీర్వదిస్తారు. ఇది ముమ్మాటికి జరిగి తీరుతుంది.' అని సుమిత్ర కౌసల్యకు ధైర్యవచనాలు చెప్పి ఆమెను ఊరడించింది. మాటల చాతుర్యం వున్న సుమిత్ర మాటలతో కౌసల్య ఊరడిల్లింది. కౌసల్యలోని శోకమేఘాలన్నీ మెల్లమెల్లగా సూర్యుని వెచ్చని తాకిడికి మబ్బు వీడిపోయినట్లు విడిపోయాయి. ఆమె మనస్సు కాస్త దిటవు ఏర్పరచుకొంది.

* * *

రామాదులు తమసానదీ తీరానికి చేరిక

సర్గ - 45

తండ్రి ఆజ్ఞను పరిపాలించడానికి రాముడు వనాలకు బయలుదేరాడు. ఆయనను విడిచి ఉండలేని అయోధ్యావాసులు రాముని వెంబడించి వెళ్లారు. తిరిగి రావాలని అనుకొనేవారిని ఎక్కువ దూరం అనుసరించి వెళ్లకూడదనే నియమానికి కట్టుబడి అంతఃపురజనులు, రాముని తల్లులు, దశరథుడు వెనుదిరిగారు. అయోధ్యా వాసులందరూ రామా! రామా! మమ్ము విడిచి వెళ్లకు అంటూ రోదిస్తూ రాముని వెంట వెళ్లుతూనే ఉన్నారు.

రాముడు వారిమాట వినకుండా ముందుకు సాగిపోతున్నాడు. అయినా పురజనులు ఆయనను విడిచి ఉండలేక 'రామా! ఆగు ఆగు' అంటూ వెళ్లే జనాన్ని చూసి రాముడు– 'ఓ పౌరులారా! మీరందరూ నాపై చూపే

ఆదరానికి ఎంతో సంతోషిస్తున్నాను. కానీ నన్ను ఇలా వెంబడించడం బాగాలేదు. మిమ్ములన్దరిని నా సోదరుడు భరతుడు రాజై పాలించగలడు. భరతుడు నా తండ్రిలాగానే మిమ్ము కంటిని రెప్పల్లాగా చూడగలడు. అతడు వయసుకు చిన్నవాడైనా పెద్దల దగ్గరనుంచి ఎంతో అనుభవాన్ని నేర్చుకొన్నాడు. సద్గుణనిధి, పరాక్రమశాలి, వినయ సంపన్నుడు. అటువంటి భరతుని మీరు నన్ను చూసినట్లుగా చూడాలి. నేను, శత్రుఘ్నుడు, లక్ష్మణుడు నా తల్లులు మీరు అందరూ భరతుని ఆజ్ఞను అనుసరించి ఉండాల్సినవారం. భరతునికి రాజుగా ఉండాల్సిన లక్షణాలన్నీ ఉన్నాయి. అందుకే దశరథ మహారాజు భరతునిగా రాజుగా చేయాలనుకొన్నాడు. భరతునికి అనుకూలురై మీరు సుఖంగా జీవించండి.' తన నిర్ణయానికి కట్టుబడే రాముడు పురజనులతో వారికి స్వాంతన చిక్కేటట్లు మాట్లాడాడు. కాని వారందరూ రాముడినే తమ రాజుగా ఊహించుకోవడంలోనే ఉండిపోయారు.

లక్ష్మణునితో ఉన్న రాముడు వారినందరిని తాళ్లతో కట్టివేసినట్లుగా తన వినయగుణసంపదతో కట్టివేశాడు. దానితో వారు రామునికి మారు పలుకలేని వారయ్యారు. పౌరులలోని కొందరు తపోబలసంపన్నులు, పండితులు ఉన్నారు. వారందరూ రాముని విడిచి ఉండలేక బాధపడసాగారు.

రాముని వెంబడించి వెళుతున్న వారిలో కొందరు 'ఓ అశ్వరాజములారా! మీ శ్రవణశక్తి గొప్పది. మీరు మేము చెప్పేదానిని వినండి. ప్రజల హితంకోసం రాముడిని వనాలకు తీసుకవెళ్లకండి. రథాన్ని నగరానికి మరల్చండి. గొప్ప మనస్సు ఉన్నవాడు, దయార్ద్రహృదయం గలవాడు ఐన రాముడు రాజుగా తగినవాడేకాని వనవాసానికి పనికిరాడు' అని ఆర్తితో అరిచారు.

వారిని రాముడు చూశాడు. రామునకు హృదయం ద్రవించింది. వృద్ధులైనవారు నాకోసం పరితపిస్తున్నారని అనుకొన్నాడు. వెంటనే రథం దిగాడు, ఆ ఆర్తజనులకోసం వారిదగ్గరకు నడిచాడు.

యజ్ఞయాగాలు చేసిన ద్విజోత్తములు రాముని చూచి దుఃఖించారు. అప్రమేయప్రతిభాశాలి రాముడు తండ్రికోసం అడవుల పాలవుతున్నాడే అని అనుకొన్నారు. రాముడు బాధపడుతున్న వారి దగ్గరకు చేరాడు. వారందరూ ఒక్కసారిగా 'రామా! నీవు సూర్యకిరణాల తాపంతో వడలిపోతున్నావు. మేము నిత్యాగ్నిహోత్రులం. మేము మా నిత్యాగ్ని ఉపకరణాలతో నిన్ను అనుసరించి వస్తాం. మేము వాజపేయయాగం చేశాం. మాకు అప్పుడు యాగఫలంగా శ్వేతచ్ఛత్రాలు లభించాయి. వాటిని నీకు పట్టుతూ మేము నీతో వస్తాము. నీవు ప్రజాహితైషివి. మేము ప్రభుభక్తిపరాయణులం. మేము ఇంతవరకు మా శాస్త్రవిధులను చేస్తూ వచ్చాం.

నీవు మాకురాజుగా ఉంటావని తలచాం. నీవు వనవాసానికి వెళుతున్నావు కాబట్టి మేము నీవెంట వచ్చి నీతోనే ఉండి తిరిగి నీవు రాజ్యం చేపట్టే సమయానికి తిరిగి వస్తాము. దీనికి నీవు ఒప్పుకొని తీరాలి' అని రాముణ్ణి ఒప్పించ చూశారు.

అవి అన్నీ విని రాముడు చిరునవ్వు నవ్వాడు. 'అయ్యా! మీరందరూ వేదపారంగతులు. మీకు నేను చెప్పవలసిన పనిలేదు. వేదములే మన ప్రమాణం కదా. వేదాన్ని తృణీకరించిననాడు మనకు జీవితమే లేదుగదా. మనిషి తన కర్తవ్యాన్ని విస్మరించిననాడు అధోగతి పాలవుతాడని వేదం ఘోషిస్తోంది కదా. కర్తవ్యపరాయణులైన

వారికి స్వర్గం చేజిక్కుతుంది అని మీకు తెలుసుగదా. మరి మీ భార్యాబిడ్డలను పోషించడం మీ విధికాదా? మీ కర్తవ్యాన్ని మీరు ఎలా విస్మరిస్తారు?' అని రాముడు వారిని అడిగాడు. దానికి వారందరూ 'రామా నీవు ధర్మపరుడివై వనవాసానికి బయలుదేరావు. తండ్రి ఆజ్ఞను పాలిస్తున్నావు. ఇక మేమెందుకు ధర్మమీమాంసాలను గూర్చి ఆలోచించాలి? మేము తలలు నెరసిన వృద్ధులం. మావేదాలు సురక్షితంగా మా హృదయంలోనే ఉన్నాయి. మా భార్యలు పతివ్రతలు. వారి పాతివ్రత్యమే వారిని ఆదుకోగలదు. నీవు మమ్ముగూర్చి ఆలోచించాల్సిన పనిలేదు.

ఓ రఘునందనా! మేము కాదు సకల ప్రాణికోటి నిన్ను ఆరాధిస్తోంది. వృక్షరాజాలు సైతం నీకోసం తమ శాఖల్ని చాపి ముందుకు వస్తున్నాయి. వాటి పురాకృత పాపం వదలనట్లుగా వాటి వేర్లు వాటిని కదలనీయడంలేదు. రామా! అవి పెనుగాలిని సృష్టించి బోరున విలపిస్తున్నాయి. జంతుజాలాలన్నీ నీ రాకకోసమే ఎదురుచూస్తున్నాయి.'అని చెబుతూ నడక సాగిస్తున్నారు.

బ్రాహ్మణులే కాదు సకలజాతులవారు రాముని వనవాసానికి వెళ్లవద్దని చెబుతూ నడక సాగించారు. జంతుజాలాలు, మానవులు, వృక్షాలు ఇవేకాక రాముని వెళ్లవద్దని చెప్పడానికే వచ్చినట్లు తమసానది రాముని రథానికి అడ్డుగా నిలిచింది.

సుమంత్రుడు తమసానదీ ప్రాంతానికి చేరువకాగానే అలసిన అశ్వాలను రథం నుంచి వేరుచేసి వాటికి విశ్రాంతి నిచ్చాడు.

* * *

తమసానదిని దాటటం

సర్గ - 46

మనోహరమైన తమసానదీ ప్రాంతంలో సతీసోదరసమేతుడైన రాముడు పురజనులతో కలిసి విశ్రమించాడు. అందరూ అలసటతో నిద్రకు ఉపక్రమించారు. అప్పుడు రాముడు 'లక్ష్మణా! నేడు మనకు వనవాసంలో ఒక రాత్రి గడుస్తోంది. ఈ అరణ్య ప్రదేశాలన్నీ మెల్లమెల్లగా నిద్రావస్థలోకి జారుకొంటున్నాయి. పక్షులు, మృగాలు అన్నీ వాటి గూళ్ళల్లో నిశ్చింతను పొందుతున్నాయి.

అయోధ్యలో మనకోసం తపిస్తూ మన తల్లిదండ్రులు రోదిస్తుంటారు. అలా వారు ఏడ్చి ఏడ్చి ఏమి బాధలను కొనితెచ్చుకొంటారేమోనని నాకు చింతగా ఉంది. అయినా భరతుడు అక్కడే ఉన్నాడని అనుకొంటే నాకు కాస్త ధైర్యం కలుగుతోంది. ధర్మపరాయణుడై, భరతుడు తల్లిదండ్రుల మనస్సులకు ఇష్టంగా ప్రవర్తిస్తాడు. భరతుని గుణగణాలతో వారిని సంతుష్టులను చేస్తాడని నాకు అనిపిస్తోంది' అని చెప్పాడు. 'ఓ సౌమిత్రీ! మీ వదిన అరణ్యవాసాన్ని ఎలా భరిస్తుందోనని చింతించకు.

నీవు మాతో వచ్చి మంచి పనిచేశావు. సీతను జాగ్రత్తగా చూసుకొనడంలో నీవు నాకు సహాయం చేస్తావు. ఈ క్షేత్రంలో మనం జలాహారాన్ని తీసుకొని ఈ రాత్రికి విశ్రమించడం బాగుంటుందని నాకు అనిపిస్తోంది' అని చెప్పాడు రాముడు. 'సుమంత్రా! మీరు రథాలకు కట్టిన అశ్వాలను జాగ్రత్తగా చూడండి. ఈ పురజనులందరూ నాపై ప్రేమతో ఇంతదూరం వచ్చారు. ఈ చెట్ల నీడలో పడుకున్నారు. వీరికి ఏ మాత్రం బాధ కలగకుండా వీరిని విడిచి మేం వెళ్ళాలి.

అందుకే మీరు ఉషఃకాలంలోనే ఎవరూ నిద్రలేవక ముందే మమ్ము ఈ నదిని దాటించండి' అని చెప్పాడు. తర్వాత సుమంత్రుడు రాజకుమారులకు పడక ఏర్పాటుచేశాడు. సీతాసమేతుడై రాముడు నిద్రపోయాడు. లక్ష్మణులు నిద్రపోయే అన్నావదినలను చూస్తూ వారి గొప్పతనాన్ని సుమంత్రునికి వర్ణించి చెప్పాడు. ఇంతలో కాలం నాల్గో జాముకు మారింది. రాముడు, సీత మేల్కొన్నారు. "ప్రజల దుఃఖాలను పోగొట్టాల్సింది రాజులు. వీరు మనపై అనురాగంతో కష్టాలను పడుతూ ఈ నేలపై పడుకొన్నారు. వీరందరూ లేవకముందే మనం దూరంగా వెళ్లాలి. మనం వెళ్ళిన దోవ తెలియక వీరందరూ అయోధ్యకు వెళ్తారు" అని రాముడు చెప్పాడు.

రాముని మాటను ఆజ్ఞగా తలచి సుమంత్రుడు రథాన్ని సిద్ధం చేశాడు. ఆజానుబాహువులైన రామలక్ష్మణులు సీత రథాన్ని ఎక్కారు. సుమంత్రుడు రథాన్ని ముందుకు ఉరికించాడు. సుళ్ళు తిరుగుతూ పరవళ్ళు తొక్కుతున్న తమసా నదిని వారు దాటారు. రథం ఆగింది. దానినుండి ముగ్గురు దిగారు. వారు అనుకూలంగా ఉన్న ఒకదారిని ఎంచుకొని ముందుకు పోవాలని అనుకొన్నారు.

రాముడు 'సుమంత్రా! మీరు రథాన్ని ఎక్కి వేగంగా ఉత్తరదిశగా వెళ్ళి మరల ఇటు తిప్పు. మీరు అలా చేస్తే ఈ జనులకు మనం ఎక్కడకు వెళ్ళినదీ తెలీకుండా ఉంటుంది. ఇలా వీరిని మభ్యపెట్టి మనం వనాలలోకి వెళ్దాము' అని చెప్పాడు శ్రీరాముడు. శ్రీరాముని ఆదేశం ప్రకారం సుమంత్రుడు ఉత్తరాభిముఖంగా రథాన్ని పరిగెత్తించాడు. ఇంకో మార్గంలో తిరిగి సీతారామలక్ష్మణుల దగ్గరకు వచ్చాడు. అలా వచ్చిన రథాన్ని ఆ ముగ్గురు ఎక్కి వనాలలోకి ప్రయాణం సాగించారు.

* * *

పురజనులు అయోధ్యకు మరలడం

సర్గ - 47

తమస్సును ఛేదించే భానుడు తూర్పుదిక్కుకు రాబోయాడు. తూర్పు వాకిలి భళ్ళున తెరుచుకొంది. అయోధ్యావాసులు మేల్కొన్నారు. తమ ప్రియతముడు వారికి అక్కడ కనబడలేదు. రాముని జాడ తెలియక వారందరి ముఖం చిన్నబోయింది. కన్నీళ్ళు ధారగా కారసాగాయి. దీనంగా వారు దిక్కులన్నీ పరికించి చూశారు. అయినా వారికి సీతా రామలక్ష్మణులు కనిపించలేదు.

వారికి వారిపై ఏహ్యభావం కలిగింది. 'ఛీ ఛీ నిద్రమత్తులో పడి అమూల్యమైన సంపదను పోగొట్టుకొన్నాము. విశాలవక్షస్థలం గల ఆజానుబాహువు అయిన రాముని దూరం చేసుకొన్నాం' అంటూ పదే పదే విలపించారు. మనపై దయగల రాముడు మనలను విడిచి ఎలా వెళ్ళగలిగాడు అంటూ మథనపడ్డారు. రాముడు లేకుండా మనం జీవించడం వృథా. రాముడు లేకుండా అయోధ్యకు ఎలా వెళ్తాం? మనమందరం మన ప్రాణాలను విడిచిపెడ్తాం. లేకపోతే మనం ఉత్తరదిక్కుగా నడిచి వెళ్దాం అనుకొన్నారు.

ఏమి చేయడానికి పాలుపోక రథం జాడలు కనబడతాయేమోనని వెతికారు. కొద్ది దూరం రథపు జాడలు కనిపించి అవి మాయమయ్యాయి. అయ్యో! ఎంతటి నిర్భాగ్య జీవులం రాముని అనుసరించి వచ్చి కూడా రాముని పోగొట్టుకొన్నామే అని వారు చింతించారు.

మనం అయోధ్యకు తిరిగి వెళ్తే వారందరు రాముడు ఏడి అని అడిగితే ఏమి చెప్పాలి? ఈర్ష్యాద్వేషాలు లేని రాముణ్ణి అరణ్యాలకు సాగనంపి వచ్చామంటే వారు మనలను ఏమంటారు. రాముడు తిరిగి రాలేదని వారికి తెలిస్తే వారు దుఃఖంలో మునిగిపోతారు. దానికి హేతువులం మనమే అవుతాం. అందుకే ఇక్కడ ఉన్న చితుకులను ఎండిన కర్రలను పేర్చి చితి ఏర్పాటుచేసి అందులోకి దూకుదాం.

ఆత్మనిగ్రహం ఉన్న రాముడితో వచ్చిన మనం రాముడు లేకుండా తిరిగి మన ఇండ్లకు ఎలా వెళ్తాం? అంటూ అందరూ శోకించారు.

వారు అలా చింతిస్తూ నడిచి నడిచి అయోధ్యానగరం వైపు మళ్ళారు. ఆ పౌరులందరు తమ నగరాన్ని చూచి చాలా బాధపడ్డారు. రాముడు లేని నగరం శోభావిహీనంగా కనిపించింది. అందరూ తమ తనువులోని భాగం కోల్పోయినట్లుగా ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లుతున్నారు. వారి నేత్రాలన్నీ కలువల్లాగా కనిపించాయి.

అప్పుడు అయోధ్య చంద్రుడు లేని ఆకాశంలాగా స్తబ్దుగా కనబడింది. నీళ్ళన్నీ ఆవిరి అయిపోయిన సముద్రంలాగా కళావిహీనం అయింది. పౌరులందరూ దుఃఖితులై ఉన్నారు. రాముని విడిచి వచ్చినవారు ఇంట్లోనే ఉన్నవారు ఎవరూ ఎవరినీ చూడలేక చూసినా గుర్తుపట్టలేక మితిమీరిన దుఃఖాశ్రువులలో మునిగిపోయారు.

* * *

స్త్రీల విలాపం

సర్గ - 48

రామునితో కూడా వెళ్ళి మరలా వచ్చిన వారందరూ రాముని తీసుకొని రాలేకపోయితిమే అని దుఃఖించారు. జీవితమంతా వృథా అనుకొని ధైర్యాన్ని కోల్పోయారు. జీవించి ఉండి కూడా ప్రాణం లేనివారిలాగా నిశ్శబ్దంగా ఉన్నారు. ఈ స్థితిలో ఇంటికి వచ్చినవారికి భార్యాపుత్రులు కూడా దుఃఖిస్తూనే కనిపించారు. ఇరువురు

దుఃఖంతో కన్నీళ్ళు నింపుకొని ఒకరినొకరు చూచుకోలేకపోయారు. అయోధ్యావాసులందరూ చేయవలసిన కార్యాలలో ఆసక్తి లేక నిత్యకృత్యాలను కూడా విస్మరించారు. వర్తకులు వాణిజ్యాలను, పూజారులు దేవాలయంలోని పూజలను నిరాసక్తిగా చేశారు. స్త్రీలు ప్రతిదినం అవసరమైన వంట వార్పులలో కూడా ఆసక్తి కోల్పోయారు. ఆబాలగోపాలం తిండిమీద ధ్యాసను వదిలేశారు.

రాముని తీసుకొని రాకుండా వచ్చిన మగవారిని చూసి స్త్రీలు ఎద్దేవా చేశారు. రాముని విడిచి వచ్చినవారు కార్యారంభశూరులే కాని కార్యాన్ని సాధించే నేర్పులేనివారని తూలనాడారు. రామునితో గడపని జీవితం ఒక జీవితమేనా అని శోకించారు.

సీత రామునితో వెళ్ళింది. నిత్యం ఆయనను చూస్తూ ఆయనకు పరిచర్యలు చేస్తూ గడుపుతోంది. ఆమె అదృష్టమే అదృష్టం అనుకొన్నారు. అన్నావదినలను సేవించే భాగ్యం దొరికిన లక్ష్మణుడే భాగ్యవంతుడనుకొన్నారు. రాముని చూస్తూ గడిపే సౌమిత్రియే సత్పురుషుడని వారు భావించారు.

రాముని స్నానాదికాలకు పనికివచ్చే చెరువులు నదులు పుణ్యప్రదమైనవని తలచారు. వనంలో ఉండే వృక్ష సముదాయం, వనచరాలు, నదీనదాలు అన్నీ రాముని శోభను ఇనుమడింపచేసేవి. రాముణ్ణి ఎవరైనా చక్కగా ఆదరిస్తారు. పరుల ఇష్టానిష్టాలను గుర్తెరిగి ప్రవర్తించే రామునికి అప్రియులే ఉండరు. అందుకే వృక్షాలన్నీ తమ తమ ఫలపుష్పసంపదలతో రాముని అలరించగలవు. పరులకోసమే జీవించే నదులు, పర్వతాలు, తరువులు అన్నీ రాముని తమ ఆత్మబంధువు అని తలుస్తాయి. రాముని కోసం వాటి సంపదను అవిచ్ఛిన్నంగా స్రవింపజేస్తాయి. సర్వులకు ప్రియాన్ని కలిగించే రాముడు ఉండే చోట భయం, పరాభవం అనేవాటికి చోటు ఉండదు.

రాముడు శూరత్వంలో సాటిలేని మేటి. రూపసౌందర్యాలతో అందరిని ఆకట్టుకొంటాడు. రాముడే మహాత్ముడు. ప్రజల మనోభీష్టానుసారం ప్రవర్తించే రాముడు ఎక్కడ ఉంటాడో అక్కడే మేమందరం ఉంటాం. అతడే మాకు గతి, అతని దోవే మా గమ్యస్థానం. మేము రాముని దగ్గరకు వెళ్తాం. సీతను సేవిస్తాం; మీరు రాముని సేవించి తరించండి; మన జీవితం సుఖంగా గడిచిపోతుంది. రాముడు లేకుండా ఈ అయోధ్యలో మనం మనలేము– అంటూ బోరున స్త్రీలు విలపించారు.

అన్యాయంగా దుర్మతి ఐన కైక చేతిలోకి అయోధ్యానగర రాజ్యలక్ష్మి వెళ్ళిపోయింది. నీతి నియమాలు లేని రాజుల నీడలో బతకడంకన్నా చావడమే మంచిది. ధనవ్యామోహంతో కైక భర్తను, కుమారులను, కులాన్ని నాశనం చేసింది. ధనం ఉంటే అది పరులకు ఉపయోగపడాలి కాని తన కొరకే ఉపయోగించే ధనంవల్ల అశాంతి తప్ప మరేది కలగదు.

అధర్మప్రవర్తనులు, నీతిబాహ్యుల చెంత జీవించడం మరణసదృశమే. కైక జాలి లేని వనిత. వారసులను అరణ్యానికి పంపి భర్తను పక్కకు తోసి అధికార పీఠాన్ని ఎక్కింది. అటువంటివారి దగ్గర పనిచేస్తూ ఉండడంవల్ల మనకు దుర్గతి పడుతుంది. కైకేయివల్లనే ఈ రాజ్యం సర్వనాశం అవుతోంది. సరైన నాయకుడు లేని రాజ్యం ఆధారం లేక నశించిపోతుంది.

దశరథుడు ఆడి తప్పనివాడు. మాటకోసం కొడుకును కారడవులకు పంపాడు. ఇతడు ఎక్కువ కాలం జీవించడు. దశరథుని పరలోక ప్రయాణం తథ్యం. ఆ తరువాత ఈ అయోధ్య నిండా విలాపాలే కాని సల్లాపాలు ఉండవు. మీ అందరి పుణ్యం క్షీణించింది. అందుకే అందరం కష్టాల కొలిమిలో పడిపోయాం. విషాన్ని తాగి మరణాన్ని ఆహ్వానించండి, లేదా రాముణ్ణే అనుసరించి వెళ్ళండి. రాముని సతీసోదరసమేతంగా కపటోపాయాలతో దూరంగా తరిమేశారు. ఒట్టిపోయిన గొడ్లను కసాయివాని పాల్జేసినట్లు మనలను భరతునికి అప్పగిస్తున్నారు.

మహారథుడు, బాహుబల సౌందర్యాతిశయుడు, శత్రువినాశకరుడైన రాముడు అరణ్యాలను పట్టిపోయాడు. ఆయన సత్యవచనం, ధర్మం, వన చరులైన ఋషీశ్వరులను, జంతుజాలాలను ఆనందింపజేస్తాయి. రాజు లేని ఈ రాజ్యానికి అంత్యకాలం దాపురించింది అంటూ అనేక విధాలుగా అయోధ్యా స్త్రీలు బాధపడ్డారు. రాముని గుణగణాలను తలచుకొని అతనికి జరిగిన అన్యాయానికి వగచారు. తమ ప్రాణేశులకు రాముని అనుసరించి వెళ్ళడమే మంచిదని బోధ చేశారు.

యథావిధిగా అయోధ్యలో సూర్యుడు అస్తమించాడు. రేరాజు ఆకాశాన ఉదయించాడు. అయినా పౌరులు పట్టించుకోలేదు. సంధ్యావందనాలు చేయలేదు. స్త్రీలు విలపించడంలోనే తలమునకలయ్యారు. తమ తనయుల గురించి మరచారు. జన సంచారం లేక వీధులన్నీ బోసిపోయాయి. అమ్మేవారు కొనేవారు లేక అంగళ్ళు మూతపడే ఉన్నాయి. దేవాలయాలలో దేవుడే లేనట్లుగా కళ తప్పాయి. ఎక్కడి వారక్కడ నిస్తేజంగా ఉండిపోయారు.

ఆకాశంలో నక్షత్రాలు లేని చంద్రుడిలాగా అయోధ్య నిశీధిలో అణగారిపోయింది. తమ పుత్రులకన్నా మిన్నగా ప్రేమించిన రాముడు దూరం అయ్యాడనే బాధ స్త్రీలలో అతిశయించింది. ఆనందానికి దూరమైన అయోధ్య నృత్యగీతాలు, ఉత్సవసంభ్రమాలు లేకుండా పోయింది.

నీరు ఇంకిపోయిన సముద్రంలాగా అయోధ్య శోభావిహీనమైంది.

* * *

గోమతినదిని దాటటం

సర్గ - 49

సీతీసోదరసమేతుడై రాముడు తండ్రి ఆజ్ఞ ప్రకారం తమసానదీ ప్రాంతం ఆవల చాలా దూరం వెళ్ళాడు. అలా అలా నడుస్తూ నగర పొలిమేరలు చేరాడు. ఆ ప్రాంతంలోని చిరుపల్లెలు గ్రామాలు చూస్తూ ముందుకు సాగారు. రథం మీద వెళుతున్న వీరిని అక్కడివారు చూచి కంటతడిపెట్టారు. వారిలో వారు, 'ఈ దశరథ మహారాజు కామపరవశుడు. అందుకే ఆడదాని చేతిలో కీలుబొమ్మ అయ్యాడు. అన్యాయంగా జ్యేష్ఠకుమారుని అడవికి పంపాడు. అక్రమంగా కైకకు రాజ్యాన్ని కట్టబెట్టాడు. అన్యాయాలు రాజగృహంలోనే నేడు జరుగుతున్నాయి. అయినా రాజు తన మాట ఎంత విన్నా, ఇంత దుర్మార్గానికి ఒడిగట్టవచ్చా? కైక దుష్టురాలే, ఈమెవల్ల ఇక్ష్వాకు వంశం నాశనం చెందుతుంది'– అని అనుకోవడం రాముడు విన్నాడు.

అంతలో రథం కోసల దేశపు సరిహద్దులను దాటింది. నిర్మల జలాలను ప్రవహింపజేస్తున్న వేదశ్రుతి అనే నదిని దాటి అగస్త్యుడు ఉండే దక్షిణ దిక్కుకు వారు మరలారు. అక్కడ వారు చాలాదూరం ప్రయాణం చేశారు. స్వచ్ఛమైన జలాలతో గోవులను అలరించే గోమతి నది వారికి కనిపించింది. సముద్రంతో కలిసే ఈ గోమతిని కూడా వారు దాటారు.

ఆ ప్రాంతమంతా సీతారాములు కలియచూశారు. రాముడు సీతతో 'ఓ ప్రియసతీ! ఈ ప్రాంతం ఎంత సస్యశ్యామలంగా ఉందో చూడు. దీనిని మనువు ఇక్ష్వాకునకు ఇచ్చాడు. ఇది చాలా విశాలమైంది. ఇందులో ఎన్నో రాష్ట్రాలు ఉన్నాయట' అని చెప్పాడు.

రథాన్ని తోలే సుమంత్రుని చూచి రాముడు ప్రేమ పూర్వకంగా 'ఓ 'సూతా! నా వనవాసం పూర్తి అయిన తర్వాత నేను ఎప్పుడు అయోధ్యను చేపడతానో? అప్పుడు ఈ సరయూ తీరప్రాంతంలో వేటకు రావాలని నా కోరిక. పుష్పించిన తరుసముదాయం, మదించిన వన్యమృగాలు నా కోరికను పెంచుతున్నాయి. వేటాడటం రాజుల లక్షణం కదా! కాని మృగాలు మృత్యుభీతితో పారిపోయేటప్పుడు నా మనస్సు ఆందోళనకు గురి అవుతుంది. అందుకే నాకు వేటాడటం అంత తృప్తిని ఇవ్వదు. కాని మృగాయావినోదం రాజర్షులకు ప్రీతిని కలిగిస్తుంది. సమర్థులైన ధనుర్ధారులతో కలిసి వచ్చి పౌరుషాన్ని ఉద్దీపన చేసే మృగాలను ఎదుర్కోవడం రాజర్షులు మెచ్చే క్రీడ కదా!' అని అంటూ రాముడు సుమంత్రునితో చెపుతూ వారు పయనం సాగించారు.

* * *

సీతారామలక్ష్మణులు శృంగిబేరపురం చేరటం

సర్గ - 50

కోసల దేశాన్ని సీతారామలక్ష్మణులు పూర్తిగా దాటారు. రాముడు అయోధ్య వైపు తిరిగి నమస్కరించాడు. 'ఓ అయోధ్యా పట్టణమా! మాకు వనవాసానికి అనుమతిని ఇవ్వు. నేను నా తండ్రి ఋణం తీర్చి తిరిగి వచ్చి నిన్ను దర్శిస్తాను' అని చెప్పాడు. వీరిని చూడడానికి వచ్చిన గ్రామీణులతో రాముడు కన్నీరు ఒలుకుతుండగా చేతిని ఎత్తి 'మీరందరూ మమ్ములను దయతో చూశారు. కాలం దయలేనిది. కష్టాలను కూడా ఇస్తుంది. అందుకే నన్ను విడిచి ఉండలేనని అనుకోకుండా, మీరు మీ పనులను చేసుకోండి' అని అన్నాడు. రాముని మాటలు విన్న వారికి దుఃఖం పొంగింది. వారు రామునికి నమస్కారం చేశారు. కన్నీరు కారిపోతున్నా చూచుకోకుండా దూరం అయిపోతున్న రామలక్ష్మణులను తదేకంగా చూస్తూ నిలబడ్డారు. అలా చూస్తుండగానే సూర్యుడు అస్తమించి కనబడకుండా వెళ్ళినట్లు రామలక్ష్మణుల రథం కనుమరుగైంది.

పురుషశ్రేష్ఠులైన రామలక్ష్మణులు విశాలనగరమైన అయోధ్యను తలచారు. ఆ పొలిమేరలలో సైతం జనులు దానస్వభావులుగా ఉన్నారు. అక్కడ ఉద్యానవనాలు, నదీనదాలు, ఆశ్రమవాటికలు, యజ్ఞక్రియలు చేయడానికి అనుకూల ప్రదేశాలు, మామిడి, అరటితోటలు, గోసమూహాలు, వేదఘోషలతో ఆ ప్రాంతం రమణీయంగా ఉంది.

త్రిపథ అయిన గంగాతీరానికి వారు చేరారు. గంగానది స్వచ్ఛంగా, నిర్మలంగా ప్రవహిస్తోంది. నాచు పట్టకపోవడంతో నది అడుగుభాగాన కూడా కనిపిస్తుంది. ఆ తీరప్రాంతంలో కుటీరాలు నిర్మించుకొని ఎందరో మహర్షులు తమ ఆశ్రమజీవితాన్ని గడుపుతున్నారు. అప్సర స్త్రీలు పండుగ దినాలలో వచ్చి గంగాస్నానం ఆచరించి గంగను సేవించి వెళ్ళుతున్నారు. గంధర్వులు, దేవతలు, దానవులు, కిన్నరులు అందరికీ ఈ గంగ పూజనీయురాలే గదా! అందరూ ఈ నదీమతల్లిని సేవించేవారు. నదీతీరంలో వెలసిన పర్వతాలు దేవతలు విహరించడానికి అనువుగా ఉన్నాయి. మహర్షుల తపస్సుకు సానుకూలంగా నిశ్శబ్దాన్ని కలిగి ఉన్నాయి. దేవతల కోసం ఆకాశంలో గంగ ప్రవహించింది అందుకే ఇది దేవనది అయింది.

గంగానది తన సుడులతో పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తోంది. ఒక చోట తెల్లని నురుగులతో సాగుతోంది. మరో చోట వేగంగా, నిదానంగా ప్రవహిస్తోంది. నిశ్చలగామిని లాగా అనిపిస్తోంది. మరికొన్ని చోట్ల లోతుగా మహాధ్వనితో చూపరులకు భయం గొల్పుతూంది. గంభీరంగా ప్రవహిస్తోంది. నదీతీరంలో ఇసుక తిన్నెలు ఉన్నాయి.

ఈ నదీతీర ప్రాంతంలో హంసలు, సారసపక్షులు, చక్రవాకాలు విహరిస్తున్నాయి. అనేక విధాలైన పక్షుల కలకలరావాలతో మధురంగా ధ్వనిస్తున్నాయి. తీరప్రాంతంలో ఎదిగిన చెట్లు గంగానదికి మూలాభరణంలాగా కనిపిస్తున్నాయి. అక్కడక్కడ కలువలు, పద్మాలు కనులకు ఇంపును కలిగిస్తున్నాయి.

గంగానదీ ఉపరిభాగంతో పూలపరాగాలు పడి వింత శోభను కలిగింది. అమలినయైన గంగలో వనచరాలు హాయిగా ఆడుతున్నాయి. దిగ్గజాలు దిగి సంతోషంగా వాటి తొండాలతో నీటిని ఊదుతూ, పైన పోసుకొంటూ పెద్దగా రొద చేస్తున్నాయి. ఫలాలు, పుష్పాలు, చిగుళ్ళు, పొదలు అక్కడా ఉండి పక్షులకు ఇష్టమైన ప్రదేశం అయింది. ప్రకృతితో అలంకరించబడిన గంగ సర్వాభరణభూషిత అయిన సుందరాంగి వలె శోభిస్తోంది.

విష్ణుపాదోద్భవైన గంగ అటు దేవతలచే ఇటు నరులచే కొలవబడి ప్రశస్తి చెందింది. పాపాలను కడిగివేస్తూ పతితపావనిగా పేరుమోసింది. భగీరథుని మహాసంకల్పంతో ఆకాశగంగ శంకరుని జటాజూటం నుండి బయలుపడి భూమిని ఆక్రమించింది. పక్షుల రొద నదీఘోష మిళితమై ధ్వని భయంకరంగా వినిపిస్తోంది. సముద్రుని పట్టమహిషి అయిన గంగాతీరానికి రాముడు చేరాడు. ఆ తీరాన ఉన్న శృంగిబేరపుర సమీపానికి రాముని రథం వచ్చింది.

'సుమంత్రా! ఈ నిర్మలవాతావరణం, స్వచ్ఛమైన గాలి, ఈ గంగానదీతీరం ఎంతో హాయిగా ఉన్నాయి. మనం ఈ రోజుకు ఇక్కడే ఆగుదాం' అని రాముడు సుమంత్రునితో చెప్పాడు.

'ఓ సారథీ! ఇక్కడి మహావృక్షాలు, పొదలు, పూలు, మనస్సును దోచుకుంటున్నాయి. ఇక్కడ కాసేపు ఆగి ఈ సుందర ప్రకృతిని ఆస్వాదిద్దాం' అని రాముడు అన్నాడు.

సుమంత్రుడు, రాముని ఇష్టప్రకారం రథాన్ని ఇంగుదీవృక్షం వైపు త్రిప్పి ఆపాడు. లక్ష్మణుడు, సీత ఆ వన శోభకు అచ్చెరువొందారు. అందరూ రథాన్ని దిగి ప్రకృతి రమణీయతను ఆనందంగా చూస్తున్నారు. సుమంత్రుడు అశ్వాలకు విశ్రాంతినిచ్చి, రాముని దగ్గరకు వచ్చి వినయంగా నిలబడ్డాడు.

ఆ శృంగిబేరపురంలో గుహుడు అను ఒక బోయ రాజు ఉన్నాడు. అతడు రామునకు ప్రాణాధికుడు. అతనికి సీతారామలక్ష్మణులు వచ్చారన్న సంగతి తెలిసింది. వెంటనే అమాత్యులు, జ్ఞాతులతో కలిసి రాముని దగ్గరకు వడివడిగా వచ్చాడు. నిషాదరాజును అల్లంత దూరాన్నే రామలక్ష్మణులు చూశారు. గుహుడు రాముని చూసి విషాద వదనంతో రాముని కౌగిలించుకొన్నాడు.

'ఓ రామా! మీరు నాకు స్నేహితులు. ఇది నా పూర్వ జన్మసుకృతం. ఈ రాజ్యం, నేను, వీరు అందరూ మీ భృత్యులమే. అయోధ్య మీకు ఎలానో ఈ శృంగిబేర కూడా మీకు అలానే అని అనుకో. మీ సేవకులమైన మేము ఏం చేయాలో ఆనతి ఇవ్వు. మీ కోసం ఈ మధురాన్నాలు తీసుకొచ్చా. వీటిని మీరు స్వీకరించండి. మీ రాక మాలో ఆనందాన్నిచ్చింది'– అన్న గుహుని మాటలు రామునిలో సంతోషం కలిగించాయి. రాముడు గుహునితో "గుహా! నీకు మాపై చాలా ప్రేమ ఉందని మాకు తెలుసు. నీవు తెచ్చిన ఈ మధురపదార్థాలు నీవు మా దగ్గరకు కాలినడకతో రావడం ఇవన్నీ మాకు ఆనందాన్నే ఇచ్చాయి. నీవు నీ ప్రజలు బంధువులు అందరూ క్షేమంగా ఉన్నారు కదా. మీ స్నేహం నేను ఎప్పటికీ కోరుకొంటాను. కాని నీవు తెచ్చిన వీటిని నేడు నేను స్వీకరించలేను. ఇప్పుడు నీ స్నేహితుడు కందమూలాలు తింటూ మౌనియై బతకాలి. అందుకే నేను వీటిని నీకు ఇచ్చివేస్తాను. కాని నా రథాన్ని నడుపుతూ వచ్చిన ఈ అశ్వాలు ఆకలిగొని ఉన్నాయి. ఇవి దశరథునకు ప్రీతిపాత్రమైనవి. వీటి మేతను నీవు సమకూర్చినట్లయితే నేను ఎంతో సంతోషిస్తాను" అని రాముడు చెప్పాడు.

వెంటనే గుహుడు తన సేవకుల చేత గుర్రాలకు కావలసిన వాటిని తెప్పించి ఇచ్చాడు. రాముడు నారవస్త్రాన్ని ఉత్తరీయంగా ధరించాడు. రామలక్ష్మణులు సంధ్యావందనాలు ఆచరించారు. లక్ష్మణుడు తెచ్చిన జలాన్ని సీతారాములు సేవించారు. ఆ ముగ్గురు నీటితో తమ కడుపులు నింపుకొన్నారు. ఆ వృక్షసమీపంలోనే సీత, రాముడు పడుకొన్నారు. సేద తీరుతూ విశ్రాంతి తీసుకొన్నారు.

లక్ష్మణుడు వారికి నమస్కరించాడు. గుహుని దగ్గరకు వచ్చాడు. ధనుర్ధరుడైన లక్ష్మణునితో గుహుడు మాటలు కలిపాడు. సీతారాముల సంరక్షణ కోసం లక్ష్మణుడు సావధానుడై ఉండడం గుహునకు సంతోషం కలిగించింది. ఎన్నడూ నేలపై పడుకోని రామునికి రాత్రి దీర్ఘంగా అనిపించింది.

* * *

లక్ష్మణుడు గుహునితో మాట్లాడటం

సర్గ – 51

అన్నకోసం పాటుపడే తమ్ముని చూచి గుహుడు సంతోషించాడు. "నాయనా లక్ష్మణా! నీకోసం శయ్యను ఏర్పరిచాను. దీనిపై నీవు సుఖంగా విశ్రాంతి తీసుకో" అని చెప్పాడు. "సౌమిత్రీ! మీకు శ్రమ అలవాటులేదుకదా. మేము శ్రమైకజీవులం. మీ ముగ్గురూ హాయిగా నిద్రపొండి. మేము మిమ్మల్ని కంటి రెప్పల్లాగా కాపాడుతాం.

నాకు రాముని మించిన సఖుడు ఈ లోకంలో ఎవ్వరూ లేరు. ఈ రాముని దయతోనే నేను కీర్తిమంతుడి నవ్వాలని అభిలషిస్తున్నాను. ఆదమరచి మీరు నిద్రించండి.

నేను మీకోసం మేల్కొని ఉంటాను. గొప్ప చతురంగబలాలు వచ్చినా మేమందరం వాటిని ఎదుర్కోగలం. సందేహించకుండా మీరు కూడా విశ్రాంతి తీసుకోండి." అని గుహుడు లక్ష్మణునికి చెప్పాడు. ధర్మబుద్ధిగల "ఓ నిషాదరాజా! మీ నీడలో ఉన్న మాకు ఎలాంటి భయంలేదు. మీ స్నేహం మాకు ఆనందాన్నే ఇస్తోంది. నా ప్రియ సోదరుడు నేలపై పడుకొంటూ ఇడుమలకు గురి అవుతున్నాడు. ఈ స్థితిలో నాకు సుఖం ఎలా కలుగుతుంది? నిద్ర ఎలా వస్తుంది? శ్రీరాముడు కష్టాలు పడడం చూచి నేను తట్టుకోలేను.

పరాక్రమశాలియైన శ్రీరాముడు నేడు తృణాలపై పడుకోవడం నేను ఓర్చుకోలేకుండా ఉన్నాను. అందరి మెప్పును పొందాడు. మా తండ్రికి ఇష్టుడు, జ్యేష్ఠుడు. రాజ్యంలోని వారందరి మనస్సులను ఆకట్టుకొన్నాడు. ఇటువంటి వాడు నేడు అరణ్యాలకు రావడం తటస్థించింది. దీన్నంతా నా తండ్రి చూస్తూ ఎక్కువ కాలం జీవించలేదు. రాముని వియోగాన్ని ఆయన తట్టుకోలేదు. రాజు లేని ఈ రాజ్యం అనాథ అయిపోతుంది. ఈ పాటికి రాజ గృహాలు, పురజనుల ఇండ్లు అన్నీ ఏడ్చి ఏడ్చి నిరాశలో కూరుకొని ఉంటాయని నాకనిపిస్తోంది. నా తల్లిదండ్రులు మమ్ము విడిచి ఉండగలరని నాకు అనిపించడంలేదు.

కౌసల్య,దశరథుడు ఈ రాత్రిని గడపగలుగుతారో లేదో అని నాకనిపిస్తోంది. నా తల్లి శత్రుఘ్నుని కొరకు చూస్తుందేమో. కౌసల్యాదులు రాముని విడిచి ప్రాణాలతో ఉంటారని నేను అనుకోవడంలేదు. అందుకే నా మనస్సు కుదుటపడటంలేదు. కంటికి నిద్ర రావడంలేదు. నేడు ఈ అయోధ్య దుఃఖభాజనమై పోయింది. పెద్దకొడుకు మహాత్ముడైనవాడు దూరమయ్యాడు అనే విషయం విని మహారాజైన దశరథుని ప్రాణాలు నిలుస్తాయా? తన మనోరథం తీరలేదనే వ్యథతో రాజు మరణిస్తాడు. రాజుకోసం రాణులు ప్రాణత్యాగం చేస్తారు. వీరందరికి భరత శత్రుఘ్నులు అంత్యేష్ఠులు జరిపి వారు కృతార్థులవుతారు.

అయోధ్య కడుచక్కనిది. ఎత్తైన మేడలు, చక్కని వాకిండ్లు, రాజప్రాసాదాలు, ఉద్యానవనాలు, జలాశయాలు అన్నీ కలిసి అయోధ్యశోభను ఇనుమడింప చేస్తాయి. పురప్రముఖులు, పౌరులు, స్త్రీలు, బాలలు అందరూ ధర్మబద్ధులై అయోధ్యను కర్మభూమిగా చేస్తారు. ఇలలోనే స్వర్గాన్ని నెలకొల్పుతారు. ఇటువంటి భాగ్యసీమను మేము వనవాసానంతరం చూడగలమా? మహాత్ముడైన మా తండ్రిని చూచి మరల ఆయన్ని సేవించే భాగ్యం కలుగుతుందా?" అంటూ లక్ష్మణుడు పితృవియోగానికి వ్యధచెంది దీనంగా విలపిస్తూ గుహునితో మాట్లాడాడు. లక్ష్మణుని దుః ఖపూరితమైన మాటలు గుహునిలో ఆవేదనను కలిగించాయి. దీనుడైన లక్ష్మణుని మాటలు వింటుండగానే రాత్రి గడిచిపోయింది.

* * *

సీతారామలక్ష్మణులు వత్సదేశం చేరటం

సర్గ - 52

భానూదయం అయింది. రామలక్ష్మణులు మేల్కొని సంధ్యావందనాలు చేశారు. రాముడు 'లక్ష్మణా, ఈ రోజు మనం ఈ జీవనది అయిన గంగను దాటుదాం అని అన్నాడు. రాముని మాటను లక్ష్మణుడు సుమంత్రునికి గుహునికి తెలిపాడు. గుహుడు రాముని మనోభీష్టాన్ని నెరవేర్చాలని అనుకొన్నాడు. మంత్రులను పిలిచాడు. గంగను దాటడానికి అనువైన నావను సిద్ధం చేయమన్నాడు. ఆయన మాట ప్రకారం వారు చక్కని నావను తెచ్చారు. దాన్ని చూచి గుహుడు "ప్రియసఖా, రామా! ఇదిగో ఈ నావ గంగానదిని దాటడానికి పనికివస్తుంది. ఇంక నీకేమి కావాలో సెలవు ఇయ్యి. దానిని నేను ఇస్తాను. దేవతాపుత్రుడితో సమానమైన నీవు ఈ నావను ఎక్కు" అని చెప్పాడు.

రామాదులు గుహుని సాయంతో నావను ఎక్కడానికి ముందుకు కదిలారు. వెంటనే సుమంత్రుడు 'శ్రీరామా! నేను చేయవలసిన కార్యం ఏమిటో నాకూ చెప్పు' అని అడిగాడు. దానికి రాముడు తన చేతితో సుమంత్రుని స్పృశిస్తూ 'ఓ మంత్రిపుంగవా! నీవు అయోధ్యకు వెళ్లి నా తల్లిదండ్రులను ఏమరుపాటు లేకుండా వారిని సేవించు. నీ రథంపై మేము ఇంత దూరం వచ్చాం. ఇకమీదట మేము కాలినడకతో ముందుకు సాగుతాం. నీవు ఈ రథంపై తిరిగి అయోధ్యకు వెళ్లి అక్కడి కార్యాలను చక్కదిద్దు' అని చెప్పాడు. తనను తిరిగి వెళ్లమని ఆజ్ఞ ఇస్తున్నాడని సుమంత్రుడు అనుకొన్నాడు. "ఓ రామచంద్రా! మీరు మాటకోసం అడవులను ఆశ్రయించారు. మీలాంటి ధీరోదాత్తుడు, సత్యవచనుడు ఈ లోకంలో మరొకడు ఉండడు. ధర్మపరాయణులైన మీకే కష్టాలు కలగడం చూసినవారికి వేదాధ్యయనం మీద, మృదుత్వంమీద, బ్రహ్మచర్యంమీద, ఋజువర్తనం మీద నమ్మకం సన్నగిల్లుతుంది. రామా! మీరు సతీసోదరసమేతులై వనవాసదీక్షను ముగించుకొని ముల్లోకాలను జయించిన శక్తిని పొందుతారు. శ్రీరామా! మేము దురదృష్టవంతులం. మిమ్ము విడిచి దుష్టురాలైన కైకకు వశమై మేం జీవించాల్సి వస్తోంది."

ఇలా చెబుతూ సుమంత్రుడు బిగ్గరగా ఏడ్చాడు. దుఃఖార్తుడైన సుమంత్రుని రాముడు ఓదార్చుతూ, "సూతా! మిమ్ము మించిన మిత్రుడు ఇక్ష్వాకు రాజులకు మరొకడు లేడు. దశరథుడు తీరని కోరికతో కుంగిపోయాడు. వృద్ధుడు, వయోభారంతో శక్తిహీనుడై మనస్సుకు నచ్చినట్లు చేసే పరిస్థితి లేక చింతితుడై ఉన్నాడు. కైక కోరిక ననుసరించి దశరథ మహారాజు ఏమి చెప్పినా నిస్సంశయంగా దానిని ఆచరిస్తూ ఉండు. ఆయన ఆజ్ఞను ఎప్పుడూ ధిక్కరించినట్లు కనిపించకు. వ్యర్థంగా చెప్పుతున్నాడనుకోకు. మా తండ్రి ఏవిధంగానూ బాధపడకుండా చూడు. జితేంద్రియుడైన ఆ మహారాజుకు నేను నమస్కారాలు చేశానని చెప్పు. వనవాసం చేయాల్సి వచ్చిందని మా ముగ్గురిలో ఎవ్వరూ కలత చెందలేదు. పద్నాలుగేళ్లు గడిచిన తర్వాత మేం ముగ్గురం అయోధ్యకు వస్తాం. అప్పుడు మా దగ్గరే మీరు ఉండవచ్చుకదా! చింతించకండి, సుఖంగా ఉంటూ నా తల్లిదండ్రుల ఆరోగ్యాదులను కాపాడుతూ ఉండు.

నా తల్లులు అయిన కౌసల్య, సుమిత్ర, కైకేయిలకు పాదాభివందనం చేసినట్లు తెలుపు. నా తండ్రిగారి భార్యలందరికి నా నమస్కారాలు తెలియచేయి. సీతాలక్ష్మణులు వారికి వందనం ఆచరించినట్లు చెప్పు. మీరు వెళ్లి భరతుని శీఘ్రంగా తీసుకొని వచ్చి రాజ్యాధికారాన్ని చేపట్టమని నా మాటగా చెప్పు. అప్పుడు భరతుని ఏలుబడిలో మీకు మావల్ల కలిగే ఈ దుఃఖం ఉండదు.

భరతునితో నా మాటగా చెప్పు. రాచకార్యాలు భేదబుద్ధి లేక ఎలా చేస్తాడో అలానే తల్లుల విషయంలో కూడా భేదాన్ని చూపవద్దని చెప్పు. నా ముగ్గురు తల్లులను ఒకేవిధంగా చూడమని చెప్పు. తండ్రి మాట ప్రకారం రాజ్యాభిషిక్తుడై ఇహపరసుఖాలు పొందవచ్చని భరతునితో చెప్పు.'' రాముని మాటలన్నీ విన్న సుమంత్రుడు 'ఓ శ్రీరామచంద్రా! మీపై నాకున్న వాత్సల్యానురాగంతో చెబుతున్నాను. మీ వియోగాన్ని భరించలేక అల్లాడుతున్న అయోధ్యనగరానికి నేను తిరిగి ఎలా వెళ్లగలను? ఆనాడు రాముడున్న రథాన్ని చూసే ప్రజానీకం దుఃఖించింది. నేడు రథంపై మీరు లేకుండా నేను తిరిగి అయోధ్యలో ప్రవేశిస్తే వారు దుఃఖసముద్రంలో మునిగిపోరా? యుద్ధంలో రాజును కోల్పోయి ఒంటరిగా వచ్చే రథసారథిలాగా నన్ను చూడగానే ప్రజలు దైన్యాన్ని పొందుతారు. మిమ్ము దూరం చేసుకొన్న నగరవాసులు దుఃఖంతో అభోజనులై ఉంటారు. మిమ్మే తలుస్తూ కార్యవిముఖులై ఉంటారు. వారు ఎంతగా క్షోభిస్తున్నారో మీరు ఆనాడు చూచారు గదా. ఆనాడు చేసిన ఆర్తనాదం నేడు నూరురెట్లు ఎక్కువవుతుంది. మీరు లేని నన్ను చూచిన ప్రజలగుండెలు అవిసిపోతాయి.

దుఃఖంలో కూరుకుపోయిన కౌసల్యామాత నా చెంతకు వచ్చి 'నా సుగుణాభిరాముడేడి?' అని అడిగితే 'మేనమామ ఇంట దిగబెట్టినాను, వారు సంతోషంగా ఉన్నారులే అమ్మా' అని చెప్పమంటావా? రామచంద్రా! నేను అప్రియమైనను అబద్ధం చెప్పలేను. నానోట మిమ్ము అరణ్యాలలో విడచి వచ్చానని అనగానే ఆ తల్లి ఎంతగా రోదిస్తుందో? మీరు ఆరోహించి వచ్చిన ఈ రథాన్ని నేడు మీరు లేకుండా ఎలా నేను తోలుకెళ్లను? నేను ఈ పనులన్నీ చేయలేను. నేనూ మీ వెంట వస్తాను. నన్ను మీవెంట అరణ్యాలకు రావడానికి అనుమతిని ప్రసాదించండి. ఒకవేళ మీరు నన్ను నిరాకరించదలిస్తే నేను అగ్నిలో ప్రవేశిస్తాను'' అని రాముని సుమంత్రుడు భయపెట్టచూశాడు. ''రామా! నీ అనుగ్రహంతో ఇన్నాళ్లు సుఖాన్నే అనుభవించాను. ఈనాడు మీచెంత ఉండే భాగ్యాన్ని నాకు అందించు. మీరు దానికి అనుమతించాలనే నా కోరిక. నా కోరికను మీరు తిరస్కరించరని నేను నమ్ముతున్నాను. మీరు అరణ్యవాసి ఐనపుడు ఈ రథం గుర్రాలు అన్నీ మీకు సేవ చేస్తూ తృప్తిచెందుతాయి. వాటివల్ల ఉత్తమగతిని పొందుతాయి.

నేను నిస్సంగుడినై మీకు శుశ్రూష చేస్తూ నా జీవితాన్ని గడుపుతాను. పాపాత్ములు దేవలోకానికి ఎలా వెళ్లలేరో అలా నేను మీరు లేకుండా అయోధ్యలో ప్రవేశించలేను. మీ వనవాసదీక్ష ముగిసిన తర్వాత మీ ముగ్గురిని రథంపై ఎక్కించుకొని అయోధ్యలో అడుగుపెట్టాలనేది నా కోరిక. మీ చెంత నాకు యుగాలు క్షణాల్లో గడిచిపోతాయి. మీరు లేని అయోధ్యలో నాకు కాలం గడవదు. నేను మీ భక్తుడను. నా ప్రభువు కుమారుడివైన మిమ్ము అనుసరిస్తూ ఉండాలనేదే నా ఆకాంక్ష. మీవెంట ఉండి మిమ్ము, మీ మర్యాదను కాపాడుతుంటాను. నావల్ల మీకు ఎల్లవేళలా ఉపకారమే జరుగుతుంది. నన్ను విడిచివెళ్లకు అంటూ అనేకవిధాలుగా సుమంత్రుడు రాముని ఒప్పించాలని చూశాడు.

సేవకులపై అపార ప్రేమ ఉన్న రాముడు దీనుడైన సుమంత్రుని మాటలు విన్నాడు. "సుమంత్రా! నీవు అయోధ్యకు తిరిగి వెళితే కైకేయితల్లి నేను అడవులకు వెళ్లానని నమ్ముతుంది. దానితో తన మాటను పాటించారని నాతండ్రి అయిన దశరథునిపై ప్రేమను చూపుతుంది. ఆయనపై ఉండే నమ్మలేనితనాన్ని దూరం చేసుకుంటుంది. భరతుడు రాజ్యం చేపట్టాలనేది నా కోరిక. మీరు తిరిగి వెళ్లినట్లు అయితే నాకు, నా రాజ్యానికి ,నా తల్లిదండ్రులకు, ప్రజలకు ఆనందాన్ని చేకూర్చుతారు. నేను చెప్పినవాటినన్నింటిని జాగ్రత్తగా గుర్తుతెచ్చుకొని వాటిని ఆచరించు" అంటూ సుమంత్రుని శ్రీరాముడు ఓదార్చాడు.

గుహుని చూచి రాముడు 'ఓ నేస్తమా! నేనిప్పుడు జనవాసాలకు దూరంగా నివసించాలి. వనచరుడనై పద్నాలుగేండ్లు వనవాసం చేయాలి. దానికోసం ఏర్పాట్లు చేసుకోవాలి. నా తల్లిదండ్రులు ఇష్టపడినట్లుగా నేను జటాధారి నవ్వాలి. దానికోసం మర్రిపాలు కావాలి. ఆ పాలతో నేను నా వెంట్రుకలను ముడిపెట్టుతాను' అని చెప్పాడు. గుహుడు వెంటనే మర్రిపాలు తెప్పించాడు. వాటితో రామలక్ష్మణులు జటాధారులయ్యారు. నార చీరలు ధరించారు. అప్పుడు ఋషులవలె రామలక్ష్మణులు కనిపించారు.

రామలక్ష్మణులు విఖనసమహర్షి చెప్పిన వానప్రస్థమార్గాన్ని చేపట్టారు. తన ప్రియుడైన గుహునితో రాముడు సైన్యం, ధనాగారం, దుర్గం, దేశం వీటిల్లో ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించకూడదని హితవు చెప్పాడు. రాజ్య భారాన్ని మోయడం కత్తితో సాముచేయడం లాంటిదని పెద్దలు అంటారు. కడు జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి సుమా అని శ్రీరాముడు చెప్పాడు. గుహుని దగ్గర వీడ్కోలు పలికి రామలక్ష్మణులు, సీత ముగ్గురూ నావ దగ్గరకు వెళ్లారు. ఆ నావను ఎక్కారు. గుహుడు నావికునితో 'వీరిని ఆవలి ఒడ్డుకు చేర్చు' అని చెప్పాడు. నావనెక్కిన ఆ ముగ్గురూ గంగాదేవికి నమస్కరించారు. 'దైవీం నావమ్' అంటూ రాముడు మంత్రాన్ని జపించాడు. సుమంత్రుని గుహుని వీడి సీతారామలక్ష్మణులు నావలో ప్రయాణం సాగించారు.

నావికుడు బలమైన తెడ్లతో గంగా ప్రవాహాన్ని వెనక్కు నెట్టుతూ నావను ముందుకు నడిపించాడు. నావ నది మధ్యకు చేరింది. సీత చేతులు జోడించి, "ఓ సౌభాగ్యవతీ! గంగమ్మతల్లీ! దశరథుని కోడలినైన నేను నా భాగస్వామి, నా మరిది అరణ్యవాసానికి వెళుతున్నాం. మేం ముగ్గురం వనవాసాన్ని ముగించుకొని తిరిగి అయోధ్యను చేరడానికి నీచెంతకు వస్తాం. మేము క్షేమంగా తిరిగి వచ్చేటప్పుడు నిన్ను నేను పూజిస్తాను. మా ముగ్గురికి ఆపదలు ఎదురవ్వకుండా కాపాడు తల్లీ" అని మొక్కుకొన్నది.

"ఓ త్రిపథగామినీ? నీవు స్వర్గభూలోకపాతాళాలలో ప్రవహిస్తూ ప్రఖ్యాతి చెందావు. నా శ్రీరాముడు అయోధ్యను చేపట్టినపుడు నీ సంతోషానికై లక్షగోవులను, వస్త్రాలను, మధుర పదార్థాలను దానం చేస్తాను. మేం వనవాసం ముగించుకొని వచ్చిన తర్వాత నీకు ప్రీతి కలిగించే నైవేద్యాలను సమర్పిస్తాను. నీ తీరాన వెలసిన అన్ని పుణ్యక్షేత్రాలను దర్శించి ఆయా దేవాలయాలలోని దేవతలను పూజిస్తాను. నేను శ్రీరాముడు లక్ష్మణుడు తిరిగి అయోధ్యకు చేరేటట్లు మమ్ము దీవించుతల్లీ!" అని సీత గంగను వేడుకొంది. ఆ నావ దక్షిణం వైపు సాగుతూ వెళ్లింది. తీరాన్ని చేరింది. రాముడు సీత లక్ష్మణుడు నావనుంచి దిగారు. ఆ మగ్గురూ కలిసి ముందుకు సాగారు.

అలా నడుస్తూ రాముడు 'ఓ లక్ష్మణా! జనులు ఉండేచోటున, లేని చోటున కూడా నీవు అప్రమత్తతతో మెలుగు. జనశూన్యమైన అరణ్యాలలో ఎంతో జాగ్రత్త తీసుకోవాల్సి ఉంటుంది. సౌమిత్రీ నీవు ముందు నడు, నీ వెనుక సీత, మీ ఇద్దరి వెనుక నేను నడుస్తాను. మనం ఒకరినొకరం ఇక్కడ రక్షించుకుంటూ ముందుకు సాగాలి. ఏ పని ఐనా చేయి దాటాక చేసేది ఏమీ ఉండదు. మన చేతులలో ఉన్నప్పుడే పనిని చక్కచేసుకోవాలి. ఇప్పుడు సీతకు కష్టాలు అర్థమవుతాయి. ఈ భూమి అంతా లోయలు, మిట్టపల్లాలతో ఉంటుంది. ఇంతకుముందెప్పుడు దీనిని చూడని సీత నేడు వీటన్నింటిని చూస్తుంది.' అని రాముడు చెప్పాడు. ఇలా వీరు ఒకరి వెనుక ఒకరు ముందుకు వెళ్లారు. వీరినే చూస్తున్న సుమంత్రునికి కన్నీళ్లు వచ్చాయి. వారు కనిపించినంత దూరం చూస్తూనే ఉండిపోయాడు. వారు కనిపించనంత దూరం వెళ్లాక దృష్టిని మరల్చాడు. తిరిగి రథాన్ని అధిరోహించాడు. దుః ఖం తో అశ్వాలను అదిలిస్తూ వత్స దేశాన్ని చేరాడు. సీతారామలక్ష్మణులు ముందుకు వెళుతూ ఆకలిని తృప్తిపరచుటకు వనాహారాన్ని తీసుకున్నారు. సాయంకాలం కాగానే ఓ చెట్టు నీడలో విశ్రమించారు.

* * *

లక్ష్మణుని అయోధ్యకు పంపే ప్రయత్నం

సర్గ - 53

వృక్షమూలం చేరిన రామలక్ష్మణులు విశ్రాంతి తీసుకున్నారు. సంధ్యావందనం చేశారు. రాముడు లక్ష్మణునితో "ఓ సౌమిత్రీ! మనం ముగ్గురం మన దేశాన్ని వదిలి వచ్చేశాం. సుమంత్రుడు మనలను వీడి వెళ్లిపోయారు. ఇప్పుడు ఒంటరివాళ్లం అయ్యాం. నీవు ఏమాత్రం దుఃఖించకు. మన మిద్దరం నేటినుంచి రాత్రిళ్లు మేల్కొని ఉండాలి. మనం సీతను కాపాడాలి. ఈరోజుకి ఇక్కడ దొరికే తృణాలను పరుచుకొని పడుకుందాం." పడుకునే వారు మాట్లాడుతున్నారు.

"లక్ష్మణా! మనల్ని విడిచిన మన తండ్రి ఎంతగా బాధపడుతున్నారోగదా! ఆయనకు రాత్రిళ్లు నిద్రవచ్చి ఉండదు. మన గురించే ఆలోచిస్తూ దుఃఖిస్తుంటారు. మన తల్లి అయిన కైక తన మాట నెరవేరినందుకు సంతోషపడుతూ ఉండి ఉంటుంది. ఆమె భరతుని రాజ్యం కోసం మహారాజు ప్రాణాలు తీయదుకదా! కామ పరవశుడై రాజు కైక అధీనంలో ఉన్నారు. ఆయనకు వృద్ధాప్యంతో చపలత్వం వచ్చింది.

ఇప్పుడు మనలను కూడా దూరం చేసుకొన్నాడు. ఇప్పుడు ఏమీ చేయలేని అశక్తుడైనాడు. ఇదంతా చూసిన నాకు అర్థధర్మాలకంటే కామమే బలవత్తరమైనదని అనిపిస్తుంది. ఎంత తెలివిలేనివాడైనా కామార్తుడైనా కన్నకొడుకును దూరం చేసుకొంటాడా? భరతుడు ఒక్కడే భార్యాసమేతుడై కోసల రాజ్యాన్ని చేపట్టి సుఖిస్తాడు.

వృద్ధుడైన మహారాజు కాలపాశంతో బంధితుడౌతాడు. మృత్యువు ఆయనను సమీపిస్తుంది. నేను అరణ్యాలలో ఉన్నాను. ఎదురులేని అయోధ్యను భరతుడు చేపట్టడం చాలా సులభం. ధర్మార్థాలను వదిలి ఎవరైతే కామానికి

ప్రాధాన్యం ఇస్తారో వారు త్వరగా చిక్కుల్లో పడతారని ఈ దశరథుని చూస్తే తెలుస్తుంది. ఓ సౌమిత్రీ! ఈ కైకేయి వలనే ఇంత దుర్గతి పడుతోందని నాకు అనిపిస్తుంది. కైకేయి రాజ్యం దక్కిందన్న గర్వంతో మదించిపోతుందేమో. నావల్ల నా తల్లులను కూడా ఈమె హింసిస్తుందేమో? నావల్ల నీకు జన్మనిచ్చిన సుమిత్రాదేవికి కూడా కష్టాలు తప్పవనిపిస్తోంది. అందుకే నీవు రేపు ఉదయాన్నే ఇక్కడనుంచి తిరిగి అయోధ్యకు వెళ్లిపో' అని రాముడు ఉద్వేగ భరితంగా చెప్పాడు.

'లక్ష్మణా! నేనూ సీతా కలసి దండకారణ్యాలకు వెళ్తాం. సీతను నేను రక్షిస్తాను. నీవు అనాథలైన కౌసల్యా సుమిత్రలను కాపాడు. అధర్మపరురాలైన కైక నా తల్లులను దూషిస్తుందేమో. నీవు వెళ్లి ధర్మమూర్తి ఐన భరతునికి వారిని రక్షించే భారం అప్పగించు. పూర్వమెప్పుడో నేను తల్లిబిడ్డలను వేరు చేశానేమో? నేడు నేను ఆ బాధను అనుభవిస్తున్నాను. నేను నా తల్లికి సేవచేసే భాగ్యాన్ని కోల్పోయిన నిర్భాగ్యుణ్ణి. నా జీవితం వ్యర్థంగా అనిపిస్తోంది. ఏ తల్లి కూడా నావంటి కుమారుని పొందాలని అనుకోదు. నేను నా తల్లికి తీరని దుఃఖాన్ని కలిగించాను.

"లక్ష్మణా! నా వనవాసవిషయం తెలియగానే అక్కడే ఉన్న గోరువంక చిలుకతో కైకేయిని కొరుకు అని చెప్పింది. నాకన్నా నా తల్లిపైన ఆ శారికకే ఎక్కువ ప్రేమ ఉన్నట్లు తెలుస్తోందిగదా. నాపై అమిత ప్రేమను పెంచుకొన్న కౌసల్య నన్ను విడిచి ఉండలేదు. మరొకరితో ప్రేమను పంచుకోలేదు. అటువంటి ఒంటరిగా ఉన్న కౌసల్యను నేను బాధపెట్టాను. నన్ను విడిచి నా తల్లి ఎంతగా కుమిలిపోతోందో! లక్ష్మణా! నేను ఒక్కడనే ఈ అయోధ్యనే కాదు సమస్తభూమండలాన్ని చేజిక్కించుకోగలను. నా పౌరుషంపై నాకు నమ్మకం ఉంది. కాని నేడు పౌరుషాన్ని ప్రదర్శించే పరిస్థితి లేదుగదా!" ఇలా తలుస్తూ రాముడు కన్నీళ్ల పర్యంతం అయ్యాడు. తల్లిదండ్రుల్ని విడిచాననే భావం ఆయన్ని బాధపెట్టింది.

నివురుగప్పిన నిప్పులాగా దహించివేసే రాముని మనస్సును లక్ష్మణుడు చల్లని మాటలతో ఓదార్చాడు. "శ్రీరామచంద్రా! మీరు ఇక్కడికి వచ్చి ఉండడంతో అమావాస్యనాటి రాత్రిలాగా చంద్రుడు లేని ఆకాశంలాగా అయోధ్య కళావిహీనం అవుతుంది. ఓ పురుషశ్రేష్ఠా! మీరు ఇలా దుఃఖించడం బాగలేదు. మీ దుఃఖాన్ని చూసిన సీత కూడా నొచ్చుకుంటుంది. మీ సాన్నిహిత్యానికి నేనుగాని సీతగాని దూరం కాలేము. మీ నీడను వదిలిన మేము నీళ్లలోనుంచి బయటపడిన చేపల్లాగా గిలగిలలాడుతాం. మీరు లేకుండా మేం క్షణకాలమైనా జీవించలేం.

ఓ కోదండరామా! మిమ్ము విడిచి నాకు అయోధ్యకు వెళ్లాలని లేదు. మీరు లేకుండా నాకు తల్లిగాని భార్యగాని ఆనందాన్ని ఇవ్వలేరు. తండ్రినైన విడిచి ఉండగలను కాని నిన్ను విడిచి నేను జీవించలేను. మీరు లేకపోతే స్వర్గమైనా నాకు నరకాన్నే తలపిస్తుంది."

ఇలా వారు మాట్లాడుకొని అక్కడే ఏర్పరచుకొన్న శయ్యపై పవళించారు. తిరిగి వారిద్దరూ పద్నాలుగేళ్లు వనవాసం చేసే సంకల్పాన్ని దృఢతరం చేసుకొన్నారు. వారిద్దరూ రెండు సింహాల్లాగా అరణ్యాలలో పర్వతాలలో సంచరించాలని అనుకొన్నారు. వారి దరికి భయసందేహాలు చేరలేకపోయాయి.

* * *

భరద్వాజాశ్రమ దర్శనం

సర్గ - 54

రాత్రి అంతా ఆ చెట్టు నీడనే వారు గడిపారు. పొద్దున్నే లేచి సంధ్యావందనక్రియలు ఆచరించారు. ఆ తర్వాత అక్కడనుంచి బయలుదేరారు. యమునా, గంగా కలిసే ప్రదేశంలోని ప్రయాగ క్షేత్రాన్ని చేరాలని వారు ముందుకు వెళ్లారు. మార్గమధ్యంలో వారు వనశోభను ఇనుమడింపచేసే వృక్షాలను, జలపాతాలను చూస్తూ ప్రయాణిస్తున్నారు. అంతలో వారికి ఉవ్వెత్తున పైకి ఎగిసే పొగ కనిపించింది. దాన్ని చూచిన శ్రీరాముడు "లక్ష్మణా, ఇదిగో ఇక్కడ అగ్నిదేవుని ధ్వజం అయిన పొగ కనిపిస్తుంది. ఇక్కడ భరద్వాజుని ఆశ్రమం ఉన్నట్లుంది. మనం ఇప్పుడు ప్రయాగక్షేత్రాన్ని చేరినట్లు నాకనిపిస్తోంది. అదుగో నీటి సవ్వడి వినబడుతోందిగదా" అన్నాడు.

ఇక్కడ వనాల్లో నివసించేవాళ్లు ఉపయోగించే కట్టెలు పడి ఉన్నాయి. ఇక్కడ రకరకాలైన వృక్షజాతులున్నాయి. ఇది భరద్వాజాశ్రమమే అయి ఉంటుంది అని చెప్పాడు. అలా వారు సాయంకాలసమయానికి గంగాయమునల సంగమక్షేత్రానికి దగ్గరలో ఉన్న ఆశ్రమానికి చేరారు. సీతారామలక్ష్మణులు ఆశ్రమంలోని మునిని చూడాలనుకొన్నారు. ఆ ఆశ్రమంలో కొంత దూరం నడిచారు. వారిని చూచి అక్కడి పక్షులు మృగములు దూరంగా వెళ్లాయి. వీరి ముగ్గురు శిష్యులతో ఉన్న భరద్వాజుని చూసి నమస్కరించారు. తపఃసంపన్నుడైన భరద్వాజునితో రాముడు "స్వామీ! మేము దశరథుని సంతానం అంటూ పరిచయం చేసుకొన్నాడు. సీత నా భార్య, జనకుని ప్రియపుత్రి అంటూ సీతను రాముడు చూపించాడు. నేను తండ్రిమాటకోసం వనవాసదీక్షను తీసుకొని ఈ తపోవనానికి వచ్చాను. దృఢచిత్తుడైన నా తమ్ముడు లక్ష్మణుడు నన్ను విడిచి ఉండలేక నాతో వనవాసానికి వచ్చాడు. నా అర్ధాంగి అయిన సీత నా వియోగం భరించలేక నా వెంటే వచ్చింది. అలా మేం ముగ్గురం వనవాసులమయ్యాం" అంటూ వారు వచ్చిన కారణాన్ని ఆ మౌనికి తెలిపారు.

ఆ మాటలు విని భరద్వాజుడు సంతోషించాడు. వీరిని ఆదరంగా సన్మానించాడు. అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి గౌరవించాడు. కందమూలాలతో వారి ఆకలిని తీర్చాడు. భరద్వాజుని చుట్టూ మృగాలు పక్షులు తిరుగుతూ ఉన్నాయి. ఆయన్ని మునులందరూ పరివేష్టించి ఉన్నారు. ఎదురుగా ఆసీనులైవున్న సీతారామలక్ష్మణులతో భరద్వాజుడు ఇలా అన్నాడు.

"ఓ శ్రీరామా! నీ గురించి నేను తెలుసుకొన్నాను. నిన్ను అరణ్యాలకు నీ తండ్రి పంపిన విషయం నేను విని ఉన్నాను. ఈ గంగాయమునల సంగమప్రదేశం అత్యంతరమణీయంగాను పవిత్రంగాను ఉంటుంది. ఇక్కడ మీరు సుఖంగా జీవించవచ్చు" అని చెప్పాడు.

"ఓ మౌనివర్యా! మీరు చెప్పేది చాలా బాగుంది. కాని జనవాసానికి దగ్గరగా ఉన్న మీ ఆశ్రమంలో నేను ఉన్నానని జనులు తెలుసుకొంటారు. వారందరూ నన్ను చూడాలనే కోరికతో నాదగ్గరకు వస్తుంటారు. దానివలన నేను అనుకున్న కార్యం నెరవేరదు. అందువల్ల ఓ మునిశ్రేష్ఠా! జనసమ్మర్దం లేని ప్రదేశం ఏదైనా ఉంటే చెప్పండి. మేము అక్కడ ఉంటాం" అని రాముడు వినయంగా అడిగాడు.

భరద్వాజుడు రాముని దూరదృష్టిని మెచ్చుకొన్నాడు. "ఓ శ్రీరామచంద్రా! ఇక్కడికి పది క్రోసుల దూరంలో గంధమాదనపర్వతంతో సమానమైన చిత్రకూటపర్వతం ఉంది. అక్కడ ఎందరో మహర్షులు తపస్సులను సాగిస్తారు. అక్కడ వృక్షసముదాయం ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. కొండముచ్చులు, వానరాలు, ఎలుగుబంట్లు లాంటి వనచరజంతువులు కూడా ఉన్నాయి. మీకు తగిన ప్రదేశం అదేనని నాకు తోస్తోంది. ఆ చిత్రకూటంపై ఉండే మానవుల మనస్సులు చిత్రవిభ్రమకు గురి కావంటారు. ఎందరో తాపసులు వందలకొలది సంవత్సరాలు తమ తపస్సులను సాగించారు. మీరు నిశ్చింతగా అక్కడ మీ దీక్షను పూర్తిచేసుకోవచ్చు. అలాకాకపోతే నా దగ్గరే ఉండవచ్చు" అని చెప్పాడు.

ఇలా వారిరువురూ మాట్లాడుతుండగానే సూర్యుడు పశ్చిమాద్రిని చేరుకున్నాడు. సాయం సంధ్య అలముకొంది. నడిచి నడిచి అలసిన సీతారామలక్ష్మణులు ఆ రాత్రి ఆ ఆశ్రమంలోనే గడిపారు. సూర్యోదయం తర్వాత కాలకృత్యాలు తీర్చుకున్న రాముడు భరద్వాజుని చెంతకు వచ్చాడు. నమస్కరించి 'ఓ సత్యశీలుడా! మాకు చిత్రకూటం వెళ్లడానికి అనుజ్ఞ నిమ్ము' అని ప్రార్థించాడు.

"ఓ రఘునందనా! చిత్రకూటంలో తేనె, కందమూలాలు, దుంపలు విరివిగా దొరుకుతాయి. అక్కడి ప్రకృతి ఆనందాన్నిస్తుంది. అక్కడ జంతువులు ముచ్చట గొలుపుతాయి. అనేకాలైన వృక్షరాజాలుంటాయి. వాటిపై కిన్నరులు, ఉరగులు నివసిస్తుంటారు. నెమళ్లు, కుందేళ్లు మిమ్ములను అలరిస్తాయి. ఏనుగులు, లేళ్లు గుంపులుగా తిరుగుతుంటాయి. ఆ పర్వతంపై గుహలు, సెలయేళ్లు కొండచరియలు, జలపాతాలు మనస్సులను ఆకట్టుకొంటాయి. పర్వతసానువులు, మందాకినీనదిని మీరు చూడవచ్చు.

ఆ రమ్యమైన ప్రదేశంలో మీ ముగ్గురి వనవాస జీవితం ఆనందంగా గడిచిపోతుంది. మీకు అనువుగా ప్రశాంతంగా, జనసమ్మర్దం లేకుండా మీరు కోరినట్లుగా ఆ ప్రాంతం మిమ్మల్ని ఆనందింప చేస్తుంది. అక్కడే మీరు ఏ చింతా లేకుండా ఉండొచ్చు" అని భరద్వాజుడు రామాదులకు చెప్పాడు.

* * *

రామాదులు యమునను దాటటం

సర్గ - 55

భరద్వాజుని అనుజ్ఞతో రామాదులు మరునాటి ఉదయాన చిత్రకూటానికి బయలుదేరారు. సీతారామ లక్ష్మణులను మౌని ఆశీర్వదించి వారితో పాటు కాస్త దూరం నడిచాడు. "మీరు గంగాయమున సంగమప్రదేశానికి వెళ్లిన తర్వాత ఎడమవైపుగా ప్రయాణం సాగించండి. ఆ యమునను తెప్పతో దాటి వెళ్లండి. యమున ఆవల తీరంలో 'శ్యామం' అనే ఒక పెద్ద మర్రిచెట్టు ఉంది. ఇది విశాలమైన కొమ్మలు కలిగి ఉంది. దీని నీడలో ఎందరో సిద్ధులుంటారు. పచ్చని ఆకులున్న ఆ మర్రిచెట్టు చుట్టూ ఎన్నో వృక్షాలు కూడా ఉన్నాయి. సీతాదేవీ! నీవు ఆ వృక్షరాజాన్ని పూజించు, నీకు శుభం కలుగుతుంది. అక్కడ మీరు కాసేపు విశ్రాంతి తీసుకోవచ్చు.

అక్కడనుంచి ఒక క్రోసు దూరంలో మోదుగ, రేగు చెట్లు, వెదురు డొంకలతో నిండిన నీలవర్ణమైన అడవి యమునా తీరంలో ఉంది. అదే చిత్రకూటానికి వెళ్లే మార్గం. నేను పలుసార్లు ఆ దోవలో వెళ్లి ఉన్నాను. ఆ దారి సుఖకరంగా ఉంటుంది. అక్కడ దావాగ్ని భయం కూడా ఉండదు. అక్కడి వృక్షసంపద, వనచరాలు మనకు అలసటను తెలియనీయవు" అని చెప్తూ వారిని వెంబడించి వస్తున్న భరద్వాజుని ఆపి "మహర్షివర్యా! మీరు విశ్రాంతి తీసుకోండి. మేము మీరు చెప్పినట్లుగానే వెళ్తాం. మీరు శ్రమ పడకండి. మీరు ఆశ్రమానికి వెళ్లండి" అని రాముడు చెప్పాడు. రాముని కోరిక ప్రకారం భరద్వాజమహర్షి వెనకకు మరలి వెళ్లాడు. "లక్ష్మణా! మనం ఈ భరద్వాజుని ప్రేమకు పాత్రులమయ్యాం, మన జీవితం ధన్యమైనట్లు నాకు అనిపిస్తోంది" అన్నాడు రాముడు. అలా మాట్లాడుతూ వారు యమునానదీ తీరం చేరారు.

రామలక్ష్మణులు కర్రలు పేర్చి వాటిపై వెదుళ్లు తృణాలు పరచి ఒక తెప్పను తయారుచేశారు. బలశాలియైన లక్ష్మణుడు ప్రబ్బలి కొమ్మలు నేరేడు కొమ్మలు త్రుంచి కొనితెచ్చి సీతకోసం ఒక ఆసనాన్ని తయారుచేశాడు. రాముడు బిడియపడుతున్న సీతను ఆ తెప్పపైకి చేర్చాడు. సీత వస్త్రాలను, ఆభరణాలను, గునపాన్ని, గంపను, పుటికను, ఆయుధాలను సీత ప్రక్కగా పెట్టాడు. ఆ తర్వాత వీరులైన రామలక్ష్మణులు తెప్పపై ఎక్కి దాన్ని ముందుకు నడిపారు.

యమున మధ్యలోకి చేరిన సీత యమునకు నమస్కరించి, 'ఓ యమునానదీమతల్లీ! నేడు మేము నిన్ను దాటి వెళుతున్నాము. నా భర్త వ్రతదీక్షను పూర్తి చేసుకొని తిరిగి మేము ముప్పురం నిన్ను చేరాలని ఆశీర్వదించు. నా పతి రాజ్యాన్ని చేపట్టిన తర్వాత నీకు నేను పలురకాలైన నైవేద్యాలను సమర్పిస్తాను' అంటూ ప్రార్థించింది. వారు యమున ఆవలిగట్టుకు చేరారు.

వారు మహర్షి చెప్పినట్లే ముందుకు వెళ్లి శ్యామం అనే మర్రిచెట్టును చూశారు. దాని శాఖోపశాఖలు విస్తరించి ఉండడాన్ని చూశారు. ఆ వృక్షాన్ని సీత పూజించింది. మేము మా వనవాస దీక్షానంతరం కీర్తిమంతులైన కౌసల్యాదులను చూసేటట్లు దీవించ" మని సీత కోరుకొంది.

అప్పుడు రాముడు 'సోదరా! నీవు ముందుగా నడవడం ప్రారంభించు. నీ వెనుక సీత ఆమె వెనుక నేను ధనుర్ధారినై వస్తాను. దారిలో సీత మనసు పడే ఫలపుష్పాదులను ఆమెకు తీసుకొనివచ్చి ఇద్దాం" అని చెప్పాడు. సీత రెండు బలిష్ఠమైన ఏనుగుల మధ్య నడిచే ఆడఏనుగులాగా కనబడింది. ఆ వనాలలో తను ఇంతకుముందు చూడని పుష్పాలను ఫలాలను చూసి అబ్బురపడుతూ వాటిని కావాలని రాముని అడుగుతూ సీత నడక సాగించింది. ఆమె కోరినవన్నీ లక్ష్మణుడు పరుగున వెళ్లి తెచ్చిస్తూండేవాడు.

వారు సారసపక్షులు, హంసలతో అలరారే యమునను చూచి ఆనందించారు. అలా ముందుకు సాగుతూ, రాత్రి సమీపిస్తుండగా రామలక్ష్మణులు రాత్రికి ఆహారాన్ని సేకరించారు. మిట్టపల్లాలు లేక చదునుగా వున్న ఒక ప్రదేశాన్ని వారు ఎన్నుకొని ఆ రాత్రికి అక్కడ విశ్రమించాలని భావించారు.

* * *

రామాదుల కుటీరప్రవేశం

సర్గ - 56

తూర్పు తెల్లవారింది. భానూదయానికి సూచికగా పక్షుల కిలకిలారావాలు వినబడ్డాయి. వెంటనే రాముడు మేల్కొన్నాడు. ప్రక్కనే నిద్రిస్తున్న లక్ష్మణుని చూశాడు. ఆదమరచి నిద్రిస్తున్న లక్ష్మణుని సుతిమెత్తగా రాముడు మేల్కొల్పాడు. 'లక్ష్మణా! పొద్దు ఎక్కుతోంది, నీవు బడలికగా నిద్రిస్తున్నావు. ఇక మేల్కో' అంటూ లక్ష్మణుని నిద్ర లేపాడు. లక్ష్మణుడు మార్గాయాసాన్ని తీర్చుకొని హాయిగా లేచాడు. యమునలో ఆ ముగ్గురూ స్నానాదికాలు చేశారు. ప్రాతఃసంధ్యావందనాలు ఆచరించారు. ప్రయాణం మొదలుపెట్టారు.

'ఓ వైదేహీ! ఇది వసంత కాలం. చెట్లన్నీ విరగకాచి ఉన్నాయి చూడు. ఏ చెట్టుకాచెట్టు పూలహారం ధరించినట్లు కనిపిస్తోంది. ఆ పుష్పములపై ఎండ పడి వాటి అందం ద్విగుణీకృతం అవుతోంది. నల్లజీడిచెట్లు పండ్ల బరువుతో వంగి ఉన్నాయి. ఇది అడవి ప్రదేశంకదా. ఈ పండ్లను తినేవారు ఎవరూ లేక చెట్లు వీటి బరువును మోయలేక పోతున్నట్లుగా కనిపిస్తున్నాయి. మనం ఇక్కడ కుటీరాన్ని నిర్మించుకొంటే ఈ ఫలాలు తింటూ ఈ నీళ్లు తాగుతూ మన వనవాసాన్ని హాయిగా గడపవచ్చు అనిపిస్తోందిగదా!' అని సీతతో ప్రకృతి సోయగాన్ని వర్ణించి చెబుతూ చూపిస్తున్నాడు రాముడు.

'లక్ష్మణా! అటు చూడు ఇక్కడ ప్రతి వృక్షం మీద తేనె తుట్టె వ్రేలాడుతోంది. తేనెటీగల ఝంకారంతో ఈ ప్రదేశం మారుమ్రోగుతోంది. వీటిల్లో ఒక్కొక్కతుట్టెలో కడివెడు తేనె ఉన్నట్లు అనిపిస్తోంది గదా' అన్నాడు రాముడు.

'ఈ ప్రదేశం ఎంత రమణీయంగా వుందోకదా! చెట్లనుంచి రాలే పుష్పాలు నేలను కప్పివేసి తివాచి పరచినట్లు కనిపిస్తోంది. కోకిల రావాలకు నెమళ్లు క్రేంకారాలతో జవాబిస్తున్నట్లుగా వుంది.

లక్ష్మణా! ఆ వంక చూడు. ఏనుగు గుంపులు సందడి చేస్తున్నాయి. పక్షుల సమూహాలు ఎన్నో ఉన్నాయి. అన్నీ కలిసి మహాధ్వనిని పుట్టిస్తున్నాయి. అదే చిత్రకూటం. దానిపైకి మనం వెళ్దాం' – అని అంటూ రాముడు సీత లక్ష్మణునితో కలసి చిత్రకూటాన్ని చేరాడు.

రామాదులు ఆ ప్రదేశన్నంతా తిరిగి చూశారు. సమతల ప్రదేశాన్ని కుటీరం కోసం వెదికి చూశారు. ఈ ప్రదేశం మనస్సుకు రంజింప చేస్తోంది. ఆహ్లాదాన్నిచ్చే ఇక్కడే మనం కుటీరాన్ని నిర్మించుకొందాం అని ఆ ముగ్గురూ అనుకొన్నారు. ముందుకు సాగుతూ మధురఫలాలు నిండిన వృక్షాలను, కలరవాలతో వీనుల విందొనర్చే పక్షులతో ఏనుగులు, కుందేళ్లు, లేళ్లు నెమళ్లతో నిండిన ప్రదేశాన్ని కనుల పండువులా చూస్తున్నారు.

అలా వెళుతున్నవారికి వాల్మీకి ఆశ్రమం ఎదురుపడింది. ముగ్గురూ ఆ మహర్షి దగ్గరకు వెళ్లి చేతులు జోడించి నమస్కరించారు. మౌనిపుంగవుడు పరమానందపడుతూ వారికి స్వాగతసత్కారాలు చేశాడు. మహాత్మా! నేను దశరథుని జ్యేష్ఠుడను, నా తమ్ముడు లక్ష్మణుడు, జనకనందిని సీత నా భార్య అంటూ తన్ను తాను పరిచయం చేసుకొన్నాడు, వచ్చిన పనిని తెలిపాడు. మీ వనవాస జీవితం క్షేమకరంగా సాగాలని ఆ మునిశ్రేష్ఠుడు ఆశీర్వదించాడు.

'సౌమిత్రీ! నీవు కుటీరాన్ని నిర్మించడానికి అవసరమైన నేరేడు కర్రలు మొదలగునవి తీసుకొని రా మనం పర్ణశాలను నిర్మించుకుందా'మని రాముడు లక్ష్మణునితో చెప్పాడు. రామాజ్ఞ ప్రకారం లక్ష్మణుడు పర్ణశాలకు అవసరమైన సామగ్రిని తీసుకొని వచ్చాడు. ఎండావానలకు తట్టుకొనేట్లుగా ఆకులతో దూలాలతో కుటీరాన్ని నిర్మించారు. తనకోసమే శ్రమిస్తున్న లక్ష్మణుని చూసి రాముడు సంతోషించాడు. అందంగా కుదురుకొన్న పొదరింటిని చూసి ఆనందించాడు. 'లక్ష్మణా నీవు దీర్ఘాయువువై వర్ధిల్లు! అంటూ తమ్ముని ఆశీర్వదించాడు. మనం క్షేమంగా ఈ ఇంటిలో ఉండాలిగదా. అందుకే వాస్తుపూజను చేసి ఇందులో ప్రవేశిద్దాం. లక్ష్మణా! దానికి అవసరమైన అశ్వకందం తీసుకుని రమ్ము' అని రాముడు చెప్పాడు. 'సౌమిత్రీ! శాస్త్రోక్తంగా గృహప్రవేశం చేయడం ఉత్తమం. శాస్త్రం చెప్పినట్లుగా అశ్వగజకందాలను తవ్వి తీసుకొనిరా మనం విధ్యుక్తధర్మాన్ని మరచిపోకూడదు' అని రాముడు చెప్పగా లక్ష్మణుడు వాస్తుపూజాసామగ్రిని తీసుకొచ్చాడు.

'సీతా! పర్ణశాలకు సంబంధించిన అధిష్ఠానదేవతలను పూజిద్దాం. ఈరోజు ఆదివారం రోహిణీ నక్షత్రయుక్తం. ఇది గృహశాంతికి ఉపయుక్తమైందని పెద్దలంటారు. దీన్ని అనుసరించే మనం కుటీర ప్రవేశం చేద్దాం' అని రాముడు అన్నాడు. అగ్నిని ప్రజ్వలించి లక్ష్మణుడు గజకందాన్ని పక్వం చేశాడు. "అన్నా! మీరు వాస్తు పూజ ప్రారంభించండి. నేను సడలిన శరీరాకృతిని పరిపుష్టం ఒనర్చే గజకందాన్ని పక్వం చేశాను. పూజాసామగ్రిని కూర్చుతాను' అని లక్ష్మణుడు చెప్పాడు. మంత్ర కోవిదుడైన రాముడు నియమానుసారం పవిత్రుడై వాస్తుపూజలో భాగమైన మంత్రాలన్నీ పఠించాడు. సమస్తదేవతాగణాన్ని పూజించాడు. శుచియై సీతతో కూడి పర్ణశాలలో ప్రవేశించాడు. శ్రీరాముడు వైశ్వదేవబలికార్యం, రుద్రయాగం, వైష్ణవయాగం చేశాడు. గ్రహారిష్టాలు తొలగడానికి పుణ్యాహవాచన జపాలు చేశాడు. శాంతి హోమం చేశాడు. గాయత్రిని ఉపాసించాడు. దోషపరిహారార్థం బలిహోమాలు చేశాడు. గణపతిని, విష్ణువును, శివుడిని ఆరాధించాడు. పర్ణశాలలో దేవతలను ప్రతిష్ఠించాడు. ఆ చిత్రకూటంలో దొరికే ఫలాలు, పుష్పాలు, జలాలు, కందాలు, దుంపలతో సర్వదేవతలను తృప్తి పరిచాడు.

ఆ పర్ణశాల రమ్యంగా తయారైంది. మెల్లగా చల్లని గాలి చొరబడుతోంది. గ్రీష్మతాపం తగలకుండా పచ్చని ఆకులు సేద తీర్చుతున్నాయి. రమణీయంగా హృదయాహ్లాదంగా వుండే ఆ పర్ణశాలలో ఇంద్రసభలోని దేవతల్లాగా సీతారామలక్ష్మణులు ప్రవేశించారు. ఆ పర్ణశాల సమీపంలో గుంపులు గుంపులుగా మృగాలు సంచరిస్తున్నాయి. పక్షులు రొద చేస్తున్నాయి. నెమళ్లు పురి విప్పి ఆడుతున్నాయి. లేళ్లు బెదరుచూపులతో తిరుగాడుతున్నాయి. వివిధరకాల చెట్లు పూలగుత్తులతో స్వాగతిస్తున్నాయి. మధురఫలాలతో వృక్షాలు నిండుగా ఉన్నాయి.

ఏనుగుల ఘీంకారాలు పక్షుల కిలకిలారావాలు కోకిలకూతలతో ఆ ప్రదేశం శోభాయమానంగా ఉంది. అక్కడికి దగ్గరలోనే స్నానఘట్టాలతో మందాకిని ప్రవహిస్తోంది. అయోధ్యానగరానికి దూరమైనరామాదులు దుఃఖాన్ని మరచి ప్రకృతికి పరవశులయ్యారు. ఆ ప్రకృతిరమణీయతకు ఆనందించారు.

* * *

సుమంత్రుడు అయోధ్యకు చేరటం

సర్గ - 57

రాముడు గంగను దాటి దక్షిణం వైపుగా వెళ్లాడు. దానినే సుమంత్రుడు గుహుడు చూస్తున్నారు. కంటికి కనిపించకుండా వెళ్లేంతవరకు వారు రామాదులు మీదనే దృష్టి నిలిపారు. తర్వాత దుఃఖార్తుడైన సుమంత్రుడు గుహునితో చాలాసేపు మాట్లాడాడు. గుహుడు సుమంత్రుని తన ఇంట ఉండమని అడిగాడు. అలా ఉన్న కాలంలో గూఢచారులు రామాదులు దక్షిణ తీరంలో భరద్వాజాశ్రమానికి చేరడం, ఆయన అనుజ్ఞతో చిత్రకూటంలో పర్ణశాలను నిర్మించుకొని అక్కడ నివసించడం అనే విషయాలు గుహునికి సుమంత్రుడు తెలిపాడు.

ఆ విషయసేకరణ తర్వాత సుమంత్రుడు గుహునికి చెప్పి అయోధ్యకు బయలుదేరాడు. మార్గాయాసంతో ఎక్కడా ఆగలేదు. నదులూ, పర్వతాలూ, గ్రామాలు అన్నీ దాటుతూ వేగంగా మూడో నాటికి సుమంత్రుడు అయోధ్యకు చేరాడు. అయోధ్య నిశ్శబ్దంగా శ్మశానంలాగా కనిపించింది. ఎక్కడా జనసంచారం లేదు. పిల్లల కేరింతలు లేవు. పెద్దల చర్చలు సాగడంలేదు. ఎవరి వాకిలీ నిండుగా కనిపించడంలేదు. నిర్మానుష్యంగా కనిపించింది. అసలే బాధపడుతున్న సుమంత్రుడు అయోధ్యను చూసి మరింత దిగులు చెందాడు. రామవియోగాగ్నిలో ఈ నగరం దగ్ధం కాలేదుకదా. ఎప్పుడూ జనులతో కిక్కిరిసి ఉండే వీధులన్నీ ఇంతగా మూగపోయాయే అని చింతించాడు.

ఇక దశరథాదులు ఎలా ఉన్నారో అని అనుకొన్నాడు. తన అశ్వాలను వేగంగా తోలాడు. అవి ఎక్కడా ఆగకుండా పరుగెత్తి నగరం మధ్యలోకి వచ్చాయి. రథం చప్పుడు విని పురజనులు దాని దగ్గరకు పరుగెత్తి వచ్చారు. 'రాముడేడి' అంటూ సుమంత్రుని అడిగారు. 'రాముణ్ణి గంగను దాటించి వచ్చాను'– అని చెప్పే మంత్రి మాటలు విని వారు ఖిన్నులయ్యారు. పెద్దగా రోదించారు. 'అయ్యో, రామా!' 'అయ్యో రామా!' 'నీకు ఎంతటి దుర్దశ వచ్చింది నీవు లేకుండా మేము ఈ నగరంలో మనలేం అంటూ దుఃఖించారు. రాముడు మనకు ఎప్పుడు కనబడతాడో? అసలు ఇకమీద కనిపించడేమో' అని రామా అంటూ ఆక్రందనలు చేశారు. జనులు మాట్లాడుకునేవన్నీ సుమంత్రుని చెవులకు చేరాయి.

ధర్మకార్యాలు చేసే రాముడు మనకు కనిపించడు కదా. మనచేత న్యాయంగా నీతిగా ప్రవర్తింపచేసే మన ప్రభువు మన చెంత లేకుండా వెళ్లిపోయాడు కదా. జనులకు ఏది మంచిది? ఏది చెడ్డది? అని నిర్ణయించి చేసే రాజు మనకు దూరమయ్యాడు కదా. కంటికి రెప్పలా కాపాడుతూ అహర్నిశం మనకోసం పాటుపడే మన మహారాజు మనకు దక్కలేదుగదా! అని వారు పరిపరివిధాల దుఃఖించారు. రాముడు లేని రథాన్ని స్త్రీలందరూ వారివారి గవాక్షాలనుంచి చూశారు. కన్నీరు మున్నీరుగా ఏడ్చారు. తమ ప్రియతముడు తమను వీడిపోయాడని చింతించారు.

సుమంత్రుడు తన ముఖాన్ని జనులకు చూపించలేక దశరథుడున్న గృహానికి చేరాడు. రథం దిగి ఏడు కక్షలను దాటుతూ అక్కడ కిక్కిరిసి ఉన్న జన సమూహంలో నుంచి సుమంత్రుడు దశరథుని దగ్గరకు వెళ్లాడు. అలా ఒంటరిగా వెళుతున్న మంత్రిని అంతఃపుర కాంతలు చూశారు. రాముని అడవిలో వదలి వచ్చాడని తెలుసుకొని గొల్లున ఏడ్చారు. వారి కన్నులు కన్నీటిసంద్రాలయ్యాయి. కన్నీటిపొరలు కమ్మిన వారు ఎదుటివారిని చూడలేకపోయారు.

'రాముణ్ణి వదిలి వచ్చిన ఈ సుమంత్రుడు కౌసల్యాదులను ఎలా ఎదుర్కొంటాడు? రాముణ్ణి గూర్చే అడిగే కౌసల్యకు ఏమని జవాబు చెప్తాడు? రాముడు అడవుల పాలయ్యాడన్న విషయం కౌసల్య విని ఊరుకోగలదా? ఆమె అసువులు కోల్పోతుందేమో? దుఃఖంలో కూరుకుపోయిన దశరథ మహారాజు ప్రాణాలు వదిలివేస్తాడేమో!' అని వారు ఒకరితో ఒకరు మాట్లాడుకొంటున్నారు. ఆ మాటలన్నీ సుమంత్రుడు విన్నాడు. శోకాగ్నితో జ్వలిస్తున్న దశరథుని గృహాన్ని సుమంత్రుడు చూశాడు. అందులో ప్రవేశించాడు. పుత్రశోకాగ్నితో దహించబడే దశరథుని చూశాడు. పుత్రుణ్ణి కోల్పోయి కళావిహీనుడైన మహారాజును బాధగా చూశాడు. అయినా దశరథుని దగ్గర చేరి అంజలి బద్ధుడయ్యాడు. చెప్పడానికి నోరు రాకపోయినప్పటికీ సుమంత్రుడు రాముని సందేశాన్ని యథాతథంగా చెప్పాడు. రామ సందేశాన్ని మహారాజు మౌనంగా విన్నాడు. రామ వియోగశోకం భరించలేక నేలకొరిగి మూర్ఛబోయాడు.

అంతఃపురంలోని వారందరు దశరథుడు పడిపోవడాన్ని చూసి హాహాకారాలు చేశారు. బిలబిలమంటూ వచ్చి దశరథుని లేవనెత్తారు. కౌసల్యాసుమిత్రలు దశరథుని లేపి కూర్చోబెట్టారు. ఆయన కాస్త తెప్పరిల్లాడు. అప్పుడు కౌసల్య "మహాప్రభూ! ఎవ్వరూ చేయలేని పనిని చేసిన రాముని దూతగా వచ్చిన ఇతనితో మీరు మాట్లాడరేమి? చేయకూడని పని చేసివేశారు. అయినా జరిగిపోయిన పనికి ఇప్పుడు వగచి ఏం లాభం? ఇప్పుడు ఏడుస్తూ కూర్చుంటే ఫలమేమి ఉండదుకదా! అయినా మాట నిలబెట్టుకొనిన పుణ్యం మీకు లభించింది కదా. కైకకు భయపడి మీరు రామునితో మనస్సు విప్పి మాట్లాడలేక పోయారు. మీకు భీతిని కలిగించే కైక ఇక్కడ లేదు. మీరు నిర్భయంగా సుమంత్రునితో మాట్లాడవచ్చు" అంటూ గొంతు దుఃఖంతో జీరపోవ కౌసల్య దగ్గుత్తికతో మాట్లాడుతూ స్పృహతప్పి నేలపై పడిపోయింది.

దాన్ని చూచి నిర్ఘాంతపోయిన దశరథుడు మళ్లీ స్పృహతప్పాడు. వీరిద్దరినీ చూసిన అంతఃపురవాసులు సుమంత్రుడు పెద్దగా ఏడ్చారు. వారి ఏడుపులతో ఆ నగరం అంతా మారుమ్రోగిపోయింది. దుఃఖాశ్రువులు అయోధ్యను ముంచివేశాయి. పట్టణం అంతా వ్యాకులంతో నిండిపోయింది.

* * *

రామాదుల వివరాలు అడిగి తెలుసుకోవటం

సర్గ - 58

దశరథుడు కొద్దిసేపటికి స్వస్థుడయ్యాడు. తన సారథి, మంత్రి ఐన సుమంత్రుని పిలిపించాడు. "ఓ సూతా! నీవు రాముని గూర్చి నాకు వివరంగా చెప్పు" అని అడిగాడు. దుఃఖంతో వ్యాకులం చెందిన మహారాజును సుమంత్రుడు చూశాడు. శోకాగ్నితో దహించబడుతున్న దశరథుడు అన్యమనస్కంగా దిక్కులు చూడసాగాడు. "సుమంత్రా! నా రాముడు కష్టాలే ఎరుగడు. అట్టివాడు నేడు దీనుడై వనాలలో ఏ చెట్టు క్రింద పడుకొంటున్నాడు? ఎలా గడుపుతున్నాడు? ఏం తింటున్నాడు? ఇందరమున్నా రాముడు నేడు అనాథలాగా ఒంటరి అయ్యాడుగదా" అని బోరున విలపించాడు.

రాముని అనుసరిస్తూ రథాలు, గజాలు, అశ్వాలు వెళ్లేవికదా! మహాసైన్యం వెంటనడిచే రాముడు నేడు సతీసోదరులతో కాలి నడకన ఎలా తిరుగుతున్నాడో? ఆ అరణ్యాలలో క్రూరమృగాలు, కృష్ణసర్పాలు ఉంటాయిగదా. వానినెట్లా తప్పించుకొంటున్నారో? సుమంత్రా! రథాన్ని దిగి సుకుమారి ఐన జనకనందిని ఎలా అరణ్యాలలోకి వెళ్లింది? రాజకుమారులైన లక్ష్మణులు అడవులలో ఎలా సంచరిస్తున్నారు? మంత్రిసత్తమా! నీవే అదృష్టవంతుడవు. అశ్వనీదేవతలు మందరపర్వత వనాలలో ప్రవేశించినట్లు రామాదులు అరణ్యాలలోకి వెళ్లడం నీవు చూశావు. సుమంత్రా! నా కోడలు మైథిలి అరణ్యాలలోకి వెళుతూ ఏమైనా చెప్పిందా? లక్ష్మణుడుగాని, రాముడుగాని ఏమైనా అన్నారా? ఆ వివరాలన్నీ నాకు చెప్పు. వాటిని వింటూ సాధుజనసాంగత్యంతో బతికే యయాతిలాగా నేను బతుకుతాను. రామునిగూర్చి వింటూ ఈ దుఃఖసముద్రాన్ని ఈదుతాను." అని మహారాజు అడిగాడు.

వీటిని విన్న సుమంత్రుని గొంతు దుఃఖంతో పూడుకొని పోయింది. ఎంత ప్రయత్నించినా మాట పెగలలేదు. మాటలు తడబడుతుండగా "ఓ ప్రభూ! రాముడు కోదండరాముడు చేతులు జోడించి మీకు శిరసా ప్రణమిల్లుతున్నాను. ఆత్మజ్ఞాని ధర్మాత్ముడైన మా తండ్రి క్షేమ సమాచారాలను నా తల్లుల క్షేమాన్ని నేను అడిగానని వారికి తెలుపు. మేం ముగ్గురం క్షేమంగా ఉన్నట్లు, మేం ధర్మగ్లాని జరగకుండా చూస్తున్నట్లు కూడా వారికి తెలియచేయి.

మా తల్లిని సదా అగ్నికార్యాలు నిర్వర్తిస్తూ, మహారాజును దైవ సమానంగా చూచుకోమని నా మాటగా చెప్పు. నేను పట్టమహిషిని. అందరికన్నా పెద్దదానిని అని అహంకరించకుండా అందరితో కలిసిమెలిసి ఉండమని చెప్పు. భరతుడు చిన్నవాడైనా రాజ్యాధికారంతో మహారాజు అవుతాడు. అతడు సర్వదా ఆదరణీయుడు. రాజధర్మాన్ని అనుసరించి ఆయన ఆజ్ఞలను శిరసావహించమని చెప్పుము. ధర్మం తప్పకుండా అందరినీ సమానంగా చూడుమని నా తల్లితో చెప్పు.

సుమంత్రా! మా కుశలం గూర్చి భరతునితో కూడా చెప్పు. వృద్ధులైన తండ్రిని తల్లుల్ని ఆదరంగా ప్రేమగా చూచుకోమని చెప్పు. తండ్రి మాటను జవదాటకుండా రాజ్యాన్ని సర్వదా కాపాడమని చెప్పు. పెద్దలను గౌరవించమని,

పిల్లలను మమతానురాగాలతో దరి చేర్చుకోమని చెప్పు. రాజ్యంలోని పౌరులను గౌరవిస్తూ వారి ఆదరాభిమానాలను చూరగొనుమని చెప్పుము. యువరాజుగా సమస్త భోగాలతో కలకాలం వర్ధిల్లమని నా మాటగా చెప్పుము.

శ్రీరాముడు కన్నీరు కార్చుతూ కౌసల్యాదేవి నాకేగాక తనకు కూడా తల్లేయని ఆమెను భక్తి శ్రద్ధలతో చూచుకోమని నేను చెప్పానని భరతునికి తెలుపు అంటూ పేరు పేరునా అందరినీ శ్రీరాముడు అడిగాడు" అని సుమంత్రుడు చెప్పాడు.

"మహారాజా! లక్ష్మణుడు మాత్రం కన్నీరును ధారగా కారుస్తూ మా అన్నగారు చేసిన దోషమేమి? కైక దుర్బోధలతో శ్రీరాముణ్ణి అడవుల పాలు చేశాడు. ఆమె మాట మహారాజు విన్నందున నేడు మేం కష్టాలపాలు అయ్యాము" అని ఏడ్చాడు. కైక లోభగుణంతో వరాలు అడిగి ఉండవచ్చు. ఆమె ఏకారణంగానైనా అడిగినప్పటికీ మహారాజు ముందు వెనుకలు ఆలోచించకుండా ఇలా చేయడం మహాపచారం. దీనిని ఎవ్వరూ హర్షించరు. మహారాజాజ్ఞకు తిరుగులేదుగదా. అందుకే ఆయన ఇటువంటి నిర్ణయాన్ని తీసుకొన్నాడు. నేను మాత్రం ఇది సముచితమైన నిర్ణయం అని నేను భావించను. ఈ పని చేయడంతో నాకు ఆయనపై తండ్రి అనే గౌరవం పోయింది. విచక్షణా జ్ఞానం నశించి చేసిన ఈ పని మహారాజుగా ఆయనను నేను అభిమానించలేక పోతున్నాను. ఇక నాకు శ్రీరాముడొక్కడే ప్రభువు, తండ్రి, సోదరుడు, బంధువు మిత్రుడు సర్వమూ ఆయనే. లోకం హర్షించని పనిచేసి మహారాజు అయిన దశరథుడు సర్వులకూ అప్రియుడయ్యాడు.

సమస్తప్రజానీకంచే గౌరవం పొందిన శ్రీరాముణ్ణి అడవులపాలు చేశారు. లోకవిరుద్ధంగా జ్యేష్ఠ కుమారుని రాజ్యాధికారానికి దూరం చేశాడు. ప్రజలకు మేలుచేసే రాజు పరిపాలన ప్రజారంజన పాలన అవుతుంది. కాని ఇలా ప్రజలకు బాధను గూర్చే రాజును ఏమని సంబోధించాలి? ప్రజాకంటకంగా వుండే రాజనిర్ణయాలను ఆమోదించే తత్వం నాకు లేదు. నేను నిష్కర్షగా ఉన్నది ఉన్నట్లుగానే మాట్లాడతాను. నా మాటలు రాజుకు అప్రియం అనిపిస్తాయి. కాని నేను చెప్పేదంతా సత్యమే అని లక్ష్మణుడు నాతో చెప్పాడు" అని సుమంత్రుడు దశరథునికి తెలిపాడు.

'ఓ మహారాజా! లావణ్యవతి సుకుమారి ఐన సీత పరిస్థితులను చూస్తూ కన్నీరు కారుస్తుండింది. ఆమె కష్టాలు ఎరుగనిదికదా. నేడు అనుభవించే ఇక్కట్ల నుంచి ఎలా తప్పించుకోవాలో తెలియక నిశ్చేష్టగా ఉండిపోయింది. ఆమె నాతో ఒక్క మాట కూడా మాట్లాడలేదు' అని దశరథునికి సుమంత్రుడు చెప్పాడు.

"మహారాజా! మౌనంగా ఉన్న మీ కోడలు నేను బయలుదేరడాన్ని చూసి కంటతడి పెట్టింది. ఆ ముగ్గురు చేతులు జోడించి నిలబడ్డారు. వారి కన్నులు ధారాపాతంగా కన్నీరును స్రవిస్తూన్నాయి. సీతాదేవి మాటిమాటికి నన్ను రథాన్ని చూస్తూ పరితపిస్తూ వుండింది." అని సుమంత్రుడు సీతారామలక్ష్మణులు వనాలకు వెళ్లిన వివరాలు చెప్పాడు.

* * *

అయోధ్యాపురి ఆవేదన

సర్గ - 59

"సుమంత్రా! ఇంకా వారు ఏమి చేశారు? దారిలో ఏం జరిగిందో అన్నీ నాకు తెలుపు" అని దశరథుడు రాముని గూర్చి వినాలనే ఉత్సాహంతో మరల అడిగాడు. మహారాజు ఆనందం కోసం మళ్ళీ రాముని వివరాలన్నీ చెప్పాడు. 'మహాప్రభూ! నారవస్త్రాలు ధరించిన రామలక్ష్మణులు మర్రిపాలతో జటలను వేసుకొన్నారు. గంగానదిని దాటి ప్రయాగవైపు ప్రయాణించారు. ముందు లక్ష్మణుడు, ఆయన వెనుక సీత, వీరిద్దరి వెనుక రాముడు ఉంటూ నడిచి వెళ్ళారు. రామలక్ష్మణులు ధనుర్ధారులై వెళ్ళారు. వారు కనబడేంతవరకు అక్కడే ఉండి నేను వారితో వెళ్ళే దానికి అశక్తుడిని కదా అందుకే తిరిగి వచ్చాను. గుర్రాలు సైతం రామ వియోగానికి ఏడ్చాయి. నన్ను మళ్ళీ వారితో రమ్మంటారేమోనని గుహుని దగ్గర ఆగాను. గూఢచారుల ద్వారా రామాదులు చిత్రకూటం వెళ్ళినట్లు తెలుసుకొన్నాము. కాని నాకు పిలుపు రానందున రామాజ్ఞను పాటించాలని తిరిగి అయోధ్యకు చేరాను. నేను వచ్చేదారిలో రాముడు అడవుల పాలైనందుకు వృక్షాలన్నీ పూలను రాల్చివేసి ఉన్నాయి. వాటిని చూసిన నాకు అవి రాముని కోసం బాధపడుతున్నట్లుగా అనిపించింది.'

'మహారాజా! కోసలంలోకి అడుగుపెట్టిన నాకు నగరం అంతా కళావిహీనంగా కనిపించింది. చెట్ల చిగురులు పూలు అన్నీ వాడిపోయాయి. నదులలో, చెరువులలో నీరు చాలా వేడెక్కి ఉన్నాయి. తటాకాలలో, కొలనులలో నీరు ఇంత తాపానికి ఆవిరైపోయాయి. క్రూరమృగాలు సైతం చైతన్యరహితమైనట్లుగా పడి ఉన్నాయి. ప్రాణులన్నీ జీవితంపై ఆశ లేక జడమైపోయినట్లు నాకు అనిపించింది. రామునిగూర్చి శోకం అయోధ్యనంతా ఆవరించి ఉంది.'

'జలాశయాలలో నీరు ఇంకిపోవడం చేత తామరపూలు వికసించలేదు. తామరాకులు సైతం కనుమరుగై పోయాయి. కలువలు కన్నీటిని నింపుకొన్నట్లు మునిగిపోయాయి. చేపలు లాంటి జలచరాలు పైకి కనిపించటంలేదు. పక్షుల కుహూనాదాలు ఎక్కడా వినిపించలేదు. పిల్లలు ఆటపాటలు మరిచి ఏదో పోగొట్టుకొన్నవారిలాగా నిశ్శబ్దంగా దిక్కులు చూస్తున్నారు. ప్రియబాంధవుని పోగొట్టుకొన్న జనం విరాగులయ్యారు. నిత్యకృత్యాలు సైతం మరిచారు. విప్రులు యజ్ఞయాగాదులు చేయడంలేదు. వర్తకులు వాణిజ్యాన్ని ఆపివేశారు. స్త్రీలు తమ తనయుడిని పోగొట్టుకున్న రీతిలో దుఃఖిస్తున్నారు. వాకిళ్ళకు తోరణాలు లేక వెలవెలపోతున్నాయి. పుష్పాలన్నీ రాలిపోయి ఆకులు కొమ్మలు ఒరిగిపోయి వృక్షాలు దీనావస్థలో ఉన్నట్లున్నాయి.' 'ఓ మహారాజా! ఉద్యానవనాలలో, రాజవీధులలో ఎక్కడా జనసంచారంలేదు. అయోధ్య అంతా నిశీధిలో ఉన్నట్లు నిర్మానుష్యమైపోయి ఉంది. రథాన్ని తోలుకొని వచ్చే నన్ను జనులందరూ ఆత్రంగా పరుగెత్తి వచ్చి చూసి 'రాముడేడి' అని అడిగారు. 'గంగను దాటించి వచ్చాను' అని నేను చెప్పే మాటలు విని వారు శోక సముద్రంలో మునిగిపోయారు. వారి ఆక్రందనలు, హాహాకారాలు, రామా! రామా! అంటూ వారు పెట్టే పెడబొబ్బలతో అయోధ్య అట్టుడికిపోతోంది.

స్త్రీలందరూ వారి వారి ఇంటి కిటికీలనుండి ప్రాసాదాగ్రభాగాలనుండి నన్ను ఒక్కనినే చూసి రాముడు రాలేదంటూ గట్టిగా ఏడ్వసాగారు. రాముని అడవికి పంపిన ఈ మహారాజు బుద్ధిని ఏమనాలి? అసలు తండ్రి చేయవలసింది ఇదేనా? అని వారు మిమ్ములను ఈసడించుకొంటున్నారు. మన శత్రువులు సైతం శ్రీరాముడు అడవిపాలైనాడని చింతించారు. గజాలు, అశ్వాలు మొదలైన జంతువులన్నీ తమ యజమాని దూరం అయ్యాడని మేత మేయడం లేదు. నీళ్ళను త్రాగడంలేదు. మూగజీవాలు సైతం రాముని కోసం పరితపిస్తున్నాయి. వాటి నిట్టూర్పు ధ్వనులు అయోధ్యలో ప్రతిధ్వనిస్తున్నాయి. నెమళ్ళు పురివిప్పి ఆడడం మానేశాయి. కోకిలల గొంతు మూగపోయినట్లుగా పాటలు పాడడం ఆపివేశాయి. వీటనన్నింటిని చూస్తుంటే అయోధ్య పుత్రుని దూరం చేసుకొన్న కౌసల్యాదేవిలాగా కనిపిస్తోంది." అని సుమంత్రుడు తాను చూచినదాన్ని, తాను అనుభవించినదాన్ని మహారాజుకు చెప్పుతున్నాడు.

దశరథుడు సుమంత్రుని మాటలు విని అచేతనుడయ్యాడు. ధైర్యాన్ని కోల్పోయాడు. ఆయనను దైన్యం ఆవరించింది. "సుమంత్రా! ఎంతటి పాపకార్యాన్ని ఆచరించాను. కుటిలచరిత్ర ఉన్న వంశంలోని కైకను చేపట్టాను. ఆమె మాటల మాయలో పడి దుర్దశను కొని తెచ్చుకున్నాను. నా పాలిట శనివలె కైక దాపురించింది. నేను పూర్వ జన్మలో పాపాత్ముడినై ఉంటాను. అందుకే నా ప్రియ పుత్రుడిని నేడు దూరం చేసుకొన్నాను. ఒక స్త్రీ మాటలను విని కార్యాన్ని ఆచరణలో పెట్టాను. మంత్రులతో సమాలోచనలు జరపలేదు. అనుభవజ్ఞులను అడిగి తెలుసుకొన లేకపోయాను. పండితులతో చర్చించలేదు. మాట ఇచ్చాననే నెపంతో కైక కోరిక నెరవేర్చడమే నా విధి అనుకొని పొరపాటు చేశాను. ఆలోచన లేక చేసే ఏ పని ఐనా కష్టాల పాలు చేస్తుందని నేడు స్వయంగా తెలుసుకొన్నాను.

సుమంత్రా! ఇలా జరగాలనే దైవనిర్ణయమేమో! నా చేత ఇలా చేయించింది. నా వంశం నాశనం చెందడానికి నేనే కారణం అయ్యి ఉండాలని దేవుడు నా మొహాన రాసి పెట్టాడేమో? అందుకే నేను ఇలాంటి అకృత్యానికి పాల్పడ్డాను. నా భార్యలనే కాక సమస్త ప్రజానీకానికి దుఃఖ కారకుడనయ్యాను" అంటూ దశరథుడు ఘొల్లు ఘొల్లున ఏడ్చాడు.

"సుమంత్రా! నా జీవితంలో నేను నీకు ఏదైనా ఉపకారం చేసి ఉన్నానని నీవు అనుకొంటే నాకు ఒక మేలు చేయి. నా రాముడిని వెంటనే వెనుకకు తీసుకొనిరా. రాముడు లేకుండానే జీవించడం కల్ల. నా కోడలైన సీతను నా సుకుమారుడైన లక్ష్మణుడిని వెంటనే వెనక్కు పిలుచుకొనిరా. లేకపోతే నన్నే వారి దగ్గరకు తీసుకొనిపో. నేను చేసిన దానికి పశ్చాత్తాప పడుతున్నాను. వారు ముగ్గురూ ఇక్కడ లేకుండా నేను జీవించలేను. ఒక తప్పును క్షమించమని రాముడిని కోరుకొంటాను. వారిని రమ్మని నేను బతిమాలుకొంటాను. నన్ను ఇక్కడనుంచి త్వరగా తీసుకొని వెళ్లు'అంటూ దశరథుడు సుమంత్రుని బ్రతిమిలాడాడు.

'ఆజానుబాహువు, మణికుండలాలు ధరించి వికసించిన మోము కలవాడు, చక్కని పలువరుస కలిగిన నా రాముడిని నేను చూడలేకపోవడం ఎంత శోచనీయమో! ఇక్ష్వాకువంశం వాడైన నేను నా వంశాన్ని ఉద్ధరించే నా పుత్రుని నేను చూడలేకపోవడం కన్నా మించిన దుఃఖం ఇంక ఏముంటుంది? రామచంద్రా! సీతా! లక్ష్మణా!

మిమ్ము విడిచి నేను బ్రతుకలేను. మీ ఆలోచనల తోటే నా ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఈ విషయం మీరు ఎరుగరు కదా" అంటూ దశరథుడు శోకించాడు.

'ఓ కౌసల్యాదేవీ! నా పరిస్థితిని చూడు. నేను రామవియోగ శోకసంద్రంలో పూర్తిగా మునిగిపోయాను. సీతా విరహమే ఒడ్డుగా ఉంది. నా నిట్టూర్పులే దీనిలో తరంగాలయ్యాయి. నా కన్నీటి బాష్పాలే నురుగుగా ఏర్పడింది. వ్యాకులంతో ఉన్న నా చేతులే ఇందులోని చేపలు. నా కంఠధ్వనే సముద్రఘోష అవుతోంది.

విరబోసిన నా వెంట్రుకలే ఈ సముద్రంలోని నాచు. నా నిట్టూర్పుల సమూహమే సుడిగుండాలయ్యాయి. కైకేయే ఈ శోకసముద్రంలో బడబాగ్ని. మంథర మాటలే మనుష్యులను మింగివేసే మొసళ్ళు, తిమింగలాలు. కైకేయి అడిగిన వరాలే ఈ సముద్రతీరం. రాముని దూరం చేసుకొన్న నేను ఈ శోకసముద్రాన్ని ఈది ఆవలి ఒడ్డుకు చేరలేను.

రామలక్ష్మణులను చూడలేని అభాగ్యవంతుడను నేను" అంటూ దశరథుడు బాధపడుతూ మూర్ఛిల్లిపోయాడు. రాముని కొరకే ఆనాటి నుంచి విలపిస్తూ ఉన్న దశరథుడు మూర్ఛిల్లడం కౌసల్య చూడలేకపోయింది. పుత్రుని కోసం ఆవేదన చెందే భర్త ఏమైపోతాడో అని కౌసల్య భయపడింది. అటు కొడుకును దూరం చేసుకొని, భర్తను దీనస్థితిలో ఉండడం చూచి కౌసల్య తట్టుకోలేక బాధపడింది.

* * *

కౌసల్య ఆవేదన

సర్గ - 60

సుమంత్రుని మాటలన్నీ కౌసల్య విన్నది. దశరథుని స్థితి చూసింది. పుత్రవియోగాన్ని తట్టుకోలేక బాధలను భరించలేక నేలపై పడి రోదించింది. ఏదో పిశాచం పట్టుకొన్నట్లుగా 'ఓ సుమంత్రా! నా కొడుకు కోడలు లేని చోట నేను నిలవలేను. నా రామలక్ష్మణుల దగ్గరకు నన్ను తీసుకొని పో. నేను వాళ్ళు లేకుండా క్షణం కూడా జీవించలేను. నీవు తిరిగి వచ్చిన రథంపైనే నన్ను దండకారణ్యాలకు తీసుకొని వెళ్ళు. నీవు అలా తీసుకెళ్ళకపోతే ఇప్పుడే ప్రాణాలు విడుస్తాను' అంటూ సుమంత్రుని కౌసల్య ఒత్తిడి చేసింది.

ఇక్ష్వాకువంశ శ్రేయస్సును కోరే సుమంత్రుడు 'అమ్మా! కౌసల్యాదేవి! మీరు ఇంతగా బాధపడాల్సిన విషయం లేదు. రాముడు సలక్షణంగానే ఉన్నాడు. సీత తన భర్త దగ్గర అమరసుఖాలను పొందుతోంది. లక్ష్మణుడు వారికి నిరంతరం పాదసేవ చేస్తూ ఆనందిస్తున్నాడు. సీత దారిలో కనబడే కొత్త కొత్త చెట్లను, పుట్టలను, నదులను గూర్చి అడుగుతూనే ఉంది. ఆమె సంతోషంగానే భర్తతో అరణ్యాలకు వెళ్ళింది.

స్త్రీలకు భర్త తోడిదే లోకం కదా! భర్త చాటున ఉండే భార్యకు అడవి కూడా అమరావతిని తలపిస్తుంది కదా. అలానే సీతకు కూడా అడవికి అయోధ్యకు తేడా కనిపించడంలేదు. ఆమె మరదితోను, భర్తతోను సుఖంగానే

జీవిస్తోంది' అంటూ సీత కైకను గూర్చి అన్న మాటలు గుర్తుకు వచ్చి కూడా కౌసల్యకు వివరించలేదు. 'అమ్మా కౌసల్యా! మీరు వారిని గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు. వారు ముగ్గురూ ధర్మబద్ధులై సుఖజీవనం చేస్తున్నారు. సీతారాములను లక్ష్మణుడు ధనుర్ధారుడై అహర్నిశం కాపాడుతున్నాడు. రామలక్ష్మణులు సీతను కంటి రెప్పలాగా చూస్తున్నారు. సీతాలక్ష్మణులను కోదండరాముడు కనిపెట్టి ఉన్నారు. ఇలా వారు ముగ్గురు ఒకరికొకరు తోడు నీడవలె ఉంటూ జీవనం చేస్తున్నారు. అయోధ్యలోని సుఖాలు లేవని చింతించడంలేదు.

ఇంతకుముందు క్రీడోద్యానాలలో సీత ఎలా విహరించేదో ఇపుడూ రామునితో కలిసి సరససల్లాపాలు చేస్తోంది. ఆమె హృదయం ఎల్లప్పుడూ రామునే కోరుకొంటోంది. ఒకవేళ సీత రాముని విడిచి అయోధ్యలో ఉండినట్లయితే అప్పుడే అరణ్యంలో ఉన్నట్లుగా బాధపడేది. ఇపుడు మాత్రం ఆమె భయం అనేది తెలీని బాల్యావస్థలో ఉన్నట్లుగా ఉంది.' కౌసల్యకు ఇష్టమగు మాటలనే చెప్పుతూ సుమంత్రుడు ఆమెను ఊరడించాడు.

'అమ్మా ! అడవులలో నడుస్తున్నప్పుడు కూడా సీత పాదాలు సహజ సౌందర్యాన్ని కోల్పోలేదు. ఎర్రనైన ఆమె పాదాలు తామర మొగ్గలాగా కనిపించాయి. ఆమె శరీర కాంతి శీతోష్ణాలకు వాడిపోలేదు. చక్కని చుక్కైన సీత ముఖం పూర్ణచంద్రునిలాగా ప్రకాశిస్తోంది.

ఆభరణాలు ధరించకుండానే ఆమె శరీరం ధరించినట్లుగా కనిపిస్తోంది. ఆమె నడుస్తున్నపుడు కాలి అందెల చప్పుళ్ళు లయబద్ధంగా వినిపిస్తూనే ఉన్నాయి. కాని రాముని ఆనందం కోసం ఆమె ఆభరణాలన్నీ వేసికొని ఉంది. ఆమె భర్త సాన్నిహిత్యంలో నిర్భయురాలై ఉంది.

మీరు వారిని గూర్చి చింతించాల్సిన అవసరమే లేదు. సీతారామలక్ష్మణులు శోకాన్ని మరచిపోయారు. ఆనందంగా జీవిస్తున్నారు. మహర్షులు నడచిన మార్గాన్నే వారు ఎంచుకొన్నారు. కందమూలాలు, ఫలాలు తింటూ, స్వచ్ఛమైన నీటిని తాగుతూ వనంలో హాయిగా జీవనం సాగిస్తున్నారు. ధర్మాచరణులైన వారు తండ్రి ఆజ్ఞను పాటిస్తున్నామన్న ఆనందంలో ఉన్నారు. వారిని గురించి మీరు శోకించపనిలేదు' అని చెప్పే సుమంత్రుని మాటలు వింటూనే కౌసల్య పుత్రశోకాన్ని మరువలేక అయ్యో 'రామా!' 'లక్ష్మణా' అని అరుస్తూనే ఉంది.

* * *

కౌసల్య పరుషోక్తులు

సర్గ - 61

సర్వప్రాణికి ఆనందాన్ని చేకూర్చే శ్రీరాముడు వనవాసం చేయడం కౌసల్యకు దుఃఖాన్ని కలిగించింది. ఆమె దుఃఖిస్తూ 'ఓ దశరథ మహారాజా! మీ ఖ్యాతి ముల్లోకాలలో వ్యాపించి ఉంది. కాని నేడు జ్యేష్ఠుణ్ణి అడవికి పంపి అపఖ్యాతిని మూటకట్టుకొన్నారు. ఓ నరశ్రేష్ఠా! రామలక్ష్మణులు ఎన్నడు కష్టాన్ని చూడలేదు. వయస్సులో చిన్నవారు.

సీతతో కలిసి నేడు ఇక్కట్ల పాలయ్యారు. జనక సుత, సుకుమారి ఆమె ఎండవానలకు ఎలా ఓర్చుకొంటోందో? మృష్టాన్న భోజనాన్ని ఆరగించే నా తనయులు నేడు కందమూలాలతో సరిపెట్టుకోవాలి గదా!

వీణాగానంతో మృదంగ వాయిద్యాల మధ్య కాలాన్ని గడిపిన సీత నేడు క్రూర మృగాల మధ్య సంచరించాల్సి వచ్చింది. హరివిల్లులాగా సర్వులకూ ఆనందాన్నిచ్చే పరాక్రమశాలియైన రాముడు మెత్తని దిండ్ల మీద తల పెట్టుకొని పడుకొనేవాడు. నేడు కటిక నేలమీద తన చేతినే తలగడలా అమర్చుకొని పడుకోవాల్సి వచ్చింది కదా! కమలముల వంటి కన్నులు కలిగిన నా రాముని ముఖం పూర్ణచంద్రునివలె ప్రకాశించేది. అటువంటి తేజశ్శాలి ముఖం నాకు చూచు భాగ్యం ఎన్నడు కలుగుతుందో గదా?

నా హృదయం కఠినమైన శిల లాంటిది. నా పుత్రుడు పదునాలుగేండ్లు కనబడడు అని తెలిసి కూడా అది వేయి ముక్కలు కాకున్నది. ఓ రాజా! రాజైన వాడు అందరూ చెప్పే మాటలు వినాలి. విచక్షణాజ్ఞానంతో పని చేయాలి. కాని నీవు కైకేయి చెప్పుడు మాటలు విని నా చిన్న కుమారుని నేడు అడవుల పాలు చేసితివి. ఇది నీకు న్యాయమేనా? రాజప్రాసాదాలలో తిరగాల్సిన వారు అరణ్యాలను పట్టిపోయారు.

ఓ దశరథా! పదునాలుగేండ్లు గడిచి రామలక్ష్మణులు తిరిగి అయోధ్యకు వచ్చినా అప్పుడు రాజ్యాన్ని కోశాగారాన్ని భరతుడు అన్నకు అప్పగించునో? లేదో? తెలియదు. ఒకవేళ అలా భరతుడు ఇచ్చినా నా శ్రీరామచంద్రుడు స్వీకరించడు. అతిరథులను భోజనానికి ఆహ్వానించి కొందరు గృహస్థులు వారు వచ్చేలోపు తమ బంధుజనులకు భోజనాలు ఏర్పాటుచేస్తారు. అలా వారు భుజించగా ఉన్న భుక్త శేషాన్ని అతిథులైన వారు ఎవరూ ఆరగించరు. శాస్త్రమర్యాదను పాటించువారు ఆ భుక్తశేషం తినడాన్ని అవమానంగా తలుస్తారు. అలానే భరతుడు అనుభవించిన ఈ రాజ్యం రామునికి భుక్తశేషమే కదా! దీన్ని రాముడెట్లు స్వీకరిస్తాడు? తోడేళ్ళు నక్కలు ముట్టిన ఆహారాన్ని పెద్దపులి ముట్టదు. అలాగే భరతుడు ఏలిన రాజ్యాన్ని శ్రీరాముడు తన చేతిలోకి ఎలా తీసుకొంటాడు?

ఒక యజ్ఞంలో వాడిన యజ్ఞ సంభారాలను మళ్ళీ మరొక యాగానికి వాడరు. యజ్ఞంలోని సోమరసాన్ని ఒకరు సేవించిన వానిని మరల ఎవరూ ఎంగిలి చేయరు. పెద్దపులి తన తోకను త్రొక్కితే ఎలా ఊరుకోదో శ్రీరాముడు అవమానాన్ని భరించలేడు. ముల్లోకాలు శ్రీరాముని ఎదిరించినా వారందరిని మట్టి కరిపించగల ధీశాలి నా రాముడు. కపటోపాయాలతో తనకు రావలసిన రాజ్యం అన్యాక్రాంతం ఐనా శ్రీరాముడు ధర్మాన్ని విడిచిపెట్టలేదు. పితృవాక్యపాలన అనే ధర్మానికి కట్టుబడి నేడు సంతోషంగా అడవులకు వెళ్ళాడు.

శ్రీరాముడు సింహం వలె పరాక్రమశాలి. వృషభంవలె విశాల నేత్రుడు. శ్రీరామునికి కోపం వస్తే తన వాడి బాణాలతో సూర్యచంద్రాదుల గతులు మార్చగలడు. పంచభూతాలను, సప్త సాగరాలను దహించి వేయగలడు. దశరథా! అటువంటి పౌరుషశాలిని మీరు నేడు దూరం చేశారు. పెద్ద చేప చిన్న చేపను మింగినట్లు తండ్రి చేతిలోనే రఘురాముడు వంచితుడయ్యాడు. సనాతనధర్మం వేదసమ్మతమైనది కదా!

ఇలా తండ్రి తర్వాత జ్యేష్ఠునకు దక్కాల్సిన రాజ్యం దక్కనీయకుండా పెద్దవాడిని అడవులకు పంపడం ధర్మసమ్మతమేనా? న్యాయశాస్త్రం ఇందుకు అంగీకరిస్తుందా?

ఓ మహారాజా! స్త్రీరక్షణ భారం ఆమె పతిది. ఆ పతి దూరమైనప్పుడు కొడుకు ఆ భారాన్ని మోస్తాడు. సుతులు లేని ఆడవారికి జ్ఞాతులు రక్షణను ఇస్తారు. మీరెవరూ లేని స్త్రీల రక్షణ భారాన్ని ఎవరూ మోయలేరు కదా. నేడు మీరు కైక చేతిలోని కీలుబొమ్మ అయినారు. నేను మీపై ఆధారపడటం వృథా అనిపిస్తుంది. నా కొడుకు నా నుంచి మీ వల్లే దూరం అయ్యాడు. ఇక నాకు సహాయం చేసే జ్ఞాతులైన వారు ఎవ్వరూ లేరు. కాని నేను మిమ్ము విడిచి నా కుమారుని వద్దకు పోలేను. మీరు నాకు అన్ని దారులు మూసివేసి నన్ను అసహాయ స్థితిలో పడవేశారు.

శ్రీరాముని అరణ్యాలపాలు చేసి రాజ్యాన్నే దిక్కులేనిదాన్ని చేశావు. మీ మిత్రులు, సామంతులు చేసుకొనే రాజ్యానికి గండం తెచ్చిపెట్టారు. మీ వల్ల బంధువులు, హితులు, మంత్రులు దిక్కుతోచని వారయ్యారు. పౌరులు జీవచ్ఛవాలుగా మారారు. నన్ను నా సీతారామలక్ష్మణులను నిరాధారులను చేశారు. చివరకు మీరు కూడా ఏకాకులై మిగిలిపోయారు. మీరు చేసిన ఈ పనివల్ల ఒక్క కైక మాత్రమే సంతోషిస్తోంది" – అని కౌసల్య దశరథునితో నిష్ఠూరాలు ఆడింది.

ఇవన్నీ విన్న దశరథుడు తాను చేసిన పనిని తలచుకొని పశ్చాత్తాపం చెందాడు. ఇన్నింటికి కారణం తన పురాకృతపాపమేనని శోకించాడు. కానిపని చేశానని పదే పదే "హా! రామా! తండ్రీ!" అంటూ విలపించి స్పృహ తప్పిపోయాడు.

* * *

కౌసల్య పశ్చాత్తాపం

సర్గ – 62

దుఃఖంతో కూరుకుపోయి కౌసల్య ఆడిన మాటలు మహారాజును కలచివేశాయి. దుఃఖార్తుడు అయ్యాడు. తాను చేసిన పనికి ఎవరైనా ఇలా మాట్లాడుతారని అనుకొన్నాడు. నేను సరిదిద్దుకోలేని తప్పు చేశానని ఇంద్రియ లోలుడినయ్యానని అనుకొంటూ ఎంతగానో ఏడ్చాడు. దానివల్ల దశరథుడు మూర్ఛపోయాడు. కొద్దిసేపటికి తెలివి పొందాడు. అకృత్యాన్ని పదే పదే తలచాడు. ఆయనకు లోగడ చేసిన దుష్కృత్యం స్ఫురణకు వచ్చింది. మరింతగా రోదించాడు.

ఇంతకుముందు శబ్దభేది విద్యవలన మనిషి ప్రాణాన్ని హరించిన విషయం గుర్తుకు వచ్చింది. దశరథునికి ఇప్పుడు పుత్రవియోగబాధకు ఈ విషయం తోడైంది. కన్నీరు మున్నీరుగా ఏడ్చాడు. తన పాపమే తన కుమారుని

దూరం చేసిందని వాపోయాడు. ఎదురుగా కౌసల్య కనిపించింది. ఆమె మంచితనం గుర్తుకు వచ్చింది. ఆమె పట్ల తన నిర్దాక్షిణ్యత జ్ఞప్తికి వచ్చి మరింత ఖిన్నుడయ్యాడు దశరథుడు.

శోకంలో మునిగిన రాజు వణుకుతూ "ఓ కౌసల్యా! నిన్ను అంజలి ఘటించి వేడుకొంటున్నాను. నీవు శత్రువులపై కూడా దయచూపే ధర్మాతుర్మాలివి. నీ పతిపైన కాఠిన్యం చూపకు. ఓ దేవీ! గుణహీనుడైన భర్త కూడా స్త్రీకి ప్రత్యక్ష దైవమే గదా! ఈ లోకంలోని మంచి చెడ్డలు తెలిసినదానివి. నే చేసిన పాపం నన్ను దహించివేస్తోంది. నీలాగే నేను పుత్రశోకంతో కుమిలిపోతున్నాను. ఈ సమయంలో నన్ను నిందించడం భావ్యమేనా? నన్ను కనికరించి నాపై దయ చూపు. నన్ను క్షమించు" అంటూ దశరథుడు కౌసల్యను అడిగాడు.

భర్త దీనాలాపాలు కౌసల్యలో విచక్షణను మేల్కొలిపాయి. ఆమె హృదయం ద్రవించింది. కన్నీరు ధారగా కారిపోయింది. చేతులు జోడించి బతిమాలుతున్న భర్త చేతిని తన తలపై పెట్టుకొంది. 'ఓ దేవా! నేను పుత్ర వియోగాన్ని భరించలేక మిమ్ములను బాధపెట్టాను. మీకు శిరసా ప్రణమిల్లుతున్నాను. నా తప్పులను క్షమించండి. నేను అనరాని మాటలను మాట్లాడి మిమ్ము బాధపెట్టాను. పతితో బతిమాలించుకొనే సతికి ఇహపర సుఖాలు దూరమౌతాయి. నేను అన్ని తెలిసిన దానినే. కాని నాలో ఓర్పు నశించి మిమ్మల్ని కఠినంగా మాట్లాడి మిమ్ము నొప్పించాను.

ఓ ధర్మాత్మా! మీ గురించి నాకు పూర్తిగా తెలుసు. మీ సత్యసంధత నాకు ప్రియమే. కాని శోకార్తనైన నేను అనుచితంగా మాట్లాడాను. కోపం అనే శత్రువు చేత నేను చిక్కాను. అందుకే జ్ఞానవిహీనత నన్ను ఆవరించింది. కోపాన్ని మించిన శత్రువు మరెవరూ ఉండరు. కోపంలో చేయరానివన్నీ చేస్తాము. సర్వపాపాలకు మూలం కోపమే. శత్రువు చేతిలో అనుకోకుండా దెబ్బతిన్నా తట్టుకోవచ్చు. కాని దైవవశంవల్ల శోకం కలిగితే దాన్ని భరించడం కష్టం. ఆ శోకాగ్నిలో నుండి బయటపడడం బహుకష్టం. ధర్మార్థాలను తెలిసినవారైనా, శాస్త్రకోవిదులైనా శోకం ఏర్పడితే వికలమనస్కులు అవుతారు. అందుకే నేను కూడా దైవం కల్పించిన పుత్రవియోగాన్ని తట్టుకోలేక ఏదో మాట్లాడాను. మిమ్ము బాధపెట్టాను. మీరు పెద్ద మనస్సుతో నన్ను క్షమించండి. అన్యథా భావించకండి. నేనెప్పుడూ మీకు పాదదాసినే. నాపై పూర్వపు ప్రేమనే చూపండి' అని కౌసల్య దశరథుని ఓదార్చింది. తన తప్పును తెలుసుకొని క్షమించమని అడిగింది.

శ్రీరాముడు వనములకువెళ్ళి ఐదు రోజులు గడిచాయి. ఈ ఐదు దినాలు నాకు ఐదు యుగాల్లాగా కనిపించాయి. శ్రీరాముని తలచుకొన్న కొలది నా దుఃఖం తరంగాల్లా ఎగిసిపడుతోంది అంటూ తన దీనావస్థను తన భర్తకు తెలిపింది. ఈ కౌసల్య అనునయపు మాటలు దశరథునిలో వ్యాకులతను పెంచాయి. మంచివారిని బాధపెట్టానన్న బాధ ఆయనను తొలిచేసింది. అప్పుడు సూర్యకాంతులు తగ్గిపోతూ రాత్రి కాబోతుంది. దిక్కులన్నీ నెమ్మదిగా నిశ్శబ్దంలో కూరుకుపోసాగాయి. కౌసల్య మాటలు దశరథునిలో మెల్లగా ఊరటను కలిగిస్తున్నాయి. ఆయన మెల్లగా నిద్రలోకి జారుకొన్నాడు.

* * *

శ్రవణకుమారుని వృత్తాంతం

సర్గ - 63

నిద్రపోతున్న మహారాజుకు మెలకువ వచ్చింది. వెంటనే ఆలోచనల పరంపర మొదలయింది. సూర్యుని రాహువు కప్పివేసినట్లు దశరథమహారాజును బాధ కప్పేసింది. ఆయనను శోకం ముంచివేసింది. శ్రీరాముడు వెళ్ళిన ఆరవనాటి రాత్రి గదా ఇది అనుకొన్నాడు. మహారాజు ఆలోచనలలో తాను యువకుడిగా ఉన్నప్పుడు జరిగిన సంగతి గుర్తుకు వచ్చింది. ఆయన కన్నుల ముందు ఆనాటి సంగతులన్నీ కదలాడాయి. అవన్నీ తన అర్ధాంగి అయిన కౌసల్యకు చెప్పాలనుకొన్నాడు. అటు తిరిగి చూశాడు. ఏడ్చి ఏడ్చి అలసి నిద్రపోతోంది కౌసల్య. ఆమెను చూసేసరికి దశరథునికి ఏడ్పు ఆగలేదు.

ఇంతలో కౌసల్య కనులు తెరిచింది. ఆమెకు శ్రీరాముడు మదిలో మెదిలాడు. కన్నీళ్ళు వర్షించాయి. అలా బాధపడుతున్న కౌసల్యను చూసి "ఓ కల్యాణి! ఎవరు చేసిన కర్మకు ఫలం వారు అనుభవించక తప్పదు. పుణ్యపాప కర్మఫలం తప్పక ప్రతివారికి అనుభవానికి వస్తుంది. మనిషి కర్మ చేసేటప్పుడే దాని ఫలాన్ని గూర్చి ఆలోచించాలి. మంచిది అనుకొంటేనే చేయాలి. మామిడివృక్షాలు నాటాల్సిన కాలంలో మోదుగవృక్షాలు నాటి వాటి ఫలం వచ్చే సమయంలో మామిడిపండ్లు రాలేదని చింతిస్తే ఏమి లాభం? మోదుగఫలాలు తప్ప అన్యఫలాలు ఎందుకు దక్కుతాయి? అలానే నేను కైకేయికి సంతోషం కలిగించడానికి శ్రీరాముని పట్టాభిషేకం ఆపివేశాను. నేడు మంచి ఫలితం రాలేదని చింతిస్తున్నాను. అదేకాదు నేను యువరాజుగా ఉన్నప్పుడు ఒక మహాపాపాన్ని చేశాను. ఆ పాపఫలితమే నేడు అనుభవిస్తున్నాను. నా పుత్రుణ్ణి దూరం చేసుకోవడం నా పురాకృతకర్మ తాలూకు ఫలమే. దీన్ని నేను అనుభవించి తీరాలి" అని తాను చేసిన కార్యాన్ని కౌసల్యకు చెప్పుతూ దశరథుడు రోదించాడు.

"ఓ కౌసల్యా!యౌవనంలో కాలమాహత్మ్యం తెలియదు. ఉడుకురక్తం ఏవేవో చేసి మహోన్నతకీర్తిని సంపాదించాలని కోరికతో ఉంటుంది. నేను యువకుడిగా ఉన్నప్పుడు అస్త్రశస్త్ర విద్యలన్నీ అభ్యసించాను. శబ్దభేదిని నేర్చాను. శబ్దభేది విద్యలో నన్ను మించినవారు లేరని అనిపించుకొన్నాను. దానితో నాలో అహంకారం జనించింది.

ఒకనాటి వసంతఋతువు నన్ను అహ్లాదపరిచింది. వేటపై నాకు వ్యామోహం కలిగింది. నాటి నా వ్యామోహ ఫలితమే నేటి పుత్రవియోగం. అదే నేను చేసిన స్వయంకృతాపరాధం. పెద్ద లాభాన్ని ఆశించి నేను చేసిన పని నేడు నా ప్రాణాలను హరించే స్థితిని నాకు కలిగించింది. వేటపై మనసు పడిన నేను దక్షిణాయనంలో సూర్యుని తాపం అంతగా తగలని రోజులలో వేట మొదలుపెట్టాను. అది వర్షఋతువు. చెట్లన్నీ అభ్యంగనస్నానం చేసినట్లు శుభ్రపడి ఉన్నాయి. పక్షులన్నీ వర్షధారలో తడిసి ముద్దయి అప్పుడప్పుడు తళుక్కున మెరిసే ఎండలో రెక్కలు ఆరబెట్టుకొంటున్నాయి. వర్షం కుండపోతగా కురియడంతో స్వచ్ఛమైన వర్షపునీరు భూమిలోని మట్టి దుమ్ము ధూళిని తనలో కలిపేసుకొని రకరకాల రంగులు పులుముకొని పాములవలె వంకర టింకరలు పోతూ పరిగెత్తుతున్నాయి. ఇవన్నీ చూసి వేటపై నా మనస్సు పదే పదే ఆరాటపడింది.

ధనుర్బాణాలు ధరించి రథంపైన సరయూనదీ తీరానికి వెళ్ళాను. రోజంతా వేటాడాను. కాని శబ్దభేది విద్యను ఉపయోగించాలన్న కోరిక నాలో పెరిగింది. దాంతో రాత్రి అయిపోయినా వేటను ముగించకుండా ఉండిపోయాను.

చిమ్మచీకట్లు ఆవరించాయి. ఒక చెట్టుచాటున పొంచి ఉన్నాను. నిశ్శబ్దంగా ఉన్న ప్రాంతంలో బాణం ఎక్కుపెట్టి మృగాల ధ్వనికోసం చెవులు రిక్కపెట్టి ఉన్నాను. ధ్వనిని బట్టి రెండు క్రూరమృగాలను చంపివేశాను. అయినా నాలో కోరిక అణగారలేదు. మరల బాణం ఎక్కుపెట్టాను. నా కర్మ నన్ను వేటనుంచి విరమించనీయలేదు. అంతలో బుడబుడమని ధ్వని వినవచ్చింది. నాకు ఏమీ కనిపించలేదు. కాని ఏనుగు నీరు తాగే శబ్దమని నేను అనుకొన్నాను. వెంటనే సంధించి ఉంచిన బాణాన్ని వదిలాను. అది వేగంగా వెళ్ళింది. వెంటనే "అయ్యో!" "అయ్యో!" అనే అరుపులు వినబడ్డాయి. నాకు దిక్కు తోచలేదు. ఈ మనుష్యుని ఆక్రందనలు ఎక్కడనుంచి వస్తున్నాయో! అని మరల శబ్దం విన వచ్చే వైపు చెవులు అప్పగించాను.'జన సంచారమే లేని ఈ రాత్రి వేళ నన్ను బాణంతో కొట్టిందెవరు? వారికి నేను చేసిన అపకారం ఏమిటి? నేను తెలిసి ఎవరికీ ఎట్టి ఆపదను కలిగించలేదు కదా. మరి బాణఘాతం నాకు తగిలిందే ఇది ఏమి కర్మ? కందమూలఫలాలు తింటూ జీవితాన్ని గడిపే వనవాసినే నేను. నన్ను చంపిన ఎవరికి లాభం కలుగుతుంది? నిష్కారణంగా నన్ను చంపి వాళ్ళు బాపుకొనేది ఏమిటి? అయినా ఇది యుద్ధ సమయం కూడా కాదు గదా. ఈ పనిని చేసిన వానిని ఎవరు కాపాడుతారు? ఇది మహాపచారం కాదా?' అనే మాటలు వినవచ్చాయి. అక్కడికి పరుగున వెళ్ళాను. నేను వెళ్ళేసరికి ఒక మునిబాలుడు గుచ్చుకొన్న బాణాన్ని పట్టుకొని బాధపడుతూ మాట్లాడుతున్నాడు.

ఆ అబ్బాయిని చూడగానే నా కన్నుల వెంట నీరుకారింది. నా చేతిలోని ధనుర్బాణాలు జారిపోయాయి. ఆ బాలుడి చెంతే కూర్చుండిపోయాను. 'అయ్యా మీరెవరు? మీకు నేను చేసిన ద్రోహం ఏమిటి? మీరు ఒక్క బాణం వేసి నన్నే కాదు నా అంధులైన తల్లిదండ్రులను చంపివేశారు. దాహార్తితో బాధపడేవారిని మీరు పూర్తిగా పరలోకానికే పంపివేశారు. నేను నా కోసం బాధపడడంలేదు. నేను ఎప్పటినుంచో గుడ్డివారైన నా తల్లి దండ్రుల బాధ్యత మోస్తున్నాను. నేను చనిపోతే వారిని చూసే వారు ఎవరూ లేరే అని చింతిస్తున్నాను' అని చెప్పే ఆ బాలుని చూశాను. కేశాలు చిందర వందరగా పడి ఉన్నాయి. శరీరం అంతా దుమ్ముకొట్టుకొనిపోయి ఉంది. బాణపుదెబ్బకు విలవిల్లాడుతున్నాడు. ఆ స్థితిలో ఆ బాలుని చూచి నేను నిశ్చేష్టుడిని అయ్యాను. నా మృగయావినోదం ఎంతటి ఘోరకృత్యానికి హేతువు అయిందని మథన పడ్డాను.

నన్ను చూసిన ఆ బాలుడు 'అయ్యా మహారాజా! నేను ఇక్కడ దగ్గరలో ఉండే ఆశ్రమంలో ఉంటాను. నా తల్లిదండ్రుల దాహం తీర్చడానికని నీటికోసం ఈ తీరానికి వచ్చాను. మీరు ఒక్క బాణంతో నా ఆయువుపట్టును పట్టుకొన్నారు. నేను మరణిస్తే నా తల్లిదండ్రులు జీవించరు. వారి ముసలి ప్రాణాలు చిటికెలో గాలిలో కలిసిపోతాయి.

వారు గుడ్డివారు, శక్తిహీనులు. వారి దాహం తీర్చడానికి నేను నీరు తెస్తానని గంపెడాశతో వారు ఎదురుచూస్తుంటారు. నేను ఇలా అయ్యానని వారికి తెలియదు. దీన్ని బట్టి నేను చేసిన పూజలకు నేనొనర్చిన

వేదాధ్యయనానికి ఫలితమే లేదనిపిస్తోంది. అయినా నా పరిస్థితి తెలిసినా వారు నన్ను ఆదుకోలేరు. ఒక చెట్టును నరికివేస్తే మరో చెట్టు చూచి కన్నీరు కార్చుతుందేగాని నరికివేయకుండా చేయలేదు గదా. అలానే నా తల్లిదండ్రులు అశక్తులు. వారు నా పరిస్థితి తెలుసుకొని నన్ను రక్షించలేరు.

ఓ మహారాజా! మీరు వెంటనే వెళ్ళి నా తండ్రికి జరిగిన సంగతి చెప్పుము. లేకపోతే ఆయన కోపాగ్నిలో మీరు బూడిద అయిపోతారు. వారికి దాహార్తిని తీర్చి విషయం వివరించు. ఆయనను ప్రసన్నం చేసుకోండి, లేకపోతే మిమ్ము ఆయన శపించగలడు. ముందు నా శరీరంలోని ఈ బాణాన్ని పెరికివేయండి. నేను ఈ బాధ భరించలేకపోతున్నాను. నేను ఏమి చేయాలో పాలుపోక ఆ బాలుని వంకే దిగాలుగా చూస్తూ కూర్చుండిపోయాను.

బాలుని శరీరం క్షణక్షణానికి బాధతో మెలికలు తిరుగుతోంది. అవయవాలన్నీ శిథిలం అవుతున్నాయి. క్రమంగా అతడు మృత్యుముఖంలోకి అడుగుబెట్టబోతున్నాడు. అతి కష్టంమీద నాతో ఇలా చెప్పాడు. 'రాజా! నీ మనస్సు స్థిరీకరించుకో. నేను బ్రాహ్మణబాలుణ్ణి కాను. నా వల్ల నీకు బ్రహ్మహత్యాదోషం అంటదు. మీరు మనోవ్యథ చెందాల్సిన అవసరం లేదు. ముందుగా ఈ బాణాన్ని తీసివేసి నాకు మరణాన్ని ప్రసాదించండి. వెంటనే వెళ్ళి నా తల్లిదండ్రులకు విషయం చెప్పి వారిని శాంతింపచేయండి. జరిగిపోయిన కార్యం గురించి కాక జరగాల్సిన దానిని గూర్చి ఆలోచించండి. ఆలసించకుండా నా మాట ఆచరించండి' అంటూ దీనంగా చెప్పే ఆ బాలుని మాటలు నాలో ఆవేదనను కలిగించాయి. నేను అప్రయత్నంగా బాణాన్ని లాగివేశాను, ఆ తపోధనుడు నన్నే చూస్తూ ప్రాణాలు విడిచాడు.

పూర్తిగా తడిసిపోయి ఉన్న ఆ బాలుని శరీరం అచేతనం అయిపోయింది. నా కన్నులముందే నా ఘాతుక చర్యకు బాలుడు మృత్యువువాత పడ్డాడు. నేలపై ఆ పిన్నబాలుని శరీరం చూచి నేను విషాదంలో మునిగిపోయాను.

* * *

దశరథుని మరణం

సర్గ - 64

దశరథుడు మునికుమారుని వృత్తాంతం కౌసల్యకు చెప్పుతూ కంటతడి పెట్టుకొన్నాడు. "ఓ దేవీ! నేను తెలియక చేసిన పాపానికి ఆ ముని బాలుడు మృతుయ్యాడు. ఇప్పుడు నా కర్తవ్యం ఏమిటి? అని నాలో నేను ఆలోచించాను. కుండలో నీరు నింపుకొని మునిబాలుడు చెప్పిన బాటలో వారి ఆశ్రమానికి వెళ్ళాను. అక్కడ ఋషికుమారుని తల్లిదండ్రులను చూశాను. వారు వృద్ధులు, బలహీనులు పైగా గుడ్డివారు. ఎటూ కదలలేక నేలపై పడి ఉన్నారు. తమ తనయుడి గురించే మాట్లాడుకొంటున్నారు. వారికి విషయం తెలియక అనాథల్లాగా ఉదాసీనంగా ఉన్నారు. తమ కుమారుడు నీరు తెస్తాడన్న ఆశతో వారు ఎదురుచూస్తున్నారు. వారిని చూసి వారి

ఆశలను అడియాశలు చేసింది నేనే కదా! అని నాకు దుఃఖం పొంగుకు వచ్చింది. నా దుష్కృత్యానికి వారు నన్ను ఎంతగా శపిస్తారో కదా అని నా మనస్సు భయపెడుతోంది. వారిని దీనావస్థలో చూసి నేను మరింత కుంగిపోయాను.

నా అడుగుల చప్పుడు విని వారు 'కుమారా! వచ్చావా? నీ ఆలస్యానికి కారణం ఏమి? నీవు మహా తపస్వివి గదా! నీకు మేము అప్రియమైన కార్యం ఏదైనా చేశామా? నీ తల్లి నీకై తహతహలాడుతోంది. మేము దాహంతో అల్లాడిపోతున్నాం. దప్పికతో మా గొంతు తడారిపోతోంది. త్వరగా వచ్చి మా దాహార్తిని తీర్చు కుమారా. మాట్లాడకుండా ఉన్నావేమి?' అని అడిగారు.

నేను వారి మాటలు విన్నాను. నాకు చేష్టలుడిగిపోయాయి. నా గొంతు పిడుచకట్టుకుపోయింది. దుఃఖం నా గొంతును పూడ్చివేసింది. మాట రాక తడబడ్డాను. వారికి ఏమని చెప్పాలో వారి ఆవేదనను ఎలా పోగొట్టాలో తెలియక నేను తికమకపడ్డాను.

ఎలాగో గొంతు పెగల్చుకుని "ఓ మహాత్మా! నేను మీ కుమారుడను కాను. నన్ను దశరథుడని అంటారు. నేను క్షత్రియుడను. ఈ అయోధ్యను ఏలే రాజును. నేను మహాపరాధం చేశాను. సత్పురుషులెవరు నన్ను క్షమించరు. నేను నా విద్యాహంకారంతో దుష్కృతాన్ని చేశాను. నేను సరయూతీరంలో శబ్దవేదిని ఉపయోగిస్తూ వేటాడుతున్నాను. అప్పుడు బుడబుడమని శబ్దం వినబడినది. శబ్దం వినిపించిన దిక్కుగా నేను బాణం విడిచాను. కాని నా బాణం ఒక తాపసి వక్షఃస్థలానికి చేరింది. అతడు నేను వెళ్ళేసరికి కొనఊపిరితో ఉన్నాడు. నేను ఆ తాపసిని చూచి దిగ్భ్రాంతుడి నయ్యాను. ఆ శరాన్ని ఆ బాలుని శరీరం నుండి తీసివేశాను. ఆ బాలుడు తన తల్లిదండ్రుల గురించి చెప్పాడు. తల్లిదండ్రుల గురించి చింతిస్తూ ఆ మౌని స్వర్గస్థుడయ్యాడు. నేను మీ సుతుని మరణానికి కారణం ఐన పాపాత్ముణ్ణి. అయ్యా జరిగింది ఇది. మీరు నన్ను అనుగ్రహిస్తారో, శపిస్తారో మీ దయ' అన్నాను.

నా వల్ల పుత్రుని పొగొట్టుకున్న ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. వారు నేను చేసిన అకృత్యాన్ని సహించలేక పోయారు. బాధపడుతున్న వారిని చూసి నేను దోసిలి ఒగ్గి నిలబడ్డాను. నావల్ల వారికి తీరని దుఃఖం కలిగిందని ఆక్రోశించాను.

అప్పుడు వారు 'ఓ రాజా! నీవు చేసిన ఈ పాపకృత్యాన్ని నీవే గనక చెప్పి ఉండకపోతే నీ తల వేయి ముక్కలై ఉండేది. ఇంద్రుడైనా వానప్రస్థానంలో ఉన్నవారిని చంపితే అతడు పదవీ భ్రష్టుడు కాక తప్పదు. తపం ఒనరించే తాపసుల ప్రాణాలు తీసిన వారి తల ముక్కలుగా పగిలిపోవడం ఖాయం. కాని నీవు తెలియక పాపం చేశావు. నీకు తెలిసే ఈ పని చేసి ఉంటే నీ ఇక్ష్వాకువంశమే నాశం అయి ఉండేది. ఓ రాజా! మాకు మా పుత్రుని చూపు. చివరి చూపైనా దక్కుతుంది. చూపేలేనివారం మా కుమారుని దగ్గరకు మమ్ము చేర్చు' అంటూ దీనంగా అడిగారు. వారిద్దరిని నేను ముని కుమారుని శరీరం దగ్గరకు చేర్చాను. వారు రక్తసిక్తమైన శరీరాన్ని స్పృశించేటట్లు చేశాను. వారు ఆ బాలుని తాకుతూ 'నాయనా తండ్రీ! నీవు మాకు నమస్కరించడం లేదేమి? కుమారా! మాతో మాట్లాడవేమి? నేలపై పడుకొన్నావేమిటి? మాపైన కోపం వచ్చిందా తండ్రీ? ఒక్కసారి మాతో మాట్లాడు కుమారా' అని దీనంగా

విలపించారు. 'కుమారా! ఇక మేము ఎవరి నోట శాస్త్రాలను వేదాలను వింటాం? పురాణేతిహాసాలను మాకు చెప్పేవారు ఎవరుంటారు? అయ్యో నేను అశక్తుడను గదా. నివ్వెరధాన్యాన్ని తెచ్చి వండుకోలేని వాడిని. కర్మానుష్ఠానలను కూడా ఒంటరిగా చేయలేనివాడిని. నన్ను కనిపెట్టుకొని ఉంటూ కందమూలాలను, ఫలాలను, దుంపలను తెచ్చి ప్రియంగా పెట్టేవారు ఎవరు ఉన్నారు? కుమారా! నీ తల్లి వృద్ధురాలు పైగా అంధురాలు. ఈమెను నేనెట్లు భరించగలను? మా ఇద్దరి పంచప్రాణాలను నీపై పెట్టుకొని ఉన్నామే. నేడు నీవు మాకు దూరం అయితే మేం ఎలా తట్టుకోగలం తండ్రి' అని వృద్ధుడు గట్టిగా ఏడ్చాడు. 'కుమారా! ఆగు ఆగు నీవు ఒక్కనివే యమపురికి వెళ్ళకు. దిక్కులేని మేము అనాథల్లాగా ఈ వనంలో జీవించలేం. మన ముగ్గురం కలిసి యముని దగ్గరకు వెళ్దాం. ఓ కుమారా! నీవు పుణ్యవంతుడవు. మేము ఆ యముని దర్శించి నీకు ప్రాణదానం చేయమని అడుగుతాం. లోకోత్తరుడైన యముడు అభయప్రదానం చేయగలడు. ఓ కుమారా! నీవు పాపాత్ముడైన దశరథుని చేతిలో ప్రాణాలు పోగొట్టుకొన్నావు. నేను ప్రమాణం చేసి చెప్తున్నాను. నీవు సత్పురుషులు పొందే పుణ్యలోకాన్ని పొందగలవు. రణరంగంలో ధీరుడైన శత్రుశేషం మిగల్చకుండా పోరాడే యోధుడు పొందే వీర స్వర్గాన్ని నీవు పొందుతావు. సగర మహారాజు, శిబి చక్రవర్తి, దుందుమారుడు లాంటి ఉత్తములు పొందిన ఉత్తమలోకాలు నిన్ను వరిస్తాయి. ఓ తనయా. నీవు వేదశాస్త్రాలను అభ్యసించిన సత్పురుషులు, తపోధనులు, సాధుజనులు, భూదానం చేసిన మహాపురుషులు, సోమయాజులు, నిష్ఠాపరులు, ఏకపత్నీవ్రతులు, గోదానం చేసినవారు గురుశుశ్రూష చేసినవారు గంగాయమునాసంగమ ప్రదేశంలో సంకల్ప పూర్వకంగా దేహత్యాగం చేసినవారు పొందే పుణ్యలోకాలను నీవు పొందగలవు. ఇది ముమ్మాటికి సత్యం. నాకు పుట్టిన నీకు దుర్గతి కలిగే అవకాశమే లేదు. నిన్ను చంపినవారే దుర్గతి పాలవుతారు' అంటూ ఏడ్చి ఏడ్చి ఆ వృద్ధుడు తన కొడుకుకు ఉత్తమగతులు కలగాలని ఉదకక్రియలు చేశాడు.

ధర్మాత్ముడైన ఆ మునిబాలుడు తన జీవితాంతం ధర్మకార్యాలే చేసి ఉన్నాడు. అందుకే దివ్యరూపాన్ని పొందాడు. ఆ బాలుని ఇంద్రుడే స్వయంగా వచ్చి స్వర్గానికి రమ్మని పిలిచాడు. ఇంద్రునితో కూడిన ఆ బాలుడు తన తల్లిదండ్రులతో కాసేపు మాట్లాడి వారిని ఓదార్చాడు. 'తండ్రీ మీరిద్దరూ కొద్దికాలంలోనే నా దగ్గరకు రాగలరు. భక్తిశ్రద్ధలతో నేను మీకు సేవ చేసినందువల్లే నాకీ సద్గతి కలిగింది. విచారించకండి'– అని ఆ మునిబాలుడు తల్లిదండ్రులను ఓదార్చాడు. ఆ తర్వాత ఇంద్రునితో కలిసి దివ్యవిమానమెక్కి స్వర్గానికి వెళ్ళాడు. మహాతేజశ్శాలి ఐన ఆ ముని బాలుని తండ్రి భార్యతో కలిసి కుమారునికి జలతర్పణం చేశాడు. అక్కడే ఉన్న నాతో ఆయన ఇలా చెప్పాడు. 'ఓ రాజా! నీవల్ల నేను సంతానహీనుడనయ్యాను. ఇక ఆలస్యం చేయకుండా మమ్మల్ని కడతేర్చు. మాపై నీ బాణాన్ని ఎక్కుపెట్టు. నీ అజ్ఞానంతో నన్ను శోకంలో ముంచివేశావు. నీవల్ల నేను పుత్రుని పొగొట్టుకొని దుఃఖంలో మునిగాను. సర్వం నశించిపోయింది. నీవు కూడా అలానే పుత్రశోకానికి లోనై మరణించుదువుగాక!' అని నన్ను శపించాడు. 'ఓ మహారాజా వైశ్యకుమారుణ్ణి చంపితివి. నీకు బ్రహ్మహత్యా దోషం అంటదు గాని నీకు ప్రాణాంతకమైన పుత్రశోక స్థితి తప్పక కలుగుతుంది. సత్పాత్రునకు చేసిన దానంవల్ల కలిగే ఫలం లాగా ఈ శోకం ఈ జన్మలోనే నీకు ఎదురౌతుంది' అని నన్ను శపించిన కొద్దిసేపటికి వారు చితాగ్నికి వారి దేహాలను

ఆహుతి చేశారు. వారిద్దరూ స్వర్గానికి వెళ్ళారు. ఓ దేవీ! చూశావా నేను నా చిన్నతనంలో అజ్ఞానంతో చేసిన దుష్కర్మవల్ల నేను పుత్రశోకాగ్నిలో దహించి వేయబడుతున్నాను. ఆ కార్యం నేడు నాకు గుర్తుకువచ్చింది. తినరాని పదార్థాలు తిని అజీర్తి రోగాన్ని తెచ్చుకొన్నట్లుగా నేను చేసిన పాపపుపని నన్ను వెన్నంటే వుండి నాకు చావును తెచ్చిపెట్టింది. ఆ మహర్షిపుంగవుడు ఇచ్చిన శాపఫలితమే నేడు నేను అనుభవిస్తున్నాను. ఇప్పుడు నా మరణం తథ్యం' అని దశరథుడు కౌసల్యతో చెప్పాడు.

'ఓ కౌసల్యా! నా దృష్టి మందగిస్తోంది. నీవు నన్ను ఒకసారి స్పృశించు' అంటూ దశరథుడు భయపడిపోయాడు. 'ఓ కల్యాణీ నేను పట్టాభిషేకాన్ని చేయాల్సిన నా కుమారునికి అది చేయకపోగా అడవులకు పంపివేశాను. ఇది నాకు తగని పనే కదా. అయినా ధర్మాత్ముడైన నా కొడుకు నా మాటను వేదతుల్యంగా భావించాడు. కొడుకును ఏ తండ్రి త్యజించగలడు. తెలివిగల కుమారుని త్యజించిన తండ్రిని నేనొక్కడినే. ఇంతటి పాపాన్ని చేసిన నా కొడుకు మహాత్ముడు కాబట్టి నన్ను పల్లెత్తు మాట కూడా అనలేదు. కౌసల్యా! నేను నా ప్రాణాలను విడిచేలోపు రాముని ఒక్కసారి చూస్తే బాగుంటుంది కదా. ఎవరైనా మరణించిన తర్వాత తమ ఆత్మీయులను చూడలేరు కదా!

ఓ కౌసల్యా! నా చూపు, జ్ఞాపకశక్తి తగ్గిపోతున్నాయి. ఇదిగో యమదూతలు వచ్చారు. నన్ను రమ్మని తొందర పెడుతున్నారు. సత్యవచనుడైన నా శ్రీరాముని చూసే అదృష్టం ఇక నాకు లేదు గదా. ఇంతకన్నా దుఃఖం వేరే ఏముంటుంది? శ్రీరాముని ఎడబాటు నా ప్రాణాలను తోడివేస్తోంది. పద్నాలుగేండ్ల తర్వాత మకరకుండలాలు ధరించి దివ్యమైన తేజస్సుతో వెలిగే నా శ్రీరాముని ముఖాన్ని చూసేవారు నిజంగా దివ్యాత్మలే. తామరరేకులవంటి కన్నులు, అందమైన పలువరసతో చూడముచ్చట కొలిపే నాసికతో ముద్దులొలికే నా చిన్నారి తనయుడు రఘు రాముని మోమును చూసేవారే అదృష్టవంతులు. వారే కృతార్థులు. వారి జన్మ ధన్యమైపోతుంది. వారి భాగ్యమే భాగ్యం. ఓ కౌసల్యా! నాకు మరణం ఆసన్నమౌతోంది. నాలో ఇంద్రియాలు పని చేయడం మానివేశాయి. ప్రమిదలోని నూనె అయిపోయేటప్పుడు తగ్గే దీపకాంతిలాగా నా దేహం నెమ్మదిగా వడిలిపోతోంది. వేగంగా ప్రవహించే నది కట్టలు తెంచుకొని పారినట్లు నా మనస్సుతో రాముని వియోగం పొంగుకు వస్తోంది. ఈ శోకాన్ని నేను భరించలేను.

'కుమారా! రాఘవా! రఘురామా! దీనుడనైన నన్ను వదిలి ఎక్కడకు వెళ్ళావు? నాపై నీకు దయ లేదా తండ్రీ! పురుషోత్తమా! ఇక్ష్వాకువంశతిలకా! నా గారాలతండ్రీ! నన్ను దిక్కులేనివాణ్ణి చేసి నీవు దూరంగా వెళ్ళిపోయావా? ఓ కౌసల్యా!సుమిత్రా! నేను వెళ్ళిపోతున్నాను. నా వంశనాశం చేసిన కైకేయీ! నేను ఈ లోకాన్ని విడిచి వెళ్తున్నాను అంటూ కౌసల్య సుమిత్రల ముందే దశరథుడు అంతిమశ్వాసను విడిచాడు. ఆయన ప్రాణాలు అనంతవాయువులో కలిసిపోయాయి. ప్రియపుత్రుని వియోగకారణంగా దశరథ మహారాజు అర్ధరాత్రి తర్వాత ప్రాణాలను విడిచివేశాడు.

* * *

అంతఃపుర స్త్రీల రోదనం

సర్గ - 65

సూర్యోదయం అయింది. మహారాజును జయజయధ్వనులతో మేల్కొలపడానికి వందిమాగధులు, పండితులు వచ్చారు. వారి జయజయధ్వనులు ఆ ప్రాంతమంతా మారుమోగాయి. ఇక్ష్వాకువంశాన్నంతా వారు కీర్తించారు. మహారాజు చేసిన ఘనకార్యాలను పొగిడారు. ఆ చప్పుళ్ళకు పక్షులన్నీ తమ గొంతుల్ని కలిపాయి. బ్రాహ్మణులు స్వస్తివచనాలు పలికారు. శ్రావ్యంగా వీణాగానం చేశారు. మృదంగధ్వనులు వినిపించారు. పరిచారిక స్త్రీలు కంచుకులు దశరథుని సేవలో పాల్గొనడానికి వచ్చారు. సుగంధద్రవ్యాలను పరిమళభరితవస్తువులను తెచ్చారు. రాజు రాణుల అభ్యంగనస్నానాల ఏర్పాటుకు కావాల్సిన వస్తువులన్నీ తెచ్చారు. అలంకారాది వస్త్రాలు, ఆభరణాలు, పుష్పాలు తెచ్చారు. ఆ వస్తువులన్నీ శుభప్రదమై మంగళకార్యాలకు వినియోగించేవై ఉన్నాయి.

ఎంతకూ దశరథుడు శయ్య దిగిరాలేదు. సూర్యోదయం పూర్తిగా అయ్యేంతవరకు వారు రాజును కీర్తిస్తూనే ఉన్నారు. అయినా దశరథునిలో చలనం లేకపోయేసరికి వారిలో కొందరు మహారాజు దగ్గరకు వెళ్ళారు. ఆయనను తట్టి లేపారు. కాని వారు ఏమీ తెలుసుకోలేకపోయారు. రాజు నిద్ర చూచి వారికి సందేహం కలిగింది. వారు భయకంపితులయ్యారు. రాజు చేయి పట్టి చూశారు. వారి శంక నిజమయింది. రాజు స్వర్గస్థుడైనట్లు వారు గ్రహించారు. రాజుగారి పక్కనే ఉన్న కౌసల్య సుమిత్రలను వారు చూశారు. పుత్రవియోగ దుఃఖంలో ఏడ్చి ఏడ్చి నిద్రపోతున్నారు. వారి ముఖం నిండా కన్నీటి చారికలు కరుడుగట్టి ఉన్నాయి. ఆ స్త్రీలు ఏడ్చి సొమ్మసిల్లిపోయారా? అన్నట్లు గాఢనిద్రలో మునిగి ఉన్నారు. వారు చీకటి కమ్మిన నక్షత్రాల్లా కనిపించారు. కౌసల్య కళావిహీనమై కృశించి కుంగిపోయి నిద్రలో మునిగి ఉంది. వారిని చూసిన దాసీలు రాజుగారు నిద్రలో మరణించారని అనుకొన్నారు.

స్త్రీలందరూ ఒక్కసారిగా తమ ప్రియతముడిని కోల్పోయి బిగ్గరగా ఏడ్వసాగారు. వారి ఆక్రందనల ధ్వనికి ఉలికిపాటుగా కౌసల్యాసుమిత్రలు మేల్కొన్నారు. దశరథుని చూసి అయ్యో నాథా!అంటూ నేలపై పడిపోయారు. నేలపై పడి దొర్లుచు రోదిస్తున్న కౌసల్య చంపబడిన ఆడ ఏనుగులాగా వారికి కనిపించింది. ఆకాశం నుండి రాలిన తారల్లాగా వారు కళావిహీనలై సర్వమును పొగొట్టుకుని ఏడుస్తున్నారు. విషయం తెలుసుకొని కైకేయి ఇతర రాణులందరూ దుఃఖితులై దశరథుని శరీరం దగ్గరకు వచ్చారు. దశరథునిగృహం నలువైపులా రోదనలతో ప్రతిధ్వనిస్తూంది. ఆ గృహం అంతా దీనులతో, దుఃఖితులతో నిండిపోయింది. అక్కడ ఆనందం కనుమరుగైపోయింది. మహారాజు దివంగతుడయ్యాడని అందరూ తెలుసుకొన్నారు. వారు పెడబొబ్బలు పెట్టారు. ఆర్తనాదాలు చేస్తూ జీవితేశ్వరా! మమ్ము అనాథలను చేసి మమ్ములను వీడిపోయావా అంటూ స్త్రీలందరూ విలపించారు. వారందరు ఒకరి చేతులు మరొకరు పట్టుకొంటూ మనకందరికీ ఎంత దీనావస్థ కలిగించారో కదా అని దుఃఖించసాగారు.

* * *

దశరథుని కాయాన్ని భద్రపరచటం

సర్గ - 66

కౌసల్య తేజోవిహీనుడైన తన భర్త శిరస్సును తన ఒడిలో పెట్టుకొంది. నీరింకిపోయిన సముద్రంవలె అణగారిన అగ్నిలాగా ఉన్న దశరథుని చూచి ఆమె అమితంగా దుఃఖిస్తూ కైకేయిని చూచింది. ఆమెలో కోపం ప్రజ్వలించింది. 'ఓ క్రూరురాలా! నీ కోరికలు ఈడేరాయి. నేడు మహారాజు స్వర్గస్థుడయ్యాడు. నీకు అడ్డు చెప్పేవారు ఎవరూ లేరు. నీవు నిరభ్యంతరంగా ఈ రాజ్యాన్ని ఏలుకో. నా రాముడు నన్ను వీడి అడవులకు వెళ్ళాడు. నా జీవితేశ్వరుడు శాశ్వతంగా నాకు దూరం అయ్యాడు. నేను ఒంటరిగా మిగిలిపోయాను. నాకు ఈ జీవితంపై ఆశ నశించింది.

అధర్మ పరురాలైన కైక తప్ప ఏ స్త్రీ తన ప్రాణేశ్వరుని వదలి జీవించగలదు? లోభియైనవాడు దురాశతో ఇతరులకు విషాన్నాన్ని పెట్టగలడు. అందులోని దోషం ఏ మాత్రం గుర్తించడు. అలానే మంథర మాటలను విని రఘువంశ వినాశాన్ని చేతులారా చేసింది. కైక వరాలను అడ్డుపెట్టుకొని సీతారాములను అడవులకు పంపారన్న వార్త జనకుడు తెలుసుకొంటే ఆయన నావలె దుఃఖిస్తాడు గదా. ఇప్పుడు మహారాజు విగతజీవుడయ్యాడు. నేను అనాథ నయిపోయాను. ఈ విషయాలేవీ నా శ్రీరామునకు తెలియవు కదా. సీతవనాలలో సంచరిస్తూఎంత దుఃఖా న్ని అనుభవిస్తుందో గదా. అరణ్యాల్లో భయంకరధ్వనులకు భయపడుతూ రాముని చేరుతుందేమో. జనక మహారాజు వృద్ధుడైపోయాడు. పుత్ర సంతతిలేనివాడు, తన పుత్రిక రాజాంతఃపురంలో కాక అడవుల్లో కాపురం చేస్తోందని ఆయన తెలుసుకొంటే జనకుని ప్రాణాలు నిలుస్తాయా? ఆయన అంతులేని దుఃఖసముద్రంలో కూరుకుపోతాడు.

'నేను నా ప్రాణేశ్వరునితోపాటు సహగమనం చేసి దేహత్యాగం చేస్తాను' అంటూ కౌసల్య దశరథుని గట్టిగా ఆలింగనం చేసుకొంది. ఇలా ఏడుస్తున్న కౌసల్యను అంతఃపుర దాసీలు పట్టుకొని బలవంతంగా దూరంగా తీసుకొని వెళ్ళారు.

అమాత్యులు, వసిష్ఠాది గురువులు దశరథుని దగ్గరకు వచ్చారు. వసిష్ఠుని ఆజ్ఞ ప్రకారం దశరథుని శరీరాన్ని తైలంలో భద్రపరిచారు. తరువాత చేయాల్సిన పనులు చేశారు. నలుగురు పుత్రులున్న దశరథుడు నేడు అనాథగా మారి దివంగతుడు అయ్యాడు. కుమారులు లేకుండా దహనసంస్కారాలు చేయడం ఇష్టం లేక వారు మహారాజు శరీరాన్ని తైలం ఉన్న తొట్టెలో పెట్టి భద్రపరిచారు. నూనెలో ఉంచిన మహారాజు శరీరాన్ని చూసి స్త్రీలందరూ అయ్యో ఈ ప్రభువు మరణించాడు అంటూ బిగ్గరగా ఏడ్చారు.

'అయ్యో మహారాజా! మమ్ములను వీడి శ్రీరాముడు దూరంగా వెళ్ళాడు. ఆ బాధను భరిస్తున్న మాపై కనికరం లేకుండా మీరు శాశ్వతంగా దూరం అయ్యారు కదా' అంటూ వారు విలపించారు. దుష్టురాలగు కైక కుమారుడిని దూరం చేసింది. భర్త మరణానికి కారణం అయింది. ఈమె దగ్గర మనం ఉండవలసి వస్తోంది అని

వారు వగచారు. మీరు ధర్మాత్ముడు ఐన శ్రీరాముడు లేకుండా కైక దూషణలు తట్టుకొంటూ మేం ఎలా జీవించగలం? మహారాజా! మాపై జాలి లేదా అని అన్నారు.

ఈ కైక బలిష్ఠుడైన రాజును వంచించింది. పరాక్రమశాలురైన రాముని లక్ష్మణుని సుకుమారి ఐన సీతను దూరం చేయగల్గింది. ఆమె ఆశలకు అడ్డు లేకుండా చేసుకొంది. ఇక ఎవరిని ఆమె నిలవనిస్తుంది? ఎవరినీ కైక వదలదు అంటూ వారందరూ రోదించారు.

దశరథుని భార్యలందరూ ఆనందం నశించిపోగా విపరీతమైన దుఃఖంలో మునిగిపోయారు. మహాత్ముడైన దశరథుని కోల్పోయిన అయోధ్య చంద్రుడు లేని రాత్రిలాగా, భర్తలేని స్త్రీలాగా కళావిహీనం అయింది. రాజ్యంలోని ప్రతివారు దశరథుని మరణం తెలుసుకొని చింతించారు. ప్రతివారు మహారాజును తలచుకొని రోదించారు. ఆయన గుణగణాలను చెప్పుకుంటూ బాధపడ్డారు. అయోధ్య అంతా శోకసముద్రంగా కనిపించింది.

పుత్రశోకంతో మహారాజు స్వర్గస్థుడు కాగా, ఆయన భార్యలందరూ ప్రాణాలు కోల్పోయిన మహారాజును చూచి బిగ్గరగా ఏడ్వసాగారు. పుత్రుడు దూరం అయి ఒక ప్రక్క, నాథుడు మరణం మరొక ప్రక్క వారిని కుంగదీసింది. ఆ సమయంలో సూర్యుడు తన ప్రయాణాన్ని ఆపివేశాడన్నట్లు అస్తమయం అయింది. రాత్రించరులకు వీలుగా రాత్రి ప్రవేశించింది.

అయోధ్యావాసులందరూ కౌసల్యాసుమిత్రలకు కలిగిన దుఃఖాన్ని గూర్చి చెప్పుకొన్నారు.కైక వ్యామోహం ఎంతపనిచేసిందని వారు చింతించారు. రాముని ఎడబాటు భరించలేని మహారాజు మంచితనాన్ని గూర్చి కథలు కథలుగా చెప్పుకొన్నారు. రఘువంశ వినాశనానికి కారణం అయిన కైకను దూషించారు. కొడుకు కోసం భర్త ప్రాణాలకే ఎసరు పెట్టిందని భరతుని తల్లిని వారందరూ తూలనాడారు.

ఇలా అయోధ్య సూర్యుడు లేని పగలులాగా, చంద్రుడు లేని రాత్రిలాగా, నక్షత్రాలు లేని ఆకాశంలాగా కళావిహీనం అయింది.

* * *

రాజులేని రాజ్యస్థితి

సర్గ - 67

ఆ రాత్రి అతిదీర్ఘంగా సాగింది. అయోధ్యావాసులలో ఎవరి దగ్గరా ఆనందం మచ్చుకైనా కనిపించలేదు. ఆక్రందనలు నిట్టూర్పులతో రాత్రి అంతా నిండిపోయింది. అందరి మనసులు వ్యాకులతతో నిండి ఆలోచనే లేక స్తబ్దుగా అయిపోయాయి. అయోధ్య అంధకారంలో మునిగిపోయింది.

చీకట్లు చీల్చుకొని సూర్యుడు కష్టపడి బయటకు వచ్చాడు. కాని ఎవరి మనస్సూ ఆనందించే స్థితిలో లేదు. కాని రాచకార్యాల కోసం విప్రులు అమాత్యులు సభ తీరారు. మార్కండేయుడు, మౌద్గల్యుడు, వామదేవుడు, కాశ్యపుడు, కాత్యాయనుడు, గౌతముడు, జాబిలి మొదలగు బ్రాహ్మణోత్తములు రాజపురోహితుడు, మునిశ్రేష్ఠుడైన వసిష్ఠునితో మాట్లాడారు.

"ఓ మౌనివర్యా! పుత్రవియోగాన్ని తట్టుకోలేని మన మహారాజు మనలను వీడి వెళ్ళాడు. ఈ రాత్రి నూరు సంవత్సరాల కాలం అయినట్లుగా గడిచింది. ప్రభువు, చక్రవర్తి పెద్దకుమారుడు శ్రీరాముడు అడవుల పాలయ్యాడు. భరతశత్రుఘ్నులు మేనమామైన కేకయరాజు దగ్గర ఉండిపోయారు. లక్ష్మణుడు అన్నను అనుసరించి వెళ్ళాడు. నేడు రాజు దివికేగాడు. ఇప్పుడు అయోధ్య రాజు లేక అనాథ అయింది.

రాజులేని రాష్ట్రంలో అల్లకల్లోలాలు జరుగుతాయి. అలా గాకుండా ఉండాలంటే రాజు వారసులతో ఎవరినో ఒకరిని రాజుగా నియమించాలి. రాజు లేని రాజ్యంలో సకాలంలో వర్షాలు పడవు. వ్యవసాయం దెబ్బతింటుంది. నీటికోసం ఎదురుచూస్తూ రైతు విత్తనాలను చల్లడానికి భయపడతాడు. విత్తనాలు వేయని పొలం బీడు పట్టిపోతుంది. పచ్చిక లేక జంతువులు ఆకలికి అల్లాడుతాయి. పుత్రులు తండ్రి మాట వినరు. భార్యాభర్తల మధ్య అన్యోన్యతలు దెబ్బతింటాయి. ఆర్థికపరిస్థితి దిగజారి వారిలో ఒకరినొకరు అగౌరవపరచుకొనే స్థితి కలుగుతుంది. దానితో అసత్యం రాజ్యం ఏలుతుంది. అన్యాయం, అక్రమాలు చుట్టాలై తిరుగుతాయి.

రాజులేని దేశంలో ప్రజలు వ్యసనపరులు అవుతారు. జారులు చోరులు ఎక్కువ అవుతారు. సభలు సమావేశాలు జరగవు. సత్సంగం ఎక్కడా జరగదు. సాధువుల మాట ఎవరూ వినరు. ఋజువర్తనం ఉండదు. ఋతంభరులలాగా మనుష్యులు మనలేరు. వృక్షాలను నరికివేస్తారు. ప్రజలలో భయాందోళనలు పెరుగుతాయి. వారు దానకార్యాలు చేయరు. లోభగుణం అలవరచుకొని ధనాన్ని దాయడంలో మునిగిపోతారు. సత్రాలు దేవాలయాల నిర్మాణం ఉండదు. ఉన్నవాటి సంరక్షణ బాధ్యతను ఎవరూ చేపట్టరు. సోమయాజులైన వారు యజ్ఞవిఘ్నాలు కలుగుతాయనే భయంతో యజ్ఞాలను ప్రారంభించరు. గొప్పధనం కలవారు యజ్ఞయాగాదులను చేయించినా ఋత్విజులకు సరైన దక్షిణలు ఈయరు.

రాజులేని రాష్ట్రంలో ప్రజల మనోవికాసానికి తోడ్పడే లలితకళలను ఎవరూ ప్రోత్సహించరు. సంగీతం, నాట్యం, కవిత్వం చెప్పేవాళ్ళకు, చూపించే వాళ్ళకు సరియైన పోషణ లేక ఆ కళలు మరుగున పడిపోతాయి. దానివల్ల ప్రజల బుద్ధి సంకుచితం అవుతుంది. దానితో దేశాభివృద్ధికి అవసరమైన ఆలోచనలు ప్రజలలో కలగవు. దేవోత్సవాలు, తీర్థయాత్రలు, హరికథలు, పురాణ ప్రవచనాలు లాంటి సామాజిక కార్యక్రమాలు చేసేవారు లేక కుంటుపడిపోతాయి. సమష్టిగా కష్టపడి ఫలం పొందే నేర్పును ప్రజలు పోగొట్టుకొంటారు. స్వార్థులై ఎవరి మనోభీష్టానికి వారు పనిచేస్తారు. అప్పుడు పరులకు ఉపకారం చేయకపోగా అపకారం చేసే స్థితిలోకి జారిపోతారు.

క్రయవిక్రయాలు న్యాయబద్ధంగా సాగవు. వ్యవహారపు చిక్కులు విడదీయడంలో న్యాయవాదులు లోభంలో ఆలోచిస్తూ నేర్పరితనాన్ని చూపరు. చోరుల భయం అధికమై అందమైన స్త్రీలు చక్కని అలంకారాలను ధరించడానికి భయపడతారు. వారు విహరించడానికి వెనుకంజవేస్తారు.

రాజభయం లేక బందిపోట్లు దోపిడిదారులు స్వైరవిహారం చేస్తారు. దానితో భార్యాభర్తలు ప్రియులు ప్రియురాండ్లతో విహారాలను మానివేస్తారు. పిల్లలపెంపకంలో తల్లిదండ్రులు అజాగ్రత్తగా వ్యవహరించి దేశానికి శక్తులైన వారిని ఉదాసీనులుగా తయారుచేస్తారు. విద్యాగంధం అందరికీ అందదు. శాస్త్రాలను పట్టించుకోరు. దానితో ఎవరు చెప్పేది వారికే వేదం.

ప్రక్కవాడి గురించి ఆలోచించడం మానేసి తన కడుపే కైలాసం అనుకొనే అభాగ్యజీవులు పుట్టుకవస్తారు. నాలుగు వర్ణాలవారు భయం నీడలో బతుకీడ్చుతారు. నిర్భయంగా ఎవరూ మాట్లాడలేరు. న్యాయానికి, ధర్మానికి కాలం చెల్లుతుంది. వ్యాపారస్థులు, ధనవంతులు కూడా కంటిమీద హాయిగా కునుకుతీయలేరు. వృద్ధులను నిరాదరించేవారు ఎక్కువ అవుతారు. పిల్లల ఆలనపై ఆసక్తిని చూపరు. బాణప్రయోగ విద్యలు అస్త్రశస్త్రాల నైపుణ్యం సంపాదించేవారు తక్కువ అయిపోతారు. ప్రజలలో అభద్రతాభావం పెరిగిపోతుంది. ఇంద్రియ నిగ్రహం కలవాడు, భిక్షతో బతికేవాడు, పరమాత్మనే తలచువాడు మునీశ్వరుడు ఇక్కడ సంచరించడు.

కట్టుబాట్లు సడలిపోతాయి. క్రమశిక్షణ లోపిస్తుంది. రణరంగంలోని సైనికులు భీరువుల్లా ప్రవర్తిస్తారు. పరాయివారు ఈ దేశాన్ని తృటిలో చేజిక్కించుకొనే అవకాశాలు కలుగుతాయి. తపోధనులు, పండితోత్తములు శాంతిమాటలు మాట్లాడరు. శాస్త్ర విషయాలు చర్చించరు. విహారాలకు వెళ్ళేవారు ఎవ్వరూ ఉండరు.

రాజులేకపోతే ప్రజలలో ఏకాగ్రత నశిస్తుంది. దైవంపై శ్రద్ధాభక్తులు సన్నగిల్లుతాయి. వారు దైవారాధనకు దూరమౌతారు. ఉద్యానవనాలు, వృక్షాలను పెంచకపోవడంచేత వసంతుడు రాజ్యంపై కన్ను సారించడు. చెట్లే లేనప్పుడు సుగంధాలు ఎక్కడనుంచి వస్తాయి? రాజు లేని రాజ్యం నీరు ఎండిపోయిన ఇసుక తేలిన నదిలాగా అయిపోతుంది. చెట్లు చేమలు లేని అడవిలాగా అణగారిపోతుంది. గోపాలురు లేని గోప సమూహంలాగా అనిపిస్తుంది.

మన మహారాజు నేడు దివంగతుడు అయ్యాడు. రాజ్యానికి రాజు ప్రతీక. రాజ్య ఔన్నత్యాన్ని తెలిపేది పతాకం. నేడు దాన్ని అవగతం చేయాలి. రాజు లేని రాజ్యంలో వ్యక్తులకు వస్తువులకు భద్రత కరువౌతుంది. ప్రజలు మర్యాదలు మరుస్తారు. దుష్టశక్తులు ప్రబలిపోతాయి. పెద్దవారి మాట పిన్నవారు వినరు. రాజదండనం కరువైనందువల్ల నాస్తికులు విశృంఖలంగా వ్యవహరిస్తారు.

యథారాజా తథా ప్రజ కదా! రాజు సత్యధర్మాలకు ఆయువుపట్టు. రాజు నీతిమంతుడై ధర్మంగా రాజ్యాన్ని పాలిస్తే ప్రజలందరూ ఆయన మార్గంలోనే పయనిస్తారు. జాతిధర్మాలను సామాజికన్యాయాన్ని రాజు ఆదరిస్తే ఎక్కడా అక్రమాలు అన్యాయాలు జరగవు. సత్ప్రవర్తనగల రాజు ప్రజాహితం కోసం అహర్నిశం పాటుపడతాడు. వారి యోగక్షేమాల కోసం తన ప్రాణాన్ని పణంగా పెడ్తాడు. యమునిలాగా నిష్పక్షపాతంగా వ్యవహరిస్తారు. దానివల్ల బలవంతులకు, బలహీనులకు ఒకే లాభం కలుగుతుంది. ఎవరూ నిరాదరణకు గురికారు. దానివల్ల ప్రజలకు రక్షణ ఏర్పడి వారు ఇతర విషయాలలో తమ నైపుణ్యాన్ని చూపగలరు. దేశ రక్షణ భారాన్ని రాజ్యంలోని ప్రతి పౌరుడు తన భుజస్కంధాలపై మోయగలడు. వరణునివలె సదాచారుడైన రాజు పరిపాలనలో సదాచారులు

ఉండి నియమ నిష్ఠలుకల పౌరులు వృద్ధి అవుతారు. రాజు బుద్ధిమంతుడైతే ప్రజలకు మంచి చెడ్డలను వివరిస్తాడు. వారిలో వివేకాన్ని మేల్కొలుపుతాడు. వారిని ఉత్సాహవంతులుగా దేశాభివృద్ధి కారకులుగా రాజు తయారుచేస్తాడు. అలా కాకపోయినట్లు ఐతే దిక్కుతోచని ప్రజలు అయోమయులై తమ జీవితాలను తామే నాశం చేసుకొంటారు. ఆదర్శప్రాయుడైన రాజు వల్ల ప్రజలు నిర్భయులై సదాచారులు ఋజువర్తనులు అవుతారు. ఓ వసిష్ఠ మహర్షీ! రాజు బ్రతికి ఉండగా మేము ఎల్లప్పుడు మీ ఆజ్ఞలను పాటిస్తూ ఉండేవాళ్ళం. ఇప్పుడు మేం మీ అనుకూలురమే. కాని రాజు లేని రాజ్యపుస్థితిని మాకు తెలిసినంత వరకు మీకు చెప్పాము. రాజు లేని రాజ్యం అడవిగా మారుతుంది. దాన్ని దృష్టిలో పెట్టుకొని మీరు ఉదారుడు, ఆదర్శప్రాయుడైన వానిని ఇక్ష్వాకువంశజుడిని రాజుగా నియమించండి. ఈ కోసలరాజ్యాన్ని మీరే కాపాడండి" అంటూ మార్కండేయాది మహర్షులు ఒక్కొక్కరుగా వసిష్ఠమహర్షికి చెప్పారు.

* * *

దూతలు కేకయరాజ్య ప్రవేశం

సర్గ - 68

ఋత్విజుల మాటలన్నీ వసిష్ఠుడు విన్నాడు. బాగుగా ఆలోచించాడు. అక్కడున్న ప్రముఖులు మంత్రులు బ్రాహ్మణోత్తములను ఉద్దేశించి ఇలా చెప్పాడు. ప్రస్తుతం భరతుడు శత్రుఘ్నుడు ఇద్దరూ వారి మేనమామ ఇంటిలో హాయిగా ఉన్నారు.

భరతునకే రాజ్యం ఇవ్వాలనేది దశరథుని అభిప్రాయం కదా. అందువల్ల వేగంగా రథాన్ని నడిపే చోదకులను కేకయరాజ్యానికి పంపి భరతాదులను ఇక్కడకు వెంటనే రప్పించాలి– అని చెప్పాడు. వారందరూ దానికి ఆమోదం తెలిపారు.

సిద్ధార్థా!, జయంతా!, విజయా!, అశోకా!, మదనా!– మీరు అందరూ ఇలా రండి. మీకు నేనొక కార్యాన్ని అప్పజెప్పుతున్నాను. దానిని మీరు వేగంగా పూర్తిచేయాలి. మీరందరూ కేకయరాజ్యానికి వెళ్ళండి. కాని అక్కడివారికి ఈ అయోధ్యాపురి విషయాలు తెలియకూడదు. మీ ముఖంలో ఎక్కడ విషాదచ్ఛాయలు కనబడకుండా జాగ్రత్తలు తీసుకోండి. భరతునికిగాని, శత్రుఘ్నునికిగాని దశరథుని మరణం గాని శ్రీరాముని వనవాసం గురించి కాని అక్కడ చెప్పకండి. మీరు వెళ్ళి భరతునకు నేను మంత్రులందరూ నీ క్షేమ సమాచారాన్ని అడిగారు అని చెప్పండి. మీరు చేయవలసిన పని ఒకటి అవసరమైనది ఉంది. దాన్ని వెంటనే నిర్వర్తించడానికి మీరు బయలుదేరాలి అని నా మాటగా చెప్పండి. కేకయరాజుకు తగిన బహుమానాలు, ఉత్తమ వస్త్రాలు భరతునికి ఇష్టమైన వస్తువులన్నీ తీసుకొని వెళ్ళి వారికి ఇవ్వండి అని చెప్పాడు.

వసిష్ఠుని ఆదేశం ప్రకారం దూతలు దారిలో కావాల్సిన ఆహార పదార్థాలను ఇతర సామగ్రిని సిద్ధం చేసుకొన్నారు. వేగంగా పనులన్నీ పూర్తిచేసుకొన్నారు. వసిష్ఠుని అనుమతిని తీసుకొని కేకయ రాజ్యానికి రథాలపై

పరుగులు తీశారు. వారు ఆ పర్వతాల పర్వతం దక్షిణ భాగపు చివరవరకు ప్రయాణం చేసి మాలినీనదీ తీరాన్ని దాటి ప్రలంబగిరి ఉత్తరభాగాన్ని చేరి అక్కడనుండి పశ్చిమదిక్కుగా ప్రయాణించారు.

ఆ దూతలు హస్తినాపుర సమీపంలో గల గంగను దాటి అక్కడనుంచి పశ్చిమాభిముఖులై కురుజాంగల దేశంలోనుండి పాంచాల దేశానికి వెళ్ళారు. అక్కడ నదులను సరస్సులను చూస్తూ పని తొందరలో ఆ ప్రకృతిని ఆస్వాదించలేక శీఘ్రంగా పయనించారు.

వారు మధురజలాలతో, పక్షులగుంపులతో అలరారే శరదంభనదిని కూడా వేగంగా దాటిపోయారు. ఈ నది పశ్చిమతీరంలో ఒక వృక్షం ఉంది. దానిమీద ఒక దేవత అధిష్ఠించి ఉంది. ఆ వృక్షాన్ని పూజించిన వాళ్ళ కోరికలు సఫలమౌతాయన్న ప్రచారం ఉంది. అందువల్ల దానికి 'సత్యోపయాచనం' అని ప్రసిద్ధి వచ్చింది. దూతలు దారిలో ఆ వృక్షరాజాన్ని చూసి ప్రదక్షిణ నమస్కారాలు చేసి అక్కడనుంచి వేగంగా 'కులింగాపురి' చేరుకొన్నారు. అక్కడనుంచి అభికాశం అను గ్రామాన్ని, ఇక్షుమతి అనే పవిత్రనదిని దాటారు. ఇక్షుమతి బోధిభవనం అను పర్వతాన పుట్టి ప్రవహిస్తూ ఉంది. ఆ ప్రాంతం అంతా ఇక్ష్వాకువంశీయుల పాలనలోనే ఉంది. ఆ నది నీటిని దోసిలితో త్రాగి తపస్సు చేసే తాపసులను చూచి వారికి నమస్కరించారు. ఆ తర్వాత 'సుధామ' అనే పర్వతాన్ని చేరారు.

పర్వతాన్ని ఆనుకొని ప్రవహించు 'విపాశ' అను నదిని, శాల్మలీవృక్షాలను వారు చూశారు. ఎక్కడా ఆగకుండా ముందుకు సాగుతూ దారిలో ఎదురయ్యే నదులను, దిగుడు బావులను, చెరువులను, తటాకాలను చూస్తూ వెళ్ళారు. అంతేకాక అడవి జంతువులైన సింహాలు, పులులు, జింకలు ఏనుగుల లాంటి జంతువుల సంచారాన్ని చూస్తూ ముందుకు సాగారు. వసిష్ఠుని ఆజ్ఞను రాజాజ్ఞగా భావించి వారు విశాలంగా ఉన్న మార్గాలలో పయనించారు.

సుదూరప్రయాణం అవడంవల్ల దూతలే గాక గుర్రాలు అలసిపోయాయి. కాని వారు వడివడిగా కేకయ రాజ్యనగరమైన గిరివ్రజపురాన్ని చేరారు. దశరథుని ఆత్మ శాంతికోసం ఇక్ష్వాకువంశంపై ప్రీతితో రాత్రివేళ ఐనప్పటికీ దూతలు త్వరగా ఆ పురాన్ని చేరారు.

* * *

భరతుని స్వప్నభయం

సర్గ - 69

దూతలు ప్రవేశించిన రాత్రి వేకువ జామున భరతునికి ఒక కల వచ్చింది. పొద్దున్నే వచ్చిన పీడకల భరతునికి భయం కలిగించింది. భయోత్పాతాన్ని కలిగిస్తున్న ఆ కలను మరచిపోలేక భరతుడు దుఃఖార్తుడు అయ్యాడు. మనోవ్యథ చెందాడు. ఆయన చింతాగ్రస్తుడవడం భరతుని మిత్రులు గ్రహించారు. ఆ భరతుని

సంతోషం కోసం వారు సభలు ఏర్పాటు చేశారు. ఆటపాటలు, కథలు చెపుతూ భరతుని మనస్సు మరల్చాలని చూశారు.

వీణానాదాలను, నాట్యాలను, నాటికలను నాటకాలను ప్రదర్శింపజేశారు. హాస్యప్రసంగాలు చేశారు. అయినా రఘువంశశ్రేష్ఠుడైన భరతునికి దుఃఖం పోలేదు. అతని మనస్సు కీడు శంకించింది. వ్యాకులచిత్తంతో మిత్రుల హాస్యప్రసంగాలలో పాలు పంచుకోలేకపోయాడు. దాన్ని గమనించిన మిత్రులు "భరతా! ఎందుకీ విచారం? నీ మనస్సు దేన్ని గురించి ఆలోచిస్తోంది? మాకు చెప్పవచ్చుగదా!" అని అడిగారు.

నేస్తాల మాటలకు భరతుడు ఇలా బదులు చెప్పాడు. "మిత్రులారా! వేకువ జామున నాకు ఒక కల వచ్చింది. ఆ కలలో నా తండ్రి మలిన శరీరంతో ఉన్నాడు. ఆయన కేశాలు చెల్లాచెదురుగా ఉన్నాయి. మా తండ్రి పర్వతశిఖరం మీద నుండి గోమయంతో కూడిన మడుగులో పడిపోయినట్లుగా కనబడ్డాడు. ఆ పేడలో మా నాన్న ఈదుతున్నాడు. ఆయన నవ్వుతూ దోసిలితో నూనె తాగుతున్నాడు. ఆయన నువ్వుల అన్నం తింటున్నాడు. ఆయన తలకిందులుగా నూనెలో మునకలు వేస్తూ కనిపించాడు. ఆ కలలోనే నాకు నీరు లేని సముద్రం, ఆకాశంలో నుండి చంద్రుడు జారిపోవడం చూశాను. చీకట్లు కమ్మి భూమి నాకు కనబడలేదు. కాని భూమి కుంగిపోయినట్లు, చెట్లన్నీ ఎండిపోయి పర్వతాలు బద్ధలై వాటినుంచి ఉవ్వెత్తున లేచే పొగలు, రాజవాహనమైన భద్రగజం దంతం ముక్కలు ముక్కలుగా విరిగిపోవడం ఇవన్నీ నాకు కనబడ్డాయి.

అంతేగాదు, మా తండ్రి నల్లని వస్త్రాలు ధరించి ఇనుప పీటపై కూర్చుని ఉన్నాడు. నల్లగా, ఎర్రగా ఉన్న స్త్రీలు ఆయనను చూచి నవ్వుతున్నారు. మా తండ్రి ఎర్రని పూలమాల ధరించి గాడిదలను పూన్చిన రథంపై ఎక్కి వేగంగా దక్షిణాభిముఖంగా వెళ్ళడం చూశాను. వికారరూపి ఐన ఒక స్త్రీ ఎర్రని వస్త్రాలు ధరించి మా తండ్రిని లాక్కు వెళుతున్నట్లుగా కూడా చూశాను.

ఈ కల నన్ను భయపెడ్తోంది. ఈ భయంకర కల ఫలితంగా నేనో, రాముడో, మహారాజో, లక్ష్మణుడో మరణించవచ్చు అని నాకు అనిపిస్తోంది. ఒక వ్యక్తి గాడిదల రథంపై సాగిపోవడం చూస్తే ఆ వ్యక్తి మరణాన్ని చూస్తామంటారు గదా. ఈ కల వలనే నాకు మనస్తాపం కలుగుతోంది. మాటిమాటికి నా తండ్రిని చూడాలని అనిపిస్తోంది. నా మనస్సు కలత చెందింది. దానితో నా గొంతు పిడుచకట్టుకుపోతోంది. అకారణంగా నా కంఠం దుఃఖంతో పూడుకుపోతోంది. నాపై నాకే రోత కలుగుతోంది! విసుగు పుడుతోంది. ఇక్కడ ఉండాలని నాకు అనిపించటంలేదు. హేతువు ఏమీ లేకుండానే నా మనస్సు చింతిస్తోంది.

నేను ఎప్పుడూ ఇలాంటివి ఊహించుకోలేదు. నా కలలో నా తండ్రి దుఃస్థితిని చూచి నాకు భోరున ఏడ్వాలనిపిస్తోంది. వేగంగా వెళ్ళి నా తండ్రి క్షేమాన్ని కనుగొనాలనిపిస్తోంది. మాటిమాటికీ కల గుర్తుకువచ్చి నా హృదయాన్ని కలచివేస్తోంది. దీనికి కారణాన్ని నేను ఊహించలేకున్నాను" అని భరతుడు తనకు సుదీర్ఘంగా వచ్చిన కలను మిత్రులకు తెలిపాడు. అందువల్లే మీ మాటలు నాలో చలనం కలిగించటంలేదు. మిమ్ము నేను ఆదరించలేకపోతున్నాను అంటూ భరతుడు దీనంగా చెప్పాడు.

* * *

భరతాదుల అయోధ్యా ప్రయాణం

సర్గ - 70

భరతుడు తన మిత్రులతో మాట్లాడుతుండగానే అయోధ్య దూతలు శత్రుదుర్భేద్యమైన కందకాన్ని దాటి 'రాజగృహం' అనే నగరంలో ప్రవేశించారు. వారు కేకయరాజును అతని కుమారుడగు యుధాజిత్తును చూసి నమస్కారాలు చేశారు. కేకయరాజు వారి కుశలాన్ని అడిగి ఆదరించాడు. భరతుని కలుసుకొని వసిష్ఠుడు చెప్పిన రీతిగా వచ్చిన కార్యాన్ని చెప్పారు. అయోధ్య నుంచి తెచ్చిన వస్తు సామగ్రిని భరతునకు అప్పజెప్పి మీ మాతామహునకు ఇరవై కోట్ల విలువగల వస్తువులు, మీ మేనమామకు పది కోట్ల విలువగల సామగ్రిని అందజేయండి అని చెప్పారు. భరతుడు సేవకులపై ప్రేమ కలవాడు. వారు చెప్పినట్లుగానే తాతకు, మేనమామకు వస్తుసముదాయాన్ని సమర్పించాడు.

దూతల క్షేమసమాచారాలను అడిగి తెలుసుకొన్నాడు. వారికి వసతులను ఏర్పాటుచేసి చక్కగా ఆదరించాడు. ఆ తరువాత "దూతలారా! మా తండ్రి క్షేమంగానే ఉన్నారు కదా! నా సోదరులైన రామలక్ష్మణులు క్షేమమే కదా! ఆదరణీయురాలు, పూజ్యురాలు ధర్మంతో ప్రవర్తించే మా కౌసల్యాదేవి క్షేమమే గదా. లక్ష్మణుని తల్లి ఐన సుమిత్రా దేవి అందరితోను ప్రియంగా మాట్లాడుతుంది. ఆమె క్షేమమే గదా! అందరిలోకి కోప స్వభావురాలు తానే తెలివి గలదాన్ననుకొనే నా తల్లి కైక సుఖంగానే ఉంది కదా. ఆమె నాతో ఏమి చెప్పి పంపింది?" అని దూతలను అడిగాడు. దానికి వారు సమాధానాన్ని దాటవేసి మీరు త్వరగా అయోధ్యాపురిని చేరుకోవాలి. మీరు చేయవలసిన కార్యం వెంటనే జరగాల్సి ఉంది. మీ తాతగారి అనుమతిని తీసుకొని వెంటనే బయలుదేరండి. మిమ్ము శీఘ్రంగా తీసుకొని రమ్మని వసిష్ఠులవారు మమ్ము ఆదేశించారు. మేము పురోహితుని ఆజ్ఞాబద్ధులం. మీరు బయలుదేరుటకు కాలయాపన చేయకండి అని తొందర పెట్టారు.

దూతలు చెప్పిన విషయం భరతుడు కేకయరాజుకు చెప్పాడు. మా కులపురోహితులు, మా తండ్రిగారు నన్ను చూడాలని అనుకొంటున్నారు. మీరు నాకు అనుజ్ఞ ఇస్తే వారిని చూస్తాను. మరల మీరు నన్ను చూడాలనుకొన్నపుడు మీ దగ్గరకు వస్తాను అని చెప్పారు. దానికి కేకయ రాజు "నాయనా భరతా! నీ ఇష్టప్రకారమే అయోధ్యకు బయలుదేరు. నీ తల్లిదండ్రులను, కులగురువులను, అమాత్యులను నీ తల్లులందరిని అడిగినట్లు చెప్పు. వారి క్షేమాన్ని మేం వాంఛిస్తున్నామని చెప్పు. పరాక్రమశాలురైన రామలక్ష్మణులను కూడా అడిగినట్లు చెప్పు"

ఆ తర్వాత కేకయ రాజు తన మనవడికి రెండువేల బంగారునాణాలు, భద్రగజాలు, కంబళ్లు, మృగ చర్మాలు, పదారు వందల గుర్రాలు, తదితరాలూ ఇచ్చి సత్కరించాడు. కేకయప్రభువు తనకు ఇష్టులైన వారిని విశ్వాసపాత్రులు గుణవంతులు యజమానిని ప్రాణం ఒడ్డి రక్షించువారైన యుధాజిత్తు తన మేనల్లునకు ఐరావతపర్వతమున పుట్టిన ఏనుగులు, వేగంగా నడిచే సామర్థ్యంగల అశ్వాలు అంతఃపురంలో చక్కని శిక్షణలో

నేర్పుకలిగిన వేటకుక్కలు బహుమతిగా ఇచ్చాడు. భరతుడు త్వరగా వెళ్ళాల్సిన అవసరం ఉండడంతో ఆ కానుకల్ని స్వీకరింపలేదు. తన స్వప్నం గుర్తుకువచ్చి దూతల తొందరను చూసి భరతుడు దుఃఖభారంతో ఉద్విగ్నుడు అయ్యాడు. కేకయరాజ్యంలోని అంతఃపురానికి వెళ్ళి అక్కడ వారి అమ్మమ్మ నుండి అనుమతిని తీసుకొని శత్రుఘ్నుసహితుడై కేకయరాజు అనుజ్ఞతో అయోధ్యకు బయలుదేరాడు. రథంపై భరతుడు బయలుదేరాడు. ఆయన వెనుక రత్నాలు పొదిగిన శతాధిక రథాలు, ఒంటెలు, వృషభములు, గుర్రాలు, ఏనుగులు చతురంగబలాలు భరతుని అనుసరించి వెళ్ళాయి. భరతుడు తన సోదరుడైన శత్రుఘ్నునితో కలిసి తాతగారి ఇంటి నుంచి బయలుదేరుతుంటే ఇంద్రసభ నుంచి సిద్ధుడు బయలుదేరుతున్నట్లు కనిపించింది.

* * *

భరతుని అయోధ్యాప్రవేశం

సర్గ - 71

భరతుడు అయోధ్యకు తూర్పు ముఖంగా బయలుదేరాడు. 'సుధామ' నదిని దర్శించి ముందుకు సాగాడు. హ్లాదినీనదిని, పశ్చిమంగా ప్రవహించే 'శతద్రూ' (సట్లెజ్) నదిని వారు దాటారు. ఏలాధాననగర సమీపంలో ఈ శతద్రూనది ఉంది. 'అపరపర్వటములు' అనే ప్రదేశం చేరారు. అక్కడనుంచి శిలావహనదిని దాటి శల్యకర్తన నగరం చేరారు. వారు పర్వతాలు నదులు దాటుతూ చైత్రరథవనానికి చేరారు. పశ్చిమంగా ప్రవహించే సరస్వతీ నది గంగానది కలిసే ప్రదేశానికి చేరారు. వీరు మత్స్యదేశాల మీదుగా భారుండనగరానికి వచ్చారు.

కుళింగము అనే పేరుగల యమునానదిని వారు దాటారు. వేగంగా ప్రయాణించడంవల్ల ఎండ వేడమికి తాళలేక భరతుని సైన్యం, జంతువులు అన్నీ అలసిపోయాయి. గుర్రాలను, గజాలను చెట్ల నీడలో వదిలారు. ఆత్మీయులందరూ కాసేపు విశ్రమించి నీటిని త్రాగి అలసట తీర్చుకొని మళ్ళీ బయలుదేరారు.

జన సంచారం లేని దుర్గమారణ్యాలను భరతుడు వాయువేగంతో దాటాడు. 'అంశుధాన'నగరానికి చేరారు. రేవులు లేని గంగానదిని దాటడం కష్టమని వారు భావించారు. అందువల్ల సుప్రసిద్ధరేవుపట్టణమైన ప్రాగ్వడ నగరానికి వారు వెళ్ళారు.

అక్కడినుంచి గంగా నదిని దాటి కుటికోష్ఠికానదిని, ధర్మవర్ధనం అనే గ్రామాన్ని కూడా దాటి భరతాదులు తోరణి గ్రామానికి దక్షిణానగల జంజూ ప్రస్థానానికి చేరారు. అక్కడ రమణీయమైన వరూధము అనే గ్రామాన్ని చూశారు. ఆ ప్రదేశంలోని మనోజ్ఞమైన వనంలో ఒక రాత్రి గడిపారు.

తెల్లారిన తర్వాత బయలుదేరి తూర్పుదిక్కుగా ప్రయాణం సాగించారు. కదంబవృక్షాలు సమృద్ధిగా ఉండే ఉజ్జీహాన నగరం దగ్గరలో వుండే వనాన్ని వారు చూశారు.

కడిమి చెట్ల తోపు దగ్గరనుంచీ మీరు మెల్లగా రండి నేను ముందుగా వెళ్తాను అంటూ భరతుడు రథంపై వేగంగా ముందుకు సాగాడు. భరత శత్రుఘ్నులు 'సర్వతీర్థ' గ్రామంలో రాత్రి సమయంలో ఆగారు. 'ఉత్తానికా' నదిని 'హస్తివృష్టిక' అనుగ్రామాన్ని 'కుటికా'నదిని, లౌహిత్య గ్రామాన్ని, కపీవతి అనే నదిని దాటి వేగంగా ముందుకు వెళ్ళారు.

'ఏకసాల' గ్రామాన్ని, 'స్థాణుమతి' అనే నదిని, 'వినత' గ్రామం దగ్గరలో గల గోమతీనదిని దాటి కళింగ వనానికి చేరారు. అప్పటికి వారి గుర్రలు బాగా డస్సిపోయాయి. వాటి అలసటను గమనించి వాటికి అక్కడ విశ్రాంతినిచ్చారు. రాత్రి కూడా ప్రయాణం సాగించారు. అలా ఏడు దినాలు ఏకధాటిగా పయనించి ఎనిమిదవ రోజుకు భరతాదులు అయోధ్యానగరం దగ్గరకు చేరారు.

తన నగరం ఐన అయోధ్యను భరతుడు చూశాడు. తన సారథితో ఓ సారథీ! చూడు ఇదే మన అయోధ్య. ఇలలోని స్వర్గం. ఇక్కడ వేద పండితుల ఘోష ప్రతిధ్వనిస్తుంటుంది. ధర్మదేవత చిరునవ్వుతో తిరుగాడుతుంటుంది. అవిద్యాపరులు ఎవ్వరూ ఇక్కడ లేరు. చక్కని ఉద్యానవనాలతో అలరారే అయోధ్య నేడు ఎందుకనో వెలవెలబోతున్నట్లు అనిపిస్తోంది. ఇంతకుముందు నగరంలో జన సంచారం ఎక్కువగా ఉండేది. దేశ విదేశాల నుండి వచ్చే యాత్రికులు, వర్తకులతో కిటకిటలాడే అయోధ్య నేడు నిర్మానుష్యంగా సందడి లేకుండా కనిపిస్తోంది.

హుషారుగా షికారు చేసే యువకులు, వారి స్నేహితులు ఉద్యానవనాలలో కిక్కిరిసి ఉండేవారు. ఉద్యాన వనాలన్నీ శోభాయమానంగా ఉండేవి. ఎక్కడ చూసినా మంగళకరంగా కనిపించేది. నేడు పాడుబడినట్లుగా, అరణ్యంలాగా అయోధ్య కానవస్తోంది. దీనికి కారణం ఏమిటో? అని భరతుడు అన్నాడు.

ఈ వనాలలోని పుష్పాలనుండి మకరందం ఆస్వాదించడానికి తుమ్మెదలు కీటకాలు ఝుమ్మని రొద చేస్తూ ఉండేవి. స్త్రీలందరూ బహుచక్కని ఆభరణాలు ధరించి మంగళప్రదంగా తిరుగుతుండేవారు. క్రీడావినోదాలు జరుగుతుండేవి. కోయిల గానమాధుర్యం వినసొంపుగా వినబడుతూ ఉండేది. పూపొదరిండ్లు, దిగుడు బావులు, తటాకాలు అన్నీ కళాత్మకంగా కనిపించి కనుల పండుగగా ఉండేవి. కాని నేడు అవి అన్నీ దుఃఖంలో మునిగిపోయినట్లుగా నిశ్శబ్దాన్ని ఆవరించుకొన్నాయి. ఆకులన్నీ రాలిపోతూ వుండడం చూసి చెట్లన్నీ ఏడుస్తున్నట్లుగా నాకు అనిపిస్తోంది. అయోధ్యలో ఆనందం శూన్యం అయినట్లు అనిపిస్తోంది.

సూర్యోదయం కాబోతుంది. పక్షుల కలకలారావాలు గాని, వేదపండితుల వేదనాదంగాని, క్రీడామృగాల చప్పుళ్ళు కాని ఎక్కడా వినిపించడంలేదు. సువాసనలు మోసుకొచ్చే పవనుడి జాడలేదు. దుఃఖంలో మునిగిపోయి తాపాన్ని భరించలేక వేడి సెగలను నింపుకొన్న వాయువు బరువుగా తాకుతూ వెళ్ళుతున్నాడు. భేరీలను మోగించడంతో వచ్చే ధ్వని, మృదంగ ధ్వని, వీణానాదం మచ్చుకైనా వినిపించడంలేదు.

చూడడానికి అనిష్టమైనవి, దుఃఖకరమైనవి ఐన అశుభసూచనలే నాకు ఇక్కడ కనిపిస్తున్నాయి. అసలే నా మనస్సు నా అధీనంలో లేదు. ఇప్పుడు మరింతగా దుఃఖం తన్నుకు వస్తోంది. కారణం తెలీదు కాని నా మనస్సు వ్యధాభరితం అయిపోతుంది.

ఎంత నిమ్మళించినా హృదయం బరువెక్కిపోతోంది. మనస్సు కీడునే తలుస్తోంది. భయంతో నా ఇంద్రియాలు పట్టుతప్పుతున్నాయి అని భరతుడు సారథితో చెప్పాడు. అంతలో వైజయంతం అనే ద్వారంలో ప్రవేశించారు. అక్కడి భటులు భరతునికి జయధ్వానాలు చేశారు. తనను తీసుకొని వచ్చిన రథసారథితో "ఓ పుణ్యాత్ముడా! వసిష్ఠ మహర్షి నన్ను త్వరగా పిలిపించటంలో కారణం ఏమై ఉంటుంది? ఎన్నడు దైన్యం ఎరుగని నేను ధైర్యాన్ని కోల్పోతున్నాను. ఓ సారథీ! మహారాజులు మరణించినప్పుడు ఏర్పడే పరిస్థితులు నాకు కనబడుతున్నాయి. గృహస్థుల ఇండ్లన్నీ శోభావిహీనం అయి ఉన్నాయి. ఆత్మీయులను దూరం చేసుకొని విషాదంలో మునిగి విరాగులైనవారి వాకిండ్లు వలె ఈ నగర వాసుల వాకిళ్ళు వెలవెలబోతున్నాయి. ఎవరూ వీధులను, వాకిళ్ళను శుభ్రపరచినట్లు లేరు. బలికర్మలు ఆచరించినట్లు లేరు. ధూపసుగంధాలు లేవు. కుటుంబికులందరు అభోజనులై కుంగి కృశించిపోయినట్లున్నారు. వీరందరికి ఏమైంది? వంటావార్పులను కూడా మానివేశారా?

దేవాలయాలు కళాహీనంగా ఉన్నాయి. వాటి ప్రాకారాలకు పూలతోరణాలు లేవు. దేవాలయాలలో జనులెవ్వరూ లేరు. యజ్ఞాలు యాగాలు జరిగినట్లుగా కనిపించడంలేదు. పూలఅంగళ్ళలో పూలు లేవు. వర్తకుల వాణిజ్యం చేస్తున్నట్లు లేదు. ఈ నగరవాసులు మోములన్నీ ఏడ్చి ఏడ్చి కన్నీటి చారికలతో ఉబ్బి ఉన్నాయి. ఎవరినో పొగొట్టుకొని మరెవరికోసమో ఎదురుచూస్తున్నట్లు దీనవదనాలతో ఉన్నారు. వీరి వ్యధకు కారణం ఏమి?"

ఇంద్రుని అమరావతివలె శోభించే అయోధ్య నేడు చీకట్లు ఆవరించి అంధకారంలో మునిగిపోయినట్లుగా కనిపిస్తోంది. దీన్ని చూస్తుంటే నాకు దుఃఖం ఆగడంలేదు. నా అమూల్యవస్తువు ఏదో నా నుంచి దూరం అయిపోయినట్లు నాలో దుఃఖం కట్టలు తెంచుకు వస్తోంది. నా మనస్సు కీడునే శంకిస్తోంది.అని మనసున తలుస్తూ ఉద్వేగంగా పరుగెత్తుకుని వస్తున్న కన్నీటికి కారణం ఏమై ఉంటుందా అని ఉద్విగ్నమనస్సుతో , ఇదివరలో ఎన్నడూ చూడని దృశ్యాలు చూశాను అనుకొన్నాడు. అశుభ సూచనలు అపశకునాలు చూసి భరతుడు ఉత్సాహాన్ని కోల్పోయాడు. గుండె నిబ్బరం కోల్పోతుండగా భరతుడు దీనమనస్కుడై తండ్రి మందిరంలో ప్రవేశించాడు.

* * *

భరతుని పరితాపం

సర్గ - 72

రాజభవనంలో భరతునకు తండ్రి కనిపించలేదు. వెంటనే తన తల్లి ఐన కైకేయి వద్దకు వెళ్ళాడు. ఆమె భరతుని చూడగానే తన బంగారు ఆసనం నుండి దిగ్గున లేచింది. భరతుడు తల్లికి పాదాభివందనం చేశాడు. భరతుని లేవనెత్తి కైక శిరస్సును ముద్దాడింది. అక్కున చేర్చుకొంది. కుశలం అడిగింది.

భరతుని కూర్చోబెట్టుకొని తాతగారి ఇంటినుంచి బయలుదేరి ఎన్నాళ్ళైంది? మీ అమ్మమ్మ తాతలు క్షేమమే కదా. మీ మేనమామ యుధాజిత్తు ఏమంటున్నాడు? అని కైక వివరాలు అడిగింది. రథంపైన తీవ్రమైన వేగంతో

వచ్చావు కదా. మరి నీకు మార్గాయాసం కలుగలేదా? అని అడిగింది. కైక అడిగిన అన్నింటికి భరతుడు వినయంగా జవాబు చెప్పాడు. మేము బయలుదేరి ఏడు రోజులు అయిపోయాయి. నాకు తాత, మేనమామ ఇచ్చిన బహుమానాలన్నీ దారిలో వస్తున్నాయి. దూతల తొందరతో నేను వాటినన్నింటిని మెల్లగా తీసుకొని రమ్మని చెప్పి నేను వేగంగా వచ్చాను. 'అమ్మా! నాకు కొన్ని సందేహాలు కలుగుతున్నాయి. వాటిని తీర్చమ్మా! మీరు విషయాల నన్నింటిని నాకు చెప్పండి. నాకు ఈ మధ్య మనసు విచారంగా ఉందమ్మా' అంటూ అప్రయత్నంగా కన్నీరు పెట్టుకున్నాడు. 'తల్లీ! నా తండ్రి ఎక్కువగా మీ మందిరంలో ఉండేవారు కదా. మీ బంగారు తల్పం ఆయన లేకుండా శూన్యంగా ఉన్నదేమి? నేను తండ్రిని చూడాలని ఇక్కడకు వచ్చాను. మా తండ్రి ఎక్కడ ఉన్నారో?మీరు చెప్పండమ్మా నేను ఆయనను చూచి వస్తాను' అని భరతుడు కైకను అడిగాడు.

రాజ్య లోభమోహంలో కూరుకొన్న కైక అప్రియమైన దశరథుని మరణాన్ని ప్రియంగా భావిస్తూ భరతునితో "కుమారా! భరతా! నీ తండ్రి మహాత్ముడు, యజ్ఞాచరణుడు, పరాక్రమశాలి సత్పురుషుడు. ఉత్తములకు సంప్రాప్తించు గతి నేడు మీ తండ్రికి ప్రాప్తించింది" అని చెప్పింది. ఆ వార్త వినగానే భరతుడు కుప్పగా కూలిపోయాడు. "హా హతోస్మి! ఎంత ఘోరం జరిగిపోయింది. తండ్రీ!నాపై ప్రేమ లేదా? నన్ను విడిచి దూరతీరాలకు వెళ్ళిపోయితివా" అంటూ హాహాకారాలు చేశాడు. చేతులతో నేలను తలను కొట్టుకొంటున్నాడు. పిచ్చిపట్టినవానివలె ఎంతో దుః ఖిం చాడు. పితృమరణవార్త భరతుని కుంగదీసింది. ఆయన తండ్రిని తలచుకొని ఎంతగానో విలపించాడు.

ఈ నా తండ్రి శయ్య శరత్కాలంలోని పూర్ణచంద్రుడు ఉన్న ఆకాశంలాగా వెలిగిపోయేది. అదే నేడు ధీశాలి మహారాజును పొగొట్టుకొని చంద్రుడు లేని ఆకాశంలాగా నిర్వీర్యం అయింది అనుకొంటున్న భరతుణ్ణి అంతులేని దుఃఖం కమ్మివేసింది. ఆయన ముఖాన గుడ్డ కప్పుకొని బిగ్గరగా ఏడ్చాడు.

గజంవలె గంభీరుడైన భరతుడు దిక్కులేని వాడివలె, పిరికివానివలె నేలపై పడి ఏడుస్తున్న వానిని కైక లేవనెత్తింది. "ఓ రాజకుమారా! లెమ్ము. ఓ యశస్వీ! నలుగురిచే గౌరవింపబడే నీవు ఇలా రోదించడం బాగాలేదు. ఓ కుమారా! నీవు సదాచారుడివి. నీ బుద్ధి సూర్యుని కాంతివలె నిశితమైంది. నీవు ఇంతగా విలపించడం భావ్యంగా లేదు'' అని కైక భరతుని అనునయించింది. చాలాసేపు భరతుడు తన దుఃఖాన్ని ఉపశమించుకోలేకపోయారు. కొద్దిసేపటికి తనను తాను నిబాళించుకొని తల్లిని ఇలా అడిగాడు. "అమ్మా! మహారాజు శ్రీరాముని పట్టాభిషేకాన్ని జరిపించడానికో, లేక యజ్ఞం ఏదైనా తలపెట్టి నన్ను పిలిపిస్తున్నాడనుకొన్నాను. సంతోషంగా త్వరగా ఇక్కడకు వచ్చాను. నేను అనుకొన్నది ఒకటి దైవం చేసింది మరొకటి అయింది. అయినా ఇంతలో మహారాజును పీడించిన ఆ వ్యాధి ఏమిటి? అంత్యకాలంలో తండ్రి దగ్గరే ఉండి ఆయనకు ఉపచారాలు చేసిన రామలక్ష్మణులే ధన్యులు కదా!

నేను ఎప్పుడూ నా తండ్రి దగ్గరికి వెళ్ళినా నా శిరస్సును మూర్కొనేవాడు. నా హితం కోరే నా తండ్రి నేడు నన్ను చూడలేదు కదా. నేను ఆయన దగ్గరకు వెళ్ళినా విగతజీవుడైన నా తండ్రి నన్ను గుర్తించలేదు కదా. క్లిష్ట

కార్యాలను అవలీలగా చేసే నా తండ్రి నన్ను ఎప్పుడూ చేతితో తాకుతూ నాకు ధైర్యాన్ని కలిగించేవాడు. అటువంటి నా తండ్రి కరస్పర్శ నాకు ఇక దొరకదు కదా. శ్రీరాముడు నాకు అన్నే కాదు తండ్రి, బంధువు అన్నీ. నా సర్వస్వం ఆయనే! శ్రీరాముడు నాకు తండ్రి తదనంతరం తండ్రివంటివాడు. అటువంటి నా అగ్రజునికి నేను శిరసా ప్రణమిల్లుతాను. ఆ ధర్మాత్ముడే ఇక నాకు పరమగతి.

నా తండ్రి ధర్మపరుడు, నిత్యసత్యవచనుడు, దృఢసంకల్పుడు. పూజ్యుడు అట్టి నా తండ్రి అంతిమ సమయంలో నాకు వినిపించమని ఇచ్చిన దివ్యోపదేశం నేను వినాలనుకొంటున్నాను. అమ్మా! నా తండ్రి నా గురించి ఏమైనా చెప్పారా? దానిని నాకు తెలుపుము" అని భరతుడు కైకను అడిగాడు.

రామవనవాసం భరతునికి ప్రియం కూర్చుతుందనుకొని కైక జరిగిన విషయాలు యథాతథంగా చెప్పడం ప్రారంభించింది. "కుమారా! భరతా! శ్రీరాముడు సతీసోదరులు అనుసరించి రాగా నారవస్త్రాలు ధరించి వనవాసం చేయడానికి దండకారణ్యాలకు వెళ్ళాడు అని చెప్పింది.

ఆ మాటలు విని భరతుడు చలించిపోయాడు. ఇక్ష్వాకువంశంలోని వారందరూ సదాచారులే. ఎప్పుడూ దుష్టవర్తనులు కాలేదు. శ్రీరాముడు ధర్మపరుడు కదా! వనవాసం ఎందుకు చేయాల్సి వచ్చిందో అనుకొని అమ్మా! శ్రీరాముడు ఏదైనా అకృత్యాన్ని చేశాడా? శ్రీరాముడు బ్రాహ్మణరథాన్ని అపహరించాడా? ఏ పాపం చేయనివాణ్ణి దండించాడా? ఆయన మనస్సు పరసతిపై మరలిందా? భ్రూణహత్యచేసినవానిలాగా దండకారణ్యాలకు ఎందుకు వెళ్ళాడు? అమ్మా!" అని భరతుడు ఆక్రోశించాడు.

చపలచిత్తం కలిగిన కైక స్త్రీ స్వభావాన్ని అనుసరించి జరిగింది జరిగినట్లు భరతునితో చెప్పనారంభించింది. "భరతా! శ్రీరాముడు ఏ దోషం చేయలేదు. ఎవరినీ హింసించలేదు. ఏకపత్నీవ్రతుడైన రాముని మనస్సు పర స్త్రీలపై వెళ్ళలేదు. భరతా! మీ తండ్రి శ్రీరాముని పట్టాభిషిక్తుడిని చేయాలనుకొన్నారు. ఆ వార్త నాకు తెలిసింది. లోగడ నాకు మీ తండ్రి రెండు వరాలు ఇచ్చి ఉన్నారు. నేను చాలా తెలివిగా ఆ రెండు వరాలను ఇప్పుడు ఇవ్వమని మీ తండ్రిని అడిగాను. మీ తండ్రి సత్యవచనుడు కాబట్టి ఇచ్చిన మాటను నిలబెట్టుకోడానికి నేను కోరినట్లు పద్నాలుగేండ్లు శ్రీరాముడికి వనవాసం విధించారు. ఆయనతోపాటు సీత లక్ష్మణుడు కూడా వెళ్ళారు. నిన్ను పట్టాభిషిక్తుని చేయమని నా రెండవ వరంగా కోరుకొన్నాను. శ్రీరాముడు అడవులకు వెళ్ళడాన్ని భరించలేని మీ తండ్రి శ్రీరాముని గూర్చి తలుస్తూ స్వర్గస్థుడయ్యాడు. రాజనీతి కోవిదుడవైన ఓ భరతా! నీ కోసమే నేను ఈ సమస్త కార్యాన్ని చేశాను. ఓ పుత్రా! నీవు శోకం వీడి మహారాజ పదవిని చేపట్టు. పరాక్రమశాలి నీ తండ్రికి అంతిమసంస్కారాలు జరిపించు. వెంటనే కోసలరాజ్య సింహాసనాన్ని అధిష్ఠించి నన్ను సంతోషపెట్టు"– అని కైక భరతునితో చెప్పింది.

* * *

భరతుని ఆగ్రహం

సర్గ - 73

భరతుడు తండ్రి మరణించినట్లు, సోదరుడు అడవిపాలైనట్లు తెలుసుకొని చింతాక్రాంతుడయ్యాడు. అందరూ దూరమైన నాకు ఈ రాజ్యంతో పనేముందనుకొన్నాడు. "అమ్మా! మీరు తండ్రి మరణించేటట్లు చేశారు. సోదరుని దూరంగా పంపివేశారు. ఇన్ని అనర్థాలకు కారణమై మీరు నాకు సుఖాలనుకొని దుఃఖాలను తెచ్చిపెట్టారు.

నీవు ఇక్ష్వాకువంశ నాశనానికి కాళరాత్రిలాగా దాపురించావు. నీ సంగతి తెలియక మా తండ్రి నిన్ను తన రాణిగా చేసుకొన్నారు. ఓ పాపాత్మురాలా! నీ అజ్ఞానంతో నన్ను తండ్రి లేనివాణ్ణి చేశావు. కులాన్ని అపవిత్రం చేశావు. సత్యసంధుడు, ధర్మపరుడైన నా తండ్రి నీ కుటిల ప్రయత్నాలకు తన ప్రాణాలు కోల్పోయాడు.

నా తండ్రి నీకు చేసిన అపచారం ఏమి? ఏ ద్రోహం చేశాడని నా సోదరుని అడవులకు పంపావు? వ్యర్థంగా ఈ పాడు పని చేశావు. ఇక పుత్ర వియోగ శోకంతో జీవించే నా పెద్ద తల్లులు నీ దగ్గర ఉండడం కష్టమే. ధర్మాధర్మాలను తెలిసిన నా సోదరుడు నిన్ను ఎప్పుడు అగౌరవపరచలేదుగదా? నా పెత్తల్లిని ఎలా చూసుకొనేవాడో నిన్ను అలానే చూసేవాడుకదా. ఏనాడూ నీపై ప్రేమానురాగాలను తక్కువ చేయలేదు. అట్టివానిని అడవులకు పంపాలన్న ఆలోచన నీకు ఎలా కలిగింది?

శ్రీరాముని కన్నతల్లి దశరథుని పట్టమహిషి నిన్ను ఎప్పుడూ అనాదరించలేదుకదా? నిన్ను తన సోదరివలె అభిమానించేది. ఆమెను పుత్రవియోగ శోకానికి ఎలా గురిచేశావు? సుమిత్ర కూడా నిన్ను ఎప్పుడూ పల్లెత్తుమాట అనలేదుకదా. నీ మంచికోసమే ఆమె మాట్లాడేదికదా. వారిద్దరిని నీవు ఎందుకు బాధపెట్టావు?

సర్వులకు ప్రియం ఒనరించేవాడిని, తండ్రికి ఇష్టమైన వాడిని అడవులకు పంపడమేకాక నారవస్త్రాలను కట్టి తాపసజీవితం గడపాలని ఎలా నిర్దేశించావు? కష్టాలే ఎరుగని రాజకుమారులు కదా. వారికి ఎందుకు ఈ శిక్ష వేశావు? అధర్మపరులకు అన్యాయం చేసినవారిని నగర బహిష్కరణ విధిస్తారు. ఏ దోషం, ఏ నేరమూ చేయనివానికి శిక్ష వేయాలని నీకు ఎలా అనిపించింది?

నాకు శ్రీరామునికిగల బంధం నీకు తెలిసి ఉన్నట్లులేదు. శ్రీరామునిపై నాకున్న ప్రేమానురాగాలు నీకు తెలియవనుకొంటాను. అందుకే ఇంత అనర్థానికి ఒడిగట్టావు. బలశాలులైన రామలక్ష్మణులు లేకుండా నేను ఈ రాజ్యభారాన్ని ఎలా మోయగలనని అనుకొన్నావు? వృద్ధుడు ప్రజాహితుడైన మహారాజు బుద్ధిశాలి శ్రీరామునికి రాజ్యభారాన్ని అప్పగించి నిశ్చింతగా ఉండేవారుగదా.

పుత్రవ్యామోహంతో అనర్థాలకు ఒడిగట్టి రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవాలని ఆరాటపడే నీకు నేను తలవంచను. నీ కోరికను నేను అంగీకరించను" అని భరతుడు కోపంతో అమ్మ అని గౌరవభావాన్ని కూడా పక్కనపెట్టి నిష్కర్షగా చెప్పాడు.

"అమ్మా పాపాలోచనలు కలిగి నా వంశం వారందరూ తిట్టే పనిని ఆచరించావు. కులనాశనానికే నీవు బయలుదేరావు. పుత్రులలో జ్యేష్ఠుడైనవాడు రాజ్యాధికారాన్ని చేపట్టాలని తక్కినవారు అతనికి చేదోడువాదోడుగా ఉండాలని నీకు తెలియదా? అయినా అది ఇక్ష్వాకువంశప్రధానధర్మం అని నీవు ఎరుగవా? ఆ ధర్మాన్ని కాలరాచి అన్యాయంగా అధర్మంగా రాజ్యాన్ని నాకు కట్టబెట్టాలని చూశావా?

నీకు రాజనీతి, రాజధర్మం వీటిపై సరైన అవగాహన లేనట్లు ఉంది. సత్య ధర్మాలను ఆచరించడంలో విశేషప్రతిష్ఠను కలిగిన నా వంశం నేడు అపకీర్తిని నెత్తిన చుట్టుకొంది. నీ వంశంలో కూడా మహానుభావులు ఉన్నారు కదా. వారెవరికీ ఇలాంటి దుష్టబుద్ధి ఉన్నట్లు నాకు తెలియలేదు. మరి నీకు ఇలాంటి పాడుబుద్ధి ఎలా అబ్బింది? ఈనాడు నాకు మేలు చేయబోయి, నా ప్రాణాలకు ముప్పును తెచ్చిపెట్టావు.

నేనిప్పుడు నీకు అప్రియ కార్యాలు చేస్తాను. దోషరహితుడు, సర్వులకు ఇష్టుడైన నా సోదరుడు శ్రీరాముని అడవులనుంచి వెనుకకు పిలుస్తాను. ఆ శ్రీరామునకు నేను మనస్ఫూర్తిగా సేవలుచేస్తాను. ప్రతాపశాలి, తేజోవంతుడైన శ్రీరాముని ఇప్పుడే నేను వెళ్లి వెనక్కి పిలుచుకొని వచ్చి రాజ్యసింహాసనాన్ని అధిష్ఠించమని వేడుకొంటాను" అని భరతుడు తన తల్లిమీద ఆగ్రహంతో తన నిర్ణయాన్ని చెప్పాడు. పితృవియోగాన్ని తట్టుకోలేని భరతుడు సోదరుడు కూడా దూరం అయ్యాడని ఎంతగానో విలపించాడు.

* * *

భరతుడు కైకను దూషించటం

సర్గ - 74

ఏట్టలేని కోపంతో చేయరాని పనులు చేసిన తన తల్లిని భరతుడు నిందించాడు."క్రూరురాలా! దుష్ట చరిత్రగల పాపీ! నీవు నా తండ్రికోసం ఏడువవద్దు నేనుకూడా మరణించానని భావించి ఈ రాజ్యం నుంచి దూరంగా వెళ్లిపోయి జీవితమంతా ఏడుస్తూండు"–అని భరతుడు పరుషంగా కైకను తూలనాడాడు.

"నీ మూలంగా నా తండ్రి ప్రాణాలు అనంతవాయువుల్లో లీనం అయ్యాయి. దగ్గరే వుండి సేవచేయాల్సిన ఆయన పెద్ద కుమారుడు అడవుల పాలయ్యాడు. కులానికే అప్రతిష్ఠ తెచ్చిన నీవు బతికి ఉండకూడదు. నీవలన నా వంశం నాశనం అయింది. నీకు భ్రూణహత్యాపాపం తగులుతుంది. నరకం ప్రాప్తిస్తుంది. భర్తను దూరం చేసుకోవడానికి కూడా వెనుకాడని నిన్ను చూస్తుంటే నాకు భయం వేస్తోంది. నీవు నాకు తల్లి అని పేరు పెట్టుకొన్న భయంకర శత్రువివి. నీ లోభగుణంతో ముల్లోకాలను జయించగల నా తండ్రిని వంచించి ఆయన ప్రాణాలకు ముప్పు తెచ్చిపెట్టావు. నీకు నాతో మాట్లాడే అర్హత లేదు. నీవల్ల దశరథుని భార్యలకు గొప్ప కష్టం వచ్చింది. వారందరి సౌభాగ్యాన్ని కాలరాచిన నికృష్టురాలివి నీవు. నా తల్లులందరిని దుఃఖంలో ముంచిన నీవు మనిషి రూపంలో వున్న బ్రహ్మరాక్షసివి. నీవు ధర్మాత్ముడు, బుద్ధిశాలి ఐన అశ్వపతి కుమార్తెవు కావు. తండ్రి

కులానికి మచ్చ తెచ్చిన రాకాసివి. నీవు చేసిన పాపానికి నేను శిక్ష అనుభవిస్తున్నాను. నాతండ్రి నన్ను అనాథుని చేసి వెళ్లిపోయాడు. నా సోదరులు నన్ను త్యజించారు. నేను ఏ పాపం చేయకుండానే అందరికి అప్రియుడిని అయ్యాను.

పాపబుద్ధి కలదానా! నావల్ల కౌసల్యామాతకు పుత్ర వియోగం కలిగింది. ఆమెకు కీడు కలిగించిన నీకు ఏ గతి పట్టుతుందో నాకు తెలియదు. పరులకు ఉపకారమే కాని అపకారం కలలో కూడా చేయని సుమిత్రను భర్తృహీనురాలిగా చేశావు. ఆమెకు నీవు చేసిన ద్రోహం నిన్ను పట్టి కుడపకమానదు. తల్లి సంస్కారాలను పుణికి పుచ్చుకొని ఆమె పేగు తెంచుకొని కుమారుడు పుడ్తాడు. అట్టి కొడుకు తల్లికి అత్యంత ప్రియుడుగా ఉంటాడు. ఏ తల్లికీ ఇతర బంధువులెవరు తన కొడుకుకు సరిరారు. అంత ప్రేమను కొడుకుపై తల్లి పెంచుకొంటుంది. ఆ విషయం తల్లివైన నీకు తెలియదా?" అని భరతుడు కైకపై నిందలు వేశాడు.

ఒకసారి కామధేనువు భూమిని పరికించి చూసింది. ఆ సమయంలో కామధేనువు పుత్రులైన రెండు వృషభాలు ఎండలో కాడిని మోస్తూ పొలం దున్నుతూ బాగా అలసిపోయి ఇక నడవలేక నిలబడిపోయాయి. వాటిని కామధేనువు చూచి చాలా దుఃఖించింది. వాటి కష్టాన్ని చూసి కామధేనువుకు అశ్రువులు కారిపోయాయి. ఆ సమయంలో దేవేంద్రుడు అక్కడ వెళుతుండడం తటస్థించింది. ఆ కామధేనువు కన్నీరు ఆయనపై పడింది. ఉలిక్కిపడిన దేవేంద్రుడు ఈ కన్నీరు కామధేనువుదని గుర్తించాడు. సర్వులకోసం పాటుపడే ఈ కామధేనువును బాధపెట్టింది ఎవరా? అని ఆలోచించాడు.

వెంటనే ఆ గోమాత దగ్గరకు వెళ్లి "పూజనీయురాలా! నిన్ను బాధపెట్టినవారెవరు? ఏ దేవతలైనా నిన్ను క్షోభపెట్టారా? నీ కన్నీటికి కారణం ఏమి?" అని అడిగాడు? ఆ ధేనువు "అయ్యా! దేవతల రాజా! మీ దయవల్ల నన్ను ఎవరూ బాధపెట్టలేదు. నాకు అనేక మంది పుత్రులున్నారు. కాని నేడు నా కుమారులలో ఇద్దరు గ్రీష్మతాపానికి ఒడిలిపోతూ దయలేని రైతు చేతిలో కష్టాలు అనుభవిస్తున్నారు. వారి దీనస్థితిని చూచి నేను కన్నీరు కార్చాను అంది. నా కడుపున పుట్టిన వీరిని ఆదుకొనేవారు ఎవరూ లేరు. వీరి కష్టం వర్ణనాతీతం" అని చెప్పింది. వేలకొలది పుత్రులున్నా అందరిలో ఎవరు బాధపడ్డా తట్టుకోలేని అమ్మతనాన్ని చూచి దేవేంద్రుడు అబ్బురపడ్డాడు. తల్లికి తనయుడు తప్ప వేరెవరూ అక్కరలేదుకదా అనుకొన్నాడు. ధర్మపరిరక్షణ చేస్తూ అందరికీ ఆనందాన్ని కూర్చాలనే కామధేనువు ఎంత గొప్పదో కదా అని అనుకొన్నాడు.

మరి ఒక్కగానొక్కడైన కొడుకుగల కౌసల్యకు నీవు ఇలాంటి ద్రోహం చేశావే? వున్న ఒక్క కొడుకును దూరం చేశావు. ఆమె ఎంతగా కుమిలిపోతుందో? నీవు తల్లివై ఉండి ఆలోచించలేకపోయావు! అధర్మ మార్గంలో నీ పుత్రవాత్సల్యం చాటుకోవాలని చూశావు. పుత్రశోకాన్ని కలిగించిన నీవు ఈ లోకంలోనే కాదు పరలోకంలో కూడా అపకీర్తినే పొందుతావు.

నేను నా జ్యేష్ఠసోదరునికి రాజ్యాన్ని అప్పగించి తండ్రికి ఉదకక్రియలు చేసి కౌసల్య దగ్గరకు శ్రీరాముని చేర్చి నా కళంకాన్ని రూపుమాపుకొంటాను. త్రికరణశుద్ధిగా చెబుతున్నాను. నేను అడవులకు వెళ్లి శ్రీరాముని తీసుకొని వచ్చి రాజ్యాన్ని అప్పగించి నేడు తాపసుడినై అడవులకు వెళ్తాను.

నీ దుష్టప్రవర్తనకు నోరు పెగలని ప్రజలు నన్ను చూసి కంటతడి పెట్టుకొంటున్నారు శ్రీరాముని పోగొట్టుకున్నవారు తపించి పోతున్నారు. ఇందరికి బాధను కలిగించే పాపభారాన్ని నేను మోయలేను. ఇన్ని అనర్థాలకు ఒడిగట్టిన నీవు దండకారణ్యాలకు నీకై నీవు వెళ్లడం మంచిది. లేక నీవు ప్రాణాలను తీసుకో. దేహ త్యాగం చేయడంకంటే ఇంకో గతి నీకులేదు. శ్రీరాముని పిలుచుకొని వచ్చి రాజ్యాన్ని అప్పగించి నా పాపాన్ని నేను కడిగివేసుకొంటాను. కృతార్థుడిని అవుతాను."

భరతుడు అంతులేని దుఃఖాన్ని భరిస్తూ కైకను దూషించి తాను చేయాల్సిన కార్యాలు చెప్పి, శోకాన్ని భరించలేక నేలపై పడి బిగ్గరగా ఏడ్వసాగాడు. అప్పుడు భరతుని వస్త్రాలు, ఆభరణాలన్నీ చెల్లాచెదురుగా పడిపోయాయి. ఆయన కేశసంపద చెదిరిపోయింది. అప్పుడు భరతుడు ఉత్సవాలు ముగిసి దించివేసిన ఇంద్రధ్వజం లాగా కనిపించాడు.

* * *

భరతుని నిజాయితీ

సర్గ - 75

భరతుడు అయోధ్యకు వచ్చాడని తెలుసుకొన్న అమాత్యులు సుమంత్రుడు ప్రముఖులు అందరూ భరతుని దగ్గరకు వచ్చారు. భరతుడు శోకం ఎక్కువై ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి పడిపోయాడు. కైక కన్నీరు కారుస్తూ దీనవదనంతో కూర్చుని ఉంది. చాలాసేపటికి భరతునికి తెలివి వచ్చింది. భరతుడు కన్నులు తెరచి చూశాడు. అతని ఎదురుగా మంత్రులు నిలబడి ఉన్నారు. వారినందరినీ చూడగానే భరతుడు గొల్లున ఏడ్చాడు. "అయ్యలారా! నేను ఏ పాపం చేయలేదు. నా తల్లి నేనాడు రాజ్యం కావాలని నేను అడగలేదు. నా తండ్రి రామునికిగాని, నాకుగాని పట్టాభిషేకం చేయబోయారని కూడా నాకు తెలియదు. శ్రీరాముని వనవాసం గురించి నాకు తెలియనే తెలియదు. నేను మా అమ్మతో కలిసి ఏ కుట్రలు పన్నలేదు. నేడు నే చేసింది ఏమీ లేకపోయినా నా ఆత్మీయుల్ని పోగొట్టుకొన్న వాడినయ్యాను". అంటూ భోరున విలపించాడు. శ్రీరాముని అనుసరించి సీత, లక్ష్మణులు వెళ్లిన సంగతి నాకు తెలియలేదు అని భరతుడు వాపోయాడు.

గగ్గోలు పరిస్థితి అంతా కౌసల్య భవనానికి వినబడింది. క్రూరాత్మురాలైన కైక కొడుకు భరతుడు వచ్చినట్లు ఉన్నాడు. అతడు ధర్మమెరిగినవాడు. దూరదృష్టి ఉన్నవాడు. భరతుని నేను ఒక్కసారి చూస్తాను అని కౌసల్య సుమిత్రతో చెప్పింది. భరతుని చూడడానికని కౌసల్య లేచి నడవబోయింది. భర్త మరణం, పుత్రుని వియోగంతో ఆమె శరీరం కుంగి కృశించిపోయింది. ఆమె దుఃఖాన్ని భరించలేక ఏడ్చిఏడ్చి అశక్తురాలైపోయింది. అటువంటి కౌసల్య లేవగానే కిందపడి స్పృహతప్పిపోయింది.

భరతుడు శత్రుఘ్నుడు పెద్ద తల్లులను చూడాలనుకొన్నారు. మంత్రులందరిని వెంటబెట్టుకొని కౌసల్య భవనానికి చేరారు. ఉదారస్వభావురాలు అందరినీ సమానంగా ఆదరించే కౌసల్యను భరతాదులు చూశారు. ఆమెను చూడగానే వారి కన్నులు ధారాపాతంగా కన్నీటిని స్రవించాయి. కౌసల్య దగ్గరకు పరుగునవెళ్లి కౌగిలించుకుని గట్టిగా ఏడ్వసాగారు. కౌసల్యాసుమిత్రలు, భరతశత్రుఘ్నులను చూచి గట్టిగా రోదించారు. కొద్దిసేపటికి వారు దుఃఖాన్ని దిగమింగుకుంటూ మాట్లాడసాగారు.

రామజనని ఐన కౌసల్య భరతుని చూచి, "చూచావా భరతా? క్రూరురాలైన నీ తల్లి ఎంతటి అనర్థాన్ని తెచ్చిపెట్టిందో? శ్రీరాముని అడవులకు పంపింది. నీకోసం రాజ్యాధికారాన్ని సంపాదించింది. శ్రీరాముని నారచీరలను ధరింపచేసి అడవులకు పంపడంవల్ల కైకకు ఒరిగిందేమిటో? నాకు అర్థం కావడంలేదు. శ్రీరాముడు గొప్ప అదృష్టవంతుడు. అతడున్నచోటుకే నన్ను పంపివేసి పుణ్యం కట్టుకోమని కైకకు చెప్పు. లేదా అగ్నిహోత్రాన్ని చేతపట్టుకొని నేనూ సుమిత్ర రాముడున్న చోటుకు వెదుకుతూ వెళ్లిపోతాము. అలాకాకుంటే నీకు ఇష్టమైతే నన్ను సుమిత్రను శ్రీరాముని దగ్గరకు తీసుకొని వెళ్లు భరతా!" అంటూ దీనంగా అడిగింది.

అంతలోనే కళ్ళనుండి కన్నీరు స్రవిస్తున్నా "శత్రుభయం లేని రాజ్యం, సుభిక్షమైనదాన్ని, చతురంగ బలాలు సమృద్ధిగా ఉన్న రాజ్యాన్ని నీకు మీ అమ్మ అప్పచెప్పిందికదా. ఇక ఈ రాజ్యాన్ని మీరే ఏలుకోండి" అంటూ కఠినంగా కౌసల్య భరతునితో మాట్లాడింది. అవి విన్న భరతునికి పుండుమీద కారం చల్లినట్లు అయింది. ఎంతటి అపనిందకు గురయ్యానో అని విలపించాడు. చేయని తప్పుకు పరితపిస్తున్నాను. అజ్ఞానంతో మా అమ్మ చేసిన ఘోరకార్యానికి ఫలితం నేను అనుభవిస్తున్నాను అనుకుంటూ "అమ్మా! కౌసల్యాదేవీ! తల్లీ" అని అంటూ ఆమె పాదాలపై పడి బిగ్గరగా ఏడుస్తూ తెలివితప్పి స్పృహ కోల్పోయాడు. కొద్దిసేపటికి తెలివిపొంది కౌసల్య చేతిని పట్టుకొని భరతుడు దీనంగా ఇలా చెప్పాడు–

"అమ్మా! నా సంగతి మీకు తెలియనిది కాదు. నేను ఏనాడు రాజ్యాన్ని కోరలేదు. నాకు శ్రీరామునిపై ఎంత ప్రేమ ఉన్నదో నీకూ తెలుసు. కైక చేసిన ఘోరం నాకు తెలీదు. నేను నిరపరాధిని. నీవు నన్ను ఎందుకు నిందిస్తున్నావు అమ్మా? సజ్జన శ్రేష్ఠుడైన శ్రీరాముడు నాకేకాదు సర్వులకు ఇష్టుడు. శ్రీరాముని అడవులకు పంపాలన్న ఆలోచించిన వారి బుద్ధి పాపాలతో కూడినది. నేను కలలో కూడా రాజ్యాన్ని వాంఛించలేదు. శ్రీరాముని అడవులకు పంపడంలో నా ప్రమేయం ఇసుమంత కూడా లేదు.

అమ్మా! నాకు కైక పన్నిన పన్నాగంలో భాగం ఉంటే గనక పాపాత్ముడికి సేవ చేయాల్సిన గతి పట్టుతుంది. సూర్యుని ఎదురుగా కాలకృత్యాలు తీర్చుకొన్న వారికి పట్టే పాపం నాకూ కలుగుతుంది. నిద్రిస్తున్న ఆవును తన్నిన పాపం తగులుతుంది. పని చేయించుకొని డబ్బు ఇవ్వని యజమానికి పట్టే దుర్గతి నాకు కలుగుతుంది. ప్రజలను కన్నబిడ్డల్లాగా చూసుకొనే రాజుకు ద్రోహం చేసినవారికి పట్టిన గతి నాకూ పడుతుంది" అని భరతుడు నానావిధాలైన ఒట్లు పెట్టుకుంటూ తన నిరపరాధమును నిజాయితీని కౌసల్యకు వివరించాడు. "అమ్మా! అంతేకాదు అన్నను

అడవికి పంపి రాజ్యాన్ని నేను అనుభవించాలని నేను అనుకొనివుంటే ఋత్విజులచే యజ్ఞ కార్యాలు చేయించుకున్న తర్వాత వారికి ఇవ్వవలసిన పైకం ఇవ్వని రాజుకు పట్టే దుర్గతి నాకు తప్పక తగిలి తీరుతుంది.

అమ్మా! చతురంగ బలాలు ఉంచుకొని యుద్ధంలో వెన్నుచూపిన వీరుని గతి నాకు పట్టుతుంది. వాత్సల్యంతో గురువు శాస్త్రార్థాలన్నీ విప్పి చెప్పినా అశ్రద్ధతో మరిచిపోయే శిష్యునికి చుట్టుకొనే పాపం నాకు చుట్టుకొంటుంది. తల్లీ! నన్ను నమ్ము. నేను ఎట్టి అపచారాన్ని చేయలేదు. అమ్మా! బలిష్టమైన బాహువులు వున్న శ్రీరాముడు అయోధ్యా రాజ్యలక్ష్మిని వరించి సీతతో కూడి రాజసింహాసనారూఢుడైతే చూసేవారు భాగ్యవంతులని చూడనివారు నిర్భాగ్యజీవులని నేను అనుకొంటున్నాను. అలాకాకుండా అన్నను అడవికి పంపే దుర్మార్గుడిని నేనే అయితే ఇష్టమైన ఆహార పదార్థాలను దేవునికి అర్పించకుండా తినే మూర్ఖునికి పట్టే గతి, బుద్ధిహీనతతో గురువును అవమానించడంవల్ల కలిగే పాపం నన్ను చుట్టుముట్టుతాయి. మిత్రద్రోహానికి ఒడిగట్టేవాడికి పట్టే దుర్గతి నాకూ పడుతుంది.

మేలు చేసినవారికి కీడు చేసే దుర్మార్గునికి, సజ్జనులచే వెలివేయబడినవానికి, రహస్యాన్ని దాచుకోలేక పదిమందికి చెప్పినవానికి, వ్యామోహకారణంగా తప్పు చేయడానికి సిగ్గుపడనివాడికిని, లోకులందరితో ద్వేషించబడేవారికి పట్టే దుర్గతి నాకు పడుతుంది.

అమ్మా! శ్రీరాముని విషయంలో నా జోక్యం ఏమాత్రం ఉన్నా తన చుట్టూ బంధువులను, స్నేహితులను ఉంచుకొని వారికి పెట్టకుండా తినే దుర్మార్గునికి పట్టే దుర్గతి, మనిషిగా పుట్టి తాను చేయవలసిన కార్యాలు చేయకుండా భార్యను పొందకుండా సంతానహీనుడిగా మృతిచెందే అభాగ్యునికి పట్టే గతే నాకు కలుగుతుంది. తన ధర్మపత్ని వల్ల సంతతిని పొందినవాడై అర్ధాయుస్సుతో చావును కొనితెచ్చుకొనేవారి గతే నాకు చుట్టుకొంటుంది. అంతేకాదు రాజు స్త్రీలను, బాలలను, వృద్ధులను చంపినందువల్ల పొందే దుర్గతే నాకు పడుతుంది. విశ్వాసపాత్రులైన సేవకులను గుర్తించకుండా వారిని పనిలోంచి తీసివేసినందుకు పొందే పాపం నన్ను చుట్టుకొంటుంది.

నిషిద్ధవస్తువులను అమ్మకం సాగించినవానికి పట్టే దుర్గతి, పుర్రె చేతిలో పట్టుకొని ఉన్మాదిలాగా బిచ్చమెత్తుకొనే వానికి పట్టే గతి నాకు లభిస్తాయి. అమ్మా! కామక్రోధలోభ మోహ మద మాత్సర్యాలచే వచించేవానికి పట్టే గతి నాకు పడుతుంది. మద్యపానం, స్త్రీ సంగమం, ద్యూతక్రీడలవల్ల కలిగే పాపం నన్ను చేరుతుంది. అపాత్రదానం చేసేవారికి చుట్టుకొనే పాపం నన్ను చుట్టుకొంటుంది.

అక్రమార్జనద్వారా సంపాదించే ధనమంతా ఎలా నాశనమవుతుందో అలానే నేను పాపకార్యానికి చేయూతనిచ్చి ఉన్నట్లయితే నా పూర్వజన్మ పుణ్యం నశించిపోయి నాకు నరకప్రాప్తి కలుగుతుంది. అమ్మా, అమంగళకరంగా ఉభయ సంధ్యాసమయాలలో నిద్రపోయే సోమరికివల్లే నాకు సర్వపాపాలు అంటుకొంటాయి. పరుల ఇండ్లకు నిప్పుపెట్టేవారికి తగిలే పాపం నాకు కూడా తగులుతుంది.

అమ్మా, దైవదూషణ, గురుద్రోహం చేసినవారికి కలిగే పాపాలు నాకు చేరతాయి. శ్రాద్ధకర్మలు చేయనివాడికి కలిగే పాపం నాకు తగిలి నేను పాపకూపంలో పడిపోతాను. సజ్జనులను సేవించని వారికి, సాధుసాంగత్యాన్ని దూరం చేసుకొనేవారికి ఉత్తములను పొగడని వారికి తగిలే పాపాలు అన్నీ నాకు సంక్రమిస్తాయి. అధర్మపరులకు పట్టే దుర్గతి నాకు ప్రాప్తిస్తుంది.

అమ్మా! పూర్వజన్మలో పాపం చేసుకొని ఉంటే వారు ఈ జన్మలో దరిద్రులై పుడతారు. వ్యాధిపీడితులౌతారు. పెక్కుమంది పిల్లలు ఉండి వారిని పోషించలేక బాధలు అనుభవిస్తారు. వారి పాపం వారు జన్మించి వుండగానే వారిని బాధపెడ్తుంది. అలానే నాకు శ్రీరాముని విషయంలో నా జోక్యం ఉంటే నరకప్రాప్తి కలుగుతుంది. లోభగుణంతో ఇతరులను బాధపెట్టేవారికి కలిగే పాపాలు నన్ను చుట్టుముట్టుతాయి. చాడీలు చెప్పేవారికి పవిత్రత కోల్పోయి రాజు నాకు ఏ శిక్ష విధించునోయని భయపడేవానికి, అధర్మంగా ప్రవర్తించి పరులను వంచించేవారికి ప్రాప్తించు పాపాలన్నీ నాకును సంప్రాప్తమౌతాయి.

పతివ్రత ఐన స్త్రీని బాధపెట్టే భర్తకు కలిగే పాపం, పరస్త్రీ వ్యామోహం కలిగినవారికి తగిలే పాపం, ఆడి తప్పినవాడికి పట్టిపీడించే పాపం లాంటివన్నీ నాకూ తగులుతాయి. సంతానహీనుడైనవానికి పట్టే దుర్గతి నాకు పడుతుంది. ఇతరులను చంపువారికి, విషాహారాన్ని పెట్టేవారికి, త్రాగే నీటిని మురికి చేసేవారికి పాపాలు చుట్టుకొంటాయి. అవన్నీ నాకు తగిలి తీరతాయి.

శ్రీరాముని విషయంలో నేను పాపం చేసి ఉంటే గోవు దగ్గర పాలు తాగనీయకుండా దూడను వేరుచేసినవానికి పట్టే దుర్గతి పడుతుంది. నీటిని తనవద్ద ఉంచుకొని దప్పిక ఉన్నవారికి నీరు అందించనివారికి, పక్షపాతబుద్ధితో వ్యవహరించేవాడికి కలిగే దుర్గతి నాకు కలుగుతుంది."

ధర్మాత్ముడైన భరతుడు భర్తను పోగొట్టుకొని కొడుకును దూరం చేసుకొని దుఃఖంలో కూరుకుపోయి ఉన్న కౌసల్యను ఎన్నో విధాలుగా ఊరడించాడు. ఒట్లమీద ఒట్లు పెట్టుకుంటూ పితృవియోగాన్ని భరించలేని భరతుడు ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లిపోయాడు. స్పృహ తప్పిపోయిన భరతుని సేదతీరుస్తూ కౌసల్య, "నాయనా! భరతా! నీ మాటలతో నాకు కొంత ఊరట కలిగింది. నీ శపథాల పరంపరను విని నీ నిజాయితీని, నీ నిరపరాధత్వాన్ని నేను గుర్తించాను. కుమారా! నా అదృష్టంకొద్దీ నీవు అధర్మమార్గాన్ని ఎంచుకోలేదు. నీవుకూడా నీ వంశంవారివలె సత్యవ్రతుడవు. అందుకని నీవు సత్పురుషులలో శ్రేష్ఠుడవు అవుతావు. అందులో ఎట్టి సందేహంలేదు. కాని నిన్ను చూస్తున్నకొలదీ నా దుఃఖం పెరుగుతోంది" అని భరతుని దగ్గరగా తీసుకొని గట్టిగా కౌసల్య విలపించింది. మహాత్ముడైన భరతుడు కౌసల్యను సుమిత్రలను చూచి వారి దుర్గతులను తలచుకొని ఏడ్చాడు. తన కన్నతండ్రిని పోగొట్టుకొన్నాననే చింత భరతుని పట్టి పీడించింది. అలా భరతుడు నేలపై పడి ఏడ్చిఏడ్చి నిద్రలోకి జారుకున్నాడు. మెలకువలో ఏడుస్తూ నిద్రలో జరిగిన సంగతులు తలుస్తూ రాత్రి అంతా గడిపాడు.

* * *

దశరథుని అంతిమయాత్ర

సర్గ - 76

కైకేయి సుతుడు భరతుడు శోకంలో మునిగిపోయి దుఃఖిస్తున్నాడు. విధిని మరచిపోయి తన తండ్రినే తలుస్తూ కాలం గడుపుతున్నాడు. అట్టి మహావీరుని కర్తవ్యపరాయణుని చేయాలనుకొని వసిష్ఠుడు భరతుని దగ్గరకు వచ్చాడు. "ఓ రాజకుమారా! ఇది శోకించవలసిన సమయం కాదు. నీవు నీ విధ్యుక్తధర్మాన్ని ఆచరించాలి. నీ తండ్రికి శ్రాద్ధ కర్మలు చేసి ఉత్తమ గతులను కలిగించాలి. అందువల్ల నీవు దుఃఖాన్ని వీడి మనసును కుదుటపరచుకో" అని చెప్పాడు. కులగురువు వంశపురోహితుని మాటలు భరతునిలో కదలికను తెచ్చాయి. తెచ్చిపెట్టుకొన్న ధైర్యంతో భరతుడు లేచి కూర్చున్నాడు. తాను చేయవలసిన విధులను జ్ఞప్తి చేసుకొన్నాడు. మనస్సును తన అధీనంలోకి తెచ్చుకున్నాడు. వెంటనే కులగురువైన వసిష్ఠుని ఆదేశాన్ని నిర్వర్తించడానికి పూనుకొన్నాడు. దశరథుని శరీరం శిథిలం కాకుండా వుండడానికి తైలంలో పెట్టినందువల్ల ఆయన ముఖం తెల్లగా పాలిపోయింది. ఆ శవాన్ని నూనెలో నుంచి తీసి భూమిపై పెట్టారు. స్నానాదికాలు చేయించారు. రత్నాలు పొదిగిన పాడెమీద పడుకోబెట్టారు. చూచేవారికి దశరథుడు నిద్రపోతున్నట్లుగా కనిపించాడు. తేజశ్శాలి అయిన తండ్రి నేడు అచేతనంగా పడి ఉండడం చూసి భరతాదులు తట్టుకోలేక విలపించారు. భరతుడు "తండ్రీ నేను మేనమామ ఇంటినుంచి రాకపూర్వమే అన్నను అడవులకు ఎందుకు పంపివేశారు? మీరు ఎందుకు స్వర్గానికి పయనించారు?" అంటూ రోదించాడు. తండ్రీ, అన్నా ఇద్దరూ లేక నేను నేడు అనాథనైతిని. నేడు నా క్షేమ సమాచారాలు ఎవరు అడుగుతారు? ఓ పురుష పుంగవా! మీరు రాజ్యాన్ని వదిలి మమ్ము వీడి తేలికగా స్వర్గానికి వెళ్ళారు. కాని మీరు లేని ఈ రాజ్యం అనాథ అయింది. మేమందరం దిక్కుతోచని స్థితిలోకి జారిపోయాము. దుఃఖంలో కూరుకుపోతున్న భరతునికి వసిష్ఠుడు మళ్లీ ధైర్యాన్ని కలిగించాడు. 'భరతా, నీ తండ్రికి చేయాల్సిన విధిని నిర్వర్తించు' అని చెప్పాడు. భరతుడు కళ్లు తుడుచుకుంటూ ఋత్విజులకు సైగచేసాడు. వారందరూ అగ్నిశాలనుంచి గార్హపత్య అగ్నులను తీసుకొని వచ్చారు. యథావిధిగా హోమాలు జరిపించారు. దశరథుని శరీరాన్ని శ్మశానానికి తీసుకొని వెళ్లారు. వారందరి మనస్సులు గడ్డకట్టుకొని పోయాయి. వారి కండ్లు కన్నీటిని ధారాపాతంగా వర్షించసాగాయి. పురజనులందరూ శవయాత్రలో పాల్గొన్నారు. పూలు జల్లుతూ తమ ప్రియతమ నాయకునికి అంతిమ వీడ్కోలు ఇచ్చారు. చితిని ఏర్పరచి చందనపు చెక్కలు, అగరు ముక్కలు, గుగ్గుల పుల్లలు, సరళ, పద్మక, దేవదారు కర్రలు పేర్చారు. రకరకాలైన సుగంధద్రవ్యాలు చల్లారు. దశరథుని శరీరాన్ని చితిపై చేర్చారు. విప్రులు వేదమంత్రాలు పఠిస్తున్నారు. ఉద్గాతలు సామగానం చేస్తున్నారు. అప్పుడు భరతుడు చితికి నిప్పు అంటించాడు. కౌసల్య సుమిత్ర కైకేయిలు చితికి ప్రదక్షిణ నమస్కారాలు చేశారు. ఆ సమయంలో అక్కడి స్త్రీల రోదనం క్రౌంచపక్షుల అరుపువలె ఉండింది. తర్వాత వారంతా సరయూ నదికి చేరారు. రాజపత్నులు మంత్రులు పురోహితులు భరతునితో కూడి తర్పణాలు విడిచారు. వారందరూ అంతఃపురానికి చేరారు. నేలపై పడుకొంటూ నియమనిష్ఠలతో దశరథునికి పదిరోజులవరకు అంత్యక్రియలు చేశారు.

* * *

భరతాదుల ఆవేదన

సర్గ - 77

అంత్యక్రియలు పది దినాలు చేశారు. పదకొండున భరతుడు శుచి అయ్యాడు. పన్నెండో దినం షోడశం సపిండీకరణం మొదలగు శ్రాద్ధకర్మలన్నీ జరిపించాడు.

భరతుడు విప్రులకు రత్నాలు, ధనం, పుష్కలమైన భోజనం, విలువైన వస్త్రాలు, అనేక విధాలైన శ్రేష్ఠమగు వస్తువులు దానం చేశాడు. దశరథునికి ఉత్తమ గతి కలగాలని తెల్లని ఉన్నిశాలువలను, వేలకొలది గోవులను, దాస దాసీజనాన్ని, వస్తువాహనాలను గృహాలను దానం చేశాడు.

పదమూడో రోజు భరతుడు తండ్రి వియోగాన్ని గుర్తుకు తెచ్చుకొని విలపించాడు. అస్థిసంచయనార్థం శ్మశానానికి వెళ్ళి చితి ప్రదేశాన్ని చూచి ఎంతగానో రోదించాడు. తండ్రీ! అన్నను అడవులకు పంపితివి. నన్ను కౌసల్యాదులను శత్రుఘ్నుడివి అందరిని ఒంటరివాళ్ళను చేసి నీవేమో స్వర్గస్థుడవు అయ్యావు- అంటూ ఆ బూడిదను చెల్లాచెదరైన ఎముకలను చూసి తట్టుకోలేక పెద్దగా ఏడుస్తూ నేలపై పడిపోయాడు. ఇంద్రుని ధ్వజము పైకి లేపబోగా జారి క్రిందపడినట్లుగా భరతుడు దుఃఖాన్ని భరించుకోలేక నేలపై కూలిపోయాడు. ఎంతగానో విలపిస్తున్నాడు.

పుణ్యరాశి తరిగిపోయి నేలకు పడిన యయాతి దగ్గరకు అతని దౌహిత్రుడైన అష్టకుడు, రాజర్షులందరూ చేరినట్లుగా నేలకు ఒరిగిపోయిన భరతుని దగ్గరకు అతని అమాత్యులందరూ వచ్చారు. శత్రుఘ్నుడు భరతుని ఆవేదనను పితృవియోగాన్ని సోదరుల వియోగాన్ని చూడలేక మూర్ఛితుడయ్యాడు. తండ్రి ఆలనా పాలనా గుర్తుకు తెచ్చుకొని భరతాదులు గట్టిగా తండ్రీ! అంటూ ఏడ్వసాగాడు. అసలు దీనికంతా కారణం కైక మంథరలే. వీరిని అంతమొందించడం అసాధ్యం. వీరివలననే కరుణాంతరంగుడైన మన తండ్రి మనలను వీడి వెళ్ళిపోయాడు అని దుఃఖించారు.

మాకు ఏ కష్టం కలుగకుండా చూచుకొనే మా తండ్రి మాచే కొసరి కొసరి వడ్డించి ఆహారాన్ని తినిపించేవాడు. మా కిష్టమైన వస్త్రాలను ధరింపచేసేవాడు. ఇప్పుడు మాకు అవన్నీ చేసే తండ్రి దొరకడు గదా! అని బాధపడ్డాడు. అసలు మహాత్ముడు సర్వజ్ఞుడు అయిన మహారాజు దివంగతుడు అయితే భూమి బద్దలు అయిపోలేదేమి? అన్నారు. అన్న వనాలకు వెళ్ళి దూరం అయ్యాడు. తండ్రి స్వర్గానికి వెళ్లి శాశ్వతంగా దూరం అయ్యాడు. ఇక నేను ఎవరికోసం, ఎందుకోసం జీవించాలి? ఇపుడే అగ్ని ప్రవేశం చేస్తాను. నాకు జీవితంపై ఆశ లేదు, అని భరతుడు అన్నాడు. భరతశత్రుఘ్నులు దుఃఖంలో మునిగిపోయి నేలపై పడి వృషభాల్లా ఏడ్వసాగారు. వారిని చూస్తున్న అందరూ దుఃఖానికి లోనయ్యారు. భరతా! నీ తండ్రి అస్థిసంచయనం చేయాల్సి ఉంది. అందుకు ఆలస్యం చేస్తున్నావు. ఆకలి దప్పులు జరామరణాలు శోకమోహాలు పుట్టిన ప్రతి ప్రాణికి ఉంటాయి. ఇవి అనివార్యమైన విషయాలు. వీటినుంచి తప్పించుకొనే వారు ఎవరూ లేరు అని వసిష్ఠుడు భరతాదులకు సత్యాన్ని తెలిపాడు.

సుమంత్రుడు కూడా భరతాదులకు వారించ వీలులేని విషయాలు చెప్పి వారిలో ధైర్యాన్ని కూడగట్టాడు. విధి నిర్వహణకు ఉద్యుక్తుల్ని చేశాడు.

సుప్రసిద్ధులైన భరతశత్రుఘ్నులు నెమ్మదిగా సత్యాన్ని అర్థం చేసుకొంటూ నెమ్మదిగా ఊరడిల్లారు. ఎండవానలకు తట్టుకొనే ధీమంతుల్లాగా వారు శోభిస్తున్నారు. కాని వారి ముఖం తడిఆరిపోయి ఉంది. ఏడ్చి ఏడ్చి కన్నులు ఎర్రబారాయి. పెదవులు అదురుతున్నాయి. వారి కంఠం గద్గదమై ఉంది. వారి నోటినుంచి దీనంగా మాటలు వస్తున్నాయి. వారు విరాగుల్లా విరక్తిని పెంచుకొన్నారు. అట్టి భరతాదులను పురోహితులు అస్థిసంచయనాది కార్యాలు చేయడానికి తొందర పెట్టారు.

* * *

మంథరపై శత్రుఘ్నుని రోషం

సర్గ - 78

భరతుడు పితృవియోగదుఃఖం నుండి తేరుకోలేకపోయాడు. ఏ విధంగా రాముణ్ణి వెనక్కు తీసుకొని రావాలో ఆలోచిస్తూ ఉన్నాడు. ఆ సమయంలో శత్రుఘ్నుడు భరతునితో ఇలా చెప్పాడు.

"అన్నా!సకల ప్రాణుల ఆపదలను తొలగించే శ్రీరాముడు మనలను ఆదుకొనడేమోనన్న శంక మీకు ఎందుకు కలుగుతోంది? సకలసద్గుణరాశి ఐన శ్రీరాముని ఒక అబల అడవికి పంపివేయటం నిజంగా ఆశ్చర్యంగా ఉంది. అయినా వీరాగ్రేసరుడైన లక్ష్మణుడు ఇక్కడనే ఉన్నాడు గదా. అతడు ముందునుంచి దశరథుని నిగ్రహించి ఉంటే బాగుండేది. కామపరవశుడైన రాజు నిర్ణయాలను ఎదురించకుండా తలవంచి ఆమోదం ఎందుకు తెల్పారో నాకు అర్థం కాకుండా ఉంది. ఒకరి చేతిలో కీలుబొమ్మై నిర్ణయాలను తీసుకొనే రాజును లక్ష్మణుడు ముందుగానే గుర్తించి న్యాయాన్యాయాలను పరీక్షించి ఆట కట్టించి ఉండవచ్చుగదా."

ఇలా మాట్లాడుతూ ఉండగానే సొమ్ములన్నీ ధరించి పట్టువస్త్రాలను చుట్టబెట్టుకొని గూని మంథర తూర్పు వాకిట్లో నిలబడింది. మేలైన మంచి సుగంధద్రవ్యాలను పూసుకొంది. కైక ఇచ్చిన అమూల్యవస్త్రాభరణాలను ధరించింది. రత్నాలు పొదిగిన ఆభరణాలను మెడలో ధరించింది. నడుముకు చిత్రవిచిత్రాలైన వడ్డాణాలను ధరించింది. ఇన్ని ఆభరణాలను ధరించినా మంథరలో అందం కనిపించలేదు.

అలా అలంకరించుకొని మిడిసిపడే మంథరను చూసి ద్వారపాలకులు మండిపడ్డారు. వెంటనే ఆమెను పట్టుకొని వచ్చి శత్రుఘ్నుని ముందు నిలబెట్టారు. "ఓ రాజకుమారా! ఈ గృహంలో జరిగిన అనర్థాలన్నింటికీ కారణం ఈమె. శ్రీరాముడు అడవికి వెళ్ళడానికి, దశరథమహారాజు ప్రాణాలు పోవడానికి కారణం ఈ మంథరే. మీరు ఈమెను నిగ్రహించండి" అని చెప్పారు.

అసలే దుఃఖంలో ఉన్న శత్రుఘ్నుడు వారి మాటలు విని కుతకుతలాడాడు. "ఈమె తండ్రిగారికి, సోదరులందరికీ తీరని దుఃఖాన్ని కలుగజేసింది. ఈ దుర్మార్గురాలి దుష్కర్మలకు తగిన ఫలితం అనుభవించి తీరాలి" అని అన్నాడు. శత్రుఘ్నుడు మంథరను చూసి కోపం పట్టలేక మంథరను గట్టిగా పట్టుకొన్నాడు. మంథర భయంతో గట్టిగా అరచి గగ్గోలు పెట్టింది. ఆమె అరుపులకు ఆ భవనమంతా ప్రతిధ్వనించింది. అక్కడున్న ఆమె తోడి వారందరూ ఏమి జరుగుతుందో అని భయపడిపోయారు. మనలను కాపాడేది కౌసల్య ఒకతేనని వారంతా కౌసల్య దగ్గరకు పరుగెత్తి వెళ్ళారు. "అమ్మా! మీరు కరుణామూర్తులు ధర్మపరురాలివి. మమ్ము రక్షించు." అంటూ శరణు అని అడిగితే మనలను కాపాడి తీరుతుందని వారు భావించారు.

ఏడుస్తున్న మంథరను శత్రుభయంకరుడైన శత్రుఘ్నుడు ఈడ్చుకొని వస్తుంటే ఆమె ధరించిన ఆభరణాలన్నీ చెల్లాచెదరయ్యాయి. అవన్నీ తలో దిక్కున నేలపై పడిపోయాయి. అప్పుడు ఆ ప్రదేశం నక్షత్రాల వెలుగుతో ఉన్న ఆకాశంలాగా కనిపించింది. ఆమె అరుపులు విన్న కైక అక్కడకు వచ్చి మంథరను లాక్కొని వెళుతున్న శత్రుఘ్నుని చూసింది. ఆమెను చూసి శత్రుఘ్నుడు చీదరించుకొని ఛీత్కరించాడు. ఆ చీదరింపును భరించలేని కైక దుః ఖించింది. ఇక ఈ శత్రుఘ్నుడు నన్ను ఏమి చేస్తాడో అని మంథర భరతుని దగ్గరకు వెళ్ళి శరణు కోరింది. అప్పుడు భరతుడు శత్రుఘ్నుని చూసి"సోదరా! మంథరనును నీవు క్షమించు. ఏ ప్రాణులలోని స్త్రీలనూ చంపకూడదు.

అసలు నా తల్లి ఐన కైక పరమపాతకురాలు, దుష్టురాలు ఆమెను నేను చంపి ఉండేవానిని. కానీ ధర్మాత్ముడైన శ్రీరాముడు నన్ను మాతృహంతకునిగా తలచి శిక్షిస్తాడు. ఈ భయంతోనే ఎక్కడ నాతో శ్రీరాముడు మాట్లాడడోనని నేను జంకాను. అంతేగాదు నేడు నీవు ఈ గూని మంథరను శిక్షించినావని తెలిసినా నీతో నాతో శ్రీరాముడు మాట్లాడడు. ఇది నిజం శత్రుఘ్నా. పరమ కిరాతకి అయినా కూడా స్త్రీ అని తలచి ఆమెను నీవు వదిలివేయాలి" అని చెప్పాడు. భరతుని హితాన్ని కోరి శత్రుఘ్నుడు తన రోషాన్ని తగ్గించుకొని మంథరను వదిలేశాడు.

మంథర దీనయై కైక పాదాలను పట్టుకొంది. శత్రుఘ్నుని చేతిలో పట్టుబడిన కుబ్జ నిశ్చేష్టురాలయింది. కైక ఆమెను చిన్నగా ఓదార్చింది. కాని కుబ్జ అయిన మంథర ఆడ క్రౌంచపక్షివలె కన్నీరు కార్చి భయంగా దిక్కులు చూడసాగింది.

* * *

భరతుని నిశ్చయం

సర్గ - 79

ఒక ప్రభాత వేళ మంత్రులు కులగురువులు సమావేశం అయ్యారు. వారందరూ భరతుని కలుసుకొన్నారు. "ఓ రాజకుమారా! మన మహారాజు తన జ్యేష్ఠకుమారుణ్ణి, లక్ష్మణుణ్ణి అడవులకు పంపి స్వర్గస్థులయ్యారు. ఇప్పుడు ఈ కోసల రాజ్యాన్ని ఏలే ప్రభువు లేడు. మీరు ఈ రాజ్యాధికారాన్ని చేపట్టాలి. రాముని వనవాసానికి

పంపేటప్పుడు దశరథుడు మిమ్మల్ని రాజ్యాభిషిక్తుని చేయాలనుకొన్నాడు. న్యాయ సమ్మతంగా మీరు రాజ్యాన్ని చేపట్టడం ఉచితం. మీరు రాజుగా ఉండడం మాకందరికీ ఆమోదయోగ్యమే" అని చెప్పారు.

"రఘువంశతిలకా! రాజ్యాభిషేకానికి విప్రులందరూ సంబారాలన్నీ తీసుకొని వచ్చి ఉన్నారు. మీరు పట్టాభిషిక్తులై మమ్మల్ని, రాజ్యాన్ని కాపాడాలి. మీరు రాజ్యాన్ని చేపట్టడం ఇప్పుడు అత్యంత అవసరం" అని చెప్పారు. భరతుడు ఆ మాటలన్నీ విన్నాడు. అక్కడ కూర్చిన పట్టాభిషేకవస్తుసామగ్రికి ప్రదక్షిణనమస్కారాలు చేశాడు. వారందరితో భరతుడు–

"అమాత్యులారా! నన్ను క్షమించండి. రాజ్యం మహారాజు తదనంతరం జ్యేష్ఠకుమారునికి ఇవ్వడం మా వంశాచారం. అదియే ధర్మం. కనుక మీరు పెద్దలు, అనుభవజ్ఞులు, పండితులు. ఇలా చెప్పడం సముచితంగా లేదు. మా తండ్రి జ్యేష్ఠకుమారుడే ఈ రాజ్యాన్ని చేపట్టుతాడు. శ్రీరాముని మారుగా నేను వనవాస దీక్ష తీసుకొని పద్నాలుగేండ్లు అడవుల్లో జీవిస్తాను. నేడే శ్రీరాముని వెనక్కు తీసుకొని రావడానికి నేను వెళ్తాను. మీరు చతురంగ బలాలతో కూడిన మహాసేనను సిద్ధపరచండి. మీరు నాతో వచ్చి శ్రీరాముని తోడ్కొని అయోధ్యకు వచ్చి శ్రీరాముని పట్టాభిషిక్తుని చేద్దాం" అని దృఢంగా చెప్పాడు.

"అలా కాకపోతే ఈ పట్టాభిషేకసామగ్రిని తీసుకొని శ్రీరాముని చెంతకు వెళ్ళి అక్కడే ఆయనను పూజించి పట్టాభిషేకం చేసి యాగశాలనుండి త్రేతాగ్ని లాగా శ్రీరాముని ఇక్కడకు తీసుకొని వస్తాను. ఈ కైక పేరుకు మాత్రమే నా తల్లి. పుత్రభావం లేశమైనా లేని ఈమె వాత్సల్యం ప్రేమ దయ అనే గుణాలు మచ్చుకైనా లేని ఈమె కోరికను నేను నెరవేరనీయను. శ్రీరాముడే అయోధ్యాప్రభువు. నేను కారడవులలో నివసిస్తాను.

సుమంత్రా! శిల్పులను ముందుగా దండకారణ్యం పంపించండి. వారు ఎగుడు దిగుడుగా ఉండే బాటలను సరిచేసి మంచి రహదారిని ఏర్పర్చమని చెప్పండి. అడవులను బాగుగా తెలిసిన వారిని మాతో తీసుకొని వెళ్దాం. శ్రీరాముని తీసుకొని రావడంలో ఏ మాత్రం జాగు చేయకూడదు". ఈ మాటలన్నీ అక్కడి వారందరూ విని ఎంతో సంతోషించారు. "నాయనా భరతా! నీవు చక్కని ధర్మం ఎరిగినవాడివి. నీవు చేయాలనుకొన్న పని ఎంతో ఉత్కృష్టమైనది. ఈ రాజ్యాన్ని రామునకు అప్పజెప్పాలన్న నీ నిర్ణయం ఎంతో గొప్పది. నీ ధర్మప్రవర్తనకు నీకు సకల సంపదలు చేకూరుతాయి" అని దీవించారు. భరతుని గొప్ప పలుకులను విని ఆయన దృఢసంకల్పాన్ని చూచి వారందరూ ఆనందబాష్పాలు రాల్చారు. వారందరి హృదయం సంతోషంతో ఉప్పొంగింది. వారందరూ భరతుని వెయ్యేళ్ళు జీవించమని దీవెనలు ఇచ్చారు.

అంతవరకు వారిని పట్టి పీడిస్తున్న దుఃఖం మటుమాయం అయింది. ఇక్ష్వాకువంశప్రతిష్ఠను పెంచే భరతుని వారందరూ కొనియాడారు. మంత్రులు, గురువులు, పురప్రముఖులు అందరూ ఆనందంగా "భరత కుమారా! నీ ఆశ నెరవేరుగాక! నీ ధర్మనిరతి నిన్ను రక్షించుగాక!" అని దీవించారు. మీరు చెప్పినట్లే అడవులను చదును చేసి బాటలను ఏర్పరిచే శిల్పులను నియమిస్తాం. భక్తివిశ్వాసాలు ఉన్న ప్రభుభక్తి పరాయణులైన వారిని విశ్వాసపాత్రులను మనకు మార్గాన్వేషకులుగా నియమిస్తాం అని చెప్పారు.

* * *

రహదారి నిర్మాణం

సర్గ - 80

సుమంత్రుడు రహదారులను ఏర్పరిచే నిపుణులను పిలిచాడు. వారిలో భూతలాలను గురించి బాగా తెలిసినవారు, కొలతలు వేయగల నేర్పరులు, నేలను తవ్వువారు, చదునుచేయువారు. యంత్రములు ఉపయోగించే నేర్పుకలవారు, కూలివారు, శిల్పులు, బాటలు వేసేవారు ఉన్నారు. వారందరూ కలిసి మార్గాల్లో బావులను, తటాకాలను త్రవ్వుతూ నేలను మిట్టపల్లాలు లేకుండా చదునుచేసి చక్కని రహదారులు ఏర్పరచారు. ఈ ఏర్పాట్లుచూచిన జనం భరతుని గొప్పతనాన్ని కీర్తిస్తూ ఆనందంగా ముందుకు సాగారు. పనిచేసే వారందరూ అనేక సాధనాలు తీసుకొని ఒక గుంపుగా బయలుదేరారు.

గంగాతీరానికి వెళ్ళేదారిలో ఉన్న ముళ్లపొదలు, వృక్షాలు చెట్లను చేధిస్తూ వెళ్లారు. దారిలో పెద్ద పెద్ద శిలలు చిన్న రాళ్ళు ఇవన్నీ పగులగొట్టి దారిని ఏర్పరిచారు. ఆ దారిలో చతురంగబలాలు ప్రయాణించడానికి వీలును కలుగజేశారు. దారి కిరువైపుల చెట్లు నాటారు. వారిని బాగు చేయడానికి గొడ్డళ్ళు, ఉలులు, రంపాలు మొదలైన పనిముట్లను ఉపయోగించారు. తృణాలు, వీరణాలు చిన్న చెట్లను దృఢకాయులు పెకిలించివేశారు. నడవడానికి వీలుగా రహదారిని నిర్మించారు.

అక్కడక్కడ నూతులను తవ్వారు. తటాకాలను ఏర్పరిచారు. దారిలో లోతుగా ఉండే గోతులు, లోయలను బూడిదతోను, మట్టితోను కప్పివేశారు. కట్టదగిన ప్రదేశాలను కట్టుతూ చూర్ణం చేయాల్సిన వాటిని చూర్ణంచేస్తూ ముందుకు సాగారు. బాగా నీరు పారడానికి వీలుగా లోతుగా ఉండే కాలువలనుకూడా నిర్మించారు. సేన నడవడానికి వీలుగా సున్నంలాంటి పదార్థాన్నివేసి చదును చేశారు. రథాలు వేగంగా సాగడానికి వీలుచేశారు. గంగా తీరం దాకా చదునుచేసి రహదారి దేవతలు నడిచే దారిలాగ కనిపించింది. దారికిరువైపుల ఉండే చెట్లకు సుగంధ పరిమళాలను వెదజల్లే పుష్పాలు ఉన్నాయి. దారిలో అప్పటికప్పుడు ఏర్పాటుచేసిన తటాకాలలో తామరలు పెరుగుతున్నాయి. వృక్షాలమీద నివసించే పక్షులు జనసంచారాన్ని చూచి ఆనందంతో అరుస్తున్నాయి. క్రూరమృగాలు, వన్యమృగాలు కొత్తమార్గంలోకి రావడానికి జంకుతూ అక్కడక్కడా నక్కి చూస్తున్నాయి.

మధురఫలాలు దుంపలు దొరికే ప్రదేశాల్లో విడిది గృహాలను ఏర్పాటుచేశారు. భరతాదులు ఉండడానికి వీలుగా రాజ ప్రాసాదాన్ని తలపించే గృహాలను నిర్మించారు. సైనికుల కొరకు శిబిరాలను ఏర్పరిచారు. ఏనుగులు, అశ్వాలు, వేటకుక్కలు ఉండడానికి ఏర్పాటు చేశారు. అవి హాయిగా సేదదీరే ప్రదేశాలు కల్పించారు. వాటి మేతకు పనికివచ్చే చెట్లను గడ్డిని బాగా పెంచారు. ఆ శిబిరాల దగ్గర ఇసుక కుప్పలున్నాయి. ఇంద్రకీలంలాగా ఎత్తుగా ఉండే ప్రదేశాలలో రాజగృహాలను ఏర్పరిచారు. ఎత్తుగా ఉండే ప్రదేశాలలో గృహాలు నిర్మించడం వల్ల అవి ఆకాశంలోకి ఎగురుతున్నాయా అని అనిపించాయి. ఇక్ష్వాకువంశ చిహ్నమైన ధ్వజాన్ని అక్కడక్కడా ఎగురవేశారు.

నిర్మలమైన ఉదకాలు, స్వచ్ఛమైన గాలి, నిర్మలమైన ప్రదేశంతో ఆ ప్రాంతం అంతా దేవేంద్రుని నగరంలాగా కనబడింది. మహామీనాలు ఉండే గంగానది వరకు అలసట లేకుండా సర్వులు ఇష్టపడే విధంగా రహదారిని ఏర్పాటుచేశారు. ఉత్తమ శాస్త్రమెరిగిన శిల్పులు, భవన నిర్మాణం చేసేవారు వాస్తుశిల్పులు అందరూ కలిసి ఏర్పాటుచేసిన ఆ రహదారి నక్షత్రయుక్తంగా రాత్రియందు ప్రకాశించే నిర్మలమైన ఆకాశంగా వెలుగొందింది.

* * *

వసిష్ఠుని ఆహ్వానం

సర్గ - 81

తెల్లవారిన సూచికగా స్తుతిపాఠకులు వందిమాగధులు భరతుని భవనం ముందు నిలబడి ఆయనను స్తుతించసాగారు. జయజయధ్వానాలు పలికారు. వీణా వాద్యాది జంత్రాలతో మంగళవాచకాలు చేశారు. బంగారు వాదనదండంతో సమయం తెలిపే గంటలను మ్రోగించారు. శంఖాలను పూరించారు. మహాతూర్య నాదాలు మిన్నుముట్టేట్లుగా ప్రతిధ్వనింపజేశారు. వారందరిలో భరతుడు గొప్ప తేజశ్శాలి. బుద్ధిమంతుడు. అన్న కోసం ప్రాణాలొడ్డే మహనీయుడు. అట్టివాడు దశరథుని తరువాత దశరథుడంతటివాడనే భావం గట్టిగా నాటుకొంది. అందుకే వారందరూ భరతునికి మేలు జరగాలని పొద్దుపొద్దున్నే మంగళ వాద్యాలు ఆనందంగా మోగించారు.

భరతుడు లేవగానే వాటిని విని దుఖంలో కూరుకుపోయాడు. అయ్యో నేను రాజును కాదు. నా కెందుకీ ధ్వానాలు అంటూ ఆ మంగళకరమైన ఘోషను ఆపించాడు. శత్రుఘ్నునితో మాట్లాడుతూ చూశావా "సోదరా! ఈ రాజ్యం ధర్మప్రభువులతో పాలించబడింది. దీన్ని ఏలడానికి ధర్మాత్ముడే అర్హుడౌతాడు. దశరథుని రాజ్యలక్ష్మి నేడు చుక్కాని లేని నావ అయి సముద్రం మధ్యలో ఇరుక్కుపోయింది. దానిని ఒడ్డుకు చేర్చే నావికుడు అడవుల పాలై ఉన్నాడు.

మా అమ్మ అజ్ఞానంతో లోకానికి ఎంత అపచారం చేసిందో కదా. ముల్లోకాలను ఎదిరించే దశరథమహారాజు మింటి కెగిసిపోయాడు. స్వామిసంరక్షకుడైన సమర్థుడు శ్రీరాముడు కారడవికి వెళ్లాడు. ఈ బరువునంతా నా ఒక్కనిపై మోపి వీరందరూ చోద్యం చూస్తున్నారు. మా అమ్మ అయిన కైకవల్లే కదా ఇంతటి ఘోరం జరిగింది."అంటూ కన్నీరు కార్చాడు.

భరతుని దీనస్థితిని చూసి అంతఃపుర జనులు శోకించారు. భరతుని ధర్మనిరతిని వారు నోరారా మెచ్చుకున్నారు. అలాంటి సమయంలో దేవేంద్రుని సభాభవనమైన 'సుధర్మ'లాగ ఉండే దశరథుని సభాప్రాంగణంలోకి వసిష్ఠుడు తన శిష్యులతో ప్రవేశించాడు.

సర్వవేదార్థసారాన్ని తెలిసిన ఆ మహాత్ముడు బంగారు సింహాసనాన్ని అధిష్ఠించాడు. అక్కడున్న దూతలను పిలిచాడు. మీరు త్వరగా బ్రాహ్మణోత్తములను, క్షత్రియ ప్రముఖులను, వైశ్య ప్రవరులను రాజభటులతో వెళ్లి వారిని నేను పిలుచుకొని రమ్మన్నానని చెప్పి తీసుకురండి. కొందరు వెళ్లి యశస్సులైన భరతశత్రుఘ్నులను తోడ్కొని రండి. భరతుని మేనమామ అగు యుధాజిత్తును, సుమంత్రుని శ్రేయోభిలాషులైన వారందరిని ఆహ్వానించి తీసుకునిరండి.

వారందరితో ముఖ్యమైన విషయం మాట్లాడాల్సి ఉంది అని చెప్పాడు. వసిష్ఠుని ఆదేశాన్ని శిరసావహించి వారందరూ వెళ్లారు. కొద్దిసేటికి సభాభవనానికి విచ్చేసే వారి సందడి మొదలైంది. వారందరూ అశ్వాలను, గజాలను, రథాలను, పల్లకీలను ఉపయోగించుకుంటూ అందరూ ఆ భవనానికి వచ్చారు. ఆ ప్రదేశం వారందరితో కళకళలాడింది.

వసిష్ఠుని ఆదేశం ప్రకారం వస్తున్న భరతునిచూచి దశరథుడే వస్తున్నట్లుగా వారందరూ భావించారు. దేవతలు ఇంద్రుని స్తుతించినట్లు వారు భరతుని కీర్తించారు.

తిమింగలాలు, మీనాలు లాంటి జల జంతువులు, రత్నాలు, ముత్యాలు, పగడాల్లాంటి అమూల్య వస్తువులు, శంఖాలు మణులులాంటి అపూర్వ వస్తువులతో నిండిన నిశ్చలజలం ఉన్న సముద్రంలాగ ఆ భవనం అలరారింది. దశరథసుతుడైన భరతునితో కూడి ఉన్న ఆ భవనం దశరథునితో విలసిల్లినట్లుగానే అనిపించింది.

* * *

వసిష్ఠ భరతుల సంభాషణం

సర్గ - 82

ఆ భవనానికి దశరథుని మంత్రులందరూ విచ్చేశారు. పురప్రముఖులు ఆయా శాఖలలోని నిపుణులు పిలిచిన వారందరూ వచ్చారు. వారికి తగిన ఆసనాలపై ఆసీనులయ్యారు. భరతుడు శత్రుఘ్నుడు సభలో కూర్చున్నారు. జనులతో నిండిన ఆ భవనం తారలతో కూడిన పూర్ణచంద్రుడుండిన ఆకాశంలాగ కనిపించింది.

విద్వాంసులతో నిండిన ఆ భవనం శరత్కాలపు చంద్రునిలాగ ప్రకాశించింది. వసిష్ఠుడు వారినందరినీ చూచి చాలా సంతోషించాడు. భరతుని చూచి "నాయనా భరత కుమారా! దశరథ మహారాజు ధర్మంగా రాజ్యాన్ని పాలించాడు. ధనధాన్యసమృద్ధమైన ఈ రాజ్యాన్ని నేడు నీకు అప్పగించి ఆయన దివికేగాడు.

సత్యనిష్ఠ ఉన్న శ్రీరాముడు సత్పురుషుల త్రోవలో నడుస్తూ వెన్నెలను వీడని చంద్రునిలాగ తండ్రి ఆజ్ఞను శిరసావహించి పద్నాలుగేళ్ల వనవాసానికి వెళ్లాడు. ఇలా వారు నీకు ఇచ్చిన ఈ రాజ్యాన్ని చేపట్టు. ఈ భారాన్ని నీ భుజస్కంధాలపై ఎత్తుకొనవలసిన బాధ్యత నీపైనే ఉంది" అని వసిష్ఠుడు భరతునితో చెప్పాడు.

"భరతా! సమస్త రాజ్యముల అధికారులు, సామంతులు అందరూ నిన్ను తమవానిగా గుర్తిస్తారు. వారు అనేకపారితోషికాలను నీకు సమర్పిస్తారు. ఈ రాజ్యంలోని ప్రజలు నీకు చేదోడు వాదోడుగా ఉంటారు. నీవు రాజ్యాన్ని చేపట్టడానికి ఆలోచించాల్సిన అవసరం ఏమీ లేదు" అని అన్నాడు.

ధర్మపరుడైన భరతుడు వసిష్ఠుని మాటలు విన్నాడు. ధర్మమార్గాన్నే అనుసరించాలని సంకల్పించుకున్నాడు. శ్రీరాముని స్మరించాడు. వసిష్ఠునికి చేతులు జోడించాడు. "ఓ మహర్షిపుంగవా! బ్రహ్మచర్యాన్ని అవలంబించి సకల విద్యాపారంగతుడైన శ్రీరామునకు చెందాల్సిన రాజ్యాన్ని నేను చేపట్టతగునా? దశరథునికి పుట్టిన వారెవరైనా రాజ్యాపహరణ చేయడానికి ముందుకు వస్తారా? నేను, మీరు అందరూ శ్రీరాముని సంపదలం కదా. పెద్దవాడు, నహుషునితో సమానమైన వాడు, గురు అనుగ్రహం ఉన్నవాడు శ్రేష్ఠుడైన శ్రీరామునికే ఈ అధికారం దక్కుతుంది. అన్యులెవరికీ ఈ సింహాసనంపై కూర్చునే అధికారం లేదు. వంశాచారాన్ని, రాజనీతి, ధర్మాన్ని ఆచరించేవారెవరూ రాజ్యాన్ని అపహరించి రాజ్యలక్ష్మి కైవసం చేసుకోవడం భావ్యమైన పనేనా మీరే చెప్పండి" అని భరతుడు అడిగాడు.

"మహర్షివర్యా! అన్యాయంగా ఈ రాజ్యభోగాలను నేను అనుభవిస్తూ ఇక్ష్వాకులను నాశనం చేసిన వానిని అవుతాను. భవనానికి అప్రతిష్ఠ తెచ్చిన వాడినౌతాను. అటువంటి పనిని నేను చేయను. కైక తలపెట్టిన పాప కార్యాన్ని నేను చేయనివ్వను. ధర్మాన్ని అతిక్రమించిన వారి పని పడతాను కాని వారి పక్షాన నేనేనాడు చేరను. దుర్గమారణ్యాలలో ఉండే నా సోదరునికి నమస్కరిస్తున్నాను. మనుషులలో శ్రేష్ఠుడైన రాముడే ఈ అయోధ్యాధిపతి" అని గట్టిగా చెప్పాడు. ఆ భరతుని మాటలు విని సభాసదులందరూ ఆనందంతో కన్నీరు కార్చారు. భరతుని న్యాయబుద్ధిని శ్లాఘించారు. శ్రీరాముని నేను వెనక్కు పిలుచుకొని వస్తాను. ఒకవేళ ఆ కార్యంలో నేను అశక్తుడినైతే నేను వల్కలాలు ధరించిన తాపసులవలె అరణ్యంలోనే ఉండిపోతాను. లోకంలోగల అన్ని ఉపాయాలను ఉపయోగించి శ్రీరాముణ్ణే పట్టాభిషిక్తుని చేస్తాను.

రహదారి నేర్పరిచే నిమిత్తం నేను మనుషులను ముందే పంపి ఉన్నారు. "సుమంత్రా! ఇక జాగుచేయడం మంచిది కాదు. శీఘ్రంగా సేనను తయారుచేయి. మనమందరం శ్రీరాముని వద్దకు వెళ్ళే ఏర్పాట్లను సిద్ధం చేయి అని భరతుని చెప్పాడు." సైన్యంతో వెళ్లి శ్రీరాముణ్ణి పిలుచుకుని వచ్చే నిర్ణయాన్ని విని సైనికులతో సహా అందరూ సంతోషించారు. సుమంత్రుడు భరతాజ్ఞను శిరసావహించాడు.

సభను ముగించారు. యాత్రకు సిద్ధం అవడంలో అందరూ నిమగ్నమయ్యారు. సేనాధ్యక్షుల, సైనికుల భార్యలు ఈ మాట విని సంతోషంతో వారిని త్వరగా బయలుదేరదీశారు. సేన అంతా శ్రీరాముని దగ్గరకు వెళ్లడానికి సమాయత్తం అయింది.

భరతుడు నా రథాన్ని కూడా సిద్ధం చేయండనీ చెప్పాడు. యాత్రకు అంతా సిద్ధమయ్యారు. సుమంత్రుని పిలిచి అందరూ శ్రీరాముని ఒప్పించి నగరానికి తీసుకుని రావాలని నా మాటగా చెప్పు అని భరతుడు చెప్పాడు.

భరతుని కోరికను సైన్యాధ్యక్షులందరికీ సుమంత్రుడు తెలిపాడు. మిత్రులు, శ్రేయోభిలాషులందరూ బయలు దేరారు. ప్రతి ఇంటివారు శ్రీరాముని కోసం పరుగులెత్తారు. ఎవరికి తగినట్లు వారు అశ్వాలను, గజాలను, వృషభాలను, ఒంటెలను, గాడిదలను రథాలను సిద్ధం చేసుకున్నారు.

* * *

భరతుని వనగమనం

సర్గ - 83

ప్రాతఃకాలంలోనే అందరూ బయలుదేరారు. శీఘ్రంగా రథాలు పరుగెత్తాయి. అందరి మనసులు శ్రీరాముని కోసం వాయువేగంతో పరుగెత్తి వెళ్ళాయి. మంత్రులు, పురోహితులు గుర్రాలు కట్టిన రథాలపై ఎక్కి భరతుని ముందు ప్రయాణించారు.

భరతుని తర్వాత నియమానుసారంగా కూర్చిన తొమ్మిదివేల ఏనుగులు, అరవైవేల రథాలు, అనేక విధాలైన ఆయుధాలను ధరించిన ధనుర్ధరులు బయలుదేరారు. భరతునితో పాటుగా లక్షలమంది అశ్వాలపై పయనించారు. కైకేయి, సుమిత్ర, కౌసల్య ఆనందంగా శ్రీరామునికోసం వాహనాలు ఎక్కి ప్రయాణంలో భాగస్థులయ్యారు. ఎంతోమంది రామలక్ష్మణులను కూర్చి చెప్పుకొంటూ ఇక్ష్వాకువంశాన్ని కీర్తిస్తూ భరతుని గొప్పతనాన్ని శత్రుఘ్నుని వీరత్వాన్ని చెప్పుకుంటూ వారిని అనుసరించి వెళ్ళారు.

మేఘశ్యాముడు, జనులందరిని ఆనందింపచేసేవాడు దృఢసంకల్పుడైన శ్రీరాముని ఎప్పుడెప్పుడు చూస్తామా అని వారందరూ ఎదురుచూస్తూ వడివడిగా కదిలారు. సూర్యరశ్మితో సర్వప్రాణులను తేజరిల్లినట్లు శ్రీరాముని దర్శించగానే మన బాధలు మటుమాయం అవుతాయి. శోకాలన్నీ పారిపోతాయనుకొన్నారు. పురజనులంతా ఆనందంగా ఒకరికొకరు శుభాభినందనలు తెలుపుతూ ముందుకు సాగారు.

భరతుని వెంట కుమ్మరివారు, ఆయుధాలను తయారుచేసేవారు, నెమలి ఈకలతో వీవనలు చేయువారు, వడ్రంగులు, అలంకరణలు 7చేసేవారు, దంతపుపనివారు, వెల్లవేసేవారు, సుగంధద్రవ్యాలు అమ్మేవారు కంసాలురు, కంబళ్ళు ఉతికేవారు, నేసేవారు, పరిచారికలు, కర్మచారులు, చాకళ్లు, మంగళ్లు, చేపలు పట్టేవారు, కట్టుకొనేవారు గ్రామపెద్దలు స్త్రీలు ఇలా అందరూ అయోధ్య అంతా కదిలిందా అన్నట్లు శ్రీరాముని తీసుకొని రావాలనే ఆకాంక్షతో బయలుదేరారు. విప్రు లందరూ ఎడ్ల బండ్లెక్కి ప్రయాణించారు.

వారందరూ ఆనందంతో భరతుని కొనియాడుతూ తమ ప్రియతముని చూడటానికి ఆరాటపడుతూ ముందుకు సాగారు. వారందరూ కలిసి శ్రీరాముని సఖుడు గుహుడు ఏలే శృంగిబేర పురాన్ని చేరారు. అక్కడి గంగానదిని చేరారు. భరతునితో వచ్చిన వారందరూ అక్కడ ఆగారు. భరతుడు అక్కడ ఆగి వారందరిని ఉద్దేశించి ఈ రాత్రికి మనమందరం ఇక్కడ విశ్రమిద్దాం. మీ మీ అనుకూలమైన ప్రదేశాలలో సేదతీరండి. రేపు ఉదయాన్నే గంగను దాటి ముందుకు వెళ్దాం అని చెప్పాడు. నేనూ మా తండ్రిగారి ఆత్మశాంతికై ఈ గంగలో జలతర్పణం చేస్తానని చెప్పాడు. భరతుని ఇష్టప్రకారం సేనావాహినంతా గంగానదీతీరంలో బసచేసింది. భరతుడు శ్రీరాముని వెనక్కు ఎలా పిలుచుకొని రావాలో అన్న ఆలోచనలలో మునిగిపోయాడు.

* * *

గుహుని అనుమానం

సర్గ - 84

గంగానదిని చేరిన సేనావాహిని చూసి గుహుడు అనుమానించాడు. తన బంధువులను చేర్చి, సముద్రం లాంటి సేనావాహినితో భరతుడు గంగాతీరానికివచ్చాడు. అతని మొత్తం సేన ఎంత ఉందో అంతు చిక్కడంలేదు. భరతుడు కూడా కైకవలె దుర్బుద్ధి ఉన్నవాడేమోననే శంక నాకు కలుగుతోంది. ఇప్పుడీ భరతుడు సేనతో ఇక్కడకు ఎందుకు వచ్చాడో తెలియదు. మన పల్లెవాసులను బందీలు చేయడానికి వచ్చాడేమో? రాజ్యలక్ష్మిని కైవసం చేసుకొని శత్రుశేషం ఉండకూడదనే ఆలోచనతో శ్రీరాముని తుదముట్టించడానికి వచ్చాడో? తెలియకున్నది. ఒకవేళ మంచి ఉద్దేశం భరతునకు ఉన్నట్లు అయితే మేం వస్తున్నామని ముందుగా మనకు కబురు పంపేవారు కదా! అలా జరగలేదు కనుక భరతుని మనం నమ్మలేకున్నాం అని గుహుడు తన బంధువులతో చెప్పాడు.

అందులో ఒకరు వచ్చినది భరతుడే అని అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నావని అడిగారు. రథంపై ఎగిరే (ఎర్రని కాంచనం) కోవిదారధ్వజం ఇక్ష్వాకువంశ రాజుల చిహ్నం. అది నాకు సుస్పష్టంగా కానవస్తోంది అని గుహుడు అన్నాడు. అయినా ముందు మన స్నేహహస్తాన్ని భరతునికి ఇవ్వాలి. ఆ తర్వాత మన దారికి అడ్డువచ్చి ఉంటే ఆ భరతునికి మనమెవరో తెలియపరచవచ్చునని దూరపు ఆలోచన ఉన్న గుహుడు చెప్పాడు.

దానికి అందరూ ఆమోదించారు. మీరందరూ గంగా తీరం వెంబడి సర్వసన్నద్ధులై ఉండండి. నేను వెళ్ళి భరతుని అభిప్రాయం తెలుసుకొని వస్తానన్నాడు.

వెంటనే సరిహద్దులలో ఉన్న ఆ బోయరాజు అక్కడి విశేషభోజనాలను తీసుకొని కొందరు అమాత్యులను వెంటబెట్టుకుని భరతుని దగ్గరకు బయలుదేరాడు. అల్లంత దూరాన్నే వస్తున్న గుహుని సుమంత్రుడు చూశాడు. "భరత కుమారా! గుహుడు శ్రీరాముని ఆప్తుడు. ఇప్పుడు శ్రీరాముడు ఎక్కడ ఉన్నాడో తెలుసుకోవడానికి, శ్రీరాముని వెనుక్కు తీసుకొచ్చే ప్రయత్నానికి ఈ గుహుని అవసరం ఎంతో ఉంది. అందువల్ల మీరు గుహునికి దర్శనం ఇవ్వడం సముచితం అని నాకు అనిపిస్తోంది" అని భరతునితో సుమంత్రుడు చెప్పాడు.

సమయోచితమైన ఆలోచనకు భరతుడు ఆమోదం తెల్పి గుహుని సాదరంగా ఆహ్వానించి తన వద్దకు తీసుకొని రమ్మన్నాడు. గుహుని చూడగానే భరతుడు ఎదురువెళ్ళి "ఓ నిషాద రాజా! మీ రాక మాకు ఆనందాన్నిస్తోంది. నా ఆలోచన రూపు తేవడానికి మీ అవసరం మాకు ఎంతో ఉంది. మీరు నన్ను అనుమానించనక్కరలేదు. శ్రీరాముని అడవులకు పంపడంలో నా ప్రమేయం ఏమీ లేదు. నేను శ్రీరామచంద్రుని తిరిగి తీసుకొని రావడానికి వెళ్ళుతున్నాను. రాముడు నా మాట మన్నించకపోయినా ఈ అశేష జనవాహిని కోసమైనా రాజ్యాధికారాన్ని చేపట్టుతాడనే నమ్మకంతో వీరందరిని రాముని కోసం తీసుకొని వెళ్తున్నాను" అని చెప్పాడు.

ఈ మాటలు విన్న గుహుని మనస్సు భరతుని మెచ్చుకోలేకుండా ఉండిపోయింది."ఓ భరతరాజా! మీ వంశ ప్రతిష్ఠను నూరింతలుగా పెంచే మీ ప్రయత్నం మీకు శుభాన్ని కలిగిస్తుంది. అప్రయత్నంగా రాజ్యం వచ్చినా

దాన్ని తృణప్రాయంగా వదిలివేయగలిగిన మీ త్యాగం, మీ నిజాయతీ, మీ సహృదయత సర్వులకూ ఆదర్శనీయం. మీ భ్రాతృప్రేమ సోదరులందరికి ఆచరణీయం. అన్యాయార్జనతో సంపాదించే స్వర్గం కూడా నరకప్రాయమైనదే. మీ ఉద్దేశం సర్వప్రాణికి శిరోధార్యం. భరతా! నాకు శ్రీరాముని మించిన వారెవరూ లేరు. శ్రీరాముని కోసం నేను ఏది చేయడానికైనా వెనుకంజ వేయను. శ్రీరాముని తమ్ములైన మీరు ఇక్కడకు రావడం మా జన్మ సుకృతం. ఈ రోజు మీరు మా అతిథి దేవులు. మేము రాత్రి భోజనాలకు ఏర్పాట్లు చేస్తాం. మీరందరూ హాయిగా దాన్ని స్వీకరించి విశ్రమించండి. రేపు పొద్దునే శ్రీరాముని కార్యాన్ని ఆరంభించవచ్చు" అని గుహుడు ఆనందాతిరేకంతో చెప్పాడు. భరతుడు దానికి ఆమోదించాడు.

"ప్రభూ! మా నిషాదులు మీపై ప్రేమతో ఈ ఫలాలను తెచ్చారు. ఇందులో కొన్ని రసయుక్తమైనవి, కొన్ని ఎండినవి ఉన్నాయి. ఇవన్నీ మధురఫలాలే. ఇందులో కండచక్కెరలు, పుట్ట తేనె కూడా ఉంది. ఈ వనంలో దొరికే అమూల్య ఆహారపదార్థాలన్నీ తెచ్చాం. ఇవన్నీ మీరు స్వీకరించండి. మీ సేనావాహిని కోసం ఏర్పాటుచేస్తాం. మా అతిథిమర్యాదలను అందుకొని మమ్ము సంతోషింపచేయండి. మీరు ముందుగా మీ రాకను తెల్పి ఉంటే మేము మీ సేవలో లోటు రానిచ్చేవాళ్ళం కాదు. ఇప్పుడు మా ప్రేమకొద్దీ మీ సేవ చేస్తాం దాన్ని మీరు అంగీకరించండి" అని గుహుడు చెప్పాడు.

* * *

భరత గుహుల సంవాదం

సర్గ - 85

గుహుని ఆత్మీయ అంతరంగాన్ని భరతుడు తెలిసికొన్నాడు. "సోదరా నిషాదరాజా! మీ అభిలాష ఉన్నతమైంది. ఇంత పెద్ద సేనకు ఆతిథ్యం ఇవ్వాలన్న మీ తలంపు ప్రశంసనీయమైంది. మీ మధురవాక్కులే మాకు తృప్తి కలిగించాయి. ఓ బోయరాజా! శ్రీరాముని కొనితేవడంలో నా మనస్సు లగ్నమై ఉంది. ముందు మేం భరద్వాజాశ్రమానికి ఉరవళ్ళు తొక్కుతూ ప్రవహించే ఈ గంగమ్మను దాటి వెళ్ళడానికి అసాధ్యం అనిపిస్తోంది. అరణ్యమార్గాలన్నీ తెలిసిన మీరు మాకు సహాయం చేయాలి. మేమందరం శ్రీరాముని దగ్గరకు వెళ్ళే సులువైనమార్గాన్ని మాకు తెల్పండి" అని అడిగాడు భరతుడు

"ఓ భరత వీరా! ముందు నా మనస్సులోని శంకను తీర్చండి. అప్పుడు నేను మీకు సేవలొనర్చుతాను. శ్రీరాముని వెనక్కు తీసుకొని రావడానికి ఈ సేనతో మీకు పని ఏమి? దుస్సంకల్పం ఏమీ లేనప్పుడు ధనుర్ధారుల అవసరం ఏమిటి?" అని పల్లెయోధుల బలం కలిగిన గుహుడు నిర్భయంగా భరతుని అడిగాడు. తనను అనుమానించడం భరతునికి ఆగ్రహం తెప్పించలేదు. "ఓ సోదరా! ఈ మాటలు వింటున్న నాకు నీకు శ్రీరామునిపై

ఉన్న ప్రేమ ఎంత గట్టిదో తెలుస్తుంది. నేను నీ వలె శ్రీరాముని భక్తుడిని. శ్రీరామునిపై దుష్టతలంపు నాకు కలలో కూడా కలగకూడదని నేను దేవుని ప్రార్థిస్తున్నాను. నిషాదరాజా! నన్ను మీరు పూర్తిగా విశ్వసించవచ్చు. ఈ రాజ్యంపై నాకు ఏనాడు వ్యామోహం లేదు. దీన్ని చేపట్టే అర్హత ఒక్క శ్రీరామచంద్రప్రభువుకే ఉంది. మేమందరం వెళ్ళి శ్రీరాముని వెనక్కు పిలుచుకొని వస్తాం. లేకపోతే నేనూ ఈ అడవులలోనే ఉండిపోతాను. నా జ్యేష్ఠసోదరునికోసమే అయోధ్యారాజ్యలక్ష్మి వేచి ఉంది. నే చెప్పేది ముమ్మాటికి సత్యం" అని స్వచ్ఛమైన మనస్సు ఉన్న భరతుడు చెప్పాడు.

భరతుని మాటలు విని గుహుడు పరమానంద భరితుడయ్యాడు. "ఓ భరతకుమారా! మీ కీర్తి చిరస్థాయిగా చరిత్రలో ఉంటుంది. నీవు నిజంగా ధన్యుడవు. నీకు సాటి వచ్చేవాడు ఈ భూమండలంలో ఎవరూ ఉండరు. రేపు ఉదయాన్నే నీ కోరికను తీర్చడానికి నేను నీతో వస్తాను. మా పల్లెయోధులు అరణ్యాన్ని బాగా తెలిసిన వారు మీకు సహాయంగా వస్తారు" అని గుహుడు భరతునికి చెప్పాడు. గుహుని మాటలకు సంతోషించిన భరతుడు సేనావాహినిని విశ్రమించమని చెప్పాడు. చీకట్లు అలుముకొన్న రాత్రి భరతునిలో మళ్ళీ ఆవేదనను కలిగించింది. పితృవియోగం మనస్సుకు బాధపెట్టుతుంటే శ్రీరాముని అకారణ వనవాసం ఆయనను మరింతగా క్షోభ పెట్టింది. హిమవత్పర్వతం నుండి మంచు కరిగినట్లుగా భరతునిలో శోకం స్వేదంగా మారి అన్ని అవయవాలనుండి బయటకు వచ్చింది. శ్రీరాముని కోసం పరితపించే భరతుని హృదయం బరువెక్కింది. ఆయన దుఃఖం వేడి నిట్టూర్పులతో, కన్నీటితో బయటపడుతోంది. దావాగ్నిలాగా ఆయన మనస్తాపం పెరుగుతూనే ఉంది. గుంపు నుండి తప్పిపోయిన వృషభంలాగా భరతుడు అందరిలో ఉండి ఏకాకై చింతించాడు. దుఃఖసముద్రంలోని సుడిగుండంలో చిక్కుకొని అల్లాడే భరతుని గుహుడు మంచి మాటలతో శ్రీరాముని కరుణాకటాక్షాల గురించి చెప్పుతూ ఓదార్చాడు.

* * *

గుహుని అంతరంగం - లక్ష్మణుడు

సర్గ - 86

భరతుని ఓదార్చడంలో గుహుడు ఎన్నో విషయాలు చెప్పాడు. "భరతా! మీ అన్నదమ్ములలో ఉండే మైత్రీ బంధం, ప్రేమ ఇవన్నీ ఎంతో శ్లాఘించదగినవి. మీ వలె మీ సోదరుడు లక్ష్మణుడు కూడా శ్రీరామునిపై అపార ప్రేమతో ఉన్నాడు. ఒకసారి నేను లక్ష్మణునితో మాట్లాడుతున్నప్పుడు శ్రీరామునిపై ఆయనకున్న ప్రేమను నాతో చెప్పాడు. దానిని మీకు చెప్తాను వినుము" అని గుహుడు భరతునితో చెప్పాడు.

"వనవాస భాగంలో సీతారామలక్ష్మణులు సుమంత్రుడు ఇక్కడ ఒక రాత్రి బస చేశారు. అప్పుడు సీతారాములు ఈ తృణసముదాయంపైనే శయనించారు. వారిని కావలి కాస్తూ లక్ష్మణుడు ధనుర్ధారుడై తిరుగుతున్నాడు.

దానిని చూచిన నేను లక్ష్మణునితో 'ఓ రాజకుమారా! మీరు సుఖాలలో పుట్టి పెరిగినవారు. మీకు కష్టాల గురించి తెలియదు. మీరు నేను సిద్ధం చేసిన ఈ శయ్యపై పడుకోండి. నిద్రలేమిని మీరు తట్టుకోలేరు. నాకు నా అనుచరగణానికి ఈ అరణ్యమార్గాలన్నీ బాగా తెలుసు. కష్టాలే మా పుట్టినిల్లు కాబట్టి మేము ఆయుధాలను ధరించి రాత్రి అంతా మిమ్ము కాపాడుతాం. మీరు నిశ్చింతగా నిద్రపొండి. చతురంగబలాలు వచ్చినా వారిని మేమందరం కలిసి మట్టి కరిపించగలం. మాపై భరోసాతో మీరు నిశ్చితంగా నిద్రపోవచ్చు. మీ ప్రాణాలను మా ప్రాణాలను అడ్డువేసి కాపాడుతాం" అని చెప్పాను.

ఇలా నేను లక్ష్మణునికి ఎంతగానో చెప్పాను. అప్పుడు లక్ష్మణుడు నాతో ఇలా చెప్పుకొచ్చాడు.

'ఓ నిషాదరాజా! మా అన్న శ్రీరాముడు మహాత్ముడు, సత్పురుషుడు. మా వంశానికి వన్నెతెచ్చే వీరుడు. ఇటువంటి ఈ కోదండరాముడు నేడు భార్యతో కూడి ఈ కటికనేలపై పడుకొని ఉంటే నా కంటికి నిద్ర ఎలా వస్తుంది? కష్టాలే ఎరుగని ఈ కోవిదుడు కష్టాలబాటలో నడవాల్సి వచ్చినపుడు నాకు సుఖభోగాలపై మనస్సు ఎలా వెళ్తుంది?

ఎన్నో నోముల పంటగా మా తండ్రికి ఈ శ్రీరామచంద్రుడు లభించాడు. ఎదురులేని ఈ మహావీరుని చేతులారా దూరం చేసుకొన్న దశరథమహారాజు ఎంతోకాలం జీవించలేడు. క్షణం కూడా వదల్లేని జ్యేష్ఠుని వనవాసానికి పంపిన ఆ ప్రభువు ప్రాణాలను త్వరలో వదిలేస్తాడు. అప్పుడు ఈ కోసల అనాథ అయిపోతుంది.

శ్రీరాముని వనగమనాన్ని చూచి ఓర్చుకోలేని మా తల్లులైన సుమిత్ర కౌసల్యలు ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి ఉంటారు. అంతఃపురకాంతలందరూ దుఃఖంతో మునిగి హాహాకారాలు చేసి చేసి మూర్ఛిల్లి ఉంటారు. మా తల్లులు శ్రీరాముని వదిలి జీవించలేరు. తప్పక కౌసల్య సుమిత్రలతో కూడిన దశరథమహారాజు ఈ రాత్రి ఐనా జీవించి ఉండగలరా? అన్న శంక నన్ను పట్టి పీడిస్తోంది? ఇక నాకు నిద్రపోవాలని, పడుకోవాలని, తినాలని ఎలా అనిపిస్తుందో నీవైనా చెప్పు' అంటూ గట్టిగా ఏడ్చాడు లక్ష్మణుడు.

'మహారాజు శ్రీరాముని పట్టాభిషిక్తుని చేసి ప్రజారంజకమైనపాలన చేసిన రాజుగా కీర్తింపబడాలనే కోరిక ఉండేది. రాముని రాజును చేయాలని ఆయన ఎంతగానో తపించాడు. కోరిక తీరని మహాప్రభువు కొడుకుని కారడవులకు పంపి ప్రాణాలతో ఉండగలడా? ఉండలేరు. జీవించి ఉండడం అనేది కల్లే.

దశరథమహారాజు అంత్యకాలంలో దగ్గరే ఉండి ఆయనకు అంత్యేష్ఠులను జరిపే భరతశత్రుఘ్నులే ధన్యాత్ములు. దశరథుని ఏలుబడిలో అయోధ్య దేవేంద్రుని అమరావతితో పోటపడేది. మా తండ్రిగారు రాజుగా బ్రతికితే ఆ నగరంలో ఇండ్లు, సంపన్నుల హర్మ్యాలు, రాజప్రాసాదాలు అలంకరణలో కన్నులకు ఇంపు కలిగిస్తాయి. ఎల్లప్పుడు నృత్యగీతాది వాద్యాలలో సరస్వతీదేవి ఇల్లును తలపిస్తుంది. నిత్యం ఉత్సవాలతో పండుగ సంబరాలతో నగరం హోరెత్తేది. దేశవిదేశాల యాత్రికులు, నగరపౌరులు, వ్యాపారస్థులు తమ దైనందిన జీవితంలోని పనులలో మునిగి నగర వీధులను నిర్మానుష్యానికి తావిచ్చేవారు కాదు. పుష్పవాటికలు, నందనోద్యానాలు, విహార స్థలాలు ప్రేయసీప్రియులకే కాక సర్వులకూ మనోరంజకంగా ఉండేవి. అయోధ్యలోని ప్రజలందరూ సుఖశాంతులతో

వర్ధిల్లేవారు. అటువంటి నగరాన్ని మేం వనవాస దీక్షానంతరం చూడగలమా? నేను, సీత, రామునితో కూడి తిరిగి అయోధ్య ప్రవేశించగలమా?' అంటూ లక్ష్మణుడు ఎంతగానో కుమిలిపోయాడు. శ్రీరాముని గూర్చి చెప్పే లక్ష్మణునికి దుఃఖం తన్నుకొచ్చింది. అలా ఆయన చెప్పుతుండగా సూర్యోదయం అయింది. ప్రాతఃసంధ్యావందనాలు ఆచరించుకొని సావధానులై సీతతో కూడి వారిద్దరూ ముందుకు సాగారు" అని భరతునికి గహుడు లక్ష్మణుని గూర్చి తెలిపాడు.

* * *

భరతుడు - శ్రీరాముని ఆచూకీ

సర్గ - 87

లక్ష్మణుని గురించి, రాముని గురించి గుహుడు చెప్పగా విని భరతునిలో దుఃఖం పెల్లుబికింది. నారవస్త్రాలు ధరించి జటాధారియైన రామలక్ష్మణులు పడరాని బాధలు పడ్డారే అని ఆయన చింతించాడు. కఠోరదీక్ష తీసుకొన్న 'రాముడు నా మాటను మన్నిస్తాడా? తిరిగి అయోధ్యకు వస్తాడా?' అనే సందేహాలతో రాముని గూర్చే ఆలోచిస్తూ గట్టిగా ఏడ్చి మూర్ఛిల్లిపోయాడు భరతుడు.

ప్రక్కనే ఉన్న శత్రుఘ్నుడు దాన్ని చూచి ఖిన్నుడై భరతుని పట్టుకొని అక్కున చేర్చుకొని 'భరతా! అయ్యో మనకు ఎంత కష్టం వచ్చిందో' అని శోకిస్తూ స్పృహ తప్పాడు. వీరిద్దరిని చూస్తున్న కౌసల్యాది తల్లులు పరుగెత్తి వచ్చారు. కౌసల్య దగ్గరగా వచ్చి వారిని అక్కున చేర్చుకొంది. భోరున విలపిస్తూ "నాయనలారా మీరు ఇలా అయ్యారేమిటి? భరతా!శత్రు భయంకరుడివే నీవు ఇంతలోనే మూర్ఛిల్లుటకు కారణం ఏమి? నీపైనే ప్రాణాలు పెట్టుకొని బతికే మాకు నిన్ను చూస్తుంటే మనస్సు ఆగడంలేదు.

నీవేమైనా శ్రీరాముని గూర్చి అప్రియవార్త విన్నావా?" అంటూ ఏడ్చింది. తల్లి స్పర్శతో బలిష్ఠుడైన భరతుడు తేరుకొన్నాడు. విశాలనేత్రాలు వున్న భరతుడు తన్ను తాను తమాయించుకొన్నాడు. "అమ్మా విచారపడకు. శ్రీరాముని గూర్చి ఏవిధమైన అప్రియవార్త నేను వినలేదు. రాజకుమారుడైన శ్రీరాముడు సుఖభోగాలలో తేలవలసినవాడు వనాలు పట్టిపోయాడే అనే చింత నన్ను క్రుంగదీస్తోంది" అని కౌసల్యతో చెప్పాడు. "నాయనాభరతా! అసలే మీ తండ్రిని పోగొట్టుకొని అనాథలయ్యాం. జ్యేష్ఠుడైన శ్రీరాముడు మనకు దూరమయ్యాడు. నీ ఒక్కనిపైనే మేమూ ఈ కోసల రాజ్యం ప్రాణాలు పెట్టుకొని జీవిస్తున్నాం. నీవు ధైర్యంగా ఉండి మమ్ము కడతేర్చు తండ్రీ" అని కౌసల్య భరతునితో చెప్పింది. గోవు దగ్గర దూడ సేదతీరినట్లు భరతుడు తల్లి చెంత సాంత్వన పొందాడు. "ఓ నిషాదరాజా! మా అన్నగారి గురించి నీకు తెలిసింది మాకు చెప్పు. శ్రీరాముడు తృణాలపై పడుకొన్నాడంటివి కదా. ఎక్కడ? ఎలా సేదతీరాడో మాకు చెప్పు" అని గుహుని మరల శ్రీరాముని గురించి అడిగాడు."ఓ భరతకుమారా! శ్రీరాముని గూర్చి వింటూ నీ మనస్సును కుదుటపర్చుకో. మీ అన్నావదినలు ఈ గారచెట్టుకిందే విశ్రమించారు. నేను

వారికి మధురపదార్థాలన్నీ వారి భోజనం కోసం సిద్ధపరిచాను. వాటిని వారు ఆదరించారు కానీ స్వీకరించలేదు. మేం క్షత్రియులం. మేము ఇవ్వవలసిన వారమే కాని స్వీకరించవలసిన వాళ్లంకాదు. అయినా మేం వనవాస దీక్షలో వున్నాంగదా. ఇపుడు వనాహారాన్ని తీసుకోవడమే మా లక్ష్యంగా ఉండాలి అని శ్రీరాముడు చెప్పాడు.

అంతలో లక్ష్మణుడు వెళ్లి స్వచ్ఛమైన జలాన్ని తీసుకొనివచ్చి ఇచ్చాడు. వారు ముగ్గురూ ఆ జలాన్నే ఆహారంగా తీసుకొన్నారు. లక్ష్మణుడు తృణాలను పరచి చక్కని శయ్యను సిద్ధం చేశాడు. శ్రీరాముని పాదాలను స్వయంగా కడిగాడు. సీత పాదాలు కడుక్కోవడానికి నీరు అందించాడు. ఆ తర్వాత వారు ఆ పక్కపై శయనించారు. వారికి కాస్త దూరంలో చేతిలో ఖడ్గాన్ని, భుజాన విల్లుని ధరించి అప్రమత్తతతో వారిని రాత్రంతా లక్ష్మణుడు కావలి కాచాడు. నేను నా అనుచరులు ఆయనకు తోడుగా ధనుర్ధారులమై నిలబడ్డాం. శ్రీరాముని గూర్చి మాట్లాడుతూ రాత్రి గడిపాం. తెల్లారిన తర్వాత ప్రాతఃసంధ్యావందనాలు ఆచరించి నేను సిద్ధం చేసిన నావనెక్కి వారు ముందుకు సాగారు భరతా" అంటూ గుహుడు శ్రీరాముని గూర్చి భరతునికి చెప్పాడు.

* * *

భరతుని ఆర్తి

సర్గ - 88

గుహుని మాటలు విన్నవారందరూ ఇంగుదీవృక్షం చెంతకు వెళ్లారు. భరతుడు అక్కడ అంతా పరిశీలించి "అమ్మా! చూడు ఇక్కడే పరిచిన ఈ గడ్డిశయ్యపైనే శ్రీరాముడు పడుకొని ఉంటాడు. ఇదంతా రాముని కదలికలతో నలిగి ఉంది. ఇదిగో ఇక్కడ బంగారపు ఆభరణాల పొడి పడి ఉంది. పట్టుదారాలు కూడా ఈ తృణాలకు తగిలికొని ఉన్నాయి. దీన్నిబట్టి సుకుమారి జనకసుత సీతాదేవి కూడా ఇక్కడే పడుకొని ఉండిఉంటుంది.

'అయ్యో! నేనెంత క్రూరాత్ముడనో? నావల్లే పట్టు పీతాంబరాలు దాల్చి బంగారు రత్నాలు పొదిగిన మేడలలో నిద్రించాల్సిన ఈ మహామహులు ఈ కటిక నేలపై ఈ ఎండు గడ్డిలో పడుకోవాల్సి వచ్చింది. నరశ్రేష్ఠుడైన రాముడు, దశరథమహారాజు పెద్ద కుమారుడు, తండ్రికి ఇష్టుడు, అందాల రాముడు, అందరిని మురిపించేవాడు అట్టివాడు కారడవులకు నావల్లే వెళ్లాడే! నేనెంత పాపకర్మం చేశానో?" అని చెబుతూ భరతుడు శ్రీరాముని తలచి ఆవేదన చెందాడు.

"ఇక్ష్వాకువంశంలో పుట్టిన శ్రీరాముడు ఎప్పుడూ ఎత్తైన మేడలలో ప్రాసాద అగ్రభాగాలలో మెత్తని పరుపులపై చిత్రవిచిత్ర అలంకారాలతో ఉండే శయ్యాగారాలలో పవళించేవాడుగదా! సూర్యోదయానికి పూర్వమే వందిమాగధుల జయజయధ్వానాలు, పక్షుల కిలకిలారావాలతో మేళవించిన మంగళతూర్యనాదాలతో నిద్ర మేల్కొనేవాడు శ్రీరాముడు. ఎల్లప్పుడు శాస్త్రచర్చలతో, సత్పురుషుల సాంగత్యంతో కాలాన్ని గడిపే శ్రీరాముడు నేడు కాలినడకతో అరణ్యాలలో

తిరుగుతూ చేతిలో ఎల్లప్పుడూ విల్లుపట్టి ఉన్నాడుకదా. సదా శాంతిని కోరే రాముడు, నలువైపులా కలియచూస్తూ ఏ వైపున ఏ ప్రమాదం పొంచివుందో, ఏ క్షణాన ఏమౌతుందో అన్న సందేహాలతో కాలం గడపాల్సి రావడం కాలం మహత్వమేకాని మరొకటి కాదు. కాలాన్ని శాసించగలవారు ఎవరూ లేరు. దైవ నిర్ణయానికి తిరుగులేదు.

మహాసాధ్వి ఐన సీత రామునితో కూడి కష్టాలు పడడం నేను సహించలేను. సుకుమారి, సౌందర్యవతి ఇనకులవంశానికి కీర్తితెచ్చే ఆ మహా ఇల్లాలు, కడగండ్లు పడడం నాకు బాధను కలిగిస్తోంది. ఇది అంతా నాకు స్వప్నంగా అనిపిస్తుంది. శ్రీరాముడు మహాచక్రవర్తి కావాల్సిన తరుణంలో అరణ్యాలలో సంచరించవలసి రావడం నాకు కలగా అనిపిస్తుంది. జరిగింది జరుగుతున్న దానిని చూసి నా మది దిగ్భ్రాంతికి గురవుతోంది.

శుభలక్షణ సంపన్నుడు, పూర్వజన్మపుణ్యాన్ని మూటకట్టుకొన్న లక్ష్మణుడు శ్రీరాముని వెంట వెళ్లడం ఆ భాగ్యవంతుడు చేసుకొన్న పుణ్యం. పతియే గతి అని పతితో కూడివెళ్లిన ఆ సతియే ధన్యురాలు. శ్రీరామునితో వెళ్లినవాళ్లు కృతార్థులు. శ్రీరాముని ఎడబాసి మనబతుకు నావికుడు లేని నావలాగా అయిపోయింది.

శ్రీరాముడు అడవులలో ఉన్నా నేడు విషాహారాన్ని ఎలా తినాలని అనుకోరో, ఆవిధంగానే కోసల రాజ్య తలుపులు తెరచి ఉన్నా ఆ వైపు ఏ శత్రువూ కన్నెత్తి చూడలేదు. శ్రీరాముని విడిచిన మనం లోపల బయట రక్షణ కరువై ఉన్నాం.

అయోధ్యాపురి రక్షణ లేకున్నది. ద్వారాలు తెరచే ఉన్నాయి. సైనికులు యుద్ధ విముఖులై ఉన్నారు. అశ్వాలు గజాలు ఏవీ సన్నద్ధంగా లేవు. అయినా ఈ నగరానికి వచ్చే ఆపద ఏదీలేదు. ఎందుకంటే దీని ప్రభువు శ్రీరాముడేనని ఈ భూప్రపంచమంతా తెలిసిన విషయమే.

నేను సైతం నేటినుంచి జటాధారినై నారవస్త్రాలనే ధరిస్తాను. తాపసుల మార్గాన్నే అవలంబించి కందమూలాలే నా ఆహారంగా చేసుకొంటాను. రాముడు అయోధ్యకు మరలిన తర్వాత నేను మిగతా కాలాన్ని వనవాసంతో గడపుతాను. నాతో శత్రుఘ్నుడు వనవాసం చేస్తాడు. ధనుర్ధారుడైన లక్ష్మణుడు రామునితో కూడా రాజ్య కార్యకలాపాలలో పాల్గొంటాడు. అలాచేస్తే రాముని ప్రతిజ్ఞాభంగంకాదు. బ్రాహ్మణోత్తములు రాముని పట్టాభిషిక్తుని చేసి రాజ్యాన్ని అప్పచెప్తారు. ఈ నా కోరికను దేవతలు తీరుస్తారు. ఓ దేవతలారా! నా కోరిక సఫలీకృతం చేయండి. ఈ నా అభ్యర్థనను రాముడు తప్పక అంగీకరిస్తాడు. నేను శ్రీరామునికి పాదాభివందనం చేసి నా కోరికను మన్నించమని వేడుకొంటాను.

ఒకవేళ నా కోరిక శ్రీరాముడు మన్నించకపోతే నేను ఈ అడవులలోనే ఉండిపోతాను" అని భరతుడు పలువిధాల శ్రీరాముని గూర్చి ఆలోచిస్తూ ఆయనను అయోధ్యకు ఎలా తీసుకొని రావాలో అని మథనపడుతున్నాడు.

* * *

భరతాదులు - భరద్వాజాశ్రమం

సర్గ - 89

నాటి ప్రభాతవేళ భరతుడు శత్రుఘ్నుని నిద్రనుంచి లేపాడు. "శత్రుఘ్నా! నిషాదుల ప్రభువైన గుహుని వెంటబెట్టుకొని రా! మనం భరద్వాజాశ్రమం వెళ్లడానికి మార్గం చెప్తాడని చెప్పాడు. అన్నా! నేను నీవలె శ్రీరాముని చింతనలో రాత్రి గడిపాను. రాత్రి నాకు నిద్ర రాలేదని చెప్పాడు శత్రఘ్నుడు. ఆప్యాయతానురాగాలు ఉన్న ఆ అన్నదమ్ముల దగ్గరకు గుహుడు రానే వచ్చాడు. అంజలిబద్ధుడై నిల్చున్నాడు.

"రాజకుమారులారా! మీకు రాత్రి హాయిగానే గడిచిందికదా. మీకు ఎట్టి ఆటంకం కలుగలేదుకదా" అని భరతాదుల కుశలాన్ని గుహుడు అడిగి తెలుసుకున్నాడు. "ఓ నిషాదరాజా! మీ ఆదరణ మాకు ఆనందాన్నే ఇచ్చింది. ఈ గంగానదిని దాటే ఏర్పాట్లు చూడండి" అని భరతుడు గుహునితో చెప్పాడు.

గుహుని ఆజ్ఞ ప్రకారం నిషాదులు భరతసేనను గంగానది రేవుకు చేర్చారు. 500 నావలను సిద్ధం చేసారు. స్వస్తికచిహ్నాలతో, గవాక్షాలతో, పెద్దపెద్ద గంటలతో పతాకాలతో ఉండే ఇంకొన్ని నౌకలను గంగాతీరాన నిలిపారు.

స్వస్తికచిహ్నంతో అలరారే ఒక నావ చిరుమువ్వలతో అలంకరించి భరతశత్రుఘ్నులకోసం గుహుడు తీసుకొచ్చాడు. వసిష్ఠాదిగురువులు, విప్రులు నావలలో ఎక్కారు. వారి వెనుక భరతాదులు గుహుని నావలో ఎక్కారు. కౌసల్యాదులు, ఇతర అంతఃపురకాంతలు నావలలో ఎక్కారు. ఆ తర్వాత సామగ్రి పలునావలలో చేర్పించారు. సేనావాహినంతా సంతోషంగా మాట్లాడుతూ నావలలో ఎక్కారు. అశ్వాలను, గజాలను, గాడిదలను, ఒంటెలు, ఎద్దులు, కుక్కలను అన్నింటిని నావల్లో చేర్పించి ఆవలి తీరాన్ని చేరడానికి నావికులు అమితోత్సాహంతో నావలను నడిపారు. సేనలు మిగిలినవారిని ఆవలి తీరాన చేరిన నావలు తిరిగి మొదటి స్థానానికి వచ్చి వారిని ఎక్కించుకొని తీసుకొనిపోయారు. అంతసేపు ఓపిక పట్టలేనివారు కొందరు తెప్పలపై పరుగెత్తారు. కుంభాల సహాయంతో నదిని దాటారు. ఇంకొందరు చేతులకు పని కల్పిస్తూ ఈదుతూ ఆవలికి వెళ్లారు.

సేన అంతా ఆవలి తీరాన్ని చేరాక భరతుడు శుభముహూర్తంలో భరద్వాజాశ్రమానికి బయలుదేరాడు. వయోవృద్ధుడు మునిశ్రేష్ఠుడైన భరద్వాజుని చూడడానికి వసిష్ఠాది కులగురువులు, విప్రులు మాతలతో కలిసి భరతుడు భరద్వాజాశ్రమాన్ని చేరాడు. వృక్షసంపదతో, పర్ణశాలతో మనోహరంగా చూడముచ్చటగా ఉన్న ఆశ్రమాన్ని చూశారు.

* * *

భరద్వాజుని దర్శనం

సర్గ - 90

భరద్వాజాశ్రమానికి ఒక క్రోసెడు దూరంలోనే భరతుని సేన ఆగింది. భరతుడు అస్త్రశస్త్రాలన్నింటిని విడిచి పట్టుబట్టలు కట్టుకొని వసిష్ఠుడు, మంత్రులతో కలిసి కాలినడకన ఆశ్రమానికి వెళ్లాడు. భరద్వాజుడు కనిపించగానే మంత్రులందరిని ఇక్కడే ఆగి వుండమని చెప్పి వసిష్ఠునితో కలిసి ముని దగ్గరకు వెళ్లాడు. వసిష్ఠుని చూడగానే భరద్వాజుడు అర్ఘ్యపాద్యాదులు తీసుకొనిరమ్మని తన శిష్యులకు పురమాయించాడు. వసిష్ఠుని, భరతుని ఆదరంగా సత్కరించాడు. వారిద్దరూ మౌని కుశలాన్ని అడిగారు. భరతుడు తాను దశరథుని పుత్రుడని, రాముని తమ్ముడని తనను తాను పరిచయం చేసుకున్నాడు.

భరద్వాజుడు భరతునితో "నీవు, నీ మంత్రులు, నీ ప్రజానీకం అంతా క్షేమమేకదా. నీ తల్లులందరూ క్షేమంగా ఉన్నారుకదా. నీవు రాజ్యభారాన్ని భుజస్కంధాలపై ఉంచుకొని నేడు ఇక్కడకు ఎందుకు వచ్చావని?" త్రికాలవేత్త అయిన భరద్వాజుడు భరతుని ప్రశ్నించాడు. "భరతా! నీవు ఇక్కడకు రావడం నాలో సంశయాన్ని కలిగిస్తోంది. నీ రాకలో ఏదైనా దురుద్దేశం వుందా? కౌసల్య గారాబు తనయుడైన శ్రీరాముని, సీతను, లక్ష్మణుని నీ తల్లి కోరికకు బద్ధుడైన దశరథుడు కానలకు పంపించాడుగదా! సర్వులకూ ఆనందాన్నిచ్చే ఆ శ్రీరామునిపై నీకుకూడా ప్రేమలేదా? మీ అమ్మ సంపాదించిన రాజ్యాన్ని అనుభవించక ఇక్కడకు ఎందుకు వచ్చావు? ఒకవేళ సీతారామలక్ష్మణులకు అపకారం చేయాలన్న తలంపు నీ మదిలో వుందా?" అని భరద్వాజుడు అడిగాడు. ఆ మాటలు విని భరతుడు చిన్నబుచ్చుకొన్నాడు. "ఓ మహాత్మా! అనుభవంలోను, జ్ఞానంలోను మీరు త్రికాలవేత్తలు. మీరు కూడా నన్ను సామాన్యునివలె సంశయించడం నాకు బాధ కలిగిస్తోంది. ఓ మౌనివర్యా!నాకు శ్రీరామునికి అపకారం చేయాలనే బుద్ధి ఏ నరములోను లేదు. ఇది నిజము. నేడు శ్రీరాముని అయోధ్యకు తీసుకువెళ్లాలనే తలంపుతో ఇక్కడకు వచ్చాను. నేను కేకయరాజ్యంలో వున్నపుడు మా అమ్మ చేసిన పనులతో నాకు ఎటువంటి సంబంధం లేదు. నేనేనాడు రాజ్యం కావాలని మా అమ్మతో చెప్పలేదు. నా ప్రమేయం లేకుండా జరిగిన దుస్సంఘటనలను సరిదిద్ది నా నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకోవాలనే వచ్చాను. దానికి మీ సహాయం కావాలి.

నా జ్యేష్ఠభ్రాత ఎక్కడున్నాడో నాకు మీరు చెప్పండి. నేను అక్కడికి వెళ్లి ఆయనను క్షమించమని అడిగి రాజ్యాన్ని చేపట్టుమని వేడుకొంటాను. నా ఉద్దేశం నా తలంపు ఇదే. దీనిని మీరు గ్రహించి నాపై దయచూపి నా కోరిక సఫలం కావాలని ఆశీర్వదించండి" అని భరతుడు భరద్వాజుని కోరాడు.

భరద్వాజుడు చిరునవ్వు నవ్వుతూ "ఓ నరోత్తమా!నీ గురించి నాకు సర్వం తెలుసు. కాని నీ మాటలచే నాకు తెలిసినదానిని వినాలని నిన్ను అడిగాను. నీవు చింతించనవసరంలేదు. నీ కోరిక నీ ఇనకుల వంశ ప్రతిష్ఠను పెంచేదిగా వుంది. వీరులకు వుండాల్సిన దయదాక్షిణ్యాలు నీకున్నాయి. రాజ్యం వీరభోజ్యం అయినా నీతి నియమాలకు కట్టుబడి రాజ్యాన్ని పరిపాలన చేయాలి అన్న నీ సంకల్పం సర్వులకూ ఆమోదయోగ్యం.

నీ అన్నవదినలతోపాటు నీ సోదరుడు లక్ష్మణుడు కూడా ఇక్కడకు దగ్గరలో ఉండే చిత్రకూట మహాపర్వతప్రాంతంలో ఉంటున్నారు.

ఓ రాజకుమారా! నీవు నీ మంత్రులు ఈరోజు నా ఆశ్రమంలో విందారగించి రేపు మీ సోదరుని చూచుటకు వెళ్లండి. నా కోరికను కాదనకండి" అన్న భరద్వాజునితో, "ఓ మునీశ్వరా! మీ ఆదేశం మాకు శిరోధార్యం. మీ కోరిక ప్రకారమే మేము నడచుకొంటాం" అని భరతుడు భరద్వాజునితో చెప్పాడు.

* * *

భరద్వాజుని ఆతిథ్యం

సర్గ - 91

"ఓ మునిపుంగవా! మీరు నాకు చక్కని ఆదరంతో ఆతిథ్యాన్ని ఇచ్చారుగదా! మరలా మీరు మా ఆతిథ్యం కోసం శ్రమపడకండి" అని భరతుడు చెప్పాడు. "ఓ భరతా! నీవు సైన్యాన్ని దూరంగా ఉంచి నీ మంత్రులను కూడా అక్కడే ఆపి నీవు ఒక్కడివే నాదగ్గరకు ఎందుకు వచ్చావు. నేను ఇప్పుడు నీ మంత్రులకు నీ సేనకు ఆతిథ్యం ఇవ్వాలని అనుకొంటున్నాను" అని భరద్వాజుడు చెప్పాడు.

"మునిశ్రేష్ఠా! రాజు, రాజపుత్రులు మీకు ఎల్లప్పుడు ప్రయత్నపూర్వకంగానే దూరంగా ఉండాలి. అదీకాక నా సేనలో గుర్రాలు, ఏనుగుల లాంటి జంతువులు కూడా వున్నాయి. అవి మీ ఆశ్రమవాతావరణాన్ని కలుషితం చేస్తాయేమోనన్న భయంతోను, ఇంతమందిని ఎందుకు వెంటబెట్టుకొచ్చావని మీరు అడుగుతారని నేను వారిని తీసుకురాలేదని" భరతుడు భరద్వాజునికి ప్రత్యుత్తరం ఇచ్చాడు. మీ సేననంతా వెంట తీసుకొనిరమ్మని ముని భరతుని ఆదేశించాడు.

భరద్వాజుడు ఆచమనం చేసి దైవోపాసన చేశాడు. భరతాదుల సేవకు విశ్వకర్మను పిలిచాడు. ఇంద్ర యమ, వరుణ, కుబేరులను ఆహ్వానించాడు. వారితో నేను భరతాదులకు ఆతిథ్యం ఇవ్వాలనుకొన్నాను. దానికోసం మీరు పనులను చేయండి అని చెప్పాడు. విశ్వకర్మ భరద్వాజ ముని ఆజ్ఞ పాటించి అక్కడి భూమినంతా చదును చేశాడు. రాజపుత్రులు, రాజమాతలు పరిచారికలు, సైనికులు, వారి బలాలు, పురుషులు, స్త్రీలు ఉండడానికి విచిత్ర కట్టడాలను నిర్మించాడు. సెలయేళ్లను, తటాకాలను పండ్లచెట్లను, నీడనిచ్చే వృక్షాలను, ఆహ్లాదపరిచే తరువులను ఏర్పరచాడు. ఇంద్రాదిదేవతలు వారికి సుఖాన్ని కలిగించడానికి పుష్పవృష్టిని కురిపించారు. వాయునందనుడు తన చల్లని పిల్లగాలులతో వారికందరికి హాయి గొల్పాడు. ఆ గాలి స్పర్శతో సేన అంతా ఆనందించింది. ముచ్చటైన ప్రకృతిని చూచి భరతుని సేన అబ్బురపడింది.

తూర్పు పడమరలుగా సాగిపోయే నదులను, ఆకాశంలోను, భూలోకంలోను ప్రవహించే నదులను ఆహ్వానించి భరతాదులకోసం ఇక్షురసాన్ని, ఖర్జూరాది ఫలరసాలను స్రవించమని భరద్వాజుడు ఆదేశించాడు. నదులన్నీ ముని చెప్పిన పనులు చేయడంలో మునిగిపోయాయి.

భరద్వాజుడు నృత్య, గాన వినోదాన్ని అందించాలనుకొన్నాడు. విశ్వావసువును, హాహా హూహూ దేవగంధర్వులను అప్సరసలను ఆహ్వానించాడు. మహేంద్రగిరిలో మయుడు నిర్మించిన ప్రదేశాలలో నివసించే ఘృతాచి, విశ్వాచి, మిశ్రకేశి, అలంబుస, నాగదంత, హేమ, హిమ లాంటి అప్సరసలను కూడా పిలిచాడు. రంభ, ఊర్వశి, మేనకలతోపాటుగా తుంబురుని ఆహ్వానించాడు. వారివారి అలంకరణ సామగ్రిని వారి గానానికి ఉపయోగించే ఉపకరణాలతో కూడి రమ్మని చెప్పాడు.

వారినందరిని భరతాదులకు సేవ చేయమని పురమాయించాడు. దివ్యులు విహరించే 'చైత్రరథం' అనే ఉత్తరకురుభూములలో ఉండే దివ్యవనాన్ని ఇక్కడకు రమ్మని పిలిచాడు. దివ్యవనం క్షణాలలో భరద్వాజుని ఆశ్రమానికి విచ్చేసింది. భరద్వాజుడు ఓషధులకు అధిపతి అయిన చంద్రుని పిలిచి రకరకాలు ఆహారపదార్థాలను (భోజ్యములు, భక్ష్యములు చోష్యములు, లేహ్యములు) భరతాదులకు అందించమని కోరాడు. నిష్ఠాగరిష్ఠుడైన భరద్వాజుడు తూర్పుదిక్కుకు నమస్కరించి మంత్రాలన్నీ పఠించాడు. వెంటనే ఆయన పిలిచిన వారందరూ వచ్చి వారికి చెప్పిన పనులు చేశారు.

పూమాలికలు, తేనె, పండ్ల రసాలు, గుజ్జులు తయారుచేసి ఇచ్చారు. చక్కని వీణామృదంగ వాద్యాలతో కూడిన గానాన్ని వారు వినిపింపచేశారు. అప్సరసలు నాట్యమాడారు. దేవదుందుభులు శ్రావ్యంగా వినిపించాయి. సుగంధాలను వాయువు మోసుకొచ్చింది. ఎవరికి కావలసినవాటిని వారికి నచ్చేవిధంగా అమర్చారు. విశ్వకర్మ శిల్పనిర్మాణం భరతాదులకు కనువిందు చేసింది. అశ్వశాలలు, గోశాలలు, గజశాలలు ఎద్దులు ఒంటెలు కుక్కలు ఉండడానికి ఏర్పాట్లు, స్త్రీ పురుషులు విహరించడానికి వారి అనువైన ప్రదేశాలు అక్కడ నిర్మాణం కావడం చూచి భరద్వాజుని గొప్పతనాన్ని వారందరూ వేనోళ్ల పొగిడారు.

దివ్యుల చైత్రరథంలో భరతాదులు సంచరించారు. రాజప్రాసాదద్వారాలు చక్కని తోరణాలతో అలంకరించారు. వాటిలో తల్పాలు, ఆసనాలు మనోహరంగా అమరాయి. రత్నాలు, ముత్యాలు, పగడాలు పొదిగిన ఆ రాజభవనంలోకి భరతుడు భరద్వాజునకు నమస్కరించి వెళ్లాడు. అందులో రాజసింహాసనం, ఛత్రచామరాలు భరతుడు చూశాడు. అవన్నీ శ్రీరామునివని తలచి వాటిపై శ్రీరాముడు ఆసీనుడైనట్లు భావించి వాటికి ప్రదక్షిణ నమస్కారాలు చేశాడు. భరతుడు మంత్రి కూర్చునే ఆసనంపై కూర్చున్నాడు. వారివారి అర్హతలనుసరించి భరతునితో వచ్చిన అమాత్యులు గురువులు ఆసీనులయ్యారు. అంతలో బ్రహ్మదేవుడు ఇరవై వేల మంది అప్సరసలను అక్కడికి పంపించాడు. కుబేరుడు కూడా అప్సరసలను వారి సేవకు వినియోగించాడు. సూర్యకాంతిని వెదజల్లే నారద తుంబురులు వచ్చి భరతుని ఎదుట గానాలాపం చేశారు. మిశ్రకేశి పుండరీక వామనలాంటి అప్సరసలు భరద్వాజుని ఆజ్ఞ ప్రకారం భరతుని ఎదుట నాట్యం చేశారు.

దేవదారు, తాళ, ఎర్రగోరింట, కానుగ చెట్లను చూచి భరతుని దగ్గరున్న గూనివారు పొట్టివారు ఆనందంగా వాటి దగ్గరకు వెళ్లారు. శింశుప, ఉసిరిక, నేరేడు, మాలతి, మల్లిక జాజి లాంటి చెట్ల లతలు స్త్రీ రూపంలో వచ్చి భరతాదులతో 'ఇక్కడ పూలనుంచి సేకరించిన తేనె, పండ్ల రసాలు, పాయసాలు, మధురఫలాలు మీకోసమే ఉన్నాయి. వీటన్నింటిని మీరు ఇష్టంగా ఆస్వాదించి ఆనందించండి' అని చెప్పారు.

అలసిపోయిన భరతసేనకంతా నదీతీరాలలో అభ్యంగన స్నానాలు చేయడానికి అప్సరసలు ఏర్పాటుచేశారు. వారి సేవలో పురుషులు, స్త్రీలు బడలికను మరచిపోయారు. జంతువులు శ్రమ మర్చిపోయేటట్లు మేతవేసి వాటిని శుభ్రపరిచారు. వాటిచే నీరు త్రాగించారు. అవి కూడా అలసట మర్చిపోయి హాయిని అనుభవించాయి. వాటికి తేనెతో కలిపిన పేలాలను చెరకు గడలను పెట్టారు. పురుషులందరూ మేము శ్రీరాముని గూర్చివచ్చి ఇక్కడ స్వర్గ సుఖాలను అనుభవిస్తున్నాం. మేము అయోధ్యకు, దండకారణ్యానికి రాము. శ్రీరాముడు, భరతుడు క్షేమంగా ఉందురుగాక! అని పలవరించారు. చోదకులందరూ మితిమీరిన ఆనందంతో గుర్రాలను, గజాలను అదుపు చేయలేక స్వర్గమంటే ఇదే ఇదే అని బిగ్గరగా అరవసాగారు.

ఆ సైనికులందరూ అప్సరసల సేవలో అమృతతుల్యాలైన భోజ్యపదార్థాలు కడుపునిండా తిని మరల వాటిని తినాలని త్రాగాలనే ఆశ పడుతున్నారు. దాసదాసీజనాలు స్త్రీలందరూ నూతన వస్త్రాలు, ఆభరణాలు ధరించి సంతోషంగా అటు ఇటు పరుగెడుతూ ఆనందిస్తున్నారు. జంతువులన్నీ శ్రమపడకుండానే కావాల్సిన ఆహారాన్ని తిని హాయిగా నెమరువేసుకుంటూ ఉండిపోయాయి.

భరతాదులకు అక్కడ చోద్యాలన్నీ చూస్తున్నకొద్దీ చూడాలనే అనిపించసాగాయి. బంగారు పాత్రలలో తెల్లని అన్నం, ఘుమఘుమలాడే వింతవింత ఆహారపదార్థాలు వాటి శోభను ఇనుమడింప చేస్తూ చక్కని పుష్పాలంకరణ వారిని మైమరపింప చేసింది. మధురపానీయాలు తొణికిసలాడుతున్నాయి. పాలు, పెరుగు, జీలకర్ర వేసిన మజ్జిగ, పాయసాలు, చక్కెరలు నిండిన వివిధాకృతులు కల పాత్రలు మనోహరంగా ఉన్నాయి.

స్నానం చేసేవారికి ఉసిరికపొడి, సుగంధిల చూర్ణాలు, కషాయాలు అమర్చారు. దంతధావనం చేసేవారికి తెల్లని కూర్చలు, పండ్ల పొడులు సిద్ధం చేసారు. వస్త్రాలు, పాదరక్షలు, అంగరాగాలు, లేపనాలు, అద్దాలు గుట్టలు గుట్టలుగా పేర్చారు. స్త్రీలకు పురుషులకు పనికివచ్చే అలంకార వస్తువులు అమర్చారు.

అక్కడక్కడా కొలనులున్నాయి. అవి జంతువులు దిగడానికి పనికివచ్చేట్లు ఏర్పాట్లుచేసి వున్నాయి. తటాకాలలో కలువలు, తామరలు కుదురుకొని నీటిని కప్పి వేస్తున్నాయి. స్వచ్ఛమైన జలం ఈదడానికి అనువుగా వున్నాయి. 'యవస' గడ్డితో కూడిన పచ్చిక బయళ్లు కనువిందు చేస్తున్నాయి. తివాసీలు పరచినట్లు అనిపించే అక్కడి పచ్చిక చూపరులను ఆకట్టుకొంటున్నాయి.

భరద్వాజుని ఆతిథ్యానికి మురిసిన భరతాదులు ఇది నిజమా? కలా అన్న భ్రమలో ఆశ్చర్యానుభూతులకు లోనయ్యారు. అతిథులందరూ మైమరచి ఆ రాత్రంతా హాయిగా గడిపారు. తెల్లవారగానే భరద్వాజుని ఆహ్వానితులందరూ ఆయన అనుమతి పొంది వారివారి నిజస్థానాలకు వెళ్లిపోయారు.

అయోధ్యావాసులందరూ తెల్లవారినప్పటికీ వారి సుఖనిద్రను వదలలేకపోయారు. వారి శరీరాలకు అలముకొన్న సుగంధలేపనాలు అలానే ఉన్నాయి. వారు ధరించిన అలంకారాలు పుష్పమాలికలు చెల్లాచెదరుగా ఉన్నాయి. వారంతా మేను మరచి నిద్రలోనే జోగుతున్నారు.

* * *

భరతాదులు - చిత్రకూట ప్రయాణం

సర్గ - 92

సూర్యోదయం కాగానే భరతుడు భరద్వాజుని దగ్గరకు వచ్చాడు. అగ్నిహోత్రాన్ని పూర్తిచేసుకొని కూర్చున్న ముని ముకుళిత హస్తుడైన భరతుని చూసి "భరత కుమారా! రాత్రి మీకు హాయిగా గడిచిందా? మీ పరివారానికి ఆతిథ్యంలో ఏ లోటు రాలేదు గదా? మీరందరూ సంతోషంగా ఉన్నారా?" అని అడిగాడు.

ముని పుంగవునికి నమస్కరించి "అయ్యా! మీ నీడలో మేం ఆనందాన్ని పొందాం. నా అమాత్యులు, సైన్యం అందరూ తృప్తి పొందారు. మీ వాత్సల్యాన్ని నాపై చూపి నా సోదరుని ఉనికిని నాకు తెల్పండి. నేను నా అన్న దగ్గరకు వెళ్ళడానికి అనుమతి ఇవ్వండి. సులభంగా మేమందరం అక్కడికి చేరడానికి మార్గాన్ని చూపండి" అని భరతుడు అభ్యర్థించాడు.

"రాజకుమారా! ఇక్కడి పదిక్రోసుల దూరంలో చిత్రకూటం ఉంది. ఆ గిరికి ఉత్తర భాగంలో మందాకినీ నది ప్రవహిస్తూ ఉంటుంది. ఆ పర్వతంపై సెలయేళ్ళు, వనాలు రమణీయంగా ఉంటాయి. ఆ నదికిరువైపులా సమృద్ధిగా వృక్షసంపద ఉంది. అక్కడి ప్రకృతి నయనానందకరంగా ఉంటుంది. పుష్పవనాలు, చెట్లతోపులు, వన్య మృగాలు, చిన్న పెద్ద జంతువులు అక్కడ తిరుగాడుతూ ఉంటాయి. అక్కడ ఎందరో తాపసులు వారి తపస్సులను కొనసాగిస్తుంటారు. ఆ నదీప్రాంతంలోనే సీతారామలక్ష్మణులు పర్ణశాల నిర్మించుకొని జీవిస్తుంటారు. ఓ భరతా! యమున దక్షిణ తీరంలో రెండు దోవలున్నాయి. అందులో దక్షిణదిశగా వెళ్ళే దారిలో నీ సైన్యాన్ని నడిపించు. నీవు శ్రీరాముని దర్శనం చేయగలవు అని భరద్వాజుడు భరతునికి చెప్పాడు.

రాజమాతలు ముగ్గురూ పతివియోగంతో కృశించి దీనలై భరద్వాజునికి ప్రదక్షిణనమస్కారాలు చేశారు. తన మాట నెగ్గక ఒక ప్రక్క, లోకనిందకు గురై మరోప్రక్క కైక కుంగిపోయి సిగ్గుతో కుంచించుకుపోయి ఒక పక్కగా నిలబడింది. సర్వజ్ఞుడైన మహర్షి భరతుని చూసి నీ ఈ ముగ్గురుతల్లులలో ఎవరు ఎవరో తెలుసుకొనగోరుతున్నాను అని అన్నాడు. దానికి భరతుడు "పూజ్యమహర్షీ! పట్టరాని దుఃఖంలో మునిగిపోయి పతిని శాశ్వతంగా దూరం చేసుకొని ఒక్కగానొక్క కన్నకొడుకును దూరం చేసుకొని దీనంగా విలపిస్తున్న ఈ పెత్తల్లే శ్రీరాముణ్ణి కన్న ధన్యురాలు. కౌసల్యాదేవి ఈమె నోముల పంటే మా తండ్రిగారి జ్యేష్ఠపుత్రుడు. ఈమెకు ఎడమవైపున నిలచిన తల్లి సుమిత్రాదేవి. ఈమె వీరులైన లక్ష్మణశత్రుఘ్నుల్ని కన్న ధన్యాత్మురాలు. నా పక్కనే నిలబడి ఉన్న ఈమె కడు నిర్దయురాలు, వివేకశూన్యురాలు, అహంభావి, లోభం కలది, ఐశ్వర్యదాహం కలది, సదాచారం తెలిసినట్లు కనిపించే దుర్మార్గురాలు. ఈమె నా తల్లి. దశరథుని మరణానికి, శ్రీరాముని అరణ్యవాసానికి హేతువుగా నా తల్లి ఐన కైక" ఈమె అని గద్గదకంఠంతో తన తల్లులను మహర్షికి పరిచయం చేశాడు.

దుఃఖం ఎక్కువై భరతుని కన్నులు ఎర్రబారాయి. నాగుపాములాగా నాసికా రంధ్రాలనుండి శ్వాస బుసకొడ్తోంది. అని చెప్పి దుఃఖిస్తున్న భరతుని చూసి భరద్వాజుడు "భరతా! నీవు, నీ తల్లైన కైకలో దోషగుణాన్ని ఎంచకు. శ్రీరాముని అరణ్యవాసం మహర్షులకు, మానవులకు ఉపయుక్తంగా ఉంటుంది. వనవాసానంతరం ఉత్తమమైన ఫలాలను మీరు పొందుతారు. శ్రీరాముడు ఆచంద్రార్కమైన యశఃకీర్తులను ఆర్జిస్తాడు. సూర్యచంద్రాదులు ఉన్నంతకాలం మీ వంశప్రతిష్ఠ నిలిచి ఉంటుంది. జరిగేదంతా దైవ నిర్ణయమని భావించి నీ కర్తవ్యాన్ని నీవు చేయి" అని హితోపదేశం చేశాడు.

భరద్వాజుని అనుమతిని తీసుకొని, మార్గాన్ని కనుగొని చిత్రకూటం బయలుదేరాలని భరతుడు పూనుకొన్నాడు. సేననంతా వివిధ వాహనాలలో బయలుదేరమని చెప్పాడు. వారందరూ భరద్వాజుని ఆశీస్సులను పొందారు. భరతుడు, శత్రుఘ్నుడు, కౌసల్యాదులు, మంత్రులు అందరూ మహర్షికి అభివాదం చేసి ఆశీర్వాదాలను తీసుకొన్నారు.

రాణులందరూ వారి వాహనాలు ఎక్కారు. శుభలక్షణులైన భరతుడు శత్రుఘ్నుడు వసిష్ఠుని అనుమతి తీసుకొని రథాన్ని అధిరోహించారు. రథాలు, అశ్వాలు, గజాలు, చతురంగబలాలు పాదచారులు అందరూ భరతునితో శ్రీరాముని దర్శించాలన్న ఆరాటంతో సంతోషంగా చిత్రకూటానికి బయలుదేరారు. మృగాలు, పక్షులతో నిండిన వనాలను దాటుతూ వారందరూ ఒక మహావనంలోకి ప్రవేశించారు.

* * *

నరసంచారం

సర్గ - 93

అశేషజనులతో నిండిన సేన మహావనంలో ప్రవేశించింది. ఆ సేన వల్ల ఉత్పత్తి అయిన ధ్వనితో వనంలో గుంపులుగా తిరిగే వన్య ప్రాణులు భయపడి చెల్లాచెదరయ్యాయి. మదపుటేనుగులు ఘీంకరిస్తూ పరుగులు తీశాయి. వాటిని చూచి దుప్పులు, జింకలు బిత్తరచూపులతో చెంగుచెంగున ఎగురుతూ తలో దిక్కుకు పరుగెత్తాయి. ఎలుగుబంట్లు చిన్న చిన్న జంతువులు అన్నీ భయపడి పారిపోతున్నాయి. రథచక్రాల శబ్దం, ఏనుగులు అశ్వాలు చేసే భీకరమైన ధ్వని, సైనికుల కోలాహలం, నడిచేవారి నిట్టూర్పులు, పల్లకీ మోసేవారి వంత పాటలు అన్నీ కలిసి ఆ అడవిని మారుమోగించాయి.

ధర్మాత్ముడైన దశరథసుతుడు శ్రీరాముని దర్శనం త్వరలో కలుగబోతున్నది. సంతోషంగా ముందుకు వెళ్తున్నాడు. వారు ఏకధాటిగా చాలాదూరం ప్రయాణించారు. ఏనుగులు, అశ్వాలు అన్నీ అలిసిపోయాయి. సైనికులంతా డస్సిపోయారు. సంతోషంతో నడుస్తున్నా ప్రయాణపు బడలిక వారి ముఖంపై కనబడుతోంది.

భరతుడు దానిని గమనించాడు. సమయస్ఫూర్తి ఆలోచన శక్తి ఉన్న ఆ రాజకుమారుడు వసిష్ఠునితో "మహర్షీ! ఈ వనప్రదేశం చూస్తుంటే ఇదే భరద్వాజుడు తెలిపిన చిత్రకూటంలా ఉంది. మనం మందాకినీ చిత్రకూట మధ్యప్రదేశానికి వచ్చినట్లుగా అనిపిస్తోంది" అని భరతుడు అంటూ చుట్టుపక్కలంతా పరికించిచూస్తున్నాడు. శత్రుఘ్నా! అదుగో నల్లని పర్వతశిఖరాలు ఎత్తుగా కనిపిస్తున్నాయి. ఈ నల్లని పర్వత శిఖరాలపై ఉన్న ఈ వృక్షాలు వాటి చివర్లో పూచిన పూలు స్త్రీల కొప్పున అలంకరించిన పూతూలికవలె కనబడుతున్నాయి. ఇది నిర్జనారణ్యంవలె నిశ్శబ్దంగా ఉంది. కాని నేడు మనందరిచే నిండి నాకు అయోధ్యను తలపిస్తోంది. మన సేనావాహిని చేసే ధ్వనులకు ఇక్కడి వనచరాలు భయపడి గాలిచే ఎగురకొట్టబడే నీలమేఘంలాగా పరుగెత్తుతున్నాయి.

ఈ పర్వతాలు, సెలయేళ్ళు, వన్యమృగాలు, వృక్షసంపద అన్నీ మనం చిత్రకూటం చేరినట్లుగా తెలుపుతున్నాయి. మన రథాలన్నీ శ్రీరాముని దర్శనార్థమై పరుగులు తీస్తున్నాయి. శత్రుఘ్నా! చూడి గుర్రపు గిట్టలవల్ల లేచిన దుమ్ము ఆకాశం అంతా కప్పివేస్తుంది. వాయువు దాన్ని మరో చోటికి కొనిపోతున్నట్లుగా నాకు అనిపిస్తోంది. ఇటు చూడు సోదరా! అందమైన పింఛాలుగల ఈ నెమళ్ళు మన రథాల జోరుకు భయపడి ఎట్లా పరుగెత్తుతున్నాయో! తాపసులకు నెలవైన ఈ పవిత్రభూమి నిజంగా భూతలస్వర్గ మనవచ్చు. మనం ఇక్కడ ఆగుదాం. ఈ ప్రదేశంలోనే ఎక్కడో శ్రీరాముడు ఉండి ఉంటాడు. మన సైనికులందరూ తలో వైపు వెళ్ళి రామచంద్రుని జాడను తెలుసుకొని వస్తారు" అని భరతుడు శత్రుఘ్నునితో అన్నాడు. భరతుని ఆదేశాన్ని విన్న వారందరూ శస్త్రాలు పట్టుకొని శ్రీరాముని వెదకడానికి వెళ్ళారు. వారు కొద్ది దూరం ముందుకు సాగారు. అలా సాగిన వారికి ఒక చోట ఎత్తుగా లేస్తున్న పొగలు కనిపించాయి. దాన్ని చూచిన వారికి ఆనందం కలిగింది. వెంటనే వెనక్కు తిరిగి భరతుని దగ్గరకు వచ్చారు. "ఓ రాజకుమారా! మేము ఇక్కడికి కొంతదూరంలో పొగను చూశాము. పొగ అగ్ని వల్ల సంభవిస్తుంది కదా. అగ్ని ఉండే చోట తప్పక నరులు ఉండి ఉంటారు. వారు శ్రీరామచంద్రులే అయి ఉంటారని చెప్పారు. ఒకవేళ శ్రీరాముడు కాకపోయినా తపస్వులు అయినా ఉంటారు. వారి నడిగి మన రామచంద్రుని జాడ తెలుసుకోవచ్చుననే ఆనందంతో మీకు చెప్తున్నాం" అని అన్నారు.

వారి మాటలకు భరతుడు ఎంతో సంతోషించాడు. శ్రీరాముని త్వరలో కలుసుకోబోతున్నామన్న ఆనందం ఆయన కళ్ళల్లో దోబూచులాడింది. వెంటనే భరతుడు "మీరందరూ ప్రశాంతంగా ఇక్కడే ఉండండి. నేను, సుమంత్రుడు గురువు అయిన వసిష్ఠునితో వెళ్లి శ్రీరాముణ్ణి చూచి వస్తాం" అని చెప్పాడు. దానికి అందరూ సంతోషంగా ఆమోదించారు. భరతుడు ధూమశిఖలపైనే దృష్టి నిల్పి శ్రీరాముని దర్శనం కలగబోతుందన్న ఆత్రంతో వడివడిగా నడవసాగాడు.

* * *

చిత్రకూట వర్ణన

సర్గ - 94

చిత్రకూటపర్వతం మీద నివసించే శ్రీరాముడికి గిరులన్నా, తరులన్నా చాలా ఇష్టం. అందువల్ల ఒక రోజు సీతతో కలిసి వనవిహారం చేయడానికి వెళ్ళాడు. అలా వారు చిత్రకూటంలో చిత్రవిచిత్రాలను చూస్తూ తన్మయం చెందుతూ తిరుగుతున్నారు. "ఓ కల్యాణీ! రాజ్యాధికారం దూరం అయినా, బంధుమిత్రులు దూరం అయినా, ఇక్కడి రమణీయ దృశ్యాలు చూచి నా మనస్సు బాధను మరచి హాయి ననుభవిస్తోంది. నీ మనస్సు కూడా ఈ మనోహరదృశ్యాలు చూచి ఆనందిస్తోంది కదా!" అని అడిగాడు. "తనువులు వేరైనా ఆత్మ ఒకటిగా ఉన్న మనలో నా మనస్సు వేరే విధంగా ఎందుకుంటుంది స్వామీ! నేనూ మీవలె ఆనందాన్నే అనుభవిస్తున్నాను" అని చెప్పింది సీత!

"ఓ సుందరీ! ఈ పర్వతం అందచందాలు చూడు. ఎత్తుగా ఉన్న శిఖరాలు ఆకాశాన్ని అంటుకొంటు న్నాయా! అని అనిపిస్తున్నాయి కదా! ఈ పక్షులు చేసే ధ్వనులు మృదుమధురంగా మన వీనుల విందొనరిస్తున్నాయి. ఈ ఎర్రని ఇంద్రనీల మణి, పుష్యరాగం, స్ఫటికాలవలె శోభలీనే ఈ ధాతువుల సమృద్ధితో ఈ చిత్రకూటం మరింత శోభాయమానంగా ఉంది. ఈ ధాతువులలో కొన్ని నక్షత్రాల మెరుపును కలిగి ఉంటే మరికొన్ని పాదరసాన్ని పోలి ఉన్నాయి కదా సీతా! అంటూ పర్వత శోభనంతా సీతకు వర్ణించి చెప్తున్నాడు. "ఈ మృగాలు సైతం చిత్రకూటంలో తమ నైజాన్ని మరచి హాయిగా సంచరిస్తున్నట్లు ఉన్నాయి. హింసావృత్తిని వీడి స్నేహంగా తిరుగాడుతున్నట్లుగా అనిపిస్తోంది. పెద్దపులులు, ఎలుగుబంట్లు, సింహాలు, చిరుతలు తిరుగాడే ఈ ప్రదేశంలోనే చెవులపిల్లులు, దుప్పులు, వన్యప్రాణుల మనస్సుపై కూడా ఈ పర్వతం తన ప్రభావాన్ని చూపిస్తున్నట్లు ఉంది కదా."

"ఈ వృక్షాలలో మామిడి, నేరేడు, వేగిస, మోరటి, పనస, చంద్ర, ఉడుగు, గజపిప్పలి, నెమ్మి, మారేడు, తుమ్మి, డేకు, వేప, ఇప్ప, తిలక చెట్లు ఎన్ని రకాలున్నాయో! వీటిని చూసి, తెలుసుకొనే భాగ్యం మనకు ఈ వన జీవితంలో ఒనగూడింది కదా. మా వంశంలోని పూర్వులు నియమబద్ధంగా వనవాసాన్ని చేసినవారికి అమృతత్వం సిద్ధిస్తుందని చెప్తారు. అది నిజమేనని అనిపిస్తోంది. మంకెన, వేత్ర, ఏఱుమద్ది, దానిమ్మ చెట్లు నేత్రపర్వంగా ఉన్నాయి. ఎత్తుగా సాగిన చెట్లు, శాఖోపశాఖలతో విస్తరిల్లిన చెట్లు భారాన్ని మోయలేక ఆసరాగా ప్రక్క వృక్షాలను అల్లుకొని చెట్లు నీకు నే ఉన్నానులే అని చెప్తున్నట్లు అనిపిస్తాయి కదా. ఈ రెండు మూడు రకాల చెట్లు పెనవేసుకొని పెరగటానికి చూస్తే పరస్పర సహకారంతోనే జగత్తు నడుస్తోందని బ్రహ్మ చెప్పక చెప్తున్నట్లుగా అనిపిస్తోంది."

"ఈ వృక్షాలు ఇచ్చే చల్లని నీడలు, ఆకలి తీర్చడానికి ఇచ్చే ఫలాలు, మానసికానందానికి ఇచ్చే మనోహర మైన పూలు, ఇంద్రియ ఆనందాన్నిచ్చే పరిమళభరిత సుగంధం, ఇవన్నీ అందించే ఈ వృక్షరాజాలను మించినవి ఏవీ ఈ సృష్టిలో లేవనిపిస్తోంది. పరుల కోసమే పెరిగే ఈ చెట్లు మానవులకు జ్ఞానబోధ చేస్తున్నట్లుగా ఉన్నాయి."

"ఈ అత్యద్భుతశోభలో ఈ అందా లొలికే కొండచరియల్లో విహరిస్తున్న ఈ కిన్నర జాతి ప్రేమజంటలను చూడు. వారు ఒకరికై ఒకరు ప్రకృతి పురుషుల్లా చూసేవారికి గగుర్పాటును కలిగిస్తున్నారు. ఈ విద్యాధరులు వారి సతులతో కూడి ఇక్కడే ఆనందాన్ననుభవిస్తున్నారు."

"ఈ పర్వతశిఖరంపై నుండి జాలువారే ఈ జలపాతాలు భూమిని చీల్చుకొని ఉబికి వచ్చే ఈ నీటి ఊటలు, చిన్నచిన్న తటాకాలు, సెలయేళ్లు ధారగా స్రవిస్తున్న నదులు, అన్నీ కనువిందు చేస్తున్నాయి. చతుర్ముఖుని సృష్టిని మెచ్చుకోలేని మనస్సు ఉండదేమో ననిపిస్తోంది. ఓ సుందరీ! నీ సాహచర్యం, లక్ష్మణుని సేవ, ఈ పర్వతరాజం అందించే అహ్లాదంతో ఎన్ని ఏళ్ళు ఐనా ఇక్కడే నేను మనగల ననిపిస్తోంది. అయోధ్యానగరాన్ని వీడిన దుఃఖం నాలో అంతరించిపోతోంది. ఈ పర్వతశిఖరాలు వృక్షాలకు, సెలయేళ్ళకు ఆటపట్టై ఒప్పారుతున్నాయి గదా.

ఈ మన వనవాసం నా మనస్సుకు ఆహ్లాదాన్నే కాదు, రెండు మహత్తరఫలాలను కూడా నాకిచ్చింది. ఒకటి పితృణం తీర్చుకొనే భాగ్యం. తమ్ముడైన భరతునికి ఆనందాన్ని కలిగించే సౌభాగ్యం నాకు దక్కింది గదా. ఇంతకుమించిన ఫలాలు నాకు అక్కరలేదనిపిస్తోంది ప్రియా!" అని శ్రీరాముడు తన మనస్సులోని భావాలను తన సతితో పంచుకొంటున్నాడు.

"సీతా! ఈ ఆనందంవల్ల, వనవాస జీవితం వల్ల మనకు పరమపదం కూడా లభిస్తుంది. ఈ పర్వతంపై పలు రంగులతో ఉన్న ఓషధులు రాత్రివేళ కూడా జ్వలిస్తూంటాయి. ఓ ప్రియా! ఈ పర్వతంపై ఉన్న గుహల అందం కూడా వర్ణించలేనిది. ఈ గుహలు మన గృహాలవలె నివాసయోగ్యమైనవిగా ఉన్నాయి. కావాలని పెంచి పోషించుకొనే ఉద్యానవనాలకు మించిన పూదోటలు ఈ ప్రకృతిలో రమణీయకాంతులీనుతాయి. సంపెంగ మల్లె మాలతీ లాంటి పుష్పభరితమైన మొక్కలు ఒక చోట చేరి చూపరుల మనసులను దోచుకొంటున్నాయి. ఈ పర్వతంపై ఏకశిలలు చాలా విస్తీర్ణాన్ని ఆక్రమించుకొని ఉన్నాయి."

"ఓ వైదేహీ! ఇటు చూడు ఈ పర్వతరాజం ఎంత మనోహరంగా ఉందో. విలాస స్త్రీ పురుషులు ఉత్పల, పున్నాగ భూర్జపత్రాలతో శయ్యలు ఏర్పాటుచేసుకొని ఉన్నారు. వాటిని కప్పుతూ తామరాకులు కూడా పరచి ఉన్నాయి. వారు వారి రతికేళిలో మధురఫలాలు ఆరగించి మిగిలిన భాగాలను అక్కడే పడేసి ఉన్నట్లుగా వీటిని చూస్తే అనిపిస్తోంది గదా."

"ఈ చిత్రకూటం రుచికరాలైన మధురఫలాలు, పుష్టినిచ్చే కందమూలాలు, దుంపలు, దాహార్తిని తీర్చే నీటి ధారలు, ఆహ్లాదానిచ్చే వృక్షరాజాలతో సంపన్నమైన అమరావతిని తలపిస్తోంది. కుబేరుని అలకాపురి సైతం దీనిముందు వెలలేనిదిగా చేసి ఈ చిత్రకూటం విరాజిల్లుతోంది."

"ఓ ప్రాణేశ్వరీ! వనవాస నియమాలు పాటిస్తూ, సత్పురుషుల మార్గంలో మసులుతూ, మీతో కలిసి జీవనం పదునాలుగేళ్ళు సంతోషంగా నాకు సాగిపోతాయి. అప్పుడు మనం వంశ కీర్తిప్రతిష్ఠలను పెంచిన వారమవుతాం" అని శ్రీరాముడు సీతతో కలిసి వనవిహారం చేస్తూ తన భావాలను తన ప్రాణసఖితో పంచుకొంటున్నాడు.

* * *

మనోహరమందాకిని

సర్గ - 95

సీతారాములు అలా తిరుగుతూ తిరుగుతూ మందాకినీతీరప్రాంతానికి చేరారు. వారి మనస్సులు ఆ స్వచ్ఛమైన జలాన్ని ఇసుక తిన్నెలను చూచి హాయి ననుభవించాయి. ఒప్పులకుప్ప ఐన వైదేహిని కమలాలవంటి కన్నులు ఉన్న శ్రీరాముడు చూచి "ఓ సీతా! ఈ అందమైన మందాకిని సోయగం చూడు. ఎంత నిర్మలంగా ఒద్దికగా సాగుతుందో కదా! ఈ మందాకినికి ఇరువైపులా ఉన్న చెట్లు రాల్చే ఈ పూలు చూస్తుంటే మందాకిని సోయగాన్ని చూచి పర్వతుడు తన్మయంతో చిందులేస్తున్నాడా అనిపిస్తోంది గదా.

మందాకిని స్వచ్ఛతకు మనస్సు పడి హంసలు, చక్రవాకాలు ఇందులో మునకలు వేస్తున్నాయి. మందాకినిలో విచ్చుకొన్న కమలాలు కంటికి విందు చేస్తున్నాయి. ఈ పర్వతంలోని వన్యప్రాణులన్నీ ఈ నదిజలంతో తృప్తి అనుభవిస్తున్నాయి. గజరాజులు తమ రాణులతో కలిసి ఈ నదిలో జలకాలాడుతున్నాయి. ఓ జానకీ! అటు చూడు అక్కడ నారచీరలు ధరించి జటాధారులైన మౌనులు మందాకినిలో స్నానాలు ఆచరిస్తున్నారు. ఇంకొందరు బాహువులు ఎత్తి నమస్కరిస్తూ తపస్సు చేస్తున్నారు. ఈ ఎత్తుగా ఉన్న ఇసుకతిన్నెలు వాటి దగ్గర ఉన్న తీరంలో సిద్ధులు గుంపులుగా చేరి స్నానపానాదులు చేస్తున్నారు. నీవు నా పక్కనే ఉండడం వల్ల ఈ పర్వతపు అందం ఈ మందాకినీ రామణీయకం మరింత వన్నెలీనుతున్నాయి. నీవు నీ సఖులతో క్రీడించినట్లే ఈ మందాకినిలో క్రీడించు. ఈ నదీ జలం ఎంతో పావనమైనది. ఆ జలాలు చెట్లకు, జంతువులకు దాహార్తిని తీర్చి పుణ్యం మూటకట్టుకొన్నాయి. లక్ష్మణుడు నా కనుసన్నలలో మెలగుతూ నాకు అలసట తెలియనీయకుండా సేవలు చేస్తున్నాడు. నీవు నా మనస్సెరిగి ప్రవర్తిస్తున్నావు. అందుకే నాకు అయోధ్య మరపుకు వస్తోంది. మైథిలీ! నీతో కూడి నేను త్రికాలాల్లోను ఈ మందాకినీలో స్నానం ఆచరిస్తున్నాను. నియమబద్ధజీవితాన్ని సునాయాసంగా ఈదుతున్నాను. కందమూలాలు, ఫలాలు తింటూ నేను మనస్సును అదుపులో ఉంచుకొన్నాను. అందుకే ఈ చిత్రకూటం, ఈ మందాకిని నాకు అమరావతిని తలపిస్తున్నాయి.

లేళ్ళగుంపులు నదిలో మునుగుతూ తమ శరీరపువన్నెను మందాకినికి చుట్టబెట్టుతున్నాయి. ఎరుపు, పసుపువర్ణాలు కలసి వింత శోభను కూర్చుతున్నాయి. సింహాలు, ఏనుగులతో కలసి వానరాలు ఆడుతున్నాయి. ఇక్కడి వనచరాలన్నీ విరోధభావాన్ని మానివేసి పరస్పరసహకారభావాన్ని వృద్ధిచేసుకొన్నట్లున్నాయి. దానికి కారణం ఈ వనంలోని జలాల వృక్షాల పరోపకార గుణమేనేమో! వాటిని చూచి భరద్వాజమహర్షి ఇక్కడ నివసించే నరులు చిత్తవిభ్రమను త్రోసి, తాపసజీవనంతో నరోత్తములు అవుతారని చెప్పారు. ఎంతైనా ఇక్కడ రమణీయ దృశ్యాలు వర్ణించడానికి మాటల మూటలు చాలావేమో అనిపిస్తుంది." అంటూ శ్రీరామచంద్రుడు సీతకు చిత్రకూటాన్ని మందాకినీసౌభాగ్యాన్ని వర్ణించి చెప్పుతూ విహరించసాగాడు.

* * *

ప్రశాంతవాతావరణంలో అలజడి

సర్గ - 96

సీతారాములు వనవిహారం చేస్తూ మందాకినీశోభలకు అచ్చెరువొందారు. అలా తిరుగుతూ ఒక చోట కూర్చుని అక్కడ దొరికే వనాహారాన్ని సీతకు రాముడు రుచి చూపిస్తున్నాడు. అంతలో భరతుని సేన ముందుకు వస్తుండడంతో అశ్వాలు, గజాలు, పాదచారుల వల్ల రేగిన దుమ్ము కొండలా ఆకాశాన్ని కమ్మివేస్తూ సేనవల్ల భీకర ధ్వనులు ఆ ప్రదేశాన్ని చుట్టుముట్టాయి.

ఆ ధ్వనికి వనచరాలు భయపడి పరుగులు లంకించుకొన్నాయి. సేనాపరాగాన్ని చూచి ఏదో ఉత్పాతం వస్తోందేమోనని లేళ్ళు కుందేళ్ళ లాంటి జంతువులు బిత్తరచూపులతో నలుదెసలా చూస్తూ పరుగెత్తుతున్నాయి. ఈ వనచరాల అలజడి, ఈ మహాధ్వనికి కారణం ఏమిటో సీతారాములకు అంతుచిక్కడంలేదు. వారు నలువైపులా పరికించి చూశారు. వారి కంటికి కనిపించినంత దూరంలో ఏ అవాంతరం లేదు. ఈ ప్రశాంతస్థితిని భంగపరిచే హేతువేమిటో కనుగొనమని శ్రీరాముడు లక్ష్మణునికి చెప్పాడు.

"ఓ సౌమిత్రీ! మేఘఘర్జన వలె వినిపిస్తున్న ఈ ధ్వని ఎక్కడనుంచి వస్తోందో కనిపెట్టు. ఏనుగులు, దున్నలు కూడా భయంతో పరుగెత్తుతున్నాయి. ఎవరైనా రాజుగాని, రాజకుమారులు గాని వేటాడుటకు వచ్చారా? లేక క్రూరమృగాలేమైనా ఈ జంతువులపైకి వచ్చాయా? తెలుసుకో. బాగా అలవాటుపడిన పక్షులు కూడా ఇక్కడ రావడంలో పొరబాటుపడతాయి గదా. రాజులుగాని, వేరే ప్రాంతానికి చెందిన జంతువులు కాని ఇక్కడికి రావడం అసాధ్యం కదా! మరి ఈ మహాధ్వనికి కారణం ఏమిటో యథార్థంగా తెలుసుకొని నాకు చెప్పు" అని శ్రీరాముడు లక్ష్మణునికి చెప్పాడు.

వెంటనే సౌమిత్రి దగ్గరలో ఉన్న ఒక మర్రిచెట్టు ఎక్కాడు. చెట్టుచివర వరకు ఎగబ్రాకి నలుప్రక్కలా పరికించి చూశాడు. ఉత్తరం వైపు మహాసైన్యం ఉండడం లక్ష్మణునికి కనిపించింది. రథాలు, అశ్వాలు, గజాల తోటి ఉన్న ఆ మహాసేనను తేరిపార చూశాడు. రథంపై ఎగురుతున్న కేతనాన్ని పరీక్షగా చూశాడు. లక్ష్మణునికి పట్టరాని ఆగ్రహం వచ్చింది. వెంటనే రాముని దగ్గరకు వచ్చి విషయం చెప్పాడు.

"అన్నా! నిత్యాగ్నిహోత్రాలన్నీ ఆర్పివేయి. సుకుమారి అయిన వదిన సీతను గుహలో భద్రంగా దాచు. వెంటనే లేచి ధనుర్ధారుడివికా. ఏ క్షణంలోనైనా శత్రుసేన మనమీద దాడి చేయవచ్చు. ఆ సేనను తిప్పికొట్టడానికి మనిద్దరం సర్వసన్నద్ధులం కావాలి" అంటూ లక్ష్మణుడు కళ్ళల్లో నిప్పులు చెరుగుతూ చెప్పాడు. "లక్ష్మణా! నీవు సరిగా ఆ సేన ఎవరిదో చూడు" అని శ్రీరాముని నోటినుంచి పలుకులు వచ్చి రాగానే అన్నా! క్రూరాత్ములైన కైక సుతుడైన భరతునిదే ఆ సేన. అయోధ్యలో అయాచితంగా లభించిన రాజ్యాన్ని అప్పనంగా కాజేసి ఇంకా శత్రు శేషం మిగల్చకూడదనే దుర్బుద్ధితో భరతుడు మన మీదకు దండెత్తి వస్తున్నాడు. భరతుని ఎదిరించడానికి మీరు కవచధారులై వింటిని సంధించి లెండు" అని లక్ష్మణుడు కోపోద్రిక్తుడై చెప్పాడు.

"అన్నా! ఇదిగో ఇటు చూడు. గుర్రాలనెక్కి ఆశ్వికులు, గజయోధులు ఉత్సాహంగా ఇటే పరుగెత్తుతున్నారు. అన్నా! మీకు, వదినకు, నాకు మహాపకారం చేసి కష్టాలను తెచ్చిన ఈ భరతుని ఇక నేను బతకనివ్వను. అపకారం చేసిన వారిని చంపడం ధర్మవిరుద్ధం కాదు గదా. ఆ రథాలపై ఎగిరే కోవిదార ధ్వజం మన వంశందే అవుతుంది గదా. రఘువీరా! తీరని అపచారానికి ఒడిగట్టిన ఆ భరతుని పనిపట్టి మీరు కోసలరాజ్యాన్ని దక్కించుకోండి. ఏనుగువల్ల నేల కూలిన చెట్టులాగ నేను యుద్ధంలో భరతుని అంతం చేస్తాను. భరతుని మరణం చూచి లోభగుణం ఉన్న కైక కుళ్ళి కుళ్ళి ఏడుస్తుంది. కైకను ఆమె హితైషి అయిన మంథరను ముక్కలు ముక్కలుగా నరికి ఈ భూమండలానికి పాపవిముక్తి కలుగజేస్తాను. రామా! ఇన్నాళ్లు నేను కోపాన్ని నా వశంలోనే ఉంచుకొన్నాను. కైక దుర్మార్గాన్ని సహించాను. ఓర్పుకు కూడా హద్దు ఉంటుంది గదా. ఈనాడు నా కోపాగ్నితో భరతుని సేనను భస్మం చేస్తాను.

శత్రువులను నా కరవాలానికి బలి ఇచ్చి వారి రక్తంతో ఈ చిత్రకూటాన్ని అభిషేకిస్తాను. ఏనుగు కుంభస్థలాలను, గుర్రాల గుండెలను నా బాణాలతో చీల్చివేస్తాను. ఆ మహాసేనలోని ప్రతి ఒక్కరిని అంతం చేసి వారి మాంసాన్ని కాకులకు గద్దలకు వేస్తాను.

ఈ నాటితో మన కష్టాలు తీరిపోతాయి. ఈ ప్రపంచంలోని దుర్మార్గుల పని పట్టి నా ధనుర్బాణాల ఋణాన్ని తీర్చుకొంటాను." అని లక్ష్మణుడు ఆగ్రహావేశుడై మాటల తూటాలను రాముని ఎదుట పేల్చాడు.

* * *

శ్రీరాముని శాంతవచనం

సర్గ - 97

కోపగ్రస్థుడైన లక్ష్మణుని ఆగ్రహాన్ని శ్రీరాముడు చూశాడు. తన సోదరుడైన లక్ష్మణుని శాంతపరచాలను కొన్నాడు. "సౌమిత్రీ! శాంతించు. మహాధనుర్ధారి, జ్ఞాని అయిన భరతుడే స్వయంగా ఇక్కడకు వస్తే మనకు కత్తీ డాలుతో అవసరం ఏముంటుంది? నేను తండ్రి మాటకు గౌరవం ఇచ్చి వనవాసానికి వచ్చాను గదా. ఇప్పుడు మనలను చూడడానికి వచ్చిన భరతుని చంపితే మనకు వచ్చేదేమిటి? అపకీర్తి మనకు రాకుండా ఉంటుందా? లక్ష్మణా! బంధువులను, సోదరులను చంపినందువల్ల వచ్చే అమృతమైనా నాకు విషాహారంతో సమానమే. నేను నా సోదరుల కోసమే ఈ రాజ్యాన్ని కోరుతాను. వారి ఆనందం కోసం నేను ఏదైనా చేస్తాను. నా ఆయుధాలపై ప్రమాణం చేసి చెప్తున్నాను. నేను మీ కొరకు ధనాన్ని గాని, రాజ్యాన్ని గాని ఆర్జిస్తాను.

నేను తల్చుకొంటే ఈ భూమండలాన్నంతా యుద్ధం చేసి గెలవగలను. కాని అధర్మంగా లభించే ఇంద్ర పదవిని కూడా నేను కోరుకోను. లక్ష్మణా! మీ ముగ్గురూ అనుభవించలేని సుఖాన్ని నేను ఏనాడూ ఇష్టపడను. భరతుడు ప్రేమాస్పదుడు. నరశ్రేష్ఠుడు. ఇంతకుముందు భరతుడు నీతోగాని, నాతోగాని వైరభావం చూపించాడా?

మనలను ఏనాడైనా త్రోసిరాజనే విధంగా ప్రవర్తించాడా? లేదు కదా. మరి ఈనాడు నీకు భరతునిపై ఇంత కోపం ఎందుకు కలుగుతోంది? కోపంతో నీవు భరతుని అనురాగాన్ని గుర్తించలేకున్నావు.

ఇప్పుడు భరతుడు మేనమామ ఇంటినుంచి తిరిగి వచ్చి, మన వనవాసవిషయం తెలుసుకొని ఉంటాడు. కైకను అప్రియమైన పరుషవాక్యాలతో దూషించి మన తండ్రిని మెప్పించి కోసల రాజ్యాన్ని తీసుకోమని నన్ను అర్థించడానికే భరతుడు ఇక్కడకు వచ్చి ఉంటాడు. కులధర్మాన్ని స్మరిస్తూ వంశగౌరవానికి భంగం రాకూడదన్న కోరికతో మనలను తిరిగి తీసుకుపోవాలన్న నిశ్చయంతో భరతుడు వచ్చి ఉంటాడు. భరతుని ఆగమనంలో ఇది తప్ప మరొక్కటి ఉండదు. భరతుడు నీవలె నాకు ప్రాణసమానుడు. భరతుణ్ణి నీవు దుర్భాషలాడితే నన్ను దూషించినట్లే అవుతుంది. భరతునిపై నీవు చూపించే నీ ఆగ్రహం నాపై చూపించినట్లే అవుతుంది.

భరతుడు ఇప్పుడు ఇక్కడకు రావడం సముచితంగానే కనిపిస్తోంది. అసందర్భంగా ఏమీ నాకు కనబడ్డంలేదు. నీవు భరతుణ్ణి శంకించడంలో అర్థం ఏమీ లేదు. సోదరా! ఆగ్రహంలో ధర్మాన్ని మరుస్తున్నావు. ఎట్టి ఆపద వచ్చి మీద పడినా తండ్రిని కొడుకులు చంపుకోగలరా? నీవే ఆలోచించు. నీవు ఆ సాలవృక్షాన్ని దిగి నాచెంత వచ్చి నిలబడు. నీ ఆగ్రహాన్ని చల్లార్చి ఆలోచించు. రాజ్యాన్ని పొందాలనే ఆశతో నీవు కఠోరంగా మాట్లాడుతున్నావు. భరతుడు ఇక్కడకు రాగానే ఆ రాజ్యాన్ని నీకు ఇమ్మని చెప్తానులే. అప్పుడు కూడా భరతుడు సంతోషంగా రాజ్యాన్ని నీకు అప్పగిస్తాడు. భరతుడు ఎప్పుడూ తండ్రి మాటను గాని, నా మాటనుకాని కాదనడు" అని శ్రీరాముడు చెప్పాడు.

శ్రీరాముని శాంతవచనాలు విని లక్ష్మణుడు తన తప్పు తెలుసుకొన్నాడు. సౌమిత్రి అజ్ఞానంతో మాట్లాడిన మాటలకు సిగ్గుపడ్డాడు. తలవంచుకొన్నాడు. రాముని చెంత చేరాడు. "అగ్రజా! నా అజ్ఞానాన్ని క్షమించు. మీ సోదరప్రేమ కొనియాడదగినది. మీ సోదరుడైన భరతుడు కూడా మీ వలె ధర్మాత్ముడే అయి ఉంటాడు. ఇప్పుడుమన తండ్రి దశరథుడే ఇక్కడకు వస్తున్నాడని నేను అనుకొంటున్నాను" అని లక్ష్మణుడు చెప్పాడు.

శాంతపడిన సౌమిత్రిని చూచి శ్రీరాముడు ఆనందించాడు. "లక్ష్మణా! విషయం తెలుసుకొని బాధపడుతూ మనలను చూడటానికి భరతుడు వస్తున్నాడని నాకు అనిపిస్తోంది. లేక సుఖాలలో పుట్టించి పోషించిన మన తండ్రి మనం కష్టాలకు ఓర్చుకోలేమన్న తలంపుతో మనలను అయోధ్యకు తీసుకొని వెళ్ళడానికి వస్తున్నాడేమో? లేక జనకప్రియనందిని అయిన ఈ సీత కష్టాన్ని చూడలేక వెనక్కు తీసుకెళ్దామని మన తండ్రి వస్తున్నారేమో" అని శ్రీరాముడు అన్నాడు.

అటు చూడు "రఘునందనా! మన తండ్రిగారి శత్రుంజయగజం వస్తోంది. ఉత్తమాశ్వాలు రెండూ దాని వెనుక పరుగెత్తుతున్నాయి. కాని తండ్రిగారి శ్వేత ఛత్రం మాత్రం నాకు కనిపించడంలేదు. నాకు ఎందుకో అనుమానం వస్తోంది" అని లక్ష్మణుడు చెప్పాడు.

"లక్ష్మణా! నా మాట విని సందేహాలన్నీ పక్కన పెట్టి ఇక్కడే ఉండు" అని రాముడు చెప్పగా లక్ష్మణుడు అలానే చేశాడు.

భరతుడు శ్రీరామునికి ఇబ్బంది కలిగించకూడదనుకొన్నాడు. అందుకే కొండ దిగువ భాగంలోనే సేననంతా విశ్రమించమని చెప్పాడు. భరతుని మహాసేన కొండ క్రింద ఒకటిన్నర యోజనముల దూరం వరకూ వ్యాపించింది.

భరతుడు శ్రీరాముని అనుగ్రహం పొందడానికి కాలి నడకతో ముందుకు వెళ్ళాలని అనుకొన్నాడు. క్రమశిక్షణ ఉన్న భరతునిసేన భరతుని ఆదేశాన్ని శిరసావహించి ఆ కొండ దగ్గరే విశ్రమించింది.

* * *

భరతుని ఆనందం

సర్గ - 98

కాలినడకతోనే రాముడున్న ప్రదేశాన్ని కనుగొనాలని భరతుడు అనుకొన్నాడు. "శత్రుఘ్నా! నీవు ఈ ఆటవికుల గుహుని సాయంతో ఈ అటవీ ప్రదేశమంతా వెదకు. శ్రీరాముని మనం నేడు కనుగొనగలమని నా మనస్సు తెలుపుతోంది. నేను అమాత్యులతో కలిసి పరిశీలించి రాముని జాడను తెలుసుకొంటాను" అని చెప్పాడు. శత్రుఘ్నుడు తన సోదరుని ఆదేశ ప్రకారం అడవి వెతకడం మొదలుపెట్టాడు. మాటలలో నేర్పరి ఐన భరతుడు అక్కడ కాలుచొరలేని చెట్ల సముదాయాన్ని చూసి ఈ దట్టమైన దుర్గమారణ్యం శ్రీరాము డున్నందువల్ల ప్రసిద్ధి చెందింది. శ్రీరాముని ఉనికివల్లే ఈ అడవి వింతశోభలతో అలరారుతోందని చెప్పుతూ ముందుకు సాగాడు.

నాకు శ్రీరాముడు కనబడునంతవరకు మనశ్శాంతి కరువే అవుతుంది. పరాక్రమశాలియైన లక్ష్మణుడు, సాధ్వీమణి, స్త్రీలలో శిరోరత్నమైన సీతమ్మ కనబడితే నా మనస్సు కుదుట పడుతుంది. శ్రీరాముడు సీతతో కూడా అయోధ్యకు తిరిగి వచ్చి రాజ్యసింహాసనాన్ని అధిష్ఠించేంతవరకు నా మనస్సుకు ఊరటలేదు. శ్రీరాముని జాడ తెలియక కొట్టుమిట్టాడే నా మనస్సు రామాశ్రమాన్ని చూస్తున్నా నాకు ఊరట కలుగుతుందని నేను భావిస్తాను అని మంత్రులకు భరతుడు చెప్పాడు. పద్మనేత్రుడైన రాముని ఎల్లవేళలా చూచే భాగ్యం కలిగిన లక్ష్మణుని జన్మే ధన్యత పొందింది. శ్రీరామునికి ఆవాసం కల్పించిన ఈ పర్వతం కూడా పుణ్యం చేసుకొన్నదే. నీడలా రాముని అనుసరించే సీత అధిక భాగ్యవంతురాలు.

అలా బాధపడుతూ ముందుకు సాగుతూ ఒక మద్దిచెట్టును చూశాడు. దానిపైకి ఎగబ్రాకి దూరంగా నిత్యాగ్నిహోత్రం నుండి విరజిమ్మే పొగలను భరతుడు చూశాడు. ఆనందంతో ఆయన మనస్సు ఉబ్బి తబ్బిబ్బు అయింది. వెంటనే దగ్గరే ఉన్న అమాత్యులతో నేను దగ్గరలో పొగను చూశాను. అక్కడే నా సోదరులు ఉండి ఉంటారని చెప్పాడు. సముద్రమంతా ఈది ఆవలి ఒడ్డుకు చేరిన గజఈతగానివలె భరతుడు సంతోషించాడు.

శత్రుఘ్నుడు గుహునితో కలిసి భరతుడు వడివడిగా ముందుకు అడుగులు వేశాడు.

* * *

శ్రీరామ భరతుల సమాగమం

సర్గ - 99

శత్రుఘ్నునికి ఆశ్రమచిహ్నాలు చూపుతూ ముందుకు సాగాడు. ఆయన వెనుక అమాత్యులు, రాణులు, వసిష్ఠుడు అనుసరించారు. కొద్దిదూరం వెళ్ళిన తర్వాత వసిష్ఠునికి నమస్కరించి "మహర్షి వర్యా! నేను శత్రుఘ్నుడు త్వరత్వరగా ముందుకు వెళ్తాం. మీరు మా తల్లులను తీసుకొని రండి" అని చెప్పాడు. భరతశత్రుఘ్నులు అమాత్యులు గబగబా నడిచారు. అలా వారు కొద్దిదూరం వెళ్ళగానే వారికి ఒక పర్ణశాల కనబడింది. దాని పక్కగా నారచీరలు ఆరడానికి కట్టి ఉన్నారు. చెట్లపైన దర్భలు వేలాడదీయడం చూశాడు. "సోదరా! ఇటుచూడు. ఈ పర్ణశాలే రామాదుల నివాసం అయి ఉంటుంది. దీని దగ్గర దగ్గరగా ఉన్న నారచీరలు దర్భలు పర్ణశాల మార్గాన్ని సూచించడానికి లక్ష్మణుడు వీటిని ఏర్పాటుచేసి ఉంటాడు.

ఇంక కొద్దిదూరంలో చక్కగా పేర్చి ఉన్న పిడకలను చూశారు. ఇదుగో చలి బాధనుండి తప్పించుకోడానికి తాపసులు ఏర్పాటుచేసుకొనే ఈ పిడకలు చూశారా! ఇవి కూడా లక్ష్మణుడే ఏర్పరిచి ఉంటాడు. శత్రుఘ్నా! మనం నిశ్చితంగా భరద్వాజుడు చెప్పిన చిత్రకూటం చేరాము. ఇక్కడికి దగ్గరిలోనే మందాకిని ఉండి ఉంటుంది. రాముని చూస్తామన్న ఆలోచనే నాకు ఆనందాన్నిస్తోంది. ఈ ఎత్తుగా ఉన్న చెట్లపైన కట్టిన వల్కలాలు దారి గుర్తుకు లక్ష్మణుడు ఏర్పాటుచేసి ఉంటాడు. ఈ గుర్తులు ఏనుగులు భీకరంగా ఘీంకరిస్తూ పోట్లాడుకొను ప్రదేశం ఇది అని చెప్పేలాగా ఉన్నది. ఇది కూడా లక్ష్మణుని ఏర్పాటే అయి ఉంటుంది. ఈ చిహ్నాలను చూస్తూ మనం ముందుకు వెళ్ళితే తప్పకుండా రామాదుల నివాసం కనిపిస్తుంది. ఇదిగో వేగంగా పైకి ఎగజిమ్మే ఆ పొగలు సాయంసంధ్యాసమయంలో అగ్ని కార్యాల నిమిత్తం వెలిగించిన అగ్నిహోత్రం అయి ఉంటుంది" అని భరతుడు అడవిని పరిశీలిస్తూ చెపుతూ ముందుకు సాగుతున్నాడు.

"సోదరా! నరశ్రేష్ఠుడు, పూజ్యుడు అయిన శ్రీరాముణ్ణి నేను ఆనందంతో చూస్తాను. చూశారా! నేను ఎంత అభాగ్యశాలినో! నా వలనే రాజ్యసింహాసనారూఢు డవ్వాల్సిన రామచంద్రుడు నేడు కటికనేలపై కూర్చుని ఉంటాడు. ఇటువంటి నా జన్మ నా జీవితం వ్యర్థం కదా. పట్టు పీతాంబరాలు ధరించి కాంతులీనే శ్రీరాముడు నేడు మృగాజినాలు, నారవస్త్రాలు ధరించాడు గదా! ఇది నేను చేసిన మహాపచారం. నా దుష్కృత్యానికి ప్రాయశ్చిత్తం లేదు. శ్రీరాముడు సర్వసుఖాలను త్యజించి ఈ దుర్గమారణ్యంలో వనవాసి అయ్యాడు. నేను లోకాపవాదుకు గురి అయ్యాను. నేడు నేను శ్రీరాముణ్ణి ప్రసన్నుని చేసుకొంటాను. సీతమ్మతల్లిని క్షమించమని వేడుకొంటాను. లక్ష్మణుణ్ణి కరుణించమని వేడుకొంటాను. ఎట్లా అయినా నేను లక్ష్మణునితో కూడిన సీతారాములను అయోధ్యకు తీసుకొని వెళ్తాను. నా మనోరథం ఈడేర్చు భగవాన్" అని భరతుడు దుఃఖిస్తూ ప్రార్థించాడు.

అలా భరతాదులు పర్ణశాల సమీపానికి వచ్చారు. ఆ కుటీరం నల్లమద్ది, తాటిచెట్ల ఆకులతో కప్పి ఉంది. మృదువైన కుశలతో కప్పిన యజ్ఞవేదిలాగా ఆ కుటీరం కనిపించింది. అందులో మహాధనుస్సులు కనబడినాయి. అవి శత్రునిర్మూలకాలు. బంగారుపూతతో ఎంతో ప్రకాశవంతంగా కనిపించాయి. రెండుఖడ్గాలు, చిత్రవిచిత్రంగా

మెరిసే డాలులు, బంగారు నగిషీలు చేసిన చిత్రాలు, అడవిజంతువులకు భయంకరంగా కనిపించే సింహపు గుహలాగా ఆ పర్ణశాల చిత్ర విచిత్ర ఆయుధ సంపదతో చూపరులకు భయం కొలిపే రీతిలో కనిపించింది. అది పాతాళంలోని భోగవతివలె ఒప్పారింది.

భరతుడు పర్ణశాలను పరికించి చూశాడు. ఒక విశాలమైన వేదికను చూశాడు. దానిపై జటావల్కలధారియైన శ్రీరాముడు జింకచర్మాన్ని ఉత్తరీయంగా వేసుకొని నారవస్త్రాలు ధరించి అగ్నితేజస్సుతో పద్మాసనుడై కనిపించాడు. ప్రశాంతవదనంతో కరుణ జాలువారే కన్నులతో ఎత్తైన భుజాలతో పరమాత్మలాగా శ్రీరాముడు సీతతో కూడా అసీనుడై ఉండడాన్ని భరతుడు చూశాడు.

వేదికను అలంకరించి ఉన్న శ్రీరాముని చూడగానే భరతుని దుఃఖం కట్టలు తెంచుకొని ప్రవహించింది. గద్గదకంఠంతో, పురజనులతో, మంత్రి, సామంతులతో సేవలందుకోవాల్సిన శ్రీరాముడు నేడు మృగచర్మాన్ని ధరించి అరణ్యాల్లో ఉన్నాడు కదా! శాస్త్రవిధులను అనుసరించి యజ్ఞయాగాలు చేయాల్సిన శ్రీరాముడు తాపసుడయ్యాడు కదా! సుగంధ పరిమళభరితమైన చందనాదులను పూసుకోవాల్సిన తరుణంలో దుమ్ము ధూళుల్లో నివసిస్తున్నాడు గదా! ఇన్ని బాధలకు నేనే కారణం. నా వల్లనే నా శ్రీరాముడు ఇడుమల పాలయ్యాడు. నావలనే సీత కష్టాల నెదుర్కొంటోంది. హాయిగా నిర్భయంగా తిరగాల్సిన లక్ష్మణుడు సదా ధనుర్ధరుడై అప్రమత్తుడై అరణ్యాలలో తిరుగుతున్నాడు. ఇదంతా నా కర్మఫలమే. నేనెంత క్రూరకర్మం చేశానో! నా జీవితం వ్యర్థం! నావల్ల నా సోదరులు కష్టాల వాకిట్లో జీవనం చేస్తున్నారు అని భరతుడు ఎంతగానో వాపోయాడు.

దుఃఖంతో కన్నీళ్ళు వరదలా పారాయి. ముఖమంతా ఆవేదనతో స్వేదమయం అయింది. కాళ్ళు తడబడ్డాయి. చేతులు వణికాయి. మనస్సు గడ్డ కట్టింది. శ్రీరాముని పాదపద్మాలను చేరాలనే సంకల్పం ఎక్కువై అక్కడనుండే "స్వామీ!" అంటూ నేలపై పడిపోయాడు భరతుడు.

భరతుడు కన్నీరు మున్నీరుగా విలపిస్తూ రుద్ధమైన కంఠంతో ఎంతో కష్టపడి గొంతు పెగల్చుకొని 'అన్నా!' అని గట్టిగా పిలిచి కన్నీరు నింపుకొన్న కన్నులతో శ్రీరాముని చూడలేక బిగ్గరగా ఏడ్చాడు.

శత్రుఘ్నుని పరిస్థితి భరతుని మించిందే. ఇరువురూ రాముని పాదాలపై పడి బిగ్గరగా ఏడ్వసాగారు. శ్రీరాముడు వారిద్దరిని లేవనెత్తి అక్కున చేర్చుకొన్నాడు. రామచంద్రుని నేత్రాలనుండి అశ్రువులు ధారాపాతంగా కారసాగాయి. రామలక్ష్మణభరతశత్రుఘ్నులు దుఃఖంతో సంతోషంతో ఒకరినొకరు కౌగిలించుకొని కన్నీరు కార్చారు. వారందరూ తెప్పరిల్లి మంత్రి సుమంత్రునితోను, సఖుడైన గుహునితోను మాటలు కలిపారు.

ఆ దృశ్యాన్ని చూసిన ఋషీశ్వరులు ఆ నలుగురన్నదమ్ములను చూశారు. వారి ప్రేమాస్పదహృదయాన్ని చూచి వారి అన్యోన్యతానురాగాలకు కంటతడిపెట్టారు.

* * *

శ్రీరాముడు - రాజనీతి

సర్గ - 100

కుంగి కృశించిపోయి భూమిపై సాష్టాంగనమస్కారం చేస్తున్న భరతుని శ్రీరాముడు లేవనెత్తాడు. అక్కున చేర్చుకొని శిరస్సును ముద్దాడాడు. తన దగ్గర కూర్చోబెట్టుకొని కుశలమా అని అడిగాడు."భరతా! మేనమామ ఇంటినుండి తిరిగి వచ్చిన చాలా రోజులకు నిన్ను చూస్తున్నాను. నీవు చాలా కృశించి ఉన్నట్లుగా నాకు అనిపిస్తోంది. సోదరా! మన తండ్రి దశరథమహారాజు క్షేమంగా ఉన్నారు కదా. దుఃఖంలో కూరుకుపోయిన కౌసల్య దుఃఖం ఉపశమించిందా? ఆమె కుశలంగా ఉంది కదా. సద్బుద్ధి ఉన్న కుమారులను కన్న సుమిత్రాదేవి క్షేమమే గదా. రాణి అయిన కైక సంతోషంగా ఉంది గదా. నీవు ఎందుకో అమిత దుఃఖంతో బాధపడుతున్నట్లు నాకు కనిపిస్తోంది. మన తండ్రిగారైన దశరథమహారాజు గారి ఆరోగ్యం బాగున్నది కదా. సత్యవంతుడైన ఆయన మాటను నీవు జవదాటడంలేదు కదా. భరతా! వయోభారం దుఃఖం కలగలిసి ఆయన్ను పరలోక గతుణ్ణి చేయలేదు కదా. బాలుడివైన నిన్ను త్రోసి అన్యులెవరైనా రాజ్యాన్ని అపహరించారా? ఇలాంటి దుర్మార్గం కలుగలేదు గదా. ఇంతకీ తండ్రి ఉండగానే నీవు అరణ్యాలకు రావలసిన పని ఏముంది? నీవు ఎందుకు ఇక్కడకు వచ్చావు?" అంటూ శ్రీరాముడు భరతుని ప్రశ్నల పరంపరలో ముంచెత్తాడు.

మౌనంగా చూస్తూన్న భరతుని చూసి శ్రీరాముడు "నాయనా భరతా! ధర్మనిరతుడు అశ్వమేధాది యాగాలు చేసిన ధీరుడైన దశరథుడు కుశలుడే కదా. బ్రాహ్మణశ్రేష్ఠుడు సర్వవిద్యలను ఆపోశన పట్టిన మన కుల గురువు వసిష్ఠుని నీవు గౌరవాదరాలతో చూస్తున్నావు కదా. ఆ మార్గదర్శకుడు చెప్పిన విధంగా నీవు యజ్ఞకార్యాలను చేస్తున్నావు గదా. ఏ కాలంలో ఏ యాగం జరపాలో వసిష్ఠుడు నీకు తెలుపుతున్నాడు గదా. హోమవిధులను బాగా ఎరిగిన విప్రులు నీకు సకాలంలోనే నీవు చేయవలసిన కార్యాలను నీకు చెప్తున్నారనుకొంటాను.

నీ చుట్టూ ఉన్న పరిజనుల బాగోగులను నీవు చూస్తున్నావు కదా. దేవతలను యజ్ఞయాగాది కార్యాలతో సంతోషింపజేయుచున్నావు గదా. మన తల్లిదండ్రులకు సేవ లొనర్చుతూ వారి మాటను శిరసావహించి వారికి మనోల్లాసాన్ని కలిగిస్తున్నావు కదా. భృత్యులకు ఎప్పటికప్పుడు వారి సేవలను గుర్తిస్తూ వారికి బహుమతులను ఇస్తూ వారి మనస్సును కనిపెట్టి ఉంటున్నావు కదా. గురువుల అభిమతానికి ఎదురుచెప్పడంలేదు కదా. జ్ఞాతులను, వయోవృద్ధులను గౌరవంతో వినయవిధేయతలతో వారిని ఆదరిస్తూ వారికి మనస్సంతోషాన్ని కలిగిస్తున్నావు కదా. విద్వాంసుల విద్యను గుర్తించి వారి జ్ఞానాన్ని నలుగురూ పంచుకొనేటట్లు వ్యవహరిస్తున్నావు కదా. వైద్యుల సేవలకు మించిన పారితోషికాన్ని ఇచ్చి వారిలో భద్రతాభావాన్ని పెంచుతున్నావు గదా. నాయనా భరతా! శస్త్రాస్త్ర ప్రయోగశీలి అయిన సుధన్వునికి నీవు గౌరవ సత్కారాలను అందిస్తున్నావు కదా.

విశ్వాసపాత్రులను, నీతో సమానమైన ధీరులను, రాజనీతి కోవిదులను, ప్రలోభాలకు లొంగని ధీరోదాత్తులను ఉత్తమవంశసంజాతులను నీ మనస్సెరిగి ప్రవర్తించే నిపుణులను నీ మంత్రివర్గాన చేర్చుకున్నావు గదా. సమస్త

శాస్త్రాలను పుక్కిట పట్టినవారు, విషయాలను గోప్యంగా ఉంచుతూ ఎల్లవేళలా రాజ్యహితం కోసం పాటుపడేవారి మీద రాజువిజయం ఆధారపడి ఉంటుంది. అటువంటి వారిని రాజు కంటికి రెప్పలాగా ప్రాణానికి ప్రాణంగా ఆదరించాలి. వారు ఏ వేళలోను రాజును గురించి తప్పుడాలోచనలు చేసే అవకాశాన్ని వారికి కలిగించకుండాను చూసుకొనే బాధ్యత, నేర్పు రాజుదే అయి ఉండాలి సుమా! రహస్యాలోచనలను నీవు ఒక్కడివే చేయడం లేదు కదా. విశ్వాసపాత్రులైన వారితో మంత్రాంగం నెరపి సరైన నిర్ణయాలను సకాలంలో తీసుకొంటున్నావు గదా. ఏ లోభానికి లొంగక, అప్రమత్తుడివై బహు విధాలుగా ఆలోచించి అందరి ఆలోచనలను పరిగణనలోకి తీసుకొని నిర్ణయాలను అమలుచేస్తున్నావు గదా" అని భరతునికి రాజుగా వ్యవహరించాల్సిన తీరును రాముడు చెప్పాడు.

"భరతా! సోమరివై నిద్రలో జోగకుండా వేకువనే లేచి కర్తవ్యపాలనకు దీక్షాబద్ధుడివి అవుతున్నావు గదా. గూఢచారుల ద్వారా రాజ్యంలోని, ఇతర రాజుల విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకొంటున్నావు గదా. నీ రాజ్య వ్యవహారాలు శత్రురాజులకు తెలీకుండా జాగ్రత్తలు తీసుకొంటున్నావు గదా. నీవు చేసే పనులలో జాప్యం జరగకుండా చూస్తున్నావా? నీవు చేయబోయే పనులను గురించి సామంతులకు తెలుపుతున్నావు గదా. భరతా! పెక్కుమంది మూర్ఖులతో విషయచర్చకన్నా శాస్త్రమెరిగిన పండితుడు ఒక్కనితోనే చర్చ సఫలమౌతుందని తెలుసుకొన్నావు గదా. ప్రభువులకు మందిబలంకన్నా బుద్ధిబలం ఉన్నవారితోనే శ్రేయస్సు కలుగుతుంది. అందువలన యంత్రాంగంలోను స్నేహంలోను, శ్రేయస్సును వాంఛించే పండితుల భావానికి ప్రాధాన్యం ఇవ్వాలి. మేధావి ఐన మంత్రి ఎదుటి వారి అభిప్రాయాన్ని తెలుసుకోవడంలోను, రాబోయే ఆపదలను గుర్తించి వాటి నివారణోపాయాలను కనుగొనడంలోను ముందుంటాడు. అటువంటి మంత్రివల్లే రాజు మహాసంపదలను ఆర్జించి కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేసుకోగలడు. విచక్షణతో దక్షులైన వారికి మాత్రమే కార్యాలను అప్పగించాలి. ఉత్తములకు పెద్ద కార్యాలను, మధ్యములకు సామాన్య కార్యాలను, నిమ్నస్థాయిలోని వారికి స్వల్పకార్యాలను అప్పగించాలి. తలకు మించిన భారాన్ని ఎవరిపై మోపకూడదు. చేయదగిన పనిని మాత్రమే చేయమని ప్రోత్సహించాలి. చేయకూడని పనులను చేయవల్సిందేనంటూ వారిపై ఒత్తిడి తేకూడదు. మనస్సు పెట్టకుండా చేసే పనులలో నైపుణ్యం కొరవడుతుంది. భృత్యులు కదా అనే చులకనభావంతో పనిని అప్పగిస్తే వారిలో నిరాశ మొదలై కార్యం చెడుతుంది. అందువలన త్రికరణశుద్ధిగా తరతరాలనుండి సత్ప్రవర్తన గల వారికే ముఖ్యకార్యాలను అప్పగించాలి.

తప్పులను చేసినవారిని దండించడంలోను అప్రమత్తత ఉండాలి. దోషులలో పరివర్తన తీసుకొచ్చే దండన విధించాలి కాని వారిలో కసిని, కోపాన్ని పెంచేటట్లు రాజు వ్యవహరించకూడదు. సామాన్య ప్రజలు కూడా ప్రభు భక్తి కలిగినవారుగా ఉండేవిధంగా రాజ్యాన్ని పాలించాలి.

అక్రమార్జనతో యజ్ఞయాగాలు చేయాలని సంకల్పిస్తే ఋత్విజులు తిరస్కరిస్తారు. మనం సంపాదించిన ధనాన్ని ఋజుమార్గంలోనే ఖర్చుచేయాలి. అపాత్రదానం చేయకూడదు. బలత్కారానికి పూనుకొనే కాముకులను స్త్రీలు ఎదిరిస్తారు. శిక్షార్హులు కానివారిని దోషులుగా నిర్ణయిస్తే ప్రజలు రాజు నిర్ణయాలపై అనాసక్తిని పెంచుకొని రాజును త్రోసిపుచ్చుతారు. సుంకాలను ప్రజలు సంతోషంగా కట్టేట్లు చూస్తున్నావు గదా. ప్రజలను బాధించి వసూలు చేసే పన్నులు ఎక్కువకాలం అమలుచేయలేమని నీకు తెలుసు గదా. కుటిలరాజనీతిజ్ఞులను, అన్నీ తెలిసి

కావాలని రాజద్రోహానికి పాల్పడేవారిని, అత్యాశపరులను, రాజ్యకాంక్షతో హత్యలకు వెనుకాడని వారిని, విశ్వాసపాత్రులైన భృత్యులను తొలగించడంలో నిమగ్నమైన వారిని, పరధనాపేక్ష గలవారిని రాజు నిరోధించి తీరాలి. అటువంటివారిని కఠిన దండనకు గురి చేయాలి లేకపోతే వారు రాజును పదవీ భ్రష్టుణ్ణి చేయగల సమర్థులు.

సేనాపతి విషయంలో కూడా జాగ్రత్త తీసుకున్నావు గదా. రాజసత్కారాలకు పొంగిపోయేవాడు, శత్రువులను నిగ్రహించడంలో సమర్థుడు, విపత్కర పరిస్థితులలో ధైర్యంతో వ్యవహరించగలవాడు, సమయస్ఫూర్తిగలవాడు, కరుణార్ద్రుడు, యుద్ధనీతిని తెలిసినవాడు, రాజభక్తి పరాయణుడు, తృప్తిగలవాడు, నైతికత ఉన్నవాడు, ఎట్టి పరిస్థితులలోను నీతిని తప్పని వాడు అయిన వానినే సేనాధ్యక్షుడిగా నియమించాలి. సైనికులను నియమించడంలో పూర్తి స్వేచ్ఛనివ్వాలి. అప్పుడే నీవు కోరే విజయసోపానాలను అధిరోహించగలవు. సైనికుల సేవలకు ఇచ్చే జీత భత్యాలలో ఉదారంగా ప్రవర్తిస్తూ కాలాతిక్రమణను చేయడం లేదు కదా! ఒకవేళ నీవు సమయానికి వారికి కావాల్సినవి అందించకపోతే వారిలో నీ పట్ల ఏహ్యభావం ఏర్పడుతుంది. అది నీకు అనర్థాన్ని కలిగిస్తుంది. అందువల్ల వారి పట్ల సద్విచారంతో ప్రవర్తించాలి."

"మంత్రులు, సేనాపతులు, నీ కోసం ప్రాణత్యాగం చేయడానికి వెనుకాడేవారు కాదు కదా. ప్రధానాధికారులు మంత్రులు మంచి వంశప్రతిష్ఠ కలవారినే ఎన్నుకొన్నావు గదా. ఎవరైనా నీ రాజ్యంలో పొరబాట్లు చేస్తే దానికి కారణాన్ని వెదికి అటువంటి పొరపాట్లు మరల జరగకుండా ఉండేటట్లు చేస్తున్నావు గదా. పశ్చాత్తప్తుల విషయంలో కరుణతో ఆలోచించి వారికి తగిన వసతులను కలిగించాలి. వారు మరల ఎట్టి తప్పుకు తలవంచకుండా ఉండే విధంగా పరిస్థితులను కల్పించాలి.

యుక్తాయుక్తవిచక్షణ కలవారిని, స్వదేశీయులకు విదేశీయులకు రాజు భావాలను యథాతథంగా చెప్పగలవారిని, సమయస్ఫూర్తితో రాజుకీర్తిని పెంచే విధంగా ప్రవర్తించేవారిని మాత్రమే దూతలుగా పెట్టుకోవాలి. రాజసందేశాలను వినిపించటంలో వారు జాగ్రత్త వహించే వారుగా ఉండాలి.

పరదేశంలోని విషయాలను కనుగొనడానికి పద్దెనిమిది మందిని, స్వదేశంలోని విషయ గ్రహణకు పదైదు మందిని గూఢచారులుగా నియమించావు గదా. ప్రతి ముగ్గురి గూఢచారులపైన ఒక్కొక్క విశ్వాసపాత్రుడైన గూఢచారిని మరొకరికి తెలీకుండా నియమించావు గదా. వీరివల్ల ప్రతి విషయాన్ని గూర్చిన పూర్తి సమాచారాన్ని నీవు ఎప్పటికప్పుడు తెలుసుకొంటున్నావు గదా. మంత్రులు, పురోహితులు, యువరాజు, సేనాపతి, ద్వారపాలకులు, అంతఃపురాధికారులు కారాగారాధికారులు, ధనాధ్యక్షులు, కార్యనియోజకులు, న్యాయాధికారులు, సేనానాయకులు, నగరాధ్యక్షుడు, కర్మచారులు, సభాధికకృతులు, ధర్మాధికారులు, దండపాలురు, దుర్గరాష్ట్రపాలకులు, వీరందరి విషయాన్ని గూఢచారులద్వారా శత్రుపక్షంలోను స్వదేశంలోను మిత్రపక్షంలోను ఎప్పటికప్పుడు సమాచారాన్ని రాజు తెలుసుకొంటూ వ్యవహారాలను చక్కదిద్దుకోవాలి. నీవు వీటి విషయంలో జాగ్రత్త వహిస్తున్నావు గదా. భరతా! నీ చేతిలో ఒకసారి ఓడిపోయి వెనక్కు వెళ్ళినవారి విషయంలో కూడా జాగ్రత్తనే తీసుకోవాలి. వారిని ఎప్పుడు దుర్బలులుగా ఎంచకూడదు. వారిని కూడా బలం ఉన్న శత్రువులలాగా చూస్తూ వారివల్ల ఏ ఆపద

వాటిల్లకుండా జాగ్రత్తపడాలి. రాజుకు ఏ విషయంలోను నిర్లక్ష్యం పనికిరాదు. అనాచారులను, దైవభక్తి లేనివారిని, నాస్తికులను దరిచేరకుండా చూచుకోవాలి. మేమే పండితులమని అహంకరించే అజ్ఞానులను దూరం చేయాలి. వారివల్ల తర్కం చేసే శాస్త్రం భ్రష్టుపట్టే అవకాశం ఉంటుంది. అందువల్ల అటువంటివారిని నిర్హేతుకంగా నిగ్రహించాలి. శుష్కతర్కాన్ని వారి పట్ల కఠినదండన అమలు చేసి మరల వారు వ్యర్థప్రలాపాలు చేయకుండా చూడాలి.

అయోధ్య శత్రుదుర్భేద్యమైనది. మన పూర్వులందరూ సత్యనిష్ఠులై దాన్ని పరిపాలించారు. అయోధ్య దృఢ ద్వారాలు కలది. రథాశ్వగజబల సమన్వితమైంది. ఆ నగరంలో నివసించే వారందరూ వారి వారి వర్ణాలను బట్టి సత్కర్మలను చేసేవారు. ధర్మంపై ఆసక్తికలవారు, పైగా జితేంద్రియులు. వారి వల్ల నగరశోభ నలుదిశల్లో వ్యాపించింది. వారు కార్యోత్సాహంతో ముందడుగు వేయగల సమర్థులు; అసంఖ్యాకులైన విద్వాంసులు నగరంలో అవిద్యను దూరం చేశారు. విద్యాసంపన్నులైన వారివలన అయోధ్య కళకళలాడుతుంటుంది. ఇంద్రుని అమరావతిని తలపించే అయోధ్యను నీవు చక్కగా పరిరక్షిస్తున్నావు గదా. అంతేగాదు భరతా! మన కోసలరాజ్యం పవిత్రభూమి. ఆ కర్మభూమిలోని రాజులందరూ అశ్వమేధాది యాగాలొనర్చినవారు. భక్తిప్రపత్తులను పెంచే దివ్యభూమి మనది. బాటసారుల దాహార్తిని, పాదచారుల వసతిని గుర్తించి వారి సదుపాయాలకై నగరంలో ఎన్నో సత్రాలు, తటాకాలు చలివేంద్రాలు సురక్షితంగా ఉన్నాయి. ఏ వేళ అతిథి వచ్చినా అయోధ్యావాసులు వారికి సేవ చేయడంలో ఏ లోటును రానీయరు. అందలి స్త్రీ పురుషులు సుఖంగా ధర్మప్రవర్తనులై, నీతిమంతులై జీవిస్తారు. అందుకే అక్కడ ఎట్టి హింసాకృత్యాలు జరగవు. సామాజికన్యాయాన్ని ప్రభువు, ప్రజలు తప్పక పాటిస్తారు. సకాలంలో కురిసే వర్షాలతో పాటుగా వారు నిర్మించుకొన్న జలనిధితో సస్యశ్యామలంగా నగరాన్ని శోభింపజేస్తారు. రైతులు బంగారు పంటలను తమ క్షేత్రాలలో పండించి రాజధనాగారాన్ని పోషిస్తారు. ఆ రాజ్యంలో అన్నార్తులకు తావు ఉండకుండా చూస్తారు. వర్తకులు న్యాయవిచక్షణతో ధర్మబుద్ధితో వాణిజ్యాన్ని చేస్తారు. కర్మచారులు వారి కర్మలను దైవీభావనతో ఆచరిస్తారు. అందువల్ల దేశం సుభిక్షంగా అలరారుతోంది. ఖనిజసంపదకు కాణాచి కోసలమని పేరుగాంచింది. అగ్ని చోరాదిభయాలకు తావుండదక్కడ. మన పూర్వుల నైపుణ్యంతో కోసలరాజ్యం ధనధాన్యసౌభాగ్యాలతో వర్ధిల్లుతుంటుంది. నీవు కూడా పూర్వుల సదాచారాన్ని గౌరవించి మన వంశప్రతిష్ఠను పెంచే పనులను చేస్తున్నావని నేను తలుస్తాను.”

“క్రయవిక్రయాలు జరిపే వైశ్యులను ఎప్పటికప్పుడు జాగ్రత్తగా పర్యవేక్షించాలి. అంతఃపురస్త్రీలందరూ నీపై అభిమానంతో ఉన్నారు కదా. వారిపై నీవు ప్రేమాదరాలను కలిగి ఉన్నావు కదా. అలా అని రహస్య విషయాలను వారికి చెప్పడం లేదు కదా. అంతఃపురవాసుల రక్షణభారం రాజుపైనే ఉంటుంది. ప్రతిరోజు రాజ్యంలోని పౌరులకు నీ దర్శనం కలిగిస్తున్నావు కదా. ప్రజలందరూ నిర్భయులై జీవిస్తున్నారు గదా. ఉద్యోగుల విషయంలో మధ్యేమార్గాన్ని అవలంబిస్తున్నావు గదా. నీ దగ్గర వారికి అతి చనువుగాని అతిభయం కాని ఉండకూడదు. వారు విషయాలను నిస్సంకోచంగా నీతో చర్చించే వీలును కల్పిస్తున్నావు గదా. నీ భయంతోవారి అవసర కార్యాలను దాటవేయకుండా చూడాల్సి ఉంటుంది.

భరతకుమారా! నీ కోశాగారాన్ని, నీ దుర్గాలన్నింటిని సక్రమంగా చూసుకొంటున్నావు గదా. అస్త్రశస్త్రాలు, యంత్రాలు, ధనధాన్యాలలో లోటు రానీయకుండా చూడాలి. నీ రాజ్యాదాయం పుష్కలంగా ఉంది కదా. నీవు భోగలాలసుడివై ధనాన్ని నట, నర్తక, గాయకులకు పంచడం లేదు కదా. అలా అని నీవు భోగాలపై విరక్తుడివి కూడా కాకూడదు. లలిత కళలను ప్రోత్సహిస్తే రాజులోను ప్రజలలోను మానసికానందం కలిగి వారి నైపుణ్యానికి మెరుగులు దిద్దవచ్చు. నీ ధనాన్ని మాతాపితల సేవలకు, దైవకార్యాలకు, అభ్యాగతులకు, యోధులకు, మిత్రులకు ఉపయోగిస్తున్నావు కదా. ఎట్టి పరిస్థితులలోను ధనాన్ని అప్రయోజకుల పాలు చేయకూడదు."

"సజ్జనులపై నేరారోపణ చేస్తే న్యాయవాదులను లోతుగా పరిశీలించి న్యాయంగా శిక్షను అమలుచేయాలి. నేరారోపణ రుజువైన వానిని కఠినంగానే దండించాలి. వాని విషయంలో లోభం చూపకూడదు. అలానే నిరపరాధులను శిక్షించకూడదు. నిర్దోషుల కన్నీరు భూమిపై ఒలకకూడదు. వృద్ధులు, బాలబాలికలు, విద్యావంతులు నిన్ను కలుసుకొన్నప్పుడు వారికి తగిన బహుమతులు ఇచ్చి వారిని సంతోషింపజేయాలి. మిత్రుల విషయంలోను మృదు వచనాలే పలకాలి.

భరతా! బ్రాహ్మణోత్తములకు, వృద్ధులకు, దేవతలకు, మహావృక్షాలకు నమస్కరిస్తున్నావు గదా. ధర్మాచరణ సమయంలో అర్థార్జన, ధనాన్ని ఆర్జించాల్సిన సమయంలో ధర్మ ప్రసంగాలు చేసి ధర్మార్థాలకు హాని కలిగించడంలేదు గదా. కాలాన్ని సద్వినియోగపరుస్తూ నీవు, నీ ప్రజలు సుఖ సంతోషాలను పొందుతున్నారు కదా. నగర ప్రజలను ఆనందపరుస్తున్నట్లుగానే జానపదుల సంతోషాన్ని గమనిస్తున్నావు గదా. సరిహద్దులలోని వారి విషయంలో అతి జాగ్రత్తగా ఉండాలి. వారి సంతోషాన్ని పెంచే కార్యాలను తప్పక చేపట్టాలి. రాజుపైన వారిలో భక్తి, ప్రేమ వృద్ధి చెందేటట్లు చేయాలి."

"భరతా! రాజదోషాలు పద్నాలుగున్నాయి. అవి నాస్తికత్వం, అబద్ధం చెప్పడం, క్రోధం, ఏమరుపాటు, కార్యాలలో కాలయాపన, ఇంద్రియలోలత్వం, జ్ఞానులను దర్శించకుండడం, రాజకార్యాలను ఒక్కని ఆలోచనలోనే చేయడం, అవగాహనరాహిత్యంతో సమాలోచనలు, నిశ్చయించిన పనులలో జాప్యం, రహస్యాల వెల్లడి, మంగళకార్యాలు చేయకుండడం, అనేకశత్రువులపై ఒకేసారి దండెత్తడం లాంటి ఈ పద్నాలుగు పనులు రాజుకు చేయకూడదు. ఇది నీకు తెలుసు గదా.

భరతా! దశ, పంచ, చతు, సప్త, అష్ట, త్రి వర్గాల దోషాలను నీవు విసర్జిస్తున్నావు గదా.

మృగయాక్షో దివాస్వాపః పరీవాదః స్త్రియోమదః

తౌర్యత్రికం వృథాట్యా చ కామజో దశకో గుణాః

ఇవి పదిదోషాలు వేట, జూదం, పగటి నిద్ర, పరనింద, స్త్రీ మదం, వ్యర్థాలాపనలు ఇలాంటివి రాజు చేయకూడని దోషాలు.

శత్రువు, ద్రవ్యం, స్త్రీ, పరుషవాక్కు, అపరాధంవలన కలిగే వైరాలు పంచవర్గం. వీటినుంచి కూడా రాజు జాగ్రత్తతో దూరంగా ఉండాలి.

సాపత్నం వస్తుజం స్త్రీజం వాగ్జాత మపరాధజమ్

వైరప్రభేదనిపుణై ర్వైరం పంచవిధం స్మృతమ్

చతుర్వర్ణ సామ దాన దండభేదోపాయాల చేత కాని న్యాయార్జన, రక్షించుట, వృద్ధి పొందించుట, సత్పాత్రునకు ఇవ్వడం లాంటి నాలుగు విధాలైన మిత్రవర్ణంతో కూడా సమయస్ఫూర్తితో రాజు మెలగాలి."

"**సప్తవర్ణం** అనగా, స్వామి, అమాత్యులు, రాష్ట్రం, దుర్గం, కోశం, సైన్యం, మిత్రుడు ఇవి రాజ్యానికి సప్తాంగాలు. వీటి విషయంలో కూడా రాజు అప్రమత్తుడై వ్యవహరించాలి. లేక తనవాడు, మిత్రుడు, ఆశ్రితుడు, బంధువు, కర్మచారి, భృత్యుడు, ఉపకారంతో లబ్ధిపొందినవాడు ఈ ఏడుగురి విషయంలో కూడా రాజు తగిన జాగ్రత్తతోనే మసలుకోవాలి.

"శ్యేనః సూచీ వజ్రశ్చ శకటో మకరస్తథా

దణ్డాఖ్యః పద్మనామా చ వ్యూహాః సప్తప్రధానతః

శ్యేనం, సూచి, శకటం, మకరం, దండం, పద్మం అనే యుద్ధరంగంలో సేనలు నిలుపు విధానాలు ఏడు. వీటిని గురించి కూడ రాజు సంపూర్ణంగా తెలుసుకొని ఉండాలి.

అష్టవర్గం: రాజు మంచి పరిపాలనతో ప్రజారంజక పాలనం చేయాలంటే వ్యవసాయం, వర్తకం, దుర్గం, సేతువు, అడవి, గని, సుంకం, నిర్జనారణ్యాలలో జనసమ్మర్దం చేయడం వంటి వాటిని లోపం లేకుండా చూడాలి. అంతేకాక క్రోధం నుండి పుట్టే ఎనిమిది వ్యసనాలకు రాజు దూరుడై ఉండాలి. అవి చాడీలు చెప్పడం, ద్రోహం చేయడం, ధనాశ, ఈర్ష్య, అసూయ, వాక్పారుష్యం, దండపారుష్యం అనేవి.

త్రివర్గం: అసాధ్యాలైన వాటిని సాధించాలనుకోవడం, సులభసాధ్యాలను ప్రయత్నపూర్వకంగా సాధించక పోవడం, సమయపాలన పాటించకపోవడమనే వ్యసనత్రయాన్ని కూడా రాజు తన దృష్టిపథంలో ఉంచుకోవాలి.

త్రయి, వార్త, దండనీతిని పాటించడమే త్రివర్గం అని కూడా అనవచ్చు. భరతా! రాజు శత్రువులపై యుద్ధభేరిని మ్రోగించడంలో ఆచి తూచి అడుగువేయాలి. శత్రువులతో సంధి హితమా! లేక శత్రుశేషం లేకుండా చేయడం హితమా! అని ఆలోచించి అడుగువేయాలి. దైవమానుష ఆపదలను ఎదుర్కొనే స్థైర్యధైర్యగుణాలు రాజులోను, రాజును ఆశ్రయించిన సేనాపతులలోను, మంత్రులలోను ఉండితీరాలి. శత్రుపక్షంలోని ఆత్మాభిమా నులను, లుబ్ధులను నిష్కారణంగా రాజావమానం పొందిన వారలను తనవైపు తిప్పుకొనే నేర్పు రాజుకు ఉండాలి. ఎట్టి పరిస్థితులలోను సంధి చేసుకోవడానికి పనికిరాకుండా తుదముట్టించవలసిన వారు ఇరవైవిధాల శత్రువులు

ఉంటారు. వారి విషయంలో రాజు కఠినదండననే విధించి తీరాలి. విజిగీషువు ఐన రాజు అనగా రాజ్యకాంక్షతో రాజ్యాన్ని విస్తరింపజేయాలనుకొనే రాజు పిరికివానిని దరి చేరనీయకూడదు. లోభులను, దురాశాపరులను, విషయాసక్తుడిని, తృప్తిచెందనివాడిని, శత్రుత్వం బలంగా ఉన్నవాడిని, సత్యధర్మాలు పాటించనివాడిని, దుర్భిక్ష పీడితుడిని, స్వదేశాన్ని వీడి పరాయిపంచన చేరినవాడిని, దేవబ్రాహ్మణ దూషణ చేసేవాడిని దూరం చేసుకోవాలి. శత్రువు మిత్రుడు, మిత్రుని శత్రువుల విషయంలో రాజుకు అతి జాగ్రత్త అవసరం".

"రాజనీతిని ధర్మాచరణను, యుద్ధనీతిని క్షుణ్ణంగా అర్థం చేసుకున్న రాజే ప్రజలను కన్నబిడ్డలుగా పాలించగలడు. నీవు ఈ విషయాలన్నింటిలో ఆరితేరినవాడివని నాకు తెలుసు. వేదోక్తధర్మాలను పాటిస్తూ రాజనీతి శాస్త్రరీత్యా ఆలోచనలను చేస్తున్నావు గదా. నీ అగ్నిహోత్రాది అనుష్ఠానాలను విధిగా జరుపుతున్నావుగదా. నీ అర్ధాంగి నిన్ను అనుసరిస్తున్నది గదా. నీవు ఆమెపై ప్రేమాదరాలను కలిగి ఉన్నావు గదా. నీవు సంతానవంతుడివి అయినావా? నేను ఇప్పుడు చెప్పినవన్నీ నీలో వినయసంపదను పెంచుతాయి. ఉత్తమార్జనకు పనికివస్తాయి. ధర్మాచరణలో ఆసక్తిని పెంపొందించుతాయి. దానివలన నీకు ఆయుర్వృద్ధి, సకలశుభాలు చేకూరుతాయి. నాయనా! భరతా! మన పూర్వులు, సత్పురుషులు నడచిన బాటలోనే నీవు నడిచినట్లు అయితే నీకు సర్వం శుభకరంగానే ఉంటుంది."

"భరతా! నీవు ఎల్లవేళలా రుచికరాలైన భోజ్యపదార్థాలను ఒక్కడివే భుజించకు. నలుగురికీ పంచడంలోని తృప్తిని స్వయంగా ఆచరించి తెలుసుకో. రాజనీతిజ్ఞుడివై, ఆత్మజ్ఞానివై న్యాయదండాన్ని చేపట్టి ప్రజలను ధర్మబద్ధంగా పాలించు. ఆనాడు ఈ సమస్తభూమండలం నీ పాదాక్రాంతం అవుతుంది. నిన్ను ఎదిరించే శత్రువు పుట్టడు. దానివల్ల నీవు ఇహ సుఖాలతోపాటు పరసుఖాలను పొందగలవు" అని శ్రీరాముడు భరతునకు రాజనీతిని బోధించాడు.

* * *

భరతుని అభ్యర్థన

సర్గ - 101

రాజనీతులన్నీ బోధించిన రాముడు లక్ష్మణసమేతుడై భరతుని ఓదార్చాడు. "భరతకుమారా! నీవు జటావల్కలాలు ధరించి ఇక్కడకు ఎందుకు వచ్చావు? నీవు తండ్రి ఇచ్చిన రాజ్యాన్ని పాలించకుండా ఇక్కడికి రావడంలో నీ ఉద్దేశ్యం ఏమిటి?" రాముని ప్రశ్నలు భరతునిలో దుఃఖాన్ని పెంచాయి. శ్రీరాముని గట్టిగా కౌగిలించుకొని రోదిస్తూ "అన్నా! నిన్ను అడవికి పంపి మన తండ్రి చేయరాని పనిని చేశానని బాధపడుతూ పుత్రశోకాన్ని భరించలేక స్వర్గస్థుడైనాడు" అని చెప్పి భోరున విలపించాడు.

"సర్వులకు ప్రియుడివైన నిన్ను తన ముద్దుల భార్యకోసం మన తండ్రి దూరం చేసుకొన్నాడు. ఆ మహాపాపంవల్ల ఆయన ఆర్జించిన పుణ్యఫలమంతా ఆవిరయిపోయింది. నా తల్లి కైక తీరని కోరికతో వైధవ్యాన్ని పొందింది. ఇప్పుడు పతి వియోగాన్ని భరించలేక పుత్రుని దూరం చేసిన పాపానికి నరకబాధను అనుభవిస్తోంది. మీరు నన్ను అనుగ్రహించి రాజ్యాభిషిక్తుడివై నాపై దయచూపు. మహారాజును కోల్పోయిన ప్రజలు, భర్తను పోగొట్టుకొని భార్యలు, తండ్రిని దూరం చేసుకొన్న మేము మీ పాదసన్నిధిని చేరాము. మమ్ము కాపాడవలసిన బాధ్యత మీపైనే ఉంది. శ్రీరామా! మాపై కరుణతో మేము చెప్పేది విను తండ్రీ" అని భరతుడు శ్రీరామునికి విన్నవించాడు.

"శరత్కాలపు రాత్రి చంద్రుని పొంది ఆనందించినట్లు మీరు ఈ భూదేవిని చేపట్టి రాజ్యలక్ష్మిని సనాథురాలిని చేయండి. మంత్రులు, నేను, సేనానాయకులు, ప్రజలందరమూ శిరస్సు వంచి నిన్ను ప్రార్థిస్తున్నాం. మీ సోదరుడిని, శిష్యుడిని, దాసుడినైన నన్ను కృతార్థుణ్ణి చేయండి శ్రీరామా! వంశాచారం ప్రకారం కులధర్మాన్ని అనుసరించి మీకు దక్కిన రాజ్యాన్ని కాదనకుండా చేపట్టండి" అంటూ భరతుడు పలువిధాలుగా అభ్యర్థిస్తూ రాముని పాదాలు పట్టుకొని ఏడ్వసాగాడు.

దుఃఖార్తితో తపించిపోతున్న భరతుణ్ణి రాముడు లేవనెత్తి హృదయానికి హత్తుకొన్నాడు. "భరతా! ఉత్తమ కులమందు పుట్టిన నీవు ఏ పాపకార్యాన్నీ చేయలేదు. బాల్యచేష్టలతో నీ తల్లియైన కైకను నిందించకు. పాపరహితుడివైన భరతా! శోకించకు. మన తండ్రి చేయరాని తప్పులు ఏవీ చేయలేదు. మన పూర్వజులు, సత్పురుషులు నడచిన త్రోవలోనే ఆయన నడిచాడు. భార్యాపుత్రాదుల విషయంలో తమకు నచ్చిన రీతిలో వారు ప్రవర్తించవచ్చు. ఆ న్యాయాన్ని దృష్టిలో పెట్టుకొన్న దశరథమహారాజు ప్రవర్తించాడు. మన తండ్రికి నన్ను రాజ్యాభిషిక్తుణ్ణి చేసేందుకు ఎంత అధికారం ఉందో నారచీరలు ధరింపజేసి నన్ను అరణ్యాలకు పంపేందుకు అంతే అధికారం ఉంది. ఇది నీవు అంగీకరించవలసిన విషయం."

"ధర్మజ్ఞుడైన తండ్రిని మనం ఎలా గౌరవిస్తున్నామో అదే గౌరవాన్ని మన తల్లులకు ఇవ్వడం మన విధ్యుక్త ధర్మం. ధర్మశీలురైన నా తల్లిదండ్రులు నన్ను దండకారణ్యాలకు వెళ్ళమని ఆదేశించినప్పుడు నేను అలా చేయక వేరొక మార్గాన్ని ఎట్లా ఎంచుకొంటాను? నేను దండకారణ్యాలలో ఎలా వనవాసినై పద్నాలుగేండ్లు గడుపుతానో, నీవు కూడా రాజ్య సింహాసనాన్ని అధిష్ఠించి ప్రజారంజకపాలన చేయడం నీ కర్తవ్యం. అప్పుడే నీవు తండ్రి మాటను గౌరవించినట్లు అవుతుంది.

మహాతేజశ్శాలియైన మన తండ్రి సర్వజనుల ముందు ఈ విధంగానే మనలను ఆజ్ఞాపించాడు. ధర్మాత్ముడైన తండ్రిమాటకు కొడుకులమైన మనం గౌరవం ఇచ్చి తండ్రి ఆజ్ఞను పాటించి తీరాలి. తండ్రి నీ భాగానికి రాజ్యం ఇచ్చాడు. నా భాగానికి అర్హమైన దండకారణ్యాన్ని ఏలమని అప్పగించాడు. తండ్రి మాట ప్రకారం నేను నా కర్తవ్యాన్ని పాలిస్తాను. ఇదే నాకు సముచితంగా కనిపిస్తోంది. తండ్రి మాటకు విరుద్ధంగా వేరొకటి నేను చేయలేను" అని శ్రీరాముడు భరతుని అభ్యర్థనను సున్నితంగా తిరస్కరించాడు.

* * *

మహారాజు నిష్క్రమణ వివరణ

సర్గ - 102

శ్రీరాముని మాటలన్నీ భరతుడు విన్నాడు. అన్నా! నాకు మిమ్ము సేవించడం, మిమ్ము అనుసరించడమే ధర్మం. ఆ ధర్మాన్ని వీడిన నాకు ఇతర రాజధర్మాలతో పని ఏముంది? శ్రీరామా! మన వంశాచారం ప్రకారం జ్యేష్ఠుడు ఉండగా కనిష్ఠునికి రాజార్హత లేదు గదా. అందువలన మీరు ఈ ఐశ్వర్య సమృద్ధమైన అయోధ్యను చేపట్టి కులాచారాన్ని, వంశాచారాన్ని నిలబెట్టండి.

సామాన్యజనులు రాజును మానవునిగానే తలుస్తారు. కాని రాజు ధర్మార్థాలను రక్షించే విషయంలో తన సంగతిని విస్మరిస్తాడు. మానవాతీతమైన పనులను చేపట్టి రాజ్యాన్ని రక్షిస్తాడు. అందువల్ల నా దృష్టిలో రాజు ప్రత్యక్ష దైవమే. నేను కేకయదేశంలో ఉండగా సీతాలక్ష్మణులతో కలిసి మీరు అడవికి వెళ్ళి ఉన్నప్పుడు సత్పురుషులు కీర్తించే మన తండ్రి దశరథుడు స్వర్గస్థుడైనాడు.

మీ వియోగదుఃఖాన్ని భరించలేని దశరథుడు దివంగతుడయ్యాడు. మన తండ్రి ఆత్మశాంతికై నేను, శత్రుఘ్నుడు జలతర్పణం చేశాం. మీరు, లక్ష్మణుడు తండ్రి కోసం తర్పణాలు వదలండి. ప్రియమైన కొడుకు ఇచ్చే తిలాంజలులు పితృలోకంలో అక్షయ పుణ్యఫలాలను అందిస్తాయని అంటారు. మన తండ్రికి మీరే ప్రియపుత్రులు కదా. మీరు దూరంగా వెళ్ళిపోవటంతో ఆయన మీ వియోగాన్ని తట్టుకోలేకపోయాడు. మీపై లగ్నమైన మనస్సును మరల్చుకోలేక మిమ్ము గూర్చి చింతిస్తూ శోకతప్తుడయ్యాడు. మీపై ధ్యాసతోనే దశరథుడు దివికేగాడు.

* * *

రామాదుల విలాపం

సర్గ - 103

భరతుడు చెప్పిన తండ్రి మరణవార్తను విన్న రాముడు నిశ్చేష్టుడయ్యాడు. హృదయవిదారకమైన మాటను విని వజ్రఘాతం తగిలినవానిలాగా శ్రీరాముడు మొదలు నరికిన చెట్టులాగా కూలిపోయాడు. తండ్రీ! మమ్ము వీడి ఎక్కడికెళ్లావని రెండు చేతులెత్తి గట్టిగా రోదించాడు. లోకాలన్నీ రక్షించే నేర్పున్న శ్రీరాముడు తన హస్తలాఘవంతో చెట్లను కూలద్రోసి బాగా దస్సి నేలకొరిగిన మదపుటేనుగులాగా నేలపై పడ్డాడు. అతని చుట్టూ లక్ష్మణాదులు, సీత చేరి పితృవియోగదుఃఖాన్ని భరించలేక గట్టిగా ఏడ్చారు.

మూర్ఛిల్లిన రామునిపై కాసిని నీళ్లు చల్లి సేదతీర్చారు. రాముడు తెప్పరిల్లి దైన్యస్థితిలోనే ఉండిపోయాడు. తండ్రిని పోగొట్టుకొని విలపిస్తున్న రాముడు "భరతా! మన తండ్రి లేని అయోధ్యతో నాకు పని ఏముంది?

సత్పురుషుడైన మహారాజు ఏలిన ఆ కోసలరాజ్యాన్ని ఇప్పుడు ఎవరు ఏలగలరు? అయ్యో నాకోసమే పరితపిస్తూ ప్రాణాలు విడిచిన నా తండ్రికి నేను అంత్యక్రియలు చేయలేకపోయాను. నేను జన్మించి ప్రయోజనం లేదు. భరతశత్రుఘ్నులిద్దరూ కృతార్థులు. వారి తండ్రికి అపరక్రియలు చేసి ధన్యాత్ములు అయ్యారు. వనవాసానంతరం కూడా దశరథమహారాజు లేని అయోధ్యను నేను చూడలేను. అందువల్ల నేను అక్కడికి రాను. ఒకవేళ నేను దీక్ష ముగించుకొని అక్కడకు వస్తే నాకు ఉపదేశం చేసేవారు, నాకు మార్గనిర్దేశం చేయగలవారు ఎవరూ లేరుకదా. మా తండ్రి ఎప్పుడు సుఖాభివృద్ధికరమైన మాటలను మాట్లాడేవాడు. అవి ఎంతో వినసొంపుగా ఉండేవి. వినాలనే ఆశను పెంచేవి. మరి ఇప్పుడు ఇటువంటి మాటలు ఎవరి దగ్గర వినగలం?" అని భరతునితో శ్రీరాముడు తండ్రిని గూర్చి చెప్పాడు.

సీత, లక్ష్మణులవైపు తిరిగి "చంద్రముఖీ! మీ మామగారు మరణించారని, లక్ష్మణా! నీవు తండ్రి లేని వాడినయ్యావనే కఠోరసత్యాలను ఈ భరతుడు చెప్తున్నాడు." అనే రాముని మాటలు వింటుంటే సీతాదులకు కన్నీరు ఆగలేదు. శ్రీరాముని వారందరూ ఓదార్చి తండ్రికి జలతర్పణం చేయమని ప్రోత్సహించారు. సీతను, లక్ష్మణుని ఓదార్చుతూ మన తండ్రికి ఉత్తరక్రియలు చేద్దాం. గారచెట్టు తెలగపిండిని ఉత్తరీయాన్ని తీసుకొని రమ్మని వారికి శ్రీరాముడు చెప్పాడు.

సోదరులను ఓదారుస్తూ సుమంత్రుడు సీతను వెంటబెట్టుకొని ఆ సోదరులను మందాకినినదీతీరానికి తీసుకొని వచ్చాడు. ఫలపుష్పాలతో నిండిన తీరం గల మందాకినిలో వారందరూ స్నానాలు చేశారు. దోసిలితో నీరు పట్టి దక్షిణంవైపు తిరిగి "తండ్రీ ఈ జలం నీకు తృప్తిని కలిగించుగాక! అని అన్నారు. ఈ నిర్మలసలిలాలు అక్షయమై నిన్ను చేరుగాక!" అని శ్రీరాముడు తండ్రికి జలతర్పణం చేశాడు. అందమైన రేవులు వున్న మందాకిని నీటినుంచి ఒడ్డుకు చేరి తిలతర్పణపూర్వకంగా శ్రీరాముడు పిండప్రదానం చేశాడు.

శ్రీరాముడు దర్భలు పరిచి వాటిపై రేగుపండ్లు కలిసిన గారపిండి ముద్దలను పెట్టాడు. దుఃఖార్తుడై గద్గద కంఠంతో శ్రీరాముడు "తండ్రీ మేము భుజించే ఆహారాన్నే నీకు నేను ఇస్తున్నాను. మనం తినే ఆహారమే దేవతలు ఆరగిస్తారుకదా. నీవు దీనిని తృప్తిగా భుజిస్తావుగదా!" అంటూ దుఃఖాన్ని ఆపుకోలేక గట్టిగా విలపించాడు.

ఆ తర్వాత వారందరూ పర్ణశాలకు వెళ్లారు. శ్రీరాముడు సోదరులను చూచి తండ్రిని కోల్పోయామనే చింతతో వారిని కౌగిలించుకొని గట్టిగా ఏడ్చాడు. వారందరి ఏడ్పుల శబ్దం ఆ కొండచరియలలో ప్రతిధ్వనించింది. ఈ ధ్వనిని భరతుని సైనికులు విని వ్యాకులం చెందారు. మరల పరిశీలనగా విని భరతుడు శ్రీరాముని కలుసుకొని ఉంటాడు. తండ్రి మరణాన్ని తెలిపి ఉంటారు. అందుకే ఆ సోదరులు, సీత కలిసి తండ్రిని తలచి రోదిస్తున్నట్లున్నారు. ఇది రోదనధ్వనియే అని అనుకొన్నారు. వారందరూ వారి స్థానాలను విడిచి ఆ ఏడుపు వచ్చే దిక్కుగా పరుగెత్తి వెళ్లారు. కొందరు గుర్రాలను అధిరోహించి, కొందరు గజాలనెక్కి శ్రీరాముని చూడాలని పరుగెత్తారు. మరికొందరు వారి కాలినడకతోనే పరుగు లంకించుకున్నారు. వారివారి వాహనాల చప్పుడు, గుర్రపుడెక్కల శబ్దం, వారి

కోలాహలం కలిసి మహాధ్వని ఏర్పడింది. మేఘాలరాపిడితో కలిగే ధ్వనిని తలపించింది. ఆ ధ్వనికి భయపడిన ఆడ ఏనుగులు మగఏనుగుల దగ్గరకు వెళ్లాయి. అవి రెండూ కలిసి మరొక ప్రాంతానికి పరుగులు తీశాయి. వారి మదపుటేనుగుల ఘీంకారధ్వని, రామాదుల ఏడుపుతో ఏర్పడిన ధ్వని సైనికుల పాదఘట్టనల ధ్వనితో కలిసిపోయి వన్యమృగాలు భయంతో వణికిపోయాయి.

వరాహాలు, తోడేళ్లు, దున్నలు, సర్పాలు, వానరాలు, వ్యాఘ్రాలు, గోకర్ణాలు, గవయాలు, జింకలు తలోదిక్కుకు పారిపోయాయి. చక్రవాకాలు, హంసలు, కారండవాలు, కొంగలు, కోకిలలు, క్రౌంచాలు ఆ ధ్వనికి భయపడి దూరంగా పారిపోయాయి. భయంతో ఎగిరిపోయిన పక్షుల సమూహం ఆకాశాన్ని కప్పివేశాయి. క్రింద భరతుని సేన భూమిని కప్పివేసింది. ఇలా భూమ్యాకాశాలు సమానంగా ఉన్నట్లుగా ప్రకాశించాయి. జనులందరూ రాముని పర్ణశాలను చూశారు. వడివడిగా వస్తూ ఖిన్నుడై నేలపై కూర్చుని దుఃఖిస్తున్న శ్రీరాముని చూశారు. దీనికంతటికి కారణమైన కైకను, మంథరను దూషిస్తూ వారికి ఇష్టుడైన శ్రీరాముని దగ్గరకు చేరారు.

మహారాజును కోల్పోయిన జనులను శ్రీరాముడు చూచి వారిని ఓదార్చాడు. తల్లిదండ్రుల్లాగా వారిని ఆదరించాడు. రాముని చేరిన వారినందరినీ స్వాగతిస్తూ కన్నీరు కార్చుతూ వారికి సముచితరీతిలో గౌరవ మర్యాదలు శ్రీరాముడు చేశాడు. వారందరి మనస్సులు దుఃఖంతో నిండిపోయాయి. తండ్రిని కోల్పోయిన రామాదులను చూసి జనులందరూ రోదించారు. మహాత్ములైన సోదరులకు భరించలేని కష్టాలు వచ్చిపడ్డాయని వారందరూ దుఃఖించారు. వారిని చూచి రామాదులు రోదించారు. ఇలా వారందరి దుఃఖం మృదంగధ్వనిలాగా అవిచ్ఛిన్నంగా సాగింది.

* * *

కౌసల్యాదులు - శ్రీరాముడు

సర్గ - 104

వసిష్ఠుడు రాముణ్ణి చూడాలన్న ఆశయంతో రాజపత్నులతో కలిసి రామాశ్రమం వైపు సాగాడు. కౌసల్యాదులు మందాకినీతీరాన్ని చేరి అక్కడి రేవును చూశారు. కౌసల్యకు దుఃఖం ముంచుకొచ్చింది. "సుమిత్రా! నీ కుమారుడైన లక్ష్మణుడు ఈ రేవునుంచి రామునికోసం నీటిని తీసుకొని వెళ్తున్నట్లు అనిపిస్తోంది. నీవు లక్ష్మణుడు చేసే పనిని నీచంగా భావించకు. అన్నకోసం తమ్ముడు చేసే సేవ మహత్తరం అవుతుందిగాని ఏనాటికీ నీచమనిపించుకోదు. అయినా ధర్మాత్ముడైన భరతుని కోరికను మన్నించి నా రాముడు త్వరలో రాజ్యాభిషిక్తుడు అవుతాడు. అప్పుడు లక్ష్మణునికి ఈ బాధ తప్పిపోతుంది. ఆ కాలం త్వరలోనే వస్తుంది" అని సుమిత్రతో కౌసల్య పలికింది.

ఇంకాస్త దూరం వారు నడవగానే వారికి శ్రీరాముడు ఇంగుదీవృక్ష తెలకపిండితో చేసిన పిండాలు కనిపించాయి. దానిని చూచి కౌసల్యాదులు కంట తడి పెట్టుకొన్నారు. "సోదరీమణులారా! భరతుని ద్వారా తండ్రి మరణవార్తను రామాదులు తెలుసుకొన్నట్లున్నారు. మహాత్ముడు జ్యేష్ఠుడైన రాముడు పిండప్రదానం చేసినట్లున్నాడు. సముద్రమే ఎల్లలుగా వున్న ఈ భూమండలాన్నంతా ఏలిన దశరథమహారాజు నేడు ఈ గారపిండి ముద్దలను ఎలా ఆరగించగలడు. సమస్త భోగాలను అనుభవించిన దేవేంద్రునిలాగా వెలుగొందిన ఆ మహానుభావునికి నేటికి ఈ తెలకపిండి ముద్దలు భోజనాలయ్యాయి. సకలైశ్వర్యాలతో తులతూగాల్సిన నా రాజకుమారుడు ఈ గారపిండిని తన తండ్రికి సమర్పించాల్సి వచ్చింది కదా. ఇంతకన్నా దుఃఖం ఇంక ఈ లోకంలో ఏముంటుంది" అని తన చెల్లెళ్లతో చెప్పి కౌసల్య కుమారుని దైన్యానికి వగచింది.

'మానవులు ఏమి తింటారో దానినే భగవంతునికి అర్పిస్తారన్నమాట సత్యం. నేడు నా కుమారుడు ఈ గారపండిని భుజిస్తూ అదే తండ్రికి సమర్పించాడుకదా. ఇట్టి పరిస్థితిని చూచి కూడా నా హృదయం ముక్కలు అవదు. నా గుండె నిజంగా పాషాణమే' అని రోదించే కౌసల్యను సపత్నులందరూ కలిసి ఓదార్చారు. వారందరూ చివరికి రామాశ్రమాన్ని చేరారు. సమస్త భోగాలను విడిచి నారవస్త్రాలను ధరించి అరణ్యవాసం చేసే శ్రీరాముని చూసి వారందరూ కన్నీరు కార్చారు. కౌసల్య రాముని దగ్గరకు చేరగానే రామాదులు వారందరికి పాదాభివందనం చేశారు. కౌసల్య రాముని దగ్గర చేరి వీపు నిమురుతూ దుఃఖాన్ని పారద్రోలడానికి ప్రయత్నించింది. తల్లి ఓదార్పులో శ్రీరాముడు కన్నీళ్లు పెట్టుకున్నాడు. తల్లులందరూ రామాదులను ఓదార్చారు. వనవాస క్లేశాలతో కృశించి ఉన్న సీతను కౌసల్య అక్కున చేర్చుకొని తల్లి బిడ్డను లాలించినట్లు కోడలిని లాలించింది.

కోడలిని అక్కున చేర్చుకొని 'అమ్మా నీవు దశరథమహారాజు కోడలివి. నీకు ఎన్ని కష్టాలు వచ్చాయో. ఇక్కడ ఎండ తాపానికి ఓర్చుకోలేని నీ ముఖబింబం కమలంలాగా వాడిపోయింది. దుమ్ము కొట్టుకొనిపోయి పూర్ణచంద్రబింబం లాంటి నీ ముఖ వర్చస్సు తగ్గిపోయింది. నీ చిన్నబోయిన మోమును చూస్తుంటే నా మనస్సు శోకాగ్నితో దహించి వేస్తోంది.'

శ్రీరాముడు దుఃఖాన్ని దిగమింగుకొని వసిష్ఠునికి పాదాభివందనం చేశాడు. ఆయన చెంతే కూర్చున్నాడు. వసిష్ఠుని దగ్గరకు భరతాదులు, పురప్రముఖులు మంత్రులు, సైనికులు, ధర్మవేత్తలు ఒక్కొక్కరుగా వచ్చి కూర్చున్నారు. తాపసవేషంలోని శ్రీరాముని ముఖం దివ్యతేజస్సుతో నిండింది. భరతుడు తన అగ్రజునికి చేతులు జోడించి నమస్కరించాడు. అక్కడినుంచే జనులందరూ దాన్ని చూశారు. ధర్మప్రభువైన భరతుడు తన అన్నగారితో ఏఏ సాధువచనాలు చెప్తాడో అని ఎదురుచూశారు. సత్పురుషుల హృదయాలన్నీ కుతూహలంతో నిండాయి.

సత్యసంధులైన రామాదులు వసిష్ఠునితోను, బంధుమిత్రులతోను కలిసి యజ్ఞశాలలోని త్రేతాగ్నులలాగా విరాజిల్లారు.

* * *

శ్రీరాముని హితవు

సర్గ - 105

దుఃఖంలో మునిగిన సోదరులకు అతి కష్టంగా రాత్రి గడిచింది. మరునాటి ఉదయాన్నే స్నేహితులు, బంధువులు అందరూ మందాకినిలో స్నానాలు చేసి జపహోమాలు ఆచరించారు. ఆ తర్వాత శ్రీరాముని వద్దకు వచ్చి కూర్చున్నారు. ఎవరూ ఏమీ మాట్లాడకుండా మౌనాన్ని ఆశ్రయించారు. స్నేహితులు, బంధువుల మధ్య కూర్చున్న రాముని నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ భరతుడు– "అన్నా! మా తల్లి మాటను మన్నించి మీరు నాకు రాజ్యాన్ని ఇచ్చారు. నేను సదాచారాన్ని నమ్మి మీకు ఈ రాజ్యాన్ని తిరిగి ఇచ్చివేస్తున్నాను. రాజార్హత మీకే ఉంది. అందువల్ల మీరు అయోధ్యకు వచ్చి రాజ్యసింహాసనాన్ని అధిష్ఠించి మమ్మల్నందరినీ సంతోషపరచండి" అని చెప్పాడు.

"ఓ శ్రీరామా! ఈ విశాల భూభాగాన్ని ఏలగల సమర్థులు మీరు ఒక్కరే. గాడిద గుర్రపునడకను అనుసరించలేనట్లుగాను, ఏ పక్షిరేడు గరుత్మంతుని వేగాన్ని అధిగమించలేనట్లుగా, నేను నీ బాధ్యతను మోయలేను. ఇతరులపై ఆధారపడి జీవించేవాని జీవితం వ్యర్థమే అవుతుంది. ఒక మొక్కను నాటినవానికి ఆ మొక్క వటవృక్షమై ఫలాలను ఇవ్వలేకపోతే వాడు చేసిన శ్రమ ఎలా వృథా అయిపోతుందో అలాగే నరులలో శ్రేష్ఠులైన మీరు దశరథ మహారాజు కోరినట్లు రాజ్యాన్ని చేపట్టకపోతే ఆ మహారాజు యాగాలు చేసి మిమ్ము కనిపెంచడం వృథా అయిపోతుంది. ప్రభువులలో శ్రేష్ఠులైన మీకు భృత్యులమైన మమ్ము కాపాడే బాధ్యత ఉంది. మీరు పెరిగి ఈ కోసలానికి రాజువు అవుతారన్న జనుల ఆశ అడియాస చేసినవారవుతారు.

"ఓ మహాప్రభూ! మీరు వంశగౌరవాన్ని పెంచుతూ రాజ్యసింహాసనాన్ని అధిరోహిస్తే వివిధ వర్గాలకు చెందిన పౌరులు, ప్రధానపురుషులు సంతోషిస్తారు. శ్రీరామా! నామాట మన్నించి అయోధ్యకు తిరిగిరండి. రాజ్య సింహాసనాన్ని చేపట్టి అయోధ్యావాసులను, నన్ను ఆనందింపచేయండి. నా నమ్మకాన్ని వమ్ము చేయకండి ప్రభూ" అంటూ దీనంగా వేడుకునే భరతుని చూసి శ్రీరాముడు ఎంతో బాధపడ్డాడు.

"సోదరా! నీవు ఇలా చింతించవద్దు. ఏ వ్యక్తి ఐనా ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించలేడు. మనుష్యులను దైవం ఆడిస్తుంటాడు. భగవంతుడు ఆడించినట్లు ఆడేవాళ్లమే కాని మనం వేరొక ఆట ఆడలేము. కూడబెట్టిన ధనాదులన్నీ ఒకనాటికి నశించి పోయేవే. భార్యాపుత్రమిత్రాదులందరూ ఒకనాడు వీడి పోవాల్సినవాళ్లే. ఈ భూమిపైకి ఎవరైనా ఒంటరిగానే వచ్చి ఒంటరిగానే వెళ్లిపోతారు. వారివారి పూర్వజన్మ సుకృతాన్నిబట్టి సుఖదుఃఖాలను అనుభవిస్తుంటారు. సంబంధబాంధవ్యాలన్నీ జీవించి ఉన్నంతవరకే పట్టిఉంటాయి. ఎంతటివారికైనా మరణం తప్పదు. బాగా పండిన పండ్లు ఎలా నేలకు రాలిపోతాయో, పండిన ఆకులు చెట్టునుంచి ఎలా రాలి పడిపోతాయో ఆవిధంగానే పుట్టిన ప్రతివ్యక్తీ కాలం తీరగానే మృత్యువు ఒడిలో తలదాచుకోక తప్పదు.

దృఢస్తంభాలతో కట్టిన భవనం ఏదో ఒకనాటికి శిథిలం అయినట్లుగానే ఈ శరీరాన్ని ఎంత బాగా పోషించి రక్షించినా, వార్ధక్యం రాకమానదు మరణం పొందకపోదు. ఇది అనివార్యవిషయం. గడచిన రాత్రి తిరిగి రానట్లుగా

ఈ లోకంలోని సర్వజీవుల ఆయువు తరిగిపోతుంటుంది. భరతా! ఇతరులకోసం నీవు ఎందుకు విలపిస్తావు? ఏ మనిషి అయినా పనిచేసినా, చేయకపోయినా కాలం ఆగదు. అతని ఆయువు తరగకుండా ఉండదు. అనివార్యాలైన వాటిని మానవుడు తప్పించుకోలేడు. సర్వులకూ బాల్యం, యౌవనం, వార్ధక్యం అనేవి ఒకదాని తర్వాత మరొకటి ఆహ్వానించకుండానే వస్తాయి. అప్పుడు జుట్టు నెరవడం, పళ్లు ఊడడం సామాన్య విషయాలే.

సామాన్య జనులందరూ సూర్యోదయానికి ధనార్జనసమయం ఆసన్నమైనదని సంతోషిస్తారు. వారే సూర్యాస్తమయాన్ని చూచి ఇది భోగించవలసిన సమయం అని ఆనందిస్తారు. కాని ఏ ఒక్కరూ మన ఆయువు తరిగిపోతుంది గదా మన జీవితంలో పనికొచ్చే పని ఏదైనా ఇంతవరకు చేశామా? అని ఆలోచించరు. పోనీ ఇకముందైనా జీవితాన్ని సార్థకం చేసుకుందామని కూడా తలచరు. వసంతాది ఋతువులు ఆరంభం కాగానే ఎప్పుడూ చూడనివి చూస్తున్నామనే భ్రమలో ఆనందిస్తారు. మరల మరలా వచ్చేవాటిని చూచి కొత్తవని సంతోషిస్తారు. కాని, వాటివల్ల వారి ఆయుర్దాయం క్షీణించిపోతుందని ఎవరూ గ్రహించరు.

మహాసముద్రంలో రెండు కర్రలు ఒకటిగా కొంత దూరం సాగిపోతాయి. మరల అవే వీడి చెరో దిక్కుకు పోతాయి. అదేవిధంగా సంపదలు, భార్యాపుత్రులు, బంధువులు అందరూ ఒకరికి ఒకరై జీవిస్తున్నామన్న భ్రమలో ఉంటారు. కాని వారు కాలాన్ని అతిక్రమించలేరు. వీరి సంయోగవియోగాలు అతిసహజంగా జరిగేవే. దారిని పోతున్న వారితో మీతో కూడా నేను మీ వెనుకే వస్తానని దారి చూపించేవారితో ముందుకు వెళ్లవచ్చు. అలానే మన పూర్వులు చూపిన బాటలో వారుచేసిన సత్కార్యాలను చేస్తూ మనమూ నడవవచ్చు. కాని ఒకరికోసం దుః ఖించడం అవివేకం. మన దుఃఖంతో వారి మృత్యువును కాని, మన మరణాన్నికాని ఆపలేము. నదీప్రవాహం ముందుకు సాగును కాని వెనక్కు రాదు. అలాగే వయస్సు పెరుగుతున్నకొద్దీ ఆయుస్సు తరిగిపోవడం అతి సహజం. గడచిన కాలం వెనక్కురాదు. అందుకే విచక్షణతో మనముందున్న కాలాన్ని సద్వినియోగపరచుకోవడం వివేకుల లక్షణం. మన తండ్రి సత్పురుషులు నడిచిన దోవలోనే నడిచాడు. సత్యవచనానికి కట్టుబడి ఉన్నాడు. యజ్ఞయాగాదులు చేశాడు. భూరిదానాలు చేశాడు. కాబట్టి స్వర్గానికి చేరాడు. తనదగ్గర ఉన్న భృత్యుల ప్రేమను పొందాడు. ప్రజలను కన్నబిడ్డల్లాగా వాత్సల్యంతో చూశాడు. ధర్మమార్గంలో ధనాగారాన్ని నింపాడు. నింపిన ఆ ధనాన్ని అపాత్రదానం చేయలేదు. అందుకే దివ్యపథాన్ని పొందగలిగాడు.

పలువురికి ఆదర్శవంతంగా ఉండేలా జీవించాడు. ఆయన ఉన్నా లేకపోయినా ఆయన చేసిన పనుల ఫలితాలను ప్రజలు అనుభవించేలాగా చేశాడు. క్రతువులు ఆచరించాడు. జలాశయాలు ఏర్పాటుచేశాడు. వందల ఏళ్లు జీవించి ఉండే వృక్షసముదాయాన్ని పెంచి పోషించాడు. అందుకే ఆ పుణ్యాత్ముడు దివికేగాడు.

పుష్కలంగా భోగభాగ్యాలను అనుభవిస్తూ దీర్ఘాయురారోగ్యములతో వర్ధిల్లి తన ప్రజలను తనవలె చూచుకొన్నాడు. అందుకే దశరథమహారాజు నేడు అమరపురిని అలంకరించాడు. ఆ పుణ్యపురుషుడు సత్కార్యాలు చేసి సద్భావనలతో రాజ్యాన్ని అచిరకాలం పాలించి ప్రజల మన్ననలను అందుకొని చివరికి పరమపదించాడు. ఆ పుణ్యపురుషుని కోసం మనం శోకించడం మంచిదికాదు.

సత్పురుషుడైన మన తండ్రి మానవదేహాన్ని విడిచి దివ్యదేహాన్ని పొందాడు. బ్రహ్మలోకాన విహరించడానికి ఆనందంగా వెళ్లాడు. ఆయన దైవీసంపదలను పొందాడు. ధీరులైనవారు జీవితంలో ఎదురయ్యే కష్టాలను చూచి దుఃఖించరు. సంతోషాన్ని చూచి పొంగిపోరు. ఇప్పుడు మనం తండ్రి మరణానికిగాని, నా వనవాసానికిగాని కుంగిపోవాల్సిన అవసరంలేదు. అలానే నీవు తండ్రి మాటను మన్నించి రాజ్యాన్ని ఏలడం నీ విధి.

దాన్ని నీవు తప్పక ఆచరించి తీరాలి. ఇలా విలపించడం ఎవ్వరికీ మంచిదికాదు. ధీరోదాత్తుడవైన నీవు బుద్ధిశాలివి. రాజ్యాన్ని చేపట్టి అయోధ్యావాసుల మనస్సెరిగి ప్రజారంజకంగా పాలన చేయి. నేను తండ్రి ఆనతి ప్రకారమే పద్నాలుగేళ్లు వనవాసాన్ని చేస్తున్నాను. మనం దశరథమహారాజు పుత్రులం. మనం తండ్రి మాటను ఉల్లంఘించడం ధర్మవిరుద్ధం అవుతుంది. దశరథుడు మన జన్మదాత. ఆయన మాట మనకు వేదతుల్యం, శిరోధార్యం.

నరశ్రేష్ఠా! ఇహపర సుఖాభిలాషులందరూ కూడా పెద్దల ఆజ్ఞలను శిరసావహించాలి. సత్పురుషుల దారిలో నడవాలి. నీ ధార్మిక స్వభావంతో ఆత్మోన్నతికి కృషిచేయి. నీకు ఎదురునిలిచేవారు ఎవరూ ఉండరు" అని ధర్మబద్ధుడు సర్వసమర్థుడైన శ్రీరాముడు తన తమ్ముడైన భరతకుమారునికి తండ్రి ఆజ్ఞను శిరసావహించుమని చెప్పాడు.

* * *

భరతుని వేడికోలు

సర్గ - 106

శ్రీరాముని ఉపదేశాన్నంతా భరతుడు విన్నాడు. "ఓ శ్రీరామచంద్రా! మీరు చెప్పినదంతా ఎవరూ కాదనలేని సత్యమే. మీరు దుఃఖాలకు కుంగిపోకుండా సంతోషాలకు పొంగిపోకుండా స్థితప్రజ్ఞతతో జీవిస్తున్నారు. మరల ఏమీ తెలియనివానిలాగా వృద్ధుల్ని సంశయాలు తీర్చమని అడుగుతుంటావు. అన్నీ తెలిసిన మీకు తెలియనివి ఏముంటాయి? అయినా అన్నా! అలా ప్రవర్తించడం మీ ఒక్కనికే సాధ్యమవుతుంది. కాని మాలో ఎవరికీ మీ అంత ప్రజ్ఞలేదు అని చెప్పడం అతిశయోక్తికాదు. మీరు ఎవరిపై రాగద్వేషాలుగాని, ఏ వస్తువులపై ఆసక్తిగాని, అనాసక్తిగాని ప్రదర్శించకూడదని చెప్పారు. ఇది వివేకుల లక్షణం అయి ఉంటుంది. వివేకి దేనికోసం పరితపించడు, కష్టాలకు వెరవడు.

అటువంటి ఉత్తమలక్షణాలన్నీ మీకే ఉన్నాయి. మీరు సత్త్వగుణసంపన్నులు. జననమరణరహస్యాలను తెలిసినవాడివి. మీ ప్రతిభతో ఎటువంటి కష్టాలనైనా ఎదుర్కోగలవు. ఏ బాధలూ మిమ్ము చలింపచేయలేవు. ఇది మీ ఉదాత్తలక్షణం.

నేను కేకయరాజ్యంలో ఉన్నపుడు అల్పజ్ఞానంతో నా తల్లి పాపకార్యాచరణ చేసింది. అందులో నా ప్రమేయం లేశమాత్రం కూడా లేదు. కాని అధర్మపరురాలైనా దండనకు తగింది అయినా తల్లిని రక్షించే బాధ్యత తనయునిదేకదా. అందుకని నేను ఆమెకు మరణదండన విధించలేదు. ఉత్తమవంశంలో పుట్టాను. ధర్మానికి ప్రతిరూపంగా భాసిల్లే మీకు తమ్ముడి నయ్యాను. ధర్మాధర్మాలను తెలిసి తల్లిని ఎలా శిక్షించగలను? అందుకనే ఆమెకు ఎట్టి శిక్షను నేను వేయలేదు. నా తండ్రి ధర్మమెరిగినవాడు, సత్యవచనుడు, వృద్ధుడు, గురువు, నా జన్మదాత, దైవంతో సమానుడు అట్టి మహితాత్ముడిని నేను ఏవిధంగాను నిందు సభలో అవమానించలేదు.

కాని ధర్మాధర్మాలను ఎరిగి వృద్ధాప్యంలో ఒక స్త్రీని సంతృప్తిపరచుటకు అధర్మానికి ఒడిగట్టడం న్యాయసమ్మతమేనా? జనుల బుద్ధి అవసానకాలంలో వక్రిస్తుందని పెద్దలు చెప్పే మాటలు నా తండ్రి విషయంలో నిజమైనట్లు ఉన్నాయి. ఏది ఏమైనా కైకను తృప్తిపరచడానికో, విధివశాత్తో మన తండ్రి ధర్మాన్ని ఉల్లంఘించి పాప కార్యాన్ని చేశాడు. అన్నీ తెలిసిన మీరు ఆ అధర్మకార్యాన్ని తిరిగి ధర్మయుక్తంగా చేయవచ్చుగదా. తండ్రి చేసిన అప్పులను తీర్చేవాడు, తండ్రి తప్పులను సరిదిద్దేవాడు ఉత్తమపుత్రుడని పేరుకదా. అట్టి ఉత్తమపుత్రుడు మీరే. మీరు అయోధ్యకు తిరిగివచ్చి ఈ జటావల్కలాన్ని విసర్జించి రాజ్యాధికారాన్ని చేపట్టండి. అప్పుడు తండ్రిచేసిన తప్పు సరిదిద్దినట్లు అవుతుంది. మన వంశాచారాన్ని సక్రమంగా మనమూ పాటించినట్లు అవుతుంది." అని భరతుడు శ్రీరాముని వేడుకొన్నాడు.

"శ్రీరామా! నన్ను, నా తల్లిని అనుగ్రహించు. మమ్మల్నందరినీ కాపాడే బాధ్యత మీ భుజస్కంధాలపైనే ఉంది. పురజనులను, బంధువులను కాపాడడానికి మీరు సమర్థులు. ప్రభూ! నాపై కరుణ చూపించు. రాజకుమారులైన మీరెక్కడ? మీరు చేసే ఈ వనవాసమెక్కడ? క్షాత్రధర్మానికి, జటాధారణకు సంబంధం ఏమైనా ఉందా? పరస్పర విరుద్ధకర్మలను చేయవద్దు. తాపసవృత్తి క్లేశభూయిష్ఠమైనది. క్షత్రియులైన మీరు మీ ధర్మాన్ని అనుసరించి రాజ్యాన్ని పాలిస్తూ వృద్ధులను, బాలలను, పౌరులను రక్షించే మీ కర్తవ్యాన్ని పాటించాలి. దీనివల్ల మీకు ఈ లోకంలో నిశ్చయంగా కీర్తిప్రతిష్ఠలు వచ్చి తీరతాయి. ఈ తాపసవృత్తిలో ఫలాన్ని నిశ్చయించలేము. కష్టాలు పడడమే మీకు ఇష్టమైతే నాలుగువర్ణాలవారిని సంతృప్తిపరిచే కష్టాన్ని ఎదుర్కో. వారినందరినీ తృప్తిపరిచే విధమైన పరిపాలన సాగించడం నిజంగా కష్టమే. మనిషిజన్మనెత్తినవారికి నాలుగుఆశ్రమాలలో గృహస్థాశ్రమమే ఉత్తమమైందని శాస్త్రాలు చెప్తున్నాయిగదా. మరి మీరు వానప్రస్థాశ్రమాన్ని ఎలా ఎంచుకోగలరు?

రామచంద్రా! దేన్నిబట్టి చూసినా మీకే రాజ్యాధికారం ఉంది. శాస్త్రరీత్యా, చట్టరీత్యా, వంశమర్యాద రీత్యా మీరే సర్వసమర్థులు. చిన్నవాడినైన నేను ఈ భూభారాన్ని మోయలేను. ప్రతిభాపాటవాలలోను నేను మీ తరువాతి వాణ్ణే. సద్గుణసంపదలోను నీ వెనుకవాణ్ణే. అట్టి నేను రాజ్యార్హతను ఏవిధంగా పొందగలను? మీరు రాజ్యాన్ని చేపట్టారని మన శత్రువులకు తెలిస్తే వారు తోకముడిచి పారిపోతారు. రఘువరా! మీరు దేవతలతో అభిషిక్తుడైన ఇంద్రునిలాగా మీరు మాచేత అభిషిక్తులై కోసలరాజ్యలక్ష్మిని వరించండి. పరులనిందలతో కుంగిపోతున్న నా తల్లిని రక్షించే భారం మీదే సుమా. మీకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. మన తండ్రి చేసిన అధర్మాన్ని

రూపుమాపి ధర్మానికి పట్టంకట్టండి. తల్లిదండ్రులను పాపకూపం నుంచి బయటపడేసే భారం మీపైనే ఉంది. పరాక్రమంతో సర్వలోకాలను జయించే నేర్పు ఉన్న మీరే ఈ అయోధ్యను ఏలే సర్వాధికారులు. నేను మనస్తాపాన్ని పొంది బాధలో కూరుకుని ఉన్నాను. నా మనవి ఆలకించి నన్ను ఉద్ధరించు తండ్రీ" అని పలువిధాలుగా భరతుడు శ్రీరాముడిని వేడుకొన్నాడు. చివరగా "అగ్రజా! మీరు నా మాటను మన్నించకపోతే మీతో కూడా నేను శత్రుఘ్నుడు అడవులకు వస్తాం. మేం మిమ్మల్ని అనుసరించి పద్నాలుగేండ్లు వనవాస జీవితాన్ని ఆరంభిస్తాం. మా మాటను మీరు తప్పక వినితీరాలి" అని భరతుడు అనేక రకాలుగా శ్రీరాముని అభ్యర్థించాడు. భయపెట్టాడు. భంగపోయాడు. ఎన్నోవిధాలుగా శ్రీరాముని అయోధ్యను చేపట్టుమని ప్రార్థించాడు.

దృఢసంకల్పచిత్తుడైన శ్రీరాముడు భరతుని అన్ని మాటలను శ్రద్ధగా విన్నాడు. కాని చిరునవ్వుతో వాటిని తోసిపారేసినాడు. పితృవాక్యపరిపాలనకే పెద్దపీట వేశాడు. ఇలాంటి మనఃస్థైర్యం ఉన్న శ్రీరాముని చూసి ప్రజలు నివ్వెరపోయారు. ఆయన దృఢచిత్తాన్ని చూసి వారు విస్మయానందులయ్యారు. వారందరూ ఒకేసారి రాముని నిర్ణయానికి కన్నీరును, ఆనందాశ్రువులును రాల్చారు. శ్రీరాముని కఠోరనియమానికి అచ్చెరువుతో ఆనందించారు. అయ్యో! శ్రీరాముని ప్రభువుగా పొందలేకపోయామని చింతించారు. అన్నకోసం పరితపించిపోయే భరతుని వారందరూ ప్రశంసించారు. తండ్రి మాటకోసం కట్టుబాటును దాటని శ్రీరామునిపై ప్రేమను పెంచుకొన్నారు. వారంతా కలిసి భరతుని ప్రార్థనను మన్నించుమని శ్రీరాముని కోరారు. సత్యసంధునివైన మీపరిపాలన మాకు అందించమంటూ వేడుకొన్నారు. "సర్వసమర్థుడివైన రామా! అయోధ్యకు మరలివచ్చి మమ్మేలుకో" అనివారు శ్రీరాముని ఎంతగానో వేడుకొన్నారు.

* * *

శ్రీరాముని ఆదేశం

సర్గ - 107

భరతుని పదేపదే ప్రార్థనలు విని శ్రీరాముడు "భరతకుమారా! కైకేయీ సుతుడివైన నీవు ఇలా మాట్లాడడం ఉచితంగానే ఉంది. కాని దశరథుని పుత్రులమైన మనమిద్దరం తండ్రి మాటను జవదాటకూడదను విషయం నీకు తెలుసుకదా. మన తండ్రి నీ తల్లిని వివాహం చేసుకొనేటప్పుడే నీకు రాజ్యం అప్పగిస్తానని నీ మాతామహునికి మాట ఇచ్చిఉన్నారు. అంతేగాక దేవాసురసంగ్రామకాలంలో మన తల్లి ఐన కైక ఎంతో సేవ చేసింది. ఆ సేవకు తృప్తిపడిన దశరథమహారాజు ఆమెకు వరాలు కూడా ఇచ్చాడు. అందువల్లనే మీ తల్లి మన తండ్రిచేత నన్ను అరణ్యాలకు పంపునట్లుగాను, నీకు రాజ్యాధికారం ఇచ్చేటట్లుగాను వాగ్దానం తీసుకొంది. తండ్రి వాగ్దానం నిలబెట్టడానికి నేను లక్ష్మణుడు, సీతతో కలిసి ఈ నిర్జనారణ్యానికి వచ్చాను. శ్రేష్ఠపురుషుడవైన నీవు మన తండ్రి మాటను శిరసావహించి ఆయన సత్యప్రతిజ్ఞను నిలబెట్టాల్సిన బాధ్యత నీపై కూడా వుంది. మనం పితృఋణం తీర్చుకొనాలి. తల్లిదండ్రుల ఇష్టానుసారం మనం నడుచుకోవాలి. అందువలన నీవు నిస్సంశయుడివై

రాజ్యపాలనాధికారాన్ని చేపట్టి మనోరంజకంగా భూమిని పాలించి మన వంశప్రతిష్ఠను పెంచు" అని శ్రీరాముడు భరతునకు హితోపదేశం చేశాడు. కీర్తిమంతుడైన గయుడు గయాక్షేత్రంలో పితృయాగాన్ని చేశాడు. అప్పుడు ఆయన 'పుత్' అనే నరకంనుంచి రక్షించేవాడే పుత్రుడని చెప్పాడు. పితృదేవతలకు తనయులు చేయు సత్కార్యాల వల్ల ఉత్తమగతులు ప్రాప్తిస్తాయి. అందువల్లనే పుత్రులు కావాలని తల్లిదండ్రులు కోరుకుంటారు. గుణవంతులు విద్యాధికులు ఐన కుమారులు పెక్కుమంది కావాలనే వారి కోరిక సమంజసమైనదే. ఎందుకంటే ఒకడు కాకపోయినా మరొకడు తమను పున్నామనరకం నుంచి తప్పిస్తారని వారు ఆశపడతారు. మనలను నవమాసాలు మోసి కని పెంచి పెద్దచేసిన వారికి మనం ఈ మాత్రం చేయడం సబబుగానే కనిపిస్తుందిగదా.

"భరతా! నీవు అయోధ్యకు వెళ్లి శత్రుఘ్నునితో కలసి రాజర్షులు నడచిన దోవలో నడుస్తూ ద్విజులందరిని మెప్పిస్తూ ప్రజానురంజనపాలన చేయి. నేను, మీ వదిన, లక్ష్మణునితో కలిసి ఈ ప్రాంతాన్ని విడిచి దండకారణ్యాలకు వెళ్తాము. నేను ఆనందంగా వనాలకు రాజునయి వన్యమృగాలను వృక్షాలను సంరక్షిస్తాను. నీవు కూడా సంతోషంగా అయోధ్యాపతివై నరులను రక్షించే బాధ్యతను చేపట్టి కృతార్థుడవుతావని నేను నమ్ముతున్నాను. భరతా! నీవు నిస్సంకోచంగా అయోధ్యకు తిరిగివెళ్లు. రాజ్యాధికారాన్ని సంతోషంగా స్వీకరించు. ప్రజలను కన్నబిడ్డల్లాగా సంరక్షించు. నీపై ఎప్పుడు శ్వేతచ్ఛత్రం ఉండి నిన్ను రక్షిస్తుంటుంది. దశరథునికి మనం నలుగురు పుత్రులం. మన నలుగురం మన తండ్రిని సత్యవంతునిగా చరిత్ర ప్రసిద్ధం చేయాలి. అందుకే నేను లక్ష్మణునితో కలిసి పద్నాలుగేండ్లు తాపస వృత్తితో దండకారణ్యవాసాన్ని చేస్తాను. నీవు శత్రుఘ్నునితో కలిసి పద్నాలుగేండ్లు రాజ్య భారాన్ని నీ భుజస్కంధాలపై మోసి ధన్యమైన జీవితాన్ని అనుభవించు. దీనికోసం నీవు దుఃఖించ నవసరం ఏమాత్రం లేద" ని శ్రీరాముడు భరతునికి మరల తన సంకల్పాన్ని చెప్పి రాజ్యభారాన్ని మోయడానికి అవసరమైన శక్తిని భరతునిలో కలిగించాడు.

* * *

జాబాలి నాస్తికవాదం

సర్గ - 108

భరతుని ఓదార్చుతూ శ్రీరాముడు ధర్మయుక్తంగా మాట్లాడి భరతునిలో అణిగి ఉన్న ధీశక్తిని ఉద్దీపనం చేయసాగాడు. దాన్ని బ్రాహ్మణులలో ఒకడైన జాబాలి విన్నాడు. ధర్మవిరుద్ధంగా శ్రీరామునితో జాబాలి "ఓ రఘురామా! నీవు చెప్పేదంతా యథార్థమే. కాని నీ వంటి ప్రతిభాశాలి మనోబలం ఉన్నవాడు అజ్ఞానిలాగా మాట్లాడడం అనుచితం. ఈ లోకంలో తన్నుమాలిన ధర్మం మొదలు చెడ్డబేరం అవుతుంది. ఎవరికి ఎవరు బంధువులు? ఎవరు మిత్రులు? ఈ లోకంలోకి ఒంటరిగా వచ్చినవారే ప్రతి ఒక్కరూ. వచ్చిన తర్వాత తల్లితండ్రి భార్య పుత్రుడనే మమకారాలను పెనవేసుకొని పిచ్చివానిలాగా అందులో కొట్టుమిట్టాడుతుంటాడు. ఇదంతా ఒక పిచ్చితనమే కాని ఎవ్వరూ ఎవరికీ ఏమీ కారు. ఇది నిత్యసత్యం."

"ఓ మనోభిరామా! బాటసారి రాత్రివేళలో ఏదైనా సత్రంలో తలదాచుకొని ఉదయం కాగానే వాని దోవన వాడు వెళ్ళిపోతాడు. సత్రం కాని, సత్రంలోని వారు కాని ఆ బాటసారి వెంట వెళ్ళరు. అదేవిధంగా లోకంలో ఒంటరైన వానికి పుత్రమిత్రకళత్రాది సంబంధాలు క్షణికాలే. క్షణభంగురమైన జీవితంలో బాంధవ్యాలతో అవసరం ఏమీ లేదు. సజ్జనులైన వారు దీనిని గుర్తించి తీరుతారు."

"నరశ్రేష్ఠుడవైన రామా! నీవు క్లిష్టతరమైన ఈ వనవాసజీవితానికి భరతవాక్యం పలుకు. నీవంటి మేధావి తండ్రి తదనంతరం రాజ్యాన్ని పాలించాలి కాని అనాలోచితకార్యాలపై మనస్సును కేంద్రీకరించకూడదు. దేశాంతరాలలో ఉన్న భర్త కోసం ఎదురుచూసే సాధ్వీమణిలాగా నీకోసం అయోధ్య ఎదురుచూస్తోంది. వెంటనే సకలసంపదలతో అలరారే రాజ్యలక్ష్మిని చేపట్టి రాజ్యసింహాసనాన్ని అధిరోహించు. దశరథునికి నీకు ఎట్టి బాంధవ్యాలు లేవు. అందువలన నేను చెప్పినట్లుగా రాజ్యాన్ని చేపట్టి దేవేంద్రునిలాగా అమరసుఖాలను పొంది సుఖంగా జీవించు" అని జాబాలి తన నాస్తికత్వాన్ని కారణంగా చూపుతూ శ్రీరామునికి బోధ చేశాడు.

"మీ తండ్రి సహజంగా చేరవలసిన చోటుకే చేరాడు. దీనికై మీరు పరితపించడం భావ్యం కాదు. ప్రాణి పుట్టుకకు తండ్రి నిమిత్తకారణుడై ఉంటాడు. శుక్రశోణితాల కలయికవల్ల శిశువు జన్మనెత్తుతాడు. ధర్మాచరణం అంటూ ఉండేవారు జీవితాంతం కష్టాలు పడుతూనే ఉంటారు. ఎదురుగా కనిపించే భోగాలను, ధనాన్ని ఆర్జించలేరు, సుఖించలేరు. శ్రాద్ధకర్మలు జరిపి పితృదేవతలు భుజించారని ఇక్కడివారు సంతోషపడుతుంటారు. కాని ఈ లోకంలోనే భోజ్యపదార్థాలు నశిస్తాయి కదా. మరి వాటిని మృతులై శరీరం లేని వారు ఎలా భుజిస్తారు? అలా అయితే దూర దేశాలకు వెళ్ళేవారికి శ్రాద్ధం పెట్టితే వారి దారి భత్యాలకోసం చూడక్కరలేదు. ఒకరు తిన్నందువల్ల మరొకరి పొట్ట నిండితే ఇలా చేయవచ్చు."

"దేవతలను ఆరాధించాలి. దానధర్మాలు చేయాలి. యజ్ఞయాగాదులు చేయాలి. ఇల్లు వాకిలి వదిలి సన్యాసులు అవ్వండి అని చెప్పే వేదాంతాలన్నీ శుష్కమైనవి. ఇతరుల ధనంతో సుఖించాలనుకొనేవారు దాన ధర్మాలను చేయమంటూ గ్రంథాలు రాశారు. ధనవంతుల మనస్సులు మరల్చి తిందామన్న ఆశతో బకాసురులు ఈ పనిచేశారు.

తండ్రి మాటను విశ్వసించాలి. తండ్రి ఆజ్ఞను పాటించి తీరాలి అనుకొనే నీవు నా మాటను విను. ఈ లోకం తప్ప మరొక లోకం ఏదీ లేదు. ప్రత్యక్షంగా కనిపించే వాటినే నమ్మాలి కాని కనిపించని వాటిపై ఆశ పడకూడదు."

"ఓ రామా! ఈ లోకంలోని లభించే సుఖాలే శాశ్వతాలు. పరలోకం అనేది ఏది లేదు. భరతుడు ప్రాధేయపడుతున్నాడు గదా. భరతుని ప్రార్థనను అంగీకరించి నీవు అయోధ్యను చేపట్టి రాజ్యాభిషిక్తుడవై మమ్మల్నందరిని ఆనందింపచేయి" అని లోకంలోని సంగతులను విడమర్చి చెప్పాడు.

* * *

రాముడు - నాస్తికత్వ ఖండన

సర్గ - 109

చిత్తచాంచల్యంలేని శ్రీరాముడు జాబాలి మాటలను విన్నాడు. "బ్రాహ్మణోత్తమా! నీవు చెప్పిన మాటలన్నీ హితకరంగాను చేయదగినట్లుగాను కనిపిస్తున్నా అవి మనిషికి అహితాన్ని బోధించేవి అనర్థదాయకమైనవే అయ్యి ఉన్నాయి. ధర్మాన్ని, వేదాన్ని తూలనాడే వారిలో పాపభీతి ఉండదు. దైవీభావన కొరవడిన వారిలో పరలోక భయం లేక పాపకృత్యాలను చేస్తారు. అన్యాయాలను అక్రమాలను చేస్తారు. ఇతరుల మనస్సు నొప్పించేవారిని సత్పురుషులెవరూ మెచ్చుకోరు.

మనిషి ప్రవర్తనవల్లే ఉత్తమవంశసంజాతుడు కాదా?, గుణహీనుడా, గుణవంతుడా అనేది నిర్ణయించు కోవచ్చు. ఆచారవ్యవహారాదులలో శ్రేష్ఠుడిగా కనిపించినా ఇట్టి భావసముదాయం ఉన్నవాడు అనార్యుడౌతాడు. పవిత్రమైన కర్మలను చేస్తున్నట్లు కనబడినా అపవిత్రుడే అవుతాడు. ఉత్తమలక్షణాలు కలవాడైనా దుశ్శీలమూ అవలక్షణాలు కలిగినవాడే అవుతాడు. అట్టివానిని మనస్సున్న ఎవరూ దరిచేర్చరు.

మీరు ఉపదేశించిన ఈ సూత్రాలు గోముఖవ్యాఘ్రం లాంటివి. వీటివల్ల వర్ణసాంకర్యం జరుగుతుంది. వేదోక్త కర్మలు చేయని నన్ను బుద్ధిమంతుడని ఎవ్వరూ అనుకోరు.

హద్దులు లేకుండా ప్రవర్తించే వానిని చూచి లోకులు దురాచారునిగాను, కళంకితునిగాను చూచి అవమా నిస్తారు. మీరు చెప్పిన రీతిలో నేను రాజ్యాన్ని చేపట్టితే అధర్మానికి పట్టం కట్టినవాడినౌతాను. 'యథారాజా తథా ప్రజా' అన్నట్లు ప్రజలందరూ నన్ను అనుసరిస్తూ అధర్మానికి కొమ్ముకాస్తారు. రాజ్యంలో ధర్మదేవత నిలబడ్డానికి చోటులేకుండా పోతుంది. దానివల్ల సుభిక్షంగా ఉండే దేశం కరవుకాటకాలకు నిలయం అవుతుంది.

అలాకాక రాజ్యం దైవదత్తమని నమ్మి సత్యస్వరూపం అని తెలుసుకొని వ్యవహరిస్తే రాజు ధర్మవర్తనుడిగా కీర్తింపబడతాడు. ప్రజలు రాజును అనుకరిస్తూ సత్యవచనులై ధర్మమూర్తులు అవుతారు. అధర్మానికి, అన్యాయాలకు, అక్రమాలకు తావు ఏర్పడదు."

"లోకంలో సత్యం చెప్పువాడే శ్రేష్ఠుడని ఋషీశ్వరులు, పెద్దలు చెప్తారు. సత్యవాదినే లోకం సర్వోన్నతుడిగా కీర్తిస్తుంది. ధర్మమే సత్యానికి పరాకాష్ఠ. దానివల్లే స్వర్గప్రాప్తి కలుగుతుంది. సత్యధర్మాలకంటే మిన్న ఐనది ఈ లోకంలో ఏదీ లేదు. సత్యంవలనే ధనధాన్యాభివృద్ధి, పుత్రపౌత్రాభివృద్ధి కలిగితీరుతుంది. సత్యవాదికి మాత్రమే లోకం వశమవుతుంది. ధర్మసంస్థాపన చేసేవారిని ధర్మమే రక్షిస్తుంది. నేను సత్యాన్ని ఏనాటికి వీడలేను. తండ్రి మాటను పాలిస్తానని ఇంతకు పూర్వమే సత్యప్రతిజ్ఞ చేశాను. ఈనాడు దానికి నేను బద్ధుడినై ఉంటాను కాని ప్రతిజ్ఞాభంగం నేను చేయను."

"ధర్మభ్రష్టుడైన వానిని చంచలచిత్తుడిగా భావించి పితృదేవతలు వానిని దరిచేరనివ్వరు. ఎవ్వరికైనా ధర్మమే మూలం, సత్యమే శ్రేయోదాయకం అవుతుంది. పాపాత్ములు కుటిలురు క్రూరులు నీచులు అనబడువారు మాత్రమే

అధర్మాన్ని చేస్తారు. ప్రజాక్షేమం పేరు చెప్పి తండ్రి మాటను ఉల్లంఘించి రాజ్యాన్ని నేను చేపట్టితే అది అధర్మమే. ఈ విపరీతమైన ధర్మవిరుద్ధకార్యాలను నేను ప్రాణం పోయినా చేయను."

"మానవుడు పాపకార్యాన్ని మనస్సులో ఆలోచించి నోటితో అబద్ధాలు చెప్పుతూ చేతులతో కర్మ చేస్తాడు. అందుకే వానికి పాపఫలితం మూడింతలుగా చేరుతుంది. దానధర్మాదులవల్ల వచ్చే యశస్సు కీర్తి మరణించిన తర్వాత కూడా మనలను అంటిపెట్టుకొనే ఉంటుంది సుఖాలకు దారిచూపిస్తుంది. పాపపంకిలమైన జీవితం పాప సంచయాన్ని మరుజన్మకు మోసి కష్టాలకు దారిచూపిస్తుంది. అందువల్ల ప్రతి ఒక్కరికి సత్యధర్మాలే శ్రేయోదాయకాలు."

"జాబాలీ! మీరు ఎంత నొక్కి వక్కాణించినా కూడా మీరు చెప్పే నీతి అధర్మమైనది. సత్పురుషులెవరు దీనిని ఆదరించరు. నేను తండ్రికి మాట ఇచ్చినవాడిని. మరల భరతుని వేడికోలు విని రాజ్యాన్ని ఏ విధంగా చేపట్టుతాను? నేను చేసిన ప్రతిజ్ఞ ధర్మసమ్మతమైనది అందుకే అక్కడే ఉన్న నా తల్లి ఐన కైక సంతోషించింది. నేను అంతఃకరణాలతో కూడి శుచిగా ఉండాలని తలుస్తాను. బాహ్యంగా కనిపించే వాని విషయంలో శుచిని మాత్రమే అర్హమైనది కాదు. ఇంద్రియాలను అదుపులో పెట్టుకొని పవిత్రమైన కందమూలఫలాలను భుజిస్తూ నియమనిష్ఠలతో కార్యకారణ విచక్షణతో వనవాసజీవితాన్ని గడుపుతాను."

"భారతభూమి పవిత్రమైన కర్మభూమి. ఇందులో జన్మించిన వారెల్లరూ శుభకార్యాలనే ఆచరించాలి. ధర్మబద్ధంగా జీవించాలి. సత్యవాక్కునే వ్రతంగా కలిగి ఉండాలి. మనోవాక్కాయకర్మల ద్వారా సత్యవ్రతాన్ని అవలంబిస్తే అత్యంతశుభఫలితాలను పొందుతారు. దీనివల్ల ఉత్తమసంపదలను స్వర్గప్రాప్తిని పొందుతారు. మహర్షులందరూ సత్యవ్రతదీక్షతో జితేంద్రియులై ఇంద్ర పదవిని సైతం చేజిక్కించుకోగలిగారు. తపస్సులు ఆచరించినందులనే వారు దివ్యులై దివ్యలోకాలలో సంచరించగలిగారు." అని శ్రీరాముడు అన్నాడు.

జాబాలి నాస్తికత్వానికి శ్రీరాముడు చిరాకుపడి "సత్యం పలకడం, తల్లిదండ్రులను సేవించడం, ధర్మాసక్తిని కలిగి ఉండడం, పరాక్రమం కల్గి ఉండడం, ప్రియంగా మాట్లాడడం, అతిథి అభ్యాగతులను సేవించడం లాంటి పనులే స్వర్గానికి సోపానాలని" శ్రీరాముడు నిక్కచ్చిగా చెప్పాడు. శ్రీరాముని మాటలు విన్న అక్కడి సత్పురుషులందరూ ఏకగ్రీవంగా శ్రీరాముని ఆమోదించారు. వారు వారి వర్ణాశ్రమధర్మాలను పాటిస్తూ ఉత్తమలోకప్రాప్తిని కోరుకొన్నారు. అయినా జాబాలిలో నాసితకత్వపు ధోరణి పోలేదు. ఆయన తిరిగి రాముని తన తత్త్వాన్నే బోధించసాగాడు.

దాంతో శ్రీరామునిలో కోపం పెరిగింది. జాబాలి నాస్తికత్వాన్ని నిర్మూలించదలచాడు. "ఓ జాబాలీ! మీ బుద్ధి కుంచించుకుపోయింది. పెడతోవ పట్టింది. మీరు ధర్మమార్గానికి దూరం అయి ధూర్తప్రవర్తనకు దగ్గరవుతున్నారు. చార్వాకమతప్రచారానికి పూనుకొన్న మిమ్ము మా తండ్రి దరిచేర్చుకోవడాన్ని నేను సహించలేను. వేదాలను త్యజించినవానిని, అధర్మపరుని ఎంత జ్ఞాని ఐనా దండించి తీరాలి. పండితులెవరూ ఈ నాస్తికత్వాన్ని కలిగిన వానితో సంబంధం పెట్టుకోకూడదు. మాట్లాడరాదు. ఇట్టివానికి రాజ్యంలో ఉండే అర్హత కూడా ఉండదు.

మీ కంటే పూర్వులైన వారందరూ వేదాన్ని అభ్యసించిన వారే. వేదధర్మానికి కట్టుబడి కర్మలు ఆచరించి ఇహపరలోక సుఖాలను పొందినవారే. అందువల్ల మనం కూడా వేదాన్ని, ధర్మాన్ని ఆచరణలో పెట్టాలి. అహింస, సత్యం, యజ్ఞం, తపస్సు, దానం, పరోపకారం అనే కార్యాలను నిర్వహించాలి. తేజోమూర్తులు దానవంతులు అహింసావ్రతం గలవారు అకళంకితులూ అయిన మునీశ్వరులు సత్పురుషులతో కూడి లోకంలో కీర్తిని అందుకొని పూజ్యులౌతున్నారు."

శ్రీరాముని కోపాన్ని చవిచూసిన జాబాలి మరల ఈ విధంగా చెప్పాలనుకొని "శ్రీరామా! నేను నాస్తికుడను కాను. పరిస్థితులను బట్టి నేను మాట్లాడినాను. కాని పరలోకం ఉన్నదన్న సత్యం నాకు తెలుసు. కాని పరిస్థితులు మన చేతిని దాటకుండా ఉండేందుకై నేను నాస్తికత్వంతో ప్రసంగించాను."

"శ్రీరామా! నిన్ను ఏవిధంగానైనా ప్రసన్నుని చేసుకొని నీ దృఢసంకల్పాన్ని విరమింపజేసి నిన్ను మాతోటి అయోధ్యకు తీసుకెళ్ళాలనే సదుద్దేశ్యంతో నేను అలా మాట్లాడినాను. కాని నిజానికి నేను ఆస్తికుడినే. వేదాన్ని తు.చ తప్పకుండా పాటించేవానిని. ధర్మవిరుద్ధమైన పనులను నేను చేయను ఎవరిని చేయనివ్వను. కాని అందరూ కోరుకునే నిన్ను రాజుగా చూడాలనే తలంపుతో నేను ఆ విధంగా మాట్లాడి నిన్ను నొప్పించాను. ప్రభూ! నన్ను క్షమించవలసిందిగా నేను ప్రార్థిస్తున్నాను. నేను ఎల్లవేళలా ధర్మం పట్ల అనురక్తుడినై ఉంటాను అని సత్యప్రతిజ్ఞ చేస్తున్నాను. సత్యానికి కట్టుబడే నేను ఉంటాను" అని జాబాలి వినయంగా శ్రీరామునికి చెప్పి శ్రీరాముని కోపాన్ని ఉపశమింపచేశాడు.

* * *

వసిష్ఠుని హితబోధ

సర్గ - 110

శ్రీరాముని క్రోధస్వరం వసిష్ఠుడు విన్నాడు "ఓ శ్రీరామా! జాబాలి ఆస్తికుడే. ఇతనికి జనుల జనన మరణాల గురించి తెలుసు. కేవలం నిన్ను అయోధ్యకు తీసుకెళ్ళాలనే ఉద్దేశ్యంతో ఇలా మాట్లాడాడు. లోకాల ఆవిర్భావం గురించి నేను చెప్తాను విను" అంటూ వసిష్ఠుడు శ్రీరామునితో అన్నాడు.

"ఓ రఘునందనా! సృష్టికి పూర్వం అంతా జలమయమై ఉండేది. భూమండలం, బ్రహ్మదేవుడు, దేవతలు పుట్టారు. ఈ పృథ్వి ఆ కాలంలో జలంలో మునిగిపోయింది. అప్పుడు పరమాత్మ వరాహరూపంలో భూమిని పైకెత్తి ఉద్ధరించాడు. బ్రహ్మ తన పుత్రులైన మరీచ్యాదులతో కలిసి జగత్తు అంతా సృష్టించాడు."

"శాశ్వతుడు నిత్యుడైన పరమాత్మ బ్రహ్మదేవుని నుండి మరీచిని పుట్టించాడు. మరీచి కశ్యపునకు జన్మ ఇచ్చాడు. కశ్యపునకు సూర్యుడు జన్మించాడు. ప్రజాపతైన మనువు ఈ సూర్యునికి కుమారుడే. మనువు కొడుకు ఇక్ష్వాకువు. సంపదలతో నిండిన భూమిని మనువు ఇక్ష్వాకునకు ఇచ్చాడు. ఇతడే మొదటి అయోధ్యకు రాజు. ఇతనికి కుక్షి ఆయనకు వికుక్షి అనువారు జన్మించారు."

"అయోధ్యను ఏలిన వికుక్షి తేజశ్శాలి. మహాపరాక్రమవంతుడు ఇతనికి అనరణ్యుడను కొడుకు పుట్టాడు. అనరణ్యుని పాలన ఉత్తమోత్తమమైనదిగా ప్రసిద్ధికెక్కింది. ఇతని పాలనలో సత్పురుషులు కానివారు ఎవరూ ఉండేవారు కాదు. దుర్భిక్షం లాంటి ఆపదలు వారికి కలుగలేదు. జారచోరాది భయం లేకుండా ప్రజలు సత్యవంతులుగా కీర్తిపొందారు."

"ఈ అనరణ్యునికి పృథువు జన్మించాడు. ఇతను కూడా ప్రఖ్యాతి పొందినవాడే. ఈయనకు త్రిశంకువు జన్మించాడు. పరమధార్మికుడిగా త్రిశంకువు పేరుమోసి సశరీరంగా స్వర్గానికి వెళ్ళాడు. త్రిశంకువు కుమారుడు దుందుమారుడు. ఈయనకు యువనాశ్వుడు అను కొడుకు కలిగాడు."

"యువనాశ్వునకు మాంధాత, అతనికి సుసంధి పుట్టారు. ధ్రువసంధి, ప్రసేనజిత్తు అనువారు సుసంధికి పుట్టిన రాజకుమారులు. వీరు కీర్తిప్రతిష్ఠలను పెంచి పోషించారు. ధ్రువసంధికి భరతుడు, భరతునకు అసితుడు అనువారు జన్మించారు. అసితుని కాలంలో దుర్మార్గాలు కనబడ్డాయి. అసితునకు హైహయులు, తాలజంఘులు, శశిబిందులు వారు శత్రువులయ్యారు. అసితుడు వారిని ఎదిరించి నిలవలేకపోయాడు." ఆయన "మౌని వృత్తిని అవలంబించి పర్వత ప్రాంతాలలో నివసించాడు. అతనికి ఇద్దరు భార్యలుండేవారు. వారిద్దరికి మనస్పర్ధలు ఏర్పడి గర్భవతులైన వారు ఒకరికి మరొకరు విషాన్నాన్ని తినిపించుకొన్నారు. అక్కడే తపస్సు చేసుకొంటున్న చ్యవనునికి కాళింది వెళ్ళి నమస్కరించి ఆయనకు శుశ్రూష చేసింది. ఆమె సేవలకు మెచ్చుకొని చ్యవనుడు ఆమెకు బుద్ధిమంతుడు, లోకప్రసిద్ధుడు, వంశోద్ధారకుడైన కుమారుడు కలుగుతాడని ఆశీర్వదించాడు. విషాన్నాన్ని తిన్నప్పటికీ విషంతోటే బాలుడు కాళిందికి జన్మించాడు. అందుకే ఆయనకు సగరుడనే నామం ప్రసిద్ధికెక్కింది. తన ఉత్తమ శీలంతో అరవై వేలమంది పుత్రులను కన్నాడు. సగరునికి అంశుమంతుడను మనవడు కూడా కలిగాడు."

"అంశుమంతునకు దిలీపుడు, దిలీపునకు భగీరథుడు పుట్టారు. ఈ భగీరథుడు పరమేశ్వరుని మెప్పించి గంగను భూలోకానికి తీసుకొచ్చి తన పినతండ్రులకు ఉత్తమ గతులు కలుగజేశాడు. ఈ భగీరథునకు కకుత్స్థుడను పుత్రుడు ఉదయించాడు. ఈయన వలనే మీకు కాకుత్స్థులనే పేరు వచ్చింది. ఇతనికి రఘువు పుట్టాడు. అందువలన మీ వంశానికి రఘువంశం అని రాఘవులని పేరు వచ్చింది."

"మహాపరాక్రమశాలియైన రఘువుకు పురుషాదకుడు పుట్టాడు. ఇతను కల్మషపాదుడు, సౌదాసుడు అనే పేర్లతో ప్రసిద్ధికెక్కాడు. ఇతని కుమారుడు శంఖణుడు. శంఖణుడు తండ్రితో యుద్ధం చేసి నశించిపోయాడు. ఈయనకు శ్రీమంతుడు అను కొడుకు ఉండేవాడు. శ్రీమంతునికి శీఘ్రుగుడు అతనికి మరువు పుట్టారు. మరువుకు ప్రశుశ్రువుడు ఇతనికి అంబరీషుడు జన్మించారు."

"నహుషుడు తండ్రి అంబరీషుడు. నాభాగుడు నహుషుని కొడుకు. ఇతనికి అజుడు అనే సువ్రతుడు పుట్టాడు. అజుని కొడుకు మీ తండ్రి అయిన దశరథ మహారాజు. ఆయనకు నీవు జ్యేష్ఠకుమారుడివి. రాజ్యాధికారివి. అందువలన భరతుని ప్రార్థన విని నీవు అయోధ్యాపతివై ప్రజలను పాలించు" అని ఇక్ష్వాకువంశ క్రమాన్ని శ్రీరామునికి వసిష్ఠుడు చెప్పాడు.

"ఓ రామా! మీ కులంలోగాని మీ వంశంలోగాని జ్యేష్ఠుడే రాజగును కాని చిన్నవానికి రాజ్యార్హత ఉండదు. ప్రాచీనమైన రఘువంశీయుల కులధర్మాన్ని పాడుచేయకుండా నీవు సకల సమృద్ధమైన అయోధ్యను చేపట్టి అందరిని ఆనందింపచేయాలని నాకోరిక కూడా." అని వసిశిష్ఠుడు శ్రీరామునికి హితబోధ చేశాడు.

* * *

రామాజ్ఞ

సర్గ - 111

వసిష్ఠుడు కులధర్మాన్ని వంశాచారాన్ని చెప్పాడు."ఓ శ్రీరామా! ప్రతిమనిషికి ఆచార్యుడు తల్లి తండ్రి అనే వారు గురువులుగా ఉంటారు. తల్లిదండ్రులు జన్మనిచ్చి ప్రపంచం గురించి తెలుపుతూ గురువులు అవుతారు. విచక్షణాజ్ఞానాన్ని బోధించి ఆచార్యుడు జ్ఞాననేత్రాన్ని తెరిపించి మరోజన్మనిచ్చినవాడు అవుతాడు. అందువల్ల ప్రతి మనిషికీ ముగ్గురు గురువులుంటారు."

"ఓ రఘురామా! నీవు సత్సంప్రదాయాన్ని ఎన్నడూ విడిచిపెట్టకు. ఇక్కడ ఉన్న ఈ పౌరుల మాటను ఆలకించు. వృద్ధురాలైన నీ తల్లి మాటను జవదాటకు. సన్మార్గంలోనే ఉంటూ ప్రజాహితాన్ని దృష్టిలో ఉంచుకొని సత్పురుషుల నడచిన దారిలో నీవు కూడా నడిచి ఉత్తమమైన కీర్తిని పొందు. సత్యానికి కట్టుబడిన రామా! నిన్ను వేడుకొంటున్న ఈ భరతుని మాటలు మన్నించు. క్షత్రియుల ధర్మమైన ప్రజాపాలన చేపట్టి స్వధర్మానికి న్యాయం చేయి." తన గురువైన వసిష్ఠుని మాటలు శ్రీరాముడు విన్నాడు.

"ఓ వసిష్ఠమహర్షీ! తల్లిదండ్రులు తమకు పుట్టిన వారికి ఎన్నో సేవలు చేసి, పెంచి, పోషించి, పెద్దవారిని చేసిన విద్యాబుద్ధులను చెప్పించి, తమంతవారిని చేసి తృప్తి పొందుతారు. అటువంటివారికి ఏమి చేసినా ఎంత చేసినా వారి రుణం తీర్చుకోవడం అసాధ్యం అనిపిస్తుంది. దశరథుడు నా కన్నతండ్రి. ఆయన ఇచ్చిన ఆదేశాన్ని పాటించడమే నా ధర్మం. నేను ఎన్నటికి ఆయన మాటను వమ్ము కానివ్వను." అని చెప్పే శ్రీరాముని చూసి భరతుడు నిస్పృహ చెందాడు.

తన ప్రక్కనే కూర్చుని ఉన్న సుమంత్రునితో భరతుడు "ఓ సుమంత్రా! ఇక్కడే దర్భలు పరిచి నాకు ఆసనాన్ని సిద్ధం చేయి. ధనవంతునకు అప్పు ఇచ్చి నిర్ధనుడైన బ్రాహ్మణుడు నిరాహారదీక్ష పూనినట్లు రాముడు నా విషయంలో ప్రసన్నుడగు వరకు నేను ఇక్కడే అన్నపానీయాలు మాని నిరాహారుడనై దీక్ష పూనుతాను" అని చెప్పాడు. ఆయన మాటలు విని శ్రీరాముని వంక జూస్తూ ఏమి చేయాలో తెలియక చేష్టలుడిగి సుమంత్రుడు నిలబడిపోయాడు. అప్పుడు భరతుడే ధర్మాసనం వేసికొని దానిమీద నిశ్చలంగా కూర్చున్నాడు.

మంకుపట్టు పట్టిన భరతుని శ్రీరాముడు చూసి "భరతా! నీవు నన్ను అడ్డగించడానికి నేను నీకు చేసిన అపకారం ఏమిటి? బ్రాహ్మణుడు ధనం కోసం చేయడం ఉచితం, కాని క్షత్రియుడివైన నీవు ఇలా చేయడం ఏమి ధర్మం?" అని అడిగాడు. "భరతా! ఈ కఠోరవ్రతాన్ని విడువు. ఇక్కడనుండి అయోధ్యకు వెళ్ళిపో." అని కఠినంగా శ్రీరాముడు చెప్పాడు.

దృఢసంకల్పుడైన రాముని మాటలు విని నిరాశతో భరతుడు పౌరులను చూసి మీరైనా నా అన్నకు ఎందుకు చెప్పరు? మీరందరూ ఆయనను అయోధ్యకు రావడానికి ఒప్పించండి అని బతిమలాడాడు. వారందరూ ఆయనను చూసి కంటతడి పెట్టుకొని "రాజకుమారా! భరతా! మీ అగ్రజుడు శ్రీరాముడు తండ్రి మాటను పాలించి తీరాలని గట్టి నిశ్చయాన్ని చేసుకొన్నాడు. నిశ్చయ బద్ధుడైన శ్రీరాముని మేము మార్చడానికి అశక్తులం. శ్రీరాముడు చెప్పేదానిలో సత్యమున్నది" అని వారు చెప్పారు.

అయోధ్యావాసుల మాటలు విని శ్రీరాముడు "భరతా! సోదరా! లెమ్ము నీ వ్రతాన్ని ఉపసంహరించుకొని లే! ఈ పౌరుల మాటల సారాంశాన్ని గ్రహించు. అవగాహన చేసుకో. నా మాట విని అయోధ్యాధిపతివై తండ్రి మాటను పాలించి కీర్తిని పెంచు" అని శ్రీరాముడు భరతునితో అన్నాడు.

భరతుడు లేచి జలాన్ని తాకి, "ఓ సభాసదులారా! నేను ఎప్పుడూ నా తల్లిని గాని, తండ్రినిగాని రాజ్యం కావాలని కోరలేదు. నా తల్లి చేసిన పనిలో నాకు లేశమాత్రం కూడా ప్రమేయం లేదు. తండ్రి ఆదేశాన్ని పాటించి వనవాసం చేయడం తప్పనిసరైతే నేనే ఆ పద్నాలుగేండ్లు జటావల్కలాలు ధరించి శ్రీరాముని బదులుగా వనవాసాన్ని చేస్తాను" అని గట్టిగా చెప్పాడు.

భరతుని కఠిన నిశ్చయాన్ని చూసి శ్రీరాముడు ఆశ్చర్యపడ్డాడు. పౌరులను చూచి "నగరవాసులారా! మా తండ్రి జీవించి ఉండగా చేసిన ప్రతిజ్ఞను ఇప్పుడు తారుమారు చేయడం మంచిది కాదు. మా తల్లి కోరికలు మా తండ్రి వాటిని నెరవేర్చాలని అనుకోవడంలో అనుచితం ఏమీ లేదు. చేయతగిన పనిని ప్రతినిధితో చేయించడం లోకనిందకు గురి అవుతుంది. అటువంటి పని నాకు సమ్మతం కాదు.

భరతుని మనస్సు నాకు బాగా తెలుసు. సత్యసంధుడు మహాత్ముడైన ఈ భరతుడు క్షమాశీలుడు. ఇతనిలో అన్నీ శుభలక్షణాలే ఉన్నాయి. భరతుని కోరిక ప్రకారం నేను పద్నాలుగేండ్ల వనవాసం తర్వాత అయోధ్యకు వచ్చి నా తమ్ముళ్ళతో కలిసి రాజ్యాన్ని పాలిస్తాను.

భరతా! తండ్రి మాటను జవదాటని కుమారులుగా మనం పేరు తెచ్చుకొందాం. నేను తండ్రి ఆదేశాన్ని పాటించి పద్నాలుగేండ్లు వనవాసాన్ని చేస్తాను. నీవు అప్పటివరకూ రాజ్యభారాన్ని వహించి తండ్రికి అసత్యదోషాన్ని అంటకుండా చేయుము. అదే మన కర్తవ్యం" అని శ్రీరాముడు భరతుని ఆజ్ఞాపించాడు.

* * *

పాదుకాప్రదానం

సర్గ - 112

దశరథపుత్రుల అన్యోన్యానురాగాలను చూచి అక్కడి మహర్షులు ఆశ్చర్యపడ్డారు. వారి సోదరప్రేమను చూసి అమాత్యులు పురజనులు అచ్చెరువొందారు. అంతరిక్షమార్గాన నిలబడి చూస్తున్న దివ్యులు రామాదుల ప్రేమాస్పదహృదయాన్ని మెచ్చుకొన్నారు. ఒకరికోసం మరొకరు తపించే ఇక్ష్వాకుసోదరులను వారందరూ శ్లాఘించారు. శ్రేష్ఠులైన పుత్రులను కన్న దశరథుని పుణ్యాన్ని వారు కీర్తించారు. రాజ్యాదుల విషయంలో వారికున్న నిరాసక్తిని చూచి వారు సంతోషంతో పొంగిపోయారు. నిరుపమానసౌందర్యవంతులైన రాముని, భరతుని మాటలను పదే పదే వినాలని కుతూహలపడ్డారు.

రావణవధను వాంఛించే మహర్షులు అందరూ కలిసి భరతునితో ఇలా చెప్పారు., "భరతా! నీ కీర్తి ప్రతిష్ఠలు లోకంలో దశదిశలా వ్యాపిస్తాయి. నీ అచంచల భక్తివిశ్వాసాలు సాటిలేనివి. నీవు సద్వంశంలో పుట్టి ధర్మమెరిగినవాడివి. నీ ప్రవర్తన ఆదర్శప్రాయమైంది. తమ్ముళ్ళందరూ అన్నలపై చూపించాల్సిన ప్రేమ ఇదే. నీ తండ్రికి ఆత్మశాంతి కలిగించడానికి నీవు శ్రీరాముని మాటలతో ఏకీభవించు. రాముని ఆజ్ఞను శిరసావహించు." అని ఏకగ్రీవంగా ఋషీశ్వరులందరూ చెప్పారు.

శ్రీరాముడు తండ్రి ఋణం తీర్చుకోవాలని ఆశించడం మాకు సమ్మతంగానే అనిపిస్తోంది. నీవు కూడా పితృఋణం తీర్చుకో. మీ తండ్రి తన భార్య అడిగిన వరాలను ఇచ్చి ఆమె రుణాన్ని తీర్చుకొని స్వర్గాన్ని చేరాడు" అని చెప్పి గంధర్వులు, మహర్షులు, రాజర్షులు అందరూ అక్కడినుంచి వెళ్ళిపోయారు. శ్రీరాముడు వారి మాటలకు సంతోషించాడు. భరతుడు తన కోరిక నెరవేరనందుకు ఎంతో చింతించాడు. ధైర్యాన్ని కోల్పోయాడు. ఆయన శరీరం వణుకుతుండగా గొంతు నుంచి మాటలు పెగలలేదు.

మాటలు తడబడుతుండగా చేతులు జోడించి శ్రీరామునితో మరల భరతుడు "ఓ రాజశిరోమణీ! నా అభ్యర్థనను మన్నించు. మన వంశాచారం ప్రకారం నీవు రాజ్యాభిషిక్తుడివై మమ్ము కాపాడు. నా తల్లిని అనుగ్రహించు" అని వేడుకొన్నాడు. ఈ విశాలభూసామ్రాజ్యాన్ని నేను రక్షించలేను. బంధువులు, యోధులు, మిత్రులు సహృదయులందరు మీరే రాజు కావాలని ఎదురుచూస్తున్నారు. వారి కోరికను తీర్చడం మీ ధర్మం. ప్రజలను పాలించడానికి మీరే సర్వసమర్థులు. నేను అందుకు ఏ విధంగానూ పనికిరాను" అని భరతుడు శ్రీరాముని వేడుకొన్నాడు.

భరతుడు పదే పదే ప్రార్థిస్తూ శ్రీరాముని పాదాలపై పడ్డాడు. శ్రీరాముడు భరతుని లేవనెత్తి అక్కున చేర్చుకొని లాలించాడు. తన ఒడిలో కూర్చోబెట్టుకొని "భరతా! భయపడకు. నీ బుద్ధి గురువుల శిక్షణతో మొనదేలి ఉంది.

నీ వినయసంపద నీలో సద్గుణాల రాశిని పెంచింది. నీ సంకల్పం దృఢమైనది. ఈ సమస్త భూమండలాన్ని పాలించే సమర్థత నీలో నిబిడీకృతమై ఉంది. నీవు మరొక్కసారి ఆలోచించి తండ్రి ఆదేశాన్ని శిరసావహించి ఆయనకు ఆత్మశాంతిని కలిగించు.

ప్రతిభాశాలులైన మంత్రులతో, సేనాపతులతో బాగా ఆలోచించి ధర్మనిర్ణయాలను నీవు తీసుకోగలవు. ఆత్మీయుల అండదండలను సంపాదించి ప్రజల అనురాగాన్ని చూరగొని ఈ విశాల రాజ్యాన్ని మనోరంజకంగా పాలించగలవు. ఇందులో నాకు ఏ సంశయం లేదు. భరతా! సూర్యచంద్రాదులు గతి తప్పినా సముద్రం పొంగి పొర్లినా నేను తండ్రి ఆదేశాన్ని వమ్ముచేయను. ఇది నా ప్రతిజ్ఞ. దీనిని నీవు సడలించడానికి వ్యర్థంగా ప్రయత్నించి కాలయాపన చేయడం మంచిది కాదు.

భరతా! మన తల్లి కైక నీపై ప్రేమతో గాని రాజ్యలోభంతోకాని, తీరని కోరికలతోగాని ఈ పని చేసింది. దానిని నీవు మనస్సులో పెట్టుకొని ఆమెను బాధించకు" అంటూ సూర్యునిలాంటి దివ్యతేజస్సుతో ప్రకాశించే శ్రీరాముడు భరతునికి నచ్చచెప్పాడు. శుక్లపక్ష చంద్రునివలె ఉన్న శ్రీరాముని మాటలు విని భరతుడు "అన్నా! నీవు ఈ బంగారు పాదుకల్ని ఒక్కసారి వేసుకొని నాకు ఇవ్వు. ఇవే సమస్త లోకాలకు యోగక్షేమాలను అందించగలవు" అని చెప్పాడు. వెంటనే శ్రీరాముడు పాదుకలను తొడుగుకొని వెంటనే విడిచాడు. ఆ పాదుకలకు భరతుడు ప్రణమిల్లాడు. "ఓ రఘువరా! నేను జటధారినై నారవస్త్రాలను కట్టుకొని కందమూలాదులను తింటూ నగరం బయట మీ కోసం ఎదురుచూస్తుంటాను. మీ ప్రతినిధిగా రాజ్యాన్ని పాలిస్తాను.

కాని పద్నాలుగేండ్ల తరువాత ఒక్క నిమిషం అయినా మీరు నాకు కనిపించకపోతే నేను అగ్నిప్రవేశం చేస్తాను. మీరు లేని ఒక్కక్షణం కూడా నేను జీవించను" అని భరతుడు కఠోరప్రతిజ్ఞ చేశాడు.

శ్రీరాముడు దానికి ఆమోదం తెల్పాడు. శత్రుఘ్నుని అక్కున చేర్చుకొని "రఘునందనా! నీవు మన తల్లుల విషయంలో ఏ మాత్రం అజాగ్రత్త చూపకు. నా మీద, మీ వదిన మీద ఒట్టుపెట్టుతున్నాను. కైకపై ఏ మాత్రం కోపగించకు. దూషించడం కూడా చేయకూడదు" అని చెప్పుతుండగానే ఆయన కళ్ళు కన్నీటిని స్రవించాయి. భరతశత్రుఘ్నులకు జాగ్రత్తలు చెప్పి వారికి వీడ్కోలు ఇచ్చాడు. ధర్మజ్ఞుడైన భరతుడు పాదుకలకు ప్రదక్షిణ నమస్కారం చేశాడు. శత్రుంజయం అనే ఏనుగు అంబారిపై ఆ పాదుకలను పెట్టాడు. హిమవత్పర్వతం లాంటి దృఢనిశ్చయం ఉన్న శ్రీరాముడు జనులకు, వసిష్ఠునకు, పౌరులకు, మహర్షులకు, జానపదులకు సోదరులకు వీడ్కోలు పలికాడు. దాన్నంతా చూస్తున్న కౌసల్యాదులు దుఃఖంలో మునగడంతో వారి కంఠం మూగబోయింది. వారు శ్రీరామునితో ఏమీ మాట్లాడలేకపోయారు. శ్రీరాముడు వినయంగా తల్లులందరికి నమస్కరించాడు. దుఃఖభారంతో రాముడు వెనుతిరిగి పర్ణశాల వైపు పయనించాడు.

* * *

భరతుని తిరుగు ప్రయాణం

సర్గ - 113

శ్రీరాముని పాదుకలు తీసుకొని భరతాదులు తిరుగుముఖం పట్టారు. అతనికి ముందుగా వసిష్ఠాది మునులు మంత్రులు బయలుదేరారు. వారు తూర్పు దిక్కుగా నడిచి మందాకినీనది వైపు మళ్లారు. భరతుని సేన అంతా అనేకధాతువుల సౌందర్యంతో నిండిన చిత్రకూటాన్ని చూస్తూ ఆ కొండ ప్రదేశాలలో ముందుకు సాగారు.

భరతుడు భరద్వాజాశ్రమానికి చేరుకొన్నాడు. ఆ మహాముని దగ్గరకు వెళ్ళి పాదాభివందనం చేశాడు. సంతోషించిన ఆ మహర్షి "భరతా! శ్రీరాముని కలుసుకొన్నావా? నీ కార్యం పూర్తి అయింది గదా" అని అడిగాడు. శ్రీరామదర్శనభాగ్యం మాకు కలిగింది. "మునీశ్వరా! మా అన్నను నేను, వసిష్ఠుడు, పౌరులు అందరూ అయోధ్యకు వచ్చి రాజ్యాన్ని పాలించమని ఎంతగానో వేడుకొన్నాం. కాని దానికి శ్రీరాముడు అంగీకరించలేదు. నేను పదునాలుగేండ్లు వనవాసాన్ని తండ్రి మాట ప్రకారం చేస్తాననే దృఢనిశ్చయాన్నే చెప్పాడు."

"వసిష్ఠుడు, నేను ప్రార్థించగా శ్రీరాముడు ఈ బంగారంతో తాపడం చేసిన ఈ పాదుకలను నాకు కానుకగా ఇచ్చాడు. వీటిని నేను తీసుకొని అన్న ఆజ్ఞను పాలించడం కోసం అయోధ్యకు మరలిపోతున్నాను" - అని చెప్పే భరతుని మాటలు విని భరద్వాజుడు సంతోషించాడు."ఓ భరతా! నీవు ఉత్తమశీలం కలిగి సత్ప్రవర్తన కలవాడివి. వర్షపు నీరు పల్లానికి ప్రవహించి తటాకాలలో నిలచినట్లుగా సర్వశుభలక్షణాలు నీలో చేరి ఉన్నాయి. ధర్మనిరతిగల నిన్ను పుత్రునిగా పొందిన దశరథుడు పుణ్యాత్ముడు" అని భరతుని ప్రశంసించాడు. ఆ తర్వాత భరద్వాజునకు ప్రదక్షిణనమస్కారాలు చేసి భరతాదులు అయోధ్యకు బయలుదేరారు. ఉత్తుంగతరంగాలతో పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తున్న గంగానదిని వారు దర్శించారు. భరతుడు సర్వసైన్యంతో కూడా గంగానదిని దాటి శృంగిబేరపురం చేరాడు.

అక్కడనుండి భరతుడు కొద్దిదూరం ప్రయాణం చేసి అయోధ్యకు చేరాడు. తండ్రిగాని, సోదరులుగాని లేని శూన్యమైన ఆ ప్రదేశాన్ని చూచి భరతుడు దుఃఖించాడు. "సుమంత్రా! అయోధ్య కళాహీనమై ఎలా వెలవెలపోతుందో చూడు. ప్రజల కన్నులలో ఆనందం శూన్యమై పోయింది. నగరాన్నంతా నిశ్శబ్దమే రాజ్యమేలుతోంది" అని భరతుడు అయోధ్యను చూచి పూర్వసంఘటనల తాలూకు బాధను అనుభవించాడు.

* * *

అయోధ్య దురవస్థ

సర్గ - 114

మహాయశస్వి అయిన భరతుడు రథంతో అయోధ్యాపురిలో ప్రవేశించాడు. ఆ సమయానికి అక్కడ పిల్లులు గుడ్లగూబలు తిరుగుతున్నాయి. అది రాత్రివేళ కావడంతో చిమ్మ చీకట్లతో కృష్ణపక్షపు రాత్రిలాగా గాఢాంధకారం

అలముకొని ఉంది. చంద్రుని రాహువు కబళించగా వెన్నెలంతా మాయమైనట్లు దశరథుని మృత్యువు మింగివేయగా అయోధ్య తేజస్సును పోగొట్టుకొని కళావిహీనం అయింది.

గ్రీష్మతాపానికి నదిలో నీరు తరిగిపోయింది. మిగిలిన కాస్త నీరు వేడెక్కింది. ఆ వేడికి తాళలేక పక్షులు విలవిలలాడుతున్నాయి. నదిలోని జలచరాలైన చేపలు, మొసళ్ళు ఆ తాపాన్ని భరించలేక నీళ్ళ అడుగున చేరాయి. అలా కృశించి ఎండిపోయిన నదిలాగా అయోధ్య దివ్యతేజస్సుతో అలరారే శ్రీరాముణ్ణి, పరాక్రమంతో తేజరిల్లే దశరథుణ్ణి దూరం చేసుకొని తన శోభనంతా ఆవిరి చేసుకొంది.

బంగారు కాంతులను వెదజల్లే అయోధ్య నేడు నిత్యాగ్నిహోత్రం అయిపోయిన తర్వాత మంటలు ఆగి పొగలు రేగిన యజ్ఞాగ్నిలాగా శ్రీరాముని దూరం చేసుకొన్న అయోధ్య వెలవెలబోయింది. యుద్ధంలో ఓడిపోయి, రథాలు విరిగి, చక్రాలు ఊడి, చెల్లాచెదురైన గజాలు అశ్వాలు ఉన్న రణభూమిలాగా కోసలమహాప్రభువును పోగొట్టుకొని కకావికలమై ఉంది. హోరున వీచే ప్రచండమైన వాయువేగానికి ఉవ్వెత్తున లేచి పడే తరంగాలతో ఉన్న సముద్రఘోషలాగా జనుల సందడితో కోలాహలంగా ఉండే అయోధ్య, నేడు ఉద్ధృతి తగ్గిపోయి నిస్సత్తువగా నిదానంగా పారే తరంగసమూహంలాగా, అయోధ్య నీరుగారిపోయి ఉంది.

మహాక్రతువు ముగిసిన తర్వాత నిశ్శబ్దాన్ని ఆవరించిన యజ్ఞవాటికలాగా, అయోధ్య మూగపోయింది. నిగనిగలాడే పద్మరాగాది మణులు తొలగించిన కొత్త ముత్యాలహారంలాగా, అయోధ్య కళ తప్పింది. ఆకాశం నుండి తన కాంతిని కోల్పోయి భూమికి చేరిన తారవలె అయోధ్య నిస్తేజమైంది. వసంత ఋతువులో చెట్లన్నీ చిగిర్చి వికసించిన పూల గుత్తులతో కళకళలాడుతూ వీణావేణుమృదంగాది ధ్వనులతో వీనుల విందొనర్చే అయోధ్య, నేడు గ్రీష్మంలో రగిలిన దావాగ్నిలో దగ్ధమై వసివాడి కళావిహీనమై పోయింది.

దుఃఖంలో మునిగిన నగరవాసులందరూ దైనందిన కార్యాలలో ఆసక్తిని తగ్గించుకొన్నారు. వర్తకులు వాణిజ్యంపై విరక్తితో అంగళ్ళు మూసివేశారు. నడిచివెళ్ళే వారు ఎవ్వరూ లేక రాజవీధులన్నీ నిర్మానుష్యంగా మారి అయోధ్య మేఘాల మాటున దాగిన చంద్రునిలాగా శోభను కోల్పోయింది. బాధను మరచిపోవాలని మధుపానం చేసిన వారందరూ అక్కడే నేలమీద పడి నిద్రలో కూరుకొనిపోయారు. మధుపాత్రలలో మధువు లేక విచ్చలవిడిగా పడి ఉన్నాయి. ఇళ్ళముందు వీధులలో శుభ్రపరచేవారు లేక అవన్నీ దుమ్ముతో నిండి చెత్తాచెదారం చేరి చూడడానికి అసహ్యంగా కనిపిస్తున్నాయి.

చలివేంద్రాలన్నీ ఖాళీ కుండలతో ఉన్నాయి. నీరు ఇచ్చేవారు కాని, తాగేవారు కాని లేక, పాడుబడిన ప్రదేశంలాగా కనిపిస్తోంది. దృఢమైన విల్లును వాడిబాణాలతో కొట్టడం చేత ఆ మహాధనుస్సు విరిగి ముక్కలు ముక్కలైనట్లుగా, కైక వరాల ధాటికి అయోధ్య ఛిన్నాభిన్నమైపోయింది. యుద్ధరంగంలో నేలకొరిగిన ఆడు గుర్రంలాగా అయోధ్య దీనావస్థలో కూరుకుపోయింది. దిగుడుబావిలోని నీరు ఎండిపోవడంతో అందులోని మొసళ్ళు, తాబేళ్ళు బయటపడి గిలగిలలాడుతాయి. కలువలు ఎండిపోయాయి. దాని గట్లు అన్నీ బీటలు వారాయి. అలా అయోధ్య రాజులను దూరం చేసుకొని బీటలు వారింది. మంచి సుగంధాది మైపూతలు లేక దుఃఖంతో కృశించిపోయిన

పురుషుని శరీరంలాగా అయోధ్య కృశించిపోయింది. వర్షాకాలంలో సూర్యుని కప్పివేసి ఆ కిరణాల తాకిడిని అడ్డుకొన్న మేఘమండలంలాగా అయోధ్యను దుఃఖం కమ్ముకొనిపోవడంతో శోభ కోల్పోయింది.

సుమంత్రుని సారథ్యంలో సాగివస్తున్న భరతుడు కళ తప్పిన అయోధ్యను చూసి "సుమంత్రా! ఎల్లప్పుడూ వినవచ్చే మధురధ్వనులు ఇప్పుడు వినిపించడం లేదు. చల్లగా వీచే గాలిలో పరవశింపజేసే సుగంధాలు లేవు కస్తూరి చందన అగరు పరిమళాలు కాని పూల సుగంధం కాని గాలి తేవడం లేదు. శ్రీరాముడు వనవాసానికి వెళ్ళిన తర్వాత రథాలపై వెళ్ళేవారు లేరు. గుర్రాల సకిలింపులు ఏనుగుల ఘీంకారాలు వినిపించడంలేదు. శ్రీరాముడు వనాలకు వెళ్ళటం చూసిన పౌరులలో శరీరధ్యాస తగ్గిపోయింది. విహారాలపై ప్రేమ నశించింది. అందుకే పరిమళాలు కాని, ప్రేయసీప్రియుల విహారాలు కాని, ఎక్కడా కనిపించకుండా పోయాయి. విరక్తినిండిన నగరవాసుల హృదయాలు వాహ్యాళిపైగాని ఉత్సవాలపై గాని ఇష్టాన్ని పెంచుకోలేకపోతున్నారు. స్త్రీలు ప్రియబాంధవుడిని కోల్పోయినట్లు అలంకారాలపై మక్కువను చూపలేకపోతున్నారు. ఇంటిగుమ్మాలను పూలతో అలంకరించడం మానివేశారు. వారి కొప్పులపై పూలను ముడుచుకోవడం మరిచిపోయారు. అయోధ్యాపురి వైభవం అంతా చిత్రకూటానికి శ్రీరామునితో తరలి వెళ్ళినట్లు ఉంది. అందుకే అయోధ్య శుక్లపక్షరాత్రిలాగా శోభించడంలేదు. గ్రీష్మతాపానికి అల్లాడేవారిని చిరుజల్లులు సేద తీర్చినట్లు దుఃఖంలో కూరుకుపోయిన ఈ నగరవాసులకు శ్రీరాముని ఆగమనం ఎప్పుడు తెలుస్తుందో. శ్రీరాముడు రావడంతో మన అందరికి మనస్సులు సంతోషపు జల్లులలో కరిగిపోతాయి కదా! ఆ మహోత్సవం ఎప్పుడు వస్తుందో? ఈ హృదయభారం ఎప్పుడు తీరుతుందో?" అని భరతుడు కుమిలిపోయాడు. ఇలా పరితపిస్తూ భరతుడు రాజప్రాసాదానికి చేరాడు. దశరథుడు లేని ఆ రాజగృహం సింహం లేని గుహలాగా నిస్తేజంగా కనబడింది. ఆ అంతఃపురం అంతా ఎవరూ లేకపోవడంతో కళావిహీనం అయి పాడుబడిన గృహంలాగా కనిపించింది. భరతుడు అంతఃపురాన్ని అంతా కలియతిరిగి చూశాడు. పూర్వపువైభవాన్ని తలచుకొని కన్నీరు కార్చాడు.

* * *

పాదుకాపట్టాభిషేకం

సర్గ - 115

తల్లులు, పౌరులు అయోధ్యకు చేరిన తర్వాత భరతుడు కృతనిశ్చయుడయ్యాడు. తల్లులందరికి నమస్కరించాడు. వసిష్ఠునికి నమస్కరించి, "మహర్షివర్యా! తండ్రి, సోదరులు లేకుండా ఈ అంతఃపురంలో నేను ఉండలేను. నేను మా అన్నతో చెప్పినట్లుగా పాదుకలను తీసుకొని వెళ్ళి నందిగ్రామంలో రాజప్రతినిధిగా వ్యవహరిస్తాను. కోసలరాజ్యానికి అసలైన ప్రభువు శ్రీరామచంద్రుడే. అతడు వనవాసం ముగించుకొని తిరిగి అయోధ్యకు వచ్చేవరకు నేను రాజ్యభారాన్ని మోయాలని అనుకొంటున్నాను." అని భరతుడు చెప్పాడు.

మహాత్ముడైన భరతుని మాటలకు అక్కడి వారందరూ సంతోషించారు. మంత్రులు, గురువులు ముక్తకంఠంతో భరతుని కీర్తించారు. "భరతా! నీవు శ్రేష్ఠుడవు. నీ సోదరప్రేమ అద్వితీయమైనది. నీవు నిత్యం శ్రీరామునికై తహతహలాడుతుంటావు. ధర్మసమ్మతములైన నీ మాటలు అందరికీ శిరోధార్యాలే. నిన్ను ఎదిరించు శక్తి ఎవరికీ లేదు. నీ సేవాభావం, తండ్రిపై భక్తి, సోదరులపై నీవు చూపే ప్రేమ నిరుపమానమైంది" అని చెప్పారు.

తనకు ప్రియంగా మాట్లాడే వారితో భరతుడు సంతోషించి "సుమంత్రా! మీరు వేగంగా నా రథాన్ని సిద్ధం చేయుడు. నేను శత్రుఘ్నుడు కలిసి నందిగ్రామానికి బయలుదేరుతామని" చెప్పాడు. భరతుడు, శత్రుఘ్నుడు తల్లుల దగ్గర అనుమతి తీసుకొని పాదుకలను శిరస్సుపై పెట్టుకొని రథాన్ని అధిరోహించాడు. అయోధ్యావాసు లందరూ భరతుడు పిలవకపోయినా అతని వెన్నంటి వెళ్ళారు. అయోధ్య అంతా నందిగ్రామం చేరుకొంది. వసిష్ఠాది గురువులు మంత్రులు అందరూ నందిగ్రామం వెళ్ళారు.

భరతుడు రథం దిగి "వసిష్ఠ మహర్షీ! నేను శ్రీరాముని బంటును. మా అన్నగారు స్వయంగా ఇచ్చిన ఈ బంగారు పాదుకలకు పట్టాభిషేకం చేసి నేను నా దగ్గర న్యాసంగా ఉంచిన ఈ రాజ్యాన్ని మా అన్న వచ్చేవరకూ పాలిస్తాను. వనవాసాన్ని ముగించుకొని తిరిగి వచ్చిన క్షణంలోనే పాదుకలను వారికి తొడిగి ఈ రాజ్యాన్ని రామునికి అప్పగించి నేను నా పాపాన్ని కడిగివేసుకొని పరిశుద్ధుడనౌతాను. ఈ పాదుకలకే విషయాలన్నీ నివేదిస్తూ ఉంటాను. ఈ పాదుకలే ధర్మాన్ని ప్రతిష్ఠింపచేస్తాయి. నేను రాజప్రతినిధిగా ఉండే నిమిత్తుడను మాత్రమే" అని చెప్పాడు.

"ఏనాడైతే శ్రీరాముడు తిరిగి వచ్చి అయోధ్యను చేపట్టి పట్టాభిషిక్తుడౌతాడో ఆనాడు ఈ అయోధ్య తిరిగి పూర్వవైభవాన్ని సంతరించుకొంటుంది. జనులందరి కళ్ళల్లో దైన్యం పోయి దివ్యమైన కళ ఆవరిస్తుంది. ఆ రోజే నేనూ సంతోషిస్తాను. మా అమ్మ నుండి వచ్చిన కళంకాన్ని ఆ రోజు పోగొట్టుకొంటాను. అట్టి ఆనందకరమైన రోజు కోసం పరితపిస్తూ ఎదురుచూస్తాను. శ్రీరామునకు రాజ్యాన్ని అప్పగించి ఆయన శుశ్రూషలో శేషజీవితాన్ని గడుపుతాను. అద్దానివల్లే నాకు కీర్తిప్రతిష్ఠలు వస్తాయి."

అలా భరతుడు చెప్పి నందిగ్రామంలోనే పాదుకా పట్టాభిషేకం చేసి సర్వ విషయాలను పాదుకలకు నివేదిస్తూ సర్వసమర్థుడైన, వీరుడైన భరతుడు రాజ్యాన్ని పాలించసాగాడు. శ్రీరామునిలాగా జటలను వేసుకొని నారవస్త్రాలు ధరించి కందమూలఫలాలను భుజిస్తూ, వనవాసదీక్షను నందిగ్రామంలో భరతుడు చేస్తున్నాడు. పాదుకలకు భరతుడు స్వయంగా ఛత్రం పట్టుతూ వింజామరలు వీస్తూ ఈ పనులన్నీ శ్రీరామునికే చేస్తున్నట్లుగా అనుకొంటూ ఉండేవాడు.

నియమనిష్ఠలు కల భరతుడు వినయసంపదతో ప్రతికార్యాన్ని పాదుకలకు నివేదించాడు. వచ్చిన కానుకలన్నీ పాదుకలకే సమర్పించేవాడు. ఇలా భరతుడు రాజ్యపాలన కొనసాగించాడు.

* * *

ఋషులు చిత్రకూటాన్ని వీడటం

సర్గ - 116

భరతుడు వెళ్ళిన తర్వాత రామాదులు ఆ పర్ణశాలలోనే నివసించారు. కొద్దికాలానికి అక్కడే ఉన్న ఋషీశ్వరులు, మునులు ఎందుకో కలవరం చెందుతున్నారని శ్రీరామునికి అనిపించింది. వారు వారి భయాందోళనలను శ్రీరామునికి తెలపడానికి భయపడినట్లుగా కనిపించసాగారు. కనుబొమ్మలు ముడివేస్తూ అటు ఇటు తిప్పుతూ కన్నులతోభాషిస్తూ తమలో తాము గొణుక్కుంటూ రహస్యంగా మంతనాలు చేసేవారు.

ఇదంతా గమనించిన శ్రీరాముడు వారికి కలిగిన ఆపద ఏమిటో తెలుసుకోవాలని అనుకొన్నాడు. వెంటనే ఆ చిత్రకూటంలో ఉండే కులపతి దగ్గరకు వెళ్లాడు. ఆయన వేయిమంది శిష్యులతో ఉండేవాడు. ఆయన దగ్గరకు వెళ్ళి నమస్కరించి "మునివర్యా! ఇక్కడి వారి వైఖరిలో ఏదో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. దీనికి కారణం ఏమిటో నాకు తెలీకుండా ఉంది. నేను ఏమైనా అపరాధం తెలీకుండా చేశానా? దయచేసి నాకు చెప్పండి. నన్ను క్షమించండి" అని అభ్యర్థించాడు. "లేకపోతే అత్యంతాసక్తితో నాకు సేవ చేసే సీత మీ విషయంలో ఏమరపాటుతో తప్పు ఏదైనా చేసిందా? లేక తొందరపాటు ఉన్న నా తమ్ముడగు లక్ష్మణునివల్ల ఏదైనా అపచారం జరిగిందా? చెప్పండి మీ వ్యాకులతకు కారణం తెలుసుకోలేక నా మనస్సు బాధపడుతోంది" అని అడిగాడు. వయస్సులోనూ, జ్ఞానంలోనూ వృద్ధుడైన ఆ మునీశ్వరుడు వణుకుతున్న శరీరంతో శ్రీరాముణ్ణి చూశాడు. ఆయన మనస్సును తెలుసుకొన్నాడు. "నాయనా, శ్రీరామా! ధర్మమెరిగిన నీవు అపరాధాలను ఎందుకు చేస్తావు? నీవు పొరపాటుగా కూడా ఎటువంటి అపరాధమూ చేసి ఉండలేదు. ఇక నీ భార్య ఐన సీత స్త్రీలలో శిరోమణి. ఆమె ధర్మమెప్పటికీ తప్పదు. నీ తమ్ముడగు లక్ష్మణుడు నీకు ప్రతిరూపమే. లక్ష్మణుని వల్ల కూడా ఎట్టి అపచారం జరగలేదు.

మా మునులు వ్యాకులం చెందడానికి వేరే కారణం ఉంది. ఇక్కడ ప్రశాంత జీవితాన్ని గడుపుతున్న మునులను రాక్షసులు వేధిస్తున్నారు. రావణుని తమ్ముడు ఖరుడు ఇక్కడ నివసిస్తాడు. ఖరుడు ఎదురింప శక్యంగాని క్రూరుడు. నరమాంసభక్షకుడు. మహాపాపి. మా ఉనికిని భరించలేక తపస్సు చేసుకొనే వారిని బాధిస్తున్నాడు.

వికృతరూపాలతో వచ్చి తాపసులను భయభ్రాంతులను చేస్తున్నాడు. యజ్ఞానికి పనికివచ్చే స్రుక్కు స్రువాది హోమసాధనాలను విరిచివేస్తూ హోమద్రవ్యాలను చిందర వందర చేస్తున్నాడు. హోమగుండాలలో నీరు పోసి నిప్పును ఆర్పివేస్తున్నాడు. కలశాలను విరగగొట్టుతున్నాడు. అమంగళకర వస్తువులను తెచ్చి తాపసులపై చల్లి వారిని బాధిస్తున్నారు. నీచబుద్ధిగల రాక్షసుల చాటున దాగి ఉండి తాపసులపై బడి వారిని చంపివేస్తున్నారు. భయకంపితుడై బిత్తరచూపులు చూసేవారిని చూస్తూ వికృతానందం పొందుతున్నారు. వీరి బాధపడలేని మా వారు ఈ ఆశ్రమాన్ని వీడి స్వస్థలానికి పోదామని నన్ను ఒత్తిడి చేస్తున్నారు" అంటూ మునుల బాధలను శ్రీరామునికి ఆ వృద్ధమునీశ్వరుడు చెప్పాడు.

"అందుకని ఓ శ్రీరామా! ఇక్కడికి దగ్గరలో ఉన్న ఆశ్రమానికి మేము వెళ్తాం. అక్కడ కందమూలాలు, ఫలాలు, జలాలు పుష్కలంగా దొరుకుతాయి. ఖరుడు దుష్టుడు. అతని వల్ల నీకు కూడా ప్రమాదం ఏర్పడవచ్చు.

రాక్షసులను హతమార్చడంలో నీకు సాటి ఐనవారు ఎవరూ లేకపోయినప్పటికీ నీ భార్యతో కూడి ఇక్కడ ఉండడం అసాధ్యంగా అనిపిస్తోంది. రాక్షసులు పలువేషాలు వేసి సాధువులను హింసిస్తారు. అందుకని నీవు నీ సతీ సోదరులతో కలిసి మాతో పాటు ఆ ఆశ్రమానికి వచ్చి నివసించు" అని మునీశ్వరుడు శ్రీరామునికి రాక్షసుల బాధలను విడమర్చి చెప్పాడు.

శ్రీరాముడు "ఓ తాపసీ! నేను ఇక్కడ ఉండగా మీరు భయపడాల్సిన అవసరం లేదు. నేను వారినందరిని నిర్జించగలను. లక్ష్మణునితో కలసి నేను ఎందరు రాక్షసులు వచ్చినా వారిని నిగ్రహించి మిమ్ము కాపాడగలను. నేను మిమ్ములను అన్ని విధాలుగా రక్షింపగలను" అని అభయం ఇచ్చాడు. ఐనా వారిని నిలపలేకపోయాడు.

వెళ్ళడానికే నిశ్చయించుకొన్నవారిని కొద్దిదూరం వెంబడించి వెళ్ళి వారికి శ్రీరామాదులు వీడ్కోలు పలికారు. తిరిగి పర్ణశాలకు వచ్చి జీవించసాగారు.

ఋషీశ్వరులు లేకుండా శ్రీరాముడు ఎప్పుడూ జీవించి ఉండలేదు. పెద్దలు, జ్ఞానులు లేని ప్రదేశాలను శ్రీరాముడు ఎప్పుడు ఇష్టపడేవాడుకాడు. శ్రీరాముని మనస్సులో జ్ఞానులు, ఋషీశ్వరుల మననంలో శ్రీరాముడు ఎల్లవేళలా మసలుతూ ఉండేవాడు.

* * *

అత్రిముని ఆశ్రమ దర్శనం

సర్గ - 117

ఋషీశ్వరులందరూ ఆ ప్రదేశాన్ని విడిచి వెళ్ళిపోయారు. ఆ ప్రదేశంలో రామునికి కూడా ఉండడం ఇష్టం లేకుండా పోయింది. భరతుడు, శత్రుఘ్నుడు, తల్లులు, పౌరులు, మంత్రులు, గురువులు వచ్చి తనను అభ్యర్థించడం రామునకు పదే పదే గుర్తుకురాసాగింది. వారి దుఃఖం జ్ఞప్తికి వచ్చి తండ్రి జ్ఞాపకాలతో శ్రీరాముడు దుఃఖానికి దాసుడయ్యేవాడు. ఆ ప్రదేశంలో వారు మాట్లాడిన సంగతులు గుర్తుకువచ్చి దుఃఖం తన్నుకువచ్చేది. అంతేగాక పవిత్రంగా ఉన్న చిత్రకూటపర్వతప్రాంతం భరతుని సేనలోని జంతువులతో నిండి అవి విడిచిన పేడలతో నిండి చూడడానికి అసహ్యకరంగా తోచింది. ఏదిఏమైనా ఇంకొక చోటకు వెళ్ళడమే యుక్తమని శ్రీరామునికి అనిపించింది. సీతాలక్ష్మణులతో ఆ విషయం చెప్పాడు.

వారిద్దరిని తీసుకొని శ్రీరాముడు చిత్రకూటాన్ని వదిలి ముందుకు పోయాడు. వారికి అత్రిమహాముని ఆశ్రమం తారసిల్లింది. ఆ మహాముని దగ్గరకు రామాదులు వెళ్ళి పాదాభివందనం చేశారు. రామునిపై అత్రి పుత్రవాత్సల్యం చూపి అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి రామాదులను ఆదరించారు. వారు మాట్లాడుతుండగా మహాసాధ్వి తపస్విని అయిన అనసూయ అక్కడకు వచ్చింది. అత్రి తన భార్య అయిన అనసూయను సీతారామక్ష్మణులకు పరిచయం చేశాడు. సీతాదేవిని చూపి ఈమె విదేహరాజకుమార్తె, దశరథుని పెద్ద కోడలు, శ్రీరాముని ధర్మపత్ని అని పరిచయం చేశాడు.

అప్పుడు అత్రిమహాముని శ్రీరామునితో తన భార్య గురించి ఇలా చెప్పాడు. "శ్రీరామా! ఒకసారి పది సంవత్సరాలపాటు వర్షాలు కురవక కరువు వచ్చింది. లోకాలన్నీ నీరు లేక మలమలమాడిపోసాగాయి. అప్పుడు ఈ అనసూయ కఠోర తపస్సు చేసింది. కందమూలాలను తన తపఃప్రభావంతో ఆమె సృష్టించింది. అంతేగాక తన తపోవిశేషం చేత గంగానదిని ప్రవహింపజేసి జనుల ఆకలిదప్పులను తీర్చివేసింది. పదివేలసంవత్సరాలు తపస్సు ఆచరించింది. చాంద్రాయణాది వ్రతాలను ఆచరించింది. దాని ప్రభావంతో ఋషీశ్వరులకు ఎదురయ్యే విఘ్నాలను తొలగించింది. దేవకార్యం కోసం పదిరాత్రులను కలిపి ఒక రాత్రిగా మార్చి దేవతలకు సహాయం చేసింది. ఈ మహాత్మురాలు నీకు తల్లి వంటిది" అని చెప్పగా శ్రీరాముడు ఆమెకు నమస్కరించాడు.

"అసూయ లేని కారణంతో ఈమె అనసూయగా పిలవబడుతోంది. ఎన్నడూ ఆమెకు కోపం రాదు. ఇటువంటి ఈమెతో సీతకు స్నేహం చక్కగా కుదురుతుందని" అత్రిమహాముని చెప్పాడు. దీనినంతా వింటున్న సీతాదేవితో శ్రీరాముడు మహర్షివాక్యాలు విన్నావుగదా. ఆ అనసూయాదేవిని నీవు అనుసరిస్తూ ఉండమని చెప్పాడు.

శ్రీరాముని మాటలు విని సీత అనసూయ దగ్గరగా వెళ్ళింది. వయోభారంతో అనసూయాదేవి శరీరమంతా ముడతలు పడి కేశాలన్నీ తెల్లబారి ఉన్నాయి. ఆమె పండుముసలి ముత్తైదువలాగా కనిపించింది. ఆమెకు సీత నమస్కరించి "అమ్మా! మీరు ఆరోగ్యంగా ఉన్నారా!" అని అడిగింది. చిరునవ్వుతో సీతకు బదులు చెప్పుతూ "సీతా నీవు కడు అదృష్టవంతురాలివి. ధర్మాన్ని ఆచరిస్తున్నావు. నీవు అయోధ్యలోని సంపదలను త్యజించి పతియే దైవం అని నమ్మి ఈ అడవులకు వచ్చావు. నీవు నిజంగా భాగ్యశాలివని చెప్పొచ్చు.

స్త్రీలకు పతియే దైవం. తన భర్త ఏ పరిస్థితులలో ఉన్నప్పటికీ స్త్రీ ఆయనను అనుసరిస్తే ఆమెకు ఈ లోకంలోను, పరలోకంలోను సంపదలు వెన్నంటి వస్తాయి. కొందరు దుర్మార్గులైన స్త్రీలు భర్తను తమ అదుపాజ్ఞలలో ఉంచుకోవాలని భావించి కోరరాని కోరికలను కోరుతూ ఇక్కట్లపాలు చేస్తారు. భార్య తను ధర్మాన్ని ఆచరించడమే కాక తన భర్తను ధర్మపరునిగా ఉండడానికి సహకరిస్తే ఆ భార్యను లోకమంతా కీర్తిస్తుంది. భార్యాభర్తలలో ఎక్కువ తక్కువగాక వారిద్దరూ ఒకరికొకరు మసలి ఏకరూపులై జీవించాలి. భర్త సర్వావస్థలయందు భార్యను రక్షిస్తూ ఉండాలి. నేను ఎంతగానో పరిశీలించి చూశాను. భార్యకు భర్తే హితకారి అవుతాడు కాని వేరొకరు కాలేరు. సద్గుణవంతులు ధర్మమెరిగిన నీవంటివారు మాత్రమే భర్తను దైవంతో సమానంగా భావించి గౌరవిస్తారు. భార్యాభర్తల మధ్య అన్యోన్యానురాగాలు ఉండాలే గాని ఈర్ష్యాద్వేషాలు ఉండకూడదు. నీవు సహధర్మచారిణివై శ్రీరామునికి సేవలుచేస్తూ ఉత్తమ ఫలప్రాప్తిని పొందగలవు. స్త్రీలలో రత్నంలాగా భాసిల్లగలవు" అని అనసూయాదేవి సీతాదేవిని కొనియాడుతూ ఆమెకు స్త్రీ ధర్మాలను చెప్పింది.

* * *

అనసూయ సీతకు బహుమతులు ఇవ్వటం

సర్గ - 118

మహాత్మురాలైన అనసూయాదేవి మాటలు సీత సంతోషంగా విన్నది. "అమ్మా! మీరు చెప్పేదంతా యథార్థమే. నాకు కూడా సతికి పతియే నిజమైన దైవం అని తెలుసు. మీరు చెప్పే విషయాలు వింటుంటే మా అత్తగారు, మా అమ్మ చెప్పినది గుర్తుకువస్తోంది. స్త్రీ తన భర్త గుణహీనుడైనా, చరిత్ర హీనుడైనా అతనిని ఆదరించడమే ఉత్తమమైన ధర్మమని తెలుసుకోవాలని వారుకూడా అన్నారు.

శ్రీరాముడు జితేంద్రియుడు, దయగలవాడు. సర్వప్రాణులను సమానంగా చూసేవాడు. దశరథుని స్త్రీలందరిని తల్లులుగా గుర్తించి ఆదరించేవాడు. పితృభక్తిపరాయణుడు. అటువంటి వానిని అనుసరించే నేను ఆయనకు ఇష్టం వచ్చిన రీతిలోనే ప్రవర్తిస్తాను. మేము దశరథుని మాట ప్రకారం అడవులకు వచ్చేటప్పుడు మా అత్తగారైన కౌసల్యాదేవి నాకు భర్తను గురించి హితబోధ చేసింది. దానిని నేను ఎల్లప్పుడూ మనస్సులోనే ఉంచుకొంటాను. నా వివాహసమయంలో మా అమ్మ నాకు చేసిన మహోపదేశం కూడా నేను మనస్సులోనే పదిలపరచుకొని ఉన్నాను.

అమ్మా! మీ మాటలు వింటుంటే మా అమ్మ చెప్పినవి గుర్తుకు వస్తున్నాయి. భార్యకు భర్తను సేవించటమే గొప్ప తపస్సు అని చెప్పింది. సావిత్రీదేవి పతిసేవ చేసి స్వర్గంలో సుస్థిరస్థానాన్ని పొందింది. అనసూయాదేవీ మీరు కూడా అటువంటి ఉత్తమలోకాలను పొందగలరు. స్త్రీలలో శిరోరత్నానివి. దివ్యస్వరూపిణి ఐన రోహిణీదేవి తన భర్తను క్షణకాలం కూడా విడచి ఉండదు. చంద్రునితోపాటు రోహిణి ఎల్లవేళలా తోడునీడగా ఉంటుంది. ఎటువంటి సంకట పరిస్థితులనైనా ఎదుర్కొంటూ తన పతిని అనుసరించే స్త్రీలకు దేవలోకంలో గౌరవమర్యాదలు స్థిరంగా ఉంటాయి. ఈ లోకంలో ఆమెను మించిన వారు గాని ఆమెను ఎదురించగలవారుగాని ఎవరూ ఉండరు గదమ్మా" అని అన్నది సీత.

సీత మాటలకు అనసూయ సంతసించి ఆమెను అక్కున చేర్చుకొని శిరస్సును ముద్దాడింది. "సీతా! నీవు ఏదైనా కోరుకో! నీవడిగిన నా తపఃఫలితం నేను నీకు ఇస్తాను" అని చెప్పింది. సీత చిరునవ్వుతో "అమ్మా! మీరు ఇంతకన్నా నాకు ఇవ్వవలసినవి ఏమున్నాయి? మీ ఆశీర్వాదమే నాకు అన్నింటికన్నా మిన్నగా కనిపిస్తోంది. మీ దీవెనలను నేను కోరుకొంటున్నాను" అని చెప్పింది. ఆ మాటలకు అనసూయ మరింతగా తృప్తి చెందింది. "అమ్మా సీతా! నీవు శ్రీరామచంద్రుని భార్యగా చక్కగా మాట్లాడావు. ఏమీ కోరని నీ నిండుదనాన్ని చూసి నేను ముచ్చటపడుతున్నాను. నీవు కోరకున్నను నీకు నేను కొన్ని కానుకలను ఇస్తాను. అవి నీకు ఉత్తమఫలాలను అందిస్తాయి" అని చెప్పి పూమాలలు, ఆభరణాలు, వస్త్రాలు, అంగరాగాలు, అనులేపనాలు ఇచ్చింది. వైదేహీ! పుష్పమాలలు ఎన్నటికి వాడని కుసుమాలు. నీవు ఇవి ధరించియే ఉండవచ్చు. ఈ వస్త్రాలు మాయనివి, నలగనివి నీకు ఎప్పటికీ క్రొత్తగానే ఉంటాయి. ఈ ఆభరణాలు వన్నె తగ్గనివి. ఈ అంగరాగాలు, ఈ మైపూతలు నీ శరీర కాంతిని ఇనుమడింపజేస్తాయి. వీటిని నీవు అలంకరించుకొని నీ భర్తను సంతోషపెట్టు అని అనసూయ ఎంతో

ప్రీతిగా కానుకలు సీతకు ఇచ్చింది. అనసూయ ఇచ్చినవాటినన్నింటిని సీతాదేవి ఎంతో ఇష్టంగా తీసుకొంది. తర్వాత ఆమెకు చేతులు జోడించి నమస్కరించి పక్కనే కూర్చుంది. అలా కూర్చున్న సీతను చూచి "ఓ సీతా! నీ వివాహం స్వయంవరం ద్వారా జరిగినదని విన్నాను. నాకు నీ వివాహం, నీ జననం గురించి చెప్తావా" అని అడిగింది.

"తల్లీ! మీకు ఇష్టమైన పని చేయడం కన్నా నాకు ప్రీతికరమైనది ఏదీ లేదు. మిథిలానగరానికి జనకుడు మహారాజు. అతడు గొప్ప ధర్మవేత్త. సత్యసంధుడు. ఒకసారి జనకుడు యజ్ఞం చేయాలని తలచాడు. దానికోసం యజ్ఞభూమిగా నిర్ణయించబడిన భూమి నాగలితో దున్నుతుండగా ఆయనకు నేను దొరికానట. అమూల్యమైన రత్నం దొరికినట్లుగా శిశువునైన నన్ను ఎత్తుకొని ఈమె నా కూతురు అంటూ పుత్రికావాత్సల్యాన్ని నాపై కురిపించాడట. ఆ సమయంలో ఆకాశవాణి "జనకా! ఈమె మనుష్యజాతికి చెందిన శిశువుగాదు. నీవు ఈమెను కూతురిగా పెంచుకో. నీకు సర్వశుభాలు కలుగుతాయి" అని చెప్పిందట. దానికి ఆయన ఎంతో సంతోషించి తన భార్యకు ప్రియమైన కానుకగా ఇచ్చాడు. ఆమె నన్ను పుత్రికగా భావించింది. వారిద్దరూ నన్ను ఎంతో అల్లారుముద్దుగా పెంచారు. విద్యాబుద్ధులను చెప్పించారు. నాకు యుక్తవయస్సు వచ్చింది. నాకు ఎవరిని భర్తగా నిర్ణయించాలో తెలియక నా తండ్రి ఎంతో ఆవేదన చెందేవాడు. ఆయన బాగా ఆలోచించాడు. పూర్వం వరణుడు ఒక మహాచాపం రెండు తూణీరాలను మా వంశంలోని దేవరాతునకు కానుకగా ఇచ్చాడట. ఆ మహాధనుస్సు మా తండ్రి దగ్గరే ఉండేది. దానిని సామాన్య మానవులెవరూ ఎత్తలేకపోయేవారు. ఎంతోమంది కలసి దానిని ఒకచోటనుండి మరోచోటికి మార్చేవారు. అటువంటి బలమైన చాపాన్ని జనకుడు చూశాడు. అప్పుడు వరాన్వేషణలోనున్న నా తండ్రికి ఒక ఆలోచన వచ్చింది. రాజులందరిని పిలిచి ఈ మహాచాపాన్ని ఎత్తి ఎవరైతే అల్లెత్రాడును బిగించి నారిని సంధిస్తారో వారికి నా కూతురైన సీతను ఇచ్చి వివాహం చేస్తానని స్వయంవరాన్ని ప్రకటించారు. ఎందరో రాజులు ఆ ధనుస్సు ఎత్తడానికి ప్రయత్నించి విఫలురు అయ్యారు. కొందరు దాన్ని చూసి దానికి నమస్కరించి వెళ్ళిపోయారు. చాలాకాలానికి రామలక్ష్మణులను తీసుకొని విశ్వామిత్రమహర్షి నా తండ్రి చేస్తున్న యజ్ఞాన్ని చూడడానికి వచ్చాడు. అప్పుడు శ్రీరాముడు శివచాపాన్ని చూడాలని ముచ్చట పడుతున్నాడని దానిని శ్రీరామునకు చూపించమని విశ్వామిత్రుడు నా తండ్రికి చెప్పాడు. మహర్షి మాట ప్రకారం శివచాపాన్ని రామలక్ష్మణులకు నా తండ్రి చూపించాడు. రాముడు తన గురువైన విశ్వామిత్రుని అనుమతిని తీసుకొని ఆ చాపాన్ని క్షణకాలంలో ఎత్తి దాని అల్లెత్రాడును బిగించాడు. నారిని సంధించబోగా ఆ శివచాపం పెళ్లున మహాధ్వనితో విరిగిపోయింది. సత్యవ్రతుడైన నా తండ్రి తన ప్రతిజ్ఞ ప్రకారం నన్ను శ్రీరామునకు ఇవ్వబోగా తండ్రి అనుమతి పొందలేదని నన్ను శ్రీరాముడు స్వీకరించలేదు. జనకుడు దశరథ మహారాజును ఆహ్వానించి ఆయన అనుమతిని తీసుకొని నన్ను శ్రీరామునికి ఇచ్చి పాణిగ్రహణం చేయించాడు. అలానే నా చెల్లెలైన ఊర్మిళను లక్ష్మణునకు ఇచ్చి పెండ్లి చేశారు. నా పినతండ్రి కూతుళ్ళు మాండవీశ్రుతకీర్తులను భరతశత్రుఘ్నులకు ఇచ్చి పెళ్ళిచేశారు. ఆ విధంగా ధర్మపరుడైన శ్రీరామునకు నేను సహధర్మచారిణిని అయ్యాను" అంటూ సీత తన స్వయంవరగాథను అనసూయాదేవికి వివరించింది.

* * *

రామాదుల పయనం

సర్గ - 119

అనసూయాదేవి సీత కల్యాణగాథను విని ఎంతో సంతోషించింది. ఆమెను తన హృదయానికి హత్తుకొంది. శిరస్సును ముద్దాడింది."సీతా! నీ మధుర వచనాలతో నీ గాథను విని నేను పరమానందాన్ని పొందాను. ఇప్పుడు చంద్రుడు రోహిణితో కూడి ఆకాశాన్ని ఏలడానికి వస్తున్నాడు. మునులందరూ సాయంసంధ్యలను నిర్వర్తించడానికి స్నానాలు చేసి గుంపులు గుంపులుగా వస్తున్నారు. పక్షులన్నీ ఆహారాన్వేషణను ముగించుకొని తమ గూటికి చేరుతున్నాయి. పశువులన్నీ తమ పిల్లల దగ్గరకు చేరుతున్నాయి. ఈ ఆశ్రమంలోని మృగాలన్నీ యజ్ఞవేదిక మీద చదునుగా ఉన్న ప్రదేశాలలో పడుకొంటున్నాయి. రాత్రి సంచరించే జంతువులు బయలుదేరాయి. చెట్లన్నీ కూడా నిద్రావస్థలోకి జారుకొంటున్నాయి. దిక్కులన్నీ అస్పష్టంగా కనిపిస్తూ అంధకారంలోకి వెళ్ళిపోతున్నాయి.

నేను ఇచ్చిన ఆభరణాలు నీవు అలంకరించుకొని అంగరాగాలు దిద్దుకొని శ్రీరాముని చెంతకు వెళ్ళి విశ్రమించు" అని అనసూయ సీతకు చెప్పింది. సీత ఆమె చెప్పినట్లుగానే విని చక్కని వస్త్రాలు, ఆభరణాలు ధరించింది. మైపూతలతో అంగరాదులతో శరీరకాంతిని ఇనుమడింపజేసుకొని వచ్చి అనసూయ పాదపద్మాలకు ప్రణమిల్లింది. సీతను లేవనెత్తి శ్రీరాముని దగ్గరకు పంపింది. ఎవరికీ దక్కని సత్కారం సీతకు దొరకడాన్ని చూసి రామలక్ష్మణులు సంతోషించారు. ఆ రాత్రి సీతారామలక్ష్మణులు అక్కడే విశ్రమించారు. మరునాటి ఉదయాన్నే లేచి కాలకృత్యాలు తీర్చుకొన్నారు. సంధ్యావందనాలు ఆచరించారు. గాయత్రిని ఉపాసించారు. ఆ తర్వాత అత్రి దగ్గరకు వచ్చి పాదాభివందనం చేసి అక్కడనుండి వెళ్ళడానికి అనుమతిని అడిగారు. మార్గనిర్దేశనం చేయమని అడిగారు. వారి మాటలు విని అక్కడి మునీశ్వరులు "రామలక్ష్మణులారా! ఈ ప్రదేశం చాలా భయంకరమైనది. రాక్షసులు ప్రతిచోటా పొంచి ఉంటారు. కందమూలాలకోసం వెదకటం ఉపద్రవాలకు అవకాశం ఏర్పడుతుంది. నరమాంసాన్ని తినే రాక్షసులు ఇక్కడ తిరుగుతూ ఉంటారు. ఆ రాక్షసులు మునులను హింసిస్తుంటారు. భుక్తాయాసంతో ఉన్నప్పుడో, లేక ఏమరుపాటుగా ఉన్నప్పుడో మన చెంతకు వచ్చి మనలను భయకంపితులను చేస్తారు. తాపసులందరూ ఈ మార్గాన్నే కందమూలాల కోసం వెళ్ళివస్తుంటారు. నీవు ఈదారిన వెళ్ళవచ్చు. నీ దారికి అడ్డుపడే రాక్షసులను నీవు నిగ్రహించు" అని చెప్పారు. తపఃసంపన్నులైన అత్రిమునికి, ఋషీశ్వరులకు రామాదులు అంజలి ఘటించారు. వీడ్కోలు పలికి శుభాశీస్సులు అందుకొన్నారు. మేఘమండలంలో సూర్యుడు ప్రవేశించినట్లు శ్రీరాముడు సీతాలక్ష్మణులతో కలిసి వనంలో ప్రవేశించాడు.

* * *

అయోధ్యకాండ సంపూర్ణం

అరణ్యకాండ

సీతారామలక్ష్మణుల దండకారణ్యప్రవేశం

సర్గ - 1

సీతారామలక్ష్మణులు దండకారణ్యానికి వచ్చారు. వారికి తాపసుల ఆశ్రమాలెన్నో కనువిందుచేశాయి. తాపసులు వల్లెవేసే వేదంతో ఆ ప్రాంతం ప్రతిధ్వనిస్తోంది. అక్కడంతా ఋషులు కట్టుకొనే నారవస్త్రాలు ఆరవేసి ఉన్నాయి. దర్భలు గుట్టలుగా ఉన్నాయి. తాపసులు ఆచరించే సంధ్యావందనాలు గాయత్రీ మంత్రాలతో ఆ ప్రదేశం పవిత్రంగా కనిపించింది. రాక్షసులు మాత్రం ఆ ప్రాంతాన్ని చూసి భయపడ్డారు.

ఆశ్రమప్రాంతం ప్రశాంతంగా ఉంది. స్వచ్ఛమైన గాలి వీస్తోంది. అక్కడివారిలో దైవంపై భక్తిభావం మెండుగా వుంది. అందుకే దుర్గమారణ్యంలోను వారు నిర్భయులై సంచరిస్తున్నారు. మృగాలు తమ సహజమైన క్రౌర్యాన్ని వదిలి సాధుబుద్ధితో తిరుగుతున్నాయి. వేదపఠనకుదీటుగా చిలుకలు మధురంగా సవ్వడి చేస్తున్నాయి. పక్షులగుంపులన్నీ కలరవాలతో ఎగురుతున్నాయి. అక్కడికి అప్సరసలు వచ్చి తమ నృత్యగానాలతో దైవసేవ చేస్తున్నారు.

అగ్నిహోత్రం చేసే ప్రదేశాలు విశాలంగా ఉన్నాయి. సుక్కులు, స్రువాలు, యజ్ఞపాత్రలు, దర్భాసనాలు, దర్భలు, సమిధలు, కలశాలు, కందమూలాలు అన్నీ ఆ ప్రదేశాల నిండా ఉన్నాయి. ఆ ఆశ్రమంలోను చుట్టూరా ఉన్న వృక్షాలన్నీ సమృద్ధమైన ఫలసంపదతో అలరారుతున్నాయి. భూతబలులు వైశ్వదేవాది హోమాలతో ఆ ప్రదేశం పునీతం అయ్యింది. కనులపండుగగా కనిపించే పుష్పవనాలు కలువలతో నిండిన తటాకాలు సరస్సులు చూడముచ్చటగా ఉన్నాయి.

తాపసులు నిత్యం కందమూలాలు, ఫలాలు తీసుకొనేవారు. త్రిసంధ్యలలో సంధ్యావందనాలు, గాయత్రీ ఉపాసనలు చేసేవారు. వారి ముఖం సూర్యునిలాగా దివ్యతేజస్సుతో సత్వగుణంతో శోభిల్లుతోంది. వారు నారచీరలు కట్టుకొని వేదం పఠిస్తుంటే దైవం నడచివస్తోందా అనిపించేది. వారందరూ పవిత్రజీవనులు. ఆ ప్రకృతిలో వారికి దైవంతప్ప మరేమీ కనిపించేది కాదు. అటువంటి సత్పురుషులు జితేంద్రియులు బ్రహ్మజ్ఞానులున్న ఆ ప్రదేశం బ్రహ్మలోకంలాగా కనిపిస్తూంది.

ఆ సత్యలోకంలోకి వింటిని ధరించిన కల్యాణగుణసంపన్నుడైన శ్రీరాముడు వచ్చాడు. భూత భవిష్యత్తులను ఎరిగిన ఆ ద్విజోత్తములు వచ్చే సీతారామలక్ష్మణులను చూసి సంతోషంతో వారికి ఎదురువెళ్ళారు. మహాసాధ్వి ఐన సీతను సద్గుణసంపన్నులైన రామలక్ష్మణులను వారు స్వాగతించారు. వనవాసులైన మునులకు శ్రీరాముని శరీరసౌందర్యసౌకుమార్యలావణ్యాలు ఆశ్చర్యం కలిగించాయి. అద్భుతతేజోవిరాజమానులైన ఆ ముగ్గురిని తాపసులు కన్నులార్పకుండా తదేకంగా చూస్తూ స్వాగత సత్కారాలు అందించారు. సమస్త లోకకల్యాణం కోసం శ్రమించే ఆ ఆశ్రమ జీవనులకు సీతారామలక్ష్మణులు అంజలి ఘటించారు. ఆ ముగ్గురిని ఉచితాసనాల మీద కూర్చోబెట్టారు. వారి దగ్గర ఉండే కందమూలాలు, మధుర ఫలాలను వారికి పెట్టారు. "స్వామీ! శ్రీరామచంద్రా! ఈ ఆశ్రమం మీదే అనుకోండి" అని చెప్పారు.

"శ్రీరామా! రాజు విష్ణు అంశ సంభూతుడు. నీవు వర్ణాశ్రమాది సమస్త ధర్మాలను ఎరిగినవాడవు, మాన్యుడవు; మేమందరం మీ రాజ్యంలో నివసించేవారం. మీరు నగరంలో ఉన్నా, అడవిలో ఉన్నా, మీరే మా రక్షకులు. మమ్ము రక్షించే భారం మీదే సుమా! ఓ రఘుకులనందనా! మేమందరం తపస్సు చేసుకొంటూ మా కాలాన్ని గడుపుతున్నాం. తపోవిధులకు శత్రువైన కామక్రోధాదులను విడిచిపెట్టాం; శాపాయుధాలను ప్రక్కన పెట్టాం. తపస్సే మా సంపద. గర్భంలో ఉన్న శిశువును తల్లి రక్షించినట్లుగా మీరు మమ్ములను కాపాడాలి" అని చెప్పారు.

సీతారామలక్ష్మణులను సత్కారాలతో, మంచి మాటలతో అలరించి వారిని తాపసులు సంతుష్టులను చేశారు.

* * *

విరాధుడు తారసిల్లటం

సర్గ - 2

మునీశ్వరుల ఆదరాభిమానాలకు సీతారామలక్ష్మణులు తృప్తిచెందారు. సీతారామలక్ష్మణులు ఆ రాత్రి వారి దగ్గరే గడిపారు. మరునాటి ప్రాతఃకాలంలో లేచి స్నానాదికాలు పూర్తి చేసుకొని మునులకు వీడ్కోలు పలికి ముందుకు సాగారు. అలా వారు ముందుకు సాగి వనమధ్యప్రదేశానికి చేరారు. అక్కడి వృక్షాలన్నీ తెగిపడి ఉన్నాయి. తీగలు, పొదలు చెల్లాచెదురుగా ఉన్నాయి. పెద్దపులులు, తోడేళ్ళు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ఆకాశంలో ఎగిరే పక్షులు బిక్కుబిక్కుమని ఎగురుతున్నట్లుగా కనిపించాయి. నీటి జాడ ఎక్కడా వారికి కనిపించలేదు. కీచురాళ్ళ రొద మాత్రం భయంకరంగా కర్ణకఠోరంగా వినిపిస్తోంది. దాన్నంతా సీతారామలక్ష్మణులు చూశారు.

అంతలో వారికి భయంకరమైన శబ్దం వినబడింది. వారిముందుకు పర్వతాకారంతో లోతైన కళ్ళు, వికృతమైన నోరున్న ఒక రాక్షసుడు వచ్చాడు. అతణ్ణిచూచి సీత భయకంపిత అయ్యింది. రాక్షసుని పొట్ట ఎత్తుగా, లోతుగా అసహ్యకరంగా ఉంది. ఆ రక్కసుని శరీరం నిండా వేలాడే మాంసఖండాలు, రక్తపుచారికలున్నాయి. పొడవైన శరీరం ఉన్నవాడు పులితోలు కట్టుకొన్నాడు. అపుడే పులిని చంపి తీసిన చర్మంలాగా ఆ పులితోలు నెత్తురోడుతోంది. అతని చేతిలో ఒక శూలంఉంది. ఆ శూలానికి మూడు సింహాలు, నాలుగు పులులు, రెండు తోడేళ్ళు, 10 లేళ్ళు, దంతాలున్న పెద్దఏనుగు తలను గుచ్చి దానిని మెడమీద పెట్టుకొని పెద్దగా నోరు తెరచి భీకరంగా అరుస్తూ ముందుకు వస్తున్న ఆ రాక్షసుణ్ణి సీత చూసి భయంతో బిర్రబిగిసిపోయింది.

నరమాంసభక్షకుడైన ఆ రాక్షసుడు వీరి ముగ్గురిని చూశాడు. తాపసవేషంలో ఉన్న రామలక్ష్మణుల ప్రక్కనున్న జనకసుత అయిన సీతనుచూచి పట్టరాని కోపంతో పెద్దగాఅరుస్తూ వాళ్ళమీదకు దూకాడు. ఆ వేగానికి భూమి దద్దరిల్లింది. దిగ్భ్రాంతికి లోనై చూస్తున్న సీత నడుము వానికి చిక్కింది. సీతను గట్టిగా పట్టుకొని కొద్దిదూరం అడుగులు వేసి అక్కడ నిలబడ్డాడు. మరల రామలక్ష్మణులవంక చూశాడు. 'ఓరి పాపాత్ములారా! మీరు తాపసుల వేషంలో నారచీరలు ధరించారు. తల ముడివేశారు. చేతిలో ధనుర్బాణాలు ఖడ్గం పట్టుకొనడమేకాక ఒక స్త్రీని

వెంటబెట్టుకొని తిరుగుతున్నారు. మీరెంత అధర్మాన్ని చేస్తున్నారు? తాపసులైన మీకు స్త్రీసాంగత్యమా? ఇది మునుల పద్ధతికి విరుద్ధం గాదా? ఇంతకి మీరు ఎవరు?" అని కోపంగా రాక్షసుడు రామలక్ష్మణులను అడుగుతూ కాస్తదూరం నడిచాడు. ఆగి వెనుతిరిగి మళ్ళీ అతనే అంటున్నాడు.

"నేను ఎవరో మీకు ముందుగా చెప్తాను వినండి! నన్ను విరాధుడని అందరూ అంటారు. నేను నరమాంసాన్ని ఇష్టంగా తింటాను. అందుకే ఈ అరణ్యాలలో తిరుగుతూ, ఇక్కడ తపస్సు చేసుకొనే ఋషులను చంపి తింటుంటాను. ఈ రోజు మిమ్ములను చూశాను. ఈ సుందరిని నేను పెళ్ళి చేసుకొంటాను. భార్యగా స్వీకరిస్తాను. మీ ఇద్దరి రక్తాన్ని చిటికెలో తాగేస్తాను" అని చెప్పే రాక్షసుని మాటలను సీత విని భయంతో వణకసాగింది.

విరాధుని చేతిలోచిక్కిన సీతను చూచి దుఃఖంతో శ్రీరాముని ముఖం చిన్నబోయింది. సీత ఆ రక్కసుని చేతిలో సుడిగాలికి అల్లల్లాడే అరటిచెట్టులాగా వణకుతుండడం చూసి శ్రీరాముడు ఖిన్నుడయ్యాడు. లక్ష్మణునివైపు తిరిగి "ఓ సౌమిత్రీ! ఇది ఏమిటి? నా భార్య సీత; జనకనందిని; అతి సుకుమారి; సదాచారంతో బతికే కీర్తిమంతురాలైన సీత ఈ విరాధునికి చిక్కింది.

లక్ష్మణా! మన పినతల్లికి మనం ఇక్కట్లు పడడమే ఇష్టమేమో? అందువల్ల ఆమె కోరిక అనే నెపంతో మనలను ఈ అరణ్యాలకు పంపింది. రాజ్యాన్ని భరతునకు కట్టబెట్టడమే కాక మంచి దూరదృష్టితో భరతునకు ఎదురులేని రాజ్యాన్ని ఇవ్వడంకోసం, శత్రుశేషం మిగల్చకుండా ఉండేందుకే ఈ పన్నాగంపన్ని మనలను రాక్షసుల పరం చేసింది. ఈనాటికి కైక కోరిక నెరవేరింది.

లక్ష్మణా! నాకు రాజ్యాధికారం దక్కలేదని బాధవేయలేదు! కాని, మన తండ్రి మరణం నాలో ఆవేదన కలిగించింది. దాన్ని మించిన దుఃఖం నేడు ఈ విరాధుని చేతిలో చిక్కిన సీతను చూస్తుంటే పొంగుకొస్తోంది. ఇది నిజం. నాలో కోపం కట్టలుతెంచుకువస్తోంది. నా సీత!" అంటూ పెద్దగా ఏడుస్తున్న శ్రీరాముని లక్ష్మణుడు చూశాడు. లక్ష్మణునిలో ఆవేశం పెల్లుబికింది. "అన్నా! ఇది ఏంటి? ఎందుకీ దుఃఖం మిమ్ము ముంచెత్తుతోంది? అగ్రజా! కర్తవ్యం ఆలోచించుము; మీరు దేవేంద్రుని మించిన పరాక్రమశాలురు. సమస్త ప్రాణులను రక్షించే ధైర్యం కలవాడివి. మీ సేవకుడిని అయిన నేను మీ ప్రక్కనే ఉన్నాను. ఈ పరితాపం మీకు మంచిది కాదు. కన్నీళ్ళు మీకు అవసరం లేదు. ఇప్పుడే ఒకే ఒక్క బాణంతో ఈ విరాధుని మట్టి కరిపిస్తాను.

"అన్నా! బాధపడకు; ఈ దురాత్ముని రక్తంతో భూమి దాహాన్ని తీర్చుకొంటుంది. ఆనాడు భరతుడు రాజ్యకాంక్షతో వస్తున్నాడనుకొని అజ్ఞానంతో కోపం తెచ్చుకొన్నాను. ఇంద్రుడు పర్వతాన్ని వజ్రాయుధంతో పగులకొట్టినట్లు నేను నా క్రోధావేశాన్ని ఈ పర్వతాకారునిపై కుమ్మరిస్తాను. శ్రీరామా! దుఃఖించకు. నా బాణంతో ఈ దుష్టుని హృదయాన్ని చీల్చివేస్తాను. దానితో వీడి ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోతాయి. ఫలితంగా వీడి శరీరం గిలగిలా కొట్టుకొంటూ మట్టిపై పడుతుంది" అని శ్రీరామునికి లక్ష్మణుడు ధైర్యం కలిగించే మాటలు చెప్పాడు.

* * *

శ్రీరామ విరాధుల వాగ్వివాదం

సర్గ - 3

లక్ష్మణుడు అన్నలో ధైర్యాన్ని మేల్కొలిపాడు. విరాధునివంకతిరిగి "రాక్షసాధమా? నీవెవరు? ఇక్కడ ఎందుకు తిరుగుతున్నావు?" అని ప్రశ్నించాడు. దానికి విరాధుడు కోపంతెచ్చుకొని వనం ప్రతిధ్వనించేటట్లుగా "మీరెవరు? నన్ను ప్రశ్నలు అడిగే మీరు ఎక్కడికి వెళ్తున్నారు?" అని అడిగాడు.

ఆ మాటలకు శ్రీరాముడు "ఓ విరాధ! మేము ఇక్ష్వాకు వంశీయులం. సచ్చరితగలవారం. మేము క్షత్రియులం. ఈ దండకారణ్యాలలోఉన్న నీవెవరో మాకు చెప్పు" అని అడిగాడు. "ఓ రాఘవా! నేను జయుడను రాక్షసుని కుమారుడను. నా తల్లి శతహ్రద. నేను నా తపస్సుతో బ్రహ్మను మెప్పించి వరాలను తీసుకొన్నాను. బ్రహ్మ వర ప్రభావంతో నన్ను ఎవరూ చంపలేరు. నాపైవేసే శస్త్రాలు పనిచేయవు. నా శరీరాన్ని ఎవరూ ఛేదింపలేరు. అందుకనే నేను మీకు చెప్తున్నాను. ఈ అబలను ఇక్కడే వదిలి మీరు మీ కాళ్ళకు బుద్ధి చెప్పండి. ఈమె కావాలని మీరు ఇక్కడే ఉంటే మీ ప్రాణాలు తీసేస్తాను. ఈ నారీమణి నాకు దక్కితే నేను మీ జోలికి రాను. నా మనస్సు మారకముందే మీ పిక్కబలం కొద్దీ పారిపోండి" అని చెప్పుతూ విరాధుడు రామలక్ష్మణులను భయపెట్టాలని చూశాడు.

ఆ మాటలకు శ్రీరాముడు మండిపడ్డాడు. కనులెర్ర చేసి "ఓ పాపాత్ముడా! క్షుద్రుడా! సద్వంశ స్త్రీని కోరుకోవడం నీ హీన చరిత్రను తెలుపుతోంది. నీ చావును నీవు కొనితెచ్చుకొంటున్నావు. ఇక నా చేతిలో నీవు తప్పించుకోలేవు" అంటూ శ్రీరాముడు చాలా కోపంగా ఆ విరాధునిపై శరప్రయోగం చేశాడు. అగ్నితుల్యమైన ఏడు బాణాలు నెమలి ఈకలు చుట్టుకొన్న విరాధుని శరీరాన్ని చీల్చి రక్తసిక్తం చేసి, నేలపై పడిపోయాయి.

దాంతో సీతాదేవిని విడిచివేసి వేగంగా రామలక్ష్మణులపైకి విరాధుడు ఉరికాడు. దిక్కులు పిక్కటిల్లేటట్లు గట్టిగా అరిచాడు. వజ్రాయుధాన్ని పోలిన మహోన్నతమైన శూలాన్ని పట్టుకొని నోరంతా తెరచి భయంకరంగా అరుస్తూ వారిపైకి విరాధుడు పరుగెత్తాడు.

మృత్యుదేవతలాగా ఉండే విరాధునిపైకి రామలక్ష్మణులు నిప్పులు చెరిగే బాణవర్షాన్ని కురిపించారు. వాటిని చూసి విరాధుడు గట్టిగా ఆవలించి వికటాట్టహాసం చేశాడు. దాంతో సోదరద్వయంవేసిన బాణాలన్నీ విరాధుని శరీరంనుండి నేలపై పడిపోయాయి. బ్రహ్మవరం ఆ విరాధుని కాపాడింది. రామలక్ష్మణుల బాణాలు ఆ రాక్షసుని ఏమీ చేయలేకపోయాయి. వాడు శూలంతో ముందుకు పరుగెత్తాడు. దాన్ని చూసి శ్రీరాముడు తన బాణాన్ని ఎక్కుపెట్టి వదిలాడు. ఆ ధాటికి విరాధుని శూలం రెండు ముక్కలైంది. వజ్రాయుధంతో ఛేదించబడిన మేరు పర్వతం లాగా విరాధుని చేతిలోని శూలం రెండు ముక్కలై నేలపై పడిపోయింది.

ఖడ్గాలను ధరించి రామలక్ష్మణులు విరాధునిపై పడి బలంకొద్దీ కొట్టారు. ఆ ఖడ్గ దెబ్బలకు విరాధుడు కుపితుడయ్యాడు. దగ్గరగా ఉన్న రామలక్ష్మణులను తన బాహువులలో ఇరికించితీసుకొని పోవాలనుకొన్నాడు.

దాన్ని గమనించిన శ్రీరాముడు 'లక్ష్మణా! వీడు మనలను ఎత్తుకొని పోవాలని చూస్తున్నాడు. అలాగే పోనివ్వు. ఎలా అయినా ఈ మార్గాన్నే మనం ముందుకు పోవడానికి ఎంచుకోవాలి. అందుకని వీడిని నిరోధించకు' అని చెప్పాడు.

బలశాలైన విరాధుడు రామలక్ష్మణులను తన భుజాలపై ఎక్కించుకొన్నాడు. గట్టిగా పెడబొబ్బలు పెడుతూ అడవిలోకి వెళ్ళాడు. వారిద్దరిని మోస్తూ విరాధుడు దట్టంగా ఉన్న ప్రదేశానికి చేరాడు. అక్కడ చిత్ర విచిత్రమైన పక్షులు గుంపులు గుంపులుగా ఉన్నాయి. నక్కలు, పెద్దపులులు, ఏనుగులు, మృగాలు అక్కడ నిర్భయంగా తిరుగుతున్నాయి.

* * *

విరాధుని శాపవిముక్తి

సర్గ - 4

మహాపరాక్రమవంతులైన రామలక్ష్మణులను విరాధుడు తీసుకొనిపోవడం చూచి సీత బిగ్గరగా ఏడ్చింది. చేతులు ఎత్తి పెద్దగా రోదిస్తూ "ఓ రాక్షసా! వారితోపాటు నన్ను తీసుకొని వెళ్ళు" అని అరిచింది. వ్యాకులం చెందే సీతను చూచి రామలక్ష్మణులు దుఃఖించారు. త్వరగా ఈ రక్కసుని మట్టుపెట్టాలనుకొన్నారు. శ్రీరాముడు విరాధుని కుడిభుజాన్ని బలవంతంగా విరిచేశాడు. లక్ష్మణుడు ఎడమ భుజాన్ని నరికేశాడు.

బాహువులు తెగిన ఆ రాక్షసుడు విరిగిపడిపోయిన పర్వతంలాగా నేలమీద పడి మూర్ఛపోయాడు. వెంటనే రామలక్ష్మణులు కిందికి దిగి వాణ్ణి పిడికిళ్ళతో, బాహువులతో పాదాలతో కుమ్ముతూ పైకి కిందికి కుదిస్తూ పడవేసి ముద్దచేశారు. బాగా దెబ్బలుతగిలి మూర్ఛితుడు అవుతూకూడా రక్కసుడు తన ప్రాణాలను వదలలేదు. తన బలాన్నంతా రామలక్ష్మణులు తీసివేస్తున్నా తిరిగి ఆ రాక్షసుడు మరల మరల పైకి లేస్తూనే ఉన్నాడు. బాణాల తాకిడి, ఖడ్గ ప్రహారాలు అతడిని ఏమీ చేయలేకపోతున్నాయి.

ఇదంతా అనుభవశాలి ఐన శ్రీరాముడు చూశాడు. ఎన్ని చేసినా చావని రాక్షసుని గురించి ఆలోచించాడు. ఓ "లక్ష్మణా! వీడు బ్రహ్మవరప్రభావి. అందుకే మన చేతులలో నిస్తేజుడు అయినా తిరిగి బలం పుంజుకొంటున్నాడు. అందువలన ఈ రాక్షసుని నేను నా పాదం కింద అణచివేస్తాను. నీవు పెద్దగొయ్యి తవ్వు. అందులో వీణ్ణి పాతిపెట్టి వీడిపీడను దూరం చేసుకొందాం" అని చెప్పాడు.

అలా చెప్తూనే శ్రీరాముడు తన పాదాన్ని విరాధుని కంఠం మీద పెట్టబోయాడు. అంతలో 'ఓ శ్రీరామా! నన్ను కరుణించు. నా అజ్ఞానంతో మీరెవరో నేను ముందుగా తెలుసుకోలేకపోయాను. దేవేంద్రునితో సమానమైన

బలం ఉన్న మీరు నన్ను ఎప్పుడో హరించి వేశారు. శ్రీరామా! మీరు కౌసల్యానందనులని ఇప్పుడే నేను తెలుసుకొన్నాను. యశశ్శాలి ఐన లక్ష్మణా! నాపై దయచూపుము. మహాభాగ్యశాలి ఐన సీతను నేను గుర్తించాను.

"శ్రీరామా! నా కథను ఆలకించుము. నేను తుంబురుడను గంధర్వుడను. కుబేరుని శాపంవలన నాకీ విరాధ శరీరం వచ్చింది. నేను ఇంద్రియలౌల్యంతో రంభపై ఆసక్తిని పెంచుకొన్నాను. రంభతో కాలం గడుపుతూ నా కర్తవ్యాన్ని విస్మరించాను. కుబేరుని సేవించే పనిని నేను మరిచాను. దానితో కుబేరునికి నాపై ఆగ్రహం కలిగింది. కుబేరుడు నరమాంస భక్షణతో దండకారణ్యంలో నివసించాలని నన్ను శపించాడు. నా తప్పును తెలుసుకొన్న నేను కుబేరుని క్షమించమని వేడుకొన్నాను. పశ్చాత్తప్త హృదయంతో కుబేరుని నేను శరణు వేడాను. దానికి ఆయన అనుగ్రహించి శాపవిముక్తిని తెలిపాడు. దశరథ నందనుడైన శ్రీరాముడు నిన్ను యుద్ధంలో ఎప్పుడు సంహరిస్తాడో ఆనాడు నీకు శాప విముక్తి కలుగుతుంద'ని చెప్పాడు. ఆనాటినుంచి నేను విరాధుడినై ఈ అరణ్యంలో నరమాంసాన్ని తింటూ కాలం గడుపుతున్నాను."

"ఈనాటికి నాకు శాపవిముక్తి కలిగే అదృష్టం వచ్చింది. నేను మిమ్ము చూడగలిగాను. నేనెంతో భాగ్యశాలిని. ఓ రామా! నన్ను మీరు అనుకొన్నట్లుగానే రాక్షసుల ధర్మంగా గోతిలో పాతిపెట్టండి. మీ అనుగ్రహవీక్షణంతో నేను నా నిజరూపాన్ని పొంది స్వస్థలానికి వెళ్తాను. శత్రు సంహారకులైన రామలక్ష్మణులారా! మీకు యశస్సు కీర్తిప్రతిష్ఠలు కలుగుతాయి" అని పూర్వగాథను విరాధుడు రామలక్ష్మణులకు చెప్పాడు. మహాసాధ్వి అయిన సీతను నేను మీకు ఆగ్రహం కలిగించేలా పట్టుకొన్నాను. నన్ను క్షమించండి" అని విరాధుడు చెప్పాడు.

అన్న ఆజ్ఞానుసారం లక్ష్మణుడు ఏనుగులకోసం తవ్వే గొయ్యిలాంటి పెద్ద గొయ్యిని తీశాడు. శ్రీరాముడు తన పాదం కింద విరాధుని పడవేయాలని చూశాడు. 'శ్రీరామా! మరొక విషయం. మీవల్ల నేను శాపవిమోచనం పొందాను. రామలక్ష్మణులారా! సూర్యసమానుడైన శరభంగ మహర్షి ఆశ్రమం ఇక్కడికి ఒకటిన్నర యోజనాల దూరంలో ఉంది. ఆ శరభంగుడు ధర్మమూర్తి ప్రతాపవంతుడు. మీకు శ్రేయస్సును కలిగిస్తాడు. నన్ను పాతిపెట్టిన తర్వాత మీరు ఆయనను దర్శించండి. మీ మనోభీష్టాలు నెరవేరుతాయి' అని విరాధుడు చెప్పాడు.

ఆ మాటలను రామలక్ష్మణులు విన్నారు. పర్వతాకారంతో ఉన్న మహాబలశాలి ఐన విరాధుని రామలక్ష్మణులు ఆ గోతిలోకి విసిరివేశారు. భయంకరంగా అరణ్యమంతా దద్దరిల్లేటట్లు విరాధుడు అరిచాడు. పెద్దగా అరుస్తున్న ఆ విరాధుని శరీరాన్ని బలవంతంగా గోతిలోనికి నెట్టి రాళ్ళతో మట్టితో కప్పేశారు. ఆయుధాలతో వధింపశక్యం కాని విరాధుని గోతిలో పాతి పెట్టి స్వర్గానికి పంపించారు.

విరాధుడు తాను కోరుకొన్న రీతిలోనే సంతోషంగా నిజవాసానికి చేరాడు. విరాధుని పీడను దూరం చేసుకొన్న రామలక్ష్మణులు సంతోషంగా సీతను చేరారు. ఆ ముగ్గురు కలిసి ఆనందంగా ఆ అరణ్యంలో ముందుకు సాగారు.

* * *

శరభంగాశ్రమం

సర్గ - 5

విరాధుని స్వర్గానికి పంపివేసి భయపడుతున్న సీతను అక్కున చేర్చుకొని శ్రీరాముడు ఆమెను ఊరడించాడు. వారు ముగ్గురూ సంతోషంగా ముందుకు సాగారు. "ఓ లక్ష్మణా! మనం ఈ వనవాసానికి అలవాటులేని వాళ్ళం కదా. అందువల్ల ఈ అరణ్యంలో నడవడం కష్టంగావుంది. అసలే ఈ దండకారణ్యం ఇక్కట్ల నిలయంగా ఉంది. మనం త్వరత్వరగా శరభంగుని ఆశ్రమానికి వెళ్దాం" అని శ్రీరాముడు చెప్పాడు.

అన్న ఇష్టప్రకారం లక్ష్మణుడు గబగబా అడుగులు వేశాడు. ఆయనను అనుసరిస్తూ సీతారాములు వెళ్ళారు. కొద్దిదూరం నడిచినవారికి తన తపశ్శక్తితో దైవత్వాన్ని పొందిన శరభంగుని ఆశ్రమం కనిపించింది. దివ్య తేజోవిరాజమానుడైన శరభంగుని ఆశ్రమం వినిర్మలంగా ఉంది. ఆ ప్రశాంత వాతావరణాన్ని రామలక్ష్మణులు చూస్తున్నారు. అంతలో వారికి అద్భుతఆశ్చర్యకరవిషయం వారి కన్నులకు కనిపించింది.

అగ్నివంటి తేజస్సుతో ఒక దివ్య పురుషుడు సూర్యభగవానునిలా రథంపై కనిపించాడు. ఆయన రథం దిగి భూమికి పాదాలను చేర్చకుండానే ముందుకు అలా సాగిపోతున్నాడు. ఆయన వెనుకనే దేవతలందరూ వెళ్తున్నారు. ఆ దృశ్యాన్ని అబ్బురంగా సీతారామలక్ష్మణులు చూశారు. ఆ దివ్య పురుషుడు ఎవరో చూద్దామని శ్రీరాముడు ఆయనను కొద్దిదూరం అనుసరించి వెళ్ళాడు. ఆయన ఇంద్రుడన్న విషయం శ్రీరామునికి తెలిసింది. దేవేంద్రుని రథానికి ఆకుపచ్చని గుర్రాలుండడం చూశాడు. తెల్లని మేఘంవలె చంద్రుని కాంతి వంటి కాంతితో అలరారే ఆ దేవతారాజును బంగారు దండాలున్న చిత్రవిచిత్రపుష్పమాలికతో అలంకరించి ఉన్న వింజామరలతో దివ్యాంగనలిద్దరూ ఆయనకు విసురుతున్నారు. వింతకాంతులీనే ఆభరణాలను అనిమిషపతి ధరించాడు. ఆయనను గంధర్వులు, దేవతలు, సిద్ధులు ఎంతోమంది స్తుతిస్తున్నారు.

ఆ సహస్రాక్షుడు శరభంగుని దగ్గరకు వెళ్ళి మాట్లాడడం శ్రీరాముడు చూశాడు. 'లక్ష్మణా! ఆ ఆశ్చర్యకరమైన ఆ దివ్యరథాన్ని చూడు. దానికాంతులు మిరుమిట్లు గొల్పుతున్నాయి. యజ్ఞాలలో ఆహ్వానించే ఆ దేవేంద్రుని గురించి మనం విన్నాం కదా. ఆ దేవేంద్రుని రథం ఇదే. అవే ఈ దివ్యాశ్వాలు. ఇందులో ఏ మాత్రం సందేహం లేదు. మనం విని తెలుసుకొనే ఆ దేవతారాజు రథం ఇదే. ఆ రథం చుట్టూ మకర కుండలాలు ధరించి ఖడ్గ హస్తులైన యువకులు నిలబడి ఉన్నారు. వారు విశాలవక్షస్థలంతో బాహువులతో విరాజిల్లుతున్నారు. వారు ధరించిన దివ్యాభరణాలు, రక్తవర్ణ వస్త్రాలు వారి అందాన్ని ద్విగుణీకృతం చేస్తున్నాయి. వారందరూ యువకిశోరాల్లా ఉన్నారు. అమృతత్వాన్ని సిద్ధించుకొన్నవారందరూ ఎప్పటికీ నవయౌవనంతో ఉంటారని మనం విని ఉన్నాం కదా. వారిని వార్ధక్యం బాధించదు. అందుకే వారు దివ్య తేజోసంపన్నులుగా కనిపిస్తున్నారు."

"సౌమిత్రీ! ఈ రథంలోని కాంతిమంతుడు ఎవరో స్పష్టంగా కనుక్కొని వస్తాను. నీవు ఇక్కడే ఉండు. ఈ వైదేహిని సంరక్షిస్తూ ఇక్కడే ఉండు" అంటూ శ్రీరాముడు శరభంగాశ్రమం వైపు వడివడిగా నడిచాడు. అలా

వస్తోన్న శ్రీరాముని దేవేంద్రుడు చూశాడు. వెంటనే పక్కనఉన్న దేవతలతో సురపతి 'ఆ రాముడు ఇటే వస్తున్నాడు. రాముడు చేయవలసిన కార్యం పూర్తి అయిన తర్వాతనే నేను ఆయనకు కనిపించాలి. దేవతలు సైతం చేయలేని కార్యాన్ని రాముడు చేయవలసి ఉంది. మీరందరు ఆయనకు జయంకలిగేలా చూడండి. అతడు విజయుడైన తర్వాతనే నేను రాముడిని చూస్తాను' అంటూ సర్వదేవతారాధకుడైన సురరాజు శరభంగునికి నమస్కరించి ఆయన అనుజ్ఞను తీసకొని అక్కడినుంచి రాముడు రాకముందే తన దివ్యరథంలో వెళ్ళిపోయాడు.

వెళ్ళిపోయిన దేవేంద్రుని రాముడు చూశాడు. సీతాలక్ష్మణులతో కలిసి రాముడు శరభంగుని దగ్గరకు వెళ్ళాడు. పాదాభివందనం చేశాడు. ఆ మహర్షి ఆనందంగా వీరికి అర్ఘ్యపాద్యాలు ఇచ్చి సత్కరించాడు.

సీతారామ లక్ష్మణులు ఆ మహర్షి దగ్గర కూర్చున్నారు. మహర్షి వారి యోగక్షేమాలను విచారించాడు. దేవేంద్రుడు మీ దగ్గరకు ఎందుకు వచ్చాడో చెప్పమని శ్రీరాముడు శరభంగుని అడిగాడు. దానికి ఆ మహర్షి చిరునవ్వు నవ్వి 'తండ్రీ! శ్రీరామా! నేను నియమ నిష్ఠలతో తపస్సు ఆచరించాను. నా తపస్సుకు మెచ్చి బ్రహ్మ పుణ్యలోకాలను ప్రసాదించాడు. ఈ రోజు దేవేంద్రుడు తనతో కూడా నన్ను సత్యలోకానికి తీసుకొని వెళ్ళడానికి ఇక్కడకు వచ్చాడు. కాని నేను నీవు నా దగ్గరకు వస్తున్నావని తెలుసుకొన్నాను. నరశ్రేష్ఠా! పుణ్యపురుషుడివైన నిన్ను చూడాలని అనుకొన్నాను. అందుకే నిన్ను చూడకుండా నీతో మాట్లాడకుండా నేను అత్యుత్తమమైన సత్యలోకానికి రాలేనని చెప్పి దేవేంద్రుని పంపివేశాను. ఇప్పుడు ధర్మాత్ముడివైన నీవు నాకు కనిపించావు. నా మనస్సు సంతోషంతో నిండిపోయింది. ఈనాడు నాకు ఏ కోరికలు లేవు. అందుకే నేను నా తపఃఫలంగా సాధించిన పుణ్యరాశిని నీకు ఇస్తాను తీసుకో' అని శరభంగుడు శ్రీరామునకు చెప్పాడు.

'మహర్షీ! మీ మాటలు నాకు చాలా ఆనందాన్ని ఇస్తున్నాయి. కాని ఆ పుణ్యరాశిని నేను సంపాదిస్తాను. మహర్షీ! నాపై దయతో మీరు ఈ అరణ్యంలో మాకు నివాస యోగ్యమైన ప్రదేశాన్ని చూపండి' అని అడిగాడు. శరభంగుడు 'ఓ పుణ్యపురుషా! ఈ అరణ్యంలోనే సుతీక్షణుడనే గొప్ప తపస్వి ఉన్నాడు. అతడు ధార్మికుడు తపః శక్తి సంపన్నుడు. ఆయన మీకు మంచి నివాసయోగ్యమైన ప్రదేశాన్ని చూపిస్తాడు. మీరు పశ్చిమంగా వెళ్ళండి. మీకు సుతీక్షణుని ఆశ్రమం కనిపిస్తుంది అని చెప్పాడు.

కానీ, ఒక్క క్షణం ఆగండి. నేను నీ దర్శనం చేసుకొని తృప్తి పొందాను. పాము కుబుసం విడిచినట్లుగా ఈ శరీరాన్ని ఇక నేను త్యజిస్తాను. నేను అగ్నిలో ప్రవేశించి నా శరీరాన్ని దగ్ధం చేసుకొన్న తర్వాత మీరు ఇక్కడనుంచి వెళ్ళండి' – అంటూ శరభంగుడు అగ్నిని జ్వలింపజేశాడు. శాస్త్రోక్తంగా మంత్రాలు పఠించాడు. అగ్నిదేవునికి ఆజ్యం పోసి తృప్తి కలిగించి తాను ఆ అగ్నిలో ప్రవేశించాడు.

అగ్నిదేవుడు శరభంగుని కేశాలను శరీరాన్ని తనలో లీనం చేసుకొన్నాడు. మాంసాన్ని ఎముకలను భక్షించి వేశాడు. శరభంగుడు పదునైదు ఏండ్ల బాలునిగా కౌమారాన్ని పొందాడు. మహాత్ముడై దేవతల లోకాన్ని దాటుకుంటూ సత్యలోకాన్ని చేరుకొన్నాడు. పుణ్యాత్ముడైన శరభంగుని చతుర్ముఖుడు ఆనందంగా చూసి సంతోషంగా 'ఓ మహామునీ! శుభస్వాగతం' అంటూ స్వాగతించాడు.

* * *

మునుల ప్రార్థన - శ్రీరాముని అభయం

సర్గ - 6

శరభంగుడు స్వర్గానికి చేరాడు. ఆ తర్వాత ఆ ఆశ్రమంలోని మునులందరూ పరాక్రమశాలైన శ్రీరాముని దగ్గరకు వచ్చారు. వారందరూ వానప్రస్థానంలో ఉన్నవారు. కొందరు ఆకులను మాత్రమే భుజించేవారున్నారు. ఇంకొందరు జలాన్నే స్వీకరించేవారున్నారు. మరికొందరు ధాన్యాన్ని రాళ్లతో మాత్రమే నలిపి ఆహారంగా చేసుకున్న వారున్నారు. చంద్రకిరణాలనే ఆహారంగా తీసుకునేవారున్నారు. ఇలా ప్రజాపతి నఖములనుంచి పుట్టిన వైఖానసులు, ప్రజాపతి రోమములనుంచి పుట్టిన వాలఖిల్యులు, ప్రజాపతి పాదప్రక్షాళనము వల్ల పుట్టిన సంప్రక్షాలులు, ఇలా ఎందరో అక్కడ మహర్షిపుంగవులున్నారు. వారిలో నీళ్ళపై తపస్సు చేసేవారు, ఆకాసాన్ని తపోభూమిగా చేసుకున్నవారు, కాళ్ళు చేతులనే శయ్యగా మార్చుకుని శయనించేవారు. అసలు పడక లేనివారు, ఇరుకు ప్రదేశాలలో తపస్సు ఆచరించేవారు, తడిబట్టలు కట్టుకునేవారు. పంచాగ్నుల మధ్య తపస్సు చేసేవారు, గాలి మాత్రమేఆహారంగా ఉన్నవారు, ఇలా చాలా రకరకాల తపస్సులను చేసేవారున్నారు. వీరందరూ తపస్సుఅనే సంపదవల్ల సంతృప్తిని పొందినారు. ఇంద్రియ నిగ్రహులు, దివ్య తేజస్సులు ఉన్నవారు. బ్రహ్మవర్చస్సుతో వెలిగేవారు, ధ్యానయోగ తత్పరులు, అష్టాంగయోగసాధకులు, తపశ్చర్యలో సుస్థిర స్థానాన్ని పొందిన యోగి పుంగవులు. వీరందరూ శ్రీరాముని దగ్గరకు వచ్చారు. వారికందరికి సీతారామ లక్ష్మణులు అభివాదం చేశారు. ధర్మస్వరూపుడైన శ్రీరాముణ్ణి వారు ఆనందంగా చూశారు.

"ఇక్ష్వాకు వంశతిలకా! ధనుర్ధారులలో మేటి అయిన శ్రీరామా! నీవు సత్యవంతుడవు. నీ పితృభక్తి, కీర్తి సత్యలోకం దాకా వ్యాపించింది. నీవు మహితాత్ముడవు. ధర్మమెరిగిన వాడివి. అన్నీ తెలిసిన నీకు మేం చెప్పేది ఏదీ లేదు. కానీ మమ్ము రక్షించే నాథుడవు నీవేనని తలచాం. మేము అర్థించటానికి ఆర్తులమై నీ దగ్గరకు వచ్చాం.

రామచంద్రా! కన్నబిడ్డల్లా ప్రజల బాగోగులను చూసే రాజే ధర్మమూర్తి గదా. అలాంటి నరేంద్రునకు ఇహ సుఖాలతో పాటు శాశ్వత కీర్తిప్రతిష్ఠలు అందుతాయి. కర్తవ్యాన్ని నియమ నిష్ఠలతో ఆచరించే రాజు బ్రహ్మ లోకవాసుల చేత కూడా ఆదరించబడతాడు. సాత్వికాహారాన్ని తింటూ తపస్సు చేస్తూ ఉత్తమధర్మకార్యాలను చేసి మునులు పొందే ఫలంలో నాల్గవ వంతు రాజుకు చేరుతుంది.

శ్రీరామా! నేడు నీవే ఈ అరణ్యాధిపతివి. నీవు ఇక్కడ ఉండగానే తపస్సు చేసుకొనే వైఖానస, వాలఖిల్యాది వానప్రస్థులెందరో క్రూరాత్ముల చేతిలో బాధలు పడుతున్నారు. ఆ క్రూర రాక్షసులు పెట్టే బాధలను తాళలేక ఎందరో తపస్సులు మనస్తాపం చెందుతున్నారు.

మేము దిక్కులేనివారిలాగా అయ్యాం. మాలో ఎంతోమంది ఈ రక్కసుల చేతిలో నిహితులు అవుతున్నారు. అనాథ రక్షకా! పంపానదీతీర వాసులను, మందాకినీతీర వాసులను చిత్రకూటంలో నివాసం చేస్తున్న వారినెందరినో

వీరు పొట్టన పెట్టుకొన్నారు. వారి చేతిలో జీవం కోల్పోయి అచేతనులైన ఈ మునుల శరీరాలను చూడు. ఈ భయంకర రాక్షసులు చేసే ఈ ఘోరకృత్యాలను మేము సహించలేకున్నాం.

ఓ రాజకుమారా! మమ్ములను కాపాడే భారం నీదే. నీవే ఈ అకృత్యాల బారినుండి మమ్ము రక్షించాలి. దీనజన బాంధవా! ఈ రాక్షసుల చిత్రహింసలనుండి మమ్ము నీవే కాపాడాలి" అని పలు విధాలుగా శ్రీరాముని ఆ మునులు ప్రార్థించారు.

ధర్మనిరతుడైన శ్రీరాముని మనస్సును తాపసుల మాటలు కలచివేశాయి. దీనులను కాపాడే శ్రీరాముడు మునులకు అభయం ఇచ్చాడు. "ఓ తాపసులారా! తపస్సే సంపదగా ఉన్న మీరు నేటినుండి నిర్భయంగా ఉండండి. మీమీ కార్యాలను నిర్విఘ్నంగా కొనసాగించండి. మీ బాధలను నేను దూరం చేస్తాను. నేను నా తమ్ముడు కలిసి రాక్షసుల ఆటకట్టిస్తాం. తాపసుల ఆజ్ఞను నేను శిరసావహించి మిమ్ము బాధపెట్టే రాక్షసులను యమపురికి పంపిస్తాం. మా తండ్రి ఆనతి ప్రకారం వనవాసానికి వచ్చిన నాకు మీకు సేవచేసే భాగ్యం లభించడం నా అదృష్టంగా భావిస్తాను.

ఓ తపోధనులారా! మీరు నిశ్చింతగా ఉండండి. మీ శత్రువులను నా శత్రువులుగా భావించి వారిని అంతం చేస్తాను. మీ కార్యసిద్ధికి నేను మనస్ఫూర్తిగా తోడ్పడుతాను. మీరు నిశ్చలంగాభగవంతునికోసం ధ్యానం చేయండి. నేను మీ చెంతనే ఉండి మిమ్ములను కాపాడుతాను. మా అన్నదమ్ముల పరాక్రమం మీకు ఆనందాన్నిస్తుంది" అంటూ వీరాధివీరుడైన శ్రీరాముడు మునులకు అభయం ఇచ్చాడు. సీతలక్ష్మణులతో కలిసి శ్రీరాముడు సుతీక్ష్ణాశ్రమానికి బయలుదేరాడు.

* * *

సుతీక్ష్ణుని దర్శనం

సర్గ - 7

మునులకు అభయప్రదానం చేసి రామాదులు సుతీక్ష్ణుని కోసం బయలుదేరారు. వారు చాలా దూరం ప్రయాణం చేశారు. జలనిధులను దాటుతూ ఎత్తుగా ఉన్న ప్రదేశానికి వచ్చారు. అలా వారు ముందుకు సాగుతూ దట్టంగా వృక్షాలున్న ప్రదేశానికి చేరారు. అక్కడి వృక్షాలు ఫల సంపదతో నిండి ఉన్నాయి. ఆ ప్రదేశంలో వారికి ఒక ఆశ్రమం కనిపించింది. దాని దగ్గరగా తాపసులు కట్టుకొనే వస్త్రాలు ఆరవేసి ఉండడాన్ని వారు చూశారు.

అక్కడికి వెళ్ళారు. ధ్యానమగ్నుడైన సుతీక్ష్ణుని చూశారు. ఆయన తపస్సులో మునిగి శరీర శుభ్రతను కూడా మరచిపోయాడు. ఆయన తలమీద జటలు మాసిపోయి ఉన్నాయి. ఆయన దగ్గరకు రామాదులు వెళ్ళి వినయంగా

నమస్కరించారు. 'పూజ్యులైన మహర్షీ! నేను శ్రీరాముడిని, నా భార్య సీత నా తమ్ముడు లక్ష్మణునితో కలిసి మీ దగ్గరకు వచ్చాను. మీరు మహానుభావులు సత్యనిష్ఠాపరులు, మీరు నాతో మాట్లాడండి' అన్న మాటలు విని కనులు తెరిచి ఆ ముని సంతోషంగా రాముణ్ణి కౌగిలించుకొన్నాడు.

"శ్రీరామా! కోదండరామా! నీ రాకతో మా ఆశ్రమం ధన్యమైంది. నీ దర్శనంతో నేను పునీతుడిని అయ్యాను. నేను నీ కోసం వేచి చూస్తున్నాను. నీవు కోసల రాజ్యాన్ని విడిచి చిత్రకూటానికి వచ్చి ఉన్నావని నేను తెలుసుకొన్నాను. నీవు త్వరగా నా దగ్గరకు వస్తావని నాకు తెలిసి నీ కోసమే ఈ దేహాన్ని త్యజించకుండా ఎదురుచూస్తున్నాను.

ఓ శ్రీరామ నూరు యజ్ఞాలు చేసి ఇంద్ర పదవిని చేపట్టిన దేవేంద్రుడు నా దగ్గరకు వచ్చాడు. నేను నా తపః శక్తితో సాధించిన ఉత్తముల లోకాల గురించి చెప్పాడు. అవన్నీ నేను నీకు ఇస్తున్నాను. వాటిలో నీవు సీతాసహితుడివై విహరించు" అని ఇంద్రుడు బ్రహ్మదేవునితో చెప్పినట్లు సత్యనిష్ఠాగరిష్ఠుడైన మహాతపస్వి సుతీక్ష్ణుడు శ్రీరామునికి చెప్పాడు.

'ఓ మహామునీ! నన్ను క్షమించు. నేను ఆ పుణ్యలోకాలన్నీ సాధించుకోగలను. కాని నాకు మీరు ఒక ఉపకారం చేయండి. ఈ వనంలో మేము ఉండదగిన ప్రదేశాన్ని చూపించండి. అక్కడ మేము కుటీరాన్ని నిర్మించుకొని మా వనవాస కాలాన్ని గడుపుతాం. మీరు గొప్ప తేజోవంతులని సర్వప్రాణి హితాన్ని కోరేవారని మీ గురించి గౌతమ వంశుజుడైన శరభంగుని ద్వారా మేం తెలుసుకొన్నాం. మీరు దయచేసి మాకు అనువైన ప్రదేశాన్ని చూపించండి' అని శ్రీరాముడు సుతీక్ష్ణుని అడిగాడు.

శ్రీరాముని మాటలకు సుతీక్ష్ణుడు సంతోషంతో పొంగిపోయాడు. శ్రీరామచంద్రా! ఈ ఆశ్రమం మీరు నివసించడానికి ఎంతో అనుకూలంగా ఉంటుంది. ఇది సర్వసౌఖ్యవంతంగా ఉంది. ఇక్కడి ప్రకృతి ఆహ్లాదకరంగా మనోరంజకంగా ఉంటుంది. కందమూలాలు, ఫలాలు ఇక్కడే పుష్కలంగా దొరుకుతాయి. జలాశయాలు అమృతంలాంటి స్వచ్ఛమైన నీటితో ఉన్నాయి. ఈ ఆశ్రమంలోకి అప్పుడప్పుడు క్రూరమృగాలు, లేళ్ళ గుంపులు వచ్చి వైరభావాన్ని మరచిపోయి హాయిని అనుభవిస్తాయి. ఈ ఆశ్రమంలో క్రూర మృగాల సంచారం తప్ప మరే దోషం నాకు కనిపించలేదు. అందుకే మీరు నిర్భయంగా ఇక్కడ ఉండొచ్చు' అని చెప్పాడు.

'ఓ మహాతపా! నేను ఇక్కడికి వచ్చే క్రూర మృగాలు మీకు కష్టాన్ని కలిగిస్తుంటే చూడలేను. వాటిని నా శరంతో చంపివేస్తాను. ఇలా నేను చేయడం మీకు బాధ కలిగిస్తుందేమో? అందుకే నేను మీ ఆశ్రమంలో ఎక్కువకాలం ఉండలేను' అని శ్రీరాముడు చెప్పాడు. దానికి ఆ మహర్షి సమ్మతించాడు. సాయం సంధ్యావందనాన్ని ఆచరించడానికి రామాదులు సరస్సు దగ్గరకు వెళ్ళారు. సాయం సంధ్యోపాసనాన్ని ముగించుకొని వచ్చిన రామాదులకు సుతీక్ష్ణుడు చక్కని కందమూలాలు మధుర ఫలాలు పెట్టాడు. వారిని సంతుష్టులను చేశాడు.

* * *

దండకారణ్యంలోని మునుల ఆశ్రమాలు

సర్గ - 8

సుతీక్ష్ణుని ఆదర సత్కారాలు అందుకొని రాత్రి సీతారామలక్ష్మణులు హాయిగా గడిపారు. ప్రాతఃకాలాననే లేచి నిత్యకృత్యాలు ఆచరించారు. ఆ తపోభూమిలోనే హోమ కార్యాలు, దేవతారాధన చేశారు. సుతీక్షణుని దగ్గరకు వెళ్ళారు. 'మహామునీ! మీరు చక్కని ఆతిథ్యం ఇచ్చారు. మేము ఎంతో సంతోషించాం. కాని మాతో ఉన్న ఈ మౌనివర్యులు త్వరపడుతున్నారు. మాకు ఈ అరణ్యంలో ఉన్న మునుల ఆశ్రమాలన్నింటిని చూడాలని కుతూహలంగా ఉంది. మేమందరం తాపసులను దర్శించడానికి మీ అనుమతిని కోరుతున్నాం. మాకు సెలవు ఇవ్వండి' అని శ్రీరాముడు అడిగాడు.

'నడమంత్రపు సిరికి మిడిసిపడే వారిలాగా సూర్యుడు తన కిరణాల తాపాన్ని ప్రజ్వలింపజేస్తున్నాడు. ఆ ఉదయభానుడు మధ్యాహ్న మార్తాండునిగా మారకముందే మేం బయలుదేరుదాం అని అనుకొంటున్నాం. ఆ సూర్యుని వేడిని మేం భరించలేకున్నాం' అని చెప్పి రామాదులు సుతీక్ష్ణునికి ప్రదక్షిణ నమస్కారాలు చేశారు. వారిని లేవనెత్తి గట్టిగా హృదయానికి హత్తుకొని ఆప్యాయంగా వారితో ఇలా చెప్పాడు.

"శ్రీరామా! నీడలా వెన్నంటి వచ్చే సోదరునితోను మహాసాధ్వి ఐన నీ ఇల్లాలితో కూడి నీవు ఈ సుందరమైన ఆశ్రమాలన్నింటిని చూడు. రామా! వీరందరూ నిర్మల అంతఃకరణలు ఉన్నవారు. తపస్సే సంపదగా ఉన్న మహానుభావులు. ఈ మునీశ్వరులను దర్శించి వారి ఆశీర్వాదాలను తీసుకోండి."

"నాయనా తండ్రీ! ఈ అరణ్యంలో కందమూలాలు కోకొల్లలుగా దొరుకుతాయి. మధుర ఫలాలు వృక్షాల నిండుగా ఉన్నాయి. పక్షులు గుంపులు గుంపులుగా ఎగురుతూ మనోల్లాసాన్ని కలిగిస్తాయి. ఇక్కడి జలనిధులు కలువలతో చూడచక్కని తామరలతో వాటిపై ఝుమ్మని వాలే తుమ్మెదలతో కన్నుల పండుగ చేస్తాయి. పురివిప్పి ఆడే నెమళ్ళు, మధురమైన గానాన్ని వినిపించే కోయిలలు, క్రౌంచ పక్షులు, చిత్ర విచిత్ర ఆకారాలున్న పక్షులు మనస్సును రంజింపచేస్తాయి. నాయనలారా! మీ ప్రయాణం క్షేమంగా సాగుతుంది. మరల ఈ ఆశ్రమానికి రండి" అంటూ సుతీక్షణుడు రామాదులకు వీడ్కోలు ఇచ్చాడు. సీతాదేవి రామలక్ష్మణులకు ధనుస్సులను అమ్ముల పొదులను తెచ్చి ఇచ్చింది. వారు మహర్షికి నమస్కరించి ధనుస్సులను చేత బట్టుకొని సీతతో కలిసి రామలక్ష్మణులు ఆశ్రమం వెలుపలకి వచ్చారు.

* * *

సీత యుక్తాయుక్తముల విచక్షణ

సర్గ - 9

సీతారామలక్ష్మణులు అడవిలో సంచరిస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు. రాముడు చేసిన అభయ ప్రదానం సీత మనస్సులో మెదిలింది. తనకు అపకారమేమి చేయని రాక్షసులను అంతం చేస్తానని రాముడు చెప్పటంలోని ఔచిత్యాన్ని గూర్చి సీత ఆలోచిస్తోంది. దాన్ని తెలుసుకోవాలని సీత అనుకొంది. 'నాథా... శ్రీరామా! మునిధర్మం చాలా కష్టమైనది. సూక్ష్మంగా సున్నితంగా ఉంటుంది గదా. ధర్మసూక్ష్మాన్ని తెలుసుకోవడం చాలా కష్టమనిపిస్తోంది. కోరికలు లేనివారు మాత్రమే ఈ ధర్మాన్ని ఆచరించగలరు అని నాకు అనిపిస్తోంది.

పురుషశ్రేష్ఠా!వ్యసనాలలో మూడు వ్యసనాలు ముఖ్యమైనవి అని నేను అనుకొంటాను. వాటిలో మొదటిది అబద్ధం చెప్పడం, రెండోది పర స్త్రీ వ్యామోహం. శ్రీరామచంద్రా! ఈ రెండు వ్యసనాలు మీ దరిదాపులలోకి రావు. మీరు ఇంతకుముందు గాని తర్వాతగాని అబద్ధాలాడాల్సిన అవసరం రాదని నేను భావిస్తున్నాను. మీరు దీక్షాబద్ధులు అందువల్ల పరస్త్రీల మీద మీకు కలలో కూడా వ్యామోహం కలిగే అవకాశం లేదు. కాని మూడో ముఖ్యమైన వ్యసనం ప్రాణిహింస. మీరు జితేంద్రియులని నాకు తెలుసు. కనుకనే మీరు సత్యనిష్ఠతో ఉన్నారు. ధర్మమెరిగిన వారు కాబట్టి మీరు తప్పులు చేసే అవకాశం తక్కువ. కాని నా మనస్సును కలవరపెట్టే విషయం ప్రాణిహింస. ఇది ఇంతకుముందు మీకు లేకపోయినప్పటికీ ఇప్పుడు మిమ్ము ఆవహిస్తోందేమోనని నాకు అనిపిస్తోంది.

అకారణంగా మానవులు ఇతర ప్రాణులను హింసిస్తారు. నేడు మీరు వ్రతదీక్షను పూని ఉన్నారు. తాపసాశ్రమంలో మునులను రక్షిస్తానని వారికి అభయం ఇచ్చారు. ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకొనే సద్వంశంలో జన్మించిన రఘుకుల నందనా! నా మనస్సు ఈ విషయానికే వ్యాకులం చెందుతోంది. మనకేమీ అపకారం చేయని రాక్షసులను సంహరిస్తానని చెప్పటం అనుచితం కాదా?" అని అమాయకంగా మృదుస్వభావి అయిన సీత శ్రీరాముని అడిగింది.

వీరాధివీరా! మనం దండకారణ్యాలకు పయనించడం నాకు ప్రీతి కలిగించడంలేదు. మీరు లక్ష్మణునితో కూడి ధనుర్బాణాలను చేబూని అక్కడ కనిపించే క్రూరమృగాలను రాక్షసులను తునుమాడుతారు గదా సమిధలు దగ్గర ఉండడంవల్ల అగ్నితేజోబలాలు వృద్ధి అయినట్లు ధనుర్బాణాలు చేతిలో ఉంటే క్షత్రియుని శౌర్య పరాక్రమాలు అధికం అవుతాయి కదా అని అడిగింది.

శ్రీరామా! నాకు తెలిసిన దానిని మీకు చెప్తాను వినండి. ఒక వనంలో మహాతపస్వి ఐన ఒక ఋషీశ్వరుడు ఉండేవాడు. ఆయన ఎల్లవేళలా తపస్సులో లీనమై ఉండేవాడు. సత్యనిష్ఠుడు. ఆయనకు తపోభంగం చేయాలని దేవతారాజు తలిచాడు. ఆ మౌని దగ్గరకు ఇంద్రుడు ఓ భటుని రూపం ధరించి వచ్చాడు. ఆ భటుని చేతిలో ఖడ్గం ఉండేది. ఒకరోజు ఆ భటుడు ఆ ఖడ్గాన్ని ముని దగ్గర పెట్టి జాగ్రత్త చేయమని నేను మళ్ళీ వస్తానని చెప్పి వెళ్ళాడు.

ఖడ్గరక్షణభారం నాదే అనుకొని ఆ తాపసి కందమూలాలు తెచ్చుకొనేటప్పుడు, స్నానాదికాలు చేసేటప్పుడు ఆ ఖడ్గాన్ని తన దగ్గరే పెట్టుకొనేవాడు. ఆ తపోధనుడు ఖడ్గాన్ని రక్షించాలనే ఉద్దేశంతో దాన్ని చేతిలో పట్టుకొని ఉంటూ తన తపస్సును నిర్లక్ష్యం చేశాడు. క్రమక్రమంగా తపస్సును మరచిపోయి హింసాత్మక ఖడ్గానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవాడు. ఇలా అతని బుద్ధి పెడదోవ పట్టింది. అహింసామూర్తి ఐన ఆ తాపసి హింసామూర్తిగా మారాడు. దానితో స్వర్గలోకాలకు వెళ్ళాల్సిన ఆ తపస్వి నరకలోకాలకు వెళ్ళాడు. ఖడ్గ సంపర్కంవల్ల ధూర్తుడయ్యాడు. అందువలనే దుష్టులకు దూరంగా ఉండమని పెద్దలు చెప్తారు.

అగ్నివలన వస్తువు రూపాదులలో మార్పు వచ్చినట్లుగానే శస్త్రం ధరించిన మనిషి బుద్ధికి మార్పు చేర్పులు కలుగుతాయనడంలో ఆశ్చర్యం లేదు కదా! మీపై ఉన్న అనురాగం గౌరవం కారణంగా నేను మీకు ఇది చెప్పాను. మీరు అన్యథా భావించకండి. నేను మీకు హితబోధ చేశానని తలచకండి" అని సీత వినయంగా తనకు తెలిసిన దానిని వారితో చెప్పింది.

"శ్రీరామా! మీరు ధనుర్ధారులై ఇక్కడ సంచరిస్తూ రాక్షసులను సంహరిస్తాననడం నాకు ఉచితంగా అనిపించడం లేదు. ఓ వీరా! నిరపరాధులైన వారిని శిక్షించడం అపరాధమే కదా! తాపసులు రాక్షసులవలన భయపడుతుంటే వారిని రక్షించే భారం ధనుస్సు చేపట్టిన రాజుది అవుతుంది. ఇది నిజమే. కాని, మనం వనవాసులం వనవాసమెక్కడ? శస్త్రధారణ ఎక్కడ? మనం తాపసుల మార్గంలో నడిచేవాళ్ళం. క్షత్రియ ధర్మం తాపసుల మార్గం పరస్పర వైరుధ్యం కదా! వనవాసులమైన మనం తపోవృత్తినే ఆచరించాలి. అదే మన ధర్మం.

ఓ శ్రీరామా! ఇప్పుడు శస్త్రధారణ మీకు అవసరంలేదు. వాటివల్ల మన బుద్ధి మార్పు చెందే అవకాశం ఉంటుంది. మనం అయోధ్యకు వెళ్ళిన తర్వాత తిరిగి రాజ్యాన్ని చేపట్టినప్పుడు ధనుర్బాణాలు గ్రహించడం మంచిది. అప్పుడు క్షత్రియ ధర్మాన్ని అనుసరించి మా అత్తమామలకు ప్రీతి కలిగించవచ్చు.

సర్వజగత్తు ధర్మం మీద ఆధారపడి ఉంది. ధర్మాచరణంవల్ల సంపదలు, సుఖశాంతులు, జ్ఞానం వస్తుంది. తద్వారా ముక్తి లభిస్తుంది. చాంద్రాయణాది వ్రతాదుల ఆచరణ ద్వారా మనిషి ముక్తిని పొందవచ్చు. కాని, కేవలం మనిషి తన శరీరపోషణద్వారా ముక్తిని జ్ఞానాన్ని పొందలేడు.

ఓ శ్రీరామా! నేను మీపై నాకున్న అనురాగంతో చెప్తున్నాను. మీరు నిర్మల చిత్తంతో తాపస ధర్మాన్నే అనుష్ఠించండి. పురుషార్థాలన్నీ మీకు తెలుసు. ధర్మమెరిగిన మీకు ధర్మసూక్ష్మాల గురించి ఎవరు చెప్పగలరు?

లక్ష్మణసహితులైన మీరు బాగా ఆలోచించి ఏది ధర్మమని మీరు ఆలోచిస్తారో దానిని మీరు చేయండి" అని సీత రామునితో చెప్పింది.

* * *

ప్రతిజ్ఞాపాలనత్వం

సర్గ - 10

సీతాదేవి మాటలకు శ్రీరాముడు సంతోషించాడు. 'ఓ దేవీ! నీవు గొప్ప వంశంలో జన్మించావు. ధర్మాలన్నీ తెలుసుకొన్నావు. నాపై గాఢానురాగాన్ని పెంచుకొన్నావు. అందుకే నీ మనస్సు వ్యాకులం చెందుతోంది. క్షత్రియులున్న చోట అధర్మానికి చోటుండకూడదని నీకు తెలుసు కదా! అంతేగాదు వీరులున్న చోట బలహీనుల ఆర్తనాదం వినబడకూడదు గదా! అన్నీ తెలిసిన నీకు నేను చెప్పేది ఏముంది?

సీతా! నీముందే ఈ దండకారణ్యవాసులైన మునులు వారి బాధలను నాతో ఏకరువు పెట్టుకొన్నారు గదా! తాపసులైన వారు ఆర్తజనులై నన్ను శరణువేడారు. శరణార్థులను కాపాడే బాధ్యత వీరుడినైన నాపై ఉంటుంది కదా! కందమూలాలను తింటూ అహింసామూర్తులై జీవనం చేసే ఆ మౌనివర్యులను రాక్షసులు భయభీతులను చేస్తున్నారు. ఆ రాక్షసుల ఆగడాలకు తాపసులు అల్లాడుతున్నారు. ధర్మమూర్తులైన వారు సుఖశాంతులకు దూరమౌతున్నారు.

నియమానుసారం తపస్సులో ఉన్నవారిని ఈ రక్కసిమూక అల్లరి పెడుతోంది. చేతికందిన వారిని అందినట్లుగా మింగివేస్తున్నారు. వారి బాధలను తట్టుకోలేక శ్రీరామా! అని నన్ను పిలిచి శరణు కోరేవారి బాధలను దూరం చేసే బాధ్యత నాదే కదా!

నేను వారి జాలిగాథనంతా విన్నాను. వారు పడే బాధలను గూర్చి తెలుసుకొన్నాను. నేను ఉండగా వారు హృదయావేదనను అనుభవించడం నేను చూడలేక వారికి పాదాభివందనం చేసి నేను చేయవలసిన కార్యాన్ని నిర్దేశించమని వారినే అడిగాను. వారందరూ ముక్తకంఠంతో ఒకే మాట చెప్పారు. 'ఓ శ్రీరామా! క్రూరులైన రాక్షసాధములు మమ్ము నాశనం చేస్తున్నారు. మా హోమగుండాలను అపవిత్రం చేస్తున్నారు. మమ్ము ముక్కలు ముక్కలుగా చేసి తినేస్తున్నారు. మా జీవనాన్ని కడగండ్ల పాలు చేస్తున్నారు. వారినుంచి మమ్ము రక్షించే భారం నీదే.

మమ్ము రక్షించే వారు లేక దిక్కులేనివారిలాగా మేము దీనులమయ్యాము. మా తపోనిష్ఠలను భగ్నపరిచే ఆ రక్కసుల చేతిలో మేము నానా బాధలు అనుభవిస్తూ పరితపిస్తున్నాం. ఇక నీవే మా దిక్కు. నీవే మమ్ములను రక్షించి కాపాడాలి. మా భారం నీపై మోపి మేము నిశ్చింతగా ఉంటాం' అని చెప్పారు. అంతేగాదు 'ఓ రఘుకులోత్తమా! మేము మా తపోబలంతో రాక్షసులను తుదముట్టించగలం. ఆ అధముల పీడను వదిలించుకోగలం. కాని, మేము ఎన్నో కష్టాలకోర్చి నియమ నిష్ఠలతో సంపాదించుకున్న పుణ్యాన్ని కేవలం మా కొరకే వెచ్చించడం మా అభిమతం కాదు. మా తపఃశక్తి లోకకళ్యాణానికి ఉపయోగించాలనేది మా నిర్ణయం మా ఆశ.

దానివలన మేము ఈ రాక్షసులను నిరోధించలేకపోతున్నాం. మేం శపించబోమని తెలుసుకొన్న అధములు మా కార్యాలకు విఘ్నాలను కలిగిస్తున్నారు. అహింసా మార్గాన్ని అవలంబించే మమ్ములను రాచి రంపాన

పెడుతున్నారు. నీవు లక్ష్మణునితో కలిసి ఆ రాక్షసుల పీడనుండి మమ్ము కాపాడు తండ్రీ. మాపై దయ చూపి ఆ రక్కసులను తుదముట్టించు. తాపసవృత్తిలోవున్న మమ్ములను రక్షించే భారం నీదే' అంటూ నన్ను వారు అభ్యర్థించారు.

జానకీ! నేను ఆ ఋషీశ్వరుల మాటలన్నీ ఆలకించాను. దండకారణ్యాన నివసించాలనుకొన్న నేను ఆ రాక్షసుల బాధను నివారించదలిచాను. మహోన్నత మూర్తులైన తాపసులను రక్షిస్తానని ప్రతిజ్ఞ చేశాను. నా ప్రాణం ఉన్నంతవరకు నేను ప్రతిజ్ఞాబద్ధుడినై ఉంటాను. అహర్నిశం మునుల రక్షణ భారాన్ని మోయగలను. ఇది నా నిశ్చిత కర్తవ్యం. ఋషులకిచ్చిన మాటను వెనక్కు తీసుకోను. వారి రక్షణకై నేను శ్రమించడమే నాకు ఇష్టమైన పని' అని శ్రీరాముడు సీతతో చెప్పాడు.

'జానకీ! బ్రహ్మజ్ఞానులైన బ్రాహ్మణులకిచ్చిన మాటను లేశమైనా జవదాటను. నేను చేసిన ప్రతిజ్ఞ కోసం నిన్ను లక్ష్మణుని పరత్యజించడానికి కూడా నేను వెనుకాడను. నా నిబద్ధత గురించి తెలిసిన నీకు నేను చెప్పనవసరం లేదు. నీవు నా అర్ధాంగివి. ఆత్మీయురాలివి. నాపై ఉన్న ప్రేమతో నీవు ఇలా చెప్పావు. ఆత్మీయులైన వారితోనే వారి హితాన్ని గురించి ఎవరైనా చెప్తారు. నీవు కూడా అదే చేశావు. నీ మాటలు నాకు ఎంతో సంతోషాన్నిచ్చాయి.

వైదేహీ! నీ మాటలు నీ సుహృద్భావానికి సంకేతంలాగా ఉన్నాయి. నీ వంశానికి తగినట్లు నీవు చెప్పావు. నీ హృదయం నీచే అలా మాట్లాడించింది. నీవు నా సహధర్మచారిణివి కదా! కాబట్టి ధర్మాచరణంలో నీకు భాగం ఉంటుంది. నీ కర్తవ్యాన్ని నీవు ఏమరుపాటు లేక ఆచరిస్తుందు' అని హితైషి ఐన సీతకు శ్రీరాముడు తన ప్రతిజ్ఞా పాలనత్వాన్ని గూర్చి విడమర్చి చెప్పాడు.

* * *

మాండకర్ణి వృత్తాంతం

సర్గ - 11

రామలక్ష్మణులు ధనుర్బాణాలు చేబూని సీతతో కూడి అరణ్యాలలో నడుస్తున్నారు. వారికి ఎన్నో వనాలు పర్వత సానువులు, మైదానాలు దట్టమైన వృక్ష సముదాయాలు కనిపించాయి. మధ్యమధ్యలో జలాశయాలు ఎదురయ్యాయి. ఆ నదుల ఒడ్డున ఉన్న ఇసుక తిన్నెల మీద బెగ్గురుపక్షులు, చక్రవాకాలు ముచ్చటించుకొంటున్నట్లు ఉన్నాయి. ఆ నదులలో సరస్సులో చక్కని కలువలు తామరలు నిండుగా కనిపించాయి. నీటిపై ఆడే పక్షులు నీటిలో ఉన్న జలచరాలు వారికి కనువిందు కలిగించాయి. అప్పుడప్పుడు ఆ అడవిలో గుంపులు గుంపులుగా లేళ్ళు బెదురుచూపులతో పరుగెత్తుతున్నాయి. వాడికొమ్ములు ఉన్న అడవి దున్నలు కనిపించాయి. మత్తగజాలు, ఎలుగుబంట్లు అక్కడక్కడా వారికి కనిపిస్తూ ఉన్నాయి.

వారందరూ నడిచి నడిచి సూర్యాస్తమయ సమయానికి ఓ సరస్సు తీరానికి చేరారు. ఆ సరస్సు ఒక యోజనం విస్తీర్ణం దాకా వ్యాపించి ఉంది. దాంట్లో ఎర్రతామరలు నల్ల కలువలు కలగలసి పూచి ఉన్నాయి. రాజ

హంసలు కలహంసలు కూడి ఉన్నాయి. బెగ్గురు పక్షులు, చక్రవాకాలు అక్కడ ఆడుతున్నాయి. ఏనుగుల గుంపులు కోలాహలంగా జలకాలాడుతున్నాయి. వారందరూ ఆ తటాక తీరానికి చేరారు. వారికి వీణావేణు మృదంగ తాళ ధ్వనులతో కూడిన మధుర గానం వినిపించింది. ఆ వాద్యగోష్ఠిని సీతాదులు తన్మయులై విన్నారు. దానికి కారకులైన వారికోసం చుట్టూ పరికించి చూశారు. అక్కడ వారికి ఎవరూ కనిపించలేదు. కాని గాన మాధుర్యం వారికి వినబడుతూనే ఉంది. రామలక్ష్మణులు అత్యంతాసక్తితో ధర్మభృతుడను మహర్షిని ఇది ఏమి వింత? అని అడిగారు. "ఓ విప్రోత్తమా! ఈ వింత రహస్యం కాకపోతే మాకు చెప్పండి. మాలో దీని గురించి వినాలనే ఉత్సుకత ఎక్కువ అవుతోందని" వారు అడిగారు.

'శ్రీరామా! ఈ సరస్సు పేరు పంచప్సరము. ఇది అన్ని కాలాలలో జలసమృద్ధితో అలరారుతుంటుంది. మాండకర్ణి అనే మహర్షి తన తపఃప్రభావంతో దీన్ని నిర్మించాడు. ఆ మహర్షి గాలిని నీటిని మాత్రమే ఆహారంగా తీసుకొంటూ పదివేల సంవత్సరాలు తపస్సు చేశాడు. ఆ తపస్సును చూసి ఇంద్రాదులు భయపడ్డారు. వారందరూ అగ్నిదేవుని నాయకత్వంలో ఒక చోట గుమికూడి మాండకర్ణి తపస్సును భగ్నం చేయాలని అనుకొన్నారు. ఆ మహర్షి తపస్సువల్ల దేవతల ఆధిపత్యానికి భంగం కలుగుతుందని అనుకొన్నారు. అందుకే ఆయన తపస్సుకు భంగం కలిగించాలనుకొన్నారు. విద్యుత్కాంతులవలె మిరుమిట్లుగొలిపే సౌందర్యం కలిగిన ఐదుగురు అప్సరసలను ఆ ముని దగ్గరకు పంపారు.

ఆ దివ్యాంగనలు తమ చర్యలతో నిష్ఠాగరిష్ఠుడైన మాండకర్ణి మహర్షిని కామపరవశుణ్ణి చేశారు. ఆయన తపస్సు ఆగిపోయింది. ఆ అప్సరసలు ఆ మహర్షికి భార్యలయ్యారు. వారందరూ ఈ తటాకం క్రింద ఇల్లు నిర్మించి అక్కడ ఉంటున్నారు. ఆ ముని వారిని సంతోషపరచడానికి తన తపశ్శక్తితో నూతన యౌవనాన్ని పొందాడు. ఆ దివ్యులు ఆ మహర్షి పుంగవుని అలరించడానికి వీణావేణుగానాన్ని ఆలపిస్తున్నారు.

ఆటపాటలతో క్రీడించేవారి ఆభరణాల ధ్వనులు వీణావాద్యాది శబ్దాలు మధుర మంజుల నాదాల ధ్వనే మనకు ఇప్పుడు వినిపిస్తోంది' అని చెప్పాడు. ఆశ్చర్యంగా ఆనందంగా ఆ మాండకర్ణుని వృత్తాంతాన్ని వారంతా విన్నారు. ఆ తర్వాత ఆ ఆశ్రమాన్నంతా శ్రీరాముడు తిరిగి చూశాడు. అక్కడంతా బ్రహ్మ తేజస్సు నిండి ఉంది. వల్కలాలు, దర్భలతో ఆ ప్రదేశం పవిత్రంగా ఉంది.

ఆ ఆశ్రమంలో సీతారామలక్ష్మణులు మునులతో కూడి విశ్రమించారు. ఆ నివాసం వారికి ఆనందాన్నిచ్చింది. శ్రీరాముడు ప్రతిరోజు మునులతో మాట్లాడుతూ వారి సేవలతో సంతోషంగా కాలం గడుపుతున్నాడు.

సుతీక్షణుని ఆశ్రమం

శ్రీరాముడు పంచప్సర సమీపాన ఉన్న ఆశ్రమంలో సుఖంగా జీవించసాగాడు. కొద్దిరోజుల తర్వాత మరలా తాను దర్శించి వచ్చిన మునుల ఆశ్రమాలను చూడాలనుకొన్నాడు. సీత లక్ష్మణులను వెంటబెట్టుకొని ఒక్కొక్క ఆశ్రమంలో కొన్నాళ్లు ఉంటూ మరొక ఆశ్రమాన్ని దర్శించడానికి వెళ్ళుతూ కాలం గడిపాడు. రామాదులు ఒక్కొక్క ఆశ్రమంలో నాల్గు నెలలు ఆరు నెలలు లేక పక్షం రోజులు, మూడు నెలలు, ఒక మాసం అలా కాలాన్ని

వెచ్చిస్తూ గడిపారు. అలా వారు పది సంవత్సరాలు మునుల సేవ చేస్తూ జీవించారు. తర్వాత వారు సుతీక్షణుని దగ్గరకు వెళ్ళాలనుకొన్నారు. వెంటనే ప్రయాణం కట్టి సుతీక్షణుని దగ్గరకు వెళ్ళారు. వారిని చూసి ఆ మహర్షి మహదానంద పడ్డాడు. అతిథి సత్కారాలు చేశారు. మధుర పదార్థాలు పెట్టారు. హాయిగా సుతీక్షణుని దగ్గర రామాదులు కొన్నాళ్ళు ఉన్నారు. ఒక రోజు మాటల సందట్లో శ్రీరాముడు 'మహర్షి వర్యా! మేము ఇక్కడ అగస్త్య మహాముని గురించి విన్నాం. మాకు ఆయనను సేవించాలనే కోరిక కలిగింది. అగస్త్యుడు ఉన్న చోటును మాకు చూపి పుణ్యం కట్టుకోండి' అని అడిగాడు.

ఆ మాటలకు పరమానందపడి సుతీక్షణుడు 'శ్రీరామా! నేను కూడా మీకు అగస్త్యుని గురించి చెప్పాలనుకొంటున్నాను. నీవు కూడా అదే అడిగావు. ఆ గొప్ప తేజస్విని గురించి నేను చెప్తాను విను అంటూ శ్రీరామా! ఇక్కడికి నాల్గు యోజనాల దూరంలో సుదర్శనుని ఆశ్రమం ఉంది. అగస్త్యుని సోదరుడే ఇతను. మీరు ముందు ఇతనిని దర్శించండి. సుదర్శనుని ఆశ్రమం ఎంతో పవిత్రమైంది. అక్కడ రావిచెట్లు, ఫలవృక్షాలు, పూలచెట్లు ఉన్నాయి. నిర్మలమైన సలిలాలు వాటిలో పద్మాలు సరస్సులు వాటిలో కలహంసలు, బెగ్గురు పక్షులు, చక్రవాకాలు, కన్నెలేడి పిట్టలు ఉన్నాయి. ఇవన్నీ కలిసి ఆ ప్రాంత శోభను పెంచుతుంటాయి. ఒక రాత్రి మీరు ఆ ఆశ్రమంలో విశ్రమించండి.

మరునాటి ఉదయాన్నే దక్షిణ ముఖులై సాగిపొండి. అక్కడికి ఒక యోజనం దూరంలో మీకు మహాత్ముడైన అగస్త్యాశ్రమం దర్శనం ఇస్తుంది. అక్కడి వనప్రదేశం కూడా మీకు ఆనందాన్నిస్తుంది. మీరు అక్కడ ఆయనను సేవించవచ్చు. మీరు ఆయనను చూడాలని ఉవ్విళ్ళూరుతున్నట్లయితే నేడే మీరు బయలుదేరండి. సుతీక్షణుని మాట ప్రకారం రామాదులు అగస్త్యాశ్రమానికి బయలుదేరడానికి ఉద్యుక్తులయ్యారు. మహర్షికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి ఆయన అనుమతిని తీసుకొని వారు ప్రయాణం ఆరంభించారు.

వాతాపి, ఇల్వలుల వృత్తాంతం – సుదర్శనుని ఆశ్రమ దర్శనం

సుతీక్షణుడు చెప్పినట్లుగానే రామాదులు నడక సాగించారు. కొద్దిదూరం వారు ప్రయాణించిన తర్వాత ఫలపుష్ప భారంతో నేలకు వంగిన వృక్ష సముదాయాన్ని చూశారు. బాగా పండిన పిప్పళ్ళ వాసన గాలితో సఖ్యం చేసి నాసికారంధ్రాల దగ్గరకు పరుగెడుతోంది. అక్కడక్కడ హోమకార్యాలు చేసిన ఆనవాళ్ళు కనపడుతున్నాయి. వైడూర్యపు వన్నెలు కలిగిన దర్భలు పేర్చి ఉండటం చూశారు. సమిధలన్నీ కుప్పలు పోసి ఉన్నాయి. అగ్నిహోత్రం నుండి వెలువడే పొగలు నల్లని అంచులతో మేఘ సముదాయాన్ని తలపిస్తున్నాయి. ఇవన్నీ చూస్తూ శ్రీరాముడు 'లక్ష్మణా! సుతీక్షణ మహర్షి చెప్పిన అగస్త్యుని సోదరుని ఆశ్రమం ఇదే అయి ఉంటుంది' అన్నాడు. పవిత్ర నదులలో స్నానమాచరించిన తాపసులు అక్కడ అప్పుడే పూచిన పూలను తుంచి ఇష్టదేవతలను పూజిస్తూ కనిపించారు. 'లక్ష్మణా! శోభాయమానమైన సుదర్శనుని ఆశ్రమం చూడు ఎంత పవిత్రంగా కనబడుతుందో' అని శ్రీరాముడు చెప్పాడు.

ఒకానొక కాలంలో ఇక్కడ వాతాపి, ఇల్వలుడనే రాక్షస సోదరులు ఉండేవారు. వీరు వీరి అతి తెలివితో బ్రాహ్మణులను ఇష్టంగా తినేవారు. ప్రతిరోజు ఇల్వలుడు శ్రాద్ధం జరుగుతోంది భోక్తలుగా రండని బ్రాహ్మణులను పిలిచేవాడు. ఆ వచ్చిన విప్రులకు సోదరుడైన వాతాపిని శాకంగా మార్చి చక్కగా వండి వడ్డించేవాడు. ఇదేమి తెలియని ఆ అమాయక బ్రాహ్మణులు సుష్ఠుగా తినేవారు. వారి కాళ్ళు కడుక్కోవడానికి నీళ్ళు ఇస్తూ ఇల్వలుడు "సోదరా! వాతాపి! ఇటురా" అని పిలిచేవాడు. వెంటనే బ్రాహ్మణుల ఉదరాన్ని చీల్చి వాతాపి బయటపడేవాడు. బ్రాహ్మణులు మృత్యువాతపడేవారు. సోదరద్వయం వికృతానందంతో ఆ విప్రులను ఆరగించేవారు. ఇలా వీరు వేలకొలది విప్రులను నాశనం చేశారు. దీనినంతా దేవతలు చూసి సహించలేకపోయారు.

వారందరు గొప్ప తపస్సంపన్నులైన అగస్త్యుని దగ్గరకు వచ్చి మొరపెట్టుకున్నారు. రాక్షసుల ఆగడాలను అరికట్టమని వేడుకొన్నారు. బ్రాహ్మణులను రక్షించాలని రాక్షసులను అంతం చేయాలని అగస్త్యుడు అనుకొన్నాడు. వెంటనే భోక్తగా ఇల్వలునికి అగస్త్యుడు కనిపించాడు. యథాప్రకారం ఇల్వలుడు వాతాపిని వండి వార్చి అగస్త్యునకు సమర్పించాడు. అగస్త్యుడు దానినంతా చక్కగా తిని ఈ శ్రాద్ధ భోజనం నాకు చాలా తృప్తి కలిగించింది. జీర్ణం వాతాపి జీర్ణం అంటూ లేచాడు. మామూలుగా ఇల్వలుడు పాదాలు కడుక్కోవడానికి ఉదకాన్ని ఇస్తూ నాయనా వాతాపి ఇలారా అంటూ కేకేశాడు. అగస్త్యుడు నవ్వుతూ "ఇల్వలా! ఇంకెక్కడి వాతాపి నా ప్రేగులలో జీర్ణం అయి ఎప్పుడో యమపురికి వెళ్ళాడు" అంటూ చావు కబురు చల్లగా చెప్పాడు. ఇల్వలునికి జరిగింది తెలిసి అగస్త్యునిమీద ఆగ్రహంగా విరుచుకపడ్డాడు. అగస్త్యుడు కోపాగ్నిని తన కన్నుల్లో ప్రజ్వలింపజేశాడు. అంతే ఆ కంటి మంటలతో ఇల్వలుడు దగ్ధం అయ్యాడు. ఇలా రాక్షసులను అంతం చేశాడు అగస్త్యుడు.

ఆ లోకకల్యాణార్థి ఐన అగస్త్యభ్రాత ఐన సుదర్శనునిదే ఈ ఆశ్రమం అని చెప్పుతూ రాముడు ఆశ్రమంలోకి ప్రవేశించాడు. ఇంతలో సూర్యభగవానుడు పశ్చిమాద్రిని చేరుకొన్నాడు. రామలక్ష్మణులు సంధ్యావందనాది కార్యాలు ఆచరించుకొని సుదర్శనుని దర్శించారు. వందనం చేశారు. సుదర్శనుడు ఎంతో ఆనందించి ఆ ముగ్గురికి స్వాగత సత్కారాలు చేశాడు. కందమూలాలు, మధుర ఫలాలు రాత్రి భోజనంగా పెట్టాడు. వాటిని రామాదులు ప్రీతిగా ఆరగించారు. వినిర్మల ప్రశాంత వాతావరణం ఉన్న ఆశ్రమంలో వారు హాయిగా రాత్రి గడిపారు.

అగస్త్యాశ్రమ దర్శనం

మరునాటి ఉదయమే రామాదులు మేల్కొని నిత్యకృత్యాలు తీర్చుకొన్నారు. గాయత్రిని ఉపాసించారు. సుదర్శనుని దర్శించారు; నమస్కరించారు; అగస్త్యుని ఆశ్రమానికి వెళ్ళడానికి అనుమతి కోరారు. ఆ మహర్షి ఆనందంగా వారికి వీడ్కోలు ఇచ్చాడు.

రామాదులు పయనిస్తూ మార్గమధ్యలో పనస, తాటి, జలకదంబ, కానుక, పొగడ చెట్లను, విప్ప, చంద్ర, తుమికి లాంటి తరు సముదాయాన్ని చూశారు. మారేడు వృక్షాలు వారికి కనిపించాయి. ఏనుగులు తమ తొండాలను వృక్షాల మొదళ్ళకు రాస్తూ చెట్లను ఊగిస్తున్నాయి. దాంతో వృక్షాగ్రంలో ఉన్న పూలు వర్షంలా కిందకు జారుతున్నాయి. ఆ వృక్షాలపై పక్షులు గుంపులుగా కూడి ఉన్నాయి. ఆ చెట్ల కొమ్మలపై వానరాలు పరుగెడుతున్నాయి.

పద్మనేత్రుడైన శ్రీరాముడు ఆ వనశోభకు ముగ్ధుడయ్యాడు. 'సౌమిత్రీ ఈ ప్రదేశంలోని రమణీయతను చూడుము. – సీతా! ఈ తరువుల ఆకులు పచ్చని రంగుతో కళకళలాడుతున్నాయి. మృగాలు హాయిగా సంచరిస్తున్నాయి. పక్షులు ఆనందంగా సవ్వడి చేస్తున్నాయి. ఇది మహనీయుడైన అగస్త్యుని ఆశ్రమం అయి ఉంటుంది. ఇది దివ్య తేజస్సుతో అపురూప కాంతులను విరజిమ్ముతోంది. ఇది తప్పక ఆ మహామహుని కొలువై ఉంటుందని శ్రీరాముడు సీతాలక్ష్మణులకు చెప్పాడు. సౌమిత్రీ! అగస్త్యుడు తన తపఃప్రభావంతో వింధ్య పర్వతాన్ని స్తంభింపజేశాడు. అందుకే ఆయనకు అగస్త్యనామం విఖ్యాతి చెందింది. ప్రయాణపు బడలికతో వచ్చిన వారికి ఈ ఆశ్రమం అలసటను పోగొట్టుతుంది. అదుగో అటు చూడండి. నిత్యాగ్నిహోత్రాలనుండి వచ్చే ధూమం ఆకాశం పైకి పోతోంది. ఆశ్రమం చుట్టూ నారవస్త్రాలు ఆరకట్టి ఉన్నాయి. ఈ ప్రశాంత వాతావరణం రక్కసులను భయభ్రాంతులను చేస్తుంది.

అగస్త్యనామం రాక్షసుల వెన్నులో చలి పుట్టిస్తుంది. అలాంటి పుణ్యాత్ముని ఆశ్రమానికి మనం వచ్చాం అని శ్రీరాముడు ఆనందంగా తనవారికి చెప్పాడు. వింధ్య పర్వతానికి దక్షిణంగా ఉన్న ఈ భాగమంతా రాక్షసులకు సింహస్వప్నంగా ఉంది. రాక్షసులు తమ వైరప్రవృత్తిని మరిచి ప్రశాంత జీవనానికి అలవడ్డానికి కారణం ఈ అగస్త్యుడే. అగస్త్యుడున్న వైపు వారు రారు – సరికదా కన్నెత్తి కూడా చూడరు. నిశాచరులందరూ అణగి మణిగి మసలుకొంటుంటారు. అగస్త్యుని ప్రభావం చేత ఈ దక్షిణ దిశ ప్రఖ్యాతి పొందింది.

అంతేగాదు సూర్యగమనానికి అడ్డుగా పెరిగే వింధ్యపర్వతం అగస్త్యుని ఆదేశంతో తన పెరుగుదలను ఆపివేసింది. దీర్ఘాయుష్షును పొంది తన పుణ్యకర్మలవలన ప్రసిద్ధి చెందే ఈ అగస్త్యుని ఆశ్రమం ఎంతో పవిత్రమైంది. ఎందరో సాధు జనులకు ఆశ్రయాన్నిస్తోంది. ఈ సత్పురుషుడు లోకులకు మేలు చేస్తుంటాడు. లోక కల్యాణార్థమే తాను పనులను ఆచరిస్తాడు. ఇప్పుడు మనకు కూడా ఆ మహర్షి సత్ఫలాలను అందిస్తాడు' అని శ్రీరాముడు సీతాలక్ష్మణులతో చెప్పాడు.

'ఈ వనవాస కాలం మనం ఈ ఆశ్రమంలోనే గడుపుదాం. ఇక్కడకు ఎందరో గంధర్వులు, సిద్ధులు, దేవతలు, మహర్షులు వచ్చి ఈ సాధు పుంగవునికి సేవలు చేస్తారు. ఈ ఆశ్రమంలో అసత్యవాదులు, కఠినాత్ములు, కామాతురులు నిలువలేరు. యక్షులు, నాగులు, గరుడాది పక్షి జాతులకు కూడా ఇది నివాస స్థలమే. ఇక్కడి వారందరూ ధర్మనిరతులై జీవిస్తారు.

ఇక్కడ సిద్ధిపొందిన మహాత్ములు దివ్యతేజోరూపులై దివ్య విమానమెక్కి స్వర్గానికి వెళ్తారు. సత్కర్మలు చేస్తూ దైవారాధన చేసేవారికి దివ్యత్వం, అమరత్వం తప్పక సిద్ధిస్తాయి. లక్ష్మణా! మనం ఈ ఆశ్రమంలోకి వచ్చేశాం. నీవు ముందుగా వెళ్ళి నేను సీతతో కూడ వచ్చానని ఆ మహర్షికి తెలియజేయుము' అని శ్రీరాముడు లక్ష్మణుని అగస్త్యుని దగ్గరకు పంపాడు.

* * *

అగస్త్యుని ఆతిథ్యం

సర్గ - 12

లక్ష్మణుడు రాముని మాటను చెప్పడానికి ఆశ్రమంలోపలకి వెళ్ళాడు. అక్కడున్న అగస్త్యుని శిష్యునితో 'మహాశయా! దశరథ మహారాజు పెద్దకొమరుడైన శ్రీరాముడు తన భార్యతో కలిసి వచ్చాడు. నేను శ్రీరాముని తమ్ముడను. నన్ను లక్ష్మణుడని అంటారు. మేం ముగ్గురం అగస్త్యుని సేవించాలని వచ్చాం. మీ గురువుగారికి ఈ విషయం చెప్పి అనుమతిని తీసుకోండి' అని చెప్పాడు. లక్ష్మణుని మాటలు విని అగస్త్యుని శిష్యుడు అగ్నిగృహంలో హోమం చేస్తున్న తన గురువు దగ్గరకు వెళ్ళి నమస్కరించి 'గురువర్యా! 'దశరథుని' పుత్రులు రామలక్ష్మణులు సీతాదేవి మిమ్ము సేవించాలని వచ్చారు. మీ అనుమతి కోసం నిరీక్షిస్తున్నారు' అని చెప్పాడు. ఆ మాటలకు అగస్త్యుడు సంతోషించాడు. నాయనా! వారిని వెంటనే లోపలికి తీసుకొనిరా వారి రాక మనకు ఎంతో ఆనందాన్నిస్తుంది. వెంటనే వెళ్ళు– అంటూ అగస్త్యుడు చెప్పాడు. గురువు అనుమతితో శిష్యుడు వెళ్ళి స్వాగత సత్కారాలతో శ్రీరాముని లక్ష్మణుని సీతను ఆహ్వానించాడు.

శ్రీరాముడు సీతా సమేతుడై లక్ష్మణునితో కలిసి ఆశ్రమంలో హాయిగా తిరుగుతున్న లేళ్ళ గుంపులను చూస్తూ లోపలికి వచ్చాడు. అలా ముందుకు సాగుతున్న రామాదులకు మునివర్యులతో కలిసి అగస్త్యుడు వీరికి ఎదురు వస్తూ కనిపించాడు. 'లక్ష్మణా! ఆ బ్రహ్మ వర్చస్సుతో వెలిగిపోతూ వస్తున్న ఆ దివ్య తేజోమూర్తి అగస్త్య మహర్షి' అంటూ తన తమ్మునకు శ్రీరాముడు చెప్పాడు. ఆజానుబాహువగు శ్రీరాముడు, లక్ష్మణుడు, సీత మహర్షికి పాదాభివందనం చేశారు. మహర్షి శ్రీరామునకు అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి అతిథి సత్కారాలు చేశాడు. మీ ముగ్గురు మార్గాయాసం తీర్చుకొండని వారికి ఉచితాసనాలను చూపించాడు.

తన చెంతే కూర్చున్న రామునితో అగస్త్యుడు శ్రీరామా! వనవాసం చేసేవాళ్ళు వైశ్వదేవాది అగ్నికార్యాలు ముందుగా ఆచరించాలి. తరువాత అర్ఘ్యపాద్యాదులతో అతిథిని సేవించాలి. ఇది వనవాసుల ధర్మం. దీనిని ఎవరైనా అతిక్రమిస్తే వారు పాపాన్ని మూటగట్టుకొన్నవాళ్ళు అవుతారు అని చెప్పాడు.

'శ్రీరామా! నీవు సత్యనిష్ఠ ఉన్నవాడివి. మహాయోధుడవు. నేడు నీవు మా అతిథి దేవుడివి. అందుకని మేము నిన్ను పూజించాలి' – అంటూ మహర్షి పూలమాలికను శ్రీరామునకు అర్పించాడు.

'ఓ పురుషోత్తమా! ఇది గొప్ప ధనుస్సు. బంగారం రత్నాలతో దీనిని విశ్వకర్మ నిర్మించాడు. సూర్యుని తేజస్సు వంటి ఈ అమోఘమైన శరం నాకు బ్రహ్మదేవుడు ఇచ్చాడు. ఈ రెండు తూణీరాలు దేవేంద్రుడిచ్చాడు. ఈ తూణీరాల నుండి బాణాలు అక్షయంగా వస్తూనే ఉంటాయి. ఈ సువర్ణ ఖడ్గం కూడా సురపతే నాకు అనుగ్రహించాడు. ఓ శ్రీరామ! ఈ ధనుస్సుతో విష్ణువు ఒకసారి రాక్షసులను సంహరించాడు. ఈ వైష్ణవ చాపాన్ని తూణీరాలను, ఖడ్గాన్ని నేను నీకిస్తున్నాను. నీవు వీటిని ఆనందంగా స్వీకరించు. నీకు విజయం లభిస్తుంది.' అంటూ మహర్షి శ్రీరామునకు దివ్యాస్త్రాలను బహూకరించాడు.

* * *

పంచవటీ ప్రయాణం

సర్గ - 13

'రామలక్ష్మణులారా! మీ రాక నాకు ఎంతో సంతోషాన్నిస్తోంది. నాపైగల ఆదరంతో సీతతో కలిసి మీరు రావడం నాకు తృప్తినిచ్చింది. ఈ అడవిలో తిరగడంవలన మీరు ఎంతో అలసిపోయినట్లున్నారు. సుకుమారి జనక సుత ఐన ఈ సీత కూడా నడిచి నడిచి అలసినట్లు కనిపిస్తోంది. ఈమె విశ్రాంతిని కోరుతున్నట్లు అనిపిస్తోంది. రాణివాసంలో అత్యంత గారాబంగా పెరిగిన వైదేహి ఇపుడు కష్టాలతో కూడుకొన్న ఈ అరణ్య మార్గానికి సంతోషంగా నీతో వచ్చింది. ఇది నీకు ఎంతో గర్వకారణం. దీనివలన ఆమెకు నీపై గాఢానురాగం ఉందని తెలుస్తోంది.

శ్రీరామా! నీతోపాటు కష్టాలను ఇష్టంగా అనుభవించడానికి వచ్చిన ఈమె చాలా ఉత్తమురాలు. ఈమెను నీవు చక్కగా చూసుకొనాలి. సీత ఎల్లప్పుడు సంతోషంగా ఉండేటట్లు నీవు చూడాలి.

రామా! సామాన్యంగా స్త్రీలందరూ భర్తలు తమకు అనుకూలంగా ఉన్నప్పుడు వారిపై అనురాగాన్ని పెంచుకొంటారు. విధివశాత్తూ వారు దురవస్థ పాలైనప్పుడు అదే భర్తలను వారు ఈసడిస్తారు. ఇది సృష్టి ఆరంభం నుండి కూడా స్త్రీల సహజ లక్షణమే. రామా! స్త్రీలు చంచల స్వభావులుగా ఉంటారు. శస్త్రాలవంటి తీవ్ర స్వభావంతో వాయువు వంటి వేగంగా ఉంటారు. వీరు ముందు వెనుకలు అంతగా ఆలోచించరు. తొందరపాటు వీరిలో ఎక్కువగా ఉంటుంది. కానీ నీ భార్య సీతలో ఈ దోషాలేవీ కనిపించటంలేదు. నీవు రాజ్యాన్ని వదిలి అరణ్యాలను పట్టి వచ్చినా నీ నీడలాగా నిన్నే అనుసరిస్తూ వస్తోంది. ఈమె అరుంధతీ దేవిలాగా పరమసాధ్వి.

సేవాతత్పరతా హృదయం ఉన్న లక్ష్మణునితో కలిసి సాధ్వీమణి అయి సీతతో కూడి శత్రు సంహారకుడివైన నీవు ఇక్కడకు రావడంవలన ఈ ఆశ్రమం పునీతం అయ్యింది. మా జన్మ ధన్యమైంది. అందువలన మీరు ఇక్కడే ఉండండి' అని అగస్త్యుడు శ్రీరామునకు చెప్పాడు.

'ఓ మునీశ్వరా! మాపై నీకున్న అనురాగం చాలా గొప్పది. మీరు మమ్మల్ని అనుగ్రహించారు. అందుకు మాకెంతో సంతోషంగా ఉంది. మహాత్మా! మీరు మా వనవాస జీవితాన్ని గడపడానికి అనువైన తావును చూపించండి.' అదే మాకు పదివేలు" అని శ్రీరాముడు అగస్త్యుని అడిగాడు.

అగస్త్యుడు రెండు నిమిషాలు ధ్యానమగ్నుడయ్యాడు. "నాయనా! శ్రీరామా! ఇక్కడికి రెండు యోజనాల దూరంలో పంచవటి ప్రదేశం ఉంది. అక్కడ కందమూలాలు, ఫలాలు పుష్కలంగా దొరుకుతాయి. స్వచ్ఛమైన మధుర జలాశయాలు సమృద్ధిగా ఉన్నాయి. వనచరాలు హాయిగొలుపుతుంటాయి. అది మీరు నివసించడానికి వీలుగా ఉంటుందని నేననుకొంటాను. అది మీ వనవాసానికి అనువైన ప్రదేశం అని భావిస్తాను. నీ తండ్రి ఆజ్ఞానుసారం నీవు వనవాస జీవితాన్ని అక్కడ హాయిగా గడపవచ్చు. నీ తండ్రి ధన్యుడు. నీవు ఆయన మాటను పాటించి, పూరుడు తన తండ్రి ఐన యయాతిని సంతృప్తిపరచినట్లు, దశరథుని తరింపజేశావు. రామా! నీ తండ్రి నాకు మిత్రుడు. నా తపశ్శక్తితో నీ వృత్తాంతాన్నంతా నేను తెలుసుకొన్నాను. నీ హృదయంలో నీవు

ఏమనుకొంటున్నావో అలా చేయడానికి పంచవటి అనువుగా ఉంటుందని నేను అనుకొంటాను. జనులకు దూరంగా తాపస వృత్తిలో హాయిగా జీవితాన్ని గడపటానికి ఈ ప్రదేశమే ఉత్తమమైనది" అని అగస్త్యుడు శ్రీరామునితో చెప్పాడు.

పుణ్యగోదావరి తీరాన ఉన్న పంచవటి సుందరంగా ఉంది. అక్కడ వన చరాలు సంతోషంగా ఉంటాయి. నిర్మలమైన వాతావరణం జన సంచారం లేక ప్రశాంతంగా ఉంది. సీతాదేవి కూడా ఇక్కడ విహరించడానికి వీలు ఉంటుంది. నీవు ఇక్కడ నివసిస్తూ తాపసులను రక్షిస్తూ నీ ప్రతిజ్ఞాపాలన సక్రమంగా చేయవచ్చు అని చెప్పాడు.

శ్రీరామా! అటు చూడు ఇక్కడికి దగ్గరలో కనిపిస్తున్న ఇప్పచెట్ల వనానికి ఉత్తరంగా మర్రిచెట్టు ఉంది. దాని అభిముఖంగా ఒక పర్వతం ఉంది. దాని దగ్గరలో ఉండే సుప్రసిద్ధ ప్రదేశమే పంచవటి. ఏ కాలంలోనైనా పుష్పసంపదతో అక్కడి వృక్షాలు తులతూగుతుంటాయి. మీ వనవాసాన్ని ఇక్కడ పూర్తిచేసుకొని తర్వాత అయోధ్యకు వెళ్ళి కోసల రాజ్యాన్ని నీవు పాలించవచ్చు' అని మహర్షి శ్రీరామునితో చెప్పాడు.

శ్రీరాముడు అగస్త్యుడు చెప్పినదంతా విన్నాడు. పంచవటికి వెళ్ళడానికి ఆయనను అనుమతి కోరాడు. "తపోనిధీ! మాకు సెలవు ఇవ్వండి" అని రామలక్ష్మణులు సీత మహర్షి పాదాభివందనం చేశారు. ఆ సాధు శ్రేష్ఠునకు వీడ్కోలు ఇచ్చి బాణ తూణీరాలు ధరించి రామలక్ష్మణులు సీతతో కలిసి పంచవటికి బయలుదేరారు.

* * *

జటాయువు పరిచయం

సర్గ - 14

సీతారామలక్ష్మణులు దండకారణ్యంలో పంచవటి ప్రదేశానికి ప్రయాణం సాగించారు. వారికి దారి మధ్యలో ఒక పెద్ద పక్షి కనిపించింది. అది జటాయువు. వారు దానిని చూశారు. దాని ఆకారం పెద్దదిగా దృఢంగా ఉంది. రాక్షసుడీ ఈ ఆకారంతో ఉన్నాడనుకుని నీవెవరు? ఇక్కడ ఎందుకు ఉంటున్నావని వారు ఆ పక్షిరాజును అడిగారు. 'తండ్రీ రామచంద్రా! నేను మీ తండ్రి మిత్రుడను. జటాయువును' అని చెప్పాడు. ఆ గ్రద్ద తండ్రి మిత్రుడని తెలుసుకొని శ్రీరాముడు సంతోషంతో నమస్కరించాడు.

వారు కాసేపు యోగక్షేమాలను మాట్లాడారు. వారి మాటలలో శ్రీరాముడు ఆ పక్షిరాజు యొక్క పుట్టు పూర్వోత్తరాల గురించి అడిగారు. 'ప్రభూ! సకల ప్రాణి సృష్టి గురించి నాకు తెలిసింది చెప్తాను వినుము'– అంటూ ఆ పక్షిరాజు ఇలా చెప్పాడు. 'ప్రజాపతులలో కర్దముడు మొదటివాడు. విక్రోతుడు, శేషుడు, సంశ్రయుడు, బహుపుత్రుడు, స్థాణువు, మరీచి, అత్రి, క్రతువు, పులహుడు, దక్షుడు, వివస్వంతుడు, పులస్త్యుడు, అంగిరసుడు, ప్రచేతసుడు, కశ్యపుడు వీరు పదిహేను మంది తక్కిన ప్రజాపతులు.

కశ్యపునకు అరిష్టనేమి అనే పేరు కూడా ఉంది. ఈ కశ్యప ప్రజాపతి దక్షుని ఎనిమిదిమంది కన్యలను వివాహం చేసుకొన్నాడు. వారందరికి కశ్యపుడు నాతో సమానమైన వీరత్వం ఉన్న పుత్రులను మీరు పొందుతారు అని చెప్పాడు. అదితి, దితి, కాళిక, దనువు దక్షుని కూతుళ్ళైన ఈ నలుగురు కశ్యపుని మాటను వేదంగా భావించారు. కామ, క్రోధవశ, మనువు, అనల ఈ నలుగురికీ కశ్యపుని మాట అంతగా రుచించలేదు.

ఓ కోదండరామా! అదితి ద్వాదశాదిత్యులకు, అష్టవసువులకు, ఏకాదశ రుద్రులకు, ఇద్దరు అశ్విని కుమారులకు జన్మనిచ్చింది. దితి దైత్యులను పొందింది. వీరు వనములతో సముద్రాలతో శోభించే ఈ భూమిని పాలించేవారు. దనువు అశ్వగ్రీవుని పొందింది. కాళిక నరకుడు కాలకుడు అనే వారికి జన్మనిచ్చింది.

త్రామ, క్రౌంచి, భాసి, శ్యేని, ధృతరాష్ట్రి, శుకి అనే ఐదుగురు కన్యలను కన్నది. వీరు చాలా ఖ్యాతి పొందారు. క్రౌంచి నుంచి గుడ్లగూబలు, భాసినుంచి నీటి కాకులు, కోళ్ళు, శ్యేని నుంచి డేగలు, గ్రద్దలు పుట్టాయి.

ధృతరాష్ట్రి ద్వారా హంసలు, కలహంసలు, చక్రవాకాలు పుట్టుకొచ్చాయి. శుకి నతకు జన్మనివ్వగా ఈమె వినతను కుమార్తెగా పొందింది. కశ్యపుని భార్య ఐన క్రోధవశ, మృగి, మృగమంద, హరి, భద్రమద, మాతంగి, శార్దూలి, శ్వేత, సురభి, సురస అనే పదిమందికి జన్మప్రదాత అయ్యింది.

శ్రీరామ! మృగి సంతానమే మృగాలు, మృగమంద ఎలుగుబంట్లను, సవరపు మెకములను (సృమరములు), చమరీ మృగాలను సంతానంగా పొందింది. హరి సంతానం సింహాలు, వానరాలు, భద్రమద, ఇరావతి అనే బిడ్డను పొందింది. ఐరావతం ఇరావతుని సంతానం. మాతంగి ఏనుగులను బిడ్డలుగా పొందింది. కొండముచ్చులు, వ్యాఘ్రాలు, శార్దూలి అనే ఆమెకు పుట్టాయి. శ్వేత దిగ్గజాలను పుట్టించింది. సురభికి రోహిణి, గంధర్వి అనే కూతుర్లు పుట్టారు. గోవులన్నీ రోహిణి సంతానమే. గంధర్వి అశ్వాలకు, సురస నాగులకు కద్రుక (కద్రువ) సర్పాలకు జన్మనిచ్చారు.

కశ్యపుని భార్య ఐన మనువు నందు పుట్టిన వారే మానవులు. అవల వృక్షాలకు జన్మప్రదాత అయింది. కద్రువ కొడుకు ఆదిశేషుడు. ఇతడు తన వేయి పడగలతో ఈ భూభారాన్ని మోస్తుంటాడు. వినత అనూరుడు, (అరుణుడు) గరుడుడు అనే పుత్రులను పొందింది. అనూరునకు సంపాతి, నేను పుట్టాం. సంపాతి నాకు పెద్దన్న. మా అమ్మ పేరు శ్యేని. శ్యేని అరుణల కుమారులలో నేను చిన్నవాడిని. నన్ను జటాయువు అని అంటారని మీకు తెలిసిన విషయమే కదా!

శ్రీరామా! ఇక్కడ క్రూరమృగాలు తిరుగుతుంటాయి. దుష్ట రాక్షసులు కూడా సంచరిస్తుంటారు. నన్ను మీరు సమ్మతిస్తే నేను మీ నివాస స్థలాన్ని రక్షిస్తుంటాను. మీ అన్నదమ్ములిద్దరూ కుటీరానికి దూరంగా వెళ్ళినప్పుడు నేను సీత రక్షణ భారాన్ని మోస్తాను అనే జటాయువు మాటలకు శ్రీరాముడు ఎంతో సంతోషించాడు. మా తండ్రికి ఆత్మీయుడివైన నీవు మమ్ము రక్షిస్తానంటే మాకు అంతకన్నా భాగ్యమేమి ఉంటుంది. మీ ఇష్టప్రకారం చేయుము' అని శ్రీరాముడు జటాయువునకు చెప్పాడు.

సీతారామ లక్ష్మణులు సంతోషంగా పంచవటి ప్రాంతానికి పయనించారు. అగ్నిలోపడిన శలభాల్లాగా రాక్షసులను అంతం చేయాలని రఘురాముడు అనుకొన్నాడు.

* * *

పంచవటి పర్ణశాల

సర్గ - 15

సీతారామ లక్ష్మణులు అగస్త్యుడు చెప్పినట్లే పంచవటికి వచ్చారు. అక్కడ వృక్ష సంపద మృగసంచారం చూసి ఆనందించారు. 'లక్ష్మణా! ఈ రమ్యమైన ప్రదేశం అంతా తిరిగి చూసి మన కుటీరానికి అనువైన ప్రాంతాన్ని చూసుకొందాం' అని రాముడు లక్ష్మణునితో చెప్పాడు.

'లక్ష్మణా! మనం హాయిగా సంచరించడానికి మన అవసరాలను తీర్చుకోవడానికి జల సమృద్ధి ఉన్న ప్రాంతాన్ని చూడు. ఎగుడు దిగుడుగా లేని ప్రదేశం అయితే కుటీర నిర్మాణానికి బాగుంటుంది. మన నిత్యాగ్నిహోత్రానికి అవసరమైన సమిధలు దర్భలు పూవులు దొరికేటట్లుగా కూడా ఉండాలి సుమా!' అని శ్రీరాముడు చెప్పాడు.

'అన్నా! నేను మీ సేవకుడను. మీకు నచ్చిన ప్రదేశంలో కుటీరాన్ని నిర్మిస్తాను. అక్కడ మీరు వదిన హాయిగా నివసించవచ్చు. నేను ఎల్లప్పుడు మిమ్ము రక్షిస్తుంటాను' అని చెపుతూ నడవసాగాడు. శ్రీరాముడు లక్ష్మణుని చేతిని తన చేతితో పట్టుకొంటూ ఆ ప్రదేశాన్నంతా పరిశీలిస్తూ తిరిగారు.

కొద్దిసేపటికి వారు చదునైన చూడచక్కని ప్రాంతాన్ని చూశారు. 'ఓ సౌమిత్రీ! ఈ ప్రదేశం ఎంతో రమణీయంగా ఉంది. ఇక్కడికి దగ్గరలో వృక్ష సంపద ఫల పుష్పాలతో అలరారుతోంది. క్రూర మృగ సంచారం దరిదాపులలో కనిపించడంలేదు. లేళ్ళ గుంపులు చూస్తూ ఉంటే కాలం తెలియడంలేదు. మీ వదినె వీటితో ఆడుకోవడానికి ఇక్కడ వీలుగా ఉన్నట్లుంది. దగ్గరలో పద్మాలతో నిండి ఉండే సరస్సు కనబడుతూ ఉంది. ఆ పద్మాల సువాసన మన ముక్కు పుటాలను చేరుతోంది కదా! అగస్త్య మహర్షి చెప్పినట్లే పుణ్యవతి గోదావరి నిర్మలంగా ప్రవహిస్తోంది. ఈ గోదావరి తీరంలోని పక్షుల గుంపులు చూడు నేత్ర పర్వంగా కనిపిస్తున్నాయి. పూల పరిమళాలను ఆస్వాదిస్తూ జలకాలాడుతూ హంసలు, చక్రవాకాలు ఆనందాన్ని అనుభవిస్తున్నాయి.

ఇక్కడికి దగ్గరలో కనిపిస్తున్న ఎత్తైన కొండలు ఈ ప్రదేశానికి పెట్టని కోటలా భాసిస్తున్నాయి గదా. ఆ కొండలపై బంగారు, వెండి, రాగి, గైరికాది ధాతువులున్నట్లున్నాయి. వాటి జిలుగుల వెలుగులు ఆ కొండలపై దాగుడు మూతలాడుతున్నాయి. ఈ కొండలు పసుపు తెలుపు ఎరుపు వర్ణాలతో అలంకరించిన ఏనుగుల్లా చూపరులకు ఆనందాన్నిస్తున్నాయి.

మద్ది, తాటి, కానుగ, ఖర్జూర, పనస, మామిడి, జలకదంబ, నేమి చెట్లు, పున్నాగ, తియ్యమామిడి, అశోక, తిలక వృక్షాలు ఈ గిరుల శోభను ఇనుమడింపజేస్తున్నాయి. మల్లె, జాజి, సంపంగి లతలు ఆ వృక్షాలతో పెనవేసుకొని విడదీయరాని బంధంతో పెరుగుతున్నట్లున్నాయి. మొగలి పొదలు మత్తైన వాసనను వెదజల్లుతున్నాయి. చందన తిమిళ, స్థల కదంబ చెట్ల సువాసనల గుబాళింపు మనసును మరో లోకానికి తీసుకొని వెళుతున్నట్లు అనిపిస్తున్నాయి. నిమ్మ, ఉమ్మెత్త, ఇనుమద్ది, చంద్ర, జమ్మి, మోదుగ, కలిగొట్టు చెట్లు శోభాయమానంగా ఉన్నాయి. ఈ గోదావరీ తీర పంచవటి తీరం పుణ్యప్రదంగా పవిత్రంగా కనిపిస్తోంది. జటాయువు సహకారంతో మనం ఇక్కడే కొద్దికాలం ఉందాం. నీవు మనకు వీలైన కుటీరాన్ని ఇక్కడే నిర్మించు' అని చెప్పాడు.

లక్ష్మణుడు అన్న ఆదేశాన్ని శిరసావహించాడు. కుటీర నిర్మాణానికి కావాల్సిన సామగ్రిని ఏరి కూర్చాడు. మట్టిగోడలు కట్టాడు. వెదురు స్తంభాలు నాటి వాటిపైన వెదురుబొంగులు అమర్చాడు. జమ్మికొమ్మలను పరిచాడు. వాటిని ఎక్కడికక్కడ తాళ్ళతో బిగించాడు. దర్భలను, రెల్లుగడ్డిని వాటి మీద కప్పాడు. ఇలా పర్ణశాలను బలంగా అందంగా తీర్చాడు. నేలనంతా చదును చేశాడు. ప్రతిదీ అందంగా అమర్చి చక్కని పొదరిల్లును ఏర్పరిచాడు. చూడముచ్చటైన ఆ కుటీరాన్ని నిర్మించి అన్నా వదినలకు చూపించాడు.

శ్రీరాముడు దాన్ని చూసి సంతోష తరంగుడయ్యాడు. వాస్తు దేవాది పూజలు చేసి ఆ ముగ్గురు ఆ కుటీర ప్రవేశం చేశారు. చక్కని వసతిని ఏర్పాటుచేసిన లక్ష్మణుని దగ్గరకు వెళ్ళి శ్రీరాముడు ఆలింగనం చేసుకొని తన ఆనందాన్ని తెలిపాడు. 'లక్ష్మణా! నీవు సర్వసమర్థుడవు. నా మనస్సెరిగి ఈ మహత్కార్యాన్ని తృటిలో చేశావు. నీవు నాకు తోడుగా ఉండడంవల్ల మన తండ్రి ఎడబాటును కూడా నేను మరచిపోతున్నాను. కర్తవ్య దీక్షాబద్ధుడైన నీవు నాకు తమ్ముడిగా దొరకడం నా అదృష్టం' అంటూ శ్రీరాముడు లక్ష్మణునకు చెప్పాడు. అన్న సంతోషించడం చూసి లక్ష్మణుడు పులకించిపోయాడు. 'అన్నా! నిన్ను సంతోషపరచడం కన్నా మిన్నయైనది నాకు ఈ లోకంలో ఏదీ లేదు. నీవు ఆనందంగా ఉన్నప్పుడు నీ చెంత ఉండే భాగ్యం నాకు దొరకడం నా అదృష్టంగా నేను అనుకొంటాను' అని శ్రీరామునితో లక్ష్మణుడు చెప్పాడు.

అలా వారిద్దరూ పరస్పరానురాగంతో ఆ పర్ణశాల ప్రవేశం చేశారు. సీత రామునితో ఆనందంగా కుటీరంలో ప్రవేశించింది. ఆ ముగ్గురు నిత్యానందంతో పర్ణశాలలో కొద్దికాలం గడిపారు.

* * *

భరతుని ప్రశంస

సర్గ - 16

హేమంత ఋతువర్ణనం

సీతారాములు కాలం గడపడాన్ని చూసి ఆనందంతో శరదృతువు తన కాలం తీర్చుకొని వెళ్ళిపోయింది. భూదేవికి సంతోషాన్నిచ్చి ఆమె ఆనందంతో పులకిస్తుండగా హేమంతుడు నవయౌవనుడై ప్రేయసీ ప్రియుల

మనస్సు చూరగొంటూ ఏతెంచాడు. అలా వచ్చిన హేమంతుని చూసి ప్రకృతి పడుచు పరవశించింది. అవని ఒడిలో పొదువుకొన్న తరువులకు ప్రకృతి స్నేహహస్తాన్నిచ్చింది. హేమంతుని కరుణను పొందిన వృక్షాలన్నీ విరగకాచాయి. పొలాలన్నీ బంగారు పంటలు పండాయి.

ఒకనాటి సుప్రభాత వేళ సీతారాములు గోదావరి నదికి వెళ్ళారు. వాళ్ళను అనుసరించి లక్ష్మణుడు వెళ్ళాడు. ప్రకృతి సోయగాన్ని చూస్తూ 'అన్నా! నీకిష్టమైన హేమంత ఋతువు ఆసన్నమైంది. రైతులందరూ ధాన్యలక్ష్మిని ఇంటికి తెచ్చుకుని ఆనందిస్తున్నారు. హేమంతుడు పుట్టించే చలితో జనులందరూ ముడుచుకొనిపోయి ఉన్నారు. స్నానపానాదులు చేయాలని వచ్చే జనులకు జలాలు వణుకు పుట్టిస్తున్నాయి. అగ్నిదేవుని అందరూ కావాలని కోరుకుంటున్నారు. కొత్త ధాన్యాలను భుజించాలనుకొన్నారు. దానికన్నా ముందుగా కొత్త ధాన్యాలను దేవతలకు నైవేద్యం ఇచ్చి వారిని సంతృప్తిపరిచారు. పితృదేవతలను సంతోషింపజేశారు. హోమకార్యాలు ఆచరించారు. పల్లె ప్రజలందరూ పాడి పంటలు సమృద్ధిగా ఉండడంతో వారు నిశ్చితంగా జీవిస్తున్నారు. హేమంతుని చలిని వారి కోరిక అగ్నితో తృప్తిపరుస్తున్నారు. ఈకాలంలో సూర్యుడు దక్షిణదిశపై తన ఏకాగ్రతను పెట్టాడు. సూర్యుని చూపు కరవైన ఉత్తరదిశ నాథుని దూరం చేసుకొన్న వనితలాగా వెలవెలపోతోంది.

దక్షిణాయనమందు హిమవత్పర్వతుడిని మంచు చెలి చేరి పూర్తిగా కప్పేస్తుంది. అందుకే దానిని హిమాలయం అన్నారు. మధ్యాహ్న మార్తాండునితో చెలిమి చేసేవారు మధ్యాహ్న సమయాలను ఇష్టపడుతూ ముసుగు తొలగించని ఓరిమి నశించి ఉదయనుని నీడలను, నీళ్లను వారు భరించలేకపోతున్నారు. వాయుదేవుడు హేమంతునితో కలిసి రావడంతో చల్లని గాలులు వీస్తున్నాయి. వాటిని చూసి జనులు మరింతగా ఒదిగిపోతున్నారు. వన్యప్రాణులు చలిధాటికి గుహలను వదిలి బయటకు రాలేకపోతున్నాయి. అడవి అంతా హేమంతుని వశమయింది.

ఈ ఋతువులో మానవులు హేమంతుని బారిన పడలేక ఇండ్లలోకి దూరి దుప్పట్లను నిగడదీస్తున్నారు. దాంతో కోపం తెచ్చుకొన్న హేమంతుడు సాగక మంకుపట్టు పట్టి అక్కడే తిష్ఠవేశాడు. దాంతో ఈ పుష్యమాసంలోని రాత్రి అంధకారాన్ని ఎంతకీ దూరం చేసుకోలేక దీర్ఘంగా అనిపిస్తోంది.

మంచు చెలి తన మేలి ముసుగును చంద్రమండలపు అంచులకు తగిలేటట్లుగా ధరించి సూర్యుని అడ్డుగా నిలిచి ఆ కిరణాలను చంద్రుని సోకకుండా జాగ్రత్త పడింది. చంద్రుడు దీంతో తన ప్రియనేస్తపు హస్తాన్ని అందుకోలేక మలినమైన అద్దంలాగా తేజోవిహీనుడయ్యాడు.

వెన్నెల రాత్రి కూడా మంచు దట్టంగా తడిక కట్టడంతో చంద్రుని వెన్నెల భూదేవిని స్పృశించడానికి కష్టపడుతోంది. దాంతో భూదేవి మోము ఎండ తాపానికి వన్నె తరిగిన సీతాదేవి మోములాగా వాడిపోయింది. ఉదయ సంధ్యాకాలంలో మంచు ఎక్కువగా ఉంటోంది. గాలి బరువుగా వీస్తోంది. అరణ్యాలలో యవల, గోధుమ చేలపై ఎండ పొడ తగిలీ తగలగానే క్రౌంచ, సారస పక్షులు వాటిపై చేరి ఒకటే పోరుపెడ్తున్నాయి. సిగ్గుతో కొత్త పెళ్ళికూతురు తలవంచుకొని భూమిని చూస్తున్నట్లు నిండైన కంకులతో ఉన్న వరిపైరు వంగిపోయి నేలను చూస్తోంది.

మంచు పడచు క్రీగంటి చూపులకు వశుడై సూర్యుడు తన ప్రతాపాన్ని అంతగా చూపలేక చంద్రుడు నా సోదరుడే అంటున్నాడు. అందువలన సూర్యకిరణాల వెలుగు తన సహజమైన ఎరుపు తెలుపుతో మిళితమై పసుపు వన్నెలాగా పుడమిని భ్రమింపజేస్తోంది. పచ్చిక బయళ్ళపై మంచు కరిగి బిందురూపు సంతరించుకొంది. దానిపై సూర్యరశ్మిపడి వింత కాంతులీనుతోంది. చూపరులు వాటిని చూసి సముద్ర గర్భం రత్నాలను వెదజల్లిందేమోనని తలుస్తున్నారు. దప్పికతో జలరాశిలో ఏనుగుల తొండాన్ని చాచి వాటి చల్లదనాన్ని చూసి రక్షక భటుడిని చూచిన దొంగవలె వెనకడుగు వేస్తున్నాయి. జలపక్షులన్నీ భీరువుల్లాగా మారిపోయి జలాన్ని చూసి భీతి చెందుతున్నాయి.

మంచు అక్కడ ఇక్కడ అనే తేడా లేక అంతా తన ప్రతాపంతో ముంచేసింది. అందులో నదులున్నాయి. అందుకే తన ప్రభావాన్ని కోల్పోయి నది తన జాడను ఎరుకపరచలేకపోతోంది. దాని దగ్గరే ఉన్న ఇసుక తిన్నెలు మంచును తనలో కలిపేసుకొని నది ఉనికిని చాటుతున్నాయి. సూర్యుని చెలిమికి ఎడబాటు ఏర్పడ్డంతో పర్వత శిఖరాలనుండి జాలువారే సెలయేరు గడ్డలా జారుతోంది. ముకుళించిన పద్మాలలోని కేసరాలు పుప్పొడి శిథిలమై పరాగాన్ని పంచలేకపోయాయి. దాంతో పద్మాలతో భాసిల్లే సరస్సులన్నీ శోభను కోల్పోయాయి.

భరతుని ప్రస్తావన

రామాదులు వ్యాహ్యాళికి వెళ్ళారు. అలా నడుస్తూ వెళ్తున్న వారికి భరతుడు జ్ఞప్తికి వచ్చాడు. వారి మనసు మూగబోయింది. సోదరులిద్దరికి ఒకే కాలంలో భరతుడు గుర్తుకురావడంతో మాట్లాడకోకుండా సాగుతున్నారు. ముందుగా లక్ష్మణుడు 'సోదరా!నందిగ్రామంలో భరతుడు మీరు లేరనే చింతతో కుమిలిపోతున్నాడు. మీలాగే జటాధారియై నారచీరలు ధరించి మీపై భక్తితో తపస్సు చేస్తున్నాడు. మీ పాదుకలే పరమనిధిగా భావించి తన సర్వస్వాన్ని వాటికే అప్పగించాడు. కందమూలాలు తింటూ కృశించి భాతృవియోగాగ్నిలో తప్తుడయ్యే భరతుని చలి పులి భయపెడ్తోందేమో? అని నాకు అనిపిస్తోంది.

భరతుడు కటిక నేలపై పడుకొంటూ పౌరులతో కలసి సరయూ నదికి స్నానానికి వెళ్ళుతుంటే మంచు చెలి అతన్ని అనుసరిస్తూ భీరువును చేస్తోందేమోనని నాకు అనిపిస్తోంది. పద్మపత్ర నేత్రుడు ఆజానుబాహువు వీరాధివీరుడైన భరతుడు భోగాలను త్యజించి మిమ్మే త్రికరణశుద్ధితో ధ్యానిస్తున్నాడు. చేతికి అందిన స్వర్గాన్ని కూడా తోసేసి మిమ్మే స్మరిస్తూ భరతుడు తాపసుడయ్యాడు. లోకంలో మానవులు తల్లిని అనుసరిస్తూ తండ్రిని మరుస్తారనే లోకనీతిని అబద్ధమని భరతుడు చాటాడు.

దశరథుని ప్రియభార్య కైక ఇంత క్రూరురాలు ఎలా అయ్యిందో నాకు అర్థం కావడం లేదు' అని లక్ష్మణుడు అనగానే 'లక్ష్మణా! నీవు మన పినతల్లిని తూలనాడటం మంచిదికాదు. నీకు ఇష్టమైతే భరతుని గురించి ఆలోచించు. అంతే కానీ పెద్దలలో తప్పులను ఎంచడం మంచిపనికాదు. వారు దేనినైనా ఆలోచించి మనకు యశస్సును కలిగించే పనులను చేయమనే చెప్తుంటారు. వారిని నిందించే తప్పులు మనము చేయకూడదని చెప్పాడు. 'సౌమిత్రీ! నేను దృఢనిశ్చయుడిని అయినప్పటికీ భరతుని గురించి ఆలోచనలతో నా మనస్సు భరతుని చూడాలని

తహతహలాడుతోంది. భరతుని మాటలు ఆలకించమని భరతుని హృదయానికి హత్తుకోమని నామది పోరు పెడ్తోంది. లక్ష్మణా! మనం నలుగురం కలిసి ఆనందంతో జీవించే తరుణం ఎప్పుడు వస్తుందో' కదా అంటూ శ్రీరాముడు చింతించాడు.

సీతారాములు, లక్ష్మణుడు స్నానాదికాలు ముగించుకొన్నారు. రామలక్ష్మణులు సంధ్యావందనాది కార్యాలు చేశారు. సూర్యుని అర్ఘ్యపాద్యాదులనిచ్చి గౌరవించారు. దేవతలను ఆరాధించారు. శివుడు పార్వతి నందీశ్వరులతో కలిసి స్నానం చేసినట్లు రాముడు సీతాలక్ష్మణులతో కలిసి గోదావరి స్నానం చేశాడు.

* * *

శూర్పణఖ ప్రవేశం

సర్గ - 17

స్నానసంధ్యలు పూర్తిచేసుకొని రామాదులు పర్ణశాలకు వచ్చారు. రామలక్ష్మణులు మహర్షులను పూజిస్తూ పురాణకథాప్రసంగాలతో రోజులను గడుపుతున్నారు. ఒక రోజు శ్రీరాముడు సీతతో కలిసి పర్ణశాలలో కూర్చున్నాడు. వారు ముచ్చటలాడుకొనే మధ్యలో ఒక రాక్షసి వారిదగ్గరకు వచ్చింది. ఆమే రావణుని చెల్లెలు శూర్పణఖ. జటాజూటాలతో శ్యామవర్ణాంకితుడైన ఆజానుబాహుని శూర్పణఖ చూసింది. పద్మనేత్రాలతో శోభిల్లే ఆ శ్రీరామునిపై మరులుగొన్నది. కామపరవశ అయ్యింది. శ్రీరాముని అదేపనిగా చూడసాగింది. శ్రీరాముని ముఖం ప్రసన్నంగా ఉండగా శూర్పణఖ ముఖం వికృతంగా ఉంది. విశాల నేత్రాలతో నల్లని కురులతో నల్లని వాడైన శ్రీరామునిపై కురుచ కన్నులు, రాగిజుట్టు, వికృతాకారంతో ఉన్న శూర్పణఖ మనసు పడింది. శూర్పణఖ శ్రీరాముణ్ణి చూసి చూసి కామ వికారంతో విచక్షణ కోల్పోయింది.

'ఓ సుందరా! తాపసవేషంలో భార్యతో కూడి చేతితో ధనుర్బాణాలను ధరించి ఉన్నావేమిటి? రాక్షస నివాసమైన ఈ అరణ్యాలకు ఏ పనితో వచ్చావు? వివరంగా నాకు చెప్పుము' అని అడిగింది. సత్యవచనుడైన శ్రీరాముడు దశరథుడను అయోధ్యను ఏలిన మహారాజు పెద్దకొడుకును నేను. నన్ను శ్రీరాముడని అందరూ అంటారు. ఈయన నా తమ్ముడు లక్ష్మణుడు. ఈమె నా భార్య సీత విదేహ రాజైన జనకుని కుమార్తె. మేము మా తండ్రి మాట ప్రకారం వనవాస జీవితాన్ని గడపడానికి ఇక్కడకు వచ్చాం' అని శూర్పణఖకు సమాధానం చెప్పి 'ఇంతకీ ఓ వనితా? నీ తండ్రి ఎవరు? నిన్ను చేపట్టినవారు ఎవరో? మీ వివరాలను మాకు చెప్పుము. నీ రూపాన్ని చూసి మేం రాక్షస వనితని అనుకొంటున్నాం అని శ్రీరాముడు అన్నాడు. 'ఓ రామా! నేను కామరూపాలను ధరించగల ఒక రాక్షస వనితను. నేను ఈ అడవులలో నిర్భయంగా సంచరించగలను. రాక్షస ప్రభువైన రావణుని సోదరిని. మేము విశ్రవసుని బిడ్డలం. నాకు ధర్మాత్ముడైన విభీషణుడనే సోదరుడు, ఎల్లప్పుడూ నిద్రించు స్వభావం ఉన్న మహాబలవంతుడైన కుంభకర్ణుడను సోదరులు నాకున్నారు. తిరుగులేని మహావీరులైన ఖరదూషణులు

కూడా నాకు సోదరులే. అద్భుతమైన నీ మనోహరమైన రూపాన్ని చూసి నాకు నీపై మోహం కలిగింది. నేను నిన్ను భర్తగా కోరి నీదగ్గరకు వచ్చాను. నేను చాలా బలం కలదాన్ని. బలవంతులైన సోదరులను కలదాన్ని. నన్ను వివాహం ఆడి నీవు సుఖంగా జీవించవచ్చు. ఇక ఈ సీతతో నీకు పని ఉండదు' అని శూర్పణఖ చెప్పింది.

'శ్రీరామా! నేను నీకు తగినదానను. ఈ సన్నని నడుముగల సీత కురూపిగా కనిపిస్తోంది. నా అందచందాలను చూడు. నీ తమ్ముడిని నేను చిటికెలో తినివేయగలను. అప్పుడు మనకు అడ్డువచ్చేవారు ఎవరూ ఉండరు. ఈ మనుష్యకాంత ఐన సీతను భక్షించి వేయగలను. అప్పుడు మనిద్దరం ఈ అడవిలో అందాలలో ఆనందాన్ని రుచి చూడవచ్చు' అంటూ మత్తుగొలిపే కళ్ళతో శూర్పణఖ శ్రీరామునితో చెప్పింది. కడు నేర్పరి ఐన శ్రీరాముడు ఆమెను చూసి ఆమె మాటలు విని ఎగతాళిగా నవ్వాడు.

* * *

శూర్పణఖను విరూపినిగా చేయటం

సర్గ - 18

మన్మదాధీనమైన శూర్పణఖను చూసి శ్రీరాముడు పరిహాసం చేశాడు. 'ఓ శూర్పణఖా! నేను వివాహితుడను. నా పక్కనే నా అర్ధాంగి ఉంది. సవతిపోరు స్త్రీలకు సుఖాన్ని ఇవ్వదు కదా! రూపయౌవన సౌశీల్యాలు ఉన్న ఇతడు నా తమ్ముడు. ఈయన చాలాకాలం నుండి భార్యకు దూరంగా ఉంటున్నాడు. యువకుడైన ఈ అందగాడు నీవు కోరుకోదగినవాడు. ఓ విశాలాక్షీ! నీవు సవతిపోరులేని ఈ అందగాడిని ఆశ్రయించి నీ కోరిక తీర్చుకో' అని చెప్పాడు.

ఆ మాటలు వినడంతోనే శూర్పణఖ గిరుక్కున లక్ష్మణుని చెంతకు చేరింది. 'మోహనాకారా! సర్వాంగ సుందరినైన నన్ను చేపట్టి సుఖించు' అని అన్నది. ఆమె మాటలు లక్ష్మణునకు నవ్వు తెప్పించాయి. 'ఓ సుందరీ! నేను మా అన్న దగ్గర సేవకునిగా ఉన్నాను. నన్ను నీవు కోరి సేవకుని భార్యవు అవుతావా? ఓ చిన్నదానా! నిర్మలమైన వన్నె ఉన్నదానివి. నా అన్నగారిని చేపట్టి చిన్న భార్యగా రాణించు. మా వదినె సీత వృద్ధురాలు వికార రూపంతో ఉంది. ప్రశస్తి లేని ఆమెను త్యజించి మా అన్న నిన్ను చేపట్టుతాడు. విశాలమైన బలమైన నడుముగలదానా! నీ అంద చందాలు చూసి ఎవరైనా మనుష్యకాంతలను ఇష్టపడుతారా? నీవు చాలా చక్కని పెద్ద పొట్టతో పెద్దదైన ముక్కుతో అందంగా ఉన్నా'వంటూ లక్ష్మణుడు పరిహసించాడు. ఆ మాటలలోని ఎగతాళిని శూర్పణఖ గుర్తించలేకపోయింది. శత్రు భయంకరుడైన రాముని వద్దకు శూర్పణఖ మళ్ళీ వెళ్ళి, 'ఓ రామా! వికృతాకారం గల ఈ దుష్టురాలిని నీ భార్యగా చేరదీసి నన్ను అనాదరిస్తున్నావు. నన్ను నీవు ఇష్టపడడానికి అడ్డుగా ఉన్న ఈ సీతను నీ ముందే నమిలివేస్తాను. ఆ తర్వాత నన్ను చేపట్టు. మనం క్రీడించుదాం' అంటూ కుపిత ఐన శూర్పణఖ చిగురుటాకులా ఉన్న సీతపైకి దూకింది. లేడి చూపులు గల సీత ఈ భయంకర రూపిణిని చూసి భయపడింది. మృత్యుపాశంలాగా పైకి వెళ్ళే శూర్పణఖను ఒక్క హుంకారంతో శ్రీరాముడు అదుపు చేశాడు.

'ఓ సౌమిత్రీ! దుష్టులతో పరిహాసం పనికిరాదు. మీ వదినెకు ఆపద కలుగుకుండా చూడు. ఈ క్రూరాత్ములాలు మహోదరి ఐన శూర్పణఖను విరూపిగా చేయుము' అని ఆదేశించాడు. వెంటనే లక్ష్మణుడు తన ఖడ్గానికి పనిచెప్పాడు. శూర్పణఖ ముక్కు చెవులు కోసేసి విరూపిగా చేశాడు.

ముక్కు చెవులు కోయించుకొన్న భయంకర రూపిణి ఐన శూర్పణఖ వర్షాకాలంలో శబ్దం చేసే మేఘంలాగా గర్జిస్తూ పరుగులు పెట్టింది. పెడబొబ్బలు పెడుతూ లబోదిబోమంటూ అక్కడే నివసిస్తున్న ఖరుని దగ్గరకు పరుగెత్తింది. రాక్షసులతో ముచ్చట్లాడే ఖరుని దగ్గరకు వెళ్ళి శూర్పణఖ నేలపై పడిపోయింది. రక్తం ఓడుతున్న ముఖంతో ఉన్న శూర్పణఖను ఖరుడు ఏమైందని విచారించగా రామాదుల వృత్తాంతం, తాను భంగపడిన విషయం అంతా వివరించింది.

* * *

పదునాల్గు వేల రాక్షసుల రణభేరి

సర్గ - 19

రక్తంతో తడిసిపోతున్న విరూపి ఐన శూర్పణఖను చూసి ఖరుడు కుపితుడు అయ్యాడు. 'ఓ సోదరీ! లెమ్ము. నిన్ను ఈ స్థితికి తెచ్చిన అధముడు ఎవ్వడో చెప్పుము? ముందు వెనుకలు ఆలోచించకుండా నీ ముక్కు చెవులు కోసిన ఆ మొనగాడెవ్వడు? వాడికై వాడే మృత్యువును మెళ్లో వేసుకొన్నాడు. ఈ విషయం వానికి తెలియనట్లుంది.

కామరూపంతో స్వేచ్ఛాచారిణివైన నీపై దురాచారాన్ని చేసినది ఎవరు? ఋషీశ్వరుడా! లేక దేవ గంధర్వ జాతులకు చెందినవాడా? ఎవరో చెప్పుము. పాకాసురుని చంపిన సహస్రాక్షుడు తప్ప మరియొక్కడు ఈ సాహసానికి పూనుకోడు. క్షీరంతో కలిసిన నీరును హంస వేరు చేసినట్లుగా నా శరపరంపరతో నిన్ను బాధించిన వాడి ప్రాణాలను పీకిపారేస్తాను. సోదరీ! నీ దుఃఖానికి కారణం ఐన వానిని చూస్తూ ఊరుకోలేను. వాడిని సంహరించివేస్తాను. నా చేతిలో మృతిచెందిన వాని శరీరాన్ని కాకులు గద్దలు తింటాయి.

నా చేతికి చిక్కిన ఆ క్రూరుని ఎవ్వరూ రక్షించలేరు. నిన్ను ఈ దుస్థితికి తెచ్చిన ఆ దుర్జనుడు ఎవ్వడో త్వరగా చెప్పు' సోదరుని మాటలు విని వ్యథ చెందే శూర్పణఖ ఆనందించింది. 'సోదరా! మన దండకారణ్యంలో అయోధ్యాధిపతి ఐన దశరథుని పుత్రులు రామలక్ష్మణులు నిరుపమానసౌందర్యోపేతులు జితేంద్రియులైనవారు ఉన్నారు. వారు రాజచిహ్నాలు ఉన్నవారు. వారు దేవతలో? మనుష్యులో నాకు తెలియలేదు. వారి చెంత ఒక నవ యౌవ్వని ఉంది. ఆమె బహు చక్కని సుందరి. చక్కని శరీరానికి తగిన ఆభరణాలు ధరించి అందంగా కనబడుతోంది. ఆమె వల్లనే నేను ఇలా కురూపినయ్యాను. ఆ ఇద్దరి యువకులను నీవు రణరంగంలో సంహరించు. వారి రక్తాన్ని తాగి తృప్తి పొందుతాను. ఆ ముగ్గురిని అంతం చేస్తేనే నా మనస్సు కుదుటపడుతుంది' అని శూర్పణఖ చెప్పింది.

ఖరుడు ఆ మాటలు విన్నాడు. కోపంతో ఊగిపోయాడు. తన దగ్గర ఉండే యోధులలో 14వేలమందిని పిలిచాడు. 'ఓ యోధులారా! ఈ దండకారణ్యంలో ఇద్దరు మానవులు ఒక కాంతతో నివసిస్తున్నారు. మీరు వెళ్ళి ఆ ముగ్గురు దురాచారులను తుదముట్టించి రండి. ఆ ముగ్గురి రక్తాన్ని చూసి నా సోదరి తృప్తి పొందుతుంది. ఇదే నా ఆజ్ఞ. వారిపై రణానికి కాలు దువ్వి ఆ ముగ్గురిని అంతం చేసి రండి' అని వారిని యుద్ధానికి పంపించాడు. వారందరూ శూర్పణఖను వెంటబెట్టుకుని మేఘసమూహంలాగా శ్రీరామునిపైకి యుద్ధానికి వెళ్ళారు. రామాదులను చిటికెలో చంపేయవచ్చు అనే ఆలోచనతో రాక్షసులు వడివడిగా వస్తున్నారు. మనం అసురులం కదా! మానవమాత్రులను మేమే చంపేయగలం వీరంతా ఎందుకు దండుగ అని ఎవరికివారు అనుకొంటున్నారు. శూర్పణఖ నన్ను కాదన్న ఈ హీనులైన మానవులకు తగిన శిక్ష వేస్తున్నాను. ఇపుడు ఆ సీతకు, లక్ష్మణునకు బుద్ధి వస్తుంది అనుకొంటూ వేగంగా రాక్షససేనావాహినితో వస్తోంది.

* * *

రాక్షస యోధుల అంతం

సర్గ - 20

శూర్పణఖ పరుగున వచ్చి రామాదులను రాక్షసులకు చూపించింది. రాక్షసులు రామలక్ష్మణులను సీతను చూశారు. శ్రీరాముడు వారిని చూసి 'లక్ష్మణా! శూర్పణఖ రాక్షసులను తీసుకొని వచ్చింది. నీవు మీ వదినెను జాగ్రత్తగా కాపాడుతూ ఉండు. నేను వారి పని చెప్పి వస్తాను' అని చెప్పుతూ లేచాడు. అన్న ఆజ్ఞను శిరసావహించి లక్ష్మణుడు సీతాదేవికి రక్షణగా నిలిచాడు.

ధనుస్సు చేబూని శ్రీరాముడు 'ఓ రాక్షసులారా! రామలక్ష్మణులం మేం ఇరువురం దశరథుని పుత్రులం. మేము జనకసుత సీతతో కలిసి చొరరాని దండకారణ్యంలోకి వచ్చి మౌని ధర్మంతో కందమూలాలు తింటూ కాలం గడుపుతున్నాం. మీరెందుకు మమ్ములను బాధిస్తున్నారు? మహర్షుల ఆదేశం ప్రకారం రాక్షస పీడను వదిలించడానికి నేను ఈ సువర్ణ ధనుస్సును చేపట్టాను. మీకు మీ ప్రాణాలపై ఆశ ఉంటే ఇక్కడనుంచి పారిపొండి. లేకపోతే నాతో యుద్ధానికి సన్నద్ధులు కండి' అన్నాడు.

శ్రీరాముని ఆ మాటలు వారిలో కోపాన్ని పెంచాయి. 'ఓ మానవా! మా నాయకుడైన ఖరాసురునకు నీవు కోపాన్ని తెప్పించావు. మహాకాయుడైన ఖరుడు మా నాయకుడు. ఆయన దగ్గర పదునాలుగు వేలమంది భయంకరాకారులైన అతి బలవంతులైన రాక్షసులు ఉన్నారు. ఇప్పుడు నిన్ను నిర్జించడానికి మేము పదునాలుగు మందిమి ఉన్నాం. నీవు ఒంటరిగా పోరాడాలని వచ్చావు. నీకు మా దగ్గర నిలబడడానికే శక్తి లేదు. ఇక యుద్ధాన్ని ఎలా చేస్తావు? ప్రాణాలపై ఆశ వదులుకో. నీ చావు ఇక తథ్యం' అని రాక్షసులు రాముని బెదిరించారు.

వారందరూ కలిసి శ్రీరామునిపై శూలాలు విసిరారు. శ్రీరాముడు వారందరి శూలాలను తన శరాలతో తునుకలు చేశాడు. శ్రీరాముడు క్రోధావేశుడు అయ్యాడు. వెలుగులు విరజిమ్మే పదునాలుగు బాణాలను విల్లెక్కుపెట్టి వారిపై వదిలాడు. ఆ బాణాలు బంగారు రంగుతో తళతళలాడుతూ వేగంగా వెళ్ళి ఆ రాక్షసుల వక్షస్థలాలను చీల్చివేసి భూమిలోకి వెళ్ళాయి. ఆ శరధాటికి రాక్షసుల గుండెలు బద్దలు అయ్యాయి. వారందరూ మొదలు నరికిన వృక్షాల్లాగా నేలకొరిగారు.

అలా పడిపోయిన వారందరిని చూసిన శూర్పణఖ భయంతో వణికిపోయింది. భీకర ధ్వనులు చేసింది. గగ్గోలు పెడుతూ ఖరుని నివాసానికి పరుగెత్తింది. దుఃఖం పొంగి పొరలుతుండగా ఆమె నేలపై పడి కొట్టుకొంటోంది. ఆ ముఖం నిండా తెగిన ముక్కు చెవులనుండి కారిన రక్తపుచారికలు. వాటిపైన కన్నీరు చూడడానికి అసహ్యకరంగా ఏడుస్తోంది. జరిగినదంతా తలచుకొంటూ బిగ్గరగా అరుస్తూ రోదించసాగింది.

* * *

శూర్పణఖ ఖరుని రెచ్చగొట్టటం

సర్గ - 21

రాక్షస వినాశానానికే దాపురించిందా?ఏమిటి అని ఖరుడు ఏడుస్తున్న శూర్పణఖను చూసి అనుకొన్నాడు. చాలా కోపం తెచ్చుకొని 'ఓ సోదరీ! నీ తృప్తికొరకే రక్తం తాగే మహాయోధులైన పదునాలుగు వేలమంది రాక్షసులను పంపాను. మరల నీకు ఏమి జరిగింది? నీవు ఎందుకు ఏడుస్తున్నావు?' అని ఖరుడు అడిగాడు.

'శూర్పణఖా!నేను పంపిన వారు నా మాటను జవదాటరు. నా కోసం వారు అహర్నిశం పాటుపడతారు. ఇందరు ఉండగా నీవు ఎందుకు ఏడుస్తున్నావు? దుఃఖాన్ని వీడి నిరాశ నిస్పృహలను దూరం చేయి' అని ఖరుడు శూర్పణఖను ఓదార్చాడు. 'సోదరా! నా దురవస్థను చూసి నీవు బాధపడి నా కోసం, నన్ను అవమానించినవారిని అంతం చేయమని రాక్షసులను పంపావు. కాని వారందరిని ఒక్క శ్రీరాముడు అంతం చేశాడు. ఆ శ్రీరాముని వీరత్వాన్ని చూసి నేను భయంతో వణికిపోయాను. ఎటునుంచి ఏ ప్రమాదం వాటిల్లుతుందో అని నేను భయపడుతున్నాను. అందుకే నేను నిన్ను శరణు వేడుతున్నాను.

భయకంపితనైన నన్ను నీవు రక్షింపకున్న నాకు వేరే దారి లేదు. నీవు పంపిన వారందరూ ఆ వీరాధివీరుని శరాలకు ఆహుతి అయిపోయారు. అన్నా! నీకు నాపై జాలి ఉన్నచో రాక్షసులను అంతం చేస్తున్న ఆ రఘువీరుని సంహరించు. నీవు ఈ పని చేయకపోతే నేను ఇప్పుడే ప్రాణత్యాగం చేస్తాను. నీకు ఎంత బలం ఉన్నప్పటికీ ఆ దశరథరాముని ఎదిరించలేవని నాకు తెలుసు'అని ఖరుని శూర్పణఖ యుద్ధోన్ముఖుని చేసింది.

'సోదరా! నేను వీరుడను, శూరుడను అని నీవు ఊరకనే చెప్తుంటావు. కాని నీలో లేశమాత్రం వీరత్వం లేదు. మానవ మాత్రులైన రామలక్ష్మణులను ఎదిరించడానికే నీవు తటపటాయిస్తున్నావు. అందువలన నీకు పౌరుషం లేదని నేను అనుకోవడంలో పొరపాటు ఏదీ లేదు.

ఓ నిశాచరా! దండకారణ్యంలోకి వచ్చి ఉన్న ఆ సోదరులను నీవు అంతం చేయకపోతే రాక్షస జాతికే కళంకం ఆపాదించినవాడివి అవుతావు. నీకు యుద్ధం చేసే దమ్ము లేనప్పుడు ఇక నీవు ఇక్కడ ఉండడంలో అర్థంలేదు. వెంటనే నీ అనుచర గణంతో కలిసి నీ నిజ నివాసానికి వెళ్ళిపో. రాముని పరాభవాగ్నిలో నీవు నాశనం అవుతావు. శ్రీరాముడు మహా పరాక్రమశాలి. అతని సోదరుడు లక్ష్మణుడు కూడా గొప్ప శక్తిసామర్థ్యాలు గలవాడు. వాడే నా ముక్కు చెవులను కోసేసిన మొనగాడు.'

రాక్షసులలో వీరులు ఎవరూ లేరంటూ బాన పొట్టతో శూర్పణఖ ఖరుని సమీపంలో భోరున ఏడుస్తూ పలు విధాలుగా ఖరునిలో క్రోధాగ్ని ప్రజ్వలింపజేసే ప్రయత్నం చేస్తోంది.

* * *

ఖరుని యుద్ధాభిలాష

సర్గ - 22

శూర్పణఖ మాటలు ఖరునిలో రోషాన్ని ప్రేరేపించాయి. 'ఓ సోదరీ! నీకు ఎదురైన అవమానం నేను చూడలేకుండా ఉన్నాను. నిన్ను అవమానించిన వారిపై నాలో తీవ్రమైన కోపం రగిలిపోతోంది. రాముడు ఒక్క తుచ్ఛ మానవుడు. మహాయోధుడినైన నా ముందు రాముడెంతటివాడు? నీవు విచారించకు. ఇప్పుడే నేనే వెళ్ళి ఆ రాముని యముని దగ్గరకు పంపిస్తాను. అప్పుడు నీవు వేడి చల్లారకముందే ఆ రాముని రక్తాన్ని రుచి చూద్దువుగాని. నీవు విలపించకు' అంటూ ఖరుడు శూర్పణఖకు ఆనందం కలిగించే మాటలు అన్నాడు. అల్పాయుష్కుడైన రాముని చంపుతానని చెప్పే ఖరుని మాటలతో శూర్పణఖ పొంగిపోయింది. ఖరుని పొగడ్తలతో ముంచేసింది. వెంటనే ఖరుడు తన సేనాధిపతి ఐన దూషణను పిలిచాడు. 'దూషణా! నా కనుసన్నల సైగ కోసం వేచి చూసే మహామహులైన మహాయోధులను 14 వేలమందిని రణానికై సిద్ధం చేయి. మనమందరం వెళ్ళి ఆ దుష్టుడైన రాముని హతమార్చి వద్దాం. సర్వాయుధాలను తీసికొని నా రథాన్ని సిద్ధం చేయి. పులస్త్యవంశజులైన బలవంతులతో కలసి వెళ్ళి ఆ రాముణ్ణి నా కరవాలానికి బలి ఇస్తాను.' అని చెపుతుండగానే దూషణుడు–

'అయ్యా మేలిమి గుర్రాలను పూన్చి రథాన్ని సిద్ధపరిచాను. మీరు ఇప్పుడు యుద్ధోన్ముఖులు కావచ్చు' అని చెప్పాడు. బల్లాలు, ఖడ్గాలు, బాణాలు అన్నీ తీసుకొని ఖరుడు బంగారు చక్రాలు ఉన్నా పెద్ద ఆకారంతో ఉన్న రథం దగ్గరకు వచ్చాడు. ఆ రథంపైన పూలు, చెట్లు, సూర్యచంద్రులు, పక్షులు రకరకాలుగా చెక్కి ఉన్నారు.

పతాకంతో శోభిల్లుతున్న రథాన్ని ఖరుడు ఆవేశంగా అధిరోహించాడు. దాన్ని చూసిన రాక్షసవీరులు ఆయన దగ్గరకు రణం చేయడంకోసం గుమికూడారు. దూషణుడు ఆయుధాలను ధరించి రణభూమికి వెళ్ళడానికి సిద్ధపడ్డారు. వారినందరిని చూసి ఖరుడు చాలా సంతోషంతో యుద్ధానికి బయలుదేరండి' అంటూ, ఆజ్ఞనిచ్చాడు.

ఖరుని సైన్యం నాయకుని ఆజ్ఞనందుకొని రణోత్సాహంతో మహానాదంతో జనస్థానం నుండి వేగంగా ముందుకు ఉరికారు. శత్రు భయంకరులైన వారి చేతులలో గండ్రగొడ్డళ్ళు, కత్తులు, కటార్లు, ఖడ్గాలు, చక్రాలు ధరించారు. కొందరి చేతులలో ముళ్ళగదలు, ఇనుప పొన్ను ఉన్న రోకళ్ళు, ఎనిమిది అంచులున్న ఆయుధాలు ఉన్నాయి. కొంతమంది రాక్షసులు ఖరుని రథానికి ముందుభాగంలో మరికొంతమంది వెనుకభాగంలో నడుస్తుండగా ఖరుడు మహోత్సాహంగా రథంలో పోరుకు బయలుదేరాడు.

అందరిలో యుద్ధాభిలాష ఎక్కువై శత్రువును భయంతో ముంచేటట్లు పెద్ద పెద్దగా అరుస్తూ పరుగెత్తారు. ఖరుడు యుద్ధోత్సాహం ఇనుమడింపచేయాలని సారథిని పెద్దగా ప్రోత్సహిస్తున్నాడు. నాయకుని సమరాభిలాషను చూసి సారథి గుర్రాలను వేగంగా తోలడానికి అదలిస్తున్నాడు.

* * *

ఖరుని ప్రగల్భాలు

సర్గ - 23

ఖరునికి ఎదురైన అపశకునాలు

మహోత్సాహంతో రణగొణ ధ్వనులతో పోతున్న ఖరుని సైన్యానికి బూడిద రంగులలోని మేఘాలు దట్టంగా ఆవరించి రక్తధారలను వర్షించాయి. ఇంకాస్త ముందుకు వెళ్ళగానే చక్కని చదునైన రాజమార్గంలో వెళ్ళే గుర్రాలు తొట్రుపడ్డాయి. నల్లని ఆకాశంలో సూర్యుని చుట్టూ ఉన్నట్టుండి ఒక ఎర్రని కాంతి వలయం కనిపించింది. అన్నీ అపశకునాలు కనిపించాయి.

మరికొంతసేపటికి ఖరుని రథంపై ఉన్న ధ్వజంపైన గద్ద ఎగురుతూ వచ్చి దానిపై కూర్చుంది. క్రూరమృగాలు కర్ణకఠోరంగా అరుస్తూ తిరిగాయి. పక్షుల గుంపులు ఆర్తనాదం చేస్తున్నట్లుగా వికృతంగా అరిచాయి. నక్కలు ఊళలు పగటి పూట అమంగళకరంగా వినవచ్చాయి. ఆకాశం నిండా నల్లని మేఘరాశి ఆవరించింది. దాంతో సూర్యుడు మబ్బుల చాటుకు వెళ్ళాడు. పట్టపగలు చిమ్మచీకట్లు అలుముకొన్నాయి. సంధ్యాకాలం బాగా భూమినంతా ఎర్రని కాంతులు చేరాయి. రాబందులు నక్కలు గద్దలు ఖరుని రథం ముందు చేరి గోల చేశాయి. అది రాహుకాలం అవడంతో రాహువు సూర్యుని మింగివేశాడు. పెనుగాలులు తీవ్రంగా వీచాయి. పగటి పూట నక్షత్రాలు మినుకు మినుకు మంటూ కనిపించాయి.

తామర కొలనులో తామరలు వాడిపోయాయి. చేపల్లాంటి జలచరాలు నీటి అడుగుకు చేరాయి. చెట్లు ఆకులను, పూలను రాల్చేసి మోడుగా నిల్చున్నాయి. ప్రచండమైన గాలికి ధూళి తోడైంది. గోరువంకలు కూశాయి. ఆకాశం నుండి ఉల్కలు జారాయి. కొండలు నదులు అడవులతో నిండిన భూమి ఒక్కసారి కంపించింది. ఖరుని ఎడమ భుజం అదిరింది. అతడి గొంతు పిడచ కట్టుకుపోయి మాట పెగలలేదు. అనుకోకుండా నొసలు బాధపెట్టాయి. కళ్ళలో నీరు ఉబికి వచ్చింది. ఐనా ఖరుడు యుద్ధం నుంచి వెనుకడుగు వేయలేదు.

ప్రగల్భాలు

ఇన్ని భయోత్పాతాలు కనబడినా మూర్ఖశిఖామణి ఐన ఖరుడు "ఓ యోధులారా! నేను ఎవరినీ వేటినీ లెక్కచేయను. మనకు భయంకలిగించే ఈ అపశకునాలను చూసి భీతిచెందే భీరువు నేను గాదు" అంటూ గర్వంగా అరిచాడు."వీరులారా!నేను నక్షత్రాలను సైతం నా బాణంతో రాలగొట్టగలను. నన్ను చూసి మృత్యుదేవతే భయపడాలి. శూర్పణఖను అవమానించిన ఆ లక్ష్మణుని మట్టి కరిపించి కాని నేను వెనుతిరగను. నా చేతిలో రామలక్ష్మణులు నేడు హతులు అవ్వడం ముమ్మాటికి నిజమై తీరుతుంది. నాకెప్పుడూ జయమే సిద్ధిస్తుంది, మీరందరూ చూడండి. మహిమోపేతమైన వజ్రాయుధధారి మహేంద్రుడినే నేను తుదముట్టించగల వీరుడను. నాకు ఈ మానవమాత్రులు సమ ఉజ్జీలు కారు" అంటూ కలవరపడుతున్న సైన్యాని ధైర్యాన్ని నూరిపోయాలని ఆశించిన ఖరుడు మాట్లాడాడు. అపశకునాలు చూసి భీతిచెందే ఖరుని సైన్యం తిరిగి ఉత్సాహాన్ని పొందింది. ఖరుని ప్రగల్భాలతో వారిలో సంతోషం ఉప్పొంగింది.

ఈ యుద్ధం చూడటానికి ఋషులు, దేవతలు, గంధర్వులు, సిద్ధచారణులు, ఋషులు అందరూ అక్కడికి వచ్చారు. వారందరూ ఒకరితో ఒకరు నేడు మహావిష్ణువు రాక్షసులను అంతం చేసినట్లుగా శ్రీరాముడు ఖరాదులను మట్టుపెట్టాలి. గోవులను, సాధువులను, విప్రులను నాశనం చేసే ఈ ఖరుడు లోకకంటకుడు నిర్మూలించబడాలి. శ్రీరాముడు ఈ పౌలస్త్యవంశజులందరిని యమపురికి పంపి విజయుడవ్వాలి అనుకొంటున్నారు.

రాక్షసయోధులందరూ ఖరుని వెంట పోసాగారు. శ్యేనగామి పృథుగ్రీవుడు, యజ్ఞశత్రువు, విహంగముడు, దుర్జయుడు, కరవీరాక్షుడు, పరుషుడు, కాలకర్ముకుడు, మేఘమాలి, మహామాలి, సర్పాస్యుడు, రుధిరాశనుడు అనే పన్నెండుమంది మహావీరులు ఖరుని వెంట వెళ్ళారు.

మహాకపాలుడు, స్థూలాక్షుడు, ప్రమాధి, త్రిశరుడు అనే నలుగురు సేనాపతుల దూషణునితో సాగారు. సమరోత్సాహులైన వీరాధివీరులు రాక్షసయోధులు ముందుకు పరుగెత్తి రామలక్ష్మణుల దగ్గరకు చేరారు.

* * *

శ్రీరాముడు యుద్ధ సన్నద్ధుడు కావటం

సర్గ - 24

ఖరుని సైన్యం రావడం వారికి అపశకునాలు ఎదురు అవడం చూసి శ్రీరాముడు "లక్ష్మణా! సమస్త ప్రజానీకానికి అశుభాలను సూచించే ఈ అపశకునాలు రాక్షస సంహారాన్ని తెలుపుతూ నల్లని మేఘ సమూహాలు భయంగొల్పేటట్లు ఉరుముతున్నాయి. ఇవి రక్తధారలను వర్షిస్తున్నాయి. బంగారు మొనలు ఉన్న మన బాణాలు శత్రువులపైకి వెళ్ళాలనే ఉత్సాహంతో ప్రతాపాన్ని చూపెడుతున్నాయి.

"సౌమిత్రీ! ఈ పక్షుల అరుపులు మనకు భయంలేదని చెప్తూనే భవిష్యత్తులో ఘోర యుద్ధం చేయాల్సి వస్తుందని సూచిస్తున్నాయి. లక్ష్మణా! నా కుడిభుజం ఒకటే అదురుతోంది. దీన్నిబట్టి మనం విజయం సాధిస్తామని నా మనస్సు చెప్తోంది. ఉత్సాహంతో ఉన్న నీ ముఖం కూడా మెరుస్తూ మన విజయాన్నే సూచిస్తోంది. సమరానికి బయలుదేరేవారి ముఖంలో ప్రసన్నత కరువై వెలవెలబోతుంటే వారికి అపజయం తప్పదని తెలుస్తుంది.

సౌమిత్రీ! మన మీదకు వచ్చే ఆ రాక్షసుల ధ్వని వినబడుతోంది గదా. రణభేరినాదం మారుమోగుతోంది. తెలివిగల వారు ఆ రాబోయే ఆపదలను తెలుసుకొని వాటి నివారణోపాయాన్ని తెలుసుకోవాలి. లక్ష్మణా! నీవు సీతను తీసుకొని ఒక కొండ గుహను వెదికి దానిలో ఆమెను సురక్షితంగా ఉంచు. నీవు అక్కడే కాపలాగా ఉంటూ మీ వదినెను రక్షించు" అంటూ యుద్ధానికి సన్నద్ధం అయ్యే లక్ష్మణుని చూచి రాముడు ఇంకా ఇలా చెప్పాడు. 'లక్ష్మణా! నీవు బలశాలివి. ఇప్పుడు వచ్చేవారినందరినీ నీవు ఎదిరించగలవు. కాని నేను వారిని హతమార్చాలని అనుకొంటున్నాను. అందుకని నీవు ఒక దుర్గమమైన గుహను, చొరరాని దానిని బాగా చూసి మీ వదినెను రక్షించు. నేను ఈ రాక్షసులను తుదముట్టించి మీ దగ్గరకు చేరుతాను.'

లక్ష్మణుడు అన్న ఆజ్ఞను విన్నాడు. రాముని మాట తనకు వేదవాక్యం. కనుక ఆయన మాటను పాటించాలనుకొన్నాడు. వెంటనే సీతమ్మ దగ్గరకు వెళ్ళాడు. విషయం చెప్పాడు. సీతాదేవిని తీసుకొని ఒక చొరరాని గుహ దగ్గరకు వెళ్ళాడు. దాన్ని చూసి రాముడు తృప్తితో కవచాన్ని ధరించాడు. రాక్షస సంహారాన్ని చేయాలని గట్టిగా అనుకొన్నాడు.

అప్పుడు శ్రీరాముడు పొగలేని అగ్నిలాగా తేజరిల్లాడు. చేతిలో వింటిని పట్టుకొని నిలబడి దిక్కులు చూస్తూ ధనుష్టంకారం చేశాడు. ఆకాశమార్గంలో దేవతలు, గంధర్వులు, సిద్ధులు, చారణులు, మహర్షులు వచ్చి నిలిచారు. భృగుమహర్షి కూడా వారి దగ్గర చేరి శ్రీరామ యుద్ధాన్ని చూడాలనే కుతూహలంతో శ్రీరాముడు చేసిన వింటినారి శబ్దాన్ని శ్రద్ధగా ఆలకించారు.

వారందరూ ఖరుని సైన్యాన్ని చూసి అంతులేని దురాగతాలకు పాల్పడే ఈ నీచులు పదునాలుగు వేలమంది ఉండగా ధర్మాత్ముడు సాధు రక్షకుడైన శ్రీరాముడు ఒక్కడే ఉన్నాడు. మహాయుద్ధం ఎలా ఉంటుందో?

మహావీరాధివీరుడైన శ్రీరాముడు వీరినందరిని ఎలా ఎదుర్కొంటాడోనన్న ఆలోచనలు వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రణభూమిలో ఒంటరిగా నిలబడ్డ శ్రీరాముడు పినాకపాణి ఐన మహాశివునిలాగా కనబడ్డాడు.

రాక్షససేన శత్రువును నేనే చంపుతాను. నేను చంపుతా అంటూ భీకరంగా అరుస్తున్నారు. పిచ్చిపట్టిన వారిలాగా ఎగురుతూ దూకుతూ శ్రీరాముని ముందుకు పరుగెత్తి వస్తున్నారు. ఈ సేనను చూసిన క్రూరమృగాలు భయపడి పరుగు లంకించుకొన్నాయి. యుద్ధానికి వచ్చిన ఖరుని సేననంతటిని ఆయుధపాణి ఐన శ్రీరాముడు ఒక్కసారి పరికించాడు.

వెంటనే అమ్ముల పొదిలోనుంచి బాణాన్ని తీసి ఎక్కుపెట్టి నిలిచాడు. ప్రళయకాలాగ్ని లాగా తేజరిల్లే శ్రీరాముని చూసి వనదేవతలు భయపడ్డారు. దక్షుని యజ్ఞం ధ్వంసం ఒనర్చడానికి సిద్ధపడిన త్రిశూలధారిలాగా ఖరుని సేనను అంతం చేయడానికి శ్రీరాముడు వింటిని చేబూనాడు.

కదనరంగంలో నిలబడ్డ శ్రీరాముని చూసి ప్రాణులన్నింటిలో భయం ఆవేశించింది. ఖరుని సేన అంతా అగ్నిలాంటి కవచాలు ధరించి నల్లని మేఘరాశిలా కనిపించింది.

* * *

శ్రీరాముని చేతిలో రాక్షసులు అంతం

సర్గ - 25

ఖరుడు సర్వసన్నద్ధుడై ధనుస్సు చేబూని నిలబడిన శ్రీరాముని చూశాడు. సారథీ! ఆ రాముని ఎదురుగా రథం నిలుపు - అని తన సారథికి చెప్పాడు. ఖరుని చూసి మిగతా సేనాపతులు రామునిపై విజృంభించారు. అలా వచ్చిన ఖరుణ్ణి రాముడు కోపంగా చూశాడు. రాముణ్ణి భయపెట్టడానికి ఖరుడు పెద్దగా అరుస్తూ వేయి బాణాలను ప్రయోగించాడు. కత్తులు, ఈటెలు, గొడ్డళ్లు, గదలు, ఖడ్గాలు ఎవరి చేతిలో ఆయుధాన్ని వారు శ్రీరామునిపైకి విసరివేశారు. మహాపర్వతంపై మేఘాలు వర్షధారలను కురిపించినట్లు రాక్షసులు రామునిపై బాణాలను కురిపించారు. రాక్షససంహారం చేస్తానని ప్రతిజ్ఞ చేసిన రాముడు వారి బాణాలన్నింటిని తుత్తునకలు చేశాడు. ఆయుధాలన్నింటిని నాశనం చేశాడు. వారందరూ ఒక్కసారిగా రామునిపైకి రాగా రాముడు మేఘాలు కప్పిన సూర్యునిలాగా కనిపించాడు. తన ధనుస్సును మండలాకారం చేసి శత్రువులపైకి వందలకొలది బాణాలను రాముడు ప్రయోగించాడు. అవన్నీ రాక్షసుల యోధుల శరీరాలను ముక్కలు చేశాయి.

శ్రీరాముని ధనుర్మండలం నుండి ఎన్నో బాణాలు శత్రువులను మట్టి కరిపించాయి. ఒక్క రామునిపైకి 14వేలమంది రాక్షసులు రావడం చూసి దేవ గంధర్వ కిన్నరులు, సిద్ధులు, మహర్షులు అందరూ బాధపడ్డారు. ఆ రాక్షసుల ఆయుధాలు రాముని శరీరాన్ని బాధించడంతో ఆయన అవయవాలనుండి రక్తం బయటకు చిమ్మింది.

రాముడినే చూస్తున్న లక్ష్మణునకు సంధ్యాసమయంలోని సూర్యుడిలా రాముడు కనిపించాడు. రాముణ్ణి అన్ని బాణపు దెబ్బలు బాధిస్తున్నా, కాస్తకూడా బాధపడకుండా శత్రువులను యమపురికి పంపడంలో నిమగ్నుడయ్యాడు. శ్రీరాముని బాణాలు గుచ్చుకొన్న వారు గట్టిగా ఆర్తనాదం చేస్తున్నారు. వారందరూ దావాగ్నికి దగ్ధమై నిస్తేజమైన వనంలాగా సుఖాన్ని మరిచారు. కొందరు రాక్షసులు రాముని ఎదురుగా నిలిచి గదలు గొడ్డళ్ళు శూలాలు ప్రయోగించారు. వాటినన్నింటిని రాముడు అవలీలగా నాశనం చేశాడు. రథాలను విరగగొట్టాడు. గజాలను, అశ్వాలను, యోధులను అందరిని వరుసగా అంతం చేస్తూ శ్రీరాముడు ముందుకు సాగాడు.

వారందరిపైన గాంధర్వాస్త్రాన్ని రాముడు ప్రయోగించాడు. ఆ రణభూమి అంతా శిరస్సు తెగిన పడిన వాళ్ళతో చేతులు ముక్కలు అయినవాళ్ళతో వక్షస్థలం బద్దలు అయినవాళ్ళతో గుట్టలుగా నిండింది. ఇదంతా చూసి మిగిలిన రాక్షసులు చిందర వందర అయ్యారు. చాలా భయపడిపోయారు. రణంపై నిరాసక్తిని పెంచుకొన్నారు. ప్రాణాలపై ఆశ చావక వారందరూ ఖరుని దగ్గరకు వెళ్ళి మొరపెట్టుకున్నారు. వారినందరిని ఖరుడు ఓదార్చి మనదే విజయం అని నమ్మబలికి వారిని కూడా తీసుకొని మళ్ళీ రాముడిపైకి భీకరంగా పరుగెత్తాడు. వృక్షాలు, శిలలు ధరించి వాటిని రామునిపైకి విసిరేశారు. రాముడు వాటిని మధ్యలో తుంచేశాడు. అలా ఖరుని సేనకు రామునకు మధ్య మహాభీకరమైన యుద్ధం జరిగింది.

గంధర్వాస్త్రం రాముడు ప్రయోగించగా వేలకొలది బాణాలు రాక్షసులను చుట్టుముట్టడం వలన చీకట్లు కమ్ముకొన్నాయి. ఆ చీకట్లో వారికి రాముడు బాణాలను తీయడం ఎక్కుపెట్టడం కనిపించలేదు. రాముని బాణానికి హతులు అయినవారి సంఖ్య అంతకంతకు పెరిగి భూమి అంతా రాక్షసుల మృతదేహాలతో నిండిపోసాగింది. ఆయుధాలన్నీ చూర్ణం అయ్యి పడిపోయి ఆ రణభూమి భయంకరంగా కనిపించింది.

* * *

అంతమైన దూషణుని సేన

సర్గ - 26

సేన అంతా నాశనం చెందడం దూషణుడు చూశాడు. రాముడిపై విపరీతమైన కోపంతో ఐదువేలమంది రాక్షసులను వెంటబెట్టుకొని విజృంభించాడు. వారందరూ రామునిపైకి ఎడతెరిపి లేకుండా వృక్షాలను, శిలలను, బాణాలను వేయసాగారు. వాటిని చూసి రాముడు భయం లేకుండా తన శరపరంపరను కురిపించారు. అవన్నీ ముక్కలుగా తెగిపడిపోయాయి.

రాముడు ఎదురులేనివాడై ఖరుని సేనాపతిపైన వాని అనుచరులపైన బాణ ప్రయోగాన్ని చేశాడు. వారందరూ కుపితులై రామునిపై ఖడ్గాలను ప్రయోగించారు. వాటిని నిగ్రహిస్తూనే రాముడు దూషణుని ధనుస్సును తన ఖడ్గంతో ముక్కలు చేశాడు. రథాన్ని రథసారథిని కూల్చివేశాడు. దూషణుని వక్షస్థలం బాణాల దెబ్బలతో రక్తం

స్రవించింది. అయినా కష్టపడి దూషణుడు ఇనుపగుదిని చేపట్టాడు. అది బంగారు రేకులతో చుట్టబడి శత్రు భయంకరంగా ఉంది. దాన్ని చూసి దూషణుడు కోపంగా రాముని మీదకు వెళ్ళాడు. రాముడు దూషణుని రెండు హస్తాలను రెండు బాణాలతో తెగనరికాడు. చేతులు కోల్పోయిన దూషణుడు దంతాలు ఊడిన మహాగజంలాగా నేలపై పడిపోయాడు. దాన్ని చూచిన రాక్షస వీరులు చావు మూడి రామునిపైకి ఎగబడ్డారు.

వారందరిని రాముడు తన బాణాలతో సత్కరించాడు. ఆయుధాలను నుగ్గు చేశారు. మహాబలవంతులైన సేనాపతులందరిని మట్టి కరిపించాడు. ఖరుడు వారందరూ మృతులు అవటం చూశాడు. ఒక్క మానవుడు ఇంతమంది రాక్షస వీరులను చంపడం చూసి మహా క్రుద్ధుడయ్యాడు. వెంటనే తన పన్నెండుమంది మహాయోధులను తీసుకొని రామునిపైకి పరుగెత్తాడు. వారందరూ రామునిపై ఎడతెగని బాణాలను వేశారు.

రాముడు వాటినన్నింటిని బంగారు మొనగల తన బాణాలతో ముక్కలు చేశాడు. వందమంది రాక్షసులు ఎదురైనప్పుడు వంద బాణాలతో, వేయిమంది వచ్చినపుడు వేయి బాణాలతో వారిని రాముడు నిర్మూలించాడు. ఆ బాణాల ధాటికి రాక్షసులు ధరించిన ఆభరణాలు కవచాలు ఊడిపోయాయి. వారి అవయవాలన్నీ కూడా దెబ్బతిన్నాయి. ఆయుధాలు ముక్కలై పడిపోయి భూమి అంతా పరచుకొన్నాయి. ఆ నిశాచరులందరూ రక్తసిక్తమైన శరీరంతో నేలపై పడి ప్రాణాలు విడిచారు.

రాముని ఒక్క చేతిలోనే పదునాలుగు వేలమంది రాక్షసులు చనిపోయారు. ఎట్టి వాహనం లేకుండా భూమిపై నిలబడే వారినందరిని మట్టిలో కలిపేశాడు. యుద్ధభూమిలో ఖరుడు, త్రిశరుడు ఇద్దరే మిగిలారు. మిగతా వారందరూ రాముని చేతిలో హతులైపోయారు. దీనినంతా చూసి ఖరుడు ఖిన్నుడయ్యాడు.

* * *

త్రిశిరుని సంహారం

సర్గ - 27

రాముని పైకి వెళ్ళే ఖరుని త్రిశిరుడు ఆపి 'ఓ మహానాయకా! ఇందరి వీరులను చంపిన ఆ రాముని నేను చంపేస్తాను. ఆ అవకాశాన్ని నాకు ఇమ్ము. ఒక్క క్షణంలో మహావీరాధివీరుడైన రాముడిని హతమార్చి మీకు ఆనందం కలిగిస్తాను. ఒకవేళ అలాకాక నేనే రాముని చేతిలో చచ్చిపోయినట్లు అయితే అప్పుడు మీరు యుద్ధం చేయండి. ముందుగా నాకు అవకాశాన్ని ఇమ్ము' అని త్రిశిరుడు అడిగాడు.

త్రిశిరుని సమరోత్సాహాన్ని చూసిన ఖరుడు వెళ్ళు ఆ రాముని యమపురికి పంపు అంటూ ఆయనను రెచ్చగొట్టి పంపాడు. త్రిశిరుడు రథం ఎక్కి మహాపర్వతంలాగా రాముని ముందుకు వెళ్ళాడు. పెద్దగా అరుస్తూ రామునిపైకి బాణాలు కురిపించాడు. తనపైకి వేగంగా దూసుకొచ్చే బాణాలను, రాక్షసుని చూసి రాముడు విల్లు

ఎక్కుపెట్టి ఘోరంగా పోరాడాడు. సింహగజాల పోరులా రాముడు త్రిశిరుడు పోరాడారు. రాముని ఫాలభాగాన్ని మూడు బాణాలతో త్రిశిరుడు కొట్టాడు. రాముడు తనకు తగిలిన బాణాలను చూసి ఏమి ఈ రాక్షసుని బలం. ఇతని బాణాలు నాకు పువ్వుల్లా గుచ్చుకొన్నాయి అనుకొంటూ పదునాలుగు బాణాలతో త్రిశిరుని వక్షస్థలాన్ని రాముడు ఛేదించాడు. నాలుగు బాణాలతో రథాన్ని, ఎనిమిది బాణాలతో రథసారథిని కూల్చివేశాడు.

రథాన్ని, రథ సారథిని మట్టుబెట్టడం చూసి త్రిశిరుడు భూమిమీదకు దూకబోయాడు. మళ్ళీ రాముని బాణాలు వచ్చి త్రిశిరుని వక్షస్థలాన్ని ముక్కలుగా ఖండించివేశాడు. రాముడు క్రుద్ధుడై ఆ త్రిశిరుని మూడు తలలను ఖండించాడు. ఆ రాక్షసుని మొండెం నేలపై పడిపోయింది. ఇక అక్కడ ఖరుడే మిగిలాడు. ఖరుని బలాలు దీన్ని చూచి భయంతో పారిపోయాయి.

* * *

ఖరునితో శ్రీరాముని పోరు

సర్గ - 28

యుద్ధంలో అందరూ చావడం చూసి ఖరుడు భయకంపితుడు అయ్యాడు. ఒక్క మానవుడు ఇంతమందిని మట్టికరిపించాడే అనే ఆలోచన ఖరునిలో భయాన్ని పుట్టించింది. అయినా పట్టువదలక భీకరంగా రామునిపైకి ఖరుడు దూసుకెళ్ళాడు. రథంపైనుండి రామునిపైకి శస్త్ర ప్రయోగం చేశాడు. దశదిశలను తన బాణాలతో నింపివేశాడు. రఘురాముడు తన తిరుగులేని బాణాలను ఎక్కుపెట్టి వాటినన్నింటిని కూల్చివేశాడు.

ఆ ఇద్దరూ ఒకరిని మించి మరొకరు బాణాలు వేయగా ఆకాశం అంతా శరాలతో నిండిపోయింది. ఖరుడు 'వికర్ణి' అనే అస్త్రంతో రాముని బాధించాడు. రాముడు ఇంతమందిని చంపి అలసిపోయి కూడా మహోత్సాహంతో నిలబడ్డాడు. ఆ రాముణ్ణి చూసి ఖరుడు ఇతడు మహాశక్తి సంపన్నుడు అని అనుకొన్నాడు.

మిడుత అగ్నిని మింగాలని వెళ్ళినట్లుగా ఖరుడు రామునిపైకి దూసుకెళ్ళాడు. సింహం కుందేలును చూచినట్లు రాముడు ఖరుని చూశాడు. రాముని పరాకుని చూసి ఖరుడు ఏడు బాణాలతో రాముని కవచాలను కొట్టాడు. దానితో ఆ కవచం నేలపై పడిపోయింది. దాన్ని చూసి రాముడు కుపితుడై ఖరునిపై బాణవర్షాన్ని కురిపించాడు.

ఖరుడు పెద్దగా నాదం చేస్తూ రామునిపైకి బాణాలను వదిలాడు. దాన్ని చూసి రాముడు తనకు అగస్త్యుడు ఇచ్చిన గొప్ప వైష్ణవ చాపాన్ని చేతబట్టి ఖరుని నిర్జించడానికి పూనుకొన్నాడు. రాముడు ఖరుని రథాన్ని ధ్వజాన్ని ముక్కలుగా చేశాడు. ఖరుడు కోపంతో రామునిపైకి అనేక బాణాలను వేశాడు. ఆ ధాటికి రాముని శరీరం గాయపడి రక్తసిక్తం అయ్యింది. క్రోధావేశంతో రాముడు మహాధనుస్సును ఎక్కుపెట్టి ఆరు బాణాలను ఖరునిపై వేశాడు.

వాటిలో ఒక శరం ఖరుని శిరమును, రెండు బాహువులను, మూడు వక్షస్థలాన్ని బాధించాయి. సూర్యకిరణాలలాగా ప్రజ్వరిల్లే పదమూడు బాణాలను రాముడు ఖరునిపై ప్రయోగించాడు. అవన్నీ ఖరుని రథసారథిని రథాన్ని చక్రాలను ఇరుసులను ధనుర్బాణాలను ఖండించివేశాయి. ఖరుని రథం అశ్వాలు అన్నీ హతమవగా నీరుగారిపోరుతూ కూడా ఖరుడు గదను ధరించి రామునిపైకి ఎగిరాడు.

దీనినంతా చూస్తున్న వారందరూ రఘురాముని కొనియాడారు. రాక్షసులను హతమార్చడం చూసి రాక్షస పీడ వదిలిందని ఎంతో సంతోషించారు. రామునకు వారందరూ నమస్కరించారు.

* * *

ఖరుని శ్రీరాముని వాగ్వివాదం

సర్గ - 29

అన్నీ పోగొట్టుకొని కూడా ఆశ చావక మరలా యుద్ధానికి వస్తున్న ఖరుని చూసి శ్రీరాముడు 'ఓ నిశాచరా! నీవు అశ్వగజ పదాదిబలాలతో కూడిన సైన్యాధిపతివి అయినా దుష్కర్మలకు పాల్పడుతున్నావు. పరులకు కీడు తలపెట్టే వాడు లోకంలో ఎక్కువ కాలం సుఖంగా ఉండలేడు. సమస్త ప్రాణాలను భయపెట్టేవాడు ముల్లోకాధిపతి ఐనా వాడు నాశం అవ్వక తప్పదు. లోకకంటకులను ఎవరూ భరింపలేరు. దుష్టసర్పాన్ని చంపివేసినట్లు దుష్టులను సంహరిస్తారు. కామక్రోధలోభమదమాత్సర్యాలచే పాడుపని చేసినవాడు తన పనికి విచారించకపోతే తాను చేసిన పాపకర్మలను చూసుకొని పశ్చాత్తాపపడకపోతే వానికి వినాశకాలం దాపురించినట్లే. వాడి సర్వైశ్వర్యాలు పోతాయి. తన మరణాన్ని తానే కొనితెచ్చుకొన్నట్లుగా వాడు చేసిన పాపం వాడిని తుదముట్టించక మానదు.

ఓ పాపాత్ముడా! ఈ దండకారణ్యంలో సర్వాన్ని త్యజించి ముక్కు మూసుకొని తపం చేసేవారిని పొట్టన బెట్టుకొని నీవు సాధించినది ఏమిటి? పాపాత్ములు ధనాన్ని కూడబెట్టినా, ఐశ్వర్యాన్ని చేజిక్కించుకొన్నా వేర్లు లేని చెట్టులా నాశనం అవక తప్పదు. పాపాలు చేసినవారు వారి పాపఫలాన్ని అనుభవించక తప్పదు. విషపదార్థాలను తిని ఎవరు కూడా ఎలా బతకరో, ఆ విధంగానే పాపకృత్యాలు చేసేవారు మరణించక తప్పదు. నీలాంటి దుష్టులను యమపురికి పంపడానికే నా తండ్రి దశరథుడు నన్ను ఇక్కడకు పంపాడు. నావలన మృతిచెందినవారు వీరస్వర్గాన్నే పొందుతారు. నీవు కూడా ధర్మాత్ములు వెళ్ళిన లోకాలకే వెళ్ళాల్సి ఉంది. నా బాణాల దెబ్బలు తగిలి నీవు నరకయాతన అనుభవిస్తుంటే నీవు బాధించిన వారు పైనుండి సంతోషంగా చూస్తారు. ఓ రాక్షసాధమా! నీవు నాపై ఎన్ని బాణాలు వేసినా నేను తాటిపండును ఒలిచినట్లుగా నీ తలను తెగనరుకుతాను.' ఇలా చెప్పే రాముణ్ణి చూచి ఖరుడు ఆవేశపరుడయ్యాడు.

'ఓ దాశరథీ! సాధారణ సైనికులను రథ సారథులను చంపి మహావీరునిలాగా విర్రవీగకు. నీవు చేసిన యుద్ధం ప్రశంసించడానికి అర్హమైనది కాదు. వీరులు తన శక్తియుక్తులను చూసుకొని తామే గర్వపడరు.

క్షత్రియయోధులు నీలాగా ప్రగల్భాలు పలుకుతారు. వీరుడైన ఎవరూ తన ప్రశస్తి తన వంశ ప్రతిష్ఠను చాటుకోరు. నీ ఆత్మస్తుతి వలన నీవు ఎంత గొప్పవాడివో నాకు తెలుస్తుంది. శత్రువుల రక్తపు చారికలతో ఒప్పారే ఈ నా చేతిగదను నీవు చూడలేదా? నీ ఎదురుగా నేను యుద్ధానికి నిలబడ్డాను కదా! నన్ను గుర్తించలేదా? నీ ప్రాణాలను హరించడానికి నేనొక్కడినే చాలును. నా గురించి చెప్పవలసింది చాలా ఉంది. కాని సూర్యాస్తమయం కాబోతోంది. 14 వేలమందిని చంపిన నిన్ను నా గదకు బలి ఇచ్చి వారి మనోవ్యథను తీర్చుతాను' అంటూ ఆ గదను రామునిపైకి విసిరాడు ఖరుడు. మంటలను చిమ్ముతూ ఆ గద రామునిపైకి వస్తోంది. దాన్ని చూసి రాముడు తన బాణాన్ని ప్రయోగించి గదను ముక్కలు చేశాడు. ఆ గద నేలపాలయింది.

* * *

ఖరుని యమపురి ప్రయాణం

సర్గ - 30

గదను ఛిన్నాభిన్నం చేసి శ్రీరాముడు 'ఓ రాక్షసాధమా! ఇదేనా నీ బలం! ఊరకనే ప్రగల్భాలు ఆడకు' అన్నాడు. 'నీవు చనిపోయిన వారి బంధువుల మనోవ్యథను తీర్చుతానంటివి. నీవు పలికినవన్నీ అబద్ధాలే కదా! నీవు నీచ రాక్షసుడివి. దుష్ప్రవర్తనుడవు. నేను నేడు నా బాణాలతో నిన్ను ముక్కలుగా ఖండించి వేస్తాను. నీ శరీరం నుండి పొగలు కక్కుతూ వచ్చే రక్తం భూమి పానం చేస్తుంది. నా బాణాల దెబ్బలతో నీ భుజాలు తుంచి వేస్తాను. నీవు ఈ భూమిపై పడి లేవలేక దీర్ఘనిద్రలో మునిగిపోతావు. నీవల్ల బాధపడే సాధువులందరూ నీ మరణాన్ని చూసి ఆనందిస్తారు. ఋషీశ్వరులందరూ నిర్భయంగా తపస్సు చేసుకొంటారు. నీ రాక్షస వనితలందరూ దిక్కులేక నా ధాటికి భయపడి పారిపోతారు.

నీ ప్రవర్తనను మెచ్చుకొనే నీ భార్యలందరూ నీ మరణంతో శోకానికి గురి అవుతారు. నీచరాక్షసా! నిన్ను అంతమొందించి సర్వప్రాణులకు సంతోషాన్నిస్తాను' అని చెప్పే రాముని మాటలు ఖరునిలో భయం పుట్టించాయి. అయినా 'ఓయీ! రామచంద్రా! ఎక్కువగా మాట్లాడుతున్నావు. నీ మృత్యువు నిన్ను చేరడానికి వేచి ఉంది. అది నీకు తెలియక ఏదేదో వాగుతున్నావు. వివేకాన్ని కోల్పోయి విచక్షణ నశించడంతో నీవు మాట్లాడే మాటలకు విలువ లేకుండా పోతోంది' అని ఖరుడు అన్నాడు.

ఖరుడు నలుదిక్కులా కలయచూశాడు. ఏదైనా కనిపిస్తే దానితో రాముణ్ణి బాధించాలని అనుకున్నాడు. వానికి మద్దిచెట్టు కనబడింది. దానిని పెరికి రామునిపైకి విసరివేస్తూ 'రామా! ఇక నీవు చచ్చినట్లే' అని అరిచాడు.

ఆ చెట్టును రాముడు తన బాణాలతో ముక్కలు చేశాడు. మహాకోపంగా ఖరుని తన శరపరంపరతో చీల్చి చెండాడాడు. ఖరుని శరీరం నుండి రక్తం ధారలా కారసాగింది. దాన్ని చూసి ఖరుడు చాలా ఆవేశం తెచ్చుకొని రామునిపైకి దూకాడు. ఖరుని చంపడానికి అస్త్రాలను ఎక్కుపెట్టి ఉన్న రాముడు ఖరుడు దూకడం చూసి రెండు అడుగులు వెనుక్కు వేశాడు. దేవేంద్రుడిచ్చిన బాణమును సంధించి రాముడు ఖరుని వక్షస్థలాన్ని చీల్చివేశాడు.

పరమశివుని కంటిమంటలకు అంధకాసురుడు భస్మమైనట్లుగా శ్రీరాముని శరాగ్నిలో మిడుతలాగా ఖరుడు దగ్ధం అయ్యాడు. ఇంద్రుని చేతిలో వృతాసురుడు హతమైనట్లుగా శ్రీరాముని చేతి బాణానికి ఖరుడు నేలకొరిగాడు.

ఖరుడు యమపురికి వెళ్ళడంతో అందరి మనసులు సంతోషంతో నిండాయి. రాజర్షులు, మహర్షులు అందరూ రాముని ప్రశంసించారు. వారందరు రామునితో 'ఓ శ్రీరామా! దేవేంద్రుడు ఖరసంహారంకోసం శరభంగాశ్రమానికి వచ్చాడు. ఆశ్రమదర్శనం అన్న నెపంతో నిన్ను ఈ రాక్షసులను తుదముట్టించడానికి ఈ మహర్షులు తీసుకొని వచ్చారు. ఈ రాక్షసులందరిని చంపి సాధువులకు నీవు మహోపకారం చేశావు. ఇప్పుడు మేమందరం సంతోషంగా మా తపస్సులను కొనసాగించుకొంటాం' అని చెప్పారు.

అంతలో దేవతలు, చారణులు, గంధర్వులు అందరూ అక్కడికి వచ్చి రాముని అభినందించి పుష్పవృష్టిని కురిపించారు. దుందుభులను మ్రోగించారు. 'నీ పరాక్రమం నిరుపమానమైనదని వారందరూ రాముని కొనియాడారు. నీ యుద్ధకౌశలం మాకు విష్ణుదేవుని కౌశలాన్ని తలపించింది. నీవు చిరకాలం వర్ధిల్లు అంటూ అందరూ రాముని దీవించి వెళ్ళారు.

లక్ష్మణుడు సీతను తీసుకొని రాముని దగ్గరకు వచ్చాడు. రాముడు ప్రశంసలు అందుకోవడం వారు చూచి ఆనందించారు. అపార రాక్షస సైన్యాన్ని అంతా మూడు గడియలలో రాముడు సంహరించడం చూచి లక్ష్మణుడు తన అన్న పరాక్రమాన్ని మెచ్చుకొన్నాడు. తన భర్త శౌర్య పరాక్రమాలను చూచి, అందరూ మెచ్చుకోవడం చూచి జానకి పరమానందభరితురాలు అయింది. ఆ దేవి సంతోషంతో తన భర్తను కౌగిలించుకొని తన హర్షాన్ని తెలిపింది.

రాక్షసుల యోధుల సమూహాలను ముక్కలు చేసిన రాముణ్ణి అందరూ పొగిడారు. సీతారామలక్ష్మణులు సంతోషంగా కాలం గడిపారు.

* * *

అకంపనుని బోధ - మారీచుని ఉపదేశం

సర్గ - 31

రావణుని గూఢచారులలో అకంపనుడు ఒకడు. ఖరుని ఉదంతం తెలుసుకొన్న అకంపనుడు వేగంగా తన నాయకుడి దగ్గరకు వెళ్ళాడు. 'ఓ మహారాజా! జనస్థానంలో చాలామంది మన రాక్షసుల మరణం జరిగిపోయింది. నేను చావుతప్పికన్ను లొట్టపోయి పరుగెత్తి వచ్చాను.' ఘోరం జరిగిపోయిందని చెప్పాడు. దాన్ని విన్న రావణుడు కనులెర్రచేసి 'నా జనస్థానాన్ని ఎవరు నాశనం చేశారు? వానికి మృత్యువు చేరువ అయినట్లు ఉంది. నాకు అపకారం చేసినవాడు ఇంద్రుడైనా కుబేరుడైనా యముడైనా నేను ఊరుకోను. అగ్నినిసైతం దహించి వేస్తాను.

మృత్యువుకే మృత్యువును. నా కోపాగ్నితో సూర్య చంద్రులను కూడా భస్మం చేయగలను. నా పరాక్రమం చూసి వాయువు కూడా నిలిచిపోతుంది' అంటూ రావణుడు వీరావేశంతో కోపాగ్ని వెళ్ళగక్కాడు.

'మహారాజా! శాంతించుము; దయచూడుము; అంటూ శరణువేడిన అకంపనుని చూసి 'నీకు వచ్చిన భయం ఏమీ లేదు అక్కడ జరిగిందేమిటో వివరంగా చెప్పుము. నేను ఏం చేయాలో చెప్తాను. భయంవీడుము' అని అభయం ఇచ్చాడు. 'ఓ రావణరాజా! అయోధ్యాపతి దశరథుని ఇద్దరు కుమారులు రామలక్ష్మణులనేవారు. వీరు చక్కని అంగసౌష్ఠవంతో ఒప్పారుతున్న అతిబలవంతులు. రాముడు తన భార్య ఐన సీతతోకూడి లక్ష్మణుని తీసుకొని దండకారణ్యంలో నివసిస్తున్నారు. ఈ మహావీరుడే మన రాక్షసులను నిహతులను చేశాడు' అని చెప్పాడు.

'అకంపనా! ఏమి ఆ రాముడు ఇంద్రాది దేవతలను తీసుకొని వచ్చాడా? లేకపోతే ఇంతటి శక్తిసామర్థ్యాలు ఆయనకు ఎలా లభ్యం అయ్యాయి. మన రాక్షసులందరిని ఎదిరించడం అనేది సామాన్యమైన విషయం కాదు గదా!' అని రావణుడు అన్నాడు. 'ఓ మహారాజా! శ్రీరాముడు ఎంతటి అందగాడో అంతటి మహాపరాక్రమ వంతుడు. దివ్యాస్త్రాలు, గుణసంపద ఎక్కువగా ఉన్నవాడు. అతని తమ్ముడు కూడా సముద్ర గంభీరుడు. రాజశ్రేష్ఠుడైన ఆ శ్రీరామునకు సరితూగు వీరుడే లక్ష్మణుడు. ఏ దేవతాసహాయం లేకుండానే ఒక్కడుగానే రణరంగంలో నిలచి మన రాక్షస వీరులను అనాయాసంగా తుంచివేశాడు. ఆ రాముని వీరత్వాన్ని గురించి చెప్పడానికి నా దగ్గర ఉన్న మాటలు చాలవు' అని చెప్పాడు. 'అలా అయితే నేనిప్పుడు వెళ్ళి ఆ వీరాధివీరులను మట్టి కరిపించి వస్తాను' అంటూ రావణుడు లేవబోయాడు. 'మహారాజా! కాస్త ఆగండి; నే చెప్పేది పూర్తిగా వినండి. ఆ మహానుభావుడైన శ్రీరాముని దగ్గర మానవాతీత బలం ఉన్నట్లుగా నాకు తోస్తుంది.

శ్రీరాముని చూస్తుంటే అతని రణరంగ కౌశలం తిలకిస్తుంటే ఆ రాముని ధాటికి నిలిచేవారు ఈ ముల్లోకాలలో ఎవరూ ఉండరేమోననిపిస్తుంది. దేవాసురులు సైతం అతని ముందు వెనకడుగు వేయాల్సిందే. నదుల వేగాన్ని నిరోధింపగలడు. నక్షత్రాలు గ్రహాలతో కూడిన ఆకాశాన్ని కూడా ఆయన రూపుమాపగల శక్తి సంపన్నుడని నాకు అనిపించింది. ఒకవేళ ఈ భూమి సముద్ర మండలంలో మునిగిపోయినా దానిని సైతం ఉద్ధరింపగలడని నాకు ఆ శ్రీరాముని చూస్తే అనిపించింది. మహాయశస్వి ఐన శ్రీరాముడు సంకల్ప మాత్రముననే ఈ సృష్టిస్థితిలయాలను తన వశంలోకి తెచ్చుకోగలడని నా మనస్సుకు తెలిసింది. అలాంటి శ్రీరాముని జయించడం మనకేగాదు ఎవరికైనా దుర్లభం అనిపిస్తోంది.

రాక్షసరాజా! అటువంటి మహావీరాధివీరుని గెలవడానికి ఒక ఉపాయం నాకు తోచింది చెప్తాను వినుము' – మరలా అకంపనుడు ఇలా చెప్పాడు. 'రాముని భార్య ఐన సీత చూడచక్కని ఇల్లాలు – అతిలోక సౌందర్యవతి – భర్త అనురాగాన్ని పొందిన దేవత. అమూల్య రత్నాభరణాలు ధరించిన ఈమెపై రామునకు అత్యధిక ప్రేమ ఉంది. ఏదేని ఒక ఉపాయంతో ఈమెను మనం రామునకు దూరం చేస్తే ఇష్టసఖీ వియోగాన్ని తాళలేక రాముడు తన ప్రాణాలను తానే త్యజిస్తాడు. ఇంతకుమించిన ఉపాయమేమి రాముని గెలవడానికి నాకు ఉన్నట్లుగా అనిపించడంలేద'నే దుష్ట ఆలోచనను రావణునికి చెప్పాడు.

ఈ దుర్బోధ రావణునికి చాలా నచ్చింది. సీతకు దూరంగా రాముని పంపేయడం ఎలా అని ఆలోచించాడు. 'ఓ అకంపనా! నీ ఆలోచన మహత్తరంగా ఉంది. పొద్దున్నే నేను రథంపై వెళ్ళి సీతను అపహరించుకొని వస్తాను' అని చెప్పాడు. జవనాశ్వాలను పూన్చిన రథంలో మారీచుని దగ్గరకు రావణుడు వెళ్ళాడు. ఆకాశంలో పయనించే ఆ రావణుని రథం మేఘాల మధ్య చంద్రునిలాగా కనిపించింది.

దశగ్రీవుని చూచిన మారీచుడు ఆనందంగా ఎదురేగి అతిథి సత్కారం చేశాడు. దివ్య భోజన పదార్థాలను ఇచ్చాడు. ఉచితాసనాన్ని ఇచ్చి కుశల ప్రశ్నలు వేశాడు. 'మీరు ఇలా నా దగ్గరకు రావడంలో విశేషం ఏమన్నా ఉందా?' అని అడిగాడు. మారీచుని ఆతిథ్యానికి ఆనందించిన రావణుడు యోగక్షేమాలను అడిగి తెలుసుకొన్నాడు. తాను వచ్చిన విషయం మెల్లగా చెప్పాడు. 'మారీచా! దండకారణ్యంలో ఖరుడు అతని సేననంతా శ్రీరాముడు హతమార్చాడు. మన రాక్షసులను తుదముట్టించిన ఆ రామునిపై పగ తీర్చుకోవాలని అనుకొన్నాను. అతని భార్య సీతను దూరం చేసి రామునికి దుఃఖాన్ని కలిగించాలని అనుకొన్నాను. దానికోసం నీ సహాయం అర్థించడానికి నేను వచ్చాను' అన్నాడు.

'రాక్షసరాజా! ఆ శ్రీరాముని గురించి సీతను గురించి చెప్పినది ఎవరు? అతడు మీకు మిత్రుడుగా కనిపించే పరమ శత్రువు అనే చెప్పాల్సి వస్తుంది. సమస్త రాక్షసులను నాశనం కోరే మీకు ఈ ఉపాయాన్ని చెప్పాడు. విషసర్పం నోటిలో చేయి పెట్టి కోరలను పీకమని మిమ్ము ప్రేరేపించే అతడు మీకు శ్రేయాన్ని ఇవ్వడు. సీతను అపహరించమని మీకు చెప్పేవాడు హాయిగా సుఖంగా జీవించే మిమ్ము కష్టాల ఊబిలోకి దింపేస్తున్నాడు.

ఓ రావణా! ఆ శ్రీరాముడు ఎదురులేని వీరుడు. సద్వంశంలో పుట్టిన సత్యనిష్ఠుడు. అతని వినయ సంపదే అతని పరాక్రమం. శ్రీరాముడనే మదపుటేనుగు బారిన పడాలని ఎవ్వరూ కోరుకోరు. ఆ వీరునితో కయ్యం కొరివితో తల గోక్కున్నట్లుగా ఉంటుంది. సింహం తన జూలును విదిల్చి తోకను నడుము మీదకు తెచ్చి జంతువులను మట్టి కరిపించినట్లుగా రాముడు శత్రువులను తృటిలో నిర్జించగలడు. మానవ రూపంలో ఉన్న ఈ శ్రీరాముడనే నృసింహుని దగ్గర పోవడం అనగా నిద్రిస్తున్న సింహాన్ని మేలుకొల్పడమే అవుతుంది. పరులకు కీడు తలపెట్టని శ్రీరామునితో యుద్ధం చేయడం అవివేకం అవుతుంది.

అవివేకంలో శ్రీరామునిపై యుద్ధనెపంతో పాతాళంలోకి జారిపోకు. రావణాసురా!వివేకవంతునివై విచక్షణతో ఆలోచించు. మన జోలికి రానివారిని గూర్చి చెడుగా ఆలోచించి వానిని నిర్జించాలనే వ్యర్థ ప్రయత్నాలు చేయకు. మీరు మీ లంకా సామ్రాజ్యానికి తిరిగి వెళ్ళిపొండి. హాయిగా సుఖంగా మీ భార్యతో కూడి మీ రాజ్యాన్ని నిర్భయంగా పాలించి సుఖించు' అని చక్కని ఉపదేశాన్ని మారీచుడు రావణుని కిచ్చాడు.

మారీచుని పలుకులు రావణునిలో వ్యధను దూరం చేశాయి. మనస్సు స్థిమితం చెందింది. ఊరడిల్లిన మనస్సుతో రావణుడు లంకకు పయనం అయ్యాడు.

(ఇది ప్రక్షిప్త సర్గమని కొందరి పండితుల అభిప్రాయం. ఇందులో వాల్మీకి ముద్ర కొరవడిందనేది వారి వాదోపసారం. కాని మారీచునికి శ్రీరాముని దెబ్బ తెలిసినదే కదా! (విశ్వామిత్ర యాగ రక్షణార్థ విషయంలో) కాబట్టి అతడు రాముని గురించి రావణునికి చెప్పి హెచ్చరించడంలో అనౌచిత్యం ఏముంది? ఆ కాలంలో వేగులు

ఎప్పటి వార్తలను అప్పుడు తెలిపే శక్తిసామర్థ్యాలు ఉన్నవారే అని చెప్పడంలోను అసంగతం కనిపించదు కదా! కాబట్టి ప్రక్షిప్తమని తీసివేయడం వాల్మీకి ముద్ర లేదనుకోవడం అంత సముచితంగా కనిపించడంలేదు. రామాయణం అంతా సహజంగా జరిగే మానవుల వృత్తాంతమే అనిపిస్తుంది కాబట్టి రావణుడనే రాక్షసుని దగ్గర ఇలా జరిగి ఉండడం అనేది అసమంజసంగా కనిపించదు).

* * *

శూర్పణఖ లంకా ప్రయాణం

సర్గ - 32

శూర్పణఖ జరిగింది తెలుసుకొని ఖిన్నురాలైంది. 14 వేలమందిని రాక్షసులను మహాయోధుడైన ఖరుని తేజోవంతుడైన దూషణుని ఒంటి చేత్తో చంపేయడం చూచి నిశ్చేష్టిత అయింది. రాముని తేజోబలసంపదలను స్వయంగా చూచి ఆశ్చర్యంలోనుంచి తేరుకోలేకపోయింది. తన వారి వినాశనాన్ని చూచి చాలా దుఃఖించింది. గట్టిగా ఆర్తనాదం చేసింది. ఆమె మనసులో రావణుడు మెదిలాడు. వెంటనే రావణుని రాజ్యమైన లంకానగరానికి పరుగులు తీసింది. ఆమె వచ్చే సమయానికి రావణుడు తన పుష్పకం అనే రాజభవనంలో సుఖాసీనుడయ్యాడు. మంత్రులు పౌరులతో కూడి సభ తీరాడు. దేవతలతో కూడిన ఇంద్రునిలాగా రావణాసురుడు కనిపించాడు. సువర్ణ సింహాసనాన్ని అధిష్ఠించి ఉన్న రాక్షసరాజు ప్రజ్వరిల్లుతున్న అగ్నిలాగా కనిపించాడు. ఋషీశ్వరులకు కంటకుడు, దేవగంధర్వులకు అజేయుడు ఐన రాక్షసుడు మృత్యుదేవతలాగా కూర్చొన్నాడు.

రావణాసురుడు విశాలవక్షస్థలం ఉన్నవాడు. ఐరావతంతో దెబ్బతిన్నవాడు. వజ్రాయుధపు తాకిడికి తట్టుకొని నిలబడ్డవాడు. ఇరవై చేతులు పది తలలతో అట్టహాసంగా కనిపించే రాక్షస రాజు రావణుడు. మేలిమి బంగారం కుండలాలు రత్న వైడూర్యాలను పొదిగిన ఆభరణాలను ధరించి వింత కాంతులతో చూపరులకు ఆకర్షణీయంగా ఉంటాడు. రావణుడు ఎన్నోసార్లు దేవతల మీదకు దండెత్తి వెళ్ళాడు. వాళ్ళ చేతులలో బాగా దెబ్బతిన్నాడు. విష్ణుచక్రపు రుచి పలుమార్లు తెలుసుకొన్నాడు. మహాబలవంతుడు. పెద్ద పెద్ద పర్వతాలను సైతం విసిరికొట్టగలడు. యజ్ఞాలను ధ్వంసం చేసేవాడు. తపస్సులో ఆరితేరి దివ్యాస్త్రాలను పొందినవాడు. నాగలోకంపై దండెత్తి వెళ్ళాడు. అక్కడి వాసుకిని జయించాడు. తక్షకుడిని ఓడించి అతని భార్యను అపహరించాడు. అలకాపురాన్ని ఏలే కుబేరుని జయించాడు. చైత్రరథం అనే పుష్పక విమానాన్ని 'నళిని' అనే సరస్సును వశపరచుకొన్నాడు. ఇంద్రుని నందనవనాన్ని చేజిక్కించుకొన్నాడు.

లోకానికంతా మేలు చేసే సూర్యచంద్రులను కూడా తన శక్తితో అడ్డుకొనేవాడు. మహారణ్యంలో ఘోరమైన తపస్సు చేసినవాడు. తన తలలు బ్రహ్మదేవునకు ఇష్టంగా అర్పించాడు. దేవతలు, దానవులు, గంధర్వులు, పిశాచాలు, పక్షులు, సర్పాలు, వీటినుండి మరణం రాకుండా ఉండేలాగా బ్రహ్మనుండి వరాలు పొందాడు.

విప్రుల యజ్ఞాలు ధ్వంసం చేస్తూ హవిస్సులను దేవతలకు అందకుండా చేసేవాడు. ప్రజలకు అహితం చేయడంలో నేర్పరి. దుష్ట ప్రవృత్తితో అందరిని ఏడిపించేవాడు. అలాంటి దుశ్చరిత ఉన్న రావణుని శూర్పణఖ చూసింది. సర్వాభరణ భూషితుడై ఆనందంగా కూర్చున్న లంకాధిపతిని భయంతో వణుకుతున్న శూర్పణఖ చూసింది. అందరిని భయభ్రాంతులను చేస్తూ విశృంఖలంగా తిరిగి ఆ రాక్షసి నేడు తన దుస్థితికి వగస్తూ విశాల నేత్రాలతో రావణునితో ఇలా చెప్పడం ప్రారంభించింది.

* * *

శూర్పణఖ నిందాలాపాలు

సర్గ - 33

అమాత్యులతో కూడిన రావణుడు పరాభవం చెంది వచ్చిన సోదరి శూర్పణఖను చూచి ఊరుకొన్నాడు. తన దీనావస్థను చూచి కూడా ఏమీ పలుకని సోదరుని చూచి శూర్పణఖ కోపం తెచ్చుకొంది. ఆ కోపంతో రావణునిలోని తప్పులను ఎత్తి చూపుతూ నిందించింది.

'ఓ రావణా! బలగర్వంతో మిడిసిపడుతున్నావు. అడ్డు చెప్పేవారు ఎవరూ లేరని నిరంకుశంగా కామభోగాలతో తేలియాడుతున్నావు. తెలుసుకొను విషయాలను కూడా మరిచి భోగాసక్తుడివి అయ్యావు. ఇంద్రియ లౌల్యంతో కన్నుగానని రాజును ప్రజలు గౌరవించారు. పరిపాలనా విషయాన్ని మరిచి సుఖాలతో తేలిపోయే రాజును ప్రజలందరూ కలసి రాజ్యభ్రష్టుడిని చేస్తారు. గూఢచారుల ద్వారా తన దేశంలోను విదేశాలలోని విషయాలు తెలుసుకోలేని రాజు రాబోయే ఆపదలను నివారించలేక ప్రజలను బాధలకు గురిచేస్తాడు. స్త్రీలోలుడైన రాజు ప్రజల స్థితిని తెలిపే మంత్రుల మాటను లెక్కచేయడు. రాజు స్థితిని చూసి మంత్రులు తమ విధులను సక్రమంగా చేయరు.

రాజ్యపాలనాసక్తత లేని రాజును త్యజిస్తారు. దేశ ప్రగతికి పాటుపడక స్వలాభాన్ని చూసుకొంటూ తన సుఖం కోసమే పాటుపడే రాజు త్వరగా నశించిపోతాడు. తన సామంత రాజుల పట్టును కూడా కోల్పోయి, తన రాజ్యాన్ని అన్యాక్రాంతం చేస్తాడు. దేవగంధర్వ దానవులు ధైర్యసాహసాలు ఉన్నవారు. వారు నీపై ప్రతీకారం తీర్చుకోవడానికి అవకాశం కోసం వేచి ఉన్నారు.

రాజా! నీవు వివేకశూన్యుడవు. నీ జనస్థానంలో నీ రాజ్యంలో ఏమి జరుగుతుందో తెలుసుకోకుండా హాయిగా కూర్చున్నావు. విషయాసక్తుడివై ప్రజల బాగును తృణీకరిస్తున్నావు. ఎలాంటి రాజువు నీవు? నీకు రాజుగా ఉండే అర్హత లేదు. గూఢచారులపై అదుపు, కోశాగారం అభివృద్ధిపై చూపు, లేని రాజులు అధికారంలో ఎలా కొనసాగుతారు? దూరదృష్టితో ఎప్పటికప్పుడు వేగులద్వారా సమాచారాన్ని రాబడుతూ తదనుగుణంగా వ్యవహరించలేని రాజువల్ల ప్రజలు ఏ విధంగానూ సుఖపడలేరు. సుఖానికి దూరం ఐన ప్రజలు రాజును గౌరవించడం మానేస్తారు.

నీ చుట్టూ చేరి ఉన్న ఈ మంత్రులందరూ ప్రతిభాహీనులు. నిన్ను పొగడడంలో కాలయాపన చేస్తున్నారు. రాజ్యంలోని సంగతులను పట్టించుకోవడంలేదు. ఇలాంటి మిత్రులు ఉన్న నీవు రాజుగా ఎన్నాళ్ళు కొనసాగగలవు? మన జనస్థానంలోని రాక్షసులను కేవలం మానవ మాత్రుడైన ఒక రాముడు అంతం చేసివేశాడు. ఖరదూషణాలతో సహా పదునాలుగు వేలమందిని రాక్షస యోధులను సర్వనాశనం చేశాడు. ఈ విషయం మచ్చుకైనా నీ దాకా రాలేదు. అంటే నీవెంత నిద్రలో ఉన్నావో తెలిసిందా?

మన చేతిలో హతమారుతూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కు బిక్కుమంటూ కాలం గడిపే తాపసులందరూ రాముని అండ చూసుకొని భయహీనులై హాయిగా తిరుగుతున్నారు. ఆ బక్కచిక్కిన తాపసులందరికీ 'నేనున్నాను' అంటూ ఆ రాముడు అభయం ఇచ్చాడు.

ఓ రావణా! భోగలాలసుడివై ఈ విషయాలను తెలుసుకోలేకపోయావు. నీ రాజ్యానికి రాబోయే దుర్దశ గురించి ఆలోచించని నీవు రాజుగా పనికిరావు. ఆశ్రితులపట్ల శ్రద్ధ వహించినవాడు, మత్తెక్కి తిరుగుబోతు అయినాడు. ఆ రాజును ప్రజలు సచివులను తూలనాడుతారు. అవసర సమయాల్లో వారు నిన్ను ఆదుకోరు.

అంతులేని వరగర్వం ఉన్నవాడు, సత్పురుషులను దగ్గరకి రానీయనివాడు, తనను తాను గొప్పగా భావించుకొనే అహంకారి, సమయా సమయాలు చూసుకోకుండా పేట్రేగేవాడు, క్రోధాన్ని అదుపులో ఉంచుకోలేనివాడు రాజుగా తగడు. ఈ లక్షణాలన్నీ నీవు వృద్ధి పరచుకొంటున్నావు. త్వరలో నీవు రాజ్యార్హతను కోల్పోతావు.

ఆపద సమయాలను గుర్తించకుండా వ్యవహరించేవాడు, సమయస్ఫూర్తి లేనివాడు, రాజ్యభ్రష్టుడు అవుతాడు. పదవి కోల్పోయిన రాజు గడ్డిపోచకు కూడా సరిరాడు. కట్టి విడిచిన వస్త్రంలాగా, వాడిన పూదండలాగా రాజును ప్రజలు తీసిపారేస్తారు.

ప్రతిక్షణం జాగ్రత్తగా మెలిగేవాడు, సమయానుకూలంగా వ్యవహరించేవాడు, జితేంద్రియుడు, సత్పురుషులను గౌరవించేవాడు, ధర్మస్వభావం ఉన్నవాడు రాజుగా కీర్తిప్రతిష్ఠలు పొందుతాడు. ప్రజల మనస్సులో ఆ రాజు ఎక్కువ కాలం నివశిస్తాడు. అలాంటి రాజును ప్రజలే కాపాడుతూ గౌరవిస్తారు. కాని రావణా! నీవు మన రాక్షసుల వైనం తెలుసుకోలేక పోయావంటే నీ అసమర్థత తెలుస్తుంది. నేను చెప్పినా నీవు శత్రువులపై ఉపేక్షాభావాన్నే చూపుతున్నావు. అలాంటి నీవు రాజుగా మనగలవా? దేశ కాల పరిస్థితులపై అధికారం లేక వ్యవహార దక్షత లేని రాజు క్షీణించిపోతాడు. నీ రాజ్యానికి ముప్పు రాబోతుంది. దానిని నీవు గుర్తించడం లేదు. యుక్తాయుక్త విచక్షణను కోల్పోయి నిద్రలో ఉన్నావు. నీవు ఆపదల పాలు కావడం నిజమేననిపిస్తోంది' అంటూ శూర్పణఖ రావణుని ఎంతో నిందించింది.

ఆ నిందాలాపనలు విని అకంపనుని ద్వారా విషయం తెలుసుకొని మారీచుని హితబోధ విని రాజ్యానికి వచ్చే ముప్పు గురించి ఆలోచిస్తూ నా కర్తవ్యం ఏమిటనే దీర్ఘాలోచనలో మునిగిపోయాడు.

* * *

రామాదుల వివరణ - శూర్పణఖ

సర్గ - 34

శూర్పణఖ మాటలు విని రావణుడు క్రోధ పరవశుడు అయ్యాడు. 'శూర్పణఖా! రాముడు ఎవడు? అతడెట్టి వీరుడు? అతని దగ్గర ఉన్న ఆయుధాలు ఏవి? ఆయన బలపరాక్రమాలు ఎలాంటివి? అసలు దండకారణ్యానికి ఎందుకు వచ్చాడు? నీ ముక్కు చెవులు కోసిన వారెవరు? ఎందుకీ పనిచేశారు? జనస్థానంలో ఖరదూషణులతో సహా పదునాలుగు వేలమంది రాక్షసులను ఎందుకు చంపాడు?' అంటూ ప్రశ్నల పరంపర కురిపించాడు రావణాసురుడు.

అసలే క్రోధంలో కూరుకొన్న శూర్పణఖ ఆ ప్రశ్నలు విని శాంతించింది. తనకు తెలిసినదానిని చెప్తాను అంటూ మొదలుపెట్టింది. 'ఓ సోదరా! రామలక్ష్మణులు దశరథుని పుత్రులు. జనకసుత ఐన సీత రాముని అర్ధాంగి. వీరు ముగ్గురు వారి తండ్రి ఆజ్ఞానుసారం దండకారణ్యంలో ఉన్నారు. శ్రీరాముడు బహుసుందర రూపం కలవాడు. అత్యంత సాహసవంతుడు. విశాలనేత్రాలున్నవాడు. తాపసులలాగా జటాజూటాన్ని ధరించి నారచీరలు కట్టి కందమూలాలు తింటున్నాడు. ఆ మార్గాన్నే అవలంబిస్తూ అన్నకు తగ్గ తమ్ముడిలా లక్ష్మణుడు ఉన్నాడు. ఇతడు కూడా మహాబలవంతుడు. వీరిద్దరూ ధర్మాత్ములు.

ఆజానుబాహువైన శ్రీరాముడు ఒంటిగా నిలబడి పదునాలుగు వేలమందిని రాక్షసులను అద్భుతంగా యమపురికి మూడు గడియలలో పంపేశాడు. వారందరిని తన బాణ ప్రయోగంతో భయభ్రాంతులను చేశాడు. బాణం వేసేటప్పుడు నారి సంధించడం ఎక్కుపెట్టడం లాంటి వాటిని నేను చూడలేకపోయాను. వేలకొలది బాణాలను నిరంతరంగా ప్రసరింపజేశాడు.

ఆ మహాత్ముడు స్త్రీలను వధించకూడదను ధర్మంతో నన్ను వదిలేశారు. ముక్కోపి అధర్మానికి వ్యతిరేకి ఐన లక్ష్మణుడు నా ముక్కు చెవులు కోసి విరూపిని చేశాడు. లక్ష్మణుడు రాముని బహిఃప్రాణమని చెప్పొచ్చు. సాటి లేని బలశాలురు వారిద్దరూ.

జనకనందిని ఐన సీత చక్కని చుక్క. ఆమె సౌందర్యానికి సాటి వచ్చేవారు ఈ భూమండలంలో ఎవరూ లేరు. ఆమె అవయవాల పొందిక, ఆమె ధరించిన ఆభరణాల సోయగం స్త్రీనైన నన్నే కట్టిపడేసింది. సీత కన్నులు, కేశాలు, ముఖం- ఇలా ప్రతి అవయవం అందానికి మారుపేరులా ఉంటుంది. ఆమె అందచందాల ముందు దేవగంధర్వయక్షకన్యలు దిగదుడుపే. ఆ జానకి కౌగిలి సుఖాన్ని పొందడమే అదృష్టం. ఆమె భార్యగా పొందిన వాని సుఖం సురపతికైనను లేదు. సీతను భార్యగాగల పురుషుడు సర్వలోక శ్రేష్ఠుడౌతాడు. ఆమె నీకు భార్యగా ఉండదగినదని నాకు అనిపించింది. నీవు ఆమెకు సరైన జతగాడివి. ఆమెను చూస్తే నీవు ముఖాన్ని మరల్చుకోలేకపోతావు. సీత జగన్మోహిని.

ఆ సౌందర్యవతిని నీకు భార్యగా చేయాలని తలచి అక్కడకు వెళ్ళి ప్రయత్నించాను. కాని క్రూరుడైన లక్ష్మణుని చేతిలో విరూపివి అయ్యి తిరిగి వచ్చాను. పున్నమి చంద్రుని బోలు ముఖవర్చస్సుతో వెలిగే ఆ భామను నీవు చేసుకోవాలని అనుకొంటే వెంటనే బయలుదేరు.

రాక్షసరాజా! నీవు ఆ శ్రీరాముని తుదముట్టించి ఖరదూషణాదులకు ఆత్మశాంతిని కలిగించు. మన వంశనాశనానికి ఒడిగట్టిన ఆ దుష్ట మానవుడిని దునుమాడు. రాముని నిర్జించు. లక్ష్మణుని పైలోకాలకు పంపు. అప్పుడు ఒంటరి ఐన సీతను నీవు చేపట్టి స్వర్గసుఖాలను అనుభవించు.

ఈ నా అభిప్రాయం నీకు నచ్చినట్లు అయితే యుద్ధభేరిని మోగించు. మన వంశగౌరవాన్ని పెంచు. సంశయాలన్నింటిని వీడి బలపరాక్రమాలను చూపుతూ రామలక్ష్మణులను పారద్రోలు. ఇంద్రుని వడగండ్ల వానను మరిపించే శరఉధృతిని చేయగల రాముని హతమార్చు. శత్రు భయంకరుడైన లక్ష్మణుని మట్టి కరిపించు.

యుద్ధంలో విజయుడివై సీతను తెచ్చుకొని హాయిగా సుఖించు. ఖరదూషణాదులను సంహరించిన రాముని ఒకసారి జ్ఞప్తికి తెచ్చుకొని కర్తవ్యాన్ని నిర్ణయించుకో' అంటూ శూర్పణఖరావణునియుద్ధానికి ఎగదోసింది.

* * *

రావణుడు మారీచుని దగ్గరకు వెళ్ళడం

సర్గ - 35

శూర్పణఖ చెప్పినదంతా రావణుడు విన్నాడు. తన మంత్రులతో కలిసి ఆలోచించాడు. ఏకాంత మందిరంలో కూర్చుని కర్తవ్యాన్ని నిర్ణయించుకొన్నాడు. రథశాలకు వెళ్ళి రథసారథిని పిలిచి రథాన్ని సిద్ధం చేయమని పురమాయించాడు. యజమాని ఆజ్ఞ శిరోధార్యం అని భావించే రథసారథి క్షణాలలో ఉత్తమాశ్వాలను బంగారు రథానికి జత చేశాడు. ఆ గుర్రాలు వేగంలో అతి సమర్థత కలవి. బంగారు జీనులతో పిశాచాకారంలో ఉన్నాయి. మేఘ గర్జనలాగా ధ్వని చేసే ఆ రథాన్ని ఐశ్వర్య సంపన్నుడైన రావణుడు ఎక్కాడు.

ఋషీశ్వరులకు భయం పుట్టించేవాడు, ఇంద్రాదులకు దడ పుట్టించే శక్తి ఉన్నవాడైన రాక్షసేశ్వరుడు తన బంగారురథంలో ఎక్కి విద్యుత్కాంతులను విరజిమ్మే గగనమార్గాన ప్రయాణం సాగించాడు. అలా వెళ్తున్న రావణుడు పర్వత పంక్తులను దాటి సాగర తీరాన్ని చేరాడు. అక్కడ మనసు దోచే ప్రకృతి రమణీయతను ఆస్వాదించాడు. చక్కని అరటి తోటలను, కంది పైరులను, కొబ్బరి చెట్లను చూశాడు. ఏపుగా పెరిగిన తాటిచెట్లు, పుష్పించి ఉన్న మద్దిచెట్లు, కానుగ చెట్లు కంటికింపుగా కనిపించాయి. ఆ తీర ప్రదేశాలలో నాగులు, గరుడు, పక్షులు, గంధర్వులు, కిన్నరులు, దేవతలు సంచారం చేస్తున్నారు.

వైఖానసులు చంద్రకిరణాలను ఆహారంగా గ్రహించేవారు, మాష గోత్రజులు, జితేంద్రియులు, సిద్ధులు చారణులు ఆ ప్రదేశం అంతా ఉన్నారు. దివ్యాభరణాలను ధరించి ఆటపాటలను నేర్చిన అప్సరసలు ఆ ప్రదేశాన్ని

తమ విద్యా నైపుణ్యంతో శోభింపజేస్తున్నారు. దేవ దానవులు ఇక్కడ సంచారం చేస్తున్నారు. క్రౌంచ పక్షులు బెగ్గురు పిట్టలు కోలాహలాన్ని సృజిస్తున్నాయి. ఎత్తుగా ఉన్న శిలలు సాగరంలోని నీటి స్పర్శచే నునుపుదేలి ఉన్నాయి.

కుబేరుని తమ్ముడైన రావణునికి దివ్య విమానాలు కనిపించాయి. ఆ విమానాలు జితేంద్రియులవి. తపో మహిమతో ఉన్నవారు చక్కగా అలంకరించి ఉన్న ఆ దివ్య విమానాలను ఎక్కి వారు అనుకొన్న ప్రదేశాలకు మార్గాయాసం లేకుండా వెళుతుంటారు. వాటిలోంచి రావణునికి దివ్యగానం వినిపించింది. ఇంకా దారిలో ప్రయాణం సాగిస్తున్న రావణుడు సువాసనలను వెదజల్లే చందనాది వృక్షాలను చూశాడు. పరిమళభరితమైన వాసనతో ఉన్న మధురఫలవృక్షాలు పూలు విరగకాసిన చెట్లు తక్కోలవృక్షాలను చూశాడు. ఆ తీరం అంతా ముత్యాలు, పగడాలు, శలభాలు, రాశులుగా ఉన్నాయి. అవి వెదజల్లే రంగురంగులకాంతులు మిరిమిట్లు గొల్పుతున్నాయి. దారిలోని వింతలన్నీ చూస్తూ పది తలలతో పర్వతాకారుడైన రావణుడు ముందుకు సాగుతున్నాడు.

జానపదులు నివసించే పల్లెలు గంధర్వులను బోలిన వనితామణులున్న నగరాలు స్వర్గాన్ని తలపించే ఆ సాగర తీరాన్నంతా రావణుడు కన్నుల పండుగలా చూశాడు. ఆ సముద్రతీరంలో వీచే పిల్లగాలులు మైమరిపిస్తున్నాయి. సముద్రంలో లేచే అలలు అవి చేసే అల్లరి ఎంత చూచినా చూడాలనే అనిపిస్తోంది. దానికి కొద్ది దూరంలో ఊడలు దిగిన మర్రిచెట్టును చూశాడు. దాని కింద ఎందరో ఋషీశ్వరులు తపస్సులో మునిగి ఉండడం చూశాడు. ఆ మర్రి కొమ్మలు నూరుయోజనాల వరకు వ్యాపించి ఉన్నాయి.

గరుత్మంతుడు ఒకసారి పెద్ద తాబేలును పట్టాడు. అది తిందామని ఈ మర్రి కొమ్మ మీద వాలాడు. అతి బలసంపన్నుని ధాటికి ఈ కొమ్మ నిలవలేక పుటుక్కున విరిగిపోయింది. ఆ మర్రి రాజమే ఇది. దీని క్రింద తలక్రిందులుగా వేలాడుతూ ఎందరో తాపసులున్నారు. మరెందరో ఋషీశ్వరులు ఈ కొమ్మ క్రింద తపస్సుల్లో మునిగిపోయి ఉన్నారు. వీరందరికి ఆపద కలగకకూడదని గరుత్మంతుడు ఒక కాలితో ఆ విరిగిపోతున్న కొమ్మ పట్టుకొని మరో కాలితో తాబేలును పట్టి దాన్ని తినివేసి నూరుయోజనాల వరకు వ్యాపించి ఉన్న ఈ కొమ్మ నుండి ఒక ఆటవిక ప్రదేశాన్ని చేరి అక్కడ తాపసులకు హాని కలిగించే ఆటవికులను కొట్టి చంపి మునులందరిని కాపాడాడు. ఆ ఉత్సాహంతో గరుత్మంతుడు ఇంద్రుని భవనాన్ని చేరి అక్కడ ఉన్న రక్షణను ఛేదించుకొని వెళ్ళి అమృతాన్ని చేజిక్కించుకొన్నాడు. గరుత్మంతుని బలం వల్ల ఒక కొమ్మ విరిగిపోయినా ఆ మర్రిచెట్టు ఉన్న మరో శాఖ ఎందరికో ఆశ్రయాన్నిచ్చింది. 'సుభద్రం' అనే పేరుతో ఆ మర్రిచెట్టు ప్రసిద్ధి చెందింది. దాన్ని రావణుడు చూశాడు.

ఇలా రావణుడు సముద్ర తీర ప్రదేశాన్నంతా తిలకిస్తూ ఆవలితీరం చేరాడు. అక్కడ ప్రశాంత రమణీయంగా అలరారే మారీచుని ఆశ్రమాన్ని చూశాడు. కందమూలాలను తింటూ నారవస్త్రాలు ధరించి ఆశ్రమధర్మాలను పాటించే మారీచుని చూశాడు. ఆ మారీచుడు తన వద్దకు వచ్చిన రాక్షసేశ్వరుని చూసి స్వాగతసత్కారాలు చేశాడు. అర్ఘ్యపాద్యాదులను ఇచ్చి ఉచితాసనం ఇచ్చి రావణుని సత్కరించాడు.

తర్వాత రాక్షస ప్రభువును కందమూలాలతో ఆనందింపజేశాడు. యోగక్షేమాలను అడుగుతూ లంకానగర విశేషాలను అడిగాడు. మారీచుని చూసి రావణుడు ఆయన మాటలకు సమాధానం ఇవ్వాలనుకొన్నాడు.

* * *

రావణుడు మారీచుని సహాయం అర్థించడం

సర్గ - 36

మారీచుని ఆతిథ్యం రావణుడు స్వీకరించాడు. యోగక్షేమాలను అడిగే మారీచునితో తన మనస్సులోని ఆవేదనను చెప్పాడు. 'ఓ మారీచా! నీవు నా కుడిభుజానివి. ఆపదలలో నీవు తప్ప నన్ను ఆదుకొనేవారు ఎవరూ లేరు. దండకారణ్యంలో నా సోదరుడైన ఖరుడు అతని సేనాపతి దూషణుడు మహాబలశాలి ఐన త్రిశరుడు రాముని చేతిలో హతం అయ్యారు. పదునాలుగు వేలమంది రాక్షసులను పాదచారి ఐన రాముడు అవలీలగా సంహరించివేశాడు. శూర్పణఖను రామునితమ్ముడు లక్ష్మణుడు విరూపిగా చేశాడు. ఇవన్నీ నా మనస్సును కలచివేస్తున్నాయి.

నా ఆజ్ఞలను శిరసావహిస్తూ శత్రుభయంకరులైన నావారు నిహతులుకావడం నేను భరించలేకపోతున్నాను. అస్త్రశస్త్రవిద్యలలో ఆరితేరినవారు కామరూపులు బలిష్ఠులు ఐన వారిని రాముడు ఎట్టి సైన్య సంపద లేకుండా సంహరించడం చూచి నేను దిగ్భ్రాంతుడినయ్యాను. ఆ రాముని గూర్చిన వివరాలను తెలుసుకొన్నాను. శ్రీరాముడు అతని తమ్ముడు సీత తండ్రి చేత రాజ్యం నుంచి బహిష్కరించబడినారు. ఇప్పుడు దండకారణ్యాన్నే నివాసంగా చేసుకొన్నారు. రాముడు మునులకు భయం కలిగించే నా సోదరులను యమపురికి పంపేసి ఆ ఋషీశ్వరులనందరిని నిర్భయులుగా చేశాడు. వారికి అండగా ఉంటానని అభయం ఇచ్చాడు. వారందరూ రాముని అండను చూసుకొని హాయిగా కాలాన్ని గడుపుతున్నారు. ఇదంతా చూచి నా మనస్సు ఆందోళనకు గురి అవుతోంది. నా ఉనికికి ప్రమాదం వస్తుందేమోననే శంక నాకు కలుగుతోంది. అందువలన నేను బాగా ఆలోచించి నీ సహాయం కోరి వచ్చాను.

ఆ రాముడు ఇంద్రియ నిగ్రహుడైన కఠినుడు. లోభి ధర్మాన్ని త్యజించి పనులు చేస్తున్నాడు. అకారణంగా రాక్షసులను నాశనం చేస్తున్నాడు. ఆ మూర్ఖుడు శౌర్య పరాక్రమాలపై ఎక్కువ అభిమానం ఉంచుకొన్నాడు. భయం అనేదే లేకుండా నా చెల్లెలైన శూర్పణఖను అవమానించాడు. అటువంటి దుర్మార్గుడైన రాముణ్ణి నేను ఎదుర్కోవాలి దానికి నేను ఒక ఉపాయం ఆలోచించాను.

నీవు కాదనకుండా నేను చెప్పేది విని ఆచరించు. వెండి చుక్కలున్న బంగారు చర్మకాంతితో లేడి రూపాన్ని నీవు సంతరించుకొని రామాదుల పర్ణశాల దగ్గరగా తిరుగు. అప్పుడు నీ అద్భుత సౌందర్యాన్ని చూచి సీత మనస్సు పడి రామలక్ష్మణులను నిన్ను తీసుకొని రమ్మని పంపుతుంది. అదే అదనుగా భావించి నేను ఆ సీతను

అపహరిస్తాను. ప్రాణప్రదంగా చూసుకొనే భార్య దూరం అవడంతో ఆ శ్రీరాముడు దుఃఖితుడు అవుతాడు. అలా కృంగి కృశించిపోయిన రాముని నేను ఎదుర్కొంటాను.

నీవు ఈ సాయం చేయి. నీవు బహురూపాలను పొందగల ధీశాలివి, శూరుడవు. మాయలను పన్నడంలో నిన్ను మించిన రాక్షసుడు లేనేలేడు. బంగారు లేడి కోసం రామలక్ష్మణులు సీతకు దూరం కాగానే నేను చంద్రకాంతులను రాహువు అపహరించినట్లుగా సీతను అపహరించి తెచ్చేస్తాను. దుఃఖంలో మునిగిన శ్రీరాముని నేను సునాయాసంగా సంహరిస్తాను. అప్పుడు యథాప్రకారం నేను నా ఉనికిని పదిలపరచుకోవడానికి తాపసులను భయభ్రాంతులను చేస్తూ జీవిస్తాను' అని చెప్పే రావణుని మాటలు మారీచుని హృదయస్పందనను ఆపేశాయి. మారీచుని ముఖం ఆ మాటలు వినడంతోనే కళ తప్పింది.

చేతలుడిగి నిశ్చేష్టుడై తాను దెబ్బతిన్న రామునిపైకి మనస్సు మరల్చుకొన్నాడు. ఆ రాముని శౌర్యాన్ని మదిలో తలచాడు. గొంతు తడారి పెదవులు ఎండిపోయాయి. మారీచుడు ఆర్తితో రావణుని దీనంగా చూశాడు. భయాందోళనకు గురి ఐన మనస్సును చిక్కబట్టుకొని ఎలానో గొంతు పెగల్చుకొని తనకు రావణునకు మేలు కూర్చే వాస్తవ పరిస్థితిని రావణునికి చెప్పాలని తలచి నోరు తెరిచాడు.

* * *

మారీచుని ఉపదేశం

సర్గ - 37

'రాక్షసరాజా! నే చెప్పేది సావధానంగా వినుము. ఈ లోకంలో స్వార్థపరులు ఎక్కువ. తమ ప్రాపకం కోసం ప్రియమైన మాటలు చెప్తుంటారు. అప్రియంగా కనబడినా మేలు ఒనరించే మాటలు చాలా తక్కువ మంది చెప్తారు. అలాంటి వారి మాటలను వినేవారు చాలా తక్కువగా ఉంటారు.

ప్రభూ! మీ దగ్గర ఉన్నవిషయం ఉన్నట్లుగా చెప్పే ధైర్యస్థులైన గూఢచారులు లేరు. మిమ్ము మెప్పించి లబ్ధిపొందాలనే వారు నీకు కీడు కలిగించే విషయాలను మేలైనవిగా చెప్తున్నారు. రావణా! రాముని గూర్చి మీరు విన్న దాంట్లో అసత్యమే ఎక్కువగా ఉంది. మీరు సీతను అపహరించి తెస్తే ఏమి జరుగుతుందో తెలుసుకోలేకుండా వ్యర్థ ప్రయత్నాలు చేస్తున్నారు. మీరు అనుకొన్నట్లు చేసిన మరుక్షణం శ్రీరాముడు రాక్షస జాతే ఈ భూమి మీద లేకుండా చేస్తాడు. అప్పుడు మీరు ఏం చేయగలరు? మీ, నా మరణం కోసమే సీత పుట్టినట్లుగా ఉంది. మీరు రాజుగా ఉన్నందువలన అమాయకంగా జీవించే లంకానగర వాసులు రామాగ్నిలో కాలి బూడిద అయిపోతారు.

కామాతురుడు, పాపాత్ముడు, కుటిలాత్ముడు ఐన రాజు తన ప్రవృత్తితో తాను నశించడమే కాదు తన బంధువులను, స్వజనులను, చివరకు ప్రజలను కూడా నాశనం చేస్తాడు. రావణా! మీరు అంతటి పాపకార్యాచరణకు పూనుకోకుము.

శ్రీరాముని గురించి నేను అసలు విషయం చెప్తాను వినుము. దశరథుని నలుగురి కొడుకులలో శ్రీరాముడు పెద్దవాడు. అన్నపై అపారమైన ప్రేమాదరాలున్న వాడు లక్ష్మణుడు. దశరథుని ప్రియభార్య ఐన కైక తృప్తికోసం కైక తనయుడికి రాజ్యాన్ని ఇచ్చివేసి భోగాలన్నింటిని తృణప్రాయంగా వదిలేసి పదునాలుగు సంవత్సరాలు దండకారణ్యాలలో నివసించడానికి మనస్ఫూర్తిగా రాముడు వచ్చాడు.

అట్లాంటి ధర్మాత్ముడైన రాముని ఇల్లాలు సీత. ఈమె పరమ సాధ్వీమణి. స్త్రీలలో ఉత్తమ గుణసంపన్నురాలు ఎల్లవేళలా రాముని హితాన్ని కోరే ఈమె భర్త నీడలోనే చరించాలనే పట్టుదలతో కారడవులకు ఇష్టపడి వచ్చింది.

వీరిద్దరిని కంటి రెప్పలా కాపాడుతానంటూ మహాబల తేజోసంపన్నుడైన విశాలహృదయం ఉన్న లక్ష్మణుడు వెన్నంటి వచ్చాడు. రావణా! రాముడు ఇంద్రియనిగ్రహుడు, పరాక్రమశాలి. చేసిన ప్రతిజ్ఞను ఎటువంటి పరిస్థితులలోనైనా నిలబెట్టుకోగల ధీశాలి అతడు. స్వధర్మాచరణలో అహింసావ్రతాన్ని ఆచరించే తాపసులకు అండగా ఉంటానని వాగ్దానం చేశాడు. సూర్యకాంతి వంటి తేజస్సు గల సీతను అపహరించడం మన మృత్యువును మనమే ఆహ్వానించినట్లు అవుతుంది. మీ చావుకు రాముని చేతిలో ఎక్కుపెట్టిన బాణమే మూలం అవుతుంది. రణభూమిలో పరమేశ్వరునిలా జ్వలించే రామునికి ఎదురు పడకపోవడమే ఎంతైనా మంచిపని అవుతుంది.

రాక్షసుల పాలిట మృత్యుదేవత పాలిట పడకుండా ఉండడమే వివేకుల కర్తవ్యం. మీరు కావాలని కోరుకొని ఆపదల వలయంలో చిక్కుకొనకుము. శ్రీరాముని బలపరాక్రమాలను అంచనా వేయడం మీకు నాకు రాని పని. అర్ధాంగి ఐన సీత రాముని నీడలో ఉంది. రామాశ్రయంలో ఉన్నవారిని కబళించడం మృత్యువుకే చేతకాదు.

ఓ దశగ్రీవా! రాముని ఎదిరించడం అనేది కలలో కూడా దుర్లభమే. విశాల వక్షస్థలం ఉన్న ఉదాత్తుడు శ్రీరాముడు. ఆయన కరుణాసముద్రంలో మనం ఈదగలమే కాని ఆయన కోపాగ్నికి శలభాల్లా మాడి మసిబారిపోవడం మన చేతగాని పని. శ్రీరాముని ధర్మపత్ని అయోనిజ. ఆమె ఉవ్వెత్తున ఎగిసిపడే జ్వాలలాంటిది. ఆమెను తస్కరించడం మీరు చేయలేని పని అని నేను ఘంటాపథంగా చెప్పగలను.

మీరు మీ రాజ్యంలోనివారు కలకాలం సుఖశాంతులతో జీవించాలనుకొంటే మీకు దుర్బోధను చేసినవారి మాటలను పెడచెవిని పెట్టు. కలలో కూడా శ్రీరామునిపై యుద్ధాభిలాషను తలపకుము. కావాలంటే విభీషణాది మంత్రి పుంగవులతో పునరాలోచించుకొనుము. రాముని బలాలను నిశితంగా పరిశీలించుము. రాముడు నీకు చేసిన అపచారం ఏమిటో? దానికి నీవు ఒనరించాలనుకొనే ప్రతిక్రియ ఏలాంటిదో ? దాని పర్యవసానం ఎలా ఉంటుందో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకో. నేను మాత్రం యుద్ధం తగదనే చెప్తాను. నీకు అందరికి మేలు కలుగజేసే ప్రయత్నం గురించి ఆలోచించి నిర్ణయం తీసుకో అని మారీచుడు రావణునికి చెప్పాడు.

* * *

మారీచుని రామానుభవం

సర్గ - 38

శ్రీరాముని బలపరాక్రమాలను మారీచుడు రావణునికి చెప్పాడు. రావణుని మదిలో పునరాలోచన లేకపోవడాన్ని చూచి మారీచుడు తన అనుభవాన్ని రావణునికి చెప్పాలనుకొన్నాడు. 'రావణా! శ్రీరాముడు బాల్యావస్థలో చేసిన ఘనకార్యాన్ని గూర్చి చెప్తాను వినుము. ఓ రాజా! నేను ఇంతకుముందు వరగర్వంతో సంచరించేవాడినని మీకు తెలుసు గదా! అలాంటి సమయంలో విశ్వామిత్రుడు యాగం చేయాలని తలపెట్టి యాగాన్ని ప్రారంభించాడు. నేను నా వరబలంతో ఆ తపోనిధిని నానావస్థల పాలు చేశాను. ఆయన యాగం ప్రారంభంలోనే మట్టికొట్టుకు పోయేటట్లు చేశాను. నా బాధను తప్పించుకోవాలని భవిష్యద్దృష్ట ఐన విశ్వామిత్రుడు ఆలోచించాడు.

ఒకసారి కోసల రాజ్యానికి విశ్వామిత్రుడు వెళ్ళాడు. దశరథరాజేంద్రుని చూశాడు. ఎన్నో వ్రతాలు చేసి కన్న కొడుకును యాగరక్షణార్థం నాతో పంపుమని విశ్వామిత్రుడు దశరథుని కోరాడు. 'అయ్యా మహర్షి బాలుడైన నా రామునకు నిండా పన్నెండు ఏళ్ళయినా లేవు. అస్త్రశస్త్రాదివిద్యలను ఇప్పుడిప్పుడే నేర్చుకోబోతున్నాడు. ఇతడు రాక్షసులను ఏమి హతమార్చగలడు. నేను ససైన్యంగా వచ్చి మీకు అడ్డుపడే రాక్షసుల పని పడతానని' వేయి విధాలుగా అభ్యర్థించాడు.

దానికి విశ్వామిత్రుడు ఒప్పుకోలేదు. 'ఓ కోసలాధిపతి! నూనూగు మీసాలు రాని ఈ యువకిశోరుడే మారీచుని నిర్జించగలడు. ఈ రాముణ్ణే నాతో పంపించు. నీకు శుభం కలుగుతుంది' అని చెప్పాడు. రాజు మహర్షి మాటలపై నమ్మకంతో రామలక్ష్మణులను విశ్వామిత్రుని వెంట పంపించాడు.

విశ్వామిత్రుని రక్షణలో రామలక్ష్మణులు ధనుర్ధారులై దండకారణ్యంలో ప్రవేశించారు. వారి ముఖం అగ్ని తేజస్సుతో విరాజిల్లేది. వారిద్దరూ యాగభూమిని కాపలాకాస్తున్నారు. అప్పుడు విశ్వామిత్రుడు యాగాన్ని పునరారంభించాడు. నేను విషయం తెలుసుకొన్నాను. రాముణ్ణి చూశాను. బాలుడని నిర్లక్ష్యం చేశాను. వడివడిగా నా పర్వతాకారాన్ని మోస్తూ బంగారుకుండలాలు నా చెవులకుమెరుస్తుండగా యజ్ఞవాటికను చేరాను. నా కండబలం కొద్దీ హోమ గుండంలో నెత్తురు క్రుమ్మరించబోయాను.

అల్లంత దూరాన్నే నన్ను చూసిన బాలరాముడు నా ఆకారాన్ని చూచి కాస్త కూడా తొట్రుపడలేదు, సరికదా బాణాన్ని ఎక్కుపెట్టాడు. నామీద ఆయనలో ఎక్కడో దయ ఉన్నట్లుంది. అందుకే నన్ను క్షణంలో మూర్ఛితుడిని చేసి ఒక్క బాణంతో నూరుయోజనాల దూరంలో ఉన్న సముద్రజలాల అడుగునపారవేశాడు.

నేను మైకం తెలిసి లేచి చూచేసరికి ఆ అసహాయశూరులైన బాలకులు రామలక్ష్మణులు నా అనుచరులందరినీ యమపురికి స్వేచ్ఛగా పంపేశారు. వారి రణకౌశలంతో రాక్షసులనుమట్టి కరిపించారు. విశ్వామిత్రుని యాగాన్ని నిర్విఘ్నంగా జరిపించారు. ఆ విశ్వకల్యాణకారకుడైన విశ్వామిత్రుని ఆశీర్వాదాలను ఆ బాలకులు పొందారు.

'ఓ రాక్షస రాజా! కౌమారదశ వచ్చీ రాకముందే అంతటి బల పరాక్రమాలు ఉన్న ఆ శౌరి నేడు యౌవనంలో ఉన్నాడు. యుద్ధవిద్యలలో ఆరితేరాడు. సర్వుల మన్ననలను పొందాడు. తాపసుల ఆశీర్వచనాలు అందుకొన్నాడు. సీతను అర్ధాంగిగా పొందాడు. అటువంటి శ్రీరాముణ్ణి మీరు ఎదురించగలరా? ఏ క్లిష్టకార్యాన్నైనా తృటిలో చేయగల సర్వసమర్థుణ్ణి దుష్ట ప్రవర్తనతో అందరినీ బాధించే మీరు నిగ్రహించగలరా?

అందుకే ఖర దూషణాదులు శ్రీరాముని చేతిలో హతులయ్యారు. మీరు అదే పాడు పనికి పూనుకొన్నట్లు అయితే మీ భోగలాలస జీవితం సర్వనాశం అవ్వక తప్పదు. మీరే కాదు మీ రాజ్యంలో నిశ్చింతగా సాగిపోయే జీవితాలతో ఉన్నవారు తమ ప్రాణాలపై ఆశ వదులుకోవాల్సిందే. రాక్షస జాతికే మీరు అనర్థాన్ని తెచ్చిపెట్టినవానివి అవుతావు. కుబేరుని తమ్ములైన మీరు సకలైకసంపన్నతతో వజ్రవైడూర్యాదిమణులతో పొదిగిన నిర్మించిన రాజప్రాసాదలతో సుఖంగా జీవించే మీ స్త్రీ జనాన్ని గూడా మీరు అనాథులను చేసినవారు అవుతారు.

పాపకృత్యాలకు దూరంగా ఉండిన పవిత్రులు సైతం మీ లంకలో ఉన్నందుకు పాపుల ప్రాపకాన్ని పొందినందుకు మీతోపాటు శిక్ష అనుభవిస్తారు. సువాసనలతో సర్వాభరణాలతో ఆనందించే భోగులు విరాగులై పోతారు. మీరు గనక సీతను అపహరించినట్లు అయితే యుద్ధం అనివార్యం అవుతుంది. రామరావణయుద్ధంలో భర్తలు కోల్పోయిన ఆలుబిడ్డలు, కొడుకులు కోల్పోయిన తల్లులు లెక్కకుమించి బాధాతప్తులై లంకలో తిరుగాడుతూ మిమ్ములను, మీ చర్యలను తూలనాడుతారు. మీవల్ల వారి జీవితం సర్వనాశనం అయినందుకు వారు మిమ్ము శపిస్తారు. రాముని చేతిలో మరణించినవారు స్వర్గానికిప్రయాణంకట్టినా, రాముడు వదిలేసిన రాక్షసులు దిక్కులేని అనాథల్లా మారిపోతారు.

రావణా! మీ శోభాయమానమైన లంకా పట్టణం అంతా రామ శరాగ్నిలో ఆహుతి అయిపోతుంది. అమరావతి లోని ప్రాసాదాల వైభవాన్ని తలపించే మీ నగర శోభ ఆ రామాగ్నిలో బూడిద అయిపోతుంది. ఈ సంఘటనలన్నీ మీ కన్నులముందే జరిగిపోతుంటే మీరు అవాక్కై చూస్తుండిపోతారు.

ఓ రాజా! మీ చెంత వందల సంఖ్యలో మీ స్త్రీ జనులు ఉన్నారు కదా! మీ రాణులు సౌందర్యంలో దివ్యులను పోలి ఉన్నారు కదా! మీరు వారితో హాయిగా ఉండడమే ఏనాటికైనా మేలు! అలా కాక ఆ సీతాసాధ్విపై కన్నువేస్తే అది మీ నాశకారణం కాక తప్పదు. పరసతిని పొందేవారు పాపాత్ములు. పరసతి పొందుకన్నా పాపం మరొకటి ఉండదు. మిమ్మే నమ్ముకున్న మీ స్వజనాన్ని ఆనందంగా ఉంచడమే మీ ధర్మం అవుతుంది. స్వధర్మాన్ని వీడి చరించినవారికి నరకప్రాప్తి కలుగుతుంది. మీరొక్కరి దోషకారకంగా మీరు, మీ జనులు నాశనం కాకుండా కాపాడే బాధ్యత మీయొక్క భుజస్కంధాలపైనే ఉంది. మీ విచక్షణాజ్ఞానం మంచి చెడులను గూర్చి ఆలోచించి, ఆ తర్వాత నిర్ణయాన్ని తీసుకోవచ్చు. త్వరపడి మీకు కీడు కలిగించే కార్యం మీద మోజుపడకుము.

రావణా! మీ మేలు కోరేవాణ్ణి నేను. అందుకే మీకు ఇంతగా చెప్తున్నాను. సీతాదేవిని మీరు బలవంతంగా తీసుకొని వస్తే మీ చతురంగ బలాలే కాదు లంక అంతా ధ్వంసమౌతుంది. మీరు ఆ శ్రీరాముని బాణాలకు ఆహుతి అయిపోతారు' అని మారీచుడు తన అనుభవాన్ని అంతా పూసగుచ్చినట్లుగా చెప్పాడు.

* * *

మారీచుని హెచ్చరిక

సర్గ - 39

'ఓ రావణా! ఆనాడు నేను ప్రాణాలతో సముద్రజలాలలో నిలిచాను. నాకు నా బుద్ధి పెడదారిపడుతూ ఉంటుంది గదా! ఈమధ్య ఒకసారి ఏమైనదో చెప్తాను వినుము.

నా మనస్సు పొరలలో ఎక్కడో రామునిపై వ్యతిరేకత దాగే ఉంది. ఆయనపై విరోధాన్ని నేను తెంచుకోలేకపోయాను. ప్రాణాపాయస్థితికి లోనై కూడా నేను మరలా రాముని ఎదిరించాలని అనుకొనేవాడిని. అలాంటి సమయంలో ఒక రోజు నేను మృగరూపాన్ని సంతరించుకొన్నాను. పెద్ద నాలుకతో, దృఢమైన శరీరంతో వాడి కోరలతో మహాబలశాలినై దండకారణ్యంలోకి వెళ్ళాను.

అలా వెళ్ళి నా పాత బుద్ధితోనే పవిత్ర భూములలోను, జలాశయాల తీరంలోను, మునులు తపస్సు చేసుకొను ప్రదేశాలలోను తిరిగాను. మునులు తపస్సులో మునిగి ఉన్నప్పుడు వారి జోలికి పోలేకపోయాను. కాని వారు ఆదమరిచినప్పుడు, వారు ధ్యానను నిలపలేకపోయినప్పుడు వారి దగ్గరకు వెళ్ళి వాళ్ళను నోట కరచుకొని వెళ్ళేవాడిని. మునులందరిని భయభ్రాంతులను చేస్తూ నిర్భయంగా ఆ అడవులలో సంచరిస్తూ ఉన్నాను. ధర్మ విరుద్ధమైన కార్యాలు చేస్తూ తిరిగి తిరిగి రామాదులున్న దగ్గరకు వెళ్ళాను.

తాపసవృత్తిని అవలంబిస్తూ సీతతో కూడి ఉన్న రాముణ్ణి చూశాను. ఆయన నన్ను అవమానించిన తీరును గుర్తుకు తెచ్చుకొని చాలా కోపంగా రాముని ఎలా దెబ్బతీయాలా అని ఆలోచనతో ఉన్నాను. అయినా ఆయన దెబ్బ గుర్తుకువచ్చి ఒక అడుగు వెనక్కువేశాను. కాని, ఇప్పుడు ముని వేషధారణలో ఉన్నాడు కదా! పరులను హింసించడమో ననుకొని నా వాడికొమ్ములతో రామునిపైకి దూకి హింసిద్దామని అనుకొన్నాను. నాతోపాటు మరో ఇద్దరు రాక్షసులు మృగరూపాన్ని ధరించి అక్కడే ఉన్నారు. నేను రామునిపై దూకడం చూచి వారు రామాదులను బాధించడానికి ముందుకు వెళ్ళారు.

అంతే! రాముడు తన చేతిలోని వింటిని ఎక్కుపెట్టి మా ముగ్గురిపై మూడు బాణాలు వేశాడు. రాముని బాణ రుచి నేను ముందే తెలిసినవాడిని కాబట్టి ఒక్క ఉదుటన వెనక్కు తిరిగి పరుగు లంకించాను. సముద్రం ఆవలకు వచ్చి వెనక్కు తిరిగి చూశాను. నన్ను వెంబడించిన రామబాణం నా పిరికితనాన్ని చూసి మరలిపోతోంది. అబ్బా! నా ప్రాణాలు దక్కాయని కాలికి బుద్ధి చెప్పాను. కాని నాతో వచ్చిన ఇద్దరూ రామబాణానికి ఆహుతి అయిపోయారు.

పూర్తిగా రాముని గూర్చి తెలుసుకొన్న నేను ఇప్పుడు నా స్వభావాన్ని మార్చుకొని తాపసవృత్తిని స్వీకరించాను. నిరంతరం భగవధ్యానంలో కాలం గడుపుతూ కందమూలాలే ఆహారంగా తీసుకొంటూ ఈ నారవస్త్రాలు ధరించి కాలం గడుపుతున్నాను. రావణా! నాకు వేలకొలది రాములున్నట్లుగా కనిపిస్తారు. నేను కన్ను తెరిచినా మూసినా రాముడే కనబడతాడు. అతని పరాక్రమమే నాకు ఆలోచనగా మారింది. నిరంతరం రాముని గూర్చే ఆలోచించే

నేను మీ హితాన్ని కోరి మంచి చెప్తున్నాను. రామభయం నాలో ఎంత ఉందంటే 'ర' శబ్దంతో మొదలయ్యే రథం రత్నం అన్న పేర్లు వినిపించినా రాముడేమో అనే తడబాటు నాలో మొదలౌతుంది.

రావణా! ఒక్కడుగా కనిపించే ఆ రాముడు తన బలసంపన్నతతో రాక్షసవంశంలో వీరాధివీరులైన బలి చక్రవర్తినిగాని నముచిగాని ఎదుర్కోగలడు. మీరు ఇంకా యుద్ధం చేయాలనుకొంటే రామునికి ఎదురుగా వెళ్ళి పోరు సల్పుము. అంతేగాని ఈ సీతాపహరణప్రయత్నం మాను. మీ జీవితంపై ఆశ ఉంటే రాక్షససంహారి గురించి మరచిపోవడమే మేలు.

ఓ నిశాచరా! మీరు ఇప్పుడు సన్మార్గంలో హాయిగా లంకాపట్టణం ఏలుతున్నారు. దీన్ని మానివేసి అధర్మానికి పూనుకొంటే సపరివారంగా నాశనం చెందుతావు. రాముని గూర్చి మీరు ఏమైనా చేసుకోగాని నేను మాత్రం ఆ రామునిపైకి మీ మాటవలన నేను రాను. జనస్థానంలో మీ ప్రతినిధిగా ఉన్న ఖరుడు శూర్పణఖ వలన అకారణంగా రామునిపై కత్తికట్టాడు. రాముడు నిర్హేతుకంగా ఖరుని యమపురికి సాగనంపాడు. మీ విషయంలో కూడా రాముడు అదేపని చేయగల సమర్థుడు.

నేను నాకు తెలిసినదంతా మీకు చెప్పాను. రామునితో యుద్ధం మృత్యువును మెడలో వేసుకొన్నట్లే అవుతుంది. ఇప్పటికీ మీరు రామునిపై ప్రతీకారేచ్ఛనే కలిగి ఉంటే రామునిపై రణభేరిని మోగించు. ఆ రామబాణాలతో లంకా నాశనాన్ని కళ్ళారా చూసి ఆనందించుము. మీ బంధుమిత్రనాశనం మాత్రం తథ్యం' అని మారీచుడు పలు విధాల రాముని పరాక్రమం గురించి రాక్షసేశ్వరుడైన రావణునికి చెప్పాడు.

* * *

రావణుని ఆజ్ఞ

సర్గ - 40

మృత్యువు ఆసన్నమయ్యే సమయంలో మంచి చెవికెక్కనట్లుగా మారీచుని హితవాక్యాలు రావణునిలో కోపం తెప్పించాయి. కాలం తీరినవానికి ఔషధం కూడా విషం ఐనట్లుగా మారీచుడు చెప్పే మంచి మాటలు రావణుని మనస్సులో చొరలేకపోయాయి.

తల పొగరున్న రావణుడు – 'మారీచా! నీవు చెప్పినవన్నీ అసంగతాలుగా ఉన్నాయి. కేవల మానవమాత్రుడైన రాముని గురించి అతిగా ఆలోచించి ఏదో వ్యర్థ ప్రలాపాలు చేశావు. చవుటి నేలలో నాటిన విత్తనాల్లాగా నీ వచనాలు నేడు వృధా అయ్యాయి. ఒక మూర్ఖురాలైన స్త్రీ మాటలను పట్టుకొని ఈ రాముడు తండ్రిని, రాజ్యాన్ని, మిత్రులను, తల్లులను వదలి అడవులకు వచ్చి బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నాడు. ఖరుని సంహరించిన ఆ రాముణ్ణి నేను ఆ క్షణమే చంపివేసి ఉండేవాడిని. రాముని ప్రాణాధికమైన సీతను హరించి ఆ రాముణ్ణి బాధించి తీరుతాను.

ఇదే నేను తీసుకొన్న దృఢ నిర్ణయం. దీన్ని ఇంద్రాదులు అసురులు అందరూ కలిసి వచ్చినా నా నిర్ణయాన్ని మార్చలేరు. నేను నిన్ను సీతాపహరణ విషయం ఎలా ఉంటుంది అని అడిగి ఉంటే నీవు చెప్పే ఈ మాటలు సహజంగా ఉండేవి. కాని నేను పని చేయమని వచ్చి చెప్తున్నప్పుడు నీ అనుచిత ప్రసంగం నీ అవివేకాన్ని చూపెడుతోంది. మారీచా! ప్రతి రాజు ఇతరుల నుండి గౌరవాదరములనే కోరుకొంటాడు. ప్రజలు, గూఢచారులు, సేవకులు వీరిలో ఎవరైనా రాజు మేలు కోరి చెప్పే విషయాలు రాజును కీర్తిస్తూ మృదువుగా గౌరవ సూచకంగా చెప్పాలి. రాజు మాటలను తోసిపుచ్చే పౌరులను ఏ రాజు సహించలేడు.

ఓ రాక్షసా! ప్రతి రాజు దివ్య లక్షణాలు పుణికిపుచ్చుకొని ఉంటాడు. అవి అగ్నిలాంటి తీక్షణ స్వభావం కలవి. ఇంద్రుని రీతి పరాక్రమం, చంద్రునివంటి ఆహ్లాదకరం, యముని వంటి ప్రసన్నత, వరుణుని వంటి దుష్ట నిగ్రహ లక్షణం – వీటివల్ల శత్రువులను పీచమణచవచ్చు. శరణాగతులను రక్షించవచ్చు. స్వజనులలో ధైర్యాన్ని నింపవచ్చు. ప్రజల ఉన్నతిని కోరవచ్చు. ఈ లక్షణాలు ఉన్న రాజులే లోకంలో గౌరవార్హులు అవుతారు.

నీవు రాజును గౌరవించాలన్న ధర్మాన్ని వీడావు. శత్రువులను నా ముందే కీర్తిస్తూ నన్ను అవమానించావు. అజ్ఞానంలో మునిగి నాకే హితోపదేశం చేస్తున్నావు. నీ అర్హతను మరిచి నాతో ఇచ్ఛాపూర్తిగా మాట్లాడడానికి సాహసించావు. ఓ వీరా! నేను చేయవలసిన కార్యం గురించి నాకు క్షుణ్ణంగా తెలుసు. నీవు నాకు ఏమీ చెప్పనవసరంలేదు. నేను నిన్ను సహాయం చేయమని శాసించడానికి వచ్చాను.

నీ అధిక ప్రసంగాన్ని కట్టిపెట్టి, మారు పలకకుండా నేను చెప్పినట్లుగా చేయి. అదే నీకు మంచిది. బంగారు చర్మం మీద వెండి చుక్కలున్న లేడి రూపాన్ని ధరించి రామాదుల పర్ణశాల దగ్గర సంచరిస్తూ నీ మీద సీత దృష్టి పడే విధంగా నడుచుకో. నిన్ను చూచిన క్షణమే ఆ వైదేహి నిన్ను కోరి రాముని నిన్ను పట్టి తెమ్మని ప్రేరేపిస్తుంది. రాముడు ఆమె కోరికను తీర్చడానికి నీ వెంట పడతాడు. నీవు నీ ఇష్టం వచ్చిన చోటుకు రాముని పరుగెత్తించు. అలా పర్ణశాలకు దూరం అయిన రాముని సమక్షంలో నీవు హా! లక్ష్మణా! హా! సీతా! అని అరచి రామునికి అపాయం కలిగినట్లుగా నటించు. అప్పుడు లక్ష్మణుడు కూడా అన్నను వెదుకుతూ కుటీరానికి దూరం అవుతాడు. అప్పుడు నేను సీతను అపహరించి తీరుతాను.

ఇలా నేను చెప్పినట్లు నీవు చేయకపోతే ఆ రాముడు నిన్ను చంపునో మానునో కాని నేను మాత్రం నిన్ను చంపివేస్తాను. ఓ రాక్షసా! నీవు ఒకవేళ సీత దగ్గరకు వెళ్ళినట్లు అయితే నీ ప్రాణాలు దక్కవచ్చునేమో! కాని వెళ్ళకుండా ఉంటే నీ ప్రాణాలపై ఆశ వదులుకో. బాగా ఆలోచించి నిర్ణయం తీసుకో' అని రావణుడు మారీచుని తన ఆజ్ఞను నిర్వర్తించుమని నిర్బంధించాడు.

* * *

మారీచుడు చెప్పిన యథార్థం

సర్గ - 41

రావణుని నిరంకుశ ఆజ్ఞను విని మారీచుడు కోపం తెచ్చుకొన్నాడు. పరుషంగా 'ఓ రావణా! మీ సర్వనాశనం కోరుతూ మీకు సీతాపహరణం చేయమని చెప్పిందెవరు? ఓ రాజా! మీరు సుఖసంతోషాలతో ఉండడం చూడలేని మీ శత్రువులు మిమ్ము మించిన రాముని చేతిలో మీరు నాశనం అవ్వాలని తలచి మీకీ దుర్బోధ చేశారు.

మిమ్ము ఎదిరించలేని నిస్సహాయులు మీ పాడుపనిని హర్షించలేనివారు, మీ చావును కోరి మీతో స్వయంగా మిమ్మే మంటలలో దూకించడానికి వారు పూనుకొన్నారని స్పష్టంగా తెలుస్తోంది. ఓ రావణా! లోక విరుద్ధంగా ప్రవర్తించే మీకు బుద్ధి చెప్పాల్సిన మీ మంత్రులు ఏం చేస్తున్నారు? అవసరమైనప్పుడు మీకు బుద్ధి బోధించని ఆ సచివులను దూరం చేయడం ఉత్తమం. దానికి మీరు ఎందుకు ఉపేక్షిస్తున్నారు.

రాజు గుణవంతుడైనచో రాజ్యంలోని పౌరులు మంత్రులు సామంతులు అందరూ సుఖంగా జీవిస్తారు. కానీ ఆ రాజు అధర్మ ప్రవర్తనతో విశృంఖలంగా గుణహీనమైన పనులు చేస్తుంటే రాజేకాక రాజ్యం మంత్రులు సామంతులు అందరూ నాశనం అవ్వడం సర్వపురుషార్థాలనుండి దూరం కావడం ఖాయం.

రాజు ప్రవర్తననుబట్టి ప్రజల నడవడి ఆధారపడి ఉంటుంది. ఇంద్రియనిగ్రహం లేని రాజు నిరంకుశ ధోరణితో ఎక్కువ కాలం రాజ్యాన్ని ఏలలేడు. వంకర టింకర దారిలో వేగంగా నడిచే అశ్వాల వలన రథం రథసారథి అపాయాల పాలైనట్లు దీర్ఘాలోచన లేని మంత్రుల ఉపాయాలను ఆచరించే మందబుద్ధి ఐన రాజుతో కూడా సద్బుద్ధిఉన్నవారుసైతం నాశనం అయిపోతారు.

నేడు శ్రీరాముని చేతిలో నేను మరణించడం యాదృచ్ఛికం. ఇలా విధి రాసి ఉంటుంది. కాని మీరు కావాలని కోరుకొని మీ మృత్యువును ఆహ్వానిస్తున్నారు. మిమ్ము చూస్తుంటే నాకు జాలి కలుగుతోంది. నన్ను చంపిన కొద్దికాలంలోనే మిమ్మూ రాముడు నా దగ్గరకు పంపివేస్తాడు. ఇందులో ఎలాంటి సంశయం లేదు.

రాక్షసరాజా! నన్ను తీసుకొని వెళ్ళి సీతను మీరు తెచ్చినట్లు ఐతే మీ బంధుజనంతోటి మీరు మరణించడం తథ్యం. ఇది మీరు గుర్తుంచుకొనవలె. విపరీత కాలం వచ్చినప్పుడు వినాశకరబుద్ధే బాగా అనిపిస్తుంది అంటూ మారీచుడు రావణునికి జరగబోయే యథార్థపరిస్థితిని చెప్పి సీతాపహరణకార్యాన్ని అడ్డుకోవాలని ఎంతగానో ప్రయత్నించాడు.

* * *

బంగారు లేడి - సీత

సర్గ - 42

నేను ఇన్ని చెప్పినా పట్టుదల వదలని రావణుని చూసి సరే మీ ఆజ్ఞానుసారం మీతో వస్తాను అని చెప్పాడు. 'ఓ రావణా! ధనుర్బాణాలు ధరించి ఉన్న శ్రీరాముని దగ్గరకు నేను వెళ్ళగానే నన్ను చూసిన తక్షణం మీ జీవితం ముగియడం తథ్యం. ఇక్కడ మీ ఎదురుగా ఉన్నది నా ప్రతిరూపమే. విరోధంబూని శ్రీరామునికి ఎదుటపడిన క్షణమే నా ఆయువు తీరిపోయింది. మీరు కూడా రామునిపై విరోధం పెంచుకొంటున్నారు. మీ మృత్యువు మీ చెంతే ఉంది అని మీరు గ్రహించవలసిఉంది.

పదండి మీతో వస్తాను – అంటూ మారీచుడు పలకగానే రావణుడు "మారీచా! నీవు ఇంతవరకు నిశాచరుడవు కాని నీవు ధీరుడివైనా మారీచుడవు. నా రత్నఖచితమైన బంగారు రథాన్ని నీవు కూడా నాతోపాటు అధిరోహించు. నీవు నీ ఇష్టం వచ్చిన రీతిలో రాముణ్ణి ప్రలోభపెట్టు. రామలక్ష్మణులు లేని సమయం చూచి సీతను అపహరించి తీసుకొని వద్దాం" అని మారీచుని తీసుకొని రావణుడు దండకారణ్యాలకు బయలుదేరాడు. అలా వారు రథంమీద వనాలు, నగరాలు, పర్వతాలు, నదులు, ఎన్నో ప్రదేశాలను దాటుతూ వెళ్ళి చివరకు దండకారణ్యంలో ప్రవేశించారు. అక్కడ రామాశ్రమాన్నీ చూశారు. రథాన్ని దిగారు. రావణుడు మారీచుని చేయి పట్టుకొని 'మారీచా! మన పని ప్రారంభించు' అని చెప్పాడు. వెంటనే బంగారు లేడి రూపం పొందాడు. అద్భుతమైన చర్మపు నిగనిగలతో మెరుస్తూ అక్కడక్కడ వింతకాంతులీనే వెండి చుక్కలతో బెదురుచూపులతో రామాశ్రమం చేరి రాముని కుటీరం ముందు సంచరించసాగాడు.

ఆ మారీచమృగం వింతశోభలతో ఆ ప్రదేశానికే శోభను కలిగిస్తూ ఉంది. లేడి కొమ్ములు ఇంద్రనీల వర్ణాన్ని ఆపాదించుకొన్నాయి. దాని ముఖం తెలుపు నలుపు మిశ్రమ వన్నెతో ఉంది. మెడ కొంచెం పైకెత్తి అక్కడక్కడ పచ్చికను లేచిగుళ్ళను తింటూ తిరుగుతోంది. దాని ప్రక్కలు నెమలి వర్ణాన్ని కలిగి ఉన్నాయి. దాని ఉదరం తెల్లని మల్లెపూవులాగా ఉంది. లేడి కాలిగిట్టలు వైడూర్యాలను పొదిగినట్లున్నాయి. వన్నెచిన్నెలతో సీతాదేవిచూపు తన మీద పడాలనే కాస్తదూరం వెళుతూ మరల చెంగు చెంగున గన్నేరు మొక్కల దగ్గర కుటీరం దగ్గరగా సంచరిస్తూ ఉంది. కొద్దిసేపు లేళ్ళ గుంపుతో కలుస్తూ తిరిగి ఒంటరిగా తిరుగుతూ చిత్రవిచిత్ర విన్యాసాలు చేస్తూ ఉంది. దానిపక్కన తిరిగే జంతువులన్నీ అది మామూలు జంతువు కాదని గ్రహించాయి. దానికి భయపడి అవి దూరంగా పారిపోయాయి. మాయామృగం చక్కని గెంతులు వేస్తూ పచ్చికను వాసన చూస్తూ లేచిగుళ్ళను పంటి మధ్యన ఇరికించుకొని తిరుగాడుతూంది. అప్పుడే సీతాదేవి తన కోమలమైన చేతులతో పూలను కోద్దామని గన్నేరు మొక్కల దగ్గరకు వచ్చింది.

పూలను కోస్తూ వన్నెచిన్నెలతో సోయగాలు చిందిస్తున్న ఆ లేడిని చూచింది. కన్నులు పెద్దవి చేసుకొని ఆ వింత మృగాన్ని ఆనందంగా చూసింది. శరీర కాంతి మిరుమిట్లు కొలుపుతూ తిరగాడే ఆ లేడి సీతాదేవి చూపును

ఆకర్షించడానికి చిత్రవిచిత్రంగా తిరుగుతోంది. దాని వన్నెలు ఆ వనానికే అందాన్ని చేకూర్చుతున్నాయి. ఇంతకు ముందెప్పుడు ఇలాంటి సువర్ణ శరీరపు కాంతి ఉన్న లేడిని సీత చూడలేదు. అందుకే ఆశ్చర్యం, ఆనందం మిళితమై అద్భుతంగా చూస్తోంది.

* * *

మాయామృగం వేటకై ఉత్సాహం

సర్గ - 43

మేలిమి బంగారు ఛాయ శరీరం ఉన్న మృగంపై సీతాదేవి మనస్సు పడింది. 'నాథా! శ్రీరామా! లక్ష్మణా! త్వరగా రండి ఆయుధాలను తీసుకొని వెంటనే రండి. ఈ వింత మృగాన్ని చూసి ఆశ్చర్యానుభూతిని మీరు పొందుతారు రండీ' అంటూ సీతాదేవి వేగంగా రమ్మని రామలక్ష్మణులను పిలిచింది. వారిద్దరూ గబగబా వచ్చి ఆ మృగాన్ని చూశారు.

చూచిన తడవులోనే లక్ష్మణుడు 'అన్నా! ఇది మామూలు లేడి కాదు. మారీచుడే మాయా మృగరూపాన్ని ధరించి వచ్చినట్లుంది. వేటాడే రాజులను మట్టుపెట్టడానికి ఆ రాక్షసుడు ఈ రూపాన్ని సంతరించి వచ్చి ఉంటాడు. శ్రీరామా! ఇది నిజంగా మాయా విశేషమే. వింత కాంతులీనుతున్నట్లు కనిపించే ఈ శరీరం నిజమైన మేను కాదు. బంగారు శరీరం లేళ్ళు ఈ భూప్రపంచంలో ఎక్కడా ఉండవు.'అని తనమనసులోని మాటను నిస్సంకోచంగా చెప్పాడు. కాని బంగారు హరిణిపై మనస్సు పడ్డ మానవతి సీత లక్ష్మణుని వారించింది. లక్ష్మణుని మాటలకు అడ్డు నిలిచింది.

'ఆర్యపుత్రా! ఈ అద్భుతమైన మృగం నా మనస్సును దోచుచున్నది. దీన్ని నాకు తెచ్చి ఇవ్వండి. మన కుటీరంలో పెరిగే ఇతర మృగాలతో కలసి ఉంటుంది. నేను దీనితో ఆడుకొంటాను. ఇక్కడ చుక్కల లేళ్లు, చమర మృగాలు, కిన్నర మృగాలు ఎలుగుబంట్లు సవరపు మెకాలు మనోహరంగా సంచరిస్తూ ఉన్నాయి. అవి అన్నీ చూడటానికి సౌందర్యం కలవే. కాని వీటినన్నింటిని మించిన సౌందర్యాతిశయం దీనిలో ఉంది. ఇలాంటి హరిణాన్ని నేనెన్నడూ చూడలేదు. దీని నడక వయ్యారం చూస్తున్నకొద్దీ మనస్సు పరవశం అవుతోంది. దీని నుంచి వచ్చే కాంతితో ఈ వనం కొత్తదనాన్ని సంతరించుకొంటుంది. దీని అరుపు మధురంగా వినబడుతోంది. దీన్ని స్పృశించాలనే కోరిక నా మనస్సును తొలుస్తోంది.

ఈ మృగాన్ని ప్రాణాలతో పట్టి తెస్తే మన వనవాసానంతరం మన అయోధ్యకు దీన్ని తీసుకొని వెళ్దాం. అపుడే మన అంతఃపుర సౌభాగ్య చిహ్నంగా ఈ మృగం ఉంటుంది. అప్పుడు మా అత్తగార్లు అంతఃపురవాసులు దీన్ని చూసి ఆనందిస్తారు. ఓ నరశ్రేష్ఠా! కనీసం దీన్ని పట్టి తేలేకపోయినా దీన్ని చర్మం అయినా తీసుకొని వస్తే

నాకు సంతోషమే. ఆ చర్మాన్ని ఆసనంగా చేసుకొని కూర్చోవాలని నా కోరిక. శ్రీరామా! ఉత్తమ స్త్రీలు ఇలాంటి ఘోర కార్యానికి పురుషులను పురికొల్పరు కాని నా మనస్సెందుకో ఈ మృగాన్ని కోరుకొంటోంది.'అని మనసుపడిన మృగం గూర్చి సీతమ్మ పదేపదే చెప్పుతోంది.

ఆ మృగాన్ని చూచిన శ్రీరాముడు దాని రోమ సౌందర్యం, నడక వయ్యారం ఆ మృగం ఆవలించినప్పుడు దాని ఎర్రని నాలుక బయటకు రావడం చూసి అచ్చెరువొందాడు. నక్షత్రంలాగా మిలమిలలాడుతూ ఉన్న ఆ చుక్కల వైభవాన్ని చూసి రాముడు కూడా ముచ్చటపడ్డాడు. దానిపై సీతాదేవి ప్రోద్బలం తోడై మృగాన్ని వేటాడి పట్టి తేవాలని అనుకొన్నాడు. 'లక్ష్మణా! ఈ వింత మృగం నీవు చెప్పినట్లు ఇక్కడెక్కడా లేదు. కుబేరుని చైత్రరథమనే ఉద్యానవనంలోగాని, ఇంద్రుని నందన వనంలోకాని ఇలాంటి విచిత్రాలు కనిపిస్తాయి కాబోలు. మేఘం నుండి రాలిన విద్యుత్కాంతిలాగా మెరపు తీగలాగా వన్నెలు చిందే ఈ మృగం అపురూపంగా కనిపిస్తోంది. దీన్నిచూస్తే ఎవరి మనస్సు అయినా ప్రలోభానికి లొంగుతుంది. అందుకే మిథిలానగర రాజకుమారి మనస్సు పడింది.

మామూలుగా కనబడే జంతువుల అందానికి దాసోహం అవ్వడంలో ఆశ్చర్యం ఏముంది? రాజులందరూ వేటలో దొరికే వినోదాన్ని, పురుషార్థాన్ని పొందడానికి పరుగులెత్తుతారు. ఇంకాకొందరు ముత్యాలు, మణులు, రత్నాలకోసం అర్రులు చాస్తుంటారు. లక్ష్మణా! తాపసులందరూ తమ తపో ప్రభావం చేత అక్షయ సంపదలను తృటిలో సంపాదిస్తారు. అదంతా లోకకల్యాణానికి ఖర్చుచేస్తారు. కాబట్టి అది ఉత్తమమైన సంపద అవుతుంది. ముందు వెనకాలోచన లేక ధనాన్ని ఆర్జించడమే పురుష లక్షణం అని అర్థశాస్త్ర ప్రవీణులు అంటారు. అమూల్యంగా లభించే వస్తువులు ప్రజల అభివృద్ధికి తోడ్పడాలి. అద్భుతంగా కనిపించే ఈ మృగచర్మం నేను తీసుకొని వస్తాను. దాని బంగారు చర్మం మీద నేను మీ వదిన ఆసీనులమవుతాం' అని శ్రీరాముడు తన కోరికను లక్ష్మణునికి చెప్పాడు.

'లక్ష్మణా! కదళ మృగచర్మంగాని, ప్రియక మృగ చర్మంగాని, ప్రవేణి మృగచర్మం కాని దీని స్పర్శ సుఖాన్ని ఇవ్వలేవని నాకు అనిపిస్తోంది. సౌమిత్రీ! ఈ లోకంలో రెండే దివ్య మృగాలున్నాయి. ఆకాశంలో సంచరించే మృగశీర్షా నక్షత్రం, భూమిపై సంచరించే ఈ మృగం ఇవి తప్ప వేరేవి ఏవీ లేవు. అలాగాక నీవు చెప్పినట్లు ఈ మృగం రాక్షస మాయ ఐనట్లు అయితే నేను తప్పక వధించి తీర్తాను.

ఇది మారీచుని పనే అయినట్లు అయితే, ఇతడు ఇంతకుముందు ఎందరు తాపసులనో దుఃఖితులను చేశాడు. ధనుర్ధారులై వేటకు వచ్చిన రాజులను పొట్టన పెట్టుకొన్నాడు. కాబట్టి ఈ రాక్షసాధముడు చంపదగినవాడే. సౌమిత్రీ! పూర్వం ఇక్కడ వాతాపి అనే రాక్షసుడు ఉండేవాడు. వాడు కపటోపాయాల చేత తాపసుల కడుపులోకి వెళ్ళి వారి ఉదరాన్ని చీల్చుకొని వస్తుండేవాడు. వాడి కర్మ నశించి ఒకసారి అగస్త్యునికి ఆహారం అయ్యాడు. ఆయన కడుపు చీల్చుకొని రాబోయే వాతాపిని చూసి ఆ మహర్షి ఇంక ఎక్కడకు వస్తావు? వాతాపి జీర్ణం జీర్ణం అన్నాడు. అంతే వాడు చేసిన పాపానికి శిక్షగా అగస్త్యుని వలన ప్రాణాలు పోగొట్టుకొన్నాడు. అలా నన్ను చేరిన ఈ మారీచుడు యమపురికి వెళ్ళవలసినవాడే కదా!

సౌమిత్రీ! నీవు ధనుర్బాణాలు ధరించి సర్వసన్నద్ధుడివై మీ వదినెను రక్షిస్తూండు. ఈమెను రక్షించడం మన ముఖ్య కర్తవ్యం. నేను ఈ మృగాన్ని వేటాడి సజీవంగానైనా, నిర్జీవంగానైనా దీన్ని పట్టి తెస్తాను. నీవు ఏమరుపాటు లేకుండా మైథిలిని రక్షిస్తుండు. నేను ఒక్క బాణంతో దీన్ని వధించి దీని చర్మాన్ని తెచ్చి వైదేహికి ఇచ్చి ఆనందపడుతాను.

జటాయువు నీవు కలసి సీతను సదా రక్షిస్తూ అప్రమత్తుడై ఇక్కడే ఉండు. నేను తృటిలో వెళ్ళి వస్తాను. ఈ దండకారణ్యం రాక్షసుల ప్రమాదం ఏవైపున పొంచి ఉందో మనం గ్రహించలేం. ఎల్లవేళలా నీవు సీతను రక్షిస్తూ ఉండుము" అని శ్రీరాముడు లక్ష్మణునకు చెప్పాడు.

* * *

మారీచ వధ

సర్గ - 44

మహాబలపరాక్రమవంతుడు ఐన శ్రీరాముడు లక్ష్మణునికి జాగ్రత్తలు చెప్పాడు. నడుముకు ఖడ్గాన్ని అలంకరించాడు. చేతితో మూడు వంపులున్న ధనుస్సును పట్టుకొన్నాడు. అమ్ములపొదిని వీపున ధరించాడు. మాయామృగాన్ని వేటాడటానికి బయలుదేరాడు. శ్రీరాముడు తనను చూస్తూ వస్తున్నాడని తెలుసుకొని చెంగు చెంగున గెంతుతూ మాయమవుతూ మరలా కనిపిస్తూ రాముని కవ్విస్తూ ముందుకు పరుగెత్తింది. మృగం వేగంగా పరుగెత్తుతూ రామునికి చిక్కినట్లుగా కనబడి అంతలో తృటిలో తప్పించుకొంటూ పరుగెత్తేది. ఒక్కొక్కసారి ఆకాశంలో ఎగురుతోందా? అనిపించేది. మరొక్కసారి ఇక్కడీ దాపునే ఉంది కదా అనిపించేది. ఇలా రాముని పరుగెత్తించింది. శ్రీరాముని కుటీరానికి చాలా దూరంగా తీసుకొని పోయింది. ఎంతకీ దొరకకుండా పోయే ఆ మృగం మీద రామునికి విపరీతమైన కోపం వచ్చింది. పట్టుదల పెరిగింది. అలసిపోయి ఒక చెట్టు నీడన కూర్చున్నాడు. మళ్ళీ ఆ మారీచమృగం ఇతర మృగాలతో కలసి అక్కడే సంచరించడం రాముడు చూశాడు. దాన్ని చూసి రాముడు లేచి దాని వెంట వెళ్ళాడు. రాముడు తనను వెంబడించడం చూచి మరలా ఆ లేడి అదృశ్యం అయినట్లుగా కంటికి కనిపించకుండా పారిపోయింది. మళ్ళీ చెట్ల మధ్యనుండి బయటకు వచ్చింది. దాన్ని చూచిన రాముడు క్రుద్ధుడు అయ్యాడు. దాన్ని చంపాలని నిశ్చయించుకొన్నాడు. వెంటనే నారిని సంధించాడు. సూర్యకిరణ కాంతులను విరజిమ్మే బాణాన్ని తీసి ఎక్కుపెట్టాడు. ఆ బాణం వేగంగా వెళ్ళి మారీచుని శరీరాన్ని చీల్చివేసింది. ఆ దెబ్బతో మారీచుడు లేడి చెట్టంత పొడవున పైకి ఎగిరాడు. ఆయువు తీరిపోయింది. ప్రాణాలు అనంతవాయువులో కలియడానికి పెనుగులాడాయి. దాంతో మారీచుడు అసలు రూపాన్ని పొంది నేల మీద పడిపోయాడు. అప్పుడు రావణుని మాటలు మారీచునికి గుర్తుకొచ్చాయి. రావణుని ఆదేశాన్ని పాటించాలని నిశ్చయించుకొన్నాడు. వేగంగా ఆలోచించాడు. 'హా సీతా!' 'హా లక్ష్మణా!' అని గట్టిగా ఆర్తనాదం చేశాడు. తిరుగులేని రామబాణం మారీచుని ప్రాణాలను అనంతవాయువులో లీనం చేసింది. మారీచుని అసలు స్వరూపం పర్వతాకారంగా ఉంది. చిత్ర విచిత్ర

ఆభరణాలు శరీరమంతా నిండి ఉండి కిందపడడంవల్ల చెల్లాచెదరు అయ్యాయి. పెద్ద పెద్ద కోరలున్న మారీచుడు పెద్ద రాక్షసుడని చెప్పకుండానే తెలుస్తోంది.

విగత జీవుడౌతోన్న మారీచుని శ్రీరాముడు చూశాడు. అటు ఇటు దొర్లుతూ మృత్యువుతో పోరాడే మారీచుని చూచి లక్ష్మణుని మాటలు గుర్తుకు తెచ్చుకొన్నాడు. లక్ష్మణుడు ఊహించినది నిజమే అయ్యింది. ఇతడు మరణిస్తూ 'హా! లక్ష్మణా, హా! సీతా' అని అరిచాడు. ఈ అరుపులు విన్న సీత ఏమగునో అని శ్రీరాముడు దిగులు చెందాడు. లక్ష్మణుని పరిస్థితి ఎలా ఉందో అనుకొన్నాడు. మారీచుని స్వరం విని దిగులుతో శ్రీరాముడు తన ఆశ్రమానికి వడివడిగా వెళ్ళడానికి బయలుదేరాడు.

* * *

సీతాదేవి పరుషోక్తులు

సర్గ - 45

సీతాదేవి వనం నుండి వచ్చే ఆర్తనాదం వినింది. వ్యాకులపడి 'లక్ష్మణా! మీ అన్నకు ఏదో ఆపద వాటిల్లినట్లుంది. నీవు వెంటనే వెళ్ళి ఆయనను కాపాడి తీసుకొనిరా' అని చెప్పింది. కాని లక్ష్మణుడు ఏమీ మాట్లాడలేదు. మరలా సీత 'ఓ లక్ష్మణా! మీ అన్న గొంతు విన్నప్పటినుండి నా మనస్సు ఏదో కీడును శంకిస్తోంది. నా ప్రాణాలు నిలవడంలేదు. సింహాల మధ్య చిక్కుబడిన వృషభంలాగా రాక్షసుల మధ్య మీ అన్న చిక్కిపోయినాడేమో? నీవు వెంటనే వెళ్ళి కాపాడుము. వెళ్ళు, వెళ్ళు' అంటూ సీత పలుసార్లు లక్ష్మణునికి చెప్పింది.

ఎన్నిసార్లు చెప్పినా రామాజ్ఞను అనుసరించి లక్ష్మణుడు కదలకుండా అక్కడే నిలబడ్డాడు. దాన్ని చూచి మైథిలికి కోపం వచ్చింది. 'లక్ష్మణా! నీవు పైకి మంచివాడుగా కనిపిస్తూ రామునికి శత్రువులాగా ఉన్నావు. ఆపద సమయంలో రామునికి సాయం అందించక ఇక్కడే నిలబడ్డావు. నీలో నాపై కోరిక ఉన్నట్లుంది. నీ మీద అభిలాష వలనే రాముడు చిక్కుల్లో పడిపోయినా నీవు నిమ్మకు నీరెత్తినట్లుగా కనిపిస్తున్నావు. రామునికి కష్టాలు చుట్టుకొనడమే నీకు ఇష్టం కాబోలు. మా రక్షణార్థం అని నీవు అడవులకు వచ్చావు. నేడు ఆపదలపాలైన రాముణ్ణి రక్షించకుండా ఉండడంలో అర్థం ఏమిటి?

భర్త ఆపదల పాలైనాడన్న విషయం అర్థంచేసుకొన్న సీత మనస్సు పరిపరి విధాల పోయింది. ఆమె మానసికంగా క్రుంగిపోయింది. ఆమెలో దుఃఖం పొంగి కన్నీళ్ళు జలపాతంలాగా కారసాగాయి. శోకాగ్నిలో కూరుకుపోయే సీతను లక్ష్మణుడు చూసి 'ఓ వైదేహీ! శ్రీరాముని జయించడం ఎవరివల్లా కాదు. నాగులు, అసురులు, గంధర్వులు, దేవతలు, మానవులు, రాక్షసులు వీరిలో ఏ ఒక్కరు ఐనా ధనుర్ధారుడైన శ్రీరాముని ఎదురుగా నిలవలేరు. ఇది వాస్తవం. సమరంలో శ్రీరాముడు ఎదురులేని వీరుడు.

మీరు ఆయనకు ఆపద వాటిల్లిందని అపోహపడుతున్నారు. అందుకే మీరు పరుషంగా మాట్లాడుతున్నారు. శ్రీరాముడు లేకుండా మిమ్ము ఈ ఆశ్రమంలో ఒంటరిగా విడిచి వెళ్ళడం నాకు ఇష్టంలేదు. మీ మనస్సును గట్టిపరచుకోండి తల్లీ. మీ భర్త ఐన శ్రీరాముణ్ణి ఇంద్రాదులు దిగివచ్చినా ఎదిరింపలేరు.

మనకు వినబడిన ఆర్తనాదం శ్రీరామునిది కాదు. రాముడు ఏనాటికైనా అలా అరవరు. ఆయనకు ఆ అవసరం రాదు. రాక్షసమాయ ప్రభావంతో ఈ శబ్దం వినబడింది. ఇదంతా ఆ దుష్ట మారీచుని పన్నాగం అయి ఉంటుంది. ఓ సీతాదేవి! మీ రక్షణ భారం మా అన్న నాపై పెట్టి వెళ్ళాడు. ఆయన మాటను తోసేసి మిమ్ము ఒంటిగా వదిలి నేను ఎక్కడికీ వెళ్ళలేను.

రాముడు జనస్థానంలోని రాక్షసులను తుదముట్టించాడు గదా! ఖరదూషణలను సంహరించిన కోపాన్ని మనపై ఉంచుకొని మనలను ఆపదల పాలు చేయాలని రాక్షసులు కుట్ర పన్నుతున్నారు. ఏ రాక్షసుడో అన్న కంఠాన్ని అనుకరించి అరిచాడు కాని నిజానికి శ్రీరామునికి వచ్చే ఆపద ఏదీ లేదు' అని యథార్థాన్ని సీతాదేవికి లక్ష్మణుడు చెప్పాడు.

ఆ మాటలు జానకిని అంతగా నమ్మించలేకపోయాయి. అందుకే ఆమె రాముడు ఆపదలలో చిక్కుకొన్నాడనే నమ్మింది. దాంతో 'ఓ క్రూరాత్మా! నీవు వంచకుడివి. వంశానికి అపకీర్తి తెచ్చేవాడివి నీవు. నా పతిదేవుడు చిక్కుల్లో ఉన్నాడని తెలుసుకొన్నావు. ఈ సమయం కోసమే నీవు ఎదురుచూస్తున్నట్లు ఉన్నావు. దుర్బుద్ధితో మేక వన్నె పులివై నన్ను కబళించాలని ఆలోచనతో ఉన్నట్లుగా నాకు అనిపిస్తోంది.

ఓ సౌమిత్రీ! నీవు సచ్చరిత్ర కలవానివని నేను పొరపడ్డాను. నన్ను పొందాలనే ఆశతో మమ్ము వెంబడించి వచ్చినట్లున్నావు. లేదా శ్రీరాముని ఆపదల పాలు చేయమని భరతుడే నిన్ను ప్రేరేపించి పంపాడేమో? ఓ లక్ష్మణా! ఎట్టి పరిస్థితులలోను నీ కోరిక నెరవేరదు. సర్వాంగశోభితుడైన రాముని పొందిన నేను అన్యులను ఎందుకు వాంఛిస్తాను. నా భర్త లేనిచో నేను ఈ భూతలంలో ఒక్క క్షణమైనా నిలువలేను.

నీవు అలా చూస్తూనే ఉండు. నేను నీ ఎదుటనే నా ప్రాణాలను తీసుకొంటాను. ఇందులో ఏ సందేహం లేదు' అని అంది. అలాంటి పరుషోక్తులు విని లక్ష్మణుడు చలించిపోయాడు. 'అమ్మా! మీరు నా అన్నగారి భార్యవు. నాకు తల్లితో సమానురాలవు. నేను మీ మాటలకు జవాబు ఇవ్వలేను. స్త్రీలు ఇలా మాట్లాడడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. ఇది లోక సహజం. సందర్భాలను బట్టి అభద్రతాభావం ఎక్కువైనప్పుడు స్త్రీలు ఎదుటివారిని నొప్పించడం సహజమే. వారి స్వభావం చంచలమై ఉంటుంది. వారు ధర్మాన్ని పూర్తిగా విశ్వసించలేరు. అందుకే వారు బంధువుల మధ్య మనస్పర్ధలను రగిలింతురు. ఓ సీతాదేవి! మీ పలుకులు నాకు ములుకుల వలె గుచ్చుకొంటున్నాయి. మీ పరుషపు మాటలను ఈ వనదేవతలందరూ వింటున్నారు. నాకు వీరే సాక్షులు. నేను ఏ వేళయందు ఐనా అన్నగారి మాటను వేదంలాగా పాటించేవాడిని. మీరు అన్నీ తెలిసికొని ఉండి కూడా సాధారణ స్త్రీలాగా మాట్లాడుతున్నారు. మిమ్ము విడిచి నేను వెళ్ళినప్పుడు ఏ ఆపద రానున్నదో? అమ్మా! జానకీ

దేవి! నేను శ్రీరామునితో తిరిగి వచ్చి మిమ్ము చూస్తానో? లేదో? నాకు కనబడే ఈ అపశకునాలు నన్ను ఇక్కడనుంచి వెళ్ళనీయడంలేదు.

అమ్మా! మీరు అన్న కలిసి ఉండగా చూచే భాగ్యం నాకు ఉందో లేదో? నన్ను నమ్ము తల్లీ! రామునకు ఏ అపాయం రాదు' – అని చెప్పే లక్ష్మణుని మాటలు విని జానకి కన్నీరు మున్నీరుగా ఏడ్చింది. 'లక్ష్మణా! శ్రీరాముడు లేనిచో నేను క్షణమైనా బ్రతకలేను. ఇపుడే అగ్నిలో ప్రవేశించో, లేక నదిలో దూకో, పైనుంచి కిందపడో నేను నా ప్రాణాలను త్యజిస్తాను. ఎట్టి పరిస్థితులలోను శ్రీరాముని తప్ప అన్యులను స్పృశించను' అని మాటిమాటికీ పెద్దగా ఏడ్వసాగింది. గుండెలు బాదుకొంటూ పొట్టపై చేతులతో మోదుకొంటూ సీత ఏడ్చింది.

ఆమె ఆర్తి చూచి లక్ష్మణుడు భరించలేకపోయాడు. సీతాదేవిని ఊరడిల్లమంటూ ఓదార్చాడు. ఇంకా వెళ్ళకుండా ఆలస్యం చేస్తున్నాడని సీత లక్ష్మణునిపై కినుక పూని మౌనంగా కూర్చుంది. సీత మొండివైఖరిని చూచి లక్ష్మణుడు ఖిన్నుడయ్యాడు. ఆపదలో ఆమెను విడిచి వెళ్ళలేక ఆలోచిస్తూ పక్కన నిలబడ్డాడు. సీత మాటలను ఓర్చుకోలేక భగవంతునిపై భారం వేసి జాగ్రత్తగా ఉండమని సీతాదేవికి చెప్పి పదే పదే ఆమెనే చూస్తూ మనస్సును గట్టిపరచుకొని రాముని దగ్గరికి బయలుదేరాడు.

* * *

రావణుని యతి వేషం

సర్గ - 46

సీతాదేవి పరుషోక్తుల ప్రభావంతో లక్ష్మణుడు రాముని వెదుకుతూ ముందుకు వెళ్ళాడు. లక్ష్మణుడు కొద్దిదూరం వెళ్ళాడు. దానికోసమే చూస్తున్న రావణాసురుడు తన పని చక్కబెట్టుకోవడానికి ముందుకు వచ్చాడు.

రావణుడు యతివేషం కట్టాడు. కాషాయ వస్త్రాలు దండ కమండలాలు ధరించాడు. జుట్టు ముడివేశాడు. ఛత్రం పట్టాడు. పాదుకలు ధరించి బ్రాహ్మణోత్తమునిలా కనిపిస్తూ రాముని కుటీరం ముందుకు వచ్చి నిలబడ్డాడు. సంధ్యాకాలాన్ని పెను చీకటి ఆవరించినట్లు చంద్రుని కాంతిని రాహువు మింగివేసినట్లుగా సీతాదేవిని రావణుడు అపహరించడానికి పూనుకొన్నాడు.

పాపాత్ముడు ఐన రావణుని చూసి దండకారణ్యంలోని వృక్షాలన్నీ వణికిపోయాయి. పవిత్ర గోదావరి దశగ్రీవుని చూసి జంకి నెమ్మదిగా ప్రవహించసాగింది. వాయువు నెమ్మదించింది. భిక్షుని రూపంలో ఉన్న రావణుడు పతి దుఃఖంలో మునిగి ఉన్న సీత దగ్గరకు వెళ్ళాడు. దుర్జనుడైన రావణుడు శనిగ్రహం చిత్తానక్షత్రం దగ్గరకు వచ్చినట్లుగా సాధు రూపంలో సీత దగ్గరకు వచ్చాడు.

పచ్చని పట్టువస్త్రం ధరించి తామరరేకుల వంటి కన్నుల నిండా నీరు నింపుకొని చంద్రుని బోలుముఖాన్ని కాంతిహీనంగా చేసుకొని శ్రీరామునికై విలపిస్తూ కుటీరంలో కూర్చుని ఉన్న సీతను చూచి రావణుడు కామపరవశుడయ్యాడు.

లోకోత్తర సౌందర్యమూర్తి ఐన సీతను రావణుడు చూసి బంగారు బొమ్మలాగా కనిపించే 'ఓ వనితామణి నీవెవ్వరు? ఎవ్వరిదానవు? ఈ కారడవిలో ఒంటరిగా ఏల సంచరిస్తున్నావు? నీ శరీరలావణ్యం దేవతలకు గంధర్వులకు కూడా లేదు కదా! నీవు పార్వతివా? లక్ష్మీదేవివా? లేక భువన మోహనరూపంగల అప్సరసవా? ఐశ్వర్యరూపిణివా? లేక రతీదేవివా ఎవరు నీవు' అని అడిగాడు.

'ఓ కల్యాణి! నీ అవయవసంపద అత్యంతశోభను కలిగి ఉంది. నీ పలువరుస తెల్లని కాంతులు కలిగి చంద్రుని వెన్నెలతో పోటీపడుతోంది. నీ నేత్రాలు విశాలంగా ఉన్నాయి. నీ కనుచూపులు తుమ్మెదలనుపోలి ఉన్నాయి. నీ ఊరువులు ఏనుగు తొండాన్ని పోలి ఉన్నాయి. నీ జఘనప్రదేశం విశాలంగా ఉంది. నీ స్తనభారం తాటిపండ్లను గుర్తుకుతెస్తోంది. మేలైన ఆభరణాలతో నీ వక్షస్థలం వెలిగిపోతోంది. నీ చిరునవ్వు కమనీయంగా ఉంది. నీ అందచందాలు నాలో రక్తాన్ని పరుగులెత్తిస్తోంది.

చక్కని కేశసంపదతో అలరారే ఓ తరుణీ! నీ అందం అద్వితీయం; అసమానం; నీ సౌందర్యానికి సాటివచ్చే దేవతలే లేరు. నీ యౌవనం, ఈ నిర్జనారణ్యం, నీ ఒంటరితనం నన్ను పిచ్చివాణ్ణి చేస్తున్నాయి. మన్మథుని శరాలతో నేను పీడించబడుతున్నాను.

ఓ సుందరీ! ఇది నిర్జనారణ్యమైన దండకారణ్యం. ఇది దేవగంధర్వులకే చొరరానిది. నీవు ఇక్కడకు ఎలా వచ్చావు? ఇది నీలాంటి సుకుమారులు ఉండవలసిన ప్రదేశం కాదు. ఇక్కడ కామరూపులైన రాక్షసులు తిరుగుతుంటారు. నీవు ఉద్యానవనాలున్న నగరాలలో అందమైన ప్రాసాద అగ్రభాగాలలో విహరించదగినదానవు. నీవీ కారడవిలో ఒంటరిగా ఉండడం నేను చూడలేకున్నాను. నీవు మేలిమి వస్త్రాభరణాలు ధరించి షడ్రసోపేతమైన భోజనాన్ని ఆరగిస్తూ లతలాంటి పూపొదరింట్లో మెత్తని పరుపులపై శయనించాల్సిన దానవు. సర్వశ్రేష్ఠుడైన వాని పొందుతో నీవు అమర సుఖాలను పొందదగినదానవు.

ఈ అరణ్యంలో ఎలుగుబంట్లు, పులులు, సింహాలు, క్రూర జంతువులెన్నో తిరుగుతుంటాయి. అమాయకురాలైన నీవు వాటిని చూచి భయపడడంలేదా? బలిష్ఠమైన ఏనుగుల గుంపులు యథేచ్ఛగా తిరుగుతుంటాయి. వాటిని చూచి నీవు కలవరం చెందడం లేదా? నీవు ఎవ్వరి దానవు? ఎందుకు ఈ అడవిలో నిస్పృహతో జీవిస్తున్నావు? నాకు చెప్పు' అని కపట సాధు వేషధారుడు సీతను అడిగాడు.

ప్రశంసాపూర్వక మాటలను వైదేహి విన్నది. యతి వేషధారణను చూసి విప్రోత్తముడని భ్రమపడింది. ఆమె ఆ దురాచారుని ఉచితాసనం మీద కూర్చోమని చెప్పింది. అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి గౌరవించింది. అతిథి దేవోభవ అని వనంలో దొరికిన శ్రేష్ఠమైన మధురఫలాలు పెట్టి తొందరపడకుండా కడుపునిండా తినమని చెప్పింది.

కమండలాలు ధరించి సాధువేషంలో వచ్చిన ధూర్తుడిని చూసి, అతనిలోని దుర్బుద్ధిని తెలుసుకోలేక సీత అతిథి సేవ చేసింది. నిండు మనస్సుతో ఆతిథ్యం తీసుకోమని పిలిచే రాముని ధర్మపత్నిని రావణుడు చూశాడు. ఆమెను ఎలా అపహరించి తీసుకొని వెళ్ళాలా అని ఆలోచించసాగాడు.

ఇదేమి తెలియని వైదేహి వేటకై వెళ్ళిన రామలక్ష్మణులు ఇంకా రాలేదని దిగులుతో అడవి అంతా కనిపించినంత దూరం పరికించి చూచింది. అలికిడి విని వచ్చిన దిక్కును మరలా చూచింది. ఆమెకు ఎటు చూచినా పచ్చని ఆకులు గల మహారణ్యమే కనబడింది. రామలక్ష్మణుల జాడ ఆమెకు తెలియలేదు.

* * *

రావణుని ప్రలోభం

సర్గ - 47

అతిథి దేవుని సత్కరించకపోతే శపించునేమోనని సీత భయపడింది. ఆయన ప్రశ్నలను విని వాటికి జవాబు ఇవ్వాలా వద్దా అని ఆలోచించింది. చివరకు 'ఓ బ్రాహ్మణోత్తమా! నేను అయోధ్యాపతి ఐన దశరథుని కోడలిని. మిథిలానగర ప్రభువైన జనకుని కూతురిని. నేను శ్రీరాముని ధర్మపత్నిని. ఇక్ష్వాకువంశీయులమైన మేము అయోధ్యలో ఎట్టి లోటు లేకుండా సుఖభోగాలను అనుభవించాము. దశరథనరేంద్రుడు శ్రీరామునికి పట్టాభిషేకం చేయాలని అనుకొన్నారు. ఆ సమయంలో మా అత్తగారైన కైక దశరథుని ఇంతకుముందు ఇచ్చిన వరములను అడిగింది. వాటి ప్రకారం మేము పదునాలుగేండ్లు వనవాసం చేయాలని భరతునికి రాజ్యాభిషేకం చేయమని నిర్బంధించింది.

రామునకు రాజ్యాధికారం ఇస్తే తాను అన్నపానీయాలను మానివేస్తానని కైక దశరథుని బెదిరించింది. ఆ మహారాజు ఆ వరములకు బదులుగా ఎన్నో రత్నరాసులను, ఆభరణాలను ఇస్తానని ఎంతగానో ఆమెను బ్రతిమిలాడాడు. కాని ఆమె వినలేదు. నా భర్త ఐన శ్రీరాముడు సద్గుణవంతుడు. సర్వులకు ప్రియం ఒనరించేవాడు. దశరథుడు తన భార్య ఐన కైకను సంతృప్తిపరచడానికి రాముని పట్టాభిషేకం ఆపివేశాడు.

తన తండ్రిని చూడబోయిన శ్రీరామునితో కైక - 'రామా! నీవు పదునాలుగేండ్లు వనవాసం చేసి నీ తమ్ముడైన భరతునికి రాజ్యం ఇచ్చి నీ తండ్రిని సత్యసంధునిగా చేయము' అని చెప్పింది. దృఢనిశ్చయంగల నా భర్త మీరు కోరినట్లే చేస్తానని చెప్పి వచ్చాడు. నా భర్త ఇతరులకు దానం ఇచ్చేవాడే కాని ఆయన చేయి పట్టి తీసుకొనేవాడు కాదు. నా భర్త సత్యసంధుడు. లక్ష్మణుడు ధర్మాత్ముడు పరాక్రమవంతుడు. నా భర్త తమ్ముడు.

అరణ్యాలకు బయలుదేరిన అన్నను అనుసరించి దృఢనిశ్చయంతో తాను వనవాసం చేయాలని సంకల్పించుకొని మాతో ఈ కారడవులకు వచ్చాడు. ఓ విప్రోత్తమా! కైక మూలంగా మేం ముగ్గురం ఈ కారడవులలో రాజ్యభ్రష్టులమై తిరుగుతున్నాము. ఒక్క ముహూర్తకాలంలో వేటకై వెళ్ళిన రామలక్ష్మణులు తిరిగి వస్తారు. మీరు

వారితో ఉండవచ్చు. ఓ బ్రాహ్మణోత్తమా! మీరు మీ పేరు, గోత్రం, కులం చెప్పుము. ఈ దండకారణ్యంలో నీ వేల తిరుగుతున్నావో మాకు చెప్పుము' అని రావణుని ప్రశ్నలకు జవాబులు చెప్పుతూ తాను కూడా అతనిని గురించి తెలుసుకోవాలని సీత రావణుని ప్రశ్నించింది.

అమాయకంగా తనగురించి అన్ని వివరాలు చెప్పిన సీతతో గర్వాంధుడైన రావణుడు' ఓ సీతా! నేను దేవ, అసుర, పన్నగులతో సహా సకల లోకాలను భయపెట్టగల రాక్షసేశ్వరుడైన రావణుడను. ఓ సౌందర్యవతీ! నిన్ను చూచినది మొదలు నీపై మోహం పెరిగింది. నా భార్యలపై నా మనస్సు మరలడంలేదు. నన్ను నీవు పతిగా స్వీకరించినచో నీవు నా పట్టమహిషివి అవగలవు. సముద్రమధ్యలో త్రికూటగిరిపై అత్యంత శోభాయమానంగా, సకలఐశ్వర్యాలతో తులతూగుతున్న లంకానగరానికి నేనే ప్రభువును. నిన్ను నా రాణిగా చేస్తాను. ఓ భామినీ నీవు నన్ను అంగీకరించినచో వివిధాభరణాలతో నీవు అలంకరించుకోవచ్చు. నీకు నేను ఐదు వేలమంది పరిచారికలను పెట్టి సేవ చేయిస్తాను. నాతోగూడా నీవు సర్వసుఖాలను హాయిగా అనుభవించవచ్చు' అంటూ సీతను ఎంతగానో ప్రలోభపెట్టాడు.

కామంతో కళ్ళు మూసుకుపోయిన ఆ రావణుని మాటలను సీతాదేవి తృణీకరించింది.'ఓ రావణా! నేను శ్రీరాముని భార్యను. నా భర్త మేరునగధీరుడు, సర్వశుభలక్షణుడు. పురుషోత్తముడు, సూర్యచంద్రులను శాసించే శక్తి ఉన్నవాడు. రణరంగంలో ఎదురులేని వీరాధివీరుడు. సర్వకాలసర్వావస్థలయందు ఆయనను అనుసరించే దృఢవ్రతాన్ని నేను చేస్తున్నాను. ఓ రావణా! నీ దుష్ట ఆలోచన మంచిది కాదు. సూర్యుని వెలుగును ఎవరూ పట్టుకోలేనట్లు నన్ను ఎవరూ దరిచేరలేరు. రఘురాముని ప్రియసతినైన నన్ను నీవు ఆశిస్తున్నావు. నీ చావును నీవే కోరుతున్నట్లు నాకు అనిపిస్తోంది. మహావిషసర్పంయొక్క కోరలను కోరుకొన్నట్లు నీవు నన్ను కోరుతున్నావు.

ఎత్తుగా ఉన్న మందరపర్వతాన్ని చేతిలో పట్టుకోవాలని వృధాయత్నం చేస్తున్నావు. కాలకూట విషాన్ని తాగి జీవించాలనే యోచనలో ఉన్నావు. నీ వ్రేలితో నీ కంటినే పొడుచుకొంటున్నావు. శ్రీరాముని భార్య ఐన నన్ను అవమానిస్తున్నావు. పెద్ద బండను కట్టుకొని సముద్రం ఈదాలని అభిలషిస్తున్నావు. మండుతున్న అగ్నిని కొంగున కట్టుకొని కులకాలని చూస్తున్నావు.

ఓ రావణా! అత్యాశ పడుతున్నావు. అది నిన్ను సర్వనాశనం చేస్తుంది. రామునికి నీకు నక్కకు నాకానికి ఉన్నంత తేడా ఉంది. మంచి గంధానికి బురదకు ఉన్నంత భేదం ఉంది. ఏనుగుకు పిల్లికి ఉన్నంత తేడా రామునికి నీకు ఉంది. కాకికి గరుత్మంతునకు ఉన్నంత తేడా ఉన్న నీవు నన్ను ఆశించి ఇక్కడ నిలబడినట్లయితే ఇంద్రుని పరాక్రమ సమానుడైన నా భర్త ధనుర్బాణాలను ధరించి నిన్ను ఈగను నలిపివేసినట్లు నిన్ను చిదిమివేయగలడు'

పరిశుద్ధమైన ఆలోచనలు ఉన్న సీత పౌరుషంగా రావణునితో మాట్లాడి పెనుగాలికి వణుకుతున్న అరటిచెట్టులాగా భయంతో వ్యాకులం చెందింది. మృత్యుదేవతలాగా ఉండే రావణుడు భయపడుతున్న సీతను చూశాడు. ఆమెను మరింత భయపెట్టాలని తన గొప్పతనాన్ని తాను ఒనరించే దుష్కృత్యాలను తన బలాన్ని సీతతో చెప్పసాగాడు.

* * *

రావణుని స్వఘోష

సర్గ - 48

పరుషంగా మాట్లాడే సీతను చూచి రావణుడు మండిపడ్డాడు. ఓ సుందరీ నేను కుబేరుని తమ్ముడను. ప్రజలందరు మృత్యువుకు భయపడినట్లుగా నన్ను చూచి, దేవ, గంధర్వ, యక్ష, కిన్నర, కింపురుషాదులు భయంతో చచ్చిపోతారు. నేను కుబేరునిపై ఆగ్రహించి ద్వంద్వ యుద్ధంలో ఆ కుబేరుని ఓడించి వేశాను.

సకలైకసంపన్నుడైన ఆ కుబేరుడు నా భయంతో అలకాపురిని వీడి వెళ్ళాడు. పర్వతాలలో శ్రేష్ఠమైన కైలాసగిరిపై తలదాచుకొంటున్నాడు. ఆ కుబేరుని పుష్పకవిమానాన్ని నేను నా బలంతో గెలుచుకొన్నాను. దీనిపై ఎక్కి ఇచ్ఛ వచ్చిన చోటుకు తృటిలో వెళ్ళవచ్చు. ఓ మైథిలీ నన్ను తక్కువగా అంచనా వేస్తున్నావు. నేను కనులెర్ర చేయగానే సర్వదేవతలు నాకు అంజలి ఘటిస్తారు. అంతేకాదు నేనున్న తావులో గాలి కూడా నా అధీనంలో ఉండి ప్రసరిస్తుంది. వేగంగా ప్రవహించే నది కూడా నన్ను చూచి తలవంచి నెమ్మదిస్తుంది. తన ప్రతాపాగ్నితో ప్రపంచాన్ని గడగడలాడించే సూర్యుడు కూడా నా కోపాగ్ని భరించలేక తన తీవ్ర తాపస కిరణాలను చల్లగా మార్చివేస్తాడు.

ఓ సీతా! సముద్రమధ్యలో అపూర్వరత్నమణిఖచితసౌందర్యంతో విలసిల్లే లంకానగరం నా రాజధాని. అందులో వైడూర్యాది మణులు పొదిగిన రాజప్రాసాదాలు అమరావతిని తలపించే ఎత్తుగా ఉండే కోలలు చతురంగబలాలు ఉన్నాయి. నిత్యం వాద్యఘోషలతో నా నగరం ప్రతిధ్వనిస్తుంటుంది. అన్ని ఋతువులలోను వృక్షాలన్నీ సమృద్ధిగా ఫలాలను కలిగి ఉంటాయి. ఉద్యానవనాలు నయనమనోహరంగా ఉంటాయి.

ఓ సుందరీ! నీవు నాపై అనురాగం పెంచుకొన్నట్లు అయితే వేరెవరినీ నీవు తలచవలసిన అవసరం ఉండదు. మానవ లోక భోగాలలో మునిగే ఈ మానవుడైన శ్రీరాముని సంగతిని మరిచిపో. దశరథుడు నీ భర్త అసమర్థుడని తలచి రాజ్యభ్రష్టుని చేశాడు. మంచిచెడుల నిర్ణయాధికారం చేయలేని నీ రాముడు శోకంతో ఈ అడవులను పట్టుకొని తిరుగుతున్నాడు. అట్టివానితో నీకు ప్రయోజనం ఏముంది?

సీతా! నీ సౌందర్యానికి మోజుపడి నీపై ప్రేమతో వచ్చాను. మన్మథునిచే పీడించబడే నన్ను తిరస్కరించడం నీకు మంచిది కాదు. నేను నీ దగ్గరకు రావడం నీ అదృష్టం. నీవు నన్ను తిరస్కరించితే పురూరవుని నిరాకరించి మరల ఆయన పొందు కోరిన ఊర్వశిలాగా నీవు నన్ను పొందలేకపోయానని చింతిస్తావు. ఓ సుందరీ! నీ రాముడు నా కాలి గోటికి సమానుడు కాదు.

వక్ర ఆలోచన ఉన్న రావణుడు మాట్లాడే మాటలకు సీత ఎంతో కుమిలిపోయింది. చాలా కోపం తెచ్చుకొంది. కన్నులు ఎర్ర చేసి ఓ రావణా! సమస్త ప్రాణుల చేత పూజలందుకొనే కుబేరుని తమ్ముడినని చెప్పుతూ ఇట్టి పాప కార్యాలను చేస్తున్నావేమి? నీకు నీ పనులను చూచి సిగ్గు అనిపించడంలేదా? ఓ రావణా! నీవు క్రూరుడవు. పాపకార్యాలు ఆచరించే నీవు ఇంద్రియ నిగ్రహం లేనివాడివి. నీ బుద్ధి పెడదారి పట్టింది. నిన్ను రాజుగా ఎన్నుకొన్న నీ లంకానగర ప్రజలందరూ నీ వలన నాశనం చెందుతారు.

ఎవరైనా శచీదేవిని అపహరించి జీవించవచ్చునేమో కాని, ఈ రాముని పత్నినైన నన్ను మోహించి కోరి బ్రతకడం అనేది కల్ల. ఇంద్రుని చేతిలోని వజ్రాయుధాన్ని లాగికొనవచ్చునేమో కాని నన్ను కోరి అవమానించినట్లు అయితే వారు అమృతం తాగినా వారి ప్రాణాలపై ఆశ వదులుకోవాల్సిందే. నీవు కూడా అట్టి దుర్మరణానికి గురి అవుతావు అంటూ సీత రావణుని భయపెట్టింది.

* * *

సీతాపహరణం

సర్గ - 49

సీతాదేవి మాటలు విని రావణునిలో అసహనం పెరిగింది. చేతులు పిసుకుతూ తన శరీరాన్ని పెంచాడు. "ఓ సీతా! నీవు రాముని ధ్యాసలో ఉండి నా పరాక్రమం గురించి సరిగా విన్నట్లు లేదు. నేను ఆకాశంలో నిలబడి ఈ భూమండలమంతా నా భుజబలంతో పైకెత్తగలను. మృత్యుదేవతను పోరాడి గెలవగలను. నేను కోరిన రూపాన్ని పొందగల శక్తి ఉన్నవాడిని. నీ కోరికలన్నీ తీర్చగల నేర్పు ఉన్నవాడిని గనుక నన్ను నీ పతిగా స్వీకరించు" ఇలా చెప్తోన్న రావణుని కళ్ళు కోపంతో అగ్నిజ్వాలలులాగా ఎర్రగా అయ్యాయి. సాధువేషంలో సౌమ్యునిగా నిలచిన రావణుడు అతని అసలు స్వరూపాన్ని పొందాడు.

రావణుడు పది తలలతో ఇరవై భుజాలతో ధనుర్బాణాలను ధరించి నిలబడ్డాడు. అతని కళ్ళనుండి అగ్నిజాలు వారుతున్నట్లుగా కనిపించాయి. మహాకాయుడైన రావణుడు బంగారు మకరకుండలాలను ధరించాడు. నల్లని మేఘసముదాయంలాగా నల్లని శరీరంతో నిగనిగలాడుతున్నాడు. ఎర్రని వస్త్రాలు ధరించి సీతను కోపంగా చూస్తున్నాడు.

ముల్లోకాధిపతిని భర్తగా కావాలని కోరే 'ఓ చిన్నదానా! నేను సరియైనవాడిని. నీవు నన్ను భర్తగా అంగీకరించు. నాతోనే ఎన్ని జన్మలైనా ఉండిపోవచ్చు. ఓ కల్యాణీ! నేను నీకు ఎన్నడు అయిష్టమైన కార్యాలను చేయను. ఈ మనుష్యునిపై వ్యామోహాన్ని పోగొట్టుకో. సర్వరాక్షసప్రతినిధినైన నన్ను నీవు స్వీకరించు. నేను మంచిదానినని భావించుకొనే నీవు మూఢురాలివి. ఏది మంచో ఏది చెడో తెలుసుకొనలేని బుద్ధిలేనిదానివి. ఓ మైథిలీ! ఆ రాముడు రాజ్యాన్ని పొందలేక అడవులకు వచ్చాడు. ఆయనలో ఏ గొప్పతనాన్ని చూసి నీవు ఆయనపై అనురాగాన్ని పెంచుకొన్నావు? ఒక్క ఆడుదానిని ఎదిరించలేక రాజ్యాన్ని బంధుమిత్రులను పోగొట్టుకొని వనాల పాలైన వానిని నిరాదరించుము' అని చెప్పాడు.

గౌరవాదరాలకు పాత్రమైన సీతను కామపరవశుడైన రావణుడు దగ్గరగా వచ్చాడు. పద్మనేత్ర ఐన సీత జుట్టును ఎడమ చేతితోను కుడిచేతితో ఆమె కాళ్ళను పట్టుకొని తన రథం దగ్గరికి పర్వతాకారుడైన రావణుడు వెళ్ళాడు.

అప్పటిదాకా కనిపించకుండా ఉన్న ఆ బంగారురథం అప్పుడు కనిపించింది. దానిమీదకు మహాకాయుడైన రావణుడు ఎక్కి సీతను తన ఒడిలో పెట్టుకొన్నాడు. పెద్ద కంఠంతో అరుస్తూ సీతను భయపెడుతున్నాడు.

సీత రావణుని దుష్కృత్యానికి గట్టిగా ఏడుస్తూ అడవిలో తిరుగుతున్న రాముని పిలవాలని గట్టిగా శ్రీరామా! అని ఎలుగెత్తి పిలిచింది. రావణుడు మాయలు ఉన్న ఆ పుష్పకవిమానాన్ని ఆకాశంలోకి దూకించాడు. తనను అపహరించుకొనిపోతున్న రావణుని చూసి 'ఓ లక్ష్మణా! ఓ మహాబాహూ! నీవు నిజమే చెప్పావు. ఈ దశగ్రీవుడు నన్ను ఎత్తుకొనివెళ్తున్నాడు. నీకీ విషయం తెలియలేదా?' అంటూ బోరున ఏడ్చింది.

'ఓ రామా! ధర్మపాలన కోసం రాజ్యాన్ని తల్లిదండ్రులను, సంపదలను తృణప్రాయంగా వదిలేసి ఈ కారడవులను పట్టి వచ్చారే. ఈ రాక్షసాధముడు నన్ను అధర్మంగా పట్టుకొని పోతున్నాడు. మీరు దీన్ని అడ్డుకోవడానికి రాలేరా? ' అంటూ సీత రోదించింది. 'శ్రీరామా!మీరు దుర్జనులను తుదముట్టించడానికి నడుం కట్టి ఉన్నారు గదా! ఈ దుశ్శీలుని ఉపేక్షిస్తున్నారెందుకు? పాపాత్మునికి దుష్కర్మలకు ఫలితం వెంటనే రాదు గదా! దేనికైనా సమయం రావాలి. ఓ రావణా! నీ ఆయువు మూడి నన్ను కొనిపోతున్నావు. నీవు నా రాముని చేతిలో మరణించడం ముమ్మాటికీ నిజం అవుతుంది' అని గగ్గోలుగా ఏడ్చింది.

'ధర్మాత్ముడైన రాముని భార్యను ఈ దురాత్ముడు తీసుకొని వెళుతున్నాడు. నేడు కైక ఆమె పరివారం సంతోషిస్తున్నదేమో? దండకారణ్యంలో పెరిగే గన్నేరు మొక్కలారా! నన్ను ఈ దుర్మార్గుడు తీసుకొనిపోతున్నాడు. మీరైనా నా రామునికి విషయం చెప్పండి.

ఉన్నత శిఖరాలతో శోభిల్లే ఓ ప్రసరణగిరీ! నీవైనా నా రామునకు నా దురవస్థను తెలుపు. బెగ్గురు పక్షులతో, హంసలతో ఆనందిస్తున్న ఓ పవిత్ర గోదావరీ! నీకు ప్రణమిల్లుతున్నాను. ఈ దుష్టరాక్షసుడు నన్ను తీసుకెళ్ళిపోతున్నాడు. ఈ విషయం రామలక్ష్మణులకు తెలుపుమమ్మా! ఓ వనదేవతలారా! వృక్షసమూహములారా! నా గోడును నా భర్తకు వినిపించండి. రామునికి ప్రాణాధికమైన నన్ను దుర్మార్గపు ఆలోచనలతో రావణాసురుడు తీసుకెళుతున్నాడు. ఈ విషయాన్ని, సమస్తపశుపక్ష్యాదులారా! నా నిస్సహాయస్థితిని రామునికి ఎరిగించండి.

యముడు నన్ను కొనిపోయినా నా రాముడు వానిని ఎదిరించి నన్ను తిరిగి తేగలడు.' విశాలాక్షి అయిన సీత దీనంగా విలపిస్తూ ఒక చెట్టు మీద ఉన్న జటాయువును చూసింది. దుఃఖం కంఠం నిండా నిండిపోగా సీత గద్గద స్వరంతో 'ఓ పూజనీయుడివైన ఓ జటాయూ! ఒంటరిగా కుటీరంలోనున్న నన్ను రాక్షసరాజు బలవంతంగా తీసుకొనిపోతున్నాడు. నాపై నీవైనా కరుణజూపుము. ఈ నిశాచరుడు దురాత్ముడు ఐనా వీనిని మీరు ఎదురించలేరు కదా! నన్ను తీసుకొని పోయిన విషయాన్ని రామలక్ష్మణులకు వివరించి వారిని నన్ను కాపాడమని ప్రార్థించు' అంటూ సీత జటాయువును కోరింది.

* * *

జటాయువు హితోక్తులు

సర్గ - 50

నిద్రపోతున్న జటాయువుకు సీత ఆర్తనాదం వినబడింది. దిగ్గున లేచి కూర్చుంది. ఎదురుగా ఆకాశ మార్గంలో పుష్పక విమానంలో సీతను తీసుకొని పోతున్న రావణాసురుని చూసింది. సీతకు కలిగిన అపాయం చూచి జటాయువు దుఃఖించాడు. పర్వతశిఖరంలాగా ఉన్నతమైన శరీరంతో మొనతేలిన ముక్కు ఉన్న రామ సేవాతత్పరుడైన జటాయువు రావణునికి బుద్ధి చెప్పాలనుకొన్నాడు.

'ఓ రావణా! నేను జటాయువును. పక్షుల రాజ్యానికి అధిపతిని. అరవై ఏండ్ల వానిని. భగవంతుని నమ్మి సనాతన ధర్మాన్ని ఆచరించేవానిని. శ్రీరాముని గూర్చి బాగా తెలిసినవానిని. నీవు అపహరించి తీసుకొనిపోతున్న ఆ సీత భర్త పరాక్రమంలో సాటిలేనివాడు. రణరంగంలో అతనిని ఎదిరించి నిలచిన వారినెవరినీ నేను ఇప్పటివరకూ చూడలేదు. ఎవరికీ అపకారం చేయని శ్రీరాముడు ఎవరినైనా ఆపదల పాలు చేసినవారిని స్వర్గానికి పంపకుండా ఉండడు.

రాజా! మీరు, మీ భార్యలను పరులనుండి రక్షించుకొన్నట్లుగా పరసతులను కూడా రక్షించాలి గదా! లోకం నిందించే పరదారాభిలాష నీకు మంచిది కాదు. సత్పురుషులైన రాజులు ధర్మార్థకామవిషయాలను శాస్త్రాలలో చెప్పినట్లుగా ఆచరిస్తారు. వాటికి విరుద్ధంగా ఎన్నడూ ప్రవర్తించరు. ప్రజలందరకు రాజు ఆదర్శప్రాయుడుగా ఉండాలి. రాజే ప్రజలకు మార్గదర్శకుడు.

రాక్షసరాజా! మీరు చేసే పని అధర్మమైనది. మీరు పాపకృత్యాలను చేసేవారు. మీకు రాజ్యాధికారం ఎలా లభ్యమైంది? పుణ్యాత్ములకు లభించవలసిన ఈ పుష్పకం మీ దరి ఎలా చేరింది? దుష్టాత్ముకులకు ఉపదేశాలు చెవికి ఎక్కవు. ఇప్పటిదాకా రాముడు ధర్మాత్ముడు కాబట్టి మీ లంకానగరం క్షేమంగా ఉంది. కాని నేడు మీరు దురాలోచనతో పాపకృత్యానికి పాల్పడ్డారు. దీనితో రాముడు మీకు మరణదండన విధిస్తాడు. మీవలన రాజ్యం యావత్తు నశించిపోతుంది.

శూర్పణఖ కారణంగా ఖరదూషణులు రామునిపై కత్తికట్టారు. అకారణ వైరానికి కాలుదువ్వాడు. అందుకే వారిని రాముడు హతమార్చాడు. మీరు ఇప్పుడు హేతువేమి లేకుండానే సీతను అపహరిస్తున్నావు. ఇంద్రుని వజ్రాయుధంతో వృతాసురుడు దగ్ధం అయినట్లు రాముడు తన కంటి చూపుతో నిన్ను దహించివేస్తాడు. నీవు సీతను మామూలు విషయంగా చూస్తున్నావు. కాని కోడెత్రాచు ఉన్న వస్త్రాన్ని కొంగున కట్టుకొన్నట్లు, నీకు తెలియడంలేదు. మృత్యుపాశాన్ని నీవే నీ మెడలో వేసుకొన్నావన్న విషయం నీకు త్వరలోనే తెలుస్తుంది.

జీర్ణమగు ఆహారాన్నే ఎవరైనా తినాలి. జీర్ణించుకోలేని ఆహారాన్ని తింటే ఎలా రోగం వస్తుందో, తలకు మించిన బరువును ఎత్తుకొన్నప్పుడు ఎలా క్రుంగిపోతారో అలానే అపకీర్తి వచ్చే పనులు చేయడంవలన అధః పాతాళలోకంలో పడిపోతాడు.

నీవు నవయౌవనంతో ధనుర్బాణాలు ధరించి రథంలో వైదేహి తీసుకొని పోతున్నావు. నేను వృద్ధుడినైనా, పక్షిరేడునైనా నిన్ను కాలు కదపనీయను. నేను బ్రతికి ఉండగానే నీవు రామునికి అపకారం తలపెట్టి ముందుకు సాగలేవు. వేదాన్ని ఎలా తోసివేయలేరో అలానే నన్ను కాదని నీవు ఈ అపరంజి బొమ్మ ఐన సీతాదేవిని తీసుకొని పోలేవు.

ఓ రావణా! దొంగతనంగా సీతను అపహరించిన నీవు రోషం ఉంటే, వీరుడివైతే నాతో యుద్ధం చేసి గెలిచి అప్పుడు నీ ప్రతాపాన్ని చూపు. నీవు కూడా ఖరునివలె త్వరలో నేలకూలుతావు. నారచీరలు ధరించిన రాముడు విల్లు ఎక్కుపెట్టి నీవైపు తిరగగానే నీ ప్రాణాలు నిన్ను వదిలివేస్తాయి.

నీచబుద్ధి గల రాజువు నీవు. రామలక్ష్మణులు దూరంగా ఉన్నారని తెలిసీ ఈ పాపానికి ఒడిగట్టావు. నేను వారిని తీసుకొని రావడానికి వెళ్ళినట్లు అయితే నీవు అదే అదనని పారిపోతావు. అందుకే నేను నీతో పోరాడి నిన్ను చంపివేస్తాను. రాముని బహిఃప్రాణమైన సీతను నా గొంతులో ప్రాణం ఉండగా నీవు అపహరించలేవు.

దశరథుడు నా ప్రాణమిత్రుడు. శ్రీరాముడు నా దైవం. నా ప్రాణాలు అర్పించి ఐనా ఆ సీతాదేవిని కాపాడుతాను. ఓ నిశాచరా! క్షణమాగు. నేను ఇప్పుడే తొడిమ నుండి పండును రాల్చివేసినట్లుగా నిన్ను క్షణంలో కిందకు త్రోసివేస్తాను' అని జటాయువు రావణుని భయపెట్టాలని చూసింది.

* * *

జటాయువు - రావణుల సమరం

సర్గ - 51

జటాయువు ధర్మబద్ధమైన మాటలు రావణునిలో కోపాన్ని పెంచాయి. చెవులకున్న బంగారు కుండలాలు ఊగుతుండగా ఒక్క ఉదుటున రావణుడు జటాయువు మీదకు దూకాడు. ఆ ఇద్దరిమధ్య భయంకరమైన పోరు సాగింది. మహాబలశాలైన రావణుడు జటాయువు మీద భయంకరములైన పది బాణాలను వేశాడు. అవి పదును ఉన్న ములుకులతో శత్రువును మట్టికరిపించేలాగా ఉన్నాయి. జటాయువు కూడా కాళ్ళ గోళ్ళతో దశగ్రీవుని చాలా బాధించాడు.

జటాయువు బాధ భరించలేని రావణుడు మళ్ళీ బాణప్రయోగం చేశాడు. వాటిని జటాయువు నిరోధించినా వాటి వలన జటాయువు శరీరం బాగా దెబ్బతింది. ఆ బాణాల దెబ్బలను లెక్క చేయకుండా జటాయువు తన వాడి ముక్కుతో రావణుని ధనుస్సును బాణాలను ముక్కలుగా చేశాడు. చాలా కోపావేశంతో రావణుడు వేలకొలది బాణాల పరంపర ప్రయోగించాడు. వాటినన్నింటిని జటాయువు తన రెక్కల వేగంతో ఎదుర్కొన్నాడు. రావణుని కవచాన్ని, చిద్రం చేసాడు. రావణుని రథానికి పూన్చిన గుర్రాలను బలశాలైన పక్షి రేడు ముక్కుతో పొడిచి

చంపివేసాడు. రథసారథిని బాగా బాధించాడు. రావణుని రథం శ్రేష్ఠమైనది. యజమాని ఇష్టానుసారంగా వేగంగా ప్రయాణించే వీలు ఉన్నది.

ఆ రథాన్ని పక్షీంద్రుడు భగ్నం చేశాడు. పుష్పకంలో రావణుని వింజామరలు వీచే రాక్షసులను ఛత్రం పట్టుతున్న వీరులను పక్షిరాజు తన రెక్కల ధాటితో ముక్కుతో కొట్టి చంపి కింద పడవేశాడు. తన బలమైన ముక్కుతో కొట్టి కొట్టి రథసారథి శిరస్సును తుంచేశాడు.

రావణుని రథం విరిగిపోయింది. ఛత్రచామరాలు పట్టుకొన్న రాక్షసులు నేలకొరిగారు. అశ్వాలు రథసారథి మట్టిలో కలసిపోయారు. దాంతో సీతను పట్టుకొనే రావణుడు భూమిపైకి దూకాడు. దాన్ని చూచిన అందరూ జటాయువును మెచ్చుకొన్నారు. రావణుడు కిందపడటం వారికి ఆనందం కలిగించింది. బాగుగా అయింది అని అరిచారు. ఇంత యుద్ధం చేసిన వృద్ధుడైన జటాయువు అలసిపోయాడు. దాన్ని చూసిన రావణుడు సీతను గట్టిగా పట్టుకొని ఆకాశంలోకి ఎగిరిపోయాడు.

దాన్ని చూసి జటాయువు కూడా ఎగిరి రావణుని ఎదురుగా నిలుచున్నాడు. 'ఓ దుష్టబుద్ధి రావణా! శ్రీరాముని బాణాలు వజ్రతుల్యాలు. నీవు ఈ సీతాదేవిని తీసుకొని పోవడం నీ రాక్షస జాతి నిర్మూలనానికే అని తెలుసుకో. దప్పిక ఉన్నవాడు ఆరాటపడి నీళ్ళు తాగినట్లు నీవు అన్నీ బలాలు ఉండీ కూడా విషాన్ని తాగుతున్నావు. ఇక్ష్వాకు వంశీయులైన రామలక్ష్మణులను అవమానించి సీతను అపహరించావు. వారు నిన్ను క్షమించరు. ఇది వాస్తవం' అని జటాయువు రావణునితో చెప్పాడు.

'వీరుడనని చెప్పుకొనే నీవు దొంగతనం చేస్తున్నావు. నిన్ను లోకం హర్షించదు. నీ స్వజనం కూడా నీ పనిని ఎద్దేవా చేస్తారు. వినాశకాలం దాపురించినప్పుడు అధర్మ కార్యాలు చేస్తారు. ఒక్క క్షణమాగుము. నాతో యుద్ధం చేయుము. దుష్ఫలితాలను ఇచ్చే పాపాలను బుద్ధిశాలురు ఎవ్వరూ చేయరు.'అని అన్నాడు.

జటాయువు ఎన్ని చెప్పినా చెవిటివానిముందు శంఖం ఊదినట్లుగా రావణుడు తన పట్టును వీడక సీతాదేవిని తీసుకొని వేగంగా వెళుతూనే ఉన్నాడు. అప్పుడు జటాయువు కోపం పట్టలేక రావణుని వీపును చీరేసింది. తన ముక్కు కాళ్ళ గోళ్ళు రెక్కలతో రావణుని భీకరంగా పొడుస్తూ జుట్టు పీకుతూ గాయపరిచింది.

బాధ తాళలేక రావణుడు ఎడమ చేతితో సీతను గట్టిగా పట్టుకొని కుడి అరచేతితో వెనక్కు తిరిగి జటాయువును బలంగా గ్రుద్దాడు. యుద్ధ నైపుణ్యంగల పక్షిరాజు తప్పించుకొని రావణుని పది ఎడమ చేతులను ముక్కుతో చీరేసింది. తెగి రక్తం చిందుతూ పడిపోయిన చేతులన్నీ రావణునికి మళ్లీ వచ్చాయి. ఈసారి సీతను వదిలి పక్షిరాజును రావణుడు పిడికెళ్ళతో మోదాడు. ఇలా రెండు ఘడియలపాటు వారిద్దరిమధ్య అద్భుతమైన యుద్ధం జరిగింది. రావణుడు తన ఖడ్గం ఎత్తి శ్రీరామునికోసం పోరాడే జటాయువు రెక్కలను కాళ్ళను నరికేశాడు.

దాంతో జటాయువు ప్రాణాలను ఉగ్గబట్టి నేలపై పడిపోయింది. ఆత్మబంధువు నేలకొరిగినట్లుగా వైదేహి ఏడుస్తూ ఆ గ్రద్ద దగ్గరకు వెళ్ళి గట్టిగా రోదించింది. పరాక్రమశాలి ఐన ఆ పక్షిరేడు నల్లని మేఘంలాగా విశాల వక్షస్థలంతో చల్లారిన కారుచిచ్చులాగా పడి ఉన్నాడు.

అలా పడిపోయిన పక్షిరాజును పదే పదే అక్కున చేర్చుకొని చేతులతో స్పృశిస్తూ వైదేహి జనకరాజసుత సీతాదేవి ఎంతగానో రోదించింది.

* * *

రావణుడు బలవంతంగా సీతాదేవిని లాక్కొని వెళ్ళటం

సర్గ - 52

శ్రీరామునికోసం పోరాడి తన అసువులను కోల్పోతున్న జటాయువును రావణాసురుడు చూశాడు. ఆ పక్షిరాజును అక్కున చేర్చుకొని ఎంతగానో విలపిస్తున్న జానకిని చూశాడు. కన్ను అదరడం పక్షుల కూతలు ఇవన్నీ నిజంగా మానవునికి శకునాలను తెలుపుతాయి. ఇప్పుడీ పక్షులు ఇలా అరుస్తూ అటు ఇటు పరుగెత్తుతున్నాయి. ఇవి నాకొచ్చిన ఆపదను రామునకు తెలియజేయాలని అనుకొంటున్నట్లున్నాయి అని సీత వాపోయింది. రామలక్ష్మణులు తన దగ్గరికి వచ్చినట్లుగా ఓ రామా! ఓ లక్ష్మణా! నన్ను కాపాడండి అంటూ సీత బిగ్గరగా ఏడ్చింది. అలా ఏడుస్తున్న జానకి దగ్గరకు రావణుడు వచ్చాడు.

నలిగిన పూలు, చెదిరిన ఆభరణాలతో దీర్ఘంగా ఏడ్చి ఏడ్చి ఉబ్బి ఉన్న కన్నులతో రావణుని చూచిన సీత భీతి చెందింది. వెంటనే అక్కడే ఉన్న వృక్షాలను గట్టిగా లతలా పెనవేసుకొన్నది.'రామా! రామా! నన్ను రక్షించు' అంటూ ఆక్రందనలు చేసింది. ఒంటరిగా విలపిస్తున్న సీతను వృక్షాన్ని వదిలి రమ్మని రావణుడు పిలిచాడు. ఎంతకీ రాని సీతను జుట్టుపట్టుకొని గట్టిగా తనవైపు లాగాడు. రావణుని చేతిలో పరాభవాన్ని పొందుతున్న జానకిని చూడలేక జగత్తు అంతా అజ్ఞానాంధకారంలో కూరుకుపోయిందా అన్నట్లు నిశ్శబ్దం అయిపోయింది. ఆ దుర్మార్గాన్ని చూచి చేష్టలుడిగి గాలి వీయడం మానేసింది. సూర్యుడు వెలుగు ప్రసాదించలేకపోయాడు.

రావణుడు చేస్తున్న పాపాన్ని బ్రహ్మదేవుడు చూశాడు. రావణుని పాపం ఈనాటికి పండింది. మహావిష్ణువు ఇక ఇచ్చిన మాటను నిలబెట్టుకొంటాడు అని సంతోషించాడు. మహర్షులందరూ జానకీ విలాపానికి చాలా బాధపడ్డారు. కాని కాబోయే మహత్కార్యాన్ని తలచుకొని స్థిమితపడ్డారు.

ఆక్రందిస్తూ ఉన్న సీతను తన ఒడిలో పెట్టుకొని ఆకాశ మార్గాన రావణుడు ఎగిరిపోసాగాడు. సర్వాభరణ భూషిత ఐన రాజకుమారి పట్టువస్త్రాలు ధరించి రావణునితో ఎగిరిపోతుంటే మెరుపుతీగ సాగుతున్నట్లు కనబడింది. ఆమె చీర కొంగు గాలికి ఎగురుతుంటే దావాగ్నిజ్వాలలో ఉన్న పర్వతంలాగా రావణుడు కనిపించాడు.

సీత పెట్టుకొన్న పూల రేకులు విడివడి రావణునిపై పడ్డాయి. శ్రీరామునికి దూరమై రావణుని చేతికి చిక్కిన సీతాదేవి ముఖం వాడిన తామరమొగ్గలా కనిపించింది. నల్లని శరీరం గల రావణుని అంకం నుంచి కనిపించే సీత ముఖం నల్లని కొండల మధ్య నుండి ఉదయిస్తున్న చంద్రునిలాగా కనిపించింది. సహజ సౌందర్యవతి ఐన సీత

ముఖం అందానికి మారుపేరులా ఉండేది. సహజ అవయవ పుష్టితో కాంతివంతంగా ఉండే ఆ ముఖం నేడు రావణుని బారిన పడి కళతప్పి పగటి పూట వెలవెలబోయే చంద్రునిలాగా కనిపించసాగింది.

ఏనుగుకు ఆభరణాలు సొగసునిచ్చినట్లు, నల్లని రావణుని అంకాన సీత విద్యుల్లతలాగా మెరుపు తీగలాగా ఉండి శోభించింది. సీతను అపహరించే రావణుడు ఉరుముతున్న మేఘంలాగా ఉన్నాడు. అతని వేగానికి సీత కొప్పు విడిపోయింది. అందులో నుండి పూలు రాలిపోయి నలుదిక్కులా పడి రావణుని ధాటికి మరల రావణునివైపే ఎగురసాగాయి. తన మీద పడే పూలరెక్కల వలన నక్షత్రాలతో మెరుస్తూన్న పర్వతంలాగా రావణుడు కనిపించాడు.

సీతాదేవి ఎడమ కాలి అందె జారి నేలకు పడిపోసాగింది. అలా పడుతున్న ఆ అందె మధురమైన సవ్వడులు చేస్తూ మెరుపు తీగ కిందకు వస్తున్నట్లుగా కనిపించింది. ఆకాశంలో నుండి సీత ఆభరణాలు ఒక్కొక్కటిగా నేలకు రాలిపోసాగాయి. సీతాదేవి వక్షస్థలాన్ని ఎప్పుడూ అలంకరించి ఉండే ముత్యాలహారం తెగి నేలకు జారుతుంటే దేవనది ఐన గంగ ఆకాశం నుండి భూమికి చేరుతున్నట్లుగా అనిపించింది. రావణుని వేగధాటికి వృక్షాలన్ని కదలిపోసాగాయి. పక్షులన్నీ భయపడి రొద చేస్తుంటే సీతాదేవి భయపడకు అంటూ అవి అభయాన్నిస్తున్నట్లుగా అనిపించాయి.

జలాశయాలలో ఉన్న మీనాలు జలచరాలన్నీ తమలో ప్రతిక్షేపిస్తు పైన జరిగే ఘాతుకాన్ని చూసి ఏమీ చేయలేక నిస్పృహచెందాయి. అడవి మృగాలన్నీ రావణునిపై కోపంతో పరుగుపెడ్తున్నట్లుగా కనిపించాయి. జలపాతాలు పర్వతాలు, వృక్షాలు, ప్రకృతి అంతా సీతాదేవి దుఃఖాన్ని చూసి వెలవెలబోయాయి. సూర్యుడు కూడా తన కాంతిని ఉపసంహరించుకొని దుఃఖాన్ని వెలిబుచ్చాడు.

లోకంలో అధర్మం పెరిగి ఋజువర్తనం అడుగంటిపోయిందా? అనే నిరాశ అందరిలో పెరిగిపోయింది. రామా! రామా! మహాబాహూ! లక్ష్మణా! అంటూ అరచి అరచి మూగబోతున్న గొంతుతో సీత రాముని కోసం చూస్తుంటే ప్రకృతి అంతా దిగ్భ్రాంతికి లోనై నిలుచుండిపోయింది. ఎప్పుడూ చిరునవ్వు నవ్వుతూ తనను ఆశ్రయించి ఉన్నవారికి ఆనందాన్నిచ్చే ఆ వనితామణి నేడు దుఃఖంలో మునిగి శోకార్తి అయి పరపురుషుని దురాగతానికి బలియై దీనంగా ఏడుస్తూ క్రుంగిపోయింది.

* * *

సీత రావణుని నిందించటం

సర్గ - 53

బలవంతంగా లాక్కొనిపోతున్న రావణుని చూచి సీత ఎంతో భయపడింది. కోపం తెచ్చుకొని కూడా ఏమీ చేయలేక దీనంగా రావణుని చెరలోని సీత ఏడుస్తూంది. ఎదలో నుండి పౌరుషం తన్నుకురాగా సీత 'ఓ నీచ

రాక్షసా! నీకు నీవు వీరుడనని చెప్పుకొంటూ నన్ను ఎవరూ చూడకుండా తీసుకొనిపోతున్నావే! నీకు నీ పనిని చూసి సిగ్గు వేయడంలేదా? ఇలా రాముడు లేని సమయంలో నన్ను తీసుకొనిపోవడం చూచి అడ్డుపడిన జటాయువుకు కీడు కలిగించావే? నిన్ను చూసి ఎవరైనా ఎలా గౌరవిస్తారు?

నీచుడా! నీ ఈ పనే నీవెంత అధముడివో తెలుపుతోంది. నీవు ధర్మం తప్పి చేసే ఈ అకార్యం చూసిన వారెల్లరూ నిన్ను తిట్టకమానరు. నన్ను అపహరించి నీ చరిత్రను నీ వంశాన్ని నీవే అపవిత్రం చేసుకొన్నావు. కళంకిత జీవితాన్ని ఎన్నాళ్ళు కొనసాగిస్తావు. రామలక్ష్మణులకు కనబడిన తక్షణం నీకు ఆయువు మూడినట్లే అని తెలుసుకో. ఒక్క క్షణం ఇక్కడే నీకు ధైర్యం ఉంటే ఆగి చూడు. నా రాముడు నిన్ను ఏం చేయునో. నీ దుర్బుద్ధితో నన్ను తీసుకొని వెళుతూ నీ సంకల్పానికి నీవే నీళ్ళు వదులుకొంటున్నావు. వినాశకాలం ఎదురైన వారు విపరీతమైన అకృత్యాలు చేస్తారు. నీ చావు దగ్గరపడి నన్ను వాంఛించావు. నూకలు చెల్లిన వారికి ఈ భూమ్మీద ఆహారం సహించదు. నిజంగా భయపడాల్సిన విషయాన్ని గూర్చి నీవు చింతించడంలేదు. నీకు బంగారు వృక్షం కనబడుతున్నట్లుగా ఉంది. నీవు చచ్చిన తర్వాత నరకానికి వెళ్ళి నీ పాపానికి ప్రాయశ్చితంగా అగ్నిలాగా మండే పూవులు, బాగా వేడెక్కిన వైడూర్యాది మణులున్న ఆకులు ఇనుప ముల్లులున్న స్తంభాన్ని కౌగిలించుకొంటావు. ఆనాడు నీవు చేసిన పాపాన్ని గూర్చి ఆలోచిస్తావు. రామునికే అపకారం తలపెట్టిన నీవు తప్పక కాలకూట విషాగ్ని బారినపడి నీ చావును నీవే కొని తెచ్చుకొంటావు. ఓ రావణా! నీవు నివారింప శక్యంకాని యమపాశానికి బంతివయ్యావు. ఇక నీవు ఎక్కడకు వెళ్ళినా తప్పించుకోలేవు. ఒక్క రాముడు పదునాలుగు వేలమంది రాక్షసులను మూడు ఘడియలలో సంహరించివేశాడు. అటువంటి నా శ్రీరాముడు అపకారం చేసిన నిన్ను ఎలా వదలగలడు?' ఇలా భయంతో వణికిపోతూ కూడా రాముని తలచుకొని యథార్థంగా జరగబోయే వాస్తవాన్ని ఎరిగి రావణునికి హితబోధ చేస్తూ రావణుని తూలనాడింది. రావణుని చెరలోని సీత తన అసహాయస్థితికి ఎంతో కుమిలిపోయింది. ఆర్తికి లోనై కష్టాల సుడిగుండంలో ఇరుక్కుపోయిన సీత విలపిస్తూ రావణుని ఎన్నో మాటలు పరుషంగా మాట్లాడింది. వాటినన్నింటిని లెక్కచేయని రావణుడు సీతను పట్టుకొనే వెళ్తున్నాడు. అతి సుకుమారి ఐన సీత భయంతో ముడుచుకొనిపోయి బాధతో మెలికలు తిరుగుతూ దయనీయంగా ఏడుస్తోంది. అలాంటి సున్నిత మనస్కురాలైన సీతను బాధపెడుతూ రావణుడు ఆమెను అపహరించాడు.

* * *

ఆభరణాలు నేలపాలు - సీత లంకకు చేరిక

సర్గ - 54

రావణుని చేతిలోనుండి సీతను కాపాడేవారు ఎవ్వరూ కనబడలేదు. సీత దుఃఖిస్తూ నలువైపులా చూస్తోంది. అంతలో ఆమెకు ఒక పర్వతం మీద ఐదుగురు వానరులు కనిపించారు. రామలక్ష్మణులు తనను వెదకుతూ

ఇక్కడకు వస్తే వీరైనా నా సమాచారాన్ని ఇస్తారేమో అనుకొంది. వెంటనే తన చీర చెంగును చించి ఆభరణాలన్నీ అందులోపెట్టి మూటగట్టి ఆ వానరులమధ్య పడేటట్లుగా సీత మూటను జారవిడిచింది.

అలా ఆభరణాల మూటను సీత పడేయడం తొందరలో ఉన్న రావణుడు చూడలేదు. దూరంగా ఉన్న వస్తువులను, వ్యక్తులను పోల్చగల శక్తి ఉన్న ఆ వానర ప్రముఖులు పైనుంచి రామా! అని ఆక్రోశిస్తూ వెళ్తున్న విశాలనేత్ర ఐన సీతను దేవతలాగా రెప్పవాల్చకుండా చూశారు. రావణుడు సీతను తీసుకొని పంపా సరస్సు దాటి లంక దిశగా ప్రయాణించాడు.

మృత్యువును ఒడిలో పెట్టుకొన్నానన్న సత్యం తెలియక రావణుడు సంతోషంగా ఆకాశ మార్గంలో పయనిస్తూ ఎన్నో నగరాలు, పర్వతాలు, నదులు, సరస్సులు కొండలు దాటుతూ బాణంలాగా రివ్వున దూసుకుపోతున్నాడు. అలా వెళ్ళుతూ సాగరానికి చేరి దాన్ని కూడా దాటాడు. దాన్ని చూచిన సముద్రుడు కోపంగా ఎగిరిపడ్డాడు. సముద్ర జలాలన్నీ అల్లకల్లోలానికి గురి అయ్యాయి. సుడులు తిరిగిపోయాయి. సాగరంలో ఉన్న జలచరాలు ఘోరాన్ని చూడలేక సాగరం అడుగుకు వెళ్ళిపోయాయి. అంతరిక్షంలో సాగిపోయే రావణుని చూచిన చారిణులు గంధర్వులు సిద్ధులు అందరూ రావణుని చరమదశ వచ్చిందనుకొన్నారు. పెనగులాడుతున్న సీతను తన అంకం మీద పెట్టుకొని రావణుడు లంక చేరాడు.

పొడవైన వీధులతో విలసిల్లుతున్న లంకాపట్టణంలోని తన అంతఃపురానికి రావణుడు చేరాడు. నిస్పృహకు లోనైన సీతను రాముడు తన అంతఃపురంలో ఉంచాడు. అక్కడనున్న రాక్షసపరిచారికలతో ఏ పురుషుడుగాని ఏ స్త్రీగాని ఈమెను అనుమతి లేకుండా చూడకూడదు. జాగ్రత్తగా ఈమెను కాపలా కాయండి, ముత్యాలు, మణులు పొదిగిన బంగారు నగలను పట్టు పీతాంబరాలను సీత కోరినవన్నీ తెచ్చి ఆమెకు ఇవ్వండి. ఎట్టి పరిస్థితులలోను ఒక్క కఠినమైన మాటను కూడా ఆమెను అనవద్దు అని కఠిన ఆదేశాలను ఇచ్చి రావణుడు మందిరం బయటకు వచ్చాడు.

ఇంకా ఏమి చేయాలని ఆలోచిస్తున్న రావణునికి మహావీరులైన మాంస భక్షకులైన ఎనిమిదిమంది రాక్షసులు ఎదురయ్యారు. బ్రహ్మవరగర్వితుడైన రావణుడు వారిని చూసి వారి పరాక్రమాన్ని మెచ్చుకొంటూ 'ఓ యోధులారా! ఖరుడు నివసించిన దండకారణ్యానికి మీరు వెంటనే వెళ్ళండి. మన జనస్థానం ఐన ఈ శూన్యారణ్యం నేడు ఖర దూషణుల మరణంతో దిక్కులేక ఉంది. మీరు మీ బలపరాక్రమాలను నమ్ముకొని వెంటనే జన స్థానానికి బయలుదేరండి. నేను ఇంతకుముందు పదునాలుగు వేలమంది రాక్షసుల వీరులతో ఖరుని దూషణుని అక్కడ ఉంచాను. మానవుడైన శ్రీరాముని చేతిలో వారందరూ హతులై నాకు ఆవేదనను కలిగించారు. దానితో నాకు శ్రీరామునిపై క్రోధం పగ ఏర్పడ్డాయి.

ఎలా అయినా ఆ రామునిపై ప్రతీకారాన్ని తీర్చుకోవాలని తహతహలాడుతున్నాను. ఆ రాముని నేను చంపి నిర్ధనుడు నిధిని పొంది తృప్తి పొందినట్లుగా నేను మనశ్శాంతిని పొందుతాను. మీరు ఆ దండకారణ్యంలో ఉంటూ మన శత్రువుల కదలికలను నాకు ఎప్పటికప్పుడు తెలుపుతూ ఉండండి. మీ మీద నమ్మకంతో మిమ్ములను పంపిస్తున్నాను. నా నమ్మకాన్ని మీరు వమ్ముచేయరని తలుస్తాను' అని రావణుడు చెప్పాడు.

వారు రావణుని ప్రశంసా వాక్యాలు విన్నారు. సంతోషంతో రావణునికి నమస్కరించారు. జనస్థానంలోని శత్రువును కనిపెట్టాలన్న ఆలోచనలతో లంకను వీడారు. ఆ రాక్షస యోధులు దండకారణ్యానికి వెళ్ళారు. కామార్తుడైన రావణుడు సీతను లంకా అంతఃపురంలో పెట్టి సంతృప్తి పొందాడు. రామునితో ఏర్పడ్డ బద్ధవైరాన్ని కూడా అతడు గమనించలేదు. మృత్యువు చేరువౌతోందన్న ఆలోచనే లేక మోహాంధకారంలో రావణుడు మునిగిపోయాడు.

* * *

రావణుడు తన వైభవాన్ని సీతకు చూపించటం

సర్గ - 55

రావణుడు ఎనిమిదిమంది రాక్షసులను జనస్థానానికి పంపాడు. సీతకు పలు విధాలైన వసతులు ఏర్పాటు చేశాడు. ఇక నేను చేయవలసినదంతా చేసేశానని విర్రవీగాడు. సీతాదేవిని తలచుకొని కామ పరవశుడు అయ్యాడు. త్వరగా ఆమెను చూడాలనే తలంపు కలిగింది. వెంటనే అంతఃపురంలోకి వెళ్ళాడు. అక్కడ సీత దీనంగా తలవంచుకొని కూర్చుని విలపిస్తూంది. ఆడు లేళ్ళగుంపు నుండి తప్పిపోయి కుక్కల బారిన పడ్డ లేడిలాగ బెదిరిపోతోంది. పెనుగాలులకు చెల్లాచెదురై సముద్రం నడిమధ్యకు చేరిన నావలాగా వణికిపోతోంది. సీతాదేవిని చూడడంలో ఆసక్తి లేక తలవంచే కన్నీరు కారుస్తోంది.

అలాంటి సీతకు బలవంతంగా తన ప్రాసాదపు అంతర్భాగాలన్నీ చూపించసాగాడు. ఉన్నతంగా వజ్ర వైడూర్యాది మణులతో పొదిగిన గోడలు, ఏనుగు దంతాలతో అందంగా నిర్మించిన వస్తువులు అందాలు ఒలుకుతున్నాయి. మంద్ర స్వరంలో వాద్య ఘోషలు వినబడుతూ ఉన్నాయి. మేలిమి బంగారు కాంతులీనే ముఖద్వారాలు రమ్యంగా కనిపిస్తున్నాయి. ఏనుగు దంతాలతో కిటికీలు ఉండి స్వచ్ఛమైన గాలి ప్రసరించడానికి వీలు కలిగిస్తున్నాయి. భూభాగాలన్నీ గచ్చుతో ఉండి నునుపు తేలి ఉన్నాయి. దిగుడు బావులు, తామర కొలనులు ప్రాసాదపు చుట్టూర నిర్మించి ఉన్నాయి. వాటినన్నింటిని ఆవరిస్తూ వృక్షాలున్నాయి.

దివ్య శోభలు కలిగిన తన అంతఃపురాన్నంతా సీతకు రావణుడు చూపించాడు. తన భవన విశేషాలు చూపిస్తూ లంకానగర వైశిష్ట్యాన్ని సీతకు చెప్పాడు. ఇంత చూపిస్తూ చెప్తూ ఉన్నా సీత దుఃఖాన్ని వీడలేదు. ఆమె వదనం జరిగిన దానినే తలుస్తూ చిన్నబోయి ఉంది. సీతను ప్రలోభపెట్టాలని రావణుడు తన గొప్పతనాన్ని చెప్తున్నాడు.

"సీతా! బాలలు వృద్ధులుకాక నా లంకలో ముప్పైరెండు కోట్లమంది రాక్షసులున్నారు. వీరు సర్వసమర్థులు. వీరందరికీ నేను ప్రభువును. నా పని సంకల్పించి నేను చూడగానే ఆ పనిని చేయడానికి వేయిమంది రాక్షసులు పరుగెత్తి వస్తారు. ఓ విశాలనేత్రీ! నీవు నన్ను అంగీకరిస్తే వీటన్నింటికీ నిన్నే అధిపతిని చేస్తాను. నా జీవిత సర్వస్వాన్ని

నీ పాదాక్రాంతం చేస్తాను. నీకు ఇష్టంలేని పనిని నేను ఏదీ చేయను. సీతా! నా మాట విని నా భార్యగా ఉండడానికి అంగీకరించుము."

"ఓ వైదేహీ! నా లంకా రాజ్యం వేయి యోజనాల విస్తీర్ణాన్ని కలిగి ఉంది. దీనిని ఎన్నో వేలమంది అనునిత్యం కాపలా కాస్తుంటారు. సురాసురులు వచ్చినా ఈ లంకా నగరాన్ని ముట్టడించలేరు. దేవ, దానవ, గంధర్వ, యక్ష, కిన్నరాదులలో నా కన్నా గొప్పవారు ఎవరూ లేరు. నన్ను ఎదిరించే సాహసం చేసే వారు ఎవరూ లేరు.

ఓ వైదేహీ! రాముడు రాజ్యాధికారాన్ని పోగొట్టుకొన్నవాడు. నిన్ను ఏ విధంగానూ సుఖపరచలేడు. శక్తిహీనుడైన రామునివల్ల నీకు ఒరిగే ప్రయోజనం ఏదీ ఉండదు. అందువలన నీవు నన్ను నీ భర్తగా అంగీకరించి సర్వసుఖాలను పొందు. ఓ లలితామణీ! నీ భయం పోగొట్టుకొని నాతో సుఖిస్తూ కాలాన్ని హాయిగా గడుపు. యౌవనం క్షణికమైనది. అది ఉన్నప్పుడే మనం జాగ్రత్త పడాలి. ఓ లలనా! నీ రాముడు నిజంగా కాదు కదా, ఊహలలోనైనా లంక చేరలేడు.

ఓ శుభాంగీ! నా అధీనంలో ఉన్న నిన్ను కొనిపోయే శక్తి ఈ ముల్లోకాలలో ఎవరికీ లేదు. నన్ను పతిగా స్వీకరించి రాక్షసులతో కూడిన ఈ లంకానగరాన్ని ఏలుకో. నన్ను నా మాటను నీవు అంగీకరిస్తే ఈ చరాచర సమస్త జగత్తు నీ పాదాక్రాంతం చేస్తాను. నీ పురాకృత పాపం వలన నీవు రామునికి పత్నివై వనవాస క్లేశాలను అనుభవించావు. నేడు నిన్ను ఆ పాప పంకిలం వీడింది. నీవు చేసుకొన్న పుణ్యఫలంగా నేను నిన్ను ఇష్టపడ్డాను. ఈ దివ్య అపురూప సుగంధాదులతో నీవు అలంకరించుకొని నాతో కూడి సుఖించు. అదే నీకు మంచిది.

ఓ తరుణీ! నీ నిర్మల ముఖ సౌందర్యం దుఃఖంతో కూడి కళావిహీనం అయింది. దాన్ని శుభ్రపరచుకో" అని చెప్పే రావణుని మాటలు విని తన చీర కొంగుతో ముఖం దాచుకొని సీత తన దురవస్థకు వగచింది. చింతాక్రాంత ఐన సీత వ్యాకులంతో తన భర్తనే అనుక్షణం తలచుకోసాగింది.

దుఃఖంలో పూర్తిగా మునిగి ఉన్న సీతను రావణుడు చూసి 'ఓ అయోనిజా! జరిగిన దానిని గూర్చి బాధపడకు. మన ఈ బంధం విధివశాత్తు ఏర్పడింది. వైదేహీ! అధర్మమని నీవు భయపడవలసిన అవసరం లేదు. జానకీ నేను చెప్పేదాన్ని గూర్చి ఆలోచించు. నీవు సంతోషిస్తూ నన్ను సంతోషితుని చేయుము.

జానకీ! నీ మృదువుగా ఉన్న పాదాలను పట్టి ప్రార్థిస్తున్నాను. నేను ఎల్లవేళలా నీ దాసానుదాసుడినై నీ అధీనంలోనే ఉంటాను. నీకు నేనెప్పుడు అప్రియాన్ని కలిగించను. నేను కామాగ్నిలో దహించుకపోతున్నాను, నీ పాదాలను పట్టి వేడుతానని అన్నాను. నా పలుకులు నిష్ఫలం కారాదు. నా వంటి వాడెప్పుడూ చెప్పకూడని మాటలు కూడా నీపై మోహంతో చెప్తున్నాను" అని చెప్పాడు.

వాటిని సీత వినకపోయినా సీత రావణుణ్ణి అనుగ్రహించకపోయినా దానిని పట్టించుకొనకుండా రావణుడు ఇక నాకు ఈ సీత దక్కినట్లే అని ఎంతో సంతోషపడిపోయాడు.

* * *

సీత అశోకవనాన్ని చేరటం

సర్గ - 56

రావణుడి ప్రేలాపనలన్నీ సీత విన్నది. అక్కడే ఉన్న ఒక గడ్డిపోచను అడ్డుగా పెట్టుకొంది. రావణునితో నిర్భయంగా మాట్లాడింది.

"రావణా! దశరథుడు ధర్మమూర్తి. ఆయనకు పుట్టిన శ్రీరాముడు సత్యానిష్ఠాగరిష్ఠుడు. సర్వలోకారాధ్యుడు ఐన శ్రీరాముడే నా పతి. సద్వంశంలో కాలుపెట్టిన నేను అధర్మానికి ఒడిగట్టలేను. ఇక్ష్వాకు వంశంలో పుట్టిన సింహపరాక్రమశాలి ఐన సుగుణాభిరాముడు తన తమ్మునితో కలసి వచ్చి నిన్ను ఆ ఖరునిలాగా మట్టి కరిపిస్తాడు.

ఘోరరూపుడైన రాక్షసులు మహాయోధులని నీవు నాకు చెప్తున్నావు. కానీ, గరుత్మంతుని ముందు విలవిలలాడే సర్పాల్లా ఈ రాక్షసులు రాముని ముందు గిజగిజలాడిపోతారు. రావణా! శ్రీరాఘవుని వింటి నుండి వచ్చిన బాణాలు నిన్ను నేల కూల్చుతాయి. నిన్ను సురాసురులు ఎదిరించలేరేమోగాని శ్రీరాముని ముందు నీవు ఓడిపోవలసినదే. యూపస్తంభానికి కట్టిన యజ్ఞపశువులాగా నీ ప్రాణాలు శ్రీరాముని చేతిలో పోవడం ఖాయం. రోషావేశపరుడైన శ్రీరాముడు కనులెర్ర చేసినచో ఆ కంటి మంటలకే అధర్మానికి రూపమైన నీవు మాడిపోగలవు.

సాగరాన్ని సైతం ఇంకింపచేయగల సమర్థుడు రాముడు. అతడు నన్ను నీ చెరనుండి విడిపించగలడు. పరసతిని కోరిన నీవే నీ జీవితాన్ని అసంపూర్ణంగా నేలరాస్తున్నావు. నీ అకృత్యాలవలన నీ బలాలన్నీ ఉడిగిపోయాయి. జీవచ్ఛవంలాగా బ్రతికీడ్చుతున్న నీవు వ్యర్థంగా ప్రయాస పడుతున్నావు. నీ పాపకృత్యంవల్లే లంకానగరం సర్వనాశనం అవుతుంది. నిర్భయుడైన నా రాముడు దండకారణ్యంలో స్వేచ్ఛగా తిరుగుతున్నాడు. అట్టి ఆ రాముడు నీ పరాక్రమాన్ని నిర్వీర్యం చేస్తాడు. నీ మిడిసిపాటును త్వరలోనే అణిచివేస్తాడు. గర్వాంధకారంలో నీవు కన్ను గాక మాట్లాడుతున్నావు. నిన్ను నీ గర్వాన్ని సమూలంగా నాశనం చేయగల శక్తి మహిమాన్వితుడైన రామునికే ఉంది.

రాక్షసాధమా! నన్ను అపహరించిన క్షణమే నీ చావు సిద్ధం అయ్యింది. యజ్ఞశాలలో గార్హపత్యాగ్నికి ఆహవనీయాగ్ని మధ్య ఉండే స్రుక్కు స్రువం హోమ పరికరాలతో నిండి ఉన్న యజ్ఞవేదికను పాపాత్ముడు ఎలా తాకలేడో, ఆ విధంగానే ధర్మాత్ముడైన రాముని పత్నినైన నన్ను అధర్మప్రవర్తనతో ఉన్న నీవు పొందలేవు. శ్రీరాముణ్ణే సర్వస్వంగా భావించే నేను పాపినైన నిన్ను ఎలా చూస్తాను?

ఓ రాక్షసుడా! నీవు ఈ శరీరాన్ని ఏమి చేసినా, భక్షించినప్పటికీ నేను పాపాకార్యాన్ని చేయను. లోకనిందార్హమైన పనిని నేను ఏనాడు చేయలేను." ఇలా మాట్లాడి సీత మౌనంగా ఉండిపోయింది. ఆమె మాటలకు రావణునిలో భయప్రకంపనలు మొదలయ్యాయి. భీతావహమైన గొంతుతో "ఓ మైథిలీ నీకు నేను పన్నెండు మాసాల గడువు ఇస్తాను. ఈలోపు నీవు నాపై ప్రసన్నురాలివి కాకపోతే గడువు తీరిన మరుసటి ఉదయానికి నిన్ను భోజన పదార్థం చేయడానికి నా మనుషులు ముక్కలుగా చేస్తారు" అని చెప్పాడు. అహం దెబ్బతిన్న రావణుడు అక్కడున్న రాక్షసులతో "ఈమె అహంకారాన్ని రూపుమాపి నా దారికి మళ్ళించండి" అని కఠిన ఆదేశాలను ఇచ్చాడు.

ఆ రాక్షసులందరూ "చిత్తం ప్రభూ!" అంటూ రావణునికి నమస్కరించి సీతచుట్టూ చేరారు. భూమిని బ్రద్దలు చేస్తున్నట్లుగా నడిచి రావణుడు రాక్షసులారా! ఈమెను అశోకవనానికి తీసుకెళ్ళండి. వనమధ్యభాగంలోని రహస్యప్రదేశంలో ఉంచి కాపలా కాయండి. ఈ సీత నయాన భయాన మాటలు చెప్పి నాపై ప్రసన్నురాలిని చేయండి.

ఎల్లవేళలా అన్ని ఋతువులలో పుష్పిస్తూ, ఫలాలను ఇస్తూఉన్న అశోకవనానికి సీతను రాక్షసులు తీసుకొని వెళ్ళారు. సమృద్ధమైన పుష్పఫలసంపదఉన్న ఆ వనంలో రకరకాల పక్షులు పుష్టిగా తింటూ మధురంగా గానాలాపన చేస్తున్నాయి. అంతులేని శోకంలో మునిగిన సీతను వనమధ్యభాగానికి తీసుకొచ్చారు.

భీకరాకారంతో భీతిగొలిపే చూపులతో భయం పుట్టిస్తూ రాక్షసులు సీతను చుట్టుముట్టారు. దీన వదనంతో సీత శోకార్తుడు ఐన శ్రీరామున్నే తలుస్తూ నిశ్చేష్టురాలైన సీత వారి మధ్యన ఉంది.

* * *

రామునకు అపశకునాలు ఎదురవటం

సర్గ - 57

మారీచుని వధించిన రాముడు "హా! లక్ష్మణా!" "హా! సీతా!" అనే ఆర్తనాదం విని కుటీరంలోని సీతాలక్ష్మణులు చింతిస్తున్నారేమోనని గబగబా వెనుకకు తిరిగాడు. త్వరగా పర్ణశాలకు చేరాలని అడుగులు వేస్తున్నారు. అలా నడిచే రాముని వెనుకభాగం నుండి ఒక్క నక్క ఊళ వినపడింది. ఆ శబ్దం రామునిలో భయాందోళనలను కలిగించింది. నక్క ఇలా అరవడం అశుభం కదా! పర్ణశాలలోని సీతకు ఏ అపాయం వాటిల్లలేదు కదా! అని చింతించాడు.

మారీచుడు నాలాగా అరిచిన అరుపు విని సీత భయపడి ఉంటుంది. లక్ష్మణుడు అది మారీచుని స్వరమే అని అనుకొన్నా సీత వ్యాకులంతో నన్ను చూడమని లక్ష్మణుని నా దగ్గరకు పంపి ఉంటుంది. అతడు వ్యాకులంతో నన్ను చేరడానికి వస్తూ ఉండి ఉంటాడు. సందేహం లేదు. ఇదంతా సీతను మింగివేయాలని రాక్షసులు పన్నిన పన్నాగం అయి ఉంటుంది. మారీచుడు బంగారు లేడి రూపాన్ని పొందడం - దానికోసం నేను ఆశ్రమానికి దూరంగా రావడం - నా బాణందెబ్బకు లక్ష్మణా చచ్చితిని అని అరవడం ఇవన్నీ రాక్షసుల కుట్రలో భాగాలే. సందేహం లేదు. ఇలా అనుకొంటూ రాముడు వస్తున్నాడు. నాకు జన అనుకొంటూ నడుస్తున్న రామునికి చిన్నబోయిన ముఖంతో లక్ష్మణుడు రావడం కనిపించింది. దుఃఖంతో దీనవదనంతో లక్ష్మణుడు శ్రీరాముని దగ్గరకు వచ్చాడు. 'లక్ష్మణా! రాక్షస నిలయమైన దండకారణ్యంలో సీతను ఒంటరిగా వదిలి ఎందుకు వచ్చావ'ని శ్రీరాముడు అడిగాడు. లక్ష్మణుని చేతిని తన చేతితో పట్టుకొని 'లక్ష్మణా! ఒంటరిగా సీతను వదిలిరావడం వలన సీతకు చెప్పరాని ముప్పు కలుగుతుందేమోనని నిన్ను కోపించాను. సీత క్షేమమే కదా! లక్ష్మణా! నాకు అన్నీ

అపశకునాలు కనిపిస్తున్నాయి. సీతకు పెద్ద ఆపదే వచ్చి ఉంటుందని నా మనస్సు చెప్తోంది. ఆమెను రక్కసులు భక్షించివేయడమో, చంపడమో చేసి ఉంటారని గట్టిగా అనిపిస్తోంది.

లక్ష్మణా! జనకరాజ నందనని మనం క్షేమంగా చూస్తాం కదా! ఆమెకు ఏ ముప్పు వాటిల్లదు కదా! నాకు మృగాలు, పక్షులు అరవడం ప్రదక్షిణలు చేయడం చూస్తుంటే భయం వేస్తోంది. నా మనస్సు చాలా వ్యాకులం అవుతోంది. మనం లేని సమయంలో సీతను రక్కసులు అపహరించి అయినా ఉంటారు లేక చంపివేశారేమోనని నా మనస్సు పదే పదే కీడునే శంకిస్తోంది' అని రాముడు పరిపరివిధాల లక్ష్మణుడితో చెపుతూ బాధపడుతున్నాడు.

* * *

సీత కనపడకపోవటం

సర్గ - 58

నిర్జనారణ్యంలో ఒంటరిగా సీతను వదిలి ఎందుకు వచ్చావని శ్రీరాముడు బాధపడుతూ లక్ష్మణుని అడిగాడు. "సౌమిత్రీ! మనం అరణ్యాలకు వచ్చినది మొదలుగా మీ వదినె మనలను అనుసరిస్తూనే ఉంది. నన్ను విడిచి ఈ అరణ్యంలో ఆమె ఉండలేదు. నేను రాజ్యభ్రష్టుడినై ఈ కారడవులలో తిరుగుతున్నాను. సుకుమారి సుఖాలలోనే పుట్టి పెరిగిన జానకి ఎక్కడ ఉంది? ఆమెకు ముప్పు వాటిల్లి ఉండదు కదా! ఆమె లేకుండా నేను ఒక్క క్షణమైనా జీవించలేను. జానకి లేనిచో నాకు ముల్లోకాధిపత్యం ఇచ్చినా, ఇంద్రపదవి వచ్చినా నాలో లేశమాత్రం కూడా సంతోషం ఉండదు. ప్రాణాధికమైన సీతతో జీవించడమే నేను ఎల్లప్పుడూ కోరుకొంటాను. నా వనవాసజీవితం నా భాగస్వామిని నాకు దూరం చేయదు గదా! ఒకవేళ జానకి ప్రాణాలు విడిచి ఉండడం నేను చూస్తే నా ప్రాణాలను కూడా వదిలివేస్తాను. అప్పుడు నీవు అయోధ్యకు వెళ్ళి కైక కోరిక నెరవేరిందని చెప్పు. ఆమె సంతోషిస్తుంది. కైక తన పుత్రునికి ఎప్పటికి రాజ్యాధికారం దక్కిందని ఆమె ఆనందిస్తుంది. అప్పుడు కౌసల్యామాతకు ఆమెను సేవించే పని తప్పుతుంది. సౌమిత్రీ! జానకి ప్రాణాలతో ఉంటేనే నేను జీవిస్తాను. ఒకవేళ మనం పర్ణశాలకు చేరినప్పుడు జానకి చిరునవ్వుతో ఎదురుగా రాకపోతే (ఆమెకు ముప్పు వచ్చి ఉండి ఉంటే) నేను జీవించి ఉండడం అబద్ధం అవుతుంది. లక్ష్మణా! నీ అజాగ్రత్తవలన సీత రాక్షసుల బారిన పడిందేమో? సుఖాలను తప్ప దుఃఖమే ఎరుగని మీ వదినె ఈ రోజు వనక్లేశాలను అనుభవిస్తోంది. అలాంటి సీతకు నా ఎడబాటు గొడ్డలిపెట్టులాగా ఉంటుంది. ఆమె నన్ను విడిచి క్షణమైనా జీవించలేదు.

ఆ మారీచరాక్షసుడు నా బాణపు దెబ్బ తగలగానే ఓ లక్ష్మణా! సీతా! అంటూ నా కంఠస్వరంతో అరిచాడు. ఆ స్వరం విన్న సీత చాలా బాధతో కుంగిపోయి ఉంటుంది గదా! అందుకే నిన్ను పంపి నన్ను కాపాడమని చెప్పి ఉంటుంది. ఆమె కోరికతోనే నీవు ఇలా వచ్చావా? అయినా నీవు చేసినది ముమ్మాటికీ తప్పే. సీత చెప్పినప్పటికీ నీవు ఆమెను వదిలి రాకుండా ఉన్నట్లయితే బాగుండేది. కానీ, నీ రాక మన శత్రువులకు సువర్ణావకాశం

దొరికినట్లు అయింది. వారు మనపై ప్రతీకారం తీర్చుకొంటారు. ఇందులో సంశయం ఏమీ లేదు. సీతను మనకు దూరం చేసి వారు పొంగిపోతారు. అయ్యో! లక్ష్మణా! ఇది మన తలవ్రాతలాగున్నది. ఇక నేను చేసేది ఏముంటుంది?' చాలాదూరం నడిచి నడచి దుఃఖార్తికిలోనైన రామునికి దప్పిక వేసి మొహం వాడిపోయి కళ తప్పి శరీరం బాగా అలసింది. లక్ష్మణుని మందలిస్తూ గబగబా ఆశ్రమం చేరాడు. అక్కడ వారికి సీత కనిపించలేదు. దానితో వారిలో దుఃఖం మరింత ఎక్కువైంది. సీత విహరించే స్థలాలు, స్నాన ఘట్టాలు, సంచరించే స్థలాలు అన్నీ వెదికిచూశారు. కాని సీత కనిపించలేదు. గత స్మృతులను తలుచుకొంటూ రాముడు చింతాక్రాంతుడయ్యాడు.

* * *

రాముడు లక్ష్మణుని ప్రశ్నించటం

సర్గ - 59

సీతను ఒంటరిగా వదిలి వచ్చిన లక్ష్మణునితో రాముడు ఇలా రావడం తప్పని మార్గమధ్యమంలో మందలిస్తూ ఆశ్రమం చేరాడు. అక్కడ వీరికి సీత కనిపించకపోవడంతో శ్రీరాముడు ఖిన్నుడయ్యాడు. లక్ష్మణునితో మార్గమధ్యంలో ఆయనకు కలిగిన అనుభవాలు చెపుతూ "సౌమిత్రీ! నీవు సీతను వదిలి నా దగ్గరకు చేరగానే నా మనస్సు ఆందోళనతో నిండిపోయింది. నిన్ను చూచిన వెంటనే నా ఎడమ కన్ను, భుజం అదిరాయి. ఆ అపశకునం నన్ను అతలాకుతలం చేసింది" అంటున్న రాముని మాటలు విని లక్ష్మణుని దుఃఖం మరింతగా ఎక్కువైంది. "అన్నా! నేను నా ఇష్టానుసారం మీ దగ్గరకు రాలేదు. వదినమ్మ సీత నన్ను ఎన్నో దుర్భాషలతో బాధించింది. అయినా నేను ఆమెను ఎన్నో విధాలుగా ఊరడించాను. అన్నకు అపాయం కలుగదని గట్టిగా చెప్పాను. ఐనా సీతమ్మ నన్ను మీ దగ్గరకి పోవడానికి ప్రేరేపించింది. అయ్యో! లక్ష్మణా! సీతా! నన్ను రక్షించు అనే మాటలు సీతాదేవి చెవులకు సోకాయి. అవి విన్న వెంటనే మీపై ప్రేమతో ఆమె కుంగిపోయింది. భయం పొందింది. మీకు ఆపద కలిగిందని చాలా ఏడ్చింది. వెళ్ళు, వెళ్ళు, అంటూ నాకు గట్టిగా చెప్పింది. అయినా అమ్మా! భయపడకు అంటూ ఆమెకు మీపై నాకు ఉన్న విశ్వాసాన్ని చెప్పాను. నీవు నిర్భయురాలివై ఉండవచ్చు అని చెప్పాను.

ఈ లోకంలో రాముని ఎదిరించగల సాహసికులు ఎవరూ ఉండరనీ ధైర్యం చెప్పాను. ఎవరో దుష్టరాక్షసుడు అన్నను అనుకరిస్తున్నాడని ఇదంతా రాక్షసమాయ అని నమ్మబలికాను. దీనిని విని ఒక సాధారణ స్త్రీలాగా వ్యధ చెందవద్దని చెప్పాను. దేవేంద్రాదులు కూడా రాముని ఎదిరించలేరని ఎంతగానో చెప్పాను. ఆమె నా మాటలు నమ్మకుండా నీవు పాపాత్ముడవు. మీ అన్నను చంపి నన్ను పొందాలనే ఆశ పడుతున్నావు, నీకు నేను ఎన్నటికీ దక్కను అంటూ నన్ను క్రూరంగా మాట్లాడడం ప్రారంభించింది. భరతుని బంటునని అనుమానించడం కూడా ఆరంభించింది. నా నిమిత్తమై వచ్చిన రాముని ప్రచ్ఛన్న శత్రువు నీవేనని తూలనాడింది. ఆ కుటిలాత్మకమైన మాటలు వినలేక సీతమ్మను విడిచి రాలేక బాధపడుతూ నేను విధిలేక మీ దగ్గరకు వచ్చాను" అంటూ జరిగినదంతా

లక్ష్మణుడు అన్నకు చెప్పాడు. అన్నీ విన్న శ్రీరాముడు అయినా 'సౌమిత్రీ! నీవు సీతను విడిచి రావడాన్ని నేను సమ్మతించలేకపోతున్నాను. నీవు ఆచరించిన పని ఏ మాత్రం మంచిది కాదు. నేను రాక్షసులను నిర్జించగలనని తెలిసీ, సీత ఏదో అన్నదనే నెపంతో నా దగ్గరకు రావడం నాకు నచ్చలేదు. సీత కోపంలో ఏవో అనరాని మాటలు మాట్లాడింది. వాటిని విని తెలివైన నీవు సీతను విడిచి రావడం నేను జీర్ణం చేసుకోలేకపోతున్నాను. లక్ష్మణా! నా ఆజ్ఞను నీవు సరిగా పాటించలేదు. నేను మాయామృగాన్ని వేటాడుతూ చాలా దూరం వచ్చేశాను. ఆ తర్వాత నేను బాణం వేయగా మృగానికి తగిలింది. కాని నా బాణం తగలగానే మృగం రాక్షసరూపం పొందింది. నా బాణం తగిలి కిందపడిపోగానే ఆ రాక్షసుడు నా స్వరంతో హా! లక్ష్మణా! హా! సీతా! అని అరిచాడు. అది వినే మీరు వ్యాకులం చెందారు. నీవు నా దగ్గరకు రావడానికి అదే కారణం" అంటూ రాముడు ఎంతో బాధపడ్డాడు.

* * *

సీతాన్వేషణం

సర్గ - 60

నడుస్తూ వెళ్తున్న రాముని ఎడమకన్ను అదిరింది. అతని పాదాలు తడబడ్డాయి. అతనిలో భయం వణుకు పుట్టింది. ఇలాంటి అపశకునాలు రామునికి ఏదో జరగరానిది జరిగి ఉంటుందనే ఆలోచనను కలిగించాయి. సీత క్షేమంగానే ఉంది కదా! ఉంది కదా! అంటూ పలుమార్లు పలుకుతూ గబగబా నడిచాడు. పర్ణశాలలో సీత లేకపోవడంతో రాముడు చింతాక్రాంతుడయ్యాడు.

శూన్యమైన పర్ణశాలను పరిసరప్రాంతాలన్నీ రామాదులు వెదకడం ప్రారంభించారు. అది హేమంత ఋతువు. కమలాలు అన్నీ వాడిపోయి కాంతిహీనంగా ఉన్నాయి. వనదేవతలెవరూ అక్కడ కనబడలేదు. చెట్లు పుట్టలు అన్నీ దిగులుగా కనిపించాయి. పర్ణశాలప్రాంతంలో తిరిగే పక్షులు, మృగాలు దీనంగా, దిగులుగా కనిపించాయి. పర్ణశాలలో ఆసనాలు, దర్భలు, అన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. వాటిని చూసి రాముడు బాగా రోదించాడు.

సీతను ఎవరో దొంగిలించారు. లేక రక్కసులెవరైనా తినివేశారేమో? లేక వనంలో ఎక్కడైనా దాగి ఉందేమో? లేదా వనంలోకి వెళ్ళిందా? అనే ఆలోచనలు రామునిలో పదే పదే రాసాగాయి. పుష్పాలు కోయడానికో, నీరును తేవడానికో వెళ్ళి ఉంటుందేమో అనుకొన్నాడు. సీత కనబడకపోవడంతో రాముడు ఏడ్చి ఏడ్చి పిచ్చివానిలాగా కనిపించాడు.

రాముడు ప్రతి చెట్టు, పుట్ట, పర్వతం ఇలా అన్నింటినీ వెదుకుతూ వెళ్ళాడు. ఒక చెట్టునుండి మరోచెట్టుకు, ఒక కాలువ నుండి మరో కాలువకు పరుగెత్తి చూస్తూ రాముడు విలపించాడు. 'ఓ కదంబ వృక్షమా! నీవు నా సతిని చూశావా? ఆమె నీ పుష్పాలపై మక్కువ పడేది. శుభకరమైన సీత కనిపించి ఉంటే నాకు చెప్పవూ' అంటూ అడిగాడు. 'ఓ బిల్వ వృక్షమా! నీవైనా సీతను చూశావా? ఆమె స్తనాలు నీ బిల్వ ఫలాలవలె ఉండేవి. ఆమె

శరీరకాంతి చిగురుటాకువలె ఉండేది. ఆమె పచ్చని పట్టుచీర కట్టుకొని ఉంది. ఆమెను నీవు చూచి ఉంటే నాకు చెప్తావు గదా!

ఓ అర్జున వృక్షమా! కకుభ వృక్షమా! నా ప్రియురాలైన సీతను గురించి తెలిసి ఉంటే చెప్పండి మిత్రమా! ఫలాలపై పుష్పాలపై సీత మనసు పడేది. ఆమెను గూర్చి మీకు తెలిసి ఉండి ఉంటుంది. వృక్షాలలో శ్రేష్ఠమైన తిలకవృక్షమా! నీపై తుమ్మెదలు వాలి ఉన్నాయి. పద్మముఖంగల నా సీతను గూర్చి నీకు తెలిసినదంతా నాకు చెప్తావా! శోకంను తొలగించే అశోకమా! ఓ తాళవృక్షరాజమా! ఓ జంబూవృక్షమా! ఓ కర్ణికారవృక్షమా! మీలో ఎవరైనా సీతను చూచి ఉంటే నా ప్రియురాలిని గూర్చి చెప్పండి' అంటూ రాముడు ప్రతి చెట్టును సీతను గూర్చే అడిగాడు.

పెద్ద పెద్ద వృక్షాలను అడుగుతూ రాముడు మల్లె, మాధవీ, సంపెంగ, మొగలి పూలను సీతను గూర్చి చెప్పమని విచారించాడు. అలా దారిలో కనబడే వృక్షాలను సైతం సీత జాడను తెల్పమని రాముడు అర్థించాడు. లేళ్ళను, సింహాలను, ఏనుగులను, అన్నింటిని సీతను గూర్చి చెప్పు చెప్పు అంటూ వాటి వెంట తిరిగాడు.

'ఓ సీతా పొదల మాటునో, చెట్ల మాటునో దాగి నన్ను ఏడిపిస్తున్నావేమో! నీవు లేకుండా నేను క్షణమైనా జీవించలేను' అంటూ "సీతా! నాకు నీవు కనబడు" అంటూ ఎలుగెత్తి పిలుస్తూ రాముడు ఎంతగానో విలపించాడు. రాముడు సీతను చూస్తున్నట్లుగా భ్రమించి సీతా! నేను నిన్ను చూశాను. ఇదిగో నీ పట్టుచీర నాకు కనబడింది. నీకు పరిహాసాలాడే బుద్ధిలేదు కదా! ఇప్పుడెందుకీ పరిహాసాలాడుతున్నావు. సీతా! సీతా!' అంటూ పదే పదే పిలుస్తూ అలమటించాడు.

కాదు, కాదు నన్ను చూసి కూడా సీత నా దగ్గరికి రాకుండా ఉండదు. చిరునగవుల సీతను నేను లేని సమయంలో రాక్షసులు తినివేసి ఉంటారు. ఆమెను నిజంగా రాక్షసులే భక్షించివేసి ఉంటారు. అయ్యో ఆమెను లాగి చంపేటప్పుడు ఆమె ముఖం భయంతో చిన్నబోయి ఉంటుంది. బంగారు వన్నె కల నా చిన్నదాన్ని కోమల శరీరాంగిని రాక్షసులు భయంకరంగా తినివేసి ఉంటారు.

రాక్షసులకు ఆహారం అవడానికే నేను సీతను వదిలివెళ్ళినట్లు అయింది. సుకుమారమైన శరీరంగల సీతాదేవిని రాక్షసులు బలవంతంగా తినివేసి ఉంటారు. ఎందరో బంధువులున్న సీత నేడు ఎవరూ లేని దానిలాగా ఒంటరిఅయి రాక్షసుల చేతికి చిక్కింది. లక్ష్మణా! నీకైనా సీత కనిపించిందా? సీతా! సీతా! అంటూ రాముడు విలపిస్తూనే ఉన్నాడు. దుఃఖంలో మునిగిన రాముడు ఉన్మాదిలాగా తిరుగుతూ ప్రతి చెట్టును అడిగాడు. భ్రాంతి చెందిన రాముడు సీత కనిపించినట్లుగా కాసేపు కనిపించనట్లుగా కాసేపు చింతించాడు. రాముడు నిలకడ లేక దండకారణ్యం అంతా వెదికాడు.

పర్వతాలు, నదులు, సెలయేళ్ళు జలపాతాలు, చెట్లు, వృక్ష సమూహాలు, పూపొదరిండ్లు ఇలా ప్రతిదాన్ని వెదికి అలసిపోయి రాముడు సీత కనిపించక చింతించాడు. రామునిలో ఆశ కలిగి మళ్ళీ సీతను వెదకడం ప్రారంభించాడు.

* * *

శ్రీరాముని విరహం

సర్గ - 61

శ్రీరాముడు సీతకోసం ఆశ్రమమంతా చూశాడు. పర్ణశాల అంతా గాలించాడు. ఎక్కడా ఆయనకు సీత కనిపించలేదు. దాంతో దుఃఖం ఎక్కువై శ్రీరాముడు లక్ష్మణుని భుజాలను పట్టుకొని "సౌమిత్రీ! నా సీత ఎక్కడా కనిపింపదేమి? ఎవరైనా ఆమెను అపహరించి ఉంటారంటావా? లేక రాక్షసులెవరైనా మీ వదినెనను చంపి తినేసి ఉంటారా? నా ప్రాణతుల్యమైన సీత కనిపించకుండా పోయింది. ఏమై ఉంటుందీ?" అంటూ సీతా! సీతా! అని ఎలుగెత్తి రాముడు పిలిచాడు. 'సీతా! ఏ చెట్టు వెనుకైనా దాగి నన్ను ఆట పట్టిస్తున్నావా? ఆట ఇక చాలు దుఃఖంలో ఉన్న నేను నీ వియోగాన్ని భరించలేను. నీ సరసాలు చాలు నా ముందుకు రా" అని గట్టిగా పిలిచాడు.

చెల్లాచెదరైన ఆసనాలు చూస్తూ పరిసర ప్రాంతాలన్నింటిని కలయచూస్తూ శ్రీరాముడు "సీతా! ఇటు చూడు ఈ లేళ్ళు నీవు కనబడలేదని కన్నీరు కారుస్తున్నాయి. ఓ సౌమ్యురాలా? ఎక్కడకి వెళ్ళావు" అని అన్నాడు. "ఓ సౌమిత్రీ! నేను సీత లేకుండా క్షణమైనా జీవించజాలను. సీత లేని నాకు మరణమే గతి. నేను మరణించి మన తండ్రిగారి దగ్గరకు వెళ్ళితే ఆయన నన్ను అసత్యవాదివని నిందిస్తాడేమో? ఓ రామా! నేను పదునాలుగు ఏండ్లు వనవాసం చేయమని ఆజ్ఞాపించాను గదా! నీవు చేస్తావని మాట ఇచ్చి అడవులకు వెళ్ళావు గదా! మరి నేడు నీ ఇష్టప్రకారం నా దగ్గరకు ఎందుకు వచ్చావు? నీవు దుర్జనుడివని నన్ను ఆయన నిలదీస్తే ఏమని సమాధానం చెప్పేది" - అంటూ రాముడు ఎంతో విలపించాడు.

"ఓ సుందరీ! నా మనస్సు నీపైనే ఉంది. నేను నిన్ను సదా స్మరించేవాడిని. అటువంటి నన్ను విడిచి వెళ్ళడం సాధ్వివైన నీకు తగని పని. నీ ఎడబాటును నేను భరించలేను." విశాలంగా ఉన్న అడుసులో కూరుకొన్న ఏనుగులాగా శ్రీరాముడు సీత దుఃఖంలో మునిగి సీతను చూడాలని తహతహలాడుతూ విలపించడం లక్ష్మణునికి బాధ కలిగించింది.

"అన్నా! మహాబాహూ! దుఃఖించకు. మన ఇద్దరం కలసి సీత కోసం వెదుకుదాం. ఈ అరణ్యమంతా ఎన్నో గుహలు పూపొదరిండ్లు ఉన్నాయి. సెలయేర్లు జలపాతాలు సమృద్ధిగా ఉన్నాయి. వాటిపైన వదినమ్మకు ఇష్టం మక్కువ. మైథిలి స్నానం చేద్దామని ఏ తటాకానికైనా వెళ్ళిందేమో? పూలకొరకై ఏ చెట్టు దగ్గరకు వెళ్ళిందేమో? మనం ఆమెను వెదికి తీసుకొని వద్దాం. మీరు ఇలా దుఃఖించడం సబబుగా లేదు. లేక సీత మనలను ఏడిపించాలని ఎక్కడైనా దాక్కొందేమో? ఈ అడవిలో ప్రబ్బలిచెట్లు గుంపులుగా ఉన్నాయి. వాటి వెనుక దాగి సీత మన సామర్థ్యాన్ని చూస్తుందేమో? అన్నా! కన్నులు తుడుచుకొని వేగంగా రా. మన ఇద్దరం ఆమెను అన్వేషిద్దాం" అని లక్ష్మణుడు శ్రీరామునకు ధైర్యం చెప్పాడు.

లక్ష్మణుని మాటలతో శ్రీరామునిలో ఆశ మొలిచింది. "సోదరా! రామా! మీరు అంగీకరిస్తే సీతను వెదుకుదాం రా అని పిలిచే లక్ష్మణుని చేయి పట్టుకొని సీతాన్వేషణానికి సోదరులిద్దరూ బయలుదేరారు. ఆ కుటీర పరిసరాలన్నీ వెదికారు. పర్వతసానువులు, కొండలు, కొండచరియలు నదులు పర్వతాలు ఇలా ప్రతిచోటా సీతను అన్వేషించారు.

సీత ఎక్కడా కనిపించకపోయేసరికి రామునిలో దుఃఖభావం పెరిగింది. దుఃఖార్తుడైన లక్ష్మణుడు "శ్రీరామా! మహావిష్ణువు బలిని అంతం చేసి భూమండలాన్ని సాధించినట్లు నీవు శత్రువులను నిర్మూలించి జానకిని పొందగలవు" అని చెప్పాడు. ఆ మాటలు శ్రీరామునిలో నిర్వేదాన్ని నింపాయి. "ఓ లక్ష్మణా! ఈ కారడవిలో ప్రతిచోటా వెదికాం గదా! ఎక్కడా నా ప్రాణాధికమైన సీత కనిపించలేదే" అని రాముడు వాపోయాడు. నిశ్చేష్టతకు లోనైన రామునిలో దైన్యం, వైరాగ్యం ప్రవేశించాయి. బుద్ధి మందగించింది. దేనిపైనా ఆసక్తిని చూపలేకపోయాడు. మైథిలి విరహం ఆయనలో ప్రాణాలపై ఆశను కూడా పోగొట్టింది. హా! సీతా! సీతా!' అంటూ గట్టిగా సీతను పిలుస్తూ, అరుస్తూ, వేడి నిట్టూర్పులు విడుస్తూ విలపించాడు.

అలాంటి శ్రీరాముని ఎంతగానో లక్ష్మణుడు ఓదార్చాడు. కాని ఆ మాటలు రాముని దుఃఖాన్ని పెంచాయి గాని తగ్గించలేకపోయాయి. అందుకే రాముడు సీతనే కలవరించసాగాడు.

* * *

శ్రీరాముని విలాపం

సర్గ - 62

కమలలోచనుడైన శ్రీరాముడు సీత కనిపించకపోవడంతో వ్యధాభరితుడయ్యాడు. ఆయనలో దుఃఖం స్థిరనివాసం ఏర్పరచుకొంది. దీనంగా చేతులెత్తి సీతను పిలుస్తూ ఆర్తిగా రోదించాడు. "సీత నీవెక్కడా" అంటూ చూచేవారికి సైతం కంటినీరు తెప్పించేటట్లు రాముడు విలపించాడు. ఆయన కళ్ళు కన్నీళ్ళతో ధారలు కట్టాయి. ఆయన చెక్కిళ్ళు కన్నీళ్ళు కారి కారి నదీపాయలలాగా కనిపించాయి. రామునికి సీత కనిపించినట్లు అయింది.

"ఓ ప్రియురాలా! పూలపై నీకు మక్కువ ఎక్కువ గదా! అందుకే పూలతో నీ శరీరాన్ని కప్పివేశావా? అరటి స్తంభాలలాంటి ఊరువులు కలదానా! నీవు అరటి ఆకులలో నిన్ను దాచుకొన్న నాకు నీవే కనబడుతూనే ఉన్నావు. ఓ శీలవతీ! నన్ను ఏడిపించాలనే పంతం పట్టి గన్నేరు మొక్కల చాటున దాగావా? ఇక నీ ఆటలు చాలు. పరిహాసానికైనా దుఃఖాన్ని చూడలేని నీకు నేడు దుఃఖార్తితో మునిగిన నన్ను ఇంకా బాధపెట్టడం అన్యాయం కదా! ఓ విశాలాక్షీ! ఓ కమలనేత్రీ! నా మనసు దోచిన మగువా! నీవు నా దగ్గరకు రా! అంటూ శ్రీరాముడు విలపించాడు. లక్ష్మణా! సీతను రక్కసులు తప్పక ఆరగించే ఉంటారు. అది చెప్పలేక ఈ మూగజీవులు ఏడుస్తున్నాయి చూడు. నేను సీతతో కలిసి అడవులకు వచ్చాను. నేడు సీతను ఎడబాసి తిరిగి అంతఃపురానికి నేను ఎలా వెళ్తాను? సీతను కోల్పోయిన నన్ను చూసి జనులు ఎగతాళి చేస్తారు. వనాలలో సీతను రక్షించలేకపోయిన రాముడు ఇతడే అసమర్థుడంటూ నన్ను అందరూ గేలిచేస్తారు. సీత లేకపోతే నా పిరికితనం అసహాయశూరత్వం వెల్లడౌతుంది. సీతలేని నన్ను చూసి విదేహరాజు నా కూతురెక్కడా? అని నన్ను అడిగితే నేను ఏమని సమాధానం చెప్పను? సీతను పోగొట్టుకొన్నానని ఆయనకు తెలిస్తే వృద్ధుడైన జనకుడు ఎంతగా పరితపిస్తాడో కదా! భరతుని పాలనలో

సుభిక్షంగా ఉన్న అయోధ్యాపురికి నేను ఒంటరిగా వెళ్ళలేను. సీత లేకపోయినప్పుడు నాకు స్వర్గం ఐనా నరకంలాగా కనిపిస్తుంది. లక్ష్మణా! నీవు భరతుని దగ్గరకు వెళ్ళి భరతుని బాహుబంధంలో బంధించి ఆనందింపజేసి నా మాటగా ఈ వసుంధరను ఆజన్మాంతం ఏలుకొనమని భరతునితో చెప్పు.

సౌమిత్రీ! నా ఆజ్ఞ నీవు పాటించేవాడివి గదా! అయోధ్యకు వెళ్ళిన తర్వాత నా తల్లి ఐన కౌసల్యకు ఏ కష్టం రాకుండా నీవే చూసుకో. జానకి తప్పిపోయిన విషయాన్ని నీవు వారికి వివరంగా చెప్పు. సీత కనిపించక రాముడు ఆవేదన చెంది జీవితంపై విరక్తిని పెంచుకొన్నాడని చెప్పు" అంటూ వైరాగ్యంతో అన్ని బాధ్యతలను తమ్మునికి అప్పగిస్తూ తన భారాన్ని దింపుకోవాలనే ఆతురతతో దుఃఖాన్ని మరింతగా పెంచుకొంటున్నాడు.

సౌభాగ్యవతి ఐన సీత కనిపించక దైన్యంతో మాట్లాడే రాముని చూసి లక్ష్మణుని ముఖం చిన్నబోయింది. తన ప్రియమైన అన్న బాధలో కూరుకుపోయాడే. తన ప్రియసతిని కోల్పోయాడే అనే చింత సౌమిత్రిలో పెరిగి ఆయనను ఆందోళనకు గురిచేసింది.

* * *

రాముడి ఆవేదన

సర్గ - 63

శ్రీరాముడు సీతను పోగొట్టుకొని ఆర్తికి లోనయ్యాడు. ఎంతో చింతిస్తూ దండకారణ్యమంతా వెదికాడు. సీత కనిపించకపోవడంతో ఆయనలో దైన్యం ఎక్కువై నీరుగారిపోయాడు. తన శరీరంలో, ఆత్మలో సగమైన తన అర్ధాంగి ఎడబాటుతో శ్రీరాముడు అచేతనంగా మారాడు. ఏమీ చేయలేక చేష్టలుడిగి కూర్చున్నాడు. అలా కూర్చున్న ఆయన మనస్సు పదే పదే ఆయనకు వస్తున్న దుఃఖాలను ఏకరువు పెట్టింది. దాంతో శ్రీరాముడు ఇలా చెప్తున్నాడు.

"ఓ లక్ష్మణా! నేను పూర్వజన్మలో నవ్వుతూ పాపాలు చేసి ఉంటాను. అప్పుడు ఒళ్ళు తెలియక ఎన్ని పాపాలు చేశానేమో? నేడు నాకు ఒక దుఃఖం వెనుక మరో దుఃఖం సంచయంగా వస్తోంది. ఈ సంచయంగా వచ్చే దుఃఖాలు నన్ను ఆవేదనలో ముంచేస్తాయి. ఆనాడు నవ్వుతూ చేసి ఉంటే నేడు ఏడుస్తూ ఫలితాన్ని అనుభవిస్తున్నాను.

కొన్నాళ్ళ క్రితమే రాజ్యాన్ని క్షణంలో పొగొట్టుకున్నాను. తల్లికి దూరం అయ్యాను. తండ్రి మరణం నన్ను ఊబిలో పడేసింది. బంధువులను, మిత్రులను దూరం చేసుకొని నేడు ఈ దండకారణ్యంలో ఆ దుఃఖాన్ని సీత సాయంతో మరచిపోతున్నాను అని అనుకొంటున్న తరుణంలో నా ప్రియసతి ఎడబాటు నన్ను పిచ్చివాడ్ని చేస్తోంది. నాపై ప్రేమగల ఆ ఇల్లాలు నాతో కష్టాలు పడడానికి సుఖాలను త్యజించి అడవులకు వచ్చింది. నేడు నా అసమర్థతవల్ల రాక్షసుల పాలయ్యింది. ఏ రాక్షసుడన్నా ఆమెను కొనిపోయాడేమో? లేక ఆమెను నరమాంస భక్షకులు ఇష్టంగా తినివేశారేమో? ఏది జరిగిందో కాని నా సీత నాకు దూరం అయింది.

సౌమిత్రీ! సీత పద్మాలుకోసం వెళ్ళిందనుకోవడం ఉచితం అనిపించడంలేదు. నేను లేకుండా మీ వదినె ఎక్కడికీ వెళ్ళదు కదా! మరి నేడు నన్ను విడిచి ఎక్కడకు వెళ్ళి ఉంటుంది? సీత ఎడబాటు అగ్నిలో ఆజ్యం పోసినట్లు నాలో దుఃఖాన్ని పెంచుతోంది. అసలే సీత భయస్థురాలు. ఆమెను ఏ రక్కసుడైనా వచ్చి లాక్కొని పోతుంటే ఆమె ఎంతగా విలపించిందో?

సీత మోము పున్నమి చంద్రునిలాగా కనిపించేది. రాక్షసుని చూచి ఆమె ముఖం రాహువు మింగిన చంద్రునిలాగా కళాహీనమై ఉంటుంది. లోహితం లాంటి చందనాది సుగంధాల చేత అలంకరించి ఉండే ఆమె వక్షస్థలం రాక్షసుని ధాటికి రక్తసిక్తం అయ్యిందేమో! ఆమె మృదుమధురకంఠందుఃఖంలో కూరుకొనిపోయి పీలగా మారిందేమో! పరపురుషస్పర్శే తెలియని నా సీత ఎప్పుడూ కంఠాభరణాలను ధరించి నిండైన వక్షస్థల సంపదతో చక్కగా కానవచ్చేది. సొగసైన నగలకే అందాన్నిస్తోందా అనిపించే సీత కంఠం రాక్షసుని చేతిలో చిదిమి పోయిందేమో! రాక్షసుల చేతిలో చిక్కిన నా వైదేహి విశాల నేత్రాంచలాలతో నా కోసం రెప్పవాల్చక చూస్తోందేమో!" అని శ్రీరాముడు సీత లావణ్యాన్ని మరువలేక బాధకు లోనయ్యాడు.

సౌమిత్రీ! చిరునవ్వుతో నన్ను ఎప్పుడూ అలరిస్తుండే నా సీత కూడా ఎన్నో విషయాలు మాట్లాడేది గదా! గోదావరిని చూసినా, ప్రకృతిని చూసినా వాటిపై ముచ్చటపడేది గదా! కాని నేను లేకుండా ఎక్కడా వెళ్ళలేదు కదా! సోయగాలు చిందే ఈ వనప్రదేశం సీత ఇష్టపడినా ఒంటరిగా ఎటు వెళ్ళడానికి సాహసించదు.

ఓ సూర్యభగవానుడా! లోకంలో జరిగే వాటికన్నింటికీ నీవే కర్మసాక్షివి గదా! నా హృదయావేదన నీకు కనిపించడంలేదా? నేను లేని సమయంలో నా పర్ణశాలలో ఏమి జరిగిందో నీకు తెలిసే ఉంటుంది కదా. నా సీత ఏమైందో? ఎక్కడికి వెళ్ళిందో? ఎవరైనా అపహరించారో? లేక ఎవరైనా ఆమెను తినివేశారో? నాకు చెప్పి పుణ్యం కట్టుకో అని సర్వసాక్షిని శ్రీరాముడు అడిగాడు.

ఓ వాయునందనుడా! నీవు సర్వవ్యాపివిగా. నీవు క్షణం లేకపోయినా ఏ జీవి బ్రతకలేదు గదా! మరి నా సీత విషయం నీకు తప్పక తెలిసే ఉంటుంది. అది నాకు చెప్పి నా దుఃఖాన్ని దూరం చేయి" అంటూ శ్రీరాముడు నిస్పృహతో నిరాశతో మాట్లాడాడు.

దానిని చూసిన ధర్మనిరతుడైన లక్ష్మణుడు "అన్నా! దుఃఖం వీడుము. సీతకోసం నలుమూలలా గాలిద్దాం రమ్ము. అంతేగాని ఇలా దుఃఖిస్తే వచ్చేది ఏమీ ఉండదు. ధైర్యస్థులు జరిగిపోయిన దానికి విలపించరు. జరగాల్సిన దాని కోసం ఆలోచిస్తారు. మనంకూడా కర్తవ్యనిష్ఠులమవుదాం.

ఉత్సాహం తెచ్చుకొని సీతను వెదికి కనిపెట్టుదాం" అని ఎంతగానో చెప్పే మాటలు రాముని చెవికెక్కలేదు. రామునిలో దుఃఖం తుంచివేయలేకపోయాయి. దానితో రాముడు సీత ఎడబాటు వేదనలో కూరుకుపోయాడు.

* * *

సీత జాడలను గుర్తించటం

సర్గ - 64

చింతాక్రాంతుడై ఉన్న శ్రీరాముడు లక్ష్మణుని పిలిచి సీత గోదావరి నది దగ్గరికేమైనా వెళ్ళిందేమో చూచి రమ్మని చెప్పాడు. శత్రు సంహారకుడైన లక్ష్మణుడు గోదావరి నదికి వెళ్ళాడు. ఆ తీరంలో ఉన్న రేవులన్నీ గాలించాడు. నదీ తీర ప్రదేశాలన్నీ వెదుకుతూ సీతను గొంతెత్తి పిలిచాడు. కాని ప్రయోజనం శూన్యమే అయ్యింది. అక్కడినుంచి రాముని దగ్గరకు తిరిగి వచ్చి ఎక్కడా సీత కనిపించలేదని దుఃఖిస్తూ చెప్తాడు. ఆ మాటలు రామునికి అంత నమ్మకం కలిగించలేదు. ఈసారి రాముడే స్వయంగా నదీ ప్రాంతాన్ని వెదకి సీత లేదనే నిశ్చయానికి వచ్చాడు.

రాముడు సీతను గూర్చి చెప్పమని నదిని వేడుకొన్నాడు. రాముని బాధ చూడలేక వృక్షాలు, మృగాలు నదిని సీత జాడ చెప్పమని ప్రేరేపించాయి. దుష్ట రావణుని తలచుకొని గోదావరి మారుపలకలేదు. 'లక్ష్మణా! ఇక్కడ ఉంటే ప్రకృతి సీత జాడను తెలపడంలేదు. సీతను పొగొట్టుకొని నగరానికి మనం ఎలా వెళ్ళాం? ఒకవేళ వెళ్ళినా జనకుడు ఆయన కూతురిని గూర్చి అడిగితే మనం ఏమని జవాబు చెప్పాలి? ఒకవేళ మన జవాబు ఆయన వింటే ఆయన స్థితి ఏమిటి?' అంటూ బిగ్గరగా రాముడు ఏడ్చాడు.

సీతలేని రాత్రులు రామునికి దీర్ఘంగా కనిపించాయి. సీత విరహం ఆయనను నిలవనీయడంలేదు. దండకారణ్యంలోని గిరులను, నదులను అన్నింటిని పదే పదే సీత జాడ గురించి అడుగుతూ వెదుకుతూ తిరుగుతున్నాడు. సౌమిత్రీ ఈ మృగాలన్నీ నాకేసి ఏదో చెప్పాలని చూస్తున్నట్లుగా అనిపిస్తున్నాయి అని శ్రీరాముడు చెప్పాడు. 'ఓ మృగాల్లారా! నా సీత ఎక్కడా? మీరైనా చెప్పండి' అంటూ రాముడు కన్నీరు కార్చాడు. ఆ దీనుడైన రాముణ్ణి చూచి మృగాలన్నీ దక్షిణ దిక్కుగా పరుగెత్తాయి. అవి రాముణ్ణి మాతో రమ్మన్నట్లుగా చూస్తూ ముందుకు సాగాయి. వాటి అర్థం తెలిసిన రామలక్ష్మణులు వాటి వెనుకే ఆత్రంగా అడుగులు వేశారు.

అవి అలా వెళ్తూ రాముణ్ణి దక్షిణ దిక్కును, ఆకాశాన్ని నేలను పదే పదే చూస్తూ అరుస్తూ వెళ్ళాయి. ప్రజ్ఞాశాలైన లక్ష్మణుడు వాటి భావాన్ని తెలుసుకొన్నాడు. 'అన్నా! రాక్షస నిలయమైన నైరుతి దిశకు మనం వెళితే మనకు సీత కనబడవచ్చునని ఈ మృగాలు చెప్తున్నట్లున్నాయి. లేక సీతను కనుగొను ఉపాయం ఐనా మనకు తెలుస్తుంది' అని చెప్పాడు. వెంటనే రాముడు తమ్ముడిని అనుసరిస్తూ ముందుకు వెళ్ళాడు. అలా వారు మాట్లాడుతూ ముందుకు సాగారు.

ఆధారం ఏదైనా దొరుకుతుందా! అనే ఆశతో సోదరులిద్దరూ భూమినంతా పరికించి చూస్తూ సాగుతున్నారు. అలా నడుస్తున్న వారికి అక్కడక్కడ పడి ఉన్న పూవులు కనిపించాయి. ఆ పూలను చూడగానే రామునిలో దుఃఖం తన్నుకొచ్చింది. 'లక్ష్మణా! ఇదిగో వీటినే చూడు. ఇవి మీ వదినె పెట్టుకొన్న పూలే. నేనే వీటిని కోసి ఇచ్చాను. ఇవన్నీ ఇప్పుడు నేలపై పడిపోయి ఉన్నాయి. వాటిని నాకు చూపాలనే వాయువు వీటిని చెదరగొట్టలేదు. సూర్యుడు ఈ పుష్పాలను వాడనీయలేదు. భూదేవి కూడా ఆదరంగా చూస్తూనే ఉంది.

అలా వాటిని చూసి దుఃఖిస్తూ ప్రక్కనే ఉన్న ప్రసరణగిరిని చూసి 'ఓ పర్వతరాజమా! నా సీత ఇక్కడకు వచ్చిందా? ఏ రక్కసుడైనా ఆమెను బలవంతంగా ఈ వైపున తీసుకెళ్ళాడా?' అని గట్టిగా అరిచాడు. రాముని మాటలు నిశ్శబ్దంగా ఉన్న ఆ పర్వతప్రాంతంలో ప్రతిధ్వనించాయి. ఆ ప్రతిధ్వని రామునికి జవాబు ఇస్తుందేమో అనిపించింది.

ఉన్మాదిలాగా అయిన రాముడు 'ఓ గిరివరా! సీత జాడ నీవు తెలపకపోతే నిన్ను నేను ముక్కలు చేస్తాను. నా సీతను నాకు చూపించు' అని కోపంగా అరిచాడు. దానికి పర్వతం మౌనమే సమాధానం అయ్యింది. 'ఓ శైలమా! నీవు నా సీత జాడ తెలపకపోతే ఈ ప్రదేశాన్నంతా నా బాణాలతో కాల్చివేస్తాను. అప్పుడు ఇక్కడ ఏ ప్రాణీ ఉండదు' అని ఆక్రోశించాడు. 'లక్ష్మణా! సీత గురించి తెలుపని ఈ నదిని సైతం నేను ఎండగట్టి వేస్తాను' అంటూ కన్నులను ఎర్రగా చేశాడు. రాముని కోపాన్ని భరించలేని ప్రకృతి సీత జాడ తెలపడానికి పూనుకొన్నదా అన్నట్లు ఒక్కసారిగా నిశ్శబ్దం పులుముకొంది.

కొద్దిసేపటికి వారికి పర్వతానికి నదికి మధ్య రాక్షసుని పెద్ద పెద్ద అడుగుల జాడ కనిపించింది. ఆ రాక్షసుని బారి నుండి తప్పించుకోవాలని సీత పరుగిడిన ఆమె పాదముద్రలు కూడా వారికి కనిపించాయి. వాటిని చూస్తూ ముందుకు వెళ్ళిన వారికి ముక్కలై పడివున్న పెద్ద ధనుస్సు, బాణాలు అమ్ముల పొదలు కనిపించాయి. మరికొద్ది దూరంలో బంగారు ఆభరణాలు తెగి అక్కడక్కడా ముక్కలు పడి ఉండడం చూశారు. అక్కడక్కడ నెత్తుటిబొట్లు కూడా కనిపించాయి.

'ఓ లక్ష్మణా! రాక్షసులు వైదేహిని తినివేసినట్లు కనిపిస్తోంది. ఇద్దరు రాక్షసులు సీత కోసం కలహించుకొన్నట్లుగా కూడా ఈ గుర్తులు చెప్తున్నాయి అన్నారు. వారికి ఇంకాస్త దూరంలో మహాధనుస్సు విరిగిపడిపోయి కనిపించింది. బంగారు కవచం తునకలై కనిపించింది. ఈ కవచం మేలిమి బంగారంలో వజ్ర వైడూర్యాలు పొదగబడి వింత కాంతులతో మెరుస్తూ కనిపించింది. ఈ కవచం ఎవరిదై ఉంటుందా?'అని వారు ఆలోచించారు.

నూరు చువ్వలు ఉన్న ఛత్రం విరిగిపడిపోయి ఉంది. బంగారు జీనులతో పిశాచపు ముఖంతో ఉండే రథాశ్వాలు బాగా దెబ్బతిని చచ్చిపడి ఉన్నాయి. ఈ అశ్వాలు, ఈ ఛత్రం ఎవరిదోనని వారికి ఆశ్చర్యం కలిగించింది. సమర ధ్వజంతో అగ్నిజ్వాలలాగా కాంతులను విరజిమ్ముతున్న రథం తునకలైపడి ఉంది. పదునుదేలి ఉన్న బాణాలు అక్కడక్కడాపడి ఉన్నాయి. చేతిలో కొరడా పట్టుకొనే రథసారథి హతుడై కనిపించాడు.

ఇవన్నీ చూసి లక్ష్మణుడు 'అన్నా! ఈ రథం రథాశ్వాలు, రథసారథి ఎవరివై ఉంటాయి? ఈ కాలి గుర్తులు రాక్షసుని పాదాలనే తలపిస్తున్నాయి' అని అన్నాడు. రాముడు వాటిని చూచి ఇదంతా రాక్షసుల పనే అయి ఉంటుంది. నాకు వారికి ఉన్న వైరం ఇప్పుడు నూరు రెట్లు అయింది. రాక్షసులు ఈ దారినే నా సీతను తీసుకొని వెళ్ళి ఉంటారు. వారు ఆమెను అపహరించి వెళ్ళి ఉంటారు. లేక ముక్కలుగా చేసి తినివేసి ఉంటారేమో. ఈ దారిన వెళ్ళే నా సీతను ఏ ధర్మాత్ముడు చూసి కాపాడలేదు' అంటూ రాముడు భోరుమని ఏడ్చాడు.

'సౌమిత్రీ! ఇక మనకు దిక్కు ఎవరు? సమస్త జగత్తును పాలించే జగన్నాథుడు ఏమీ తెలియనివాడిలాగా మౌనంగా చూస్తున్నాడు. ఆయనకు మన మీద దయలేదు. అయినా మానవులు వారి చేసుకొన్న పాప ఫలితంగా కష్టాలను అనుభవించి తీరాలి. కాని వారిని కష్టాలనుండి కాపాడి రక్షించడంలేదని భగవంతుని నిష్ఠూరాలాడుతారు.

రాక్షసులు నా కారుణ్య భావాన్ని అర్థం చేసుకోవడంలేదు. నేను వారిపై చూపే దయను జాలిని చూచి నన్ను చేతగానివాణ్ణి అని అపోహపడుతున్నారు. నన్ను అసమర్థునిగా తలచి నా భార్యను అపహరించారు. నాలోని మంచితనాన్ని పక్కన పెట్టి నేడే నా శౌర్య పరాక్రమాలను చూపిస్తాను. నేను తలచుకొంటే యక్ష, గంధర్వ పిశాచ, కిన్నర, రాక్షస, మనుష్యులకు ప్రశాంతతే కరువౌతుంది. లక్ష్మణా! నా బ్రహ్మాస్త్రాది బాణాలను వేసి ముల్లోకాలను నాశనం చేస్తాను. ఎక్కడా ఎవరూ కాలు మోపడానికి వీలు లేకుండా చేస్తాను. వాయువేగాన్ని నిరోధిస్తాను. సూర్యచంద్రాదుల గమనాన్ని అడ్డుకొంటాను. పర్వతాలు శిఖరాలు అన్ని నుగ్గు చేయగలను. వృక్షాలు జలాశయాలను ఎండగట్టగలను. సౌమిత్రీ! నాకు కోపం వస్తే ప్రళయకాలాగ్ని సృష్టించగలను' అంటూ రాముడు వీరావేశంతో మాట్లాడాడు.

'సౌమిత్రీ! నా సీతాదేవిని దేవతలందరు ఇప్పుడు నాకు అప్పగించకపోతే ఈ సృష్టినంతా నాశనం చేస్తాను. అప్పుడు సకల ప్రాణాలు నశించిపోతాయి. సమస్త జగత్తు అంధకారబంధురం అయిపోతుంది. నేను నారి సంధించి వదిలిన బాణాన్ని ఎవ్వరూ అడ్డుకొనలేదు. సీత నిమిత్తమై ఈ లోకంలోని రాక్షసులను పిశాచులను పీచమణిచివేస్తాను.

కోపాగ్ని చల్లారని రాముడు నా శరాగ్నిలో దేవదానవ యక్ష కిన్నరాదులందరూ మాడిమసైపోతారు. నా సీతాదేవి జాగ్రత్తగా క్షేమంగా నన్ను చేరకపోతే నేను సమస్త ప్రపంచాన్ని అల్లకల్లోలం చేస్తాను. బ్రహ్మ సృష్టినే ఆపివేస్తాను' అని అన్నాడు.

వెంటనే ధనుస్సును పిడికిలితో గట్టిగా పట్టుకొని విషసర్పంలాగా బుసకొట్టేలాగా పదునుతేలిన బాణాన్ని అమ్ముల పొదినుంచి తీసి రాముడు చేత బట్టుకొన్నాడు. కాలవశంతో బాల్యయౌవనవార్ధక్యాలను ఎలా నివారించలేదో అలానే నా కోపాగ్నిలో నేను వేసే శరాన్ని ఎవ్వరూ ఆపలేరు.

ఎప్పుడూ చిరునవ్వులు చిందిస్తూ నాతో కూడా ఉంటూ ఆనందించే నా సీతను అప్పగించనిచో ఈ సృష్టి సర్వనాశనం కాక తప్పదు' అని శ్రీరాముడు కోపావేశంలో వీరాధివీరుడై వాగ్బాణాలను సంధించాడు.

* * *

లక్ష్మణుడు రాముణ్ణి శాంతింపజేయటం

సర్గ - 65

సీతావిరహాగ్నిలో రాముడు ప్రళయకాళరుద్రుడు అయ్యాడు. ఆయన లోకాలన్నింటిని ధ్వంసం చేయడానికి సన్నద్ధుడు అయ్యాడు. ఇలా కుపితుడైన శ్రీరాముని లక్ష్మణుడు ఏ రోజు చూడలేదు. వాడిపోయిన ముఖంతో

అంజలిబద్ధుడై లక్ష్మణుడు 'అన్నా! మీరు జితేంద్రియునివి. శాంతిస్వరూపులు. సకల ప్రాణుల రక్షణ చేసే మీరు ప్రకృతి విధ్వంసానికి పూనుకొంటారా?

చంద్రునిలోని చల్లదనం, సూర్యునిలోని దివ్యకాంతి, వాయువులోని వేగం, భూమిలోని ఓర్పు మీలో మూర్తీభవించి ఉన్నాయి. అందువలనే మీ కీర్తి చిరస్థాయిగా నిలిచి ఉంది. ఏ ఒక్కరి వల్లనో జరిగిన అపరాధాన్ని చూచి సమస్త జగత్తును నాశనం చేయాలనుకోవడం అనుచితం. ఈ యుద్ధరథం, రథసారథి, అశ్వాలు ఎవరివో మనకు తెలీదుగదా. సోదరా! చూడు ఇక్కడ మహాఘోరయుద్ధం జరిగినట్లు తెలిపే జాడలున్నాయి. రక్తపు మడుగులు ఇంకి ఉన్నాయి. ఈ రథాదులన్నీ ఒక్కని లాగే ఉన్నాయి. సైన్యం వచ్చినట్లు తెలియడంలేదు. పాలకులు ఒక్కడు ఒనర్చిన కార్యానికి వానికే దండన విధిస్తారు.

ఓ రఘురామా! మిమ్ము ఎవరు తక్కువగా అంచనా వేయగలరు? ఎవరైనా మీకు అపకారం చేయడానికి పూనుకొంటారా? మీ భార్యను అపహరించడం మంచిదని ఎవరు ఊహించగలరు? దీనజనశరణ్యుడివైన మిమ్ము దేవయక్షకిన్నరాదులు మీకు అపకారం చేయరు. తపస్సంపన్నులైన మహర్షులు మీకు మేలు చేయువారే కాని కీడు తలపెట్టరు.

మీ ధర్మపత్నిని కనుగొనేవరకు విశ్రమించకుండా ఉందాం. సముద్రాలు, పర్వతాలు, నదులు, దేవ గంధర్వ లోకాలన్నింటిని గాలించి వెదుకుదాం ఓ ప్రభూ! మీ ప్రేమ పెన్నిధిని దేవతలు వెదకడంలో సాయం చేసి మీ దగ్గరకు చేర్చలేక పోతే అప్పుడు ఆలోచిద్దాం.

నరేంద్రా! మనం మన వంతు ప్రయత్నం చేసి న్యాయమార్గాన్ని అవలంబించి సీతను తెలుసుకొందాం. మన ప్రయత్నంలో విజయం సిద్ధించకపోతే సీత మనకు దొరకకపోతే అప్పుడు వజ్రాయుధ తుల్యమైన మీ శరాన్ని ప్రయోగించి సమస్త సృష్టిని రూపుమాపవచ్చు' అని లక్ష్మణుడు శ్రీరాముని కోపాగ్నిని వశం చేసుకొని శ్రీరాముడిని శాంతింపజేశాడు.

* * *

లక్ష్మణుని బోధ

సర్గ - 66

శ్రీరాముడు శోకంలో మునిగిపోయాడు. ధైర్యస్థైర్యాలను కోల్పోయాడు. మానసికంగా శారీరకంగా దుర్బలుడు అయ్యాడు. దిక్కులేని వానిలాగా పరితపిస్తున్న రాముణ్ణి లక్ష్మణుడు ఓదార్చుతూ ఆయన పాదాలు ఒత్తుతూ కర్తవ్యాన్ని బోధిస్తున్నాడు. "దశరథుడు ఎన్నో యాగాలు వ్రతాలు చేసి ఆ పుణ్యఫలంగా మిమ్ముపొందాడు. ఆ మహారాజు మిమ్ము విడిచి ఉండలేక దివికి ఏగాడు కదా! నేడు మీరు ఒక సామాన్య మానవునిలాగా దుఃఖించడం

ఏం బాగుంది? ఆపదలను ధైర్యంగా ఎదుర్కోగలిగిన మీరే ఇలా శోకంలో మునిగిపోతే సామాన్య ప్రజల స్థితి ఎలా ఉంటుంది? నరశ్రేష్ఠా! మీరు సీతను పొందలేకపోతున్నానని సమస్తాన్ని నాశనం చేస్తానంటున్నారు. తీరని కోరికలున్న సామాన్య ప్రజల గురించి మీరు ఆలోచించడంలేదు. సుఖదుఃఖాలు సర్వసాధారణ విషయాలు. ఇవి ప్రతి మానవునికి అనుభూతికి వచ్చే సామాన్యాలే. యయాతి స్వర్గానికి వెళ్ళినా తన అహంకార గుణంవల్ల దుఃఖం కొనితెచ్చుకోలేదా?

వశిష్ఠమహర్షి ఒకేరోజు వందమంది పుత్రులను కని పుత్రోత్సాహం పొంది విశ్వామిత్రుని కోప కారణంగా వారినందరిని ఒక్కరోజే పోగొట్టుకొని దుఃఖం పొందలేదా? తపస్సులో ఆయనను మించినవారు ఎవరూ లేకపోయినా సుఖదుఃఖాలు ఆయనను బాధపెట్టాయి కదా! సర్వప్రాణిభారాన్ని మోసే భూదేవికి అప్పుడప్పుడు తన స్థితిని తప్పి బాధపడుతుంది గదా. జగత్తుకు ఆధారములైన సూర్య చంద్రాదులు కూడా రాహుకేతువులవలన కష్టాలు పడడం తప్పించుకోలేదు గదా! ఓ రామచంద్రా! ఇంద్రాది దేవతలు, దేహధారులు ఎవరైనా విధివ్రాతను తప్పించుకోలేరు. ఓ పుణ్యపురుషా! సీతాదేవి కనబడడంలేదని కాని, ఎవరైనా అపహరించినా కాని మీరు సామాన్యునిలా రోదించకూడదు. రామా! సత్యాసత్యాలు, కర్తవ్యాకర్తవ్యాల గురించి విచక్షణాశక్తి ఉన్నవారు ఏ దుఃఖానికి క్రుంగిపోరు. ఏ సంతోషానికి పొంగిపోరు. విశారదులు మంచి చెడులను గురించి ఆలోచించి శోకానికి వశం అవకుండా వాస్తవ పరిస్థితిని చూసి కర్తవ్యాన్ని నిర్ణయించుకొంటారు. కర్మఫలాలు అనిత్యాలు. ఎవరూ పూర్వజన్మ గురించి ఆ కర్మలను గురించి ముందుగా తెలుసుకోరు. అనుభవిస్తున్న ఫలితాన్నిబట్టి ఆ కర్మలను తలచుకొంటారు. పురుషప్రయత్నం లేకుండా కర్మఫలాలు ఎవరికీ దొరకవు. రామా! ఈ సంగతి నాకు మీరు ఎన్నోసార్లు చెప్పి ఉన్నారు. ఈనాడు దుఃఖంలో మునిగిన మీరు అన్నింటిని మరిచారు. మీకు బోధించడానికి సాక్షాత్తుబృహస్పతికి కూడా అసాధ్యమే. మీ ప్రతిభ సాటిలేనిది. మీలో దుఃఖంవలన అణగారిపోయిన శక్తిని నేడు నేను మేల్కొలుపుతున్నాను. ఓ ఇక్ష్వాకువంశమణీ! మీరు ధర్మమూర్తులు. మీ పరాక్రమం ఎంచ వీలులేనిది. దేవగంధర్వాదులకు కూడా నిన్ను ఎదురించడం దుర్లభమే. ఓ మహాపురుషా! మీ శక్తిసామర్థ్యాలతో లోకాలను నశింపజేస్తే వచ్చే లాభం ఏమీ ఉండదు. సీతను అపహరించిన శత్రువును నాశనం చేసి సీతను కాపాడడమే మన తక్షణ కర్తవ్యం. శత్రువు గురించి తెలుసుకొని వాణ్ణి మట్టికరిపించడానికి మీరు పూనుకోండి" అని లక్ష్మణుడు శ్రీరామునికి చెప్పాడు.

* * *

జటాయువును చూడటం

సర్గ - 67

చిన్నవారు చెప్పినా మంచిమాటైతే వినాలనేది స్మృతివాక్యం. అందుకే తనకంటే చిన్నవాడైనా లక్ష్మణుని మాటలలోని ఆంతర్యాన్ని రాముడు గ్రహించాడు. తన కర్తవ్యాన్ని తెలుసుకొన్నాడు. కోపాన్ని అదుపు చేశాడు. సమస్తాన్ని నాశనం చేయాలని పట్టుకొన్న ధనుస్సును పక్కన పెట్టాడు. 'లక్ష్మణా! ఇప్పుడు మనం చేయాల్సినవి ఏమిటి? మనం ఏం చేస్తే మన సీత మనకు దక్కుతుంది' అని దీనంగా అడుగుతూ కన్నీరు కార్చాడు శ్రీరాముడు.

'అగ్రజా! దిగులు చెందకు. మనం కీకారణ్యమైన ఈ దండకవనాన్ని గాలించుదాం. ఇక్కడ రాక్షసులు కిన్నరులు స్థిర ఆవాసం ఏర్పరుచుకొని ఉన్నారు. పర్వతాలు గుహలు వృక్షాలతో నిండిన ఈ వనం చొరరానిదిగా ఉంది. ఇక్కడ ఎక్కడైనా మనకు సీతమ్మ జాడ తెలుస్తుందేమో' అని అన్నాడు. లక్ష్మణుని మాటలు విన్న రాముడు అర్ధ చంద్రాకారమైన నారిని సంధించి ఆ వనంలో వెదకడం ప్రారంభించాడు. కొద్దిసేపటికి వారికి రక్తంలో పడి ఉన్న పక్షి రాజు కనిపించాడు. రక్తసిక్త శరీరంతో పడి ఉన్న జటాయువును చూసి 'లక్ష్మణా! సీతను భక్షించింది ఇతడే అయి ఉంటాడు. గ్రద్ద రూపంలో తిరుగుతున్న రాక్షసుడై ఉంటాడు. సీతను తినివేసి హాయిగా కూర్చున్నాడు. నేను ఇప్పుడే వీణ్ణి సంహరించివేస్తాను' అని శ్రీరాముడు సమస్త భూమండలాన్ని నాశనం చేసేలాగా వెంటనే ఆ జటాయువు దగ్గరకు పరుగెత్తాడు.

'ఓ రామా! అంటూ రక్తం ఓడుతున్న శరీరంతో పడి ఉన్న జటాయువు శ్రీరాముడిని చూశాడు. 'ఓ రామా! సీత కోసం అన్వేషించే శ్రీరామా! నీ సీతను హరించిన ధూర్తుడు రావణుడనే రాక్షసుడు. వాడే నాకీ గతి కలిగించాడు. రామచంద్రా! మీరిద్దరూ లేని సమయంలో ఒంటరిగా ఉన్న సీతాదేవిని కపటి ఐన రావణాసురుడు అపహరించి రథం మీద తీసుకొని పోవడం నేను గమనించాను.

వెంటనే నా సర్వశక్తులు ఒడ్డి ఆ తల్లిని కాపాడాలని యత్నించి విఫలం చెందాను. నేను రావణాసురుని చాలా బాధించాను. వాడి కవచాన్ని, ధ్వజాన్ని ఛత్రాన్ని ముక్కలు చేశాను. రథాన్ని రథాశ్వాలను, సారథిని కొట్టిపడేశాను. రావణాసురుడు నా ధాటికి తట్టుకోలేక కిందపడ్డాడు. వృద్ధుడినైన నేను రణంలో బాగా అలసిపోయాను. దాన్ని చూచిన రావణుడు కింది నుంచి లేచి సీతను పట్టుకొని మరల ఆకాశమార్గాన వెళ్ళడం చూసి వేగంగా వెళ్ళి అడ్డుకొన్నాను.

కాని నేను ఎంత బాధించినప్పటికీ వెరవని ఆ రాక్షసాధముడు తన ఖడ్గంతో నా రెక్కలను ఖండించివేశాడు. దానితో నేను నేల కూలాను. ఈ స్థితిలోనున్న నన్ను చంపడం భావ్యమా?' అని జటాయువు ఏడ్చింది.

సీత అపహరణ వృత్తాంతం విని కన్నీరు కారుస్తూ రాముడు కోదండాన్ని పక్కన పెట్టి నేలకు సాగిలపడి దీనస్థితిలోనున్న జటాయువును అక్కున చేర్చుకొని పరితపించాడు. లక్ష్మణుడు జరిగిన గాథ విని భోరుమని ఏడ్చాడు.

'లక్ష్మణా! రాజ్యాధికారం పోయింది. కనీసం రాజ్యంలో ఉండే అర్హత కూడా లేకుండా వనవాస నెపంతో అడవులకు చేరాము. ఇక్కడైనా ప్రశాంతంగా ఉందామని తలిస్తే సీత ఎడబాటు కలిగింది. దాన్ని తట్టుకోలేక బావురుమని ఏడుస్తున్న మనకు ఆప్తుడైన జటాయువు ప్రాణాపాయస్థితి ఎదురైంది. ఇన్ని కష్టాలు నాకు ఒక్కనికే వచ్చాయి. ఈ కష్టాల కొలిమి నన్ను దహించివేస్తోంది. అగ్నికూడా ఇంతగా బాధపడదేమో?' అని శ్రీరాముడు తన దౌర్భాగ్యాన్ని గూర్చి చెపుతూ విలపించాడు.

'దాహార్తికి లోనై దాహం తీర్చుకొందామని నేను సముద్రంలో చేయి పెట్టినా అది కూడా నా చేయి తగిలి ఎండిపోతుంది. అలాంటి నా భాగ్యం ఏమని చెప్పను? నాకంటే భాగ్యహీనుడైనవాడు ఈ లోకంలో ఎవరూ

ఉండరు – అంటూ ఈ జటాయువు నా తండ్రికి ఆప్తమిత్రుడు, మనకోసం నేడు ప్రాణాల మీదకు తెచ్చుకొన్నాడు' అని జటాయువు శరీరాన్ని నిమిరాడు. ఆయనను కౌగిలించుకొని 'నా మైథిలి ఎక్కడా' అంటూ శోకంతో నేలపై పడిపోయాడు శ్రీరాముడు.

* * *

జటాయువు దహన సంస్కారాలు

సర్గ – 68

రావణుని చేతిలో దెబ్బతిన్న జటాయువును అక్కున చేర్చుకొని శ్రీరాముడు ఎంతో ఏడ్చాడు. 'లక్ష్మణా! నా కోసం, నాకు సాయం అందించడంకోసం, ఈ జటాయువు ప్రాణాలను పోగొట్టుకొంటున్నాడు. ఇంకా పూర్తిగా ప్రాణాలను ఈ శరీరాన్ని విడువలేదు. అందుకే కొనఊపిరితో స్పృహ తప్పి పడిపోయాడు.

'ఓ పక్షిరాజా! మీలో మాట్లాడే శక్తి ఉన్నట్లు అయితే మీరు నాకు చెప్పాలని తలుస్తుండే నా మైథిలి ఎక్కడుందో చెప్పుము' అని శ్రీరాముడు జటాయువును అడిగాడు. రావణుడు నా సీతను అపహరించి తీసుకొనిపోవడానికి కారణం ఏమి? నేను ఆయనకు చేసిన ద్రోహం ఏమిటి? నా సీత ఎల్లప్పుడు చంద్రుని లాగా ఆహ్లాదకరమైన ముఖ కాంతితో ఉండేది. రావణుని హస్తాక్రాంతమైన నా సీతముఖం కళావిహీనం అయిపోయిందా? సీతాదేవి మీతో ఏదైనా చెప్పిందా? రావణుని నివాసం ఏది? అతని రూపు ఎట్టిది? అతని బలపరాక్రమాలు ఏవి? నాకు ఇవన్నీ చెప్పుము' అని శ్రీరాముడు ఎగశ్వాస తీస్తున్న జటాయువును అడిగాడు.

'రఘురామా! నేను పోరాడి అలసి ఉన్న క్షణంలో నా రెక్కలునరికి నన్నుకూలదోసి పెనుగాలులు సృష్టించి దక్షిణ దిక్కుగా ఆకాశంలో సీతను తీసుకొని వేగంగా వెళ్ళాడు. రామచంద్రా! నాకు మరణం ఆసన్నమౌతోంది. నేను బంగారు వృక్షాన్ని చూడగలుగుతున్నాను. రామచంద్రా! రావణుడు సీతను అపహరించిన సమయాన్నిబట్టి చెప్తున్నాను. నీవు తప్పక ఆ రాక్షసుని నిర్మూలించి సీతను చేజిక్కించుకొంటావు. నీ సీతాధనాన్ని నీవు పొందుతావు ఇది నిశ్చయం.

సీతను అపహరించి తీసుకొని వెళ్ళిన ముహూర్తంను 'విందా' ముహూర్తం అని అంటారు. ఆ విషయం అతనికి తెలియదు. ఆ సమయం రావణాసురునికి మరణాంతకం. కాబట్టి అతడు గాలానికి చిక్కిన చేపలాగా అతి త్వరలో చావక తప్పదు. ఓ రామా! నీవు చింతించాల్సిన పనిలేదు. నీవు నీ సీతను పొంది అచిరకాలం రాజ్యసుఖాలను పొందగలవు.

శ్రీరామా! ఆ రావణుడు విశ్రవసుని కొడుకు. సాక్షాత్తు కుబేరుని తమ్ముడు' అని చెప్తూ నోటినుండి రక్తాన్ని కక్కాడు. వెంటనే అతని ప్రాణాలు అనంతవాయువుల్లో లీనం అయిపోయాయి. ఇంకా శ్రీరాముడు దోసిలితో

జటాయువు ముఖాన్ని పట్టుకొని ఇంకా చెప్పమని అడుగుతూ ఉండగానే ఆ పక్షి రేడు ప్రాణాలు మింటికి ఎగసిపోయాయి. జటాయువు శిరస్సు నేలకు ఒరిగిపోయింది, శరీరం నేలపై పడిపోయింది.

ఆ దుర్భరస్థితిని చూచి రాముడు దీనంగా రోదించాడు. జటాయువు మరణం లక్ష్మణునిలో దుఃఖం కట్టలు తెంచింది. శోకంలో రాముడు 'లక్ష్మణా! చూడు చాలాకాలం నుంచి పక్షి సమూహానికి రాజై ఉండి నేడు పరుల సహాయం కోసం ప్రాణాలు విడిచాడు. మంచివారు జంతువులలో కూడా ఉంటారనడం నిజం కదా! జటాయువు మనం మరిచిపోలేని మహోపకారం చేశాడు. జటాయువు ఉదాత్తగుణం కొనియాడవలసినది. నాకు సహాయం చేయడంకోసం తన విశాలరాజ్యాన్ని తృణప్రాయంగా వదిలేశాడు. సౌమిత్రీ ఇతని మరణం నాలో సీత ఎడబాటుకు మించిన దుఃఖాన్ని కలిగిస్తోంది.

ఈ సౌజన్యమూర్తి సత్పురుషుడైన మన తండ్రివంటివాడు. మనకు పూజనీయుడు. వెంటనే కొన్ని కట్టెలను తీసుకొచ్చి చితిని పేర్చు. నేను ఈ పక్షి రేడుకు దహనసంస్కారాన్ని చేస్తాను. ఓ పక్షిరాజా! మీకు, సత్పురుషులకు, వీరమరణం పొందినవారికి, జితేంద్రియులకు, తపస్సంపన్నులకు, నిష్ఠాపరులకు, దానం చేసేవారికి ఏ ఉత్తమ గతులు ప్రాప్తిస్తాయో ఆ ఉత్తమలోకాలు మీకు ప్రాప్తిస్తాయి. మీకు తప్పక మోక్షంలభిస్తుంది. పరోపకారంకోసం మీ శరీరాన్ని ఉపయోగించిన మీకు మోక్షార్హత పొందే విషయంలో ఏ సంశయం లేదు. విష్ణుసాయుజ్యాన్ని తప్పక పొందుతావు.

ఇలా చెప్పి శ్రీరాముడు జటాయువు శరీరాన్ని చితిపై చేర్చాడు. అగ్నికి ఆహుతి చేసి ఆత్మబంధువును కోల్పోయిన రీతిగా బోరు బోరున విలపించారు.

శ్రీరామలక్ష్మణులు వనంలోకి వెళ్ళి కందమూలాలను, ఫలాలను తెచ్చారు. శ్రీరాముడు దర్భలను పరచి వనాహారాన్ని గుజ్జుగా చేసి జటాయువుకు పిండప్రదానం చేశాడు. అనంతరం రామలక్ష్మణులు నదిలో స్నానం చేసి బ్రాహ్మణోత్తములు స్వర్గప్రాప్తికోసం పఠించే మంత్రాలను పఠించారు. ఆ పక్షిరాజుకు జలతర్పణం విడిచారు.

జటాయువు తన పరాక్రమంతో సీతాపహరణ ఘోరాన్ని తలపెట్టిన రావణునితో పోరాడి అసువులు బాసింది. ఆ మహాపురుషుని త్యాగాన్ని కొనియాడి శ్రీరామచంద్రుడు జటాయువుకు ఉత్తమగతుల ప్రాప్తికోసం ఉదకక్రియలు చేశాడు. దానివల్ల జటాయువుకు ఆత్మశాంతి పుణ్యలోకాలు సిద్ధించాయి.

మరలా సీతను వెతికే కార్యక్రమానికి రామలక్ష్మణులు శ్రీకారం చుట్టారు.

* * *

కబంధుడు తారసిల్లటం

సర్గ - 69

రామలక్ష్మణులు జటాయువుకు అంత్యేష్టి జరిపి పశ్చిమదిక్కుగా నడవసాగారు. ఇక్ష్వాకువంశశ్రేష్ఠులైన ఆ సోదరులు ఎవరికీ అడుగు పెట్టడానికి వీలుకాని అరణ్యంలోకి ప్రవేశించారు. ఆ అరణ్యంలో పొదలు వృక్షాలు తీగలు దట్టంగా అల్లుకున్నట్టు ఉన్నాయి. పెద్ద పులుల్లాంటి క్రూరమృగాలు సంచరిస్తున్నాయి.

అలా వారు దండకారణ్యంనుండి మూడుక్రోసుల దూరం నడిచారు. క్రౌంచారణ్యం వారికి కనిపించింది. అక్కడ పలు వన్నెలుగల పక్షులు గుంపులుగా తిరుగుతున్నాయి. పుష్పించిన పూలు చెట్లనిండా ఉండడంతో ఆ అరణ్యం అందంగా కనిపిస్తోంది. పక్షులు, సర్పాలు, మృగాలు అక్కడ కూడా కనిపించాయి. వైదేహికోసం ఆ క్రౌంచారణ్యం అంతా వాళ్ళు వెదికారు.

వారు ఆ అరణ్యాన్ని దాటి ముందుకు పోతూ ఒక వనాన్ని చూశారు. అక్కడికి దగ్గర మతంగాశ్రమం ఉంది. మతంగాశ్రమానికి క్రౌంచారణ్యానికి మధ్యలో ఒక వనం కనిపించింది. అక్కడ వెదుకుతున్న వారికి పాతాళంలాగ ఉన్న ఒక పెద్ద గుహ ఎదురైంది. ఆ గుహను రామలక్ష్మణులు చూస్తుండగా వారి దగ్గరికి వికృతరూపంతో మహాబలురాలైన ఒక రాక్షసి వచ్చింది. ఆ రాక్షసి పొట్ట పెద్దదై వ్రేలాడుతూ ఉంది. ఎత్తుపల్లాలలాంటి అవయావాలతో ఆమె అసహ్యకరంగా కనిపించింది.

ఆ రాక్షసి రామలక్ష్మణుల ముందుకు వచ్చింది. లక్ష్మణుని చూచి "రమ్ము రమించుదం" అంటూ దగ్గరగా వచ్చింది. నా పేరు అయోముఖి నీకు నేను లభించాను. నీవే నా ప్రియుడవు. నాతో హాయిగా సుఖిద్దువు రా అంటూ లక్ష్మణుని కౌగిలించుకొంది. దగ్గరకు రావడమేకాక అసహ్యంగా మాట్లాడే రాక్షసిని కోపంగా చూసి లక్ష్మణుడు ఆమె ముక్కు చెవులు స్తనాలు కోసివేశాడు.

బాధతో విలవిలలాడుతూ ఆ రక్కసి పారిపోయింది. అలా వెళ్లుతూ 'అన్నా! నా బాహువు ఎందుకో ఎక్కువుగా అదురుతోంది. మనస్సు దిగులు చెందుతోంది. అపశకునాలు చూస్తుంటే నాకు భయం వేస్తోంది' అని లక్ష్మణుడు రామునితో చెప్పాడు. 'ఈ దుశ్శకునాలన్నీ మనకు రాబోయే ఆపదను చెపుతున్నట్లుగా నాకు అనిపిస్తోంది' అన్నాడు. అంతలో వారికి 'వంజులకం' అనే పిట్ట అరుపు వినవచ్చింది. 'లక్ష్మణా! ఇదుగో ఈ అరుపు మనకు విజయాన్ని సూచిస్తోంది. ఏ భయం లేదు. మనం విజయులమవుతాం' అనుకుంటూ వారు అడవిని అంతా గాలించసాగారు.

అంతలో వారికి విరిచి వేసినట్లుగా ఒక పెద్ద శబ్దం వినిపించింది. గాలి చుట్టుకుపోతున్నట్లు వీచింది. ఆ శబ్దం పెద్దగా ప్రతిధ్వనించింది. అది ఏ దిక్కునుంచి వచ్చిందో అని వారు చూస్తుండగా ఒక పెద్ద శరీరం, విశాలమైన ఉదరం ఉన్న రాక్షసుడు కనిపించాడు. వానికి తల పొట్టలో ఉంది పొడవైన చేతులున్నాయి.

ఆ రాక్షసుడు దట్టమైన రోమాలతో పెద్ద పర్వతంలాగా కనిపించాడు. రాక్షసుడు అరిచినప్పుడు ఉరిమినట్లుగా ఉంది. రాక్షసునికి వక్షస్థలంలోని లలాటంలో ఒక పెద్ద కన్ను ఉంది. అది పచ్చని కంటి గుడ్డుతో పెద్దగా ఉండే

కనురెప్పలతో ఉంది. ఆ రాక్షసుని రెండు చేతులు యోజనం దూరం వరకు వ్యాపించి ఉన్నాయి. ఆ చేతులతో దగ్గరికి వచ్చిన ఎలుగుబంట్లను, పులులను, పక్షులను పట్టుకొని ఆ రాక్షసుడు తినేవాడు.

ఆ రాక్షసుడు రామలక్ష్మణులను అడ్డగించాడు. తలలేని ఆ పర్వతాకారుడు చూడడానికి భయంకరంగా ఉన్నాడు. ఆ రక్కసుడు తన రెండు చేతులతో ఒక్కసారిగా రామలక్ష్మణులను పట్టుకొని దగ్గరకు లాక్కోవడానికి గట్టిగా ప్రయత్నించాడు. దాన్నిచూచి రామలక్ష్మణులు ఇద్దరు ఈ రాక్షసునికి చిక్కిపోయామే అని ఎంతో చింతించారు. దుఃఖంతో లక్ష్మణుడు 'అగ్రజా! ఇది ఏమీ ఆపద? ఇద్దరం వీనికి చిక్కాం. రామచంద్రా! నా గురించి ఆలోచించకుండా మీరు ఇక్కడనుండి తప్పించుకుని వెళ్లిపోండి' అని చెప్పాడు.

'సోదరా! మీరు కొద్దికాలంలోనే సీతను పొందుతారని నాకు తెలుస్తోంది. మీరు మన తాతముత్తాతలనుండి వచ్చిన రాజ్యాన్ని సీతతోకూడి ఏలుకొనుము. కాని అప్పుడు నన్ను మాత్రం మరచిపోకుము. ఈ రాక్షసునికి ఇప్పుడు నన్ను ఆహారంగా వదిలేసి మీరు ఎలా అయినా తప్పించుకుని వెళ్ళి పొమ్ము' అని సౌమిత్రి రామునకు చెప్పాడు.

దైన్యం పొందే లక్ష్మణునితో రాముడు ధైర్యం వీడిపోవద్దని చెప్తున్నాడు. అంతలో అతిక్రూరుడు దానవ శ్రేష్ఠుడైన కబంధుడను ఆ రాక్షసుడు 'ఓ యువకులారా! వృషభాల్లాంటి మూపురాలు కలిగిన మీరు ఎవరు? ఈ నిర్జీవారణ్యంలోకి ఎందుకు వచ్చారు. మీరు నకనకలాడే నా ఆకలిని తీర్చడానికి ఇటు వచ్చినట్లున్నారు. ఖడ్గాలు, ధనుర్బాణాలు ధరించి మీరిద్దరూ నాకు దొరికారు. మీ జీవితం ముగిసిపోయినట్లే' అని వికృతంగా అరిచాడు.

'సౌమిత్రి! మన భాగ్యం ఎంత బాగున్నదో నీవే చూడు, ఒక బాధ తర్వాత మరో బాధ మనలను పట్టి పీడిస్తోంది. సీత కనబడక దుఃఖంలో మునిగిన మనం నేడు ఈ రాక్షసుని చేత చిక్కాం. కాలం మంచి శక్తివంతమైనది కదా! కాలానికి ఎదురీదడం ఎవరికైనా అసాధ్యమనిపిస్తోంది.

ఇసుకతో కట్టిన అడ్డుకట్టలు ఎంత పెద్దవి అయిననూ అవి సముద్రజాలలు పొంగి వచ్చినప్పుడు కొట్టుకుపోక తప్పవు. అస్త్రశస్త్రాది విద్యలు నేర్చిన మహాబలశాలులైనా వీరాధివీరులైనా కాలానికి తలవంచక మానరు' అని అన్నదమ్ములిద్దరూ అనుకుంటున్నారు.

బీరువులాగా కంపించి పోతున్న లక్ష్మణుని చూసి ధైర్యం చెప్పుతూ రాముడు తన పరాక్రమాన్ని తలచుకొని ఉత్తేజితుడై తన మనస్సును గట్టి పరచుకున్నాడు.

* * *

కబంధుని కనువిప్పు

సర్గ - 70

తన చేతికి చిక్కి ఉన్న రామలక్ష్మణులను కబంధుడు చూశాడు. 'ఓ యువకులారా! మీరు ఇక ఏమీ ఆలోచించకండి. ఆ దేవుడే మిమ్ములను నాకు ఆహారంగా పంపాడు' అని అన్నాడు. దుఃఖంలో ఉన్న సోదరులకు ఆ మాటలు వేదనను కలిగించాయి. అంతలో 'అన్నా! ఈ రాక్షసుడు మనలను తినకముందే మనమే వీని చేతులను నరికివేద్దాం' అని లక్ష్మణుడు అన్నాడు.

'ఓ రామచంద్రా! వీని బలమంతా వీని బాహువులలోనే ఉంది. ఎందరినో ఈ చేతులతో పట్టుకొని పొట్టన పెట్టుకుని ఉంటాడు. కాబట్టి మనం వీని చేతులను నరికివేస్తే చాలు. వీనిని చంపే అవసరం అంతగా లేనట్టు ఉంది' అని చెప్పే లక్ష్మణుని మాటలు విని కబంధుడు కోపోద్రిక్తుడై తన నోరు అంతా తెరచి వారిని మింగివేయాలనుకొన్నాడు.

సమయస్ఫూర్తితో రామలక్ష్మణులిద్దరూ అరటిబోదెలలాంటి ఆ కబంధుని రెండుచేతులను ఖండించి వేశారు. శ్రీరాముడు కుడిభుజాన్ని, లక్ష్మణుడు ఎడమభుజాన్ని నరికేశారు. ఆ కబంధుడు దిక్కులన్నీ పిక్కటిల్లేటట్లుగా పెద్దగా గర్జన చేస్తూ నేలమీద పడిపోయాడు.

నెత్తురులో పడిన ఆ కబంధుడు రామలక్ష్మణులను చూసి 'అయ్యలారా! మీరెవరు? మీ విశేషాన్ని నాకు చెప్పండి' అని అడిగాడు. అలా అడిగే కబంధునితో లక్ష్మణుడు, 'మేం ఇక్ష్వాకువంశంలో వాసికెక్కిన దశరథుని కుమారులం. ఈయన మా అన్న శ్రీరాముడు. నేను శ్రీరాముని తమ్ముడను లక్ష్మణుడను. శ్రీరాముడు మహాబలశాలి. ఇతని ధర్మపత్ని సీత. ఆమెను ఒక రాక్షసుడు అపహరించి తీసుకొని వెళ్ళాడు. ఆమెను వెదుకుతూ మేం ఇక్కడకు వచ్చాం' అని చెప్పారు.

'ఓ రాక్షసా! ఇంతకీ నీవెవరు? మొండెంతో ఎందుకున్నావు? వక్షస్థలంలో ముఖంతో తెగిన కాళ్ళతో ఇక్కడ ఎందుకున్నావు?' అని వారు కబంధుని ప్రశ్నించారు.

కబంధునికి దేవేంద్రుని వచనాలు జ్ఞప్తికి వచ్చాయి. అతడు చాలా సంతోషిస్తూ 'నా అదృష్టం నేడు ఫలించింది. మీ దర్శనభాగ్యం నాకు కలిగింది. నా భాగ్యవశమున నా బాహువులను మీరు ఖండించారు. నా అవినయంవల్ల నాకీ దుర్గతి పట్టింది. ఈ వికృతాకారం కలిగింది. ఓ నరశ్రేష్ఠా! మీకు నా కథను అంతా చెప్తాను వినండి' అని కబంధుడు చెప్పడం ప్రారంభించాడు.

* * *

కబంధుని వృత్తాంతం

సర్గ - 71

'ఓ రామా! సూర్యచంద్రులవంటి అద్భుతమైన రూప సౌందర్యం నాకు ఉండేది. నాకు కామరూపాది విద్యలు బాగా తెలిసి ఉండేవి. దానితో నేను నా ఇష్టం వచ్చిన రూపాన్ని పొందేవాడిని. ఒక్కోసారి నేను భయంకరమైన వికృతరూపాన్ని పొంది అడవులలో తిరుగుతూ అక్కడ తపస్సు చేసుకొనేవారిని భయపెడుతూ తిరిగేవానిని.

ఒకసారి స్థూలశిరస్కుడు అనే మహర్షి కందమూలాలు తెచ్చుకొంటుంటే నేను చూశాను. వెంటనే వికృత రూపంలో ఆయన దగ్గరకు వెళ్ళి భయపెట్టాను. ఆ మహర్షి నాపై కోపం తెచ్చుకొని ఈ రూపమే 'నీకు స్థిరమగుకాక' అని శపించారు. దానితో నా గర్వం అణగారిపోయింది. నేను ఆ మహర్షిని క్షమించమని వేడుకొన్నాను. నా వికృత రూపం పోగొట్టుకొనే మార్గాన్ని చూపమని అడిగాను. ఆ మహర్షి శాంతించి శ్రీరాముడు నిర్జనవనంలో నీ భుజాలను ఖండించి అగ్నికి ఆహుతి చేసినప్పుడు నీ పూర్వ రూపం వస్తుందని చెప్పాడు.

లక్ష్మణా! అసలు నేను దనువు కుమారుడిని. దానవులలో శ్రేష్ఠుడని పేరు పొందాను. నేను తపస్సు చేసి బ్రహ్మను మెప్పించి దీర్ఘాయుష్షును పొందాను. దానితో నాలో అహంకారం మొదలయింది. దీర్ఘాయుష్షు ఉందన్న పొగరుతో నేను ఇంద్రుని ఎదురించాను. ఇంద్రునికి కోపం వచ్చి తన వజ్రాయుధంతో నన్ను కొట్టాడు. ఆ దెబ్బకు నా తల తొడలు నా శరీరంలో కలసిపోయాయి.

అప్పుడు ఈ వికృత రూపంతో నేను బతకలేనని నన్ను చంపివేయమని ఇంద్రుని ఎంతగానో ప్రార్థించాను. కాని బ్రహ్మవాక్కులు సత్యములు. అందుకే నా ప్రార్థనను మన్నించకుండా ఇంద్రుడు ఇలానే జీవించమని చెప్పాడు. దేవేంద్రా! నేను ఆహారం లేకుండా ఈ రూపంతో ఎన్నాళ్ళు జీవించగలను? అని ప్రాధేయపడ్డాను. మహేంద్రుడు నాకు యోజనం పొడవున్న ఈ రెండు చేతులను ప్రసాదించాడు. కోరలున్న ముఖాన్ని నా పొట్టలో కల్పించాడు. అప్పటినుండి ఈ వనంలో ఉంటూ నా చేతుల దగ్గరకు వచ్చిన క్రూర జంతువులను లాక్కొని తింటున్నాను. ఇంద్రుడు నాపై దయచూపి రామలక్ష్మణులు నీ భుజాలను ఖండించిన తర్వాత నీవు స్వర్గానికి రాగలవని చెప్పి వెళ్ళాడు.

ఓ రామచంద్రా! ఆనాటినుండి నేటివరకు నీ కోసమే నేను ఎదురుచూస్తున్నాను. ఈనాటికి నాకు అదృష్టం వచ్చింది. మీరిద్దరూ నా భుజాలను ఖండించి నాకు మహోపకారం చేశారు. నన్ను మీరిద్దరూ అగ్నికి ఆహుతి చేయండి. అప్పుడు నాకు పూర్వరూపం, బుద్ధిబలం వస్తాయి. అప్పుడు మీకు నేను సహాయం చేస్తాను' అని కబంధుడు సోదరులతో చెప్పాడు.

శ్రీరాముడు కబంధుని విషయం విని 'ఓ రాక్షసా! నేను, నా తమ్ముడు లేని సమయంలో, రావణుడు నా భార్య ఐన సీతను అపహరించి తీసుకొని వెళ్ళాడు. మాకు రావణుని పేరు ఒక్కటే తెలుసు. అతని రూపం కాని, పౌరుషం కాని, నివాసం కాని మాకు తెలియదు. సీత జాడ తెలిపేవారు లేక మేము ఈ వనంలో తిరుగుతున్నాం.

ఓ వీరుడా! ఈ అడవిలో ఏనుగులచే తుంచబడిన కట్టెలను తీసుకొచ్చి ఒక గుంటలో వేసి అందు నిన్ను పెట్టి అగ్నికి ఆహుతి చేస్తాము. నీవు నీ పూర్వ రూపాన్ని పొందిన తర్వాత సీత జాడ తెలిపి మా దుఃఖాన్ని పోగొట్టుము' అని శ్రీరాముడు కబంధుని అడిగాడు.

'ఓ రఘురామ! ఇప్పుడు నాకు దివ్యజ్ఞానం లేదు. నా పూర్వరూపం నాకు వస్తే దానితోపాటు ఆ దివ్యజ్ఞానం నాకు వస్తుంది. దానితో నేను నాకు తెలిసినదంతా మీకు చెప్తాను. నా స్వయంకృతాపరాధానికి నేను పొందిన ఈ ఘోరరూపాన్ని నా పశ్చాత్తాప్తంతో మీ దయతో నేను పోగొట్టుకుంటాను. ఓ రామచంద్రా! సూర్యాస్తమయం కాకముందే నన్ను దగ్ధం చేయండి' అని కబంధుడు ప్రార్థించాడు.

కబంధుని మాటలకు సోదరులు సంతోషించారు. కబంధునికి శాపవిముక్తిని కలిగించి అతనికిగల దివ్యజ్ఞానంతో సీతజాడను తెలుసుకోవచ్చునని రామలక్ష్మణులు అనుకొన్నారు.

* * *

కబంధుని సూచన

సర్గ - 72

కబంధుని కోరిక ప్రకారం రామలక్ష్మణులు ఆ రాక్షసుని ఒక గోతిలో వేసి కట్టెలు పేర్చారు, చితిని అంటించారు. ఆ మహాకాయం నెమ్మదిగా మంటలలో కాలిపోతోంది. ఆ మంటలలో నుండి నిర్మలములైన రెండు వస్త్రాలు పూలమాలను ధరించి పొగలేని అగ్నిలాగా ఒక దివ్య తేజోరూపం బయటకు వచ్చింది. అతడి అన్ని అవయవాలకు ఆభరణాలున్నాయి. మహాతేజస్వి ఐన ఆ కబంధుడు హంసలతో కూర్చిన ఒక దివ్య విమానాన్ని ఎక్కి కూర్చున్నాడు.

'ఓ రామచంద్రా!మీకు సీతాదేవి దొరుకే ఉపాయం చెప్తాను విను. సంధి, విగ్రహం, యానం, ఆసనం, ద్వైధీభావం, సమాశ్రయం అనే ఆరు ఉపాయాలతో మానవులు కార్యవిజయాన్ని పొందుతారు. దుర్దశలలో ఉన్న ఒకడు ఆ దశనుండి బయటపడు సమయం వచ్చిన వాని దగ్గరకు వెళ్ళి స్నేహం చేస్తాడు. రామా! ఇపుడు సీతను పోగొట్టుకొని మీరు ఆపదల పాలయ్యారు. మీరు మరొకరితో స్నేహం చేయడం ద్వారా ఆపదను తొలగించుకోగలరు.

రామా! ఋష్యమూకం అనే పర్వతంపైన సుగ్రీవుడను వానరశ్రేష్ఠుడు ఉన్నాడు. ఆ వానరుడు తేజోవంతుడు అద్భుత ప్రతిభాపాటవాలు కలవాడు. మాటకు కట్టుబడి ఉండేవాడు. సర్వసమర్థుడు. ఇంద్రుని అంశతో పుట్టిన వాలి ఇతని అగ్రజుడు. మహాబలిష్ఠుడైన వాలి సుగ్రీవునిపై కోపించి కిష్కింధనుండి వెళ్ళగొట్టాడు.

అప్పటినుండి సుగ్రీవుడు ఋష్యమూకం మీద మహాబలశాలులైన నలుగురు వానర ప్రముఖులతో కలిసి జీవిస్తున్నాడు. రామా! ఈ సుగ్రీవునితో మీరు స్నేహం చేయండి. అతడు సీతాన్వేషణంలో మీకు సాయం చేయగలడు.

మీరు శోకించనవసరం లేదు. విధి నిర్ణయాన్ని ఎవరు ఎదిరించలేరు. కాకున్నది కాకమానదు. ఇదంతా విధివ్రాతేనని తలచి దుఃఖాన్ని పోగొట్టుకుని ధైర్యంగా ఉండండి. సుగ్రీవుడు కామరూపి కోరిన రూపాన్ని పొందగలడు. సూర్యాంశతో ఋక్షరజసునికి పుట్టినవాడు. సూర్యకిరణ ప్రభావం ఎంతవరకు సోకుతుందో అంతవరకు వెళ్ళి అక్కడ ఏమి జరుగుతుందో తెలుసుకొనగల సమర్థుడు. వానరుడని మీరు చులకన చేయనవసరం లేదు. నేడే వెళ్ళి సుగ్రీవునితో అగ్నిసాక్షిగా మైత్రీబంధం ఏర్పరచుకొనుము. మీకు సంకల్పసిద్ధి జరుగుతుంది.

రామచంద్రా! వాలితో వైరంవలన సుగ్రీవుడు పంపాసరోవరతీరంలో ఉన్నాడు. శత్రువులను నిర్మూలించడంలో సుగ్రీవుడుశ్రేష్ఠుడు. నదీతీరాలు, పర్వతాలు, గిరిదుర్గాలు, కొండగుహలు ఇలా అన్నింటియందు తన అనుచరులతో సీతనువెదికించి నీకు ఆమె జాడతెలుపగలడు. సూర్యాంశతోపుట్టిన సుగ్రీవుడుసమస్త ప్రదేశాన్నిగూర్చి తెలుసుకొనగల యుక్తిపరుడు.

కోదండపాణీ! మీ సీతను పోగొట్టుకుని దుఃఖిస్తున్న మిమ్ము సుగ్రీవుడు ఆనందింపజేయగలడు. వానరులను నలుదిశలకు పంపి రావణాసురుడు సీతను ఎక్కడదాచిపెట్టినా వెతికి ఆమెను తీసుకొని వచ్చి మీకు ఇవ్వగల సమర్థుడు' అని సుగ్రీవునితో మైత్రిచేయుమని శ్రీరామునకు కబంధుడు చెప్తున్నాడు.

* * *

వివిధ విషయాల వివరణ

సర్గ - 73

పంపా సరోవర తీర వర్ణనం

రామచంద్రా! పశ్చిమ దిశగా మీరు ప్రయాణం సాగించండి. ఆ దారి మనోహరంగా ఉంటుంది. మీ శోకాన్ని ఆ ప్రకృతి మరిపిస్తుంది. దారిలో నేరేడు, అరటి, పనస, జువ్వి, మర్రి, రావి, తుమ్మిక, కొండగోగు, మామిడి చెట్లు గుంపులుగా ఉన్నాయి. చంద్ర, పొన్న, ఎర్రగోరింట, కానుగ, అశోక, కడిమి, గన్నేరు చెట్లు పూలను విరగకాచి పాదచారుల నాసికలకు విందు చేస్తాయి. వాటి సువాసన మరో లోకానికి తీసుకెళ్ళుతున్నట్లు ఉంటుంది. ఆ వృక్షాలలో నల్లజీడి, అశోక, ఎర్రచందనం దేవదారు వృక్షాలు కూడా ఉన్నాయి.

అటు వెళ్ళేవారు ఎవరైనా ఆ ఫలాలను ఆరగించక మానరు. అవి అమృతతుల్యం ఉంటాయి. ఇవన్నీ దాటుకొంటూ వెళ్తే మీకు మరొక వనం ఎదురౌతుంది. ఆ వనంలో చెట్లు కూడా అన్ని కాలాలలోను సమృద్ధమైన ఫల సంపదను కలిగి ఉంటాయి. చైత్ర రథమనే ఉద్యానవనంవలె ఈ వనం నిత్యం శోభాయమానంగా ఉంటుంది. లక్ష్మణుడు ఆ చెట్ల ఫలాలను మీకు అందించకుండా ముందుకు సాగలేడు. మీరు అలా సీతాదేవి జాడకోసం వెదుకుతూ ముందుకు వెళ్ళితే పంపాసరోవరాన్ని మీరు చూస్తారు. ఆ సరోవరతీరంలో రేవులు నిర్మలంగా స్వచ్ఛంగా ఉంటాయి. అక్కడక్కడా గులకరాళ్ళు మీకు కనిపిస్తాయి.

ఆ నీరు నాచు పట్టకుండా స్వచ్ఛంగా ఉండి నీటి అడుగుభాగం కనిపిస్తూ ఉంటుంది. సరోవరశోభను దానిలో పూచిన కలువలు ద్విగుణీకృతం చేస్తుంటాయి. ఆ సరోవరతీరంలో హంసలు, బెగ్గురు, క్రౌంచ, కురర పక్షులు ఆడుతూ మధుర ధ్వనులను చేస్తుంటాయి. అవి మనష్యులను చూచి బెదిరి దూరంగా పోవు. ఎందుకంటే ఎవరైనా వాటి అందాన్ని చూస్తూ తృప్తిపొందుతారు. కాని వాటిని పట్టి తినాలని అనుకోరు. ఓ రామా! అక్కడ కందమూలాలు సారవంతమైన భూమిలో పెరగడంవలన కండ పట్టినట్లు పుష్టిగా ఉంటాయి. అలాంటి వాటిని మీరు అగ్నిలో కాల్చికూడాతినవచ్చు. చక్కనిపండ్లు ముళ్ళులేనిపండ్లు కూడా మధురంగా ఉంటాయి. ఆ సరస్సులో ముళ్ళులేని చేపలు, గండుమీనులు, సొరమీనాలు, రొయ్యలు ఉంటాయి. ఆ పంపాజలాలు చల్లగా ఉండి మనస్సుకు సంతోషాన్ని కలిగిస్తాయి. వెండిలాగ స్వచ్ఛంగా ఉండి ఆరోగ్యాన్ని ఇస్తాయి. మీరు మధురభోజ్య పదార్థాలను ఆరగించేటప్పుడు లక్ష్మణుడు తామరాకును దొప్పగా చేసి పంపా జలాన్ని మీకు తాగడానికి తెచ్చి ఇస్తాడు.

రామచంద్రా! సాయంసంధ్యాకాలంలో మనవైపు వంగిన చెట్ల కొమ్మలకున్న పూలగుత్తులన్నీ చక్కని పరిమళాన్ని మనకు అందిస్తాయి. పంపాసరోవరంజలంపైనుండి చల్లనిగాలి మనలను స్పృశించి మన మనస్సులోని ఆందోళనను పొగొట్టుతాయి. రాఘవా! మీరు ఆ సరోవర తీరంలో ఆగి ఆ ప్రకృతి రమణీయతను చూడండి. మీ శోకం పోగలదు' అని కబంధుడు రామునికి చెప్పాడు.

మతంగ వన వర్ణన

రామచంద్రా! పంపాసరోవరతీరంలోని వనమే మతంగవనం. ఆ మతంగమహర్షి శిష్యులు ఏకాగ్ర చిత్తులు, జితేంద్రియులు. నిత్యం తపస్సమాధిలో ఉంటారు. వారు అక్కడ చెట్లకు కాచిన పూలను తుంచరు. మాలలు కట్టరు. దానివలనే ఆ వనశోభ పూలతో నిండి ఉంటుంది. ఆ మహర్షి తపోప్రభావంవల్లనే ఆ పూలను పసివాడకుండా ఉంటాయి. ఓ రామా! ఆ మతంగి మహర్షిని సేవించాలనుకొనే శిష్యులు అడవిలో తిరిగి సమిధలను ఏరుకొచ్చేవారు. అలా వచ్చేవారికి మార్గాయాసంవలన స్వేదం వారి శరీరాన్ని అలుముకొనేది. ఆ స్వేదబిందువులు గాలికి ఎగిరి చెట్లమీద పడి పూలుగా మారాయని అంటారు. అందుకే అవి ఎన్నడూ వాడిపోవు.

శబరి

రామలక్ష్మణులారా! ఆ శిష్యులందరూ నేడు అక్కడి నుంచి వెళ్ళిపోయారు. కాని శబరి అనే పేరుతో ప్రసిద్ధికెక్కిన ఒక సన్యాసిని అక్కడే ఉంది. దీర్ఘాయువుతో ఆమె ఆశ్రమంలోనే నేటికీ ఉంది. శబరి ఎల్లవేళలా భగవంతుని ధ్యానిస్తూ సత్పురుషులకు సేవలు చేస్తూ ఉంటుంది. మీరు ఆ శబరి ఉన్న ఆశ్రమానికి వెళ్ళి ఆమెను చూడండి. ఆమె నీ రాకకోసం వేయి కన్నులతో ఎదురుచూస్తోంది. శబరి నిన్ను చూచిన తర్వాత స్వర్గానికి చేరుకొంటుంది. పంపాతీరానికి పశ్చిమతీరంలోని ఆశ్రమం మతంగమహర్షి నిర్మించాడు. ఆ ఆశ్రమాన్ని సామాన్యులెవరూ చేరలేరు. అక్కడ తిరిగే ఏనుగులు ఆ ఆశ్రమంలోకి వెళ్ళవు.

ఋశ్యమూకపర్వత వర్ణన

పంపాతీరానికి తూర్పుగా ఋశ్యమూకపర్వతం ఉంది. ఆ పర్వతంచుట్టూ ఉన్న వృక్షాలు ఎప్పుడూ ఫల పూలసంపదతో ఉంటాయి. చిన్నచిన్నకొండలు చుట్టూ ఉండడంవల్ల ఆ ప్రాంతం సురక్షితంగా ఉంది. ఇది బ్రహ్మచే నిర్మింపబడింది. చాలా ఎత్తుగా ఉండే ఈ పర్వతాన్ని ఎక్కడం కష్టసాధ్యమైన పని. అందుకే దీనికి సుదుః ఖారోహణం అనే పేరు సార్థకం అయ్యింది.

రామచంద్రా! ఈ పర్వతానికి ఇంకో ప్రశస్తి కూడా ఉంది. దురాచారపరులెవరూ ఈ పర్వతాన్ని ఎక్కలేరు. ఒకవేళ ఏ దురాత్ముడైనా ఎక్కితే రాత్రివేళ వాణ్ణి రాక్షసులు పట్టి తినివేస్తారు. ఈ పర్వతం ఎక్కి దీనిమీద రాత్రి నిద్రించిన వారికి కలలో ఏ సంపదలు కనబడుతాయో అవే సంపదలు వాస్తవంగా వారికి లభ్యమవుతాయి. పంపా తీరంలో సంచరించే ఏనుగుల ఘీంకారాలు ఆ పర్వతం మీదకు వినబడుతుంటాయి.

అక్కడి ఏనుగులు చాలా బలిష్టంగా నల్లని మేఘంలా ఉండి సంచరిస్తూ ఉంటాయి. ఇవి ఇతర ఏనుగులతో కలవక విడిగా తిరుగుతుంటాయి. పంపమధురజలాలను ఏనుగులు తాగి వనాలలో సంచరిస్తుంటాయి. అక్కడ ఎలుగుబంట్లు, పెద్ద పులులు, నల్లచారల దుప్పులు, మనోజ్ఞంగా ఉండి నీ మనస్సును సేదతీర్చుతాయి. ఆ ఋశ్యమూక పర్వతం మీద ఒక విశాలమైన గుహ ఉంది. దాని ద్వారం శిలలతో మూసి ఉంటుంది. అందుకని శిలాపిధానం అనే పేరు ఆ గుహకు వచ్చింది. ఆ గుహ తూర్పువైపున ఒకమడుగుఉంది. ఆ మడుగు ఒడ్డున అనేక ఫలాలతో కూడుకొన్న చెట్ల కందమూలాలు ఉంటాయి. ఆ మడుగులోని నీరు చల్లగా మధురంగా ఉంటాయి. అక్కడ లేళ్ళ గుంపులు ఎక్కువగా ఉంటాయి. సుగ్రీవుడు ఆ గుహలోనే తన నలుగురు అనుచరులతో ఉంటున్నాడు. మీరు అక్కడకు వెళ్ళి ఆ సుగ్రీవుని త్వరగా కలుసుకోండి. మీ కోరిక త్వరలో నెరవేరుతుంది" అని కబంధుడు చెప్పాడు.

ఆ మాటలకు రామలక్ష్మణులు సంతోషించారు. "ఓ కబంధా! నీవు మాకు మార్గాన్ని చూపి ఉపకారం చేశావు? నీ ఉపకారాన్ని మేము ఎప్పుడూ మరచిపోము" అని చెప్పి వారు కబంధుణ్ణి నిజవాసానికి వెళ్ళమని చెప్పారు. రామలక్ష్మణుల అనుజ్ఞ తీసుకొన్న కబంధుడు మెడలో పూలమాలను ధరించి హంసలతో కూర్చిన విమానంలో సూర్యతేజస్సుతో వెలుగుతూ మీరు కార్యసిద్ధికై బయలుదేరండి. సెలవు అని చెప్పి స్వర్గానికి వెళ్ళాడు. కబంధుడు చెప్పినట్లు రామలక్ష్మణులు ఋశ్యమూకానికి వెళ్ళి సుగ్రీవునితో సఖ్యం చేసి సీతాదేవి జాడను తెలుసుకోవాలని అనుకొన్నారు.

* * *

శబరి వృత్తాంతం

సర్గ - 74

కబంధుడు చెప్పినట్లు రామలక్ష్మణులు పడమర దిక్కుకు ప్రయాణం సాగించారు. మధురఫలాలతో నిండిన వృక్షాలతో నిండుగా ఉన్న వనంలో సోదరులు ముందుకు సాగారు. పర్వతశిఖరంపైన రాత్రి గడిపి ఉదయాన్నే సుగ్రీవుని కలవాలన్న ఆశతో వారు ప్రయాణించారు. అలా నడుస్తున్నవారికి పంపాతీరాన పశ్చిమ దిక్కున ఉన్న శబరి ఆశ్రమం కనిపించింది. ఆ ఆశ్రమంలోని వృక్ష సంపదను చూస్తూ శబరి దగ్గరకు వాళ్ళు వెళ్ళారు.

రామలక్ష్మణులను శబరి చూసింది. ఎంతో సంతోషించింది. ఎన్నో ఏళ్ళ నుండి ఎదురుచూస్తున్న నిధి చేతికి చిక్కినంత సంతోషంతో వారికి స్వాగతం పలికి సత్కారాలు చేసింది. అర్ఘ్యపాద్యాదులను ఇచ్చి గౌరవించింది. చక్కని ఆసనాలను చూపి కూర్చుని సేద తీరమని చెప్పింది.

ఆ ముసలివగ్గుని చూసి ఆనందించిన రాముడు "అమ్మా తపస్సంపన్నురాలా! మీ ఆరోగ్యం, మీ తపస్సు కొనసాగించడానికి సహకరిస్తోంది గదా! మీ తపోవిధులకు ఆటంకాలు ఏవీ ఎదురుకావడంలేదు గదా. మీరు ఇంద్రియాలను అదుపులో పెట్టుకొన్నవారు గదా! ఆహార నియమాలను పాటించడానికి ఆ ఇంద్రియాలు సౌకర్యవంతంగా ఉన్నాయి గదా! ఓ మృదుభాషిణీ ప్రశాంత జీవనాన్ని గడుపుతున్నారు గదా! మీ గురుసేవ సక్రమంగా సాగుతోంది కదా!" అని ప్రశ్నల పరంపరను రాముడు శబరిని అడిగాడు.

తపస్సిద్ధురాలు పూజ్యురాలు ఐన శబరి "ఓ రామచంద్ర ప్రభూ! నేడు నేను నిన్ను కన్నులారా చూశాను. నా జీవితం ధన్యమైంది. ఇక నాకు ఏ కోరికలూ లేవు. నిన్ను చూడడంతోనే నా తపఃఫలం నాకు దొరికిందనిపించింది. ఓ పురుషోత్తమా! నిన్ను పూజించే భాగ్యం నాకీనాటికి దొరికింది. నాకు పరంధామం దొరికినంత తృప్తినిచ్చింది. ఓ రఘునందనా! నీ అవాజ్య కరుణా కటాక్షాలవలన నేను పవిత్రురాలినయ్యాను.

ఓ ఇక్ష్వాకు వంశ తిలకా! నీవు చిత్రకూటానికి చేరావని తెలుసుకొన్న ఈ మతంగవనంలోని మహర్షులందరూ స్వర్గానికి వెళ్ళారు. వారు వెళ్ళుతూ అమ్మా! శబరీ! రాముడు ఈ ఆశ్రమానికి వస్తాడు. నీవు ఆయనను సేవించి తృప్తిపడి మా దగ్గరకు రా! అని చెప్పి వెళ్ళారు. నేను ఎల్లప్పుడూ ఆ మహర్షుల సేవలోనే నా కాలాన్నంతా గడిపేదాన్ని. వారు చెప్పినట్లే నీవు ఇక్కడికి వచ్చి ఆశ్రమాన్ని పావనం చేశావు. నేను ఈ వనం అంతా తిరిగి నీకోసం మంచి మంచి మధుర ఫలాలను ఏరి తెచ్చి ఉంచాను. నీవు వాటిని తృప్తిగా తిని నాకు ఆనందాన్ని కలిగించు" అంటూ శబరి ఆ ఫలాలను రామునకు పెట్టింది.

'అమ్మా శబరి! మీ గొప్పతనాన్ని మతంగ మహర్షి గురించి మేము కబందుని ద్వారా తెలుసుకొన్నాం. నాపై మీ ప్రేమానురాగాలను ఆసక్తిని నేను తెలుసుకొని ఆనందించాను. మీ వనాన్ని చూడాలనే కోరిక నాలో ఉదయిస్తోంది. మీరు ఈ వనం యొక్క గొప్పతనాన్ని నాకు చెప్పమం'టూ రాముడు శబరిని అడిగాడు. రాముని పలుకులకు ఆ

ముదిత ఆనందంతో ఇలా చెప్పసాగింది. 'ఓ రామలక్ష్మణులారా! దట్టమైన మేఘసముదాయంలాగా ఉండే ఈ వృక్షాలు, మృగాలతో ఉండే ఈ వనం మతంగ మహర్షి నిర్మించింది. అందుకే మతంగ వనం అనే పేరుతో విఖ్యాతి చెందింది. ఇందులోకి మదపు టేనుగులు రాలేవు. ఇందులో సర్వవేళలా పరమాత్మను ధ్యానించే తాపసులే ఉంటారు. మా గురుదేవుని తపశ్శక్తితో గంగానదిని స్మరించి ఆ గంగాజలాన్నే పంపాసరోవరంగా మార్చారు. ఇక్కడ నాతో పూజలందుకొన్న జ్ఞాన వయోవృద్ధులు దేవతలకు పూలు అర్పిస్తూ పూజించేవారు.

వారందరూ తమ వార్ధక్యంతో నడవలేక సప్త సముద్రాలను చూడలేక వాటిని స్మరించారు. వారి దివ్యశక్తివలన ఆ సాగర జలాలే ఆ తేజోమూర్తుల దగ్గరకు వచ్చాయి. అందుకే సప్తసాగరతీర్థమని అంటారు. మా గురువులు ఈ సాగరతీర్థంలో స్నానంచేసి నారవస్త్రాలను ఇక్కడే ఆరవేసి ఉన్నారు చూడు. అవి ఇంకా ఆరలేదు సుమా! వారి కరస్పర్శతో పూజించిన పూలు కూడా వాడలేదు. ఇదంతా మా గురుదేవుల మహత్వమే.

రామా! మీరు ఈ వనశోభను చూశారు గదా! ఇక నేను ఈ మానవ కళేబరాన్ని విడిచి నా గురుదేవుల సన్నిధి చేరుతాను. మీరు నన్ను అనుమతిస్తే నేను దేహత్యాగం చేసి అమరలోకాలకు వెళ్తాను' అని చెప్పే శబరి మాటలు రామలక్ష్మణులకు ఆశ్చర్యానందాలను కలుగజేశాయి. వ్రతనియమనిష్ఠలతో జీవితాన్ని అనుభవించిన 'భక్త శబరీ! మీరు ఒనరించిన కార్యాలు మాకు ఆనందాన్నిచ్చాయి. మీ వలన ఈ మతంగ మహర్షి గొప్పతనాన్ని విన్నాము. ఇక మీరు హాయిగా మీ ఇష్టం వచ్చినట్లు వెళ్ళవచ్చు' అని రాముడు అన్నాడు.

శ్రీరామాజ్ఞను పొందిన శబరి దేహాన్ని అగ్నికి ఆహుతి చేసింది. జడలు నారచీరలు ధరించి ఉండే ఈ జీర్ణ శరీరాన్ని ఆనందంగా విడిచి వేసి దివ్య తేజస్సుతో వెలుగులు చిమ్ముతూ పరంధామానికి చేరింది. దివ్య తేజస్సును పొందిన శబరి దివ్యాభరణాలను ధరించి అద్భుతవస్త్రధారణతో విద్యుల్లతలాగా మెరుస్తూ పరమాత్ముని సన్నిధిని చేరింది.

పుణ్యపురుషులు శబరి గురువులు పొందిన పుణ్యలోకాలకు చేరి గురుదర్శనభాగ్యాన్ని పొంది అక్షయ సంపదను పొందింది.

* * *

రామలక్ష్మణులు - ఋశ్యమూక ప్రయాణం

సర్గ - 75

శబరి దివ్యధామానికి చేరుకొంది. రామలక్ష్మణులు ఆమె గొప్పదనాన్ని తలచుకొన్నారు. మతంగమహర్షి దివ్యత్వాన్ని మరలా గుర్తుచేసుకొన్నారు. ఆ మతంగవనంలోని వైశిష్ట్యాన్ని శ్లాఘించారు. "లక్ష్మణా! ఈ మహర్షి తపోబలంవలననే ఇక్కడ హింసాప్రవృత్తి ఉన్న క్రూరమృగాలు సైతం సాధుత్వాన్ని పొందాయి. క్రూరమృగాలు

వన్యజీవులు వారి అసలు నైజాన్ని మరిచి హాయిగా తిరుగుతున్నాయి. పెద్దపులి దగ్గరే ఆడుకొంటున్న కుందేలును చూస్తే ఆశ్చర్యం ఆనందం కలుగుతున్నాయి.

ఈ పక్షులన్నీ ఆ మహర్షుల సాధు జీవనానికి అలవడిపోయినట్లున్నాయి. నాకు వీటి అరుపులు మంత్రాల్లాగే వినవస్తున్నాయి. మనం ఈ ఆశ్రమాన్ని దర్శించి పునీతులమయ్యాం మహర్షులు నోటి వాక్య ప్రభావంతో సప్త సాగరాల నడిచి వచ్చి చేరిన సప్తసాగరతీర్థంలో మనం స్నానాలుచేసి తర్పణాలు విడిచాం. ఈ పనివలన నా హృదయభారం తగ్గినట్లుగా అనిపిస్తోంది. మహర్షులను సేవించడంవలన సత్పురుషుల కథలను వినడంవలన మన మనస్సు బాధను మరచి ఉల్లాసాన్ని పొందుతుంది కదా! ఇది సహజమనుకొంటాను. అందువల్లే నా సీతావియోగ దుఃఖం కూడా కాస్త ఉపశమించినట్లుగా ఉంది.

మహర్షుల స్వాంతన వచనాలతో ఊరడిల్లిన మనస్సు వారి శుభాశీస్సులతో మంచి జరుగుతుందనే ఆశావహాన్ని పెంచుకొంటుంది. ఆ రాబోయే మంచికాలం గురించి ఆలోచిస్తూ వర్తమాన దుఃఖాన్ని కాసేపు మరుస్తాం కదా! మనకు అట్టిదే జరుగుతున్నట్లుంది. లక్ష్మణా! నా హృదయంలో శుభసూచకాలు కలుగుతున్నాయి. నా మనస్సు భద్రత చేకూరినట్లుగా సంతోషిస్తుంది."

"సౌమిత్రీ! కబంధుడు చెప్పినట్లుగా మనం సూర్యసుతుడైన సుగ్రీవుని దగ్గరకు త్వరగా చేరుదాం" అంటూ రామలక్ష్మణులు పంపాసరోవర తీరానికి బయలుదేరారు. 'లక్ష్మణా! వాలికి భయపడి ఋశ్యమూకంపై నివాసం ఏర్పరచుకొన్న సుగ్రీవుని చూడాలనే తహతహ నాలో పెరుగుతోంది.'అని అంటున్న రామునితో ఏకీభవిస్తూ సౌమిత్రి 'అన్నా నా మనస్సు కూడా సుగ్రీవుణ్ణి చూడాలనే ఆరాటపడుతోంది. ఆయన వలనే కదా! మనం సీతాన్వేషణను సాగించగలం ' అంటూ వారు పంపాతీరానికి గబగబా నడిచారు. వారు దూరం నుంచి పంపాసరస్సును చూశారు. కలువలు, ఎర్రతామరలు, మునుల స్నానాలు, హంసల సమూహాలు కలగలసి చిత్రమైన బొమ్మలతో నేసిన తివాసీ పరచినట్లుగా ఆ సరస్సుపైభాగం వారికి కనిపించింది.

దానికి దగ్గరగా ఉన్న మతంగసరస్సును చూచి రామలక్ష్మణులు దానిలో స్నానాలు చేశారు. దాని ఒడ్డున పుష్పించిన మామిడితోటలువిరివిగా కనిపించాయి. ఆ సరస్సు అందానికి వికసించిన ఎర్రతామరలు ఇనుమడింపజేస్తున్నాయి. ఆ తోటలలో నెమళ్ళ క్రేంకారాలు ప్రతిధ్వనిస్తున్నాయి. ఆ సరస్సు ఒడ్డున తిలక, దానిమ్మ, చంద్ర, ఏరుమద్ది, సురపొన్న, గన్నేరు చెట్లు విప్పారిన పూలతో ఉన్నాయి. జాజిమల్లె పొదలు అల్లుకొని సువాసనను వెదజల్లుతున్నాయి. మర్రి, వేప, అశోక, ఏడాకుల అరటి, మొగలి అరవింద లాంటి చెట్లు ఎక్కువగా కనిపించాయి. రంగు రంగుల పూలతో పెద్ద పెద్ద వృక్షాల సమూహాలను చూస్తూ వారు ముందుకు సాగారు. వాటి మధ్య టిట్టిభ పక్షులు, నెమళ్ళు, వడ్రంగిపిట్టలు, చిలకలు, గోరువంకలు, చిత్ర విచిత్ర పక్షుల కూతలు వాటి రెక్కలార్చే శబ్దం వినబడుతూ మనస్సును ఆహ్లాదపరుస్తోంది.

వారు అలా నడిచి పంపా సరోవరానికి వచ్చారు. ఆ తీరంలోని పుష్పసముదాయంపై మకరందంకోసం ఎగిరే తుమ్మెదలు సీతాకోకచిలుకలు అందంగా కనిపించాయి. స్ఫటికంలాగా ఉన్న స్వచ్ఛమైన మధుర జలం

సరస్సు నిండాఉంది. పంపనందే గైరికాదిధాతువులతో వెలుగులు విరజిమ్మే ఋశ్యమూకం ఉండేది. దీనిని గురించి కబంధుడు చెప్పింది ఋక్ష, రజసుని కుమారుడు సుగ్రీవుడు ఉండేదిక్కడే అని అనుకుంటే నా మనస్సు ఆయనను కలుసుకోవడానికి పరుగెత్తి వెళ్తోంది లక్ష్మణా' అని రాముడు చెప్పాడు.

"సౌమిత్రీ! సీత లేకుండా నేను జీవించజాలను" అని చెప్పే శోకార్తుడైన శ్రీరామునితో అన్నా ఈ పంపలో స్నానం చేద్దాం. మీ మనస్సు ఈ జలంతో సేద తీరుతుంది. ఆ తర్వాత ప్రయాణం సాగిద్దాం అనుకొని అలానే చేసి వారు చాలా దూరం ప్రయాణం చేసి చివరకు కదంబ వనానికి చేరారు. అక్కడ వివిధ రకాలైన పక్షుల గుంపులు వారికి కనిపించాయి.

* * *

అరణ్యకాండ సంపూర్ణం